శ్రీ వేంకటేశ్వరాయ నమః

# ప్రసన్న రామాయణం

## ద్వితీయ సంపుటం

డా॥ రాయసం లక్ష్మి

ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి

2017

# PRASANNA RAMAYANAM
## Volume - II

*By*

**Dr. Rayasam Lakshmi**

© All Rights Reserved

T.T.D. Religious Publications Series No. 1261

*First Print* : 2017

*Copies* : 500

*Published by*
**Sri ANIL KUMAR SINGHAL**, I.A.S.,
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati.

*D.T.P.*
Publications Division
T.T.D., Tirupati.

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507

# ముందుమాట

భారతీయులకు పవిత్రమైన పర్వతాలున్నాయి. నదులున్నాయి. ఆలయాలున్నాయి. ఆ వరుసలో జీవితాన్ని తరింపజేసే గ్రంథాలున్నాయి. అలాంటి వాటిలో శ్రీమద్రామాయణ మహాకావ్యం ఒకటి. వాల్మీకి మహాముని ముఖతః సంస్కృత భాషలో ఈ కావ్యం వెలువడింది. సూర్యవంశీయుల్లో అగ్రగణ్యుడైన శ్రీరామచంద్రుడు, భూజాతగా జనకచక్రవర్తి చేతుల్లో పెరిగిన సీతామహాదేవి జీవితచరిత్రమే రామాయణం. లోక కంటకుడైన రావణాసుర సంహారం ఇందలి ప్రధానేతివృత్తం. శ్రీమహావిష్ణువు అనపాయిని అయిన లక్ష్మీదేవితో అవతరించి దుష్టసంహారం కావించి భూమిమీద శాంతి నెలకొల్పిన అవతారవిశేషేతివృత్తం రామాయణగాథ. ఈ నేలమీద గిరులు, ఝరులు ప్రవహించేదాకా రామాయణం నిలిచి ఉంటుందన్న పెద్దలమాట పొల్లుపోనిది. రామాయణం వెలువడిన నాటి నుంచి ప్రపంచ భాషలెన్నింటిలోనో అనూదితమైన గ్రంథమిది. ఇక భారతీయ భాషలన్నింటా వెలువడ్డ కావ్యం రామాయణం. అంతేకాదు ఒక్కోభాషలో పెక్కు రచయితల మూలాన మరీ మరీ వెలువడుతున్న గ్రంథం రామాయణం. అంతటి మహత్తరస్థాయి అందుకొన్నది సీతారామకథాపూర్ణమైన రామాయణం.

ఇదిగో ఇప్పుడు మళ్లీ రామాయణం మన చేతుల్లోకి వస్తూ ఉంది. మళ్లీమళ్లీనా అంటే మనకు తప్పకుండా రామాయణకల్పవృక్షాన్ని తెలుగుభాషలో నాటిన విశ్వనాథ సత్యనారాయణగారి "మఱల నిదేల రామాయణ మన్నచో" అన్న పద్యంలోని మాట గుర్తుకు వస్తుంది. బహురచనలతో చేయి తిరిగిన రచయిత **రాయసం లక్ష్మి**గారు. ఇప్పటి పాఠకులను ఆకట్టుకొనే విధంగా చక్కని చిక్కని తెలుగు వచనంలో రాశారు. వస్తుభావాలకు ఎక్కడా ఆటంకం కలుగకుండా పఠనం ముందుకు సాగుతుంది.


రాయసం లక్ష్మిగారి ఈ **ప్రసన్న రామాయణాన్ని** తిరుమల తిరుపతి దేవస్థానముల పక్షాన ముద్రించేందుకు స్వీకరించి ఈ గ్రంథాన్ని తెలుగు చదువరులకు అందిస్తున్నాము. ఇంతకు ముందు ప్రచురితమైన గ్రంథాలను ఆదరించినట్లే పాఠకులు ఈ గ్రంథాన్ని కూడ ఆదరించగలరని ఆకాంక్షిస్తున్నాము.

సదా శ్రీవారిసేవలో...

**కార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి





# శ్రీరామ సహస్రనామ స్తోత్రమ్

ఓమ్

రామశ్శ్రీమన్మహావిష్ణు విష్ణుర్దేవహితావహః।
తత్త్వాత్మాతారకబ్రహ్మ శాశ్వత స్సర్వసిద్ధిదః॥ 1

రాజీవలోచనశ్శ్రీమాన్ శ్రీరామోరఘుపుంగవః।
రామభద్రస్సదాచారోరాజేంద్రో జానకీపతిః॥ 2

అగ్రగణ్యోవరేణ్యశ్చ వరదః పరమేశ్వరః।
జనార్దనో జితామిత్రః పరార్థైక ప్రయోజనః॥ 3

విశ్వామిత్రప్రియో దాంతశ్శత్రుజిచ్ఛత్రుతాపనః।
సర్వజ్ఞస్సర్వవేదాదిశ్శరణ్యో వాలిమర్దనః॥ 4

జ్ఞానభవ్యోఽపరిచ్ఛేద్యోవాగ్మీ సత్యవ్రత శ్శుచిః।
జ్ఞానగమ్యోదృఢప్రజ్ఞః ఖరధ్వంసీ ప్రతాపవాన్॥ 5

ద్యుతిమానాత్మవాన్ వీరోజితక్రోధోఽరిమర్దనః।
విశ్వరూపోవిశాలాక్షః ప్రభుః పరివృఢో దృఢః॥ 6

ఈశః ఖడ్గధరః శ్రీమాన్ కౌసల్యేయోఽనసూయకః।
విపులాంసో మహోరస్కః పరమేష్ఠీ పరాయణః॥ 7

సత్యవ్రత స్సత్యసంధో గురుః పరమధార్మికః।
లోకజ్ఞో లోకవంద్యశ్చ లోకాత్మా లోకకృత్ విభుః॥ 8

అనాదిర్భగవాన్సేవ్యో జితమాయో రఘూద్వహః।
రామో దయాకరో దక్ష స్సర్వజ్ఞ స్సర్వపావనః॥ 9

బ్రహ్మణ్యోనీతిమాన్ గోప్తాసర్వదేవమయో హరిః।
సుందరః పీతవాసాశ్చ సూత్రకారః పురాతనః॥ 10

సౌమ్యోమహర్షిః కోదండీ సర్వజ్ఞ స్సర్వకోవిదః।
కవి స్సుగ్రీవవరద స్సర్వపుణ్యాధికప్రదః॥ 11

భవ్యో జితారిషడ్వర్గో మహోదారాఽఘనాశనః।
సుకీర్తిరాదిపురుషః కాంతఃపుణ్యకృతాగమః॥ 12

ఇతి శ్రీరామసహస్రనామస్తోత్రే ప్రథమశతకమ్

ఓమ్

అకల్మషశ్చతుర్బాహు స్సదావాసో దురాసదః।
స్మితభాషీ నివృత్తాత్మా స్మృతిమాన్ వీర్యవాన్ ప్రభుః॥ 13

ధీరోదాంతో ఘనశ్యామ స్సర్వాయుధవిశారదః।
అధ్యాత్మ యోగనిలయ స్సుమనా లక్ష్మణాగ్రజః॥ 14

సర్వతీర్థమయశ్శూర స్సర్వయజ్ఞ ఫలప్రదః।
యజ్ఞస్వరూపో యజ్ఞేశో జరామరణ వర్జితః॥ 15

వర్ణాశ్రమగురుర్వర్ణీ శత్రుజిత్పురుషోత్తమః।
శివలింగ ప్రతిష్ఠాతా పరమాత్మా పరాత్పరః॥ 16

ప్రమాణభూతోదుర్జ్ఞేయః పూర్ణపరపురంజయః।
అనంతదృష్టిరానందో ధనుర్వేదో ధనుర్ధరః॥ 17

హిరణ్యగర్భ స్సవితా లోకకృల్లోకభుగ్విభుః।
ఓంకార వాచ్య భగవాన్ శ్రీభూలీలాపతిః ప్రభుః॥ 18

శ్రీమత్సమస్తలోకేశ స్సర్వజ్ఞస్సర్వతోముఖః।
స్వామీసుశీలస్సులభ స్సర్వగస్సర్వశక్తిమాన్॥ 19

అక్షయఃపురుషస్సాక్షీ కేశవః పురుషోత్తమః।
లోకాధ్యక్షో మహాకార్యో విభీషణవరప్రదః॥ 20

ఆనందవిగ్రహజ్యోతి ర్హనూమత్ప్రభు రవ్యయః।
భ్రాజిష్ణుస్సహనోభోక్తా సత్యవాదీ బహుశ్రుతః॥ 21

సంసారతారకో రామ స్సర్వదుఃఖవిమోక్షకృత్।
విద్వత్తమో విశ్వకర్తా విశ్వకృ ద్విశ్వకర్మచ॥ 22

సుఖదః కారణంకర్తా భవబంధవిమోచనః।
దేవచూడామణి ర్నేతా బ్రహ్మణ్యో బ్రహ్మవర్ధనః॥ 23

నిత్యానందైక కల్యాణ స్సీతాశోకవినాశకృత్।
కాకుస్థఃపుండరీకాక్షో విశ్వామిత్రభయాపహః॥ 24

మారీచమథనో రామో విరాధవధపీడితః।
దుస్స్వప్ననాశనో రమ్యకిరీట స్త్రిదశాధిపః॥ 25

మహాధనుర్మహాకాయో భీమో భీమపరాక్రమః।
తత్త్వ స్వరూపి తత్త్వజ్ఞ స్తత్వవాదీ సువిక్రమః॥ 26

ఇతి శ్రీరామసహస్రనామస్తోత్రే ద్వితీయశతకమ్

ఓమ్

భూతాత్మా భూతకృత్స్వామీ కాలజ్ఞానీ మహావపుః।
అనిర్విణ్ణో గుణగ్రామో నిష్కలంకః కలంకహా॥ 27

స్వభావభద్ర శ్శత్రుఘ్నః కేశవః స్థాణు రీశ్వరః।
భూతాదిశ్శంభురాదిత్యః స్థవిష్ఠశ్శాశ్వతోధ్రువః॥ 28

కవచీకుండలీచక్రీ ఖడ్గీభక్తజనప్రియః।
అమృత్యుర్జన్మరహిత స్సర్వజిత్సర్వగోచరః॥ 29

అనుత్తమోఽప్రమేయాత్మా సర్వాత్మాగుణసాగరః।
సమస్సమాత్మాసమగో జటాముకుటమండితః॥ 30

అజేయస్సర్వభూతాత్మావిష్వక్సేనోమహాతపాః।
లోకాధ్యక్షోమహాబాహు రమృతోవేదవిత్తమః॥ 31

సహిష్ణు స్సద్గతి శ్శాస్తావిశ్వయోని ర్మహాద్యుతిః।
అతీంద్ర ఊర్జితఃప్రాంశు రుపేంద్రో వామనో బలిః 32

ధనుర్వేదో విధాతాచ బ్రహ్మావిష్ణుశ్చశంకరః।
హంసోమరీచిర్గోవిందో రత్నగర్భో మహద్ద్యుతిః॥ 33

వ్యాసో వాచస్పతి స్సర్వదఃపితాఽసురమర్దనః।
జానకీవల్లభశ్రీమాన్ ప్రకటః ప్రీతివర్ధనః॥ 34

సంభవోఽతీంద్రియో వేద్యోనిర్దేశో జాంబవత్ప్రభుః।
మదనో మన్మథో వ్యాపీ విశ్వరూపో నిరంజనః॥ 35

నారాయణోఽగ్రణీ స్సాధు ర్జటాయుప్రీతివర్ధనః।
నైకరూపో జగన్నాథ స్సురకార్యహితప్రభుః॥ 36

జితక్రోధో జితారాతిః ప్లవగాధపరాజ్యదః।
వసుద స్సుభుజో నైకమాయో భవ్యః ప్రమోదనః॥ 37

చండాంశు స్సిద్ధిదః కల్పశ్శరణాగతవత్సలః।
అంగదో రోగహర్తాచ మంత్రజ్ఞో మంత్రభావనః॥ 38

ఇతి శ్రీరామసహస్రనామస్తోత్రే తృతీయశతకమ్

ఓమ్

సౌమిత్రివత్సలోధుర్యో వ్యక్తావ్యక్తస్వరూపధృక్।
వసిష్ఠో గ్రామణీః శ్రీమాననుకూలః ప్రియంవదః॥ 39

అతుల స్సాత్వికో ధీరశ్శరాసనవిశారదః।
జ్యేష్ఠ స్సర్వగుణోపేతశ్శక్తిమా న్తాటకాన్తకః 40

వైకుంఠః ప్రాణినాంప్రాణః కమఠః కమలాధిపః।
గోవర్ధనధరో మత్స్యరూపః కారుణ్యసాగరః॥ 41

కుంభకర్ణప్రభేత్తాచ గోపీగోపాలసంవృతః।
మాయావీ వ్యాపకో వ్యాపీరేణుకేయబలాపహః॥ 42

పినాకమథనో వంద్య స్సమర్థగరుడధ్వజః।
లోకత్రయాశ్రయో లోకభరితో భరతాగ్రజః॥ 43

శ్రీధర స్సంగతిర్లోకసాక్షీ నారాయణో విభుః।
మనోరూపీమనోవేగీ పూర్ణఃపురుషపుంగవః॥ 44

యదుశ్రేష్ఠో యదుపతి ర్భూతావాసస్సువిక్రమః।
తేజో ధరాధరోఽవ్యగ్రశ్చతుర్మూర్తిర్మహానిధిః॥ 45

చాణూరమథనో వంద్యశ్శాంతో భరతవందితః।
శబ్దాతిగోగభీరాత్మా కోమలాంగఃప్రజాగరః॥ 46

లోకోర్ధ్వగశ్శేషశాయీ క్షీరాబ్ధినిలయోఽమలః।
ఆత్మజ్యోతి రదీనాత్మా సహస్రార్చిస్సహస్రపాత్॥ 47

అమృతాంశు ర్మహీభర్తా నివృత్తవిషయస్పృహః।
త్రికాలజ్ఞముని స్సాక్షీ విహాయసగతిఃకృతీ॥ 48

పర్జన్యః కుముదో భూతావాసః కమలలోచనః।
శ్రీవత్సవక్షాః శ్రీవాసో వీరహా లక్ష్మణాగ్రజః॥ 49

లోకాభిరామోలోకారిమర్దనః సేవకప్రియః।
సనాతనతమోమేఘశ్యామలో రాక్షసాంతకః॥ 50

దివ్యాయుధధరశ్శ్రీమా నప్రమోయోజితేంద్రియః।
భూదేవవంద్యో జనక ప్రియకృత్ప్రపితామహః॥ 51

ఇతి శ్రీరామసహస్రనామస్తోత్రే చతుర్థశతకమ్

ఓమ్

ఉత్తమ స్సాత్వికః స్సత్య స్సత్యధర్మపరాక్రమః।
సువ్రత స్సుగమ స్సూక్ష్మస్సుఘోష స్సుఖద స్సుహృత్॥ 52

దామోదరోచ్యుత శ్శార్ఙ్గీ వామనో మధురాధిపః।
దేవకీనందన శ్శౌరీ కైటభాసురమర్దనః॥ 53

సప్తతాల ప్రభేత్తాచ మిత్రవంశప్రవర్ధనః।
కాలస్వరూపీ కాలాత్మా కాలః కల్యాణదః కలిః॥ 54

సవత్సరో ఋతుః పక్షోహ్యయనో దివసోయుగః।
స్తవ్యో వివిక్తోనిర్లేప స్సర్వవ్యాపీ నిరాకులః॥ 55

అనాదినిధన స్సర్వలోకపూజ్యో నిరామయః।
రసో రసజ్ఞ స్సారజ్ఞో లోకసారో రసాత్మకః॥ 56

సర్వదుఃఖాతిగో విద్యారాశిః పరమగోచరః।
శేషో విశేషో విగతకల్మషో రఘుపుంగవః॥ 57

వర్ణశ్రేష్ఠో వర్ణభావ్యో వర్ణోవర్ణగుణోజ్జ్వలః।
కర్మసాక్షీ గుణశ్రేష్ఠో దేవాసుర వరప్రదః॥ 58

దేవాధిదేవో దేవర్షి ర్దేవాసురవరప్రదః।
సర్వదేవమయ శ్చక్రీ శార్ఙ్గపాణీ రఘూత్తమః॥ 59

మనో బుద్ధి రహంకారః ప్రకృతిః పురుషోఽవ్యయః।
న్యాయోన్యాయీ నయీ శ్రీమాన్ నయో నగధరో ధ్రువ॥ 60

లక్ష్మీవిశ్వంభరో భర్తాదేవేంద్రో బలిమర్దనః।
బాణారిమర్దనో యాజ్వాఽనుత్తమో మునిసేవితః॥ 61

దేవాగ్రణీ శ్శివధ్యానతత్పరః పరమః పరః।
సామగేయప్రియ శ్శూరః పూర్ణకీర్తిస్సులోచనః॥ 62

అవ్యక్తలక్షణో వ్యక్తో దశాస్యద్విపకేసరీ।
కలానిధిః కలానాథః కమలానందవర్ధనః॥ 63

ఇతి శ్రీరామనామ సహస్రస్తోత్రే పంచమశతకమ్

ఓమ్

పుణ్యః పుణ్యాధికః పూర్ణః పూర్వః పూరయితారవిః।
జటిలః కల్మషధ్వాంతప్రభంజనవిభావసుః॥ 64

జయీ జితారి స్సర్వాది శ్శమనో భవభంజనః।
అలంకరిష్ణు రచలోరోచిష్ణు ర్విక్రమోత్తమః॥ 65

ఆశు శ్శబ్దపతి శబ్దగోచరో రజనో లఘుః।
నిశ్శబ్దః పురుషో మాయి స్థూల స్సూక్ష్మో విలక్షణః॥ 66

ఆత్మయోని రయోనిశ్చ సప్తజిహ్వః సహస్రపాత్।
సనాతనతమః స్రగ్వీ పేశలో జీవినాంవరః॥ 67

శక్తిమాన్శంఖభృ న్నాథో గదాఖడ్గరథాంగ భృత్।
నిరీహో నిర్వికల్పశ్చ చిద్రూపో వీత సాధ్వసః॥ 68

శతానన స్సహస్రాక్ష శ్శతమూర్తిర్ఘనప్రభః।
హృత్పుండరీకశయనః కఠినో ద్రవ ఏవచ॥ 69

సూర్యో గ్రహపతి శ్శ్రీమాన్ సమర్థోఽనర్థనాశనః।
అధర్మశత్రూ రక్షోఘ్నః పురుహూతః పురుష్టుతః॥ 70

బ్రహ్మగర్భో బృహద్గర్భో ధర్మధేనుర్ధనాగమః।
హిరణ్యగర్భో జ్యోతిష్మాన్సులలాట స్సువిక్రమః॥ 71

శివపూజారత శ్శ్రీమాన్ భవానీప్రియకృ ద్వశీ।
నరనారాయణాత్మాచ కపర్దీ నీలలోహితః॥ 72

రుద్రః పశుపతిః స్థాణు ర్విశ్వామిత్రో ద్విజేశ్వరః।
మాతామహో మాతరిశ్వా విరించి ర్విష్టరశ్రవాః॥ 73

అక్షోభ్యస్సర్వభూతానాం చండ స్సత్యపరాక్రమః।
వాలఖిల్యో మహాకల్పః కల్పవృక్షః కలాధరః॥ 74

నిదానం తపనో మేఘ శ్శుక్రః పరబలాపహృత్।
వసుశ్రవాః కావ్యవాహః ప్రతప్తో విశ్వభోజనః॥ 75

ఇతి శ్రీరామసహస్రనామస్తోత్రే షష్ఠశతకమ్

ఓమ్

రామో నీలోత్పలశ్యామో జ్ఞానస్కందో మహాద్యుతిః
కబంధమథనోదివ్యః కంబుగ్రీవ శ్శివప్రియః॥ 76

సుఖో నీల స్సునిష్పన్న స్సులభ శ్శిశిరాత్మకః
అసంసృష్టోఽతిథిశ్శూరః ప్రమాథీ పాపనాశకృత్॥ 77

పవిత్రపాదః పాపారిర్మణిపూరో నభోగతిః।
ఉత్తారణో దుష్కృతిహా దుర్ధర్షో దుస్సహోబలః॥ 78

అమృతేశోఽమృతవపుర్ధర్మీ ధర్మకృపాకరః।
భర్గో వివస్వానాదిత్యో యోగాచార్యో దివస్పతిః॥ 79

ఉదారకీర్తి రుద్యోగీ వాఙ్మయ స్సదసన్మయః।
నక్షత్రమాలీ నాకేశస్స్వాధిష్ఠాన ష్షడాననః॥ 80

చతుర్వర్గఫలం వర్ణ శక్తిత్రయఫలం విధిః।
నిధానగరో నిర్వ్యాజో నిరీశో వ్యాలమర్దనః॥ 81

శ్రీవల్లభ శ్శివారంభ శ్శాంతభద్ర స్సమంజసః।
భూశాయీ భూతకృ ద్భూతిభూషణో భూతవాహనః॥ 82

అకాయో భక్తకాయస్థః కాలజ్ఞానీ మహాపటుః।
పరార్థవృత్తి రచలో వివిక్తః శ్రుతిసాగరః॥ 83

స్వభావభద్రో మధ్యస్థ స్సంసార భయనాశనః।
వేద్యో వైద్యో వియద్గోప్తా సర్వామర మునీశ్వరః॥ 84

సురేంద్రః కారణం కర్మకరః కర్మీ హ్యధోక్షజః।
ధైర్యోఽగ్రధుర్యో ధాత్రీశ స్సంకల్ప శ్శర్వరీపతిః॥ 85

పరమార్థగురు ర్దృష్టి రుచిరాశ్రితవత్సలః।
విష్ణుర్జిష్ణుర్యజ్ఞవిభు ర్యజ్ఞేశోయజ్ఞ పావకః॥ 86

మహావిష్ణు ర్గ్రసిష్ణుశ్చ లోకాత్మా లోకపావకః।
కేశవః కేశిహా కావ్యః కవిః కారణకారణం॥ 87

ఇతి శ్రీరామసహస్రనామస్తోత్రే సప్తమశతకమ్

ఓమ్

కాలకర్తా కాలశేషో వాసుదేవః పురుష్టుతః।
ఆదికర్తావరాహశ్చ వామనోమధుసూదనః॥ 88

నారాయణోనరోహంసో విష్వక్సేనోజనార్దనః।
విశ్వకర్తామహా యజ్ఞో జ్యోతిష్మాన్పురుషోత్తమః॥ 89

వైకుంఠఃపుండరీకాక్షః కృష్ణస్సూర్యస్సురార్చితః।
నారసింహో మహాభీమవజ్రదంష్ట్రనఖాయుధః॥ 90

ఆదిదేవో జగత్కర్తా యోగీశోగరుడధ్వజః।
గోవిందోగోపతిర్గోప్తా భూపతిర్భువనేశ్వరః॥ 91

పద్మనాభోహృషీకేశోధాతాదామోదరప్రభుః।
త్రివిక్రమస్త్రిలోకేశో బ్రహ్మేశః ప్రీతివర్ధనః॥ 92

సన్యాసీశాస్త్రతత్త్వజ్ఞో మంద రాద్రినికేతనః।
వామనోదుష్టదమనో గోవిందోగోపవల్లభః॥ 93

భక్తిప్రియోఽచ్యుత స్సత్యకీర్తిఃధృతిఃస్మృతిః।
కారుణ్యఃకరుణోన్యాసో పాపహాశాంతివర్ధనః॥ 94

బదరీనిలయశ్శాంత స్తపస్వీవైద్యుతప్రభుః।
భూతావాసోమహావాసశ్శ్రీనివాసశ్శ్రియఃపతిః॥ 95

తపోవాసోముదావాస స్సత్యవాసస్సనాతనః।
పురుషఃపుణ్యవాన్పుణ్యః పుష్కరాక్షోమహేశ్వరః॥ 96

పూర్ణమూర్తిః పూరాణజ్ఞః పుణ్యదఃప్రీతివర్ధనః।
పూర్ణరూపః కాలచక్రప్రవర్తన స్సమాహితః॥ 97

నారాయణః పరంజ్యోతిః పరమాత్మాసదాశివః।
శంఖీచక్రీగదీశార్ఙ్గీలాంగలీముసలీహలీ॥ 98

కిరీటీకుండలీహారీ మేఖలీకవచీధ్వజీ।
యోధజేతామహావీర్య శ్శత్రుఘ్నశ్శత్రుతాపనః॥ 99

ఇతి శ్రీరామసహస్రనామస్తోత్రే అష్టమశతకమ్

ఓమ్

శాస్తాశాస్త్రకరశ్శాస్త్రం శంకరశ్శంకరస్తుతః।
సారథీసాత్వికస్వామీ సామవేదప్రియస్తథా॥ 100

పవనఽస్సంహతశ్శక్తిస్సంపూర్ణాంగ స్సమృద్ధిమాన్।
స్వర్గదః కామదఃశ్రీదః కీర్తిదఃకీర్తిదాయకః॥ 101

మోక్షదఃపుండరీకాక్షః క్షీరాబ్ధికృతకేతనః।
సర్వాత్మాసర్వలోకేశః ప్రేరకఃపాపనాశనః॥ 102

వైకుంఠఃపుండరీకాక్ష స్సర్వదేవనమస్కృతః।
సర్వవ్యాపీ జగన్నాథ స్సర్వలోకమహేశ్వరః॥ 103

సర్గస్థిత్యంతకృద్దేవ స్సర్వలోకసుఖావహః।
అక్షయశ్శాశ్వతోఽనంతః క్షయవృద్ధివివర్జితః॥ 104

నిర్లేపోనిర్గుణస్సూక్ష్మో నిర్వికారోనిరంజనః।
సర్వోపాధివినిర్ముక్త స్సత్తామాత్రవ్యవస్థితః॥ 105

అవికారీవిభుర్నిత్యః పరమాత్మా సనాతనః।
అచలోనిశ్చలోవ్యాపీ నిత్యతృప్తోనిరాశ్రయః॥ 106

శ్యామో యువా లోహితాక్షో దీప్తిశోభితభాషణః।
ఆజానుబాహు స్సుముఖ స్సింహస్కంధోమహాభుజః॥ 107

సత్వవాన్గుణసంపన్నో దీప్యమానస్స్వతేజసా।
కాలస్వరూపీ భగవాన్ కాలచక్రప్రవర్తకః॥ 108

నారాయణః పరంజ్యోతిః పరమాత్మా సనాతనః।
విశ్వకృద్విశ్వభోక్తాచ విశ్వగోప్తాచశాశ్వతః॥ 109

విశ్వంభరోవిశ్వమూ ర్తిర్విశ్వాత్మావిశ్వభావనః।
సర్వభూతసుహృచ్ఛాంత స్సర్వభూతానుకంపనః॥ 110

సురేశ్వర స్సర్వశర్వ స్సర్వదాశ్రితవత్సలః।
సర్వగ స్సర్వభూతేశ స్సర్వభూతాశయస్థితః॥ 111

అభ్యంతరస్థస్తమసశ్ఛేత్తా నారాయణః పరః।
అనాదినిధనఃస్రష్టా ప్రజాపతిపతిర్హరిః॥ 112

ఇతి శ్రీరామసహస్రనామస్తోత్రే నవమశతకమ్

ఓమ్

నరసింహో హృషీకేశ స్సర్వాత్మా సర్వదృ గ్వశీ।
జగతస్తస్థుషశ్చైవ ప్రభుర్నేతా సనాతనః॥ 113

కర్తా ధాతా విధాతాచ సర్వేషాంపతి రీశ్వరః।
సహస్రమూర్ధావిశ్వాత్మా విష్ణుర్విశ్వభుగవ్యయః॥ 114

పురాణపురుష శ్శ్రేష్ఠ స్సహస్రాక్ష స్సహస్రపాత్।
తత్త్వంనారాయణోవిష్ణు ర్వాసుదేవస్సనాతనః॥ 115

పరమాత్మాపరంబ్రహ్మ సచ్చిదానందవిగ్రహః।
పరంజ్యోతిః పరంధామ పరాకాశః పరాత్పరః॥ 116

అచ్యుతఃపురుషః కృష్ణశ్శాశ్వత శ్శివ ఈశ్వరః।
నిత్యస్సర్వగతః స్థాణూరుద్రస్సాక్షీ ప్రజాపతిః॥ 117

హిరణ్యగర్భస్సవితా లోకకృల్లోకభుగ్విభుః।
ఓంకారవాచ్యోభగవాన్ శ్రీభూలీలాపతిఃప్రభు॥ 118

సర్వలోకేశ్వరశ్శ్రీమాన్ సర్వజ్ఞస్సర్వతోముఖః।
స్వామీసుశీలస్సులభ స్సర్వగ స్సర్వశక్తిమాన్॥ 119

నిత్యస్సమ్పూర్ణకామశ్చ నైసర్గికసుహృత్సుఖీ।
కృపాపీయూషజలధిశ్శరణ్య స్సర్వదేహినాం॥ 120

శ్రీమన్నారాయణస్వామీ జగతాంప్రభురీశ్వరః।
అయోధ్యేశోనృపశ్రేష్ఠః కుశబాలఃపరంతపః॥ 121

లవబాలఃకంజనేత్రః కంజాంఘ్రిఃపంకజాననః।
సీతాకాంతస్సౌమ్యరూప శ్శిశుజీవనతత్పరః॥ 122

సేతుకృచ్చిత్రకూటస్థ శ్శబరీసంస్తుతఃప్రభుః।
యోగిధ్యేయశ్శివధ్యేయో రావణాసురదర్పహా॥ 123

శరణ్యస్సర్వభూతానాం సంశ్రితాభీష్టదాయకః।
అనంతశ్శ్రీపతిశ్శూరో గుణభృన్నిర్గుణోమహాన్॥ 124

ఇతి శ్రీరామసహస్రనామస్తోత్రే దశమశతకమ్

ఓమ్

మత్స్యః కూర్మోవరాహశ్చ నారసింహోథవామనః।
రామోరామశ్చకృష్ణశ్చ బౌద్ధఃకల్కిఃపరాత్పరః॥

# విషయ సూచిక

## కిష్కింధకాండ


| | | |
|---|---|---|
| సర్గ-1. | పంపాసరోవరతీరానికి చేరటం | 1 |
| సర్గ-2. | సుగ్రీవుని శంక | 4 |
| సర్గ-3. | హనుమంతుని ప్రవేశం | 6 |
| సర్గ-4. | మారుతితో సౌమిత్రి సంభాషణం | 7 |
| సర్గ-5. | రామ సుగ్రీవుల మైత్రి | 9 |
| సర్గ-6. | సీత ఆభరణాల ప్రస్తావన | 10 |
| సర్గ-7. | రామసుగ్రీవుల సంభాషణం | 12 |
| సర్గ-8. | సుగ్రీవుని సంకటం | 13 |
| సర్గ-9. | వాలి సుగ్రీవుల వైరం | 14 |
| సర్గ-10. | శ్రీరాముడు సుగ్రీవుని ఓదార్చటం | 16 |
| సర్గ-11. | బలపరాక్రమాలు | 17 |
| సర్గ-12. | శ్రీరాముని సంశయం | 21 |
| సర్గ-13. | కిష్కింధాప్రయాణం | 23 |
| సర్గ-14. | సుగ్రీవుడు యుద్ధనాదాన్ని చేయటం | 24 |
| సర్గ-15. | తార హితం | 25 |
| సర్గ-16. | వాలి నేలగూలటం | 27 |
| సర్గ-17. | వాలి శ్రీరాముని నిందించటం | 29 |
| సర్గ-18. | వాలికి శ్రీరాముని సమాధానం | 31 |
| సర్గ-19. | సతీసుతుల ఆగమనం | 34 |
| సర్గ-20. | తార విలాపం | 35 |
| సర్గ-21. | హనుమంతుడు తారను ఊరడించటం | 37 |
| సర్గ-22. | వాలి మరణం | 38 |
| సర్గ-23. | తార పరితాపం | 39 |
| సర్గ-24. | సుగ్రీవుని పరితాపం - శ్రీరాముని బోధ | 41 |
| సర్గ-25. | వాలి దహనసంస్కారం | 43 |

| | | |
|---|---|---|
| సర్గ-26. | సుగ్రీవ, అంగదుల పట్టాభిషేకం | 45 |
| సర్గ-27. | ప్రస్రవణ గిరిపై రామలక్ష్మణులు | 47 |
| సర్గ-28. | వేదనాభరితమైన వర్షఋతువు | 49 |
| సర్గ-29. | సీతాన్వేషణకై సేనల సమీకరణ | 50 |
| సర్గ-30. | సుగ్రీవునికి కర్తవ్యం గుర్తుచేయటం | 52 |
| సర్గ-31. | కిష్కింధకు లక్ష్మణుడు వెళ్ళటం | 54 |
| సర్గ-32. | హనుమంతుని బోధ | 57 |
| సర్గ-33. | తార లక్ష్మణుల సంభాషణ | 58 |
| సర్గ-34. | లక్ష్మణుని మందలింపు | 61 |
| సర్గ-35. | తార లక్ష్మణుని శాంతింపజేయటం | 62 |
| సర్గ-36. | సుగ్రీవుడు రాముని ప్రశంసించటం | 63 |
| సర్గ-37. | వానర ప్రముఖులు రావడం | 64 |
| సర్గ-38. | సుగ్రీవుడు రాముని దర్శించటం | 65 |
| సర్గ-39. | రాముడు సుగ్రీవునకు కృతజ్ఞతలు చెప్పటం | 67 |
| సర్గ-40. | వానరులు తూర్పు దిక్కుకు వెళ్ళడం | 68 |
| సర్గ-41. | వానరులు దక్షిణ దిక్కుకు వెళ్ళటం | 71 |
| సర్గ-42. | పశ్చిమ దిశకు వానరుల ప్రయాణం | 73 |
| సర్గ-43. | ఉత్తర దిశకు వానరుల ప్రయాణం | 75 |
| సర్గ-44. | హనుమంతునికి ముద్రికా ప్రదానం | 77 |
| సర్గ-45. | సీతాన్వేషణాప్రారంభం | 78 |
| సర్గ-46. | సుగ్రీవుడు భూమండలం తిరిగి వచ్చిన విషయంచెప్పటం | 79 |
| సర్గ-47. | వానర ప్రముఖుల తిరుగుముఖం | 81 |
| సర్గ-48. | సీతాన్వేషణంలో అంగదుని తేజం | 81 |
| సర్గ-49. | ఆగని అన్వేషణం | 82 |
| సర్గ-50. | హనుమదాదులకు తాపసి తారసిల్లటం | 83 |
| సర్గ-51. | స్వయంప్రభ ఆతిథ్యం | 85 |
| సర్గ-52. | స్వయంప్రభ సహాయం | 86 |
| సర్గ-53. | వానరుల విచారం | 88 |

| | | |
|---|---|---|
| సర్గ-54. | హనుమంతుడు అంగదునికి ధైర్యం చెప్పటం | 89 |
| సర్గ-55. | అంగదుని ఆక్రోశం | 90 |
| సర్గ-56. | సంపాతి దర్శనం | 91 |
| సర్గ-57. | సంపాతికి జరిగినకథ చెప్పటం | 92 |
| సర్గ-58. | సంపాతి వల్ల సీత ఆచూకి తెలుసుకోవటం | 93 |
| సర్గ-59. | సంపాతి - సుపార్శ్వుడు | 96 |
| సర్గ-60. | సంపాతి ఆత్మకథ | 97 |
| సర్గ-61. | మహర్షి - సంపాతిల సంభాషణం | 98 |
| సర్గ-62. | నిశాకరుని ఓదార్పు | 99 |
| సర్గ-63. | సంపాతి ఆనందోత్సాహం | 100 |
| సర్గ-64. | వానరుల శక్తియుక్తులు | 101 |
| సర్గ-65. | వీరుల శక్తి సామర్థ్యాలు | 102 |
| సర్గ-66. | హనుమంతుణ్ణి ప్రేరేపించటం | 104 |
| సర్గ-67. | హనుమంతుడు మహేంద్రగిరి చేరటం | 106 |


## సుందరకాండ


| | | |
|---|---|---|
| సర్గ-1. | సముద్ర లంఘనం | 108 |
| సర్గ-2. | ఆంజనేయుని లఘురూపం | 114 |
| సర్గ-3. | లంకిణిని నిరోధించటం | 117 |
| సర్గ-4. | రావణాంతఃపుర ప్రవేశం | 119 |
| సర్గ-5. | రావణాంతఃపురం - సీతకై వెదకులాట | 121 |
| సర్గ-6. | రావణాదుల భవనాలలో అన్వేషణం | 122 |
| సర్గ-7. | రావణుని పుష్పక విమానం | 124 |
| సర్గ-8. | పుష్పక విమానం - పునఃఅన్వేషణం | 125 |
| సర్గ-9. | రావణాంతఃపురం - అన్వేషణం | 126 |
| సర్గ-10. | హనుమంతుని భ్రాంతి | 128 |
| సర్గ-11. | ఆంజనేయుని భ్రాంతి తొలగడం | 131 |
| సర్గ-12. | ఆంజనేయుడు చింతాక్రాంతుడవటం | 133 |
| సర్గ-13. | అనర్థాల గురించి ఆలోచించటం | 134 |

| | | |
|---|---|---|
| సర్గ-14. | అశోకవనంలో ప్రవేశం | 137 |
| సర్గ-15. | సీతా సందర్శనం | 139 |
| సర్గ-16. | సీత శోకం - హనుమంతుని దుఃఖం | 142 |
| సర్గ-17. | హనుమంతుని ఆనందం | 144 |
| సర్గ-18. | రావణుని ప్రవేశం | 145 |
| సర్గ-19. | రావణుడు సీతను చూడటం | 147 |
| సర్గ-20. | రావణుని పొగడ్తలు | 148 |
| సర్గ-21. | సీత హితవు | 150 |
| సర్గ-22. | రావణుడు - గడువు | 151 |
| సర్గ-23. | సీతకు నచ్చచెప్పే ప్రయత్నం | 153 |
| సర్గ-24. | రాక్షస స్త్రీల ఉద్బోధ | 154 |
| సర్గ-25. | శోకతప్త సీత | 157 |
| సర్గ-26. | సీత దైన్యం | 158 |
| సర్గ-27. | త్రిజటాస్వప్నం | 161 |
| సర్గ-28. | సీత ప్రాణ త్యాగానికి ఒడిగట్టటం | 164 |
| సర్గ-29. | సీతాదేవికి శుభ శకున దర్శనం | 165 |
| సర్గ-30. | హనుమంతుని ఆలోచన | 166 |
| సర్గ-31. | హనుమంతుని రామకథా గానం | 168 |
| సర్గ-32. | సీతాదేవి ఆలోచనాలోచనం | 169 |
| సర్గ-33. | సీతా హనుమంతుల సంభాషణం | 170 |
| సర్గ-34. | సీతా సందేహం | 171 |
| సర్గ-35. | సీతకు విశ్వాసం | 173 |
| సర్గ-36. | సీతాదేవికి రామముద్రికను ఇవ్వటం | 176 |
| సర్గ-37. | సీతాదేవి కోరిక | 178 |
| సర్గ-38. | చూడామణి ప్రదానం | 181 |
| సర్గ-39. | సీతాసంశయం | 184 |
| సర్గ-40. | సీతా సందేశం | 186 |
| సర్గ-41. | ఉద్యానవన ధ్వంసం | 187 |

| | | |
|---|---|---|
| సర్గ–42. | రాక్షసులు నిహతులవటం | 188 |
| సర్గ–43. | చైత్య ప్రాసాద ధ్వంసం | 190 |
| సర్గ–44. | జంబుమాలికి యముని దర్శనం | 192 |
| సర్గ–45. | మంత్రి పుత్రుల వధ | 193 |
| సర్గ–46. | సేనాపతుల సంహారం | 193 |
| సర్గ–47. | అక్షకుమారుని పరాక్రమం | 195 |
| సర్గ–48. | బ్రహ్మాస్త్రంతో బంధితుడైన హనుమంతుడు | 197 |
| సర్గ–49. | రావణుని ఆకారం | 201 |
| సర్గ–50. | ప్రహస్తుని ప్రశ్నలు | 202 |
| సర్గ–51. | హనుమంతుని హితవు | 204 |
| సర్గ–52. | విభీషణుని హితవు | 206 |
| సర్గ–53. | హనుమంతుని తోకకు నిప్పు | 208 |
| సర్గ–54. | లంకాదహనం | 210 |
| సర్గ–55. | సీత చింత | 212 |
| సర్గ–56. | సీతాదర్శనం – సముద్ర లంఘనం | 214 |
| సర్గ–57. | హనుమ అంగదాదుల సమాగమనం | 216 |
| సర్గ–58. | సీతాన్వేషణా వృత్తాంతం | 218 |
| సర్గ–59. | సీత దురవస్థ | 223 |
| సర్గ–60. | అంగదుని ఉత్సాహం | 225 |
| సర్గ–61. | మధువనంలో కేరింతలు | 226 |
| సర్గ–62. | దధిముఖుని ప్రయాణం | 227 |
| సర్గ–63. | కార్య సాఫల్యతను గుర్తించిన సుగ్రీవుడు | 228 |
| సర్గ–64. | సీతా సందర్శన వార్తను తెలపటం | 230 |
| సర్గ–65. | శ్రీరామునకు సీతావృత్తాంతాన్ని చెప్పటం | 232 |
| సర్గ–66. | శ్రీరామచంద్రుని పరితాపం | 233 |
| సర్గ–67. | హనుమంతుడు రామచంద్రుని కోర్కెను తీర్చటం | 234 |
| సర్గ–68. | సీత సందేహాలను నివృత్తి చేసిన విధానం | 235 |

## యుద్ధకాండ


| | | |
|---|---|---|
| సర్గ-1. | శ్రీరాముని దీర్ఘాలోచన | 237 |
| సర్గ-2. | సుగ్రీవుని ప్రోత్సాహం | 238 |
| సర్గ-3. | లంక రక్షణ వ్యవస్థ | 240 |
| సర్గ-4. | వానర సేన సముద్ర తీరానికి ప్రయాణం | 242 |
| సర్గ-5. | సీతాస్మరణం | 247 |
| సర్గ-6. | రావణుని మంత్రాలోచన | 248 |
| సర్గ-7. | రాక్షసుల పరాక్రమం | 250 |
| సర్గ-8. | రాక్షసుల ప్రగల్భాలు | 252 |
| సర్గ-9. | విభీషణుని హితబోధ | 253 |
| సర్గ-10. | అపశకునాలు | 256 |
| సర్గ-11. | మంత్ర భవనంలో మంత్రాంగం | 258 |
| సర్గ-12. | రావణుని పరివేదన | 260 |
| సర్గ-13. | రావణుని ప్రగల్భాలు | 263 |
| సర్గ-14. | విభీషణుని హితోక్తులు | 265 |
| సర్గ-15. | ఇంద్రజిత్తుకు రాముని పరిచయం | 266 |
| సర్గ-16. | విభీషణుడు రావణుని విడిచి వెళ్లటం | 268 |
| సర్గ-17. | విభీషణుడు శ్రీరాముని శరణువేడటం | 270 |
| సర్గ-18. | శ్రీరాముని నిర్ణయం | 273 |
| సర్గ-19. | రామ విభీషణుల సంభాషణం | 275 |
| సర్గ-20. | రావణుని రాయబారం | 277 |
| సర్గ-21. | సముద్రునిపై రామబాణ ప్రయోగం | 278 |
| సర్గ-22. | సేతు నిర్మాణం | 280 |
| సర్గ-23. | ఉత్పాత శకునాలు | 284 |
| సర్గ-24. | శుకరావణుల సంభాషణం | 285 |
| సర్గ-25. | రావణుని కుటిల నీతి | 287 |
| సర్గ-26. | రావణుడు - వానర సైన్యం | 289 |
| సర్గ-27. | సారణుడు - వానరుల పరాక్రమం | 291 |

| | | |
|---|---|---|
| సర్గ–28. | ప్రముఖుల బలాబలాలు | 292 |
| సర్గ–29. | శార్దూలుని ఆగడం | 294 |
| సర్గ–30. | వానర వీరుల వంశ చరిత్ర | 296 |
| సర్గ–31. | దశగ్రీవుడు జానకికి భీతి కలిగించటం | 297 |
| సర్గ–32. | మాయా శిరస్సును చూసిన సీత పరితాపం | 300 |
| సర్గ–33. | సరమ ఊరడింపులు | 302 |
| సర్గ–34. | సరమ లాలింపు | 304 |
| సర్గ–35. | మాల్యవంతుని హితం | 305 |
| సర్గ–36. | నగర రక్షణ ఏర్పాట్లు | 307 |
| సర్గ–37. | శ్రీరాముని వ్యూహరచన | 309 |
| సర్గ–38. | రామపక్షం సువేల పర్వతం చేరటం | 310 |
| సర్గ–39. | రామలక్ష్మణులు – లంకానగర వైభవం | 311 |
| సర్గ–40. | రావణ సుగ్రీవుల ద్వంద్వ యుద్ధం | 312 |
| సర్గ–41. | అంగద రాయబారం | 314 |
| సర్గ–42. | వానరులు లంకను ఆక్రమించటం | 317 |
| సర్గ–43. | ప్రజంఘాది వీరుల మరణం | 319 |
| సర్గ–44. | రామలక్ష్మణుల నాగబంధం | 321 |
| సర్గ–45. | వానరుల శోకం | 322 |
| సర్గ–46. | ఇంద్రజిత్తు బడాయి | 323 |
| సర్గ–47. | నాగపాశబద్ధులైన రామలక్ష్మణులు – సీత | 326 |
| సర్గ–48. | త్రిజట ఓదార్పు | 327 |
| సర్గ–49. | రాముడు స్పృహనుండి తేరుకొనటం | 329 |
| సర్గ–50. | నాగపాశం నుండి విడివడటం | 331 |
| సర్గ–51. | ధూమ్రాక్షుడి యుద్ధభేరి | 334 |
| సర్గ–52. | ధూమ్రాక్షుని సంహారం | 336 |
| సర్గ–53. | వజ్రదంష్ట్రుని వీరంగం | 337 |
| సర్గ–54. | వజ్ర దంష్ట్రుని మరణం | 338 |
| సర్గ–55. | అకంపనునితో యుద్ధం | 340 |

| | | |
|---|---|---|
| సర్గ–56. | అకంపనుని అంతం | 341 |
| సర్గ–57. | రణరంగంలో ప్రహస్తుని ప్రవేశం | 342 |
| సర్గ–58. | ప్రహస్తుడిని అంతం చేసిన నీలుడు | 344 |
| సర్గ–59. | రావణుని ప్రతాపం – పరాభవం | 346 |
| సర్గ–60. | కుంభకర్ణుని ఆగమనం | 353 |
| సర్గ–61. | కుంభకర్ణుని జన్మవృత్తాంతం | 358 |
| సర్గ–62. | కుంభకర్ణుడు – వానర సేన | 360 |
| సర్గ–63. | కుంభకర్ణుని హితవు – బీరాలు | 361 |
| సర్గ–64. | మహోదరుని ఉపాయం | 364 |
| సర్గ–65. | సమరభూమి | 367 |
| సర్గ–66. | కుంభకర్ణుని వీరవిహారం | 369 |
| సర్గ–67. | కుంభకర్ణుని మరణం | 370 |
| సర్గ–68. | రావణుని విలాపం | 375 |
| సర్గ–69. | నరాంతకుని సంహారం | 377 |
| సర్గ–70. | రావణుని కుమారుల వరుస మరణాలు | 379 |
| సర్గ–71. | లక్ష్మణుడు అతికాయుని వధించటం | 382 |
| సర్గ–72. | రావణుని చింత | 385 |
| సర్గ–73. | ఇంద్రజిత్తు సమరభూమికి వెళ్ళటం | 386 |
| సర్గ–74. | హనుమంతుడు సంజీవిని పర్వతం తేవటం | 389 |
| సర్గ–75. | వానర రాక్షసుల మధ్య ఘోరయుద్ధం | 392 |
| సర్గ–76. | రాక్షస వీరుల సమరోత్సాహం | 394 |
| సర్గ–77. | హనుమ చేతిలో నికుంభుని మరణం | 397 |
| సర్గ–78. | మకరాక్షుని యుద్ధ సన్నాహం | 398 |
| సర్గ–79. | శ్రీరాముడు మకరాక్షుని యమపురికి పంపటం | 399 |
| సర్గ–80. | ఇంద్రజిత్తు యుద్ధం | 400 |
| సర్గ–81. | మాయాసీతను చంపివేయటం | 402 |
| సర్గ–82. | ఇంద్రజిత్తు – నికుంభిలాహోమం ప్రారంభం | 404 |
| సర్గ–83. | శ్రీరాముడిని ఓదార్చటం | 405 |

| | | |
|---|---|---|
| సర్గ-84. | విభీషణుని విన్నపం | 407 |
| సర్గ-85. | లక్ష్మణాదులు నికుంభిలను చేరటం | 408 |
| సర్గ-86. | విభీషణుని ప్రోత్సాహం | 410 |
| సర్గ-87. | ఇంద్రజిత్తు నిందాలాపం | 411 |
| సర్గ-88. | ఇంద్రజిత్తు, లక్ష్మణుల ఘోర యుద్ధం | 413 |
| సర్గ-89. | ఇంద్రజిత్తుతో పోరాటం | 416 |
| సర్గ-90. | ఇంద్రజిత్తు మరణం | 418 |
| సర్గ-91. | శ్రీరాముని హర్షం | 422 |
| సర్గ-92. | రావణుని పుత్ర వియోగ దుఃఖం | 423 |
| సర్గ-93. | శ్రీరాముని పరాక్రమం | 426 |
| సర్గ-94. | రాక్షస స్త్రీల ఆక్రందనం | 427 |
| సర్గ-95. | రావణుని యుద్ధ పయనం | 430 |
| సర్గ-96. | రావణుని విజృంభణ | 431 |
| సర్గ-97. | మహోదరుని పతనం | 433 |
| సర్గ-98. | మహాపార్శ్వుని అంతం | 434 |
| సర్గ-99. | రామ రావణుల యుద్ధ ప్రారంభం | 435 |
| సర్గ-100. | శ్రీరాముని విజృంభణ - రావణుని పలాయనం | 437 |
| సర్గ-101. | లక్ష్మణుడు మూర్ఛనుండి తేరుకోవటం | 440 |
| సర్గ-102. | దేవతా సాయం | 443 |
| సర్గ-103. | రణానికి దూరమైన రావణుడు | 445 |
| సర్గ-104. | రావణుని పునః ప్రవేశం | 447 |
| సర్గ-105. | ఆదిత్య హృదయం | 448 |
| సర్గ-106. | శకునాపశకునాలు | 451 |
| సర్గ-107. | రామరావణుల భయంకర సమరం | 452 |
| సర్గ-108. | రావణ సంహారం | 455 |
| సర్గ-109. | రామ విభీషణుల సంభాషణం | 456 |

| | | |
|---|---|---|
| సర్గ-110. | రావణ స్త్రీ విలాపం | 458 |
| సర్గ-111. | మండోదరి విలాపం - రావణుని అంత్యేష్టి | 460 |
| సర్గ-112. | విభీషణుని రాజ్యాభిషేకం | 464 |
| సర్గ-113. | సీత హనుమంతుల సంభాషణం | 465 |
| సర్గ-114. | సీత రాముని దగ్గరకు రావటం | 468 |
| సర్గ-115. | పరుష వాక్కులు | 469 |
| సర్గ-116. | సీత అగ్నిప్రవేశం | 471 |
| సర్గ-117. | బ్రహ్మాది దేవతల స్తుతి | 473 |
| సర్గ-118. | అగ్నిదేవుని సాక్ష్యం | 475 |
| సర్గ-119. | పరమ శివుని ఆజ్ఞ | 476 |
| సర్గ-120. | సజీవులైన వానరులు | 479 |
| సర్గ-121. | అయోధ్యా ప్రయాణానికి సన్నాహం | 480 |
| సర్గ-122. | అయోధ్యా ప్రయాణం | 482 |
| సర్గ-123. | పుష్పక విమాన ప్రయాణం | 483 |
| సర్గ-124. | భరద్వాజ దర్శనం | 485 |
| సర్గ-125. | రాముడు అయోధ్యకు వస్తున్నాడన్న సమాచారం | 486 |
| సర్గ-126. | నరవానరుల సంభాషణం | 488 |
| సర్గ-127. | నందిగ్రామ దర్శనం | 490 |
| సర్గ-128. | అయోధ్యా ప్రవేశం | 492 |
| | శ్రీరామ పట్టాభిషేకం | 494 |
| | శ్రీరామాయణ మహత్వం | 496 |


* * *

# కిష్కింధకాండ

# పంపాసరోవరతీరానికి చేరటం

## సర్గ – 1

రామలక్ష్మణులు ప్రయాణం చేస్తూ పంపాతీరానికి చేరారు. అక్కడి ప్రకృతి శోభ రామలక్ష్మణులను పరవశింపజేసింది. అసలే దుఃఖితుడై ఉన్న రాముణ్ణి రాగరంజితమై ఉన్న పంపాసరోవరప్రకృతి మరింత దుఃఖార్తిని కలుగజేసింది. పంపలో వికసించిన తామరలను, కలువలను చూచి సీత నేత్రసౌందర్యాన్ని రాముడు గుర్తుచేసుకొన్నాడు. పంపాజలం వైడూర్యంలాగా స్వచ్ఛందంగా ఉంది. చుట్టూ వృక్షాలు, గుబుర్లు, పక్షులు, మృగాలు అన్నీ వసంతుని ఆగమనాన్ని స్వాగతిస్తూన్నాయి.

వసంతుని రాకలోని సంతోషాన్ని వృక్షాలు ఫలసంపదతో వ్యక్తీకరిస్తే, చెట్లు పూలను విరగబూచి మా ఆనందమే ఎక్కువని చెప్తున్నట్లున్నాయి. మా కలరావాలతో మేమే వసంతుని స్వాగతిస్తున్నామంటూ పక్షులు కూహూనాదాలతో మైమరచి పాడుతుంటే, మృగాలు మేం వసంతునితో మమైకమై మాకు వసంతునికీ భేదం ఏమీ లేదంటూ మృగాలు వసంతునికే ఆరాటాన్ని పెంచుతున్నట్లున్నాయి.

దీనినంతా చూచిన రాముడు బ్రహ్మసృష్టికి అబ్బురపడి తను ఆనందించడానికి తన భాగస్వామిని ఎడబాసితిననే చింతలో మునిగి నాతోపాటు నందిగ్రామంలో భరతుడు వ్యాకులుడయ్యాడనే ఆలోచన వచ్చి కలవరపాటుతో తన ప్రక్కనే తనలాగే బాధపడుతున్న లక్ష్మణునికి తన విరహవేదనను చెప్పాడు.

"లక్ష్మణా! సీతను ఎడబాసిన దుఃఖంలో మునిగిన నా మనస్సు దేనిమీద లగ్నం కావడంలేదు. దేన్ని చూచినా నా ఎద సీతను గుర్తుచేసి నన్ను బాధిస్తోంది.

కాని నేడు ఈ పంప చల్లని ఉదకం, వనశోభ కలగలసి ఉన్న మనోహరమైన ప్రకృతిని చూచి నా మనస్సు ఉల్లాసభరితం అవుతోంది. ఇక్కడ తిరిగే కొండచిలువలు, సర్పాలు, అడవిమృగాలు, పక్షులు వాటి వృత్తిని మరచి మన్మథుని బాణాలకు వశమై ప్రవృత్తి మార్చుకొన్నట్లుగా కనిపిస్తున్నాయి.

పెద్దపెద్ద వృక్షాలన్నీ చిన్నచిన్న లతలను పెనవేసుకొన్నాయి. లతలు అక్కడక్కడా పుష్పించాయి. దీన్ని చూస్తుంటే ఒకరికొకరుగా జీవనం సాగించాలని ఈ ప్రకృతి చెప్తున్నట్లుగా అనిపిస్తోంది. వృక్షాలు ఫలాల బరువుతో నేలను స్పృశిస్తున్నాయి. ఈ నీటి మీద నుంచి వచ్చే వాయువు పండ్ల సుగంధాన్ని మోసుకొస్తూ నాలో సీతను చూడాలనే కాంక్షను బలవత్తరం చేస్తున్నాయి.

చెట్ల నుంచి రాలిన పుష్పాలు భూదేవి ముఖారవిందాన్ని కప్పివేశాయి. రంగు రంగులు పూలతో నిండిన ఈ నేల రత్నకంబళిని పరచినట్లుగా కనిపిస్తోంది. పూలపై చేరిన తుమ్మెదలు మకరందాన్ని తనివితీరా తాగుతూ పూల పరిమళాలకు మత్తెక్కి వాటి మీదే సోలిపోతున్నట్లున్నాయి. ఈ గాలి పర్వతగుహలో ప్రతిధ్వనిస్తూ మద్దెల మోతను గుర్తుతెస్తోంది. ఈ పవనుడు చెట్లకు నృత్యం నేర్పుతున్నట్లుగా వృక్షాలు వాయువుకి అనుకూలంగా చిందులేస్తున్నాయి. నృత్యాన్ని చూచి పరవశించి మత్తకోకిలలు తమ గళాన్ని ఎత్తి పంచమస్వరాన్ని ఆలపిస్తున్నాయి.

సామూహిక నృత్యంలో నర్తకీమణులు హారాన్ని కూర్చినట్లు వృక్షాల చిటారుకొమ్మలు పవనుడిని మెప్పించాలని హొయలు ఒలికిస్తూ ఒకదానితో మరొకటి పెనవేసుకొనిపోయాయి. ఇవి పంపను మాలాకృతం చేసినట్లుగా అనిపిస్తోంది.

సౌమిత్రీ! జగత్ప్రాణుడైన ఈ పవనుడు చందనాది వృక్షాల సువాసన పూల పరిమళాన్ని ఫలాల మధుర సుగంధాన్ని కలగలపి చూడండి. చూడండి మానవులారా! వర్ణ వర్గ భేదాలను మరచి సఖ్యం చేస్తే ఎంత మధురంగా ఉంటుందో అని చెప్తున్నట్లుగా ఉంది.

సౌమిత్రీ! మహోన్నత శిఖరాల పైభాగాన్ని కూడా పుష్పాలు కప్పివేసి పుష్పరాశుల్లా కనిపిస్తున్నాయి. పచ్చగన్నేరు చెట్టు పూసి ఉంది. దాన్ని చూడు! పచ్చని పీతాంబరాలు ధరించిన స్త్రీలాగా కనిపిస్తోంది. ఆ స్త్రీల కొప్పుమీద మెరిసే శిరోభూషణం లాగా ఈ పూలమీద తుమ్మెదలు కనిపిస్తున్నాయి.

లక్ష్మణా! పంచవటిలో ఉన్నప్పుడు జలకుక్కుటనాదాలను విని సీత ఆనందిస్తూ నన్ను కూడా నాదాలను వినమని చెప్పేది. ఇప్పుడు ఈ నీరుకోడి అరుస్తుంటే సీత లేని నన్ను చూచి గేలి చేస్తోందా అని నాకు బాధ వేస్తోంది. ఆ పక్షుల జంటలు తుమ్మెదల ఝుంకారాన్ని ఉద్దీపితాలై ఒకరిలో ఒకరు ఒదిగి ప్రకృతిపురుషులలోని తేడాను తెలియనీకుండా చేస్తున్నాయి" అని రాముడు సౌమిత్రితో చెప్పుతున్నాడు.

"నాలో మన్మథుడు విరహాగ్నిని పెంచుతున్నాడు. మాటిమాటికి సీతను జ్ఞప్తికి తెచ్చి నన్ను మరీ పీడిస్తున్నాయి. ఈ వసంతాగ్నిని నేను ఓర్చుకోలేకున్నాను. ఈ వనంలో పురి విప్పి ఆడే మయూరంచుట్టూ ఆడు నెమళ్ళు పరివృత్తమై మణులు పొదిగి ఉన్న మయూరపు పింఛం కాంతిని ద్విగుణీకృతం చేస్తున్నాయి. తనను వదిలి ఉండలేక వచ్చే ఆడునెమలిని చూచి మయూరుడు ఆనందచిత్తుడై నృత్యం చేస్తున్నాడు. ఏ రాక్షసుడు వీరిని విడదీయ యత్నించలేదు."

"సౌమిత్రీ! ఈ జగత్తులోని స్త్రీ పురుషుల ప్రేమానురాగాలకు మించినది ఏదీ లేదని ఈ సరోవరం తీర ప్రకృతి నిర్దేశిస్తోంది. నా ప్రేమ పెన్నిధి నన్ను విడిచి ఎంత పరితపిస్తోందోననే చింత నన్ను పీడిస్తోంది. ఈ పక్షుల మృగాల హర్షోల్లాసం చూచి నాకు సీత తలపుకు వచ్చి సీత నాలాగే పారవశ్యానికి లోనై ఎంతగా పరితపిస్తోందో ననిపిస్తోంది. సీత ఉన్న చోట కూడా వసంతుని అల్లరి ఎలా ఉందో? ఆ వసంతుని శోభలను చూచి సీత దుః ఖార్తికి లోనౌతుందేమో? సీతాదేవి తన ప్రాణాలన్నీ నామీదే పెట్టుకొంది. నన్ను తాకే ఈ పిల్లగాలులు సుఖస్పర్శకు బదులు అగ్నిలాగా తాపాన్ని నాలో పెంచుతున్నాయి."

"సౌమిత్రీ! ఈ ప్రకృతిని పరవశింపచేస్తున్న వసంతుని గొప్పతనాన్ని ఏమని చెప్పను? కెందామరలు బాలసూర్యునిలాగా తళుకులీనుతున్నాయి. ఈ భ్రమరాలు మదనపరవశమై ఉన్న ప్రియురాలిని చేరుతున్నట్లు వడివడిగా పూలగుత్తులను చేరుతున్నాయి."

"లక్ష్మణా! ఈ వాయువేగానికి పంప జలతరంగాలు పరవళ్లు తొక్కుతున్నాయి. ఆ వేగఝరికి కమలాలు ఊగుతూ వింతగా కనిపిస్తున్నాయి. బెగ్గురు పక్షుల కలహంసలు వాటిని చూస్తూ వాటి వెనుకే పరుగెత్తుతున్నాయి.

సీత నా పక్కనే ఉన్నప్పుడు ఆ ప్రకృతి నన్ను పరవశింపజేసింది. ఈనాడు ఒంటరినైన నన్ను ఇవే బాధపెడుతున్నాయి. నా సఖి ఎక్కడ ఉందో! కూడా నేను తెలుసుకోలేకపోయానని నన్ను ఈ ప్రకృతి గేలిచేస్తోంది. అందుకోలేని దూరతీరాలకు వెళ్ళిన సీతను పదే పదే గుర్తుకు తెప్పించే ఈ మన్మథుని చూచి నాలో ఆక్రోశం పెరుగుతోంది. సీతను హరించిన ఆ రాక్షసుని నాకంటి మంటతో దగ్ధం చేయాలని నా మనస్సు తొందరపెడుతోంది."

"ఈ ఋశ్యమూకపర్వతం మీద పెరిగిన వృక్షాలు పుష్పించిన పూలతో మనోహరంగా ఉన్నాయి. పుష్పించబోయే మొగ్గలు శ్యామవర్ణంతో మనస్సును దోస్తున్నాయి. ఈ పర్వతంలో ఉన్న గైరికాది ధాతువులు సూర్యరశ్మితో కలిసి తమ వర్ణాలకు మరింత వన్నెను కూర్చుకొంటున్నాయి. ఇక్కడ వృక్షాల రకాలు ప్రచ్ఛన్నంగా లెక్కకు మించి ఉన్నాయి. కడిమి, ఉలిమిరి, ఖర్జూర, బొరంగి, నీలాశోకం, పారిజాత, పూర్ణక, ధవ, చందన వృక్షాలు గన్నేరు, లొద్దుగు, సింహకేసరం, సుగంధి, ఊడుగు, పచ్చపూలగోరింట, మామిడి, మద్ది, మొగలి, విరిగి, దిరిసెన, ఇరుగుడు, బూరుగు, మోదుగు, కానుక చెట్లు, మల్లె, జాజి, విరజాజి, వావిలి, బొడ్డుమల్లె, గురివింద, పొగడ, సంపెంగ, మొగలి, నాగ తీగలు ఇలా వృక్షాలు, చెట్లు లతలు ఒకదానిలో ఒకటి పెనవేసుకొని ప్రకృతి అంతా మేమే అంటున్నాయి."

"పుష్పించి నేల రాలిన కుసుమాలు, పర్ణాలు అన్నీ కలిసి భూదేవి రంగులద్దిన మేలి ముసుగులను ధరించినట్లు కనిపిస్తోంది. ఈ పంప గుణసంపదతో మందాకినిని తలపిస్తోంది. ప్రకృతికి పరవశించని వృక్షరాజాలు ఎక్కడా కనిపించడంలేదు. ఒకదానితో మరొకటి పోటీకి దిగి వన్నెచిన్నెల పుష్పకిరీటాలను నిర్మించి వృక్షరాజుల తలలపై పెట్టినట్లున్నాయి. ఏనుగులు జలక్రీడా విహారంతో నాలో మదనాగ్నిని రగులుకొల్పుతున్నాయి. పంప అత్యంత శోభతో విరాజిల్లుతోంది. ఈ ప్రకృతిని ఆస్వాదిస్తూ సంచరించే దంపతులే ధన్యులు."

"ఓ లక్ష్మణా!మందభాగ్యుడినైన నన్ను అనుసరించి అబలామణి వచ్చింది. ఆ సాధ్విని రక్షించుకోలేకపోయాను. ఆమె గురించి జనకునికి సమాధానం ఏమని చెప్పేది? ఆమె లేకుండా నా జీవితాన్ని ఎలా గడిపేది? చక్కని శరీరాకృతితో మృదుమంజులహృదయంతో శోభిల్లే నా సతి ఎక్కడ ఉందో? ఎలా ఉందో? ఆ కోమలి కంఠస్వరాన్ని వినే భాగ్యం నాకు ఉందో లేదో లక్ష్మణా! వనవాసదుఃఖాన్ని నాకు కనబడనీయక ఆ అందమైన కన్నులను అటు ఇటు తిప్పుతూ ఆనందంగా ఉన్నానని చెప్పే ఆ కుసుమకోమలి ఏమైనదో కదా!? అయోధ్యకు వెళ్ళితే కౌసల్యామాత నా అనురాగవతి ఐన నా కోడలెక్కడా? అని అడిగితే నేను ఏమని బదులు చెప్పేది? నీవు భరతునితో కలుసుకొని ఆనందించు. నేను సీత లేకుండా ఈ జీవితాన్ని జీవించలేను. ప్రాణత్యాగమే నాకు దారి. మరోదారే లేని నన్ను ఆ భగవంతుడు కరుణించడు" అంటూ విరహతాపంతో కొట్టుకుపోయే రాముణ్ణిచూచి లక్ష్మణుడు ఎంతో ఓదార్చాడు.

"పురుషోత్తమా! నీ దైన్యం నేను చూడలేను. ఆత్మీయుల ఎడబాటు దుఃఖార్తికి లోనుచేయడం సహజమే ఐనా ధీరోదాత్తులు, గంభీరులు, ఉత్సాహవంతులు ఆ శోకాగ్నికి ఆహుతి కారు. మనలో తీవ్రవేదనను కలిగించిన ప్రాణిని తుదముట్టించాలని ఆ విరహాగ్నిని పౌరుషాగ్నిగా ప్రజ్వలింపచేయాలని నీకు తెలియదా? రామా!"

“సీతను అపహరించిన దుష్టుడు పద్నాలుగు లోకాలలో ఎక్కడ ఉన్నా బతకనీయను. మర్యాదగా సీతాదేవిని అప్పగిస్తే వాడు ప్రాణాలతో మనగలడు. లేకపోతే వాణ్ణి సంహరించకమానను. మనం ప్రయత్నించి మనం కోల్పోయిన సంపదను చేజిక్కించుకోవాలి. అదే పౌరుషవంతుల లక్షణం. ఉత్సాహవంతులకు ఆశావాదులకు ఈ లోకంలో లభ్యంకానిది ఏదీ ఉండదు. మనం పట్టుబట్టి సాధించాల్సిన దానికోసం తపించి దాన్ని సంపాదించాలి. శోకాన్ని పారదోలి నీలో నిద్రాణమై ఉన్న ధైర్యాన్ని మేల్కొలుపు. సీతాన్వేషణకు పూనుకో. నీవు త్వరలో సీతారాముడవని పించుకొంటావు” అంటూ లక్ష్మణుడు ధైర్యోత్సాహాలను నూరిపోశాడు.

శ్రీరామ లక్ష్మణులు కార్యోన్ముఖులై పంపా సరోవరం అంతా వెదికారు. ఎక్కడా సీత జాడ తెలియలేదు. ఐనా ఆవేదనాపరులై కూడా పంపను దాటి సమస్త వనాలను, పర్వతాలను, కొండచరియలను అధిగమిస్తూ ముందుకు సాగారు. లక్ష్మణుడు రాజనీతిని ధైర్యాన్ని గుర్తుచేస్తూ ముందుకు వెళ్ళాడు.

ఇలా నడిచి వస్తోన్న మదపుటేనుగుల్లాంటి రామలక్ష్మణులను వాలికి భయపడి ఋశ్యమూకం మీద తలదాచుకొంటున్న సుగ్రీవుడు చూశాడు. వాలి తనను హతమార్చడానికి ఈ వీరులను పంపి ఉంటాడేమోనని అనుమానం తెచ్చుకొని నిశ్చేష్టుడయ్యాడు.

అక్కడక్కడా వెదికే సోదరులను చూసి తనకోసమే వెదుకుతున్నారని భ్రమపడి సుగ్రీవుడు విచారానికి లోనయ్యాడు. అలా నడిచి వస్తోన్న రామలక్ష్మణులను మతంగ ఆశ్రమ ప్రాంతంలో స్థిర నివాసం ఏర్పరచుకొని జీవిస్తున్న వానరులు చూశారు. వారి గంభీరమైన నడకను చూసి భయపడి తోకలు ముడిచి వానరాలన్నీ ఆశ్రమంలోకి పరుగెత్తాయి. రామలక్ష్మణులు నడుస్తూ చుట్టూచూస్తున్నారు. వారికెక్కడైనా సీత కనిపిస్తుందేమో అన్న అశ పెల్లుబుకుతూంది చెట్లు, చేమలు, కొండలు, గుట్టలు అన్నింటిని వారి కళ్లు అత్రంగా వెతుకుతున్నాయి.

* * *

# సుగ్రీవుని శంక

## సర్గ - 2

ధనుర్బాణాలను ధరించి ఆజానుబాహవులైన రామలక్ష్మణులు నడిచి రావడం సుగ్రీవునికి కలవరం కలిగించింది. సుగ్రీవుడు భయభీతుడై నలుప్రక్కల చూస్తూ ఒకచోట నిలువలేక అటునిటు పరుగెత్తుతున్నాడు. మనస్సు ఉద్విగ్నతకు లోనయ్యింది. వ్యాకులం చెందుతూన్న మనస్సుతో కపివరుడు దుఃఖితుడయ్యాడు.

రాజధర్మాలను బాగా తెలిసిన సుగ్రీవుడు తన శత్రువైన వాలి గురించి ఆలోచించాడు. బలాబలాలను లెక్కవేసుకొన్నాడు. ఎందుకైనా మంచిదనే ఆలోచనతో తనను ఆశ్రయించి ఉన్న వానరప్రముఖులతో చర్చించాడు. మనస్సులోని ఆందోళన తగ్గకపోవడంతో తను తలదాచుకొంటున్న ప్రాంతానికి వస్తున్న అన్యుల గురించి చెప్పాడు.

"ఓ ప్రముఖులారా!అటు చూడండి. నారవస్త్రాలు ధరించి ధనుర్బాణాలను చేతబట్టి జడ ముడి వేసి తాపసుల వేషధారణతో వస్తోన్న వారిరువురు తప్పకుండా వాలి పంపినవారై ఉంటారు." వారి వేషం రూపం నా మనస్సులో శంకను కలిగిస్తోంది అని చెప్పగానే వారందరూ రామలక్ష్మణులను చూశారు. భయవిహ్వలులై ఒక శిఖరం నుండి మరో శిఖరానికి ఎగురుతూ దుముకుతూ పారిపోయారు. వృక్షాలను కదల్చుతూ పెద్ద పులుల్లాంటి జంతువులను భయపెడుతూ నలుదిక్కులా వారు పరిగెత్తారు.

ఒక చోట వారందరూ గుమికూడి ఆలోచించారు. ఒంటరిగా భయపడుతూన్న సుగ్రీవుని దగ్గరకు వచ్చి నిలబడ్డారు. అతిగా భయపడే సుగ్రీవుణ్ణి వాక్చాతుర్యం ఉన్న హనుమంతుడు చూశాడు. "ఓ సుగ్రీవా! వానర ప్రముఖులారా! మీరు వాలిని తలచి భయపడాల్సిన అవసరంలేదు. ఋశ్యమూకపర్వతానికి వాలి రాలేడు కదా. ఒకసారి వాలి దుందుభి అనే రాక్షసుని చంపి ఆ కళేబరాన్ని ఎగరేశాడు. ఆ రాక్షసుని రక్తం తపస్సు చేసుకొంటున్న మతంగమహర్షి మీద పడింది. దానితో మతంగ మహర్షి కోపోద్రిక్తుడయ్యాడు. వెంటనే ఈ కళేబరాన్ని విసిరి నా తపోభంగం చేసిన వాడు ఈ ఋశ్యమూక పర్వతం మీద కాలుపెడితే మరణిస్తాడు అని శపించాడు. ఆ శాపకారణంగానే వాలి ఈ పర్వతంవైపుకు రాడు కదా! మీరు ఎందుకు భయపడుతున్నారు? సుగ్రీవా! ఈ ప్రదేశం మీకు సురక్షితమైనది. మీకు వాలివల్ల ఏ ప్రమాదం రాదు" అని హనుమంతుడు సుగ్రీవునికి ధైర్యం చెప్పాడు.

"ఓ వానరరాజా! మీరు రాజులై ఉండి సామాన్యునివలె ఆలోచిస్తున్నారు. నలుగురికి భయం పోగొట్టాల్సిన మీరే భయంతో శోకార్తులౌతున్నారు. బాగా ఆలోచించి మీ బుద్ధిని స్థిరీకరించుకోండి. మీ బుద్ధిని, కౌశలాన్ని ఇంగితాన్ని ఉపయోగించి ఎదుటివారి గురించి ఆలోచించి నిర్ణయం తీసుకోండి. బుద్ధికి పనిచెప్పకపోతే మనం బుద్ధిమంతులం ఎలా అవుతాం? భయం వీడి చేయవలసిన కార్యం గురించి ఆలోచించి నిర్ణయం తీసుకోండి" అని హనుమంతుడు చెప్పాడు.

"ఓ హనుమంతా! రాజులకు చాలామంది మిత్రులు ఉంటారు కదా! ఈ ధనుర్బాణాలను ధరించి వస్తోన్న వీరిని చూచి వారి గంభీరముద్రను చూసి ఎవరు భయపడకుండా ఉండగలరు? వీరి వేషధారణ నాలో అనుమానాన్ని రేకెత్తిస్తోంది. రాజులు మారువేషంలో ఉండి శత్రువుల పీచమణుస్తారు కదా! వాలి ఈ పర్వతానికి రాలేడు కాని, అతని మిత్రులకు ఆ భయం లేదు కదా! అందువల్లే వాలి వీరిని పంపి ఉంటాడనే ఆలోచన నాలో భయోత్పాతాన్ని కల్గిస్తోంది. రాజులను ఎట్టి పరిస్థితులలోను నమ్మకూడదు కదా!"

"ఓ వాయునందనా! నీవు మారువేషం ధరించు. సామాన్య మానవునిలాగా వీరుల దగ్గరకు వెళ్ళు. వారిని మాట్లాడించి వారి మాటలను, చేతలనుబట్టి వారు ఎవరో ఎక్కడివారో, ఎవరు పంపగా వచ్చారో తెలుసుకొనిరా. వారిని పదే పదే పొగడ్తల వర్షంలో ముంచెత్తి వారి మనస్సులో మాటను తెలుసుకొని రా! వారి విశ్వాసాన్ని చూరగొని వారు నిజంగా ఎవరో కనుక్కొనిరా. వారి మాటల ఔచిత్యాన్నిబట్టి వారి ముఖారవిందాన్నిబట్టి వారు సజ్జనులో, కాదో తెలుసుకొని రా!" అని సుగ్రీవుడు హనుమంతునికి చెప్పాడు. తన రాజుపై అభిమానం ఉన్న మారుతి వస్తోన్న ఆ వీరుల గురించి పూర్తి సమాచారాన్ని తెలుసుకొని వచ్చి మీకు ఆనందాన్ని కలుగజేస్తానని చెప్పి రామలక్ష్మణుల దగ్గరకు వాయుసుతుడు బయలుదేరాడు.

* * *

# హనుమంతుని ప్రవేశం

## సర్గ - 3

హనుమంతుడు సుగ్రీవుని ఆదేశాన్ని పాటించటానికి ఒక్క గెంతులో రామలక్ష్మణుల దగ్గరకు వచ్చాడు. కామరూపి అయిన ఆంజనేయుడు సన్యాసివేషంలో రామలక్ష్మణులను చూశాడు. ఆ సోదరులను ఆకట్టుకొనడానికి వారికి నమస్కరించాడు. మృదుమధుర వాక్కులతో వారిని అలరింపజేశాడు. "ఓ స్ఫురద్రూపులారా! మీరు చూడటానికి రాజర్షుల్లాగా ఉన్నారు. దివ్యతేజస్సు మీ ముఖంలో కనబడుతోంది. కాని మీ వేషధారణను తాపసులను పోలి ఉంది."

"సజ్జనులారా! మీరు జటావల్కలాలు ధరించారు. చేతిలో ధనుర్బాణాదులను పట్టుకొన్నారు. ధైర్యస్థులైన బంగారు శరీరచ్ఛాయతో ఉన్న మీరు పంపాసరోవరానికే వన్నెతెచ్చినట్లుగా ఉన్నారు. బలిష్ఠమైన భుజ సంపదతో, స్ఫురద్రూపంతో ఉన్న మీ చూపు ఇతరులకు భీతి కలిగిస్తోంది. మీరు ఎవరో మాకు తెలిపితే మేము సంతోషిస్తాము" అని హనుమంతుడు వారిని అడిగాడు.

"అయ్యా! ఇంద్రధనుస్సులాంటి మీ చాపం మీరు శత్రువులను హతమార్చడంలో ధీరులని చెప్తోంది. సౌందర్య మూర్తులైన మీరు ఎవరు? ఎందుకు ఇక్కడకు వచ్చారు? మీ తేజఃప్రభావంతో మహాపర్వతం దివ్యకాంతివంతం అయింది. మీరిద్దరూ దేవలోకం నుండి దిగివచ్చిన దివ్యసంపన్నుల్లాగా కనబడుతున్నారు. తామరరేకులవంటి మీ కనుదోయి మీ శౌర్యపరాక్రమాలను తెలుపుతోంది."

"సూర్యచంద్రుల వలెనున్న మీరు దైవికంగా ఈ భూలోకానికి వచ్చినవారా? మీ విశాలవక్షస్థలం సింహం వలెనున్న మీ చక్కని మూపురాగ్రం ఉత్తమ రాజలక్షణాలను కలిగిన మీరు రాజ్యభోగాలను త్యజించి తాపసులై వనారణ్యంలో తిరుగుతున్నట్లుగా కనిపిస్తున్నారు? మీరు ఇక్కడికి రావడంలోని కారణం నేను తెలుసుకోవచ్చా? మీ భుజాగ్రాలు, కరాలు ఆభరణాలు పెట్టుకొనేటట్లుగా ఉన్నాయి. కాని మీరు నిరలంకరణతో ఉండడానికి కారణం ఏమిటి? సముద్రాలతో, వనాలతో, జనాలతో నిండి ఉన్న ఈ సర్వ భూమండలాన్ని ఏలగల సత్తా మీ ఇద్దరిలో పొడచూపుతోంది. మీరు పట్టుకొన్న ఈ ధనుస్సు ఇంద్రుని దగ్గర ఉండే వజ్రాయుధంలాగా అపూర్వంగా కనబడుతోంది. తూణీరాలు పదునైన బాణాలతో నిండి చూడముచ్చటగా ఉన్నాయి. మీ చేతిలోని ఖడ్గాలు బంగారు పిడితో కుబుసం వీడిన సర్పంలాగా కనిపిస్తున్నాయి."

"మహాత్ములారా! నేను ఇంతగా మాట్లాడినా మీరు మౌనాన్ని వీడడం లేదు. మా రాజు వానరేంద్రుడు ఐన సుగ్రీవుడు. ఇతని అన్న ఐన వాలి కారణంగా భయభీతుడై రక్షణ కరువై ఈ జగత్తులో తిరుగుతున్నాడు. సుగ్రీవుడు బుద్ధిశాలి. అతడు పంపించినందువల్లే నేను మీ దగ్గరకు వచ్చాను. నన్ను ఆంజనేయుడని అందరూ అంటారు. నేను కామరూపవిద్యలు తెలిసిన వానరుడను. వాయుసుతుడను. నేను కోరుకొన్న ప్రదేశానికి వెళ్ళి రాగలను. మీతో సుగ్రీవుడు మైత్రిని కోరుతున్నాడు. సుగ్రీవునికి ఆనందం ఇవ్వాలనే అభిలాషతో నేను సన్యాసిరూపంలో మీ

దగ్గరకు వచ్చాను" అంటూ హనుమంతుని తన రాకలోని ఆంతర్యాన్ని చెప్తూతూ వచ్చిన వారు ఎవరో తెలుసుకోవాలన్న ఉత్సాహాన్ని చూపాడు.

హనుమంతుని మాటలు రామునికి సంతోషాన్నిచ్చాయి. "సౌమిత్రీ! వెదకబోయిన తీగ ఎదురైనట్లుగా మనం సుగ్రీవుణ్ణి వెదుకుతూ వస్తే సుగ్రీవుని సచివుడే మన దగ్గరకు వచ్చాడు. లక్ష్మణా! ఈ ఆంజనేయుడు వాచస్పతిలాగా కనబడుతున్నాడు. సర్వవేదాంత సారాన్ని గ్రోలినట్లుగా ఇతని మృదుభాషణం మనలో ఆహ్లాదాన్ని కలిగిస్తోంది కదా. అపశబ్దమే లేని ఇతని వాక్కు వ్యాకరణ ఉద్దండు డీతడని చెప్తోంది. ఆంజనేయుడు మాట్లాడుతూంటే ఇతని ముఖం ప్రసన్నంగా ఉంది. నాపైన, సుగ్రీవుని పైన మంచి అభిప్రాయం ఉన్నట్లుగా ఉంది. మంద్రస్వరంతో చక్కని మనస్సులోని మాటను ఆత్మవిశ్వాసంతో చెప్పాడు ఇతని మాటలు నమ్మకాన్ని కలిగిస్తున్నాయి.

ఆంజనేయుని మాటలలో స్పష్టత, ధారణలే కాక సారళ్యంగా ఉన్నాయి. ఇటువంటివాని మాటలు వింటే కత్తి ఎత్తి చంపబూనిన శత్రువు కూడా స్తబ్ధుడై, వినమ్రంగా మారిపోతాడు. ఇటువంటి దూతలున్న రాజులే మహాకార్యాలలో అవలీలగా విజయాన్ని సాధిస్తారు. సుగ్రీవుడు మంచి అదృష్టవంతుడు. బుద్ధిశాలి, వాక్యవిశారదుడైన హనుమంతుని మంత్రిగా పొందాడు" అని శ్రీరాముడు చెప్పాడు.

"ఓ ఆంజనేయా! సుగ్రీవుని గుణగణాలను గూర్చి మేం కబంధుని ద్వారా తెలుసుకొన్నాం. ఇప్పుడు నీ వలన మరింతగా విన్నాం. సుగ్రీవుని మైత్రి కోరి మేం ఇక్కడకు వచ్చాం. నీ మాటలు మాకు ఆనందాన్నిచ్చాయి" అని చెప్పే లక్ష్మణుని మాటలు పవనసుతునిలో ధైర్యం నింపాయి. సుగ్రీవుని కార్యం రామ మైత్రిలో సఫలం అవుతుందనుకొన్నాడు. మంచి వాడైన సుగ్రీవునికి నేటితో కష్టాలు తీరుతాయిలే అని హనుమంతుని మనసు కాస్త ఊరడిల్లింది. చిత్తాన్ని స్థిరీకరించుకొని సుగ్రీవ రామ మైత్రి బంధాన్ని ఏర్పరచాలని హనుమంతుడు అనుకొన్నాడు.

* * *

# మారుతితో సౌమిత్రి సంభాషణం

## సర్గ - 4

**రా**మమైత్రితో సుగ్రీవుని కార్యం విజయవంతం అవుతుందని మారుతి అనుకొన్నాడు. సుగ్రీవుడు పోగొట్టుకున్న రాజ్యాన్ని తిరిగి పొందగలడు అని ఆంజనేయునికి అనిపించింది. చాలా సంతోషంతో "రామలక్ష్మణులారా! వనాలతో కూడిన ఈ పంపాతీరం మృగాలతో సర్పాలతో నిండి ఉంటుంది. ఈ దట్టమైన అడవిలో కాలు మోపడానికి కూడా వీలుండదు కదా. మీరిద్దరూ ఈ కీకారణ్యంలోకి ఎందుకు వచ్చారు?" అని అడిగాడు.

లక్ష్మణుడు ఆంజనేయుని మాటలు విన్నాడు. తన అన్న ప్రేరణతో శ్రీరాముని గూర్చి ఇలా చెప్తున్నాడు. "ఓ వానరప్రముఖా! మేం అయోధ్యను ఏలిన సత్యవంతుడైన దశరథపుత్రులం. ప్రజానురంజకమైన మా తండ్రి పాలనలో అందరూ సుఖంగా ఉండేవారు. ఈయన దశరథుని జ్యేష్ఠపుత్రుడు శ్రీరాముడు. సద్గుణాల వల్ల అందరికీ

ఇష్టుడయ్యాడు. తండ్రి ఆజ్ఞను పాలించడానికి పద్నాలుగేండ్లు వనవాస దీక్షను చేపట్టి దండకారణ్యానికి వచ్చాడు. వెలుగును అనుసరించి ఉండే నీడలాగా ఈ సత్యనిష్ఠుని భార్య ఐన సీత శ్రీరామునితో వనవాసం చేయడానికి వచ్చింది.

నేను శ్రీరాముని దాసుడను. గుణగుణ సంపదలకు మైమరచి క్షణం కూడా ఎడబాసి ఉండలేని తమ్ముణ్ణి. నన్ను లక్ష్మణుడని అంటారు. నేను మా అన్నతో కూడి వనవాస నిమిత్తమై ఈ కారడవులకు వచ్చాను. తండ్రిని సత్యసంధుడిని చేయాలని శ్రీరాముడు తలచాడు.

అందుకే సకలైక సంపన్నుడైన శ్రీరాముడు రాజ్యాన్ని, భోగాలను, సంపదలను తృణప్రాయంగా త్యజించి నారవస్త్రాలు ధరించి తాపసుల మార్గంలో జీవించడానికి కట్టుబడినాడు. నేను ఆయన దాసుడను. అందుకనే నేను ఆయన మార్గాన్నే అవలంబించాను. మేము పంచవటిలో ఉండగానే కామరూపుడైన రావణుడను రాక్షసుడు మా వదినను అపహరించాడు. దానితో మా అన్న చింతితుడై సీతాన్వేషణ కొనసాగిస్తున్నారు" అని సౌమిత్రి చెప్పాడు.

"మా అన్వేషణమార్గంలో దితిపుత్రుడైన ధనువు అనే గంధర్వుని శాపంవల్ల రాక్షసరూపం పొందాడు. అతడు శాపవిముక్తి పొంది సుగ్రీవుడు మీ సీతాన్వేషణలో సాయం చేస్తాడని మాకు చెప్పాడు. రామపత్నిని అపహరించిన రాక్షసుని కనుగొనడంలో సుగ్రీవుడు సర్వసమర్థుడని ఆ మహావీరునితో స్నేహం చేయమని చెప్పి అతడు స్వర్గానికి వెళ్ళాడు. మేము సుగ్రీవుని మైత్రి సహాయాన్ని అర్థిస్తూ ఇక్కడకు వచ్చాం. మా విషయాలన్నీ నీకు నేను చెప్పాను. ఆశ్రితరక్షకుడు ధర్మాత్ముడు ఐన శ్రీరాముడు నేడు ప్రియపత్నిని ఎడబాసి విరహవేదనాగ్నిలో దహింపబడుతున్నాడు. కోసలాధిపతి ఐన దశరథుని ప్రియపుత్రుడు సర్వులకు ప్రియుడైన శ్రీరాముడు నేడు సుగ్రీవుని స్నేహహస్తాన్ని వాంఛిస్తున్నాడు" అని చెప్పే లక్ష్మణుని మాటలు హనుమంతుడు విన్నాడు.

"ఓ రాజకుమారులారా! మీరు జితేంద్రియులు. మా వానరరాజుకు మీ వంటి తేజోమూర్తుల అవసరం ఎంతైనా ఉంది. మా ప్రభువు తన అన్న ఐన వాలి శత్రుత్వంతో రాజ్యభ్రష్టుడయ్యాడు. తన భార్య రుమను కూడా పోగొట్టుకుని ఈ పర్వతంలో తలదాచుకుంటున్నాడు. సీతాదేవిని వెదకడంలో మా సూర్యపుత్రుడైన సుగ్రీవుడు మాతో కలిసి సాయం చేయగలడు" అని చెప్పి మనం సుగ్రీవుని దగ్గరకు వెళ్దాం అని పిలిచాడు.

హనుమంతునికి గౌరవ మర్యాదలు చేసి లక్ష్మణుడు "అన్నా! ఈ పవనసుతుని మాటలవల్ల సుగ్రీవునికి మీ అవసరం ఉందని తెలుస్తోంది. కాబట్టి వీరు సీతాన్వేషణకు తోడ్పడుతారని నాకు నమ్మకం కలుగుతోంది" అని చెప్పాడు. రామునికి కూడా జరుగుతున్న దాన్నిచూచి కాస్త చిత్తం శాంతించింది. మనసులో ఏవో శుభశకునాలు తోచాయి. బుద్ధిశాలి వాయునందనుడైన హనుమంతుడు భిక్షురూపాన్ని త్యజించి వానరరూపం పొందాడు. ఆ తర్వాత వారు ముగ్గురూ కలిసి ఋశ్యమూక పర్వతంమీద ఉన్న వానరరాజైన సుగ్రీవుని దగ్గరకు బయలుదేరారు.

* * *

# రామ సుగ్రీవుల మైత్రి

## సర్గ - 5

రామలక్ష్మణులను చూసి భీతిచెందిన సుగ్రీవుడు ఋశ్యమూకపర్వతం మీద ఉన్న మలయగిరికి చేరాడు. రామలక్ష్మణులను హనుమంతుడు తీసుకొని వెళ్ళి సుగ్రీవుణ్ణి చూపాడు. "సుగ్రీవా! మహాత్ముడైన శ్రీరాముడు తమ్ముడైన లక్ష్మణునితో కలసి నీతో సఖ్యం చేయడానికి ఇక్కడకు వచ్చారు. శ్రీరాముడు ఇక్ష్వాకు వంశ ప్రభువైన దశరథుడను రాజు కొడుకు. ఇతడు స్వధర్మాచరణలో సుప్రసిద్ధుడు. తండ్రి ఆజ్ఞను పాలించడానికి వనవాసదీక్షను చేపట్టి దండకారణ్యానికి వచ్చాడు. వీరు లేని సమయంలో రాక్షసుడు శ్రీరాముని భార్యను అపహరించుకొని వెళ్ళాడు. ఆమెను వెదకడంలో నీ సాయం కోరుతూ వీరు ఇక్కడకు వచ్చారు."

"శ్రీరాముని తండ్రి అశ్వమేధాది యాగాలను చేసి అగ్నిదేవుని మెప్పించాడు. బ్రాహ్మణోత్తములకు భూరిదానాలిచ్చి వారి దీవెనలను పొందాడు. సత్యసంధతతో భగవంతుని మెప్పించి భగవదనుగ్రహంతో ప్రజలను కంటికి రెప్పలా పాలించాడు. తన ముద్దుల భార్యకు ఇచ్చిన వరాల నెపంతో జ్యేష్ఠుని దూరం చేసుకొని ఆ పుత్ర వియోగాన్ని తాళలేక దివికేగాడు. తండ్రి మాటను నిజం చేయాలని వీరిరువురు అడవులకు వచ్చారు. శ్రీరాముని విడిచి ఉండలేని అర్ధాంగి ఐన సీత వీరిని అనుసరించి వచ్చి నేడు రాక్షసుల పాలయింది."

వీరిద్దరూ మహాపరాక్రమవంతులు పూజనీయులు. వీరిని అతిథి సత్కారాలతో సంతృప్తి పరచడం మన కర్తవ్యం. వీరివలన నీవు రాజ్యార్హతను పొందగలవని నా విశ్వాసం" అని చెప్పే హనుమంతుని వాక్యాలు సుగ్రీవునిలో ఆనందం కలిగించాయి. సుగ్రీవుడు అపరిమితానందంతో సోదరులను చూశాడు. రాముని ముఖం చూసిన సుగ్రీవునికి దుఃఖం మటుమాయం అయ్యింది.

"రామా! ధర్మచింతన ఉన్న నీవు సర్వులకు ప్రియుడవు. నీ ఉదాత్తగుణసంపదను గూర్చి పవనసుతుని ద్వారా విన్న నేను ఎంతో ఆనందించాను.

నీవంటి మహాత్ముడు నాతో సఖ్యం చేయాలనుకోవడం నా అదృష్టంగా భావిస్తాను. ఇది నాకే పరమ ప్రయోజనాన్ని తెస్తుంది. ఇదిగో నా స్నేహహస్తాన్ని చాపుతున్నాను. నీకిష్టమైతే నాతో చేయి కలుపు. మన మిద్దరం గాఢమైన స్నేహమాధుర్యసముద్రంలో మునుగుదాం. నేటినుండి మనం మిత్రులమవుదాం" అని సుగ్రీవుడు రామునకు చెప్తున్నాడు. ఆ మాటలు హనుమంతుడు విని జమ్మికర్రలు తెచ్చి అగ్నిని రాజెయ్యసాగాడు.

సుగ్రీవుని మాటలు శ్రీరాముని హృదయాన్ని ఆనందంలో ముంచెత్తాయి. వెంటనే శ్రీరాముడు సుగ్రీవుని చేతిని తన చేతితో అందుకొంటూ సుగ్రీవుణ్ణి గాఢాలింగనం చేసుకొన్నాడు. అగ్నిని వారిరువురూ పూలతో అర్చించి ప్రదక్షిణలు చేసి అగ్నిని సాక్షిగా చేసుకొని మైత్రీబంధాన్ని ఏర్పరుచుకొన్నారు. సౌహార్దంతో ఒకరినొకరు కౌగిలింతలతో సంభావించుకొన్నారు.

"శ్రీరామా! నేటినుండి మనం మిత్రులమయ్యాం. మన సుఖదుఃఖాలు ఇరువురికీ సమానమేనని" సంతోషంగా సుగ్రీవుడు రామునితో చెప్పి ఒక పుష్పించి ఉన్న మద్ది చెట్టు కొమ్మను విరిచి ఆసనంగా చేసి కూర్చోమన్నాడు. చందన వృక్షం కొమ్మను హనుమంతుడు తీసుకొని వచ్చి ఆసనం చేసి లక్ష్మణుని కూర్చోపెట్టాడు. ఆ సమయంలో సుగ్రీవునిలో రాముని మైత్రితో కలిగే ఆనందం వాలి భయం వీడని దుఃఖం కలగలిసి ప్రతిఫలించాయి. "శ్రీరామా! నేను నా అన్న ఐన వాలి వలన భయంతో కుమిలిపోతున్నాను. నా రాజ్యాన్ని తీసుకోవడమే కాక బలవంతంగా నా భార్యను తన వద్దనే ఉంచుకొన్నాడు.

ఈ ఋశ్యమూకాన్ని శాపగ్రస్తుడైన వాలి రాలేడనే ఆశతో నేను ఇక్కడ తలదాచుకొంటున్నాను. ఓ రామచంద్రా! నాలో ఈ భయాన్ని పోగొట్టి వాలితో నాకు విభేదాలు మరలా రాకుండా చేయి ప్రభూ" అంటూ సుగ్రీవుడు రాముణ్ణి వేడుకొన్నాడు. సుగ్రీవునిలో రామునివల్ల ఆనందం వస్తుందని, వాలి నుంచి ఏదైనా ప్రమాదం వస్తుందేమోనన్న శంక మరోప్రక్క ఉండి మనసు కలవరంగా ఉంది.

"కపీశ్వరా! ఆపదలలో ఆపన్నహస్తుడై ఆదుకొనేవాణ్ణే మిత్రుడని అంటారు కదా! నేను తప్పకుండా నీ దుఃఖాన్ని దూరం చేస్తాను. నిన్ను భయభ్రాంతికి లోను చేసే ఆ వాలిని నా అమోఘ శరసంపదతో నాశనం చేస్తాను. మహాసర్పాల వంటి నా బాణాల దెబ్బతో వాలి హతుడై పర్వతంలా నేలగూలక తప్పదు" అని హితకరమైన మాటలను శ్రీరాముడు సుగ్రీవునకు చెప్పాడు.

"ఓ పురుషోత్తమా! నీవలనే నేను నా రాజ్యాన్ని నా భార్యను పొందబోతున్నాను. నీవు నేడే బద్ధశత్రువైన వాలిని హతమార్చు" అని చెప్పాడు. ఆ సమయంలో సీత ఎడమ కన్ను అదిరిపాటుకు లోనైంది. అప్పుడే వాలి రావణుల ఎడమనేత్రాలు అశుభసూచకంగా అదిరాయి.

* * *

# సీత ఆభరణాల ప్రస్తావన

## సర్గ - 6

**రా**మునితో ఏర్పడ్డ మైత్రీబంధానికి సుగ్రీవుడు చాలా సంతోషించాడు. "ఓ రామా! హనుమంతుడు నాకు ఇంతకుముందే మీ గురించి చెప్పాడు. మీ వనవాస కాలంలో మీరిరువురు పర్ణశాలలో లేని సమయంలో రావణుడనే రాక్షసుడు నీ ప్రియపత్నిని అపహరించాడని విన్నాను. ఆ రావణుని ఎదిరించిన జటాయువును ఆ రక్కసుడు చంపి వేశాడనీ నేను తెలుసుకున్నాను."

"ఓ రామచంద్రా! నీవు చింతించకు. నేను మధుకైటభులు తస్కరించిన వేదాన్ని శ్రీహరి రక్షించి కాపాడినట్లుగా సీతను కాపాడుతాను. పాతాళంలోగాని, ఆకాశంలోగాని సీతను దాచిపెట్టి ఉంచినా దానిని నేను కనుగొని సీతను

రక్షించి నీకు సహాయం చేస్తాను. నీవు భార్యావియోగానికి దుఃఖించకు. విషాహారం ఎవరికీ జీర్ణం కానట్లుగా నీ సీతను దాచిన అసురులు గాని, గంధర్వులు గానీ జీవించి ఉండలేరు."

"ఓ రామచంద్రా! ఒకనాడే మేమందరం ఋశ్యమూకంపై కూర్చుని ఆలోచిస్తుండగా ఒక రాక్షసుడు ఒక స్త్రీని తన అంకంలో కూర్చోబెట్టుకుని ఆకాశమార్గాన  వెళ్లడం చూశాము. ఆ స్త్రీ మిథిలానగర రాజుకుమార్తెయే అయి ఉంటుంది. ఆ గరుత్మంతునికి చిక్కిన సర్పంలాగా విలవిలలాడుతూ రామా! రామా! లక్ష్మణా! అంటూ విలపించటం నాకు గుర్తుకు వస్తోంది. నా నలుగురు మంత్రులతో కూర్చుని ఉండటం ఆ సీతా సాధ్వి చూసిందేమో? ఆమె ఒక ఉత్తరీయంలో ఆమె ధరించిన నగలను మూటగట్టి మా మధ్య జారవిడిచింది. నేను వాటిని దాచి ఉంచాను. ఇప్పుడే వాటిని తీసుకొని వచ్చి నీకు చూపిస్తాను. వాటిని నీవు గుర్తుపట్టవచ్చు" అని సుగ్రీవుడు చెపుతూ  ఉన్నాడు.

"సుగ్రీవా! ఆలస్యం ఎందుకు? వెళ్లి తీసుకునిరా! ఆ నగలను చూపించు! నేను నా భార్యను పోగొట్టుకుని జీవితంపై ఆశను వదలుకుని ఉన్నాను" అని రాముడు పరితపించాడు. ఇతరులు చొరరాని గుహలో సుగ్రీవుడు వెళ్లి సీత నగలను మూటలను తెచ్చివారికి చూపించాడు. రాముడు ఆ నగల మూటను చేతితో ముట్టుకోగానే ఆయనలో నిండి ఉండే దుఃఖం ఉబికి కన్నీరుగా ప్రవించింది. దానితో కళ్లు కన్నీటిపొరను అడ్డుగా కట్టాయి. ఆ నగలను చేతితో స్పృశిస్తూ వాటిని చూడలేక "హా! ప్రియా!" అంటూ సీతను తలచి శ్రీరాముడు మూర్ఛితుడయ్యాడు.

అనేకానేక ఆభరణాలన్నీ తీసుకుని తన హృదయంపై పెట్టుకుంటూ "సీతా! వైదేహీ! నా ప్రియాంగీ" అంటూ రాముడు బుసకొట్టే నాగుపాములాగా నిట్టూర్పులు విడిచాడు. "లక్ష్మణా! మీ వదిన నగలను పచ్చని బయలుమీద విడిచినట్లుంది. అందువలన ఈ నగలు దెబ్బతినలేదు. నాకు కన్నీరు ఆగడం లేదు. ఈ నగలను నేను చూస్తూన్నా కానీ, సీతను మరిచిపోలేక నా కన్నులకు సీత అమాయకపు మోమే కనిపించి వీటిని చూడలేక పోతున్నాను. నీవైనా ఆభరణాలు చూడు" అంటూ రాముడు బిగ్గరగా ఏడ్చాడు. అప్పుడు లక్ష్మణుడు వాటినన్నింటిని పరిశీలిస్తూ "అన్నా! నేను నిత్యం పాదాభివందనం చేసేవాణ్ణి గదా! అప్పుడుఈ కాలి అందెలను చూసే భాగ్యం నాకు కలిగేది. ఇవి తప్పక మా వదినె సీత కాలిఅందెలే. ఇందులో సందేహం లేదు" అని చెప్పాడు.

"సుగ్రీవా! నీవు ఆ రాక్షసుని బారిన పడిన నా సీతను చూశావు. మరి ఆ దుర్మార్గుడు నా సీతను ఎక్కడికి తీసుకుని వెళ్లాడు. కనీసం ఏ దిశకు వెళ్లాడో నీవు చూశావా? అదైనా చెప్పు. ఆ రాక్షసుణ్ణి నేను వదిలిపెట్టను. ఆ దుష్టుడు సీతాదేవిని అపహరించి నాలో కోపాగ్నిని ప్రజ్వలింప చేశాడు. దానివల్ల ఆ రాక్షసుని మృత్యుద్వారాన్ని అతడే తెరచుకొన్నాడు."

"ఓ వానరా రాజా! నన్ను వంచితుణ్ణి చేసి నా అర్ధాంగి అపహరించిన రాక్షసుడెవరో చెప్పు ఇప్పుడే వాణ్ణి యమపురికి పంపిస్తాను"అని శ్రీరాముడు సుగ్రీవునితో అన్నాడు.

* * *

# రామసుగ్రీవుల సంభాషణం

## సర్గ - 7

శ్రీరాముని శోకార్తిని చూసి సుగ్రీవుడు కంపించిపోయాడు. “శ్రీరామా! ఆ సీతను అపహరించిన ఆ దుష్టుని గురించి నాకు తెలియదు. వాని వంశం కాని, కులం గాని నేను ఎరుగను. ఆ రావణుడను అధమాధముని నివాసం కూడా నాకు తెలియదు. కాని ఓ శ్రీరామచంద్రా! నీవు దీనునివలె శోకించకు. నిన్ను బాధించిన ఆ రాక్షసుడు ఏ లోకంలో దాగినా సరే నేను పట్టి బంధించి నీ దగ్గరకు తీసుకువస్తాను. ప్రమాణపూర్తిగా చెప్తున్నాను. నేను సీతను వెదికి తీసుకురావడటంలో నీకు సహాయం చేస్తాను” అని సుగ్రీవుడు రాముని ఓదార్చాడు.

“ఓ కోసలేంద్రా! నీ వంటి మహాపరాక్రములకు ఈ బేలతనం అందగించదు. నా భార్యకూడా అన్యాక్రాంతం అయింది అయినా నేను ధైర్యాన్ని కోల్పోలేదు. శోకంలో మునిగినా దైవం మీద భారం వేసి ఎదురుచూస్తున్నాను. నేను వానరుడను. మూఢుడినైన నేను భార్య గురించి అంతగా చింతించడంలేదు. నీవు నరుడవు; బుద్ధిశాలులైన గురుశిక్షణలో పెద్దవాడివయ్యావు. నాగరికుడవు; ధైర్యశాలివి; నీ లాంటి వారే ఇలా చింతకు గుర్తైతే నాలాంటి వారు ఏమౌతారు?శ్రీరామా ఎవరినైనా మీరు ఎదరించగల సమర్థులు అటువంటి మీకు నిరుత్సాహం అంతగా బాగలేదు.”అంటూ సుగ్రీవుడు రాముని ఓదార్చుతున్నాడు.

“రామచంద్రా! ఇతరులకు అభయప్రదానం చేయగల సమర్థుడివి. అట్టి నీవే ఇలా చింతకు గురి అయితే ఇక నాలాంటివారి సంగతి ఎవరు చూస్తారు? ప్రభూ! సంతతధారగా కారే ఆ కన్నీటిని ఆపివేయి. నీ సహజ ధైర్యాన్ని గుర్తు చేసుకో. దుఃఖంలోగాని ఆర్థిక కష్టాలలోగాని భయస్థితికి లోనైనప్పుడు కాని ప్రాణహాని కలిగినప్పుడు గాని ధైర్యం కలవాడు నిస్పృహకు లోనుకాడు. బరువెక్కిన నౌక నీటిలో మునిగిపోయినట్లుగా ఇంద్రియ నిగ్రహం లేనివాడు మాటి మాటికీ దైన్యానికి గురిఅయి చింతితుడౌతాడు. నిత్యం శోకించేవారికి శాంతి చేకూరదు. వారి తేజస్సును శోకం హరించివేస్తుంది.”

“రాజేంద్రా! నీవు శోకాన్ని విడిచి ధైర్యం తెచ్చుకో. రామా! నీపై మోహముతో నీ మిత్రుడినన్న భావంతో నేను చనువు తీసుకొంటున్నాను. నీవు అన్యథా భావించకు” అంటూ ఆత్మీయతతో చెప్పే సుగ్రీవుని వాక్కులు విని శ్రీరాముడు తన ఉత్తరీయపు కొంగుతో కన్నీరును తుడుచుకొన్నాడు. సుగ్రీవుని మాటలకు శ్రీరాముని మనస్సు ఊరడిల్లింది. సుగ్రీవుని గాఢంగా కౌగిలించుకొని “సుగ్రీవా! నీవు చెప్పిన ప్రతిమాటా హితంతో కూడిన సమయోచితమే. నీవలననే నేను ఊరటచెందాను. బంధువులకన్నా స్నేహితులే మిన్న అని నీవు చాటావు. నీలాంటి ఆత్మీయుడు నాకు దొరకడం నేను చేసుకొన్న పుణ్యం.”

“వానరశ్రేష్ఠా! సీతను అపహరించినవాణ్ణి కనిపెట్టడంలో నీవు జాగుచేయకు. నీ మేలుకోసం నేను చేయాల్సిన కార్యం గురించి నీవు మొహమాటపడకుండా చెప్పు. వర్షాకాలంలో నాటిన విత్తు వృక్షం అయినట్లుగా నేను నీ కార్యాన్ని సఫలీకృతం చేస్తాను. సుగ్రీవా! నేను ఏనాడూ అసత్యం పలకలేదు. వానరశ్రేష్ఠా! నేను నిన్ను వంచించిన వాలిని చంపుతానని నీకు మాట ఇస్తున్నాను. ఇది యథార్థం. నేను ప్రమాణపూర్తిగా నీకు మాట ఇచ్చాను. నా

వంశంలోని వారు మాట కోసమే ప్రాణత్యాగం చేసిన మహానుభావులు. వారి బాటలో నడిచే నేను నీ శత్రువును మట్టి కరిపిస్తాను" అని చెప్పాడు.

శ్రీరాముడు ఇలా చెప్పడం సుగ్రీవునితోపాటుగా ఉన్న వానర ప్రముఖులు అందరూ విని సంతోషించారు. వారిద్దరూ ఒకచోట కూర్చుని ఒకరి కష్టాన్ని మరొకరు పంచుకొన్నారు. వానరప్రముఖుడు, రాజ్యభ్రష్టుడైన సుగ్రీవుడు రాముడు వాలిని వధించి వేసినట్లుగా భావించి సంతోషించాడు. తన కార్యం సఫలం అవుతుందనే దృఢవిశ్వాసాన్ని రాముని మాటలద్వారా తెలుసుకొని ఆయన ఎంతో సంతోషించాడు.

* * *

# సుగ్రీవుని సంకటం

## సర్గ - 8

**వా**నరరాజు శ్రీరాముని మాటలకు సంతసించి లక్ష్మణునితో కూడి ఉన్న శ్రీరామునితో ఇలా చెప్తున్నాడు. "ఓ రామచంద్రా! నీవంటి మిత్రుడు సహాయం చేయగల ధీరోదాత్తుడు నాకు దొరకడం నా అదృష్టం. రామా! నీ అండదండలున్నచో సురరాజ్యాధిపత్యం కూడా దక్కడంలో అతిశయం ఏమీ ఉండదు. ఇక నా కిష్కింధ ఓ లెక్కా! అగ్నిసాక్షిగా నాకు నీ మిత్రత్వం దొరకడంతో నా బంధువులందరి ప్రేమానురాగాలు చూరగొంటానని నాకు అనిపిస్తోంది. సత్పురుషులైనవారు వెండి బంగారాలు, వస్త్రాదుల విషయంలో నీవి నావి అనే భేదభావాన్ని చూపించరు. బుద్ధిశాలురలకు ధైర్యం నిశ్చలంగా ఉంటుంది. తన మిత్రుడు ధనవంతుడైన ధనహీనుడైనా దోషియై నిర్దోషి ఐనా సుఖ దుఃఖాలలో మునిగి ఉన్నా ఏ తేడా లేకుండా స్నేహాన్ని ఉత్తముడు కొనసాగిస్తాడు."

"ఓ రామా! మిత్రుని స్నేహంకోసం సంపదలను సుఖాలనే కాదు ప్రాణాలను కూడా తృణప్రాయంగా చూడడం స్నేహధర్మం కదా! మనం ప్రాణస్నేహితుల్లాగా స్నేహధర్మాన్ని పాటిద్దాం" అన్న సుగ్రీవుని మాటలకు శ్రీరాముడు తన అంగీకారాన్ని తెలిపాడు. రామలక్ష్మణులు నిలుచుండడం చూసి పక్కనే విరగకాచి ఉన్న మద్దికొమ్మలను విరిచి ఆసనాలను ఏర్పరచి, వారిని కూర్చోబెట్టి, తానూ కూర్చున్నాడు.

"ఓ రామచంద్రా! నేను వాలివల్ల తీవ్ర మనస్తాపానికి గురి అయ్యాను. వాలి నా ప్రాణాధికమైన రుమను లాగివేసుకొని నన్ను కిష్కింధనుంచి గెంటేశాడు. వాలివల్ల నేను దుఃఖిస్తూ దిక్కుతోచని స్థితిలో ఉన్నాను. నేడు నీవు నాకు దొరికావు. పేదల పాలిటి కల్పవృక్షంలాగా సర్వలోకశరణ్యా! నీవే నన్ను ఆ వాలి బారినుండి కాపాడాలి. నా భార్యను నాకు దక్కించాలి ప్రభూ" అని సుగ్రీవుడు వేడుకొన్నాడు.

సుగ్రీవుని మాటలకు శ్రీరాముడు చిరునవ్వు నవ్వి "మిత్రమా! మిత్రునివల్ల ఉపకారం శత్రువు వలన అపకారం జరగడం మామూలే కదా! నేను, నీ బాధను తగ్గిస్తాను. నా బాణాలు వజ్రాయుధసమాలు. కణుపులు

ఉన్న నా శరాలు అభేద్యాలు. ఇవి చాలా పదునైనవి. శత్రువులను నాశనం చేయడంలో ప్రసిద్ధి పొందాయి" అని అంటుండగానే "రామా! నీ మాటలు నాలో ఉపశమనాన్ని కల్గిస్తున్నాయి. నీవు నా ప్రాణాధికుడివైన స్నేహితుడివి ఓ సఖా! అందుకనే నేను నిన్ను పదే పదే వేడుకొంటున్నాను." ఇలా అంటున్న సుగ్రీవునికి కన్నీళ్ళు ఉబికివచ్చాయి. కంఠం రుద్ధం అయ్యింది. డగ్గుత్తికతో కన్నీరును తుచుకుంటూ "ఓ రాఘవా! నన్ను వాలి యువరాజు పదవినుండి తొలగించాడు.

నన్ను ఎన్నో దుర్భాషలాడాడు. కిష్కింధనుండి తరిమేశాడు. నా ప్రాణసఖిని బలవంతంగా తన వశం చేసుకొన్నాడు. నా స్నేహితులను నా బంధుజనాన్ని చెరలో బంధించాడు. నన్ను హతమార్చాలని వాలి ఎన్నోసార్లు ప్రయత్నించి విఫలుడు అయ్యాడు. ఎందరినో నాపై ఉసికొల్పి పంపాడు. వారందరూ నా చేతిలో ప్రాణాలను పోగొట్టుకొన్నారు."

"ఓ రామా! మొదట మిమ్ములను వాలి పంపి ఉంటాడని నేను అనుమానించాను. భీతిల్లిన మనస్సున్న వారు ఎవరినైనా అనుమానించే దృక్పథాన్ని కలిగి ఉండడంలో తప్పులేదుకదా. నాకు హనుమంతుని లాంటివారు ఉన్నారు. వారివలన నేను ఇన్నాళ్ళు ఎన్ని కష్టాలు పడినా జీవిస్తున్నాను. నేను ఎక్కడో ఎలా ఉన్నా నన్ను వారందరూ సదా కాపాడుతూనే ఉంటారు."

"ఓ రామచంద్రా! వాలి నా కన్నా బలశాలి. అతని నాశనమే నా పురోగతికి చిహ్నం అని నాకు అనిపిస్తుంది. నా పాలిటి శత్రువు వాలి. అటువంటి వాలిని నిర్మూలించి నాకు సహాయం చేసి నీవు నన్ను కాపాడుతావు గదా!" అని అడిగే సుగ్రీవుణ్ణి శ్రీరాముడు సానుభూతితో చూశాడు. శ్రీరాముడు "సుగ్రీవా! నేటినుంచి భయం వీడు. అసలు నీకు వాలికి వైరం ఎందుకు ఏర్పడిందో నాకు చెప్పు. మీ బలాబలాలను గూర్చి నేను ఆలోచించి నీకు మేలు కలిగే విధంగా నేను కర్తవ్యాన్ని పాటిస్తాను.

నీ అవమానాన్ని విని కోపోద్రిక్తుడనై నా శరానికి వాలిని బలి ఇస్తాను. నీ శత్రువును నా శత్రువుగా భావించి వాని ప్రాణాలను హరించివేస్తాను. నీవు ప్రశాంతంగా వాలి కథను నాకు చెప్పు" అని శ్రీరాముడు అడగగా వానర ప్రముఖుడు సచివులతో కూడి వాలి వైరాన్ని దాని మూలాన్ని చెప్పనారంభించాడు.

* * *

# వాలి సుగ్రీవుల వైరం

## సర్గ – 9

**శ్రీ**రాముడు వాలితో వైరం ఏర్పడడానికి కారణం చెప్పమన్నాడు. దానికి సుగ్రీవుడు ఇలా చెప్పనారంభించాడు." ఓ రామా! మా తండ్రి ఋక్షరజుడు. వాలి శత్రుసంహారకునిగా పేరుగాంచాడు. అందుకే వాలిని తన అభిమాన

పుత్రునిగా రాజ్యానికి వారసుడిగా నా తండ్రి తలచేవాడు. మంచి బలసంపన్నుడైన వాలిని వానరరాజ్యానికి రాజును చేశాడు. నేను మా అన్నపైన గౌరవాదరాలు ఉన్నవాడినే కనుక వాలి మహారాజుకు రాజ్యభారంలో చేదోడు వాదోడుగా ఉండేవాణ్ణి. మయునికి మాయావి, దుందుభి అనేవారు కుమారులు. మాయావికి మా అన్న వాలికి ఒక స్త్రీ కారణంగా వైరం ఏర్పడింది. ఒకరోజు మాయావి నిద్రిస్తున్న మా అన్నను రణరంగానికి రమ్మంటూ భీకర గర్జన చేశాడు. ఆ గర్జనకు వాలి కుపితుడయ్యాడు. వెంటనే అతనిపై పోరుకు సిద్ధపడ్డాడు. నేను, మా వదిన, మంత్రులు ఎంత చెప్పినా వినక మాయావిపై పోరాటానికి తలపడ్డారు. అప్పుడు నేను మా అన్నను అనుసరించి పోరుకు బయలుదేరాను. కాని మాయావి మమ్మల్నిద్దరిని చూసి పరుగు ప్రారంభించాడు. వాణ్ణి తరుముతూ మేమిద్దరం చాలా దూరం వెళ్ళాం.

ఆ మాయావి అలా వెళ్ళి వెళ్ళి ఒక చొరరాని బిలంలోకి వెళ్ళాడు. వాలి దాన్ని చూసి కోపంతో మండిపడ్డాడు. నేను ఎంత ప్రార్థించి చెప్పినా వినకుండా వాలి కూడా ఆ బిలంలోకి పోవాలనుకొన్నాడు. నేను వస్తానని ప్రాధేయపడ్డాను. వాలి తనపై ఒట్టు పెట్టుకొని, నేను శత్రువును చంపి వచ్చేవరకు నీవు బిలం దగ్గరే ఉండు అని చెప్పి అతడు ఆ బిలం లోపలికి వెళ్ళాడు. ఆ తర్వాత సంవత్సరంపైగా కాలం గడిచింది. వాలి తిరిగిరాలేదు; కాని ఏడుపులు పెడబొబ్బలు వినిపించాయి. ఆ బిలం నుండి రక్తం నురగలతో బయటకు వచ్చింది. అప్పుడు మా అన్న వాలి ఆక్రందన నాకు వినిపించింది. నేను ఎంతో దుఃఖంతో వాలికోసం ఎదురుచూశాను. నా ఎదురుచూపు నాకు నిరాశ కలిగించింది.

ఇక మా అన్న మరణించాడని తలచి ఆ బిలమార్గాన్ని మూసివేసి మా అన్నకు జలతర్పణం చేసి రాజ్యానికి వచ్చాను. కాని నేనీ విషయం ఎవరికీ చెప్పలేదు. మంత్రులు ఎంతో ప్రయాసతో ఈ విషయాన్ని నన్ను అడిగి తెలుసుకొన్నారు. అప్పుడు నేనెంత వారించినా వినక వారందరూ నన్ను పట్టాభిషిక్తుని చేశారు. నేను న్యాయసమ్మతంగానే రాజ్యపాలన చేశాను. కొన్నాళ్ళకు మా అన్న వాలి తన శత్రువును చంపి కిష్కింధకు వచ్చాడు. రాజుగానున్న నన్ను చూసి దూషించాడు. నేను మా అన్న రాకకు ఎంతో సంతోషించాను. ఆయనపై గౌరవంతో వాలికి శిరసా ప్రణమిల్లాను. అయినా నేను చెప్పేది ఏమాత్రం వినకుండా నన్ను దుర్భాషలాడాడు. నా మంత్రులందరిని చెరసాలలో బంధించాడు. అన్నా! నా అజ్ఞానంతో తప్పు జరిగింది మన్నించమంటూ నేను ఎంతో వేడుకొన్నాను. నీ రాజ్యాన్ని నీవే తీసుకో ఎప్పటిలాగా నేను నీ సేవకుడిలాగానే ఉంటాను అని నివేదించాను. అయినా వాలిలో మార్పు ఏం రాలేదు. మా అన్నను నిగ్రహించు శక్తి నాలో ఉన్నా, అన్న అనే గౌరవభావంతో నేను వాలిని గౌరవించాను. వాలి నాపై ప్రసన్న దృష్టిని చూపలేదు. నాపై దయచూపలేదు. రామచంద్రా! నాపై వాలికి అదే కోపం ఇప్పటికి తగ్గలేదు. అందుకే నేను ఇలా అడవులు పట్టుకు తిరుగుతున్నాను. అతని కోపం చల్లారలేదు" అని సుగ్రీవుడు చెప్పాడు.

* * *

# శ్రీరాముడు సుగ్రీవుని ఓదార్చటం

## సర్గ - 10

"శ్రీరామచంద్రా! నేను మా అన్నను ప్రసన్నునిగా చేయాలని ఎన్నో చెప్పాను. అన్నా! వేగిరపాటుతో వచ్చే క్రోధం మంచిదికాదు. నేను కావాలని తప్పుచేయలేదు. నన్ను మన్నించు" అని ఎంతో వేడుకొన్నాను. కాని ఆయన నన్ను కనికరించలేదు. "ఓ అన్నా! నీవు శత్రువును పరిమార్చి రావడం మాకు సంతోషాన్నిస్తోంది. దిక్కులేని మాకు నీవే దిక్కు. ఈ శ్వేతచ్ఛత్రాన్ని నేను నీకు పట్టే భాగ్యం కల్పించు. నేను నీకు వింజామరలతో వీస్తూ సేవిస్తాను" అని చెప్పాను.

"అన్నా! నీకోసం నేను ఒక సంవత్సరకాలం ఎదురుచూశాను. అయినా నీవు రాలేదు. గుహనుండి రక్తం ప్రవహించి రావడం, నీ ఆక్రందన విని నేను శోకంలో మునిగి ఆందోళనతో బండరాయిని ఆ గుహకు అడ్డుపెట్టి మరలా కిష్కింధకు చేరాను. రాజు లేని రాజ్యం అన్యాక్రాంతం అయిపోతుందని, రాజు లేకపోతే రాజ్యంలో అరాచకాలు తలెత్తుతాయని, అన్యాయం ప్రబలి అధర్మం రాజ్యమేలుతుందనే భయంతో మంత్రులు, పెద్దలు అందరూ నన్ను బలవంతంగా రాజును చేశారు. ఇప్పుడు నీవు వచ్చావు ఈ నీ రాజ్యాన్ని నీకే ఇచ్చివేస్తాను. ఎప్పటిలాగే నీ భృత్యునిగా ఉంటాను."

"అన్నా! నీవు లేనప్పుడు ఈ రాజ్యాన్ని నేను న్యాసంగానే స్వీకరించాను. కాని దుర్బుద్ధితో ఈ రాజ్యాన్ని ఏలాలన్న తలంపు నాకు లేదు. నాపై కోపం వీడి నన్ను అర్థం చేసుకో." నేను ఇలా ఎంత వినమ్రతతో చెప్తున్నా మా అన్న వినకుండా నన్ను ఛీకొట్టాడు. ఎన్నో దుర్భాషలాడాడు. మంత్రి, ప్రముఖుల్ని పిలిచి నన్ను వారి ముందు నిందించాడు. పౌరులను పిలిచి "ఓ ప్రజలారా! మాయావి అనే రాక్షసుడు నన్ను అర్ధరాత్రి యుద్ధానికి పిలిచాడు. అపుడు నేను వెళ్లాను" అంటూ వారికి చెప్పడం మొదలుపెట్టాడు.

"ప్రజలారా! ఆ రాక్షసుని కవ్వింపు మాటలకు నేను కోపం తెచ్చుకొని యుద్ధానికి బయలుదేరి వెళ్ళాను. అప్పుడు ఈ దుర్మార్గుడైన మా తమ్ముడు నన్ను అనుసరించి వచ్చాడు.

మేమిద్దరం ఆ రాక్షసుని తరముతూ వెళ్ళాం. నన్ను చూసి రాక్షసుడు భయపడి పిక్కబలం కొద్దీ ఒక బిలంలోకి వెళ్ళాడు. వాణ్ణి హతమార్చాలనే ఉద్దేశ్యంతో నేను "సుగ్రీవా! శత్రువును చంపి నేను వచ్చేదాకా ఇక్కడే ఉండు" అని చెప్పి ఆ బిలంలోకి వెళ్ళాను. మా ఇద్దరిమధ్య భయంకరమైన యుద్ధం జరిగింది. నేను చివరకు విజయుడినై ఆ రక్కసుని చంపివేశాను. కిష్కింధకు రావాలని అనుకొని బయటకు వచ్చే మార్గంకోసం వెదికాను. నాకు మార్గం కనిపించలేదు. "సుగ్రీవా! సుగ్రీవా!" అని ఎంతో గట్టిగా అరిచాను.

నేను ఎంతో ప్రయాసతో బండతో కప్పిన ద్వారాన్ని చూశాను. నా పిడిగుద్దులతో ఎంతో కష్టపడి ఆ బండను తొలగించి బయటకు వచ్చి సుగ్రీవుడు అక్కడ లేనందుకు ఎంతో దుఃఖించాను. అప్పుడు నాకు విషయం అర్థం అయ్యింది. నేను మార్గాన్ని అన్వేషిస్తూ కిష్కింధకు చేరుకున్నాను. ఇక్కడ దుర్బుద్ధితో తిరిగి నేను రాకుండా ఉండేందుకు బిలద్వారాన్ని మూసివేసి వచ్చి నా రాజ్యాన్ని అన్యాయంగా అప్పనంగా ఈ దుర్మార్గపు తమ్ముడు

అనుభవిస్తున్నాడు. నేను దాన్ని జీర్ణించుకోలేకపోయాను. అందుకే ఈ దుష్టుణ్ణి కట్టుబట్టలతో రాజ్యబహిష్కరణ చేస్తాను" అంటూ నా మాట కాస్తంత కూడా వినిపించుకోకుండా మా అన్న నన్ను రాజ్యబహిష్కారం చేశాడు. అంతేగాదు "రామచంద్రా! నా భార్య ఐన రుమను కూడా బలవంతంగా తీసుకొన్నాడు.

రాజ్యంలో ఉండే అర్హతను పోగొట్టుకుని, ప్రాణసఖిని కోల్పోయిన నేను వ్యాకులచిత్తంతో ఈ భూమండలం అంతా పిచ్చివానిగా తిరిగాను. ఎన్నోసార్లు వాలి నన్ను అవమానించాడు. భయపెట్టి చంపాలనుకొన్నాడు. కాని నేను వానికి దొరుకక ఈ ఋశ్యమూకానికి చేరుకొన్నాను. శాపగ్రస్తుడైన వాలి ఈ పర్వతంపైకి రాలేడు కదా అనే నిశ్చయంతో ఇక్కడే నేను తలదాల్చుకొంటున్నాను. రామచంద్రా!నాకు మా అన్నకు గల వైరాన్ని గూర్చి నీకు చెప్పాను.

ఏ అపరాధాన్ని చేయకుండానే నేను శిక్షలు అనుభవిస్తున్నాను. రామా! నీవు సత్యసంధుడివి; నీ న్యాయ మార్గంలో ఆలోచించి నా శత్రువును నిగ్రహించి నన్ను కాపాడు తండ్రీ!" అని వేడుకొనే సుగ్రీవుని మాటలు శ్రీరాముడు విన్నాడు.

చిరునవ్వు నవ్వుతూ "సుగ్రీవా! నీవు ఇకనుండి నిర్భయంగా జీవించు. నా సూర్యతేజస్సమానమైన బాణాలు అన్యాయ్యుడైన వాలిని సంహరించివేస్తాయి. నీవు ఉండగానే నీ భార్యను హరించిన ఆ దుష్టవర్తనుని తలను నా శత్రుసంహారక శరాలు నరికివేస్తాయి. వానరోత్తమా! నీ మనోవ్యథ నాకు అర్థం అయ్యింది. ఈ దుఃఖం నుండి నేను నిన్ను బయటపడేస్తాను. నీ కోర్కె ఈడేరుతుంది. నీవు నిశ్చయంగా నీ భార్యను రాజ్యాన్ని పొందగలవు" అని శ్రీరాముడు సుగ్రీవునకు ధర్మయుక్తమైన హితవచనాలు మృదువాక్కులతో చెప్పాడు.

శ్రీరాముని మాటలు సుగ్రీవునిలో భయాన్ని పోగొట్టాయి. ఆయన మాటలు విని సుగ్రీవునికి మరల జీవితంపై ఆశలు కలిగాయి. ఈ రామచంద్రుని వల్ల నేను తిరిగి రుమను పొందుతాను అని నిశ్చయించుకొన్నాడు. సంతోషంతో రాఘవుని తనివి తీరా చూశాడు. సుగ్రీవునిలోని ఆనందాన్ని చూచిన ఆయన అనుచరులకు సంతోషం వేసింది. తమ ప్రభువు కష్టాలు తీరబోయే సమయం వచ్చింది. ఇక మనకు సుఖపడే దినాలు వచ్చాయని వానరులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

* * *

# బలపరాక్రమాలు

## సర్గ - 11

**శ్రీ**రాముని మాటలు సుగ్రీవునిలో అణచబడి ఉన్న పౌరుషాగ్నిని మేల్కొలిపాయి. సంతోషంతో సుగ్రీవుడు శ్రీరాముని శ్లాఘించాడు."ఓ రామా! నీ పదునైన బాణాలు శత్రువు ఆయువుపట్టుల్ని ఛేదించివేస్తాయి. నీవు సమస్త లోకాలను జయించగల వీరాధివీరుడవంటూ" సుగ్రీవుడు శ్రీరాముని కొనియాడారు.

"రామా! వాలి బలపరాక్రమాల గూర్చి విన్న తర్వాత నీ కర్తవ్యాన్ని నిర్ణయించుకో. వాలి ఎంత బలవంతుడో నేను చెప్తాను విను" అంటూ ఇలా చెప్పసాగాడు. "ఇనకుల వంశోత్తమా! వాలి సూర్యోదయానికి పూర్వమే లేచి కాలకృత్యాలు తీర్చుకొంటాడు. భూమండలానికి నలుదిక్కుల ఉన్న నాలుగుసముద్రాలకు వెళ్ళి సంధ్యోపాసన చేస్తాడు. తిరిగి సూర్యుడు పూర్తిగా ఉదయించకముందే తన నగరానికి తిరిగి వస్తాడు. వాలి తన బలంతో పర్వత శిఖరాలను బంతులాగా విసిరివేయగలడు. వృక్షాలను అవలీలగా పెకలించివేస్తాడు.

ఒకసారి దుందుభి అనే మహాకాయుడైన రాక్షసుడు వేయిఏనుగుల బలాన్ని సంపాదించి గర్వంగా తిరిగేవాడు. దుందుభి శరీరం పర్వతాకారంగా ఉండేది. బలగర్వం అతిశయించి దుందుభి దేవతలను మునులను బాధిస్తూండేవాడు. ఆ బలగర్వంతోనే ఒకసారి దుందుభి ఉత్తుంగతరంగాలతో ఎగిసిపడే సముద్రుని మీదకు యుద్ధానికి వెళ్ళాడు. పౌరుషవాక్యాలతో సముద్రుణ్ణి రెచ్చగొట్టి పోరుకు రమ్మన్నాడు.

ధర్మాత్ముడైన సముద్రుడు దుందుభి గర్వపు మాటలకు నొవ్వలేదు. "ఓ దుందుభీ నీవు యుద్ధనేర్పరివి. నీతో యుద్ధం చేసి రణరంగాన నేను విజయాన్ని సాధించలేను. కానీ నీతో సమానంగా యుద్ధం చేయగల హిమవంతుడను పర్వతరాజు ఉన్నాడు. అతడు నీకు సాటి ఐనవాడు. మునులందరికీ ఆశ్రయమిస్తూ ఫలపుష్పాదులతో కూడిన వృక్షరాజాలకు ఆవాసం కల్పిస్తూ సుఖంగా జీవిస్తున్నాడు. నీవు వెళ్ళి ఆ హిమవంతునితో పోరాడి నీ యుద్ధకాంక్షను నెరవేర్చుకో" అని చెప్పాడు.

సముద్రుడు తన ధాటికి భయపడి లొంగిపోయాడని దుందుభి సంతోషించాడు. తనతో సమానుడైన వాడు ఉన్నాడనే విషయం ఆ రక్కసునికి మింగుడుపడలేదు. వెంటనే హిమవంతునిపై రణభేరి మ్రోగించాడు. తెల్లని హిమవత్పర్వతాన్ని తన పిడికెళ్ళతో గుద్ది నాలుగు ముక్కలు చేసి నలుదిక్కులా పడేశాడు. వీని దుర్మార్గాన్ని చూసిన హిమవంతుడు తన శిఖరం మీదే నిలచి" ఓ దుందుభీ! నీవు అతి పరాక్రమవంతుడివి. నీతో పోరుచేయడానికి నాకు శక్తి లేదు. నీతో యుద్ధంలో నేను గెలవలేను" అని అన్నాడు."రామచంద్రా పర్వతరాజు ఇంకా దుందుభిని రెచ్చగొడుతూ ఇలా చెప్పాడు. "ఓ దుందుభీ! కాని, నీ వంటి యుద్ధ నైపుణ్యంగల వానరుడు ఇక్కడే ఉన్నాడు. అతడు నీవంటివాడే. వానితో యుద్ధం చేస్తే నీ అభిలాష తీరుతుంది" అని చెప్పాడు. ఆ వానరుడు ఎవడు? ఎక్కడుంటాడో చెప్పు" అని దుందుభి అడిగాడు.

"ఓ దుందుభీ! వాలి అనే వానరుడు యుద్ధంలో చాలా నేర్పరి. ఆయనను గెలవగల వీరులు నాకు తెలిసీ ఎవరూ లేరు. నీవు సమర్థుడివైతే వాలితో పోరు సల్పు" అని చెప్పాడు. వెంటనే దుందుభి మహాకోపోద్రిక్తంతో కిష్కింధకు బయలుదేరి వెళ్ళాడు. ఇంద్రునికి నముచిలాగా నీతో ద్వంద్వయుద్ధం చేయగల ధీశాలి అని వాలి గురించి చెప్పిన హిమవంతుని మాటలు దుందుభి కోపాన్ని అధికం చేశాయి. దానితో దుందుభి మహిషరూపం ధరించాడు. వాడియైన కొమ్ములు నల్లని మేఘంలాంటి శరీరంతో దుందుభి కనిపించాడు.

వృక్షాల కొమ్మలన్నీ తన కొమ్ములతో త్రుంచివేస్తూ తన గిట్టలతో భూమి బద్దలు చేస్తూ దుందుభి కిష్కింధ ద్వారాన్ని చేరి భీకరంగా అరిచాడు. అప్పుడు వాలి తన స్త్రీలతో సుఖిస్తున్నాడు. దుందుభిస్వరం విని కోపంతో

రగిలిపోతూ వాలి బయటకు వచ్చాడు. ఆయనతోపాటు స్త్రీలు వచ్చారు. వాలి దుందుభిని చూసి "ఓ రాక్షసా! నీ గురించి నేను అంతా తెలుసుకొనే ఉన్నాను. నీవు వెళ్ళి విశ్రాంతి తీసుకో. నాతో యుద్ధం చేయగల సమర్థుడివి నీవుగాదు" అని చెప్పాడు. ఆ మాటలు రాక్షసునికి అమిత కోపాన్ని తెప్పించాయి. పౌరుషం ఎగచిమ్మింది. "దానితో స్త్రీలముందు గొప్పలు పోకు. వానరా! నీవు బలవంతుడివైతే నాకో యుద్ధం చేసి చూపించు. అప్పుడు నీ బలమెంతో అందరికీ తెలుస్తుంది" అన్నాడు.

"పోనీ, ఈ రాత్రికి నా కోపాన్ని నిగ్రహించుకొంటాను. నీవు ఈ వానరలోకానికి అధిపతివిగదా. అందుకని ఈ రాత్రి నీ రమణులతో రమించి సుఖాన్ని పొందు. నీ మంత్రులు నీ పౌరులకు నీ చివరి వాక్యాలు వినిపించి బహుమానాలు ఇవ్వు. నీ తదనంతరం రాజ్యాన్ని ఏలడానికి వారసుణ్ణి ఎన్నుకొని నియమించు. ఈ రాత్రి అంతా సుఖంగా గడుపుతూ నీ రాజ్యమైన కిష్కింధను తవినితీరా చూడు. రేపు సూర్యోదయం కాగానే వీరునివై యమపురికి వెళ్ళడానికి సిద్ధపడి అందరికి అంతిమ వీడ్కోలు ఇచ్చి నా కదనరంగానికి రా. నిన్ను వీర స్వర్గాలంకృతుణ్ణి చేస్తాను అని దుందుభి వాలిని ఎగతాళి చేశాడు.

వాలి వీరా! నీవు ఇప్పుడు మద్యపానాదులతో మునిగి మత్తుగా ఉన్నావు. స్త్రీలపై వ్యామోహంతో ఉన్నావు. నీలాంటివాణ్ణి చంపితే భ్రూణహత్యచేసిన పాపం చుట్టుకొంటుంది. అందుకే నీవిప్పుడు ఆనందంగా నీ కోర్కెలు తీర్చుకొని రేపు ఉదయమే పోరుకు సిద్ధపడు" అన్నాడు. దుందుభి మాటలకు వాలి నవ్వి తన స్త్రీలను లోపలికి పంపివేశాడు. "ఓ దుందుభీ! ఈ వాలి మద్యపానం చేసి మత్తెక్కి ఉన్నాడని తక్కువగా అంచనా వేయకు. ఆ మధుపానం కూడా నాకు వీరపానమే. నీవు సమర్థుడివైతే కాచుకో నా దెబ్బ అని యుద్ధానికి రా" అని వాలి వీరంగం చేశాడు.

వాలికి తన తండ్రి ఇచ్చిన బంగారు హారం గుర్తుకువచ్చింది. ఆయన చెప్పిన మాటలు జ్ఞప్తికి వచ్చాయి. ఈ హారాన్ని ధరించి యుద్ధం చేస్తే ఎదుటివాని బలం నిన్ను చేరుతుందనే తండ్రి మాటలు వాలిలో ఉత్సాహాన్ని పెంచాయి. వెంటనే బంగారుమాలను ధరించి దుందుభితో తలపడ్డాడు. ఆ బంగారు మాల మహత్వంతో వాలి బలం రెట్టింపు అయ్యి దుందుభి బలం క్షీణించింది.

సమరోత్సాహంతో ఆ ఇరువురు కలబడ్డారు. వాలి కోపంతో రెచ్చిపోయి దుందుభి కొమ్ములు పట్టుకొని గిరగిరా తిప్పి నేలకేసి కొట్టాడు. దానితో దుందుభి చెవులనుండి రక్తం బయటకు కారింది. ఒకరిని మించి మరొకరు గెలవాలన్న ఆశతో వృక్షాలు పెకలించి ఒకరిపై ఒకరు వేసుకొని యుద్ధం చేశారు. వాలి పిడికెళ్ళతో గుద్ది మోకాళ్ళతో గుచ్చి దుందుభిని హింసించాడు. రాక్షసుని బలం తగ్గుతూ ఉన్నందున దుందుభి శౌర్యాన్ని చూపడంలో వెనుకంజ వేస్తున్నాడు. వాలి అతిశయించిన బలంతో దుందుభిని నుజ్జు చేస్తూ పైకెత్తి నేలకేసి కొట్టాడు. ఆ దెబ్బకు దుందుభి ప్రాణాలు విడిచాడు.

కోపం తగ్గని వాలి దుందుభి శరీరాన్ని ఎత్తి గిరగిరా తిప్పి విసిరికొట్టాడు. అది ఒక యోజనం దూరంలో పడింది. కాని అలా ఆ కళేబరాన్ని తిప్పేటప్పుడు దాని నుండి రక్తం కారి ఆ చుక్కలు మతంగాశ్రమం చుట్టూ పడ్డాయి.

కొన్ని బిందువులు గాలికి ఎగిరి తపస్సు చేసుకొంటున్న మతంగ మునిపై పడి తపోభంగం చేశాయి. "నా తపస్సు భగ్నం చేసిన మూర్ఖుడు ఎవరా" అని బయటకు వచ్చి చూశాడు. ఆయన ఆశ్రమం ఎదుట పడి ఉన్న దుందుభి శరీరాన్ని చూశాడు. ఈ దుర్మార్గం చేసింది వాలి అని తన తపోమహిమవల్ల తెలుసుకొన్నాడు. కోపంతో "ఈ ఆశ్రమాన్ని రక్తంతో అపవిత్రం చేసిన దుర్మార్గుడు శిక్షార్హుడు. వృక్షాలను ధ్వంసం చేసి నా తపస్సుకు భంగం చేశాడు. ఇతడు ఈ ఋశ్యమూకానికి వస్తే మరణం సంభవిస్తుంది" అని శపించాడు

"అంతేగాదు ఈ ఆశ్రమంలోపల ఒక యోజనంలోపల అడుగుపెడితే వాలి నశించక తప్పదు. వాలిని కొలిచే మంత్రులు, పరివారం నా మాటలు విని ఇక్కడినుంచి వెళ్ళిపొండి, ఒక్క రోజు గడువు ఇస్తున్నాను. రేపటికి మీలో ఏ ఒక్కరు కనిపించినా నా శాపానికి గురి అవ్వక తప్పదు అని అన్నాడు. రేపటి దినమున నాకు కనిపించే వారు వేల సంవత్సరాలు పాషాణులై పడి ఉందురుగాక " అంటూ మతంగ మహర్షి ఆశ్రమం లోపలకి వెళ్ళిపోయాడు

ఆ మాటలు విన్న వానరులందరూ భయంతో కంపించిపోయారు. గబగబా ఆ ఆశ్రమ ప్రాంతాల్ని విడిచి కిష్కింధకు వచ్చి వాలిని ఆశ్రయించారు. అలా భయపడుతున్నవారిని చూసి వాలి ఏమి జరిగిందని అడిగారు. వారు జరిగింది చెప్పగానే వాలి వెళ్ళి మతంగుని వినయంగా ప్రార్థించాడు. తన వల్ల జరిగిన తప్పుకు క్షమించమని ఎంతో వేడుకున్నాడు. కాని మతంగ మహర్షి వాలిని క్షమించలేదు. శాపాన్ని ఉపసంహరించుకోలేదు. వాలి దానికి ఎంతో బాధపడి తిరిగి తన ఇంటికి చేరుకొని మరలా ఈ వైపు రాకుండా ఉన్నాడు. ఈ ప్రాంతం పేరు చెప్పడానికి కూడా వాలి భయపడతాడు. అందుకే నేను నా మంత్రులతో ఇక్కడ తలదాచుకొంటున్నాను రామా" అని వాలి బలకారణాన్ని రామునికి చెప్పాడు.

"రామా! ఇటు చూడు ఇక్కడ పడి ఉండే ఈ అస్థిపంజరం ఆ దుందుభిదే. ఏడు మద్దిచెట్లు కనిపిస్తున్నాయి గదా! వీటిని వాలి ఒక్క దెబ్బతో వాటికున్న ఆకులన్నీ రాల్చివేసి ఆనందిస్తుంటాడు. అలాంటి బలోపేతుడైన వాలిని నీవు ఎలా చంపగలవు రామా" అంటూ సుగ్రీవుడు దీనంగా అడిగాడు.

దానికి లక్ష్మణుడు నవ్వి "సుగ్రీవా! నీకు నమ్మకం కలిగించడానికి రాముని ఏం చేయమంటావు అని అడిగాడు. లక్ష్మణా ఈ ఏడు సాలవృక్షాలను ఒక్క బాణంతో రాముడు ఛేదిస్తే ఈ దుందుభి మృతశరీరాన్ని దూరంగా పడవేయగలిగితే వాలిని చంపగల శక్తి ఉందనిపిస్తుంది" అని సుగ్రీవుడు చెప్పాడు.

ఎరుపెక్కుతున్న కన్నులున్న శ్రీరాముని చూసి సుగ్రీవుడు "ఓ రామచంద్రా! వాలికి భయపడి నేను ఇక్కడ తలదాచుకొంటున్నాను. వాలికున్న బలం ఎరిగినవాణ్ణి. వాలి సాహసకృత్యాలను కన్నులారా గాంచినవాణ్ణి. ఆ వానరేంద్రుడు జయింప శక్యంకానివాడు; క్రోధపరవశుడు; అతనిని తలచుకొన్నంతనే నాకు దడపుడుతుంది. అందుకే నేను ఈ వానరప్రముఖులతో కలిసి బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నాను. ఓ రామచంద్రా... నీవు ఉత్తముడైన స్నేహితుడివి. ఇన్నాళ్ళకు నా అదృష్టం కొద్దీ నాకు దొరికావు. కాని నీ బల పరాక్రమాలన్నెంటినో నేను విన్నాను కాని చూడలేకపోయాను.

వాలిని ప్రత్యక్షంగా చూసిన భయంతో ఉన్నవానిని కనుక నీ గురించిన ఆందోళనే కాని నిన్ను అవమానించాలని గాని, ఈ శౌర్య పరాక్రమాలపై నాకు అనుమానంగానీ లేవు. నన్ను నీవానిగా తలచి అర్థం చేసుకో" అని సుగ్రీవుడు రాముని బ్రతిమాలాడు. "రామా! నీవు చేసిన వాగ్దానం, నీ నిశ్చలబుద్ధి, చెక్కుచెదరని నీ ఆత్మవిశ్వాసం ధైర్యం నీ విగ్రహం అన్నీ నివురుగప్పిన నిప్పులాగా కనిపిస్తూనే ఉన్నాయి. కాని, నాలోని ఆందోళనను రూపుమాపు రాఘవా" అని సుగ్రీవుడు వేడుకొన్నాడు.

"వానరోత్తమా! నీ వ్యాకుల స్థితి నాకు అర్థం అయ్యింది. నీవు చింతించకు. నీకు ధైర్యం కలిగించడానికి నా పరాక్రమాన్ని చూపిస్తాను" అంటూ ఎండిపోయి ఉన్న దుందుభి కళేబరాన్ని శ్రీరాముడు తన ఎడమ కాలితో ఒక తన్ను తన్నాడు. అది పది యోజనాల దూరంలో పడిపోయింది.

హనుమదాదుల ఎదుట ఉన్న సుగ్రీవుడు దానిని చూసి సంతోషిస్తూ కూడా "శ్రీరామా!నాడు దుందుభి శరీరం అప్పుడే ప్రాణాలు కోల్పోయింది కావున పచ్చి రక్తమాంసాలతో కూడిన ఆ శవాన్ని వాలి ఒక యోజనం దూరంలో ఎత్తిపడేశాడు. కాని ఈరోజు ఈ దుందుభి కళేబరం ఎండిపోయి డొల్లగా ఉంది. దీన్ని నీవు పది యోజనాల దూరంలో పడవేసినా నాలో అనుమానాన్ని పూర్తిగా నశింపజేయలేకుండా ఉంది. వాలి ఒక దెబ్బతో ఆకులన్నీ రాల్చే ఈ సాలవృక్షాలను ఛేదించి నీ బలాన్ని నాకు చూపి నాలో ధైర్యాన్ని కలిగించు స్వామీ" అని సుగ్రీవుడు మరలా శ్రీరాముని ప్రార్థించాడు.

"ఓ రామా! ఏనుగు తొండంలా ఉన్న నీ బలమైన ధనుస్సును సంధించి ఆకర్ణాంతం లాగి నీ శరాన్ని వదిలి ఒక్క మద్ది చెట్టును క్రూలదోసి నా విశ్వాసాన్ని ఇనుమడింపజేయి. నీవు తప్పక వాలిని నిగ్రహించ సమర్థుడవు. ఈ సాల వృక్షాలను ఛేదించగల వీరుడవు. నా నమ్మకాన్ని నీవు ముందువెనుకలు ఆలోచించకుండా నిజం చేయి. నిన్ను పరీక్షించాలని నేను అనుకోవడంలేదు. నా తృప్తికోసం ఈ పనిని చేయమని అడుగుతున్నాను.

రామా! తేజోమూర్తులలో సూర్యుడు, పర్వతాలలో హిమవంతుడు, జంతువులలో సింహం గొప్పవారు. అట్లే మానవులలో సాటిలేని వీరుడవు నీవే! నాకా విషయం తెలుసు కాని, నాకు నమ్మకాన్ని కలిగించే బాధ్యత నీదే రామా!" అంటూ సుగ్రీవుడు రామునికి చెప్పాడు.

* * *

# శ్రీరాముని సంశయం

## సర్గ - 12

**సు**గ్రీవునకు ఆనందం చేకూర్చటానికి శ్రీరాముడు కోదండాన్ని ధరించాడు. దిక్కులు పిక్కటిల్లేటట్లుగా ధనుష్టంకారం చేశాడు. వెంటనే నారి సంధించి ఒక్క బాణాన్ని గురిచూసి వదిలాడు. అది వేగంగా వెళ్ళి ఏడు మద్ది

చెట్లను కూల్చివేసింది. భూమిని చీల్చుకొని పాతాళానికి వెళ్ళింది; అక్కడినుండి మరల అంతేవేగంగా పైకి వచ్చి రాముని అమ్ముల పొదిని చేరింది. ఈ రాముని శరవేగానికి సుగ్రీవుడు అచ్చెరువొందాడు.

వెంటనే సుగ్రీవుడు భూమిపై సాగిలిపడి శ్రీరాముని పాదపద్మాలకు ప్రణమిల్లాడు. రాముని బాణప్రయోగ కౌశలం సుగ్రీవునిలో ఆశ్చర్యానందాలను కలిగించింది. కాసేపు సుగ్రీవునకు నోట మాట రాలేదు. సంతోషంతో ఉబ్బితబ్బిబ్బు అవుతూ "శ్రీరామా! నీవు ఇంద్రాదులను ఓడించగల సమర్థుడవు. ఒకే బాణంతో ఏడు సాలవృక్షాలను భూమిని చీల్చివేశావు. నిన్ను ఎదిరించగల వీరుడెవ్వడూ ఈ లోకంలో లేడు. నీవే వాలిని నిగ్రహించగలిగిన వీరాధివీరుడవు. రఘువరా! నీవు నాకోసం నేడే వాలి వధను కావించు. నా సోదరుని రూపంలో ఉండే నా శత్రువును నిర్జించు కోసలేంద్రా!" అని సుగ్రీవుడు రాముని పొగడ్తలతో ముంచెత్తాడు.

"సుగ్రీవా! నీ ఆనందంకోసం నేను ఏమైనా చేస్తాను. ఇప్పుడే వెళ్ళి నామమాత్రంగా వాలిని పోరుకు పిలువు. నేను నా బాణాన్ని సంధించి నీ శత్రువును నేలరాలుస్తాను. వెళ్ళు" అని శ్రీరాముడు సుగ్రీవునికి చెప్పాడు. అందరూ కలిసి కిష్కింధ చేరారు. హనుమదాదులతో కలిసి రామలక్ష్మణులు చెట్ల వెనుక దాగారు. సుగ్రీవుడు రాముని అండ చూసుకొని మహారోషంతో వాలిని యుద్ధానికి రమ్మంటూ భీకరంగా గర్జించాడు. ఆ గర్జన విని వాలి ఎంతో కోపించాడు. తన చేత వెళ్ళగొట్టబడిన సుగ్రీవుడు నన్నే యుద్ధానికి రమ్మంటున్నాడని రోషం తెచ్చుకొన్నాడు. అమితవేగంతో వాలి సుగ్రీవుని ఎదుటకు వచ్చాడు.

వాలి మేఘం నుండి బయటకు వచ్చిన సూర్యుని వలె ఉన్నాడు. వాలి సుగ్రీవులు బుధ అంగారక గ్రహాలలాగా భయంకరంగా ద్వంద్వయుద్ధం చేశారు. అరచేతి చరుపులతో పిడిగుద్దులతో ఒకరినొకరు భీకరంగా హింసించు కొన్నారు. ఆ యోధుల శరీరం, ఆకారం, ఒక్కలాగే ఉన్నాయి. ఇద్దరూ సమ ఉజ్జీల్లాగా ఏకోదరుల్లాగా భాసించడం చూసి ధనుర్ధారి ఐన శ్రీరాముడు సుగ్రీవుడు ఎవరో తెలుసుకోలేక సంశయించాడు. ఏకరూపంతో ఉన్న వారిరువురు రామునిలో విస్మయం కలిగించారు. వాలిపై బాణప్రయోగం చేయడానికి రాముడు వెనుకాడాడు.

వాలిసుగ్రీవులను చూస్తూ రాముడు ప్రాణాంతకమైన తన శరాన్ని ప్రయోగించకుండా ఆ యోధులను వారి వీరత్వాన్ని చూస్తుండిపోయాడు.

సుగ్రీవునికి ఎంతసేపటికీ రాఘవుడు కనిపించలేదు. వాలి ధాటికి సుగ్రీవుడు తట్టుకోలేకపోతున్నాడు. రామబాణంకోసం సుగ్రీవుడు ఎదురుచూశాడు. ఆ రామశరం జాడ కనుచూపు మేరలో కనిపించలేదు. దాంతో సుగ్రీవుడు కాలికి బుద్ధి చెప్పాడు. శరవేగంతో పరుగెత్తి ఋశ్యమూకానికి చేరాడు. ఆయనతోపాటే వచ్చిన రామలక్ష్మణులను చూచి సుగ్రీవునికి దుఃఖం పెల్లుబికింది.

సుగ్రీవుడు తలవంచుకొని "ఓ శ్రీరామా! నేను వాలిని చంపను అని ఒక్క మాట ముందుగా నాకు చెప్పి ఉంటే నేను ఇన్ని దెబ్బలు తినేవాణ్ణి కాదు గదా! నా మీద నీకు దయ రాలేదా ప్రభూ! నేను నీ పరాక్రమాన్ని గూర్చి ఎంతో విన్నాను. కన్నులారా చూశాను. అప్పుడు శ్రీరాముని అండ నాకుందనే బలంతో విర్రవీగి నిదురపోయే సింహాన్ని తోక తొక్కి లేపినట్లు నా శత్రువును నేనే వెళ్ళి కవ్వించి కదనానికి రమ్మని పిలిచాను. తగిన శాస్తి నాకు జరిగింది" అని చింతించే సుగ్రీవుని రాముడు ఓదార్చాడు.

"సుగ్రీవా! చింతించకు. నాపై నమ్మకాన్ని ఉంచు. నీవు, నీ సోదరుడు చూడటానికి ఒక్కలాగే ఉన్నారు. మీరిద్దరిలో నీవెవరో గుర్తించడంలో నేను అశక్తుడినయ్యాను. అందుకే మీరిద్దరిని నాశనం చేయలేక నేను ఊరకుండిపోయాను. అంతేగాని నేను బాణం వేయలేక ఆగానని తలచకు. వాలికి బదులు నా శరం నిన్ను తాకితే అభయం ఇచ్చినవాణ్ణే పొట్టన పెట్టుకున్నవాణ్ణి అవుతాను గదా అనే శంక నన్ను పీడించింది. మీ కంఠస్వరాలు, మీ వర్చస్సు మీ మాట తీరు మీ పరాక్రమం ఏ ఒక్కదానిని నేను విడపరచలేకపోయాను.

సుగ్రీవా! నీవు క్రోధం తెచ్చుకోకు. నేను నా తమ్ముడు లక్ష్మణుడు, నా భార్య ఐన సీత నీ అధీనంలోనివారమే. నీకు మేలు చేసేవాళ్ళమే. వానరేశ్వరా! మరొకసారి నీవు యుద్ధం చేయి. నేను తప్పకుండా నా బాణంతో నీ శత్రువును మట్టికరిపిస్తాను. ఇందులో లేశమాత్రం సందేహం పెట్టుకోకు. నిన్ను గుర్తించడానికి వీలుగా నీవేదైనా ఒక ఆనవాలును ధరించి పోరుకు వెళ్ళు. నీ అండ నేనే ఉండి నిన్ను రక్షించి తీరుతాను" అని శ్రీరాముడు సుగ్రీవునిలో విశ్వాసాన్ని ఉత్తేజితం చేశాడు.

"లక్ష్మణా! ఈ సుగ్రీవుని కంఠంలో ఆ కనిపించే నాగకేసరపు లతను వేయి. ఈ గజపుష్పమాలతో నేను సుగ్రీవుని గుర్తిస్తాను. ఈసారి వాలిని చంపి తీరుతాను" అని శ్రీరాముడు చెప్పగానే లక్ష్మణుడు గజపుష్పలతను పెకిలించి మాలగా చేసి సుగ్రీవుని మెడలో అలంకరించాడు. ఆ మాలాంకృతుడైన సుగ్రీవుడు పున్నమి నాటి చంద్రునిలాగా కనిపించాడు. సంధ్యాకాలంలో బారులు తీరిన కొంగలచే ప్రకాశించే ఆకాశంలాగా తేజోవంతుడయ్యాడు.

శ్రీరామాజ్ఞను పొంది సుగ్రీవుడు తేజరిల్లిన విశ్వాసంతో ఉత్సాహంతో శత్రువును జయించగలనన్న ధీమాతో కిష్కింధకు బయలుదేరాడు.

* * *

# కిష్కింధాప్రయాణం

## సర్గ - 13

**ల**క్ష్మణుడు శ్రీరాముడు సుగ్రీవాదులతో కలిసి కిష్కింధకు బయలుదేరారు. శ్రీరాముడు శత్రువులను నిర్జించే బంగారుపూత గలిగిన ధనుస్సును అమ్ములపొదినిండా శత్రు భయంకరాలైన శరాలను చేత పట్టి వాలిని వధించడానికి బయలుదేరాడు. సుగ్రీవుడు లక్ష్మణునితో కలిసి ముందు నడుస్తుండగా వారి వెనుక శ్రీరామ హనుమంతులు వారి వెనుక నల నీల తౌరులు అనే వానరోత్తములు నడిచివెళ్ళారు. వారు అలా వెళ్తూ మార్గమధ్యంలో అనేక జలాశయాలను చూశారు. వాటిప్రక్కనే ఏపుగా పెరిగిన వృక్షాలను చెట్లను పొదలను తిలకించారు. వాటిమధ్య స్వేచ్ఛగా తిరిగే వన్యమృగాలను చూశారు. కన్నలేడిపిట్టలు బెగ్గురు పిట్టలు కలహంసలు, వంజులాలు, నీటికోళ్లు చక్రవాకాల్లాంటి చిత్రవిచిత్రపక్షులు అవి చేసే కలరవాలు వింటూ ముందుకు సాగిపోయారు.

వర్షపుధారలతో చక్కగా పెరిగిన పచ్చికను ఇష్టంగా తింటూ ఎవరైనా తమకు హాని కలిగిస్తారేమోననే శంకతో నలువైపులా జాగ్రత్తగా చూసే లేళ్ళు హరిణాలు చూసి అబ్బురం చెందారు. తటాకాలనిండా ఉన్న నిర్మలమైన జలాన్ని తమ జలక్రీడతో కలుషితం చేస్తున్న ఏనుగులను చూశారు. కొండచరియలల్లో చరించే మేఘాల్లా ఉండే నల్లని ఏనుగుల సమూహాలను చూశారు. ప్రకృతిని చూస్తూ కిష్కింధకు వారు వెళ్తున్నారు. అప్పుడు శ్రీరాముడు సుగ్రీవా! ఈ వనంలో చెట్ల సమూహాలు మేఘ సమూహాల్లా కనబడుతున్నాయి. అరటి తోటలు మేఘ మండలం దాకా వ్యాపించి ఉన్నట్లుగా ఎదిగి ఉన్నాయి. వీటి విశేషమేమి అని అడిగాడు. శ్రీరామా! ఇది గొప్ప ఆశ్రమ ప్రాంతం. ఇందులో ఏడుగురు మహామునులు తలక్రిందులుగా ఉండి తపస్సు చేసేవాళ్ళు. వారు నియమం ప్రకారం జలంలో శయనించేవారు. వారానికి ఒకసారి వాయుభక్షణ చేసేవారు. ఆశ్రమంలోని చెట్లు మధుర ఫలాలను ఇస్తాయి. ఇక్కడ దొరికే కందమూలాలు అమృతతుల్యంగా ఉంటాయి. ఆ తాపసులు ఏడువందల సంవత్సరాలు నియమనిష్ఠలతో తపస్సు చేసి సశరీరంగా స్వర్గానికి వెళ్ళారు. ఆ మహిమాన్వితులైన ఆ మునుల ఆశ్రమంలోకి ఇంద్రాదిదేవతలు కాని పశుపక్ష్యాదులు కాని చొరలేవు. ఒకవేళ ఎవరైనా ఇందులో ప్రవేశించినా వారు తిరిగి ప్రాణాలతో వెనక్కిరారు. కాని ఇక్కడ వేణుగానాదులు మృదంగధ్వనులు మంగళతూర్యాలు వినబడుతుంటాయి. ఈ వనం నుంచి మంచి సుగంధాలు గుబాళిస్తుంటాయి. ఇవన్నీ చూసిన వారు ఆ మహామునులు స్వర్గానికి వెళ్ళి అప్సరసలను తీసుకొని ఇక్కడకు మళ్ళీ వచ్చి వినోదిస్తూంటారని అందరూ అనుకొంటారు. ఈ వనంలో త్రేతాగ్నులు ప్రజ్వలిస్తూ ఉంటాయి. వాటినుంచి వెలువడే పొగలు పావురపు గుంపుల్లాగా కనబడుతున్నాయి, అటు చూడండి. హోమధూమంతో కప్పి ఉండే ఈ చెట్ల పైభాగాలన్నీ మేఘాలతో కప్పిన వైడూర్య పర్వతంలాగా కనిపిస్తోంది. "రామచంద్రా! ఈ సప్తజనాశ్రమానికి దోసిలొగ్గి నమస్కరించుదాం. వీరి దీవెనలు అందుకొన్నవారికి అన్నీ శుభాలే చేకూరుతాయి. వీరికి అపజయం అనేది ఉండదు అని సుగ్రీవుడు రామాదులకు" చెప్పాడు. అందరూ కలిసి ఆ ఏడుగురు మహామునులకు నమస్కరించారు. ఆ తర్వాత వారందరూ చాలా దూరం ప్రయాణం చేసి వాలి ఏలుతున్న కిష్కింధను చూశారు.

ఆ మునుల ఆశీర్వాదాలను పొందిన రామలక్ష్మణులు, హనుమ సుగ్రీవులు దివ్య తేజస్సుతో కనిపించారు.

* * *

# సుగ్రీవుడు యుద్ధనాదాన్ని చేయటం

## సర్గ - 14

**రా**మసుగ్రీవాదులు కిష్కింధకు చేరుకొన్నారు. రామలక్ష్మణులు హనుమదాదులు చెట్ల వెనుక పొంచి కూర్చున్నారు. సుగ్రీవుడు కిష్కింధపరిసరాలన్నీ పరికించి చూశాడు. "శ్రీరామా! ఈ కిష్కింధను వానరులు ఎల్లప్పుడూ రక్షిస్తూ ఉంటారు. ఇది శత్రుదుర్భేద్యమైంది. దీని ద్వారం బంగారంతో, ధ్వజయంత్రాలతో కూడి ఉంటుంది. మహావీరుడా! నీ అండతో నేను ఇక్కడకు వచ్చాను. నన్ను రక్షించే భారం నీదే సుమా" అని శ్రీరామునితో సుగ్రీవుడు చెప్పాడు.

చెవులు చిల్లులు పడేలాగా భయంకరమైన శబ్దం చేసి వాలిని యుద్ధానికి ఆహ్వానించాడు. గాలి రాపిడివల్ల ఉద్భవించిన మేఘగర్జనలాంటి నాదాన్ని సుగ్రీవుడు చేశాడు. సుగ్రీవుణ్ణి రాముడు చూసి "ఓ వీరోత్తమా! భయయపడకు; నేను నీకు చేసిన ప్రతిజ్ఞను పాలిస్తాను; నీ మెడలో అలంకృతమై ఉన్న గజ పుష్పలతతో నిన్ను గుర్తించి నా బాణంతో వాలిని నేడు సంహరిస్తాను. నీవు ఈ మాల ధరించి నక్షత్రాల చుట్టు ఉన్న చంద్రునిలాగా కనిపిస్తున్నావు. నీవు వాలిని ద్వంద్వ యుద్ధానికి రమ్మని పిలు. నీ శత్రువును నీ వైరాన్ని నేటితో పెరికివేస్తాను."

"సుగ్రీవా! నీ సోదరుని నాకు ఒకసారి చూపించు. వెంటనే అతడిని నేను యమపురికి పంపివేస్తాను. వాలి నా చేతిలో ప్రాణాలు పోగొట్టుకోవడం తథ్యం. నీవు నేను ఏడు సాలవృక్షాలను ఒక్క బాణంతో కొట్టివేయడం చూశావు కదా. అలానే నేడు ఒక్క బాణంతోనే వాలిని హతమారుస్తాను. వానరోత్తమా! నేను ఇంతవరకు ఒక్క అబద్ధం కూడా చెప్పలేదు. నన్ను ఎన్ని కష్టాలు చుట్టుముట్టినా నేను కల్లలాడను. వరణుడు నేలపై వర్షించి పంటలను పండించినట్లు నేను నీ కోరికను సఫలీకృతం చేస్తాను. వాలిని గట్టిగా అరచి యుద్ధానికి పిలువు. యుద్ధకాంక్ష ఉన్న వాలి నీ పిలుపుకు కోపం తెచ్చుకొని బయటకు తప్పక వస్తాడు. ఆ వాలికి యుద్ధం చాలా ప్రీతిని కలిగిస్తుంది. ఎప్పుడు తనను తాను పొగడుకొంటూ వుంటాడు. అందులో నీవెప్పుడు అతడిని జయించలేదు కదా! తన బలాన్ని గురించి చెప్పుకొనేవారు స్త్రీలముందు యుద్ధానికి రెచ్చకొడితే చూస్తూ ఊరుకోలేరు. కాబట్టి ఏ భయం లేకుండా రణనాదం చేసి వాలి యుద్ధానికి ఆహ్వానించు" అని శ్రీరాముడు సుగ్రీవునికి చెప్పాడు.

బంగారపు రంగుతో మెరిసిపోయే శరీరచ్ఛాయ ఉన్న సుగ్రీవుడు సంతోషంతో తనలోని పౌరుషాగ్నిని మేల్కొలిపాడు. వెంటనే ఆకసం బద్దలు అయినట్లుగా గర్జించాడు. ఆ భీకర గర్జనకు ఆవులు భయపడి పారిపోయాయి. యుద్ధరంగంలో శత్రువులకు భయపడిన అశ్వాలు పరుగెత్తినట్లు వన్యమృగాలు దిక్కుతోచక పరుగులెత్తాయి. పుణ్యం తగ్గి రాలిపోతున్న గ్రహాల్లాగా ఆకాశంలోకి ఎగిరే పక్షులు మహానాదానికి భయపడి నేలపై పడిపోయాయి. సుగ్రీవుడు సూర్యుని అంశంతో పుట్టినవాడు. మేఘంలాగా శబ్దం చేయగల సమర్థుడు. గాలివల్ల ఉవ్వెత్తున ఎగిసిపడే తరంగాలు గల సముద్రునిలాగే సుగ్రీవుడు తేజస్సుతో ప్రకాశించాడు. మహాభీకరమైన నాదాన్ని చేశాడు. నా నాదం వినగానే వాలి కంపించిపోవాలన్న ఆలోచనతో సుగ్రీవుడు గట్టిగా అరిచాడు.

* * *

# తార హితం

## సర్గ - 15

**అ**ంతపురంలో వాలి సేదతీరుతూ సుగ్రీవుడు చేస్తున్న భీకరమైన గర్జన విన్నాడు. సర్వప్రాణిని హడలెత్తించేలాగా ఉన్న ఆ నాదం విని అసలే కోపగ్రస్తుడైన వాలి మండిపడ్డాడు. అతని మత్తు దిగిపోయింది. కోపంతో ఊగిపోయాడు. పింగళ వర్ణం ఉన్న వాలి శరీరం సంధ్యాసమయంలో సూర్యునిలాగా ఎర్రబారింది. వాలి దంతాలు వికృతంగా కనిపిస్తున్నాయి. కోపంతో కన్నులు చంద్రనిప్పులు కక్కుతున్నాయి. ఏనుగులు పద్మాల్ని పెకిలించివేయడంతో కళావిహీనమైన మడుగులాగా వాలి తేజోహీనుడయ్యాడు.

సుగ్రీవుని భీకరమైన అరపు విని కోపంతో భూమి పగిలేటట్లు అడుగులు వేస్తూ బయటకు రాబోయాడు. ఆ సమయంలో వాలి భార్య ఐన తార శంకించింది. వెంటనే వాలిని తన కౌగిలిలో చేర్చుకొని మృదువుగా మెత్తగా ఇలా చెప్పింది. "ఓ మహావీరా! మీలో నదీప్రవాహంలాగా ఉబికి వచ్చే ఈ కోపాన్ని, రాత్రి ధరించిన పూదండను పొద్దున పడవేసినట్లుగా పెరికివేయి. సుగ్రీవునితో యుద్ధం ఏమీ గొప్పకాదు. రేప్పొద్దున వానితో పోరాడవచ్చు. మీతో యుద్ధంలో గెలవగల నేర్పు ఎవరికీ లేదు. నేను మిమ్ము ఎందుకు ఆపుతున్నానో ఒక్క క్షణం ఆగి ఆలోచించండి"

"ఓ నాథా! స్వామీ! ఇంతకుముందే గదాయుద్ధానికి పిలిచి సుగ్రీవుడు మీచే చావు దెబ్బలు తిన్నాడు. చావు తప్పి కన్నులొట్టపోయి మతంగవనానికి పారిపోయిన సుగ్రీవుడు మళ్ళీ వచ్చి మిమ్మల్ని యుద్ధానికి పిలుస్తున్నాడంటే నాకెందుకో అనుమానం వేస్తోంది. ఇందులో ఏదో రహస్యం దాగి ఉన్నట్లుంది."

"సుగ్రీవుడు చేస్తున్న ఈ మహాగర్జనలో సుగ్రీవుని జయం వినిపిస్తోంది. ఈ నాదాన్ని బట్టి అతడు గట్టి ప్రయత్నంతో వచ్చినట్లున్నాడు. ఇప్పుడు సుగ్రీవుని బలహీనునిగా చూడకండి. ఈసారి సుగ్రీవుడు ఒంటరిగా వచ్చి ఉంటాడని నాకు అనిపించటంలేదు. బలమైన సాయం అంది ఉండడంతోనే మీతో పోరుకు నీ తమ్ముడు సిద్ధపడినట్లున్నాడు.

లేనట్లయితే ఇంత త్వరగాను భీకరంగాను పోరుకు పిలవలేడు. కీడెంచి మేలును చూడడం మంచిది అని నాకు అనిపిస్తోంది" అని తార వాలితో చెప్పింది. "మహావీరా! ఇదంతా నేను ఊరికినే చెప్పటంలేదు. సుగ్రీవుడు మంచి తెలివి ఉన్నవాడు. లోతుపాతులు ఎరిగి చెలిమి చేసేవాడు. ఇంతకుముందే అంగదుడు గూఢచారుల ద్వారా తెలుసుకొన్న విషయం నాకు చెప్పి ఉన్నాడు. దానికి తగ్గట్టుగానే నేడు సుగ్రీవుడు మహారణనాదం చేస్తున్నాడు.

"వానరోత్తమా! అయోధ్యాపురిని ఏలిన దశరథ మహారాజు పుత్రులైన రామలక్ష్మణులనే వారి స్నేహం సుగ్రీవునికి దొరికిందట. ఆ సోదరులు మహాపరాక్రమవంతులట. శత్రువులను ఎదిరించడంలో వారికివారే సాటి అట. మహాశూరులైన రామలక్ష్మణులు రాక్షసులను ఎందరినో హతమార్చారట. ఆ శ్రీరాముడు నీ తమ్ముడైన సుగ్రీవునికి అండగా ఉంటానని బాస చేశాడట. శ్రీరామచంద్రుడు సత్యనిష్ఠాపరుడు. సాధుజనులకు కల్పవృక్షం వంటివాడు. మహావృక్షం తన చెంత చేరిన వారికి నీడను, ఫలాలను ఇచ్చి సేద తీర్చినట్లుగా శ్రీరాముడు తనను ఆశ్రయించిన వారికి తాపాలను తొలగించడంలో దిట్ట అట. ఆ ప్రభువు సకల శాస్త్రాలను వేదాలను నేర్చినవాడు. సకల సద్గుణ నిధి శ్రీరాముడు."

"ఆ సాటిలేని పరాక్రమశాలితో మీకు వైరం ఎందుకు? శూరుడా! నా మాట విను. మిమ్ము నేను తప్పుపట్టడంలేదు. కాని మీ మేలు కోరి చెప్తున్నాను. ఓ రాజా! మహాబలవంతుడైన రాముని అండ ఉన్న సుగ్రీవునితో యుద్ధం మనకు మంచిదికాదు. సుగ్రీవుని యువరాజుగా పట్టాభిషిక్తుని చేయడమే అన్ని విధాల మంచిపని అని నాకు అనిపిస్తోంది."

"వానరోత్తమా! సుగ్రీవుడు మీకు తమ్ముడే. మీ కన్నా అతను చిన్నవాడు. కనుక అతనిని చేరదీయవలసినది మీరే. లోకంలో తమ్ముని మించిన ఆత్మీయుడు మరొకడు ఉండడు. సుగ్రీవుని మీరు దగ్గరకు చేరబిలిచి యువరాజుగా గౌరవించడమే మీకు వానికి మేలని నాకు తోస్తోంది. మీరు సుగ్రీవునితో వైరం మాని స్నేహం చేసినట్లు అయితే అతను ఎప్పుడూ వినయ విధేయతలతో మిమ్ము సదా సేవిస్తూ మీ బంటుగా నమ్మకంగా ఉంటాడు.

తమ్ముని ఎడ మీరు సద్భావాన్నే చూపాలి. ఒకవేళ తమ్ముడు ఎపుడైనా తప్పు చేస్తే పెద్దలైన మనమే వారికి మంచిని బోధించిదగ్గరికి తీయాలి. అది పెద్దవారికిబాధ్యత కదా ఇందులో మీకు తెలియనిది ఏదీ లేదు. కానీ, మీరు కోపంలో తెలసిందానిని కూడా నిర్లక్ష్యం చేస్తున్నారు. ఓ నిమిషంపాటు కోపాన్ని విసర్జించి కాస్త ఆలోచించి చూడండి. అపుడు మీకు సుగ్రీవుని మీద జాలి కలుగుతుంది. ఇప్పుడు మీరు యుద్ధం మానివేయడమే మంచిది. ఇంతకన్నా మంచి మార్గం నాకు కన్పించడంలేదు. మీ ప్రియసతిని, మీ ప్రియం గోరి నేను చెప్పే మాటలు ఆలకించండి స్వామి!

నేను ఇలా మాట్లాడానని నాపై కోపించకండి. మీరుబుద్ధిశాలులు. ఒక్క క్షణం కోపం వీడి ఆలోచిస్తే పరిస్థితి అంతా మీకు అర్థం అవుతుంది. కోసల ప్రభువు, శ్రీరాముడు ఇంద్రునితో సమానుడు. అటువంటి ఆ కోదండపాణితో మనకు వైరం మంచిదికాదు" అని తార వాలికెన్నో మంచి మాటలు హితాన్ని కూర్చేవి చెప్పింది.

అయినా పోగాలం దాపురించిన వారికి మంచి మాటలు చెవికి ఎక్కనట్లు వాలికి తార హితోక్తి నచ్చలేదు. తార చెప్పేవాటినన్నింటిని వాలి విసుగ్గా విన్నాడు. ఇంక చాలు నీ సోది అన్నట్లుగా చూశాడు. తారకు వాలి చేస్తున్నపని నచ్చలేదు. ఏవిధంగా వాలిని యుద్ధం నుంచి మరల్చాలి అని ఆలోచించసాగింది.

* * *

# వాలి నేలగూలటం

## సర్గ - 16

తార మాటలు విని వాలి నవ్వుతూ "ఓ సుందరీ! నీవు అనవసరంగా భయపడుతున్నావు. నీవు చెప్పినట్లు సుగ్రీవుడు నాకు తమ్ముడే కాని నేడు శత్రుపక్షంలో నిలిచిన ధూర్తుడు. నాచే చావుదెబ్బలు తినినవాడు. నన్ను యుద్ధానికి రమ్మని సవాలు చేస్తున్నాడు. యుద్ధానికి రమ్మని పిలిస్తే ఏ వీరుడైనా పోకుండా ఉండగలడా? అది అతని పౌరుషానికి మచ్చ కాదా? నీవు ఎక్కువగా ఆలోచించకుండా లోపలికి వెళ్ళు" అని తారతో వాలి చెప్పాడు. అయినా ఆమె అక్కడనుంచి కదలకపోవడంతో ఆమెతో వాలి మరలా ఇలా అంటున్నాడు.

"ఓ సుందరాంగీ! నీవు ఇక్ష్వాకువంశీయులు సత్యనిష్ఠులని, ధర్మవర్తనులని చెప్పావు కదా. నేనేనాడు వారిపై కత్తి ఎత్తలేదు కదా. నిరపరాధిపైన శ్రీరాముడు విల్లు ఎందుకు ఎక్కుపెడ్తాడు? నీవు శ్రీరాముడు నాకు కీడు

చేస్తాడని అనవసరంగా ఆలోచించకు. ఇక నీవు మాట మాట్లాడకుండా వెళ్ళు. నేను ఇప్పుడే రణరంగానికి వెళ్ళి ఆ సుగ్రీవుని ఒక పిడిదెబ్బతో పీచమణిచివస్తాను. దురాత్ముడైన సుగ్రీవుడు నా ధాటికి తట్టుకోలేక తోక ముడిచి వెళ్ళాడు. నీవు కోరినట్లుగానే అతనిని చంపకుండా విడిచివస్తాను. నాపై ఉన్న అనురాగంతో ఇంతదాకా చెప్పావు బాగుంది. ఇక నేను సుగ్రీవుని జయించి వస్తాను" అని వాలి చెప్పాడు.

ఎల్లప్పుడు అందరి హితం కోరి మధురంగా మాట్లాడే తార తన హిత వచనాలను వినని భర్తను చూచి కన్నీరు కార్చింది. అతని జయాన్ని కోరి స్వస్తి వచనాలు చెప్పింది. వాలికి ప్రదక్షిణనమస్కారాలు చేసి పట్టరాని దుఃఖంతో తన తోడివారలతో కలిసి అంతఃపురంలోకి వెళ్ళింది.

వాలి మహాకోపావేశంతో ఉడికిపోతూ వడివడిగా బయటకు వచ్చి నలుదిక్కులా శత్రువు కోసం చూశాడు. అంతలో సువర్ణవర్ణంతో కాంతులీనే శరీరచ్ఛాయ ఉన్న సుగ్రీవుడు వాలికి కనిపించాడు. సుగ్రీవుణ్ణి చూచిన వెంటనే వాలిలో క్రోధం కట్టలు తెంచుకొంది. వెంటనే నడుముకు గట్టిగా ఉత్తరీయాన్ని చుట్టుకొన్నాడు. సుగ్రీవుని ఎదుటకు మహావేగంగా కదిలాడు. సుగ్రీవుడు కూడా శ్రీరామునిపై నమ్మకంతో బంగారు హారం ధరించి ఉన్న వాలి ఎదురుగా నడిచాడు.

"ఓరి సుగ్రీవా! నేను వ్రేళ్ళు ముడిచి పిడికిలి బిగించి ఒక గుద్దు నీ తలపై మోదితే నీ ప్రాణాలు అనంత వాయువులో లీనం అవుతాయి" అన్నాడు. ఆ మాటలు సుగ్రీవునకు కోపం తెప్పించాయి. "అయితే ఇదిగో కాచుకో నా పిడికిలి దెబ్బతో నీ ప్రాణాలు ఇప్పుడే హరించి వేస్తాను" అంటూ కొట్టబోగా వాలి సుగ్రీవుని తలపై మోదాడు. ఆ దెబ్బకు సుగ్రీవుని నోటినుండి రక్తం సెలయేరులా స్రవించింది. కోపోద్రిక్తుడైన సుగ్రీవుడు ఆ దెబ్బకు ఓర్చుకుంటూనే ప్రక్కనే ఉన్న ఒక పెద్ద మద్దిచెట్టును పెకిలించి వాలిపై వేశాడు. ఆ మద్ది దెబ్బకు వాలి ఒక్క నిమిషం పాటు నావికులతో బరువెక్కిన నావ కదలబారినట్లుగా వాలి చలించాడు.

వాలి సుగ్రీవులు మహాపరాక్రమవంతులు. ఒకరినొకరు జయించాలనే యుద్ధకాంక్షతో రగిలిపోతూ భీకరంగా యుద్ధం చేయసాగారు. పిడిగుద్దులతో గుద్దుకొంటూ, మోకాళ్ళతో మోచేతులతో పొడుచుకుంటూ, వాలంతో విసురుకుంటూ యుద్ధం చేస్తున్నారు. వారిద్దరూ పూర్ణిమతిథినాడు సంధ్యాసమయంలోని సూర్యచంద్రుల్లాగా భాసిల్లుతున్నారు. క్షణక్షణానికి సుగ్రీవునిలో బలం తగ్గిపోతూ నిస్సత్తువ వ్యాపిస్తుండగా బంగారు మాల మాహాత్మ్యంతో వాలి బలం అంతకంతకూ పెరుగుతూ పోయింది. కుపితుడైన సుగ్రీవుడు వాలిమీద ఒక్కసారిగా విజృంభించాడు. ఈ అన్నదమ్ములపోరు ఇంద్ర వృత్రాసురుల పోరులాగా కనిపించసాగింది.

వనచరులైన వారు మేఘాల్లాగా గర్జిస్తూ ఒకరికొకరు హెచ్చరిస్తూ పోరాడుతున్నారు. శక్తి క్షీణిస్తున్న సుగ్రీవుడు శ్రీరాముని కోసం దిక్కులు చూడసాగాడు. గొప్ప బలశాలి, వీరాధివీరుడు ఆశ్రిత జన పాలకుడైన శ్రీరాముడు సుగ్రీవుని రక్షించాలని తలచాడు. కాలచక్రాన్ని పట్టిన కాలయమునిలాగా శ్రీరాముడు వాలిపై నారిని సంధించాడు. ఆ ధనుష్టంకారానికి చెట్లమీద కూర్చుని ఉన్న పక్షులు భయపడి పైకి ఎగిరిపోయాయి. హాయిగా సంచరిస్తున్న మృగాలు నారీ శబ్దాన్ని విని భయంతో నలుదిక్కులకు పరుగు లంకించుకొన్నాయి.

శ్రీరాముడు వజ్రసమానమైన బాణాన్ని వదిలాడు. అది వేగంగా వెళ్ళి నిప్పులు చెరుగుతూ వాలి వక్షస్థలంలో గ్రుచ్చుకొంది. ఆ క్షణం వాలి పరాక్రమం నశించిపోయింది. నేలకు ఒరిగిపోయాడు. ఆశ్వయుజ మాసంలో పూర్ణిమనాడు దించిన ఇంద్రధ్వజంలాగా వాలి వన్నె తరిగి నేలపై పడి స్పృహను కోల్పోయాడు.

ఇంద్రాంశ సంభూతుడైన వాలి శరీరం నుండి అప్రమేయ పరాక్రమశాలి అయిన రాముని బాణపు దెబ్బకు జలధారాల్లాగా రక్తం ప్రవహించింది. ఆ రక్తపుమడుగులో వాలి శరీరం తడిసింది. పెనుగాలికి తట్టుకోలేక నేలకూలిన అశోకవృక్షంలాగా వాలి రణరంగంలో పడిపోయాడు. పెనుగాలి తీవ్రతకు దెబ్బతిన్న తోటకూర కాడలాగా వడలి వాడిపోయాడు.

* * *

# వాలి శ్రీరాముని నిందించటం

## సర్గ - 17

శ్రీరాముని బాణపు దెబ్బకు వాలి మొదలు నరికిన చెట్టులాగా నేలపై పడిపోయాడు. వానరగణాలకు ప్రభువైన వాలి పడిపోగా వానరరాజ్యం చంద్రుడు లేని ఆకాశంలాగా కళావిహీనం అయ్యింది. వాలి నేలపై పడిపోయినప్పటికి, ఆయన ధరించిన బంగారు మాల మహిమతో వాలి తేజస్సు పరాక్రమం ప్రాణం అలానే నిలచి ఉన్నాయి. అప్పుడు సంధ్యాసమయాన ఎర్రని కాంతులు ధరించిన ఆకాశంలాగా వాలి కనిపించాడు. శ్రీరాముని బాణం వాలి స్వర్గం వెళ్ళడానికి అర్హతను కల్పించింది.

కొద్దిసేపటికి వాలి కన్నులు తెరిచి చూశాడు. వాలి మంటలు ఆగిపోయిన అగ్నిలాగా కనిపించసాగాడు. దైవశాత్తు నేలకు జారిన సూర్యునిలాగా వాలి నేలను ఆని ఉన్నాడు. మహేంద్రుని వంటి శౌర్య పరాక్రమాలు ఉన్న వాలి ఎదురింప శక్యం కానివాడు. ఇంద్రుని వరాన పుట్టినవాడు. విశాలమైన వక్షస్థలం ఉన్న వాలిని రామలక్ష్మణులు చూడాలనుకొన్నారు. మెల్లగా నేలపై పడి ఉన్న వాలి దగ్గరకు ఆ సోదరులు రాసాగారు.

అలా దగ్గరికి వస్తున్న రామలక్ష్మణులను వాలి చూశాడు. వాలి ధర్మబద్ధంగా వినయంగా శ్రీరామునితో మాట్లాడాలనుకొన్నాడు. వాలి దగ్గరకు వచ్చి చూస్తున్న రామలక్ష్మణులను చూడగానే వాలిలో పౌరుషం ఎగచిమ్మింది. అయినా వినయంగా శ్రీరామునితో–

"ఓ శ్రీరామా! మీ గురించి నేను తెలుసుకొన్నాను. మీరు ఉత్తమ వంశసంజాతులని సత్వగుణాలున్న పరాక్రమవంతులని, అన్నివిధాలా ఖ్యాతి పొందిన మీరు వేరొకనితో యుద్ధం చేసే నన్ను ఎలా కొట్టగలిగారు? సకలప్రాణరక్షకులుఅని, ప్రజాహితాన్ని కూర్చుతారని ఈ భూలోకమంతా మిమ్ము కీర్తిస్తుంది గదా. ఇంద్రియ, మనోనిగ్రహాలు, సహనం, ధర్మాచరణం, ధైర్యం, సత్యవ్రతం పరాక్రమం దుష్టులను దండించి శిష్టులను రక్షించడం అనే లక్షణాలు రాజుకు ఉండవలసిన లక్షణాలు కదా!

సద్వంశంలో మీరు పుట్టారు కదా!, ఆ లక్షణాలన్నీ మీలో ఉన్నాయని నేను తలచాను. నా ప్రియపత్ని తార యుద్ధం వద్దని వారిస్తున్నా వినకుండా వచ్చాను. ఇతరమైన పనిలో మునిగినవాణ్ణి శ్రీరాముడు దెబ్బతీయడనే విశ్వాసంతో నేను సుగ్రీవునితో తలపడ్డాను. కాని, మీ బుద్ధి పెడదారి పట్టి ఉందని నేను గ్రహించలేకపోయాను. మీరు ధర్మమనే ముసుగు వేసి అధర్మానికి ఒడిగడతారని నేను తెలుసుకోలేకపోయాను. మీ ఆచారవ్యవహారాలు గడ్డితో కప్పిన బావిలాగున్నాయి. బూడిదలో దాగిన నిప్పులాగా నీవు సత్యమనే దారిలో అసత్యాన్ని, అన్యాయాన్ని చేసేవాడివి. జటావల్కలాలు ధరించిన మీరు చూడడానికి సత్పురుషులులాగా కనిపిస్తున్నారు. కాని, మీరు చేసిన పని అంతా అధర్మమైనదే.

నేను మీ దేశంలోగాని, మీ నగరాన గాని ఎన్నడూ అపచారం చేయలేదు. వనభోజనం చేస్తూ కాలం గడిపే నన్ను, మిమ్ము ఎప్పుడూ ఎదిరించని నన్ను, మరొకరితో యుద్ధంతో చేసే నన్ను మీరు చంపబూనడం ఏం బాగుంది? క్షత్రియ వంశంలో పుట్టి సర్వవేదాలను అభ్యసించి ధర్మమార్గాన్ని అవలంబించే ఎవరైనా ఈ పనికి పూనుకొంటారా?

రామచంద్రా! మేము వనాలలో తిరిగే మృగాలం. ఫలమూలాలే మాకు ఆహారం. కానీ మీరు నాగరికులు, సకల శాస్త్ర పారంగతులు. అందులో బుద్ధికుశలురైన గురువుల దగ్గర శిక్షణను పొందిన వానివి. నీతిని, ధర్మాధర్మాలను ఎరిగి ఉండేవాడివి. రాజులమధ్య రాజ్యం కోసమో, స్త్రీలకోసమో బంగారు వెండిలాంటి వాటికోసమో, ద్రవ్యం కోసమో యుద్ధాలు జరుగుతాయి. మరి మీరు ఏ ఫలం ఆశించి నన్ను కొట్టారు? దోషులపై ఆగ్రహం నిర్దోషులపై అనుగ్రహం కలిగి ఉండడం రాజుల ధర్మం. వీటిని రాజులు తమ స్వార్థంకోసం తారుమారుచేయకూడదు. ఈ విషయం మీకు తెలియదని అమాయకుడైనా అనుకోడు. రామచంద్రా! నీవు చపలచిత్తుడవు. కోపవశుడవవు. యుక్తాయుక్త విచక్షణ లేనివాడివి. క్రమం లేకుండా విశృంఖలంగా ప్రవర్తించే నీవు నిరపరాధినైన నన్ను కొట్టావు. సత్పురుషుల ముందు ఏమని సమాధానం ఇవ్వగలవు?” అంటూ వాలి రాముని తనను సంహరించడానికి కారణాలను అడుగుతున్నాడు.

“ఓ రామచంద్రా! రాజద్రోహి, భ్రూణహత్యలు, చేసేవారు, చోరుడు ప్రాణహాని చేసేవాడు నరకయాతనల నుండి తప్పించుకోలేరు. చాడీలు చెప్పేవాడు, లోభి, మిత్రద్రోహి, గురుద్రోహి పరకాంతలను చేపట్టేవాడు నరకానికే పోతారు. “ఓ రఘురామా! జింక చర్మం లాంటివి అయితే ఉపాసకులకు ఉపయోగపడతాయి. చమరీ మృగాల కేశాలు దైవ సేవకు ఉపయోగిస్తారు. ఏనుగు దంతాలు కూడా లోకంలో ఉపయోగించుకొంటారు. కాని, ఐదుగోళ్ళున్న నేను చనిపోయిన తర్వాత ఏ విధంగానూ ఉపయోగపడను.

ఏదైనా అనివార్య కారణాలవలన బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు మాంసాహారులు ఐనచో వారు ముళ్ళపంది, వరాహం ఉడుము, కుందేలు, తాబేలు ఈ జంతువుల మాంసమే వారు తీసుకోవాలనే నిబంధన ఉంది కదా.మీరు క్షత్రియులు కదా! నావలన నీకు ఏవిధమైన లాభం ఉండదు. తార నా హితాన్ని కోరుతూ చెప్పిన మాటలను పెడచెవిన పెట్టాను. ఆయువు మూడి ఈ సుగ్రీవునితో యుద్ధానికి వచ్చాను. శీలవతి ఐన స్త్రీలకు ధూర్తులైన పతుల

వలన రక్షణ కరువౌతుంది. ఆ విధంగా నా వలన రాజ్యం దిక్కులేనిది అవుతుంది. మీరు కపటంతో ఇతరులకు అపకారం చేస్తూ జీవిస్తారు. ఇలాంటి పాపకార్యాచరణం చేసే మీరు ధర్మాత్ముడైన దశరథునకు ఎలా పుట్టారు? శ్రీరాముడనే ఏనుగు సదాచారాలనే బంధనాలు తెంచుకొన్న ధర్మమనే అంకుశం లేనిదైన ఆ ఏనుగు చేతిలో నేను ప్రాణాలు పోగొట్టుకొన్నాను. ఈ పని మీకు శ్రేయస్కరమైనది కాదు. ఉచితమైనది కాదు. రాజకుమారా! నీవు నా ఎదురుగా నిలచి యుద్ధం చేస్తే నేను నిన్ను క్షణాలలో సంహరించి ఉండేవాణ్ణి. మద్యపాన మత్తులో జోగి ఉన్నవానిని పాము కాటు వేసి చంపినట్లు మీరు చాటున పొంచి ఉండి నన్ను దెబ్బతీశారు. సీతాదేవి కోసం నీవు సుగ్రీవుని ఆశ్రయించావు. అదే నన్ను అడిగి ఉండే ఆ సాధ్విని ఒక్కరోజులో తీసుకొచ్చి మీ ముందు నిలిపే వాణి!

పాతాళమధ్యమంలో కాని ఆకాశంలోకాని ఎక్కడ ఉంచినా నేను సీతా సాధ్విని ఒక్క క్షణాన మీకు అప్పగించేవాణ్ణి. ఆ రావణుని యుద్ధంలో చంపకుండా వాడి మెడకు త్రాడు బిగించి మీ పాదాలపై పడవేసి ఉండేవాణ్ణి. నేను మరణించిన తర్వాత ఈ సుగ్రీవుడు ఈ రాజ్యానికి రాజు కావడం సహజమే. అయినా మీరు నన్ను చంపడం మాత్రం ముమ్మాటికీ అనుచితమే. ఎవరికైనా మరణం అనివార్యం. ఆ సంగతి నాకు బాగా తెలుసు. కానీ, నేను మీ చేతిలో అధర్మమార్గంలో చావడం నేను జీర్ణం చేసుకోలేకపోతున్నాను.

నన్ను చంపడం మీకు ఏ విధంగా ఉచితం అనిపించిందో నాకు ఆలోచించి జవాబు ఇవ్వండి" – అంటూ నోరు ఎండిపోతున్న వాలి శ్రీరాముని చూస్తుండిపోయాడు.

* * *

# వాలికి శ్రీరాముని సమాధానం

## సర్గ – 18

శ్రీరాముని చేతిలో నిర్జీవుడవబోతున్న వాలి పరుషంగా శ్రీరాముని నిందించాడు. ఆ తర్వాత ఆ వానరేంద్రుడు జలాన్ని వర్షించిన మేఘంలాగా, మంటలు చల్లారిన అగ్నిలాగా అయిపోయాడు. ధర్మార్థాలు తెలిసిన వానర రాజును శ్రీరాముడు అభిమానంగా చూశాడు. "వాలీ! నీవు ధర్మార్థ కామాలను, ఆచారవ్యవహారాలు తెలియకుండా నీవు నన్ను ఆక్షేపిస్తున్నావు. వానరులకు ఉండే సహజమైన చపలత్వంతో నీవు నన్ను తూలనాడుతున్నావు.

కొండలతో, నదులతో, అరణ్యాలతో కూడి ఉన్న ఈ భూమి అంతా ఇక్ష్వాకుల పాలనలోనే ఉంది. ఇక్కడి వనచరాల మీద పూర్తి అధికారం ఇక్ష్వాకుల ప్రభువులదే. ఈ భూమిని ఇక్ష్వాకు వంశీయుడైన భరతుడు ఏలుతున్నాడు. ఆయన ఋజువర్తనుడు, రాజనీతి, శిక్షా శాస్త్రాలను చదివినవాడు. ధర్మార్థకావ్యాలలో అసమాన ప్రతిభ కలవాడు. మేము మరికొందరు రాజులం ఆయన ఆజ్ఞానువర్తులమై ధర్మపరిరక్షణ చేస్తూ ఈ భూమి మీద తిరుగుతున్నాం. ధర్మమార్గాన్ని వీడి ప్రవర్తించేవారిని దండించడం మా విధి. నీవు భోగలాలసుడివై ధర్మ విరుద్ధకార్యాలకు పూనుకొన్నావు.

తనకంటే పెద్దవాడైన అన్న, తండ్రి, గురువు వీరు ముగ్గురూ తండ్రిలాంటివారు. తనకంటే చిన్నవాడైన తమ్ముణ్ణి, తనదగ్గర విద్య నేర్చుకొనే శిష్యుడిని తనకు పుట్టిన కుమారునిలాగా చూసుకోవాలి. ధర్మం చాలా సూక్ష్మమైనది. సత్పురుషులకే అంతంతమాత్రంగా అర్థం అయ్యేది. సర్వప్రాణులలో చైతన్యరూపంలో ఉండే పరమాత్మే ధర్మాధర్మాలను తెలిసినవాడు. నీవు వానరుడవు. నీ మంత్రులు కూడా నీలాగా వానరులే; అలాంటి చంచలబుద్ధి ఉన్నవారితో నీవు చేసే మంత్రాంగం దానివల్ల వచ్చే ప్రయోజనం శూన్యమే. నీవు కోపావేశంతో నన్ను నిందించడం మంచిది కాదు. నేను నిన్ను చంపడం ఎలా ధర్మమో చెప్తాను విను.

నీవు ధర్మాన్ని ఏనాడో కాలరాచావు. కామంతో కన్నులు మూసుకొని పోయి తమ్ముని భార్యతో కూడి శారీరకసుఖాలను అనుభవిస్తున్నావు. కొడుకు వంటి సుగ్రీవుని భార్య ఐనందువల్ల రుమ నీకు కోడలవుతుంది. కోడలైనా కూతురైనా ఒక్కటే. అలాంటి కూతురితో రమించే నీవు అధర్మవర్తనుడివి కాక ధర్మం తెలిసినవాడివి ఎలా అవుతావు. లోకధర్మాన్ని విడిచిన వానికి దండన విధించడం సముచితమే కదా. ఇక్ష్వాకువంశంలోని భరతుని పాలనలో ఉన్న నిన్ను నేను ఎలా ఉపేక్షిస్తాను? సుగ్రీవుడు నాకు లక్ష్మణునితో సమానుడు. రాజ్యాన్ని, భార్యను పోగొట్టుకుని దుఃఖంలో ఉన్న సుగ్రీవుడు నాతో సఖ్యం కోరాడు.

అందుకనే వానరప్రముఖుల ఎదురుగా నేను సుగ్రీవునికి సహాయం చేసి ఆయన పోగొట్టుకొన్న రుమను కిష్కింధను ఇప్పిస్తానని ప్రతిజ్ఞ చేశాను. ఏవిధంగా చూసినా నేను నిన్ను దండించడం నేరం కాదు, ధర్మబద్ధమే. పాపాలు చేసిన జనులు రాజు విధించిన దండనతో పాపవిముక్తి పొంది స్వర్గారోహణ అర్హతను పొందుతారు. చోరుని రాజు కనికరించి విడిచిపెట్టినా కూడా అతడు పాపవిముక్తుడే అవుతాడు. కాని ఆ పాపం రాజుకు చుట్టుకొంటుంది అని మనుధర్మశాస్త్రం చెప్తుంది.

వానర రాజా! నీకు ధర్మశాస్త్రాలు అన్నీ తెలుసుననుకొంటున్నావు కదా! మరి నీవు చేయకూడని పని చేసేటపుడు ఏ ఒక్కరోజైనా తప్పేమోనని ఆలోచించలేదా? నేడు ఇలా మాట్లాడుతున్నావు" అంటూ రాముడు వాలికి సమాధానం ఇస్తున్నాడు.

"వానర రాజా! నీవు చేసినట్లే ఇంతకుముందు శ్రమణుడు అనువాడు పాపకృత్యాలు చేశాడు. అతనిని మాంధాత అను మా వంశీయుడు ఘోరంగా శిక్షించాడు. ఇతరులు చేసిన పాపాన్ని రాజులు నిరోధించకపోతే ఆ పాపం రాజుకు అంటితీరుతుంది. అందుకని రాజు ఏమరుపాటు లేక పాపాత్ముల్ని దండించి తీరాలి. ధర్మానికి లొంగి ఉన్న నేను నిన్ను దండించి పాపం నుండి వైదొలిగాను.

అంతేగాదు వానరరాజా! రాజులకు వేట ధర్మబద్ధమైన క్రీడ. రాజులు వలలను పన్ని, కపటోపాయాల ద్వారా వేటాడవచ్చు. వన్యమృగాలను, క్రూరమృగాలను వేటాడేటప్పుడు అవి ఏమరపాటుతో ఉన్నప్పుడు, లేక మరే పనిలోనో నిమగ్నమైనప్పుడు, లేక అవి మనలను విశ్వసించి దగ్గరగా వచ్చినప్పుడు సైతం వాటిని నిరోధించవచ్చు లేక వేటాడవచ్చు. దీనివల్ల రాజుకు ఏ విధమైన పాపం అంటదు. నీవు శాఖామృగానివి. కాబట్టి నిన్ను దాపున పొంచి చంపడంలో ఏ విధమైన తప్పులేదు. రాజ్యంలోని బలవంతులు బలహీనులను అణిచి వారి ఆస్తుల్ని

మరొకరు అనుభవించడం చూచిన రాజులు నిమ్మకు నీరెత్తినట్లు ఉంటే ఆ బలహీనుల్ని ప్రభువునుంచి రక్షణలేక వారు జీవితాశయాన్ని పోగొట్టుకుంటారు. ఆ బలహీనులను ఆదుకోలేకపోయినందువల్ల రాజకు పాపం చుట్టుకుంటుంది.

ప్రజల అభ్యున్నతిని కోరుతూ ధర్మకార్యాలు చేసే ప్రభువుల్ని అధిక్షేపించడం పరుషంగా మాట్లాడడం మంచిపనికాదు. ఓ వానరా! మా తాతముత్తాతలు ధర్మమార్గాన్నే అవలంబించి జీవించారు. నేనూ వారి మార్గాన్నే నడుస్తున్నాను" అని శ్రీరాముడు వాలిని వధించటం ధర్మమైన కార్యమేనని స్పష్టపరిచాడు. ఇన్ని విన్న వాలిలో అంతర్మథనం జరిగింది.కాసేపు మౌనంగా ఉన్నాడు ఆ తరువాత "రఘువరా! నన్ను క్షమించు. నరోత్తమా! నీవు చెప్పినదంతా వాస్తవమే. ధర్మజ్ఞుడివైన నీ ముందు అల్పజ్ఞానినైన నేను ఏం మాట్లాడగలను. నేను ఇప్పటివరకు అనుచితంగా మాట్లాడి నిన్ను నొప్పించాను. అందుకని నన్ను దోషిగా తలచకు. హేతుబద్ధంగా ఆలోచించటంలో నీవే నేర్పరివి.

అకృత్యాలకు పాల్పడిన నాపై దయచూపి ధర్మమార్గంలో నేను నడిచేటట్లు నీవే తోడ్పడు. శ్రీరామా! నాకు నా భార్య ఐన తార గురించి కాని, బంధు మిత్రుల గురించి కాని, నాకు బాధలేదు. కాని, మా అంగదుడు చిన్నవాడు. అతణ్ణి గురించే నా బాధ. నేను నా చిట్టి తండ్రిని ఎంతో గారాబంగా పెంచాను.

శ్రీరామా! అంగదుడు చాలా పసివాడు. నేను కనబడకపోతే నీరు ఎండిపోయిన చెరువులాగా చిక్కి శల్యమైపోతాడు. నాకు తారకు ప్రేమఫలంగా దొరికిన చిన్నవాడు, నావలె బలశాలి. ఐనా వీనిని నీవే కాపాడాలి రామా! నీవు సుగ్రీవుని మీద చూపించే వాత్సల్యదృక్కును నా బిడ్డమీద కూడా చూపించు. నా దోషాన్ని తారలో సుగ్రీవుడు చూస్తాడేమో. ఆమె సాధ్వీమణి. స్వపర భేదాలు లేని స్త్రీ. ఆమెను సుగ్రీవుడు గౌరవంగా చూచేటట్లు చేయండి స్వామీ.

స్వామీ రామచంద్రా! తార వద్దంటున్నా వినకుండా నీ చేతిలో చావాలనే కోరికతోనే ఈ సుగ్రీవునితో ద్వంద్వయుద్ధానికి తలపడ్డాను. రామా! నన్ను కరుణించావు తండ్రీ" అంటూ వాలి మౌనంగా ఉండిపోయాడు.

"వానరా! నీవు ఇక ఏమీ ఆలోచించకు. నేను ధర్మం విషయంలో స్థిరనిశ్చయుణ్ణి. నీ భార్యాపుత్రుల విషయంలో కూడా నీవు విచారించవద్దు. వారిని నేను చూస్తాను. నేరం చేసిన వాడు శిక్ష అనుభవించిన తర్వాత దోషి కాడు. ఆ విధంగానే నీవు నీ పాపం నుండి దండన పొంది విముక్తుడివయ్యావు. నిన్ను ఇప్పుడు ఏ పాపం అంటదు.

వానరోత్తమా! నీ మనస్సులో గూడుకట్టుకొని ఉన్న అజ్ఞానాన్ని, భయాన్ని, శోకాన్ని విడిచిపెట్టు. ఎవరైనా ప్రారబ్ధకర్మలను అనుభవించి తీరాలి. దానిని నీవు తప్పించుకోలేవు.

నీ అంగదుడు నేటినుండి నీ నుండి పొందిన అనురాగాన్నే సుగ్రీవుని నుండి, నా నుండి కూడా పొందుతాడు. అంగదునికి వచ్చిన ఆపద ఏదీ లేదు." శత్రువులను నిగ్రహించడంలో సర్వసమర్థుడైన శ్రీరాముని పలుకులు వాలికి ఉపశమనాన్నిచ్చాయి. అతడు నిశ్చలబుద్ధితో భగవంతుణ్ణి వేడుకొన్నాడు.

"శ్రీరామా! నేను చేసిన పాపాలను లెక్కపెట్టకు స్వామీ. నేను అజ్ఞానంతో ఎన్నో చేయకూడని పనులను చేశాను. గర్వాంధుడినై ఎవరు చెప్పినా వినేవాణ్ణి కాదు. రామా! నేను బలవంతుణ్ణని విర్రవీగాను. నేడు నాబలం ఏపాటిదో నాకు తెలిసివచ్చింది. చేసిన పాపాన్ని మన్నించు రామచంద్రా! నీ బాణపు దెబ్బకు ఆక్రోశంతో నిన్ను పరుషంగా మాట్లాడాను. అపుడు కూడా నాలో 'నేను' అనే ధిక్కారం చావక నన్ను అలా మాట్లాడించింది స్వామీ! వానరుడినైన నేను నా చపలచిత్తంతో సుగ్రీవుణ్ణే కాక మిమ్మల్ని కూడా నేను బాధ పెట్టాను నన్ను మన్నించు" అంటూ వాలి శ్రీరాముని కోరాడు. శ్రీరాముడు వాలిలోని పశ్చాత్తాపాన్ని చూసి కరుణార్ద్రహృదయంతో వాలిని కరుణించాడు.

* * *

# సతీసుతుల ఆగమనం

## సర్గ - 19

శ్రీరాముని ఓదార్పు మాటలు విని వాలి మౌనంగా ఉన్నాడు. సుగ్రీవుని దెబ్బలకు వాలి శరీరం బాగా దెబ్బతింది. శ్రీరాముని బాణపు దెబ్బకు ప్రాణాలు అవసాన దశకు చేరుకొన్నాయి. ఈ విషయం అంతఃపురంలోని తారకు తెలిసింది. రాముని దెబ్బతో వాలి నేలకూలాడన్న అప్రియవార్త తార విని ఎంతో దుఃఖించింది. అంగదునితో కలిసి అనేక కక్ష్యలను దాటుతూ వాలి దగ్గరకు రావాలని బయటకు వచ్చింది. వాలి నేల కూలాడన్న వార్తతో ఆమె ఎంతగానో చలించిపోయింది.

వాలితో ఉన్నవారందరూ ఎంతో బలశాలులు. కాని ధనుస్సు చేతబట్టిన శ్రీరాముని చూచి వారందరు భయపడిపోయారు. జట్టు నాయకుడు హతుడు కాగా ఆ జట్టు అంతా చెల్లాచెదురు అయిపోయినట్లుగా వాలి నేలకొరగడంతో వాలి అనుయాయులు పారిపోవటానికి యత్నించారు. ఆ విషయం తార చూచింది. వారిని శ్రీరాముని బాణం వెంటాడుతున్నట్లుగా గడగడా వణికిపోతున్నారు. ఎవరికి వారు గబాగబా తలో దిక్కుకు పరుగెత్తుతున్నారు. వారి వారి బంధువులను, సంతును తీసుకొని పారిపోవడానికి చూస్తున్నారు.

అటువంటి వారిని దుఃఖిస్తున్న తార చూచి "వానరులారా! మీరు వాలికి అనుచరులే గదా! ఆ స్వామిని వీడి మీరు ఎందుకు పారిపోతున్నారు. సుగ్రీవుడు రాముడు వాలిని నేలకూల్చారు అని మీరు ఎందుకు భయపడిపోతారు? మీరు పారిపోకండి" అని తార వారితో చెప్పింది.

కామరూపులైన వానరులు తార మాటలు విన్నారు. "అమ్మా! మృత్యువు శ్రీరాముని రూపులో వచ్చి వాలిని తీసుకొనిపోతోంది. మీరు మీ పుత్రుడైన అంగదుని రక్షించుకోండి. వాలి విసిరిన వృక్షాలను శిలలను శ్రీరాముడు పడవేసి వాడి బాణంతో వాలిని నేలకూల్చాడు. ఇంద్రునితో సమానమైన వాలి పడిపోవడంతో మేమందరం తలో దిక్కుకు పారిపోతున్నాం. మీరు కూడా మీ బిడ్డను రక్షించుకోవడానికి మాతో కూడా రండి" అని పిలిచారు.

"అమ్మా! ముందు మనం కిష్కింధను కాపాడాలి. అంగదుని రాజ్యాభిషిక్తుని చేసి రాజ్యాన్ని కాపాడుదాం. మనకు సుగ్రీవాదులవల్ల ఆపద రావచ్చు" అని చెప్పే వానరుల మాటలకు అడ్డు వచ్చి తార "వానరులారా! వానరోత్తముడు మహాత్ముడు ఐన నా భర్త మరణించిన తర్వాత నాకు కొడుకుతో గాని, రాజ్యంతోగాని పని ఏముంది? నా భర్త పాదాలే నాకు గతి" అని చెప్పి భర్త మరణానికి బిగ్గరగా ఏడ్చింది.

తలను, రొమ్ములను బాదుకుంటూ వాలి దగ్గరకు పరుగెత్తింది. దుందుభి లాంటి రక్కసులను చంపిన వాలి శ్రీరాముని దెబ్బతో నేలకొరిగి ఉండడం తార చూచింది. మహాపర్వతాలను అవలీలగా విసిరివేయగలవాడు, వాయువులాగా గమనాన్ని కలిగినవాడు, పరాక్రమశాలి నేడు వర్షించిన మేఘంలాగా చేష్టలుడిగి నేలపై పడి ఉన్న వాలిని తార చూసింది.

సకల జనులతో పూజింపబడే దేవాలయంలాగా ఉన్న చైతన్యాన్ని గరుత్మంతుడు సర్పంకోసం పడగొట్టగా శిథిలావస్థకు చేరినట్లుగా వాలి దీనంగా నేలపై పడిపోయాడు. వాలి పక్కనే కోదండాన్ని ధరించిన శ్రీరాముడు లక్ష్మణుడు సుగ్రీవుడు నిలబడి ఉండటం తార చూసింది. వారినందరిని నిర్మల చిత్తంతో ఆమె మౌనంగా చూచింది.

వారిని దాటుతూ వాలి దగ్గరకు వెళ్ళి నేలపై ఉన్న భర్తను చూచి దుఃఖం ఆపుకోలేక బిగ్గరగా ఏడ్చింది. ఆమె వాలి దీనస్థితిని చూసి స్పృహ తప్పి నేలపై పడిపోయింది. కొద్దిసేపటికి తెలివి తెచ్చుకొని "ఆర్యపుత్రా!" అంటూ శోకంతో కంఠం మూగపోగా బిగ్గరగా ఏడుస్తూ గగ్గోలుగా అరిచింది. లకుముకిపిట్టలాగా విలపించే తారను ఆమెతో కూడా వచ్చిన అంగదుని చూచి సుగ్రీవునికి దుఃఖం ఆగలేదు. ఆయన కన్నుల వెంట కన్నీరు వరదలాగా స్రవించింది. గొంతుమూగబోయింది. కంఠం నుంచి మాట పెగలక ఆమెనే చూస్తూ నిల్చుండిపోయాడు. అక్కడున్న రామలక్ష్మణులు ఇతర వానరగణం తారకు వచ్చిన దుఃఖానికి విచారిస్తూ ఉండిపోయారు.

* * *

# తార విలాపం

## సర్గ - 20

**వా**లిని చూచి తార దుఃఖంలో కూరుకుపోయింది. భర్తపై పడి గట్టిగా ఏడ్చింది. "ఓ మహావీరా! యుద్ధంలో ఆరితేరిన వీరుడివి గదా. నిరపరాధినైన నేను మీ పక్కనే ఉన్నాను. నన్ను పలకరించరేమి? ఓ వానరప్రభూ లెమ్ము! మీరు ఈ భూమి మీద పడి ఉండడం నేను చూడలేకున్నాను. ఓ నాథా! మీకు నాకన్నా ఈ భూదేవి మీద మక్కువ. అందుకే చివరి క్షణాన కూడా ఈమెను వదలేక ఉన్నావు. ఓ వీరుడా! మీరు స్వర్గంలో కూడా అందమైన నగరాన్ని నిర్మించి ఉంటారు. అందుకే నేడు ఈ కిష్కింధను వదిలి అక్కడికి వెళ్ళాలని చూస్తున్నారు. సువాసనలతో నిండిన వనాలలో మనం ఎంతో హాయిగా విహరించాం కదూ. ఇప్పుడు మీరు వాటినన్నింటిని వదిలి వెళ్ళిపోతున్నారు.

మీరు లేక నేను నిరాశకు లోనైనాను. మీరు మృతులయ్యారని తెలిసిన క్షణమే నా హృదయం వేయి ముక్కలు అవ్వాల్సింది. కాని కాలేదు. నా హృదయం పాషాణమే అయి ఉంటుంది.

వానర రాజా! మీరు రుమను అన్యాయంగా కిష్కింధలో ఉంచి సుగ్రీవుణ్ణి తరిమివేశారు. అందుకే ఆ పాపమే నేడు మిమ్ము మృత్యువును దరిచేర్చింది. అందుకే నేను మీ మేలు కోరి ఎన్నో హితవచనాలు చెప్పాను. కాని, మీరు దేనినీ లక్ష్యపెట్టలేదు. అసలు స్వర్గంలో మీ కోసం అందమైన అప్సరసలు వేచి ఉన్నారేమో? వారందరూ కామశాస్త్రపారంగతులు అయి ఉంటారు. వారి మనసులు దోచాలనే మీరు స్వర్గానికి వెళ్ళినట్లున్నారు. ఎవరికీ వశం కాని మిమ్మల్ని కాలం సుగ్రీవునికి లొంగినట్లు చేసింది. నాథా! నేను ఇంతవరకు దుఃఖం అంటే ఏమిటో తెలియకుండా పెరిగాను. శోకం కూడా నాకు తెలీదు. కాని నేడు మీ వియోగంతో నేను శోకంలో మునిగిపోయాను. మనం మన ప్రేమఫలమైన అంగదుణ్ణి ఎంతో గారాబంగా పెంచుకున్నాం కదా. కాని నేటి నుండి పినతండ్రి ఐన సుగ్రీవుని రక్షణలో భయభక్తులతో గడపాల్సి ఉంటుంది. నాయనా అంగదా! ఒక్కసారి మీ తండ్రిని చూడు. ఇక ఆయనను దర్శించే భాగ్యం మనకు దొరకదు. వానరోత్తమా! మీరు స్వర్గానికి వెళ్తున్నారు గదా. ఒక్కసారి మావైపు చూచి అంగదునికి నాకు చివరి సందేశాన్ని ఇవ్వండి. శ్రీరాముడు మిమ్ము చంపి ఆయన ప్రతిజ్ఞను పాటించాడు.

సుగ్రీవా! ఇక మీ అన్న బాధ నీకు ఉండదు. నీవు హాయిగా రుమను పొంది సుఖంగా కాలం గడుపు. యథేచ్ఛగా ఈ కిష్కింధను ఏలుకో. వానరరాజా! మీ భార్యలందరూ మిమ్ముల్ని చూడాలని ఇక్కడకు వచ్చారు. నేను ఎంతగా మాట్లాడుతున్నా మీరు మాట్లాడరేమి? నాపై కోపం వీడి నాతో ఒక్కసారి ఐనా మాట్లాడండి" అంటూ తార వాలిని చూచి దుఃఖభారంతో కుమిలిపోయింది. "ఓ వానరోత్తమా! ఎంతో బలశాలివైన మీరు మరలి రాలేని లోకాలకు తరలి వెళ్తున్నారు. ఓ సుందరాకారా! మీ బాహువులకు అందమైన భుజకీర్తులను పెట్టుకొంటారు గదా! ఓ నాథా! మీరు ఇలా నన్ను వీడి అంగదుని మరచి ఎక్కడకు పోతారు? నేను గాని అంగదుడు కాని మీకు ఎప్పుడైనా అప్రియమైన కార్యం చేశామా? మాపై మీకు ఎందుకు కినుక? ఓ వానరోత్తమా! నేను అజ్ఞానంతో నీ పట్ల అనుచితంగా ఎప్పుడైనా ప్రవర్తించి ఉంటే నన్ను మనసారా క్షమించు. అంటూ ఆ సాధ్వీమణి భర్త పాదాలకు శిరసా మొక్కింది తన తోటి స్త్రీలతో కలిసి తార భర్త మరణవార్తను భరించలేకపోయింది. నాథుడు అనాథునిలాగా నేలపై పడి ఉండడం చూడలేక బిగ్గరగా ఏడ్చింది. చివరకు జీవితేచ్ఛ నశించి ప్రాణాలను విడిచివేయడానికి సిద్ధపడింది. "నాథా! మీరు లేని ఈ లోకంలో నాకు ఏమీ పని లేదు. మీరు లేనిదే నాకు అంతా శూన్యంగా కనిపిస్తోంది" అంటూ తార హృదయవిదారకంగా ఏడుస్తోంది.

* * *

# హనుమంతుడు తారను ఊరడించటం

## సర్గ - 21

**భ**ర్త మరణాన్ని సహించలేక తార భూమిపై పడి ఏడుస్తోంది. తాను కూడా ప్రాణాలను విడిచివేయాలనుకొంది. అప్పుడు హనుమంతుడు ఆమె దగ్గరకు వచ్చి ఓదార్పుగా మాట్లాడాడు. “అమ్మా! పుట్టిన ప్రతిజీవీ తాను చేసిన కర్మల ఫలితాన్ని అనుభవించక తప్పదు. తెలిసి కాని తెలియక కాని చేసినా కూడా ఆ కర్మ తాలూకు ఫలం అనుభవించి తీరాల్సిందే. ప్రాణాలన్నీ ఒక దేహాన్ని విడిచి మరొక దేహానికి పోతూ వస్తూ ఉంటాయి. మీరు శోకంలో మునిగి ఉన్నారు. ఈ జీవితం నీటి బుడగలాగా నశ్వరమైనది. క్షణక్షణానికి ఆయువును కోల్పోయే ఈ జీవి గురించి మీరు ఎందుకు శోకిస్తున్నారు?

అమ్మా! తార! మీరు అన్నీ తెలిసినవారు. ప్రాణులు పుట్టటం గిట్టటం గూర్చి ఎవరికీ తెలియదు. ఏ ప్రాణి ఎప్పుడు పుడ్తాడో మళ్ళా ఎప్పుడు మరణిస్తాడో తెలిసే జ్ఞానం మనకు లేదు. మీ అంగదుడు చిన్నవాడు. అతని బాగోగులను చూడాల్సిన బాధ్యత మీ పైనే ఉంది. పైలోకంలో సుఖం కోసం నేడు పుణ్యకార్యాలు చేయాలి. అమ్మా! వాలిమీదే ప్రాణాలు పెట్టుకొని లక్షలసంఖ్యలోని వానరులు జీవిస్తున్నారు.

కాని, నేడు వాలి తన కాలం తీరి పరలోకయాత్ర ఆరంభించారు. పరలోకంలో ఆయన పొందబోయే సుకృతం కోసం అక్కడికి వెళ్ళారు. ధర్మప్రభువైన వాలిని నమ్మి ఉన్న వీరందరూ నేడు అనాథల్లా మారారు. ఆయన పుణ్యం సంపాదించి స్వర్గానికి వెళ్ళారు. ఆయనకోసం మీరు పరితపించవలసిన అవసరం లేదు. రాజ్యాన్ని చక్కగా పాలించాడు. స్వజనులకోసం రాజ్యప్రజలకోసం వాలి ఎన్నో మంచి పనులు చేసి పుణ్యం సంపాదించాడు. ఓ పూజనీయురాలా! సుగ్రీవాంగదులకు మీరే దిక్కు. ఈ వానర లోకాన్ని రక్షించాల్సిన బాధ్యత వాలిభార్యగా మీ పైనే ఉంది. దుఃఖభాజనులైన వీరిని ఊరడించి భావి కార్యానికి వీరిని పురికొల్పు. నీ పర్యవేక్షణలో అంగదుడు వానరలోకాన్ని పాలించగలడు. పుత్రులవలనే తల్లిదండ్రులకు ఉత్తమగతులు సంప్రాప్తిస్తాయి. అంగదుడు మహారాజు ఉత్తమగతులు పొందేలాగా ఉత్తరక్రియలు చేస్తాడు. అమ్మా! దివంగతుడైన వాలి మహారాజుకు అంతిమ సంస్కారాలు చేయాలి. ఆ తర్వాత అంగదుని పట్టాభిషిక్తుని చేయాలి. అప్పుడు రాజుగా అంగదుని చూచిన తర్వాత మీ మనస్సు కుదుట పడ్తుంది. “హనుమంతా! సర్వకార్యాలను చేయగల సమర్థుడు సుగ్రీవుడు. భర్తనే పోగొట్టుకొన్న నేను ఈ రాజ్యభారాన్ని ఎలా మోయగలను? ఈ అంగదుని గూర్చిన బెంగ నాకెందుకు? నేను నా భర్తతో కలిసి స్వర్గానికి వెళ్తాను. అదే నాకు పరమప్రీతి. హనుమా! నీవు అంగదుని పట్టాభిషిక్తుని చేయాలనుకోవడం మంచిది కాదు. సుగ్రీవుడు అంగదునికి తండ్రి వంటివాడు. సుగ్రీవుడే నాకన్నా మిన్నగా అంగదుని చూచుకొంటాడు. నేను వీరమరణం పొందినా నా భర్తతో కలిసి సహగమనం చేస్తాను. నాకు అది తప్ప మరో మార్గం లేదు” అని తార చెప్పింది.

* * *

# వాలి మరణం

## సర్గ - 22

అతికష్టంగా ఊపిరి పీల్చుకొంటూ కొన ఊపిరితోనున్న వాలి నలుదిక్కులా చూశాడు. ఆయనకు సుగ్రీవుడు కనిపించాడు. ఆత్మీయంగా సోదరుని దగ్గరకు పిలిచి "సోదరా! నిన్ను కిష్కింధనుండి వెళ్ళగొట్టానని నన్ను దోషిగా చూడకు. నేను బలగర్వంతో అజ్ఞానంవల్ల అలా చేశాను. అన్నదమ్ములమైన మనం హాయిగా కలసిమెలిసి బతికేలాగా భగవంతుడు మనకు రాసి ఉండలేదు. సోదరప్రేమతో పెరగాల్సిన మన ద్వేషమే పెంచుకొంటూ ఎదిగాం. నీవు ఈ వానరరాజ్యాన్ని స్వీకరించు. నేను మరొక క్షణంలో ప్రాణాలు వదిలేస్తాను.

వాలి అజేయుడు – సంగ్రామంలో ఎవరికీ లొంగనివాడు అనే కీర్తి నేటితో అంతరించిపోతోంది. సోదరా! నీవు నా రాజ్యాన్ని సంపదలను అన్నీ గ్రహించు. నీవు రాజ్యభారం మోయడం కష్టమైనా నీవు నీ సమర్థతతో మోయగలవు. ఇదిగో నా ప్రాణాధికుడైన అంగదుడు. మాయామర్మాలు ఎరుగని పసివాడు. వీనిని నీవే సొంత కుమారునిలాగా చూచుకో. నాకు మారుగా వీని బరువు బాధ్యతలను నీవే జాగ్రత్తగ చూడు. శత్రుభయం లేకుండా హాయిగా పెరిగేటట్లు నీవే అంగదుని కాపాడు.

సుగ్రీవా! తార కొడుకైన అంగదుడు యుద్ధసమయంలో నీకు కుడిభుజంగా ఉంటాడు. అంగదుడు పరాక్రమశాలి. అతడు చురుకుదనం ఉన్నవాడు. సమయానికి తగినట్లుగా అంగదుడు ప్రవర్తించగలడు. ఇదిగో తార చాలా సూక్ష్మబుద్ధి కలది. ఈమె సుషేణుని కూతురు. ఆమె రాబోయే ఆపదలను కనుగొని వాటిని నివారించగల సమర్థురాలు. ఈమె చెప్పిన పని నిశ్చయబుద్ధితో నిస్సంకోచంగా చేయవచ్చు. నీవు శ్రీరామునికి మాట ఇచ్చిన ప్రకారం నడుచుకో. సీతాన్వేషణం చేయనిచో అధర్మం అవుతుంది. ఆయనను ఎప్పుడూ నొప్పించకు.

సుగ్రీవా! నా తండ్రి ఇచ్చిన మాలను నేను బతికి ఉండగానే నీవు వేసుకో. లేనిచో నేను మృతి చెందితే దీనికున్న అజేయమైన శక్తి క్షీణించిపోతుంది" అని చెప్పి ఆ మాలను సుగ్రీవుని మెడలో వేశాడు. అప్పుడు వాలి తేజో విహీనుడు అయ్యాడు. ఆ మాటలతో సుగ్రీవుని కోపం పటాపంచలైపోయింది. అన్న చెప్పినట్లుగా విన్నాడు. అక్కడే ఉన్న అంగదుని చూస్తూ చివరి క్షణాలను లెక్కపెడుతున్న వాలి "నాయనా అంగదా! దేశ కాల పరిస్థితులనుబట్టి నడచుకో. పినతండ్రి చెప్పినట్లుగా ఆచరించు. నా గురించి ఎక్కువగా ఆలోచించకు" అంటూ వాలి చెప్పుతున్నాడు."అంగదా! సంతోషవిచారాలకు పొంగిపోవడం కాని దుఃఖపడడం కాని చేయకు. ధర్మాన్ని తప్పి ఎపుడూ ప్రవర్తించకు. నీ కన్నా చిన్నవాళ్ళను ప్రేమాదరాలతో చూడు. నీ కన్నా పెద్దవాళ్ళను గౌరవభావంతో చూడడంలో ఏమరుపాటును దరిచేరనీయకు.

అంగదా!నీవు ఎప్పుడూ సుగ్రీవుని శత్రువులను కలవకు. నీ ఆటపాటలు నా దగ్గర సాగినట్లుగా ఇకపై సాగవు. నిగ్రహంతో రాజుకు ప్రయోజనం కూర్చే పనులే చేస్తూండు. సుగ్రీవునితో అతి చనువుగా ఉండకు. అలా అని దూరంగా కూడా మసలకు. నీవు జ్ఞానంతో ఆలోచించి పనులు చేయి అని చెప్పుతూ ఉండగా వాలి కన్నులు

తిరిగి మూసుకొనిపోయాయి. అతని దంతాలు బయటకు వచ్చాయి. శరీరం చల్లబడింది. ప్రాణాలు అనంతవాయువులో లీనమయిపోయాయి. దానిని చూచిన వానరులందరూ ఒక్కసారిగా మిన్నుముట్టేలాగా ఏడ్చారు. కిష్కింధ రాజును పోగొట్టుకున్న వారి ముఖాలు దీనంగా మారాయి.

దీర్ఘాలైన బాహువులు మహారాజును గూర్చి వారందరూ ఇలా చెప్పుకొన్నారు. ఒకసారి గోలభుడు అనే గంధర్వుడు వాలిపై దండెత్తాడు. అతనితో వాలి భీకరంగా యుద్ధం చేశాడు. వారిద్దరి సమరం సుమారుగా పదిహేనేండ్లుగా సాగింది. చివరకు వాలి తన పదునైన గోళ్ళతో రక్కి ఆ మహా భయంకరుడైన గోలభుణ్ణి చంపివేశాడు. ఇంతటి మహాపరాక్రమశాలి నేడు మృత్యువుపాలయ్యాడు.

శ్రీరామునితో వాలి హతుడైపోగా అక్కడ ఉన్న తార, అంగదులతో పాటుగా వానరప్రముఖులు, వానర పౌరులు స్వజనులు బంధుజనులు అందరూ బిగ్గరగా ఏడ్చి శోక సముద్రంలో మునిగిపోయారు. తార వాలిని కౌగిలించుకొని ఏడుస్తోంది. ఆమె నరికివేయబడిన చెట్టును పెనవేసుకొన్న లతలాగా వాలిని అల్లుకొనిపోయి ఉంది.

* * *

# తార పరితాపం

## సర్గ - 23

**వా**లి స్వర్గస్థుడు కావడం చూచి తార తట్టుకోలేకపోయింది. "ఓ మహావీరా! అందరిని భయపెట్టే మీరు ఈనాడు కటికనేలపై పడి ఉన్నారు. మీచే దెబ్బలు తిని పారిపోయిన సుగ్రీవుడే నేడు మొనగాడు అయ్యాడు. విధి వైపరీత్యం కదా! వానర భల్లూక ప్రముఖులందరూ మిమ్ము కోల్పోయి దీనులయ్యారు. నా ఆక్రందన అంగదుని దీనాలాపం మీకు వినిపించడంలేదా?

నేను చెప్పే మాట వినకుండా సుగ్రీవునితో పోరుకు దిగి నేడు ఈ స్థితిని కొనితెచ్చుకొన్నారు. ప్రభూ! నిన్నటిదాకా ఈ నేలపై మీతో ఓడినవారు హరతులు పట్టారు. నేడు మీరు శ్రీరాముని చేతిలో నిహతులై పడిపోయారు. దీనిబట్టి ఈ నేల వీరుల్ని బలితీసుకొనేదని నాకు తెలుస్తోంది. నా ప్రాణనాథా! మీకు యుద్ధం చాలా ప్రీతి. యుద్ధం చేయడంలో మీరు ఆరితేరినవారు. కాని, నేడు నీ ప్రాణసఖినైన నేను అనాథగా మారిపోయాను. వీరుడవైన మిమ్మల్ని పోగొట్టుకొన్నాను. సుఖాలలో మునగవలసిన నేను దుఃఖంలో మునిగిపోయాను. పట్టపురాణినైన నేను నేడు దుర్దశలో ఉన్నాను.

నాథా! నేను కఠినపాషాణురాలిని. మీరు మరణించినా నేను బతికే ఉన్నాను. స్త్రీ పుత్రవతి ఐనా సకల సంపదను కల్గి ఉన్నా భర్తను కోల్పోతే ఆమెను విధవ అనే ఈ లోకం పిలుస్తుంది. స్వామీ! నీవు ఎప్పుడూ ఎర్రని

కంబళిపై మెత్తని పరుపులతో పవళిస్తావు గదా! అందుకే కాబోలు మీ శరీరంలోని రక్తం మడుగులు కట్టి తివాచిలాగా అయింది. మీరు ఈ రక్త కంబళిపైనే పడుకొని ఉన్నారు. వానరేంద్రా! మీ పిడిగుద్దులకు భయపడి పారిపోయిన సుగ్రీవుడు ప్రతిక్షణం మిమ్మల్ని చూచి భీతిల్లేవాడు. కాని, నేడు శ్రీరాముని ఒక్క బాణానికే మీరు ఎలా పడిపోయారు? మీరు చనిపోవడంతో సుగ్రీవునికి భయం పోయింది.

నాథా! నిన్ను కౌగిలించుకొని మీమీద పడుకోవాలనే నా ఆశను ఈ శ్రీరాముని బాణం అడియాస చేస్తోంది. నాలో నిరాశను పెంచుతోంది" అని తార అమితదుఃఖంతో భోరున ఏడ్చింది. వాలి వక్షస్థలాన్ని గుచ్చుకొని ఉన్న రామబాణాన్ని నీలుడు లాగివేశాడు. వాలి శరీరంనుండి ప్రవహించే రక్తం గైరికాది ధాతువుల్లాగా బాణం లాగడంతో రక్తం చింది చుట్టూ పడింది.

పింగళవర్ణుడైన వాలి శవంగా మారి రక్తం మడుగులో ధూళి అంటుకొని పడుకొని ఉన్నాడు. ఆ స్థితిని చూచిన తార "అంగదా! చూడు. నీ తండ్రి ఒనర్చిన పాపకృత్యాల ఫలితం ఇదే. వాలివల్ల ఏర్పడ్డ అన్నదమ్ముల మధ్య రగలుకొన్న రణాగ్ని నేటితో ఆరిపోయింది. చూడు అంగదా! మీ తండ్రి శరీరం బాలసూర్యునిలాగా వెలుగుతోంది." తార మాటలను విని అంగదుడు తనతండ్రి పాదాలను స్పృశించి నమస్కరించాడు.

"ప్రాణనాథా! మన కుమారుడు నేడు నీకు శిరసా ప్రణమిల్లాడు. ఎప్పటిమాదిరిగా మీరు దీర్ఘాయుష్మాన్ భవ అని దీవించరేమి? సింహం చేతిలో మరణించిన వృషభం దగ్గరకు లేగదూడను వెంటబెట్టుకొని వచ్చిన గోవులాగా నేను మీ దగ్గరకు అంగదుని తీసుకొని వచ్చాను. నాథా! శ్రీరాముడు అనే జలనిధిలో మీరు మీ ధర్మపత్నినైన నన్ను విడిచి ఎలా స్నానమాడారు?

నాథా! దేవేంద్రుడు మిమ్ములను మెచ్చి ఇచ్చిన బంగారుహారం ఎప్పుడూ మీ మెడలో వ్రేలాడేదిగదా! ఇప్పుడు ఆ హారం ఏమైంది? సూర్యుడు అస్తమించినా మేరుపర్వతశోభ తరగనట్లుగా ప్రాణాలు మిమ్ము విడిచి వెళ్ళినా మీ దేహకాంతి మిమ్ము వీడిపోలేదు.

ప్రభూ! నాడు నేను చెప్పిన మాట వినకుండా యుద్ధానికి వెళ్ళారు. అయ్యో! నేను మిమ్మల్ని నివారించలేకపోయాను. నేడు మీరు మరణం పొందారు. యముడు మిమ్ము ఒక్కరినే తీసుకొనివెళ్లాడు. నేడు మిమ్మల్ని మేము కోల్పోయి అనాథలమయ్యాము. అంగదుడు నేను మిమ్ము పోగొట్టుకుని నిర్జీవుల్లా, బతికిఉన్నా చచ్చిన వారిలాగా మారిపోయాం. రాజ్యలక్ష్మి నిన్ను విడిచినట్లే నన్ను విడిచి వెళ్ళింది అంటూ తార వాలి పరాక్రమాన్ని గుర్తుచేసుకుంటూ ఎంతగానో పరితపించింది.

వాలి మరణం తారను ఎంతో కుదిపేసింది. తన భర్తను తాను మార్చుకోలేకపోయానని తార ఎక్కువగా చింతించింది. భర్తలోని దుర్గుణాలను సుగుణాలుగా చేయలేకపోయానని విచారించింది. వాలిని వదిలి ఉండలేక తార దుఃఖభారంలో క్రుంగిపోయింది.

* * *

# సుగ్రీవుని పరితాపం - శ్రీరాముని బోధ

## సర్గ - 24

కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తారను చూచి సుగ్రీవుడు చలించిపోయాడు. అన్న నా వల్లనే మరణించాడనే బాధ ఆయనను కుంగదీసింది. వాలి మృతశరీరాన్ని చూచి సుగ్రీవుడు గట్టిగా ఏడ్చాడు. ఆయన మనస్సు నిండా దైన్యం ఆవరించింది. లోలోపల తాను చేసిన పనికి కుమిలిపోయాడు. తన సేవకులతో కలసి శ్రీరాముని దగ్గరకు వెళ్ళాడు. "రామచంద్రా! నీవు చేసిన ప్రతిజ్ఞను నిలబెట్టుకొన్నావు. రాజ్యఫలం నాకు దక్కింది. కానీ నేడు నా మనస్సు ఆందోళనతో నిండి రాజ్యభోగాలపై మళ్లడంలేదు. అసలు నాకు జీవించాలనే ఆసక్తి లేదు.

ఇక్కడ జీవితేశ్వరుడు మరణించాడని తార ఏడుస్తోంది. పురజనులందరూ రాజును కోల్పోయామని చింతిస్తున్నారు. అంగదుడు తండ్రి మరణించడంతో వ్యాకులచిత్తుడైనాడు. ఇవన్నీ చూచి నా మనస్సు రాజుగా బాధ్యతలు చేపట్టడానికి ఇష్టపడుటలేదు. రామా! ఇంతకుముందు మా అన్న నన్ను ఎప్పుడూ తీవ్రంగా అవమానించేవాడు. దానితో నాకు కోపం వచ్చేది. అందుకే అన్నను చంపాలని నేను కోరుకున్నాను. కాని నేడు ఆయన చనిపోవడం చూచి నేను ఎంత పెద్ద తప్పు చేశానో అని నాకు అనిపిస్తోంది. ఇంతవరకు ఋశ్యమూకంపై జీవించాను. అలానే ఉండిపోతే బాగుండేదేమో! కాని, సోదరుడు చనిపోయిన తర్వాత వచ్చిన రాజ్యసుఖాలు ఆనందాన్ని ఇవ్వడంలేదు.

రామా! మా అన్న విచక్షణాజ్ఞానం ఉన్నవాడు. "సుగ్రీవా! నాకు నిన్ను చంపబుద్ధి కావడంలేదు. ఇక్కడనుంచి ఎక్కడికైనా వెళ్ళి బతుకు ఫో" అని చెప్పాడు. కాని, నేను మందమతినై ఆయన చావును కోరుకొన్నాను. ఓ రఘువీరా! అన్నను చంపడంవల్ల వచ్చే దుఃఖం గొప్పదా? లేక ఆ సోదరుని చంపి రాజ్యసుఖాలను పొందడంవల్ల వచ్చే ఆనందం గొప్పదా? అని ఆలోచించిన వారు ఎవరైనా అన్నను చంపుకొంటారా? మా అన్న ఆయన బుద్ధికి తగినట్లుగా ఆలోచించి నన్ను వెళ్ళగొట్టి వదిలేశాడు. కాని, నేను ప్రాణహాని చేసి చాలా పెద్ద తప్పు చేశాను.

ఒకసారి వాలి నన్ను పెద్ద చెట్టుకొమ్మతో కొట్టాడు. ఆ దెబ్బకు నేను తాళలేక అమ్మా అంటూ ఆర్తనాదం చేశాను. అది వాలి విని నా దగ్గరకు వచ్చి "ఇంకెప్పుడు నాతో యుద్ధానికి తలపడకు" అని హెచ్చరించి నన్ను చంపకుండా వదిలేసి వెళ్ళిపోయాడు. ఇది ఆయన ఔన్నత్యం. కాని నేను ఆయన ప్రాణాలకే ఎసరుపెట్టాను. నేను వానరులకు ఉండే సహజమైన చపలబుద్ధినే చూపించాను.

త్వష్ట కొడుకు ఐన విశ్వరూపుని చంపిన ఇంద్రునిలాగా నేను నా సోదరుని చంపించి మహాపాపం చేశాను. ఆ పాపకార్యం గురించి ఆలోచించడం కూడా నేరమే అవుతుంది. సత్పురుషులు ఎవరూ ఇలాంటి పాపాలు చేయరు. పాపాత్ములకు వారు దూరంగా ఉంటారు.

ఇంద్రునికి విశ్వరూపుని చంపడంవల్ల బ్రహ్మహత్యాపాపం చుట్టుకొంది. కాని, ఆ పాపాన్ని భూమి 'ఊసర' క్షేత్ర రూపంలోను, నీరు నురుగు రూపంలోను, వృక్షాలు జిగురు రూపంలోను, స్త్రీల ఋతురూపంలోను తీసుకొని

ఇంద్రునికి పాపపు బరువును తగ్గించారు. కాని, నేడు నా పాపాన్ని పోగొట్టేవారు ఎవరూ లేరు. రామా! నేను అధర్మానికి ఒడిగట్టి వంశనాశనం చేశాను. పాపినైన నేను ప్రజా గౌరవానికి అర్హుడను కాను. యువరాజుగా కూడా తగను. అలాంటి నాకు రాజ్యపదవి ఎలా వస్తుంది?

నాలాంటి పాపాత్ముని చూసి సజ్జనులు ఏవగించుకొంటారు. లోకాలన్నీ వెలివేస్తాయి. జడివాన పల్లపు ప్రదేశాలను ముంచేసినట్లు నన్ను నా పాపం దహించివేస్తోంది. బంగారం అగ్నిలో కాల్చినపుడు దానిలోని మాలిన్యం పోయినట్లు నేను చేసిన పాపపు పని నా పశ్చాత్తాపంతో పాపం దూరం అవుతున్నట్లుగా ఉంది. రఘువీరా! వాలి మరణం చూసి తార, అంగదుని ప్రాణాలు ఉంటాయా అని అనుమానం వేస్తోంది.

రామా! సజ్జనుడు, మాట వినేవాడు ఐన కొడుకు ఏ లోకంలో ఐనా దొరుకుతాడేమో కాని సోదరుని సాన్నిధ్యం ఎలా దొరుకుతుంది? అంగదుడు తండ్రి మరణంతో చింతలో మునిగిపోయాడు. అతడు బతుకుపై ఆశ వదలివేసుకొంటే దానిని చూచి తార బ్రతకలేదు. అంగదుడు కాస్తంత సేద తీరి పితృమరణ దుఃఖానికి దూరం అయితే వానిని చూచి తార కూడా తేరుకొంటుందని నా నమ్మకం.

రామా! నేను ఇదంతా చూచి బతకలేకుండా ఉన్నాను. నేను ఇప్పుడు అగ్నిలో ప్రవేశించి నా ప్రాణాలు వదిలేస్తాను. నేను వానరులకు సీతాన్వేషణ చేయమని చెప్తాను. నేను లేకపోయినా వారు నీకు సహాయం చేస్తారు. నీవు సీతను పొందుతావు. నేను చేసిన పాపంవల్ల నేను జీవించడానికి అర్హతను కోల్పోయాను. నాకు చావడానికి అనుమతిని ఇవ్వు" అంటూ సుగ్రీవుడు ప్రార్థించాడు.

సుగ్రీవుని బాధను చూచి రాముడు కూడా కంటి తడి పెట్టుకొన్నాడు. క్షణకాలంపాటు రాముడు కూడా దుఃఖానికి లోనయ్యాడు.తననే చూస్తున్న తారను శ్రీరాముడు గమనించాడు. భర్త మరణంతో దుఃఖంలో మునిగిన ఆమెను ఓదార్చాలని శ్రీరాముడు అనుకొని తార దగ్గరకు నడిచాడు. రాముడు రావడం చూచి మంత్రులు వాలిపై పడి ఉన్న తారను లేవదీసి కూర్చోబెట్టారు. అప్పుడు ధనుర్బాణాలను ధరించి ఉన్న రామలక్ష్మణులను తార చూచింది. అంగదునివలన శ్రీరాముని రూపగుణాలను విని ఉంది కాని ఆమె రాముని ఎప్పుడూ చూడలేదు.

అంగదుడు చెప్పిన రాముడితడే కావచ్చునని తార అనుకొంది. ఒక్క బాణంతో నా భర్తను చంపిన వాడితడే కదా, ఈయనను పరుషంగా మాట్లాడాలని ఓపిక లేకపోయినా తూలుతూ పడుతూ రాముని దగ్గరకు వచ్చింది. కాని రాముని చూసిన తర్వాత ఆమె కోపం తగ్గిపోయింది. అప్పుడు "రామా! నీవు ఊహించడానికి వీలుకాని స్వరూపం కలవాడివి. జితేంద్రియుడవు. ధర్మమే రూపుకట్టినట్లు ఉన్నవానివి. ఓర్పు, క్షమ ఉన్నవాడివి. అందమైన దృఢమైన అవయవ సంపద ఉన్నవాడివి. విచక్షణాజ్ఞానం ఉన్నవాడివి. కాని నావిషయంలో" అంటూ తార ఏదో చెప్పాలని అనుకొని ఓక్షణం ఆగింది.

"కాని రామచంద్రా! నా భర్తను ఒక్క బాణంతో చంపివేసి నన్ను అనాథను చేశావు. నేను లేకపోతే వాలి స్వర్గసుఖాలను కూడా పొందలేడు. కోదండరామా! సీతాదేవి మీ పక్కన లేనందువలన ఈ అందమైన ఋశ్యమూక పర్వతంలోని ప్రకృతిని ఆస్వాదించలేకుండా ఉన్నారు కదా! మీలాగే మావారుకూడా నేను లేకపోతే స్వర్గంలో చింతితులై సుఖాలను అనుభవించలేరు.

అందుకని నన్ను కూడా ఆయన దగ్గరకు పంపించి పుణ్యం కట్టుకోండి. శ్రీరామా! నన్ను చంపితే బ్రహ్మహత్యా పాపం చుట్టుకొటుందని మీరు ఆలోచించవద్దు. ఎందుకంటే భర్త ఆత్మే భార్య కదా! అర్ధాంగి ఐన భార్యను భర్తనుంచి విడదీయం. ఈ లోకంలో కన్యాదానానికి మించిన దానం ఏదీ లేదు. ధర్మం పాటించి నన్ను నా భర్తకే ఇచ్చివేయండి. దానివల్ల మీకు పాపం అంటదు.

ఓ రామచంద్రా! నేను నా భర్తవల్ల వంచించబడ్డాను. నన్ను ఇక్కడే వదిలేసి ఆయన మాత్రం దివికి ఏగాడు. నాథుడు లేని నన్ను మీరు చంపడంలో తప్పులేదు. బంగారుమాలను ధరించిన మహాత్ముడైన వాలి లేకుండా నేను జీవించజాలను." ఇలా తార పలు విధాలుగా తనను సంహరించమని శ్రీరాముని వేడుకొంది.

తార చెప్పిందంతా శ్రీరాముడు విన్నాడు. ఆమెను ఓదార్చాలని అనుకొన్నాడు. "అమ్మా! వీరపత్నీ! నీవు ఇలా విరక్తి చెందవద్దు. ఈ సృష్టి అంతా బ్రహ్మదేవుని లీలావిలాసం కదా. సమస్తప్రాణుల సుఖదుఃఖాలు ఆయన చేతిలో ఉంటాయి. మనమందరం బ్రహ్మదేవుని చేతిలో కీలుబొమ్మలం. ఆ విధిని ఎదిరించి ముల్లోకాల్లో ఎవరూ కూడా జీవించలేరు. అమ్మా నీవు శోకించకు. విధి నిర్ణయానికి మనమందరం తలవంచి తీరాలి.

నీ కుమారుడైన అంగదుడు త్వరలో యువరాజుగా పట్టాభిషిక్తుడు అవుతాడు. అప్పుడు నీ మనస్సు ఊరట చెందుతుంది. వీరపత్నులందరూ తమ వీరులైన భర్తలకోసం పరితపిస్తారు. అంగదుని వీరత్వంతో నీవు తిరిగి సంతోషాన్ని పొందగలవు." శత్రువులను శిక్షించే ధర్మాత్ముడైన శ్రీరాముడు తారతో యుక్తిగా మాట్లాడాడు. శ్రీరాముని మాటలవల్ల తార దుఃఖం నుంచి కాస్త కోలుకొంది. ఆమె మనస్సు మార్చవీలులేని పరిస్థితిని చూచి ఊరడిల్లింది. ఆమె కాస్త తెప్పరిల్లిన మనస్సుతో తృప్తిగా శ్రీరాముని చూచింది.

* * *

# వాలి దహనసంస్కారం

## సర్గ - 25

**వా**లి మరణానికి తార, అంగదుడు, సుగ్రీవుడు వానరులందరు శోకతప్తులయ్యారు. వారితోపాటు రామలక్ష్మణులు దుఃఖించారు. అయినా ఆ దుఃఖం నుంచి శ్రీరాముడు బయటపడి "సుగ్రీవాదులారా!వాలికోసం మీరు ఇంతగా దుఃఖించడం బాగాలేదు. చనిపోయిన తర్వాత జరగవలసిన కార్యాలను విస్మరించకూడదు. అవి చేయడంవలనే పైలోకాలకు వెళ్ళిన వారికి ఆత్మశాంతి చేకూరుతుంది. లోకమర్యాదను పాటించి దహన సంస్కారాలు మృతజీవునికి చేయాలి. ఏ పనినైనా కాలం దాటకుండా చేయాలి. లోకంలో సర్వకర్మలకు కారణం ఈ కాలమే. ఎవరూ ఏ పనిని స్వతంత్రించి చేయలేరు. అందరూ కాలానికి వశులై ఉంటారు.

కాలానికి బంధుత్వాలు మిత్రత్వాలు ఏవీ ఉండవు. కాలానికి పక్షపాతం అనేది ఉండదు. ఎవరైనా వారి ప్రారబ్ధకర్మను అనుసరించే పని చేయాల్సి ఉంటుంది. కాలతత్వాన్ని ఎవరూ తెలుసుకోలేరు. ధర్మార్థకామాలు

కూడా కాలాన్ని అతిక్రమించలేవు. వాలి నా బాణంతో పాపరహితుడై దివ్యలోకానికి చేరాడు. స్వధర్మాచరణ చేస్తూ పోరాడి వీరమరణం పొందాడు. అందువలన వాలికి సద్గతి లభించింది.

ఆయన కోసం మీరు తపిస్తున్నారు. కాని ఆయనకు చేయాల్సిన తదుపరి కార్యాలు చేయండి" అని రాముడు చెప్పాడు.

శ్రీరాముడు ఇలా చెప్పిన తర్వాత లక్ష్మణుడు "సుగ్రీవా! నీవు తారకు అంగదునికి తోడుగా నిలిచి దహన సంస్కారాలు చేయించు. ఎండుకట్టెల్ని చందనాదుల్ని తెప్పించు ఏమి చేయాలో తోచక అయోమయస్థితిలో కూరుకుపోయిన అంగదునికి ధైర్యం చెప్పి అనునయించు. ఆయన మనస్సులోని అజ్ఞానాన్ని పారదోలు. దహనక్రియలకోసం నేయి, వస్త్రాలు, తైలం, గంధం లాంటి వస్తువుల్ని తెప్పించు. ఈ కిష్కింధ అంతా ఇప్పుడు నీ అధీనంలో ఉంది.

ఓ తారుడా! నీవు వెళ్ళి ఒక పూలపల్లకిని తెప్పించు. ఈ శవాన్ని మోసే పల్లకిని అలంకరించండి. దానిని మోసేందుకు బలిష్ఠులైన వానరుల్ని సమీకరించండి" అని చెప్పి రాముని దగ్గరకు వెళ్ళాడు. తారుడు వెళ్ళి శిబికను మోయించుకొని వచ్చాడు. ఆ పల్లకిపైన రథంలాగా అందంగా పక్షులు, వృక్షాలు చెక్కబడి ఉంది. అది సిద్ధుల విమానంలాగా ఉంది. సన్నని రంధ్రాలతో కూడిన కిటికీలు కూడా దానికి ఉన్నాయి. విశ్వకర్మ తయారుచేసి ఉండడంవల్ల ఆ శవపేటిక అద్భుత శిల్పవిన్యాసాన్ని కలిగి ఉంది. దాని నిండా పూలు, పూల మాలికలు అలంకరించారు.

శ్రీరాముని ప్రోద్బలంతో వాలి శరీరానికి ఆ పేటికపైకి సుగ్రీవుడు చేర్పించాడు. మృతుడైన వాలిని పూలతోను వస్త్రాలతోను అలంకరించారు. అప్పుడు సుగ్రీవుడు వానరులతో "సోదరులారా! వానరరాజ్యానికి ప్రభువైన వాలికి రాజోచితమర్యాదలతో దహనక్రియల్ని చేయించండి" అని చెప్పాడు. కొందరు వానరులు శవానికన్నా ముందుగా దారిలో రత్నాలు చల్లుతూ నడిచారు. దగ్గరి బంధువులులైన తారుడు మొదలగువారందరూ అంగదుని పట్టుకొని ఏడ్చారు.

వాలి భార్యలందరూ తమ నాథుడు తమను విడిచి వెళ్ళిపోయాడని గగ్గోలు పెట్టి ఏడ్చారు. వానరులందరూ వాలిని అనుసరిస్తూ వచ్చారు వారి ఏడుపులు ఆక్రందనలతో ఆ కొండ అంతా ప్రతిధ్వనించింది. కొండమీద నుండి పడుతున్న సెలయేరు దగ్గర జన సంచారం లేని చోట వాలి పల్లకిని దించారు. వానరుల్లో కొందరు చితిని పేర్చారు. అందరూ శోకంలో మునిగి అక్కడే నిలబడ్డారు. వాలిని మోసుకొచ్చిన శిబికను అక్కడే పెట్టి వారందరూ శోకంలో మునిగి చేయాల్సిన కార్యాన్ని మరిచారు. తార వాలి మృతశరీరాన్ని ఒడిలో పెట్టుకొని "ఓ రాజేంద్రా! మేమందరం నిన్ను అనుసరించి వచ్చాం. మీరు ఎందుకు మమ్మల్ని చూడడంలేదు. మీ ముఖం నిద్రపోతున్నట్లుగానే ఉంది. మీలో జీవకళ పోలేదు. అయ్యో వానరేశ్వరా! నేనెంత మాట్లాడినా మీరు ఒక్క మాట కూడా మాట్లాడరే? జీవితేశ్వరా ఇక నేను ఏం చేయగలను? అంటూ ఎన్నో విధాలుగా తార వాలిని తలచి తలచి ఏడుస్తోంది. సుగ్రీవాదులు, మంత్రులు అందరూ మీ చుట్టే ఉన్నారు. మీరు లేచి వారినందరిని పంపివేయండి. మనం ఇద్దరం ఈ ప్రకృతిలో హాయిగా విహరిద్దాం" అంటూ విలపించింది.

తండ్రి మరణాన్ని చూసి తట్టుకోలేని అంగదుడు ఆక్రోశిస్తున్నాడు. ఏమీ చేయలేని అనాసక్తతతో కూలబడిపోయాడు. అటువంటి అంగదుణ్ణి దుఃఖితుడైన సుగ్రీవుడు లేవదీసి చితిపై వాలి శరీరాన్ని చేర్చి ఆ చితికి అంగదుని చేత నిప్పు పెట్టించాడు. అంగదుడు మృతుడైన తండ్రికి అపసవ్యంగా ప్రదక్షిణ చేశాడు.

వాలికి శాస్త్రానుసారంగా అంత్యక్రియలు చేశారు. చల్లని నదీతీరానికి తిలతర్పణాలకోసం వెళ్ళారు. వానరులందరూ కలిసి అంగదుని చేత వాలికి తిలతర్పణం చేయించారు. మహాబలశాలి ఐన శ్రీరాముడు వానరుల వద్దే ఉండి వాలికి రాజలాంఛనాలతో ఉత్తరక్రియలను జరిపించాడు.

ఆ తర్వాత సుగ్రీవుడు అగ్నిలాంటి తేజస్సు నిండిన శ్రీరాముని చెంతకు వచ్చాడు.

* * *

# సుగ్రీవ, అంగదుల పట్టాభిషేకం

## సర్గ - 26

ఉత్తరక్రియల అనంతరం అందరూ స్నానాలు చేసి రాముని దగ్గరకు చేరారు. కార్యాలను అనుకూలంగా చేసే సమర్థత ఉన్న శ్రీరాముని దగ్గరకు మహర్షులందరూ బ్రహ్మదేవునికి దగ్గరకు వచ్చినట్లుగా వచ్చారు. అందరూ ఇంకా వాలి మరణబాధ నుంచి పూర్తిగా తేరుకోలేదు. గంభీరవదనుడైన హనుమంతుడు శ్రీరాముని చూచి నమస్కరించి "రామా! మీ వలన వానరమహాసామ్రాజ్యాన్ని ఈ సుగ్రీవుడు పొందారు. మీరు ఆజ్ఞ ఇచ్చినట్లు అయితే వానరబంధువులు స్నేహితులతో కలిసి సుగ్రీవుడు కిష్కింధకు వెళ్ళి సమస్త కార్యాలను చేపడ్తారు.

స్వామీ రామచంద్రా! సుగంధజలాలు, ఔషధాలతో విధి విధానాన్ని అనుసరించి పట్టాభిషిక్తుడు అయి రత్నాలు, వజ్రాలతో మిమ్మల్ని అర్చిస్తాడు. మీరు రమ్యమైన కిష్కింధానగరానికి వచ్చి మా సుగ్రీవుణ్ణి రాజ్యాభిషిక్తుని చేయండి" అని చెప్పాడు. హనుమంతుని మాటలన్నీ శ్రీరాముడు విన్నాడు.

"హనుమంతా! నేను మా తండ్రి ఆజ్ఞను అనుసరించి పద్నాలుగేండ్లు నగరాలలోకి ప్రవేశించను. వీరుడైన సుగ్రీవుణ్ణి సర్వసంపదలతో అలరారే మనోహరమైన కిష్కింధకు మీరందరూ వెళ్ళి వెంటనే పట్టాభిషిక్తుణ్ణి చేయండి. హనుమంతా! నీవు లోకవ్యవహారాలు తెలిసినవాడివి. ఈ అంగదుడు సత్ప్రవర్తన ఉన్నవాడు. యువరాజ్యపదవికి తగినవాడు. పరాక్రమంలో వాలి అంతటి వీరుడు. వీనిని కూడా యువరాజ్యపట్టాభిషిక్తుని చేయండి.

సుగ్రీవా! ఇది వర్షాకాలసమయం. ఇప్పుడు ఏపని మొదలుపెట్టినా నిరంతరం కురిసే వానలవల్ల ఆటంకాలు కలుగుతాయి. ఈ వర్షాకాలంలోని మొదటి మాసం ఐన శ్రావణం ఇది. మీరందరూ హాయిగా కిష్కింధకు వెళ్ళి ఉండండి. నేను లక్ష్మణుడు ఈ ప్రస్రవణగిరి మీద ఉంటాం. కాని, నీవు రావణవధ నిమిత్తం ఈ కాలంలో సేనలను సమీకరించు. కార్తికమాసం సీతాన్వేషణానికి మంచి కాలం. ఆ రోజున మనం మా పనిని మొదలుపెడదాం. అప్పటిదాకా మీరు కిష్కింధలో నివసించండి. మేము రమ్యమైన ఈ గుహలో ఉంటాం.

చక్కని గాలులు వీస్తున్నాయి. నిర్మలమైన జలాలున్నాయి. కలువలు తామరలతో నిండిన జలాశయాలు కనులకింపుగా ఉన్నాయి. మేం ఈ ప్రస్రవణగిరిపైనే కాలం గడుపుతూ సీతాన్వేషణ కాలానికై ఎదురుచూస్తాం. ఇదే మన ఒడంబడిక" – అంటూ శ్రీరాముడు సుగ్రీవునకు చెప్పాడు.

రామాజ్ఞను శిరసావహించి సుగ్రీవాదులు అందమైన కిష్కింధకు చేరుకొన్నారు. మంత్రులు అందరూ సుగ్రీవునికి నమస్కరించారు. పౌరులు, బంధుజనులు సుగ్రీవుని చుట్టుముట్టారు. వారందరితో సుగ్రీవుడు ఆనందంగా, ఆత్మీయంగా మాట్లాడాడు. ఆ తర్వాత వాలి అంతఃపురంలోకి సుగ్రీవుడు వెళ్ళాడు. సభాస్థలికి చేరిన సుగ్రీవునికి బంగారు చువ్వలున్న ఛత్రం పట్టారు.

వింజామరలు వీచారు. రత్నాలు, బీజాలు, ఓషధులు, పూలు, తెల్లని వస్త్రాలు, అనులేపనాలు, సువాసనలున్న పూలమాలికలు, చందనాదులు, బంగారు అక్షతలు, కొఱ్ఱ ధాన్యం, తేనె, నేయి, పెరుగు, పేలాలు, పులి, చర్మం, పాదరక్షలు, మైపూతలు, గోరోజనం, మణిసిలలు, వీటనన్నింటిని సుగ్రీవుని పట్టాభిషేకం కోసం తీసుకొని వచ్చారు. పదారుమంది కన్యలు కూడా వచ్చారు.

బ్రాహ్మణోత్తములు వచ్చి హోమాలు చేశారు. వారికి నూతన వస్త్రాలు, రత్నాభరణాలు, మధురభక్ష్యాలు ఇచ్చి వారిని సంతృప్తిపరిచారు. అగ్నిదేవునికి హవిస్సులు ఇచ్చి పూజించారు. రాజభవనాలలో కంబళ్ళు పరచి పూలతోరణాలు కట్టి అందంగా అలంకరించారు.

వానరశ్రేష్ఠులు పుణ్యనదీ తీర్థాలను సముద్రజలాలను తీసుకొని వచ్చి బంగారుకలశాలలో పోశారు. మహర్షులు చెప్పినట్లుగా శాస్త్రానుసారంగా బంగారు కలశాలతో, వృషభ కొమ్ములతో, పరిమళ జలాలను తీసుకొని గజుడు, గవాక్షుడు, గవయుడు, శరభుడు, గంధమాదనుడు, మైందుడు, ద్వివిదుడు, హనుమంతుడు, జాంబవంతుడు, నలుడు లాంటి వానర ప్రముఖులు సుగ్రీవునికి అభిషేకం చేశారు.

పట్టాభిషేకం తర్వాత వానరులందరూ కలిసి సుగ్రీవునకు జయధ్వానాలు చేశారు. సుగ్రీవుడు వాలి కొడుకు ఐన అంగదుణ్ణి కౌగిలించుకొని శ్రీరాముని ఆదేశం ప్రకారం యౌవరాజ్యపట్టాభిషేకం చేశాడు. అంగదుడు పట్టాభిషిక్తునిగా చూసి వానరులందరూ బాగు బాగు అంటూ కోలాహలంగా వేడుకలు చేశారు. అందరూ ఆనందంగా జయధ్వానాలు చేశారు. సుగ్రీవుని అంగదుడిని అర్చించారు. వారందరూ రామలక్ష్మణులను కొనియాడారు. కిష్కంధ అంతా కోలాహలంగా ఆనందంగా పండుగను చేసుకొంటున్నారు. వానరులందరూ సుగ్రీవునకు మంచికాలం వచ్చిందని అనుకొంటున్నారు.

సుగ్రీవుడు శ్రీరాముని దగ్గరకు వచ్చి పట్టాభిషేకమహోత్సవం గురించి జరిగిన విశేషాలన్నీ చెప్పాడు. తన భార్య ఐన రుమను సంతోషంగా చేపట్టానని రామునకు తెలిపాడు. తార అంగదాదులను తన శాయశక్తులా దేవుని దయ వలన సంతోషపరిచానని సుగ్రీవుడు రామునికి చెప్పాడు.

పట్టాభిషేకం తర్వాత సుగ్రీవునితోపాటు సకలవానరలోకం సంతోషించింది. దేవేంద్రుడు అమరావతిని పాలించినట్లుగా సుగ్రీవుడు నిర్భయంగా వానర లోకాన్ని పాలించసాగాడు.

* * *

# ప్రస్రవణ గిరిపై రామలక్ష్మణులు

## సర్గ - 27

శ్రీరామునకు విషయాలన్నీ చెప్పి సుగ్రీవుడు తన వానరులతో కలిసి కిష్కింధకు వెళ్ళాడు. ఆ తర్వాత రామాదులు ప్రస్రవణగిరికి వెళ్ళారు. ఆ ప్రస్రవణగిరిపైన క్రూరమృగాల సంచారం ఎక్కువగా ఉంది. భయంకరమైన సింహగర్జనలు ఎప్పుడూ వినిపిస్తూ ఉన్నాయి. చెట్లు వృక్షాలు ఏపుగా పెరిగి ఉన్నాయి. వన్యప్రాణులైన కోతులు, ఎలుగుబంట్లు, అడవి పిల్లులు తిరుగుతూ ఉన్నాయి. నిండైన జలాలతో ఉన్న జలాశయాలు చూడముచ్చటగా ఉన్నాయి.

ఆ ప్రసరణగిరి శిఖరం మీద అనువుగా ఉన్న ఒక గుహను రామలక్ష్మణులు ఉండడానికి ఎన్నుకొన్నారు. శ్రీరాముడు శరత్కాలసమయంలో సీతాన్వేషణ చేయాలని సుగ్రీవునితో చెప్పాడు. దానికోసం శ్రీరాముడు ఎదురుచూస్తున్నాడు. "లక్ష్మణా! ఈ వర్షాకాలం అంతా మనం ఇక్కడేఉందాం. ఈ పర్వతం పై ధాతువులు, వృక్షాలు, జలాలు, మృగాలు పక్షులతో సమృద్ధిగా ఉంది. ఇక్కడికి దగ్గరలోనే జలాశయం ఉంది. అది ఇప్పుడే పడే వర్షాలతో ఇంకా మన దగ్గరకు వచ్చినట్లుగా ఉంటుంది.

లక్ష్మణా! ఈ గుహ ఈశాన్యభాగం పల్లంగా ఉంది. ఇది శుభకరమైంది. పడమర భాగం ఎత్తుగా ఉంది. దానివలన పెనుగాలుల బాధ ఉండదు. ఈ గుహ ముందుభాగం సమతలంగా ఉంది. ఈ గుహ ఉత్తరభాగంలోని ఉన్న పర్వతశిఖరం కాటుకకొండలాగా నల్లగా ప్రత్యేకంగా కనబడుతోంది. దక్షిణభాగంలో పర్వతశిఖరం అతి తెల్లగా ఉండి కైలాసశిఖరంలాగా కనిపిస్తోంది. ఈ గుహకు తూర్పుభాగంలో ప్రవహించే నది త్రికూటపర్వతం నుండి జాలువారే గంగను తలపిస్తోంది. ఈ నది ఒడ్డున పుష్పాలతో కూడిన వృక్షాలు అందంగా కనిపిస్తున్నాయి. చిన్నపొదలు, పెద్దవృక్షాలు కలసి చక్కని వస్త్రాదులను ధరించిన యువతిలాగా ఈ నది కనిపిస్తోంది.

వందలకొలది పక్షిసమూహాలు ఈ వృక్షాలపై ఆవాసం ఏర్పరచుకొని ఉన్నాయి. అవి అన్ని మధుర ధ్వనులను చేస్తున్నాయి. ఈ నదీ తీరంలో బెగ్గురు పక్షులు కలహంసలు సందడి చేస్తూ ఈ నది రమణీయతను పెంచుతున్నాయి. ఈ నదిలో నల్లకలువలు దట్టంగా ఉన్నాయి. ఎరుపు తెలుపు కలువలు కూడా బాగా పూచి అందంగా కనబడుతున్నాయి.

ఈ నదిని ఆశ్రయించి ఈ మనోహరమైన ప్రకృతిలో ఎందరో మహానుభావులు తమ తపస్సులను సాగిస్తున్నారు. ఇక్కడ పెరిగి ఉన్న సుగంధపు చెట్లు ఎవరో కావాలని పెంచినట్లుగా ఒక క్రమపద్ధతిలో ఉన్నాయి. లక్ష్మణా! ఇంత ముగ్ధమనోహరప్రదేశంలో మనం హాయిగా కాలం గడుపుదాం. లక్ష్మణా! విను వానరుల కోలాహల ధ్వని ఇక్కడకు వినిపిస్తోంది. వారందరూ సంతోషంగా వీణావేణుమృదంగ తాళధ్వనులతో నృత్యాలు చేస్తూ గానాలు ఆలపిస్తూ ఆనందిస్తున్నారు. కపీంద్రుడైన సుగ్రీవునకు రాజ్యం దక్కింది. పోగొట్టుకొనబడిన రుమ దొరికింది. సర్వసంపదలు దగ్గరకు వచ్చాయి. మిత్రులు, బంధువులు, స్వజనులు అందరూ చేరువయ్యారు. ఇప్పుడు సుగ్రీవుడు ఆనందంగా ఉన్నాడు" అని చెప్పి శ్రీరాముడు లక్ష్మణుడు గుహ లోపలికి వెళ్ళారు.

అందమైన ప్రకృతితో ఫలాలు పూలతో సమృద్ధిగా ఉన్న ప్రస్రవణగిరి సుఖజీవనానికి అనుకూలంగా ఉంది. కాని శ్రీరాముడు సీత లేక ఆ ప్రకృతిని ఆస్వాదించలేకపోయాడు. రమ్యంగా కనబడే పరిసరాలు శ్రీరామునికి ఆనందాన్ని ఇవ్వలేకపోయాయి. రాత్రిళ్ళు అందంగా కనిపిస్తూ విరహవేదనను పెంచే చంద్రుడు కనబడి శ్రీరామునికి నిద్రను కూడా దూరం చేశాడు.

సీతావియోగాన్ని భరించలేని శ్రీరాముడు సీతనే అనుక్షణం తలచుకొంటూ దుఃఖిస్తుండేవాడు. అలాంటి స్థితిలో ఉన్న అన్నను చూసి తానేమీ చేయలేకపోతున్నానని లక్ష్మణుడు చింతించే వాడు. "అన్నా! మీరు మహావీరులు. మీవంటి ఉత్తములు శోకించకూడదు. సర్వశుభలక్షణ సంపన్నుడవు. అన్నీ తెలిసిన మీరు కాలం కోసం ఆగక నిరంతరం వేదన అనుభవించడం నేను చూడలేకుండా ఉన్నాను.

మీరు ఇలా శోకిస్తుంటే తగు సమయం చిక్కినప్పుడు రాక్షసుని వధించడంలో శక్తిహీనతకు గురి అవుతారు. కనుక ధైర్యం తెచ్చుకొని రాక్షసుని సపరివారంగా నాశనం చేయడానికి కావలసిన శక్తియుక్తులకోసం శ్రమించు. మీరు తలచుకొంటే ఈ సమస్తభూమండలాన్ని తలకిందులు చేయగల సమర్థులు. మీకు రావణుడు ఒక లెక్కా? శరత్కాలంలో మనం అందరం కలిసి రావణుని మదం అణచివేద్దాం.

అన్నా! మీలో నిద్రాణమై ఉన్న శక్తిని మేల్కొలపండి. సరియైన కాలంలో శత్రువును మీరు మట్టి కరిపించగలరు. దైన్యం వీడి సంతోషంగా ఉండండి" అని చెప్పే లక్ష్మణుని మాటలు శ్రీరామునికి ప్రియంగా అనిపించాయి. "ఓ సౌమిత్రీ! నీ మాటలు అన్నీ సత్యాలే. హితాన్ని గూర్చేవి. ప్రియమైనవి అయిన మాటలు నీవు చెప్పి నాకు సంతోషాన్నిచ్చావు. ఇదుగో నేనిప్పుడే శోకాన్ని విడిచిపెడ్తున్నాను. నీవల్ల నేను ఉత్తేజం పొందాను.

లక్ష్మణా! మనం కార్యోన్ముఖులం అవుదాం. శరత్కాలం ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూద్దాం. ఉపకారం పొందిన వీరులు తప్పకుండా ప్రత్యుపకారాన్ని చేస్తారు. అలా చేయని వారిని సత్పురుషులు ఏవగించుకొంటారు. ఆ భయంతోనైనా సుగ్రీవుడు మనకు సహాయం చేస్తాడని నాకు అనిపిస్తోంది." లక్ష్మణుడు అన్న మాటలకు సంతోషించాడు. "అన్నా! మీరు చెప్పినట్లే ఆ వానరరాజు సుగ్రీవుడు మన పనులను తప్పక చేస్తాడు. అందుకే మీరు శరత్కాలం వరకు ఓపికగా శోకరహితుడవై ఎదురుచూడు. అన్నా! మంచివారి దగ్గర కష్టాలు కలకాలం కాపురం చేయవు. వారిలో మంచితనాన్ని ఇంకా పెంచాలనే దేవుడు ఇలా చేస్తుంటాడనిపిస్తుంది" అని చెప్పాడు.

"మీ మనోరథం ఈడేరుతుంది. మీలో ఉన్న ఉత్సాహాన్ని సడలనీయకండి. శత్రువుపై విజయాన్ని సాధించాలన్న పట్టుదలను అంతకంతకూ పెంచుకొంటూ శరత్కాలంకోసం మనం ఎదురుచూద్దాం. దైవం మనకు అనుకూలుడు కావల్సిఉంది. కాలం (సమయం) మన పక్షాన తప్పక నిలుస్తుంది. ఈ వర్షాకాలంలో ఎదురయ్యే కష్టాలను అధిగమిద్దాం" అని లక్ష్మణుడు శ్రీరామునికి ధైర్యాన్ని, ఉత్సాహాన్ని కలిగించాడు.

* * *

# వేదనాభరితమైన వర్షఋతువు

## సర్గ - 28

వాలి వధానంతరం సుగ్రీవాదులు కిష్కింధలో, రామలక్ష్మణులు ప్రస్రవణగిరిలో కాలం గడుపుతున్నారు. కాలం నెమ్మదిగా సాగుతోంది. రాముడు విరహాన్ని తట్టుకొని సీతకోసం ఎదురు చూస్తున్నాడు. ఒకరోజు "సౌమిత్రీ! మనం అనుకొన్న వర్షాకాలం రానే వచ్చింది. స్త్రీ తొమ్మిది మాసాలు మోసి శిశువు అనే సంపదను పొందినట్లుగా ఆకాశం సూర్యకిరణాలద్వారా సముద్రజలాలు పీల్చి తొమ్మిదినెలలు తనలో పెట్టుకొని ఆ సంపదను ఇప్పుడు అందిస్తున్నట్లుంది. సూర్యభగవానుని మేఘపంక్తులనే మెట్లు ఎక్కి చక్కని పూలతో మనం అర్చించవచ్చు.

సంధ్యారాగకాంతులతో ఆకాశం నిండినప్పుడు తెల్లని మబ్బులు చుట్టుకొన్నప్పుడు రక్తసిక్తమైన గాయాన్ని తెల్లనివస్త్రంతో కట్టినట్లుగా కనిపిస్తోంది. వేసవి తాపానికి వేడెక్కిన భూమి తొలకరి జల్లులకు తడిసి వేడి కన్నీరు గార్చుతున్న సీతాదేవిలాగా కనిపిస్తోంది. మేఘాలతో చెలిమి చేస్తున్న ఈ పవనుడు ఆ చల్లదనాన్ని పూలసువాసనలను కలుపుకొని తెస్తున్నాడు. ఈ ప్రసరణగిరి మంచి సువాసనలతో నిండిన వర్షధారలతో బహుసుందరంగా ఉంది. దీన్ని చూస్తుంటే సుగ్రీవుని అభిషేకం కన్నులకు కట్టినట్లుగా ఉంది. లక్ష్మణా! ఈ వర్షాకాలం వేసవి తాపాన్ని తీర్చివేసింది. దుమ్ము ధూళి ఈ వర్షధారలకు తడిసిపోయి భూమిపై గట్టిగా అతుక్కుపోయాయి. రాజుల యుద్ధకాంక్షను మనస్సునుండి తొలగించివేసింది. అందరూ హాయిగా వీచే చల్లని పిల్లగాలులతో వైరాలు మరచి సుఖశాంతులతో బ్రతుకుతున్నారు. ప్రకృతే మనిషికి కలసి మెలసి ఉంటే సృష్టి ఎంత రమ్యంగా ఉంటుందో నేర్పుతున్నట్లు నాకనిపిస్తుంది. పక్క ప్రదేశాలకు వెళ్ళినవారు తిరిగి స్వస్థలానికి చేరుకొంటున్నారు. అన్నీ బాగున్నాయి కాని ఈ వర్షఋతువు నా సీత లేని లోటును నాకు బాగా గుర్తుకు తెస్తోంది. సీతావిరహవేదనను నేను భరించలేకపోతున్నాను.

ఆకాశం నిండా మేఘాలు అలుముకొని ఆకాశాన్ని కనబడనీయడంలేదు. మోహం తొలగని సాధకునకు బ్రహ్మ ప్రత్యక్షం కానట్లుగా ఆకాశం చూడాలంటే కనిపించడంలేదు. వర్షపునీరు కలసి సెలయేళ్ళు, నదులు ఉద్ధృతంగా ప్రవర్తిస్తున్నాయి. పక్షులన్నీ తడిసిపోతున్నా నిత్యకృత్యం అయిన ఆహారాన్వేషణ సాగిస్తూనే ఉన్నాయి. మేఘాలు ఉరుముతూ ఉంటే సింహాలు గర్జించినట్లు ఏనుగులు ఘీంకరించినట్లుగా ఉంది. భూమి అంతా పచ్చని ఆకులు గల చెట్లతోను పచ్చికతోను ఉంది. పచ్చని పట్టుచీర ధరించిన ప్రౌఢలాగా భూదేవి కనిపిస్తోంది.

నేరేడు వృక్షాలు గుత్తులు గుత్తులుగా పండ్లను రాలుస్తున్నాయి. తుమ్మెదల ఝుంకారాలు నెమళ్ళ క్రేంకారాలు కోయిలల కూతలు అన్నీ కలగలిసి వర్షఋతువు అందాన్ని పెంచుతూ తమ ఆనందాన్ని తెలుపుతున్నాయి. కప్పల బెకబెకలు మృదంగధ్వనిలాగా కరతాళధ్వనుల్లాగా వినిపిస్తున్నాయి. నూతనవధువు తన పతిని చేరడానికి తొందరగా వెళ్తున్నట్లుగా నదులన్నీ జలాలు నింపుకొని సముద్రుని కలవడానికి ఉరుకులు పరుగులు పెడ్తున్నాయి.

భరతుడు నాల్గుమాసాలకు కావలసిన గృహోపకరణాలు సంపదలు సమృద్ధిగా సమకూర్చుకొని ఉంటాడు. ఆషాఢపూర్ణిమ మొదలుకొని చాతుర్మాస్యవ్రతాన్ని చేపట్టి ఉంటాడు. వర్షాలు విజృంభించి కురుస్తున్నాయి. రావణుడు

ఎలాంటి శత్రువో మనకు తెలీదు. నేను సీతాదేవిని పోగొట్టుకొని క్రుంగి కృశించిపోతున్నాను. సీతను వెతకడానికి ఇది అనువైన సమయం కాదు. దారులన్నీ జలాలతో మూసుకొని పోయి ఉంటాయి. మిట్టపల్లాల జాడ మనం తెలుసుకోలేము. వర్షాకాలం తర్వాత సుగ్రీవాదులు మన కార్యాన్ని మొదలుపెడ్తారేమో? చాలా రోజుల తర్వాత సుగ్రీవుడు కూడా తన భార్యను పొంది ఇప్పుడిప్పుడే ఆనందానికి అలవడి ఉన్నాడు. ఆ ఆనందంలో మనం వారికి గుర్తు ఉంటామో లేదో అని నాకు దిగులుగా ఉంది. సౌమిత్రీ! మనం నదులు శాంతించే వరకు వేచి చూడాల్సిందే కదా!

సుగ్రీవుడు మన కార్యాన్ని తప్పక చేస్తాడనే అనుకొంటున్నాను. కాని మనపై పగపట్టినట్లుగా ఉండే దైవం మనకు మేలు చేస్తాడంటావా?" అని కలవరపడుతున్న శ్రీరామునకు లక్ష్మణుడు "అన్నా! మీరు నిజమే చెప్తున్నారు. తప్పకుండా మనకు సీతాన్వేషణంలో సుగ్రీవుడు సాయం చేస్తాడు. మనం తొందరపడకుండా వర్షాకాలం ముగిసి శరత్కాలం వచ్చేవరకు ఎదురుచూడాలి. దైవం తప్పక మన పక్షాన నిలుస్తాడు సీతాదేవిని మీరు తప్పక పొందుతారు. మీరే కాదు మనందరమూ బాగుంటాము" అని చెప్పాడు.

* * *

# సీతాన్వేషణకై సేనల సమీకరణ

## సర్గ - 29

**కా**లం వేగంగా సాగిపోతునట్లు సుగ్రీవాదులకు, అతి నెమ్మదిగా సాగుతునట్లు రామాదులకు అనిపించసాగింది. మెరుపులు ఉరుములు తగ్గుతూ ఆకాశంగా నిర్మలంగా ఉండడాన్ని హనుమంతుడు చూశాడు. పిండి ఆరబోసినట్లుగా వెన్నెల కురుస్తోంది. మారుతి దీనినంతా చూసి వర్షాకాలం జరిగిపోయి శరత్కాలం వచ్చిందనుకొన్నాడు. ఇది సీతాన్వేషణకు సరియైన కాలం. ఇపుడు సుగ్రీవునికి మిత్రకార్యం గురించి గుర్తుచేయాలని అనుకొన్నాడు.

సుగ్రీవుడు మనోరథాలన్నీ తీరి రాజ్యం చేజిక్కి సంపదలు నిండి ఉండడంతో నిరంతరం కామపరవశుడై స్త్రీలోలుడై అంతపురంలో ఏకాంతంగానే ఉన్నాడు. అతడు తన భార్య రుమ, తారలతో కలిసి నిత్యం భోగలాలస జీవితాన్ని గడుపుతున్నాడు. రాజ్యకార్యాలు మంత్రులమీదనే ఉంచి సుగ్రీవుడు తరుణులతో క్రీడిస్తూ ఆనందపారవశ్యంలో కాలం గడుపుతున్నాడు. సుగ్రీవుడు చేయాల్సిన కార్యం గురించి మరచిపోయాడు. ఆంజనేయుడు పరిస్థితిని చూశాడు. అర్థం చేసుకొన్నాడు. వాయునందనుడు సకల శాస్త్ర విషయాలను తెలిసినవాడు. కర్తవ్యపాలనలో విచక్షణ ఉన్నవాడు యథార్థపరిస్థితిని చూచి తెలుసుకోగల నేర్పరి. పెడదారి పట్టిన సుగ్రీవుని చూసి తెలుసుకొన్నాడు. పరిస్థితిని చక్కబరచాలని మారుతి మృదుమధుర వచనాలతో సుగ్రీవుని ప్రసన్నునిగా చేసుకొన్నాడు. సుగ్రీవునితో ధర్మార్థనీతివచనాలు మంచిని బోధించేవి ప్రజల అభ్యున్నతిని పెంచేవైన మాటలు ఎన్నో చెప్పాడు.

"ఓ ప్రభూ!మన కష్టాలు తీరిపోయాయి. మీకు రాజ్యం ప్రాప్తించింది. కీర్తిప్రతిష్ఠలు పెరిగాయి. కాని మిత్రులకు చేస్తానని ఇచ్చిన మాటలను నిలబెట్టుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. మనం వారిద్వారా ఉపకారాన్ని ముందే పొంది ఉన్నాం. ఇప్పుడు ప్రత్యుపకారాన్ని సకాలంలో చేస్తే సన్మార్గంలో నడిచినవారం అవుతాం. అప్పుడు యశస్సు, రాజ్యం, కీర్తి వాటి అంతట అవే మన దగ్గరకు వస్తాయి.

ఓ సుగ్రీవా! మీరు సదాచార సంపన్నులు, సన్మార్గంలో నడిచి రామునకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోండి. సమస్త సుఖ భోగాలను త్యజించి మిత్రుని కార్యం చేసినవారికి అఖిల సంపదలు ఒనగూడుతాయి. సకాలంలో పని ఆరంభించకపోతే కార్యం చెడి అనుకొన్న ప్రయోజనం కలుగదు. సూర్యపుత్రా! ఇప్పటికే కాలాతీతం అయింది. శ్రీరాముని కార్యం మనం త్వరగా చేయవలసి ఉంది.

సీతాన్వేషణానికి తగిన సమయం ఇది అని శ్రీరామునికి తెలుసు. అతడు అసలే బాధతో ఉన్నాడు. ఆ రాముడు నేడు మీపై ఆధారపడి ఉన్నాడు. ఈ విషయం మీతో చెప్పడానికి వెనుకాడుతున్నట్లుంది. శ్రీరాముడు మీకు ప్రాణమిత్రుడు. మీ వంశోన్నతికి ఆయనే కారణం. ఆ మహాత్ముడు మీకు గొప్ప సహాయం చేసి ఉన్నాడు. మీరు ఆయనకు ప్రత్యుపకారం చేయడానికోసం సీతాన్వేషణకు పూనుకోండి" అని సుగ్రీవునకు మారుతి చెప్పాడు.

"వానరాలకు, భల్లూకాలకు ప్రభువైన ఓ సుగ్రీవా! మహాశక్తి సంపన్నుడవు, గొప్ప పరాక్రమశాలివి, అయినా శ్రీరామునికి ప్రీతిని కలిగించడానికి మీరు సిద్ధపడటంలేదు ఎందుకు? శ్రీరాముడు వాలిని వధించి మీకు మహోపకారం చేశారు గదా! ఆయన ధర్మపత్నిని ఈ లోకంలో ఎక్కడున్నా వెదికించాల్సిన బాధ్యత మనదే కదా! శత్రుసంహారకసమర్థత ఉన్న ఆ రామునికోసం సర్వశక్తులు ఒడ్డి సహాయం చేయడం మీ కర్తవ్యం.

వానరరాజా! మీరు మహాబలశాలురు. మీ దగ్గర కామరూప విద్యలు తెలిసిన వానరప్రముఖులు ఎందరో ఉన్నారు ఎవరూ వారిని ఎదిరింప శక్యంకాదు. వారందరిని మీరు పిలిచి కార్యాన్ని అప్పజెప్పండి. ఎవరెవరు ఏమేమి చేయాలో మీరు నిర్ణయించి చెప్పండి. నేను మీకు తెలీని విషయాలు చెప్పుతున్నానని అనుకోవద్దు. మీరు చేయాల్సినదానిని నిర్వర్తిస్తే మంచిపేరు వస్తుందని నాకు తెలిసింది చెప్పాను" అన్నాడు హనుమంతుడు. మారుతి చెప్పిన విషయాలన్నీ విని సుగ్రీవునికి తాను చేసింది ఏమిటి? తాను చేయాల్సింది ఏమిటి అన్న విషయం గురించి తెలుసుకొన్నాడు. తాను నిర్వర్తించాల్సిన కార్యం గురించి మంచి అవగాహన వచ్చింది.

వెంటనే 'నీలుడు' అనే సేనాధిపతిని పిలిచి అన్ని దిక్కులనుండి సమస్త కార్యాలను చేయగల వానరులను సమీకరించమని ఆదేశించాడు. శీఘ్రగమనం చేయగలవారు, పనిలో చురుకైనవారు రాజ్యపొలిమేరలను రక్షించువారు అయిన వానర యోధులను అందరిని రమ్మని నా ఆజ్ఞగా చెప్పు. ఎవరైనా నా ఆజ్ఞను ధిక్కరిస్తే వారికి మరణదండన విధిస్తాను. వానరయోధులందరిని అంగదుని వెంటబెట్టుకొని పిలుచుకొనిరమ్మని సుగ్రీవుడు చెప్పాడు.

* * *

# సుగ్రీవునికి కర్తవ్యం గుర్తుచేయటం

## సర్గ - 30

శ్రీరాముడు వర్షాకాలమంతా చాలా కష్టపడుతూ గడిపాడు. ఎప్పుడు శరత్కాలం వస్తుందా అని ఎదురుచూస్తూ గడిపాడు. నిర్మలంగా మారిన ఆకాశం, పండు వెన్నెల రాత్రిళ్ళు వచ్చాయి. వాటిని చూసి శ్రీరాముడు సీతాన్వేషణకు తగిన సమయం వచ్చిందనుకొన్నాడు. ఒక ప్రక్క ఆనందం వేసినా సీత ఎడబాటుతో కలిగే వేదనే ఆయనలో ఎక్కువైంది. రావణునిపై దండెత్తి వెళ్ళడానికి సమయం మించిపోతోందని చాలా బాధపడ్డాడు. శోకంతో ఉన్న రాముడు మూర్ఛపోయాడు.

మళ్ళీ వెంటనే తేరుకొని ప్రస్రవణగిరిపై కూర్చుని ప్రకృతిని చూశాడు. “అయ్యో! నా సీత దూరంగా ఎలా ఉందో?” అనుకొన్నాడు అదే చింత ఆయన కళ్ళల్లో కన్నీరు తెప్పించింది. ప్రకృతి అంతా స్వచ్ఛందగా నిర్మలంగా ఉంది. కాని నా మనస్సు ఆవేదనతో సుడిగుండంలా ఉంది అనుకొన్నాడు. సీత ఆశ్రమంలో సారసపక్షులతో మాట్లాడుతూ వినోదిస్తూ ఉండేది. పాపం ఇప్పుడు మనసును ఎలా ఆహ్లాదపరచుకొంటుందో అని అనుకొన్నాడు. నేను దగ్గరగా లేనందువల్ల సీత ఎంత దిగులు పడుతుందో అనుకొన్నాడు.

నా ప్రాణేశ్వరి కలహంసలు చేసే సవ్వడి విని నిద్రలేచేది. ఇప్పుడు ఆమె ఎలా నిద్ర మేల్కొంటోందో? చక్ర వాకాల ధ్వని విని నా విరహాన్ని ఎలా భరిస్తుందో? ఈ నదులు, బావులు, సెలయేర్ల దగ్గర నడుస్తున్నప్పుడు నా సీత నా ప్రక్కన లేక ఏదీ నాకు మనోహరంగా కనిపించడంలేదు. సీతాదేవి కుసుమకోమలశరీరం ఉన్న సుకుమారి. నేడు ఈ శరద్రాత్రులలో మన్మథుడు బాధిస్తున్నాడేమో? ఇలా ఆలోచిస్తూ సీత విరహంలో మునిగిపోయి పరాకుగా ఒంటరిగా కూర్చుని రాముడు బాధపడటం లక్ష్మణుడు చూశాడు.

“అన్నా! పరాక్రమాన్ని విస్మరించి సీతమ్మను తలుస్తూ కూర్చుని చేయాల్సిన కార్యాలన్నీ విస్మరిస్తూ ఉంటే ఏం లాభం వస్తుంది? అన్నా! దైన్యాన్ని వీడి కార్యోన్ముఖుడవు అయ్యే అవసరం ఎంతైనా ఉంది. చిత్తస్థైర్యాన్ని తెచ్చుకొని కర్తవ్యపాలన చేయండి.”

“ఓ రామా! శత్రువులు ఎంతటివారైనా గాని సీతాదేవి చెంతకు రాలేరు. ఎవరైనా అగ్నిలో చేయి పెట్టితే దగ్ధం కాకుండా ఉంటారా? మీరు చింతను వదిలి చేయాల్సిన కార్యాన్ని చేయండి. నేను చెప్పుతున్నానని మరోలా భావించవద్దు” అన్నాడు లక్ష్మణుడు.“అన్నా! నేను! విచారంలో పెద్దలైనా కాస్త ఏమరుపాటున ఉంటారు. వారిని విచారం కుంగదీస్తుంది. అందుకని మీకు నేను చిన్నవాడినైనా అపుడపుడు ఇలా చెప్పాల్సి వస్తోంది. దీనిని మీరు తప్పుగా తలచవద్దు. మీకు బోధించే వానిగా నేను చెప్పడం లేదు. విచారంలో మునిగిన నా అన్నకు బాసటగా ఉండాలన్న ధ్యాసలో ఇవన్నీ చెప్పాను” అని వినయగుణసంపన్నుడైన లక్ష్మణుడు చెప్పాడు.

లక్ష్మణునిమాటలు విని శ్రీరాముడు “లక్ష్మణా! నీవు చెప్పేదంతా యథార్థమే. రాజనీతి యుక్తములే. కానీ నేను సీత విరహాన్ని తట్టుకోలేక విచారిస్తున్నాను. నీవు చెప్పే దానిని నేను తప్పుగా భావించను. సీతాన్వేషణా

కార్యానికి మనం సన్నద్ధులం కావాల్సిందే. నేను దాన్నెందుకు విస్మరిస్తాను? కష్టసాధ్యమైనా సీతాన్వేషణకు మార్గాన్ని గూర్చి ఆలోచిస్తాను. దేవేంద్రుడు తగిన కాలంలో వర్షాలు కురిపించి భూమిని సస్యశ్యామలం చేశాడు.

మేఘాలన్నీ వర్షించి బాగా అలసిపోయి పర్వతాలపైన, వృక్షాలమీద, నగరాలమీద సంచరిస్తూ సేద తీరుతున్నాయి. అర్జునపుష్పాల వాసనను మోస్తూ విజృంభించి వీచిన గాలి ఇప్పుడిప్పుడే శాంతిస్తోంది. ప్రకృతి అంతా అభ్యంగన స్నానం చేసినట్లుగా వర్షధారలతో తడిసి మాలిన్యాన్ని కడిగివేసుకొని పరిశుభ్రంగా అందంగా కనిపిస్తోంది.

ప్రకృతిలో శరత్కాల శోభ అందంగా కనిపిస్తోంది. ఉదయ కిరణాల నులి వెచ్చని తాకిడితో విప్పారే కమలాల కాంతులు అందంగా ఉన్నాయి. అడవి మృగాల పక్షులు వన్యప్రాణులు అన్నీ శరత్కాలపు ఆనందాన్ని చవిచూస్తూ హాయిగా తిరుగాడుతున్నాయి.భోగలాలసతో ఉన్న ఏనుగులన్నీమెల్లగా తిరుగుతున్నాయి. చీకట్లు తొలగిపోయి దిక్కులన్నీ ప్రకాశిస్తున్నాయి. సూర్యుని వేడితో భూదేవి తడిసి ఉన్న తన శరీరాన్ని ఎండబెట్టుకొంటోంది. వృషభాలన్నీ ఆవుల గుంపులో చేరి ఆనందంగా అరుస్తున్నాయి.

వర్షాకాలం ఆగిపోవడంతో పుట్టలో దాగివున్న సర్పాలు చిన్న చిన్న పురుగులు ఆకలితో నకనకలాడుతూ ఆహారం కోసం పరుగులెత్తుతున్నాయి. సంధ్యాసమయం ఆసన్నమై ఆకాశం కాషాయరంగు చీర చుట్టుకొంది. తారలు మిణుకుమంటూ వస్తున్నాయి. పండు వెన్నెల కురుస్తున్న రాత్రిలో ప్రకృతి అంతా తెల్లచీర కట్టిన భామలాగా కనబడుతోంది. వర్షాకాలంలో చిగురించిన రెల్లు గడ్డి శరత్కాలంలో కాస్త పెరిగి గాలికి అటు ఇటూ ఊగుతూ వింత చేష్టలు చేస్తోంది.

తుమ్మెదలు మకరందాన్ని తనివితీరా గ్రోలి ఆనంద పారవశ్యంతో గీతాలు ఆలపిస్తున్నాయి. నది మందగమనంతో సాగుతోంది. వనాలన్నీ సర్వాంగసుందరంగా అలంకరించినట్లుగా కనిపిస్తున్నాయి. ఈ వనాలలో మన్మథుడు పుష్పబాణాలను సంధించి విరహవేదన అనుభవించే జంటలపై దాడి చేస్తున్నాడు. ఏడాకుల పొన్నచెట్లు, ఎర్ర కాంచన చెట్లు, మంకెన చెట్లు కనువిందు చేస్తున్నాయి.

రాజుల జైత్రయాత్రలకు ఇది తగిన సమయం. లక్ష్మణా! సుగ్రీవుడు మన గురించి మరచిపోయినట్లున్నాడు. కనీసం మన దగ్గరకు రాలేదు. సీతాన్వేషణకు పూనుకొన్నట్లుగా కూడా లేదు. నేను సీతావిరహాన్ని భరించలేక పోతున్నాను. ఈ వర్షాకాలం నాల్గుమాసాలు నాకు నూరు సంవత్సరాలు గడిచినట్లుగా అనిపించాయి. సీత నాతో కలిసి ఉద్యానవనానికి వచ్చినట్లుగా ఈ మహారణ్యానికి వచ్చింది.

సౌమిత్రీ! నేను రాజ్యాధికారాన్ని పోగొట్టుకొని అడవుల పాలైనాను. నేడు సీతను కూడా కోల్పోయి విరహంలో మునిగి ఉన్నాను. నాపై ఆ సుగ్రీవునకు కూడా దయ రాలేదు. రావణునిచే వంచితుడు, ఇంటికి దూరంగా ఉన్నాడు. దైన్యంతో నా శరణు జొచ్చాడు. ఏ అండదండలు లేనివారు అని ఆ సుగ్రీవుడు నన్ను చులకన చేస్తున్నాడు.

పరస్పరం సాయం చేసుకొందామని నేను సుగ్రీవుడు ప్రతిజ్ఞ చేసుకొన్నాం. కాని నా సహాయంతో సుగ్రీవుని కష్టం తీరిపోయింది. కాని నేడు సుగ్రీవుడు సహాయం చేయాల్సిన సమయం వచ్చింది. సుగ్రీవుడు మాత్రం సాయం మాట మరిచి మిన్నకుండా ఉన్నాడు.

లక్ష్మణా! నీవు వెంటనే కిష్కింధకు వెళ్ళు. మూర్ఖునిలాగా ఇంద్రియ సుఖాలలో మునిగితేలే సుగ్రీవునితో నా మాటగా చెప్పు. ఉపకారం చేస్తానని మాట ఇచ్చి తప్పటం అధముల లక్షణం. ఆశ కల్పించి వమ్ము చేసిన వాడు నరకానికి వెళ్తాడు. ఇచ్చిన మాటకు కట్టుబడి అశుభానికైనా, శుభానికైనా కట్టుబడి ఉండేవాడే వీరుడు. సహాయం తీసుకొని మరచిపోయిన వారు కృతఘ్నులు. లక్ష్మణా! సుగ్రీవుడు నా బాణపు దెబ్బను రుచి చూడాలని అనుకొంటు న్నాడేమో అడుగు. మరల నా ధనుష్టంకారం వినాలని ఉత్సాహపడుతున్నాడేమో కనుక్కో. మాట తప్పితే వాలికి పట్టిన గతే నీకు పడుతుందని సుగ్రీవుని పనుల వలనే మైత్రి ఏర్పడింది. అవసరాలు అన్నీ తీరిపోయాయి కదా! ఇప్పుడు సీతాన్వేషణకు ఎందుకులే అని అనుకొన్నాడేమో? సఖభోగాలలో మునిగి ఈ నాల్గుమాసాలు గడిచిపోయినట్లు సుగ్రీవునికి తెలియడం లేదేమో? నీవు సుగ్రీవుని దగ్గరకు వెళ్ళి నేను చెప్పిన మాటలన్నీ చెప్పు. వాలి వెళ్ళిన త్రోవ ఇంకా మూయలేదు. చేసిన ప్రతిన మరచిపోతే నీ పరివారంతో సహా వాలి దగ్గరకు వెళ్ళవలసి ఉంటుంది అని చెప్పు. మన కార్యం సానుకూలంగా అయ్యేటట్లుగా చూడు.

"వానరేశ్వరా! ధర్మమే శాశ్వతమైనది. దానిని పాటిస్తూ చేసిన వాగ్దానాన్ని నిలుపుకో" అని చెప్పు అని శ్రీరాముడు సౌమిత్రితో చెప్పాడు. అన్న దీనస్థితి చూసి సుగ్రీవుని ఆలస్యానికి కుపితుడై సుగ్రీవుని శిక్షించాలని లక్ష్మణుడు అనుకొన్నాడు. చేసిన సహాయాన్ని మరిచిన వారిని తప్పక శిక్షించాలని అనుకొన్నాడు.

* * *

# కిష్కింధకు లక్ష్మణుడు వెళ్ళటం

## సర్గ - 31

శ్రీరాముడు సీతాదేవి ఎడబాటుతో దుఃఖంలో మునిగి ఉన్నాడు. సుగ్రీవుని అలసత్వం ఆయనలో కోపాన్ని అధికం చేసింది. అప్పుడు లక్ష్మణుడు "అన్నా! సుఖదుఃఖాలలో పాలుపంచుకోవడం మిత్రుల లక్షణం. కాని, సుగ్రీవుడు మనవల్ల సుఖాలను పొంది కూడా మన విషయం మరిచినట్లు ఉన్నాడు. అందుకే ఆయన ధ్యాస మనవైపు మళ్ళటం లేదు" అని అన్నాడు.

"ఓ రామచంద్రా! సుగ్రీవుడు తుచ్ఛమైన ఇంద్రియసుఖాలలో మునిగి ధర్మమార్గాన్ని మరచిపోయాడు. అందుకే ప్రత్యుపకారం గురించి ఆలోచన లేకుండా ఉన్నాడు. గుణహీనుడు, వీనికి రాజ్యార్హత లేదు. ఇతడు కూడా వాలి మార్గాన్నే అనుసరించాల్సి ఉంటుంది. మాట తప్పిన సుగ్రీవుని నేడే హతమారుస్తారు. అంగదుడు

రాజై వానర ప్రముఖులతో కలిసి మనకు సహాయం చేస్తాడు" అని సౌమిత్రి ఆగ్రహావేశాలతో ముక్కుపుటాలు అదురుతుండగా అన్నాడు.

శ్రీరాముని పలుకులు విని లక్ష్మణుడు కుపితుడై రణావేశంతో ధనుర్బాణాలు ధరించి ఒక్క ఉదుటున లేచాడు. కోపంతో ఊగిపోతున్న లక్ష్మణుని చూచి శ్రీరాముడు "సౌమిత్రీ! వివేకశూన్యంతో మిత్రవధ చేయకు. సహేతుకంగా ఆలోచించి కార్యాన్ని సాధించు. పాపిని శిక్షించువానిని మాత్రమే వీరుడు అని అంటారు. నీవు సత్ప్రవర్తన కలవాడివి. నీవు సుగ్రీవుని విషయంలో కోపం వీడి మైత్రీబంధంతో మాట్లాడు.

సీతాన్వేషణానికి సమయం మించిపోయిందని కటువుగా గాక మృదువుగా సుగ్రీవునికి చెప్పు" అని చెప్పే శ్రీరాముని మాటలు విని లక్ష్మణుడు కిష్కింధానగరానికి వెళ్ళాడు. సుగ్రీవుని హతమార్చాలన్న కోరికను మార్చుకొని అన్న హితంకోసం మాట్లాడాలని తలచి సుగ్రీవుని వద్దకు వెళ్ళాడు. సౌమిత్రి బుద్ధిలో బృహస్పతి వంటివాడు. సుగ్రీవుడు ఏమి చెప్తాడో విని తర్వాత ఏం చేయాలో ఆలోచించి చేద్దామనుకొని వెళ్ళాడు.

సీతాన్వేషణలో సుగ్రీవుని ఆలస్యాన్ని, శ్రీరామునిలో కోపాగ్నిని చూచి లక్ష్మణుడు కుపితుడయ్యాడు. కార్యావసరంవల్ల లక్ష్మణుడు వేగంగా పెద్ద పెద్ద అడుగులు వేస్తూ ముందుకు వెళ్తున్నాడు. ఆయన వేగధాటికి చెట్లు కూడా పరుగెడుతున్నట్లుగా కనిపించాయి. అడ్డం వచ్చే చెట్లను తృటికాలంలో పెరికి అవతల పారవేస్తూ వేగంగా సౌమిత్రి ముందుకు సాగాడు.

నగరద్వారం వద్దకు చేరాడు. లక్ష్మణుని చూసి అక్కడున్న వానరులు భయపడి చెట్లమీదకు ఎగబ్రాకారు. కిష్కింధను చాలామంది సైన్యం రక్షిస్తూ కనిపించారు. వారిని చూడగానే అగ్నిలో ఎండుకట్టెలు వేసినట్లుగా లక్ష్మణునికి కోపం పెరిగింది. అలా కోపంతో మండిపోతున్న లక్ష్మణుని చూసి వానరులందరూ తలోదిక్కుకు పరుగెత్తారు. అందులో కొందరు పరుగెత్తి వెళ్ళి తారతో భోగిస్తున్న సుగ్రీవునికి లక్ష్మణుడు వచ్చాడన్న విషయం చెప్పారు.

కామాసక్తిలో మునిగిన సుగ్రీవుడు వారి మాటలు వినిపించుకోలేదు. అప్పుడు మంత్రులు చెప్పిన మాటప్రకారం వానరులు నగరం వెలుపలకు ఆనందంగా వచ్చారు. గోళ్ళు, దంతాలు ఆయుధాలుగా ఉన్న ఆ వానరులు వికృతంగా కనిపించారు. వారందరూ పెద్దపులి దర్పం కలిగి ఉన్నవారు. వారిలో కొందరు పది ఏనుగుల బలం ఉన్నవారు మరికొందరు 15 ఏనుగుల బలం ఉన్నవారు. ఇంకొందరు వంద ఏనుగుల బలం ఉన్నవారు కూడా ఉన్నారు. వారందరూ చెట్లను చేత పట్టుకొని కిష్కింధను కాపలా కాస్తుండటాన్ని చూసి లక్ష్మణుడు ఆగ్రహించాడు.

లోపలికి వెళ్ళి వచ్చిన వానరులు లక్ష్మణుని ఎదురుగా నిలబడ్డారు. అన్న ఆర్తిని సుగ్రీవుని ఏమరుపాటు గుర్తుకువచ్చిన కొద్దీ సౌమిత్రిలో కోపం పెరుగుతూ పోయింది. కళ్ళు ఎర్రగా మారాయి. పిడికిళ్ళు మూసుకొన్నాయి. ముక్కునుంచి వేడి గాలులు వస్తున్నాయి. మహాసర్పంలాగా లక్ష్మణుడు బుసకొట్టుతున్నాడు. అంతలో లక్ష్మణుని చెంతకు అంగదుడు వచ్చి ఆయన కోపం చూచి వణికిపోయాడు.

లక్ష్మణుడు అంగదుని చూచి “నాయనా! అంగదా! నేను వచ్చానని నీ పినతండ్రి అయిన సుగ్రీవునికి చెప్పు. అన్న దుఃఖానికి పరితపిస్తూ లక్ష్మణుడు ద్వారం దగ్గరకు నీ కోసం వేచి ఉన్నాడని చెప్పు. లక్ష్మణుని తీసుకొని నీ వద్దకు రావాలా? లేక నీవే సౌమిత్రి దగ్గరకు వస్తావా? అని మాత్రమే అడిగి రా” అని చెప్పాడు. ఆ మాటలు విని అంగదుడు ఎంతో బాధపడ్డాడు. సౌమిత్రి మాటలు సుగ్రీవునకు చెప్పాలనుకొని లోపలకు వెళ్ళాడు.

సుగ్రీవుని దగ్గరకు వెళ్ళి అంగదుడు సుగ్రీవునకు, తారకు, రుమకు నమస్కరించి సౌమిత్రి వచ్చినట్లు చెప్పాడు. సుగ్రీవుడు మితిమీరి మధుపానం చేయడంవలన మత్తులో ఉండి అంగదుని మాటలు వినలేదు. అక్కడున్న వానరులందరూ పరిస్థితిని చూచి చాలా భయపడిపోయారు. ఏం చేయాలో తోచక వానరులందరూ పెద్దగా అరిచారు. ఆ అరుపుకు సుగ్రీవునికి మెలుకువ వచ్చింది. ఆయన కళ్ళు ఎర్రగా ఉన్నాయి. ఆయన ధరించిన ఆభరణాలన్నీ చెల్లాచెదరుగా ఉన్నాయి.

అంగదుడు వెళ్ళి ప్లక్షుడు, ప్రభావుడు అనే వానరప్రముఖులను ఇద్దరిని తీసుకొని వచ్చాడు. వారు దూరదృష్టి కలవారు. మొదట వారు లక్ష్మణుని ప్రశంసించారు. ఆ తర్వాత సుగ్రీవుని దగ్గరకు వెళ్ళి విస్పష్టంగా ప్రేమగా మాట్లాడారు. “ రాజా! రామలక్ష్మణులు సత్యసంధులు. రాజ్యపాలనా దురంధరులు. వీరు మీకు రాజ్యాన్ని ప్రసాదించారు. లక్ష్మణస్వామి ధనుర్ధారుడై ద్వారం దగ్గరకు వచ్చి ఉన్నాడు. ఆయనను చూసి వానరులందరూ భయపడిపోతున్నారు.

లక్ష్మణుని దగ్గరనుండి అంగదుడు సందేశాన్ని మోసుకొచ్చాడు. సౌమిత్రి కోపంలో వానరులను దగ్ధం చేస్తాడేమోనన్నట్లుగా ద్వారం దగ్గర వేచి ఉన్నాడు. సుగ్రీవా! మీరు వెంటనే మీ పరివారంతో వెళ్ళి ఆయనకు నమస్కరించండి. ఆయన కోపాన్ని చల్లార్చుము. ఓ రాజా! శ్రీరాముని ఆదేశాన్ని శిరసావహించి మీరు చేసిన ప్రతిజ్ఞను ఆచరించండి. మీరు చేసిన వాగ్ధానానికి బద్ధులై సంచరించుము. భోగలాలసత్వాన్ని వీడి జరుగుతున్న సంగతిని అవలోకించుము.

నేడు రామాదులు బాధలు అనుభవిస్తున్నారు. మనందరి విచారాన్ని రూపుమాపి వారు ప్రత్యుపకారంకోసం చూస్తున్నారు. లక్ష్మణునికి వారి అన్న పై అత్యంత అనురాగం ఉంది. ఆయన దుఃఖాన్ని సౌమిత్రిని చూడలేదు. ఒకవేళ మనం వారికి సేవ చేయడంలో ఆలస్యం జరిగితే మనలను క్షమిస్తాడని మాకు అనిపించడంలేదు. నేడు మన ఉపకారంకోసం మన వాకిట వేచిఉన్న లక్ష్మణునిని చూస్తే ఈ సంగతి అర్థం అవుతుంది. సుగ్రీవా! మనందరి మేలు కోరి మేము మీకు చెప్పుతున్న విషయం పై దృష్టిని నిలుపుము అని వారు సుగ్రీవునికి హితవు చెప్పారు.

* * *

# హనుమంతుని బోధ

## సర్గ - 32

లక్ష్మణుడు కుపితుడై ఉన్నాడని అంగదునిచే విని సుగ్రీవుడు భయపడి ఆసనం నుండి దిగ్గున లేచాడు. సుగ్రీవుడు శ్రీరాముని ఔన్నత్యాన్ని తన అల్పత్వాన్ని తెలుసుకొన్నాడు. ఆలోచనాపరుడైన మంత్రులతో సుగ్రీవుడు ఇలా చెప్తున్నాడు. "వానరప్రముఖులారా! నేను ఎప్పుడు సౌమిత్రిని గూర్చి పరుషంగా మాట్లాడలేదు. నేను ఆయనకు ఏ విధంగాను అపకారం చేయలేదు. మరి ఆ మహాత్ముడు నాపై కోపగించడానికి కారణం ఏమై ఉంటుంది. కుటిలాత్ములెవరైనా నా దోషాలను వెదకి ఆయనకు నాపై చెప్పారేమో. అందువలనే లక్ష్మణునికి నాపై కోపం వచ్చి ఉంటుంది. కావున మీరు బుద్ధిబలంతో బాగా ఆలోచించి లక్ష్మణునికి ఎందుకు కోపం వచ్చిందో తెలుసుకొని నాతో చెప్పండి" అని చెప్పాడు. నాకు రామలక్ష్మణులవలన భయం లేదు గదా! మిత్రుడినైన నాపై వారి అకారణ కోపం చూసి నాకు ఆందోళన కలుగుతోంది. మిత్రుని సంపాదించడం సులువే కాని మిత్రత్వాన్ని నిలుపుకోవడం చాలా కష్టం. ఎందుకంటే మతి మాటిమాటికి మారుతుంది కదా! ఏ చిన్న సంఘటన ఐనా మనస్సును మార్చివేయవచ్చు. రాముడు నాకు మహోపకారం చేసి ఉన్నాడు. దానికి నేను ఎల్లప్పుడు ఆయనకు ఋణపడి ఉంటాను. ఆయనవల్ల నేను పోగొట్టుకొన్న సంపదలు తిరిగి నాకు దొరికాయి. కాని ఆయనకు తిరిగి నేను ఉపకారం చేయలేకపోతున్నాను. అందుకే నాకు భయాందోళనలు కలుగుతున్నాయి" అని సుగ్రీవుడు అన్నాడు. సుగ్రీవుని మాటలు విన్న హనుమంతుడు ఇలా చెప్పాడు. "మహారాజా! నీ హితం కోరి చెప్తున్నాను. మీకు రాముడు మహోపకారం చేసిన మాట నిజమే. అది మీరు గుర్తుపెట్టుకోవడంలో ఏమంత ఆశ్చర్యం లేదు. శ్రీరాముడు లోకాపవాదం వస్తుందనే ఆలోచన లేకుండా వాలిని సంహరించాడు. శ్రీరాముడు మీకు స్నేహితుడు. మీరు చేస్తున్న పనివల్ల కోపం తెచ్చుకొన్నాడు. అందుకే తన తమ్ముణ్ణి మీ దగ్గరకు పంపాడు. మీరు గుర్తించడం లేదు కాని అందమైన శరత్కాలం వచ్చేసింది. మీరు ఆలోచనలలో శ్రేష్ఠులైఉండి కూడా సుఖాలలో మునిగి కాలాన్ని గుర్తించలేదు. ఇప్పుడు ప్రశాంతవాతావరణం నెలకొని ఉంది. సీతాన్వేషణానికి ఇది సరియైన సమయం. మీరు ఈ విషయం మరిచిపోయారని లక్ష్మణుడు ఆగ్రహిస్తున్నాడు. మహాత్ముడైన శ్రీరాముడు ధర్మపత్నిని పోగొట్టుకొని దుఃఖంలో ఉన్నాడు. ఆయన ఆవేదనలో తమ్మునితో చెప్పి పంపిన విషయాలు పరుషంగా ఉన్నా మీరు విని తీరాలి. మీరు ఆయన విషయంలో కాలాన్ని గుర్తించక అపరాధం చేసి ఉన్నారు. కావున వెంటనే వెళ్ళి ఆ లక్ష్మణుని ప్రసన్నునిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇది తప్ప మరొక దారి నాకు కనిపించడంలేదు. నేను మీ హితం కోరి ఉన్న విషయం చెప్పాను. ఆ శ్రీరాముడు కోపగిస్తే ఆయన ధాటికి ముల్లోకాలు గడగడలాడుతాయి. దేవతలు, గంధర్వులు, రాక్షసులు ఎవరైనా ఆయన ముందు తలవంచాల్సిందే. ఆయనకు కోపం తెప్పించడం మంచిది కాదు. మీరు మీ కొడుకైన అంగదునితో వెళ్ళి బంధు మిత్రులతో కూడి లక్ష్మణునికి శిరసా ప్రణమిల్లి ఆయనకు విధేయుణ్ణని చెప్పండి. వారి శాసనాన్ని ఎవ్వరూ ఉల్లంఘించలేరు. ఆ మహాపురుషుల బలం మీకును తెలియును అని హనుమంతుడు సుగ్రీవునకు చెప్పాడు.

* * *

# తార లక్ష్మణుల సంభాషణ

## సర్గ - 33

అంగదుడు లక్ష్మణుని నగరంలోకి రమ్మని ఆహ్వానించాడు. అక్కడున్న ద్వారపాలకులు లక్ష్మణునికి నమస్కారం చేశారు. రమ్యమైన కిష్కింధనంతా చూస్తూ లక్ష్మణుడు ముందుకు సాగాడు. ఆ కిష్కింధలో అందమైన రాజభవనాలు వనాలు జలాశయాలు కనిపించాయి. నిండుగా పుష్పించిన పూలతో ఫలాలతో ఉన్న వనాలు అందంగా కనిపించాయి. భవనాలన్నీ రత్నవజ్రవైఢూర్యాదిమణులతో పొదిగి నిర్మించి ఉన్నారు.

వీధులన్నీ విలువైన వస్తువులుగల అంగళ్ళతో నిండి ఉన్నాయి. వానరులందరూ దేవతలు, గంధర్వులవల్ల జన్మించి చూడడానికి అందంగా కనిపిస్తున్నారు.

రాజవీధులన్నీ చందనాది సుగంధాలతో, మధువులతో గుబాళిస్తూ ఉన్నాయి. సెలయేళ్ళు, తటాకాలు అక్కడక్కడా కమలాలు తామరలతో అందంగా కనిపిస్తున్నాయి. అంగదుడు, మైందుడు, ద్వివిదుడు లాంటి వానర ప్రముఖుల భవనాలు దృఢంగా అందంగా దేదీప్యమానంగా ఉండడం లక్ష్మణుడు చూశాడు. దివ్య మాలలతో అలంకరించిన భవనాలు ధనధాన్యాదులతో సమృద్ధిగా ఉన్నాయి.

సుగ్రీవుని భవనం ఇంద్రుని భవనంలాగా తెల్లని కాంతితో మెరిసిపోతోంది. ఆ భవనానికి చుట్టూ అందమైన మధురఫలాలు ఉన్న చెట్లు ఏపుగా ఉన్నాయి.

ఇంద్రుడు ప్రసాదించిన మహావృక్షాలు చల్లని నీడలనిస్తూ ఉన్నాయి. ఆ భవనం చుట్టూ బలిష్ఠులైన వానరులు కాపలా కాస్తూ ఉన్నారు. సుగ్రీవుని గృహంలోకి మేఘముల మధ్య సూర్యునిలాగా లక్ష్మణుడు ప్రవేశించాడు. ఏడు కక్ష్యలను దాటి లక్ష్మణుడు లోపలికి వెళ్ళాడు. సురక్షితంగా ఉన్న ఒక అంతఃపురంలోకి వెళ్ళాడు. అక్కడ మంచి మంచి ఆసనాలు ఉన్నాయి. అక్కడకు వెళ్ళగానే మధురమైన సంగీతం ఆయనకు వినిపించింది. వీణ వేణువు లాంటి తంత్ర వాద్యాలతో కూడిన గానం కూడా సౌమిత్రికి వినిపించింది.

అక్కడ చక్కని రూపలావణ్యాలున్న స్త్రీలు చాలామంది కనిపించారు. వారు ఉత్తమ వంశానికి చెందినవారిలాగా కనిపించారు. మేలైన ఆభరణాలు ధరించి ఫలాలను పేర్చుతున్నారు. సుగ్రీవుని అనుచరులు కనిపించారు. వారందరూ సంతృప్తిగా ఉన్నారు. మంచి వస్త్రాభరణాలను ధరించి ఉన్నారు.

పనిలో ఆసక్తిని కలిగి ఉన్నారు. వారిలో ఎవరూ కార్యభారాన్ని మోయలేనివారు కనబడలేదు. అలా వెళ్తున్న లక్ష్మణునికి కాలి అందెల సవ్వడులు గాజుల గలగలలు వినిపించాయి. వెంటనే లక్ష్మణుడు ఆగిపోయాడు. లోపలికి వెళ్ళడానికి సందేహించాడు. ఆభరణాల ధ్వనులు వినిపించడంతో చాలా కోపం వచ్చింది. వెంటనే ధనుష్టంకారం చేశాడు. శ్రీరాముని తలచుకొని స్త్రీలు లేనిచోటకు వెళ్ళి అక్కడ నిలబడ్డారు.

ధనుష్టంకారం విని సుగ్రీవుడు భయంతో దిగ్గున లేచాడు. అంగదుడు చెప్పినది నిజమే. లక్ష్మణుడు కోపంగా ఉన్నాడు అని సుగ్రీవుడు అనుకొన్నాడు. భయంతో సుగ్రీవుని మొహం వెలవెలబోయింది. తారను చూసి సుగ్రీవుడు "ఓ సుందరీ! లక్ష్మణుడు సహజంగా మృదుస్వభావి. కాని, ఇప్పుడు చాలా కోపంతో వచ్చినట్లున్నాడు. ఆయనకు కోపం ఎందుకు వచ్చిందో త్వరగా ఆలోచించి చెప్పు. మనం ఆయనకు ఏదైనా అపచారం చేసి ఉన్నావేమో ఆలోచించి చెప్పు. లేకపోతే నీవే వెళ్ళి ఆయనను మంచి మాటలతో అలరించి స్వాగతించి తీసుకొనిరా!

మహాత్ములు స్త్రీలపై కోపగించరు గదా! కమలముల వంటి నేత్రద్వయంగల లక్ష్మణుడు నిన్ను చూసి నీ మాటలు వినడంతోనే ప్రసన్నుడవుతాడు. ఆయన కోపం తగ్గిన తర్వాత నేను ఆయన దగ్గరకు వస్తాను" అని అన్నాడు. సుగ్రీవుని మాట ప్రకారం మధువును సేవించి ఉన్న తార లక్ష్మణుని చెంతకు వెళ్ళింది. అప్పుడు మత్తువల్ల ఆమె కన్నులు మూతపడుతూ ఉన్నాయి. ఆమె నడుముకు వడ్డాణం ఉంది. ఆమెను చూసి లక్ష్మణుడు కోపం పనికిరాదని తలచి శాంతం వహించి ఊరుకొన్నాడు.

మధువు త్రాగి ఉన్నందువల్ల, లక్ష్మణుని ప్రసన్నమైన ముఖం చూడడంవలన స్త్రీలకు సహజంగా ఉండే బిడియాన్ని వదిలివేసింది. లక్ష్మణుని కోపాన్ని పోగొట్టాలని తలచి ఇలా మాట్లాడింది. "రాజకుమారా! మీ కోపానికి కారణం ఏమిటి? మీ ఆజ్ఞను పాటించనివాడు బ్రతికి ఉండగలడా? దావాగ్నికి ఎవరైనా ఎదురు వెళ్ళగలరా?" అని అడుగుతున్న తార మాటలకు సౌమిత్రి కోపం కాస్త చల్లారింది. ఆమెతో నిస్సంకోచంగా లక్ష్మణుడు – "భర్త హితం కోరే తారా! నీ ప్రభువు సుఖభోగాలలో తేలియాడుతూ ధర్మార్థాలను మరిచాడు. నీవు ఈ విషయం గుర్తించినట్లు లేదు. సుగ్రీవుడు మధుపానలాలసుడై శోకంలో మునిగిన మమ్మల్ని మరిచిపోయాడు. రాజ్యప్రయోజనాన్ని కూడా విస్మరించాడు.

నాల్గు నెలల తర్వాత సీతాన్వేషణ చేస్తానని మాట ఇచ్చాడు. కాని మదమత్తుడై అవధి మించిపోయిందని తెలుసుకోలేకపోతున్నాడు. సన్మార్గంలో నడిచేవారు మధుపానానికి దాసులు కారాదు. ఉపకారం పొంది ప్రత్యుపకారాన్ని చేయనివారు శిక్షార్హులు అవుతారు. గుణవంతుడైన మిత్రుని పోగొట్టుకోవడం కూడా జరుగుతుంది. ధర్మమార్గాన్ని అనుసరించేవారు ఇచ్చిన మాటను మరవకూడదు. నీ ప్రభువు ఈ విషయాలు మరిచిపోయాడు.

ఓ తారా! అన్నీ తెలిసినదానివి. మా కోసం సుగ్రీవుడు ఏం చేయాలో నీవే చెప్పు" అని అడిగాడు. తార లక్ష్మణుని మాటలలోని యథార్థాన్ని గుర్తించింది. ధర్మం తెలిసినది కాబట్టి సీతాన్వేషణలో కాలాతీతం అయ్యినట్లు గుర్తించింది. సౌమిత్రికి విశ్వాసం కలిగేటట్లుగా మాట్లాడాలనుకొంది.

"రాజకుమారా! ఇది కోపగించాల్సిన సమయం కాదు. ఆత్మీయులపైన కోపం తగదు. మీ కార్యాన్ని గురించి ఆలోచన మా ప్రభువు మనస్సులో మెదులుతూనే ఉంది. ఆయనవల్ల జరిగిన పొరపాటుకు మీరు క్షమించండి. పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలాగా మహా పరాక్రమశాలురైన మీరు సుగ్రీవునిపై కోపగించడం బాగాలేదు.

మీరు కార్యశూరులు. మీ వంటివారు కోపానికి వశులు కాకూడదు. నాకు శ్రీరాముని బలపరాక్రమాలు బాగా తెలుసు. సీతాన్వేషణకు కాలయాపన జరిగిందనీ నాకు తెలుసు. మీరు సుగ్రీవునకు చేసిన మహోపకారం

కూడా నాకు గుర్తుంది. ఓ నరవరా! మహర్షులు సైతం కామానికి వశులై ప్రవర్తిస్తారు. వానరుడైన సుగ్రీవుడు చపల స్వభావంతో భోగలాలసుడై ఉన్నాడు. దానివల్ల సీతాన్వేషణకు ఆయన పూనుకోలేదని నాకు తెలుసు. కాలయాపన చేశాడని నాకు తెలుసు.

కామపరవశులకు కాలం గురించి కాని ధర్మార్థాలను గురించి కాని తెలీదు. సుగ్రీవుడు కామాసక్తుడై నా వద్దనే ఉన్నారు. సుగ్రీవుడు మీకు సోదరునివంటివాడు. ఆ ప్రభువును మీరు క్షమించాలి." అని తార లక్ష్మణుని ప్రార్థించింది. "లక్ష్మణస్వామీ! సుగ్రీవుడు సుఖాలకు దాసుడై ఉన్నా కూడా మీ విషయాన్ని సాధించడానికి నలుమూలలనుండి వానరులను సమీకరిస్తున్నారు.

ఆయన ఆదేశాన్ని అనుసరించి కోట్లకొద్దీ వానరులు కామరూపులు మహాయోధులు సీతాన్వేషణలో సాయం చేయడానికి వచ్చి ఉన్నారు.

ఓ మహానుభావా! మీరు స్త్రీలు ఉన్నారని ఇక్కడ నిలచి ఉన్నారు. దీనివల్ల మీరు మంచి నడవడి కలవారని తెలుస్తోంది. పర స్త్రీలను సోదరీభావంతోనో, లేక మాతృభావంతోనో చూసేటప్పుడు వారి దగ్గరకు రావడంలో సంకోచం ఏమీ అక్కరలేదు. దోషం కూడా లేదు. మీరు ఆలోచించక మా అంతఃపురంలోకి రండి" అంటూ తార లక్ష్మణుణ్ణి ఆహ్వానించింది.

తార ప్రేరణతోను, కార్యాన్ని త్వరగా చేయాలన్న ఆత్రంతోను లక్ష్మణుడు అంతఃపురంలోకి వెళ్ళాడు. అన్న దుఃఖాన్ని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా తొందరగాపోగొట్టాలన్న ధ్యాసతో సౌమిత్రివడివడిగా వెళ్లాడు.

వజ్ర వైడూర్యాది మణులు పొదిగి బంగారుతో చేసిన సింహాసనం మీద సూర్యుడిలాగా సుగ్రీవుడు కూర్చుని ఉన్నాడు. సుగ్రీవుడు దివ్యాభరణాలు వేసికొని ఉన్నాడు. ఆయన చుట్టూ అమూల్య ఆభరణాలు వస్త్రాలు ధరించిన స్త్రీలు కూర్చుని ఉన్నారు. నవరత్నకచితమైన సింహాసనం మీద కూర్చుని భోగాలు అనుభవించడం చూచి, తను అన్నకు ఇచ్చిన మాట తప్పి ఇక్కడ భోగాలలో పరవశుడై ఉండడం చూచి లక్ష్మణునిలో ఆగ్రహం పెల్లుబికింది.

విశాలమైన కన్నులు, బంగారు వన్నెతో ఉన్న సుగ్రీవుడు ఉన్నతాసనం మీద రుమతో కలిసి ఉండడం లక్ష్మణుడు చూచి కుపితుడు అయ్యాడు. లక్ష్మణునిలో ఆవేశం పెరిగి ముక్కు పుటాలు అదురుతున్నాయి. ఉశ్చ్వాసనిశ్వాసాల వేగం పెరిగింది. వదనం అంతా పొక్కుతీసిన కందగడ్డలా అయింది. నిప్పులు కురుస్తున్న కన్నులతో రోషావేశుడైన లక్ష్మణుణ్ణి సుగ్రీవుడు చూశాడు.

* * *

# లక్ష్మణుని మందలింపు

## సర్గ - 34

లక్ష్మణుని చూడగానే సుగ్రీవుని మత్తు దిగిపోయింది. వెంటనే ఆసనం నుండి దిగ్గున లేచాడు. అన్న కోసం పరితపిస్తూన్న లక్ష్మణుని చూడగానే సుగ్రీవుడు జావకారిపోయాడు. సుగ్రీవుడు ఎగిరి లేవగానే ఆయనతో ఉన్న స్త్రీలందరూ ఒక్కసారిగా లేచి నిలబడ్డారు. మత్తుతో ఎర్రబారిన కన్నులున్న సుగ్రీవుడు దోసిలొగ్గి లక్ష్మణుని దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. నక్షత్రాలతో కూడి ఉన్న చంద్రునిలాగా రుమ మొదలగు స్త్రీలతో పరివృతుడై ఉన్న సుగ్రీవుని లక్ష్మణుడు చూశాడు.

"సుగ్రీవా! ధైర్యశాలి, ఉత్తమ వంశసంజాతుడు, ఇంద్రియ నిగ్రహం కలవాడు, దయ ఉన్నవాడు మాత్రమే రాజపదవికి అర్హుడు. అధర్మపరుడు, ఇచ్చిన మాట మరచి భోగాలలో మునిగేవాడు, గౌరవాదరాలకు అనర్హుడు. అంతేగాదు శిక్షార్హుడు కూడా అన్నాడు. గుర్రం దానం ఇస్తానని ఇవ్వనివాడు, నూరు గుర్రాలను చంపిన పాపాన్ని పొందుతాడు. గోమాత విషయంలో అబద్ధం చెప్పితే వేయి గోవులు చంపిన పాపం చుట్టుకొంటుంది. తోటి మానవునికి సహాయం చేస్తానని మాట ఇచ్చి నెరవేర్చని వానికి బంధువులను చంపిన పాపం అంటుకుంటుంది.

శ్రీరామునికి మాట ఇచ్చి తప్పినవాడు రౌరవాది నరకాలను అనుభవించక తప్పదు. ఓ వానరరాజా! ఉపకారం పొంది కూడా ప్రత్యుపకారం చేయనివాడు కృతఘ్నుడు. అంతేగాక వధార్హుడు కూడా. చేసిన మేలు మరచినవాడు అందరిలో జీవించి ఉండి కూడా చచ్చినవానితో సమానం అని బ్రహ్మదేవుడే చెప్పాడు. మద్యపానం చేసినవారు, బ్రహ్మహత్యకు పాల్పడినవారు, దొంగలు, వ్రతభంగం చేసినవారు ప్రాయశ్చిత్తం ద్వారా పాపం నుంచి విముక్తులు అవుతారు. కాని కృతఘ్నుని పాపం ఆ విధంగా కూడా పోదు. సుగ్రీవా! నీవు సహాయం అందుకొని సుఖాలు అనుభవిస్తూ ఇచ్చిన మాటను మరచిన కృతఘ్నుడివి. నీవు ఇలాంటి వంచకుడవని శ్రీరాముడు అనుకోలేదు.

శ్రీరాముని వలనే నీకు రాజ్యం, భోగం దక్కింది కాని ఆ విషయం మరిచావు. శ్రీరాముడు ఏ పనినైనా అవలీలగా చేయగలడు. వాలి వెళ్ళిన మార్గాన నీవు వెళ్ళాలనే ఆలోచనలో ఉన్నట్లున్నావు. శ్రీరాముని బాణ తీవ్రత గురించి నీకు తెలియునుగదా, నీవు అనుభవిస్తున్న సుఖాలు శాశ్వతాలు అని భ్రమపడుతున్నావు. అందువలన సీతాన్వేషణ గూర్చి మరచినట్లు కనిపిస్తోంది" అని లక్ష్మణుడు సుగ్రీవుని మందలించాడు.

* * *

# తార లక్ష్మణుని శాంతింపజేయటం

## సర్గ - 35

**కో**పావేశంతో మాట్లాడే లక్ష్మణుని తార చూసింది. "ఓ సౌమిత్రీ! శాంతించు. మీ మిత్రుడు మీ సోదర సమానుడైన ఈ వానర రాజును ఇలా కఠినంగా మాట్లాడటం మంచిదికాదు. ఈ వానర ప్రభువైన సుగ్రీవుడు కృతఘ్నుడు కాదు. వంచించువాడు కాని అసత్యవచనుడు కాని కాదు. ఇతడు మృదుస్వభావం ఉన్నవాడు. శ్రీరాముడు చేసిన మేలును నిత్యం తలుస్తున్నవాడు. పరంతపా! మీ సోదరుల వల్లనే ఈ అసామాన్యమైన వానర రాజ్యాన్ని, రుమను, నన్ను, సుగ్రీవుడు పొందగలిగాడు.

లక్ష్మణ స్వామీ! సుగ్రీవుడు చాలాకాలం కష్టాలను అనుభవించాడు. అందుకే ఇప్పుడు సుఖాలను చూసి వాటిపై మోహం విడువలేక ఉన్నాడు. విశ్వామిత్రుడు మహాతపఃశాలి. అటువంటి మహర్షి కూడా ఘృతాచిపై అనురక్తి కలిగి పది సంవత్సరాల కాలాన్ని ఒక్క రోజులాగా తలచాడు. అటువంటి సదాచారసంపన్నులు తపః సంపన్నులే కామానికి దాసులైపోతారు. అటువంటిది వానరుడు ఎన్నో కష్టాలు అనుభవించినవాడు కామానికి దాసుడు అవడంలో వింత ఏముంది? ఓ పురుషోత్తమా! బ్రహ్మచే సృష్టించబడిన ప్రాణులకు ఆహారం నిద్ర దాంపత్య సుఖం అన్నీ సహజదేహధర్మాలు. ఆపదలలో ఉన్న సుగ్రీవునికి ఇవి ఏవీ దొరకలేదు. రామానుగ్రహంవల్ల నేడు ఆపదలు దూరం అయ్యాయి. సుఖాలు చేరువ అయ్యాయి. సుఖాలను చవి చూసిన వానరేంద్రుడు వాటిపై వ్యామోహాన్ని పెంచుకొన్నాడు. నేడు ఆ వ్యామోహంలో చిక్కుకొని బయటకు రాలేక తపిస్తున్నాడు. మీరు ఇతనిని క్షమించి వదిలివేయండి. పురుషశ్రేష్ఠా! అంతరార్థం తెలుసుకోకుండా క్రోధం తెచ్చుకోకూడదు. సుగ్రీవుని పక్షాన మేమందరం మిమ్ముల్ని త్రికరణ శుద్ధిగా క్షమించమని వేడుకొంటున్నాం. ధర్మజ్ఞా! మమ్ము అనుగ్రహించు. శ్రీరామునికి ప్రీతి కూర్చుటకు సుగ్రీవుడు ఈ వానర రాజ్యాన్ని, రుమను, నన్ను కూడా పరిత్యజించగలడు. ఈ ప్రభువు రావణునితో పోరాడి రోహిణిని చంద్రునితో కూర్చినట్లు సీతాదేవిని రామునకు అప్పగిస్తాడు.

లక్ష్మణా! రావణుడు లంకాధిపతి. అక్కడ కామరూపవిద్య తెలిసిన రాక్షసులు వేలకొలది ఉన్నారు. వారినందరిని జయించిన తర్వాతే సీతాదేవిని మనం కనుగొనగలం. ఎవరి సహాయం లేకుండా రావణుని ఎదిరించడం సుగ్రీవునికి అసాధ్యం. అందుకని వానరసేనను సమీకరిస్తున్నాడు. కటిక దుర్మార్గుడైన రావణుని తుదముట్టించడం చాలా కష్టమైన పని. నాకు వాలి చెప్పగా విని రావణుని గురించి తెలిసింది. ఆయన లంకలో వేలకొలది రాక్షసులున్నారు. వానర యోధుల సమీకరణం కానందున శ్రీరాముని దగ్గరకు సుగ్రీవుడు రాలేదు. ఓ లక్ష్మణా! వానరవీరులందరూ నేడే రావలసి ఉంది. వారందరూ రాముని దగ్గరకు తప్పక వస్తారు. కోపం విడిచిపెట్టండి. వానరాగమనం తరువాత శ్రీరాముని దగ్గరకు రావాలని, అపుడయితే ఇచ్చిన మాటను నిలబెట్టుకొంటున్నానని చెప్పవచ్చు అని సుగ్రీవుడు కాలయాపన చేశాడు. అసలే వానర స్త్రీలు రావాలని తలచి బాధలో ఉన్నారు. ఇప్పుడు మీ కోపం చూసి వారందరూ ఎంతో భయానికి లోను అవుతున్నారు" అని తార లక్ష్మణుని అనునయించింది.

* * *

# సుగ్రీవుడు రాముని ప్రశంసించటం

## సర్గ - 36

**తా**ర ధర్మబద్ధంగా చెప్పే మాటలు సౌమిత్రి మౌనంగా విన్నాడు. లక్ష్మణుడు ప్రసన్నచిత్తుడయ్యాడని సుగ్రీవుడు తెలుసుకొన్నాడు. తనలోని భయాన్ని స్నానానంతరం తడిబట్టను విడిచినట్లుగా పోగొట్టుకున్నాడు. సుఖభోగాలకు చిహ్నంగా ధరించిన మాలలన్నీ త్రెంచేశాడు. సుగ్రీవుడు పూర్తిగా మత్తునుంచి బయటపడ్డాడు. "ఓ సౌమిత్రీ! రామానుగ్రహంవల్ల నాకు రాజ్యం, కీర్తిప్రతిష్ఠలు దొరికాయి. ఇలాంటి మహోపకారం చేసిన ఆ శ్రీరామునికి నేను ఏమి ప్రత్యుపకారం చేసినా నా రుణం తీరదు.

శ్రీరాముడు తన పరాక్రమంతో రావణుని సంహరించి సీతాదేవిని పొందగలడు. ఆ ప్రభువుకు నా సహాయం నిమిత్తం మాత్రమే. ఒక్క బాణంతో ఏడు తాళ వృక్షాలు ఛేదించి భూమిని బ్రద్దలు చేసిన ఆ మహావీరునకు నేను చేసే సహాయం ఏపాటిది? శ్రీరాముని ధనుష్టంకారానికి పర్వతాలు నదులు భూమి అంతా కంపించిపోయింది. అట్టి అసహాయశూరునికి ఎవరి సహాయం కావాలి?

రావణుని హతమార్చే జైత్రయాత్రలో శ్రీరాముని వెంట నేను ఉంటాను. ఆ స్వామి నీడలో ఉంటే నేను ఆ రాముని అండ చూసుకొని కొద్దిగా హద్దుమీరి ప్రవర్తించానేమో. నన్ను క్షమించండి. ఈ లోకంలో తప్పుచేయనివారు ఎవరూ ఉండరు కదా!" అలా మాట్లాడుతున్న సుగ్రీవుని చూచి లక్ష్మణుడు ప్రసన్నుడు అయ్యాడు. "వానరేంద్రా! మీవంటి వినయగుణసంపన్నుడు తోడుగా ఉన్నప్పుడు శ్రీరామునకు వచ్చిన భయమేమి ఉంది. మీరు ఆయనకు కుడిభుజం లాంటివారు. సుగ్రీవా! నీవు నిష్కపటివి. నీవు సర్వసుఖాలను పొందే వీలున్న అర్హుడివి. ప్రతాపశాలి ఐన శ్రీరాముడు మీ సహాయంతో త్వరలోనే శత్రువులను మట్టికరిపించగలడు. సుగ్రీవా! నీవు ధర్మాలను బాగా తెలిసి ఉన్నవాడివి. నీవు సముచితంగా మాట్లాడుతున్నావు. వానరశ్రేష్ఠా! నీవు మా అన్న తప్ప ఎవరైనా తమ తప్పులను గుర్తించగలరా? బలపరాక్రమాలందు నీవు కూడా శ్రీరాముని అంతటివానివి. దైవానుగ్రహంవల్ల నీ సహాయం మాకు దొరికింది.

సుగ్రీవా! నీవు నాతో కూడా బయలుదేరి వచ్చి భార్యావియోగంలో మునిగి రోజురోజుకీ కృశించిపోతున్న మీ మిత్రుని ఓదార్చు. శ్రీరాముడు వ్యాకులచిత్తంతో మాట్లాడిన మాటలు నాలో తీవ్ర ఆవేదనను కలిగించాయి. ఆ ఆవేదనవలన పరుషంగా మాట్లాడి నిన్ను నొప్పించాను. నన్ను క్షమించు. నా మాటలను మరచి నన్ను నీ సోదరునిగా తలచు. నేను మా అన్న వ్యాకులతలో ఉండడాన్ని నేను చూడ లేక నిన్ను నీ స్త్రీ జనాన్ని బాధకు గురి చేశాను. భోగ లాలసత్వంలో మునిగి నీవు మమ్ములను మరిచిపోయావనే చింత నన్ను నిలవనీయలేదు. అందుకే నేను నిన్ను నొప్పించాను" అని లక్ష్మణుడు సుగ్రీవునితో చెప్పాడు. లక్ష్మణుని మాటలకు సుగ్రీవుని కనులలో నీరు నిండింది. సుగ్రీవుడు సౌమిత్రిని ఆనందంగా "మీ భ్రాతృ ప్రేమ గొప్పది" అని అంటూ కౌగిలించుకుని "సోదరా! నా ఆలస్యాన్ని మీరే పెద్ద మనసుతో క్షమించాలి. శ్రీరాముని దుఃఖాన్ని మనిద్దరం కలసి దూరం చేద్దాం అని చెప్పాడు.

* * *

# వానర ప్రముఖులు రావడం

## సర్గ - 37

లక్ష్మణుడు మాటలు సుగ్రీవుడు విన్నాడు. ప్రక్కనే ఉన్న హనుమంతుని చూచి "హనుమంతా! మహేంద్ర గిరి, హిమవత్పర్వతం, వింధ్యాచలం, కైలాస పర్వతంపై ఉన్న వానరులందరిని తీసుకొనిరావాలి.

పడమర దిక్కున సముద్రప్రాంతాలలోని వానరులను, సంధ్యారుణకాంతులతో విలసిల్లే ఉదయగిరి ప్రాంతంలోని వానరులను, అంజనాద్రి పైన ఉన్న వానరులను, మనశ్శిలాగుహలలో ఉన్న వానరులను ధూమగిరిపైనున్న వానరులను త్వరగా రమ్మని చెప్పాలి.

మధ్యాహ్న సూర్యకాంతులతో ఉన్న మహారుణపర్వతం మైరేయం అనే మధువును గ్రోలే వానరులు వేగంగా పరుగెత్తగలిగినవారు, భూమండలం అంతా ఉన్నా వానరులందరిని సామ దాన దండోపాయాలతో తీసుకొని రావాలి. వేగంగా వెళ్ళి రాగల దూతలను నేను ఇంతకుముందే పంపాను. కాని వారు ఇంకా రాలేదు. అందుకే నీవు మరలా కొందరిని పంపించు. వానరప్రముఖు లందరిని త్వరగా రమ్మని ఆహ్వానం పంపు" అని హనుమంతునికి సుగ్రీవుడు చెప్పాడు.

"నలుదిక్కులా ఉన్న వానరులందరూ పదిరోజులలో ఇక్కడికి చేరాలని నా ఆజ్ఞగా చెప్పు. గుంపు గుంపులుగా వందల వేల కోట్ల మంది ఆకాశాన్ని కప్పివేస్తున్నారా అన్నట్లు ఇక్కడనుండి వెళ్ళాలి. అలా వారినందరిని నీవు పిలిపించు" అని వానరరాజు అన్నాడు. సుగ్రీవుని ఆజ్ఞమేరకు త్వరగా వెళ్ళగలిగిన వారిని దూతలుగా హనుమంతుడు పంపాడు.

సముద్ర తీరమందు, పర్వతాలలో, వనాలలో ఎక్కడెక్కడ ఉన్న వానరులందరూ రామకార్యార్థమై కిష్కింధా నగరానికి చేరుకొన్నారు. కాటుకలాగా నల్లగా ఉన్న వానరులు వేగంగా పరుగెత్తేవారు అంజనాద్రి నుండి మూడు కోట్లమంది కిష్కింధకు వచ్చారు. అస్త్రాద్రినుండి మేలిమి బంగారు చాయగలవారు పది కోట్లమంది వచ్చారు. సింహం జూలువంటి వన్నెగల కపులు వేయి కోట్లమంది కైలాసం నుండి బయలుదేరారు. హిమవత్పర్వత ప్రాంతం నుండి వేల కోట్లమంది కిష్కింధకు తరలివచ్చారు.

కుజునివలె ఎర్రని నేత్రాలుగలవారు కోట్లకొలది వానరులు వింధ్యపర్వతం నుండి బయలుదేరారు. పాల సముద్రం నుండి కానుగ వనం నుండి ఎందరెందరో వానరులు వచ్చారు. వారు కొబ్బరినే ఆహారంగా తినేవారు. లెక్కపెట్టడానికి వీలులేనంతమంది వానరులు కిష్కింధకు చేరుకొన్నారు. అలా వారందరూ వస్తూ హిమవత్పర్వతాన్ని చూశారు.

వారందరు హిమవత్పర్వతాన్ని అక్కడున్న వృక్షాలను పరిశీలనగా చూస్తున్నారు. అక్కడ ఇంతకుముందు దేవతల ప్రీతి కోసం రుద్రయాగం జరిగింది. ఆ యజ్ఞశాల నుండి క్షీరాన్నం, ఆజ్యాది హోమద్రవ్యాలు స్రవించాయి. వాటివల్ల ఉత్పన్నమయిన ఫలమూలాలు అమృతతుల్యంగా ఉన్నాయి. వాటిని చూడగానే ఎక్కడలేని ఆకలి వేస్తున్నట్లు వానరులకు అనిపించింది. మనోహరంగా అమృతతుల్యంగా ఉన్న ఆ ఫలాలు ఆరగించినవారికి మరల

ఒక నెల వరకూ ఆకలి అన్నది వేయదు. అవి తినే వానర ప్రముఖులు అక్కడ దొరికే ఓషధులను ఫలాలను తనివితీరా తిన్నారు.

ఆ యజ్ఞశాలనుండి సువాసనలు వెదజల్లే పూలను సుగ్రీవుని ప్రియంకోసం వానరులు తెచ్చారు. వానర ప్రముఖులు తమ తమ గుంపులకు ముందుగా నడుస్తూ అందరికి ఉత్సాహాన్ని నింపుతూ ముందుకు సాగారు. వారికి విధించిన గడువుకన్నా ముందుగానే వచ్చి వారు తీసుకొని వచ్చిన పూలను, ఫలాలను, ఓషధులను సుగ్రీవునికి సమర్పించి ఆయనకు ఆనందం కలిగిస్తూ ఆయన ప్రక్కనే నిలబడ్డారు.

దూతలందరూ వేగంగా వానరులందరిని రమ్మని చెప్పి వారు మహావేగంతో సుగ్రీవుని దగ్గరకు వచ్చారు. “మహారాజా భూమండలంలో నలుదిక్కులా ఉన్న వానరులందరూ మీ మాట చెప్పగానే సంతోషంగా వారంతట వారే బయలుదేరి వచ్చారు. మీ ఆజ్ఞ వారికి శిరోధార్యమని చెప్పి తరలివచ్చారు” అని దూతలుగా వెళ్ళిన వానరులు చెప్పారు. వారి మాటలకు సుగ్రీవుడు ఎంతో సంతోషించాడు. వారు ఇచ్చిన కానుకలను ఆదరంగా తీసుకొని సంతృప్తి పొందాడు.

* * *

# సుగ్రీవుడు రాముని దర్శించటం

## సర్గ - 38

**దూ**తలను సంతోషపరచి సుగ్రీవుడు వారిని పంపివేశాడు. కార్యం సఫలం అవుతోందని వానర రాజు సంతోషించాడు. వానరులందరూ వచ్చి రామకార్యాన్ని సఫలీకృతం చేస్తారని దానికి శ్రీరాముడు సంతోషిస్తాడని సుగ్రీవుడు అనుకొన్నాడు. అందరూ వెళ్ళిన తర్వాత సుగ్రీవునికి సంతోషం కలిగిస్తూ లక్ష్మణుడు “ఓ సౌమ్యుడా! నీవు సముచితం అని అనుకొంటే ఇపుడే శ్రీరాముని కలిసి ధైర్యం చెప్పడానికి నాతో కూడా రా” అని వినయంగా పిలిచాడు.

“స్వామీ! మీ ఆజ్ఞ నాకు శిరోధార్యం. ఇప్పుడే మనం శ్రీరామచంద్రుని చూడడానికి వెళ్దాం” అని చెప్పి అక్కడ ఉన్న తార, రుమ ఇంకా స్త్రీలందరినీ అంతఃపురంలోకి వెళ్ళమని సుగ్రీవుడు చెప్పాడు. “వానర ప్రముఖులందరూ ఇటు రండి” అని గట్టిగా పిలిచాడు. ఆ మాటలు విన్నవారు అంతఃపురంలో రాగలిగినవారు అందరూ వచ్చి చేతులు జోడించి నిలబడ్డారు. “వానరులారా! మీరు వెంటనే వెళ్ళి పల్లకీని తీసుకొని రండి” అని ఆజ్ఞాపించాడు.

ఒక్క క్షణంలో కొందరు వానరులు అందమైన పల్లకిని తెచ్చారు. అప్పుడు సుగ్రీవుడు “లక్ష్మణస్వామి మీరు అందులో కూర్చోండి” అని చెప్పారు. లక్ష్మణుడు కూర్చున్న తర్వాత సుగ్రీవుడు కూడా కూర్చున్నాడు. ఆ పల్లకిని వానరులు మోశారు. ప్రభువుల మీద శ్వేతచ్ఛత్రాన్ని పట్టారు. తెల్లని వింజామరలతో వీచారు. శంఖాలను పూరించారు. భేరీలను మ్రోగించారు. వందిమాగధులు స్వస్తివచనాలు చెప్పారు. అప్పుడు రాజమర్యాదలతో లక్ష్మణుడు సుగ్రీవుడు

బయలుదేరారు. వారిని ఎంతోమంది వానరులు చుట్టుముట్టి వచ్చారు. వారు అలా సాగి ప్రస్రవణగిరిపై ఉన్న శ్రీరామచంద్రుని దగ్గరకు వచ్చి పల్లకి దిగారు. సుగ్రీవుడు శ్రీరాముని చూసి ఆయనకు నమస్కరించాడు. వానరులందరూ శ్రీరామునికి ప్రణమిల్లారు.

పాదాలపై వ్రాలి నమస్కరించే వానర ప్రభువును లేవనెత్తి శ్రీరాముడు అక్కున చేర్చుకొన్నాడు. సుగ్రీవుడు రామాజ్ఞను పొంది నేలపై కూర్చున్నాడు. ఆయనను శ్రీరాముడు చూచి "ఓ వానరోత్తమా! ధర్మార్థములను ఆచరించువాడే రాజు. కేవలం కామంతో జీవించేవాడు చెట్టుకొమ్మపై నిద్రించేవానితో సమానం. శత్రునాశనం చేసేవాడు, మిత్రులను సంపాదించేవాడు, సత్యనిష్ఠాపరుడు ఐనవాడే రాజుగా భావించవచ్చు. ధర్మఫలాలను తినడానికి సీతాన్వేషణకు సమయం ఆసన్నమైంది. నీవు నీ సచివులతో కలిసి ఆలోచించి నిర్ణయాన్ని తెలుపు" అని శ్రీరాముడు చెప్పారు.

"ఓ మహాబాహూ! మీ స్నేహానికి ముందు నేను దౌర్భాగ్యపు స్థితిలో ఉన్నాను. మీ స్నేహ సహాయంవల్ల నేను నా రాజ్యాన్ని, భార్యలను, సంపదలను, కీర్తిప్రతిష్ఠలను పొందాను. మేలు చేసినవారికి తిరిగి మేలు చేయనివాడు అధమాధముడు. రామా! సీతాన్వేషణకోసం భూమండలాన ఉన్న వానరులందరిని పిలిపించాను. వారందరూ వచ్చారు.

రఘువీరా! భల్లూకవీరులు, కొండముచ్చులు దేవగంధర్వ అంశాలతో పుట్టినవారు తమ తమ సైన్యాలతో బయలుదేరి ఇక్కడకు వస్తున్నారు. వారందరూ మహాదుర్గాలను అరణ్యాలను ఎరిగినవారు. పరంతపా! వందల, వేల కోట్ల సంఖ్యలో వానరులు తరలిస్తున్నారు. వానరప్రముఖులలో ఒక్కొక్కరి వెంట శంకువు, అర్బుదం, మధ్యం, అంతం, సముద్రం, పరార్థం అను సంఖ్యలో (ఇవి ఒకదాని తర్వాత ఇంకొటి పది రెట్లు ఎక్కువ గల సంఖ్యలు) ఇక్కడకు చేరుకొంటున్నారు.

వారందరూ మహాబలోపేతులు. వారు మిమ్ములను చేరుకొని సీతాన్వేషణాన్ని చేసి రావణుని బంధు సపరివారాన్ని అంతం చేసి సీతాదేవిని తెచ్చి మీకు ఇవ్వగలరు." ఇలా చెప్పే సుగ్రీవుని మాటలు శ్రీరామునికి సంతోషాన్ని కలిగించాయి. సీతాన్వేషణంకోసం సుగ్రీవుడు తెప్పించే వానర సేనను చూసి రాముడు చాలా సంతోషించాడు. సంతోషంతో రాముని కన్నులు బాగా విప్పారిన నల్ల కలువల్లాగా చూడముచ్చటగా ఉన్నాయి అన్న సంతోషాన్ని చూసి సౌమిత్రి ఎనలేని ఆనందాన్ని పొందాడు. సోదరుల సంతసాన్ని చూచేసరికి వానరుల ఆనందం మితి మించింది. సీతాదేవి కనపడినంతగా అందరి కన్నులు విప్పారాయి.

మిత్రుని కోపం పోయి సంతోషంతో ఉండడాన్ని సుగ్రీవుడు చూచి గుండెల నిండా గాలి పీల్చుకొన్నాడు. ఎంత కష్టమైనా పడి సీతమ్మ తల్లిని కనుగొనాలని కఠినంగా నిశ్చయించుకొన్నాడు. ఇకమీద ఎలాంటి పరిస్థితిలో నైనా ఏమరుపాటును నాహృదయంలో కలుగనీయను. ఏ త్యాగానికైనా నేను సిద్ధంగా ఉండాలి. ఎన్ని ఆటంకాలు ఎదురైనా పట్టుదలను సడలనీయను అని గట్టిగా నిర్ణయించుకొన్నాడు. రాముని కార్యం పూర్తి చేసే ధైర్యస్థైర్యాలను నాకు కలుగచేయుము – అంటూ భగవంతుని వేడుకొన్నాడు.

* * *

# రాముడు సుగ్రీవునకు కృతజ్ఞతలు చెప్పటం

## సర్గ - 39

తన పనిని చేస్తున్న సుగ్రీవుని చూచి రాముడు గాఢంగా కౌగిలించుకొన్నాడు. ఇంద్రుడు వర్షాన్నివ్వడం, సూర్యుడు వెలుగునివ్వటం, చంద్రుడు వెన్నెల నివ్వటం అనేవి వారి సహజ లక్షణాలు. ప్రత్యుపకారం చేయడం సత్పురుషుల లక్షణం. సౌమ్యుడైన నీవు ఎప్పుడూ ప్రియంగా మాట్లాడే స్వభావం ఉన్న నీవు ప్రత్యుపకారం చేయడం నాకు ఆశ్చర్యంగాలేదు.

"ఓ సుగ్రీవా! నీవు నాకు తోడుగా నిలిస్తే నేను ఈ రణరంగంలో విజయకేతనం ఎగురవేస్తాను. నీవు నా ప్రాణమిత్రుడవు. నీవు ఎలా ఐనా నాకు సహాయం చేయాలి. అనుహ్లాదుడను రాక్షసుడు పులోముని కుమార్తె అయిన శచీదేవిని అపహరించినట్లు ఈ రావణుడు తన నాశనానికే సీతాదేవిని అపహరించాడు. ఇంద్రుడు అనుహ్లాదుడిని, అతనికి సహాయం చేసిన పులోముని సంహరించినట్లు నేను రావణుడిని సంహారం చేసి సీతాదేవిని పొందుతాను.

శ్రీరాముడు అలా చెప్తుండగానే సూర్యుని కాంతిని కప్పివేసే దుమ్ము రేగింది. దుమ్మువలన దిక్కులన్నీ చీకట్లతో అలుముకొన్నాయి. కొండలు, వనాలు, అరణ్యాలు ఉన్న భూమి అంతా ఒక్కసారిగా కంపించింది. అసంఖ్యాకులైన వానరులందరు ఇసుకవేస్తే రాలనంతమంది కోటాను కోట్లమంది కిష్కింధకు చేరుకొన్నారు. వారిలో వివిధ శరీరచ్ఛాయ గలవారు ఉరుములాగా గర్జించేవారు ఉన్నారు.

శతవలి అనే వానర వీరుడు పది కోట్లమంది అనుచరులతో అక్కడికి వచ్చారు. తార తండ్రి ఐన సుషేణుడు వేల కోట్ల సంఖ్యలో అనుచరులను తీసుకొని అక్కడికి వచ్చాడు. రుమ తండ్రి కూడా చాలామంది అనుచరులతో కిష్కింధకు వచ్చాడు. హనుమంతుని తండ్రి ఐన కేసరి వానరసేనతో వచ్చాడు. గవాక్షుడు ధూమ్రుడు వేల సంఖ్యలో వానరసేనను తరలించుకువచ్చారు.

పనసుడు, నీలుడు, గవయుడు దరీముఖుడు, మైందుడు, ద్వివిదుడు, గజుడు వీరందరూ లెక్కకుమించినంత వానర సేనను వెంటబెట్టుకొని వచ్చారు. జాంబవంతుడు తేజస్వులయిన భల్లూకయోధులను తీసుకొనివచ్చాడు. బలపరాక్రమాలు గల రుమణ్వంతుడు వంద కోట్ల అనుచరులతో సుగ్రీవుని దగ్గరకు వచ్చారు. అంగదుడు, తారుడు, ఇంద్రజానువు, రంభుడు వీరందరూ వానరసేనను తరలించారు.

దుర్ముఖుడు అను వానరప్రముఖుడు, హనుమంతుడు, నలుడు, దధిముఖుడు, శరభుడు, కుముదుడు, వహ్ని, రంభుడు వీరందరూ వానరులను తీసుకొని వచ్చారు. వచ్చిన వారందరూ ఎగురుతూ, దుముకుతూ కోలాహలంగా ఉన్నారు. అలా వచ్చిన వానర ప్రముఖులందరిని గూర్చి సుగ్రీవుడు శ్రీరామునికి చెప్పాడు. వారిని

శ్రీరామునకు పరిచయం చేశాడు. తిరిగి "వానరప్రముఖులారా! మీరు మీ సేనలను అనువైన ప్రదేశాలలో నిలపండి" అని సుగ్రీవుడు వారికి చెప్పాడు. వారందరూ శ్రీరాముని కోసం పనిచేయబోతున్నామన్న సంతోషంతో శ్రుతి మించి గెంతుతున్నారు. ఎపుడెపుడు సీతమ్మ తల్లిని కనుగొందామా అని ఎవరికి వారు తాము చేయబోయే పనులను గూర్చి ఆలోచిస్తున్నారు.

* * *

# వానరులు తూర్పు దిక్కుకు వెళ్ళడం

## సర్గ - 40

**వా**నరులందరిని సుగ్రీవుడు రామునికి పరిచయం చేయడం పూర్తి చేశాడు. "శ్రీరామా! ఈ వానరులందరూ బలిష్ఠులు. కామరూప విద్య తెలిసినవారు. శత్రువులపై ఉరికి వారిని ఓడించి అనుకొన్న కార్యాన్ని సాధించుకొని రాగల వీరులు. వీరు నేలమీద, నీటిమీద నడవగలరు.

రామచంద్రా! వీరందరు అసమాన బలపరాక్రమోపేతులు. వీరందరూ ఇప్పుడు మీ అధీనంలో ఉన్నారు. మీరు సీతాన్వేషణకు ఇది తగిన సమయం అని భావిస్తే చెప్పండి. దానికి తగిన రీతిగా వీరిని ఆజ్ఞాపించవచ్చు" సుగ్రీవుడు శ్రీరామునితో చెప్పాడు.

సుగ్రీవుని మాటలకు శ్రీరాముడు సంతోషించి, " సుగ్రీవా! అసలు సీతాదేవి బ్రతికి ఉందా? ఉంటే ఎక్కడ ఉంది? రావణుని బలాబలాలు ఏమిటి? అతడున్న ప్రదేశం ఎక్కడ ఉంది? ఇవన్నీ తెలుసుకొని అప్పుడు అన్వేషణను మొదలుపెడ్దాం. సుగ్రీవా! నేను నా తమ్ముడు అన్వేషణను సాగించలేము. నీవు నీ అనుచరులు కలిసి సీతాన్వేషణను చేసి కార్య సాఫల్యాన్ని పొందగలరు. అందువలన మీరందరూ బాగా ఆలోచించి తగిన రీతిలో స్పందించండి అని చెప్పాడు. సుగ్రీవా! నీవు నాకు లక్ష్మణునితో పాటు సోదరుడివి, ఆప్తుడవు. తగిన సహాయం చేయగలిగినవానివి, కార్యదక్షుడవు. నీవే ఆలోచించు" అని చెప్పగానే సుగ్రీవుడు వినతుని పిలిచాడు.

రామలక్ష్మణుల సమక్షంలో ఆ వానర ప్రముఖుని పిలిచి, " వినతుడా! నీవు నీ అనుచరులతో కలిసి తూర్పు దిక్కుకు వెళ్ళి, అక్కడ కొండ కోనలు పర్వతాలు నదులు దేన్నీ వదలకుండా సీతకోసం గాలించండి. చక్కగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోండి" అని చెప్పాడు.

మీరందరూ నేను చెప్పినట్లుగా ముందుకు సాగండి. గంగ, సరయు, కౌశికి, యమున నదులను, యామునగిరి, సరస్వతి, సింధు, శోణ, మహి పర్వతముల మధ్య ప్రవహించే 'కాల మహి' నదీ తీరాలను వెదుకుతూ వెళ్ళండి. అలా వెళ్తూ బ్రహ్మమాల, విదేహా, మాళవ, కాశి, కోసల, మాగధ అనే మహాగ్రామాలను పుండ్ర అంగ దేశాలలోని జనపదములను కోశకారులనే రాజుల రాజ్యాలను, వెండి గనులు గల దేశాలలో సీతను వెదకండి.

ఓ వానరులారా! సీతకై వెదికేటప్పుడు కొందరు సముద్రంలో మునిగి ఉన్న పర్వతాలను, పట్టణాలను, మందర పర్వత అగ్రభాగాలను ఆశ్రయించి నివసిస్తుంటారు. వారిలో కొందరికి చెవులు ఉండవు. కొందరికి పెదవులే చెవులై ఉంటాయి. వాళ్ళల్లో కొంతమందికి ఒక పాదమే ఉంటుంది. వారందరూ వికృతరూపులు మహావేగం కలవారు, ఎదిరింప శక్యంకానివారు. ద్వీపాలలో ఉండే కిరాతులు మనుష్యులను చంపి తినేస్తుంటారు. నరవ్యాఘ్రాలు అనే పేర నీటి మధ్యలో ఉంటారు. వీరందరి దగ్గరకు వెళ్ళి అక్కడ కూడా సీతను వెదకండి – అని తూర్పుకు వెళ్ళి సీతను ఎలా వెతకాలో మార్గనిర్దేశాన్ని చేస్తున్నాడు సుగ్రీవుడు.

"వానరులారా! మీకు దారిలో యవద్వీపం కనిపిస్తుంది. అవి రత్నాల రాశిలా పేరుగాంచింది. అది ఏడు ఖండాలుగా ఏర్పడి ఉంది. దాని చుట్టూ సముద్రం ఆవరించి ఉంది. అక్కడికి లంఘించి కాని నావలమీద కాని వెళ్ళవచ్చు. అక్కడనుంచి సువర్ణ, రూప్యక ద్వీపాలున్నాయి. అవి బంగారు వెండి గనులకు ప్రసిద్ధమైనవి. దీని తర్వాత శిశిరము అనే పర్వతం ఉంటుంది. అక్కడ దేవతలు, దానవులు ఉంటారు. ఈ ద్వీపాల సమీపంలోని సెలయేళ్ళు, నదులు, గిరులు అన్నింటిని సీతాదేవి కోసం వెదకండి.

సముద్రానికి ఆవల ఉన్న శోణనదం చేరండి. లోతుగా ఎర్రని నీళ్ళతో వేగంగా ప్రవహిస్తుంటుంది. అక్కడ సిద్ధులు, చారణులు ఉంటారు. అది చాలా రమ్యమైన ప్రదేశం. రావణుని నివాసం కోసం సీతాదేవి కోసం అక్కడంతా వెదకండి. పర్వతాల మీదనుండే జాలువారే నదులు, మనోహరమైన ఉద్యానవనాలు, గుహలు, ఇలా ప్రతిదానిని వెదుకుతూ ముందుకు వెళ్తే ఇక్షు సముద్రం కనిపిస్తుంది. అవి తీవ్ర ఘోషలతో ఉవ్వెత్తున ఎగిసిపడే తరంగాలతో ఉంటుంది.

ఆ తీరంలో మహాకాయులైన అసురులు ఉంటారు. ప్రాణులను తింటూ బ్రహ్మవరంతో దీర్ఘకాలం వారు జీవిస్తుంటారు. ఇక్షు సముద్రం నల్లని మేఘంలాగా కనిపిస్తుంది. అక్కడ భయంకరమైన సర్పాలుంటాయి. యుక్తితో దాన్ని దాటాల్సి ఉంటుంది. 'లోహితం' అనే మధుసముద్రం ఉంది. అక్కడ శాల్మలీ వృక్షాలు అధికంగా ఉంటాయి. అందుకే దాని శాల్మలీ (బూరుగు) ద్వీపం అని అంటారు.

అక్కడ గరుత్మంతుని భవనం ఉంటుంది. దాన్ని విశ్వకర్మ నిర్మించాడు. అది కైలాస శిఖరం లాగా కనిపిస్తుంది. అక్కడ మందేహాలు అనే రాక్షసులు ఉంటారు. వారు మహాకాయులు సూర్యోదయ సమయంలో ఊర్ధ్వముఖులై బాలభానుని మ్రింగివేయాలని చూస్తుంటారు. అప్పుడు ఆ సూర్యకిరణాల తాకిడికి గాయత్రీమంత్రాలచే బాగా దెబ్బతిని ఆ మధు సముద్రంలో పడి పోతుంటారు. కాని మరల వారు పైకి వచ్చి అక్కడే వ్రేలాడుతుంటారు. ఇది ప్రతిరోజు జరుగుతుంది. అక్కడంతా కూడా వెదకండి.

ఆ తర్వాత ఘృత, దధి, సముద్రాలను వెదుకుతూ ముందుకు వెళ్ళితే 'క్షీరోదం' అనే సముద్రం కనిపిస్తుంది. తెల్లని మేఘాలుంటాయి. ఆ సంద్రంలోని తరంగాలు ముత్యాలహారాల్లా కనిపిస్తాయి. ఆ సముద్రం మధ్యలో 'ఋషభం' అనే పర్వతం ఉంది. ఆ ఋషభగిరిపై సుదర్శనం అనే సరస్సు ఉంది. అందులో తెల్లని పద్మాలు కింజల్కాలు మేలిమి బంగారు కాంతులతో వికసించి ఉంటాయి. పర్వతంలో పెద్ద పెద్ద వృక్షాలున్నాయి. ఆ

సరస్సునిండా రాజహంసలు గుంపులుగా ఉన్నాయి. అక్కడ దేవతలు, చారణులు, యక్షులు, కిన్నరులు, అప్సరసలు ఆనందంగా జలవిహారాలు చేస్తుంటారు.

దాన్ని దాటిన తర్వాత మధురజలాలతో నిండిన మహాసముద్రం కనిపిస్తుంది. అక్కడ ఔర్వుడు అనే మహాముని తపస్సు చేసుకొంటూ ఉంటాడు. ఆయన కోపం వలన దివ్య తేజస్సు ఏర్పడింది. అదే హేయముఖం అనే పేరుతో బడబాగ్ని అయ్యి సముద్రంలో ఉంది. ఆ సముద్రంలో మహావేగంగా కదిలే తరంగాలు చరచరాలే ఆ బడబాగ్నికి ఆహారం. అక్కడ ఉండే మహాప్రాణులు కూడా అగ్నికి భయపడుతుంటారు. ఆ గగ్గోలు వినిపిస్తూ ఉంటుంది.

ఆ మధురజలధికి ఉత్తరంలో పదమూడు యోజనాల దూరంలో జాతరూపశిలం అనే బంగారు పర్వతం ఉంది. దానిమీద అనంతుడు అనే పేరుతో సర్పాకృతిలో ఆదిశేషుడు కూర్చుని ఉంటాడు. తెల్లని వన్నెతో పద్మాలవంటి నేత్రాలతో నీలవస్త్రాన్ని ధరించి వేయి పడగలతో ఈ భూభాగాన్ని మోస్తుంటాడు. ఆ మహాత్ముని దర్శనం చేసుకోండి. ఆయన ధ్వజం తాటి చెట్టులాగా పొడవుగా మూడు తలల గుర్తుతో ఉంటుంది. ఆ తాళధ్వజానికి ఒక వేదికను దేవతలు నిర్మించారు.

అక్కడ కూడా వెదికి ముందుకు వెళ్ళండి. మీకు ఉదయాద్రి కనిపిస్తుంది. ఆ గిరి నూరు యోజనాల దూరం వరకు వ్యాపించి ఉంది. ఆ ఉదయాచలంలో మద్ది, తాళ, కానుగచెట్లు ఎక్కువగా ఉన్నాయి. గన్నేరు విరగకాచి ఉంటుంది. అవన్నీ బంగారు వన్నెతో దివ్యంగా కనిపిస్తాయి. 'సౌమనసం'అనే బంగారు శిఖరం ఉంది. అది పది యోజనాల పొడవుతో ఒక యోజనం విస్తీర్ణంతో ఉంది.

వామనుడు బలిదానాన్ని గ్రహించేటప్పుడు ఒక పాదం ఈ సౌమనసం మీద రెండవ పాదం మేరు శిఖరం మీద ఉంచాడని చెప్తారు. సూర్యుడు జంబూద్వీపానికి ఉత్తరంలో సంచరించి ఈ సౌమనస శిఖరానికి చేరిన తర్వాత మేరుగిరికి దక్షిణాన ఉన్నవారికి స్పష్టంగా కనిపిస్తాడు.

ఈ శిఖరం మీద వైఖానసులు, వాలఖిల్యులు తపస్సు చేస్తూ ఉంటారు. వారు సూర్యునంతటి తేజస్సు కలవారు. వారిని దర్శనం చేసుకోండి. ఉదయాద్రికి ముందు సుదర్శనద్వీపం ఉంది. సౌమనసశిఖరం మీదకు సూర్యుడు రాగానే సుదర్శనద్వీపం వారు ఉత్తేజితులవుతారు. వారిలో చైతన్యం వస్తుంది. అందుకే దీనికి సుదర్శనం అనే పేరు వచ్చింది. అక్కడ ప్రతి అంగుళం సీతాదేవి కోసం వెదకండి. అక్కడ ప్రభాత సంధ్య ఎరుపు వన్నెతో సుందరంగా కనిపిస్తుంది. దీన్ని బ్రహ్మ సృష్టించాడు. బ్రహ్మలోకానికి, భూలోకానికి ఇది ద్వారం లాంటిది. భూలోక నివాసులు ఈ ఉదయాద్రి నుండి ఊర్ధ్వలోకాలకు వెళ్తుంటారు. మొదట ఈ ద్వారం నిర్మాణం జరిగింది కనుక పూర్వదిశ తూర్పు అనే పేరు వచ్చింది.

ఆ ఉదయాద్రి దాటిన తర్వాత అంధకారం వ్యాపించి ఉంటుంది. అక్కడికి సూర్యకాంతి ప్రసరించదు. అది దేవతల నివాసం తూర్పు దిశలో నేను ఇంకా చాలా పర్వతాలు, వనాల గూర్చి చెప్పలేదు. మీరు వాటిని కూడా వదలకుండా వెదకండి. నాకు తూర్పు దిక్కుగురించి ఇంతే తెలుసు. మీరు అక్కడికి వెళ్ళి రావణుని గూర్చి అంతా వెదకండి. మీకు నెల గడువు ఇస్తున్నాను. అవధి దాటకుండా మీరు తిరిగిరావాలి. తూర్పు దిశ అంతా దేవేంద్రుని

అధీనంలో ఉంది. అక్కడ సీతాదేవిని వెదికి కృతార్థులై మరలి రండి. మీకు క్షేమమగు గాక" – అంటూ సుగ్రీవుడు తూర్పు దిక్కుకు వానరులను పంపించాడు. వానరులంతా సుగ్రీవుని మాటలను కదు శ్రద్ధతో విన్నారు. వారు సీతాదేవిని కనుక్కోవాలన్న ఉత్సాహంతో ఎపుడెపుడు తూర్పును గాలించేద్దామా అని ఆత్రంతో శ్రీరాముని, సుగ్రీవుని ఆజ్ఞకోసం ఎదురు చూస్తున్నారు. వారిలో వారు తూర్పు దిక్కు సంబంధించిన సమాచారాన్ని చర్చించుకొంటున్నారు.

* * *

# వానరులు దక్షిణ దిక్కుకు వెళ్ళటం

## సర్గ - 41

**సు**గ్రీవుడు వినీతుని నాయకత్వంలో వానరులను తూర్పు దిక్కుకు పంపించాడు.అంగదుని నాయకుడిగా చేశాడు. నీలుడు, హనుమంతుడు, జాంబవంతుడు, సుహోత, శరారి, శరగుల్మ, గజుడు, గవాక్షుడు, గవయ, సుషేణ, వృషభ, మైన్ద, ద్వివిద, విజయ, గంధమాదన, ఉల్కాముఖి, అనుగులనే వానరప్రముఖులను వానర సేనను అంగదుని నాయకత్వంలో దక్షిణ దిక్కుకు పంపించాడు.

ఆ దక్షిణ దిక్కులోని ప్రవేశింపశక్యంకాని ప్రదేశాలను గురించి సుగ్రీవుడు వారలకు చెప్పాడు. "వానరులారా! మీరు వింధ్య పర్వతం నుండి సీతాన్వేషణను మొదలుపెట్టండి. అక్కడున్న వృక్షాలను దాటి ముందుకు వెళ్తూ ఉంటే మీకు నర్మదానది కనిపిస్తుంది. అందులో మహావిషసర్పా లుంటాయి. దాని తర్వాత గోదావరి మహానది కృష్ణవేణి వరద అనే నదులున్నాయి. అవి అన్నీ పాములకు ఆశ్రయాన్నిస్తాయి. ఆ నదీ తీర ప్రాంతాలన్నీ వెదకండి.

మేఖల, ఉత్కల, దశార్ణ దేశాల్లోని అశ్వవంతి అవంతి పురాలను గాలించండి. విదర్భ, ఋషిక, మాహిషిక, వంగ, కళింగ, కౌశిక, దేశాలలో వెదుకుతూ దండకారణ్యంలోని పర్వత ప్రాంతాలు నదీ తీరాలు, గుహలు వెదుకుతూ ఆంధ్ర, పుండ్ర, చోళ, పాండ్య, కేరళ మొదలైన దేశాలలో కూడా గాలించండి. గైరికాది ధాతువులతో, చందన వృక్షాలతో చిత్రవిచిత్రంగా ఉండే మలయపర్వతాన్ని బాగా వెదకండి. అక్కడనుండి వెళ్ళితే మీకు కావేరీ నది కనిపిస్తుంది. ఆ నదీ తీరంలో అప్సరసలు ఉంటారు. ఆ మలయ పర్వతంమీద అగస్త్య మహర్షి మహాతేజోమూర్తి ఉంటాడు. ఆయనను దర్శనం చేసుకోండి. ఆయన అనుజ్ఞ తీసుకొని తామ్రపర్ణి అనే నదిని దాటండి. మొసళ్ళు అక్కడ ఉన్న ద్వీపాలలో చందనవృక్షాలు ఎక్కువగా ఉంటాయి.

పాండ్యరాజుల నగరం వస్తుంది. అక్కడ భవనాలు ముత్యాలతో, మణులతో నిర్మించి ఉంటారు. ఆ ప్రదేశమంతా కూడా సీతను గాలించండి. పాండ్యనగరం తర్వాత సముద్రం ఉంది. ఆ సముద్రంలో మహేంద్రగిరి ఉంది. ఆ గిరిపై చిత్ర విచిత్ర వృక్షాలు ఫలాలతో పూలతో ఉంటాయి. ఆ సముద్రం దాటడానికి మీరు ఒక నిశ్చయానికి రండి. అక్కడ దేవర్షులుంటారు. మహేంద్రగిరికి దేవేంద్రుడు పర్వదినాలలో సముద్రస్నానం చేయడానికి వస్తుంటాడు.

మహేంద్రగిరికి నూరు యోజనాల దూరంలో ఒక మహాద్వీపం ఉంది. అది దీపకాంతులతో దేదీప్యమానంగా ఉంటుంది. మానవ మాత్రులు అక్కడకు ప్రవేశించలేరు. ఆ ప్రదేశం రావణుని ఆధీనంలో ఉంటుంది. అక్కడ ప్రతి అంగుళం వెదకండి. సీతాపహరణానికి పూనుకొన్న నిందార్హుడు రావణుడు. దక్షిణసముద్రమధ్యంలో 'అంగారక' అనే రాక్షసి ఉంది. సముద్రం మీద వెళ్ళేవారి నీడలను ఆకర్షించి వారిని ఆ రాక్షసి తింటూ ఉంటుంది.

ఆ లంకా ద్వీపంలో ప్రతి అంగుళం వెదకండి. అక్కడెక్కడా సీతాదేవి కనిపించకపోతే, సీతాదేవి అక్కడ లేదని మీకు రూఢంగా తెలిస్తే ముందుకు వెళ్ళండి. దక్షిణ దిశగా సాగితే వంద యోజనాల దూరంలో ఉష్పితం అనే పర్వతం కనిపిస్తుంది. అక్కడ సిద్ధులు చారణులుంటారు. పెద్ద సముద్రం అక్కడ ఆవరించి ఉంటుంది. ఆ గిరి శిఖరాలు ఆకాశాన్ని తాకుతున్నట్టుగా ఉంటాయి. ఆ పుష్పిత పర్వతంపై ఒక బంగారు శిఖరంపై సూర్యుడు, ఒక వెండి శిఖరంపై చంద్రుడు కాంతిని ప్రసరింపజేస్తుంటారు.

ఆ పర్వతంపైకి కృతఘ్నులు, క్రూరులు, నాస్తికులు వెళ్ళలేరు. ఆ పర్వతానికి నమస్కరించి తర్వాత దానిని దాటండి. దాని తర్వాత పద్నాలుగు యోజనాల దూరంలో సూర్యవంతం అనే శైలం కనిపిస్తుంది. దాన్ని దాటిన తర్వాత వైద్యుతం అనే గిరి వస్తుంది. అక్కడి మార్గం క్లిష్టంగా ఉంటుంది. వైద్యుతం మీద సర్వకాలాలలోను పూలు, పండ్లు సమృద్ధిగా ఉంటాయి. వాటిని ఆరగించండి. మధువు కూడా అమృతంలాగా ఉంటుంది. అక్కడ అంతా వెదకి 'కుంజరం' అనే పర్వతాన్ని చేరండి.

ఆ గిరిపై విశ్వకర్మ అగస్త్యుని కోసం నిర్మించిన భవనం ఉంది. అది ఒక యోజన విస్తీర్ణంలో పది యోజనాల ఎత్తుగా నిర్మించబడి ఉంది. దీని తర్వాత భోగవతీ అనే పురం కనిపిస్తుంది. ఈ భోగవతీలో సర్పాలు అధికం. అందులో ప్రవేశించడం కష్టసాధ్యం. తీక్షణమైన కోరలు గల విషసర్పాలతో భోగవతీ నగరం రక్షింపబడుతుంది. సర్పాలకు రాజు ఐన వాసుకి భవనం ఉంది. ఆ ప్రదేశాలన్నీ సీతకోసం గాలించండి. దీని తర్వాత వృషభ పర్వతం ఉంది. వివిధ రత్నాలతో సర్వసమృద్ధిగా వృషభాకారంలో ఉంది. ఇక్కడ పసుపు, ఆకుపచ్చ నీలం వర్ణాలతో ఉండే చందనవృక్షాలున్నాయి. ఈ వృక్షాలు అగ్నిలాగా ఉంటాయి. వీటిని గంధర్వులు రక్షిస్తుంటారు. వీటిని చూడాలే కాని తాకకూడదు.

శైలూదుడు, గ్రామణి, శిగ్రువు, శుభ్రువు, బభ్రువు అనే గంధర్వులు ఈ వృషభగిరిపై ఉంటారు. దీని దాటిన తర్వాత భూమి సరిహద్దు కనిపిస్తుంది. సూర్యచంద్రాగ్నుల తేజస్సుతో వెలిగొందే పుణ్యపురుషులు అక్కడ ఉంటారు. వీరందరూ స్వర్గానికి వెళ్ళే అర్హత ఉన్నవారు. దీని తర్వాత పితృలోకం ఉంది. ఇది యమసదనం. ఈ చిమ్మ చీకట్లలో ఎవరూ వెళ్ళలేరు. మీరు అక్కడికి వెళ్ళకండి.

వానరులారా! మీరందరూ నేను చెప్పినవి గుర్తుంచుకొని వెళ్ళిరండి. ఎక్కడైనా నేను చెప్పనివి కనిపిస్తే వాటినీ బాగా వెదకండి. సీతకోసం ప్రతి అంగుళం వృథా కాకుండా వెతకండి. సీత ఆచూకీని కనుగొని రండి. మీకు కూడా ఒక నెల అవధిగా పెడ్తాను. నేను పెట్టిన గడువులోగా ఎవరైనా మేము సీతను చూశాం అని చెప్పితే వారికి నాతో సమానమైన భోగభాగ్యాలను కల్పిస్తాను. అలా చెప్పిన వానరుని మించిన ప్రేమాస్పదుడు నాకు

ఎవరూ ఉండరు. నా ప్రాణతుల్యుడు. ఎన్ని దోషాలు చేసినా వానిని నేను ఆత్మబంధువుగా తలుస్తాను. మీరందరూ ఉత్తమవంశంలో పుట్టారు. ఎలా ఐనా జనకరాజసుత ఐన సీతాదేవి జాడను తెలుసుకొని వచ్చి నా మిత్రునకు ఆనందం కూర్చండి. వెళ్ళండి అని వారినందరిని పంపించాడు. రాముడు నాకు ప్రాణమానాలను ఇచ్చి నన్ను కాపాడినాడు కదా! నేను నా శక్తి వంచన లేకుండా నా స్నేహితునికోసం సాయం చేయడం నాధర్మంగా భావిస్తున్నాను" అని చెప్పాడు.

* * *

# పశ్చిమ దిశకు వానరుల ప్రయాణం

## సర్గ - 42

సుగ్రీవుడు తనకు మామగారైన సుషేణుని చూచి నమస్కరించాడు. తార తండ్రి ఐన సుషేణుడు మేఘంవలె నీలవర్ణంవాడు. మరీచి మహర్షి కొడుకైన మారీచుడు ఇతడు మహేంద్రునితో సమానవర్చస్సు కలవాడు. గరుత్మంతునంత గమనవేగం ఉన్నవారు. వీరిద్దరితోపాటు రెండు లక్షలమంది వానరసేన ఉంది. వీరందరిని సుషేణుని నేతృత్వంలో పశ్చిమ దిశకు వెళ్ళమని సుగ్రీవుడు చెప్పాడు.

"కపిశ్రేష్ఠులారా! మీరు సౌరాష్ట్ర, బాహ్లిక, శూర, భీమ దేశాలలోని జనపదాలు, గ్రామాలు, పట్టణాలు అంతా వెదుకుతూ వెళ్ళండి. పున్నాగ, వకుళ, ఉద్దాలక వృక్షాల నడుమ మొగలి పొదల మధ్య సీతాదేవి కోసం గాలించండి. నదీతీరాలను పర్వత ప్రాంతాలను, గుహలను వేటినీ విడిచిపెట్టకుండా వెదకండి. మరుభూములు, మెట్ట నేలలు, శిలా ప్రాంతాలు, దుర్గమాలు ఇలా అన్నింటిని వెదకండి.

సముద్రంతీరంలో వెదకండి సముద్రంలో తిమింగలాలు, మొసళ్ళు ఉన్నాయి. పశ్చిమ సముద్రపు తీర ప్రాంతంలోని తోటలను, వనాలను అంతా వెదకండి. మురచీపట్టణం, అవంతి అంగలోపాపురి, అలక్షితవనం వస్తాయి. వీటినంతా కూడా సీతకోసం గాలించండి. సింధూనది సముద్రంలో కలిసే చోటున హేమగిరి ఉంది. అది నూరు శిఖరాలతో ఉంది. ఈ శిఖరంపైన పక్షులు క్రూరంగా ఉంటాయి. ఇవి ఏనుగులను, తిమింగలాలను కూడా ఈడ్చుకొని పోతూంటాయి. ఈ ప్రాంతంలో మదపుటేనుగులు ఉంటాయి.

పశ్చిమసముద్రమధ్యంలో పారియాత్రం అను మహాపర్వతం ఉంది. దాని బంగారు శిఖరం నూరు యోజనాల దాకా విస్తరించి ఉంది. సామాన్యులు దీన్ని చూడలేరు. దీనిమీద ఇరవైనాల్గు కోట్ల మంది గంధర్వులున్నారు. మీరు ఎంతటి పరాక్రమవంతులైనా ఆ గంధర్వుల దగ్గరకు వెళ్ళకండి. వారికి ఏ విధమైన హాని కలిగించకండి. ఆ గంధర్వులు ఆ పర్వతంలోని ఫలమూలాలను రక్షిస్తుంటారు. అవి ఏవీ మీరు తీసుకోకండి. అక్కడ జానకీదేవిని వెదకండి. వానరులకు వారు ఏ కీడూ చేయరు.

పారియాత్ర పర్వతానికి దగ్గరలో వజ్రగిరి అనే పర్వతం ఉంది. అక్కడంతా వృక్షాలు, లతలు వైదూర్యంలాంటి స్వచ్ఛమైన కాంతులు ఉంటాయి. దీనికి దగ్గరలోనే చక్రవంతం అనే ఒకపర్వతం ఉంది. ఇది సముద్రంలో నాల్గవంతు దాకా వ్యాపించి ఉంది. విశ్వకర్మ వేయి అంచులున్న ఒక చక్రాన్ని నిర్మించాడు. దీనిమీద పంచజనుడు, హయగ్రీవుడు అనే దానవులు ఉండేవారు. వారిని శ్రీ మహావిష్ణువు సంహరించాడు. వీరినుంచి పాంచజన్యం అనే శంఖాన్ని సుదర్శనం అనే సహస్రార చక్రాన్ని తీసుకొన్నాడు.

ఇక్కడ ఉండే చిత్ర విచిత్ర గుహలలోను, పర్వత సానువులలో వైదేహి జాడలను గుర్తించండి. ఆ చక్రవంతగిరికి అరవై యోజనాల దూరంలో వరాహగిరి ఉంది. ఆ గిరిపైన ప్రాగ్జ్యోతిషపురం ఉంది. ఇది సువర్ణమయం. దీనిని నరకుడు అనే రాక్షసుడు పాలిస్తాడు. వీని పట్టణమంతా కూడా వెదకండి. వరాహగిరి దాటిన తర్వాత సర్వ సౌవర్ణ పర్వతముంది. ఇక్కడ వేలకొలది జలధారలు సెలయేళ్ళు నదులున్నాయి. ఈ గుహలలో క్రూరమృగాల సంచారం ఎక్కువగా ఉంటుంది.

దీని తర్వాత మేఘవంతం అనే పర్వతం ఉంది. దీనిపైనే దేవతలు మహేంద్రుని దేవతా రాజుగా అభిషేకించారు. మహేంద్రుడు పాకాసురుని సంహరించాడు. దీని దాటి వెళ్ళిన తర్వాత అరవై వేల బంగారు కొండలు కనిపిస్తాయి. ఆ కొండల మధ్యపర్వతాలకు రాజైన మేరుగిరి ఉంది. మేరుగిరికి సూర్యుడు ఒక వరం ఇచ్చాడు. ఆ వర ప్రభావంతో ఆ పర్వతాన్ని ఆశ్రయించి ఉన్నవారు బంగారు కాంతులతో వెలుగుతుంటారు. దేవతలు, దానవులు, గంధర్వులు అందరూ మేరుగిరిపై అనురక్తి కలిగి ఉంటారు.

దేవతలు, మరుద్గణములు, అష్టవసువులు వీరందరూ మేరుగిరికి వచ్చి సూర్యుని ఆరాధిస్తుంటారు. వారి పూజలు అందుకొని సూర్యుడు అస్తాద్రిని చేరుకొంటాడు. మేరు పర్వతానికి అస్తాద్రికి పది యోజనాల దూరం ఉంది. దానిని అర్థముహూర్తకాలంలో సూర్యుడు అధిగమిస్తాడు. ఈ పశ్చిమాద్రి శిఖరంపై విశ్వకర్మ అత్యద్భుతమైన ఒక భవనాన్ని నిర్మించాడు. ఇక్కడ వరుణుడు నివాసం ఏర్పరచుకొన్నాడు. మేరుగిరికి అస్తాద్రికి మధ్య పది శాఖలున్న మహాతాళ వృక్షం ఉంది. దానిక్రింద ఒక చిత్రమైన వేదిక వ్రేలాడుతూ ఉంటుంది. అక్కడుండే తటాకాలు, సరస్సులు, సెలయేళ్ళు, పర్వతాలు, గుహలు, వృక్షాలు – ఇలాంటి వన్నింటిని సీతాదేవి కోసం వెదకండి.

అక్కడ మేరుసావర్ణి అనే మహర్షి ఉంటాడు. తపస్సంపన్నుడు, ధర్మాత్ముడు బ్రహ్మదేవుని అంతటి వారు. ఆయనకు నమస్కారం చేసి వైదేహిని గూర్చి అడగండి. అందువలన కార్యసిద్ధి కలుగుతుంది. సూర్యభగవానుడు ఉదయగిరినుండి అస్తాద్రి వరకు ఉన్న జగత్తులో చీకట్లు పారద్రోలి వెలుగును ప్రసాదిస్తాడు. ఓ వీరులారా! నాకు అంతవరకే తెలుసు. దీని తర్వాత వానరులు వెళ్ళలేరు.

మీరు కూడా నెలలోపు పశ్చిమాద్రి అంతా వెదికి సీత జాడను తెలుసుకొని రండి. గడువు తీరిన తర్వాత వచ్చేవారికి నా చేతిలో చావు తప్పదు. మీతో సుషేణుడు వస్తాడు, ఇతడు మహాబలశాలి. ఈయన నాయకత్వంలో పశ్చిమదిశను గాలించండి. శ్రీరాముడు చేసిన మహోపకారానికి మనం సీతను కనుగొని చెప్తే ఋణం తీర్చుకొన్నవారం అవుతాం. కార్యం సఫలం అయ్యేటట్లుగా ఆలోచించి ప్రవర్తించండి. నేను చెప్పనివి మీకు అనుకూలంగా అనిపిస్తే వాటిని కూడా చేయండి అని చెప్పి వానరసేనను పశ్చిమ దిశకు పంపించాడు.

వారందరూ  సంతోషంతో సీత జాడ కోసం పలు విధాలుగా ఆలోచిస్తూ వెళ్ళుతున్నారు. వారి మనసులలో ఎన్నో అనుమానాలు వస్తున్నాయి. అసలు సీతమ్మ  ఎలా ఉంటుందో ఆమెను ఎలా పోల్చుకోవాలో ఆలోచిస్తున్నారు. వారిలో సందేహజీవులున్నారు. వారు మనం గడువులోపల సీతమ్మను గుర్తించగలమా? అన్న ఆలోచనలో మునిగిపోయారు. మరికొందరు ఆశావాదులున్నారు. వారు నెలలో తప్పక సీతమ్మను కనుగొనగలమనుకొని ఎంతో సంతోషంగా ఉన్నారు. ఇంకొందరు అంతా దైవేచ్ఛ అని దేవునిపై భారం వేసి నిశ్చింతగా ముందుకు పోతున్నారు.

* * *

# ఉత్తర దిశకు వానరుల ప్రయాణం

## సర్గ - 43

**సు**గ్రీవుడు శతవలి అనే వీరుని పిలిచాడు. "ఓ వీరాగ్రేసరా! వైవస్వతుని అంశలతో జన్మించిన వానర వీరులను నీ అనుచరులను తీసుకొని ఉత్తరదిశగా ప్రయాణం చేసి అక్కడి ప్రదేశాలలో సీతామాతను వెదకండి. మనకు రాముడు మహోపకారం చేశాడు. మనం ఆయనకు ప్రత్యుపకారంగా ఏది చేసినా తక్కువే అవుతుంది. కానీ శ్రీరాముడు పోగొట్టుకున్న అమూల్య నిధిని మనం ఇక్కడ ఉందని చెప్తే చాలు ఆయన ఎంతో సంతోషిస్తాడు. ఆయన ఒక్కరే ఎందరినో శత్రువుల పీచమణచగలడు. మనం ఆయనతో ఉండి శత్రువును తుదముట్టించి శ్రీరాముని ప్రాణాధికమైన పెన్నిధి అయిన సీతను దగ్గర చేరిస్తే చాలు. ఆయన మనం ఋణం తీర్చుకొన్నట్లుగా భావిస్తాడు.

హిమవత్పర్వతం ఉత్తర దిశకు మహిమాన్వితమైన పర్వతం. ఆ ప్రదేశాలన్నీ క్షుణ్ణంగా గాలించండి. మ్లేచ్ఛ దేశాలను పుళిందుల భూములను, శూరసేనుల రాజ్యాలను బాగుగా వెదకండి. ఇంద్రప్రస్థం దాని పరిసర ప్రాంతాలు, దక్షిణ కురు భూములైన కురుక్షేత్రాది ప్రాంతాలు, మద్రక దేశాలు, కాంభోజ రాజ్యాలు, యవనుల భూములు, శకుల దేశాలు, అరట్టక దేశాలు, బాహ్లికరాజ్యాలు, ఋషిక ప్రదేశాలు, పురురాజుల భూములు, టంకణ దేశ ప్రాంతాలు, చీన పరమ చీన భూములు, వరద భూములు, హిమవత్పర్వత భూములు అన్నీ నిశితంగా వెదకండి.

అక్కడ ఉండే లొద్దుగ చెట్లు, పద్మక వృక్షాలు, దేవదారు వనాలు, అన్నీ ఒక్కటీ వదలకుండా రావణుని నివాసం కోసం, సీతాదేవిని ఎక్కడ దాచాడో  తెలీదు కనుక అన్ని ప్రాంతాలను వెతకండి. దేవతలు, గంధర్వులు సంచరించే సోమాశ్రమ ప్రాంతాలు, కాళ పర్వత ప్రాంతాలు, అక్కడ ఉండే పెద్ద పెద్ద గుహలు, సెలయేటి తీరాలలో సీతాదేవి కోసం గాలించండి. ఆ కాళగిరి తర్వాత హేమగర్భం అనే పెద్ద పర్వతం వస్తుంది. సుదర్శనం అనే కొండ కూడా అక్కడికి దగ్గరే ఉంది. ఈ రెండింటిని దాటి అవతలకి వెళ్ళితే అక్కడ దేవసఖ శైలం వస్తుంది. అక్కడ రకరకాల పక్షుల గుంపులు ఉంటాయి. దీని తర్వాత 100 యోజనాల వరకు శూన్యప్రదేశం ఉంది. అక్కడ

నదులు, పర్వతాలు, వృక్షాలు లేవు. దానివలన ప్రాణ సంచారం అక్కడలేదు. దీని తర్వాత దుర్గమారణ్యం ఉంది. అది కైలాస శిఖరంలాగా కనిపిస్తుంది. దీన్ని చూస్తే ఒళ్ళు పులకరిస్తుంది. ఇక్కడే కుబేరుని దివ్యభవనం ఉంది. దీనిని కూడా విశ్వకర్మనే నిర్మించాడు. బంగారు మణులు పొదిగిన అలంకారాలతో దివ్యంగా కనిపిస్తుంది. విశాలమైన సరస్సు ఉంది. దానిలో ఉండే కమలాల, కలువల అందాలు చెప్పనలవి కాదు. అప్సరసలు అక్కడ క్రీడిస్తుంటారు. యక్షరాజ కుబేరుడు కాన అక్కడ అందరూ యక్షులుంటారు. అక్కడంతా కూడా మీరు జానకీదేవి కోసం వెదకండి.

దీని తర్వాత క్రౌంచగిరి ఉంది. దుర్గమమైన గుహ అక్కడుంది. కుమారస్వామి తన శక్తి ప్రయోగించినందువల్ల అది ఏర్పడినదని అంటారు. కాలుపెట్టడానికి వీలు లేకుండా ఉంది. అక్కడ మహర్షులు తపస్సు చేస్తుంటారు. వారికి తపోభంగం కలిగించకుండా మీరు అన్వేషణ సాగించండి. మన్మథుడు తపస్సు చేసిన ప్రాంతమైన ఆవృక్షం అనే కామశైలం ఉంది. అక్కడే ఉన్న మానస పర్వతాన్ని కూడా వెదకండి. అక్కడ ఏ ప్రాణి ఉండదు. మైదాన ప్రదేశాలన్నీ బాగా గాలించండి.

మైనాకం అనే పర్వతంలో మయుడు నిర్మించిన భవనం ఉంది. దానిలో కింపురుషుల, స్త్రీల భవనాలున్నాయి. అక్కడంతా గాలించండి. మైనాక పర్వతం తర్వాత ఒక పవిత్ర ఆశ్రమం వస్తుంది. అక్కడ సిద్ధులు, వాలఖిల్యులు, తపస్సు చేస్తూంటారు. వారికి వినయంగా నమస్కరించి సీతాదేవి జాడ తెలపమని వారిని అర్థించండి. ఆ ఆశ్రమంలో వైఖానసం అనే సరస్సు ఉంది. సూర్యకాంతులతో బంగారు వన్నెలతో అక్కడి ప్రదేశాలు అలరారుతుంటాయి. అక్కడ కుబేరుని గజవాహనం అయిన 'సార్వభౌమం'తో ఆడు ఏనుగులు తిరుగుతుంటాయి. వీటి తర్వాత ఒక ప్రదేశం ఉంది. అక్కడ సూర్యచంద్రులు, నక్షత్రాల కాంతి ప్రసరించదు. అక్కడ మేఘదర్శనమే ఉండదు. ఆకాశం శూన్యంగా ఉంటుంది. కాని దేవతలతో సమానమైన దివ్యతేజోమూర్తులు తపస్సు చేస్తుంటారు. వారి ప్రకారమే సూర్యుని మించిన వెలుగు ప్రసరిస్తూ ఉంటుంది. దీని తర్వాత 'శైలోదం' అనే నది ఉంది.

ఆ నదికి ఇరువైపులా కీచకములు అనే వెదుర్లు ఉంటాయి. అవి వంగి ఒకదానితో మరొకటి పెనవేసుకొని వంతెనలాగా కనిపిస్తాయి. ఆ వంతెన మీదనుంచి తపస్సంపన్నులు రాకపోకలు చేస్తుంటారు. ఆ నదీ తీరంలోనే ఉత్తర కురుభూములున్నాయి. అక్కడ నదులు, జలాశయాలు సమృద్ధిగా ఉన్నాయి. అందులో కమలాలు, పద్మాలు విరబూసి వింత శోభను కలిగి ఉంటాయి.

ఆ నదీ తీరాలు అందమైన ఇసుక తిన్నెలతో మనోహరంగా ఉంటాయి. అక్కడ ముత్యాలు, మణులు, బంగారాలు దొరుకుతాయి. అక్కడి పర్వతాలు బంగారు కాంతులతో వెలుగులు విరజిమ్ముతుంటాయి. అన్ని కాలాలలో అద్భుత పరిమళాలను వెదజల్లే పూలు, పండ్లు సమృద్ధిగా ఉంటాయి. అక్కడ కొన్ని వృక్షాలు వస్త్రాలను ఇస్తాయి. మరికొన్ని ముత్యాలు, వైదూర్యాలు పొదిగిన చిత్రమైన ఆభరణాలనిస్తాయి. మరికొన్ని వృక్షాలు చిత్రవిచిత్రమైన బంగారు తల్పాలు, అస్తరణాలు ఇస్తాయి. ఇంకొన్ని తరువులు మనస్సుకు ఇంపైన మూల్యములను, కమ్మని పానీయాలను, భక్ష్యాలను ప్రసాదిస్తాయి. అక్కడి స్త్రీలు సద్గుణవంతులు. చక్కని రూపయౌవనాలతో దివ్య తేజస్సుతో ఉంటారు. గంధర్వులు నాగులు, కిన్నెరులు, సిద్ధులు, విద్యాధరులు స్త్రీలతో కూడి ఆనందిస్తుంటారు. వారందరూ

సత్కార్యాలు చేసినవారు. నిరంతరం మధురగీతాలాపనలు, వేణు వీణా మృదంగతాళధ్వనులు, కమ్మని దరహాస ధ్వనులు వినిపిస్తూ ఉంటాయి. అక్కడ చెడు ఆలోచన చేసేవాళ్ళు కాని, కోరిక తీరనివారు కాని ఎవరూ ఉండరు. ఆ కురుదేశ ప్రాంతాలు వెదుకుతూ ముందుకు సాగండి. అప్పుడు లవణసముద్రం కనిపిస్తుంది. ఆ సంద్రం నడుమ సోమగిరి అనే సువర్ణపర్వతం ఉంది. మీరు వెతికేటపుడు అలసటతో ఉంటే కాసేపు సేద తీర్చుకుని మళ్ళీ వెతకడం మొదలుపెట్టండి లేకపోతే అలసిన శరీరం సరిగా పనిచేయదు" అని సుగ్రీవుడు చెప్పుతున్నాడు. ఇంద్ర బ్రహ్మ లోకాలలోనివారు ఈ సోమగిరి అందాలను చూస్తుంటారు. రాత్రివేళ సూర్యుడు లేకున్నా విపరీతమైన వెలుగు ప్రసరిస్తూ ఉంటుంది. అక్కడ విష్ణుభగవానుడు, బ్రహ్మ, శంకరుడు ఉంటారు. వారిని బ్రహ్మర్షులు సేవిస్తుంటారు. మీరు ఎవరూ ఉత్తర కురుభూములను దాటి వెళ్ళరాదు. దైత్యులకే కాక దేవతలకు కూడా అక్కడికి వెళ్ళడం అసాధ్యం. కనుక అక్కడివరకు సీతాదేవిని అన్వేషించి తిరిగి రండి. ఆపైన సూర్యరశ్మి ఉండదు. నేను చెప్పని ప్రదేశాలు ఏవైనా ఉంటే వాటిని కూడా మీ బుద్ధిని అనుసరించి వెదకిరండి. మీరు కష్టాలను ఓర్చుకొని సీతాదేవి క్షేమవార్తను తీసుకొని రండి. మీరు వాయువేగ గమనులు. సూర్యతేజస్సుగలవారు. మీరు ఈ ఘనకార్యం చేసి వస్తే మా సంతోషానికి అవధే ఉండదు. మిమ్మల్నే కాక మీ బంధు మిత్రులను మిమ్ము ఆశ్రయించినవారిని సైతం సంతోషపెడ్తాను. మీరు క్షేమంగా వెళ్ళి లాభకరమైన వార్తతో తిరిగి రండి అని చెప్పి వారిని ఉత్తరదిశకు పంపారు.

* * *

# హనుమంతునికి ముద్రికా ప్రదానం

## సర్గ - 44

**సీ**తాన్వేషణ కార్యం హనుమంతుడు తప్పక చేస్తాడని సుగ్రీవునికి అన్పించింది. అందుకే మారుతిని దగ్గరకు పిలిచాడు. ఆప్యాయంగా చేతితో స్పృశించాడు. "హనుమంతా! వానరోత్తమా! జంతువులు తిరిగే భూములలో, ఎట్టి ఆధారం లేని అంతరిక్షంలో, సుడిగాలులలో, దివ్యశక్తి సంపన్నులైన దేవతలుండే స్వర్గంలో పశుపక్ష్యాదులు సంచరించ వీలులేని నీటిలో నీ గమనానికి అడ్డు ఉండదు.

అసురులు, నాగులు, మానవులు, దేవతలు ఉండే ప్రదేశాలే కాక సంద్రాలు, పర్వతాలు ఉండే సమస్త లోకాలు నీకు తెలిసినవే. నీవు గమనంలోను, వేగంలోను, శక్తి సామర్థ్యాలలోను నీ తండ్రి వాయుదేవుని అంతటివానివి. నీ బలపరాక్రమాలకు సాటివచ్చే ఏ ప్రాణి భూమండలాన లేదు. నీవే సీతాదేవిని కనుగొనే మార్గాన్ని ఆలోచించు. నీవు మంచి ఉపాయశాలివి. నీతికోవిదునివి. దేశ కాలాలకు అనుగుణంగా ప్రవర్తించే బుద్ధిశాలివి నీవేనని" సుగ్రీవుడు హనుమంతునితో చెప్పాడు. సుగ్రీవుడు సీతాన్వేషణభారాన్ని హనుమంతునికి అప్పజెప్పాడని శ్రీరాముడు అనుకొన్నాడు. శ్రీరాముని మనస్సు కూడా హనుమంతుడే కార్యసిద్ధిని పొందగలడని

చెప్పింది. హనుమంతుని గూర్చి ఆలోచించాడు. సుగ్రీవుడు గట్టి నమ్మకాన్ని మారుతిమీద పెట్టుకొన్నాడు. ఆ పనిని చేస్తాననే ధైర్యం హనుమంతునిలో కనిపిస్తోంది. సుగ్రీవునికి ఇతని సామర్థ్యం బాగా తెలిసి ఉంటుంది. ఇతనివలనే కార్యం సాఫల్యం జరుగుతుంది అని శ్రీరామునికి అనిపించింది. ఒకసారి శ్రీరాముడు హనుమంతుని తేరిపార చూశాడు. చాలా సంతృప్తి కలిగింది. లోలోపల ఆనందించాడు. ఆ ప్రభువు హనుమంతుణ్ణి దగ్గరకు పిలిచాడు. "హనుమా! నా పేరు చెక్కి ఉన్న ఉంగరాన్ని నీకు ఇస్తున్నాను దీన్ని తీసుకో". ఇది సీతకు నా ఆనవాలుగా ఇవ్వు. అప్పుడు జానకీదేవి ఈ ముద్రిక చూస్తుంది. నీవు శ్రీరాముని నుండి వచ్చిన దూతవే! అని అనుకొంటుంది. ఏ అనుమానం లేకుండా నిన్ను విశ్వసిస్తుంది. నీ కార్యోత్సాహం, ధైర్యసాహసాలు, నీ పరాక్రమం, సుగ్రీవుని సందేశం అన్నీ నాకు నీవే కార్యాన్ని సాధిస్తావని చెప్తున్నాయి. నీవే నా సీతాదేవిని చూసి వస్తావని నేను ఆశపడ్తున్నాను" అని చెప్పాడు. వానరేంద్రుడు హనుమంతుడు ఆ మాటలకు సంతోషించాడు. ఆ ముద్రికను తీసుకొని తలపై పెట్టుకొన్నాడు. ఆ తర్వాత ప్రభువుకు శ్రీరామునకు నమస్కరించి బయలుదేరాడు. ఆయనతో కపులందరూ నడిచారు. హనుమంతుడు నిర్మలమైన ఆకాశంలాగా కనిపించాడు. చంద్రుని వెన్నెల లాగా మనస్సులు చల్లబడినాయి. "వాయుసుతా! నీవే సీతమ్మజాడను తెలుసుకొనిరా" అని అందరూ ముక్తకంఠంతో అన్నారు. సుగ్రీవుడు వానరులందరికి పనులను అప్పగించాడు. అందరు సీతాన్వేషణలో ఎలా చేయాలో ఆలోచిస్తున్నారు. వారందరిలో ఉత్సాహం ఉరుకలు వేస్తోంది. శ్రీరాముని మనసు కాస్త ఉపశమిస్తోంది. ఇక త్వరలో నా సీత జాడ తెలియబోతున్నదని ఆనందిస్తున్నాడు. లక్ష్మణుని మనసు కూడా వదినమ్మ త్వరలో దొరుకుతుంది ఇక మా అన్నను సంతోషంతో ఉండడాన్ని చూస్తాను అని అనుకొంటున్నాడు.

* * *

# సీతాన్వేషణాప్రారంభం

## సర్గ - 45

వానరులందరిని ఒకచోట సమావేశపరిచాడు. అందరికి సూచనలు ఇచ్చాడు. శ్రీరామ కార్యాన్ని సఫలీకృతం చేయండి అని ధైర్యాన్ని ఉత్సాహాన్ని వానరులలో సుగ్రీవుడు కలిగించాడు. వారందరూ మిడుతల్లాగా ఎగురుతూ జానకీని వెదకడానికి బయలుదేరారు. నెల గడువు వరకు రామలక్ష్మణులు ప్రసరణగిరిపైనే నివసించారు.

హిమవత్పర్వంతో ఉండే ఉత్తర దిశకు శతవలి అనుచరులతో కలిసి బయలుదేరారు. వినతుడు తూర్పు దిక్కుకు, తారుడు, అంగదుడు హనుమంతుడు దక్షిణ దిశకు సుషేణుడు పశ్చిమదిశకు బయలుదేరారు. సుగ్రీవుడు వారినందరిని పంపించివేసి ఇక ఎలా అయినా రామకార్యం జరిగి తీరుతుందని సుగ్రీవుడు విశ్వసించాడు.

బయలుదేరిన వానరులందరూ మనం రాజాజ్ఞను శిరసావహించుదాం. రావణుని హతమార్చి సీతమ్మను తీసుకువద్దాం అని కేకలు వేశారు. వారిలో వారు ప్రశంసించుకొంటూ, గర్జిస్తూ, నవ్వుతూ, త్రుళ్ళుతూ, ఎగురుతూ,

దుముకుతూ, సంతోషాతిశయంతో ముందుకు సాగారు. ఎవరికివారు ఆ దుష్టరావణుడు నాకు చిక్కితే వాని పని అధోగతే అని బీరాలు పలుకుతున్నారు.

ఎవరికి వారు తామే సీతమ్మను తీసుకొచ్చేస్తున్నట్లుగా భవిష్యత్తును చెప్తున్నారు. సీతమ్మను చిటికెలో తెచ్చేస్తాం, దీనికి నెల గడువు అవసరం లేదు. సుగ్రీవుడు ఎక్కువ రోజుల అవధిని ఇచ్చాడని అనుకొంటున్నారు.

వానరులందరు గబాగబా వెళ్లుతున్నారు. వారిలో వారు ప్రగల్భాలు పలుకుతున్నారు. కొందరు నేనే రణానికి రావణుని పిలిచి వానిని వాని పరివారాన్ని నాశనం చేసేస్తాను. ఒక్క క్షణంలో సీతామాతను తెచ్చేస్తాను అంటున్నారు. మరికొందరు వైదేహి పాతాళంలో ఉన్నా సరే నేను ఒక్కడినే వెళ్ళి ఆ తల్లిని నా భుజాలపై ఎక్కించుకొని వచ్చేస్తాను. ఎన్ని కష్టాలనైనా సహించి ఆ తల్లిని శ్రీరాముని చెంతకు చేర్చి ఆయనకు సంతోషం కలిగిస్తాను అంటున్నారు.

వృక్షాలను పెకిలించివేస్తాం, భూమిని బ్రద్దలు చేస్తాం, సముద్రాలను అల్లకల్లోలం చేస్తాం, ఎన్ని యోజనాల దూరం ఐనా నేను ఎగరగలను అని ఒకడు అంటే నా కంటే ఎత్తుగా ఎవరూ ఎగరలేరని మరొకరు అంటున్నారు. భూమండలంలోని గాని, పాతాళంలోగాని, అరణ్యాలలోని గాని నిర్భయంగా సంచరించి జానకీదేవిని తీసుకువస్తాం.

ఎక్కడ ఉన్నా ఆ తల్లిని తెచ్చి ఈ తండ్రిని సంతోషపెడ్తాం "వానరరాజా! నీవు నిశ్చితంగా ఉండు" అని వారందరూ సుగ్రీవునకు చెప్తూ వెళ్ళారు.

* * *

# సుగ్రీవుడు భూమండలం తిరిగి వచ్చిన విషయంచెప్పటం

## సర్గ - 46

**వా**నర వీరులందరూ తమ బలాలతో సీతాన్వేషణకు ముందుకు సాగిపోయారు. అప్పుడు రామ సుగ్రీవులు మాట్లాడుకొంటున్నారు. "వానరోత్తమా సుగ్రీవా! నీకు ఈ సమస్త భూమండలం గురించి ఎలా తెలిసింది" అని శ్రీరాముడు ఆశ్చర్యంగాను, ఆనందంగా అడిగాడు.

"నరశ్రేష్ఠా! నా కథ చెప్తా విను" – అంటూ మా అన్న వాలి ఒకసారి మహిషరూపంలో ఉన్న దుందుభిని మలయగిరి వైపు తరిమికొట్టాడు. ఆ రాక్షసుడు ఆ మలయ పర్వతగుహలోకి దూరాడు. వాలి కూడా దుందుభిని చంపాలని అందులోకి వెళ్ళాడు. సంవత్సరం గడిచినా మా అన్న రాలేదు కాని ఆ గుహ నుండి రక్తం దారులు కట్టి ప్రవహించింది. నేను మా అన్న ఆ దుందుభి చేతిలో మరణించాడని అనుకొన్నాను. దానితో నాకు శోకం ముంచుకు వచ్చింది.

అప్పుడు నేను దుందుభికి భయపడి ఆ బిలాన్ని మూసివేస్తే అతడు రాలేడు కదా అని అనుకొన్నాను. వెంటనే ఒక పెద్ద శిలతో ఆ గుహను మూసివేసి కిష్కింధకు బయలుదేరి వెళ్ళాను. దుఃఖం ఉన్నా రాజ్యభారాన్ని మోస్తూ నా భార్య రుమను, తారను స్వీకరించాను. మిత్రులతో కూడి రాజ్యవ్యవహారాలను చూస్తున్నాను. ఒక రోజు దుందుభిని చంపి వాలి నా దగ్గరకు వచ్చాడు. మా అన్న చూడగానే నాకు సంతోషం వేసింది.

సగౌరవంగా నేను ఆ రాజ్యాన్ని అప్పగించాను. నేను చేసిన తప్పుకు వివరణ చెప్పి క్షమించమని వేడుకొన్నాను. కాని ఆయన నా మాటను త్రోసిపారేసి నాపై యుద్ధానికి వచ్చాడు. నన్ను చంపాలనే క్రోధంతో నాపై ఉరికాడు. నేను దాన్ని చూచి అక్కడ నుంచి పారిపోయాను. నా వెనుక నా నలుగురు మంత్రులు వచ్చారు. వాలి నన్ను నా మిత్రులను తరుముతూ వెంటాడాడు.

నదీ తీరాలు, వనాలు, నగరాలు దాటుతూ నా కాలి బలంకొద్దీ పరుగు తీశాను. అప్పుడు నాకు ఈ భూమి అద్దంలో కనిపించినట్లు చిన్నదిగా కనిపించింది. అలాతచక్రంలాగా ఆవుగిట్ట ప్రమాణంతో భూమి కనిపించసాగింది. నేను మొదట తూర్పు దిక్కుకు వెళ్ళాను. అక్కడ ఉండే నదులు, పర్వతాలు, నగరాలు దాటి ఉదయాద్రిని చేరుకొన్నాను. ఇంకా వాలి వెంటాడడం గమనించాను. మళ్ళీ దక్షిణ దిశకు పరుగు లంకించుకొన్నాను. అక్కడ ఉండే వాటిని అధిగమిస్తూ వెళ్ళాను.

కాని నన్ను వాలి వదలలేదు. మళ్ళీ నేను అక్కడనుంచి పశ్చిమదిశకు వెళ్ళాను. అక్కడంతా తిరిగి తిరిగి అస్తాద్రిని చూశాను. అక్కడా వాలి వదలకపోయేసరికి నేను ఉత్తరదిశకు పరుగెత్తాను. హిమవత్పర్వతాన్ని మేరుగిరిని లవణసముద్రాన్ని చూశాను.

ఎక్కడకు పోయినా నాకు రక్షణ దొరకలేదు. ఏ పుణ్యాత్ముడు నన్ను ఆదుకోలేదు. అప్పుడు అంతా తిరిగి తిరిగి అలసిపోయిన నాతో హనుమంతుడు ఇలా చెప్పాడు. 'ఓ సుగ్రీవా! ఇక్కడ ఋశ్యమూక పర్వతం ఉంది. దాని మీదకు వాలి రాడు. మతంగముని చేత వాలి శపించబడ్డాడు. వాలి ఆ పర్వతం మీద కాలుపెడితే తల నూరు వ్రక్కలు అవుతుందని ఆ మహర్షి శపించాడు. అది తెలుసుకొన్న వాలి అక్కడకి రాడు.

మనం అక్కడుండవచ్చ'ని హనుమంతుడు చెప్పటంతో నేను ఆనందించాను. అప్పటినుంచి నేను హనుమంతుడు ఇక్కడే ఉన్నాం. మీరు వచ్చి నన్ను రక్షించారు. వాలికి భయపడిన నేను సమస్త భూమండలాన్ని చుట్టివచ్చాను" అని సుగ్రీవుడు శ్రీరాముని సందేహాన్ని తీర్చాడు. శ్రీరాముడు సుగ్రీవుడు చెప్పినదాన్ని విని చాలా బాధపడ్డాడు. పాపం నీవు ఈ భూమండలం అంతా వాలి వలన భీతితో చుట్టవలసివచ్చింది గదా అని అన్నాడు. సుగ్రీవా! నేను నీవు మిత్రులమయ్యాం. ఇక మనిద్దరికి ఆ భగవంతుడు మంచిరోజులను ప్రసాదిస్తాడులే" అని చెపుతూ ఒకనినొకరు ఓదార్చుకొన్నారు.

* * *

# వానర ప్రముఖుల తిరుగుముఖం

## సర్గ - 47

సీతాన్వేషణకు వెళ్ళిన వానరులందరూ సుగ్రీవుడు చెప్పినట్లు ఆయా ప్రదేశాలన్నీ గాలించి శోధించారు. నదీ నదాలు, పర్వతాలు, గుహలు, సముద్రాలు అన్నీ గాలించారు. అడవులు, నిర్జనారణ్యాలు, జనారణ్యాలు అన్నీ వెదికారు. పగలంతా వెదకి రాత్రి ఒకచోట వారందరూ చేరేవారు. అక్కడ తరువులకున్న ఫలాలను తిని జలాశయాలలోని నీరు త్రాగి ఆకలిదప్పులను తీర్చుకొనేవారు.

అలా వారు అన్నిచోట్లా గాలించి వెదికారు. కాని, వారెవరికీ సీతమ్మ జాడ అంతు చిక్కలేదు. దానితో సుగ్రీవుడు ఇచ్చిన గడువు తీరిపోతుందనే భయంతో తిరుగుముఖం పట్టారు. వారిలో నిరాశ ఎక్కువ అయింది. వారందరిలో సీతమ్మను కనుగొనలేక పోయామని, శ్రీరాముని నిరాశాపరుస్తున్నామని బాధపడుతున్నారు. సుగ్రీవుడు శ్రీరామచంద్రునికి ప్రత్యుపకారం చేయలేకపోయానని చింతిస్తాడన్న విచారం వారిలో ఎక్కువైంది.

సీతమ్మను వెతకడానికి వెళ్ళిన వారందరూ మళ్ళీ యథాస్థానానికి చేరి తమ ప్రభువుకు సీత జాడ కనుక్కోవడానికి వారు పడిన శ్రమనంతా వివరించి చెప్పారు. కాని, కార్యాన్ని సాధించలేకపోయారని నిరాశగా చెప్పారు.

అలా వెనుదిరిగి వచ్చిన వారిలో దక్షిణదిశకు వెళ్ళినవారు సుగ్రీవాదులకు కనిపించలేదు. ఎక్కడో ఆశ మిణుకుమనింది. వానరులందరూ ముక్తకంఠంతో హనుమదాదులు సీతమ్మ జాడను తెలుసుకొని వస్తారు. రావణుడు ఉండేది లంకలోనే కదా అని చెప్పారు. వీరిని చూచి సుగ్రీవునకు ఎక్కడలేని నిరాశ కలిగింది. కానీ వానరులందరూ హనుమదాదుల గురించి చెప్పడం విని ఎక్కడో ఆశ కలిగింది.

* * *

# సీతాన్వేషణంలో అంగదుని తేజం

## సర్గ - 48

దక్షిణదిశకు బయలుదేరిన అంగదుని సేన చాలా దూరం ప్రయాణం చేసి వింధ్యపర్వతాన్ని చేరింది. వింధ్య పర్వతశిఖరాలను, గుహలను, అడవులను, దుర్గాలను, సరస్సులను, వృక్షాలను, చెట్లతోపులను, ఇలా కనిపించిన వాటినన్నింటిని అంగుళం అంగుళం వెదకడం ప్రారంభించారు.

వారు ఎంత వెదకినా జనకసుత జాడ వారికి తెలియలేదు. వానరులందరూ సీత జాడలను వెదుకుతూ ఆకలి వేసినప్పుడు వారి దగ్గరలో ఉన్న వృక్షాల ఫలాలను తినేవారు. వారికి గుహలతో ఉన్న కీకారణ్యం కనిపించింది. అక్కడ నీరు లేదు. ప్రాణిశూన్యమైన ప్రదేశంలాగా అనిపించింది. అది కూడా వదలకుండా ఒళ్ళు గగుర్పాటుకు లోనవుతున్నా వారు ఆ దుర్గమారణ్యం అంతా వెదికారు.

వారికి మరొక నిర్జనారణ్యం కనిపించింది. అక్కడ ఎండిపోయిన వృక్షాలున్నాయి. జలాశయాలన్నీ ఇంకిపోయి ఉన్నాయి. కందమూలాల జాడ కూడా లేదు. వన్యమృగాలైన దున్నలు, ఏనుగులు, లేళ్ళు, పులులు ఆఖరికి పక్షులు కూడా అక్కడ లేవు. ఏ ప్రాణి అక్కడ లేదు.

ఒకానొకప్పుడు ఈ అరణ్యంలో మంచి వనం ఉండేది. ఇక్కడ కండుడు అనే మహర్షి తపస్సు చేసుకొనేవాడు. ఆయన గొప్ప తపస్సంపన్నుడు. ఆయనకు పదహారేళ్ల కుమారుడు ఉండేవాడు. ఒక రోజు ఆ తాపసి కుమారుడు ఆ వనంలోనే చనిపోయాడు. దానికి ఆ కండు మహర్షి కోపించి ఆ వనాన్ని నాశనం అవ్వమని శపించాడు. దాంతో అక్కడి వృక్షాలన్నీ ఎండిపోయాయి. నదులు సెలయేళ్ళున్న జలాలతో నిండి ఉండే ప్రదేశాలన్నీ ఇంకిపోయాయి. దాంతో ప్రాణులన్నీ మరోచోటకు వెళ్ళిపోయాయి. దాన్ని కూడా వదలకుండా వానరులు వెదికారు.

ఎంత వెదికినా వారికి రావణుని నెలవు చిక్కలేదు. సీతమ్మతావు కనిపించలేదు. ఇంకో ప్రదేశానికి వారు వెళ్ళారు. అక్కడ ఒక భయంకరాకారుడైన రాక్షసుడు వారికి ఎదురయ్యాడు. ఆ రక్కసుడు "ఆహా! మీరు నాకు దొరికారు ఇక మీ అందరికీ చావు మూడినట్లే" అని వీరి పైకి విజృంభించాడు. అంగదుడు వానిని చూసి వీడే రావణుడు అని గట్టిగా అరచేతితో వాణ్ణి చరిచాడు. ఆ దెబ్బకు ఆ రాక్షసుడే దిమ్మతిరిగి బొమ్మలాడి రక్తం కక్కుకొని చచ్చాడు.

ఒక్క దెబ్బకే పడిపోయాడు. వీడు రావణుడు కాడు అని వారు నిర్ధారించుకున్నారు. మరల సీతమ్మ జాడ కోసం అన్వేషణను మొదలుపెట్టారు.

ఆ తర్వాత వారందరూ గుహ కనిపిస్తే అందులోకి వెళ్ళి సీతమ్మకోసం వెదకి వెదకి అలసిసొలసి పోయారు. కాని వారి పని సఫలం కాలేదు.

* * *

# ఆగని అన్వేషణం

## సర్గ - 49

వెదకి వెదకి అలసిపోయిన వానరులను చూశాడు. వారిలో ఉత్సాహం తీసుకొని రావాలని అంగదుడు తలచాడు. "వానరులారా! మనమందరం ఎక్కడెక్కడో సీతమ్మకోసం వెదికాం. కాని ఆ దుర్మార్గుడైన రావణుని జాడను కనుగొనలేకపోయాం. అందరం ఆకలి దప్పులతో ఉన్నాం. ముందు మన ఆకలి తీర్చుకొందాం" అన్నాడు. వారందరూ అక్కడున్న ఫలాలను ఆరగించారు.

మరలా అంగదుడు "వానరులారా! మన ప్రభువైన సుగ్రీవుడు చండశాసనుడు. ఆయన ఇచ్చిన గడువు తీరిపోయింది. కాని మనం కార్యసాఫల్యాన్ని పొందలేదు. విరక్తి నిరుత్సాహం అనేవాటికి కార్యశూరులు లోనుకాకూడదని పెద్దలు చెప్తారు. మనం ఆ రెండూ వీడి మరలా అన్వేషణ కొనసాగిద్దాం. కృషి చేస్తే దొరకనిది

ఏది ఉండదు కదా! అందుకే మరలా మన శ్రమను మొదలుపెడ్తాం. సీతాదేవి కనిపించేంతవరకు అన్వేషణను ఆపవద్దు మనందరం కలసి దేవునిపైన భారం వేసి రామకార్యం చేద్దాం” అని చెప్పాడు.

“వానరులారా! సుగ్రీవుడు కోపస్వభావుడు. శ్రీరామునివలన మనం ఉపకారం పొంది ఉన్నాం. ఆయనకు ప్రత్యుపకారం చేయలేకపోతే తీవ్రమైన శిక్షకు లోను అవుతాం. శ్రీరామ సుగ్రీవులకు మనం భయపడి తీరాలి. కాబట్టి మనం వెదకే పని తిరిగి ప్రారంభిద్దాం. ఇది మీకు నచ్చకపోతే ఇంకేదైనా ఉపాయం ఉంటే చెప్పండి. దాన్ని అనుసరించుదాం అని అంగదుడు అన్నాడు. గంధమాదనుడు ఆయాసపడుతూ “ఈ అంగదుడు చెప్పే మాటలు మనకు శ్రేయస్సు కల్గిస్తాయి. సుగ్రీవుడు చెప్పినట్లే ముందుకు సాగుతూ గిరులు, తరులు, వృక్షాలు, పొదలు, నదీ నదాలు అడవులు, అరణ్యాలు అన్నీ వెదుకుతూ పోదాం. ఎలా అయినా సీతమ్మను కనుగొని తీరుదాం” అని చెప్పాడు.

వారు అలా వెదుకుతూ ముందుకు వెళ్ళి రజతపర్వతాన్ని అధిరోహించారు. రమ్యమైన లొద్దుగువనాలు, ఏడాకుల అరటి చెట్లవనాలు ఇలా అన్ని ప్రదేశాలు ఆ కపివరులు వెదికారు. అయినా వారికి సీతమ్మ కనిపించలేదు. ఆ గిరి పైనుంచి క్రిందికి చూచినపుడు వారు గుహలను చూశారు. వెంటనే దిగివచ్చి గుహలను పరిశీలించారు. వెదికి వెదికి వారి శరీరం దస్సిపోయింది. దాంతో ఒక్కక్షణం ఆగి ఊపిరి తీసుకొన్నారు.

మరలా అన్వేషణ మొదలుపెట్టి వింధ్య మొదలునుండి చివరిదాకా వెదికారు. గుహలు, కొండలు, గుట్టలు, నదీనదాలు, చెట్లుచేమలు, ఇలా ప్రతిఒక్క దానిని వెదుకుతూ వెళ్ళుతున్న వారికి ఎక్కడా రావణుని ఉనికి తెలిపే ఛాయలు కూడా వారికి కనిపించలేదు. వారి ఒడలు అలసటకు లోనై బడలిక తీర్చుకోవాలని ఆశిస్తున్నాయి. వారి మనసులు మాత్రం రావణుని ఉనికి తెలుసుకుని వానిని మట్టుపెట్టాలని ఆత్రపడసాగాయి.

* * *

# హనుమదాదులకు తాపసి తారసిల్లటం

## సర్గ - 50

వానరులు వింధ్యపర్వతంలోని గుహలను, అడవులను, గుట్టలను, గుబురులను, ఎగుడుదిగుడు నేలను అంతా వెదికారు. నైరుతి దిశకు వారు మళ్ళారు. అక్కడ పెద్ద పెద్ద అరణ్యాలు కాలు పెట్టడానికి సందు లేకుండా వృక్షాలతో నిండి ఉన్నాయి. ఐనా సరే వారందరూ ఒకరి నొకరు పట్టుకుంటూ నడిచి నడిచి ఆ ప్రదేశం అంతా వెదికారు.

గజుడు, గవయుడు, ద్వివిదుడు మొదలైన వారంతా అలా వెదుకుతూ ముందుకు సాగారు. వారికి ఒక గుహ కనిపించింది. ఆ బిలం పేరు ఋక్షబిలం. అది ఒక దానవుని అధీనంలో ఉంది. హనుమదాదులు చాలా అలసి ఆకలి దప్పులతో నీరసించి ఉన్నారు. ఆ క్షణంలో వారికి నీళ్ళు దొరికినా బాగుండు అనిపించింది. ఆ

గుహలో వారికి లతావృక్షాలు ఉన్నట్లు చూశారు. క్రౌంచపక్షులు, హంసలు, బెగ్గురు, చక్రవాకాలు బయటకు రావడం వారు చూశారు. అవన్నీ నీళ్ళలో తడిసి ఉన్నట్లు కనిపించాయి. పద్మాల రేణువులు అంటుకొని ఉండడంతో ఎర్రగా కనిపిస్తున్నాయి.

వారు ఆ గుహ దగ్గరకు వెళ్ళారు. అందులోనుంచి మంచి మంచి సువాసనలు వచ్చాయి. అందులో ప్రవేశించడం కష్టంగా అనిపించింది. వారికి అది పాతాళ గుహో? లేక రావణుని మాయా మందిరమా? అనే అనుమానం వచ్చింది. పరిస్థితులను చూసి నీరు ఉందని అనుకొని సంతోషించారు. కాని ప్రతికూలపరిస్థితులు కనబడుతూ అసలే అలసిపోయిన వారికి నిస్సత్తువను కలిగించింది.

ఆ గుహనంతా బాగా పరిశీలించి చూసి “ఓ వానరులారా! మనం ఈ దక్షిణదిశ బాగా వెదకి వెదకి అలసిపోయాం. ఇక్కడ మాత్రం పచ్చని ఆకులున్న చెట్లు, తడిసిన రెక్కలున్న పక్షులు కనిపిస్తున్నాయి. కాబట్టి ఇక్కడ తప్పక జలాశయం ఉంటుంది. పదండి ముందుకు వెళ్ళదాం” అని హనుమంతుడు అన్నాడు.

అలా వాళ్ళు ఆ బిలం లోపలికి వెళ్ళారు. అక్కడ చిక్కగా చీకటి అలుముకోనుంది. కాని వారికి వెలుగులో కనిపించినట్లుగా అంతా కనిపిస్తూనే ఉంది. అదే వారి ఘనత. అక్కడ మృగాలు, పక్షులు అన్నీ తిరుగుతున్నాయి. వారంతా మనోవేగంతో గుహలోపలికి వెళ్ళారు. అక్కడంతా చెట్లు చొరరానంత పెరిగి ఉన్నాయి. వానరులందరూ ఒకరి చేతులు మరొకరు పట్టుకొని ముందుకు వెళ్తున్నారు. అలా వారు ఒక యోజనం దూరంగా వెళ్ళారు. వారంతా ఆకలితో దాహంతో క్రుంగి కృశించిపోయి ఉన్నారు.

అలాంటివారికి ఒక్కసారిగా వెలుగు కనిపించింది. ఆ దిశగా వారు నడిచారు. అక్కడ అగ్నిజ్వాలలాగా వెలుగులీనే వృక్షాలు కనిపించాయి. అక్కడ మద్ది, తాళ, పున్నాగ, ఏరుమద్ది, అశోక, చంపక, నాగ వృక్షాలున్నాయి. ఎర్రని చిగురుటాకులతో ఉన్న లతలు అరటి చెట్లకు అల్లుకుని ఉన్నాయి. అక్కడ జలసమృద్ధిగా ఉన్న సరస్సుల నిండా వికసించిన పద్మాలు, కనువిందుగా కదిలే చేపలు తాబేళ్ళు చూశారు. అదంతా నయనానందకరంగా అనిపించింది.

ఆ గుహలో పెద్ద పెద్ద భవనాలు చూశారు. వాటి శిఖరాలు బంగారం వెండితో నిర్మితం అయి ఉన్నాయి. ఆ భవనపు గోడలు వైడూర్యం, ముత్యాలతో పొదిగి ఉన్నాయి. ఆ భవనాలు చుట్టు పుష్పించిన వృక్షాలున్నాయి. వాటిపై మకరందాన్ని ఆస్వాదిస్తూ తుమ్మెదలు ఝుంకారం చేస్తున్నాయి.

ఆ భవనాలలో తల్పాలు, ఆసనాలు, వాహనాలు అన్నీ అందంగా అలంకరించి ఉన్నాయి. చందనాది పరిమళాలు కందమూలాది ఆహార పదార్థాలు, పానీయాలు, తేనెలు అన్నీ సిద్ధం చేసి ఉన్నారు. వీటినన్నింటిని సంతోషంగా చూస్తూ వానరులు ఆ భవనంలోపలికి వెళ్ళారు. వారికి అక్కడ కృష్ణాజినం ధరించిన ఓ స్త్రీ కనిపించింది. ఆమె తపస్సంపన్నురాలు అనిపించింది. వానరులందరికి ఒక్కసారి ఆకలికి ఆహారం దొరికిందనుకొని సంతోషం వేసింది. అదేక్షణంలో ఎవరో ఏమిటో ఈ తాపసి లాగా ఉన్న ఈ స్త్రీ నిజంగా తాపసురాలేనా? లేక ఏదైనా రాక్షస మాయ నా అనే అనుమానం కలిగి వారికి విచారం కలిగింది.

ఎందుకైనా మంచిదనుకొని వానరులు ఆమెకు దూరంగా నిలిచారు. వానరులతో కలసి హనుమంతుడు ఆమెకు నమస్కరించాడు. "అమ్మా! మీరెవరు? ఈ అరణ్యంలో ఈ భవనం, గుహ, బంగారు రత్నరాసులు ఇక ్కడ ఎందుకున్నాయో చెప్పుఅమ్మా. దయతో నాకు చెప్పమ్మా" అని అడిగాడు.

* * *

# స్వయంప్రభ ఆతిథ్యం

## సర్గ – 51

హనుమంతుడు ఆ తాపసితో ఇంకా ఇలా చెప్పాడు. "అమ్మా! మేము ఆకలి దప్పులతో బాగా అలసిపోయాం. నడుస్తూ నడుస్తూ చీకటి గుహలో ప్రవేశించాం. నీళ్ళు ఇక్కడ ఉన్నాయని తలచాం. దాహం తీర్చుకొందాం అని దీని లోపలికి వచ్చాం. కాని ఇక్కడి వస్తుసంపద మమ్ములను దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. ఇది రాక్షస మాయేమోనని మాకు అనుమానం వేస్తోంది. అందుకే మా దాహార్తి తీరే మార్గం కానరాక ఏమి చేయాలో అని అనుకొంటుంటే మీరు కనిపించారు."

"తల్లీ! ఉదయభానుని కాంతితో విలసిల్లే ఈ వృక్షరాజాలు, పరిశుభ్రమైన ఆహార పదార్థాలు, స్వర్ణమయములైన భవనాలు, ముత్యాలు, వైడూర్యాలు పొదిగిన కిటికీలు బంగారు వన్నెతో వికసించిన పద్మాలు మంచి సువాసనలు వెదజల్లుతున్న ఫలాలు, బంగారు చేపలు, తాబేళ్లు ఇవన్నీ చూస్తుంటే ఆశ్చర్యానుమానాలు కలుగు తున్నాయి. ఇవన్నీ మీ మహిమవలన ఏర్పరిచినవా లేక ఏ రాక్షసుడన్నా మమ్ము మోసగించ ప్రయత్నమా. అమ్మా! మిమ్మల్ని చూస్తుంటే గొప్ప తపసిద్ధి సంపన్నురాలుగా కనిపిస్తున్నారు. దయచేసి మాకు నిజం చెప్పి పుణ్యం కట్టుకోండి."

"మేము ఒక ముఖ్యమైన కార్యాన్వేషణలో ముందుకు వెళ్ళుతున్నాం. దారిలో మాకు ఎన్నో ఆపదలు, కష్టాలు వచ్చాయి. వాటిని మేమందరం దేవుని కృపతో అధిగమించి ముందుకు పోతున్నాం. కాని మేము నెరవేర్చాల్సిన కార్యంలో ఇసుమంతైనా సఫలం కాలేదు. కాని మేము ఆకలికి తట్టుకోలేకపోతున్నాం అందుకనే నీటిని చూచి ఆనందంతో ఇక్కడికి వచ్చాము."

"అమ్మా మాకు ఇది అంతా వింతగా ఉంది. మాకు ఆనందంగాను, దుఃఖం గాను ఉంది. కనుక మమ్ము కనికరించి అసలు విషయాన్ని చెప్పి మాకు సా యం చేయమ్మా" ఆంజనేయుడు అని అడిగాడు.

ఆ తాపసి హనుమంతుని మాటలకు చిరునవ్వు నవ్వి "అయ్యా! మయుడను దానవశ్రేష్ఠుడు ఉండేవాడు. అతడు మాయావి. తన మాయతో ఈ స్వర్ణవనాన్ని భవనాలను వృక్షాలన్నీ ఇక్కడ సమస్తాన్ని సృష్టించాడు. విశ్వకర్మకు సాటిగా ఇతని నిర్మాణం సాగేది. మయుడు ఒకసారి తపస్సు చేసి బ్రహ్మను మెప్పించాడు. బ్రహ్మ దివ్యమైన వరాన్ని అనుగ్రహించాడు. ఆ వరప్రభావంతో శుక్రాచార్యుని నుండి శిల్పశాస్త్ర జ్ఞానాన్ని పొందాడు."

"దానివలన ఈ సకలసదుపాయాలున్న ఈ బంగారు వనాన్ని సృష్టి చేసుకొని హాయిగా జీవించేవాడు. హేమ అనే అప్సరసపై అనురక్తితో ఆమెతో సుఖించసాగాడు. వారిరువురు ఉండడం దేవేంద్రునకు నచ్చలేదు. మయుడు నిత్యకృత్యాలను విస్మరిస్తున్నాడనుకొన్న దేవతల రాజు మయుని దూరంగా పంపివేయాలని అనుకొన్నాడు. దానిని అనిమిషపతి చూశాడు. కాని మాటలతో పని సాగదనుకొన్న మహేంద్రుడు తన వజ్రాయుధంతో మయుడిని యముని దగ్గరకు పంపివేసి ఈ వనాన్ని హేమకే ఇచ్చివేశాడు."

"నేను మేరు సావర్ణి అను అప్సరస కూతురిని. నేను హేమ స్నేహితులం. ఇప్పుడు హేమ నన్ను ఈ వనాన్ని రక్షిస్తుండమని నాకు చెప్పింది. దీనివలన నేను ఇక్కడ ఉంటున్నాను. మీరు ఆకలి దప్పులతో అలసిపోయారు కదా. ఇదిగో ఈ ఫలాలు కందమూలాలు తినండి. ఈ నిర్మలమైన పానీయాలు సేవించండి. ఆ తర్వాత వానరోత్తములారా! మీరు స్వస్థులై మీ వృత్తాంతాన్ని నాకు చెప్పండి. మీరు ఎవరో? ఏ పనిమీద ఈ దుర్గమారణ్యాలకు వచ్చారో నేను వినదగినవి ఉంటే నాకు చెప్పండి అని తాపసి అడిగింది. ముందు మీ అలసటను తీర్చుకోండి. ఆ పై మాట్లాడండి" అని చెప్పింది.

* * *

# స్వయంప్రభ సహాయం

## సర్గ - 52

**స్వ**యంప్రభ ఫలాలతో పానీయాలతో వానరులకు ఆతిథ్యం ఇచ్చింది. వారి ఆకలిదప్పులను దూరం చేసింది. తర్వాత "ఓ కపి పుంగవులారా! మీరు మీ వృత్తాంతం మీకు అభ్యంతరం ఏమీ లేకపోతే నాతో చెప్పండి" అని అడిగింది.

ధర్మనిరతురాలైన ఆ తాపసిని చూచి హనుమంతుడు "అమ్మా! మేము శ్రీరామ కార్యార్థమై ఇక్కడకు వచ్చాం. అయోధ్యాప్రభువైన దశరథుని పుత్రులు రామలక్ష్మణులు. శ్రీరాముడు తన భార్య ఐన సీతతో తమ్ముడైన లక్ష్మణునితో తండ్రి ఆజ్ఞను పాటించడానికోసం దండకారణ్యాలకు వచ్చాడు. సోదరులిద్దరూ పర్ణశాలలో లేని సమయంలో రావణుడను రక్కసుడు సీతాదేవిని అపహరించుకొని వెళ్ళాడు.

రామలక్ష్మణులిద్దరూ వైదేహిని వెదుకుతూ సుగ్రీవుని దగ్గరకు వచ్చారు. సుగ్రీవుడు భార్యా వియోగంతో రాజ్యభ్రష్టుడై ఉన్నాడు. ఆయనకు రాముడు రాజ్యాన్ని, భార్యను పొందడంకోసం మహోపకారం చేశాడు. దానివలన సుగ్రీవుడు ఆనందించి శ్రీరామునకు ప్రత్యుపకారం చేయాలని తలచాడు. అఖిలభూమండలంలోని వానరులను ఏకంచేసి సర్వభూమండలాన్ని వెదకించాలని సుగ్రీవుడు అనుకొన్నాడు. అలా అందరిని పంపిస్తూ మమ్మల్ని దక్షిణదిశకు పంపించాడు. వారందరి సంగతి ఏమో కాని మేము సీతమ్మకోసం గాలించాం. ప్రతి అంగుళం వెదకి వెదకి వేసారిపోయాం. కాని మాకు ఆ తల్లి సమాచారం ఏదీ తెలియలేదు. మేం ఆకలి దప్పులతో క్రుంగి కృశించిపోయాం. దాహార్తి తీర్చుకోవడానికి అన్ని వైపులా పరికించి చూశాం. మాకు అంతా శూన్యంగానే కనిపించింది.

అలా వెదకగా వెదకగా ఈ బిలం కనిపించింది. ఇక్కడనుంచి మంచి సువాసనలను మా ముక్కుపుటాలకు చేరాయి. నీటిమీద నుంచి వచ్చేగాలి మమ్ము స్పృశించింది. మేం ఆశతో ఈ బిలాన్ని బాగా చూశాం. అప్పుడు సారసపక్షులు, బెగ్గురు పక్షులు కలహంసలు సందడి చేస్తూ తడిసిన రెక్కలను ఆర్చుకొంటూ బయటకు రావడం చూశాం. పచ్చని ఆకులున్న వృక్షాలు కనిపించాయి. ఇవన్నీ నీరు ఉందనే సంకేతాన్ని చూపెట్టుతున్నాయని సంతోషించాం.

ఈ బిలం లోపలకి ప్రవేశించాం. కాని ఈ చిమ్మ చీకటికి మా ఒళ్ళు గగుర్పొడిచింది. అయినా ఆ జలదరిస్తున్న శరీరంతోనే నీటి జాడకై లోపలికి ఒకరి చేతులు మరొకరు పట్టుకుంటూ లోపలికి వచ్చాం. మా కళ్ళు జిగేలుమనేటట్లుగా ఈ వనం కనిపించింది. ఇక్కడేమన్నా మా సీతమ్మ ఉందేమోనని ఆశతో లోపల అంతా వెదికాం. మమ్ము దిగ్భ్రమకు గురిచేస్తూ ఈ వస్తువులు కనిపించాయి. అంతలో మీరు మాకు దేవతల్లాగా కనిపించారు.

మీరు పెట్టిన ఫలాదులు పానీయాలు మా ఆకలిని దూరం చేశాయి. తిరిగి మేం స్వస్థులమయ్యాం. మేం బాగా తేరుకొన్నాం. మాకు సహాయం చేసిన మీకు మేం ఏం చేయగలమో చెప్పితే సంతోషంగా నీకు ఉపకారం చేసి మా కార్యం కోసం వెళ్తాం" అని అడిగారు. ఆ మాటలకు స్వయంప్రభ "వానరులారా! మీ మాటలే నాకు సంతృప్తిని కలిగించాయి. చాలు నాకు ఇంకేమి అక్కరలేదు" అని చెప్పింది. తాపసి ధర్మయుక్తమైన మాటలు విని వానరులు సంతోషించారు.

"అమ్మా! మేము ఈ బిలంలో తిరుగుతుండగానే మాకు మా ప్రభువు ఇచ్చిన గడువు మీరిపోయింది. మమ్ములను నీవే కాపాడాలి. ఈ బిలం నుండి మమ్ము బయటకు చేర్చు. మేం మా ప్రభు కార్యం చేయాల్సి ఉంది. ఒకవేళ అందులో విఫలం చెందితే మేమందరం మా ప్రాణాలను వదిలేయాల్సి ఉంటుంది. ఇప్పటికే గడువు మీరిపోయింది. మాకు త్వరగా బిలం నుంచి బయటపడే మార్గాన్ని చెప్పు అమ్మా" అని హనుమంతుడు అడిగాడు.

"అయ్యా! మీరందరూ ఒకసారి మీ కన్నులు మూసుకోండి. మీ చేతులతో మీ ముఖాన్ని కప్పుకోండి. అప్పుడు నేను ఈ బిలాన్ని దాటించగలను. అసలు ఈ బిలంలోకి వచ్చినవారెవరైనా తిరిగి ప్రాణాలతో బయటకు పోలేరు. కాని మీరు మీ ప్రభుకార్యంకోసం నిమగ్నులై ఉండడంవలన నేను నా తపశ్శక్తి చేత మిమ్ములను బయటకు చేర్చే మార్గం చెప్తాను. నా మాట విని మీరు కండ్లు మూసుకోండి" అని చెప్పింది. వానరులంతా ఒకసారి ఒకరినొకరు చూసుకున్నారు. హనుమంతుడు చెప్పినట్లు చేద్దాం అనుకొన్నారు. వానరులంతా స్వయంప్రభ చెప్పినట్లే చేశారు. ఆమె ఎంతో సంతోషించింది. ఆమె రామకార్యం పై వారికున్న శ్రద్ధను గమనించింది. వారికి సహాయం చేయడం వలన దైవం తృప్తి పడుతాడనుకుని సంతసించింది. వెంటనే స్వయంప్రభ వారినందరిని బిలం బయటకు చేర్చింది.

"అయ్యలారా! కన్నులు తెరవండి. ఇవిగో మీరు గుహ బయటకు వచ్చారు. ఇదిగో వింధ్యపర్వతం. ఇదిగో ప్రస్రవణ పర్వతం. ఇదిగో దక్షిణ మహాసముద్రం. ఇక సెలవు. మీకు శుభం కలుగుతుంది. నేను నా స్థానానికి వెళ్తాను" అని చెప్పి స్వయంప్రభ మళ్ళీ బిలంలోకి వెళ్ళిపోయింది.

* * *

# వానరుల విచారం

## సర్గ - 53

వానరులందరూ సముద్రం వైపు దృష్టి సారించారు. ఉత్తుంగతరంగాలతో ఎగిసిపడే సముద్రుడు పెద్దగా గర్జిస్తున్నట్లుగా ధ్వనిని పుట్టిస్తున్నాడు. వింధ్యగిరి నైఋతి మార్గంలో ఒక చెట్టు క్రిందికి అందరూ చేరారు. వారందరి మనస్సులు చింతలో మునిగిపోయాయి. ఆ వృక్షం లతలతో పెనవేసుకొని పుష్పించి ఫలాలతో వంగి ఉంది. దాన్ని చూసి వారు వసంత ఋతువు వస్తోంది. మన ప్రభువు మనకు మరణదండనే విధిస్తాడు అని భయపడ్డారు. వృద్ధులు జ్ఞానులైన వానరులు చింతాక్రాంతులు అవడం చూసి, యువకుడు బలిష్ఠుడు స్ఫురద్రూపి ఐన అంగదుడు ఇలా చెప్పాడు. “ఓ మిత్రులారా! మన గడువు ఆ బిలంలోనే అయిపోయింది. ఆశ్వయుజ మాసంలో బయలుదేరుతూ ఒక నెల గడువు తీసుకొన్నాం. కాని అది గడిచిపోయింది. కాని మన ప్రభువు ధర్మప్రవర్తనుడు. ఆయనకు మిత్రులైన మీరు నీతి కుశలురు. మీకు పరాక్రమంలో సాటిఐనవారు లేరు. నన్ను నాయకునిగా చేసుకొని మీరందరూ వచ్చారు. వచ్చిన పని కాలేదు. ఇప్పుడు మనం తిరిగి వెళ్ళి మన ముఖాన్ని ఎలా చూపెట్టగలం. కావున మృత్యువుతోనే మనం నెయ్యం చేయాలి'' అని అన్నాడు. ''మనం పని చేయలేకపోయామని చెప్పి దండనకు నిలబడేకంటే మనమే ప్రాయోపవేశం చేసి మన ప్రాణాలు మనమే తీసుకోవడం మంచిదిగా నాకు అనిపిస్తోంది. మాకు సుగ్రీవుడు బద్ధవిరోధి. నన్ను ఆయన యువరాజుగా చేయలేదు. శ్రీరాముడే నన్ను యువరాజును చేయమని ప్రోత్సహించాడు. ఇప్పుడు నేను పనిలో బీరువునయి వెనుదిరిగాను అని మా పినతండ్రికి చెప్పితే వెంటనే ఆయన నాకు మరణ దండన విధిస్తాడు. ఆ శిక్షకు బదులు నేనే స్వతహాగా ఈ సముద్రతీరంలోనే ప్రాణాలు వదులుతాను” అని అంగదుడు పరితాపం చెందుతూ చెప్పాడు. శ్రీరాముడు సీత వియోగంతో చిక్కి శల్యమై ఉన్నాడు. అసలే సుగ్రీవుడు కాలయాపన చేశాడని ఆ ప్రభువు కోపగించి ఉన్నాడు. ఇప్పుడు మనం కార్యసాఫల్యం పొందలేదని చెప్పితే రాముడు ఖిన్నుడవుతాడు. అది చూచి సుగ్రీవుడు రాముని మెప్పించాలని మనలను కఠిన దండనకు గురిచేస్తాడు. అసలు రాజకార్యం చేయలేని వారు తిరిగి రాజుదగ్గరకు వెళ్ళకూడదు. అక్కడికి వెళ్ళినా ఇక్కడ ఉన్నా మనకు చావు తప్ప మరో మార్గం కనిపించడంలేదు అని అందరూ ఒకేమాట అన్నారు. వారందరిలో చింత గూడుకట్టుకుంది. అంతలో తారుడు లేచి “ఇపుడు విచారించి ప్రయోజనం ఏమీ ఉండదు. మనం జీవించాలని అనుకొంటే వెంటనే స్వయంప్రభ దగ్గరకు వెళ్ళి అక్కడే ఉందాం. మహేంద్రునికే రావడానికి వీలులేని ఆ గుహకు సుగ్రీవాదులు రాలేరు. కాబట్టి మనమందరం అక్కడే ఉండిపోదాం” అని చెప్పాడు. మనం తినడానికి లోటు ఉండదు. సుగ్రీవుడు రాముడు వీరివల్ల కలిగే అపాయం ఉండదు అని అందరూ అన్నారు. కొద్దిసేపు అందరూ నిశ్శబ్దంగాఉన్నారు. కాసేపు తర్వాత తారుని మాటలు అంగదునికి నచ్చాయేమో అనుకొన్న వానరులందరూ మేమందరం తారుని మాటలు బాగున్నాయని అనుకొంటున్నాం. ఆ విధంగా చేస్తే భయమేమి మనకు ఉండదు కదా! అని అన్నారు. వారిలో రామకార్యం జరుగలేదనే బాధ సుగ్రీవుడు చెప్పినట్లు వినకపోతే కఠినశిక్షకు గురౌతామన్న విచారం ఎక్కువై వారు ఏం మాట్లాడుతున్నామో తెలియకుండానే ఏదేదో చెప్తుతున్నారు.

* * *

# హనుమంతుడు అంగదునికి ధైర్యం చెప్పటం

## సర్గ - 54

తారుని మాటలు ఇష్టంగా వింటున్న అంగదుని హనుమంతుడు చూశాడు. ఈ అంగదునిలో రాజు లక్షణాలు కనిపిస్తున్నాయి అనుకొన్నాడు. మరింత నిశితంగా చూస్తూ బుద్ధికి సంబంధించిన ఎనిమిది గుణాలున్నాయి అనుకొన్నాడు. వినాలనే కోరిక, వినిన విషయాన్ని అర్థం చేసుకోవడం, అర్థం అయిన విషయాన్ని మనస్సులో పెట్టుకోవడం, ఊహ, సంశయ నివృత్తి విషయంలో అర్థాన్ని గ్రహించడం, తత్త్వజ్ఞానం అనే ఈ ఎనిమిది గుణాలతోపాటు కార్యాన్ని సామదానభేదదండోపాయాలచేత సాధించే గుణం కూడా ఈ అంగదునిలో ఉంది అనుకొన్నాడు.

దేశ కాలాలకు తగినట్లుగా వివిధవిషయపరిజ్ఞానం రాజుకు ఉండాల్సిన విశిష్ట గుణాలు కూడా అంగదునిలో సంతృప్తిగా ఉన్నాయి. ఈ అంగదుడు తేజస్సులోను, బలంలోను, పరాక్రమంలోను శుక్లపక్షచంద్రునిగా ఎదుగుతున్నాడు. పరాక్రమంలో తండ్రిని మించిన తనయుడు. రాజాజ్ఞ పాలించే విషయంలో అలసిపోయి ఈ తారుని మాటలతో స్వస్థత పొందుతున్నాడు. సకల శాస్త్రవేత్త, బుద్ధిబలసంపన్నుడైన ఈ అంగదుని ధర్మం వైపు హనుమంతుడు మళ్ళించాలనుకొన్నాడు.

తన వాక్చాతుర్యంతో సామ దాన భేద దండోపాయాలలో భేదాన్ని చేత బట్టుకొని వానరులలో భేదాన్ని కలిగించాడు. అంగదుని మందలించాడు. "అంగదా! నీవు సుగ్రీవుని కంటే సమర్థత కలవాడివి. నీవు నీ తండ్రిలాగా కపి రాజ్యాన్ని చక్కగా ఏలగలవు. వానరులు ఎప్పుడూ చంచలమనస్కులు. ఇప్పుడు నీతో ఉన్న వీరు భార్యాసుతులను వీడి ఎక్కువ కాలం నిన్ను అట్టిపెట్టుకొని ఉండరు. అందుకే వీరు ఇపుడు కార్యం కాలేదనగానే వారికి తోచిన సంగతులు చెప్పుతున్నారు. కాని వారు నిజాన్ని మాట్లాడడంలేదు. నీవు మెచ్చుకొంటావని ఏదో చెప్పుతున్నారు. నీవు నిజాన్ని గ్రహించే నేర్పుతో ఆలోచించు" అని చెప్పాడు. "అంగదా! ఒక్క విషయం నేను చెప్పేది విను. జాంబవంతుడు, నీలుడు, సుహోత్రుడు వీరు ఎప్పటికీ సుగ్రీవునకు దూరంగా రారు. నేను కూడా నీ దగ్గర ఉండను. నీవు ఏ ఉపాయంచేత కూడా మా మధ్య భేదాన్ని సృష్టించలేవు. నేను ఒక యథార్థ విషయం చెప్తాను జాగ్రత్తగా విను. ఎప్పుడైనా బలవంతులకు బలహీనులతో వైరం ఏర్పడితే ఒకవేళ కాకున్నా మరొకవేళ వారిని క్షమించి వదిలిపెట్టగలరు. కాని దుర్బలుడు బలవంతునితో వైరం పెట్టుకోలేడు. అది అతని వినాశనానికి హేతువు అవుతుంది.

నీకు తారుడు ఈ బిలం సురక్షితం అని చెప్తున్నాడు. కాని ఇది నిజం కాదు. మయుని దేవేంద్రుడు ఇక్కడే వజ్రాయుధంతో చంపివేయలేదా? ఇప్పుడు మహేంద్రుని మించిన లక్ష్మణుడు ఉన్నాడు. అతని బాణధాటికి ఈ బిలం ఆకు దొప్ప ఎగిరినట్లు ఎగిరిపోగలదు. రామలక్ష్మణుల దగ్గర వజ్రాయుధాన్ని మించిన అస్త్రశస్త్రాలున్నాయి.

అంగదా! నీవు ఈ బిలంలో వెళ్ళగానే వీరందరూ నిన్ను వీడి వారి నివాసాలకు వెళ్ళిపోతారు. సుగ్రీవునికి దణ్ణం పెట్టి క్షమను పొంది భార్యాబిడ్డలతో హాయిగా ఉండిపోతారు. కాని నీవు ఒక్కడివే ఈ బిలంలో బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సి ఉంటుంది.

అప్పుడు గాలికి ఎండు ఆకు కదిలినా భయం చేత ఉక్కిరిబిక్కిరి అయిపోతావు. ఒక్కడినిగా ఉంటూ ఎక్కువ దినాలు జీవించలేక బ్రతికి కూడా జీవచ్ఛవంలాగా మారి అనుక్షణం క్రుంగిపోతూ ఉంటావు. నీవు చేసిన పనికి నీ మనస్సే ఎదురు తిరుగుతూ ఉంటుంది.

రామలక్ష్మణుల బాణాలు అత్యంత శక్తి సమన్వితమైనవి. వాటిని ఎదిరించే శక్తి ఎవరికీ లేదు. సీతాన్వేషణ కార్యాన్ని నీవు విస్మరిస్తే ఆ బాణాలు నిన్ను వెంటాడకపోవు. అలాగాక ఇపుడే మీ పినతండ్రి దగ్గరకు వచ్చి చేయలేని పనిని సత్యమార్గంలో చెప్పితే నీ పినతండ్రి నిన్ను క్షమించగలడు.

అలాగాక మాతో ఉండి నీవు పని సాధించుకొని వెళ్ళితే నిన్ను రాజ్యాభిషిక్తునిగా సుగ్రీవుడు చేస్తాడు. సుగ్రీవుడు ధర్మనిరతుడు. నియమబద్ధ జీవనానికి అలవడినవాడు. అతడు నీ తల్లికి మోదం కూర్చాలనుకొనేవాడు. కాబట్టి సుగ్రీవుడు నిన్ను ఎప్పటికీ చంపడు. సుగ్రీవునకు మరో సంతానం లేదు గదా! నిన్నే ప్రాణప్రదంగా చూసుకొంటాడు. మనం మన కార్యాన్ని సాధించుకొనే వెళ్దాం. అదే మనకు మంచి పని" అని మారుతి అంగదుని మనస్సులోని మాలిన్యాన్ని ప్రక్షాళన చేశాడు.

* * *

# అంగదుని ఆక్రోశం

## సర్గ - 55

**ప్ర**భుభక్తి పరాయణుడైన హనుమంతుని మాటలు అంగదునిలో ఆక్రోశాన్ని కలిగించాయి. "హనుమా! నీవు సుగ్రీవుని గూర్చి చెప్పే మాటలలో అంతగా నిజంలేదు. స్థిరమైన బుద్ధి, అంతఃకరణ శుద్ధి, దయ, ఋజువర్తనం, పరాక్రమం, గాంభీర్యంలాంటి గుణాలు ఆయనలో నాకు మచ్చుకైనా కనిపించవు.

అంతేగాదు, సుగ్రీవుని అన్న వాలి భార్య పట్టమహిషి తనకు వదిన అయిన ఆమెను వాలి బ్రతికి ఉండగానే భార్యగా స్వీకరించాడు. దుందుభితో తలపడాలని వెళ్ళి అక్కడ నిలబడి కూడా తిరిగి తన అన్న రాకుండా ఉంటాడనే దుష్ట ఆలోచనతో బిలాన్ని బండరాయితో మూసివేసి రావడంలో ఔచిత్యం ఏమిటి? ఎక్కడి ఋజువర్తనం?

శ్రీరామునితో అగ్నిసాక్షిగా స్నేహం చేసి ఉపకారం పొంది భోగాలలో మునిగిపోవడం స్థిరబుద్ధికి అంతః కరణ శుద్ధికి సంకేతమా? ఇప్పుడు కూడా సుగ్రీవుడు ధర్మంపై ఆసక్తితో మనలను ఇక్కడికి పంపలేదు. కేవలం లక్ష్మణుడు చంపుతాడనే భయంతో మనలను పంపించాడు. ఇదేనా ఆయనలోని పరాక్రమం, దయ ఉత్తమ వంశంలో పుట్టిన వారెవరైనా ఆ చపలచిత్తుని నమ్ముతారా? అందులోనూ ఆయన వంశంలోనే పుట్టిన నాకు ఆయనపై నమ్మకం ఎలా కలుగుతుంది?

అంతేగాదు ఎవరైనా తన బిడ్డలకు రాజ్యం దక్కాలని కోరుకొంటారు గదా. మరి సుగ్రీవుడు నన్ను రాజుగా ఎందుకు చేస్తాడు? నేను సుగ్రీవుని కార్యాన్ని చేయలేక అపరాధిని అయ్యాను. ఇప్పుడు నాకు శక్తి కూడా క్షీణించిపోయింది. మరల కిష్కింధకు వెళ్ళి అనాథలాగా ఎలా జీవించగలను? సుగ్రీవుడు కనికరం లేని కర్కోటకుడు. అతడు రాజ్యాధికారం కోసం నన్ను చిత్రహింసలకు గురిచేస్తాడు. అక్కడకు వచ్చి బందీని అయి చచ్చేకంటే ఇక్కడే నా ప్రాణాలు తీసుకోవడం చాలా ఉత్తమం.

మీరందరూ గృహోన్ముఖులు కండి. కాని నేను ప్రతిజ్ఞాపూర్వకంగా చెప్తున్నాను. ఈ స్థితిలో నేను కిష్కింధకు రాను. మీరు వెళ్ళి శ్రీరామలక్ష్మణులను నా పినతండ్రిని కుశలం అడిగానని చెప్పండి. నా తల్లి తార నేను చనిపోయానని తెలుసుకొంటే ఆమె కూడా ప్రాణాలు విడుస్తుంది. మీరు నా తల్లులైన తార, రుమలను నేను అడిగినట్లుగా చెప్పండి. అలా అందరికి చెప్పి ఆ వృద్ధులైన వానరులకు అభివాదం చేశాడు. ఖిన్నుడై, కాంతిహీనుడై, కన్నుల నీరు కారుతుండగా ప్రాయోపవేశం చేస్తాను” అంటూ దర్భలు పరిచి వాటిపై కూర్చున్నాడు. ఆ స్థితిలోని దీనుడైన అంగదుని చూసి వానరులందరూ సుగ్రీవుని నిందించారు. అంగదుని విడిచి ఉండలేక మేం కూడా ప్రాయోపవేశం చేస్తాం అంటూ తూర్పు దిక్కుకు మరలి కూర్చున్నారు. వారందరూ వారి తనువులను త్యాగం చేయడానికి నిశ్చయించుకున్నారు. అందరూ కూర్చుని దశరథుని కథ, రామలక్ష్మణ సీతలు దండకారణ్యానికి రావడం, సీతాపహరణం, వాలివధ సుగ్రీవ రామల మైత్రి గురించి మాట్లాడుకోసాగారు. ఆ వారి ధ్వని ఆకాశం ఉరిమినట్లుగా అనిపించింది.

* * *

# సంపాతి దర్శనం

## సర్గ – 56

వానరులందరు ప్రాణాలు త్యజించాలనే నిర్ణయంతో ఒక్క చోట కూర్చున్నారు. వారిలో మన బంధువులందరిని వదిలి ప్రాణత్యాగం చేస్తున్నామనే బాధఎక్కువైంది. జరిగిపోయిన విషయాలను మాట్లాడుకోసాగారు. అక్కడ ఒక గృధ్రరాజు ఉంది. ఆ పక్షి రాజు పేరు సంపాతి. జటాయువు సోదరుడు సంపాతి. భగవంతునిపై నమ్మకం ఉన్నవాడు. సుప్రసిద్ధ బలపరాక్రమాలున్న చిరంజీవి. ఆయన ఇక్కడకు చేరిన వానరులందరిని చూశాడు. పూర్వజన్మ పుణ్య విశేషాన్ని అనుసరించి భగవంతుడే ప్రాణులను సర్వదా రక్షిస్తుంటాడు. నాకీనాడు అప్రయత్నంగా చాలా ఆహారం దొరికింది. వీరందరూ మరణించాలనే వాంఛను తెలుపుతున్నారు. ఎవరు ముందు చస్తారో వారిని నేను తింటూ ఉంటున్నాను. అలా ఒకరు తర్వాత మరొకరి పని బాగుంది అన్నది సంపాతి.

ఆ మాటలన్నీ అంగదుడు విన్నాడు. అసలే వ్యాకులంలో ఉన్న అతని మనస్సు మరింత ఉద్విగ్నతకు లోను అయ్యింది. “హనుమా! చూశావా! మన ప్రాప్తం ఎలా ఉందో సీతాన్వేషణలో విఫలం అయిన మనకు మరణదండన

విధించడానికి సాక్షాత్తు ఆ సూర్యకుమారుడైన యముడే వచ్చాడు. జటాయువు సీతకోసం ఎంత కష్టపడిందీ మీకందరికీ తెలిసిందే కదా! జంతువులు కూడా రాముని కార్యం చేయడానికి తమ శక్తినంతా కూడదీసుకొని చేస్తున్నాయి. మనకు శక్తి ఉండి కూడా రామకార్యం సఫలం చేయలేకపోయాం. మనకన్నా ఆ జటాయువు పుణ్యాత్ముడు, అదృష్టవంతుడు.

ఆ జటాయువుకు మనలాగా సుగ్రీవుని బాధ లేదు. వీరోచితంగా రాక్షసులతో పోరాడి వీరమరణం పొందింది. మనలాగా పిరికి సన్యాసుల్లాగా జీవితాన్ని అంతం చేసుకోలేదు. అయినా శ్రీరాముడు ఒక్కడే పద్నాలుగు వేలమంది రాక్షసులను హతమార్చాడు. రామలక్ష్మణుల పరాక్రమానికి ఎదురువచ్చేవారు ఎవరూ లేరు. మనం సీతమ్మ జాడను తెలుసుకోలేక వెనుదిరిగి వెళ్ళితే రాముని బాణానికి ఆహుతి అవక తప్పదు. ఇవన్నీ ఆ దశరథుడు కైకకు ఇచ్చిన మాటవలనే జరుగుతున్నాయి" అంటూ దీనంగా మాట్లాడుకొనే వానరుల మాటలను సంపాతి విన్నాడు.

ఆయనకు చాలా దుఃఖం కలిగింది. అప్పుడు "అయ్యా! వానరోత్తమా! నీవెవరవు? నా సోదరుడైన జటాయువును గూర్చి అతని మరణం గూర్చి చెపుతున్నావు. నా తమ్ముని మరణం నాకు ఆందోళన కలిగిస్తోంది. చాలాకాలానికి జటాయువు పేరు వింటున్నాను. అయ్యలారా! నన్ను ఈ పర్వతం నుండి క్రిందకు దింపండి. సూర్యకిరణాల వేడికి నా రెక్కలు మాడిపోయాయి. అందువలనే నేను ఎగురలేను.

నా తమ్ముడు ఉత్తముడు; బలపరాక్రముడు, జనస్థానంలో ఉండే నా తమ్మునికి రాక్షసులతో వైరం ఎందుకు ఏర్పడింది? పెద్దల ఆదరాభిమానాలు చూరకొనే దశరథుని కొడుకు ఐన శ్రీరామునితో స్నేహం ఎలా కలిగింది. నాకు అవన్నీ తెలుసుకోవాలని ఉంది. మీరు నాపై దయతో నన్ను క్రిందకు దింపి నా అనుమానాన్ని నివృత్తి చేయండి" అని సంపాతి వానరులను వేడుకొన్నాడు.

* * *

# సంపాతికి జరిగినకథ చెప్పటం

## సర్గ - 57

**అ**క్కడ ప్రాయోప్రవేశానికి సిద్ధపడి కూర్చున్న వానరులు సంపాతి దుఃఖంతో పూడుకొని పోయిన గొంతుతో తన సోదరుని గూర్చి అడిగే ప్రశ్నలు విని అనుమానించారు. ఈ గ్రద్ధ మనలను భక్షించడానికని ఇలా మాట్లాడుతోంది. మనం దీని దగ్గరకు వెళ్ళకపోవడమే మంచిదనుకొన్నారు. మరొక్క నిమిషానికి వారి తలంపు వారికే సిగ్గు అనిపించింది. మనం చనిపోవాలనే నిశ్చయంతో ఉన్నాం. మనలను ఈ పక్షి భక్షిస్తే చనిపోతామేమోనని భయపడుతున్నాం. ఆఖరికి తన జీవిత అంతమందైనా మరొకరికి ఈ శరీరం ఉపయోగపడితే మంచిదే కదా అనుకొన్నారు.

వెంటనే అంగదుడు, ఇంకొంతమంది లేచారు. పర్వతంపైనుండి పక్షిరాజును దింపారు. అప్పుడు సంపాతి "ఓ వానర ప్రముఖులారా! అసలు రాముడు ఎందుకు అడవికి వచ్చాడు? ఆయనకోసం నా తమ్ముడు రాక్షసులతో ఎందుకు తలపడ్డాడు? మీరు ఎవరు? ఇక్కడికి ఎందుకోసం వచ్చారు? ఇప్పుడు మీలోని ఈ నైరాశ్యానికి కారణం ఏమిటి? అన్నీ నాకు చెప్పండి. అన్నింటిని సవివరంగా తెలుసుకోకపోతే నా మనస్సు నన్ను నిలవనీయదు. దయచేసి జరిగినదంతా నాతో చెప్పండి" అని సంపాతి వారిని కోరాడు.

"అయ్యా సంపాతి నేను నీకు కావలసినదంతా చెప్తా విను" అంటూ అంగదుడు "ఓ పక్షిరేడా! ఋక్షరజుడనే వానరేంద్రుడు మా తాత. ఆయనకు వాలి సుగ్రీవులు ఔరస పుత్రులు. వాలి పెద్దవాడు కాన అతడే వానరలోకానికి రాజుగా ఉంటూ అందరి ప్రశంసలు పొందుతూ రాజ్యాన్ని ఏలుతున్నాడు. ఆ సమయంలో సుగ్రీవునకు వాలితో వైరం ఏర్పడింది. దశరథ మహారాజు పెద్ద పుత్రుడు శ్రీరాముడు తండ్రి ఆజ్ఞను పాటించాలని లక్ష్మణుడు, సీతతో కలిసి వనవాసం చేయడానికి దండకారణ్యానికి వచ్చారు.

రాముని భార్య ఐన సీతాదేవిని రావణుడను రాక్షసుడు అపహరించాడు. ఆమెను వెదకుతూ వచ్చి సుగ్రీవునితో రామలక్షణులు స్నేహం చేశారు. వైరి ఐన వాలిని చంపి వానరరాజ్యానికి సుగ్రీవుణ్ణి రాజుగా చేశారు. అందుకు ప్రతిఫలంగా వైదేహిని వెదకిపెడ్తామని వానరులు చెప్పారు. ఆ కారణంగానే మేం ఈ దక్షిణ దిశకు వచ్చాం. మేమందరం ఇక్కడంతా గాలించాం. కాని ఆ సీతాదేవి జాడ మాకు కనిపించలేదు.

మేమందరం ఇక్కడ ఉండగానే మా కార్యానికి మా రాజు విధించిన గడువు తీరిపోయింది. ఇప్పుడు అక్కడికి వెళ్ళినా మాకు ప్రాణాలు ఉండవు. అందుకే ఇక్కడే మేం ప్రాణాలు వదిలివేయాలని నిశ్చయించుకొన్నాం అంటూ శ్రీరామునికి జటాయువుతో స్నేహం, రావణాసురునితో జటాయువు పోరాడడం, వీరోచితంగా ప్రాణాలు పోగొట్టుకోవడం, రావణుడు దుర్నీతికి పాల్పడడం, ఇలా అప్పటివరకూ జరిగినదంతా సంపాతికి అంగదుడు చెప్పాడు.

* * *

# సంపాతి వల్ల సీత ఆచూకి తెలుసుకోవటం

## సర్గ - 58

**వా**నరుల దీనగాథ విని, తన తమ్ముని వీర మరణం తెలుసుకొని సంపాతి చాలా ఏడ్చింది. "అయ్యా! నేను నా తమ్ముని చంపిన రావణునిపై పగ తీర్చుకోలేని వృద్ధుణ్ణి అయ్యాను. నా తోబుట్టువును చంపిన ఆ రావణుని నాశం చేయాలనే కోరిక నన్ను దహించివేస్తోంది" అని వృద్ధుడైన సంపాతి బోరున విలపించింది.

"వానరులారా! సర్వలోక పూజ్యుడైన ఆ రామునికి నేను మాట సహాయం చేసి తీరుతాను. వృత్రాసుర వధ మాకు తెలిసిందే. ఆ కాలంలో నేను జటాయువు ఆకాశంలో ఎగరటానికి పోటీపడి సూర్యమండలంవైపు పరుగుదీశాం. సూర్యమండలానికి చేరువకు వెళ్ళిన మాకు మధ్యాహ్నమార్తాండుని తాపం భరించే శక్తి తగ్గింది. నా తమ్ముడైన జటాయువు ఆ సూర్య కిరణాల ధాటికి విలవిలలాడడం చూచి నేను నా రెక్కను కప్పి రక్షించాను. అప్పుడు ఆ అర్కుని కిరణాలు నా రెక్కలను మాడ్చివేశాయి. అప్పుడు నేను ఈ వింధ్యపర్వతం మీద పడిపోయాను.

అప్పటినుంచి నా తమ్ముని జాడ నాకు తెలియదు. నేడు మావాని మరణవార్త చెప్పి నన్ను దుఃఖార్తికి లోనుచేశారు. కాని రామునికి ప్రియం చేసే కార్యంలో ప్రాణాలు విడిచిన నా తమ్ముని గూర్చి తెలుసుకొనడం నాకు గర్వంగా ఉంది. నేను ఆ శ్రీరామునికి ప్రియాన్ని కూర్చుతాను" అని చెప్పాడు.

అంగదునిలో ఆ మాటలు ఆశను రేపాయి. వెంటనే "ఓ సంపాతీ! ఇదిగో మీకు నేను నమస్కారం చేస్తున్నాను. మాకు మా సీతమ్మ జాడ తెలిపి పుణ్యం కట్టుకోండి. దుష్టరావణుని నివాసం ఎక్కడో? శ్రీరాముని ధర్మపత్నిని ఎక్కడ ఉంచాడో? మాకు దయచేసి మీకు తెలిస్తే చెప్పండి. అప్పుడు మీరు మా ప్రాణదాతలు అవుతారు. మీరు చేసే ఈ మహోపకారానికి మేం ఋణపడి ఉంటాం" అని ఆత్రుతగా అడిగాడు.

"నాయనా అంగదా! తప్పకుండా నీకు సహాయం చేస్తాను. నేను రెక్కలు పోగొట్టుకొని శక్తిహీనంగా ఉన్నాను. కాని శ్రీరామకార్యమే నా ప్రథమకర్తవ్యం. నేను అతల వితల వరుణ లోకాలు,అంతేకాదు విష్ణువు ఆక్రమించిన ఊర్ధ్వలోకాల గురించి నాకు తెలుసు. దేవాసుర సంగ్రామాలు, అమృతం కోసం క్షీర సాగర మథనం కూడా నాకు తెలిసిందే.

నేను ఇంతకుముందు రావణుడు ఒక చక్కని రూపవతి ఆభరణాలు ధరించిన తరుణిని తన అంకపీఠంలో ఇరికించుకొని పోవడం నేను చూశాను. నల్లని రావణునిపై పట్టుచీర ధరించిన ఆ తల్లి నల్లని కొండపై సూర్యకాంతి పడినట్లుగా కనిపించింది. నల్లని రావణునిపై ఒక మెరుపు తీగలాగా ఆమె కనిపించింది. ఆమె పదే పదే రామా! రామా! అంటూ విలపించింది. లక్ష్మణా! అని మొరపెట్టుకోవడం నేను విన్నాను. ఆమె సీత అయి ఉంటుంది.

ఆ దుష్టుడిని గురించి ఇప్పుడే చూచి చెప్తాను మీరు భయపడకండి. నేను అంతా చూచి మీకు చెప్పగలను." అంటూ సంపాతి తన దృష్టిని దూరంగా సారించారు. వానరులందరిలో ఆశ మొలకెత్తింది. నడవలేని సంపాతి ఎలా చెబుతాడా అని అందరూ ఆత్రంగా చూస్తున్నారు. అపుడు "అంగదా! ధాన్యం తినే జంతువులు నేలమీద కొంతవరకు చూడగలవు. పావురాలు లాంటి పక్షులు ఆకాశంలో ఎగిరే మార్గం మొదటిది. ఇవే నేలను కాస్త ఎత్తునుంచి చూడగలవు. చెట్ల పండ్లను తినే కాకిలాంటి పక్షులు వీటికన్నా కాస్త ఎత్తున ఎగరగలవు. వాటి మార్గం రెండవది. క్రౌంచ పక్షులు, నీటికాకులు వీటికన్నా ఎత్తుగా ఎగురుతాయి. అవి సంచరించే మార్గం మూడవది. దానికన్నా ఎత్తుగా డేగలు వాటిపైన గ్రద్దలు ఎగరగలవు. గ్రద్దలు ఎగిరే మార్గం ఐదవది. ఆరవమార్గంలో రూపయౌవనాదులతో ఉండే క్షీరాన్ని గుర్తించి వేరుపర్చగల శక్తి ఉన్న హంసలు ఎగురుతాయి.

వినతాసుతులైన గరుత్మంతుడు, అనూరుడు ఏడవ మార్గాన అంటే ఆ పక్షులకన్నా ఎత్తుగా ఎగరగలరు. మేం అందరం ఆ ఏడవ మార్గాన సంచరించే వినతాసుతులమే. అందుకే మాకు ఒక శత యోజనం వరకు దూరం ఏ శ్రమా లేకుండానే మాకు కనిపిస్తుంది. మా ఆహారాన్వేషణలో ఈ దృష్టి ఉపయోగపడుతుంది.

నాకు కూడా గరుత్మంతునిలాగా దివ్యదృష్టి ఉంది. దానివలన రావణుని నివాసం కనుగొంటాను అని చెప్పింది. వానరులారా! రావణుని పట్టణం ఇక్కడనుంచి వంద యోజనాల దూరంగా ఉంది. రావణుని నివాసం లంకానగరం. రావణుడు విశ్రవసుని కుమారుడు. కుబేరుని సోదరుడు. ఈ లంకానగరాన్ని విశ్వకర్మ నిర్మించాడు. అందులో ఉండే గృహాలు ఆరామాలన్నీ సువర్ణమయాలే. ఆ నగరానికి చుట్టూ ప్రాకారాలు బంగారు కాంతులతో విలసిల్లుతున్నాయి. సీతాదేవి రావణుని దగ్గరే బంధింపబడి ఉంది. ఆమె పట్టువస్త్రం ధరించి దీనంగా కూర్చుని ఉంది. ఆమె చుట్టూరా బలకాయులైన రాక్షస స్త్రీలు కాపలా కాస్తున్నారు. లంకానగరం చుట్టూ సముద్రం ఆవరించి ఉంది. వానరులారా! ఈ వందయోజనాల సముద్రాన్ని అధిగమించి వెళ్ళి మీరు ఆ సీతమ్మను చూచి వస్తారు. ఈ మాటలు నేను దివ్యదృష్టితో చూచి చెప్తున్నాను. ఈ సముద్రాన్ని లంఘించడానికి మీరందరూ పూనుకోండి.

వానరులారా! మాంసభక్షకుడైన రావణుడు నా తమ్ముని చంపడం ఒక కారణం అయితే, ధర్మమూర్తి భార్యను అపహరించడం రెండవ తప్పు. వానిపైన ఎలా ఐనా పగ తీర్చుకోవాలి. మీరు సముద్రాన్ని దాటి వెళ్ళి సీతను చూసి కిష్కింధకు వెళ్ళవచ్చు. నా మాట వమ్ముకాదు. నేను భవిష్యత్తు తెలుసుకొని మీకు జరుగబోయే దానిని గూర్చి చెప్తున్నాను. మీరు తప్పక ఆ రావణుని లంకను చూస్తారు. దానిలో బంధించబడిఉన్న సీతమ్మ గూర్చి తెలుసుకుని రామునికి చెప్తారు. రాముడు మీతో కలసి ఆ దుష్టరావణుని అతని పరివారాన్ని నాశనం చేస్తాడు. మీకు భయం అవసరంలేదు. నాకూ ఆ రామకార్యంలో పాలు పంచుకునే అవకాశం దేవుడు కల్పించాడు. నా తమ్ముడు రామకార్యంలో ప్రాణాలు పోగొట్టుకున్నాడు. వాని ప్రాణాలు పోయాయనే బాధ కన్నా నాకు శ్రీరామునికి సహాయం చేశాడన్న తృప్తి ఎక్కువగా ఉంది.

వానరులారా! మీరు నాకు ఒక సహాయం చేయండి. రెక్కలు లేని నన్ను సముద్ర తీరానికి చేర్చి నాచేత నా తమ్మునికి జలతర్పణం చేయించి కృతార్థులు కండి" అని చెప్పాడు. వెంటనే అంగదాదులు సీతాదేవిని చూచినంతగా సంతోషిస్తూ సంపాతి కోరికను నెరవేర్చారు. సముద్ర తీరానికి తీసుకువెళ్ళి తర్పణం విడిపించి తిరిగి యథాస్థానాన్ని చేర్చి సంపాతిని సంతోషపెట్టారు. ఐనా సీతమ్మ జాడ తెలిసిపోయిందిలే అనే సంతోషం వారిలో అధికం అయింది.

* * *

# సంపాతి - సుపార్శ్వుడు

## సర్గ - 59

**స**ంపాతి ద్వారా అమృత వచనాలు విని వానరులందరూ సంతోషమనస్కులు అయ్యారు. అందులో వానర శ్రేష్ఠుడైన జాంబవంతుడు లేచి "అయ్యా సంపాతీ!మీరు రెక్కలు లేక ఇక్కడే ఉన్నానని అంటున్నారు కదా! అసలు రావణుడు సీతను తీసుకొనిపోవడం మరి ఎవరైనా చూశారా? ఆ విషయం మాకు చెప్పండి. ఇంకేదైనా రావణుని గూర్చిన విషయం ఉంటే అది కూడా చెప్పి మాకు సహాయం చేయండి" అని అడిగాడు. "సంపాతీ! వజ్రాయుధ సమములైన రామలక్ష్మణుల బాణాల గురించి ఆలోచించని ఆ మూర్ఖరావణుడు ఎవడు? ఎక్కడ ఉంటాడు? ఆయన చేసే పని ఏమిటి? ఆ విషయాలుకూడా మాకు చెప్పి పుణ్యం కట్టుకోండి" అని అడిగాడు.

వానరులకు రాముని పై ఉన్న భక్తి, విశ్వాసం సంపాతికి ఆనందం కలిగించాయి. వారికి రామకార్యంలో విజయులవ్వాలన్న కాంక్ష ఉందని తెలుసుకొని వారికి తనకు తెలిసిన విషయాలు చెప్పాలనుకొన్నాడు. సంపాతి వానరులకు సంతోషం కూర్చుతూ "వానర ప్రముఖులారా! నాకు సుపార్శ్వుడనే కుమారుడున్నాడు. ఆయనే వృద్ధుణ్ణి ఐన నన్ను రోజు ఆహారం పెట్టుతూ పోషించుకొంటున్నాడు. గంధర్వులకు కామం ఎక్కువ, సర్పాలకు కోపం ఎక్కువ. అలానే మాకు ఆకలి ఎక్కువగా ఉంటుంది. నేను రోజు ఆకలితో నా కుమారుని కోసం ఎదురుచూస్తుంటాను. సుపార్శ్వుడు బలపరాక్రమశాలి బుద్ధిమంతుడు. ఒకరోజు సాయం సమయంలో ఉత్త చేతులలో నా దగ్గరకు వచ్చాడు. నేను క్షుద్బాధను తట్టుకోలేక ఆహారం కోసం సుపార్శ్వుని పీడించాను. అప్పుడు 'తండ్రీ నన్ను మన్నించు. ఈ రోజు కూడా ఎప్పటిలాగే మహేంద్రగిరికి వెళ్ళి ఆహారం కోసం వేచి ఉన్నాను. అప్పుడు కదులుతున్న కాటుక పర్వతం లాంటి ఒక మహాకాయుడు ఒక మెరుపు తీగలాంటి స్త్రీని బలవంతంగా ఎత్తుకుపోతూ నాకు కనిపించాడు. మంచి ఆహారం దొరికిందన్న సంతోషంలో నేను వారిపై ఉరికాను. అలా వారి దగ్గరకు చేరుకున్న నన్ను చూసి అంజలి ఘటించి "ఓ వీరుడా! నాకు దారి ఇవ్వు" అంటూ ప్రాధేయపడ్డాడు. ఈ లోకంలో శరణు అని అడిగితే కాదనేవారు ఎవరు ఉంటారు. అందుకే ప్రాధేయపడుతున్న అతణ్ణి నేను వదిలేశాను. అతడు ఓ క్షణంలో అక్కడనుంచి వెళ్ళిపోయాడు. అక్కడున్న సిద్ధులు వచ్చి నన్ను ప్రశ్నించారు. ఆ దుష్టుడు రావణుడు. ఆయన ఎత్తుకొని వెళ్ళే ఆ స్త్రీ రాముని భార్య సీత. ఆమెను తీసుకొనివెళ్ళాలన్న కోరికతో వాడు నిన్ను వదిలేశాడు. అందుకే నీవు బ్రతికిపోయావు. నీకు క్షేమమగుగాక! అంటూ వారు నాతో చెప్పారు. ఆ రావణునితో వెళ్ళిన ఆ రాముని పత్ని పట్టువస్త్రాలు ధరించి ఉంది. ఆమె వేసుకొన్న ఆభరణాలు చెదిరిపోయి ఉన్నాయి. ఆమె కేశాలు విడివడి చెల్లాచెదురుగా ఎగురుతున్నాయి. ఆమె "రామా! లక్ష్మణా!" అంటూ ఆక్రోశిస్తోంది. ఇది నేను చూశాను. నా మనస్సు చెదిరిపోయింది. ఆహారాన్వేషణలో బుద్ధి పనిచేయలేదు. అందుకే ఉత్తిచేతులతో నీ దగ్గరకు వచ్చాను' అని సుపార్శ్వుడు నాకు చెప్పాడు. అలా రావణుని నా కొడుకు కూడా చూశాడు.

ఆ దుష్ట రావణుని గూర్చి విని కూడా నేను ఏం చేయలేకపోయాను. అవిటివానినైన నేను చేయగల కార్యం ఏముంటుంది? కాని నా దివ్యదృష్టి చేత విషయగ్రహణ చేసి మీకు శ్రీరామ కార్యంలో ఉపయోగపడుతాను.

వానరరాజు పంపగా మీరు ఇక్కడికి వచ్చిన మహిమోపేతులు. అతి పరాక్రమశాలురు, మీరు చేయలేని కార్యం ఏదీ ఉండదు.

మీ రామలక్ష్మణుల బాణాలు ముల్లోకాలను ఎదిరించగల పటిమ కలవి. వారిని ఎదిరించే మొనగాడు ఎవరూ ఉండరు. మీరు అజేయులై రామకార్యాన్ని చేస్తారు. మీ శత్రువు దశకంఠుడు బలపరాక్రమాలతో అత్యంత తేజశ్శాలి. అయినా ఆయన చేసిన దుష్టకార్యాలవలన ఆయువు మూడుతుంది. మీరే తప్పక విజయాన్ని పొందుతారు. మీరు ఆలసించకుండా సముద్ర లంఘనాన్ని గూర్చి ఆలోచించండి. కార్యశూరులు కాల విలంబనానికి సహించలేరు కదా!" అని సంపాతి వారితో చెప్పాడు. సంపాతి మాటలు విన్న వానరుల కళ్ళలో నీరు నిండింది. అయ్యో నాడు సుగ్రీవాదులు కూడా సీతమ్మను చూశారు. కాని, ఆ దుర్మార్గాన్ని ఎవరూ నిరోధించలేకపోయారు. నాడు ఆ రాక్షసుని చేతుల్లో చిక్కిన సీత ఎంతగా విచారించిందో కదా? ఆమె రామా! అంటూ ఆక్రోశించి ఉంటుంది కదా! మనమెవరమూ ఆ అమ్మను రక్షించలేకపోయామే, నేడు ఆ తల్లి ఎన్ని బాధలు పడుతుందో కదా అని వానరులందరి మనసులు ఆవేదన చెందాయి. వారు కాసేపు మిన్నకుండిపోయారు.

* * *

# సంపాతి ఆత్మకథ

## సర్గ - 60

**సం**పాతి మాటలు వింటూ అంగదాదులు ఆయన చుట్టూ కూర్చుని ఉన్నారు. వారందరు తనను విశ్వసించుచున్నారని తెలుసుకొని ఆ గ్రద్ద సంతోషించాడు. 'అయ్యా నాకు తెలిసిన వైదేహి వృత్తాంతాన్ని మీకు చెప్తాను వినండి' అని ఇంకా ఇలా చెప్పసాగాడు. "ఆ రోజు నేను సూర్య కిరణాలవలన మాడిపోయి స్పృహ తప్పి వింధ్య పర్వతం మీద పడిపోయాను. ఆ తర్వాత ఆరు రోజులకు నాకు తెలివి వచ్చింది. కాని నాలో శక్తి పూర్తిగా క్షీణించిపోయిందని నేను తెలుసుకొన్నాను. నేను ఎక్కడ ఉన్నానో ఏ పరిసరాలు నాకు దగ్గరగా ఉన్నాయో కూడా నేను గుర్తుపట్టలేని స్థితిలోకి జారిపోయాను. మెల్లమెల్లగా నేను శక్తి పుంజుకోవడానికి ప్రయత్నించాను. చుట్టుప్రక్కల నెమ్మదిగా పరికించి చూడడం ప్రారంభించాను. పచ్చని ఆకులతో ఉన్న వృక్షాలతో గుల్మాలతో ఆవృత్తం అయి ఉన్న ఈ ప్రాంతం వింధ్యగా గుర్తించాను. పక్షుల కిలకిలరావాలు విశాలమైన గుహలు ఎత్తైన శిఖరాలు అన్నీ చూచి ఇది వింధ్యా పర్వత దక్షిణ భాగమని తెలుసుకొన్నాను. నాలో కొంత శక్తి వచ్చినట్లుగా నాకు అనిపించింది. నా రెక్కలు అపుడపుడే కాస్త బాధనుంచి విముక్తి పొందుతున్నట్లు అనిపించాయి. కదల్లేని నేను ఇక్కడే కాలం గడుపుతాను. ఆ భగవంతునికి నా పై దయ రాకపోతుందా అని అనుకొని చుట్టుప్రక్కల గమనించసాగాను. అప్పుడు ఇక్కడ దగ్గరలో ఉండే ముని ఆశ్రమం గుర్తుకు వచ్చింది. ఆయన గొప్ప తపఃశాలి. ఇప్పుడు ఆయన స్వర్గానికి వెళ్ళి ఉన్నాడు. ఆయన దివంగతుడైన తర్వాత 8 వేల సంవత్సరాలు గడిచాయి. అప్పటినుంచి నేను

ఇక్కడే ఉన్నాను. 'నిశాకరుడు' అనే ముని నిజంగా చంద్రుని అంత చల్లనివాడు. ఆయనను నేను, జటాయువు ఎన్నోసార్లు దర్శించి ఉన్నాం. అప్పుడు నాకు ఆయనను చూడాలన్పించింది. వెంటనే శక్తి కూడదీసుకొని మెల్లమెల్లగా పర్వతాన్ని దిగుతూ వెళ్ళాను. చివరకు ఆ ఆశ్రమం దగ్గర ఉన్న చెట్టు మొదలుకు చేరి అలసిపోయాను. ఇక అక్కడే కూర్చుని ఆ ముని కోసం ఎదురుచూడసాగాను. ఆ నిశాకరుడు సముద్రస్నానం చేసి తిరిగి వస్తున్నాడు. ఆయనను అనుసరిస్తూ అనేకానేక పక్షులు, మృగాలు వస్తుండడం చూశాను. అప్పుడు దండయాత్రలలో విజయుడై రాజు నగరానికి ఆనందోత్సాహంగా వస్తుంటే ఆయనకు జయధ్వానాలు పలుకుతూ వచ్చే సైన్యంలాగా ఈ పక్షులు, మృగాలు ఆ మహామునిని వెన్నంటి వచ్చాయి. ఆ ముని ఆశ్రమంలోకి ప్రవేశించాక అవి మళ్ళీ వెనుదిరిగిపోవడాన్ని నేను చూశాను. ఆయన ఎంత గొప్ప వ్యక్తోగదా అని అనుకొంటూ అక్కడే కూర్చున్నాను. ఆ ముని లోపలకు వెళ్ళిన ఒక క్షణంలో బయటకు వచ్చి నా దగ్గరకు వచ్చాడు. నేను నమస్కరించాను. ఆయన చిరునవ్వు నవ్వి "ఆయన ఓహో! నీవు సంపాతివి గదా! నీ సోదరుడు జటాయువు కదా. మీరు ఇంతకుముందు మనుష్యరూపంలో నాకు ప్రణామం చేసి ఉన్నారు కదా! ఇప్పుడేమి నేను గుర్తుపట్టలేని విధంగా నీ రెక్కలు దగ్ధం అయ్యి ఉన్నాయి. ఏదైనా నిన్ను రోగం పీడిస్తోందా? లేక మరే బాధ అయినా వచ్చిందా? నాకు చెప్పు" అని ఆ మహాముని అడిగాడు. ఆయన నన్ను గుర్తుపెట్టుకున్నాడన్న విషయం విని నాకు ఆనందం వేసింది.

* * *

# మహర్షి – సంపాతిల సంభాషణం

## సర్గ – 61

"అయ్యా మహర్షి! నేను నా తమ్ముడు పోటీపడి సూర్య మండలానికి ఎగిరి ఈ దుస్థితిని తెచ్చుకొన్నాను. బల గర్వంతో మేము కైలాసగిరిలోని మునుల ఎదురుగా సూర్యుడు అస్తాద్రిని చేరేలోగా ఆ భాస్కరుని దగ్గరకు వెళ్ళిరావాలని అనుకొని బయలుదేరాం. ఇద్దరం ఒకేసారి పైకి ఎగిరాం. భూమిపైన ఉన్న నగరాలు చూస్తూ అక్కడి వీణా వేణు మృదంగనాదాలను వింటూ ఎర్రని వస్త్రాలు ధరించిన స్త్రీలను చూస్తూ ముందుకు వెళ్ళాం. పైన ఎగిరే మాకు భూమిపై నగరాలు రథ చక్రం ప్రమాణంలో కనిపించాయి.

కాసేటికి సూర్యమార్గాన్ని చేరాము. అక్కడినుంచి క్రిందకు చూశాం. ఇక్కడి వనాలు పచ్చిక బయళ్ళలాగా కనిపించాయి. కొండలు, పర్వతాలు నేలపై పరిచిన రాళ్ళలాగా సమతలంగా కనిపించాయి. నదులు అన్నీ ధరణీదేవి వేసుకొన్న కంఠహారాల్లాగా కనబడ్డాయి. చాలా ఎత్తుగా ఉన్న వింధ్య, మేరు, హిమవత్పర్వతాలు ఏనుగుల్లా కనిపించాయి. అలా ఎగురుతూ వెళ్ళుతున్న మాకు శరీరాలు చెమర్చాయి. తీవ్రంగా భయం దుఃఖం కలిగాయి. ఒకేసారి శరీరం బలహీనంగా మారిపోయింది. శక్తిలేని వాళ్ళలాగా అయిపోయాం. దిక్కులన్నీ యథాప్రకారంగా ఉన్నా మాకు అవి అన్నీ కలిసిపోయినట్లుగా అనిపించింది.

ఈ లోకం అంతా ప్రళయ కాలాగ్నిలో దగ్ధం అయిపోతున్నట్లుగా మాకు అనిపించింది. కళ్ళు బైర్లు కమ్మాయి. లోకం అంతా తిరిగిపోతున్నట్లుగా అనిపించసాగింది. మనస్సు పనిచేయడం మానివేసింది. ఏమౌతుందో అని మేం పైకి చూశాం.

మాకు భూమి ప్రమాణంలో సూర్యుడు కనిపించాడు. సూర్యమండలం కనిపించింది. మేం దాన్ని వింతగా చూస్తుండగానే నాతో చెప్పకుండానే నా తమ్ముడు జటాయువు భూమిమీదకు జారిపోతున్నాడు. అతడి ప్రమేయం లేకుండానే వెళ్ళిపోతున్నాడని నేను తెలుసుకొన్నాను. వెంటనే తమ్ముడిని రక్షించాలన్న ఆత్రంతో నా రెక్కలు పూర్తిగా విప్పార్చి జటాయువుకు నీడను కల్పించాను. అంతలో జటాయువు నేలకు జారడం చూశాను. బహుశా అది దండకారణ్యం అయి ఉంటుందని నేను అనుకొన్నాను.

తిరిగి నా స్థితిని గమనించుకొనేసరికి నా రెక్కలు పూర్తిగా సూర్యకిరణాల ప్రభావంతో మాడిపోయాయి. నేను అనుకోకుండానే వింధ్య పర్వతంపై పడిపోయాను. సోదరుడు దూరం అయ్యాడు. నేను కదలలేని స్థితిని తెచ్చుకున్నాను. రాజ్యం పోయింది. ఇక నా గర్వానికి నా చావే తగినదని నేను నిశ్చయించుకొన్నాను. పూర్తిగా నాలో గర్వం అణిగిపోయింది. ఆ క్షణం నుండి నాకు చనిపోవాలని అనిపిస్తోంది. మహానుభావా" అని సంపాతి తన స్థితిని నిశాకరునికి చెప్పాను. నా కథనంతా నిశాకరుడనే మహర్షి నింపాదిగా విన్నాడు.

* * *

# నిశాకరుని ఓదార్పు

## సర్గ - 62

**నా** విషయం అంతా చెప్పి "ఓ మహర్షి! నా గురించి నేను చెప్పుకోవడానికి సిగ్గుపడుతున్నాను. నా ఇంద్రియాలన్నీ పట్టుదప్పి ఉన్నాయి అని చెప్పేసరికి నా కళ్ళు నీటితో నిండాయి. ఆయన్ను చూచి భోరుమని ఏడ్చేశాను. ఆ నిశాకరుడు ధ్యానమగ్నుడయ్యాడు. కొద్దిసేపటికి కన్నులు తెరచి నన్ను చూశాడు. "సంపాతి నీవు దుఃఖించకు. నీకు మళ్ళీ చిన్న రెక్కలు వస్తాయి. నీ దృష్టి నీ ప్రాణశక్తి బలపరాక్రమాలు అన్నీ పుంజుకొంటాయి. నీవు రాబోయే కాలంలో గొప్ప ఘనకార్యాన్ని చేయాల్సి ఉంది" అని చెప్పారు. అపుడు నాకు కాస్త ఉపశమనం కలిగింది. "సంపాతీ! నేను రాబోయే కాలం గురించి పురాణాల ద్వారా తెలుసుకొన్నాను. ఇప్పుడు మళ్ళీ నా తపశ్శక్తితో వాటినన్నింటిని చూశాను. అందుకే నీకు చెప్తున్నాను. నీవు దుఃఖించాల్సిన అవసరం ఏమీ లేదు. ఇక్ష్వాకు వంశంలో దశరథుడను ఒక మహానుభావుడు ఉన్నాడు. అతని జ్యేష్ఠపుత్రుడు తండ్రి మాట కోసం తమ్ముణ్ణి, భార్యను తీసుకొని దండకారణ్యాలకు వస్తాడు. అక్కడకు గంధర్వ యక్ష కిన్నెర దేవతలచేత చంపబడకుండా ఉండే వరాన్ని పొందిన రావణుడను రాక్షసుడు వస్తాడు. వాని వలన బాధలు అనుభవించే సజ్జనులు భగవంతుని వాని పీడ వదిలించమని వేడుకుంటూ ఉంటారు. సంపాతీ! ఆ రాక్షసుడు శ్రీరాముని భార్య ఐన సీతను అపహరించి తీసుకొని వెళ్తాడు.

ఆమెను ఎన్నో విధాలుగా ప్రలోభపెట్టాలని ఆ రావణుడు యత్నిస్తాడు. కాని ఆమె తేజోమూర్తి, నిష్పాపరురాలు. ఆమె ఆ రాక్షసునికి లొంగదు. ఆమె రావణుని ఇంట నిరాహారిగా ఉంటుంది. ఆమె దగ్గరకు ఇంద్రుడు ఒక రోజు అమృతతుల్యమైన పాయసాన్నాన్ని తీసుకొని వచ్చి ఇస్తాడు. ఆమె తన దగ్గరకు వచ్చినది అనిమిషపతి అని తెలుసుకొని ఆ క్షీరాన్నాన్ని తీసుకొని మొదటి ముద్ద నా భర్త రాముడు నా మరిది లక్ష్మణుడు జీవించి ఉన్నను మరణించినను ఇది వారికి చేరాలి అంటూ నేలపై పెడుతుంది.

ఆ తర్వాత రామసోదరులు సీతను వెదకుతూ వానరులతో స్నేహం చేస్తారు. ఆ వానరులు నీ దగ్గరకు వస్తారు. అప్పుడు నీవు నీకు తెలిసిన సీత జాడను వారికి చెప్పి వారిని సంతోషపరచాలి. నీవు రామకార్యంలో పాల్గొనాల్సి ఉంది. ఇక్కడే ఉండి నీవీ కార్యం చేయాలి. దానివలన శ్రీరామ కార్యసిద్ధే కాక ఇంకా బ్రాహ్మణులు, సాధువులు, తపస్వులు, మౌనులు ఇలా అందరికీ నీ సహాయం అంది వారికి మంచిని నీవు చేయాలి. నేను కూడా ఆ రామలక్ష్మణులను చూడాలని ఉత్సాహపడుతున్నాను. కాని ఆ నాటివరకు నేను ఈ దేహాన్ని అంటిపెట్టుకొని ఉండలేను. అందుకే నేను తనువును త్యజించి అమరలోకానికి వెళ్తాను. నేను నా తపశ్శక్తితో నీ రెక్కలు బాగుచేయగలను. కాని ఆ అవసరం లేదు. నీకు భవిష్యత్తులో చిన్న రెక్కలు వస్తాయి. నీవు మరెక్కడికీ వెళ్ళకుండా ఇక్కడే ఉండి రామకార్యాన్ని చేయాలి. దానికోసం నిరీక్షిస్తూ ఇక్కడ మునులను సేవిస్తూ ఉండు అని ఆ మునీశ్వరుడు భవిష్యద్రష్ట జరగబోయేదంతా నాకు చెప్పాడు. అది మీకు నేను చెప్పాను" అంటూ సంపాతి వానరులతో చెప్పాడు. అదంతా విని నాకు చాలా సంతోషం వేసింది.నేను ఓ మంచి కార్యానికి ఉపయోగపడబోతున్నానుకొనేసరికి నా రెక్కల బాధ నన్ను అంతగా బాధించలేదు. నాటి నుండి నేను నిరీక్షణలోనే ఉన్నాను అన్నాడు సంపాతి.

* * *

# సంపాతి ఆనందోత్సాహం

## సర్గ – 63

"వానరులారా! మునిశ్రేష్ఠుడు చెప్పిన మాటలు విని, నేను మీకోసం నిరీక్షిస్తూ కాలం గడుపుతున్నాను. మెల్లమెల్లగా ఆ చెట్టు మొదలు నుండి నేను ఈ పర్వతాగ్రభాగానికి చేరి మీ కోసమే అనుదినం నిరీక్షిస్తున్నాను. ఈ నిరీక్షణలో వందల సంవత్సరాలు గడిచిపోయాయి. ఆ మహర్షి తనువు విడిచి స్వర్గానికి వెళ్ళిపోయాడు. అప్పటినుంచి నేను ఏం చేయాలో తెలియక చేసే శక్తి లేక ఇక్కడే పడి ఉన్నాను. నాకు నా జీవితంపైన విరక్తి కలిగి ఎన్నోసార్లు మరణించాలని చూశాను.

కాని ముని వచనాలు నన్ను కర్తవ్య దీక్షాపరురాలిగా చేసేవి. అగ్నిజ్వాలలు చీకట్లను తొలగించినట్లుగా నేను దుఃఖాన్ని ఆ ముని మాటలతో శాంతింపజేసుకొంటున్నాను. దుష్టుడైన రావణుని పరాక్రమం నాకు ముందే తెలుసు. సీతాదేవిని పరితపిస్తుంటే నీవు ఎందుకు రక్షించలేదని నా కుమారుడైన సుపార్శ్వుని నేను కోపగించాను.

సీతాదేవిని రక్షింపగల రామలక్ష్మణులు దగ్గర లేరని నా సుపార్శ్వునికి తెలుసు. నాకు దశరథుని పుత్రునిపై ఉండే ఆదరాభిమానాలు తెలిసి కూడా ఆ దుష్టుడిని నిరోధించలేదని నా పుత్రుని నేను మందలించాను. నేడు నాకు చాలా ఆనందంగా ఉంది. నాకు విధాత నిర్వర్తించమని చెప్పిన కార్యాన్ని నేను చేసేశానన్న ఆనందం నన్ను సంతోషించేలా చేస్తోంది. మీరు విచారాన్ని వీడండి. మీరు సముద్రాన్ని దాటి లంకకు వెళ్ళే మార్గాన్ని చూడండి. మీకు విజయం సిద్ధిస్తుంది."

సంపాతి అలా చెపుతుండగానే ఆయనకు ఎప్పటిలాగా చక్కటి రెక్కలు వచ్చాయి. ఎర్రని ఈకలున్న రెక్కలు చూసుకొని ఈ సంపాతి పరమానందించాడు. "అయ్యా! వానరులారా! చూశారా. నా కార్యం ముగిసింది. మీకు సీతాదేవి జాడ చెప్పాను. నిశాకరుని మహాముని మహిమవలన నా రెక్కలు నాకు వచ్చేశాయి. నిండు యౌవనంలో ఉండే బలపరాక్రమాలు, శక్తి వృద్ధునినైన నాలో ప్రవేశించాయి. ఇక మీకు కార్య విజయం తప్పక కలుగుతుంది. దానికి ఇదే ప్రబల నిదర్శనం. సీతాదేవి జాడ మీకు తప్పక కనిపించి తీరుతుంది" అని చెప్పాడు.

తన రెక్కలలోని బలాన్ని చూడాలని వినువీధికి ఎగిరాడు. అలా ఎగిరిపోతున్న సంపాతిని చూసి వానరులందరూ పరమానందించారు. ఆహా! భగవంతుని విచిత్ర లీలా విలాసమని ఆయనను స్తుతించారు. కార్యసాధన జరుగుతుందన్న ఆశతో వారు తిరిగి కార్యోన్ముఖులు అయ్యారు. వాయు సమాన వేగగమనులైన ఆ వానరశ్రేష్ఠులు ధైర్యోత్సాహాలతో సీతాన్వేషణకు అభిజిత్తు ముహూర్తం కొరకు వేచి చూస్తున్నారు.

* * *

# వానరుల శక్తియుక్తులు

## సర్గ - 64

సంపాతి మాటలు వానరులలో అధిక సంతోషాన్ని కలిగించాయి. వారందరూ సీతాదేవిని చూసేసినంతగా ఆనందిస్తూ సాగర తీరానికి చేరారు. వారందరూ సాగరాన్ని ఆసాంతం చూశారు. వారికి లోకానికి ప్రతిబింబంలాగా కనిపించింది. అపారంగా కనిపించే సముద్రాన్ని చూచి మనస్సులో కలకలం రేగింది. సంద్రంలో పెద్ద పెద్ద జలచరాలు ఎగిసిపడుతున్నాయి. సముద్రం ఒకచోట నిశ్శబ్దంగా ఉంది. మరోచోట వేదం చదువుకొనే విద్యార్థుల్లాగా గట్టిగా ఘోషిస్తోంది. మరోచోట తరంగాలు ఆకాశాన్ని అంటుకోవాలన్నట్లుగా పైపైకి ఎగిసిపడుతున్నాయి.

ఈ సముద్రం ఆకాశంలాగా అంతం అనేది లేనట్లుగా కనిపిస్తోంది. ఈ 100 యోజనాల విస్తీర్ణం ఉన్న ఈ సముద్రాన్ని దాటడం ఎవరితరం అవుతుంది అని వారిలో వారు అనుకొంటున్నారు. దాన్నంతా వారి నాయకుడైన అంగదుడు చూశాడు. "వానరోత్తములారా! ఈ అపారసముద్రాన్ని చూసి దీన్ని దాటడం ఎలా అనే చింతను మీ దరికి రానీయకండి. కోపం వచ్చిన పాము మనిషిని కాటువేసినట్లుగా విషాదం మనిషి దగ్గరకు రానిస్తే మనసంతా అది కప్పివేసి మనిషిని అధఃపాతాళానికి నెట్టివేయగలదు. జాగ్రత్త సుమా" అని చెప్పాడు.

ఆ రాత్రి అంతా ఎవరి ఆలోచనలలో వారు మునిగిపోయారు. ఎవరికీ ఏమి చేయాలో అంతు చిక్కలేదు. వారందరూ ఒక చోట సమావేశం అయ్యారు. సముద్రాన్ని ఎలా అధిగమించాలా అనే వారు చూస్తున్నారు.

అంగదుడు "మిత్రులారా! వాయుసుతుడైన హనుమంతుడు జాంబవంతుని వంటి ప్రముఖులున్న మన సేనను నిలవరింపగలిగిన వారెవరు ఉంటారు? మనం తప్పక ఈ కార్యాన్ని సాధించి తీరుదాం. ఇప్పుడు మనలో ఈ మహాసముద్రాన్ని లంఘించగల యోధులు ఎవరు? సుగ్రీవుని సత్యసంధుని చేయగల ధీరులు ఎవరు?

ఈ సంకటస్థితినుండి మనలను బయటపడవేయగల మహానుభావులు ఎవరు? మనం రామకార్యం సాధించి కిష్కింధకు వెళ్ళి మన భార్యాబిడ్డలను చూసుకోగలిగేటట్లు చేసేవారెవరు?" అని అంగదుడు వారిని అడిగాడు. 'ఎవరైనా సరే నేను ఈ పని చేయగలను అంటూ ముందుకు వచ్చి అభయప్రదానం చేసి పుణ్యం కట్టుకోండి' అని వారినందరిని వాలిసుతుడు ప్రార్థించాడు.

అంగదుని మాటలు విన్న వానరసేనలో ఏ ఒక్కడూ నోరు విప్పలేదు. అందరిలో అంతటా మౌనమే రాజ్యం చేసింది. ఎవరికి వారు నిమ్మకు నీరెత్తినట్లుగా కూర్చున్నారు. మళ్ళీ అంగదుడు "వానర ప్రముఖులారా! మీరు అత్యంత బలోపేతులు. ఉత్తమ వంశంలో పుట్టిన గొప్పవారు. మిమ్ము ఎదిరింప ఎవరికీ శక్యం కాదు. మీరందరూ వాయువేగగమనులు. మీలో ఎవరైనా సముద్ర లంఘనం చేయగలమని మీ మీ శక్తిసామర్థ్యాలను చెప్పండి" అంటూ అడిగాడు.

* * *

# వీరుల శక్తి సామర్థ్యాలు

## సర్గ - 65

**అ**ంగదుడు మాటలు విని మౌనం వీడి వానర ప్రముఖులు ఒక్కొక్కరు వారి శక్తి సామర్థ్యాలను చెప్పడం ప్రారంభించారు. గజుడు లేచి "అంగదా! నేను, పది యోజనాల దూరం, గవాక్షుడు 20 యోజనాల దూరం ఎగరగలము" అని చెప్పాడు. గవయుడు 30 యోజనాలు, శరభుడు 40 యోజనాల దూరం వెళ్ళగలమని చెప్పారు. ఇలా వారి వారి శక్తిని గంధమాదనుడు, మైందుడు, ద్వివిదుడు, సుషేణుడు జాంబవంతుడు అందరూ చెప్పారు.

అందులో ఏ ఒక్కరూ వంద యోజనాలు ఎగురగలమని చెప్పలేదు. జాంబవంతుడు "మిత్రులారా!నేను వృద్ధుణ్ణి అయిపోయాను కాని 90 యోజనాలదూరం వరకు నిస్సందేహంగా ఎగురగలను. నేను యౌవనంలో ఉన్నప్పుడు బలి చక్రవర్తి దానం గ్రహించిన వామనుడు మూడు అడుగులతో ఈ విశ్వాన్ని చుట్టి ఉన్నప్పుడు కొద్దిసేపట్లోనే నేను ఆ వామనుని ప్రదక్షిణ చేసి వచ్చాను. కాని అది ఉడుకు రక్తం ప్రవహించే యౌవనం. ఇప్పుడు

వార్థక్యం వచ్చి నా గమనశక్తిని క్షీణింపచేస్తోంది. నా శక్తితో రామకార్యం సాధించగలననే నమ్మకం నాలో కలగడం లేదు" అని చెప్పాడు.

అప్పుడు అంగదుడు జాంబవంతుని మాటలకు సంతోషించి "మహావీరా! జాంబవంతా! మీరు చాలా బలశాలులే. నేను యౌవనంలో వున్నా వంద యోజనాలు ఎగురగల శక్తి నాలో ఉంది. నేను ఈ సముద్రాన్ని అతి లాఘవంగా దాటగలను. కాని అక్కడికి వెళ్ళి తిరిగిరాగల శక్తి నాకుందని నేను అనుకోవడంలేదు. అందుకే నేను ఊరుకొన్నాను" అని చెప్పాడు. జాంబవంతుడు "అంగదా! మీ శక్తి సామర్థ్యాలు మీ గమనశక్తి నాకు తెలుసు. కాని మీరు మా అందరికన్నా చిన్నవారైనా నేడు మాకందరికి నాయకునిగా ఉన్నారు. మాలో ఎవరినైనా పంపి కార్యాన్ని సాధించుకొని రావాలి గాని మీరే వెళ్ళడం అంత సమయోచితంగా ఉండదు" అని చెప్పాడు.

మా పాలకునివైన మిమ్ము మేము సదా కాపాడాలి. మా అన్వేషణకు మూలం మీరే. కార్య ప్రయోజనానికి హేతువును కాపాడుకోవల్సిన బాధ్యతను కార్యసాధకుడు వహించాలి. చెట్లు వేర్లతో భూమిలో పాదుకొన్నపుడే ఫల సంపద కోకొల్లలుగా వస్తుంది. వేర్లనే పెరికివేస్తే ఫలాలు ఎక్కడనుంచి వస్తాయి? అలానే నీవు మా మూలానివి. నీవు బాగున్నప్పుడే మనం తలపెట్టిన కార్యం సఫలం అవుతుంది" అని జాంబవంతుడు అంగదునికి హితం చెప్పాడు.

"జాంబవంతా! మీరే అన్నీ తెలిసినవారు. సుగ్రీవుడు ఎంతటి దయామయుడో అంతటి కఠిన హృదయుడు కూడా. ఇది మీకందరికీ తెలసిన విషయమే. మనం రామకార్యంలో విజయం సాధిస్తే ఎంత ఆనందిస్తామో సాధించలేకపోతే దానికి వేయి రెట్లు దుఃఖాన్ని అనుభవిస్తాము. ఇప్పుడు మీ శక్తియుక్తులు అన్నీ చెప్పారు కదా. ఇప్పుడు నేను ఈ కార్యానికి పూనుకోకపోతే మీలో ఎవరు పూనుకొంటారు? మనం ఈ పని చేయనినాడు మరణమే మనకు శరణ్యం. కావున బాగా ఆలోచించి చేయవలసిన దానిని నాకు చెప్పుము అంటూ అంగదుడు అడిగాడు. వానరులందరు మౌనం వహించారు. ఎవరూ మాట్లాడడానికి ధైర్యంగా ముందుకు రావడం లేదు. ఎవరికి వారు తీవ్రంగా ఆలోచిస్తున్నారు. రామకార్యాన్ని ఎలా చేయాలా అని చింతిస్తున్నారు. కాని వారందరి మనసులు కాస్త కుదురుగానే ఉన్నాయి. వారికి సంపాతి మాటలు ధైర్యాన్ని ఇస్తున్నాయి. కాని ఎవరు ఈ మహాసముద్రాన్ని దాటగల మహావీరులో సంపాతి చెప్పలేదు. రామకార్యాన్ని చేస్తామన్న ధీమతో పాటుగా ఎవరీ కార్యభారాన్ని మోసేవీరులనే మధన వారిలో ఎక్కువ అయింది. అంతలో జాంబవంతుని దృష్టి హనుమంతుని పై పోయింది. ఆంజనేయునిమౌనాన్ని చూశాడు. ఎంత గంభీరంగా కూర్చుని ఆలోచిస్తున్నాడో కదా అనుకొన్నాడు. అంగదునికి ధైర్యం చెప్పడం నాబాధ్యత అనుకొన్నాడు.

"అంగదా! మీరు చింతించకండి మనం కార్యాన్ని సాధించడంలో వెనకడుగు వేసే ప్రసక్తి ఉండదు. అలా అని సుగ్రీవుని చేతిలోనే లేక మనమే కారణభూతులం అయ్యి చావును కోరనవసరంలేదు. సీతాదేవి జాడ తెలుసుకోవడంలో ఆటంకాలు రావని మనకు సంపాతి చెప్పనేచెప్పాడు. మనం విజయాన్నిసాధిస్తామన్న దానికి నిదర్శనంగా సంపాతికి కొత్త రెక్కలు వచ్చిన సంగతి మీరందరూ చూశారు కదా! ఇక ఈ సముద్రాన్ని దాటే వీరుడు కావాలి. ఆ ఉపాయాన్ని ఇప్పుడే చెప్తాను వినండి.

అంగదా! ఏకాంతంగా హాయిగా కూర్చుని ఆలోచిస్తున్న ఈ వీరుని చూడుము. ఈ హనుమానుడే మన కార్యాన్ని సిద్ధింపచేయగల వీరుడు. ఈ మారుతి ఎంత దూరాన్నైనా లంఘించే సమర్థుడు" అంటూ జాంబవంతుడు హనుమంతుని గూర్చి అంగదునికి చెప్పాడు.

* * *

# హనుమంతుణ్ణి ప్రేరేపించటం

## సర్గ - 66

లక్షల కొలదిగానున్న వానరసేన అంతా దిగాలు పడడం చూశాడు. వారందరిని ఉత్తేజితులను చేయాల్సిన అవసరం ఉందనుకొన్నాడు. అందరిని ఉద్ధరించగల వీరుడు మారుతి అని అనుకొన్నాడు. అంజన కొడుకైన హనుమంతుని గూర్చి జన్మ వృత్తాంతం తెలిసిన జాంబవంతుడు తన కర్తవ్యాన్ని చేయాలనుకొన్నాడు.

"ఆంజనేయా! అందరం మాట్లాడుతుంటే నీవు ఒక్కడివే ఎందుకు మౌనంగా కూర్చున్నావు? నీవు వానరులందరిలోకి ఆరితేరినవాడివి కదా. సకలశాస్త్రాలను చదివినవాడివి. నీవు బలపరాక్రమాలలో సుగ్రీవునికి రామలక్ష్మణులకు సాటి ఐన వానివి గదా! ఎందుకీ మౌనం?" అని జాంబవంతుడు ఆంజనేయుని అడిగాడు.

కశ్యప వినతల కుమారుడు గరుత్మంతుడు. ఇతని భుజశక్తికి ఎదురులేదు. పక్షిలోకంలో ఇతడు రారాజు. ఎన్నోసార్లు సముద్రంలోనుండి మహాసర్పాలను లాక్కొని వెళ్తుండడం నేను చూశాను. నీవు కూడా అంతటి భుజబల పరాక్రమశాలివి. ఓ కపివరా! నీ బలం ప్రజ్ఞ తేజస్సు ధైర్యసాహసాలలో అన్నింటిలోను నీవు ప్రజ్ఞాశాలివే.

అప్సరసలలో శ్రేష్ఠురాలైన పుంజికస్థల నీ మాతృమూర్తి. ఆమెనే అంజన అని పిలుస్తారు. నీ తండ్రి కేసరి. అంజన ముల్లోకాలలో అందచందాలలో మేటిగా ఖ్యాతి వహించింది. ఈ అంజన ఒక అప్సరస స్త్రీ. శాపవశాత్తు వానర స్త్రీగా జన్మించింది. ఈమె తండ్రి కుంజరుడు. ఒకసారి అంజన మానవ రూపాన్ని ధరించి పట్టు వస్త్రాలను కట్టుకొని చిత్ర విచిత్ర ఆభరణాలు ధరించింది.

ఒక పర్వతాగ్రభాగముపై నడుస్తుండగా చల్లని గాలి వీస్తోంది. ఆమె అలా నడుస్తుండడం వాయుదేవుడు చూశాడు. ఆమె సర్వాంగ సౌందర్యానికి పరవశుడై ఆమె అందచందాలను చూశాడు. ఆమె అవయవ సంపదకు అబ్బురపడ్డాడు. ఆమెను తన దీర్ఘమైన బాహువులతో కౌగలించుకొన్నాడు. ఆమె విభ్రాంతురాలైంది. "ఎవరీ దుశ్చర్యకు పూనుకొంది? సౌశీల్యాన్ని భంగపరచే వాడు ఎవడు?"అంటూ కుపిత అయ్యింది.

"ఓ సుందరీ! నిన్ను నేను ఏమీ బాధించను. నిన్ను మానసికంగా ఆరాధించాను కాన నీకు ఎలాంటి కళంకం రాదు. కావున నీవు భయపడాల్సిన అవసరం రాదు. నీకు మహాపరాక్రమవంతుడు, బుద్ధి సంపన్నుడు ఐన కొడుకు పుడ్తాడు. ఆకాశంలో ఎగరడంలోను సముద్రాలను లంఘించడంలోను నా అంతటివాడు అవుతాడు" అని వాయుదేవుడు వరమిచ్చాడు.

ఆమె మనస్సు శాంతించింది. ఆ తర్వాత అంజనాదేవి నిన్ను తన పుత్రునిగా పొందింది. నీవు చిన్నప్పుడు ఆడుకొంటూ ఉదయిస్తున్న సూర్యబింబాన్ని చూసి ఫలమనుకొన్నావు. దాన్ని తెచ్చుకోవాలని పైకి ఎగిరి వెళ్ళావు. నువ్వు కొన్ని వందల యోజనాల దూరానికి ఎగిరి వెళ్ళినా నీపై ఆ సూర్య కిరణాలు తమ ప్రభావాన్ని చూపలేక పోయాయి.

అలా అంతరిక్షంలోకి దూసుకెళ్ళే నిన్ను చూసి ఇంద్రుడు ఆగ్రహించాడు. తన వజ్రాయుధంతో నిన్ను కొట్టాడు. ఆ దెబ్బకు నీ ఎడమ దవడ దెబ్బతింది. అందుకే నీకు హనుమంతుడన్న పేరు కూడా వచ్చింది. దాంతో నీవు క్రింద పడ్డావు. స్పృహతప్పావు. దాన్ని చూచిన వాయుదేవుడు విచలితుడు అయ్యాడు. తీవ్రమైన కోపం ఆయన్ను ఆవేశించింది. ఆయనకు తన తనయుడు ఏమయ్యాడో నన్న బాధ ఎక్కువై చేస్తున్న పనిని నిలిపేశాడు. దాంతో పవనుని తన శక్తిని ఆగిపోయింది. ముల్లోకాలలో గాలి స్తంభించిపోయింది. మానవులు, మహర్షులు, సిద్ధులు, దేవతలు, గంధర్వులు, అందరూ భీతి చెందారు.

అందరూ కలసి విధాత దగ్గరకు వెళ్ళారు. దేవతలందరుబ్రహ్మతో కూడి వాయుదేవుని ప్రార్థించారు. ఆయన కోపాన్ని తగ్గించుకోమని వేడారు. అందరికి ప్రాణమైన వాయువును వీచమని చెప్పారు. ముల్లోకాలు అతలాకుతలం అయిపోతున్నాయని విన్నవించారు. అప్పుడు బ్రహ్మదేవుడు నీ సుతునకు ఇక ఏ ఆయుధంవల్లా మరణించకుండా ఉండేలా అనుగ్రహించాను అన్నాడు. నీవు వజ్రాయుధ దెబ్బకు క్షేమంగా ఉండడం చూసి ఇంద్రుడు భయం వీడాడు. అపుడు "వాయుదేవా! నీ పుత్రుడు స్వచ్ఛందంగా మరణించే వరాన్ని ఇస్తున్నాను నీ కుమారునకు ఏ ఆపదా వాటిల్లదు. నీవు చింతించకు" అని చెప్పాడు. నీ క్షేమవార్త వాయుదేవునికి బలం ఇచ్చింది. వారిందరి మొర ఆలకించాడు. వారి మాటలతో అనునయం పొంది తిరిగి తన పనిలో లీనమయ్యాడు. అందరూ  హాయిగా ఊపిరి పీల్చుకొన్నారు. ఆ తర్వాత నీవు ఎప్పటిలాగా లేచి తిరిగావు. నీ తల్లితండ్రులకు ఎనలేని సంతోషాన్ని కలుగచేశావు. "ఆంజనేయా! నీవు కేసరి అంజనల ముద్దుబిడ్డవు. వాయుదేవుని ఔరస పుత్రునివి. నీకు సాటి వచ్చే వీరులు ఎవరూ లేరు. నీవు ఎన్ని యోజనాల దూరంఅయినా చిటికెలో అధిగమించగలవానివి. నీవు వాయుదేవుని అంతటివానివి. మమ్ము ఉద్ధరించే వీరుడవు నీవే."

"హనుమంతా! నేను యౌవనంలో ఉండగా వామనావతారకాలంలో వామనుడు భూమండలాన్ని ఆక్రమించి ఉండగా ఈ కొండకోనలతో అరణ్యాలతో ఆవృతమైన భూమండలాన్ని 21 పర్యాయాలు ప్రదక్షిణం చేసి వచ్చాను. దేవతల ఆదేశం ప్రకారం క్షీరసాగర మథనం చేసేటప్పుడు ఎక్కడెక్కడినుంచో ఓషధులను తీసుకువచ్చి సముద్రంలో వేశాం. దానివలనే అమృతం వచ్చింది. అప్పుడు యౌవనంలో ఉన్న నాకు బలం బాగా ఉండేది. ఇప్పుడు వృద్ధుడిని అయ్యాను. బలం క్షీణించిపోతోంది.  నాకు రామకార్యంలో భాగంగా సముద్రాన్ని దాటగల ధైర్యం, శక్తియుక్తులు లేవు. కాని నీవు  మా అందరిని బతికించగల వీరునివి నీవే. నీవు ఈ పనిని చేయగల దిట్టవు. నీవు ధైర్యసాహస పరాక్రమాది ఉదాత్తగుణాలలో సర్వశ్రేష్ఠునిగా ఉన్నావు. ఈ వానరసేన అంతా నీ శౌర్యపరాక్రమాలు చూడాలనుకొంటున్నారు. లెమ్ము వానరేంద్రా! ఇక ఉపేక్ష పనికిరాదు. సమస్తప్రాణకోటిగమనానికంటే నీవే ఉన్నత గమనశీలునివి."

ఇలా జాంబవంతుడు ఆంజనేయుని ప్రేరేపించాడు. అప్పుడు అంజనసుతునకు తన శక్తిపై నమ్మకం పెరిగింది. ఆంజనేయుడు సర్వవానర సేనలో ఉత్తేజం కలిగేటట్లుగా అద్భుతమైన రూపాన్ని సంతరించుకొన్నాడు.

* * *

# హనుమంతుడు మహేంద్రగిరి చేరటం

## సర్గ - 67

జాంబవంతుని మాటలతో ఆంజనేయుడు మహోత్సాహం పొందాడు. పరాక్రమాన్నంతా కూడగట్టుకున్నాడు. వాని చూచిన వానరులందరూ ఆనందంతో కేరింతలు కొట్టారు, కేకలు వేశారు. హనుమంతుని స్తుతించారు; పొగిడారు. వామనావతారంలో మహావిష్ణువును ప్రజలు చూచినట్లు ఆంజనేయుని వానరులు చూశారు. వారిలో అంతులేని ఆనందం కలిగింది.

హనుమంతుడు వారి ప్రశంసల వర్షంలో తడిసిపోయాడు. చాలా సంతోషించాడు. ఆయన మనస్సు రామకార్యం సిద్ధిస్తుందన్న నమ్మకాన్ని పెంచింది. తన తోకను జాడించాడు. ఒక్కసారిగా తన శరీరాన్ని విరచుకొన్నాడు. ఇంకా బలం ఆయనలో చేరినట్లు అనిపించింది. ఆ మహాత్ముని ముఖం తేజోవంతం అయ్యింది. గట్టిగా ఆవులించాడు. అప్పుడు ఆంజనేయుని ముఖం కణకణమండే అగ్నిలాగా దీప్తివంతం అయ్యింది. అందరిలో కూర్చున్న ఆంజనేయుడు లేచాడు. వృద్ధులైన కపివరులకు నమస్కరించాడు.

“మహామహులారా! ఆకాశంలో సంచరించే వాయుదేవుని శక్తి ఇంత అని చెప్పలేనిది. అతడు తన శక్తిసామర్థ్యాల చేత పర్వతాలను నుగ్గు చేయగలడు. అలాటి వాయుదేవుని పుత్రుడిని నేను. మహోన్నతమైన మేరుపర్వతం చుట్టూ అనేక వేల పర్యాయాలు నేను చుట్టిరాగలను. నేను నా బాహుబలంతో సముద్రాలను అల్లకల్లోలపరచగలను. ఈ సమస్త భూమండలాన్ని సాగరంలో ముంచివేయగలను. సముద్రాన్ని తలక్రిందులు చేయగలను. అతివేగంగా తిరిగే వైనతేయుని నేను ప్రదక్షిణ చేయగలను. ఓ వానర ప్రముఖులారా! నేను మధ్యాహ్నమార్తాండునికి ఎదురుపోగలను. అంతే వేగంతో సుదూర తీరాలకు నిర్విరామంగా వెళ్ళిరాగలను. ఆకాశంలో సంచరించే గ్రహాలను నక్షత్రాలను కూడా అధిగమింపచేయగలను. సముద్రాలలోని నీరును అంతా ఇంకింపచేస్తాను. పర్వతాలపై ఎగిరిదూకుతూ వాటిని పిండి చేయగలను. మహావేగంతో ఎగిసిపడే సముద్రాలను అవలీలగా దాటగలను. నేను వేగంగా ఆకాశంలో వెళ్తుంటే నా వెనుక నా వేగధాటికి వృక్షాలు పూలతీగలు నా వెంట వస్తాయి. “ఓ వానరులారా! నా అద్భుత రూపాన్ని మీరు చూడగలరు. ఆకాశం అంత ఎత్తుగా భూమండలం అంత వెడల్పుగా నా శరీరాన్ని నేను పెంచగలను. ఏ ప్రాణి నన్ను నా గమన శక్తిని మించలేవు.

నేను పైకి ఎగిరేటప్పుడు విద్యుద్వేగంతో ఎగురుతాను. అప్పుడు నా రూపం ఆ విష్ణుదేవునిలాగా మీకు కనిపిస్తుంది. నేను నా బుద్ధితో ఆలోచించి చేయాలనుకొన్న పనిని నా మనస్సు కూడా కలిసి వేగంగా పనిని సాధించగలను. దేవేంద్రుని నుండిగాని బ్రహ్మనుండి గాని నేను అమృతాన్ని తీసుకొని రాగలను. రావణుని లంక సైతం నేను పెకిలించుకొని రాగలననే నాకు అనిపిస్తోంది.”అని వాయుసుతుడు మహోత్సాహంతో చెప్పాడు.

ఇలా భీకరంగా గర్జిస్తున్నట్లు చెప్పే ఆంజనేయుని వానరులందరూ ఆశ్చర్యానుభూతులై చూశారు. వారందరి కళ్ళల్లో ఆనందంతో నిండిన కన్నీళ్ళు ఉబికి వచ్చాయి. అందరి విచారాన్ని పొగొట్టుతూ హనుమంతుడు మాట్లాడడంతో వారికి కార్యాన్ని సాధించివేసిన తృప్తి కలిగింది. జాంబవంతుడు ఆంజనేయుని మాటలకు పరమానందించాడు. “ఓ కేసరి నందనా! ఓ వాయుసుతా! నీలోని ధైర్యానికి తగ్గట్లుగా నీవు మాట్లాడావు. నీ మాటలతో మాలో గూడుకట్టుకొని పోయిన దుఃఖాన్ని కూకటివ్రేళ్ళతో పెరికివేశావు. మేమందరం నీకు శుభం కలగాలని ఆశిస్తున్నాం. నీవు మా కోరికను, రామకార్యాన్ని సాధించి తీరగలవు” అని చెప్పాడు. “ఓ మారుతీ! నీకు మా అందరి ఆశీర్వచనాలుతోడుగా ఉంటాయి. దేవతల అభినందనలు నిన్ను వెంబడించి వస్తాయి. నీకు గురు అనుగ్రహం కలిగితీరుతుంది. నీవు ఈ సముద్రాన్ని అవలీలగా దాటి లంకలో సీతమ్మ జాడను తెలుసుకొని అతి త్వరగా మమ్ములను చేరు. మేమందరం నీవు వచ్చేవరకు నీ నామాన్నే జపిస్తూ నీకోసం వేయి కన్నులతో ఎదురుచూస్తుంటాం. మా ప్రాణాలన్నీ నీపై పెట్టుకొని జీవిస్తున్నాం. నీవు త్వరగా సముద్ర లంఘనాన్ని ఆరంభించు” అని జాంబవంతుడు చెప్పాడు.

ఆంజనేయునితో పాటుగా అక్కడున్న వానరులందరికి సంతోషంవేసింది. రామకార్యం అయిపోయినట్లుగా వారికి అనిపించింది. వారందరి కళ్ళలో ఆనందబాష్పాలు కారసాగాయి. మహోగ్రంగా కనిపించే ఈ సంద్రాన్ని దాటగల వీరుడు ఈ అంజనాసుతుడే ఆయనకు శక్తినివ్వు భగవాన్ అని అందరూ భగవంతుని వేడుకొన్నారు.

“కపివరులారా! నేను ఎగిరి పైకి వెళ్ళేటప్పుడు నా పాదం అదిమినప్పుడు ఆ భారాన్ని ఈ భూమి భరించలేదు. ఎత్తుగా ఉన్న శిఖరాలతో గైరికాది ధాతువులతో వృక్షాలతో విలసిల్లే ఈ మహేంద్ర పర్వతంపై నేను కాలు మోపి సముద్రాన్ని లంఘించే ప్రయత్నం చేస్తాను” అన్నాడాంజనేయుడు.

అలా చెప్పి ఆంజనేయుడు పర్వతాలలో శ్రేష్ఠమైన మహేంద్రగిరిని అధిరోహించాడు. ఆ పర్వత రాజంపై మృగాలు హాయిగా సంచరిస్తున్నాయి. వృక్షాలు లతలు ఏపుగా పెరిగాయి. వాటిపై రకరకాల పక్షుల ఆవాసం చేసికొని ఉన్నాయి. ఎప్పుడు ఫలాలతో పూలతో ఆ గిరి నిత్యకల్యాణిలాగా శోభిస్తుంది. జలప్రవాహాలతో నిండిన ప్రదేశాలు ఏనుగుల సంచారం క్రూరమృగాల విహారం అన్నీ చూస్తూ హనుమంతుడు ఆ గిరి అగ్రభాగంలో అటు ఇటు నడిచాడు. ఆ పాదాల తీవ్రతకు ఆ పర్వతం కంపించింది. దానిపైన ప్రాణులన్నీ గగ్గోలుగా అరిచాయి. ఆ పర్వతం బీటలు వేసింది. ఆ పగుళ్ళనుండి నీరు పైకి ఉబికింది. ఆంజనేయుని పాదఘట్టనకు ఏనుగులు, సింహాలు భీతిల్లాయి. జంటలుగా తిరిగే నాగులు, పక్షులు తొట్రుపడ్డాయి. గుంపులుగా తిరిగే విద్యాధరులు భయపడి ఆ ప్రదేశం వదిలి వెనుదిరుగుదాం అనుకొన్నారు. ఆంజనేయుని పాదఘట్టనలకు మహేంద్రగిరి అల్లకల్లోలం అయ్యింది. పుట్టల్లోనుంచి పాములు భయపడి బయటకు వచ్చాయి. అక్కడే తపస్సు చేసుకొనే ఋషులందరూ ఏమైందోనని ఆదుర్దాతో చూశారు. శత్రు భయంకరుడు, వానరులలో శ్రేష్ఠుడు, మనోనిగ్రహం కలవాడు వేగగమనుడు ఐన ఆంజనేయుడు సముద్రం లంఘించాలని నిశ్చయించుకొన్నాడు. ఏకాగ్రచిత్తంతో భగవంతుని ధ్యానించాడు. మనస్సుతో లంకను గూర్చి ఆలోచించాడు. ఆంజనేయుని మనస్సు లంకనంతా చుట్టేస్తోంది.

*కిష్కింధకాండ సంపూర్ణం*

# సుందరకాండ

# సముద్ర లంఘనం

## సర్గ - 1

**మ**హా పరాక్రమవంతుడైన ఆంజనేయుడు సీతమ్మతల్లిజాడను తెలుసుకోవడానికి సముద్రాన్ని లంఘించాలన్న కృతనిశ్చయంతో మహేంద్రగిరిని అధిరోహించాడు. కార్యాన్ని ఏ విధంగానైనా సాధించాలని నిటారుగా నిలబడ్డాడు. గిరిపై పచ్చిక బయళ్ళు చల్లని గాలి స్పర్శతో వైడూర్యంలాగా పచ్చని రంగుతో అలరారుతున్నాయి. వాటిపై హనుమంతుడు అటు ఇటు తిరిగాడు. ఆ గిరిపై అనేక రకాలైన ధాతువులు ఉండడంతో ఎరుపు, తెలుపు, నలుపు, పసుపు మొదలయిన కాంతులను విరజిమ్ముతూ ఉంది. అక్కడ విద్యాధరులు, యక్ష, కిన్నెర, కింపురుషులు వారి ఇష్టానుసారంగా సంచరిస్తూ ఉన్నారు. ఆ గిరి కింద పెద్దపెద్దఏనుగులు తిరుగుతున్నాయి.

హనుమంతుడు వక్షస్థలబాహుళ్యాన్ని పెంచి వేగంగా తిరుగుతుంటే ఆ విసురుకు వృక్షాలపై ఉన్న పక్షులు పడిపోతున్నాయి.ఆంజనేయుడు దిక్పాలురకు  నమస్కరించాడు. తూర్పువైపుకుతిరిగి తనతండ్రి వాయుదేవునకు అంజలి ఘటించాడు. సముద్రాన్ని దాటడానికి వీలుగా తన శరీరాన్ని పెంచాడు. రామకార్యార్థిఅయి వెళ్ళుతున్న ఆంజనేయుణ్ణి అక్కడున్న వానరులందరూ ఆశ్చర్యానందాలతో చూశారు. అప్పుడు పూర్ణిమతిథిలో పొంగే సంద్రంలాగా హనుమంతుని శరీరం పెరిగింది. తన పాదాలతో గిరిని గట్టిగా అదిమి పెట్టాడు.

మహేంద్రగిరి కదల్చడానికి కష్టమైనది ఐనా మారుతి సముద్రాన్నిలంఘించడానికోసం గట్టిగా అదిమి పెట్టగానే ఒక్కసారిగా ఆ గిరి కంపించింది. ఆ కంపనకు చెట్లనుండి పుష్పాలన్నీ రాలి ఆ పర్వతం పుష్ప రాశిలాగా కనిపించింది. ఆ గిరి పగుళ్ళు బారి జలధారలు బయటపడ్డాయి. అగ్నిజ్వాలలు ఎగిసినప్పుడు దాని మధ్యమ జ్వాల నుంచి ఎగిసే సులోహిత అనే ఎర్రని జ్వాలలు ఎగజిమ్మినట్లు ఆ గిరి అంతా ఎర్రగా అయ్యింది. ఆ పర్వతంలోని గుహలలో ఉండే ప్రాణులన్నీ గగ్గోలుగా అరుస్తూ బయటకు పరుగెత్తాయి. పుట్టల్లోని భయంకరమైన పాములన్నీ గిరిని గట్టిగాపట్టుకొన్నాయి. ఆ గిరిలోని గండశిలలన్నీ పెద్ద శబ్దంతో పగులుతున్నాయి.

అక్కడ సంచరిస్తున్న కామరూపులందరూ తమ పాత్రలను, ఆయుధాలను అక్కడే వదిలేసి పైకి ఎగిరిపోయారు. అలా ఎగిరి కాస్తదూరంవెళ్ళి అక్కడనుంచి ఆ గిరిని చూడసాగారు. మధుపానం చేస్తున్నవారు ఆ మధువును అక్కడే వదిలేసి పారిపోయారు. ఆ సురాపానంతో ఎరుపెక్కి ఉన్న వారి కళ్ళు భయంతో మరింత ఎర్రజీరలతో కనిపించాయి. విద్యాధర స్త్రీలు ప్రియులతో కలిసి ఆకాశం నుండి ఆశ్చర్యంగా హనుమంతుని చూస్తున్నారు. మహర్షులందరూ ఆనందంగా రామకార్యార్థిని వీక్షిస్తున్నారు.

హనుమంతుడు శరీరాన్ని పెంచి పాదాలతో గిరిని పట్టి ఆకాశంలోకి ఎగిరి ముందుకు సాగాడు. ఆ వేగానికి ఆ గిరిపై ఉన్న వృక్షాలన్నీ మిత్రులకు వీడ్కోలిచ్చే బంధువులలాగా కాస్త దూరం వెళ్ళి వెనక్కు తిరిగి వచ్చినట్లుగా అవి సముద్రంలో పడిపోయాయి. ఆకాశంలో వెళ్ళే హనుమంతుని నీడ సముద్రం మీద పది యోజనాలదాకా విస్తరించింది. దట్టమైన మేఘమండలంగా గోచరించింది.

ఆయన మీద రాలిపడిన పూలు మనోహరంగా కనిపించాయి. హనుమంతుడు దీర్ఘంగా పెరిగి బాహువులు చాపి ఉన్నాడు. అప్పుడు ఐదు పడగల సర్పంలాగా కనిపించాడు. ఆంజనేయుని ధాటికి లవణసముద్రంలోని జలం ఉవ్వెత్తున లేచింది. అప్పుడు అడుగున ఉన్న చేపలు తిమింగలాలు అన్నీ ఆచ్ఛాదనలేని శరీరంలాగా కనిపించాయి. ఆంజనేయుడు ఎగురుతున్న గరుత్మంతునిగా కనిపించాడు. మేఘాలమధ్య చంద్రునిలాగా ఆంజనేయుడు అగుపించాడు. రామకార్యార్థిఅయి వెళ్ళుతున్న ఆంజనేయునికి సూర్యుడు తన ప్రభావాన్ని చూపించలేదు. వాయుదేవుడు కూడా తన పుత్రునికి గమనాయాసం లేకుండా ఉండడానికి చల్లగా వీచాడు. అలా ముందుకు వెళ్తున్న ఆంజనేయునిపై దేవతలు పుష్పవృష్టి గుప్పించారు. మహర్షులు సిద్ధులు అందరూ ఆయన్ను స్తుతించారు. హాయిగా సాగే మేఘంలా ఉన్న ఆంజనేయుని చూసి యక్ష కిన్నెర నాగ గంధర్వ జాతులన్నీ ప్రస్తుతించాయి. పక్షి గణాలన్నీ కీర్తించాయి. అలా అందరి ప్రశంసలు, మెచ్చుకోలు వర్షంలాగా కురుస్తుండగా ఆంజనేయుడు దక్షిణ దిశగా సాగిపోయాడు.

## మైనాకుని స్వాగతం

దక్షిణదిశగా సాగే ఆంజనేయుని సముద్రుడు చూశాడు. ఇక్ష్వాకు వంశీయులచే వృద్ధి పొందిన నేను రామకార్యార్థం వెళ్ళుతున్న ఈ హనుమంతునికి ఏదైనా సహాయం చేసి అలసట తీర్చాలనుకొన్నాడు. నేను కాస్త విశ్రాంతిని ఇవ్వగలిగితే తర్వాతి ప్రయాణం హాయిగా చేస్తాడు అని అనుకొన్నాడు. వెంటనే తన గర్భంలో ఉన్న బంగారు శిఖరాలున్న మైనాకుడు తలపునకు వచ్చాడు. " ఓ మైనాకా! దేవేంద్రుని వలన నీవు పర్వతం అయి పాతాళంలో ఉన్న రాక్షసులు బయటకు రాకుండా వారిని అదిమేస్తూ అక్కడే ద్వారంలా నిలిచి ఉన్నావు.

అయినా మైనాకా! నీవు పైకి కిందకు, పక్కకు పెరగగల సామర్థ్యం నీలో ఉంది. నేడు అసహాయశూరుడైన ఆంజనేయుడు సీతాన్వేషణార్థం దక్షిణదిశకు వెళ్ళుతూ ఆకాశమార్గంలో నన్ను దాటుతున్నాడు. నాకు ఇనకుల వంశజులు పూజనీయులు. నీవు నాలోనే ఉన్నావు కదా! నీకును వారు వందనీయులే. వారి కోసం వెళ్ళే ఈ వానర వీరునికి మనం సహాయపడడం మన కర్తవ్యం. అందుకని నీవు త్వరగా బయటకు వచ్చి నిలబడు. పైన వెళ్ళే ఆంజనేయుడు నీపై ఆగి విశ్రాంతి తీసుకొంటాడు" అని సముద్రుడు చెప్పాడు.

సముద్రుని మాటలు విన్న మైనాకుని హృదయము పొంగింది. ఇనకులవంశజుల మాటను వినేసరికి మైనాకుని మనస్సు మైమరచిపోయింది.

"మైనాకా! అదుగో ఆంజనేయుడు గబగబా వచ్చేస్తూ నీదాపుకు చేరుతున్నాడు. నీవు బయటకు వచ్చి నిలువు. నీ బంగారు శిఖరంపై కాసేపు ఆంజనేయుడు విశ్రమిస్తాడు " అని చెప్పే సముద్రుని మాటలు మైనాకుడు విని వినగానే వృక్షాలతో లతలతో నిండి ఉన్న తన శరీరాన్ని అమాంతంగా పైవరకు పెంచుతూ బయటకు వచ్చాడు. ఉదయాద్రిని చీల్చుకొని వచ్చే భాస్కర కిరణంలాగా సాగర జలాన్ని విచ్ఛిన్నం చేస్తూ పైకి మైనాకుడు ఎత్తుగా నిలిచాడు. ఆ మైనాక పర్వతాగ్రభాగాలన్నీ సూర్యసమప్రభావంగా బంగారు కాంతులీనుతున్నాయి. దానిపై ఉన్న వృక్షాల నిండా నానావిధపక్షులు కిలకిలరావాలు చేస్తున్నాయి. దాన్ని ఆశ్రయించి ఉన్న యక్షకిన్నరులు సంతోషంగా క్రీడిస్తున్నారు.

లవణసముద్రమధ్యం నుండి అనూహ్యంగా పెరిగి ఎత్తుగా నిలుస్తున్న మైనాక పర్వతాన్ని చూచి హనుమంతుడు తన కార్యానికి ఏదో ఆటంకం వస్తోందనుకొన్నాడు. వెంటనే వాయువేగంతో తన వక్షస్థలంతో ఆ మైనాకుణ్ణి హనుమంతుడు ఢీకొన్నాడు. అవలీలగా కొట్టిన దెబ్బకు ఆ గిరీంద్రుడు పులకించి ఆహా ఎంతటి శక్తి! అనుకొన్నాడు. వెంటనే మైనాకుడు మానవ రూపం ధరించాడు. తన శైలంపైనే హనుమంతునికి ఎదురుగా నిలిచాడు.

"ఓ వానరోత్తమా! ఈ రామ మహాకార్యంలో మీరు బాగా అలసిపోయి ఉంటారు. మీరు నా శిఖరాగ్రంపై కాసేపు విశ్రమించి మీ అలసటను తీర్చుకోండి. ఇక్ష్వాకులచే వృద్ధి పొందిన సాగరుడు మీకు ఆతిథ్యం ఇవ్వాలనుకొని నన్ను పంపాడు. మేలుచేసిన వారికి సహాయం చేయడం ఉత్తముల లక్షణం కదా! ఇదే సనాతన ధర్మం కదా! అందుకే సముద్రుడు మీకు సహాయం చేయాలని కోరుకొంటున్నాడు. అతనిచే నియుక్తుణ్ణైన నా చేత మీరుసహాయం పొందడంలో తప్పులేదు గదా!"

" శతయోజనాలను అధిగమించాలని వెళ్ళుతున్నారు. ఓ కపివరా! కాసేపు నాపై నిలచి నా ఆతిథ్యం తీసుకొని మరలి వెళ్ళడం మంచిది. నా దగ్గర కందమూల ఫలాలు సమృద్ధిగా ఉన్నాయి. మంచినీరు ఉంది. మీరు ప్రేమాదరాలను స్వీకరించే వానిగా ప్రసిద్ధి చెంది ఉన్నారు గదా. అతిథిని మించిన దేవుడు లేడు గదా. అతిథిని పూజించుకొనే భాగ్యం కలిగినప్పుడు ఎవరు మాత్రం వదిలివేయగలరు. ఓ కపీశ్వరా! మీరు వానర ప్రముఖులు, వాయువేగగమనులు పైగా వాయునందనులు. అంతేగాదు రామదూతవు– ఇన్ని లక్షణాలున్న మహాత్ములు మీరు."

"ఇట్టి మిమ్ము మేము సేవించుకోవటం మా భాగ్యం కదా! మేము రామకార్యంలో భాగస్తులమయ్యామన్న తృప్తి మాకు మీరు ఇచ్చినవారు అవుతారు. ఓ ధర్మజ్ఞా! అంతేగాదు మరొక ముఖ్య విషయం చెప్తా విను. ఇంతకుముందు పర్వతాలకు రెక్కలుండేవి. వాటి సహాయంతో అవి ఎక్కడికైనా వెళ్తూ వస్తూ ఉండేవి. అవి ఎగిరేటప్పుడు ఎక్కడ తమ మీద పడతాయోనని మహర్షులు దేవతలు భయపడేవారు. వారందరూ మా బాధను తొలగించమని దేవేంద్రుని అడిగారు. దేవేంద్రుడు వారి ప్రీతి కోసం పర్వతాల రెక్కలన్నీ వజ్రాయుధంతో నరికివేయసాగాడు. అప్పుడు నీ తండ్రి నన్ను ఆ దేవేంద్రుని నుండి లాఘవంగా తప్పించి ఈ సముద్రంలో పడవేశాడు. అంతటి లబ్ధి పొందిన నాకు ఆ వాయుసుతునకు సహాయం చేయాల్సిన అవసరం లేదా?"

"ఓ వానరోత్తమా! మీరు నాపై కాసేపు విశ్రమించి నాకు కూడా సముద్రునితోపాటుగా ఆనందాన్ని కలిగించుము. ఆంజనేయా! మిమ్ముచూడటం నాకు ఎంతో ఆనందంగా ఉంది. కొంత తడవు ఆగి నేనిచ్చే ఫలాలు ఆరగించండి" అని మైనాకుడు ఎంతో ప్రార్థించాడు.

సంగతి తెలుసుకొని హనుమంతుడు సంతోషించాడు.

"ఓ మైనాకమిత్రమా! నేను ఇప్పుడు కార్యార్థమై వెళ్ళుతున్నాను. వానరుల ఎదుట కార్యాన్ని సాధిస్తానని మాట ఇచ్చాను. ఇప్పుడేమో పొద్దు ఏటవాలవబోతోంది. సూర్యుడుపశ్చిమాద్రిని చేరేలోగా నేను లంకకు వెళ్ళాలి. నీవు ఏమీ అనుకోకు. నీ ఆతిథ్యాన్ని నేను స్వీకరించినట్లుగానే అనుకొనుము." అంటూ ఆంజనేయుడు కాస్త కిందకు వచ్చి తన చేతులతో ప్రసన్న వదనంతో మైనాకుణ్ణి స్పర్శించి మళ్ళీ పైకి ఎగిరి ముందుకు సాగాడు.

అలా వాయునందనుడు మైనాకునకు, సముద్రునకు వీడ్కోలిచ్చి కాస్త ఎత్తుకు ఎగిరి వేగాన్ని విజృంభించి ముందుకు సాగిపోయాడు. అలా వారిని సంతోషపరిచి తిరిగి తన కార్యంలో మునిగిన ఆంజనేయుని చూచి సిద్ధులు, దేవతలు, మహర్షులు అందరూ ప్రస్తుతించారు.

ఇంద్రుడు మైనాకుడు చేసిన పనికి ఎంతో సంతోషించాడు. సంతోషం ఇంద్రునిలో ఉప్పొంగగా గద్గద కంఠుడయ్యాడు. "హిరణ్యనాభ! నీవు రామకార్యార్థం వెళ్తూ ఈ అనంతసాగరాన్ని దాటుతూ ఉన్న పవన సుతునకు నీవు ఆతిథ్యం ఇవ్వాలనుకోవడం నాకు ఆనందాన్నిచ్చింది. నావలన నీకు ఏ ఉపద్రవం రాదు. నేను నీకు అభయప్రదానం చేస్తున్నాను. నీవు ఏ చింత లేక హాయిగా జీవించు" అని దేవేంద్రుడు మైనాకునకు చెప్పాడు. అది విన్న మైనాకుడు దేవేంద్రునకు ప్రీతి కలిగించానని సంతోషించాడు.

**సురస ఆగమనం**

అలా ముందుకు సాగిపోతున్న హనుమంతుని అందరూ ఆనందంగా చూడసాగారు. దేవతలకు ఒక ఆలోచన వచ్చింది. కార్యశూరులైనవారు మధ్యలోవచ్చే ఆటంకాలకు భయపడకుండా ముందుకు సాగాలి కదా! మరి ఈ హనుమంతుడు రామకార్యంలో ఆటంకాలకు భీతిచెందుతాడా లేదా చూడాలనుకొన్నారు. వెంటనే గంధర్వులు యక్షులు దేవతలు కలిసి మాట్లాడుకొన్నారు. నాగమాత ఐన సురసను పిలిపించారు.

పచ్చని నేత్రాలతో కోరలతో భయంకరరాక్షసరూపాన్ని ధరించు. ఆకాశ మార్గంలో రామకార్యార్థం వెళ్ళే ఈ హనుమంతునకు విఘ్నం కలిగించు. అందులో అతడు విజయుడు అయి ముందుకు సాగుతాడో లేదో తెలుసుకోవాలని ఉంది అని చెప్పాడు. ఉపాయంతో అపాయాన్ని జయించుతాడో లేక అపజయంతో వెనుతిరిగి వెళ్తాడో చూడాలనే కుతూహలం మాలో పెరుగుతోంది. నీవు వెంటనే ఆంజనేయునికి అడ్డుపడి ఆటంకాన్ని కలిగించు అని చెప్పారు.

సురస వారికందరికి నమస్కరించింది. వికారమైన వికృత రాక్షస రూపాన్ని ధరించింది. వానరునికి ఏ విధంగా అడ్డు నిలవాలా అని ఆలోచించింది. వెంటనే ఆమెకు ఆలోచన వ చ్చింది.

వానరేశ్వరునికి అడ్డు నిలిచి ఓ వానరప్రముఖా! దేవతలు నిన్ను నాకు ఆహారంగా పంపారు. కావున ఇప్పుడు నేను నిన్ను తినివేస్తాను అనింది. అలా చెప్పే సురసకు ప్రసన్నవదనంతో ఆంజనేయుడు చేతులు జోడించాడు. అమ్మా! దశరథపుత్రుడు వనవాసంచేయడానికి తన సతి తమ్ములతో వచ్చాడు. తను, తన తమ్మునితో కలసి బయటకు వెళ్ళి ఉండగా రావణుడను రాక్షసుడు శ్రీరాముని ధర్మపత్నిని అపహరించి తీసుకొని వెళ్ళాడు. నేను ఆ సీతమ్మను వెదకే ప్రయత్నం మీద వెళ్తున్నాను.

నీవు కూడా రఘువంశీయులు ఏలే ఈ భూమి మీదే నివసిస్తున్నావు కదా! ఆయన త్రిలోకప్రభువు. ఆయన కార్యానికి నీవు కూడా సహాయం చేయి. అలా కాదంటే నేను సీతమ్మను చూసి ఆ సంతోష వార్తను రామునితో చెప్పి ఆ తర్వాత నీ దగ్గరకు వస్తాను. ఇప్పుడు నా పనికి అడ్డురావద్దని వినయంగా చెప్పాడు.

కామరూపిణి ఐన సురస ఓ హనుమంతా! ఎవ్వరూ నన్ను కాదని ముందుకు పోలేరు. ఇప్పుడు నీవు నా నోట ప్రవేశించిన తర్వాతే నీవు ముందుకు సాగాలి. ఇది నాకు బ్రహ్మఇచ్చిన వరం అని చెప్పింది. దానితో ఆంజనేయుడు కోపగ్రస్తుడయ్యాడు. వెంటనే తన శరీరాన్ని పెంచాడు. సురస కూడా దానికి తగ్గట్టుగా ఇంకా పెద్దగా తన శరీరాన్ని పెంచింది. అలా పెంచిన శరీరంతో ఉన్న సురసను హనుమంతుడు చూశాడు. వెంటనే తన బుద్ధికుశలతతో సూక్ష్మరూపాన్ని ధరించి, సురస గుర్తించేలోపే ఆమె ముఖంలో ప్రవేశించి బయటకువచ్చేశాడు. అంగుష్ఠమాత్రంగా మారాడు.

ఓ వనితారత్నమా! నేను నీ నోటిలోకి ప్రవేశించి బయటకు వచ్చేశాను. నీకు బ్రహ్మ ఇచ్చిన వరం సిద్ధించింది కదా! ఇక నేను సీతమ్మ దగ్గరకు వెళ్తాను అని చెప్పాడు. రాహుముఖం నుండి బయటపడిన చంద్రుని పోలిన ఆంజనేయుని చూసి సురస నిజరూపంలో కనిపించింది. కపివరా! రామకార్యార్థ సిద్ధికై వెళ్ళే ఆంజనేయా! నీవు విజయం సాధించి సీతమ్మను రాముని దగ్గరకు చేర్చు అని చెప్పింది.

ఆమె దీవనలు అందుకొని ముందుకు సాగుతున్న వీరుని అందరూ కొనియాడారు. వినువీధిలో హాయిగా పవనసుతుడు ముందుకు సాగిపోయాడు. అలా సాగుతూ హనుమంతుడు ఆకాశ మార్గంలో వరుణుని నివాసమైన సముద్రాన్ని దాటుతూ ముందుకు వెళ్ళాడు. అలా వెళ్ళే మారుతికి మేఘాలు, పక్షులు ఐరావతం కైశికాచార్యులు సంచరించడం కనిపించింది. ఏనుగులు, సింహాలు పెద్ద పులులు లాగే దివ్య విమానాలను చూశాడు. పుణ్యం చేసి స్వర్గవాసులైన ఎందరో మహాభాగ్యవంతులు కనిపించారు. యజ్ఞాలలో హవిస్సులను తీసుకెళ్ళే దేవతలను చూశాడు.

అక్కడక్కడ మహర్షి గణాలు, తారాగణాలు నక్షత్రాలు గంధర్వులు, నాగులు, యక్షులు కనిపించారు. దేవేంద్రుని గజాలు కనిపించాయి. విశ్వావసుడు అనే గంధర్వరాజు అక్కడే ఉండడం చూశాడు. అక్కడంతా విద్యాధరులు ఎక్కువగా ఉండడం చూశాడు. జీవలోకంపై అందంగా కట్టిన గుడ్డపందిరిలాగా ఆకాశం కనిపించింది.

**సింహిక ప్రత్యక్షం**

పవనసుతుడు వాయువేగంతో మేఘాలను చీల్చుతూ గరుత్మంతునిలాగా ఆకాశంలో పరుగెడుతున్నాడు. నిరాధారమైన ఆకాశంలో ఆ మారుతి వెళ్ళుతుంటే రెక్కలున్న పర్వతంలాగా చూచేవారికి అనిపించాడు. కామరూపిణియైన సింహిక పైన వెళుతున్న ఆంజనేయుని చూసింది. ఈమె నీడను ఆకర్షించి పైన వెళ్ళేవారిని అమాంతంగా తినివేయగలిగిన రాక్షసి. పెద్ద ఆకారంతో వెళ్ళే మారుతిని సింహిక చూచి అదృష్టవశాన మంచి ఆహారం దొరికిందని సంతోషించింది.

హనుమంతుని ఛాయను ఒడిసి పట్టుకొని పరుగెత్తి వెళ్తోంది. అంతలో హనుమంతుడు తన వేగం తగ్గడాన్ని గమనించాడు. ఎదురుగాలికి వెనక్కు వెళ్ళే నావలాగా నన్ను ఎవరో లాగివేస్తున్నారనుకొన్నాడు. కిందకు చూశాడు. సముద్రంలో వికృతంగా ఉన్న పెద్ద ఆకారం ఉన్న జంతువు తనపైకి వస్తూ కనిపించింది. వెంటనే హనుమంతునికి సుగ్రీవుడు చెప్పిన ఛాయాగ్రాహ రూపిణి ఐన రాక్షసి గుర్తుకువచ్చింది. ఓహో ఈ రాక్షసి గూర్చియే సుగ్రీవుడు చెప్పింది అనుకొన్నాడు. హనుమంతుడు తనను పట్టి లాగుతున్నది సింహికనే అని నిర్ణయించుకొన్నాడు.

వెంటనే వర్షాకాలంలోని మేఘంలాగా తన శరీరాన్ని పెంచాడు. ఆ పెరిగే ఆహారాన్ని చూచి సింహక తన నోటిని పాతాళంలాగా తెరిచింది. వెంటనే మారుతి సూక్ష్మంగా చిన్నవానిగా మారి సింహిక నోటిలో దూరిపోయాడు. అది సిద్ధచారణులందరూ చూశారు. లోపలకు వెళ్ళిన మారుతాత్మజుడు సింహిక వక్షస్థలాన్ని ఆయువు పట్టును చీల్చి చెండాడి మనోవేగంతో బయటకు వచ్చాడు.

**మారుతి సముద్ర ఆవలి తీరం చేరటం**

హనుమంతుడు సమయస్ఫూర్తితో సింహికను చంపివేశాడు. మనోవేగంతో బయటకు వచ్చి ఆకాశానికి ఎగిరి ఎప్పటిలాగా వేగంగా దక్షిణానికి దూసుకెళ్ళాడు. చనిపోయి సముద్రంలో పడిపోయిన సింహికను చూచి సిద్ధచారణాదులు " హనుమా! నీవు బ్రహ్మ సంకల్పబలంతో ఆ ప్రాణిని హతమార్చి మహాకార్యాన్ని సాధించావు. ఇక నీకు విజయం సిద్ధిస్తుంది వెళ్ళు" అని అన్నారు.

మంగళప్రదమైన సీతాన్వేషణాకార్యం కోసం వెళ్ళే ఆ మహాశూరుని గంధర్వులు స్తుతించారు. తమ దీవెనలందించారు. ఆకాశమార్గంలో పయనిస్తూ ఆంజనేయుడు సముద్రం ఆవలి తీరానికి చేరాడు. నలువైపులా పరికించి చూశాడు.

నూరుయోజనాల సముద్రలంఘనం తర్వాత వృక్షాల పంక్తిని చూశాడు. భూమి మీదకు మెల్లగా దిగుతూ వివిధ వృక్ష సముదాయంతో అందంగా కనిపిస్తున్న లంకా పట్టణాన్ని లంకకు దక్షిణాన ఉన్న మలయ పర్వతాన్ని దానిపై ఉన్న వనాలను చూశాడు. సముద్ర తీరంలోనే అసంఖ్యాకంగా పుట్టి పెరుగుతున్న వృక్షాలను చూశాడు. త్రికూట పర్వతమందు పుట్టి ప్రవహిస్తోన్న నదులను చూశాడు.

మేఘంలాగా ఉన్న తన శరీరాన్ని ఒక్కసారి మారుతి చూసుకొన్నాడు. భూమి మీద దిగుతున్నాను కదా! నా పెద్ద శరీరాన్ని చూసి ఈ రాక్షసులందరు సంభ్రమానికి గురి అవడమే కాక అప్రమత్తులై రావణునికి విషయం తెల్పుతారు. అప్పుడు సీతాన్వేషణం కష్టసాధ్యం అవుతుందేమోనని ఆలోచించాడు. ఇట్లా ఆలోచించి తన పర్వతాకార శరీరాన్ని కుదించుకొన్నాడు. జితేంద్రియుడు మోహం వీడి ఆత్మజ్ఞానిఅయి స్వస్వరూపాన్ని తెలుసుకొన్నట్లుగా హనుమంతుడు మామూలు రూపాన్ని సంతరించుకొన్నాడు.

హనుమంతుడు తన కార్యనిర్వహణలో భాగంగా తన రూపాన్ని సంతరించుకొన్నాడు. సర్వవస్తు సముదాయంతో ఉన్నది, విచిత్రమైన రంగులున్న శిఖరాలున్నది; మొగలి పొదలతో, రకరకాల చెట్లతో నిండి ఉన్న లంబపర్వతంపైన హనుమంతుడు దిగాడు. ఆ మహాపర్వతం అగ్రభాగంలో ఉన్న లంకా నగరాన్ని చూశాడు.

మహావేగ గమనం ఉన్న మారుతి మెల్లగా లంబ పర్వతం పైన దిగుతుంటే ఆ వేగానికి అక్కడ పక్షులు మృగాలు భయంతో ముడుచుకుపోయాయి. సంద్రాన్ని అవలీలగా దాటి ఆంజనేయుడు అమరావతిని తలపించే లంకానగరాన్ని చూశాడు. ఆకాశంనుంచి ఏదో ఆకారం వస్తుందేమోనని జంతువులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. ఉధృతంగా వీచే గాలి నెమ్మదిస్తున్నట్లుగా ఉంది. వాయుసుతుడు నేలకు జారుతూ చుట్టుపక్కలంతా కలయ చూస్తున్నాడు. విశ్వకర్మనిర్మించిన లంకాపట్టణానికి చేరువకు చేరానన్న ఉత్సాహం హనుమంతునిలో ఉరకలు

వేసింది. కుబేరుని సోదరునిదైన లంక జ్వాలాయమానంగా కనిపిస్తోంది. లంబపర్వతమంతా చెట్లతో శోభాయ మానంగాఉంది. నేను ఏ రాక్షసుని కంటబడకుండా సీతాన్వేషణాకార్యాన్ని చేయాలి. ఏ చిన్న తప్పిదం జరిగినా అసలు కార్యానికి ముప్పు వస్తుంది. కనుక చాలా అప్రమత్తంగా పనిచేయాలనుకొన్నాడు. నారూపాన్ని ఏవిధంగా చేసుకొని లోపలకు ప్రవేశించాలా అని ఆలోచిస్తూ దిగే ఆంజనేయుని వేగానికి చెట్లన్నీ గజగజ వణుకుతున్నట్లుగా కదలబారుతున్నాయి.

* * *

# ఆంజనేయుని లఘురూపం

## సర్గ - 2

ఎవరికీ దాట శక్యంగాని అపారమైన సముద్రాన్ని అవలీలగా ఆంజనేయుడు దాటాడు. మహాపరాక్రముడు ఐన మారుతి ఎన్ని వందల యోజనాలనైనా అవలీలగా దాటగలను. ఈ వంద ఓ లెక్కా? అనుకొన్నాడు. అనుకొన్న రీతిగానే ఒక్క నిట్టూర్పుగాని, కాస్త అలసటగాని ఎక్కడా కనిపించలేదు. సముద్రంపైకి ఎగిరేటప్పుడు ఎంత ఉత్సాహంగా ఉన్నాడో దాటిన తర్వాత అంతే ఉత్సాహంతో ఉన్నాడు.

లంబపర్వతంపైన దిగిన మారుతి వేగానికి అక్కడున్న చెట్లన్నీ జలజలా పూలను రాల్చాయి. అవన్నీ మారుతిని అర్చిస్తున్నట్లుగా పైనబడ్డాయి. అప్పుడు పూలతో చేసిన విగ్రహంగా ఆంజనేయుడు కనిపించాడు. ఆ పర్వతంపై పచ్చికబయళ్ళు, ప్రశస్తమైన వృక్షాలు పెద్ద పెద్ద శిలలు ఉన్నాయి. మంచి సువాసనతో ఆ పర్వతం మనోహరంగా ఉంది. ఆకాశం నుంచి దిగిన మారుతి అటు ఇటు కాసేపు తిరిగాడు.

త్రికూటపర్వతంపై లంకానగరాన్ని చూశాడు. దేవదారు, కొండగోగు, ఖర్జూరం, మోరటి, నిమ్మ, కొండమల్లె, మొగలి చెట్లు పొదలు చూశాడు. బాగా పుష్పించిన చెట్లు ఫలాలతో మొగ్గలతో పిందెలతో వ్రేలాతూ గాలి తాకిడికి స్వాగతిస్తున్నట్లుగా ఊగుతుండడం ఆంజనేయుడు చూశాడు.

హంసలతో, కారండ పక్షులతో, పద్మాలతో, కలువలతో కళకళలాడుతున్న సరస్సులు, రమ్యమైన విహార స్థలాలు, ఉద్యానవనాలు హనుమంతుడు చూశాడు. లంక చుట్టూ నీరు ఉన్న కందకాలున్నాయి. వాటినిండా వికసించిన కలువలున్నాయి. రావణుడు శ్రీరామునికి భయపడుతున్నాడేమో! ప్రత్యేక కాపలాదారులు బాణాలు చేతబట్టుకొని లంక చుట్టూ తిరుగుతున్నారు. ఆకాశాన్ని అంటుతున్నాయా! అన్నట్లు భవనాలున్నాయి. వాటినన్నింటిని బంగారంతో చేసి మణులు పొదిగినట్లున్నారు. అవి చంద్రుని కాంతిలోను ధగధగలాడుతున్నాయి.

ప్రతి ఇంటికి బంగారు తోరణాలు లతాపంక్తులు అందంగా అలంకరించి ఉన్నారు. పర్వతాగ్రం మీద ఉన్న ఈ లంకానగరాన్ని విశ్వకర్మ ప్రత్యేకంగా నిర్మించినట్టుంది. లంకా పట్టణం ఆకాశంలోని అద్భుతంగా కనిపిస్తోంది. విశ్వకర్మ తన నిర్మాణ చాతుర్యంతో నిర్మించిన వనితారత్నంలాగా లంకానగరం కనిపిస్తోంది.

పాతాళంలోని భగవతీనగరంలాగా లంకనిండా ఆయుధపాణులైన రాక్షసులు నిండి ఉన్నారు. కోరలున్నవారు ఆ కోరలతోనే శత్రువులను చీల్చివేసేటట్లుగా ఉన్నారు. చేతులలో శూలాలు, బాణాలు, పట్టిసాలు పట్టి భయంకరంగా తిరుగుతున్నారు. హనుమంతుడు అత్యధిక రక్షణ వ్యవస్థతోపాటు అందంలో బ్రహ్మసృష్టిని పోలిన లంకానగరాన్ని విస్మయంగా చూశాడు.

హనుమంతుడు లంకనంతా పరిశీలనగా చూశాడు. ఈ శత్రుదుర్భేద్యమైన లంకను దేవతలు ఎదురించ లేరేమో! అనుకొన్నాడు. ఇంత దూరం వచ్చి వానరులు ఈ లంకను ఏమి గెలుస్తారో అనుకొన్నాడు. సప్తతాళ భేదనం చేసినా పద్నాలుగు వేల రాక్షసులను తుదముట్టించిన ఆ శ్రీరాముడు కూడా పటిష్ఠమైన ఈ లంకానగరాన్ని ఛేదించగలడా ? అని ఆంజనేయునికి అనుమానం వేసింది.

రాక్షసులను ఏ ఉపాయం చేత గెలవవచ్చు అని ఆలోచించాడు. ఆసురీశక్తులున్న ఈ రాక్షసులకు సాయం పనిచేయదు. వీరి రాజు కుబేరుని తమ్ముడవడంవలన అర్థసంపదలకు వీరికి కొదవలేదు. దానివలన ఆర్థోపాయం ఇక్కడ పనికిరాదు. అందరూ బలంతోనున్న వారే కనుక భేదోపాయం వీరికి పనిచేయదు. బుద్ధి పరాక్రమశాలురవడం వలన వీరిని యుద్ధంలో గెలవడం అసాధ్యమేమో రాజనీతి యుద్ధనీతి సామదాన భేద దండోపాయాలేవి ఈ రాక్షసులకు పనికివచ్చేటట్లుగా లేదే అని ఆంజనేయుడు విచారించాడు.

ఈ సముద్రాన్ని దాటి లంకలో ప్రవేశించగలిగిన వారు ఎవరా? అని ఆలోచించాడు. నీలుడు, అంగదుడు, నేను, సుగ్రీవుడు మేం నలుగురమే లంకలో ప్రవేశించగలం కదా! మిగతావారి సంగతి ఎలా అన్న ఆలోచన మారుతిలో కలవరం రేపింది. మనస్సంతా ఆలోచనలతో నిండిపోయింది. శ్రీరాముడు సుగ్రీవుడు చేసిన పనిఅంతా బూడిదలో పోసిన పన్నీరు అవుతుందా? దేవునికి మనపై అనుగ్రహం ఉందా? అన్న తలంపు తో ఆంజనేయుణ్ణి దుఃఖం కమ్మింది. అంతలోనే రాముని మోము గుర్తుకు తెచ్చుకున్నాడు. లేదు లేదు ఆ దివ్యమంగళునికి అపజయం ఉండదు. ఆ శ్రీరాముణ్ణి జయలక్ష్మితప్పకుండా వరిస్తుంది. ఇలా అనుకోగానే ఉత్సాహం ఉరకలు వేసింది. ముందు నే చేయవలసిన కార్యం చేయాలి అనుకొన్నాడు. వెంటనే అసలు జానకీదేవి ఇక్కడ ఉందో? లేదో? అసలు బ్రతికి ఉందో? లేదో? తెలుసుకోవడం కదా ముఖ్యం అనుకొన్నాడు.

శ్రీరాముని కార్యంలో మొట్టమొదట నేను సీతాదేవి ఎక్కడ ఉందో తెలుసుకోవాలని అనుకొన్నాడు. వెంటనే ఆ గిరి శిఖరంపై నిలబడి ఒక్క క్షణం లంకనంతా చూశాడు. బలిష్ఠులైన రాక్షసులతో నిండి ఉండే ఈ లంకలో నేను ఈ రూపంతో ప్రవేశించడం మంచిదికాదు అనుకొన్నాడు. దుష్టులైన వీరిని కన్నుగప్పి సీత మాతను వెదకడమే నా పని అనుకొన్నాడు. అదృశ్యరూపంలో సీతను వెదకడం అసాధ్యం ఈ రూపంలో వెదకడమూ అసాధ్యమే మరీ ఎలా వెళ్ళి సీత జాడను తెలుసుకోవాలి అని మధన పడ్డాడు.

రాజును బట్టి ప్రజలు, అందరూ దుర్బుద్ధి దుష్టతనంతో మితిమీరిన శక్తి ఉన్నవారు వీరందరూ. మరి వీరిని ఎలా వంచించగలను అని మారుతాత్మజుడు మరీ మరీ ఆలోచించాడు. నాకు తెలుసు తెలుసు అంటూ వెళ్ళి కార్యాన్ని పాడుచేస్తే నన్ను అసమర్థుడని అంటారు. ఎలా ఎలా? అంటూ కాలయాపన చేస్తే కార్యశూరత్వంలేని పిరికిపంద అని గేలి చేస్తారు. అబ్బో! దూత పని చాలా క్లిష్టమైనదే అనుకొన్నాడు.

లంకా రాక్షసులకు తెలియకుండా గాలి కూడా చొరలేనట్లుగా ఉంది. ఇక నేను సముద్రాన్ని దాటి వచ్చి ఏం ప్రయోజనం? రామకార్యం చేయడంలో సీతను వెదకడానికి ఈ లంకలో ప్రవేశించలేకపోతే ఇప్పటిదాకా చేసినదంతా శూన్యమే కదా! అని అనుకొన్నాడు.

ఇలా ఆలోచించి ఆలోచించి చిమ్మచీకట్లు అలముకొని ఉండే రాత్రివేళ లంకలో ప్రవేశించడం మంచిదని హనుమంతునకు అనిపించింది. అప్పుడైతే రాక్షసులందరూ నిద్రాదేవికి వశులై జోగుతుంటారు. మధుపానం చేసే అలవాటున్న వీరు మధువు మత్తులో తేలియాడుతుంటారు. ఆ వేళలో నేను సూక్ష్మరూపంలో వెళ్ళి లంక అంతా తిరిగి సీతమ్మ ఎక్కడ ఉందో తెలుసుకొంటాను. ఆ తర్వాతి కార్యాన్ని గురించి తర్వాత ఆలోచిద్దాం అన్న నిర్ణయానికి ఆంజనేయుడు వచ్చాడు.

ఒకటికి పదిసార్లు ఆలోచించి తన నిర్ణయమే మంచిదని అభిప్రాయపడి స్థిమితపడ్డాడు. ఇక ఎప్పుడీ సూర్యుడు పశ్చిమాద్రిని చేరుతాడా అని నిరీక్షించాడు. ఎప్పుడీ లంకలో వెళ్ళి సీతమ్మను చూస్తానా! అని ఎదురుచూశాడు. ఆంజనేయుడు ఎదురు చూస్తున్న సమయం రానే వచ్చింది. సూర్యుడు గబగబా పశ్చిమాద్రిలో ఎడబాటు భరించలేని ప్రియుడు ప్రియురాలిని ఆలింగనం చేసుకొన్నట్లు కూరుకుపోయాడు. లంక అంతా రాత్రించరుడు ఏలడానికి సంసిద్ధతతో ఆకాశం మీదకు వచ్చాడు. ఇరులన్నీ ఇళ్ళమీదకు, ప్రాకారాలపైకి పాకుతున్నాయి. చెట్లు, వృక్షాగ్రభాగాలు తమ సహచరిని ఆహ్వానిస్తున్నట్లుగా తమలో చిక్కదనాన్ని పులుముకుంటున్నట్లున్నాయి. తన పనికి శ్రీకారం చుట్టడానికి మారుతి తన రూపాన్ని తగ్గించుకొన్నాడు. అద్భుతంగా పిల్లి అంత పరిమాణంలో మారాడు. ప్రదోషకాలంలో లంకానగరంలోకి ఆంజనేయుడు ప్రవేశించాడు. బంగారు, వెండితో చేసిన గోడలున్న భవనాలతో నిండి ఉన్న లంకానగరం గంధర్వ నగరంలాగా అద్భుతంగా కనిపించింది. భవనాలన్నీ ఏడు ఎనిమిది అంతస్థులతో ఆకాశందాకా ఎగబాకి ఉన్నాయి. స్ఫటికమణులతో ఆ నగరం దేదీప్యమానంగా వెలుగుతుండడం ఆంజనేయుడు చూశాడు.

లంకానగరం రాజప్రాసాదాలు అమూల్యరత్నాదులతో విలసిల్లే ఈ లంకానగరం ఎంత అందంగా ఉందో కదా నేను ఈ చీకట్లో సీతమ్మను వెదకాలి అనుకొన్నాడు.

ఆంజనేయా! నీకు నేను తోడుంటాను. సీతమ్మను వెదకడంలో నీకు సహాయం చేస్తాను. రాముని కార్యాన్ని చేసి సీతమ్మను నీ ప్రభువు దగ్గరకు చేర్చు అంటూ శంఖం లాంటి తెల్లదనాన్ని చంద్రుడు తీసుకొచ్చాడు. పాలలాగా తెల్లని తామరపూలు వికసించినట్లుగా వెన్నెలంతా ఆకాశంలోనుంచి చంద్రుడు లంకపై వెదచల్లాడు.

ఆ మనోహరమైన శ్వేతవర్ణాన్ని ఆంజనేయుడు చూశాడు. ఆహా! ఈ చంద్రకాంతిలో మా అమ్మ అయిన సీతమ్మను అతిత్వరగా వెదికి మాఅయ్య రామయ్యకు సంతోషం కూర్చాలి అని మారుతి మనసున సంకల్పించాడు. అలా అనుకోగానే ఆ వినువీధి కాంతి వింతకాంతులీనుతున్నట్లైంది.

* * *

# లంకిణిని నిరోధించటం

## సర్గ - 3

మహాబలసంపన్నుడు మహావేగగమనుడు ఐన కపిశ్రేష్ఠుడు అందమైన లంకానగరంలోకి ధైర్యంగా అడుగువేశాడు. సముద్రఘోషలతో, మృదంగవీణావేణుగానాలతో, సముద్రంపై నుండి వచ్చే చల్లని మారుతంతో లంకానగరం శోభాయమానంగా వెలుగుతోంది. బలిష్ఠమైన సేనావాహినితో ద్వారం దగ్గర మత్తగజాలు అందంగా చెక్కి ఉన్న ద్వారబంధాలు విశ్వకర్మ మనసు పెట్టి చేసిన శిల్పసౌందర్యంతో లంకానగరం అద్భుతంగా ప్రకాశిస్తోంది.

చిరుమువ్వల సవ్వడితో సుందరమైన పతాకాలతో విలసిల్లే లంకప్రాకారం మీదకు హనుమంతుడు ఎక్కాడు. లంకను చూసి ఆశ్చర్యచకితుడయ్యాడు. లంకలో ఎక్కడ చూసినా లక్ష్మి తాండవిస్తోంది. ఏ ఇంటిముందైనా ముత్యాలతో తీర్చిన అరుగులు, వజ్రాలు, వైడూర్యాలతో పొదిగిన ద్వారాలు బంగారు, వెండితో చేసిన చువ్వలున్న కిటికీలు బంగారంతో చేసిన గజాలు అశ్వాల ప్రతిమలు వెండి కొండలా అలకానగరంలాగా లంకానగరం దేదీప్యమానంగా వెలిగిపోతోంది.

అంబరాన్ని చుంబించే భవనాలు, పద్మాలు, కలువలు కలగలసి ఉన్న సరస్సులు మంచి గంధపు వాసన చుట్టుకొని పరిమళభరితమైన పుష్పాలున్న ఉద్యానవనాలు ఫల సంపదతో నిండు గర్భిణీలాగా ఉన్న వృక్షాలు ఆభరణాలు కాలి అందెల సవ్వడులున్న ఆ లంకానగరం అత్యున్నతంగా మంగళప్రదంగా అత్యంత సుందరంగా రావణుని లంక అందంగా కనిపించింది.

దుర్భేధ్యమైన ఈ లంకానగరాన్ని కుముదుడు, అంగదుడు, సుషేణుడు, మైందుడు, ద్వివిదుడు వీరే జయించగలరేమో? సుగ్రీవుడు, కుశపర్వుడు జాంబవంతుడు, కౌతుమాలుడు వీరే ఇందులో ప్రవేశించగలరేమో! ఇంత పటిష్టమైన లంకను ఎవరైనా జయించగలరా? అని ఒక త్రుటికాలం ఆలోచనలో పడ్డాడు. మళ్లా అంతలో రామలక్ష్మణుల ముందు ఎవరు నిలువగలరు? ముల్లోకాలను ఎదిరించే వారి బాణం ముందు ఈ లంకానగరం ఓ లెక్కా అని అనుకొని తృప్తిచెందాడు.

రత్నకాంతులు వస్త్రంలాగా, కోశాగారాలు కర్ణాభరణల్లాగా యంత్రాగారాలు స్తనాలుగా ఉన్న సకలైక ఐశ్వర్య సంపన్న ఐన లంక వివిధాలంకార శోభిత ఐన స్త్రీ లాగా కనిపించింది. అంతలో చీకట్లను పారద్రోలుతూ లంకలోని గృహాలన్నీ దీపకాంతులతో ప్రకాశించాయి. సూర్య సమప్రభావంలాంటి దీపకాంతులున్న లంకానగరాన్ని ఆంజనేయుడు చూశాడు. ఆహా ఏమి ఈ లంకాసౌందర్యం అనుకొన్నాడు.

ఇలా అనుకొంటూ లోపలకి రాబోయే వానరుణ్ణి లంకా దేవత ఐన లంకిణి చూసింది. మారుతి ఎదురుగా భయంకరమైన నేత్రాలతో లంకిణి నిలబడింది. భయంకర స్వరంతో "ఓయి దుష్టవానరా! నీవెవరు? ఎందుకీ లంకలో అడుగుపెట్టే ధైర్యం చేస్తున్నావు? నీకు ప్రాణాలపై ఆశ లేదా?" అని అడిగింది. "మూర్ఖ వానరా! నీవు

వచ్చిన పని ఏమిటో చెప్పు నా చేతిలో నీ చావు మూడకముందే నీ సంగతి వివరించు నీ చపలచిత్తాన్ని అణచి నేను అడిగిన దానికి సమాధానాన్ని చెప్పు." అని అడిగింది.

భయంకర రూపంతో వికృత స్వరంతో మాట్లాడుతున్న స్త్రీని చూసి "ఓ వనితామణీ! మీరు అడిగిన దానికి నేను మళ్ళీ జవాబు ఇస్తాగాని ముందు తమరెవరో? ఇక్కడ ఎందుకు ఉన్నారో, నన్ను ఎందుకు లంకలో ప్రవేశించకుండా నిరోధిస్తున్నారో ముందు చెప్పండి" అంటూ ఆంజనేయుడు అడిగాడు.

అలా అడుగుతున్న మారుతిపై లంకిణికి విపరీతమైన కోపం వచ్చింది. " ఓయి! మా ప్రభువు మహాత్ముడైన రావణుడు. ఆయన ఆజ్ఞానువర్తినై నిరంతరం ఈ లంకను రక్షిస్తూ ఉంటాను. నన్ను ఎదిరించి దీని లోపలకు ఎవ్వరూ వెళ్ళలేరు. నన్ను ధిక్కరించి నీవు లోపలకి వెళ్ళడం అసాధ్యం. ఈ రోజు నా చేతిలో నీవు అసువులు పోగొట్టుకోవడం ఖాయం వానరా, బుద్ధితో ఇక్కడనుండి వెళ్ళిపో" అని లంకిణి గట్టిగా అరిచింది.

కపిశ్రేష్ఠుడైన హనుమంతుడు లంకాధిదేవతను ఎదురించడానికి సన్నద్ధుడై శరీరాన్ని పెంచి ఆమె ఎదురుగానే నిలబడ్డాడు. వికృతాకారంలోనున్నా స్త్రీ కదా అని ఆంజనేయుడు"ఓ లలనామణీ! మేడలతో ప్రాకారాలతో ఉద్యానవనాలతో గంధర్వనగరిలా కనిపించే ఈ నగరాన్ని ఒక్కసారి చూసి వెళ్దామని వచ్చాను. ఈ అందమైన పట్టణ సౌందర్యాన్ని ఒకసారి చూసి వచ్చిన దారినే వెళ్ళిపోతాను. నన్ను లోపలకి పంపించు " అని అడిగాడు.

" ఓ దుర్బుద్ధిగల వానరా! నన్ను జయించకనే లంకలోకి వెళ్లాలని కలలు కంటున్నావా? నీకు అది అసాధ్యం" అంటూ తన అరచేతితో బలంగా ఆంజనేయుని ఒక చరుపు చరించింది. ఆ దెబ్బకు కపివరుడు పెద్దగా అరిచాడు. పట్టలేని కోపంతో తన ఎడమ చేతి వేళ్ళను ముడిచి ఒక్కసారి లంకిణి తలపై మోదాడు. స్త్రీ అనే భావం ఎదురురాగా ఆంజనేయుడు గట్టిగా లంకిణిని కొట్టలేకపోయాడు.

కాని ఆ దెబ్బకే లంకిణి కిందపడిపోయింది. భయంవేసి శరీరం అంతా వణికిపోయి కిందనుంచి పైకి లేవలేకపోయింది. అలా పడిన స్త్రీని చూసి హనుమంతునికి జాలివేసింది. అప్పుడా రాక్షసి గర్వం అంతా అణిగిపోయింది. కంఠం రుద్ధమైంది. భయంతో నోటిమాటరావడంలేదు. అయినా ఎంతో ధైర్యం తెచ్చుకొని గొంతు పెగిల్చి "ఓ వానరా! కపీశ్వరా! నన్ను కాపాడు. ఉత్తములు స్త్రీలను బాధించరు గదా! ఓ మహాపురుషా! నేను ఈ లంకను రక్షించే దానిని. నీవు నన్ను జయించివేశావు. కపివరా! నేను నిన్ను తక్కువగా అంచనా వేసుకొన్నాను. నిన్ను చూచి నేను ముందుగా పసికట్టలేకపోయాను. నీకు నా నమోవాకాలు. నీ దెబ్బరుచి చూడగానే నాకు తెలసివచ్చింది. అయ్యా! నన్ను కాపాడి రక్షించుము. ఓ వానరేంద్రా! నాకు తెలసింది నీకు చెప్తాను విను.

ఇంతకుముందు చతుర్ముఖుడు నాకు ఒక వరం ఇచ్చాడు. ఒక వానరుడు నిన్ను నీ పరాక్రమాన్ని ఎదిరిస్తాడు. ఆనాడు ఈ లంకలోని రాక్షసులకు కీడు మూడిందని తెలుసుకో. ఇక లంకా వినాశనం జరిగే సమయం ఆసన్నమైనది గుర్తించు అని చెప్పాడు. ఆ విరించి సత్యవాది గదా! ఆయన చెప్పినట్లే నీవు నీ ముష్టిఘాతంతో నన్ను పడవేశావు.

సకల సంపన్నుడు ధర్మాత్ముడు ఐన రాక్షసరాజు సీత నిమిత్తంగా నేడు నాశనం చెందబోతున్నాడు. ఒక్క రాజు చేసిన దుష్కార్యంతో లంకానగరం అంతా సర్వనాశనం చెందబోతోంది. ఓ సౌమ్యా! నీ దర్శనంతో భవిష్యత్తంతా నాకు కనబడుతోంది.

శాపంతో ఉన్న ఈ అద్భుత అందమైన లంకానగరంలో నీవు యథేచ్ఛగా వెళ్ళు. నీ సీతమ్మ తల్లి ఎక్కడ ఉందో అణువణువు గాలించి తెలుసుకో! నీవు నిరాటంకంగా నీ పని చేసి దిగ్విజయునివై రాముని చేరు. జానకీ అన్వేషణకు ముందుకు అడుగువేయి" అంటూ లంకాధి దేవత కపిశ్రేష్ఠునకు దారి ఇచ్చింది. లంకిణి తన జీవితాన్నంతా ఒక్కసారి అవలోకించుకుంది.

ఎంతటి రావణుడు! ఏమి తపస్సు! ఎన్ని వరాలు ! ఎన్ని యుద్ధాలు ఎన్నెన్ని విజయాలు! కాని అవేవి నేడు అక్కరకు రావు కదా! అబ్బా దేవతలు కూడా ఈ దశకంఠునికి భయపడేవారు కదా కాని కాలం తీరింది. ఎన్నివరాలు పొందినా చేసిన పాపానికి శిక్ష పొందాల్సిందే కదా! అలా రావణుడు చేసిన పరస్త్రీ అపహరణ నేడు లంకానాశనానికి హేతువుతోంది కదా. కాలం ఎంత చిత్రమైంది. నిన్న రావణునికి భయపడిన కాలం నేడు దశాననునికి ఎదురుతిరిగి మృత్యురూపంలో కబళిస్తోంది కదా! ఎంతటి వీరులైనా కాలానికి తలవంచాల్సిందే కదా!

అహో!లంకానాశనం మొదలైంది అనుకుంటూ లంకిణి దీర్ఘ నిట్టూర్పును విడిచింది.

* * *

# రావణాంతఃపుర ప్రవేశం

## సర్గ - 4

**లం**కిణిని జయించిన హనుమంతుడు శత్రుపురంలోకి ప్రాకారం ఎక్కి దూకాడు. రాత్రివేళ శత్రువులు ఉన్న నగరంలోకి ఎడమ పాదం పెట్టి ముందుకు వెళ్ళాడు. అందమైన రాజమార్గంలో లంకాపురిలోకి ఆంజనేయుడు నిరాటంకంగా ప్రవేశించాడు. అక్కడ కనిపించే గృహాలను, ప్రాసాదాలను చూస్తూ ముందుకు సాగాడు.

ఒక్కోచోట వివిధవాద్యఘోషలు వినబడుతున్నాయి. లంకానగరం ఎత్తైన మేడలతో ఆకాశాన్ని అంటుకొంటోందా అన్నట్లుగా కనిపిస్తోంది. గృహాలన్నీ జిలుగు వెలుగులీనుతున్నాయి. కొన్ని ఇండ్లు పద్మ, స్వస్తిక చిహ్నాలతో శోభిస్తున్నాయి. మరికొన్ని ఇళ్ళు దక్షిణ ద్వారం లేకుండా వర్ధమానంగా కనిపిస్తున్నాయి.

రమ్యహర్మ్యాలతో ఉద్యానవనాలతో, చిత్రవిచిత్ర ఆకారాలున్న గృహాలు అన్ని కలిసి కంటికి ఇంపుగా కనిపిస్తూన్న లంకా నగరాన్ని ఆంజనేయుడు చూశాడు. పెద్దగా అనంతంగా ఉన్న సాగరాన్ని దాటి వచ్చాను. శత్రులెవరూ లోపలికి చొరరాని లంకనగరంలోకి అజేయంగా ప్రవేశించాను. ఇక సీతమ్మను కూడా తెలుసుకొంటాను అనే భావం ఆంజనేయునిలో కలిగింది. అందుకే లంకనగరాన్ని చూస్తూ ఆనందించాడు.

ముందుకు వెళ్ళుతున్న ఆంజనేయునకు ఒక గృహాన్ని మించిన అందం మరో గృహంలో కనిపించసాగింది. స్వర్గంలో అప్సరసగానాన్ని పోలిన రాక్షసస్త్రీలు గానాలాపన చేయడం ఆంజనేయునికి వినిపించింది. సంపన్నుల గృహాలనుండి స్త్రీల కంకణాల చప్పుళ్ళు కాలి అందెల సవ్వడులు వినిపించసాగాయి. వారు పైకి కిందకు వెళ్ళుతున్నట్లుగా పాదాల చప్పుళ్లు వినిపించాయి. కొన్నిచోట్ల మల్లయోధులు తమ జబ్బలను చరుచుకొనే శబ్దం వినిపించింది. అలా ముందుకు వెళ్తుంటే వేద మంత్రాలు వినిపించాయి. లంకలోనేనా నేను ఉన్నది ? అని ఒకసారి హనుమంతుడు అనుకొన్నాడు. లంకలోనున్న రాక్షసులలో కొందరు చేతిలో దర్భలు పట్టుకుని నోట్లో శత్రు వశీకరణ మంత్రాలు చదువుతున్నారు. మరికొందరు జుట్టును ముడివేసుకొని హోమాలు చేస్తున్నారు. ఇంకొందరు శిరోముండనంతో మంత్రాలు పఠిస్తూ ఆజ్యం పోస్తూ హోమగుండం దగ్గర ఉన్నారు.

కొందరు రాక్షసులు రావణుని స్తుతిస్తున్నారు. మరికొంతమంది ముందుకెళ్ళేసరికి ఆ మార్గమంతా రాక్షస సేన నిలిచింది. రాక్షసబలం లెక్కకు అందనంతగా ఉంది. ఎందరో గూఢచారులు తమ వార్తలను తమ సేనాధిపతులకు చెప్తున్నారు. మరికొందరు సింహంలా ఘర్జిస్తున్నారు. ఇంకాస్త ముందుకు ఆంజనేయుడు సాగాడు. అక్కడ ఒంటి చెవ్వు ఉన్నవారు ఒంటికంటి రాక్షసులు బానల్లాంటి కడుపు ఉన్న వారు పెద్ద పెద్ద స్తనాలు జారుతున్నట్లున్నవారు, వేలాడే పొట్ట ఉన్నవారు, వంకర మూతులున్నవారు, పొట్టివారు, అతి పొడవున్నవారు, ఊబకాయులు, బక్కపీచులు, మధ్యస్థంగా ఉన్నవారు ఇలా ఎన్నో రకాల రాక్షసులు చేతుల్లో ఆయుధాలు ధరించి ఉన్నారు.

అందంగా ఉన్నవారు, చూపరులను కట్టిపడేసేవారు, పూలమాలలు ఆభరణాల్లా ధరించినవారు, ఆభరణాల వంపు సొంపులున్నవారు, నానా రకాల వేషభూషణాలతో వజ్రాయుధాల్లాంటి ఆయుధాలను ధరించి తిరుగుతుండడం ఆంజనేయుడు చూశాడు. బంగారు సింహద్వారంతో విశాలంగా ఉన్న రావణుని అంతఃపురం మారుతికి కనిపించింది. దాని చుట్టూ తెల్లని కలువలతో శోభిల్లే అగడ్తలున్నాయి. దుర్గమమైన ప్రాకారంతో అత్యంత వైభవంగా కనిపించే రావణరాజ అంతఃపురాన్ని ఆంజనేయుడు చూశాడు.

అందులోనుండి వేణువీణానాదంతో కూడిన దివ్యగానం వినబడుతోంది. గుర్రాల సకిలింపులు, ఆభరణాల సవ్వళ్ళు, రథాలు, పల్లకీలు వివిధ రకాలు. వాహనాల చప్పుళ్ళు వినిపించుతున్నాయి. గుర్రాలు ఏనుగులతోపాటు తెల్లని దంతాలున్న భద్రగజం మత్తిల్లిన మృగాలు, చిలుకలు గోరువంకలు ఇంకా చాలా రకాలైన పక్షులతో అంతః పురం నిండుగా కనిపించింది. మహావీరులైన రాక్షసులు ఆయుధాలను చేత పట్టుకొని అప్రమత్తంగా తిరుగుతున్నారు. వారందరూ నలుపక్కలా జాగ్రత్తగా కాపలాకాస్తున్నారు.

అయినా కపిశ్రేష్ఠుడు వారికన్నుకప్పి రావణాంతఃపురంలోకి వెళ్ళాడు. అంతఃపురం లోపలి భాగాలు కాంచన రంజితంగా ప్రకాశిస్తున్నాయి. అమూల్యమైన రత్నవజ్రవైదూర్యాదిమణులతో అందంగా శిల్పసౌందర్యం కనిపిస్తోంది. మంచి సువానలతో ఆ ప్రదేశం అంతా రమణీయంగా ఉంది. అందులోకి ఆంజనేయుడు ప్రవేశించాడు. లంకలోని రాక్షసుల సంపద అద్వితీయంగా కనిపిస్తోంది.

* * *

# రావణాంతఃపురం - సీతకై వెదకులాట

## సర్గ - 5

అలా తిరుగుతూ ఆంజనేయుడు ముందుకు వెళ్తూ వెన్నెలను ఇస్తున్న చంద్రుని వైపు దృష్టిని సారించాడు. చల్లని కిరణాలను వెదజల్లుతూ వృషభంలాగా ప్రకాశించే చంద్రుని ఆనందంగా ఆంజనేయుడు చూశాడు. లోకుల తాపాన్ని చల్లార్చుతూ మహాసంద్రాన్ని ఉప్పొంగింపచేస్తూ ఆకాశాన్ని భూతలాన్ని తన అమృతకిరణాలతో పరశింపజేస్తూ చంద్రుడు ఆనందిస్తున్నాడు.

చంద్రకిరణప్రభావంతో చీకట్లు అక్కడక్కడ నక్కాయి. చంద్రునిలో మచ్చ సూర్య కిరణాలతో కరిగిపోయింది. పండు వెన్నెలను చిందించే రేరాజు శత్రువులను జయించిన చక్రవర్తి సింహాసనాన్ని అధిష్ఠించినట్లు ఆకాశంలో తన స్థానాన్ని పదిలం చేసుకొన్నాడు. సూర్యతాపంలో విడిపోయిన జనులు చంద్రుని చల్లని కిరణాలతో దగ్గర అవుతున్నారు. నిశాచరులైన రాక్షసులు ఆనందంగా ఉన్న ప్రకృతిలో కడుపార మాంసాన్ని భక్షిస్తున్నారు.

ప్రణయకలహాలు మాని స్త్రీపురుషులు అన్యోన్యానురాగంతో ఆనందాన్ని పంచుకొంటున్నారు. తాను చేసిన కార్యాలు వాటిలోని విజయం ఇచ్చినస్ఫూర్తితో ప్రదోషకాలంలో హనుమంతుడు చేయాల్సిన కార్యంలో తప్పక జయలక్ష్మి వరిస్తుందనే స్థిర నిశ్చయంతో ఆనందించాడు. సత్త్వవర్తనులైన స్త్రీలు తమపురుషులతో కలిసి ఆనందంగా నిద్రపోతున్నారు. హనుమంతుడు చూస్తున్న గృహాలలో మధుపానచిత్తులైన వారే ఎక్కువగా కనిపించారు. మధువు సేవించి చిత్తం కుదిరిన రాక్షసులు అధికంగా మాట్లాడుతున్నారు. బలిష్ఠమైన బాహువులు ఒకరిపై ఒకరు వేసుకొని తూలుతూ తింటూ వాగుతున్నారు.

ఇంకొందరు మధువు ఎక్కువగా సేవించి స్పృహ తప్పి తమ ప్రియురాళ్ళపై పడి నిద్రపోతున్నారు. కొందరు స్త్రీలు ఆనందంగా నవ్వుతూ ఉన్నారు. ఇంకొందరు చిర్రుబుర్రులాడుతూ నిద్రపోతున్నారు. అలా నడుస్తూ ముందుకు వెళ్ళాడు. అక్కడ సజ్జనులు ఉన్నారు. ఏనుగులు ఘీంకరిస్తున్నాయి. బుసలు కొట్టే సర్పాల్లాగా వీరులు నిట్టూర్పులు విడుస్తున్నారు. వివిధ విద్యలలో ఆరితేరినవారు, బుద్ధిశాలురు ఆస్తికులు తమతమ కర్తవ్య నిర్వహణలో నిమగ్నమై ఉన్నారు. శారీరక అందంతోపాటు బుద్ధిసౌందర్యంతో అలరారే సాధువులను మారుతి చూసి ఆనందించాడు. ఇంకా ముందుకు వెళ్తూ ప్రేమానురాగాలు కలిగిన ప్రేయసీప్రియులు, సతీపతుల ఆనందించడం చూశాడు. తమ భర్తలపై అధిక ప్రేమానురాగాలు ఉన్న శీలవంతులైన స్త్రీలను చూశాడు.

చక్కని చుక్కలైన కొందరు స్త్రీలు తమ ప్రియుల కౌగిళ్ళలో సిగ్గులొలికిస్తూ నిద్రిస్తున్నారు. ధర్మపరాయణ బుద్ధితో మెలిగే కొందరు సతులు తమ పతులకు ఆనందం పంచి ఇస్తున్నారు. మేలి ముసుగులు తొలిగిపోయి సంతోషంగా నిద్రిస్తున్న స్త్రీలున్నారు. విరహతాపంతో తమ పతుల కోసం ఎదురుచూస్తూ నిద్రలోకి జారిన స్త్రీలున్నారు. ఇలా ఉన్న వీరందరిని మారుతిని చూశాడు.

ఇందరిని చూస్తూ ముందుకు సాగుతున్న కపివరునకు కోమలాంగి రాముని విరహవేదనకు గురిచేసిన అయోనిజ కనిపించలేదు. శ్రీరాముని కోసం పరితపిస్తూ శ్రీరాముణ్ణే హృదయంలో స్థిరీకరించుకొన్న ఆ స్త్రీమూర్తిని ఎక్కడా దర్శించలేకపోయాడు.

శ్రీరాముడు చెప్పినట్లుగా సుమధురకంఠస్వరం ఉన్న భామిని, అందమైన నేత్రములున్న విశాలాక్షి, వన్యమృగాలతో ఆటలాడి పరవశించే పడతి విద్యుత్కాంతిలాగా చంద్రరేఖలాగా కనిపించే వైదేహిని మారుతి రావణాంతఃపురంలో ఎక్కడా చూడలేకపోయాడు.

రావణుని వలన భయకంపిత అయి కుంగి కృశించిపోయిన వనితారత్నం దశకంఠుని భవనం అంతా గాలించినా ఎక్కడా కనపడలేదు. జానకీదేవి ఎంత వెదకినా కనిపించకపోయేసరికి ఆంజనేయునకు దుఃఖం వచ్చింది. అయ్యో ఇక్కడ కూడా సీతామాత లేదే? నా రాముని ప్రియపత్ని... నాకు కనిపించదేమి అనే చింతకు లోనయ్యాడు.

* * *

# రావణాదుల భవనాలలో అన్వేషణం

## సర్గ - 6

రావణుని అంతఃపురం అంతా మారుతి వెదికాడు. ఆయనకు ఎక్కడా సీతమ్మ కనిపించలేదు. దాంతో ఆయన మనస్సులో విచారం గూడుకట్టుకొంది. ఇంకొకసారి చూద్దామని మళ్ళీ గాలింపు మొదలుపెట్టాడు. సూర్యకాంతులతో వెలుగులు విరజిమ్ముతున్న రావణుని ప్రసాదంలోనే ఉందేమో అనుకొని ఆవైపు వెదకడం మొదలుపెట్టాడు.

అక్కడ సింహాల్లాంటి పరాక్రమవంతులు భయంకర రూపులు రక్షణగా ఉన్నారు. ఆ భవన ముఖద్వారం వెండి బంగారాలతో తీర్చిదిద్ది ఉంది. చిత్ర విచిత్రాలైన అంతస్థులు అందమైన ద్వారాలు ఉన్నాయి. ఆ భవనం ద్వారం దగ్గరే ఆయుధపాణులై అశ్వారూఢులై గజాలపై ఎక్కిన రాక్షసులున్నారు. వీరందరిని, ఆ భవనకాంతిని చూస్తుంటే ఆంజనేయునకు ఆశ్చర్యంవేసింది.

ఆ భవనంలో సింహ, వ్యాఘ్ర చర్మాలతో చేసిన కవచాలను ధరించిన సైనికులు, మహారథులు అప్రమత్తులై ఉన్నారు. జింకలు శారికాది పక్షి గణాలు మృగాలు గుంపు గుంపులుగా ఎగురుతున్నాయి. అధిక రక్షణతో ఉన్న ఆ భవనంలోకి కపివరుడు మెల్లగా ప్రవేశించాడు. అందులో అక్కడక్కడ ఉద్యానవనాలు సెలయేళ్ళు కూడా ఉన్నాయి. పెద్ద పెద్ద అంతస్థులున్న భవనాలు చూశాడు.

అక్కడ వనితల ఆభరణాల ధ్వని సముద్రంలోని అలల చప్పుడులాగా వినవస్తోంది. దాన్ని విని మారుతి ఇక్కడ చాలామంది వనితలున్నారని అనుకొన్నాడు. ఛత్రచామరాదిరాజచిహ్నాలున్న భవనాలు, అందులో నుండి అగరుచందనాదుల పరిమళం వస్తోంది. భేరీమృదంగధ్వనులు, శంఖనాదాలు, హోమకార్యాలు చేసే ధ్వని వినబడుతోంది. ఆ రావణభవనం సముద్రంలాగా లోతుగాను, విశాలంగాను నిశ్శబ్దంగాను ఉంది. భవనానికి మించి అందమైన భవనం మరేది ఇక్కడ లేదేమోనని అనుకొన్నాడు.

ఎక్కడనుంచి మొదలుపెడ్తామా అనుకొంటూన్నప్పుడు ప్రహస్తుని భవనం కనిపించింది. వెంటనే అందులో దూరి అక్కడా వెదికి మహాపార్శ్వుని గృహంలో దూకాడు. అక్కడా గాలించాడు. మేఘమండలంగా ఉన్న కుంభకర్ణుడు, విభీషణాదుల ఇళ్ళు వెదికాడు.

అక్కడా సీతమ్మ లేదనుకొన్నాడు. మహోదరుడు, విరూపాక్షుడు, విద్యుజ్జిహ్వుడు, విద్యున్మాలుడు, వజ్రదంష్ట్రుడు మొదలగువారి ఇండ్లన్నీ వెదికాడు.

రాక్షసప్రముఖులైన సారణుడు, ఇంద్రజిత్తు జంబుమాలి, సుమాలి భవనాలను అణువణువు వెదికాడు. ఎక్కడా మారుతి మనసులోని సీతమ్మ కనిపించలేదు.

విచారవదనంతో రశ్మి కేతువు, సూర్య శత్రువు, వజ్రకాయుడు, ధూమ్రాక్షుడు, సంపాతి, విద్యుద్రూపుడు, భీముడు, ఘనుడు, విఘనుడు, శుకనాశుడు, వక్రుడు, శఠుడు, వికటుడు, హ్రస్వకర్ణుడు, దంష్ట్రుడు, రోమశుడు, యుద్ధోన్మత్తుడు, మత్తుడు, ధ్వజగ్రీవుడు, నాదినుడు, ఇంద్రజిహ్వుడు, హస్తిముఖుడు, కరాళుడు ఇలా అందరి ఇండ్లు శోధించాడు.

ఇలా అందరి ఇళ్ళు తిరుగుతూ సంపన్నులైన రాక్షసులను చూశాడు. రావణుని దగ్గరలో నిద్రించే భయంకరాకారులగు రాక్షస స్త్రీలను చూశాడు. వీరందరూ రావణుని అంగరక్షకులు ఏమో అనుకొన్నాడు. కొందరు స్త్రీలు శూలాలు, ఇనుపగదలు, శక్తితోమరాలు పట్టుకొని అటు ఇటు తిరుగుతున్నారు.

రాక్షసుల దగ్గరగా ఎరుపు, తెలుపు రంగులున్న అశ్వాలను చూశాడు. ఐరావతం లాంటివి శత్రు సైన్యంలోని గజాలను బెదిరించగలిగినవి యుద్ధాది విద్యలలో ఆరితేరినవి పర్వతం లాంటి ఆకారం కలిగినవి ఐన మదపు టేనుగులు ఘీంకరిస్తున్నాయి.

రావణుని భవనంలో రకరకాలైన గృహాలున్నాయి. వివిధాకారాలతో ఉన్న పల్లకీలు, రథాలు పొదరిండ్లు, చిత్రశాలాగృహాలు క్రీడామందిరాలు, సేదతీరే గృహాలు, ఆలోచనలు సాగించే ఇండ్లు, ఇలా రకరకాల ఇండ్లు మారుతి చూశాడు. దేవదారువృక్షాలతో పర్వతాకారాన్ని నిర్మింపచేసిన క్రీడాప్రదేశాలు పగలుసంచరించ వీలుకలిగినవి చూశాడు.

రావణుని భవనం అమూల్య రత్నరాసులతో నిర్మితం అయి ఉంది. చిత్రవిచిత్రభవనసముదాయాలు ఎత్తుగా ఉన్నాయి. ఎక్కడ చూసినా లక్ష్మీదేవి పుట్టిల్లులాగా సిరిసంపదలు తొణికిసలాడుతున్నాయి. స్త్రీలందరు నానా విధ

ఆభరణాల సౌందర్యంతో లక్ష్మీదేవతకు సోదరీమణుల్లా ఉన్నారు. ఆసనాలు, తల్పాలు ఆరామాలు అన్నీ సుందరంగా సంపన్నంగా ఉన్నాయి.

రావణుని తేజస్సుకు సాటి వచ్చేదిగా రావణుని భవనం తేజరిల్లుతోంది. వరసలు తీరిన గృహాల పంక్తులు వందల సంఖ్యలో వనితామణులు ఉన్నారు. ఆ భవనాలన్నీ ఆత్రంగా గాలించి శోధించి వేదనననుభవించాడు మారుతాత్మజుడు.

ఆయనకు ఎక్కడ వెదికినా సీతమ్మ జాడ లేశమైనా తెలియలేదు. ఆయన మనస్సు వేదనతో నిండిపోయింది. ఈ రాక్షసుడు భవనంలోనూ సీతమ్మ జాడ తెలియలేదు. ఇంక ఎక్కడైనా జానకిని దాచి ఉంచాడా అని మారుతి ఆలోచించాడు. కాని ఆంజనేయునికి పాలుపోలేదు. మనస్సంతా వేదనామయం అయింది. అసలు సీతమ్మను రావణుడు అంతం చేయలేదు కదా! అన్న అనుమానం వచ్చింది. తన మాట వినకపోతే ఈ రక్కసులు అంత పని చేయడంలో ఏ మాత్రం వెనుకాడరు. అయ్యో అలా అయితే ఆ రాముడు ఎంత పరితపిస్తాడో అని హనుమంతుడు పరితాపం చెందాడు.

* * *

# రావణుని పుష్పక విమానం

## సర్గ – 7

రావణుని అంతపురంలో లెక్కలేనన్ని గృహాలున్నాయి. అవన్నీ అందంగా వజ్రవైదూర్యరత్నాలతో పొదగబడిన సువర్ణమయాలు. ఆయుధాగారాలు మహోన్నతమైన చంద్రశాలలు ఉన్నాయి. ధనకనకవస్తువాహనాదిసకల సంపదలతో తులతూగే భవనాలున్న లంక చూడడానికి అద్భుతంగా ఉంది.

రావణుని భయానికి మయుడు అపార శిల్ప నైపుణ్యంతో ఈ లంకా నిర్మాణం చేశాడా? అన్నట్లు ఉంది. దాని దగ్గరలో పుష్పకవిమానాన్ని చూశాడు. మేఘంలాగా మహోన్నతంగా ఉంది. విశాలంగా ఆహ్లాదకరంగా నిరుపమాన తేజస్సుతో విరాజిల్లుతోంది. ఆ పుష్పకం దివి నుండి వచ్చిన స్వర్గమా అన్నట్లుంది. గిరి శిఖరంలాగా ఉంది, వివిధ రత్నాలతో అలంకరించి ఉంది.

బ్రహ్మాదిపుణ్యపురుషులవిమానంలాగా ఉంది. మెరుపు తీగల్లాంటి వనితామణులున్నారు. చిత్రవిచిత్ర వర్ణాలతో శిల్పసౌందర్యంతో అలరారుతోంది. గ్రహనక్షత్రాలతో కూడిన ఆకాశంలాగా ఉంది. శిల్పవిన్యాసంలో పర్వతపంక్తులు, సముద్రాలు, వృక్షాలునానావిధపక్షులు తీరి ఉన్నాయి. సరస్సులు అందులో వికసించిన తామరాలు ఉత్తమజాతి గుర్రాలు ఏనుగులు చక్కగా చెక్కి ఉన్నారు.

ఆ పుష్పకవిమానంపై లక్ష్మీదేవి పద్మాలమధ్య విహరిస్తున్నట్లు, ఏనుగులు తమ తొండాలతో పద్మాలను అందిస్తున్నట్లు చిత్రించి ఉంది. పర్వతంలాగా ఉంటూ సుందరమైన గుహలు కూడా ఉన్నట్లున్న ఆ పుష్పకంలోకి మరలా వెళ్ళి వెదికాడు. ఆ నగరంలోని సంపన్నుల గృహాలు, రాజు, మంత్రుల భవనాలు, రావణుని పుత్రుని భవనం, బంధువులు, సోదరులు, గృహాలు, ముఖ్యుల గృహాలు ఇలా ఇలా అన్నీ వెదికాడు. అంతా గాలించాడు.

కాని హనుమంతుడికి సర్వాంగ సుందరి శ్రీరాముని ఎడబాటులో విరహ వేదనాగ్నిలో దహించుకుపోయే నారీరత్నం కనిపించలేదు. ఉత్తమ ఇల్లాలైన సీత ధర్మమార్గానువర్తి ఐన మారుతికి కనిపించలేదు. విచార వదనంతో దుఃఖం నిండిన మనస్సుతో జానకిదేవిని పలుమార్లు అనుకొన్నాడు. అంతా వెదికినచోటే మరలా వెదికాడు. అయినా రావణుని గృహాలలో ఎక్కడా ఆ తల్లిజాడలేదు.

* * *

# పుష్పక విమానం - పునఃఅన్వేషణం

## సర్గ - 8

రావణుని పుష్పక విమానం అందచందాలతో మిరుమిట్లు కొల్పుతోంది. శిల్ప విన్యాసంలో ప్రకృతిలోని ఏ వస్తువు అక్కడ లేకుండా లేదు. బ్రహ్మ సృష్టినంతా మరల మయుడు శిల్పంలో చిత్రీకరించాడు. సాక్షాత్తు కుబేరుని తమ్ముడే రావణుడు కాన సకల సంపదలు నిండి, లేని వస్తువంటూ ఏదీ లేదు. ఈ సృష్టిలోని ప్రతిదీ లంకలో ఉంది.

వాయుమార్గంలో వెళ్ళే వీలున్నది దేవతా గృహాలలో ఉండదగినది. అందులో ఆసీనులైన వారి మనస్సులను బట్టి నడిచి వెళ్ళేది. పుష్పకంలో సభా భవన, భోజనశాలలు వినోద మందిరాలు, నర్తనశాలలు, వీణాగానాన్ని ఆస్వాదించే ప్రాంగణాలు, గోపురాలు అన్నీ అమరి ఉన్నాయి.

వాయువేగంతో సాగి పోగలిగిన ఆ విమానం ఉదాత్తంగా మహోన్నతంగా ఉంది. మహాకాయులు, ఆకాశంలో సంచరించేవారు, విశాల నేత్రాలున్నవారు, ప్రభువు మనస్సుకు నచ్చేవారు మోస్తున్నట్లుగా ఆ విమానంపైన చెక్కి ఉన్నారు.

మనోహరంగా దర్శనీయంగా ఉన్న ఆ పుష్పక విమానాన్ని మరల హనుమంతుడు క్షుణ్ణంగా పరిశీలించి వచ్చాడు. అక్కడ సీతమ్మ లేదు.

* * *

# రావణాంతఃపురం - అన్వేషణం

## సర్గ - 9

మహాభవన సముదాయాల మధ్య అర్ధయోజనం వెడల్పుతో ఒక యోజనం పొడవుతో ఉన్న ఒక ప్రాసాదాన్ని ఆంజనేయుడు చూశాడు. ఆ భవనంలో ఏమైనా సీత ఉందేమోనని అక్కడ గాలించడం మొదలుపెట్టాడు.

ఆ విశాల భవనంలో రెండు, మూడు, నాల్గు దంతాలున్న గజాలు, సర్వసన్నద్ధులై ఉన్న రాక్షసులు కాపలా కాస్తున్నారు. మహాప్రాసాదం అంతా రావణుని వరించి వచ్చిన స్త్రీ జనం నిండి ఉంది. రావణుడు వారిలో ఏ ఒక్కరినీ బలవంతంగా తెచ్చినట్లు లేదు. వారందరు రావణుని హృదయాన్ని మెచ్చి వచ్చిన వారిలా కనిపించారు.

మొసళ్ళు, తిమింగలాలు, చేపలున్న మహాసముద్రంలాగా ఉవ్వెత్తున ఎగురుతున్న తరంగాలున్న సముద్రంలాగా ఈ ప్రాసాదం ఉంది. ఈ భవనం కుబేరుని సంపద వైభవంలాగా ఉచ్ఛైశ్రవం ఉన్న ఇంద్రుని భోగంలాగా రావణుని స్త్రీల మందిరం బహు చక్కగా ఉంది.

రావణుని పుత్రులు, బంధువులు, సోదరులు, మంత్రులు వీరందరి భవనాలు మహా ఐశ్వర్య సంపన్నంగా దిక్పాలుర సంపదతో పోటీపడేవిగా ఉన్నాయి. ఈ ప్రాసాద మధ్యభాగంలో విచిత్ర భవనం ఉంది. దాన్ని మారుతి చూశాడు.

విశ్వకర్మ బ్రహ్మదేవుని కోసం దివ్యవిమానం నిర్మించి ఇచ్చాడు. కుబేరుడు తీవ్ర తపస్సు చేసి బ్రహ్మను మెప్పించి ఆ విమానాన్ని పొందాడు. రావణుడు కుబేరుని ఓడించి ఆ పుష్పకాన్ని కైవసం చేసుకొన్నాడు. ఆ పుష్పకాన్నే మారుతి చూశాడు.

ఆ పుష్పకం విశ్వకర్మనిర్మాణకౌశలానికి చిహ్నంగా ఉంది. వివిధరత్నాలతో పొదిగిన మెట్లు, వేదికలు, గృహాలు అమర్చి ఉన్నాయి. సూర్యరశ్మితో సమానమగు కాంతులు విరజిమ్ముతూ ఉంది. కిటికీలు వేదికలన్నీ ఇంద్రనీలం, మహానీలాలతో కలిపిన వజ్రాలతో నిర్మించి ఉన్నారు. అమూల్యమైన ముత్యాలు, పగడాలు అక్కడక్కడా మెరుస్తున్నాయి. అగరు, చందనంతో కూడిన సువాసనలు వెదజల్లుతున్నాయి.

అక్కడ సంచరించే వాయుసుతునకు మధుర భోజ్య పదార్థాల సువాసన గుప్పున తాకింది. బంధువు ఆప్తుణ్ణి పిలిచినట్లుగా ఆ సువాసన ఇలారా అని పిలుస్తున్నట్లు ఆంజనేయునకు అనిపించింది. శుభాకృతితో ఉన్న శాల రావణుని ప్రీతికరమైనదిగా కనిపించింది. అక్కడ దంతంతో నగిషీలు చెక్కిన స్తంభాలున్నాయి. బంగారు వెండితో నిర్మించిన మణిస్తంభాలున్నాయి. అమూలాగ్రం అలంకృతమైన స్తంభాలు భవనం ఆకాశంలో ఎగురుతోందా అన్నట్లుగా ఉన్నాయి.

ఆ శాలలో ఒక రత్నకంబళి పరచి ఉంది. దానిమీద ఈ భూతలంలోని వస్తువులన్నీ నేతలో కనబర్చి ఉన్నారు. దాన్ని చూడగానే భూలోకమే ఇక్కడ ప్రత్యక్షమైందా అనిపిస్తోంది.

అక్కడ రకరకాలైన పక్షులు మత్తుగా అరుస్తున్నాయి. దివ్య పరిమళాలు నాసికలకు విందు చేస్తున్నాయి. ఆ భవనంలో రావణుడు నివసిస్తాడు. స్వచ్ఛమైన హంసలాగా శ్వేతవర్ణాన్ని కలిగి ఉంది. పుష్పాలతో అలంకరించి ఉంది. వశిష్ఠుని కామధేనువులాగా కోరికలన్నీ ఈడేర్చేలా ఉన్న భవనం సర్వ దివ్య సంపదలకు నిలయంగా ఉన్న ఆ శాల హనుమంతునికి తృప్తిగా అనిపించింది. దాన్ని చూచి హనుమంతుడు ఇది స్వర్గమా? అమరావతియా? లేక దివ్య తపశ్చర్యలతో పొందిన అపురూప ఫలమా అని ఆశ్చర్యపడ్డాడు.

అందులో దీపాల వరుసలు ద్వీపజ్వాలలు రావణుని తేజస్సులాగా దివ్యకాంతులను ఇస్తున్నాయి. రంగు రంగుల వస్త్రాలు ధరించిన స్త్రీలు, కంబళిపై నిద్రిస్తున్న వేలకొలది సుందరీమణులను ఆంజనేయుడు చూశాడు.

అర్ధరాత్రివరకు ప్రియునితో ఆనందించి మధువు సేవించి మత్తుగా గాఢంగా నిద్రపోతున్నారు. నిద్రలో ఉన్న వారి శరీరాలమీద ఉన్న ఆభరణాలు చప్పుడు చేయకుండా నిశ్శబ్దంగా చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కదలకుండా మెదలకుండా ఉన్న పద్మాల్లాగా ఆ సుందరులు పడి ఉన్నారు.

నేత్రాలు మూసుకొని పెదవులు దగ్గరగా చేర్చి నిద్రపోతున్నారు. వారి దగ్గరనుంచి సువాసన గుబాళిస్తోంది. ఆకాశంలో తారలే నారీరత్నాల్లాగా అందంగా ఉన్న వికసించిన పద్మాల్లాగా ఆ స్త్రీ మూర్తులు ఆంజనేయునకు కనిపించారు.

అలా నిద్రిస్తున్న వారిలో కొందరి నుదుట తిలకం చెదిరి ఉంది. కొందరికి మెడలోని ఆభరణాలు నేలకు జారి ఉన్నాయి. కాలి అందెలు ఒక పక్కకు జారి ఉన్నాయి. శ్రమ మరిచిపోయి నేలపై అటు ఇటు తిరిగి తిరిగి నిద్రపోతున్నారు.

కొందరు శ్రేష్ఠమైన హంసల్లాగా, చక్రవాకాల్లాగా కారండ పక్షుల్లాగా కనిపించారు. స్త్రీలు ఆనంద చిత్తంతో నిద్రపోతూ నదుల్లాగా కనిపించారు. సుకుమార శరీరం కల స్త్రీల స్తనాలమీద ఆభరణాల గుర్తులు వత్తుకొని ఉన్నాయి. కొందరి ఉచ్ఛాస నిశ్వాసాలకు లయబద్ధంగా వారి వస్త్రాలు కదులుతున్నాయి.

కొందరు తమ చీరలను ముఖంమీద కప్పి నిద్రపోతున్నారు. రావణపత్నులందరు రావణునితో ఆనందిస్తున్నట్లు భ్రమలో నిద్రపోతున్నారు. ఒకరు మరొకరిని గాఢంగా ఆలింగనం చేస్తూ ముద్దుపెట్టమన్నారు. వారు ఆ ముద్దుకు పరవశిస్తున్నారు.

రావణునిపై అత్యాసక్తితో రావణునితో క్రీడిస్తున్నట్లు తలపోస్తున్నారు. ఒకరి తొడలపైన మరొకరు తల పెట్టారు. మరొకరు వేరొకరి వక్షస్థలాన్ని తలగడ చేసుకొన్నారు. ఇంకొందరు విశాలమైన వీపును కరచుకొని నిద్రపోతున్నారు.

ఒక జవ్వని మరొక లలన భుజాలపై నిద్రపోతోంది. ఒకరు మరొకరిపై చేతులు కాళ్ళు వేసి ఇద్దరు కలసి ఒక్కసారిగా నిద్రపోతున్నారు. వీళ్ళందరు ఒకరిపై ఒకరు నిద్రపోతూండడంతో స్త్రీ మాలలాగా కనిపించారు. రావణుని ఈ భవనం స్త్రీ వనంలాగా కనిపించింది. వారి కేశపాశాలు నిగనిగలాడుతున్నాయి. నిద్రపోతున్న వారి ముఖం ఆనందంతో దివ్యంగా కనిపిస్తోంది.

రావణుని స్త్రీల సముదాయం ఒక స్త్రీ వనంలాగా గోచరించింది. వసంత ఋతువులలోని చల్లదనంతో పులకించి పుష్పించిన వనంలాగా స్త్రీలందరి ముఖాలు ఆనందంగా విప్పారి ఉన్నాయి. పరస్పరం పెనవేసుకొని నిద్రిస్తున్న స్త్రీలు కావాలని పెంచిన పూలవనంలాగా అందంగా కనిపించారు. వారు పెట్టుకొన్న పూలలోని సుమధుర భరితమైన వాసన వారు శరీరాన్ని అలదుకొన్న అంగరాగాల సువాసన కలిసి పుష్పవనంనుంచి వ్యాపిస్తున్న నానావిధ పరిమళాలు ఆ ప్రదేశం అంతా నిండాయి.

రావణుని కాంతలు మేల్కొని ఉండే వారి వైపు ఎవ్వరూ కన్నెత్తి చూడలేరు. రాజర్షుల, పితృదేవతల, దైత్యుల, గంధర్వుల, రాక్షస కాంతలందరూ రావణుని మోహించి అక్కడికి వచ్చి ఉన్నారు.

వారిలో కొందరు రావణుడు యుద్ధకాంక్షతో వెళ్ళి అపహరించి తెచ్చిన వారున్నారు. కాని వారు కూడా రావణుని అందచందాల భ్రమలో ఇరుక్కొన్నవారే. మరికొందరు రావణుని గుణగణ సంపదకు అబ్బురపడి ప్రేమించి వచ్చినవారున్నారు.

జానకితప్ప రావణుడు కామాతురుడై పరాక్రమంతో బలవంతంగా తీసుకొచ్చిన స్త్రీ ఒక్కతి కూడా అక్కడలేదు. అందరూ అతని గుణరూపసౌందర్యాలకు మోహంతోవచ్చినవారే.

వారందరిలో వేరొకరిని ప్రేమించిన వారుగాని రావణుడు తప్ప వేరొకరిచే ప్రేమించబడేవారు కాని ఎవరూ లేరక్కడ. వారందరూ ఉత్తమవంశసంభూతులే. అందమైన శరీరలావణ్యం కలవారే. అసమర్థులుగాని అనాకారులు గాని ఎక్కడా ఆంజనేయునికి కనిపించలేదు.

బుద్ధిలేనివారుకాని తమభర్తలనుఆనందింపచేయలేనివారుగాని ఎవరూలేరు. వారందరిని చూచి కపిరాజు రాక్షస రాజైన రావణుని భార్యలందరూ రావణునితో సుఖంగా ఉన్నట్లుగానే శ్రీరాముని భార్య ఐన జానకి కూడా ఈ విధంగా అనురాగవర్తిఐనచో మంచిదే కదా! అని అనిపించింది.

సీతామాతా ఉత్తమగుణాలకు పెన్నిధి. రావణుడు ఉత్తమవంశసంజాతుడే. లంకా నగరానికి ప్రభువు. గొప్ప శివభక్తుడు. అయినా తనవంశానికి బుద్ధికిగాని తగని రీతిగా ఈ జానకివిషయంలో రావణుడు అనుచితంగా ప్రవర్తించాడు. ఇదే చాలా విషాదకరం. ఎన్ని తెలిసి ఉన్నా ఒక్క చేయకూడని పెద్ద తప్పు ఈ రావణుడు చేశాడు అని హనుమంతుడు విచారించాడు.

* * *

# హనుమంతుని భ్రాంతి

## సర్గ - 10

**సీ**తకోసం అన్వేషణ సాగిస్తున్న ఆంజనేయునికి ఒక మహాభవనంలో దంతపు నగిషీలతో చిత్రవిచిత్రశిల్ప నైపుణ్యంతో అత్యుత్తమమైన ఆస్తరణాలున్న ఒక తల్పాన్ని చూశాడు.

ఆ శయాసనానికి ఊర్ధ్వ భాగంలో దివ్యమాలలతో అలంకరించిన ఛత్రం ఏర్పాటు చేసి ఉంది. బంగారంతో నిర్మితమైంది; సూర్యకిరణాల సమప్రభావమైన తల్పం చూడగానే మనస్సు ఆహ్లాదపరిచేదిగా ఉంది.

ఆ తల్పం చుట్టూ అందమైన స్త్రీలు వింజామరలు పట్టుకొని వీస్తున్నారు. మంచి చల్లనిగాలి తల్పంలో వారికి వస్తున్నట్లుంది. ధూపాలతో శ్రేష్ఠమైన సువాసనలు ఆ గది నిండా వ్యాపించి ఉన్నాయి. ఉన్ని కంబళ్ళు పరిచి ఉన్నారు. పుష్పమాలలు అలంకరించి ఉన్నారు.

ఆ తల్పం మీద మహాకాయుడైన రావణుడు నల్లని మేఘంలాగా నిద్రపోతున్నాడు. అతని చెవులు కర్ణకుండలాలతో మెరుస్తున్నాయి. దీర్ఘబాహువులున్న అతడు బంగారు జరీ వస్త్రాన్ని ధరించి ఉన్నాడు. ధగ ధగా మెరుస్తున్న ఆభరణాలెన్నో వక్షస్థలం నిండా ఉన్నాయి.

వృక్షాలతో పొదలతో నిండి ఉన్న మందర పర్వతంలాగా నిశ్చలంగా ఉన్నాడు. మధురాపానం చేసి రాక్షస స్త్రీలకు ఆనందం కలిగించి తాను సంతోషించి ఆనందంతో గాఢంగా నిద్రపోతున్నాడు.

ఏనుగు ఘీంకరించినట్లు గురక పెట్టుతూ రావణుడు నిద్రపోతున్నాడు. ఆంజనేయుడు నిద్రపోతున్న రావణుని చూశాడు. ఛీ ఛీ ఇతడు ఎంత గొప్ప కీర్తి ఉన్నా పరస్త్రీవ్యామోహంతో ఒకరి ధర్మపత్నిని అపహరించి తీసుకొచ్చాడే అనుకొని అక్కడనుంచి దూరంగా జరిగాడు.

అక్కడే ఉన్న సోపానం ఎక్కి మరల రావణుని తల్పాన్నే చూశాడు. రావణుడు పొడవైన బాహువుల మీద ఐరావతం కోరల రాపిడి గుర్తులు చూశాడు. వజ్రాయుధ ఘాతాలకు గుర్తుగా మచ్చలున్నాయి. బాగా పుష్టిగా ఉన్న ఆ బాహువులు పొందికగా బలంగా ఉన్నాయి.

చేతుల వేళ్ళు, అరచేతులు, గోళ్ళు అన్నింటికీ శుభలక్షణాలున్నాయి. రావణుని దేహమంతా ఎర్ర చందనం అలదుకొని ఉన్నాడు. ఉత్తమసుగంధద్రవ్యాలు సుందరాంగులు మర్దించినట్లుంది. ఆ రావణుని భవనమంతా మధుపాన సువాసనలు, పూల పరిమళాలు మైపూతల వాసనలు, ధూపాల ఘాటైన వాసనలు కలగలసి మత్తైన వాసనతో ఉంది. అక్కడే మృష్టాన్నభోజనాదుల పరిమళాలు ఫలాలు సువాసనలు అలముకొని ఉన్నాయి.

తెల్లని వస్త్రం మీద మహాకాయుడు నిండుగా శయనించి ఉండడం చూశాడు. ఆ మందిరం అంతా కాంచనదీపకాంతులు చుట్టి ఉన్నాయి. ఆయన ధరించిన ఆభరణాల కాంతులు విరజిమ్ముతున్నాయి. ఆయన చెంత నిద్రపోతున్న రావణుని ముద్దుల భార్యలను ఆంజనేయుడు చూశాడు. చంద్రునివంటిముఖంతో అమూల్యాభరణాలు ధరించి రావణుని భుజంపై, వక్షస్థలంపై, ఒడిలో చేరి ఆయన పత్నులు నిద్రపోతున్నారు. అందమైన సుందరాంగులందరూ రతిక్రీడలో అలసిపోయి హాయిగా నిద్రపోతున్నారు. ఒక సుందరి నాట్యభంగిమలోనే నిద్రపోతోంది. ఒక తరుణి వీణను కౌగిలించుకొని నిద్రలోకి జారిపోయింది.

మడ్డుకం అనే చర్మ వాద్యాన్ని చంకలో పెట్టుకొని ఒక భామిని గాఢంగా నిద్రపోతోంది. స్తన సౌభాగ్యం ఉన్న లలనామణి 'పటహం' అనే వాద్యాన్ని వక్షస్థలంపై పెట్టుకొని నిద్రపోతోంది. ఒక వనిత వేణువు హృదయానికి

హత్తుకొని నిద్రపోతోంది. ఒక కాంత కామావేశంతో మరొక కాంతను ప్రియుడని తలచినట్లుంది తమకంతో అల్లుకొని నిద్రపోతోంది.

నృత్త కళానిపుణ ఐన ఒక భామ తన ఏడు తీగల విపంచిని పెనవేసుకొని నిద్రపోతోంది. బంగారు వన్నె కల చిన్నది మృదంగాన్ని ముద్దుపెట్టుకుంటూ నిద్రపోతోంది. మనోహరులందరూ పారవశ్యంతో గాఢనిద్రలో ఉన్నారు.

మధువు పాత్రను, డిండిమ అనే వాద్యాన్ని ఆడంబరం అనే తూర్యనాదాన్ని కౌగిలించుకొని ఒక్కొక్కరు నిద్రలోకి జారుకొన్నారు. వీళ్ళందరూ ఎవరికిష్టమైన రీతిలో వారు నిద్రపోతున్నారు. భ్రమలలో ఆనందం పొందుతూ చేతులతో వాద్యాలను స్పృశిస్తూ, రావణా, ప్రియా, రాజా, నాథా, అంటూ పలవరిస్తూ ఉన్నారు. తమకుకావల్సిన ఆనందాన్ని వారు తనవి తీరా పొందుతున్నట్లుగా వారి వదనం ఉంది. మధుర ఆలోచనలోఉన్నట్లుగా నిద్రపోయేవారు కనిపిస్తున్నారు.

ఆంజనేయుడు వీరినందరిని చూచి ఆహా ఏమి ఈ రావణుని సంపద! కుబేరుని తమ్ముడైనందుకు భౌతిక సంపదలకు కొదవలేన్నట్లుగా లంక వెలిగిపోతోంది. ఇక్కడ అనుభూతులకు, మనస్సానందానికి కూడా ఏ మాత్రం తక్కువ లేనట్టుగా ఎందరెందరో తరుణీమణులందరూ దశకంతుని పొందు తమసొంత మైనందుకుగాను సంతోషంగా ఉన్నారు. ఇందరి మనస్సులను ఆకట్టుకోవడం కూడా అదృష్టమే కదా! అని అనుకొన్నాడు.ఇలా ఆలోచిస్తూ ఒక్కొక్కరినే చూస్తూ వెళ్తున్న ఆంజనేయునికి ఇంతమంది కాంతలలో ప్రత్యేక సౌందర్య రాశిలా ఉన్న ఒక కాంతారత్నం ఒక అందమైన శయ్యపై నిద్రపోతుండడం ఆంజనేయుడు గమనించాడు. మంచి ముత్యాలాభరణాలు ధరించి ఉంది. ఆమె మేని కాంతితో ఆ భవనం ప్రకాశవంతం ఔతోందా! అన్నట్లు కనిపిస్తోంది.

కనక వర్ణాంగి ఐన మండోదరిని ఆంజనేయుడు చూశాడు. ఆమె రావణుని ప్రియపత్ని పట్టమహిషి.

ఆంజనేయుడు సర్వాలంకార శోభిత ఐన మండోదరిని చూసి ఆమె శరీరరూపయౌవనసౌభాగ్యాలను ఆమె ముఖంలోని దివ్యకాంతిని చూసి ఆమె సీతాదేవి అనుకొన్నాడు. వెంటనే ఆంజనేయుని మనసు హర్షాతిరేకంతో నిండిపోయింది.

సీతాదేవి కనిపించింది నాకు అనుకొని నేత్రాలు విప్పార్చి చూశాడు. తన తోకను ముద్దు ఆడాడు. అక్కడే గంతులు వేశాడు. ఆ భవనంలోని స్తంభాలమీద గబగబా పైకి కిందికి జారాడు. ఆహా సంతోషం సీతాదేవి కనిపించింది అని ఆంజనేయుడు సంతోషంగా ఉన్నాడు. ఆహా శ్రీరాముని బాధతీరిపోయింది. సీతారాములకు ఇక ఏ చింతారాదు. నేనిపుడే వెళ్ళి రామునకు సంతోషంగా సీతామాతను చూశాను అని చెప్పేస్తాను. రాముడు ఆనందిస్తాడు. సుగ్రీవుని చింతకూడా దూరమౌతుంది. శ్రీరాముని పని చేసేశానని మా వానరరాజు రుమాదులతో హాయిగా ఉంటాడనుకొంటూ గంతులు వేయసాగాడు.

* * *

# ఆంజనేయుని భ్రాంతి తొలగడం

## సర్గ - 11

**మం**డోదరిని చూసి ఆంజనేయుడు సీత అని భ్రాంతి చెందాడు. ఆహా నేను వచ్చిన పని చేసేశానని ఎంతో సంబరపడిపోయాడు. ఎగురుతూ దుముకుతూ ఉన్న మారుతికి ఉన్నట్టుండి ఒక ఆలోచన వచ్చింది.

రాముడు విరహంలో ఉంటే సీత రతిక్రీడాలసటతో నిద్రిస్తుందా? ముల్లోకాలను ఎదురించే శ్రీరాముని భార్య పరపురుషుని కోరుతుందా? అన్నపానీయాలను ఆరగించి సుఖనిద్రపోతుందా? అన్న ఆలోచనతో పవనపుత్రుని మనసులోకి వచ్చింది. అంతే సంతోషాన్ని నింపిన హనుమంతుని భ్రాంతి వీడిపోయింది.

నేను చూసింది సీతను కానే కాదు అని స్థిరీకరించుకొన్నాడు. నేను చూసిన స్త్రీ రావణుని పట్టమహిషో లేక ఆయన ప్రియపత్నో అయి ఉండాలి కాని సీత కానేరదు. ఆమె రామవిరహంలో క్రుంగి కృశించి ఆహార పానీయాదులకు దూరమై శోకంలో మునిగి ఉంటుంది కాని రామవిరహానికి లోనైన జానకికి సంతోషం ఎక్కడనుంచి వస్తుందను అనుకొన్నాడు. ఏదైనా సరే మరొక్కసారి సీతమ్మ తల్లి కోసం వెదుకుతాను అనుకొని మళ్ళీ రావణుని అంతఃపురంలోకి వెళ్ళాడు.

రావణ పాన భూమినంతా మళ్ళీ తిలకించసాగాడు. అక్కడ కొందరు స్త్రీలు నృత్యగానాలతో అలసి నిద్రపోతున్నారు. మరికొందరు పడతులు తమ వాద్య జంత్రాలను పట్టుకొని ప్రియుడనే భ్రమలో పలవరిస్తూ నిద్రపోతున్నారు. కొందరు మహిళలు మేలైన అస్తరణాలపై నిద్రపోతున్నారు. కొందరు అంగనలు అందచందాల గూర్చి ముచ్చట్లాడుతున్నారు.

మరికొందరు పాటలలోని అర్థాలకు తాత్పర్యాలు చెప్తున్నారు. ఇంకొందరు రావణుని గూర్చి చెప్పుకొంటున్నారు. రూపసౌభాగ్యాల గురించి మాట్లాడుతున్నారు. సరససల్లాపాల్లో తేలియాడుతున్నారు. ఇంకొందరు ఆదమరచి హాయిగా నిద్రపోతున్నారు.

వారినందరిని చూస్తున్న హనుమంతునికి గోశాలలోని గోవుల మధ్య వృషభం లాగా స్త్రీల మధ్య రావణుడు కనిపించాడు. అరణ్యంలో ఆడుఏనుగులతో పరివృత్తమైన మదపుటేనుగులాగా రావణుడు లావణ్యవతులతో నిద్రిస్తున్నట్లు కనిపించాడు.

రావణుని శయనమందిరంలో వివిధ రకాలైన భోగవస్తువులున్నాయి. వాటిపక్కనే రకరకాలైన మధువు మధుపాత్రలున్నాయి. అక్కడక్కడ రాక్షసులకు ఇష్టమైన భోజ్య పదార్థాలు పాత్రల నిండా ఉన్నాయి. మరికొన్ని చోట్ల బంగారు వెండితో చేసిన కడలలాంటివి లోటాల లాంటివి ఉన్నాయి.

కొద్దిగా మధువు తాగి వదిలేసిన పాత్రలు ఆహారాగ్ని సగం తిని వదిలేసిన పదార్థాలతో ఉన్న పాత్రలు అక్కడక్కడా పడివేసి ఉన్నాయి.

షడ్రసోపేతమైన భోజ్యపదార్థాలు షడ్రచులు మేళవించిన సుమధురవాసనలతో జిహ్వాకు ఆనందం కలిగించే పదార్థాలన్నీ సమృద్ధిగా పానభూమిలో ఉన్నాయి. ఫలాలు ఫలరసాలు కృత్రిమంగా తయారుచేసిన మధువులు సహజమైన మధువు అంతా రాక్షసులకు ఇష్టమైనవన్నీ నిండుగా ఉన్నాయి.

చక్కగా అమర్చిన శయనాసనాలు వాటిమీద అలంకరించిన పుష్పాలు అందంగా ఉన్నాయి. ఆ తల్పాల దగ్గరగా అందమైన ఫలాలు పొందికగా పేర్చి ఉన్నాయి. ఆ తల్పాలపైన కొందరు తరుణీమణులు నిద్రపోతున్నారు. ఒకరినొకరు కౌగిలించుకొని పోతున్నారు.

కొందరు స్త్రీలు పూర్తిగా నిద్రలో మత్తులో ఉన్నారు. వారు పక్కవారి దుప్పట్లను లాగికొని కప్పుకొంటున్నారు.

మరికొందరి స్త్రీలకు వారు ధరించిన వస్త్రాలు, ఆభరణాలు చెదిరి ఉన్నాయి. చల్లని చందనాలు పూసుకొని ఉన్నవారు హాయిగా నిద్రపోతున్నారు.

చెరుకు, తేనెలతో తయారుచేసిన మద్యం పరిమళాలు వెదజల్లుతున్న సుగంధాలు ఘుమఘుమలాడుతూ ధూపాలు ఫలాలు వాసనలు అంతా వ్యాపించి ఉన్నాయి.

శ్యామవర్ణం కలవారు, బంగారు ఛాయ ఉన్నవారు రతికేళీ విలాసాలలో మునిగి అలసి సొలసి నిద్రపోతున్నారు. వారినందరిని చూశాడు. ఎక్కడ చూసినా సీతమ్మ తల్లి జాడ కనిపించలేదు. నేను ఇంతమంది స్త్రీలను చూశాను. ఇంతమందిని వెతికినా ఎక్కడా సీతాదేవికనిపించదేమి? అసలీ లంకలో సీతమ్మ ఉందా అన్న అనుమానం మారుతిలో పొడచూపింది. ఎంతెంతమంది స్త్రీలు ఈ లంకలో ఉన్నారు? ఒకరా, ఇద్దరా ఎన్నివేలమంది రావణుని మందిరంలో ఉన్నారు. కాని నేను వెతికే ఒక్క సీతమ్మ నీడ జాడకూడా తెలియలేదే! అని విచారించాడు. సీతాదేవి ఏమో ఈమె సీత ఏమో అంటూ అందరిని బాగా చూశాను కదా! అనుకొన్నాడు మారుతి. పైగా వారందరు ఎవరూ లేరు కదా! అని హాయిగా ఆదమరచి నిద్రపోతున్నారు.

అయ్యో! పరాయి స్త్రీలనందరినీ చూశాను గదా! నేను చేసింది తప్పేమో! అని కాసేపు చింతించాడు. మళ్ళీ అంతలోనే అయినా నా మనస్సు అభావంతో ఉంది కదా! ఫర్వాలేదు, అయినా సీతమ్మ స్త్రీ కదా! ఆమెను వెదకాలని వచ్చినపుడు స్త్రీలలోనే కదా! వెతకాలి. లేళ్ళల్లో, పురుషులలోనో వెదికితే ఆమె కనిపించదు కదా! నేను చేసిందాంట్లో తప్పు ఏమీ లేదులే అని ఆలోచించుకొన్నాడు.

మనసు కుదుటపడింది. సీతమ్మను మరలా మరలా వెదికాడు. ఆయమ్మ ఎక్కడా కనిపించలేదు. దేవ గంధర్వ నాగ కన్యలు ఎందరెందరో కనపడ్డారు కాని శ్రీరాముని ధర్మపత్ని మాత్రం ఎక్కడా కనిపించటంలేదు. ఇలా కాదు అనుకొని ఒక చోట కూర్చుని దీర్ఘాలోచనాపరుడయ్యాడు. అసలు సీతమ్మ బ్రతికే ఉందా? అని అనుమానించాడు. లేదు లేదు ఆ సీతమ్మ తల్లి కుశలంగా ఉంది. నా శ్రీరాముని చేరుతుంది. నా ప్రయత్న లోపంవల్ల కనిపించడంలేదు. ఈసారి తప్పక కనబడుతుంది అనుకొని మళ్ళీ వెదకడానికి కృతనిశ్చయం తీసుకొన్నాడు.

* * *

# ఆంజనేయుడు చింతాక్రాంతుడవటం

## సర్గ - 12

**సీ**తాదేవి కోసం ఆరాటపడుతూ మారుతి రావణాంతఃపురం అంతా వెదికాడు. లతా గృహాలు, పానశాలలు చిత్రశాలలు, పొదరిండ్లు ఇలా ప్రతి చోట వెదికినా ఆంజనేయునికి నిరాశే మిగిలింది. ఎక్కడా జానకి జాడ తెలియలేదు.

నిజంగా సీతాదేవి బతికే ఉంటే కనిపించకుండా ఉంటుందా? అసలు ఇన్ని రోజులు రాముని విరహంలో ఉన్న ఆమె చనిపోయే ఉంటుంది అంతే అంతే అనుకొని హనుమంతుడు హృదయవిదారకంగా ఏడ్చాడు. లేక దుష్ప్రవర్తన ఉన్న ఈ రావణుడు మాట వినలేదని చంపివేశాడేమో! అని అనుమానించాడు.

కామభయంకరులైన రాక్షసస్త్రీలు, పురుషులను చూచి సుకుమారి ఐన సీత ఎక్కడో దాగి ఉంటుంది. ఆమె తప్పక శ్రీరాముడు వచ్చి తీసుకొని వెళ్తాడనే ఆశతో ఎదురుచూస్తూ ఉంటుంది అనుకొన్నాడు. ఇంతకాలం సీతజాడ కోసం ప్రయత్నించాం. కాని ఆ అమ్మ ఉనికి తెలుసుకోలేకపోయాం. ఇప్పుడు వెనుదిరిగి మళ్ళీ సుగ్రీవుని దగ్గరకు వెళ్ళి సీతమ్మ కనిపించలేదని ఏమని చెప్దాం అనుకొన్నాడు. ఏ మొహం పెట్టుకొని వెళ్ళను వారి దగ్గరకు అని ఆంజనేయుడు చింతించాడు.

సముద్రాన్ని లంఘించి వచ్చాను. లంక అంతా చూశాను. రావణ అంతఃపురంలోని స్త్రీలందరిని చూశాను. కాని నా ప్రయత్నం అంతా బూడిదలో పోసిన పన్నీరులాగా అయిపోయింది. నాకు ఎక్కడా సీతమ్మ కనిపించలేదు.

నేను వెనుదిరిగి వెళితే అక్కడే ఆత్రంగా ఎదురుచూస్తున్న వానరులు ఆంజనేయా! సీతమ్మ కనిపించిందా? ఎలా ఉంది? ఎక్కడ ఉంది? ఆ దుష్టరావణుని చూశావా? అంటూ వారందరూ అడుగుతారు. వారికి నేనేమని జవాబు చెప్పాలి?

సమయం మించిపోయిందంటే వారందరూ చనిపోవడానికి సిద్ధపడతారు. నాకన్నా పెద్దవాడైన జాంబవంతుడు, యువరాజు అంగదుడు వారు నన్ను ఏమంటారో ఏమో! అనుకొన్నాడు.

అసలు నిరాశ ఆవరిస్తే మనిషి ఏపని చేయలేడు. అందుకే నిరాశను దుఃఖాన్ని దరిచేరనీయకూడదు. ఉత్సాహవంతులకు చేయరాని పని అంటూ ఏదీ ఉండదు. ఎదురులేని విజయం సిద్ధిస్తుంది. కావున నేను ఉత్సాహంతో నేను వెదకని ప్రదేశాలు ఏవో తెలుసుకుని వాటిని వెదుకుతాను. కష్టపడి నా సీతమ్మ తల్లిని నేను కని పెడతాను అనుకొన్నాడు.

భూగర్భ గృహాలు, దేవాలయాలు, విహార ప్రదేశాలు, దూరంగా ఉన్న ఇళ్ళు అన్నిటిని వదలకుండా పట్టి పట్టి వెదికాడు. ఎత్తుగా ఉన్న ప్రదేశాలకు చెట్ల మీద గోడలమీద ఎగబ్రాకి చూశాడు. రావణాంతపురంలో ఆంజనేయుని కంటికి కనిపించని ప్రదేశమే లేదు. అలా అంతా వెదికాడు. కాని కార్యం సానుకూలించలేదు. ఎత్తుగా ఉన్న ప్రాకారాలు, సరస్సులు, తటాకాలు దిగుడు బావులు అంతా పరిశీలన చేశాడు. విద్యాధర స్త్రీలు

కూడా కనిపించారు. అందమైన ముఖ సౌందర్యం ఉన్నవారు, మంచి రూపవిన్యాసం ఉన్నవారు నాగకన్యలు అందరూ ఆంజనేయుని కంటబడ్డారు. ఒక్క సీతాదేవి మాత్రం ఎంత వెదికినా కనిపించలేదు.

ఇంత కష్టపడి వానరులందరూ మొత్తం భూలోకాన్నంతా గాలించారు. నేను ఈ అపారసముద్రాన్ని దాటివచ్చాను. అయినా చేసిన ప్రయత్నాలు ఏవీ ఎందుకు సఫలం అవడం లేదు? ఎందుకు సీతమ్మ కనిపించడంలేదు! అనుకొంటూ వాయుసుతుడు విచారవదనుడు అయ్యాడు. హృదయం బరువెక్కింది. కలవరపాటుకు లోనయ్యాడు. వేదన ఎక్కువ అయ్యింది. అయ్యో! శ్రీరాముడు ఎలా ఉన్నాడో? రాముని ధర్మపత్ని ఎక్కడ ఉందో? ఎలా ఉందో! అని ఒకటే చింతకు లోనయ్యాడు.

హనుమంతుని మనస్సంతా ఆవేదనకు లోనైంది.చేసిన ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరు చందాన అయిపోతున్నాయి. వానరులు ఒకరా ఇద్దరా ఎన్ని కోట్ల మంది ప్రపంచం నలుమూలాలనుండి వచ్చారు. వారందరూ నేనేదో ఘనకార్యం చేసివస్తాను. సుగ్రీవునికి శ్రీరాముడు ఒనరించిన మహోపకారానికి వానరులమైనా తమకు సాధ్యమైనంతసాయాన్ని చేశామన్న తృప్తి కలుగుతుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. వారందరిని నేను నిరాశ పరుస్తున్నాననే చింత ఆంజనేయునిలో ఎక్కువైంది. ఎలా అయినా సీతమ్మను లంకలోనే ఉందని సంపాతి చెప్పారుకదా! మరి అదంతా నిజంకాదా? మమ్మల్ని విజయం వరిస్తుందని సంపాతి చెప్పారు, దానికి నిదర్శనంగా ఆయనకు కొత్త రెక్కలు వచ్చాయి కదా! మరి నేడు సీతమ్మ కనిపించకపోవడానికి కారణం ఏమై ఉంటుంది? అని మారుతి ఆలోచిస్తూ స్తబ్దంగా కూర్చున్నాడు.

* * *

# అనర్థాల గురించి ఆలోచించటం

## సర్గ - 13

**వి**ద్యుల్లతలాగా హనుమంతుడు రావణ గృహాలన్నీ క్షుణ్ణంగా వెదికాడు. ప్రతి ప్రదేశం గాలించాడు కాని సీతమ్మ జాడ కనుక్కోలేకపోయాడు. భవనంనుండి ప్రాకారానికి ఎగిరిదూకాడు.

పక్షిరాజు ఐన సంపాతి సీతాదేవి లంకానగరంలో ఉండి ఘంటాపథంగా చెప్పాడు కదా! మరి నేనీనాడు లంకలోని నీటిగుంటలు, చెరువులు, సరస్సులు, నదులు, జలాశయాలు విహార స్థలాలు, గృహాలు, క్రీడా స్థలాలు, దుర్గాలు, వనప్రాంతాలు ఇలా అన్నీ వెదికాను కదా! మరి నాకెందుకు సీత కనిపించలేదు అని తనలో తను వితర్కించుకొన్నాడు.

విదేహ రాజు కుమార్తె– రాముని పత్ని దుష్ట రావణునికి వశమై ఉంటుందా? అలా ఎప్పటికి జరగదు. రావణుడు సీతమ్మను తీసుకొస్తున్నప్పుడు రావణుడు రాముని బాణానికి వెరచి పరుగెత్తడంలో ఆ అమ్మను జారవిడిచాడేమో! అప్పుడు ఆ తల్లి సముద్రంలో పడిపోయిందేమో అని అనుకొన్నాడు.

అలాకాక రావణుని చేతిలో నుండి కిందకు చూసి సముద్రాన్ని చూచి భయపడి గుండె పగిలి చనిపోయిందేమో? లేక రావణుడు తనను భుజ బలశక్తితో తీసుకొని పోతున్నాడు గదా! అని ఆ ఉత్తమ స్త్రీ ప్రాణాలు విడిచిందేమో లేక రావణునితో పెనగులాడుతూ ఆమె సముద్రంలో పడిపోలేదు కదా అంటూ పలు విధాలుగా ఆంజనేయుని ఆలోచన సాగింది.

తన శీలాన్ని రక్షించుకోవడంలో రావణుడు ఆమెను తినివేశాడేమో! లేక అందమైన కన్నులున్నది సౌశీల్యవతి ఐన సీతను చూచి రాక్షస స్త్రీలు అసూయ చెందారేమో! వారేమన్నా ఆ జానకిని పొట్టన పెట్టుకొన్నారేమో!

తామర రేకులాంటి నేత్రాలు ఉన్న రాముని గూర్చి చింతిస్తూ కృశించి ఆహారపానీయాలు విసర్జించి ఆమె అసువులు బాసిందేమో! రామా! లక్ష్మణా! అంటూ ఆక్రోశించి గొంతు ఎండి చనిపోయిందేమో! లేక రావణుడు పంజరంలో చిలుకను బంధించినట్లు ఈ జానకీమాతను ఎక్కడున్నా బంధించి ఉంచాడేమో?

సీతమ్మ గురించిన అశుభవార్తను శ్రీరామునికి చెప్పకూడదు. అనునిత్యం సీతమ్మను కలవరించే రామయ్యకు జానకి తప్పిపోయిందని, కనబడలేదని, మృతి చెందినదని ఏవీ ఆయనకు చెప్పకూడదు. అయ్యో! నేను ఎలా చెప్పను? ఈ వార్తను అంటూ ఆంజనేయుడు పలవరించాడు.

అసలు సీతాన్వేషణకు ఇంతదూరం వచ్చి వైదేహిని చూడలేకపోయి కిష్కింధకు వెళ్ళితే పురుషార్థం ఏముంటుంది? అనుకొన్నాడు. కనబడలేదు సీత అంటూనే చెప్పే వాక్యం విని సుగ్రీవాదులు రామలక్ష్మణులు అసలు ఏమి అవుతారో అప్రియమైన వాక్యం నేను చెప్పిన వెంటనే రాముడు ప్రాణాలు వదిలేస్తాడు. అది చూచి లక్ష్మణుడు రాముని వెంటే వెళ్తాడు.

ఈ విషయం భారతాదులు తెలిసికొంటే ఇంకా ఏమన్నా ఉందా? అసలే వనవాసంలో ఉన్న రాముని గూర్చి చింతించే భరతుడు బతికి ఉంటాడా? శత్రుఘ్నుడు జీవితాన్ని ఆపేక్షిస్తాడా? వీరి నలుగురి మరణం చూసిన దశరథుని ప్రియపత్నులు రామాదుల తల్లులు బతికి ఉండడం ఎక్కడైనా జరుగుతుందా?

రాముడు మరణించడమే జరిగితే రాముని ప్రియమిత్రుడు ఆయన ఉపకారంతో వృద్ధి పొందే సుగ్రీవుడు ప్రాణాలు ఉగ్గబట్టుకోగలడా? ఆయనను చూసిన వానర జాతి ఏమౌతుంది? వానరులందరూ కార్యాన్ని సాధించలేని నన్ను చూసి తలలు బాదుకొని ప్రాణాలు విడుస్తారు.

ఇక ఎక్కడ ఆనందం ఉంటుంది? అటు అయోధ్యాపురి ఇటు కిష్కింధానగరి అంతా స్మశానమే అయిపోతుంది. అంతా దుఃఖమే మిగిలిపోతుంది.

నేను సుగ్రీవుని దగ్గరకు వెళ్ళకపోతేనే మంచిది. ఎందుకంటే నేను శుభవార్తను తెస్తానని సీతమ్మ వస్తుందని అందరూ ఆశగాచూస్తూ జీవిస్తారు. ఇదే మంచిపని. ఒకవేళ సీతాదేవి నాకు కనిపించకపోతే నేను ఈ సాగర తీరంలో కందమూలాలు, ఫలాలు తింటూ వానప్రస్థుడినై జీవిస్తాను. లేకపోతే ఇక్కడే ఒక చితిపేర్చుకుని అందులో కూర్చుని అగ్నికిఆహుతి అయిపోతాను.

లేక ప్రాయోపవేశంతోగాని, యోగసాధనతో జీవాత్మకు శరీర సంబంధాన్ని దూరం చేస్తాను. ప్రాణాలు వది లేస్తాను.

అప్పుడీ శరీరాన్ని ఏ పక్షులన్నా, మృగాలన్నా తినివేస్తాయి. జానకి కనిపించకపోతే జలసమాధి అవుతాను కాని మరలా నేను అప్రియవార్తను మోసుకొని ఎక్కడికి వెళ్ళలేను.

ఈ రాత్రిప్రారంభంలోనే లంకిణిని జయించాను. చంద్రుని వెన్నెల అన్వేషణలో తోడుగా నిలిచింది. నిరాటంకంగా నిర్భయంగా లంక అంతా తిరిగాను. ఇప్పటివరకూ అన్నీ మంచివే జరిగాయి. కాని ఇప్పుడేమి అసలుపనికాలేదు. సీతమ్మజాడను నేను ఎందుకు కనుగొనలేకపోతున్నాను అనుకొన్నాడు.

ఇంత ప్రయత్నం వృధా అయిపోయింది. నేను ఇక కార్యంలో విజయం సాధించలేనేమో? అందుకే ఇక దేహ త్యాగం చేస్తాను కాని దేహ త్యాగానికన్నా తాపసి జీవితం మేలు అనిపిస్తోంది. మరణించడం వలన వచ్చే లాభాలకన్నా బతికి ఉంటే ఎప్పుడైనా దేవుడు కరుణిస్తాడేమో. మంచి కాలం రావచ్చు. సీతమ్మ గురించి తెలుసుకోవచ్చు.

సుగ్రీవాదులకు రామాదులకు మోదం కలిగించవచ్చు. ఒకరికి ఆనందం కలిగించడంలో మనకు ఎంత తృప్తి కలుగుతుందో? వాటిని మించిన ఆనందం ఈ ప్రపంచంలో ఎక్కడా ఉండదు. కాన నేను జీవించియే ఉంటా అనుకొన్నాడు.

నాకు సీత కనిపించకపోతే ఆ దశకంఠుని హతమారుస్తా. అప్పుడు నా పగచల్లారుతుంది. లేకపోతే ఈ రావణుని సముద్రం మీదుగా తీసుకెళ్ళి రాముని పాదాలపై పడవేస్తా. అంతే చేస్తా అనుకొన్నాడు.

ఎంత వెదికినా సీతమ్మ కనిపించకపోతే హనుమంతునిలో దుఃఖం ఎగజిమ్ముకొచ్చింది. రామపత్ని కనిపించేవరకు ఈ లంకను వీడను మరీ మరీ వెదుకుతాను. సీతమ్మ దర్శనం అయ్యేవరకు నేను క్షణం ఊరుకోను అంటూ పలు విధాలుగా ఆలోచించసాగాడు. నేను ఎంత వెదికినా ఈ సీతమ్మ కనిపించకపోవడానికి కారణం ఏమై ఉంటుందా అని హనుమంతుడు తీవ్రంగా ఆలోచించసాగాడు. ప్రయత్నలోపం నాలో ఏదైనా ఉందా అన్న అలోచన ఆయనకు వచ్చింది. సంపాతి మాటలతో సీతాదేవి బతికి ఉందని అనిపిస్తోంది. కాని ఆమె ఎక్కడ ఉందో! కనిపించడంలేదే? రాముడు సీతమ్మను చూసి రాలేదని అనుకొంటే వానరులందరినీ మట్టుపెడ్తాడు. ఆ వానర నాశనానికి నేనే కారణం అవుతాను. ఇది మంచిది కాదు అనుకొన్నాడు.

ఆయనకు ఎదురుగా అశోకవనం కనిపించింది. అష్టవసువులు, ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు, అశ్వినీ దేవతలు మరుత్తులు ఇలా అందరికీ నమస్కరించి నేను ఈ అశోకవనంలో వెదుకుతాను. ఇప్పటివరకు నేను ఇక్కడ వెతకనేలేదు. బహుశా సీతమ్మ ఇక్కడే ఉందేమో అని ఆంజనేయునిలో ఆశ మొలకెత్తింది.

ఇక్కడే ఆ తల్లి ఉంటే ఈ రాక్షసులందరిని జయించి ఆనందదాయిని ఐన రామపత్నిని రాముని దగ్గరకు చేరుస్తాను. సీతమ్మను చూడాలని లేచాడు. శ్రీరామునికి లక్ష్మణునకు సుగ్రీవునకు రుద్రునకు, ఇంద్రునకు, యమునకు వాయుదేవునకు ప్రణతులర్పించాడు. సీతామాతకు చేతులు జోడించి నమస్కరించాడు.

ఆంజనేయుడు అశోకవనంలో ప్రవేశించాలని చుట్టూరా చూశాడు. అశోకవనమంతా వివిధ వృక్షాలతో నిండి ఉంది. సాయుధపాణులైన రాక్షసులు కాపలా కాస్తుంటారు అనుకొన్నాడు.

రావణుడు చూడకుండా నేను సీతమ్మను వెదికేలా చేయమని భగవంతుని వేడుకొన్నాడు. దేవతలు, మహర్షులు అందరూ సహాయం చేయండని ఆంజనేయుడు అభ్యర్థించాడు.

సూర్యచంద్రాదులను, అశ్వినీ దేవతలను బ్రహ్మను, దిక్పాలురను, సమస్త భూతకోటిని కార్యాన్ని సఫలం చేయమని ప్రార్థించాడు.

అఖిలాండ నాయకుడైన విష్ణువును సీత కనిపించేలాగా చేయమని అర్థించాడు. పూర్ణచంద్రునిలాగా మందస్మిత ఐన సీతాదేవి ముఖారవిందం నేనెప్పటికి చూస్తానో? ఆ భాగ్యం నాకు ఎప్పుడు కలుగుతుందో అని మారుతి ఆలోచించాడు.

రావణుడు నీచుడు, భయంకర స్వరూపుడు, త్రిపుంద్రము ధరించినవాడు. ఈ రావణుడు సాధుశీల ఐన శ్రీరాముని భార్యను అపహరించి తెచ్చాడు. ఆ దీనవనిత నాకు ఎప్పుడు కనిపిస్తుందో? నాకు ఆ తల్లి దర్శన భాగ్యం ఎప్పుడు కలుగుతుందో అని ఆలోచించాడు.

* * *

# అశోకవనంలో ప్రవేశం

## సర్గ - 14

**ఆం**జనేయుడు మనసున ముక్కోటి దేవతలను ప్రార్థించాడు. సీతాదేవికి నమస్కారం చేశాడు. అటు తరువాత రావణభవనప్రాకారం నుండి అశోకవనప్రాకారం మీదకు దూకాడు. అక్కడనుంచి అశోకవనాన్ని చూశాడు. వసంతఋతువు ఆగమనంతో చెట్లు అంతా నిండా పుష్పించి మనస్సును ఆహ్లాదపరుస్తున్నాయి. ప్రతి చెట్టు వసంతశోభను రెమ్మరెమ్మనా పూయిస్తోంది. ప్రతిఆకు కదులుతూ వసంతుని రారా అంటూ పిలుస్తున్నట్లున్నాయి. అలాంటి అశోకవనాన్ని చూడగానే హనుమంతుడు పులకించిపోయాడు.

మద్దిచెట్లు అందమైన అశోక వృక్షాలు విరగబూసాయి. సంపెంగలు, మల్లెలు, జాజులు, పొన్నలు, మామిళ్లు ఇలా ఏమిటి? ప్రతి చెట్టు పూలుపూచింది. వసంతునితో స్నేహం చేసి ప్రతి రెమ్మా పిందేసింది. వింటినుంచి దూసుకొచ్చే బాణంలాగా మారుతి అశోకవనంలోకి ఒక అంగలో దూకాడు.

చిత్రంగానున్న వృక్ష వాటికలోకి ఆంజనేయుడు వెళ్ళాడు. అక్కడ పక్షుల కిలకిలారావాలు, లేళ్ళ సంచారం, కోకిల గానాలు, గండు తుమ్మెదల ఝుంకారాలు, హాయిగా విహరించే నెమళ్ళ క్రేంకారాలు, ఎర్రఎర్రగా చిగిర్చిన కొత్త ఆకులు పచ్చని పచ్చిక తివాసి పరిచినట్లుగా అందంగా ఉంది.

అలాంటి చిత్రికావనంలోకి ఆంజనేయుడు గెంతుతూ తోకను ఊపుతూ వెళ్ళుతున్నాడు. అలా ఆనందంగా వెళ్ళే మారుతిని చెట్లు చూశాయి. వసంతుడు వచ్చాడేమో అనుకొని నిద్ర లేచాయి. చెట్లు కళ్ళుతెరవడం చూచి పక్షులు తెల్లవారబోతోందని ఉదయభానునికి స్వాగతవచనాలు చెప్పడానికి రెక్కలు టపటపలాడించాయి.

ఆంజనేయుని శరీరపు రాపిడివలన పుష్పాలన్నీ ఆయనపై రాలాయి. అలా రాలిన పుష్పాలు వసుధ నిండాయి. ఫలాలు కూడా రాపిడికి రాలాయి. అలా ఫలాలు పుష్పాలు రాల్చి చెట్లు మోడుల్లా నిలచాయి. మారుతి తోకతో చేతులతో కదల్చినందువల్ల అశోకవని ప్రియునిశృంగారచేష్టలో నలగిచెదిరినజుట్టుతో, చెదిరినతిలకంతో అందంగా కనిపించే భామలాగా సోయగాలు పోయింది. పూవులు, పండ్లు పడి ధరణి కొత్త అందాలనుదిద్దుకొంది.

సోపానాలన్నీ దిగుడు బావులు, సరస్సులు, సెలయేళ్ళతో ఆ వనం నిండి ఉంది. ఆ సరస్సుల నిండా వికసించిన పద్మాలు కలువలున్నాయి. వాటిమీద కలహంసలు, బెగ్గురుపక్షులు అందంగా ఆడుతున్నాయి. దిగుడు బావుల అడుగున స్ఫటిక శిలలతో నిర్మితమై ఉన్నాయి. అక్కడ ఇసుకకు బదులుగా ముత్యాలు పగడాలు నిండినట్లుగా కనిపిస్తున్నాయి.

ఆ తీరాలలో సంపెంగలు, పొన్నలు విరగకాచి ఉన్నాయి. ఆ దిగుడుబావుల చుట్టూ కాల్వలున్నాయి. ఆ కాల్వలపై పక్కలలో చెట్లు ఇబ్బడి ముబ్బడిగా పెరిగి ఉన్నాయి. అక్కడ ఎత్తుగా ఉన్న పర్వతాలలో వాటిలో అందమైన గుహలు ఒప్పారుతున్నాయి.

ఒక కొండమీద నుండి ఓ నది ప్రణయ కలహంతో ప్రియుని నుండి జారిపోయే ప్రమదలాగా తటాలున జారుతోంది. ఆ ప్రియురాలిని వద్దు వద్దు వెళ్ళకు అనే ప్రియునిలాగా, కొన్ని చెట్లు కిందదాకా వంగి ఆపైన నుంచి పడే ప్రవాహ ఝరి స్పృశిస్తున్నాయి. అక్కడ ఎత్తుగా పెరిగిన చెట్టు నుండి ఊడలు దిగి భూమిని తాకుతున్నాయి. అలా వాటిని చూస్తూ సీతను వెదుకుతూ ముందుకు సాగుతున్న ఆంజనేయునికి ఒక సరస్సు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ సరస్సుకు మణిమయ సోపానాలున్నాయి. దాని దగ్గరే మృగ సమూహాలతో కూడిన ఒక విచిత్ర వనం ఉంది. అక్కడ విశ్వకర్మ అందమైన ప్రసాదాలు కట్టి ఉన్నాడు. అక్కడక్కడ బంగారు వేదికలున్నాయి లతావితానాలతో ఎక్కడ చూసినా రమ్యంగా రమణీయంగా కనిపించింది.

ఒక శిశుంపా వృక్షాన్ని చూశాడు. దాని చుట్టూ ఆకులు లతలు అల్లుకొని ఉన్నాయి. సీతమ్మ తప్పక ఈ వనంలోనే ఉండాలి, నాకు ఆ తల్లి కనిపించాలి అని మరల మరల భగవంతుని మారుతి మనసున ప్రార్థిస్తున్నాడు. ఆ వృక్షం దగ్గరే కాంచన తరువులు ఉన్నాయి. వాటికంతా బంగారు చిరుగంటలు అమర్చి ఉన్నారు. అవి గాలి తాకిడికి మనోహరమైన శబ్దాన్ని చేస్తున్నాయి. శింశుపావృక్షం మొగ్గలతో పూలతో చిగుళ్ళతో అందంగా ఉంది. ఆ చెట్టు నిండా కొంగొత్త ఆకులువేసి దట్టంగా ఉంది. మారుతి ఆ చెట్టుపైకెక్కి ఒక కొమ్మపై కూర్చున్నాడు. దుఃఖార్తితో కుమిలిపోయే సీతను నేను దైవవశాన ఎప్పుడుచూస్తానో అనుకొన్నాడు.

దుర్మార్గుడైన రావణుడు అందమైన గృహాలను కట్టించుకొన్నాడు. ఈ రమ్యమైన అశోకవనం వర్ణనాతీతమైన అందంతో మనోహరంగా ఉంది. ఇక్కడే ఉన్న ఈ పద్మసరస్సు నిండా పక్షిగణాలున్నాయి.

శ్రీరాముని పత్ని విరహాగ్నిని ఉపశమింపచేసుకోవడానికి తప్పక ఈ సరోవర తీరానికి వస్తుంది. ఈ చల్లని ప్రదేశం ఆమెకు ఉపశమనాన్ని ఇస్తుంది. సీతాదేవి శ్రీరామునికి ప్రాణపదమైనది. ఆ సాధ్వి తప్పక ఇక్కడకు వస్తుంది. నేను చూస్తాను అని ఆంజనేయుడు తలపోశాడు. వనవాసదీక్షలో కడగండ్లు అనుభవిస్తూ ఇప్పుడు శ్రీరాముని ఎడబాటువలన ఆయనకోసం పరితపిస్తూ కుంగిపోయిన ఆ వామలోచన తప్పక ఈ తటాకానికి వస్తుంది.

అక్షయయౌవనసంపన్నురాలైన జానకి ప్రాతస్సంధ్యావందనాలకోసం ఐనా ఈ పవిత్ర జలాల దగ్గరకు వస్తుంది. రాజశ్రేష్ఠుడైన శ్రీరామచంద్రుని భార్య సర్వశుభలక్షణ ఉండడానికి ఈ అశోక వనమే తగి ఉంది. ఆ సీతమ్మ తల్లి బతికి ఉంటే తప్పక ఈ సరస్సు చెంతకు వచ్చి తీరుతుంది అనుకొని ఆంజనేయుడు దట్టంగా ఉన్న ఆ శింశుపావృక్షం కొమ్మలలో ఆకులమధ్య దాగాడు. ఆకులో ఆకునై నేనిక్కడే వేచి ఆ సీతమ్మ తల్లికై నిరీక్షిస్తాను. తప్పక ఆ జానకి నాకు కనిపించి తీరుతుంది అని గట్టి నిశ్చయంతో ఆంజనేయుడు ఆకుల మధ్య ఒదిగాడు. ఆంజనేయుని మనసు ఆహ్లాదంగా ఉంది. ఎందుకనో హృదయం పదిలంగా ఉందని భావం కలుగుతోంది. ఏదో శుభసూచకం కనిపిస్తుందని మనసు చెప్తుతోంది. సీతమ్మ ఇక్కడే ఉంటుందని నమ్మకం ఎక్కువ అవుతోంది. రాముని కార్యం త్వరలోనే పూర్తిచేస్తాననే ఆశ కలుగుతోంది. అందుకే మారుతి నేనీ శింశుపావృక్షచ్ఛాయలో ఉంటాను. కల్యాణగడియవచ్చినా కక్కువచ్చినా ఆగందంటారు. సీతమ్మ కనిపించే సమయం ఆసన్నమైనట్లే అనిపిస్తోంది. కౌసల్యాదశరథుల కోడలు  నాకు కనిపించి తీరుతుంది అని పవనసుతుడు అక్కడే నింపాదిగా కూర్చున్నాడు.

* * *

# సీతా సందర్శనం

## సర్గ – 15

**శిం**శుపా వృక్షం మీద దాగిన ఆంజనేయుడు పలు విధాలుగా ఆలోచిస్తున్నాడు. సీత ఎక్కడైనా కనిపిస్తుందేమోనని ఆశగా నలువైపులా దృష్టి సారించి చూస్తున్నాడు.

రావణుని అశోకవనం కుబేరుని చైత్రరథంలాగా, దేవేంద్రుని నందనవనంలాగా కనిపిస్తోంది. ఎక్కడ చూసినా చెట్లు, పొదలు అన్నీ వసంత ఋతువులో చిగిర్చి పచ్చని ఆకులు పూలతో కళకళలాడుతున్నాయి. అశోకవృక్షాలు ఎర్రనిపూలుపూచి ఉదయశోభను తలపుకు తెస్తున్నాయి. కోకిలమధురస్వరాలు, గండు తుమ్మెదలు ఝుంకారాలు ఆ అశోక వనానికి వన్నె తెస్తున్నాయి.

విశ్వకర్మ తన నిర్మాణపటిమతో అందమైన ప్రాసాదాలు నిర్మించారు. తటాకాలు, సరస్సులు, సెలయేళ్ళు అన్నీ అద్భుతంగా కనిపిస్తున్నాయి. ఆ జలాల నిండా వికసించిన తామరలు, వాటి మకరందాన్ని గ్రోలడానికి

తుమ్మెదలు వాలుతున్నాయి. చల్లని జలాలలోనే జీవితాన్ని గడిపే రాజహంసలు, కలహంసలు, చక్రవాకాలు, నీటికోళ్ళు, వందల కొలదిగా ఉన్నాయి.

పెంచి పోషించే ఈ వనంలోని చెట్ల నిండా మధురధ్వని చేస్తూ పక్షి గణాలు, మృగాలు పెంపుడు జంతువులు అందంగా సంచారం చేస్తున్నాయి. వృక్షాలు ఫలాలబరువుతో వంగి ఉన్నాయి.

శోకాన్ని నాశనం చేస్తుందా అనిపించేలాగా అశోకం పూచి ఉంది. వీటినన్నింటిని తేరిపారా చూస్తున్నాడు.

అంతలో ఎత్తుగా కట్టిన రాతి కట్టడం కనిపించింది. ఈ చైత్యప్రాసాదం ఎంత బాగుందో అనుకుంటూ దాని కిందకు చూశాడు. వేయిస్తంభాలతో నిర్మితంఅయిన కైలాసంలాగా ధవళకాంతిని విరజిమ్ముతోంది. పగడాలు పొదిగిన సోపానాలతో మేలిమిబంగారు వేదికలతో మనోజ్ఞంగా ఉంది.

అలా చూస్తున్న మారుతికి విశాలనయనాలతో మంగళ రూపిణి ఐన స్త్రీ కనిపించింది. ఆమె చుట్టూ భయంకరులైన రాక్షస స్త్రీలు ఉన్నారు. ఆ స్త్రీమూర్తి వేదనలో కన్నీరు కార్చి కార్చి ఆమె కన్నులు వెలవెలపోతున్నాయి శుక్లపక్షపాడ్యమి తిథినాటి చంద్రరేఖలా సన్నగా ఉంది. మాటిమాటికి నిట్టూర్పులు విడుస్తూ తన బాధను దిగమింగుతోంది.

బూడిద కప్పిన నిప్పుకణికలాగా ఆమె శరీర కాంతి కనబడుతోంది. ఎన్నో రోజుల నుంచి కట్టుకొన్న వస్త్రంలాగా ఆమె ధరించిన పచ్చని పట్టుచీర కనబడింది. దాన్ని చూడగానే ఆంజనేయునికి ఋష్యమూకంపై నగల మూట గుర్తుకువచ్చింది. ఆ మూటకూడా ఈ పచ్చని పట్టుచీరను పోలిన వస్త్రమే అనుకొన్నాడు. ఆభరణాలు ఎక్కువగా లేని అలంకారరహిత ఐన ఆ సుందరిని చూసి ఈమెవే ఆ నగలు అయి ఉంటాయి అనుకొన్నాడు.

శరీర సంస్కారాలు లేకుండడం చేత అప్పుడే వికసించిన బురద అంటిన పద్మంలాగా, తామర పుష్పం లేని కొలనులాగా ఉంది. దుఃఖంతో తరిగిన శరీర చ్ఛాయతో సిగ్గుతో తలవంచుకొని కూర్చుని ఉంది. అంగారకునిచే పీడింపబడిన రోహిణి నక్షత్రంలాగా, వర్షాకాలపు చంద్రరేఖలాగా ప్రకాశహీనంగా ఉంది.

ఆవులమందనుండి విడవడిన గోవులాగా దిక్కులు చూస్తోంది. ఏవైపునుంచి ఏ ప్రమాదం వస్తుందేమోనన్న శంక ఉన్నట్లు అన్ని దిక్కులా ఆ లలనామణి భయం భయంగా చూస్తోంది.

ఆత్మీయులకు దూరమై నిత్యం రోదనాగ్నిలో దహించుకుపోయే ఆ పడతి కృంగి కృశించి దీనావస్థలో ఉంది. తన గుంపు నుండి తప్పిపోయిన ఆడు లేడి వేట కుక్కల బారినపడినట్లుగా సుకుమారవతి ఐన ఆ నారీరత్నం రాక్షస స్త్రీల మధ్య కూర్చుని ఉంది.

నిండుచంద్రునిపోలిన ముఖం ఉన్న ఆమె తపస్విలాగా నేలపై కూర్చుని ఉంది. ఆమె జుట్టుకు తైల సంస్కారాలు లేవు, నల్లగా ఉన్న ఆ జడ ఆమె నడుము దాకా నల్లని త్రాచులా వేలాడుతోంది. అప్పుడు శరత్కాలంలోని నల్లని వృక్షపంక్తితో కూడిన భూదేవిలాగా కనబడింది. కష్టాలే ఎరుగని ఆ ముదిత ముంచుకొచ్చిన కష్టాల కొలిమిలో అగ్నికి ఆహుతి ఐపోతున్నట్లుగా దుఃఖిస్తోంది. ఆమెను చూచి ఆంజనేయుడు ఈమె రావణుడు అపహరించి తెచ్చిన సీతామాతయే అని నిర్ణయించుకొన్నాడు.

ఋశ్యమూకపర్వతంమీద నుండి చూసిన రావణగ్రహీత అయిన రూపాన్ని గుర్తుకు తెచ్చుకొన్నాడు. ఆమె నిండు చంద్రుని పోలిన ముఖవర్చస్సుతో, అందమైన కనుబొమ్మలు కలిగి ఉంది. సర్వాంగసుందరరత్నంతో మేనిచ్ఛాయతో చీకట్లను తరముతున్నట్లుగా ఉన్న సుందరరూపం గుర్తుకు వచ్చింది. ఈ స్త్రీ మూర్తిలో ఆనవాళ్ళను వెదికాడు.

అవునవును. ఆమె ఈమేఅయి ఉంటుంది. పొగబారిన అగ్ని శిఖలా ఉంది. దుర్భరశోకకారణంగా శరీరం కృశించి ఉంది. అభ్యాసం లేని వేద విద్యలా, క్షీణించిన సంపదలాగా, జింకలా బెదురుచూపులతో దీనంగా దుఃఖిస్తోంది.

వేదన భారంతో అప్రసన్నంగా కారుమేఘాలు కప్పిన పూర్ణచంద్రునిలాగా ఆమె కనిపించింది. ఆమెను చూసిన కొలది ఈమె సీతయే కదా అన్న అనుమానం పీడిస్తోంది. నిరీశ్వర వాదం లాగా నెమ్మది లేని బుద్ధిలాగా, వ్యర్థమైన మనోరథంలాగా ప్రకాశహీనంగా ఉంది.

అలంకారవిహీనంగా ఉన్న ఆ స్త్రీ మూర్తిని రాముడుచెప్పిన దానిని బట్టి హనుమంతుడు సీతగా గుర్తించాడు. ఆనాడు రాముడు చెప్పిన ఆభరణాలు ఈమెవై ఉన్నాయని చూశాడు. చెవికి ఉన్న శ్వదంష్ట్రం అనే పేరుగల శ్రవణాభరణాలు కర్ణకుండలాలు చేతులకు మణులు పొదిగి ఉన్న గాజులు చాలారోజుల నుండి వేసుకొనే ఉండడంవలన శరీర తాపంతో నల్లబడి ఉన్నాయి. కానీ అవి అన్నీ వన్నెచిన్నెలు తరగని ఆభరణాలలాగే కనిపిస్తున్నాయి. ఆమె కట్టుకొన్న పచ్చని చీర కూడా చాలారోజులనుంచి కట్టుకొన్నట్లు ఉందికాని ఆ వస్త్ర శోభ తరగలేదు.

ఈమె తప్పక సీతామాతయే. ఈమె అనుక్షణం శ్రీరామునే తలుస్తోంది. అక్కడ ఆ రాముడు క్షణం క్షణం ఈమెనే తలపుకు తెచ్చుకొంటున్నాడు. సీత దూరంగా ఉన్నా అనుక్షణం రాముని హృదయంలోనే ఉంది. సీత హృదయపీఠంలో రాముణ్ణే అధిష్ఠింపచేసుకొని ఉంది. అందుకే వీరిద్దరూ దూరంగా ఉన్నా జీవిస్తున్నారు అనుకొన్నాడు.

ఒంటరిగా ఉన్న అబలను ఆదుకోవాలి గదా! ఆపదలో ఉన్న సీతను రక్షించలేకపోయాననే అనే బాధ, తన అర్థాంగి అయి పర పురుషుని చేత అపహరింపబడితే నేను కాపాడలేకపోయాననే బాధ, తననే నమ్ముకుని వచ్చిన వనిత నావలన ఆపదలపాలు అయ్యిందనే బాధ, తన ప్రియురాలు ఎడబాసిందనే విరహవేదన– ఇలా సీత వలన శ్రీరాముడు నాల్గు రకాల బాధలకు గురి అయ్యాడు.

పురుషులలో మోహనాకారుడైన శ్రీరామునికి, అతిలోకసుందరి ఐన సీత తగిన ఇల్లాలు. ఇలాంటి ఉత్తమమైన స్త్రీని వదిలి శ్రీరాముడు జీవించి ఉండడం నిజంగా అసాధ్యమైన కార్యమే. ఆ సీతామాత కూడా తన మనస్సు నిండా శ్రీరాముని రూపునే నింపుకొంది. కావుననే ఆమె బ్రతికి ఉంది అనుకొన్నాడు.

ఏదిఏమైనా సీతామాత బ్రతికే ఉంది. నేనా విషయం కన్నులారా చూశాను. ఇక నేవెళ్ళి నా రామునికి శుభవార్త చెప్పి ఆయనను సంతోషింపచేస్తాను. ఇన్నాళ్ళకు ఆ సీతమ్మ కనిపించింది అని ఆంజనేయుడు ఎంతో సంతోషించాడు. గడువు అయిపోయింది. కాలాతీతం అయింది.

'సీతామాత కనిపించకపోతే నా ముఖం ఎలా చూపించను అని దుఃఖించాను. నావలన వానరులు, ఇక్ష్వాకులు నాశం చెందుతారనే నా భయం నేటితో ముగిసిపోయింది. ఈ తల్లి దర్శనం జరిగింది. నేను కాదు సమస్త లోకాలు సంతోషించుతాయి' అనుకొన్న ఆంజనేయుని మది సంతోషంతో నిండిపోయింది. రామునికి ఈ వార్త చెప్పిన తర్వాత జరగబోయే పరిణామాలను ఊహించుకుంటూ ఆనందంలో మునిగాడు. వందయోజనాల సంద్రాన్ని మేమందరం ఎలాదాటాలి? అని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

* * *

# సీత శోకం - హనుమంతుని దుఃఖం

## సర్గ - 16

**సీ**తాదేవిని చూసిన ఆనందం ఆంజనేయునిలో ముప్పిరిగొనింది. ఆనందంగా కళ్ళుమూసుకొన్నాడు. ధ్యానమగ్నుడయ్యాడు. రాముడు సీత ఇద్దరూ అనుకూలంగా ఉన్నారు. రామునకు తగిన సీత, సీతకు తగిన రాముడు. వీరిదే అన్యోన్య దాంపత్యం అనుకొన్నాడు.

మళ్ళీ కళ్ళు తెరిచి ఆ సీతమ్మను చూశాడు. దైన్యస్థితిలో కన్నీరు కార్చుతూ రాక్షసాంగన మధ్య భీతహరిణిగా కూర్చుని ఉంది. అలాంటి స్థితిలోని సీతను చూచి హనుమంతుని హృదయం దుఃఖంలో కూరుకుపోయింది. లక్ష్మణస్వామికి పూజనీయురాలు. నాగేటి చాలులో భూమిని చీల్చుకొని జనకునికి పుత్రిక అయ్యి అపురూపంగా పెరిగింది. దశరథునికి పెద్దకోడలై శివధనుస్సును విరిచిన మహాపరాక్రమశాలికి భార్య ఐంది. ఇప్పుడు ఇలా ఈ రావణుని చేత అపహరింపబడి దుఃఖిస్తోంది.

కాలం ఎంతటి వారినైనా బాధిస్తుంది కదా! విధిని ఎదురించడం ఎవరికీ చేతకాదు అనుకొన్నాడు. శ్రీరాముని పరాక్రమాన్ని బాగుగా ఎరిగిన ఇల్లాలు సీత. అందుకే ఇడుములలో ఇరుక్కుపోయి ఉన్నా లోతైన గంగానదిలా దుఃఖానికి కృశించక గంభీరంగా ఉంది. ఇది సీతకే తగినది అనుకొన్నాడు. సీతారాములు ఎలా ఉండాల్సినవారు ఎలా అయిపోయారు. విధి చిత్రం అయినది. రాజులను బిక్షుకులుగా , పేదలను ధనికులుగా మార్చడానికి బ్రహ్మకు ఏ మాత్రం సమయమక్కరలేదు కదా! అనుకున్నాడు. ఎక్కడ రాజమందిరం?, ఎక్కడ అశోకవనం? 'హా సీతమ్మా' అనుకొనేసరికి మారుతికి దుఃఖం వచ్చి గొంతు పూడుకుపోయింది. సీతారాములు ఇద్దరి గుణాలు అనుగుణంగానే ఉన్నాయి. సమవయస్కులు, సద్వంశ సంజాతులు, శరీర సౌష్ఠవంలోను ఇద్దరూ సమానమైన అందం కలవారు. అందుకే అసితేక్షణ ఐనసీత శ్రీరామునికి తగిన పత్ని. ఇద్దరూ అనురూపులు అనుకొన్నాడు.

మేలిమి బంగారు కాంతిలాగా శోభిస్తున్న సీతమ్మను చూసి రాముణ్ణి తలచుకొన్నాడు. సాటిలేని మహా పరాక్రమశాలి అయిన వాలిని ఈ సీతాదేవి కోసమే శ్రీరాముడు సంహరించాడు. ఈ సాధ్వీమణి వల్లనే సుగ్రీవుడు వానర రాజ్యాన్ని ఏల గలుగుతున్నాడు.

ఈ వైదేహి కారణంగానే రాముడు ఖరదూషణాదులను యమపురికి పంపాడు. ఈ జానకి కోసమే లక్ష్మణుడు శూర్పణఖ ముక్కు చెవులు కోసివేశాడు. ఈ విశాలాక్షి కోసమే రాముడు ఒంటి చేత్తో పద్నాలుగువేల మంది రాక్షసులను తుదముట్టించాడు.

ఈ లోకోత్తర సుందరి కోసమే గదా! నేను ఈ వందయోజనాలసాగరాన్ని దాటి అద్భుతలంకానగరాన్ని చూశాను. ఈమె నిమిత్తమే శ్రీరాముడు విరాధుణ్ణి కబంధుణ్ణి త్రిశరుణ్ణి సంహరించివేశాడు.

శ్రీరాముడు ఈమె కోసం ఏమైనా చేస్తాడు. ముల్లోకాలను జయించివేస్తాడు. ఈ భూమండలాన్ని సైతం తలకిందులు చేయడం కూడా యుక్తమే అనిపిస్తోంది.

శ్రీరామునికి ముల్లోకాల రాజ్యాధికారం పొందడం ముఖ్యమా? జానకిని పొందడం ముఖ్యమా? అన్న ఆలోచన వస్తే సీతాదేవి ఔన్నత్యంలో త్రిలోకాధిపత్యం పదహారోవంతుకుకూడా సరిపోదు.

పతిసేవాపరాయణ అయి ఫలమూలాలను మృష్టాన్న భోజనంగా పర్ణశాలను భవంతులలాగా అనుకొని జీవిస్తున్న ఈ నారీమణే సీత.

నిరంతరం చిరునవ్వుతో ఉండే ఈ పుత్తడి బొమ్మ నేడు వేదనలో కూరుకుపోయింది. ఈ సీతాదేవిని చూడాలని రాఘవుడు తహతహలాడుతున్నాడు. శ్రీరాముడు సీతను పొందితే అత్యధిక ఆనందాన్ని పొందుతాడు. సీత కూడా రాముని చూస్తే పోతున్న ప్రాణాలను చిక్కబట్టుకొంటుంది.

ఈ సీత ఎదురుగా ఉండే రాక్షస స్త్రీలను చూడడం లేదు. చుట్టూరా ఉన్న ఈ అశోక వనాన్ని చూడడంలేదు. నిత్యం ఆమె శ్రీరాముణ్ణే ధ్యానిస్తూంది. తన కన్నులనిండా ఆ శ్రీరాముని చూపునే సంతరించుకొంది అందుకే ఆమెకు ఇవి ఏవీ సంతోషాన్ని ఇవ్వడంలేదు.

స్త్రీలకు ఎన్ని ఆభరణాలున్నా భర్త అనే అలంకారం లేకపోతే శోభించదు కదా! అలానే పతైనశ్రీరామునికి దూరం అయినందువల్లే ఈమె ప్రకాశ విహీనంగా ఉంది అనుకొన్నాడు.

నల్లని కురులతో అందమైన కన్నులతో శ్రీరాముని దగ్గర దివ్య సుఖాలను పొందే అర్హత ఉన్న ఈమె ఈ రాక్షసుల మధ్య అష్టకష్టాలు పడడం చూచి నా మనస్సు బాధకు గురి అవుతోంది. ఎప్పుడు ఈ పద్మపత్రనేత్రి రామలక్ష్మణుల రక్షణలోనే ఉండేది. నేడు ఈ చెట్టు కింద భయంకరరాకారుల మధ్య నలిగిపోతోంది.

శ్రీరాముడు దూరం అవడంతో మంచువలన దెబ్బతినిన పద్మలతలాగా శోభావిహీనం అయ్యింది. తోడులేని ఆడు చక్రవాకంలాగా శోకార్తికి గురి అవుతోంది.

పూలభారంతో వంగిన అశోకాలు, వసంతునితో కూడిన చంద్ర కిరణాలు సీతాదేవి విరహతాపాన్ని పెంచు తున్నట్లున్నాయి.

ఇన్నిచూసిన కపివరేణ్యుడు వానర ప్రముఖుడు ఆ దీన వనితనే సీతగా గుర్తించాడు. రాముని కార్యం చేశానని ఆనందం, దుఃఖంలో మునిగిపోయిందే సీత అన్న ఆవేదన రెండూ ఆంజనేయునిలో ఒకసారి ఆవిర్భవించాయి.

సీతను చూశానుగదా! అనుకొన్న మారుతి ఆ శింశుపావృక్షం మీదే కూర్చుండిపోయాడు. అలౌకికానందానికి గురైన మారుతి ఇహాన్ని మరిచి సంతోషంలో మునిగిపోయాడు. 'పోనీలే అమ్మా ఈ దుఃఖాన్ని ఇక మరిచిపో! నీకు మంచిరోజులు వచ్చాయి. శ్రీరాముడు వచ్చి అమరసుఖాలను అందిస్తాడు ' అంటూ తనలోనే సీతమ్మకు ఊరటనిస్తున్నానుఅనుకొంటూ తనలో తాను మాట్లాడుకొంటున్నాడు.

* * *

# హనుమంతుని ఆనందం

## సర్గ – 17

**మం**చిమనసుతో ఉన్న చంద్రుడు ధవళకాంతులను వెదజల్లుతూ ఆంజనేయునికి సహాయం చేస్తూ ఉన్నాడు. నెమ్మదిగా చంద్రుడు నీలంగా ఉన్నజలంలోకి హంస చేరినట్లు వినీలాకాశంలో పశ్చిమంలోకి చేరాడు. శోకభారంతో కుంగిపోతున్న పూర్ణచంద్రుని పోలిన సీతాదేవిని ఆంజనేయుడు స్పష్టంగా చూశాడు.

వృక్షం మొదటగా కూర్చుని ఉన్న సీతాదేవి చుట్టూ రాక్షస స్త్రీలు కూర్చుని ఉన్నారు. వారందరూ భయంకరాకారంతో భీతి కొలుపుతున్నారు.

వారందరిని ఒకసారి మారుతి చూశాడు. ఆ రాక్షస వనితలలో ఒక్క కన్ను, ఒక్క చెవి, ఒక్క ముక్కు ఉన్నవాళ్ళు, గొడుగులాంటి చెవులున్నవారు, తలదాకా వ్యాపించిన ముక్కున్నవాళ్ళు, దేహాన్ని మించిన తల ఉన్నవాళ్ళు, జుట్టులేని వాళ్ళు, చింపిరి జుట్టువాళ్ళు, పొగ రంగు కేశాలున్నవారు, వేలాడే చెవులున్నవాళ్ళు ఉన్నారు.

పెద్దపెదవులున్నవారు, పొడవైన కంఠం ఉన్నవారు, బానపొట్ట స్త్రీలు, జారిన స్తనభారం కలవారు, కంఠం దాకా పొట్ట ఉన్నవారు, ఒంటి చేయివారు, ఒంటికాలున్నవాళ్ళు, వంకర మూతిఉన్నది, పచ్చని కళ్ళున్నది వంకర టింకర అవయావాలున్న రాక్షస స్త్రీలు ఉన్నారు.

పంది, లేడి, గుర్రం, పెద్దపులి, గేదె, మేక, నక్క ఇలాంటి జంతువుల ముఖం ఉన్న రాక్షసులున్నారు. వికృతరూపులు ఐన రాక్షస స్త్రీల నడుమ సీత దీనంగా కూర్చుని ఉంది.

ఆ రాక్షస స్త్రీలందరూ మద్యపానాసక్తులు మాంసం తినేవారు. వారు తినడంలో శుభ్రత పాటించకపోవడంతో వారి శరీరం నిండా రక్తపుమరకలు, సురాపానంతో తడిసిన శరీరాలు చూడటానికి అసహ్యకరంగా ఉన్నారు. పెద్ద నోర్లు, కోరలు, కొమ్ములున్న రాక్షస స్త్రీలు కంపరం కలిగిస్తున్నారు.

ఆ రాక్షసులమధ్య పూజనీయురాలు జనకరాజసుతవైదేహి కూర్చుని ఉంది. ఆ జానకీమాతను గుర్తించి హనుమంతుడు పరమానందభరితుడయ్యాడు. శోకంలో మునిగి ఉండడం వలన ఆమె మేని వన్నె తరిగిపోయి ఉంది. అయినా చక్కనమ్మ చిక్కినా అందమే అన్నట్లుగా ఆ సీతాదేవి శరీరం కాంతి బూడిద కప్పిన అగ్నిలాగా కనిపించింది.

ఆమె పుణ్యం క్షీణించి రాలిన నక్షత్రంలాగా కనిపించింది. భర్తదర్శనభాగ్యం లేక చింతతో కూడి ఉంది. ఆభరణాలు ఏవీ ధరింపలేదు. సింహం చేత తరుమబడుతూ ఏనుగుల మధ్యనుండి విడివడి ఒంటరియైన ఆడ ఏనుగులాగా ఆమె కనిపించింది.

శ్రుతిచేయని వీణలాగా, శరత్కాలంలోని చంద్రరేఖలాగా ఆమె దీనంగా ఉంది. శ్రీరాముని తలచడం చేత రాక్షస స్త్రీల మాటలు ఆమెకు వినపడడంలేదు. గ్రహాలతో చుట్టబడిన రోహిణిలాగా సీత దుఃఖార్తికి లోనై ఉంది.

ఆమె శరీరం మాలిన్యంతో మసిబారి ఉంది. నలిగిన వస్త్రాలు కట్టుకొని బిత్తర చూపులు చూస్తూ కూర్చుని ఉంది. ఆమె మనోధైర్యమే ఆమెను రక్షిస్తోంది. శీకముల రాశిలాగా ఎగిసిపడ్తున్న తరంగంలాగా ఆమె దుఃఖిస్తూ ఉంది.

చక్కని అవయవ సౌష్ఠవంతో ఏ అలంకారాదులు లేకుండానే సీతమ్మ అందంగా ఉంది. అటువంటి జానకీ మాతను చూసి ఆంజనేయుడు ఆనందించాడు. ఆయన కళ్ళనిండా ఆనందాశ్రువులు నిండాయి. ఇన్నాళ్ళకు నా శ్రీరాముని భార్య కనిపించింది. ఇక నా శ్రీరాముడు దుఃఖాన్ని దూరం చేసుకొంటాడు. నా శ్రీరాముడు సీతను పొందుతాడు అనే ఆనందం హనుమంతునిలో నిండింది. దాంతో ఆయన కళ్ళు ఆనందభాష్పాలను జలజలా రాల్చసాగాయి.

* * *

# రావణుని ప్రవేశం

## సర్గ – 18

ఆంజనేయుడు రాత్రంతా అన్వేషణ సాగించాడు. చివరకు ఉదయం కాబోతుండగా శింశుపా వృక్షంపైనుంచి సీతను చూశాడు. ఆనందించాడు, దుఃఖార్తికి లోనైన సీతను చూచి తాను శోకమగ్నుడయ్యాడు. చివరకు ఇక కష్టాలు తొలగి సీతారాములు ఏకమవుతారులే అని ఆనందించాడు.

అంతలో తూర్పు తలుపు తెరచుకొని భానుడు తొంగిచూశాడు. రావణుని లంకలో వేదవేదాంగాలు చదివిన నిష్ణాతులు బ్రహ్మ రాక్షసులు వేదాన్ని వల్లె వేస్తుండడంతో వేద ఘోష సముద్ర ఘోషలాగా వినబడుతోంది.

చతుర్వాద్య ధ్వనులతోమంగళ వచనాలు పలుకుతూ దీర్ఘబాహువు దశకంఠుడైన రావణుని అతని అనుచరులు మేల్కొలిపారు. రావణుడు నిద్రనుండి మేల్కొన్నాడు. చెదిరిన ఆభరణాలన్నీ సరి చేసుకొన్నాడు. జారుతున్న వస్త్రాన్ని సరిచేసుకొన్నాడు. ఎప్పుడు స్మృతిపథంలో ఉన్న సీతను తలచుకొన్నాడు. కామపరవశుడయ్యాడు.

రావణుడు సర్వాభరణ భూషితుడయ్యాడు. అశోకవనిలో ప్రవేశించాడు. పక్షుల కూహూనాదాలు, క్రీడా మృగాల ధ్వనులు ఆహారాన్వేషణకు వెళ్ళే పక్షుల కిచకిచలు, పొద్దున్నే ఉదయ భానుడి నులి వెచ్చని స్పర్శతో

విప్పారే పుష్పాలు, కళ్ళు తెరుచుకోబోతున్న చిరుమొగ్గలు, ఒళ్ళు విరుచుకొంటున్న మృగాలు అన్నీ కలిసి అశోక వనం చిత్ర విచిత్రంగాంది.

అప్పుడే రాలిన పుష్పాలు, పండ్లు వసుధనంతా నింపి ఉన్నాయి. దేవకన్యలు, గంధర్వ కాంతలు దేవేంద్రుని అనుసరించినట్లు పులస్త్య వంశుజుడైన రావణ బ్రహ్మతో వందలకొలది అంగనలు వచ్చారు. వారిలో కొందరు వింజామరలతో వీస్తున్నారు. పూర్ణకుంభాలతో కొందరు ముందు నడుస్తున్నారు. మరికొందరు రావణుని పక్కన, వెనుక నడుస్తూ కరదీపికలు, ఖడ్గాలు పట్టుకొని ఉన్నారు.

శ్వేతచ్ఛత్రాన్ని పట్టుకొని ఒక తరుణి రావణునితో నడుస్తూ వస్తోంది. నిద్ర మత్తు వదలకపోవడంతో వారి కన్నులు అప్పుడప్పుడూ మత్తుగా మూసుకుపోతున్నాయి. అయినా కన్నులు బలవంతంగా తెరుచుకొంటూ తమ పతిని అనుసరించి వస్తున్నారు.

వారి ముఖాలు నిద్రలో ముకుళించే ఉన్నాయి. వారి మెడలో మణిమయహారాలు, కేయూరాలు అటు ఇటు పడి ఉన్నాయి. మైపూతలు చెదిరిపోయాయి. కొప్పులు జారిపోయాయి. అలంకరణగా పెట్టుకొన్న పూలమాలలు వాడిపోయి జారిపోయి ఉన్నాయి. ఆ స్త్రీలందరూ రావణునిపై ఉన్న ప్రేమతో నడుస్తూ వస్తున్నారు. వారు నడుస్తున్నప్పుడు ఒడ్డాణపు సవ్వడి, అందెల రవళి వినిపిస్తోంది.

మహాపరాక్రమశాలైన రావణుడు అశోకవనద్వారం దగ్గరకు రాగానే వానరోత్తముడైన ఆంజనేయుడు చూశాడు. కరదీపికల వలన ఆ ప్రదేశమంతా వెలుగులు నింపుకొంది. రావణుని అంతఃపురం కదలివచ్చిందా అన్నట్టుగా రావణుని పరివేష్టించి చాలామంది అంగనలు వచ్చారు. రావణునిలో కామం, గర్వం, మదం పెరిగి ఉన్నాయి. గర్వంగా అడుగులు వేస్తూ వస్తున్నాడు. అతని కళ్ళు ఎర్రబారి ఉన్నాయి.

నవ మన్మథుడులా ఉన్న రావణుని ఉత్తరీయం జారి కేయూరంలో చిక్కుకొంది. దాన్ని విలాసంగా లాక్కొంటూ రావణుడు సీత దగ్గరకు రావడం ఆకులలో దాగిన ఆంజనేయుడు చూసి దట్టమైన పత్ర పుష్పాలలో అణిగి ఒదిగి రావణుణ్ణే చూస్తున్నాడు.

తారలచే పరివృతుడైన చంద్రునిలాగా, రావణుడు నారీజనంతో నిండి ప్రమదవనానికి వచ్చాడు. లంకాపురంలోని అంతఃపురంలో శయనాగారంలో నిద్రించి ఉన్నప్పుడు ఇతడిని చూశాను. అతడే ఇతడు రావణుడు దశకంతుడు దుష్టుడు ఇతడే అని ఆంజనేయుడు నిశ్చయించుకొన్నాడు. మా సీతమ్మ తల్లిని బంధించి తీసుకువచ్చినవాడు దుర్మార్గుడు వీడే. ఈ రావణుడు సీతమ్మ దగ్గరికి ఎందుకు వస్తున్నాడో? ఇపుడు ఆ తల్లికి కష్ట కాలం. భగవంతుడా ఆ తల్లిని రక్షించు అంటూ మారుతి ప్రార్థించాడు. ఏం చేస్తాడోననుకొంటూ మారుతి మరికాస్త కిందకు దిగి వచ్చి ఆకుల వెనుక నక్కాడు.

నల్లని కురులతో పూర్ణచంద్రునిలాంటి ముఖం ఉన్న సుందరమైన భామామణి సీతాదేవిని చూడాలని రావణుడు ఆమెకు దగ్గరగా వస్తున్నాడు. అంగనలు దశకంఠుని అనుసరిస్తున్నారు.

* * *

# రావణుడు సీతను చూడటం

## సర్గ - 19

రూప యౌవనుడైన రాక్షస ప్రభువు వచ్చినట్లు తెలుసుకోగానే జనకరాజసుత పెనుగాలికి అరటి చెట్టు కంపించినట్లుగా కంపించింది. విశాల నేత్రాలున్న ఆ సీతామాత రావణుని దగ్గరకు రాగానే ముడుచుకొని కూర్చుంది. చుక్కాని లేని నావ సముద్రంలో కొట్టుమిట్టాడుతున్నట్లుగా ఉన్న సీతను రావణుడు చూశాడు.

శరీరం ధూళితో మలినమై ఉన్నా సీత మేనిచ్ఛాయ ప్రకాశిస్తునే ఉంది. ఆభరణాలు ధరించకపోయినా ధరించిన సౌందర్యంతో ఉన్నట్లుగానే ఉంది. బురద అంటుకొన్న పద్మంలాగా సీతాదేవి తన సహజ సౌందర్యాన్ని వీడలేదు. శ్రీరాముణ్ణే తలుస్తూ దుఃఖానికి అంతులేనట్లుగా సీతాదేవి రోదిస్తోంది. సీత తన పూర్వజన్మల ఫలంగా జనకసుత ఐంది. తన పుణ్య విశేషం చేత దశరథుని ఇంటి కోడలైంది. ఏ పాపంవలన ఇప్పుడు ఇక్కట్లకు లోనయ్యిందో, అనుకొన్నాడు ఆంజనేయుడు. సన్నగిల్లిన మహాకీర్తిలాగా, ఆసక్తి సన్నగిల్లిన శ్రద్ధలాగా, పూజాద్రవ్యాల్లేని పూజలాగా, నిష్ఫలమైన ఆశలాగా సీతాదేవి దీన స్థితిలో ఉంది. ఆమె స్థితి తరిగిన ఆదాయంలాగా, ఆచరణలేని ఆదేశంలాగా ఉంది. మసకబారిన దీపంలాగా ఎండిపోయిన నదిలాగా యుద్ధంలో అందరినీ కోల్పోయి మిగిలిన సేనలాగా సీత దీనస్థితిలో ఉంది. సమిధలు లేని యజ్ఞవేదికలాగా, చల్లారిన అగ్నిశిఖలాగా, రాహుగ్రస్త చంద్రునిలాగా ఆమె నిస్తేజంగా ఉంది.

ఏనుగు తన ఉక్రోషంతో సరస్సులోని పద్మాలన్నీ పెరికివేయగా శోభావిహీనమైన సరస్సులాగా ఉంది. కృష్ణపక్షంలోని చీకటిలాగా, ఎండకు కమిలిపోయిన కమలంలాగా ఉపవాసాది వ్రతాదులతో కుంగి తపస్సు చేసుకొంటున్న తాపసిలాగా సీత కూర్చుని ఉంది. శ్రీరాముడు దుష్టరావణుణ్ణి పరాభవించాలని సీత కులదేవతలను ప్రార్థిస్తున్నట్లుగా ఆంజనేయునికి అనిపించింది.

సీత తన అందమైన కంటి కొసలతో తనను రక్షించేందుకు శ్రీరాముడు వచ్చాడేమోనని నలుదెసలా వెదుకుతూ చూస్తోంది. అలాంటి సీతామాతను రావణుడు చూశాడు. ఆమెను తన వైపుకు తిప్పుకోవాలని ప్రలోభపెట్టడానికి చూస్తున్నాడు. ఏమి చెప్పితే తనగురించి మంచి అనుకొంటుందో అని అద్దానికోసం చూస్తున్నాడు. ఆహా ఏమీ సౌందర్యం? నరకాంత లాగా లేదు. ఏ గంధర్వకాంతలాగానో, లేక బ్రహ్మ కావాలని కూర్చిన అపురూప సౌందర్యరాశి లాగానో ఉంది. ఈమెను పొందిన ఆ శ్రీరాముడు అదృష్టవంతుడు. నేను ఈమెను ఎలా అయినా నా గురించి ఆలోచించేలా చేయగలగాలి. అలా ఈ సీతను సమ్మోహనపర్చాలి. నా రూపగుణవిశేషాలకు ఈ జానకి మోదమందాలి. నా పౌరుషాన్ని చూచి వైదేహి ఆశ్చర్యపడాలి. అలా ఎవరూ చేయలేనటువంటి కార్యాలను నేను అతిసునాయాసంగా చేసినవాటిని గురించి చెప్పాలి. అపుడు ఈ అసమాన సౌందర్యవతి నన్ను మంచివానిగా అనుకొంటుంది. శ్రీరామునికన్నా నేను మహాపరాక్రమవంతుడన్న మాట వినగానే సీత మనసు నాపై మళ్ళుతుంది. అనుకొన్నాడు. మృదుమధురమైన సంభాషణను చేయాలి అనుకొన్న రావణుడు సీతను చిరునవ్వుతో చూశాడు.

* * *

# రావణుని పొగడ్తలు

## సర్గ - 20

దీనంగా తపోనిష్ఠలో ఉన్నట్లున్న సీతను రావణుడు చూశాడు. తన చేతిని తిప్పుతూ మధురవచనంతో మనోభావాన్ని చెప్పడం ప్రారంభించాడు.

" ఓ సుందరీ! సీతా! నీవు ఎందుకు నీ చేతులతో వక్షస్థలాన్ని కప్పుతూ ముఖాన్ని చాటుచేసుకుంటున్నావు? ఓ సర్వాంగ సుందరీ! సద్గుణ సంపన్నురాలా! నేను నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. ఓ సీతా! నా వలన నీకు ఏ బాధ కలుగదు. ఇక్కడ కామరూపులైన రాక్షసులు లేరు. ఓ చిన్నదానా!బలవంతంగా పరస్త్రీలను అపహరించి పెళ్ళిచేసుకోవడం మా రాక్షసుల స్వధర్మమే అందులో సందేహం లేదు.

ఓ వైదేహీ!నీపై నాకు ఎంత మోహం ఉన్నా సరే నీవు నన్ను కోరుకోవడంలేదు కదా! అందుకే నేను నిన్ను స్పృశించను. నీవు నన్ను నమ్ము. నాపై ప్రేమ పెంచుకో. నీవు అంగీకరించేదాకా నేను ఎదురుచూస్తుంటాను. అందువలన నీవు భయపడాల్సిన అవసరం లేదు.

ఓ మైథిలీ! నీవు నన్ను కోరుకొంటే చాలు పూమాలలు, చందనాలు, మేలిమి వస్త్రాలు, దివ్యాభరణాలు, శ్రేష్ఠమైన పానీయాలు, తల్పాలు, ఆసనాలు నీవు ఏది కోరినా క్షణాల్లో నీ ముందు ఉంచుతాను.

ఓ పద్మపత్రనేత్రీ! నీవు స్త్రీలోకానికి రత్నానివి. అటువంటి నీవు ఇలా దీనంగా ఉండడం బాగాలేదు. నీవు నా దగ్గర ఉండి కూడా ఇలా ఉండడం ఎందుకు? నీవు సర్వాభరణాలను పెట్టుకొని ఆనందించు. నీవు నన్ను పొందితే సకలభోగభాగ్యాలకు అర్హురాలవు అవుతావు.

నీ యౌవనం తరిగిపోతోంది. కాలం అతివేగంగా పరుగెత్తుతోంది. నీవు కాలాన్ని వృధా చేస్తున్నావు. నీవు బాధపడుతూ నన్ను బాధలకు గురిచేస్తున్నావు. ఓ సుందరీ! బ్రహ్మ నిన్ను సృష్టించిన తర్వాత సృష్టికార్యాన్ని నిలిపివేసినట్లు ఉంది. నీకు సాటివచ్చే సౌందర్యవతి నాకు ఏ లోకంలో కూడా కనిపించలేదు.

ఓ చంద్రబింబాననా! నీలో ప్రతి అవయవం అందంతో నన్ను చూపు తిప్పుకోనీయడంలేదు. నీవు నన్ను శత్రువుగా చూడకు. నేను అన్ని దిశలనుండి ఎందరినో నారీమణులను తీసుకొచ్చాను. కాని నీవు నన్ను అంగీకరిస్తే వారికందరికీ ఇవ్వని స్థానాన్ని నీకు నేను ఇస్తాను. నా పట్టపురాణిని చేస్తాను.

ఓ భయపడు స్వభావం కలదానా! నేను సకలలోకాలను జయించాను. అక్కడ ఉండే అద్భుతాలను ప్రత్యేక సంపదలను తీసుకొచ్చాను. అవన్నీ నీ పరం చేస్తాను. నాపై కాస్త కనికరం చూపు. నా రాజ్యం అంతా నీకు ధారపోస్తాను. అంతెందుకు, నేనే నీ వాణ్ణి అవుతాను కదా! నన్ను నీ ఇష్టం వచ్చినట్లుగా చేయి.

" ఓ శుభాంగీ! ఈ సమస్తభూమండలాన్ని జయించి నీ తండ్రి ఐన జనకునికి ఇచ్చివేస్తాను. ఈ లోకంలో నన్ను ఎదిరించే వీరుడు ఎవ్వరూ లేరు. ఇకపై పుట్టబోడు. నా పరాక్రమాన్ని గురించి నీవు తెలుసుకో. నీవు నా దానివైతే నీకు భయమనేదే ఉండదు.

యుద్ధభూమిలో నేను ఎన్నోసార్లు సురాసురలను ఓడించాను. ఇకపై నన్ను వారు ఎదిరించాలని కలలో కూడా తలచరు. నాకు అనుకూలవతివై సర్వసౌభాగ్యాలకు రాణివి కా. నీ ఇష్టప్రకారం ఈ భూమిని ఎవరికైనా పంచివ్వు.

ఓ కల్యాణీ! నీవు నన్ను సేవకునిగా భావించు. నిస్సంకోచంగా నన్ను ఆజ్ఞాపింపు. నన్ను నీవు అనుగ్రహిస్తే చాలు, నీ బంధువులందరూ సంతోషంగా జీవిస్తారు. ఓ సుందరాంగీ! ఇటు తిరుగు. నా ఐశ్వర్యాన్ని ఒక్కసారి చూడు. ఆ నారవస్త్రాలు ధరించి అడవులలో తిరిగే రాముడు నీకు ఏమి ఇస్తాడు? ఎలా సుఖపెడ్తాడు? ఆ రామునిపై మోహాన్ని వీడు.

నీవు నన్ను కూడి ఉంటే ఆ రాముడు నిన్ను పొందలేడు. కనీసం కన్ను ఎత్తి ఐనా నిన్ను చూడలేడు. హిరణ్యకశిపుడు ఇంద్రుడు అపహరించిన లీలావతిని తిరిగి తెచ్చుకొన్నాడు. కాని నా వశం ఐన నిన్ను రాముడు ఏనాటికీ పొందలేడు.

అందమైన చిరునవ్వు, చక్కని పలువరుస విశాల నేత్రాలున్న ఓ చిన్నదానా! గరుత్మంతుడు సర్పాన్ని హరించినట్లు నీవు నా మనస్సును హరించి వేస్తున్నావు. ఓ సీతా! నీవు మలిన వస్త్రాలనే కట్టుకొని ఏ ఆభరణాదులు అలంకారాలు లేకుండా ఉన్నావు. కాని నిన్ను చూచిన క్షణం నుండి నా సతులపై నాకు మనస్సు పోలేదు. జానకీ! నీవు నన్ను కోరుకొన్నట్లు అయితే నా అంతఃపురంలో వేలకొలదిగా నారీజనం ఉన్నారు. వారందరికీ నిన్ను అధికారిణిని చేస్తాను.

ఆ తరుణులందరూ నీకు సేవలు చేసేలాగా చేస్తాను. నేను కుబేరుని జయించి తీసుకొచ్చిన సంపదలను, ధనరాశులను రత్నాలను అన్నింటిని నీకు ఇస్తాను.

ఓ దేవదేవీ! నా తపస్సు, పరాక్రమాలు, సంపదలు, తేజస్సు, కీర్తిప్రతిష్టలు వీటన్నింటిలో నీ రాముడు నాకు సాటిరాడు. నాపై ప్రేమ చూపి ఇవన్నీ నీ పరం చేసుకొని ఆనందించు. మేలిమి బంగారు ఆభరణాలు ధరించి నీ సహజసౌందర్యానికి మెరుగులుదిద్దుకొని ఈ సముద్రతీరంలో ఈ వనంలో నాతో గూడి ఆనందించు." అని ఎన్నో రీతులుగా రావణుడు సీతాదేవిని ప్రలోభపరిచాడు.

ఎన్నో విధాలుగా తన ఆధిక్యతను రావణుడు సీతతో చెప్తున్నాడు. తన దగ్గర ఉంటే జానకికి ఏ భయమూ ఉండదని అభయం ఇస్తున్నాడు. తనమాటలను సీత వింటోందా? తనను నమ్ముతోందా అని రావణుడు ఆమెను నిశితంగా చూస్తున్నాడు.

* * *

# సీత హితవు

## సర్గ - 21

రావణుని మాటలన్నీ సీతాదేవి విన్నది. నెమ్మదిగా ప్రత్యుత్తరం ఇవ్వాలనుకొంది. అయినా ఆ దుష్టునితో మాట్లాడాలనిపించక చేత్తో ఒక గడ్డిపరకను పట్టుకొంది."ఓ రావణా! నీకు ఈ గడ్డిపరకకు భేదం లేదు అని చెప్పినట్లుగా చేసింది.

ఓ రావణా! నాపై ఉన్న నీ మనస్సును మరల్చు. నీవు నీ సతులను ప్రేమించు. నేను ఉత్తమకులంలో పుట్టి వీరుని చేపట్టినాను. ఏకపత్నీవ్రతుడైన నా శ్రీరాముని భార్యను. నీవు చెప్పే అకృత్యం నేను చేయలేను. వేరొకరికి భార్యను ఐన నన్ను నీవు కోరుకోవడం అసహజంగా ఉంది.

ఓ నిశాచరా! సత్పురుషులవిధానం చూడు. నీ భార్యల్లాగానే ఇతరుల సతులు రక్షించవలసినవారని తెలుసుకో. నీవు నీ భార్యలతో క్రీడించడం మేలు. స్వభార్యలతో సంతృప్తిచెందక చపలస్వభావంతో ఇంద్రియ నిగ్రహం లేకుండా పరవనితలను కాంక్షిస్తే అధోగతిపాలుగాక తప్పదు.

నీ లంకాపట్టణంలో బుద్ధిమంతులు ఎవరూ లేరా? ఉన్నవారి మాటను నీవు పట్టించుకొనడం లేదా? నీవు సదాచారాన్ని కాలరాస్తున్నావు. దుర్మతివై పరదారాసక్తిని పెంచుకొంటున్నావు. నీకు నీవు పతనాన్ని ఆహ్వానిస్తున్నావు. వక్రమార్గంలో నడిచే నీకు హితం చెప్పితే చెవికెక్కడం లేదు.

అవినీతిపరులు జితేంద్రియులు కానివారు రాజ్యపాలనా అర్హతను కోల్పోతారు. వారు ఎంతటి చక్రవర్తులు ఐనా సరే దురాచారం దుష్ప్రవర్తనతో సర్వసంపదలు పోగొట్టుకొంటారు. సకలైకసంపన్న ఐన ఈ లంకానగరం నీవలనే సర్వనాశనం అవుతుంది. ఓ రావణా! దూరదృష్టి లేకుండా పాపాలు చేసినవారు ఆ కర్మఫలితాన్ని త్వరగా అనుభవిస్తారు. అప్పుడు వారి చేత బాధలు అనుభవించినవారు తగిన శాస్తి అయిందని అంటారు.

ఈ దుష్టునికి ఈ దురవస్థ కలగాల్సిందే అని పరమానందిస్తారు. సూర్యుని నుండి కాంతి దూరం కానట్లుగా నేను శ్రీరాముని నుండి దూరం కాను. నన్ను ఎవరూ శ్రీరాముని నుండి వేరు చేయలేరు. నేను ఏ ధనాశకు ఐశ్వర్యానికి లొంగేదానిని కాను.

నిన్నటిదాకా శ్రీరాముని భుజాన్ని తలగడ చేసుకొన్నదాన్ని. నేడు నీ చెంతకు ఎలా వస్తాను? నేను అయోధ్యాపతి ఐన శ్రీరామునికే తగినదాన్ని. ఓ రావణా! నీ మంచి బుద్ధితో నన్ను నా శ్రీరాముని దగ్గరకు చేర్చు. అది నీకు నీ వంశానికి కీర్తి తెస్తుంది.

నీవు దుర్మరణం కాకుండా ఉండేందుకు నీ రాజ్యాధికారం పోగొట్టుకోకుండా ఉండడానికి నిన్ను ఆశ్రయించిన వనితలను నీవు కాపాడుకోవడానికి ఒక్కటే మార్గం ఉంది. నీవు చేసిన పనులలో తప్పుదిద్దుకొని నన్ను రాముని దగ్గరకు పంపించు.

నీవు ఇంద్రియాలను జయించి ముల్లోకాలను ఎదురించే శక్తి ఉన్న శ్రీరాముని ఆశ్రయించు. నీకు మేలు కలుగుతుంది. లేకపోతే నీకు కీడే జరుగుతుంది. ఇది మాత్రం తథ్యం.

రావణా! అత్యాశకుపోయి లేనిపోని కష్టాలను కొనితెచ్చుకోకు. నివురు గప్పిన నిప్పు కూడా కాలినట్లుగా సహజపౌరుషవంతుడైన రాముడు తన భార్యను అపహరించినవాణ్ణి ఊరికినే వదలడు. అందుకే ఓ రావణా! ఇప్పటికైనా నీ స్వభావాన్ని మార్చుకో " అని సీత చెప్తుతోంది." రాక్షసరాజా! యమపాశాన్నైనా నిరోధించవచ్చు ఏమో కాని శ్రీరాముడు ఆగ్రహిస్తే నీవు కాదు ఎవరూ ఆయన ముందు నిలవలేరు. ఇంద్రుని వజ్రాయుధం లాంటి శ్రీరాముని ధనుష్టంకారధ్వని త్వరలోనే నీకు వినపడుతుంది.

రామలక్ష్మణుల బాణాలు నిన్నూ, నీ లంకనూ సర్వనాశనం చేస్తాయి. ఆ బాణాలన్నీ నీ లంకనంతా కప్పివేస్తాయి. వైనతేయుడు నాగులను నాశనం చేసినట్లుగా శ్రీరాముడు రాక్షసులను తుదముట్టిస్తాడు.

శ్రీ మహావిష్ణువు వామనావతారుడై బలిఐశ్వర్యాలను హరించినట్లుగా నా రాముడు నిన్ను సంహరించి నన్ను తీసుకొనిపోతాడు. ఓ రావణా! జనస్థానంలోని రాక్షసులందరిని చంపివేసిన సంగతి నీకు తెలియదా? నీలాగే విర్రవీగిన ఖరదూషణాదులను నాభర్త రాముడే యమపురికి పంపివేశాడు.

రామలక్ష్మణులు లేనప్పుడు నీవు నన్ను మారువేషానవచ్చి అపహరించావు. అప్పుడే నీ పరాక్రమం తెలిసింది గదా! పెద్ద పులుల దగ్గర కుక్కలు ఉండలేనట్లుగా నీవు శ్రీరాముని ఎదుట నిలవలేవు.

రామచంద్రులతో నీకు యుద్ధమే అనివార్యం ఐతే నీవు శ్రీరాముని జయించుట అసంభవం. ఎంతటి మహావృక్షమైనా పిడుగుపాటునుంచి తప్పించుకోలేనట్లు నీవు ఎవరిని ఆశ్రయించినా శ్రీరాముని నుండి తప్పించుకోలేవు. ఇది మాత్రం ముమ్మాటికీ నిజం. తనలో పడిన వస్తువును బయటపారేసినట్లుగా శ్రీరాముడు అధర్మపరులను ఏరిపారేస్తాడు. ఈనాటికీ మించినది ఏదీలేదు. ఇప్పటికైనా తప్పుచేయడం మాని ఒప్పు ఏదో తెలుసుకుని దాన్ని ఆచరించు. నన్ను శ్రీరాముని పరం చేసి తెలియక తప్పుచేశానని క్షమించుమని వేడుకో! నిన్ను ఆ శ్రీరామచంద్రమూర్తి కాపాడుతాడు. మంచివారు చెప్పేమాటలను విను. ధర్మాచరణే ముక్తి కల్గిస్తుంది. అధర్మం ఏనాటికైనా నీకు కీడునే తెస్తుంది." అని సీత రావణునితో చెప్పింది.

* * *

# రావణుడు - గడువు

## సర్గ - 22

**సీ**తాదేవి చెప్పిన మాటలు రావణునిలో ఆగ్రహాన్ని తెప్పించాయి. వెంటనే కఠోరమైన మాటలు చెప్పాడు.

" స్త్రీలను బుజ్జగించినకొలదీ వారు పురుషులను తిరస్కరిస్తూనే ఉంటారు. పురుషులు స్త్రీలను అనుకూలంగా మార్చుకోవడానికి వారితో ప్రియంగా మాట్లాడితే వారు పరుషంగా వ్యతిరేకిస్తారు. ఓ సీతా! నీ పలుకులు నాలో పట్టరాని కోపాన్ని తెప్పిస్తున్నాయి. కానీ నీపై వలపువల్ల నేను నిన్ను ఏమీ అనలేకుండా ఉన్నాను.

ఇష్టమైన వారిపై ఉన్న వ్యామోహం వారిపై ఆగ్రహాన్ని కలిగించదు. వారిమీద జాలి ఎక్కువ అవుతూ ఉంటుంది. ఓ సుదతీ! నీ పలుకులవలన నిన్ను నేను దండనకు గురి చేయగలను కానీ ఇలా మాట్లాడే నీపై నాకు దయ కలుగుతోంది.

ఓ సుందరాంగీ! నేను నీకు పన్నెండు మాసాల గడువు ఇచ్చి ఉన్నాను. అందులో ఇంకా రెండు మాసాల అవధి ఉంది. నేను ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండేవాణ్ణి. ఆ తరువాత ఒక్క క్షణం కూడా నేను ఆగను. నీవు నాపై ప్రేమనన్నా పెంచుకొని నన్ను భర్తగా అంగీకరించు. లేకపోతే నా ప్రాతఃకాలభోజనానికి నిన్ను భోజ్యపదార్థంగా తయారుచేయవలసి ఉంటుంది."

ఈ మాటలు విని అక్కడున్న దేవగంధర్వకన్యలు బిత్తరచూపులు చూశారు. వారందరూ సీతను చూస్తూ వారిని రావణుని గమనింపనప్పుడు సీతతో సైగలు చేశారు. కొందరు పెదవులు విరిచి, కనుబొమ్మలు ముడిచి, ముఖసంజ్ఞలతో చూపులతో సైగలు చేసి ఆమెను ఓదార్చారు.

సీత వారందరివల్ల ఊరట చెంది, "ఓ రావణా! నీ మేలు కోరేవాడు, నిన్ను ఈ దుష్కార్యం నుండి తప్పించేవాడు ఎవరూ లేరిక్కడ? దేవేంద్రునికి శచీదేవీలాగా శ్రీరామునకు నేను ధర్మపత్నిని. అట్టి నన్ను ఎవరూ మనసున కూడా ఆశపడరు. నీవు ఒక్కనివే దుర్మార్గానికి ఒడిగట్టావు. కాన నీవే నీ మృత్యువును ఆహ్వానిస్తున్నావు.

రాక్షసాధమా! శ్రీరామునినుండి తప్పించుకొని నీవు ఎక్కడికీ పోజాలవు. రాముడు ఏనుగు వంటివాడు. ఆయన ముందు నీవు చెవుల పిల్లివి. ఆనాడు కూడా ఆ ఇనకులవంశజుని జంకే గదా! వారు లేనప్పుడు నన్ను తీసుకొచ్చావు. నీకే ధైర్యం ఉంటే మాయామృగం నెపంతో వారిని ఎందుకు దూరంగా పంపేవాడివి? ఇప్పుడు రాముడు లేకుండా చూసి నీవు ప్రగల్భాలు పలుకుతున్నావు.

ఓ దుష్టుడా! నీవు నన్ను నీ కన్నులతో చూస్తున్నావు. నీ పాపపు కన్నులు ఏల రాలిపోకున్నవి? నేను శ్రీరాముని ప్రియపత్నిని. నా గురించి నీవు మాట్లాడుతుండగా నీ నాలుక చీరిపోవడం లేదే? ఓ రావణా! నేను నిన్ను నా మనోబలం చేత భస్మం చేయగలను. కాని రామాజ్ఞ లేదని నిన్ను ఉపేక్షిస్తున్నాను. కావున నీవు బ్రతికిపోయావు.

నీవు నన్ను అపహరించావు అంటే నీ చావు దగ్గర కొచ్చిందని నీవు తెలుసుకోలేకుండా ఉన్నావు." ఇలా మాట్లాడే సీతాదేవి వంక రావణుడు కోపంగా చూశాడు. నల్లనిమేఘంవంటి రావణుడు సింహబలం ఉన్నవాడు కోపంతో ఊగిపోయాడు. అప్పుడు ఆయన పెట్టుకొన్న కిరీటం కదలలాడింది. ఆయన ధరించిన నగలు అటు ఇటు చెదిరాయి.

అమృతం కోసం సముద్రమథనం చేసేటప్పుడు వాసుకితో చుట్టబడిన మందరపర్వతంలాగా రావణుడు కనిపించాడు. కోపంతో ఊగిపోతూ "ఓ సీతా! రాముడు నీతిమాలినవాడు, ధర్మధనహీనుడు అట్టివానిని నేను క్షణకాలంలో మట్టి కరిపించగలను " అని చెప్పాడు. ఇంకా కోపం తగ్గక అక్కడున్న రాక్షసస్త్రీలతో " ఓ పరిచారికలారా! మీరందరూ సామదానభేదదండోపాయాలను ఉపయోగించి నా దారికి సీతను తెండి భయపెట్టిగాని, మంచిగా మాట్లాడిగాని ఈ సీతను నాపై వ్యామోహాన్ని కలిగించండి". అని రావణుడు చెప్పుతుండగానే

ధాన్యమాలిని అనే రాక్షస స్త్రీ రావణుని సమీపించి తన బాహుబంధంతో బంధించి " ఓ మహారాజా! ఈ సీతాదేవి ఓ మానవకాంత, శోభాహీనురాలు, ఈమెతో మీకు పని ఏమి? నాతో క్రీడించండి, ఓ ప్రభూ! మీ ఆనందమే నా ఆనందంగా మీకు నేను వశమై ఉంటాను. ఈమె నుదట బ్రహ్మదివ్యభోగాలను అనుభవించు యోగ్యతను రాయలేదు." అంటూ రావణుని మనసు మార్చడానికి ప్రయత్నంచేస్తూ మాట్లాడజొచ్చింది. 'రాజా! నీపై ప్రేమ లేని ఈమెను కోరుకోవడంలో నీకు దుఃఖమే కాని సంతోషం ఉండదు. ఈమె నీకు సరిరాదు' అని చెప్పి ధ్యానమాలి, రావణుని పక్కకు పిలుచుకొనిపోయింది. దశగ్రీవుడు కూడా నవ్వుతూ ఆమె వెంట వెళ్ళాడు. రావణుడు భూమి అదిరినట్లుగా నడుస్తూ ముందుకు వెళ్ళి సూర్యకాంతితో సమానకాంతి ఉన్న తన భవనంలోకి వెళ్ళాడు.

ఆయనతో వచ్చిన దేవ గంధర్వ, నాగకన్యలందరూ తిరిగి ఆయనను అనుసరిస్తూ వెళ్ళారు. రావణుడు వెలుగులు విరజిమ్ముతున్న తన భవనంలోకి వెళ్ళాడు.

* * *

# సీతకు నచ్చచెప్పే ప్రయత్నం

## సర్గ - 23

**రా**క్షసరాజు రావణుడు సీతతో మాట్లాడి తిరిగి తన భవనానికి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత అక్కడున్న రాక్షసస్త్రీలందరూ సీతాదేవి దగ్గరకు పరుగెత్తి వచ్చారు. వారందరూ కోపంగా ఉన్నారు. 'ఓ సీతా! రావణుడు లంకాధిపతి రాక్షసులకు ప్రభువు ఆయనకు భార్యకావడంకన్నా గౌరవం ఏముంటుందీ? నీవు ఆయనను ఎందుకు నిరాకరిస్తున్నావు.'

ఏకజట అనే పేరు ఉన్న రాక్షస స్త్రీ కనులెర్రగా చేసి 'సీతా! మరీచి, అత్రి, అంగీరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు అనే ప్రజాపతులలో నాల్గవవాడు పులస్త్యుడు. అతడు బ్రహ్మ మానసపుత్రుడిగా పేరు తెచ్చుకొన్నాడు.

తేజస్వి ఐన విశ్రవసుడు పులస్త్యుని మానసపుత్రుడు. ఆయన కుమారుడే రావణుడు. అరివీరభయంకరుడు ముల్లోకాలను తన తపఃశక్తితో గడగడలాడించినవాడు. అటువంటివానితో నీవు ఎందుకు విరోధిస్తున్నావు? ఓ సుందరాంగీ! మేము చెప్పే హితవచనాలు ఎందుకు వినవు? ' అని ప్రశ్నించింది.

హరిజటనే రాక్షసస్త్రీ 'ఓ జానకీ! ముప్పైముగ్గురు దేవతలను, దేవేంద్రుని రావణుడు జయించాడు. మహాశక్తిసంపన్నుడు, మహాబలశాలిలాంటి వానిని నీవు తిరస్కరించడంలో అర్థంలేదు' అంటూ కోపంతో మండిపడింది.

ప్రఘస అనే రాక్షసస్త్రీ మహారోషావేశంతో వచ్చి 'ఓ సీతా! రావణుని భార్యలందరిలోను మండోదరి సర్వసౌభాగ్యవతి. ఆమెను సైతం నీ కోసం రావణుడు త్యజించడానికి పూనుకొన్నాడు. నీపై ఇంత ప్రేమ కురిపించే రావణునికన్నా నీ రాముడు గొప్పవాడా? అర్థం చేసుకో?' అంటూ అరిచింది.

'ఓ సీతా రావణునిపొందుకావాలనికోరే రమణులు వేలకొలదిగా ఉన్నారు. వారినందరిని కాదని నిన్ను చేపట్టే రావణుని తిరస్కరించడం నీ బుద్ధిలేని పని అని తెలుస్తోంది.' అని మరో సారి వికృతంగా అరిచింది. వికట పరుగెత్తుతూ వచ్చి 'అధమురాలా! సీతా! సమరాంగణంలో రావణుని చేతిలో పలుసార్లు దేవతలు ఓడిపోయారు. అట్టివాడు నీ సరసన చేరాలని ఉబలాటపడుతూ నీకు అన్నీ ఇస్తానంటున్నాడు. ఇంక ఏమి కావాలి నీకు? ' అని విసవిసలాడింది.

దుర్ముఖి వచ్చి 'ఓ సుందరీ! రావణుని చూసి సూర్యచంద్రులు కూడా గతి మార్చుకొంటారు. వాయువు సైతం చెప్పినట్లు వింటాడు. ఓ విశాలాక్షీ!మా ప్రభువు ఎంత చెప్పితే అంతే. తరువులు కూడా ఆయన కనుసన్నలలోనే ఉంటాయి. అలాంటి ప్రభువును నీవేల వద్దనుకొంటున్నావు?

ఓ భామినీ! రాక్షసరాజే కాదు రావణుడు రాజులకే రాజు. నీవు అతనికి భార్య అవడం నీ అదృష్టం అని తెలుసుకో. ఓ తరుణీ! మేం నీ మేలు కోరి చెప్పుతున్నాం. బాగా ఆలోచించి నిర్ణయం తీసుకో' అని చెప్పింది. ఇలా అందరూ తలో మాట చెప్పారు. 'అమ్మా! మేము చెప్పినట్టు వింటే రావణుడు నిన్ను ఓ పువ్వులాగా చూసుకొంటాడు. అందరికన్నా నీమీద ఆశగా ఉందని చెప్పుతున్నారుకదా! నీవు ఆలోచించుకో . రావణుని చూచి భయపడనివారు ఎవరూ ఉండరు. అలాంటివానిపొందు నీకు నిర్భయంగా ఉంటుంది. అటువంటపుడు నీకు మరో ఆలోచన అక్కరలేదు. రాక్షసరాజు తనను ప్రేమించేవారిని కంటికిరెప్పలాగా కాపాడుతారు. ఆయన అందచందాలు, వీరత్వం చూసి ఎందరెందరో తరుణులు వారికైవారు వచ్చి ఉన్నారు. రావణుని కడగంటిచూపు చాలు అనేవారే చాలామంది ఉన్నారు. అలాంటి వారినందరిని కాదని మా ప్రభువు నిన్ను కోరుకొంటున్నాడు. ఆయన ఎంతగా ప్రేమించగలడో అంతగా కోపించ గలడుకూడా. మేం చెప్పేది బాగా విత్కరించుకుని ఓ నిర్ణయానికి రా . ఆ తరువాత చేసేదేముండదు.' అని రాక్షస్త్రీలందరూ సీతకు చెప్పుతున్నారు.

* * *

# రాక్షస స్త్రీల ఉద్బోధ

## సర్గ - 24

**రా**క్షస స్త్రీలు సీతాదేవిని కోపంగా చూస్తూ ఎన్నో మాటలు చెప్పారు. అయినా సీతలో ఏ మార్పు కనిపించక పోయేసరికి వారిలో కోపం ఎక్కువ అయ్యింది. దాంతో ఆ సుకుమారి సీతను గద్దిస్తూ గట్టిగా చెప్పడం మొదలెట్టారు." ఓ సీతా! రావణుని అంతఃపురం అందరికీ ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. అందులో ఉండడానికి నీకెందుకు ఇష్టం

లేదు? మానవుడైన శ్రీరాముణ్ణే తలుస్తున్నావు. కాని ఆ రాముని దగ్గరకు నీవు ఏ విధంగానూ చేరలేవు. అందుకే మా ప్రభువును అంగీకరించు. రాముడు రాజ్యభ్రష్టుడు, ఆయన నీకు ఏమి చేయలేడు" అని చెపుతూ ఉండగానే సీత కన్నుల నుండి నీరు ఉబికి వచ్చింది. సీత ఏడుస్తూనే " మీరు చెప్పే మాటలన్నీ పాపపు మాటలే. మానవకాంతరాక్షసుని భార్య ఎలా అవుతుంది? మీరందరూ కలిసి నన్ను తినివేయండి కాని నన్ను బలవంతం చేయకండి. నా కిష్టంలేని పనిని నేను చేయలేను. నా భర్తదీనుడైనను, రాజ్యహీనుడైనను అతడే నాకు పరమావధి. సువర్చలాదేవి సూర్యుని ప్రేమించినట్లుగా నేను ఎల్లప్పుడు రామునిపైనే అనురక్తిని కలిగి ఉంటాను. నారాముని గురించి మీకు ఏం తెలుసు. మీ రాక్షసప్రభువు మీకు గొప్పగా అనిపిస్తున్నాడేమో కాని నాకు మాత్రం అధర్మమైన పనులు చేసే పనికిమాలిన వానిగానే కనిపిస్తున్నాడు. చేతకానివాడు కాన నా పతి నాకు దూరంగా ఉన్నపుడు నన్ను తీసుకొచ్చాడు. ఇది వీరులు చేయాల్సినపనేనా? అని సీత కన్నులు తుడుచుకొంటూ అడుగుతోంది. "ఓ రాక్షసవనితలారా! మీకు ఇది తెలీదేమో నేను నా రాముని ఆలోచన లేకుండా ఒక్క క్షణమైనా నిలవలేను. నాఊపిరి, నాప్రాణం, నా అనే దంతా రామునిదే. నాకు నా రామచంద్రుడు తప్ప నేనుగా నాకు కనిపించను. అలాంటి నన్ను మీరు ఈవిధంగా చేయమని అడగడం భావ్యంగా ఉందా? భార్యాభర్తలు ఒకరికొకరుగా ఒకరికోసం మరొకరు జీవిస్తారు కాని వారికి విడివిడిగా జీవితాలు ఉంటాయా? నా ప్రపంచంఅంతా రామునిదే అయినపుడు రాముని విడిచి మరెక్కడో సంతోషాలు నాకు ఎలా లభ్యమౌతాయి? రాముని ఆలోచనలు లేనినాడు నాకు అమరత్వం సిద్ధించినా అది కేవలం నరకమే అయ్యిఉంటుందికాని మరేమికాదు. శచీదేవి దేవేంద్రుని ఆరాధించినట్లు, అరుంధతి వసిష్ఠుని, రోహిణి చంద్రుని, సుకన్య చ్యవనుణ్ణి, లోపాముద్ర అగస్త్యుని సావిత్రి సత్యవంతుని, శ్రీమతి కపిలుని, మదయంతి సౌదాసుణ్ణి, కేశినీదేవి సగరుని, దమయంతి నలుణ్ణి అనుసరించినట్లు నేను ఇక్ష్వాకుల శ్రేష్ఠుడైన శ్రీరాముణ్ణే పతిగా భావిస్తాను. ఆ మహానుభావుణ్ణే నేను అనుసరిస్తాను. మీరు నన్ను ఏ విధంగాను మార్చలేరు' అని సీతాదేవి వారికి చెప్పింది. దానితో వారి మతి చెడింది. ఇంతగా చెప్పినా లేశమంతైనా మారకుండా తన ధోరణిలో చెప్పే సీతను చూసి మనశ్రమనంతా వృదా చేసిందంటూ వైదేహిపై వారికి కోపం వెళ్ళగక్కారు.

అశోక వృక్షంపై దాగిన కపివరుడు ఆ రాక్షస స్త్రీల మాటలన్నీ వింటున్నాడు. అంతా సీతాదేవిని తినివేసేలాగా నమలుతూ, పెదవులు చప్పరిస్తూ ఆ రాక్షసులు సీతాదేవిపైకి వస్తూ సీతను భయపెట్టసాగారు. వారందరూ చేతిలో గండ్రగొడ్డళ్ళు పట్టుకొని అసలు ఈ సీతను రావణుని భార్య అవడానికి అసలు పనికిరాదన్నారు. వారు అలా అంటూ సీత పైకి వస్తున్నారు. వారిని చూసి సీత భయపడుతూ వృక్షం మూలం దగ్గరగా జరిగింది.

అక్కడనుంచి సీత శింశుపావృక్షం మూలానికి చేరింది. రాక్షస స్త్రీలందరూ ఆమెను చుట్టుముట్టారు. వారిని చూసి సీత ఉబికి వస్తున్న కన్నీటిని తుడుచుకొంది. అంతలో భయంకరంగా వంకర టింకర అవయవాలున్న పెద్ద పొట్ట ఉన్న వినత అనే రాక్షసి " ఓ సీతా! ఇప్పటివరకు నీ భర్తపై చూపిన ప్రేమ చాలు ఇక దానిని వదిలిపెట్టకపోతే నీకు కష్టాలు తప్పవు" అంటూ పెద్దగా అరిచింది.

" ఓ సీతా! ఇప్పటివరకు మానవురాలిగా ఉండి ధర్మాలన్నీ ఆచరించావు. బాగానే ఉంది. ఇక చాలు రావణుడు గొప్ప పరాక్రమవంతుడు. అందగాడు. దేవేంద్రుని మించిన భోగం ఉన్నవాడు. అందరిని సంతోషింపచేయు సమర్థుడు. అతడిని నీవు చేపట్టి సంతోషించు" అని చెప్పి ఓ క్షణమాగి తిరిగి మాట్లాడడం మొదలుపెట్టింది. ' ఓ జానకీ! రామునకు రావణుని చేతిలో ఆయువు తీరిపోతుంది. అట్టి రామునితో నీకు పని ఏముంది? మేం చెప్పే మాటలు నీవు వినకపోతే నిన్ను ఇప్పుడే భక్షించి వేస్తాం ' అని చెప్పింది.

వ్రేలాడే స్తనాలున్న వికట పిడికిలి బిగించి ' ఓ సీతా! నీవు బుద్ధిహీనురాలివి. ఇప్పటివరకూ మాకిష్టం లేని ఎన్నో మాటలు చెప్పావు. నీపై జాలితో అవన్నీ మేం విన్నాం. కానీ మైథిలీ! నిన్ను రావణుడు సముద్రం ఆవలి తీరం నుండి ఇక్కడికి తీసుకొచ్చాడు. ఈ సముద్రాన్ని దాటి ఎవరూ రాలేరు. శత్రు దుర్భేద్యమైన లంకలో నీవు ఉన్నావు. ఇక్కడ నిన్ను దేవేంద్రుడు సైతం రక్షించలేడు.

నీ మంచికోసమే మేం చెప్తున్నాం. మా మాటలు విని మేం చెప్పినట్లు చేస్తే నీవూ మాతో పాటుగా ఆనందిస్తావు. స్త్రీల యౌవనం కాలంతోపాటుగా కరిగిపోతూ ఉంటుంది. దీన్ని తెలుసుకొని కాలాన్ని వృథా చేయకుండా మా రావణునితో రమించి సుఖించు' అని అంది.

'నీవు రావణుని భార్య ఐతే మేమందరం నీ పరిచారికలమై నీకు కావాల్సిన సేవలన్నీ మేం చేస్తాం. రావణుని నీవు తిరస్కరిస్తే మేం నీ గుండెను చీల్చి తినివేస్తాం' అని అందరు కలసికట్టుగా అరిచారు.

చండోదరి అనే రాక్షసి శూలాన్ని తిప్పుతూ రావణుని వద్దని చెప్పే సీతను చూసి విపరీతమైన కోపంతో మండిపడుతూ 'సీతా! నాకు నిన్ను చూసినప్పటినుంచి తీరని కోరిక ఉండిపోయింది. దాన్ని ఈ రోజు తీర్చివేసుకొంటాను. నీ కుత్తుకను చీల్చి ప్లీహమును ఉత్పీడమును, పేగులను శిరస్సులను తినివేస్తాను' అని అరిచింది.

ప్రఘస అనే రాక్షసి లేచింది,' ఓ లలనలారా! వృథాగా కూర్చోవడం ఎందుకు? ఈ మూర్ఖురాలు ఎలానూ మాట వినదు. ముందు ఈమె కంఠాన్ని చిదిమివేయండి. ఈ మానవకాంత చనిపోయిందని రాజుగారికి చెప్దాం. ఆయన మనలను ఆమెను తినివేయండి అని చెప్తాడు. ఇందులో సందేహం ఏమీ లేదు' అని చెప్పింది.

అజాముఖి 'అబ్బబ్బా! ఎందుకీ కాలయాపన. ఈమెను ముక్కలుగా నరకండి. ఆ తర్వాత ముక్కలను పంచుకొందాం. ఇందులో వివాదం నాకు నచ్చదు అని చెప్పింది. లేహ్యాలు సురాపానం సిద్ధం చేయండి మనం సీతా విందు చేసుకొందాం' అని చెప్పింది.

శూర్పణఖ లేచి ' ఈ అజాముఖి చెప్పింది బానే ఉంది. త్వరగా మద్యం తెండి. చక్కగా నరమాంసం భక్షణ చేసి లంక పశ్చిమ భాగంలో భద్రకాళికి నచ్చే నాట్యం చేద్దాం' అన్నది.

ఇలా రాక్షసులందరూ తలో మాట చెప్పి సీతను భయపెడుతున్నారు. ఆ మాటలన్నీ విని అయోనిజ కన్నీరు మున్నీరై ఏడుస్తోంది. అలా ఏడుస్తున్న సీతను వారందరూ ఆనందంగా చూస్తున్నారు. ఇలా భయపడితే మనకు భయపడి మనం చెప్పినట్లు చేస్తుంది అని ఒకరితో మరొకరు చెప్పుకొంటున్నారు.

ఎపుడెపుడు సీత అనుకూలమైన మాట చెప్తుతుందా అని వారందరూ ఆసక్తితో జానకినే చూస్తున్నారు. వారందరిని చూస్తున్న సీత భీతహరిణిలాగా దిక్కులు చూస్తోంది. రాముణ్ణే తలచుకుని ఎపుడెపుడు తనకు విముక్తి కలుగుతుందో రామునికి తనపై ఎపుడు దయకలుగుతుందో ? రామునికి తన ఉనికి గురించి తెలిసిందో లేదో, తన గురించి ఎపుడూ ఆలోచించే రాముడు తనకోసం ఎన్ని బాధలు పడుతున్నాడో! అని సీత తన భర్తగురించే తలచుకుంటూ కన్నీరు కారుస్తోంది. హాయిగా మన మాటలు వింటే ఈమె విచారం మటుమాయం అయిపోతుందిగదా! ఈ జానకికి ఆలోచన ఎందుకు కలగటంలేదా? ఎదురుగా ఉన్న సుఖాలను వదిలిపెట్టుతూ అడవులుపట్టి తిరుగుతున్న రాముని గూర్చి ఆలోచిస్తుందేమిటోనని రాక్షసాంగనలు ముచ్చటించుకొంటున్నారు.

* * *

# శోకతప్త సీత

## సర్గ - 25

**రా**క్షస స్త్రీల మాటలు విని జానకీదేవి చాలా బాధపడుతోంది. గద్గద కంఠస్వరంతో మాటలు తడబడుతుండగా ‘ ఈ మానవకాంత ఎన్నటికీ రాక్షసుని భార్య కాలేదు. నన్ను మీరు మీ ఇష్టానుసారం తినివేసినా సరే నేను మాటను ఎప్పటికీ వినను.’ అంది వారిమధ్య సీత అశాంతితో కాలం గడుపుతోంది.

తోడేళ్ళకు చిక్కిన లేడిపిల్లలాగా సీత బెదురుచూపులు చూస్తూ ఏ నిమిషం ఏమి అవుతుందో అని భయపడుతూ కాలం గడుపుతోంది. సీతాదేవి వృక్షపు మొదలు ఆనుకొని కూర్చుంది. తన భర్తను తలచుకొంటూ చింతిస్తోంది. ఆమె అలా మనస్సులో రాముణ్ణి అనుకుంటూ కన్నీరు కారుస్తూ దీనంగా ఉంది. ఆ అశోక వనంలో సీత శోకానికి అంతం లేదన్నట్లు బాధపడుతోంది.

పెనుగాలికి పడిపోతున్న అరటి చెట్టులాగా సీతాదేవి భయంతో వణుకుతోంది. ఆమె ఏడవడం చూసి ఆ రాక్షసులు ఇంకా ఆమెను శూలంతో భయపెడుతున్నారు. ఆ బాధలు పడలేక సీత“ హా రామా! లక్ష్మణా! అంటూ ఏడ్చింది. అత్తా! కౌసల్యా, సుమిత్రా చూడండి నావైపు ఒక్కసారి చూడండి. ఈ బాధలను నేను పడలేను” అంటూ దీనంగా ఏడుస్తోంది.

“నేను నిజంగానే దురదృష్టవంతురాలిని. నా పతి దగ్గర ఉండే భాగ్యం నాకు లేదు. పెను తుఫానుకు చిక్కుకున్న నావలాగా నేను వీరికి చిక్కాను ”అంటూ సీత వాపోయింది.

“ నా శ్రీరాముడు పద్మ దళాయత నేత్రుడు. ఎప్పుడూ నాతో మధురంగా స్నేహంగా మాట్లాడేవాడు. సద్గుణ సంపన్నుడైన నా శ్రీరాముని విడిచి జీవించడం దుర్లభం. నేను పోయిన జన్మలో ఎంత పాపం చేసుకొన్నానో? నేనీనాడు రావణుని చేతికి చిక్కాను. ఇన్ని బాధలు పడుతున్నా నాకు చావు రావడంలేదు. ఇంకా నేను ఎన్నెన్ని బాధలు అనుభవించాల్సి ఉందో ” అని సీత పరితపించింది.

" అయ్యో ! ఈ దుష్ట రావణునికి నేను చిక్కాను. ఇంక నా శ్రీరాముని పొందే భాగ్యం నాకు లేదు. కావున నా జీవితాన్ని ముగించుకోవడమే నా ముఖ్య కర్తవ్యం. అయినా నా జీవితం ఆయన ఆధీనంలో ఉంది కదా! నా భర్త అనుమతి లేకుండా నేను నా దేహాన్ని ఎలా త్యజించను? ఈ మనిషి జన్మకు పుణ్య పాప విచక్షణా జ్ఞానాన్ని దేవుడు ఇచ్చాడు కదా! తెలిసి తెలిసీ ఎలా పాపాన్ని చేసేది. ఇప్పటికే తెలిసో తెలియకో పాపం చేసి బాధలు అనుభవిస్తున్నాను. ఇంకా తెలిసి పాపం చేయడం నా అవివేకమే ఔతుంది" అని అనుకొంటూ సీత దుఃఖిస్తోంది.

* * *

# సీత దైన్యం

## సర్గ – 26

**సీ**త పరితాపానికి గురి అయ్యింది. నేలకు ముఖం వాల్చి అదేపనిగా ఏడుస్తోంది. ఉన్మత్తురాలై మత్తెక్కిన దానిలాగా చిత్తభ్రమకు లోనై నేలపై బడి పొర్లి పొర్లి ఏడుస్తోంది. 'అయ్యో! శ్రీరాముడు ఆ మాయా లేడికోసం వెళ్ళినపుడు కదా ఈ దుష్ట రావణుడు నన్ను ఎత్తుకొచ్చాడు. ఈ రోజు ఈ రాక్షస స్త్రీలు స్త్రీ అని కూడా చూడకుండా నన్ను బాధిస్తున్నారు.

ఈ నా జీవితంపై విరక్తి కల్గుతోంది. నా భర్తకు దూరం అయ్యాను. ఈ స్థితిలో నాకు సంపదలు ఎందుకు? ఆభరణాలు, అలంకారాలు ఎందుకు పనికివస్తాయి? నా గుండె నిజంగానే ఒక ఇనుప ముద్దలాగుంది. ఎన్ని బాధలు పడినా ఎట్టి భయంకరాకారం చూసినా ఇది బ్రద్దలు అవడంలేదు.

భర్తకు దూరం అయిన జీవితం దుర్భరం. నికృష్ట జీవితాన్ని ఎవరూ జీవించాలని తలచరు. ఈ జీవితాన్ని క్షణకాలం ఐనా భరించడం నా వల్ల కాదు. ఐనా నేను జీవిస్తూనే ఉన్నాను. నేను ఎంతటి పాపాత్మురాలినో కదా.

సముద్రాలే ఎల్లలుగాకల భూమండలానికి నా భర్త ప్రభువు. ఆయన మితభాషి. శ్రీరాముని వదిలి దూరంగా ఉన్న నాకు సుఖాలపై ఎలా ఆశ కలుగుతుంది? ఈ రాక్షస స్త్రీలు నన్ను ముక్కలు చేస్తామని అంటున్నారు. అయినా నాకు సంతోషమే. నేనే జీవితాన్ని త్యజించాలని అనుకొన్నాను. అలాంటప్పుడు వీరు నన్ను తినివేస్తామంటే నాకు బాధ ఎందుకు? ఈ నికృష్టుడైన నిశాచరుని నేను ఎడమకాలితో కూడా తాకను.

ఈ కపటుడైన రావణుడు తను ఎవరో తన వంశం ఎలాంటిదో కూడా చూసుకోకుండా నా కోసం పరితపిస్తున్నానంటున్నాడు. తాను ఎవరో కూడా తెలుసుకోలేని మూర్ఖునితో నేను ఏం మాట్లాడను? కొట్టినా, చంపినా, ముక్కలుగా నరికివేసినా నేను బాధపడను. ఆ రావణుని దరి చేరను. నన్ను ఇలా అహర్నిశం బాధించడం మీకే మంచిది కాదు అంది.

శ్రీరాముడు శత్రు భయంకరుడు. ఎవరైనా చిన్న మేలు చేసినా ఎన్నటికీ గుర్తుంచుకొనేవాడు. అనుక్షణం పరుల గురించే ఆలోచించేవాడు. తను నమ్మిన వారికోసం ప్రాణాలైనా ఇచ్చేవాడు. అట్టి నా రాముడు నాపై ఎందుకో దయ చూపడంలేదు. ఇది నా దురదృష్టం.

నా రాముడొక్కడే పదునాలుగు వేల మంది రాక్షసులను తుదముట్టించాడు. ఈ సముద్రాన్ని దాటడం అందరికీ అసాధ్యమేమో కాని నా రామునకు కాదు. ఒక్క సముద్రం కాదు, ఆ రామ బాణ వేగ గమనానికి అవధి అంటూ ఏదీ లేదు. కాని శ్రీరామచంద్రుడు రాక్షసుడైన రావణుడు నన్ను అపహరించినా నన్ను కాపాడడానికి ఎందుకు రావడంలేదో? ఒకవేళ నేను ఇక్కడ ఉన్నట్లుగా ఆ లక్ష్మణుని అన్నకు తెలియనట్లు ఉంది. తెలిసే ఉంటే ఆయన ఉపేక్షిస్తాడా? ఇది ఆ స్వామి సహించగలడా?

నన్ను అపహరించి తీసుకొనివచ్చేటప్పుడు ఒక జటాయువే చూశాడు. ఆ జటాయువు వృద్ధుడైనను ఈ దుష్ట రావణునితో ద్వంద్వ యుద్ధం చేశాడు. ఈ రావణుడే నీతి తప్పి ఆయన రెక్కలను ఖండించివేశాడు. ఈ దుష్టుని వల్లే జటాయువుకు మరణం వచ్చింది. ఆ మహత్కార్యం చేసిన జటాయువు రామునికి రావణుని సంగతి చెప్పేవరకు ప్రాణాలు ఉంచుకొన్నాడో లేదో?

ఒకవేళ నా రామునికి ఈ దుర్మార్గుని గురించి తెలిసి ఉండి ఉంటే నా దగ్గరకు తప్పక వచ్చేవాడు. ఈ సముద్రాన్ని ఎండగట్టి ఈ నీచ రావణుని నామరూపాలు లేకుండా చేసి నన్ను దగ్గరకు తీసుకొనేవాడు. నేను బాధపడుతున్నానని రాముడు తెలుసుకొంటే ఆయన తట్టుకోలేడు.

'నన్ను ఏడ్పించే ఈ లంకావాసులందరూ అనాథలై త్వరలో విచారిస్తారు. త్వరలోనే రామలక్ష్మణులు వచ్చి శత్రువులను తుదముట్టిస్తారు. ఈ లంకాపట్టణ రాజవీధులన్నీ రాక్షసుల శవాలతో నిండిపోతాయి. చితుల మంటలతో లంక దగ్ధం అయిపోతుంది. లంక వల్లకాడుగా మారడం తథ్యం.

ఈ లంకలో కనపడే అపశకునాలే లంకా వినాశనం జరుగుతుందని చెప్పక చెప్తున్నాయి. ఈ పర భార్యలపై వ్యామోహం పెట్టుకొని ఉండే రావణునివల్లే ఈ లంక సర్వనాశనం అయిపోతుంది. నీతి తప్పిన రాజే రాజ్యానికి చీడపురుగు.

రాక్షసులందరూ నిహతులైపోతారు. ఆనాడు ఈ రాక్షస స్త్రీలందరూ భర్తలను పోగొట్టుకొని అమంగళులై శోకార్తిలో మునిగిపోతారు. నా రామునకు నేను లంకలో ఉన్నట్లు తెలిసిన క్షణమే లంకా నాశనం మొదలవుతుంది. రామ బాణాలు లంకను ఛేదించి వేస్తాయి. అవినీతి అన్యాయాన్ని రూపుమాపే రామబాణాల రుచిని ఈ లంకలోని దుష్టులు రుచి చూసే కాలం దగ్గరలోనే ఉంది.

రావణుడు నాకు నిర్దేశించిన కాలమే అతనికి అతని మృత్యువుకు పెట్టుకొన్న గడువని రావణునికే తెలియదు. కొరవితో తలగొక్కుంటున్నాడు. పోయేకాలం దాపురించినందువల్లనే వ్యర్థ ప్రేలాపనలు చేస్తున్నాడు. మాంసాన్ని తినే రాక్షసులకు ధర్మం ఏమిటో ఏమి అర్థం అవుతుంది. అన్నీ అధర్మకార్యాలు చేసే వీరికి ధర్మం గురించి ఎలా తెలుస్తుంది? వారి కర్మల ఫలితం ఏమిటో వారు అనుభవించేటప్పుడు కాని అధములు తెలుసుకోలేరు.

ఈ రాక్షసుడు అల్పాహారంగా పొద్దున్నే నన్ను తింటానని చెప్తున్నాడు. నా భర్త చెంత లేదు. అందువల్లే నేనీ మాటలు వినవలసి వచ్చింది. కమలనేత్రుడైన రాముడు నా దగ్గర ఉంటే ఈ దుష్టుడు కన్ను ఎత్తి నన్ను చూడగలిగేవాడా? నా పతి ఎడబాటుతో దుఃఖార్తిలో ఉన్న నన్ను బాధించే ఈ రావణుని పాపం ఎప్పుడు పండుతుందో? నాకు విషం ఇచ్చే పుణ్యదాతలు ఎవరైనా ఉంటే ఎంత బాగుండు? నేను ఇప్పుడే ఆ యమదర్శనం చేసుకొనేదాన్ని.

నా విరహ బాధ తట్టుకోలేక నా రాముడు ప్రాణాలు విడిచి దేవలోకానికి వెళ్ళాడేమో? నేను జీవించలేక ప్రాణత్యాగం చేసి ఉంటానని భావిస్తున్నారేమో? నేను ప్రాణాలతో ఉన్నానని తెలిసి ఉంటే వారు ఈ భూమండలమే కాదు ముల్లోకాలను కూడా గాలించి నన్ను శోధించి సాధించగలరు. నా రామచంద్రుడు ధర్మమూర్తి. ఆయనను చూసినవారందరూ ఆనందంతో ఉంటారు. ఆయన రాజర్షి, పరమాత్మతో సమానుడు. అట్టివానికి భార్య ఐన నాతోపని ఏముంది? సాధారణంగా జనులు ఎదుటగా కనిపించే దాని గురించే మాట్లాడుతుంటారు. కనిపించేవారినే ప్రేమిస్తుంటారు. కనబడనివారి కోసం కృతఘ్నులు తలవరు. కాని నా రాముడు అన్యులు చేసిన దానిని మహోపకారంగా తలచి ఎప్పుడూ వారిని స్మరిస్తుంటాడు కదా!

మరి ఆయననే నమ్ముకున్న నన్ను ఎలా మరిచిపోయాడు? శ్రీరామ ధర్మపత్నినై ఉండి కూడా నాకు ఈ దురవస్థలేమిటో? నాలో సద్గుణాలు నశించి పుణ్యం ఏ మాత్రం నన్ను రక్షించడం లేదా? నా అదృష్టం అడుగంటి పోయినదేమో? ఉదాత్త చరిత్రుడైన నా రాముని వదిలి జీవించడంలో అర్థం ఏమీ లేదు.

నేను నా తనువును త్యజించడమే అన్నింటికన్నా మేలుగా కనిపిస్తోంది. నాకు ఏమి చేయాలో తోచని పరిస్థితి ఎదురౌతోంది. ఈ రావణుని బారినుంచి నేను ఎలా బయటపడాలో నా రామచంద్రునికి నాపై దయ ఎపుడు కలుగుతుందో ? లేకపోతే నేను లేననే చింతతో రామలక్ష్మణులిరువురు అస్త్ర సన్యాసం చేసి కందమూలాలు తింటూ తాపసులు అయిపోలేదు కదా! లేక ఈ దుష్టుడు కపటోపాయాలతో వారిని చంపించి వేసినాడా ఏమి? ఏ విధంగా ఆలోచించినా నాకు మరణం తథ్యమనిపిస్తోంది. అంతకన్నా మరో మార్గం నాకు కనిపించడంలేదు. మునుల జీవితమే సుఖకరమైనది. వారు నిత్యం తపస్సు చేసుకొంటూ జితేంద్రియులు అవుతారు. వారికి ఈ భూమి మీద ఉండే వాటితో ఏ పని ఉండదు. శరీరంపై మమకారమే లేకుండా ఉంటే వారికి అప్రియం, ప్రియం అనే మాటే ఉండదు.

అసలు దేహాభిమానాన్ని వదిలేసి నిత్యం పరమాత్మలో లీనం అయ్యి ఉంటే సుఖ దుఃఖాలు ఏవీ దరిచేరవు. ఒకవేళ అవి చేరినా వాటికి అనుగుణంగా మారే మనస్సు ఉండదు. ద్వంద్వాతీతంగా జీవించే మునీశ్వరులే ధన్యులు. వారి జీవితమే ధన్యమైనది వారికి నా నమస్కారం. ధర్మాత్ముడు ప్రేమ స్వరూపుడు. నిత్య సంతోషి. పుణ్యాత్ముడైన నా రాముని వదిలి ఈ పాపకూపంలోని దుష్టుని చేతిలో పడిపోయాను. ఇక నేను ఈ బాధలు ఓర్చుకోలేను. నా జీవితానికి చరమగీతం పాడుతాను. దేహత్యాగం చేసి సుఖిస్తాను' అంటూ ఉన్మాదిలాగా సీత దుఃఖాలు తట్టుకోలేక పరిపరివిధాలుగా పరితపిస్తోంది. సీత పిచ్చి పట్టినదానిలాగా ఏవేవో అనుకొంటూ కన్నీరు కార్చుతూ తుడుచుకొంటూ కూర్చుంది. ఆమె మోము చిన్నబోయింది. ఏడ్చి ఏడ్చి కన్నులు ఉబ్బి ఉన్నాయి. సంస్కారాదులు లేక శరీరం శుష్కించింది. రాముడు వచ్చాడేమోననే తలంపుతో సీత నలువైపులా ఊరికినే దృష్టి

సారిస్తూనే ఉంది. భీతహరిణి అయిన వైదేహి రావణుని వలన ఏ ప్రమాదం ఏ పక్కనుంచి వస్తుందేమోనని వెనకకు ముందుకు పక్కకు చూస్తోంది. ఆమెను చూచిన హనుమంతునికి దుఃఖం ముంచుకువచ్చింది. అయ్యో! వీరాధివీరుడైన పతిని కలిగి కూడా ఈ దుష్టుని చెరను పడి ఎన్ని కష్టాలను పొందుతోంది. అమ్మా! చింతించకు. నీ రాముడు అతి త్వరలో నిన్ను తన దరికి చేర్చుకుంటాడు. నీ కడగండ్లు దూరమౌతాయి. తల్లీ! దైవం నీకు అనుకూలించే రోజు దగ్గరలోనే ఉంది. శ్రీరామచంద్రా! తల్లి కష్టాలను దూరం చేయితండ్రీ అని ఆంజనేయుడు మనసులోనే రామునకు నమస్కరించాడు.

తన తల్లి దగ్గరకు చేరుకుని తనతో స్వాంతనవచనాలు పలకాలని అనుకొన్నాడు. త్వరగా రామునికి సీత క్షేమవార్తను తెలియచేయాలి. ఆ జానకమ్మ పడుతున్న కడగండ్లు చెప్పి రాముని ఇక్కడకు రావించి వైదేహిని విముక్తురాలిని చేయాలి. ముందు ఈ తల్లి ఏ అఘాయిత్యము చేసుకోకుండా రాముడు తన గురించి తెలుసుకోవడానికి నన్ను పంపించాడన్న విషయాన్ని తెలియపర్చాలి. లేకున్న సీతమ్మ రాముని ఎడబాటుతో మనఃక్లేశాన్ని పొంది చేయరాని పనిని చేయడానికి ఉద్యమించేలా ఉంది. దాన్ని నివారించేలా చేయాలనుకొన్నాడు.

* * *

# త్రిజటాస్వప్నం

## సర్గ - 27

**సీ**త పరితపిస్తూ చనిపోతానని చెప్పింది. ఆ మాటలు రాక్షసులు విన్నారు. వారిలో భయం మొదలైంది. ఆ విషయం తప్పక రావణునికి నివేదించాలని అనుకొన్నారు. అటువైపుగా కొందరు పరుగెత్తారు. మరికొందరు ఏ అఘాయిత్యం చేస్తోందో ఈ సీత, రావణుడు మనలను ఏమంటాడో అని సీతను జాగ్రత్తగా ఇంకొందరు చూస్తున్నారు.

ఇంకొందరు సీత వంక కోపంగా చూస్తూ ' సీతా! నీ నిర్ణయం బాగాలేదు. నీవు రావణుని తిరస్కరించడం అనుచితంగా కనిపిస్తోంది. మేం నిన్ను ఇప్పుడే తినివేస్తాం' అని బెదిరిస్తున్నారు. అక్కడే త్రిజట అనే జ్ఞాన వృద్ధ రాక్షస స్త్రీ నిదురపోతోంది. ఆమెకు మెలకువ వచ్చింది. మెలకువ రాగానే ఆమె సీతను భయపెడుతున్న రాక్షస స్త్రీల మాటలు వింది.

ఆమె రాక్షస స్త్రీలమీద విపరీతమైన కోపం తెచ్చుకొంది. 'ఓ వనితలారా! మీ వాక్ప్రభావాన్ని ఆపండి. మనకు దుర్దశ రాబోతోంది. ఈ సీతామాతను, జనకుని ప్రియపుత్రికను, దశరథుని కోడలిని, శ్రీరాముని పట్టపురాణిని మీరు తినే రోజు మాత్రం రాదు. కాని మిమ్ములను మీరు తినివేయండి. ఇప్పుడే నాకు ఒక కల వచ్చింది. అది నాలో భయాన్ని గగుర్పాటును కలిగిస్తోంది. మన రాక్షసులందరి వినాశనాన్ని చూపింది. సీతాపతి ఐన రాముని విజయాన్ని సూచించింది.'

ఈ మాటలు త్రిజట నోటినుంచి రాగానే అప్పటి వరకూ సీతను బాధిస్తున్న స్త్రీలందరూ ఒక్కమాటుగా త్రిజట దగ్గరకు పరుగెత్తి వచ్చారు. ' అమ్మా! నీకొచ్చిన కల ఏమిటి? చెప్పుచెప్పు' అంటూ పరుగెత్తి వచ్చారు. వారందరితో త్రిజట 'ఓ అంగనలారా! వినండి. ఇప్పుడిప్పుడే ఈ ఉషోదయమే నాకు ఓ కల వచ్చింది. ఏనుగు దంతాలతో నిర్మింపబడిన వేయి హంసలు పూన్చిన ఒక దివ్యమైన పల్లకి ఆకాశంలో ఉండడం నేను చూశాను. దానిపైన లక్ష్మణుడు శ్రీరాముడు తెల్లని పూల మాల ధరించి కూర్చుని ఉన్నారు. ఈ సీత కూడా సముద్ర మధ్యంలో ఒక తెల్లని పర్వతం మీద కూర్చుని ఉంది.

సూర్యునిలో కాంతి కలసిపోయినట్లుగా సీత రామునితో కలసిపోయింది. మరల కొద్దిసేపటికి నాలుగు దంతాలున్న ఒక ఏనుగుపైన శ్రీరాముడు తన తమ్మునితో రావడం నేను చూశాను. వారు శ్వేత వస్త్రాలను, మాలలను ధరించి ఉన్నారు. వారిద్దరూ సీత దగ్గరకు వచ్చారు. వారిని సీత చూసి ఏనుగుపైన ఎక్కి సీత శ్రీరాముని ఒడిలో కూర్చుంది. శ్రీరాముని ఒడిలో కూర్చున్న సీత సూర్య చంద్రులను తాకుతోంది. రామలక్ష్మణులు సీత కూర్చున్న పర్వతాకారంలోనున్న ఏనుగు వచ్చి మన లంకపై ఆగింది.

ఇంకొద్దిసేపటికి ఎనిమిది వృషభాలను పూన్చిన రథంపై రాముడు సీత లక్ష్మణునితో కలిసి ఇక్కడకు వచ్చారు. వారు ముగ్గురు పుష్పక విమానం ఎక్కి ఉత్తర దిశగా వెళ్ళారు. మన రాక్షసులే కాదు ఈ ముల్లోకాలలోను శ్రీరామ చంద్రుని ఎదురించే వారు ఎవరూ లేరు.

ఆ కలలో నేను రావణుడు ఎర్రని పూలమాలను ఎర్రని వస్త్రాన్ని ధరించి ఉండడం చూశాను. రావణుడు నూనె అంతా ఒంటికి రాసుకొని నూనె త్రాగడం కూడా నేను చూశాను. గన్నేరు దండలు మెడలో వేసుకొని పుష్పక విమానంలో కూర్చున్న రావణుడు నేలపై పడిపోయాడు. అలా పడిన రావణుని ఒక స్త్రీ ఈడ్చుకొని పోతోంది. ఎర్రని మాలలు మైపూతలు పూసుకొన్న రావణుడు గాడిదలు పూన్చిన రథాన్ని ఎక్కాడు.

ఉన్మాదిలాగా రావణుడు నూనె తాగి నృత్యం చేస్తుండగా ఆ గాడిదల రథం దక్షిణ దిక్కుకు గబగబా వెళ్తోంది. రావణుడు భయంతో వణికిపోతూ ఆ రథం పైనుండి క్రిందికి తలక్రిందులుగా పడిపోయాడు. కాసేపటికి లేచి పిచ్చివానిలాగా దిగంబరుడై ఏదేదో పెద్దగా అరుస్తున్నాడు. కొద్దిసేపటికే ఆ రావణుడు దుర్గంధ భూయిష్టమైన అంధకారమయంగా ఉన్న కందకంలో పడిపోవడం నేను కలలో చూశాను.

ఎర్రని చీరకట్టిన స్త్రీ రావణుని మెడకు త్రాడు కట్టి లాక్కొని పోవడం నేను చూశాను. అంతేగాదు రావణుని సుతులు, బంధువులు, సోదరులు అందరూ నూనెలో తేలియాడడం నేను చూశాను. రావణుడు పందిపైన ఇంద్రజిత్తు మొసలిపైన కుంభకర్ణుడు ఒంటెపైన ఎక్కి వడివడిగా దక్షిణ దిక్కుకు పోవడం నేను చూశాను.

విభీషణుడు మాత్రం తెల్లని వస్త్రాలు ధరించి స్వచ్ఛమైన గంధం పూసుకొని తెల్లని మాలలు మెడలో వేసుకొని దివ్య గజంపైన కూర్చుని ఉన్నాడు. శంఖ దుందుభి నాదస్వరాలతోను నృత్య గానాలతోను ఆయన పరవశిస్తూ ఆనందిస్తున్నాడు. ఆయన మంత్రులు కూడా నాలుగు దంతాలున్న గజంపైనున్న విభీషణుని దగ్గరే ఆకాశంలో ఉన్నారు.

ఈ రమ్యమైన లంకాపురి అంతా విరిగిన రథాలతోను, తునిగిన పల్లకీలతోను నిండి ఉండడం నేను చూశాను. రాక్షస స్త్రీలందరూ నూనెను త్రాగుతూ భయంకరంగా అరుస్తూ ఈ లంకలో నృత్యాలు చేస్తున్నారు. రాక్షసులందరూ ఎర్రని పూలు ధరించి మద్యం త్రాగుతూ కనిపించారు. ఈ లంక అంతా రామ దూత ఐన ఒక వానరుని వలన దగ్ధం అయిపోవడం నేను చూశాను.

కుంభకర్ణుడు లాంటి వీరులందరూ మాసిన బట్టలు వేసుకొని పేడలో పడిపోవడం నేను చూశాను. ఇదంతా రాక్షస నాశనాన్ని శ్రీరాముని విజయాన్ని తెలుపుతోంది గదా! అందుకే మీరందరూ ఈ సీతాదేవిని బాధించకుండా దూరంగా పోండి. శ్రీరాముడు సీతాదేవిని పొంది రావణాది రాక్షసులను తుదముట్టించినట్లుగా మిమ్ములను యమపురికి పంపివేస్తాడు.

శ్రీరామునకు సీత ఆరో ప్రాణం. ఆపద సమయంలో వనవాస దీక్షాకాలంలో కూడా ఆమె శ్రీరాముణ్ణే తలుస్తూ ఉంది. రాముని ప్రేమ పెన్నిధి ఐన సీతను ఎవరైనా ఏమన్నా అంటే శ్రీరాముడు సహించడు. మీ క్రూరత్వాన్ని విడిచి సీతాదేవితో మధురంగా మాట్లాడండి. ఆమెను శరణు వేడండి. అప్పుడు మనకు వేసే శిక్షలో తగ్గింపు రాయితీ ఉండొచ్చు. అదే నాకు మంచిదిగా కనిపిస్తోంది. ఏ స్త్రీ అయినా దుఃఖంలో ఉండగా ఇలాంటి కల వస్తే ఆమె తప్పకుండా కష్టాల నుండి బయటపడుతుంది. ఆమె పతి సాన్నిధ్యాన్ని పొందుతుంది.

ఇప్పటిదాకా ఈమెను మనం బాధించాం కదా! ఇప్పుడు మనలను ఈమె క్షమిస్తుందా? అనే అనుమానం పెట్టుకోకండి. ఈ సీతాదేవి నమస్కరించగానే వారిపైన ఆమె ప్రసన్నురాలు అవుతుంది.

మనలను ఇప్పుడు రక్షించవలసిన దేవత ఆమె. ఆమె ఎంతో దయామయురాలు. శ్రీరాముని ఇష్ట సఖి గదా! అందుకే ఈమెను మనం ప్రసన్నం చేసుకొంటే శ్రీరాముడు మనలను క్షమించి వదిలివేస్తాడు. ఈ విశాలాక్షి రూపంలోను అవయవ సంపదలతోను ఎట్టి అశుభాలు లేని సర్వశుభంకరి. కాని రజోస్తమోగుణాల ప్రభావంచేత ఈమె నేడు బాధలకు గురి ఐంది.

సీత శ్రీరాముని ప్రక్కన కూర్చుని దివ్య విమానాన్ని అధిష్ఠించినట్లు నేను కలలో చూశాను. ఈ దుఃఖాలు ఒక పీడ కల లాంటివి. ఆమె ఎప్పుడూ సుఖాలనే అనుభవించే యోగ్యత కల ఇల్లాలు. తాత్కాలికమైన మబ్బులు వీడిపోగానే ఆమె సూర్య సమప్రభావంగా వెలిగిపోతుంది. నా స్వప్న ఫలంగా సీతాదేవి అతి త్వరలో మనోరథాన్ని సిద్ధింపచేసుకొంటుంది. రావణుని నాశం శ్రీరామ జయం తప్పక కలిగి తీరుతాయి.

అదుగో చూడండి. ఈ సీతాదేవి ఎడమ కన్ను అదురుతోంది. ఇది శుభ సూచనం. ఈమె త్వరలో శుభవార్తను వినబోతోంది. అంతలో సీత ఎడమ భుజం కొద్దిగా పైకి పొంగి అదిరిపాటుకు గురిఐంది. ఇది కూడా సీతకు శుభసూచనమే. ఆడవారికి ఎడమ ప్రక్క మగవారికి కుడి ప్రక్క అదిరితే మంచిదని చెప్తారు కదా. ఏనుగు తొండం లాంటి సీత ఎడమభుజం కూడా అదురుతోంది. దీన్ని బట్టి శ్రీరాముడు ఈమె దగ్గర నిలిచినట్లే అనిపిస్తోంది.

అంతేకాదు పక్షి చిటారు కొమ్మల దాకా ప్రాకి అక్కడున్న గూటిలో చేరి మధురంగా ధ్వనిస్తోంది. ఆ కూజితం 'సీతా! భయపడకు. రాముడు నీ ఎదుటే ఉన్నాడ'ని చెప్తున్నట్లుగా ఉంది.

ఇదంతా విన్న సీత "ఓ వనితలారా! ఈ త్రిజట చెప్పినదంతా నిజం అయ్యి నేను నా భర్తతో కూడితే మీరందరికి మంచి చేయమని శ్రీరామునితో చెప్తాను" అంటూ సీత అభయం ఇచ్చింది.

* * *

# సీత ప్రాణ త్యాగానికి ఒడిగట్టటం

## సర్గ - 28

ఆ సీతాదేవి రావణుని కఠోర మాటలు గుర్తుకువచ్చి అడివి నడుమ సింహం చేత చిక్కిన గున్న ఏనుగులాగా దుఃఖించింది. ఆమె ఎవరూ లేని అనాథలాగా బాధపడుతూ రాక్షస స్త్రీలు పెట్టే బాధలు భరించలేక వారి కర్ణకఠోరమైన వాక్కులతో భీతిచెంది ఏమీ తెలియని పసి బాలికలాగా ఏడ్చింది.

ఈ లోకంలో ఎవరికైనా వారు కోరుకొన్నప్పుడు మృత్యువు రాదు. ఇది నిజమే. ఈ రక్కసి మూక మధ్య నలిగే నేను అనుక్షణం మృత్యువే కోరుకొన్నా అది నా చెంతకు రావడంలేదు. ఈ దుష్ట చరిత్రగల రావణుడు నా దోషమేమీ లేకుండానే నన్ను బంధించడమే కాక నాకు అవధి కూడా పెట్టాడు. అవధి దాటగానే నన్ను తినివేస్తానని అంటున్నాడు. అయినా నాకు చావు రావడంలేదు. అంటే నా హృదయం వజ్రం కన్నా గట్టిదైఉండాలి. శ్రీరాముని వదిలి ఇన్నాళ్ళైనా నేను బ్రతికే ఉన్నాను.

ప్రాజ్ఞుడైనవాడు అపాత్రునకు మంత్రం ఉపదేశించలేనట్లుగానే ఈ దుర్మార్గునికి నేను మనస్సు ఇవ్వలేను. శ్రీరాముడు రెండు నెలలు దాటకముందే రాకపోతే ఈ రావణుడు పదునైన ఆయుధాలతో నన్ను ముక్కలుగా చేస్తాడు. అయ్యో రామా! లక్ష్మణా! అత్తలారా! నా మొర ఆలకించండి. నా బాధలను తెలుసుకోండి.

దురదృష్టవంతురాలైన నేను మహాసముద్రంలో పెనుగాలికి చిక్కిన నావలాగా దుర్మార్గులచేతచిక్కి అల్లాడిపోతున్నాను. బలశాలురైన రాజకుమారులిద్దరూ నావల్లనే ఆ మాయామృగం వేటలో ఆపదల పాలయ్యారు. అసలు కాలపురుషుడే ఆ మృగ రూపంలో వచ్చి నన్ను ప్రలోభ పెట్టాడు. మూర్ఖురాలనై నేను అనవసరంగా వారిద్దరిని వెళ్ళమని ప్రోత్సహించి మరీ పంపాను. ' వెళ్ళను మొర్రో ' అనే లక్ష్మణుని సైతం పంపించి వేశాను. ఇదంతా నా దురదృష్టం. ' ఓ రామా! నీవు సత్యసంధునివి, ధర్మాత్ముడవు. మీ భార్యనైన నన్ను ఈ రాక్షసులు నేడు వధింపబోతున్నారు. మీకీ విషయం ఇంకనూ తెలీలేదా? మిమ్మే పరదైవంగా ఆరాధిస్తూ నేను నీ దర్శనం కోసం అశ్రులు చాస్తున్నాను. ఓర్పుతో కటిక నేల మీద పడుకొంటూ నియమ నిష్ఠలతో జీవిస్తున్నాను కాని కృతఘ్నులకు మానవులు చేసిన ఉపకారం లాగా నిష్ప్రయోజనంఅవుతోంది.

రామా! నాకు మీ దర్శన భాగ్యమే కరువైనది. నా ధర్మాచరణం గాని మిమ్ము ననుసరిస్తూ పాతివ్రత్య ధర్మాన్ని పాటించడం కాని ఏదీ నాకు కలసి రావడంలేదు. నేను ఎన్ని చేసినా అవన్నీ నిష్ప్రయోజనాలు అవుతున్నాయి. ఓ రామా! మీరు మీ పిత్రాజ్ఞను పాటించి తిరిగి అయోధ్యకు మరలి సుఖాలను అనుభవిస్తారని తలుస్తాను.

ఓ రామచంద్రా! నేనుమిమ్మే నమ్మి మీపైఅనురాగాన్ని పెంచుకొన్నాను. మీపై ప్రేమతోనే ఈ రాక్షసుల మాటలను వినలేకపోతున్నాను. కానిమిమ్ము చేరాలని నేను దర్మాచరణలో మునిగిఉన్నాను. కాని ఈ ధర్మాచరణతో నాకు ఒరిగినది ఏమి ఉంది? ఛీ నేను ఈ దుర్భర జీవితాన్ని భరించలేను. ప్రాణాలను త్యజించి వేస్తాను. విష భక్షణం చేతగాని ఆయుధంతోగాని నేను దేహత్యాగం చేస్తాను. కాని ఈ రాక్షసులు నాకు నే కోరుకొన్నవి ఇవ్వరు గదా! అనుకొంటూ సీత పరితపిస్తూ శ్రీరాముణ్ణే నిత్యం స్మరిస్తూ నోరు ఎండిపోగా అశోక వృక్షం దగ్గరకు వెళ్ళింది. అంతలో ఆమె జడ ముందుకు రాగా దానిని చేతితో పట్టుకొంది. ఆహా! ఈ జడతోనే నేను ఉరి వేసుకొంటాను. త్వరగా యమపురి చేరుతాను. ఇదినాకు యుక్తంగా కనిపిస్తోంది అనుకొంది. అంతలో మరల శ్రీరాముని గుణగణాలు తలపుకు రాగా ఆమె శ్రీరాముణ్ణే స్మరించసాగింది. ఆమె ఎడమ భుజం మరల అదిరిపాటుకు గురి అయ్యింది. సీత మనస్సులో భయం తొలగి ఏదో ధైర్యం వచ్చినట్లుగా అనిపించింది. మరల సీతలో ఏదో ఆశ తొణికిసలాడింది. శ్రీరాముణ్ణి గూర్చే ఆమె స్మరించసాగింది. ఇలా మాటిమాటికి సీతకు దుఃఖాలు సంచితపాపంలాగా వస్తూనే ఉన్నాయి. దుఃఖంనుంచి రామచంద్రుని గుర్తులతో కాసేపు బయటపడుతూ తిరిగి దశకంఠుని అనుచరుల బాధల లో పడి ఆమె దుఃఖార్తికి లోను అవుతూ తిరిగి కోలుకుంటూ కాలం గడుపుతూ దిక్కులు పరికిస్తోంది.

* * *

# సీతాదేవికి శుభ శకున దర్శనం

## సర్గ - 29

ప్రాణత్యాగానికి ఒడిగడుతూ, జీవితంపై ఆశను బలవంతంగా వదిలివేస్తూ అంతలోనే మరల శ్రీరాముడు తనను రక్షిస్తాడని, రక్షించలేకపోతున్నాడంటూ పరితపించే అన్య మనస్సుతో పరి పరివిధాల ఆలోచించే అబలామణి ఐన సీతకు తనను ఆదుకోవడానికి ఆప్తులు దరి చేరినట్లుగా ఎన్నో శుభ శకునాలు కనిపించసాగాయి.

కేశ సౌందర్యంగల సీత తన విశాల నేత్రాలను అటు ఇటు తిప్పి చూడసాగింది. నల్లని రెప్పల వెంట్రుకలతో ఉన్న కన్నులలో ఎడమ కన్ను కారణం లేకుండానే అదిరింది. సీతాదేవి ఎడమ భుజం గుండ్రంగా పరిపుష్టంగా ఉంది. ఆదాయ భుజం కూడా హేతువేది లేకుండా ఊరికినే అదురుతోంది. అరటి బోదెలాంటి ఆమె ఎడమ ఊరువు శ్రీరాముడు ఎదురుగానే ఉన్నట్లుగా అదిరింది.

సీతాదేవి సుదంతి. ఆమె పలువరుస దానిమ్మ గింజలను పోలి ఉంటుంది. ఆమె పెదవులు ఏ పూతలు పూయకుండానే దోర పండులాగా ఎర్రగా మెరుస్తూంటాయి. ఆమె నిలబడి శ్రీరాముని స్మరించుతూ ఉండగా ఆమె కట్టుకొన్న మలిన వస్త్రం ఆమె ఎద మీదనుంచి జారింది. దాంతో ఆమె నా భర్త రానున్నాడేమోనని ఆలోచన వచ్చి ఆనందించింది. ఆమె శరీరంలో కలిగే శుభ శకునాలతో మనస్సు స్పందించగా ఆమె తనకు రాబోయే ముప్పు తొలగి తాను త్వరలోనే నా భర్తను చేరబోయే క్షణం వస్తూందనుకొనసాగింది.

ఆ సీతాదేవిముఖంరాహుముఖం నుండి వెలువడిన చంద్రబింబంలాగా ప్రకాశవంతం అయ్యింది. శుభశకునాలతో ఆమె తేరుకొంది. అప్పటివరకూ అనుభవించిన బాధలు దూరం అయ్యిపోతాయన్నభావన కలిగి ఆమె ధైర్యం తెచ్చుకొంది.

ఆ ధైర్యం ఆమెకు తృప్తినిచ్చింది. దైన్యస్థానంలో ఆనందం ప్రవేశించి బుద్ధి వ్యాకులతను వీడి స్థిమితం అయ్యింది. శోకం వీడిపోయింది. మనస్తాపం దూరం అయ్యింది. మనస్సు ఆనందించింది. పండు వెన్నెలను ప్రకాశించే పూర్ణచంద్రునిలాగా ఆమె ముఖం తేజోవంతం అయ్యింది.

* * *

# హనుమంతుని ఆలోచన

## సర్గ - 30

**అ**శోక వృక్షంపైనే కూర్చుని ఉన్న హనుమంతుడు సీతాదేవిని చూసి సంతోషించాడు. అంతలోనే రావణుడు రావడం వైదేహిని భయపెట్టడం విన్నాడు. రావణుని ఆజ్ఞతో రాక్షస స్త్రీలు జానకిని బాధించడం చూశాడు. త్రిజట స్వప్న వృత్తాంతం చెప్పటం విన్నాడు. అన్నీ చూస్తూ దైన్య స్థితిలో సీత ప్రాణత్యాగం చేయాలనుకోవడం చూసి నేను ఇప్పుడు ఈ సీతమ్మతో మాట్లాడితే మంచిదా? కాదా? అన్న ఆలోచనతో హనుమంతుడు నలువైపులా చూడసాగాడు.

ఈ సీతాదేవి జాడ తెలుసుకోవడం కోసం లక్షల సంఖ్యలో వానరులు భూమండలం అంతా వెదుకుతున్నారు. అయినా నా అదృష్టం వలన ఈమె నాకే కనిపించింది. నేను చక్కగా రాక్షసుని పూర్వాపరాల గురించి తెలుసుకొన్నాను. ఇక్కడే దైవం అనుకూలించడంతో లంక అంతా తిరిగి ఈ రాక్షసుని శక్తియుక్తులన్నీ గ్రహించాను. సమస్త ప్రాణులకు అభయం ఇచ్చే శ్రీరాముని పత్ని నేడు పరితపిస్తోంది. రాక్షసుల బాధలను భరించలేక ప్రాణ త్యాగానికి కూడా తలవంచుతోంది. ఇలాంటి సీతమ్మకు నేను ఓదార్పు ఇవ్వడం ఎంతో మంచిది అనుకొన్నాడు.

శ్రీరాముని భార్య దశరథుని కోడలైన సీత ఇంతకుముందెప్పుడూ కష్టాలు చవి చూడలేదు. ఇప్పుడు ఈ అనుకోని దుఃఖభారాన్ని మోయలేక క్రుంగిపోతోంది. ఈ స్థితిలో ఆమెను అనునయించడం ఎంతో అవసరం. ఈ పరిస్థితులలో నేను ఏమీ మాట్లాడకుండా ఇక్కడ నుంచి వెళ్ళిపోతే ఈమె ఏదైనా ప్రాణహాని తలపెట్టితే నేను చేసిన పని అంతా వృధా అయిపోతుంది.

ఆజానుబాహువు ఐన శ్రీరాముడు క్షణ క్షణం సీతాదేవి విరహంలో కాలిపోతున్నాడు. అలాంటి శ్రీరామునకు ఈమె లభ్యం కాకపోతే ఆయన ప్రాణాలు నిలవవు. అటు శ్రీరాముణ్ణి ఇటు సీతమ్మను నేను ఓదార్చడమే మంచిది అనుకొన్నాడు. కాని ఈ రక్కసి మూకల మధ్యనున్న ఈ సీతతో నేను మాట్లాడేది ఎలా? అని సందేహించాడు.

నేను శ్రీరాముని దగ్గరకు వెళ్ళి నేను సీతమ్మను చూశాను అని చెప్పితే నా గురించి నా సీత ఏమంది అని అడిగే శ్రీరామునకు నేను ఏమని సమాధానం ఇవ్వగలను. కానీ ఏదో విధంగా నైనా నేను ఈ జానకితో మాట్లాడి తీరాలి అని మారుతి అనుకొన్నాడు. సీతను అనునయించకుండా నేను తిరిగి వెళ్ళి సుగ్రీవుని సైన్యాన్ని రామలక్ష్మణులను తీసుకొచ్చి రావణుని అంతం చేసినా అంతలో ఈ సీతమ్మ ప్రాణాలను వదిలేస్తే నేను ఏం చేసి ఏం లాభం ఉంటుంది?

నేను ఇక్కడే ఉండి అవకాశం దొరకగానే ఈ జానకితో మాట్లాడి ఆమెకు ధైర్యం చెప్పి ఆమె చెప్పే మాటలను వినితీరుతాను అని గట్టిగా మారుతి అనుకొన్నాడు.

నేను ప్రస్తుతం సూక్ష్మరూపంలో ఉన్నాను కదా! నేను ఆమెతో ఏ భాషలో మాట్లాడాలో అని ఆంజనేయుడు ఆలోచించాడు. ఒకవేళ సంస్కృతంలో మాట్లాడితే నన్ను రావణుడని అనుమానిస్తుందేమో? లేక మానవుల సరళమైన భాషలో మాట్లాడిస్తే నా వానర రూపం చూసి సీత శంకిస్తుందేమో అని మారుతికి అనిపించింది.

ఏదిఏమైనా సామాన్య జనావళి భాషలో ఈమెను నేను అనునయిస్తాను. అన్నెం పున్నెం ఎరుగని ఈ బాలకు నేను ధైర్యాన్ని కలిగిస్తాను. అసలే ఈమె రాక్షసులవలన భీతి చెంది ఉంది. నా వానర రూపం మానవ భాష చూసి మరింతగా భయపడి తీరుతుంది. నన్ను చూసి రావణుడు కామరూపి కదా ఈ వేషంలో వచ్చాడని తలచి బిగ్గరగా అరుస్తుంది. ఆ అరుపులకు ఈ భయంకరాకారులగు రాక్షసులు నాపై పడిపోతారు.

వారికి అందకుండా నేను ఈ వృక్ష శాఖలో పరుగెడుతూ గెంతులు వేస్తే రాక్షసులు భయపడతారు. దానితో వీరందరూ వెళ్ళి ఆ రావణునికి నా విషయం అంతా పూస గుచ్చినట్లుగా చెప్పి తీరుతారు. ఇక రాక్షస సేన అంతా ఆయుధధారులై నన్ను చుట్టు ముట్టుతారు. ఇలా మంచిదికాదు అని మారుతి అనుకొన్నాడు. వారిని ఒక్కడినే నేను గెలవలేకపోతే, ఈ సముద్రాన్ని దాటి శ్రీరామునికి సీత విషయం తెలియపర్చకపోతే ఇక ఏమన్నా ఉందా? చేసిన కార్యం అంతా అగ్నికి ఆహుతి ఐనట్లుగా సర్వనాశనం అయిపోతుంది.

దాంతో రామ సుగ్రీవులు వచ్చేలోపల ఈ వికృత రాక్షసులు సీతాదేవిని హింసల పాలు చేస్తారు. నేను వీరికి పట్టుబడినా వీరిని హతమార్చలేకపోయినా రామకార్యం అర్థాంతరంగా నిలిచిపోతుంది.

మరొక వానరుడు ఈ సంద్రాన్ని దాటి వచ్చి విషయం తెలుసుకొని రామునకు చెప్పలేడు. వేలకొలది రాక్షసులను నేను హతమార్చగలను. కాని గడువులోపల నేను ఆవలికి వెళ్ళి అంగదునికి విషయం చెప్పడంలో అశక్తుడిని అయిపోతాను. యుద్ధ రంగంలో జయాపజయాలు దైవాధీనాలు. ఆలోచించకుండా బలం ఉంది కదా అని పోరుకు సిద్ధపడితే ప్రయోజనం శూన్యమే అవుతుంది. ఇలాంటి పని ఏ వివేకి చేయదు.

అయ్యే కార్యం కూడా అసమర్థుడైన దూత వలన చెడిపోతుంది. రామకార్యం చెడిపోకూడదు. నా సముద్ర లంఘనం వృథా కాకూడదు. వానరసేన రామునికి సహాయం చేయడం వెనుకడుగు వేయకూడదు. ఇన్ని జరగాలంటే నేను ఏం చేయాలి అని హనుమంతుడు వేయి విధాలుగా ఆలోచించసాగాడు.

శ్రీరాముడు ప్రజ్ఞావంతుడు. అవలీలగా కార్యాలను చేసే సమర్థుడు. ఆయన నాకు ప్రభువు. ఆయన గుణగానాన్ని నేను సీతకు కనిపించకుండానే వినిపిస్తాను. ఈమె భయ సందేహాలను నా మాటలతో నివృత్తి చేస్తాను. ఒకవేళ నేను కనపడితే ఈమె ఉద్వేగానికి గురి అవుతుందేమో. కావున నేను ఇక్కడ ఉండే రామగుణగణ కీర్తనం చేసి సీతమ్మను ప్రసన్నురాలిని చేసుకొంటాను. నా మాటలతో శ్రీరాముని వంశ వివరాలను తెలుపుతాను. అప్పుడు సీతమ్మ కు విశ్వాసం నమ్మకం కలుగుతాయి. ఇలా అనుకొన్న ఆంజనేయుడు మృదుమధురంగా యదార్థాలను చెట్టుకొమ్మలపైనుంచే పలకడం ఆరంభించాడు.

* * *

# హనుమంతుని రామకథా గానం

## సర్గ - 31

ఆంజనేయుడు సీతాదేవికి మాత్రమే వినిపించేటట్లు మధుర కంఠంతో రామకథను శింశుపావృక్షం పైనుండే వినిపించసాగాడు. ఇక్ష్వాకు వంశజులలో దశరథుడు గొప్ప చక్రవర్తి. పవిత్ర స్వభావం. సత్యవాక్కు ఆయన సొంతం. గొప్ప కీర్తితో ఈ భూమండలాన్నంతా పరిపాలించాడు. రథ అశ్వగజ తురగ బలాలు కలవాడు. అయోధ్యాపురి నేలే దశరథునికి నలుగురు కుమారులున్నారు. ఇక్ష్వాకు వంశానికే తలమానికమైన మహారాజుకు తన పుత్రులలో పెద్దవాడు శ్యామవర్ణుడు ఐన ఆ శ్రీరాముడంటే చాలా ప్రీతి.

ప్రజారంజకంగా పాలన చేసే దశరథుడు తన ప్రియ భార్యకు ఇచ్చిన మాట వలన తన ప్రాణమైన శ్రీరాముణ్ణి అడవులకు పంపాడు. శ్రీరామునితోపాటు తమ్ముడైన లక్ష్మణుడు, భార్య ఐన సీత కూడా వనవాస దీక్షాబద్ధులై దండకారణ్యానికి వచ్చారు.

సమస్త ధర్మాలను ఎరిగిన రాముడు ఖరదూషణాది రాక్షసులను 14 వేలమందిని ఆ అరణ్యంలో మట్టుపెట్టాడు. రామలక్ష్మణులు తాపస వేషంలో మునివృత్తిని అవలంబించి పర్ణశాలలో సీతతో ఉన్నారు. అప్పుడు మాయామృగ వేటకోసం రామలక్ష్మణులు పర్ణశాలకు దూరంగా వెళ్ళారు. అదును చూసి దుష్టరావణుడు సీతమ్మను అపహరించి వెళ్ళాడు. జటాయువు ద్వారా రామలక్ష్మణులు విషయం విని సీత కోసం పరితపిస్తూ అన్వేషించసాగారు. వారికి ఋశ్యమూక పర్వతంపైన సుగ్రీవునితో స్నేహం కుదిరింది. సుగ్రీవుని అన్న మహాపరాక్రమశాలి ఐన వాలిని చంపి వానరలోకానికి సుగ్రీవుని రాముడు రాజు చేశాడు. ఆ ఉపకారంతో సుగ్రీవుడు లక్షల కొలది వానరులను భూలోకం అంతా సీత జాడ తెలుసుకోవడానికి పంపించాడు. నేను మరికొందరు వానరులం కలిసి దక్షిణ దిక్కుకు సీత అన్వేషణకొరకు వచ్చాం. అక్కడ సంపాతి అనే జటాయువు అన్న ద్వారా లంకలోని సీత గురించి తెలుసుకొన్నాం. నేను వంద యోజనాలున్న సముద్రాన్ని దాటి లంకలో ప్రవేశించాను. ఇప్పుడు శ్రీరాముడు వర్ణించిన రూప సౌభాగ్యాన్ని తేజో విశేషాన్ని మనస్సున దాచుకొన్న నాకు ఆ దివ్యమూర్తి దర్శనం ఇచ్చింది. ఆ

శ్రీరాముడు వర్ణించి చెప్పిన సర్వ శుభలక్షణ కల్యాణిని నేను చూశాను. ఇలా రామకథనంతా గానం చేసి ఆంజనేయుడు కూర్చున్నాడు. ఆ కపివరుని మాటలు విన్న జానకీదేవి చాలా ఆశ్చర్యం పొందింది. నొక్కులతోనున్న కేశాలను ప్రక్కకు తొలగించి ఆ శింశుపా వృక్షంపైకి తల ఎత్తి చూసింది. అన్ని దిక్కులూ చూస్తూ శ్రీరాముని గుణాలను విని పరమానందించింది. శుభశకునాలకు నిదర్శనంగా వినిపిస్తున్న రామకథాగానానికి అబ్బురం, ఆనందం కలగలసి సీతమ్మ హృది నిండింది. వర్ణించలేని సంతోషం ఆమెను రామదర్శనానికి ఆతృతపడేలా చేస్తోంది. ఇక్కడ నుంచి ఈ మధురగానం వినిపిస్తోందా అని జానకి నలువైపులా చూస్తోంది. సీతమ్మ నలుప్రక్కలకు పరికించడం మహాబుద్ధిశాలి ఐన సుగ్రీవుని సచివుడు ఉదయాద్రిలోని బాల భానునిలాగా ఉన్న ఆంజనేయుడు చూశాడు.

* * *

# సీతాదేవి ఆలోచనాలోచనం

## సర్గ - 32

కొమ్మల మధ్య ఆకులో ఆకై ఆంజనేయుడు కూర్చున్నాడు. పచ్చని వర్ణంతోనున్న ఆంజనేయుడు పుటం పెట్టిన బంగారు వన్నెతో తెల్లని వస్త్రాలు ధరించి వినయంగా కూర్చున్నాడు. ఆ కపిశ్రేష్ఠుణ్ణి సీతమ్మ తలఎత్తి చూసింది. ఆహా! ఈ వానరుని రూపం ఆశ్చర్యానుభూతులు కలిగిస్తోంది అనుకొంది. మరల చూసింది. భయంతో ఆమె హృదయం బరువెక్కింది. స్పృహ కోల్పోయింది. సీత రామా!, లక్ష్మణా! అంటూ దీనంగా రోదించింది.

మళ్ళీ తెలివి తెచ్చుకొని కపివరుని చూసి ఇది నాకల ఏమో అనుకొంది. అయ్యో! స్వప్నంలో వానర దర్శనం మంచిది కాదు. స్వప్న శాస్త్ర ప్రకారం వానర దర్శనం అయితే అశుభం జరుగుతుంది కదా. నేడు ఏమి దుఃఖంలో ఉన్న నాకు ఇలా కల వచ్చింది. రామలక్ష్మణులు, నా తండ్రి క్షేమంగా ఉండాలని దేవుని ప్రార్థించింది. అప్పటివరకూ ఆహ్లాదంగా ఉన్న మనసు అధైర్యానికి గురైంది. మరలా ఐనా నా రాముడు లేకుండా నాకు నిద్ర ఎక్కడనుండి వచ్చింది. ఇది కల కానేరదు. ఇది నిజమే అయ్యి ఉంటుంది. నేను ఎప్పుడూ శ్రీరాముణ్ణీ తలస్తున్నాను కదా. అందుకే ఆయన కథే నా చెవులకు వినిపించి ఉంటుంది. నేను ఏదో చూసి భ్రమపడి ఉంటాను. భ్రమరకీట న్యాయంగా నేను ఏది తలుస్తానో అదే నాకు కనపడుతోంది అనుకొంది. అయినా నాకు వానర రూపంగా స్పష్టంగా కనిపిస్తుంది. ఇది నిజమే అయ్యి ఉంటుంది.'ఓ దిక్పాలులారా!, దేవతలారా! నేను వినేది నిజమై ఉండాలి. ఇతడు రాముని పక్షంవాడు అయ్యి ఉండేలా నాకు సహాయం చేయండి ' అని సీతాదేవి అందరు దేవుళ్ళను ప్రార్థించింది.

* * *

# సీతా హనుమంతుల సంభాషణం

## సర్గ - 33

ఇదమిద్ధంగా తేల్చుకోలేకుండా మాటిమాటికి చూస్తున్న సీత దగ్గరకు హనుమంతుడు శింశుపావృక్షం దిగి క్రిందకు వచ్చి నిలిచి నమస్కరించాడు. తామర రేకుల వంటి కన్నులున్న " ఓ దేవి! ఈ చెట్టును ఆశ్రయించుకొన్న మీరు ఎవరు? మీ నేత్రాలనుండి సంతతధారగా కన్నీరు ఎందుకు స్రవిస్తోంది? ఓ మంగళప్రదురాలా! మీరు యక్షకిన్నరనాగజాతులలో ఏ జాతికి చెందినవారు?

మీరు నాకు ఒక దేవతలాగా కనిపిస్తున్నారు. మీరు మరుద్గణాలకుగాని, వసు గణాలకు గాని చెందిన వారా? లేక దివి నుండి దిగి వచ్చిన తారవా? లేక మీ పొరపాటు వలన గాని మీ భర్త అయిన వశిష్ఠుని కోప కారణంగా ఇక్కడకు వచ్చిన అరుంధతి మీరు కాదు గదా. ఓ నారీ రత్నమా! మీ పుత్రులెవ్వరు? మీ భర్త ఎవరు? మీ తండ్రి ఎవరు? పరలోకానికి వెళ్ళిన వారికోసం మీరు దుఃఖిస్తున్నారా?

మీరు ఈ భూతలాన ఉండడం, మీ రోదనం చూసి మీరు దేవతా స్త్రీలు కారని నాకు అనిపిస్తోంది. మీ అవయవ చిహ్నాలను బట్టి మీ సాముద్రికా లక్షణాలను బట్టి మీ రొక రాజకన్యలని లేక ఒక మహారాజుకు పట్టపు రాణులని నాకు అనిపిస్తోంది.

ఒకవేళ రావణుడు అపహరించి తీసుకొచ్చిన శ్రీరాముని ధర్మపత్నివి మీరే అయితే ఆ విషయాన్ని నాకు వివరంగా చెప్పుము. మీ లోకోత్తర రూపం, మీ దైన్య స్థితి, మీ వ్యాకులత్వం నాకు మాత్రం నా రాముని ప్రియసఖివైన సీతవని తోస్తోంది. నిజమేమిటో నాకు తెలియజేయి అమ్మా" అని హనుమంతుడు సీతాదేవిని అడిగాడు.

ముందు హనుమంతుడు పాడిన రామ కథనంతా సీత వింది. ఇప్పుడు వానర రూపాన్ని చూస్తోంది. హనుమంతుని మాటలు వింటోంది. సీతకు ఆశ్చర్యం, ఆనందం వేస్తున్నాయి. రాముడు పంపించిన వాడే అయిఉంటాడని మనస్సుకు అనిపించి సీత " ఓ వానరోత్తమా! శత్రు సైన్యములను పరితపింప చేసే దశరథుని కోడలిని నేను. మహానుభావులు పరాక్రమశాలి ఐన విదేహ రాజు జనకుని పుత్రికను నేనే. శ్రీరాముని భార్య అయి ఏ లోటు లేకుండా మహారాజ భోగాలన్నీ అనుభవిస్తూ పన్నెండు ఏళ్ళుగడిపాను.

ఆ తర్వాత శ్రీరాముని పట్టాభిషేకసంకల్పాన్ని దశరథుడు చెప్పగా విని మేమందరం సంతోషించాం. దశరథుని ముద్దుల భార్య అయిన కైకేయి శ్రీరాముని పట్టాభిషిక్తుని చేస్తే అన్నపానాదులు ముట్టనని భీష్మించుకు కూర్చుంది. అప్పుడు ఆమె మాట ప్రకారం మా మామగారు నా భర్తను పదునాలుగు ఏండ్లు వనవాసం చేయమన్నారు.

పుత్రుని దూరం చేసుకోలేని దశరథుడు ఎంతో దుఃఖించాడు. కాని ధర్మసత్యాలకు కట్టుబడి కఠోరమైన పనిని చేయాలనుకొన్నాడు. తండ్రిని సత్యవంతునిగా చేయాలని నా భర్త మనస్ఫూర్తిగా వనవాసానికి అంగీకరించాడు.

ఇతరులకు అప్రియం చేయని మా రాముడు అమూల్యమైన పట్టు వస్త్రాలను, ఆభరణాదులను త్యజించి నారవస్త్రాలు ప్రియంగా ధరించాడు. నన్ను కౌసల్యాదేవి దగ్గరుండమని నా నాథుడు ఆదేశించాడు.

నేను మాత్రం భర్త సాహచర్యం లేకుండా ఉండలేనని చెప్పి భర్త తోడిదే లోకమని చెప్పి ఆయనను మాటలతో ఒప్పించి ఆయన కన్నా ముందుగా నేను అడవులకు బయలుదేరాను.

అందరికి మిత్రుడుగా ఉండే సౌజన్యమూర్తిఅయిన సుమిత్రా దేవి కుమారుడు అన్నకు సేవలనుచేయడానికి నారవస్త్రాలు ధరించి వనవాసానికి సన్నద్ధుడు అయ్యాడు. మేమిద్దరం శ్రీరాముని ఒప్పించి ఆయనతో వనవాసం చేయడానికి ఉద్యుక్తులం అయ్యాం.

మేము దశరథమహారాజుకు నమస్కరించాం. మేము ఆయన అనుమతిని తీసుకొని దండకారణ్యాలకు పయనమై వచ్చాం. నా నాథుడు ఆయన తమ్ముడు లేని సమయంలో మారువేషంలో ఈ రావణుడు వచ్చి నన్ను అపహరించి ఇక్కడకు తీసుకొచ్చాడు.

నన్ను అప్పటినుండి ఎన్నో బాధలు గురి చేస్తున్నాడు. ఇప్పుడు రావణుడు విధించిన గడువులో రెండు నెలలు మాత్రమే ఉంది. అంతలో రాముడు నన్ను రక్షించలేకపోతే నేను గడువు ముగియకనే ప్రాణత్యాగం చేస్తాను అని సీత తన వృత్తాంతమంతా ఆంజనేయునకు చెప్పింది.

* * *

# సీతా సందేహం

## సర్గ - 34

తన బాధనంతా చెప్పుకొన్న సీతాదేవిని హనుమంతుడు ఓదార్చాడు. "అమ్మా! నేను శ్రీరాముని దూతను. నా స్వామి పంపగా మీ దగ్గరకు వచ్చాను. ఆయన మీ యోగ క్షేమాలను అడిగిరమ్మని నన్ను పంపాడు. అమ్మా! మీ మరిది, మీ నాథునికి ఇష్టుడైన లక్ష్మణుడు మీకు శిరసా ప్రణమిల్లుతున్నానని చెప్పమన్నాడు. వారిద్దరూ మీరు దూరం అయినారని చాలా దుఃఖిస్తున్నారు " అని చెప్పాడు. ఆ మాటలు విని రామలక్ష్మణుల కుశలంవిని సీత ఎంతో ఆనందించింది.

" వానరవీరా! బ్రతికి ఉంటే ఏనాడో ఒకనాడు ఆనందం పొందవచ్చుననే పెద్దల మాట నాకు నిజమని తోస్తోంది." అంది సీత ఆమెకు ఆంజనేయుని మీద నమ్మకం కలిగింది. మారుతి మృదుభాషణలు ఇంపును కలిగిస్తున్నాయి. ఇంకా వినాలనిపించే మాటలను వింటోంది.ప్రియంగా వారు మాట్లాడుకొన్నారు. ఆ సమయంలో కపిశ్రేష్ఠుడు ఆమె దగ్గరగా రాసాగాడు. అపుడు ఈ వానరుడు రావణుడు కాదుగదా! అని సీతమ్మ శంకించింది.

అయ్యయ్యో! నేను ఎంత పిచ్చిదానిని. ఈ వానరుని నమ్మి నా కథనంతా చెప్పాను. తప్పక వీడు దుష్ట రాక్షసుడే అయి ఉంటాడేమోనని సీత అనుకొని అశోకవృక్షం కొమ్మను వీడి క్రింద కూర్చుంది. అలా కూర్చున్న సీతను చూసి ఆమె దుఃఖాన్ని చూసి ఆంజనేయునికి ఏం చేయాలో తెలియక ఆమెకు శిరస్సు వంచి ప్రణామం చేశాడు. భయంతో వణికిపోతున్న సీత మరల వానరుని వంక చూడలేకపోయింది.

పాదప్రణామం చేస్తున్న కపివరుని చూసి భయంతో కూడిన సీత, " ఓ వానరా! నాకు నీవు రావణునివేమోనని అనుమానం కలుగుతోంది. దండకారణ్యంలో సన్యాసివేషంలో కనిపించినది నీవుకాదు గదా! అసలే దుఃఖంలో ఉన్నాను. అలాంటి నన్ను నీవు వంచించడం భావ్యం కాదు.

అయినా నీ రూపం నాలో భయాన్ని కలిగించడం లేదు. బహుశా! నీవు రావణుడవు కావేమో. ఓ కపివరా! నీవు నిజంగా నా రాముని దూతవైతే నా రామ కథను నాకు వినిపించు నీకు మంగళం అవుతుంది. నా రాముని గూర్చి వింటే నా హృదయవేదనాభారం తగ్గుతుంది.

అయినా ఇది చిత్తభ్రమ కాదు గదా! నేను చాలా దురదృష్టవంతురాలిని. నాకు నిద్ర వచ్చినా అందులో ఇలాంటి కలలు కనేదాన్ని. అప్పుడే నా రాముడు పంపిన దూతను కన్నులారా చూసి ఆనందించేదాన్ని కాని నాకా భాగ్యం కూడా లేదు. నా నిద్రాదేవికి కూడా నాపై ప్రేమ లేదు. ఆమె నా దగ్గరకు రాదు. అయినా నేను మేల్కొనే ఉన్నాను. స్పృహలోనే ఉన్నాను. ఇదంతా నిజమే అయి ఉంటుంది. నేను కలలో లేను. నేను ఇలలో ఉండి ప్రత్యక్షంగా రామదూత ఐన కపివరుని దర్శిస్తున్నాను. ఇది ఉన్మాదం కాదు. అయినా ఇదంతా రావణుని మాయోపాయం కాదు గదా!" అని మరల సంశయాత్మక మనస్సుతో డోలాయాన మనస్కురాలు అయింది. ఇన్ని ఆలోచనలతో నున్న సీత హనుమంతుని చూస్తూనే ఉంది కాని ఏమీ మాట్లాడక మౌనంగా ఉంది.

ఆమె స్థితిని అర్థం చేసుకొన్న ఆంజనేయుడు ఆమె మనస్సు ఊరడించాలనుకొన్నాడు. " అమ్మా! శ్రీరామచంద్రుడు రమణీయ రూపంతో ఉన్నవాడు. మధురంగా మాట్లాడడంలో బృహస్పతి వంటివాడు. సర్వలోక శ్రేష్ఠుడు, మహారథుడు. ముల్లోకాలను ఎదిరించగల ధైర్యశాలి. ఆయనకు భయపడి మాయామృగాన్ని నెపంగా చూపించి మీకు రాముని దూరం చేసి ఒంటరి ఐన మిమ్ము ఈ రావణుడు అపహరించాడు.

అమ్మా! మీరు శోకించవద్దు. త్వరలోనే రాముడు తన బాణాలతో లంకను దగ్ధం చేసి రావణుని హతమార్చి మిమ్ముచేపట్టుతాడు. ఓ దేవి! రాముడు అనుక్షణం మిమ్మే స్మరిస్తూ మీ విరహవేదనలో కూరుకుపోయి ఉన్నాడు. రామ లక్ష్మణులిద్దరూ మీ క్షేమాన్ని వాంఛిస్తున్నారు.

అమ్మా!నేను చెప్పేదంతా యథార్థమే. మీరు  త్వరలోనే వానరశ్రేష్ఠుడైన సుగ్రీవుని కూడా చూస్తారు. ఆ సుగ్రీవునకు నేను మంత్రిని. నా పేరు ఆంజనేయుడు. నేను సముద్రం దాటి, రాముని కోసం ఇక్కడకు వచ్చాను. మీరు అనుకొన్నట్లుగా నేను రావణుడను కాదు. రామకార్యం కోసం వచ్చిన హనుమంతుణ్ణి. నేను మీ క్షేమాన్ని ఎరిగి తిరిగి వెళ్ళి రాముని విషయం చెప్పి మిమ్ము రాముణ్ణి కలపాలనే స్థిర నిశ్చయంతో ఇక్కడకు వచ్చాను.

* * *

# సీతకు విశ్వాసం

## సర్గ - 35

**హ**నుమంతుని మాటలు సీతలో ఆశను కలిగించాయి. ఆమె దుఃఖం దూరం అయింది. దాంతో మధురంగా ఆమె హనుమంతునితో మాట్లాడింది. "ఆంజనేయా! నీకు శ్రీరామునితో ఎలా పరిచయం కలిగింది. మీకు ఆ నరవరులకు మైత్రీబంధం ఎలా ఏర్పడింది? రామలక్ష్మణుల రూపసౌందర్యాన్ని నాకు కన్నులకు కట్టినట్లుగా చెప్పగలవా?" అని హనుమంతుని అడిగింది.

" ఓ సీతాదేవి! రాముని భార్యయైన మీరు మీ భర్త రూపసౌందర్యవిశేషాన్ని నన్ను అడగడం నా భాగ్యం. మీకు తెలిసిన విషయమే అయినా నేను చెప్తాను విను తల్లీ అన్నాడు. అమ్మా! మీ నాథుడు పద్మపత్ర విశాలాక్షుడు. సూర్యుని కాంతిని, భూదేవి సహనాన్ని తన పరం చేసుకొన్నాడు. సర్వులకూ మనోరంజకం కలిగించే చక్కని దేహ సౌందర్యం ఉన్నవాడు. తన ప్రవర్తనతో ఆదర్శవంతంగా జీవించే ధర్మమూర్తి మీ నాథుడు.

వ్యవహారజ్ఞాన సంపత్తుతో ఏకపత్నీవ్రతం ఆచరించేవాడు. సర్వశాస్త్ర పారంగతుడు. సర్వప్రాణిని ఆదరించే గుణ సంపన్నుడు. సదాచార వినయ సంపన్నుడు. సర్వవేదాంతాన్ని శాస్త్రాలను చదివినవాడు. అందరిచేతా పూజలందుకొనేవాడు. తల్లిదండ్రులకే కాక ప్రజలందరికీ ఇష్టుడు. మీ మనోరథుడు.

అమ్మా సీతాదేవి! శ్రీరాముని రూపం సర్వలోకానికి సమ్మోహనకరంగా ఉంటుంది. ఆయన దీర్ఘబాహుడు శంఖం వంటి కంఠం ఉన్నవాడు. గుండ్రని భుజ సంపద కలవాడు. విశాల వక్షస్థలం కలవాడు. ఎర్రని కన్నుల మనోభిరాముడు. మేఘశ్యామవర్ణశోభితుడు. వక్షస్థలం, మణికట్టు, పిడికిలి దృఢంగా కలవాడు. ఆశ్రితజన రక్షకుడు. శరణు కోరిన వారిని కాదనకుండా ప్రాణాలకు తెగించి ఐనా రక్షించేవాడు.

కనుబొమ్మలు బాహువులు ముష్కములు సమ ప్రమాణాలుగా ఉన్నవాడు. నేత్రాంతములు, గోళ్లు, అరచేతులు, అరికాళ్లు ఎర్రగా ఉంటాయి. రాముని ఉదరం పైన మూడు రేఖలుంటాయి. అతని స్తనములు స్తనాగ్రములు రేఖలు పల్లంగా ఉన్నాయి. కంఠం, లింగం, వీపు, పిక్కలు హ్రస్వంగా ఉన్నాయి. కంఠం మీద మూడు రేఖలున్నాయి. రాముడు తొంభై ఆరు అంగుళాలున్నవాడు.

శ్రీరాముని కంఠస్వరం దుందుభి కంఠ స్వరాన్ని పోలి ఉంటుంది. సింహంలాగా శ్రీరాముడు గంభీరమైన నడక కలవాడు. ఓ దేవీ! శ్రీరాముని పెదవులు, దంతములు, నాసిక, చెవులు అన్నీ అందంగా తీర్చిదిద్దినట్లుగా ఉంటాయి. ఆయన కేశ సంపద నిగనిగలాడుతూ చిమ్మ చీకట్లను పోలి ఉంటుంది. శ్రీరాముని యశస్సు తేజస్సు లోక ప్రసిద్ధమైంది. శ్రీరాముడు సకలైక సంపన్నుడు. సత్యభాషణం ధర్మాచరణంలో ఆయనకు ఎనలేని ఆసక్తి.

దేశకాలరీతిగా ప్రవర్తించేవాడు. శ్రీరాముని తమ్ముడు సుమిత్రాదేవి కుమారుడు. రూప గుణాలలో శ్రీరామునికి లక్ష్మణుడు అనురూపుడే. శ్రీరాముడు శ్యామవర్ణుడు లక్ష్మణుడు మేనిఛాయవాడు. అతడు శ్రీరామునిలాగే సాటిలేని వీరుడు. కాంతిని నీడ అనుసరించినట్లుగా శ్రీరాముణ్ణే లక్ష్మణుడు అనుసరిస్తుంటాడు.

అమ్మా!జానకీదేవి! ఆ సోదరులిరువురూ నీ కోసం దుఃఖిస్తూ భూమండలం అంతా గాలిస్తూ మా దరికి చేరారు. వారి చేత రాజ్యబహిష్కరణ పొంది సుగ్రీవుడు ఋశ్యమూకంపై తలదాచుకొంటుండేవాడు. ఆ సుగ్రీవుని రామలక్ష్మణులు చూశారు. సుగ్రీవుడు సోదరులను చూసి వారిని వాలి పంపి ఉంటాడని తలచి భయపడి వారి దగ్గరకు మంత్రినైన నన్ను పంపించాడు.

నేను రామసోదరుల దగ్గరకు వెళ్ళి యథార్థాన్ని తెలుసుకొని సంతోషించాను. సుగ్రీవునికి రామునికి మైత్రి ఏర్పడింది. వారిద్దరూ మాట్లాడుకొని ఆలింగనం చేసుకొని గాఢమైన స్నేహబంధాన్ని పెనవేసుకొన్నారు. వారిద్దరూ వారి స్థితులను తెలుసుకొని ఒకరినొకరు ఓదార్చుకొన్నారు. మీ ఎడబాటువలన కలిగిన దుఃఖాన్ని లక్ష్మణుడు సుగ్రీవునకు తెలిపాడు.

రావణుడు మిమ్ము తీసుకొని వెళ్ళేటపుడు మీరు జారవిడిచిన నగలమూటను మేం దాచి ఉంచాం. అవి ఆ సోదరులకు చూపించాం. రాముడు వాటిని చూసి మిమ్ము తలచుకొని కన్నీరు మున్నీరుగా ఏడ్చాడు. అలా ఏడ్చి ఏడ్చి స్పృహ తప్పిపోయాడు. మేం రామునకు ఎన్నో ఉపచారాలు చేసి హితవాక్యాలు చెప్పి ఆయనను ఓదార్చాం.

ఓ సీతమ్మతల్లీ! మీ ఎడబాటువలన రాముడు నిద్రలేమి, శోకం చింతలో మునిగి దహించబడుతున్నాడు. భూకంపంతో చలించిన మహాపర్వతంలాగా శ్రీరాముడు మిమ్ము దూరం చేసుకొని భయకంపితుడయ్యాడు. ఓ రాకుమారీ! అందమైన నదీ నదాల చెంత సెలయేళ్ళ ప్రక్కన ఉద్యానవనాలలో సంచరిస్తూ కూడా మీరు లేనందున శ్రీరాముడు ఆనందించలేకపోతున్నాడు.

ఓ జానకీ! రామసుగ్రీవులు ఒక ఒప్పందం చేసుకొన్నారు. దాని ప్రకారమే సుగ్రీవుని కోసం రాముడు వాలిని సంహరించాడు. సుగ్రీవుడు తన భార్య ఐన రుమను రాజ్యాన్ని తిరిగి పొందాడు. సుగ్రీవుణ్ణి వానర రాజ్యానికి రాజుగా అధిష్ఠింపచేశాడు. ఇప్పుడు సుగ్రీవుడు రాముని దుఃఖాన్ని దూరం చేయాలని తలచాడు. సీతను అంటే మిమ్ము రాముని దగ్గరకు చేర్చాలని తలపెట్టాడు.

మిమ్ము అపహరించిన రావణుడు ఎక్కడ ఉన్నాడో మాకెవరికీ తెలియదు. మీరు ఎక్కడ ఉన్నారో కూడా తెలియదు. అందుకని సుగ్రీవుడు నలు చెరుగులా ఉన్న వానరులను కిష్కింధకు పిలిపించాడు. వారందరికీ విషయం వివరించాడు వారిని విభజించి భూలోకానికి ఉన్న నాలుగు దిక్కులకు మిమ్ము వెదకమని పంపించాడు.

వాలి సుతుడు అంగదుడు మహా పరాక్రమశాలి. ఇతడు వానర సేనలో మూడవ వంతు బలాలను తీసుకొని కొందరు వానర ప్రముఖులతోపాటు నన్ను తీసుకొని దక్షిణ దిశకు వచ్చాడు. అక్కడంతా మేము మీ కోసం అన్వేషించాము. అక్కడ తిరుగుతూ మేము దారి తప్పి శోకార్తులమై ఎన్నో రోజులు గడిపాము.

సుగ్రీవుడు మాకు ఇచ్చిన కాల అవధి తీరిపోయింది. కాని మేము మిమ్ము కనుగొనలేకపోయాము. అప్పుడు మేమందరం దుఃఖాన్ని భరించలేక ప్రాణత్యాగానికి ఒడిగట్టాము.

మేము నిస్పృహతో వింధ్యపర్వతం చేరి ఉండగా అంగదుడు మమ్ములను చూసి శోకమగ్నుడయ్యాడు. సీతాదేవి కనిపించకుండా తిరిగి వెళ్ళి రామునకు కనిపించి వారిని శోక సముద్రంలో ముంచివేయడం మంచిది కాదని మేము నిర్ణయించుకొని దేహ త్యాగం తప్ప మరో దిక్కులేదని నిశ్చయించుకొన్నాం.

ఆ సమయంలో మాకు సంపాతి అనే పక్షి ఱేడు కనిపించాడు. జటాయువు సోదరుడని చెప్పాడు. అంగదుడు సంపాతికి జటాయువు మరణాన్ని చెప్పాడు. ఆయన దానికి విచారించాడు. తిరిగి మాకు మీ విషయం చెప్పాడు. దాంతో సంతోషించి మేం సాగర తీరానికి చేరాము. మిమ్ము చూడాలనే కాంక్షతో వచ్చాం. కాని సముద్రాన్ని దాటడం ఎలానో తెలియక మరలా దుఃఖించాం. నేను ఈ సముద్రాన్ని దేవుడు అనుకూలించినందువల్ల దాటి వచ్చాను. రాత్రివేళలో ఈ లంకలో ప్రవేశించాను.

ఓ దేవీ! ఇప్పటివరకు జరిగినదంతా మీకు వివరంగా చెప్పాను. నన్ను మీ బంటుగా విశ్వసించుము. మిమ్ము అన్వేషిస్తూ వచ్చిన నన్ను అనుగ్రహించు. అమ్మా! నేను వాయుసుతుడను. మీ నాథుడైన శ్రీరాముడు, అతని తమ్ముడైన లక్ష్మణుడు కుశలంగా ఉన్నారు.

సుగ్రీవుని ఆదేశం ప్రకారం నేను ఒక్కడినే ఇపుడు లంకానగరానికి వచ్చి మిమ్ము చూశాను. ఓ దేవదేవీ! అదృష్టంవలన మీ దర్శన భాగ్యం నాకు కలిగింది. మిమ్ము ముందుగా చూసిన ఖ్యాతి నాకు దక్కింది. ఇక నేను వెళ్ళి మీ ఉదంతం చెప్పి చెప్పగానే మీ భర్త, మరిది, వానరులు అందరూ వచ్చి రావణుని హతమార్చి వేస్తారు. మీరు మీ భర్త దగ్గరకు చేరే సమయం ఆసన్నమైంది.

ఓ వైదేహీ! మాల్యవంతం అనే ఒక మహాపర్వతం ఉంది. దానిపైన కేసరి గోకర్ణ పర్వత ప్రాంతానికి వెళ్ళాము. అక్కడ శంబసాదనుడు అను రాక్షసుడు సముద్ర తీరంలోనున్న పుణ్యక్షేత్రానికి ఉపద్రవాలు కల్గిస్తుండేవాడు. దేవతలు ఋషులు ప్రార్థించగా నా తండ్రి కేసరి వానిని హతమార్చాడు. కేసరి భార్య అంజన. ఆమె వాయుదేవుని అనుగ్రహంతో నన్ను కుమారునిగా పొందింది. ఆ చర్యవలన నాకు హనుమంతునిగా నామం ఏర్పడింది" అని ఆంజనేయుడు శ్రీరామ లక్ష్మణుల వివరాలను తన వృత్తాంతాన్ని చెప్పగా విని సీత ఆనందించింది. ఆమె కన్నులు ఆనందాశ్రువులను రాల్చాయి. సీతాదేవి మోము పూర్ణ చంద్రునిలాగా శోభించింది. కపీశ్వరుడైన హనుమంతుడు తప్పక రామదూతయే అనే స్థిర నిశ్చయానికి సీతాదేవి వచ్చింది. "అమ్మా ! మీకు అన్నీ విషయాలు చెప్పాను.

ఇపుడు మీకు సంతోషం కూర్చడానికి నేను ఏం చేయాలో తెల్పుతల్లి" అని అడిగాడు. " అమ్మా! నేను కేసరి నందనుడను. వాయుదేవుని అంతటి బల పరాక్రమాలు ఉన్నవాడిని. మీకు ఏమి కావాలో చెప్పితే అది నేను చేస్తాను" అని ఆంజనేయుడు సీతాదేవితో చెప్పాడు.

* * *

# సీతాదేవికి రామముద్రికను ఇవ్వటం

## సర్గ - 36

"ఓ భాగ్యశాలీ! నేను వానరుడను. ప్రజ్ఞాశాలి అయిన రాముని దూతను. ఇదిగో ఈ రామముద్రికను రాముడు మీకివ్వమని నాకు ఇచ్చాడు. దీనిని మీరు తీసుకొని నన్ను నమ్ముము. మీ దుఃఖాలన్నీ తీరిపోయే రోజు వచ్చింది. ఊరడిల్లు తల్లీ " అంటూ అంగుళీయకాన్ని మారుతి ఇవ్వగా సీత పరమానందంగా స్వీకరించింది. దాన్ని చూచి భర్తను చూసినంతగా ఆనందించింది. ఆమె మనస్సు సంతోషాతిశయంతో పొంగిపోయింది. సిగ్గుదొంతరల్లో ముడుచుకొంది. తన భర్త సందేశాన్ని తీసుకొచ్చిన ఆ కపివరునితో సంతోషంతో ప్రియంగా మాట్లాడింది.

" ఓ వానరోత్తమా! నీవు నిజంగా ప్రజ్ఞాశాలివి. అమితబలపరాక్రమశాలివి. అందువలనే సాగరాన్ని దాటి లంకలో ప్రవేశించావు. శతయోజనవిస్తీర్ణం ఉన్న సముద్రాన్ని గోష్పాదమంతగా భావించి నీవు అవలీలగా దాటావు. నీ పరాక్రమం శ్లాఘనీయం. నీకు రావణుడనిన లేశమంతైనా భయం లేదు. నీవు నిజంగా వానరోత్తమునివే. శ్రీరాముడు ఎవరినీ పరీక్షించకుండానే ఎక్కడికీ పంపరు. అందులో నా దగ్గరకు అసలే పంపరు. అటువంటిది ఆయనే నిన్ను రామముద్రికనిచ్చి నా దగ్గరకు పంపించారంటే నీ పరాక్రమం గురించి మరలా వేరుగా నే చెప్పేది ఏముంది?

మహాతేజోసంపన్నులైన రామలక్ష్మణులు ఇరువురూ క్షేమంగా ఉండడం నా అదృష్టం. నన్ను తలుస్తూ నాకై పరితపిస్తూ రాముడు నిత్యానుష్ఠానానికి దూరం అవలేదు కదా! నిస్పృహకు లోనై పొరపాట్లు చేయడం లేదు గదా! శత్రు భయంకరుడైన రాముడు మిత్రుల విషయంలో సౌహార్దంతో ఉంటున్నారు కదా. శత్రువుల విషయంలో సామదానభేదదండోపాయాలను ఉపయోగించి విజయుడు అవుతున్నాడుకదా. నన్ను పొందడానికి తగిన సన్నాహాలను చేస్తున్నాడు గదా. శ్రీరాముని మిత్రులందరూ మంచివారే కదా! వారు ఆయన దగ్గరనుండి ఉపకారాన్ని పొందుతున్నారు కదా! మరల ప్రత్యుపకారం చేయడంలో వారు శ్రీరామునిపై ద్వేషాన్ని పెంచుకోవడం లేదు కదా!

శ్రీరాముడు కార్యసిద్ధికి తన ప్రయత్నం చేస్తూనే భగవంతుని కరుణించమని కోరుతున్నారు గదా! దైవానుకూలం కోసం శ్రీరాముడు దేవతా ప్రార్థన చేస్తున్నారు గదా. ఆంజనేయా! ఆయనకు నాపై ప్రేమ తరిగిపోలేదు గదా. నన్ను ఈ బాధలనుండి విముక్తి చేస్తారు కదా! ఆయన కష్టాలే ఎరుగని రాజకుమారుడు. నేడు అనంత దుఃఖ సముద్రంలో మునిగి ఉన్నారు. కౌసల్యాదుల క్షేమ సమాచారం అందుతూనే ఉంది కదా!

శ్రీరాముడు నా కారణంగా పరితపిస్తూ కార్యాలను చేయకుండా ఉపేక్షించడం లేదు కదా. ప్రభువు నా కోసం రాక్షస వధ చేయాలని అనుకొంటున్నారా? భరతుడు శ్రీరామునిపై అనన్య ప్రేమానురాగాలున్నవాడు. ఆయన నా కోసం అన్నకు అక్షౌహిణీ సేనను పంపించుతారా? శ్రీమంతుడైన సుగ్రీవుడు తన వానరసేనను నా కోసం ఇక్కడకు పంపించాలని అనుకొంటున్నారా? సుమిత్రానందనుడు అస్త్రశస్త్రవిద్యలందు ఆరితేరినవాడు. తన అక్షయాలైన బాణ పరంపరతో రాక్షసులను నా కోసం తుదముట్టించాలని భావిస్తున్నారా? రామలక్ష్మణుల బాణ ధాటితో రావణుడు నిహితుడవడం నేను త్వరగా చూడగలనంటావా?

నా ఎడబాటుతో రాముడు కృంగిపోయి అతని ముఖం నీరు ఎండిపోయిన సరస్సులాగా అయిపోలేదు గదా! రాముడు పితృవాక్యం కోసం అడవులకు నన్ను తీసుకొచ్చినపుడు బాధపడలేదు. కాని నేను రాక్షసుల పాలయ్యానని చింతతో శ్రీరాముడు శోకిస్తున్నాడు. మా దంపతుల మధ్య సయోధ్య అమూల్యమైనది. ఈ విషయంలో ఆయనకు ఎవరూ సాటిరారు. నాకు ప్రాణ ప్రియుడైన రాముని గురించి వినేంతవరకే నేను జీవించగలను."

మరల రాముని గూర్చి మాటలు వినాలనే జానకి తలచి మౌనంగా ఉంది. మారుతి ఆ విషయం తెలుసుకొని అంజలి ఘటించాడు. మరల సీతతో " ఓ కమలలోచనా! మీరు లంకలో ఉన్నారన్న సంగతి శ్రీరామునికి తెలియదు. అందువలనే ఆయన మిమ్ము తీసుకొని వెళ్ళలేదు. నేను వెళ్ళి చెప్పగానే రాముడు వానర భల్లూకాలతో కూడిన మహాసైన్యాన్ని తీసుకొని ఈ మహాసముద్రమును స్తంభింపచేసి ఇక్కడకు వచ్చి రావణుని హతమార్చి మిమ్ము చేపట్టుతారు.

ఆ విషయంలో సురాసురులు కాని యముడే అడ్డు వచ్చినా శ్రీరాముడు ఎదిరించగలడు. నయనసౌందర్యంతో, ఎర్రని పెదవులతో శోభిల్లే సుగుణాభిరాముణ్ణి మీరు త్వరలోనే చూస్తారు. ఇది ముమ్మాటికి నిజం. మా ప్రాణాలను నిలబెట్టే ఫలమూలాలపైన ఒట్టు పెట్టి చెప్తున్నాను. వైదేహీ! మీరు ఐరావతంపై కూర్చున్న ఇంద్రునిలాగా శ్రీరామ చంద్రుణ్ణి త్వరగానే చూడగలరు.రాఘవుడు ఎల్లప్పుడూ మితంగా మాట్లాడుతాడు. స్వధర్మాచరణలో ఆసక్తిని విడనీడడు.

ఉత్తమాశయాలు ఉన్న శ్రీరాముడు ఎప్పుడూ సాత్వికాహారాన్నే తీసుకొంటాడు. ఆ ఆహారం కూడా శరీర ధారణకు ఉపయోగించేంత మాత్రమే తీసుకొంటారు. మీ మీదనే మనస్సు లగ్నం చేసిన శ్రీరాముడు ప్రతిదాన్ని ఉదాసీనతతో చూస్తున్నారు. ఆయన మీద వ్రాలే ఈగలను తిరుగాడే పురుగులను, దోమలను, పాములను సైతం పట్టించుకోవడంలేదు.

మిమ్ము చేరాలనే కోరిక శ్రీరామునిలో బలీయంగా ఉండి మరే విషయానికి అంతగా ప్రాధాన్యం ఇవ్వటంలేదు. శ్రీరాముడు నిద్రనే మరిచారు. ఎప్పుడైనా కన్నులు అరమోడ్పులై కలతనిద్ర ముంచుకొస్తే హా సీతా! సీతా! అంటూ ఉలికిపాటుతో లేస్తున్నారు. మిమ్ము పొందడానికై సర్వవిధాలా శ్రీరాముడు ప్రయత్నిస్తున్నారు." అని మారుతి రామగుణగానం చేశాడు. రాముని గుణవర్ణనతో ఆయన మనస్సు ఆనందాతిరేకంతో నిండిపోయింది.

శ్రీరాముని గుణ సంకీర్తనతో సీతాదేవి దుఃఖం మటుమాయం అయ్యింది. శోకం తొలగిపోయింది. శ్రీరాముని విషయం వినినంతనే ఆమె పరమానందం పొందింది. ఆమె ముఖం తేజోవంతం అయింది. ఆమె ఎప్పుడెప్పుడు శ్రీరాముని దర్శన భాగ్యం కలుగుతుందా అని ఆలోచనలో సంతోష తరంగిణి అయింది.

* * *

# సీతాదేవి కోరిక

## సర్గ - 37

**హ**నుమంతుని వలన శ్రీరాముని సమాచారాన్ని తెలుసుకొని సీత ఆనందించింది. "ఓ వానరోత్తమా! శ్రీరాముడు నిత్యం నన్నే స్మరిస్తున్నారని చెప్పే నీ మాటలు నాకు ఎంత సంతోషాన్నిచ్చాయో శ్రీరాముడు దుః ఖార్తితో శోకమగ్నుడయ్యారనే మాట నాకు వేదనను కలిగిస్తోంది. అంతులేని దుఃఖంలో ఉన్నా సుఖంలో ఉన్నా మనిషిని కాలం లాక్కొనిపోతూనే ఉంటుంది. వానరోత్తమా! విధిని ఎవరూ అధిగమించలేరు కదా! మహా సముద్రంలో నావ బ్రద్దలు కాగా సముద్రం పాలైన నావికునిలా శ్రీరాముడు ఈ దుఃఖ సముద్రాన్ని ఎప్పుడు ఈది ఈవలి గట్టుకు చేరుతాడో?

శ్రీరాముడు ఎప్పుడు వస్తాడో? ఎప్పుడీ రాక్షస వధ చేస్తాడో? ఎప్పుడు నన్ను దరిచేర్చుకొంటాడో తెలియకుండా ఉంది. ఈ దుష్ట రావణుడు పెట్టిన గడువు ఇంక రెండు నెలలే ఉంది. కపివరా! అదే నా ప్రాణత్యాగానికి ముహూర్తం. అందుకే శ్రీరామ ప్రభువును త్వరపడమని చెప్పు. సీతాదేవిని రాముని అప్పగింపుమని రావణుని సోదరుడైన విభీషణుడు ఎంత చెప్పినా వినడంలేదు. రావణుడికి నన్ను శ్రీరామునకు అప్పగించడమనే విషయం ఏ మాత్రం రుచించడంలేదు. ఆయువు మూడిన రావణుడు రణరంగానికి కాలు దువ్వుతున్నాడు. అక్కడే రావణుని కోసం మృత్యుదేవత ఎదురుచూస్తున్నట్లుంది.

కపివరా! 'నల' విభీషణుని పెద్దకూతురు. ఆమె తల్లి పంపగా నా దగ్గరకు వచ్చి నాతో ఈ విషయం చెప్పింది. అవింధ్యుడను రాక్షసుడు కూడా విద్వాంసుడు; ధైర్యశాలి; రావణుని దగ్గర చనువున్నవాడు. అతడు కూడా రావణునికి హితబోధ చేశాడట. రాముని వలన రాక్షస నాశనం జరుగుతుంది కావున ఈ సీతను రాముని దగ్గరకు పంపించమని చెప్పాడు. ఆయన మాట కూడా రావణుడు పెడచెవిన పెట్టాడు.

కపీశ్వరా! నా స్వామి నన్ను త్వరగా చేరుతాడనే విశ్వాసం నాకు గట్టిగా ఉంది. నా రామునిలో సకల సద్గుణాలున్నాయి. అతడు ఒంటరిగానే దండకారణ్యంలో పదునాలుగు వేల మంది రాక్షసులను యమపురికి పంపాడు. ఎట్టి క్లిష్ట పరిస్థితులు ఆయనను చలింపజేయవు. సూర్యకిరణాల వేడివల్ల నదిలో నీరుపూర్తిగా ఇంకిపోయినట్లుగానే శ్రీరాముని బాణపరంపర రాక్షసులందరిని నుగ్గు నుగ్గు చేస్తుంది." ఇలా చెప్పే సీతను హనుమంతుడు ఆనందంగా చూశాడు.

" అమ్మా! మీరు చెప్పేది నిజమే. నేను వెళ్ళి మీ విషయం చెప్పినంతనే రాముడు వానర భల్లూక సేనలతో లక్ష్మణునితో కూడి బయలుదేరుతారు. ఇందులో ఏ సందేహం లేదు. అమ్మా! లేకపోతే ఈనాడే నేను మిమ్ము ఈ దుఃఖాలనుండి విముక్తురాలిగా చేయగలను. మీరు నా వీపుపై కూర్చున్నచో నేను ఇప్పుడే సముద్రాన్ని లంఘించి మిమ్ము మీ రాముని దగ్గరకు చేర్చగలను. నాకు రావణునితో సహా లంకను పెకిలించుకుపోగల శక్తి ఉంది. నాపై మీరు అప నమ్మకాన్ని పెట్టుకోకండి.

ఓ మైథిలీ! అగ్ని ఇంద్రునకు హవిస్సు అందచేసినట్లు నేను మిమ్ము శ్రీరామునికి తృటిలో అందించగలను. దైత్య సంహారానికి విష్ణువు సంసిద్ధుడైనట్లుగా శ్రీరాముడు లక్ష్మణ సహితుడై సంగ్రామానికి ఎదురుచూస్తున్నాడు. అవకాశం రాగానే రాముడు రాక్షసులను తుదముట్టిస్తారు. కల్యాణీ! మీరు నా వీపు మీద ఎక్కితే ఇపుడే మీ నాథుని మీరుచూడగలరు. భయపడకుండా మీరు నావీపుపై ఆసీనురాలివి అయితే రోహిణి చంద్రుని చేరినట్లుగా మీరు శ్రీరాముని చేరవచ్చు.

ఓ దేవి! మంగళ ప్రదాయనీ! ఆకాశ మార్గంలో నేను వెళ్ళేటప్పుడు ఈ రాక్షసులెవ్వరూ నా గమనశక్తిని నిరోధించలేరు. నా దారికి వారెవరూ అడ్డు రాలేరు. నేను ఇక్కడకు వచ్చినట్లుగానే మిమ్ము నేను తీసుకొని వెళ్ళగను. ఇందులో సంశయం ఏమీ లేదు వైదేహి'' అని చెప్పే హనుమంతుని మాటలకు సీతాదేవి పులకించిపోయింది. ఆనందాశ్రవులతో ఒళ్ళు గగుర్పొడిచింది." నాయనా! నీవు చూడగా చిన్నవానివి. నీవు చెప్పే మాటలు హిమవత్పర్వతం లాంటివి. ఇలా మాట్లాడడం చూస్తే నీ వానరలక్షణం కనిపించి నాకు నవ్వు వస్తోంది. ఈ చిన్న శరీరంతో నీవు నన్ను ఎలా తీసుకొని పోగలవు? "అని సీత అంది.

" అమ్మా , సీతాదేవి! నేను కామరూప విద్యలు తెలిసినవాణ్ణి. నేను నా రూపాన్ని నేను కోరుకున్న విధంగా మార్చుకోగలను. చూడమ్మా నా బృహద్రూపాన్ని చూపిస్తాను " అని చెప్పి ఆంజనేయుడు తాను నిల్చున్న చోటనుండి కొద్ది దూరానికి ఒక గెంతు వేసి అక్కడ నిలబడ్డాడు. సీతాదేవికి నమ్మకం కలిగించడానికి తన రూపవిలాసాన్ని పెంచసాగాడు.

వానరుడైన ఆంజనేయుడు నెమ్మది నెమ్మదిగా తన శరీరాన్ని పెంచాడు. మేరు మందర గిరులతో సమానమైన ఎత్తున పెరిగాడు. ప్రజ్వలిస్తున్న అగ్ని శిఖలాగా కనిపించసాగాడు. పర్వతసదృశుడు, ఎర్రని ముఖంతో తీక్షణమైన కోరలు వజ్రం లాంటి నఖములు కలిగి నిలబడ్డాడు. అమాంతంగా పెరిగిన ఆంజనేయుని సీతాదేవి ఆశ్చర్యంగా చూసింది.

అమ్మా మైథిలీ! పర్వతాలతో, వనాలతో, కోట బురుజులతో, ప్రాకారాలతో విలసిల్లుతున్న ఈ లంకా నగరాన్ని యావత్తు నేను పెకిలించుకొని పోగలను. అమ్మా మీరు భయపడాల్సిన భయం లేదు. మీరు నా వీపుపై అధిరోహిస్తే మిమ్ము నేను కంటికి రెప్పలాగా కాపాడుతూ శ్రీరాముని దరి చేర్చగలను."

పద్మపత్రాల్లాంటి విశాల నేత్రాలు ఉన్న సీతాదేవి " ఓ వానరోత్తమా! నాకు నీ బల పరాక్రమాలు నీ తేజస్సు తెలుసు. లేకపోతే ఏ సామాన్య మానవుడెవ్వడైనా ఈ శతయోజనసాగరాన్ని దాటి నా దరికి రాగలడా? నీ గమన వేగం నన్ను నీవు తీసుకొని వెళ్ళగల నీ సామర్థ్యం నాకు ముందే తెలుసు. మహాత్ములు కార్యాన్ని సాధించటానికి ముందు వెనుకలు ఆలోచించి తర్వాత నిర్ణయం తీసుకొంటారు. నీవు నన్ను సురక్షితంగానే తీసుకువెళ్ళగలవు.

కాని నీ వేగానికి నాకు తత్తరపాటు కలుగవచ్చు. అప్పుడు నేను భయంతో క్రింద పడిపోవచ్చు. సముద్రంలో పడిన నన్ను ఏ తిమింగలమో చేపనో మ్రింగి వేయవచ్చు. ఓ పండితోత్తమా! నీవు నన్ను రక్షించబోతే నేను అభద్రతకు గురికావచ్చు. అంతేకాదు, నీవు నన్ను తీసుకొని వెళ్లడం రాక్షసులు చూస్తే వారు మనలను వెంటాడి

వధించవచ్చు. ” అని సీత హనుమంతునితో చెప్తుతోంది. “ ఓ వీరాధి వీరుడా! రాక్షసులు ఇనుప గదలు, శూలాలు పట్టి నిన్ను చుట్టుముట్టుతారు. అప్పుడు నన్ను రక్షించాలనుకొన్న నీవు ఆపదలలో చిక్కుకొంటావు. నీవు నిరాయుధుడవు. పైగా ఒంటరివానివి. వారు పదిమంది ఆయుధపాణులు. ఆ స్థితిలో నీవు సముద్రలంఘనం ఎలా చేయగలవు? నీవు వీరునివై వారితో సమానంగా పోరాటం మొదలుపెట్టినా నేను భయంతో బిర్రబిగిసిపోయి జారి క్రిందపడిపోవచ్చు.

రాక్షసులందరు భయంకరాకారులు. వారు ఏదో ఒక విధంగా నిన్ను జయించాలని చూస్తారు. నీవు ఒక్క రెప్పపాటు ఏమరుపాటుతో ఉన్నా నేను క్రిందపడిపోగలను. అప్పుడు వారు నన్ను చేజిక్కించుకొని పరుగు లంకించుతారు. లేకపోతే నన్ను చంపివేస్తారు. యుద్ధంలో జయాపజయాలు దైవాధీనాలు.

వానరోత్తమా! ఈ రాక్షసులందరిని నీవే ఇక్కడే చంపి నన్ను తీసుకొని వెళ్ళినా అది నీ ప్రభువైన రామునికి అపకీర్తిని తెస్తుంది. లేకపోతే ఈ రాక్షసుల విషయం తెలుసుకొని నన్ను మీ దరి చేరనివ్వకుండా రహస్య ప్రదేశంలో దాయవచ్చు. అప్పుడు కూడా నీ ప్రయత్నం వ్యర్థం అవుతుంది.

ఓ మహావీరుడా! మహాత్ముడైన శ్రీరాముడు ఆయన సోదరులు సుగ్రీవాదుల జీవితాలన్నీ నాపై ఆధారపడి ఉన్నాయి కదా. ఆ రామలక్ష్మణులు నిరాశతో శోక సంతాపంలో పడి కృశించిపోతే మీ వానరులందరు కూడా ప్రాణాలు విడుస్తారు కదా. ఓ ఆంజనేయా! అసలు నా స్త్రీ ధర్మాన్ని అనుసరించి నా భర్త శరీరాన్ని తప్ప అన్య పురుషుని శరీరాన్ని నేను ముట్టుకోను.

రావణుడు నన్ను బలవంతంగా లాక్కొని వస్తుంటే వాని శరీరం నాకు తగిలింది. కాని అది నేను ఏమీ చేయలేని పరిస్థితి. పరాధీనురాలిని కదా! నన్ను రక్షించే నాథుడు అక్కడ లేడు. అందువలనే నేను వాణ్ణి ఏమీ చేయలేకపోయాను.

శ్రీరాముడు స్వయంగా వచ్చి ఈ దశకంఠుని తెగటార్చి నన్ను తీసుకువెళ్ళటమే శ్రీరామునికి కీర్తితెస్తుంది. నేను రాముని పరాక్రమాన్ని వినడమే కాక దండకారణ్యాన స్వయంగా చూశాను. యక్ష, గంధర్వ, నాగ జాతులలో ఎవరూ నా స్వామిని ఎదురించలేరు.

శ్రీరాముడు అద్భుతపరాక్రమశాలి. అతనికి అరివీరభయంకరుడైన లక్ష్మణుడు తోడుగా ఉన్నాడు. అలాంటి వారిద్దరి ముందు ఏ రాకాసి మూక నిలవగలదు? ప్రళయకాలరుద్రుని లాగా సమరంలో శ్రీరాముడు విజృంభించి మదించిన దిగ్గజంలాగా నిలబడి శత్రుసేనను చీల్చి చెండాడుతుంటే ఆ మహావీరుని ఎదురుగా పోగల ధైర్యశాలి ఇంతవరకును పుట్టలేదు.

కపివరా! నీవు వెంటనే వెళ్ళి నా శ్రీరాముని లక్ష్మణునితో కూడి ఇక్కడకు తీసుకొని రమ్ము. నేను చాలా కాలం నుండి రామవిరహాగ్నిలో కృశించి ఉన్నాను. నా రాముని నా దగ్గరకు తెచ్చి నన్ను దుఃఖ విముక్తిరాలిని చేసి నన్ను ఆనందింపజేయి వానరోత్తమా! అపుడే నేను సంతోషిస్తాను.” అని సీత ఆంజనేయునితో చెప్పింది.

సీత మనోభావాలను విన్న హనుమంతుని మనసు పులకించింది. ఆహా ఏమి ఈ పతివ్రతామతల్లి ధీరహృదయం. తన నాథుని గుర్తింపునే కోరుతున్నది. తాను కష్టాలు పడుతున్నా కూడా భర్త గౌరవానికే ప్రాముఖ్యతనిచ్చింది. ఇదే స్త్రీ మనస్సు గదా! అని మారుతి ఆనందాశ్రువులను కార్చాడు.

* * *

# చూడామణి ప్రదానం

## సర్గ - 38

**సీ**తాదేవి చెప్పిన మాటలతో హనుమంతుడు పొంగిపోయాడు. మాటలు నేర్చిన ఆ కపివరులు "అమ్మా మంగళప్రదా!మీ మాటలు చాలా యుక్తిగా ఉన్నాయి. అవి శ్రీరామునికి అందగించేటట్లుగా ఉన్నాయి. మీ సాధు స్వభావాన్ని, మీకు మీ భర్తపైగల భక్తిని చాటుతున్నాయి. అమ్మా! వినయవంతురాలివైన మీరే చక్కగా చెప్పారు. మీకు పరపురుషుని స్పర్శ ఇష్టం లేకుండడమనేది మీరు చెప్పడం మీకే తగినది. మీ పలుకులను నేను యథాతథంగా శ్రీరామునికి చెప్తాను.

ఓ తల్లీ! నా రామునికి మోదం కూర్చాలని, మీ ఖేదాన్ని రూపుమాపాలనీ నిశ్చయబుద్ధితో తొందరపాటుతో నేను మిమ్ము నా వీపుపై ఎక్కమని అడిగాను. నేను సముద్ర లంఘనాన్ని చేయగలనని లవణ సముద్రాన్ని దాటడం అసాధ్యమనే ఉద్దేశ్యంతో ఇలా పలికాను. శ్రీరామునిపైనున్న అవ్యాజమైన ప్రేమాదరములతో నేను మిమ్ము తీసుకెళ్ళుతానని చెప్పాను కాని మరియొక కారణం చేత గాదు. అమ్మా! నాతో రావడానికి మీరు సమ్మతం కానట్లయితే మీరు నాకేమైనా ఒక ఆనవాలును ఇమ్ము " అన్నాడు.

హనుమంతుని మాటలకు సీత ఆనందించింది. దివ్యకాంత రాక్షసులకు వినబడకుండా " ఓ వానరోత్తమా! నేను నీకు ఒక కథ చెప్తాను. నీవు దానిని శ్రీరామునితో చెప్పు.

మేము చిత్రకూటంలో ఉండగా ఇది జరిగింది. చిత్రకూటానికి ఈశాన్య భాగంలో ఒక పర్వతం ఉంది. అక్కడ ఫలాదులు కందమూలాలు సమృద్ధిగా ఉన్నాయి. మందాకినీ తీరంలో ఒక సిద్ధాశ్రమం ఉంది. ఆ ఆశ్రమ సమీపంలో నానాపుష్పపరిమళాలతో నిండిన ఉపవనాలు ఎన్నో ఉన్నాయి. అక్కడ శ్రీరాముడు నేను విహరించాం. చాలాసేపు గడపడంవల్ల మేం అలసిపోయి ఒక చెట్టుక్రింద విశ్రమించాం.

మీ ప్రభువు ఒడిలో నేను కూర్చున్నాను. అంతలో ఒక కాకి వచ్చింది. అది నా స్తనాలను చూసి మాంస ఖండం అని అనుకొందేమో అది నా చెంతకు వచ్చి నా పాలిండ్లపై ముక్కుతో పొడిచింది. నేను ఒక మట్టిపెళ్ల విసిరి దానిని దూరంగా తరిమాను. అయినా అది మరలా మరలా నా దగ్గరకు వస్తూనే ఉంది. అది నన్ను ముక్కుతో పొడవడం నేను జారిన పైటను సర్దుకోవటం జారిన వడ్డాణాన్ని పైకి లాక్కోవటం చేస్తున్నాను.

అప్పుడు నేను ఆ కాకిని కోపంగా చూస్తుండగా రాముడు నన్ను చూశారు. నేను కోపంగా కాకిని చూడగానే రాముడు నవ్వి పరిహసించాడు. అప్పుడు నేను ఆయన హృదయంలో నా తలను దాచాను. ఆ కాకివలన నా కన్నులు అశ్రుపూరితాలు అయ్యాయి. నేను కన్నులు తుడుచుకోవడం రాముడు చూశాడు. ఆయన నన్ను ప్రేమగా నిమిరి నన్ను లాలించారు. శ్రీరాముని ప్రేమామృతంలో నేను హాయి ననుభవిస్తున్నాను ..." అని ఇంకా సీతమ్మ ఇంకా చెప్పుతోంది. నేను వనంలో తిరిగి బాగా అలసిపోయినందున నేను రాముని ఒడిలో నిద్రించాను. నేను లేచిన కొద్దిసేపటికి రాముడు నా ఒడిలో తల పెట్టుకొని నిద్రపోయాను. నేను లేచి కూర్చోవడం చూసిన ఆ వాయసం తిరిగి నా దగ్గరకు వచ్చి నా వక్షస్థలాన్ని గీరింది.

ఆ వాయసం మాటిమాటికి వచ్చి నన్ను బాధించసాగింది. నా ఎద చీరుకొనిపోయి రక్తం కారింది. నేను ఆ కాకి బాధపడలేక గాఢ నిద్రలోనున్న నా శ్రీరాముని నిద్రలేపాను. నేను బాధపడటం రాముడు చూశాడు. నా పాలిండ్లు ఎర్రబడి రక్తంకారడం చూసి క్రుద్ధుడై " ఓ సుందరీ! నీ స్తన మధ్యభాగమును గాయపరిచిన దురాత్ముడు ఎవడు? మహాసర్పంతో ఆడుకొంటున్నాడు " అంటూ శ్రీరాముడు అటు ఇటు చూశాడు.

రక్తసిక్తములైన వాడి గోళ్ళతో ఎదురుగా నిలిచిన కాకిని చూశాడు. ఆ వాయసం ఇంద్రుని కుమారుడట. అతడు పక్షులలో శ్రేష్ఠుడట. అతడు శ్రీరాముని చూడగానే ఇంకో చోటుకు ఎగిరి వెళ్ళాడు. రాముడు అక్కడే ఉన్న ఒక గడ్డిపోచను తీసుకొని బ్రహ్మాస్త్రంగా అభిమంత్రించాడు. అది ప్రళయాగ్నిలాగా మంటలు ఎగజిమ్మింది. దానిని ఆ కాకిపై విసిరివేశాడు.

అంతే! ఆ దర్భ మంటలు గ్రక్కుతూ ఆ పక్షిని వెంటాడింది. ఆ పక్షి లోకాలన్నీ తిరిగింది. అయినా ఆ దర్భనుండి దూరంగా పోలేకపోయింది. ఆ దర్భ అలా ఆ కాకిని వెంబడిస్తూనే పోయింది. ఆ పక్షి చివరకు దేవేంద్రుని, దేవతలను, మహర్షులను అందరిని రక్షించమని వేడుకొంది. కాని ఆ కాకిని ఎవరూ రక్షించలేకపోయారు. ముల్లోకాలు తిరిగి ఎక్కడా రక్షణ లేక చివరకు సర్వలోక శరణ్యుడైన రాముణ్ణే ఆశ్రయించింది.

దయాళుడైన శ్రీరాముడు చంపదగినది ఐనా ఆ కాకిని రక్షించాడు. అయినా ఆ వాయసంతో " నేను ప్రయోగించిన అస్త్రం వృథా కాదు. కనుక నీవే ఏమి చేయాలో తెల్పు " అని ఆ కాకిని అడిగాడు. ఆ కాకి చేసేది ఏమీ లేక తన కుడి కన్నును ఆ బ్రహ్మాస్త్రానికి అర్పించింది. కన్ను లొట్ట చేసుకొని ఆ కాకి ప్రాణాలు దక్కించుకొంది.

అలా నా కోసమే కాకిమీదనే బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించిన నా స్వామి నన్ను అపహరించిన రావణుని ఉపేక్షించునా? నీవు నేను చెప్పిన కథను నా రామునికి గుర్తుచేయి. రాముని ధర్మపత్నినైన నేను దీనురాలినై ఇక్కడ పడి ఉన్నాను. దీనులపై కరుణ చూపించాలని నా రాముడే చెప్పి ఉన్నాడు. ఈ దీనురాలిపై దయ చూపించమని నీవు చెప్పు.

శ్రీరాముడు గాంభీర్యంలో సముద్రం అంతటివారు. ఐశ్వర్యంలో దేవేంద్రుని వంటివారు. ఆయన్నెవరూ బాధించలేరు. అస్త్రశస్త్ర విద్యలలో ఆరితేరినవారు. మహాబలశాలి. సమరభూమిలో ఆయనను ఎదిరించే శక్తి ఎవరికీ లేదు. లక్ష్మణుడు కూడా మహా పరాక్రమశాలి. వాయుదేవుని వలె బలసంపన్నులైన ఆ మహాపురుషులను

దేవతలు సైతం ఎదిరించలేరు. నన్ను ఎందుకో ఉపేక్షిస్తున్నారు." అని అంటూ కన్నీరుగార్చుతూ తన దీన స్థితికి కారణం వెదుక్కొనే సీతను చూసి హనుమంతుడు చలించిపోయాడు.

" అమ్మా! మీ ఎడబాటుతో రాముడు ఏ విషయంపైన ఆసక్తి చూపడంలేదు. ఎప్పుడూ దుఃఖంలో మునిగి ' హా సీతా!' అంటూ పలవరిస్తూనే ఉన్నాడు. అలా శోకార్తిలో మునిగిన అన్నను చూసి లక్ష్మణుడు పరితపిస్తున్నారు. అమ్మా! ఎలా ఐనా ఈనాటికి మీ ఉనికిని నేను తెలుసుకొన్నాను. ఇది మీరు దుఃఖించాల్సిన సమయం కాదు. మీ బాధలు త్వరలోనే తీరిపోతాయి.

ఓ విశాలాక్షీ!రామ సోదరులిరువురు ఇక్కడకు వస్తారు. వారి బాణాలతో లంకను సర్వనాశనం చేస్తారు. రావణుని హతమారుస్తారు. మిమ్ము అయోధ్యకు తీసుకొని వెళ్తారు. నేను మీ సందేశాన్ని వారికి తప్పక వినిపిస్తాను." అని అన్నాడు. అయ్యా వానరోత్తమా! నీవు నా శ్రీరామునకు నా ప్రణామాలు అర్పించు. కౌసల్యానందనుని కుశలాన్ని అడిగానని చెప్పుము.

ఆంజనేయా! మా లక్ష్మణస్వామిని నేను అడిగానని చెప్పుము. అతడు ధీరోదాత్తుడు. అతని గుణాలను గూర్చి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. అన్నకోసం ప్రాణసఖిని, అమ్మను, తండ్రిని, రాజ్యాన్ని, తమ్ముళ్ళను వదిలి వచ్చేశాడు. శ్రీరామునికి కుడిభుజంగా ఉంటాడు. ఉన్నాడు. మంచి మనస్సున్నవాడు. శ్రీరాముని తండ్రిగా నన్ను తల్లిగా భావించి సేవిస్తుండేవాడు. దశరథుడంతటివాడు. లక్ష్మణుడు తోడుగా ఉండడంవల్ల వనవాసంలో క్లేశాలను మేము అధిగమించాము.

శ్రీరాముడు చెప్పిన ప్రతి కార్యాన్ని తు.చ తప్పకుండా ఆచరించేవాడు. శ్రీరామునికి అతి ప్రియుడు. లక్ష్మణుడు దగ్గర ఉన్నందువల్లే శ్రీరాముడు దశరథుని బాధను మరిచిపోగలిగినారు. లక్ష్మణుని క్షేమసమాచారాలను నేను అడిగానని చెప్పు. ఓ వానరశ్రేష్ఠా! ఆ సోదరులిరువురూ నా దుఃఖాలను దూరం చేయడానికి నడుం కట్టేటట్లుగా నీవే కార్యాన్ని నడిపించు. నీవు కార్యదక్షత ఉన్న నేర్పరివి.

శ్రీరామునితో పదే పదే నా గడువు కాలాన్ని గురించి చెప్పు. గడువు తీరిన ఒక్క క్షణం కూడా నేను అసువులను నిలుపుకోజాలను." అని చెప్పి ఆ తర్వాత సీతాదేవి తన చీర కొంగు ముడి విప్పింది. అందులో ఉన్న దివ్యచూడామణిని తీసి ఇది ' వానరశ్రేష్ఠా! శ్రీరామునికి నా ఆనవాలుగా సమర్పించుము" అని చెప్తూ హనుమంతునకు చూడామణిని సీత ఇచ్చింది.

దాన్ని ప్రాణపదంగా తీసుకొని తన చేతికి అమర్చుకొని ఆనందంగా ఆ అమ్మ ప్రక్కన నిలబడ్డాడు. ఆ మణి ప్రభావంతో హనుమంతుడు వాయువు వలన కంపించిన చెట్టులాగా వణికిపోయాడు. తిరిగి స్వస్థుడయ్యాడు. మహదానందించాడు.

మనస్సుతో రాముని దగ్గరకు చేరిపోయాడు. సీతారాముల సమాగమాన్ని, వారి అనుబంధాన్ని తలచుకుని పరమానందించాడు. హనుమంతుని మనస్సంతా ఆనందంతో నిండింది. కన్నులు కాంతిపుంజాలు అయ్యాయి. శరీరం గగుర్పాటుకు గురౌతోంది. సీతమ్మను మరొక్కసారి తనివితీరా చూడాలనుకొని ఆమె వేపు చూశాడు.

ఎల్లప్పుడూ శ్రీరామునే తలచే సీత వానరుని రాక తిరుగుప్రయాణం, ఆపై రామాదుల రాక, తన బాధల విముక్తిని తలుచుకుంటూ వానరుణ్ణే చూస్తోంది.

తృప్తిగా తన పని ముగిసిందనే ఆనందంతో ఆంజనేయుడు 'అమ్మా ఇక వస్తా'నంటూ సీతమ్మకు నమస్కరించాడు. తన శరీరాన్ని తిరుగు ప్రయాణానికి సంసిద్ధం చేశాడు.

* * *

# సీతాసంశయం

## సర్గ - 39

"వానరోత్తమా! నా శిరోమణిని చూచిన వెంటనే శ్రీరాముడు గుర్తించగలడు. ఆయన దానిని చూసి నా తల్లిదండ్రులను నన్ను గుర్తుచేసుకొంటాడు. ఓ కపివరా! నా దుఃఖాలు దూరం చేయడానికి రామలక్ష్మణులను పురికొల్పే బాధ్యత నీదే సుమా. నీవు బాగా ఆలోచించి కార్యనిర్వహణా బాధ్యతను చేపట్టు" అని సీత చెప్పగానే "అమ్మా! మీ ఆజ్ఞను నేను శిరసావహిస్తాను తల్లీ" అని చెప్పి హనుమంతుడు ఆమెకు శిరసా ప్రణమిల్లాడు.

నాకు వెళ్ళడానికి అనుమతిని ఇవ్వుము అని అడిగే మారుతిని చూసి సీతమ్మ ఆత్మీయులు దూరమవుతున్నట్లు భావించి కన్నీరు పెట్టుకొంది. " ఓ హనుమంతా! వానర వీరులను సుగ్రీవాదులను భల్లూక వీరులను అడిగానని అందరితో చెప్పు. ఓ మారుతీ! ధర్మ పరిరక్షకుడైన రాముణ్ణి నన్ను ఆదరించమని చెప్పు. ఆయనలో ఉత్సాహం నింపే మాటలను చెప్పుము" అని చెప్పింది. సీత మాటలు విన్న హనుమంతుడు 'అమ్మా మీరు ఊరడిల్లండి. మీకు త్వరలో ఆనందం కూర్చే పనులే చేస్తాం.' అని చెప్పాడు.

మీ శ్రీరాముడు ఎదురులేని వీరుడు. రణరంగంలో సూర్యచంద్రాదులను, దేవేంద్రాదులను కూడా ఎదిరించివేయగల సమర్థుడు. జానకీ మీ విషయంలో కూడా ఆయన తప్పక జయం పొందుతాడు" అని చెప్పి బయలుదేరిపోతున్న మారుతిని చూసి సీతా అభిమానంతో ఆశీర్వదించింది. మరలా కొద్దిసేపటికే "ఆంజనేయా! నీవీ రాత్రికి ఇక్కడే ఉండి రేపు వెళ్ళవచ్చు గదా! ఈ రోజు ఒక రహస్య ప్రదేశాన్ని చూసుకొని అక్కడ ఉండి వెళ్ళరాదా" అని అమాయకంగా జానకి అడిగింది.

" వానరవీరా! నీవు ఇక్కడ ఉంటే నాకెందుకో హాయిగా ఉంది. నీవలన నా దుఃఖం దూరం అయినట్లుగా ఉంది. నీవు రాముని గూర్చి చెప్తూ ఉంటే వినాలనీ ఉంది. కాని నీవు వెళ్తానంటే నా మనస్సు మళ్ళీ దుఃఖ సముద్రానికి చేరువ అవుతోంది. కపివరా! నీవు వెళ్ళి వచ్చేవరకు నా ప్రాణాలు నిలుస్తాయో లేదో తెలీదు. నీ రాక నాలో కొంత శాంతిని నెలకొల్పింది. ఊరట నిచ్చింది. ఇప్పుడు నీవు వెళ్ళిపోతే మరలా నాకు దుఃఖమే మిగులుతుంది" అని సీతాదేవి మారుతితో చెప్పింది.

ఇంతకీ ' వానర ప్రముఖా! దాట శక్యం కాని ఈ మహాసముద్రాన్ని వానర భల్లూకాలు కాని, నా రామలక్ష్మణులు కాని, ఎలా దాటి రాగలరు అనే సంశయం నన్ను అదేపనిగా పట్టి పీడిస్తోంది. ఈ క్లిష్టమైన కార్యాన్ని ఎలా సాధించగలరు? ఈ మహా సముద్రాన్ని నీ శక్తియుక్తులతో దాటావు కాని మరొకరు దాటలేరు కదా!

రాముడు వచ్చి రావణుని వధించి నన్ను అయోధ్యకు తీసుకెళ్ళితే ప్రయోజనం ఉంటుందేమో కాని నీవు సముద్రం లంఘనం చేసి వచ్చీ సమాచారం ఇస్తే ఏం ప్రయోజనం ఉంటుంది? సమరశూరాగ్రణి ఐన ఆ మహాత్ముని పరాక్రమం ఇనుమడించేలా నీవు ఏదైనా చేయి. ఆయన వచ్చి నన్ను తీసుకెళ్ళితేనే శ్రీరామునికి శోభనిస్తుంది' అని చెప్పిన సీతతో హనుమంతుడు ఇలా చెప్పాడు.

' అమ్మా! మీరు మీ సందేహాలను దూరం చేసుకోండి. వానరులందరూ మహావీరులు. మీ రాముడు మహాబలసంపన్నులు. ఎట్లు ఐనా మిమ్ము వారందరూ ఆదుకొని తీరుతారు. సుగ్రీవుని ఆజ్ఞను శిరసావహించి ఒక్క గెంతులో ఎక్కడికైనా వెళ్ళిరాగలను.

భూమ్యాకాశాలలో వానరులకు, భల్లూకాలకు ఏ విధమైన అడ్డు ఉండదు. ఈ నాలుగు సముద్రాలనే కాక మొత్తం భూమండలాన్నంతా వారందరూ ఎన్నోసార్లు చుట్టివచ్చారు. సుగ్రీవుని దగ్గర ఉన్నవారిలో అందరూ ఘనులే. వారందరిలో నేనే తక్కువవాడిని. నా కన్న తక్కువ శక్తిగలవారు ఎవ్వరూ అక్కడ లేరు.

అల్పుడినైన నేను ఇక్కడకు వచ్చానంటే అమోఘ బల సంపన్నుల గురించి మరలా చెప్పేది ఏముంటుంది? చిన్న పనులకు చిన్నవారినే పంపిస్తారని మీకు తెలుసు గదా అందువలన మీరు బాధపడాల్సిన విషయం ఏదీ లేదు. ఒక్క అంగలో వారందరూ లంకను చుట్టి ముట్టుతారు. మీ శోకం తీరే రోజు ఎంతో దూరం లేదు. మహాశక్తి సంపన్నురాలైన వానర వీరులందరూ రామలక్ష్మణులతో కలిసి త్వరలోనే ఇక్కడకు తప్పక వస్తారు.

అమ్మా! మీకు అంతా శుభమే జరుగుతుంది. మీ రఘువంశ ఖ్యాతిని ఇనుమడింపచేస్తూ మీరు కోరినట్లుగానే మీ రామలక్ష్మణులే రావణుని హతమార్చి మిమ్ము అయోధ్యాపురికి తీసుకవెళ్తారు. పుత్రులతో అమాత్యులతో బంధువులతో నాశనం అయ్యే రావణుని దుర్దశ త్వరలోనే రానున్నది. మీరు చింతను వీడి సంతోషంగా ఉండుము తల్లీ!

శ్రీరాముని చేతిలో రావణాదులు నిహతులు అవడం మీరే చూస్తారు' అని చెప్పి బయలుదేరిపోతూ మరల ' అమ్మా! ధనుర్ధారులైన రామలక్ష్మణులు లంకలో ప్రవేశించడం కూడా మీరు త్వరలో చూస్తారు. వానరులందరూ రోరలు, గోళ్ళే ఆయుధాలుగా ఉన్నవారు. వారందరూ ఈ లంకా నాశనానికి ఇక్కడకు వస్తారు.

సీతాదేవీ! మీరు ఇక శోకించవద్దు. రాముడు కూడా మన్మథబాణాలతో బాధింపబడుతూ శాంతి లేక అల్లాడుతున్నారు. మీ మనస్సులోని శోకాన్ని దూరంగా తరిమివేయుము. శ్రీరామునకు ఆయన తమ్ముడైన లక్ష్మణ స్వామికి ఎదురురాగల శక్తి ఎక్కడా ఇంతవరకూ జన్మించలేదు. ఇక మీదట జన్మించను కూడా లేదు. ఆ ఇద్దరూ మీకు అండగా ఉండగా మీకు భయమెందుకు? మీరు నిశ్చింతగా ఉండండి.

ఈ రాక్షససమూహంలో మీరు  ఇక ఎక్కువ రోజులు గడపాల్సిన అవసరం ఏ మాత్రం లేదు. మీ స్వామి అతి త్వరలో మిమ్ము చేరుతారు. నేను వెళ్ళి సంగతిని శ్రీరామునికి వివరించి మీ దగ్గరకు వచ్చేంతవరకు మీరు కాస్త ఓపిక పట్టుము. ఇక రావణుడు సపరివార సమేతంగా యమ పట్టణానికి బయలుదేరుతాడు" అని హనుమంతుడు సీతా సందేహాలను నివృత్తి చేశాడు. భయాదులను తరిమేశాడు. హనుమంతుడు చెప్పుతున్నంతసేపు సీతలో ఉత్సాహం ఉరకలు వేసింది. నారాముడు ఇక త్వరలో వచ్చేస్తాడు. నా కష్టాలు గట్టెక్కినట్టే అని ఆమె అనుకొని ఆ శుభసమయం కోసం నేను తప్పక ఎదురుచూడాలి అనుకొంది. కానీ హనుమంతుడు వెళ్ళిపోతాడు అనుకోగానే జానకమ్మ నయనాలు అశ్రుపూరితాలయ్యాయి.

* * *

# సీతా సందేశం

## సర్గ - 40

హనుమంతుని మాటలు విని ఆ సీతాదేవి వర్షపు చినుకులకు సంతసించి విప్పారిన భూమిలాగా సంతోషించింది. వానరోత్తముని ప్రశంసిస్తూ 'వానర ప్రముఖా! నీ మాటలు విని నేను చాలా ఆనందించాను అంది. ' హనుమా! నేను బాధలు పడి పడి కుంగిపోయాను. నా మనస్సు నా తనువు శ్రీరాముణ్ణే కోరుకొంటోంది. ఆ శ్రీరాముని కౌగిలిలో చేరి నా బాధలను దూరం చేసుకోవాలని నేను కోరుకొంటున్నాను. ఆయన దరిచేరి ఒడిని దక్కించుకొనే భాగ్యాన్ని నీవే నాకు కల్పించాలి' అని సీతమ్మ అడిగింది.

'మారుతీ! ఆనాడు నేను వాయసంవలన బాధకు లోనైతే నా రాముడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి నన్ను రక్షించారు. హనుమా! ఒకసారి నా నుదుట తిలకం చెదిరిపోయింది. అప్పుడు తిలకం దిద్దడం మానేసి రాముడు మణిశిల గంధాన్ని నా చెక్కిలిపై దిద్దాడు. ఈవిషయాన్ని కూడా నీవు ఆయనకు గుర్తుచేయుము

' శ్రీరామా! మహేంద్రాదులను ఎదురించగలిగిన మీరు  మీ  భార్య రాక్షసుల మధ్య బాధలు అనుభవిస్తుంటే చూస్తూ ఎలా ఊరుకొన్నా'రని సీత అడిగిందని రామునితో చెప్పు. ఈ చూడామణిని చూసి రాముణ్ణి చూసినట్లుగా నేను ఇన్నాళ్లు సంతోషిస్తున్నాను. ఇప్పుడు దానిని నీ ద్వారా ఆయనకు పంపిస్తున్నాను. గడువు తీరిన క్షణంలోనే నేను ప్రాణాలను వదిలివేస్తాను అనే విషయం నీవు బాగుగా రామునితో చెప్పుము.

ఈ భయంకరులైన రాక్షసులు నన్ను ఎన్ని బాధలు పెట్టినా నేను శ్రీరాముడు వచ్చి రక్షిస్తారనే ఆశతో వీటినన్నింటిని భరించాను. కానీ రాముని చూపు నాపై ఇంతవరకూ పడనే లేదు అని నేను చింతిస్తున్నానని నా శ్రీరామునికి వివరించి చెప్పుము.

ఈ రావణుడు పెట్టే బాధలను ఇక అనుభవించలేనని నా రామునితో చెప్పు' అని చెప్పే సీత మాటలు విని ఆంజనేయుడు 'అమ్మా! మీ  ఎడబాటుతో రాముడు సుఖభోగాలను త్యజించి ఉన్నాడు. శ్రీరాముని దుఃఖాన్ని చూస్తూ లక్ష్మణుడు పరితపిస్తున్నాడు. మీరీ నాడు నాకు కనిపించారు. ఇక మీ దుఃఖం దూరం అయినట్లుగా భావించుము.

రామలక్ష్మణులు మీ దర్శనం కోసం అర్రులు చాస్తున్నారు. మీ కోసం వారు వచ్చి ఈ లంకను దగ్ధం చేస్తారు. రావణాదులను రణభూమికి బలి ఇచ్చి మిమ్ము వారు తీసుకెళ్ళుతారు. సీతమ్మా! ఇంకను మీ దగ్గర ఏదైనా ఆనవాలు ఉంటే ఇవ్వుము.' శ్రీరాముడు గుర్తుపట్టేందుకు అని హనుమంతుడు అడగగా సీతాదేవి ' హనుమా! నా చూడామణి చూడగానే రాముడు నన్ను గుర్తించును' అని చెప్పింది.

ఆమె అనుమతి తీసుకొని ఆంజనేయుడు బయలుదేరబోయాడు. 'హనుమంతా! సుగ్రీవాదులను రామలక్ష్మణులను నేను అడిగినట్లుగా మరిచిపోకుండా చెప్పు. ఓ వానర వీరా! రాముని దగ్గరకు వెళ్ళి నా స్థితిని విపులంగా చెప్పుము. నేను పడే వేదనను, ఈ రాక్షసులు నన్ను పెట్టే బాధలను అన్నీ కళ్ళకు కట్టినట్లుగా చెప్పు. నీ ప్రయాణం సుఖంగా సాగుతుంది. వెళ్ళిరా' అని సీత ఆంజనేయునికి వీడ్కోలు ఇచ్చింది. సీతా సందేశాన్ని చూడామణిని తీసుకొని సంతోషించిన మనస్సుతో హనుమంతుడు ఉత్తర దిశకు వెళ్ళాలని తలచాడు. సీతాసందేశం విన్న హనుమంతుని హృదయం ఆనందంతో నిండింది.

సీతమ్మ ప్రేమాద్రృది తలుచుకుని అమ్మ ఎంత దయామయురాలో గదా! ఈమె శ్రీరామునికి తగిన భార్య. రాముడు వెన్న వంటి మనసు కలవాడు. ఈమె చల్లని తల్లి. ఈ ఇద్దరూ దేవుని దయవలన  ఒకరినొకరు కలుసుకోవాలి.  నేను ఇక చేయవలసిన కార్యాన్ని ఆరంభిస్తాను. అనుకొని మారుతి నలుదిక్కులా చూశాడు.

* * *

# ఉద్యానవన ధ్వంసం

## సర్గ - 41

సీత దగ్గర అనుమతి తీసుకొని హనుమంతుడు రాముని దగ్గరకు వెళ్ళాలనుకొన్నాడు. అంతలో ఆయన మనస్సు నేను చేయాల్సిన కార్యం ఏది ఐనా మిగిలిపోయిందా? అని అనిపించింది. అందుకే కాస్త దూరం వచ్చి మళ్ళీ ఆలోచనాతరంగాలలో ఉండిపోయాడు. ఆయనకు ఒక ఆలోచన వచ్చింది. ఈ రాక్షసులను సామదాన భేదోపాయాల చేత జయించలేం కాని దండోపాయమే వీరికి ఉత్తమమైనది అనుకొన్నాడు. దండం దశగుణ భవేత్ అన్నారు కదా! ఇది వీరిని ఎదిరించగల ఉపాయం.

మూర్ఖులందరూ మనలను మించినవారు ఎవరూ లేరనే అపోహలో కాలం గడిపేస్తుంటారు. అలాటివారికి వారిని మించిన బలపరాక్రమాలను చూపెడితే వారు అయోమయావస్థలోకి జారిపోతారు. వారు తేరుకొనే లోపలే మనం పనిని చక్కబెట్టుకోవాలి అని ఆలోచించాడు. కాబట్టి వీరికి తప్పకుండా నా బలాన్ని రుచి చూపించాలి.

రణరంగంలో కొందరు హతులైతే మిగిలిన వారిలో భయోత్పాతం కలిగి తీరుతుంది. అప్పుడు వారే దారికొస్తారు. నేను ఇప్పుడు వీరిని భీతావహులను చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది అనుకొన్నాడు.

వెంటనే పనిని ఆరంభించాడు. కార్యం ఎంత స్వల్పమైనా దాన్ని సాధించడానికి చాలా ఉపాయాలుంటాయి. వాటినన్నింటిని తెలుసుకొన్నవాడే కార్యనిర్వహణదక్షుడు అనిపించుకొంటాడు. శత్రుబలాన్ని చక్కగా తెలుసుకొని యుద్ధ నైపుణ్యాలను అవగాహన చేసుకొని సుగ్రీవుని చెంతకు వెళ్ళితే అప్పుడు ప్రభుశాసనాన్ని చక్కగా నెరవేర్చినవాడినే అవుతాను అనుకొన్నాడు. రావణుని సామర్థ్యం బాగా తెలుసుకోవాలి అని హనుమంతుడు నిశ్చయించుకొన్నాడు. క్రూరుడైన రావణుని దగ్గర ఉన్న ఈ అశోకవనం దేవేంద్రుని నందనవనంతో సమానమైంది.

ఇది లతలతో వృక్షాలతో మనోజ్ఞంగా ఉంది. దీన్ని నేను నాశనం చేస్తాను. అప్పుడే నా వార్త రావణునికి తెలుస్తుంది అనుకొన్నాడు. రాముని బంటు ఇంత సామర్థ్యం గలవాడైతే రాముడింక ఎంత బలసంపన్నుడో అనుకొని మా సీతమ్మను ఇప్పటికైనా విడిచిపెట్టుతాడేమో అనుకొన్నాడు హనుమ. నన్ను పట్టుకోవడానికి రావణుడు చతురంగబలాలను పంపిస్తాడు. వారినందరిని నేను హతమార్చి సుగ్రీవుని దగ్గరకు హాయిగా చేరుతానని మారుతి అనుకొన్నాడు. అంతే పెనుగాలిలాగా హనుమంతుడు విజృంభించాడు.

వృక్షాలన్నింటిని పెకిలించి అవతల పడవేయసాగాడు. ఆ వనంలో వృక్షాలన్నీ భగ్నం చేశాడు. వాటిపైన ఉండే పక్షులు క్రింద మింగే మృగాలు అన్నీ కకావికలం అయి పెద్దగా రొద చేయసాగాయి. వృక్షాలన్నీ నేలమట్టం అయిపోయాయి. సరస్సులు క్రీడా పర్వతాలు అన్నీ చెల్లాచెదురుగా అయిపోయాయి. ప్రాణం లేని దేహంలాగా, అశోక వనం శోకమూర్తిలాగా తయారయ్యింది. కలవరపాటుకు లోనైన పక్షులన్నీ పెద్దగా అరవసాగాయి. జలాశయాలు ఛిన్నాభిన్నం అయ్యాయి. భూమి నుంచి వేరు పడ్డ లతల్లా వాడిపోయాయి. వృక్షాలు నేల మీద అచేతనంగా పడిపోయాయి. పర్వతాలు నుగ్గు అయ్యాయి. ఆ వనంలోని పొదరిండ్లు, చిత్రశాలలు అన్నీ పాడైపోయాయి. హనుమంతుని విజృంభణతో క్రూర మృగాలు సైతం భయంతో పరుగులు తీశాయి. సుందర వనం కాస్తా అసుందరం అయ్యింది. వనాన్ని అంతా పాడుచేశాడు. శత్రువులను ఎదిరించాలనే ఉత్సాహం ఉన్న మారుతి అశోకవనాన్ని నిస్తేజం చేసి ఆ వన ముఖద్వారం వద్ద శత్రువులకోసం ఎదురుచూస్తూ నిలబడ్డాడు.

* * *

# రాక్షసులు నిహతులవటం

## సర్గ - 42

**ఆం**జనేయుని చర్యలకు మృగాలు, పక్షులు గగ్గోలుగా అరవసాగాయి. పెళపెళరావాలతో పర్వతాలు నుగ్గు అవడంతో వచ్చే ధ్వని వల్ల లంకావాసులు భయంతో నలుదిసలా చూశారు. రాక్షసులకు అపశకునాలు కనిపించాయి. అంతవరకు నిద్రపోతున్న రాక్షస స్త్రీలు, రాక్షసులు వనభంగశబ్దాలకు లేచారు. వారిని చూసి హనుమంతుడు శరీరాన్ని పెద్దగా చేశాడు. ఆ వానరాకారాన్నిచూసి రాక్షస స్త్రీలు భయపడ్డారు.

ఆయనను చూచిన రాక్షస స్త్రీలు సీత దగ్గరకు పరుగున వచ్చారు. 'అమ్మా సీతాదేవీ! ఈ వచ్చిన వాడు ఎవడు? ఎక్కడనుండి వచ్చాడు? నీతో ఏమి మాట్లాడాడో చెప్పు, నిన్ను మేము ఏమీ అనము' అని చెప్పారు. సర్వాంగ సుందరి ఐన సీత ' కామరూపులు మీరు. మీకు తెలీకుండా ఇక్కడకు ఎవరైనా వస్తారా? ఇతడెవరో ఏం చేస్తున్నాడో నాకు ఎలా తెలుస్తుంది? మీలో ఎవరైనా ఇలా చేస్తున్నారేమో' అని చెప్పింది.

వైదేహి మాటలు విని మరింతగా రాక్షసులు భయపడి కొందరు అక్కడే ఉండిపోయారు. మరికొందరు రావణుని చెంతకు పరుగెత్తిపోయారు. 'ఓ మహారాజా! భయంకరాకారుడైన వానరుడు ఎవరో అశోకవనంలోకి ప్రవేశించాడు. సీతతో మాట్లాడాడు. మన ప్రమదవనాన్ని ధ్వంసం చేశాడు, చేస్తున్నాడు.

సీతను మేం ఆ వానరుడు ఎవరని అడిగి చూశాం. కాని ఆమె అతనిని గురించి మాకు చెప్పలేదు. ఆ వానరుడు ఇంద్రుని లేక కుబేరుని దూత ఏమో అని అనుమానం వస్తోంది. లేకపోతే ఆ శ్రీరాముడే ఈ వానరుణ్ణి ఇక్కడకు పంపి ఉంటాడు' అని వారి సందేహాన్ని చెప్పారు.

అత్యంత అద్భుతంగా ఉన్న వనవాటికనంతా వానరుడు భగ్నం చేశాడు. వనం అంతా పాడైపోయింది. అందులోని పక్షులు ఎగిరిపోయాయి. మృగాలన్నీ భయంతో అరుస్తూ పారిపోయాయి. ఒక్క సీతాదేవి కూర్చున్న చోటును తప్పించి మిగతా వనాన్ని అంతా ఆ కపి నాశనం చేశాడు. సీతాదేవి కూర్చున్న శింశుపా వృక్షం మాత్రం చిగుళ్ళతో పూవులతో అందంగా ఉంది. దానిని ఆ వానరుడు ముట్టలేదు.

'ఓ రాక్షస రాజా! ఆ భయంకరాకారుణ్ణి దండించడానికి మాకు అనుజ్ఞనిమ్ము.'అన్నారు. అతడు సీతతో మాట్లాడాడు అని చెప్పగానే ఆ మాటలకు రావణుడు కోపంతో ఊగిపోతూ పళ్లు పటపటలాడించాడు. ఆయన నేత్రాలనుండి అశ్రుకణాలు జారిపడ్డాయి. రాక్షసయోధులను పిలిపించాడు. ఎనభై వేలమంది రాక్షసులను పిలిపించి వారినందరిని గదలు, ఇనుప గుదియలు, బంగారు పిడులు అడ్డ కత్తులు, బాణాలను తీసుకొని వెళ్ళి ఆ వానరుని హతం చేసి రమ్మని చెప్పాడు.

రావణుని ఆజ్ఞతో సమరోత్సాహంతో ఎనభై వేలమంది రాక్షసులు వివిధాయుధాలను ధరించి ఒక్క వానరునిపై ఎగిసివచ్చారు. వారినందరిని చూసి హనుమంతుడు చిరునవ్వు నవ్వి, తన వాలాన్ని నేలపై బలంగా కొట్టి సింహనాదం చేశాడు. తన జబ్బలను గట్టిగా చరిచాడు. ఆ శబ్దం లంక అంతా ప్రతిధ్వనించింది. బిగ్గరగా జయఘోష చేశాడు.

మహాబల సంపన్నుడైన శ్రీరామునకు జయం, లక్ష్మణస్వామికి జయం, వానర ప్రభువైన సుగ్రీవునకు జయం. నేను కోసల దేశపు మహారాజైన శ్రీరాముని దూతను. నేను శ్రీరామదాసుడను. వాయుపుత్రుడను. హనుమంతుడననే నామం ఉన్నవాణ్ణి.

నన్నెదిరించి యుద్ధ రంగంలో ఎవరూ నిలవజాలరు. ఈ రాక్షసులందరిని నేను తుదముట్టించగలను. మీరందరూ ఏమీ చేయలేక చూస్తుంటారు. నేను వచ్చిన పని ముగించుకొని నా తల్లి ఐన సీతాదేవికి నమస్కరించి నేను నా ప్రభువు దగ్గరకు వెళ్తాను అంటూ భీషణ ధ్వని చేశాడు. ఆ ధ్వనికి రాక్షసులందరూ భయంతో బిక్కచచ్చారు.

రావణుని ఆజ్ఞతో రాక్షసులందరూ ఆంజనేయుని చుట్టుముట్టారు. రాక్షస వీరులందరూ దగ్గరకు రాగానే ఆ అశోక వన వాటికకు ఉన్న ఇనుప గడియను చేత్తో పట్టుకొన్నాడు. ఆ ఇనుప గొట్టంతోనే రావణుని కింకరులను పరిమార్చివేశాడు. అందరిని సంహరించి వేసి ఇంకా ఎవరైనా వస్తారేమోనని హనుమంతుడు వనద్వారం వద్దహాయిగా నిల్చున్నాడు.

హనుమంతుని ధాటికి భయపడి పిరికిపందల్లాగా పారిపోయిన కొందరు రాకాసిమూక రావణుని దగ్గరకు పరుగెత్తి వెళ్ళి హనుమంతుడు చేసిన భీతావహదృశ్యాన్ని కళ్ళకు కట్టినట్లుగా వర్ణించి చెప్పారు. రావణునిలోక్రోధం పెరిగిపోయింది. ఒక్క వానరుడేమి ఎనభైవేలమందిని చంపడమేమిటిఅన్న విషయం విని కోపంతో కుతకుతలాడాడు.

క్రుద్ధుడైన రావణుడు తన మంత్రి ఐన ప్రహస్తుని కుమారుని పిలిచి ఆ వాయు సుతునితో పోరాటం చేయమని పంపించాడు.

* * *

# చైత్య ప్రాసాద ధ్వంసం

## సర్గ - 43

ఆంజనేయుడు తనపైకి వచ్చిన రాక్షసులందరిని హతమార్చాడు. ఆయన దృష్టి చైత్య ప్రాసాదం పడింది. అరే! నేను వనాన్ని అంతా ధ్వంసం చేశాను కాని ఇది మిగిలిపోయింది. దీన్ని నా బలంకొద్దీ నాశనం చేస్తానని అనుకొన్నాడు. వెంటనే అశోకవనద్వారం నుండి చైత్యప్రాసాదానికి ఒక్క గెంతువేశాడు. ఆ ప్రాసాద అగ్రభాగానికి చేరాడు.

అక్కడ చేరిన ఆంజనేయుడు మరో ఉదయభానునిలా కనిపించాడు. ఆ ప్రాసాదభాగానికి చేరిన హనుమంతుడు లంక అంతా వినిపించేటట్లుగా జబ్బలను గట్టిగా చరిచాడు. ఆ శబ్దానికి ఆకాశంలో ఎగిరే పక్షులు నేలకూలాయి. చైత్య సంరక్షకులందరూ మూర్ఛపోయారు. అస్త్ర విద్యాపారంగతుడైన రాముని దిగ్విజయం లక్ష్మణ స్వామికి జయం సుగ్రీవునికి విజయం అంటూ గట్టిగా అరిచాడు.

శ్రీరాముని నమ్మిన బంటును నేను. ఆంజనేయ నామాంకితుడను. నా ఎదురుగా వేయిమంది రాక్షసులు వచ్చినా నిలవలేరు. యుద్ధంలో నాకు సాటి వచ్చే మొనగాడే లేడు. నేను ఈ లంకనంతా ధ్వంసం చేసి సీతను చూసి కృతార్థుడినై తిరిగి నేను నా రాముని చెంతకు వెళ్తాను. ఈ రాక్షసులందరూ తెల్లమొహాలు వేసుకొని నన్నే చూస్తుందురు గాక! అంటూ రాక్షసులకు దడపుట్టిస్తూ వారి గుండెల్లో మంటలు రేపుతూ ఈ చైత్యప్రాసాద విధ్వంసానికి పూనుకొన్నాడు.

అక్కడున్న ఆ ప్రాసాదసంరక్షకులందరూ ఈటెలతో, శూలాలతో ఆంజనేయునిపైకి వచ్చారు. వారి చేతిలోని గదలతోను, వాడి ఐన బాణాలతోను హనుమంతుని బాధించారు.

వాయుసుతుడు చాలా కోపం తెచ్చుకొన్నాడు. స్వర్ణాలంకృతమైన స్తంభాన్ని ఒకదాన్ని పెరికాడు. నూరు అంచులు ఉన్న ఆ స్తంభాన్ని గిరగిరా త్రిప్పాడు. అప్పుడు ఆ అంచులనుండి అగ్ని బయటకు వచ్చింది. ఆ అగ్ని ఆ చైత్యప్రాసాదాన్నంతా దహించి వేసింది. ఇంద్రుడు తన వజ్రాయుధంతో అసురులను చంపినట్లుగా వానర శ్రేష్ఠుడైన హనుమంతుడు ఆ రాక్షసులనందరిని సంహరించాడు.

వారినందరిని హతమార్చి ఆకాశాన నిలబడి నాలాంటి వానరులెందరో ఈ భూమండలాన్నంతా ఆక్రమించుకొని ఉన్నారు. వారందరూ సుగ్రీవాజ్ఞను తలదాల్చుతారు. మాలో ఉన్నవారందరూ మహాబలశాలురు. ఒకరిని మించిన వారు మరొకరు ఉన్నారు. ఒకరు పది ఏనుగుల బల సంపన్నులైతే మరొకరు వంద ఏనుగుల బలం ఉన్నవారు. ఇంకొందరు వేయి మరికొందరు పదివేల ఏనుగుల బలంతో ఉన్న తేజోసంపన్నులు.

వీరే కాదు వాయువేగ బల సంపన్నులు, ఊహించని బల పరాక్రమాలున్నవారు కూడా మాలో ఉన్నారు. దంతాలు, నఖాలు, ఆయుధాలుగా ఉన్న వానర వీరులెందరో లెక్కకుమించి ఉన్నారు. కోట్ల సంఖ్యలో వానరులను వెంటబెట్టుకొని సుగ్రీవుడు, రామలక్ష్మణులు లంకకు వచ్చి మిమ్ముల్నందరిని సర్వనాశనం చేస్తారు.

శ్రీరామునితో వైరం పెట్టుకొన్న వారు ఎవరూ ఉండరు. ఈ మిమ్ములను ఏలే ఈ దుష్టదుర్మార్గదుష్ప్రవర్తనుడైన రావణుడు సైతం మిగలడు. ఆయనను ఆశ్రయించిన మీరును చిరునామా లేకుండా పోతారు అని హనుమంతుడు అరచి చెప్తున్నాడు. అక్కడున్న రాక్షసులందరూ ఆంజనేయుని అరుపులు విని భయభ్రాంతులయ్యారు.

ఎక్కడివారెక్కడ బిగ్రబిగుసుకుపోయారు. ఏ ప్రళయం ముంచుకువస్తుందోనని నలుదిక్కులా చూస్తున్నారు. అశోకవనం లోని స్త్రీలు త్రిజట చెప్పిన కల నిజమౌవుతుందేమోనని భయంతో కన్నులనిండా నీరు నింపుకుంటున్నారు. వారందరూ రావణుని దుశ్చర్యను గురించి మాట్లాడుకొంటున్నారు. వారివారి కన్నబిడ్డల స్థితి, వారు కట్టుకొన్నవారి గతి ఏలాఉంటుందో ననే చింతలో మునిగిపోయారు. ఈ సీతమ్మను వదిలేస్తే పోతుందిగదా.

రావణుడు కోరుకొంటే అతిలోకసౌందర్యవతులు ఎంతోమంది వస్తారు. ఈ మానవకాంత వద్దంటుంటే రావణుడు పట్టుపట్టడం బాగాలేదని మనసున వాపోతున్నారు. మగువ మనసున స్థానం సంపాదించుకోకుండానే పెత్తనం చెలాయించే రావణునిబుద్ధిని ఏ ఒక్కరూ మెచ్చుకోలేకపోతున్నారు. కాని ధైర్యంగా ఒక్కరూ రావణుని చర్యలను ఆపేయడానికి సాహసించడంలేదు. విభీషణుడైనా చెప్పవచ్చుగదా! లేదా ఇంకెవరైనా బుద్ధి చెప్పచ్చుగదా! అని వారిలో వారు అనుకొంటూ కన్నులనీరును ఒత్తుకొంటున్నారు.

* * *

# జంబుమాలికి యముని దర్శనం

## సర్గ - 44

ప్రహస్తుని కుమారుడు జంబుమాలి. ఇతడు చాలా బలశాలి. పెద్ద పెద్ద కోరలున్నవాడు. చేతిలో ధనుస్సు పట్టుకొని ఆంజనేయునిపై రాజాజ్ఞతో యుద్ధానికి వచ్చాడు. అతడు ఎర్రని వస్త్రాలు ధరించి కంఠంలో పూలమాలతో శ్రవణ కుండలాలు పెట్టుకొని భీకరంగా అరుస్తూ కన్నులు ఎర్రగా చేస్తూ వచ్చాడు. ఇంద్రుని వజ్రాయుధ సమమైన ధనుస్సును చేత బట్టుకొని ధనుష్టంకారం చేశాడు.

ఆ ధ్వని ఎనిమిది దిక్కులనూ ఆవరించింది. గాడిదలు పూన్చిన రథంపైన జంబుమాలి రావడం హనుమంతుడు చూశాడు. యుద్ధానికి మరొకరు వస్తోందని ఆంజనేయుని హృదయం పొంగిపోయింది. జంబుమాలి రావడంతోనే ముఖద్వారం వద్ద వేచి ఉన్న ఆంజనేయునిపై బాణప్రయోగం చేశాడు.

ఆంజనేయుని ముఖంపైన అర్ధచంద్రాకారంలో ఉన్న ఒక బాణాన్ని ఆయన బాహువులపైన పది బాణాలను వేసి బాధించాడు. ఆ బాణాల దెబ్బకు ఎర్రని ముఖం ఉన్న కపివరుడు సూర్యకిరణాల తాకిడికి బాగా వికసించిన కెందామరలాగా కనిపించాడు. దాంతో హనుమంతుడు క్రుద్ధుడయ్యాడు. వెంటనే ప్రక్కకు చూశాడు. ఒక పెద్ద శిల కనిపించింది. దాన్ని పెకలించి మహావేగంతో జంబుమాలిపై ఆంజనేయుడు విసిరాడు. జంబుమాలి తన బాణాలతో దానిని ముక్కలుగా చేశాడు. దాన్ని చూచి హనుమంతుడు మద్దిచెట్టును పెకలించి గిరిగిరా త్రిప్పాడు.

చాలా బలసంపన్నుడని తలచి ఆంజనేయునిపై జంబుమాలి అనేక బాణాలను వేశాడు. ఆయన వక్షస్థలాన్ని కూడా నొప్పించాడు. శరీరం అంతా బాణాలు గుచ్చుకోవడంతో అక్కడే ఉన్న ఒక్క పరిఘను తీసుకొని గిరగిరా త్రిప్పి జంబుమాలి గుండెలమీద ఆంజనేయుడు మోదాడు. దాని దెబ్బకు జంబుమాలి రథం నుగ్గు నుగ్గు అయ్యింది. జంబుమాలి శిరస్సు బాహువులు, మోకాళ్ళు గుండె అంతా నుజ్జు అయింది.

పరిఘ దెబ్బతో జంబుమాలి నేలకొరిగాడు. ఆయన ధరించిన ఆభరణాలు, ధనుస్సు అన్నీ పొడిపొడి అయిపోయాయి.

ఆ విషయాన్ని కింకరులు రావణుని చెవిన వేశారు. మహాపరాక్రమశాలి ఐన జంబుమాలి మరణంతో రావణుడు కోపంతో ఊగిపోయాడు. ఎనభై వేలమంది రాక్షసులను, జంబుమాలిని హతంచేసిన ఆంజనేయునిపై మండిపడి అమాత్యపుత్రులను పిలిపించి హనుమంతునిపైకి పంపించాడు.

* * *

# మంత్రి పుత్రుల వధ

## సర్గ - 45

రావణుని ఆదేశాన్ని శిరసావహించి మంత్రి పుత్రులైన ఏడుగురు ఆ భవనం నుండి బయటకు వచ్చారు. ఆ ఏడుగురు ధనుర్ధారులలో పేరెన్నికగలవారు. మహాబలశాలురు అస్త్ర శస్త్రవేత్తలలో నిష్ణాతులు. వారందరూ హనుమంతుని ఎదుర్కోవాలని తహతహలాడుతూ వచ్చారు.

అశ్వాలు పూన్చిన రథాలపై ధ్వజపతాకాలతో వారు వచ్చారు. వారి మేఘగర్జన చేస్తూ ఆంజనేయునిపైకి వచ్చారు. వారి ధనుస్సులు బంగారంతో చేసి చిత్ర విచిత్రంగా కనిపిస్తున్నాయి. రణోత్సాహంతో వచ్చేవారు ధనుష్టంకారాలను చేస్తున్నారు. ఎనభై వేలమంది రాక్షసులను హతమార్చిన ఆంజనేయుని తెలుసుకొని వారి తల్లులు భయంతో వణికిపోతున్నారు. వారందరూ వడివడిగా వచ్చి యుద్ధ సన్నద్ధుడైన ఆంజనేయునిపై తమ బాణకౌశలాన్ని చూపెడుతూ శరవర్షాన్ని కురిపించారు. అప్పుడు ఆంజనేయుడు వర్షధారలతో కప్పివేయబడే పర్వతంలాగా కనిపించాడు. ఆకాశంలో నిలబడి వారి వీరంగాన్ని చూస్తూ ఆంజనేయుడు వారి ఉద్ధృతికి అడ్డుకట్టవేసి వారి రథాలను నిర్వీర్యం చేశాడు. సాటిలేని ఆ మహావీరుడు మంత్రి పుత్రులను వధించాలని తలచి వీరు భీరులు అయ్యేటట్లుగా భీకరంగా మేఘంలాగా గర్జించాడు. వారిలో కొందరిని తన అరచేతితో మోది పైకి పంపాడు.

మరికొందరిని కాళ్ళతో తంతూ ముష్టిఘాతాలతో ఆంజనేయుడు వారిని బాధించాడు. ఇంకొందరిని తన వాడి గోళ్ళతో గీరి హింసించాడు. తన వక్షస్థలంతో కొందరిని తొడల తాకిడితో ఇంకొందరిని నుగ్గుచేశాడు. ఆంజనేయుని దెబ్బతిని మంత్రి పుత్రులంతా గబగబా యమపట్టణసందర్శనాభిలాషతో దక్షిణదిక్కుకు పారిపోయారు. రావణుని సేనలలో చాలామంది చనిపోగా మిగిలినవారు కొందరు కాలికి బుద్ధి చెప్పారు. రథాలు విరిగి ముక్కలుగా పడిపోయాయి. ధ్వజాలు విరిగి అక్కడికక్కడే నేలరాలాయి. సమరభూమిలాగా తయారైన అశోకవనం అంతా రాక్షసుల రక్తంతో కాల్వలు కట్టింది. వారి వికార ధ్వనులతో ఆ ప్రదేశం అంతా మారుమ్రోగింది. వారినందరిని చంపివేసి ఇంకా ఎవరైనా వస్తే వారి పని పడదాం అని మారుతి తిరిగి ఆ అశోకవనముఖద్వారం దగ్గర ఎదురు చూడసాగాడు.

* * *

# సేనాపతుల సంహారం

## సర్గ - 46

రావణునికి మంత్రిపుత్రుల సంగతి తెలిసింది. ఆ వానరుడెవ్వరో కాని నా పని గల్లంతే అనుకొన్నాడు. హృదయంలో ఆవేదన మొదలైంది. అయినా ఇదంతా పైకి తెలీనీయకుండా రావణ రాజు జాగ్రత్త తీసుకొన్నాడు. బాగా ఆలోచించాడు.

విరూపాక్షుడు, యూపాక్షుడు, దుర్ధరుడు, ప్రఘుసుడు, భాసకర్ణుడు ఈ ఐదుగురు సేనాపతులను పిలిపించాడు. మహావీరులైన వారిని హనుమంతునితో యుద్ధం చేసి విజయులై రమ్మని చెప్పాడు. వారు ఆంజనేయుని గూర్చి తెలుసుకొని మహోత్సాహంతో ఆంజనేయునిపైకి విజృంభించారు. అలా వెళ్ళేవారితో రావణుడు మీరందరూ చతురంగ బలాలను తీసుకొని వెళ్ళండి రణనీతితో కాలానికి అనుగుణంగా వ్యవహరిస్తూ ఆ వానరున్ని చంపివేయండి అని చెప్పాడు.

'ఓ వీరులారా!ఇప్పటివరకూ ఆ వానరుడు చేసినవన్నీ జ్ఞప్తిలో పెట్టుకోండి. నేను ఆలోచించి చూడగా ఇంద్రుడే మనలను అంతం చేయడానికి వీటిని సృష్టించినట్లుంది. దేవేంద్రుని నాగ, యక్ష, గంధర్వాదులను మీ సహాయంతో ఎన్నోమార్లు నేను ఓడించి ఉన్నాను. అందువలన మనపైకి ఇంద్రుడు ఈ వానరుణ్ణి పంపినట్లున్నాడు. మీరు అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ వానిని తుదముట్టించండి' అని రావణుడు వారికి నీతి చెప్పాడు.

యోధులారా! వానరుడని తక్కువ అంచనా వేయకండి. మీరు జాగ్రత్తగా వ్యవహరిస్తూ చతురంగ బలాలను తోడుగా ఉంచుకొని ఆ వానర వీరుణ్ణి పట్టి బంధించండి. నేను ఇంతకుముందు వాలి, సుగ్రీవుడు, జాంబవంతుడు అనే వారిని చూశాను. వారందరూ బలసంపన్నులే. కాని ఈ వచ్చిన వానరుడు వారి అందరి శక్తిని ఒక్కడే కూడగట్టుకొని వచ్చినట్లున్నాడు. ఇంతటి మేధాశక్తిని గమనశక్తిని నేను ఇదివరలో ఎక్కడా చూడలేదు.

ఇతనిని ఎలా అయినా పట్టి బంధించండి. మీ ముందు దేవేంద్రాదులు, మానవులు, ముల్లోకాలలోని వీరులు నిలవలేరు. రణనీతిజ్ఞులు తమ ప్రాణరక్షణలో ఆత్మరక్షణ విషయంలో అతి జాగ్రత్తగా ఉండాలి. విజయం ఎల్లప్పుడు ఒకరినే వరిస్తుందని చెప్పలేము. మీ జాగ్రత్తను మీరు ఏమరుపాటు లేకుండా చేయండి" అని రావణుడు వారికి చెప్పాడు. ప్రభువు చెప్పిన రణనీతిని మనస్సులో ఉంచుకొని మహా ఉత్సాహంతో ఆంజనేయునిపైకి సేనాపతులు విజృంభించారు.

ముఖద్వారం పైన కూర్చున్న తేజోసంపన్నుడైన వానరుని వారు చూశారు. చతురంగ బలాలతో ఆయుధాలతో సమృద్ధితో వచ్చే రాక్షసులను హనుమంతుడు కోపంగా చూశాడు. వారందరూ ఆంజనేయుని చుట్టుముట్టి ఆయనపై ఆయుధాలను ప్రయోగించారు.

దుర్ధరుడనేవాడు ఐదు బాణాలను మారుతి శిరస్సుపై విసిరాడు. అవి ఆంజనేయుని తాకగానే గర్జిస్తూ వాయుసుతుడు ఆకాశంలోకి ఎగిరాడు. ఆ వాయుసుతునిపై దుర్ధరుడు వందలకొలది బాణ శరపరంపరను వేశాడు. ఆంజనేయుడు పోరాటం చేస్తూనే ఆయన శరీరాన్ని బాగా పెంచాడు. ఒక్కసారిగా ఎగిరి దుర్ధరుని రథంపైకి దూకాడు. వెంటనే అది నుజ్జు అయిపోయింది. ఆ రథానికి పూన్చిన ఎనిమిది గుర్రాలు నేలపై పడిపోయాయి. దాంతో దుర్ధరుడు నేలకు ఒరిగి ప్రాణాలు వదిలేశాడు.

దుర్ధరుడు ప్రాణాలు విడవడం చూచి విరూపాక్ష యూపాక్షులు రోషంతో ఆకాశానికి ఎగిరారు. అలా ఎగిరి తమ ముద్గరంతో ఆంజనేయుని గుండెలపై మోదారు. గొప్ప బలశాలి ఐన మారుతి వారిని నిరోధించి ఒక సాల వృక్షాన్ని పెకలించి వారిపై మోదుతూ వారిని హతమార్చాడు.

ముగ్గురు యోధుల మరణం చూసిన ప్రఘసుడు క్రుద్ధుడై హనుమంతునిపైకి ఎగిరాడు. అదే సమయంలో భాసకర్ణుడు కోపంగా ఆంజనేయుని ప్రక్కలకు తిరిగి విజృంభించాడు. అలా వారిద్దరూ ఒకేసారి హనుమంతుని బాధించారు. బాసకర్ణుడు వాడి ఐన శూలాన్ని హనుమంతునిపై విసిరాడు. వారిద్దరి వల్ల హనుమంతుని శరీరం ఛిద్రమై రక్తసిక్తం అయ్యింది. బాలసూర్య సమప్రభలతో ఒప్పారే హనుమంతుడు వారిద్దరి పని పట్టాలని తలచాడు.

వెంటనే మృగాలతో, పక్షులతో, వృక్షాలతో ఉన్న ఒక గిరిశిఖరాన్ని ఎత్తి ఆ ఇద్దరిని మోదాడు. ఒక్కసారే వారిద్దరూ ఆ దెబ్బకు ప్రాణాలు వదిలేశారు. ఆ గిరిశిఖరం క్రింద పడి వారి శరీరాలు ఆవగింజంతగా నలిగిపోయాయి. ఇక మిగిలిన వానర సైన్యాన్ని కకావికలం చేసి అందిన వారిని అందినట్లుగా మట్టుపెట్టాడు. యోధులను యోధులతో ఢీకొట్టించాడు. ఆ వనం అంతా ఏనుగులు గుర్రాలు చచ్చిన శవాలతో నిండిపోయింది. రథాలు, చక్రాలు, ఇరుసులతో రాక్షసవీరుల కళేబరాలతో ఆ ప్రదేశం అంతా మూసుకొని పోయింది. మహావీరుడైన హనుమంతుడు బలశాలురైన సేనాపతులను, వారి వారి చతురంగ బలాలతో పదాతిదళాన్ని సైతం విడవకుండా సంహరించాడు. అప్పుడు ఆంజనేయుడు రాక్షసుల పాలిట మృత్యుదేవతలాగా భాసిల్లాడు.

* * *

# అక్షకుమారుని పరాక్రమం

## సర్గ - 47

**స**భలో కూర్చుని ఉన్న రావణునకు సేనాపతుల మరణవార్త తెలిసింది. ఆయన కన్నులు ఎర్రచేస్తూ కోపంగా చూశాడు. ఆ చూపు ఎదురుగా కూర్చుని ఆయన పుత్రుడైన అక్షకుమారునిపై పడింది. వెంటనే అక్షకుమారుడు రణోత్సాహంతో పైకి లేచాడు. సభలోనివారందరూ అక్షకుమారుని వీరత్వానికి పొంగిపోయి జయజయధ్వానాలు చేసి ఆయనను ప్రోత్సహించారు.

యజ్ఞకుండంలో లేచిన అగ్నిలాగా అక్షకుమారుడు తన ఆసనం పైనుండి లేచాడు. తండ్రి అనుమతి తీసుకొన్నాడు. మేలిమి బంగారుతో చేసిన రథంపై ఎక్కి యుద్ధానికి బయలుదేరాడు. ఆ రథం అక్ష తపస్సు ఫలితంగా దక్కింది. రత్నాలు పొదిగిన ధ్వజం, మనోహరమైన పతాకం మనోవేగంతో పరుగెత్తగల ఎనిమిది గుర్రాలు ఆ రథానికి ఉన్నాయి. ఆ రథం నిరాటంకంగా సాగిపోతుంది. అంతరిక్షంపై కూడా సంచరించగలది అమ్ముద పొదలు, కత్తులు ఒరలు ఉన్నాయి. ఆ అమ్ముల పొదల నిండా బాణాలను ఎనిమిది కత్తులను, శక్తి తోమరాలతో ఆ రథం చూచేవారికి మనోహరంగా కనిపిస్తుంది. అలాంటి రథం ఎక్కి అక్షకుమారుడు ఆంజనేయునితో యుద్ధానికి వెళ్ళాడు.

హయ, గజ, రథాల సవ్వడులతో చతురంగ బలాలతో సర్వ సన్నద్ధంగా సమర భూమికి వస్తున్న అక్షకుమారుని వనవాటికముఖద్వారంపైన కూర్చున్న ఆంజనేయుడు చూశాడు. అక్షకుమారుడు ఆ వానరోత్తముని చూచి ఆశ్చర్యంగా గర్వంగా చూశాడు.

బలశాలి ఐన అక్షకుమారుడు ఆంజనేయుడు ఇప్పటిదాకా చంపిన రాక్షసులను, ఆయన రూపాన్ని తన బలాన్ని అంచనా వేసుకొన్నాడు. ఆయనలో రణోత్సాహం పెల్లుబికింది. వెంటనే తన అమ్ముల పొది నుంచి మూడు బాణాలను తీసుకొన్నాడు. కపివరుని కవ్విస్తూ ఆ బాణాలను ఆయన శిరస్సుకు తగిలేటట్లుగా వేశాడు. అవి ఆంజనేయుని ఏమీ చేయలేకపోయాయి.

దాన్ని చూచి అక్షకుమారుడు ఈ వానరుడు రాక్షసులను అవలీలగా చంపగలను అనే ధీమాతో కూర్చుని ఉన్నాడు అనుకొని వెంటనే స్థిరమైన మనస్సుతో ఆంజనేయుని ఎదురుగా వెళ్ళాడు. బంగారు పతాకాలతో భుజకీర్తులతో కుండలాలతో ఎదురులేని పరాక్రమంతో హనుమంతుని ఎదుట నిలబడ్డాడు. ఆ వీరుల సమాగమం సురాసురలకు ఆశ్చర్యాన్ని కలిగించింది.

వారిద్దరూ చేసే యుద్ధానికి భూమి దద్దరిల్లింది. సూర్యుడు ప్రకాశించడం, వాయువు వీచడం మానేశారు. పర్వతాలు చలించాయి. ఆకాశం ధ్వనించింది. సముద్రం అల్లకల్లోలం అయింది. అలా వారిద్దరి రణంలో అక్షకుమారుడు మొనదేలి బంగారు పొన్ను ఉన్న బాణాలను హనుమంతునిపై వేశాడు అవి హనుమంతుని బాగా బాధించాయి. వాటివల్ల ఆయన ముఖం రక్తసిక్తమై వికసించిన తామర పూవులాగా కనిపించింది. అపుడే వెలుగులీనుతున్న ఆదిత్యునిలాగా ఆంజనేయుని ముఖం వికసించింది.

అక్షకుమారుడు మితిమీరిన ఆనందంతో పోరు చేస్తున్నాడు. ఆయనను చూచి హనుమంతుడు మెచ్చుకోలేకుండా ఉండిపోయాడు.

అక్షకుమారుని మెచ్చుకొంటూనే తన శరీరాన్ని పెంచుతూ ఆకాశంలోకి ఎగిరాడు అయినా అక్షకుమారుడు వదలకుండా బాణపరంపరను కొనసాగిస్తూనే ఉన్నాడు. అతి లాఘవంగా వాటిని తప్పించుకొంటూ అక్ష కుమారుని సేననంతా ఆంజనేయుడు హతమార్చసాగాడు. అక్షకుమారుడు కూడా ఆంజనేయుని నిరోధించాలని ఆకాశానికి ఎగిరాడు. ఆ ఉత్సాహం చూచి హనుమంతుడు ఏమి ఉత్సాహం! అద్భుతంగా పోరు సల్పుతున్నాడు. చిన్నవాడైనా గట్టివాడే! యక్షులు కిన్నరులు ఎవరైనా వీరుని మెచ్చుకొని తీరాల్సిందే అని అనుకొన్నాడు.

ఏమరుపాటుగా ఉన్న ఆంజనేయునిపై దూసుకొస్తున్న అక్షకుమారుని చూచి జబ్బలు చరిచి తొడలను కొట్టి సమరోత్సాహాన్ని ఆంజనేయుడు పెంచాడు. వేలకొలది రాక్షసులను మట్టి కరిపించిన ఆంజనేయునిపై పిచ్చి కోపంతో అక్షకుమారుడు విజృంభిస్తున్నాడు. ఎలా అయినా అక్షకుమారుని ఆపకపోతే అతడు నన్ను తిరస్కరిస్తాడనుకొన్నాడు మారుతి. మంచి పరాక్రమశాలి యుద్ధ విద్యలలో ఆరితేరిన ఈ యువకుని చంపడానికి నా మనస్సు రావడం లేదు. అలా అనుకొనే హనుమంతుని వక్షస్థలాన్ని అక్షకుమారుడు తన బాణాలతో గాయపరిచాడు. ఇతని మనస్సు ఉరకలు వేస్తోంది. ఇతడిని బాలుడని ఉపేక్షిస్తే నన్ను అవమానించక వదలడు. ఏదిఏమైనా ఇతనిని చంపి తీరాలి అని హనుమంతుడు నిశ్చయించుకొన్నాడు.

అలా ఆలోచించి కపివరుడు అక్షకుమారునిపై తన పరాక్రమాన్ని చూపాడు. తన అరచేతితో ఎనిమిది గుర్రాలను మట్టి కరిపించాడు. ఆకాశంలో గుర్రాలు తునకలై నేలకు జారాయి. వెంటనే రథాన్ని తన బలంతో

మోదాడు. అది కూడా ఒక్క నిమిషంలో తునకలై భూమిపై పడిపోయింది. ఆంజనేయుని విజృంభణ చూసి అక్ష కుమారుడు ఆకాశంలో నిలబడి పోరు సాగించాడు.

అలా ఎగిరే అక్షకుమారుడు తపఃశక్తితో సశరీరంగా స్వర్గానికి వెళ్తున్న ఋషిలాగా కనిపించాడు. ఆకాశంలో నిలబడి ఉన్న అక్షకుమారుని ఆంజనేయుడు వెళ్ళి ఆయన కాళ్ళను తన చేతికి చిక్కించుకొని గట్టిగా పట్టుకొన్నాడు. వెంటనే అక్షకుమారుని క్రిందకు లాగివేసి తన చుట్టూ గిరగిరా త్రిప్పి విసిరి నేలకేసికొట్టాడు.

పాపం అక్షకుమారుడు నేలపై పడి పోయాడు. అక్షకుమారుని చేతులు, కంఠం, కటి ప్రదేశం, తొడలు, ఎముకలు అన్నీ ముక్కలుగా విరిగిపోయాయి. ఆ పరాక్రముని ప్రాణాలు అనంత వాయువులో లీనమైపోయాయి. వానరోత్తముడు అక్షకుమారుని నేలకేసి కొట్టి చంపివేయడాన్ని సిద్ధులు, మహర్షులు, యక్షులు, నాగులు, ఇంద్రుడు అందరూ ఆశ్చర్యంగా చూశారు.

అక్షకుమారుని యమపురికి పంపివేసి రణోత్సాహం తీరని ఆంజనేయుడు ఇంకా ఎవరైనా తనపైకి ఉరికివస్తారేమో వారి పని పడ్దాం అని వనముఖ ద్వారంపై ఎగిరి కూర్చున్నాడు. తేజోసంపన్నుడు మహా పరాక్రమశాలి ఐన అక్షకుమారుడు యమపురి దర్శనానికి వెళ్ళాడు.

* * *

# బ్రహ్మాస్త్రంతో బంధితుడైన హనుమంతుడు

## సర్గ - 48

అమిత పరాక్రమశాలి తేజో సంపన్నుడైన అక్షకుమారుడు చనిపోవటంతో రావణునిలో దిగులు మొదలైంది. అయినా మనస్సు కుదుటపర్చుకొని దేవేంద్రునితో సమానమైన తన మేఘనాదుని పిలిచాడు. 'ఓ కుమారా! నీవు అస్త్రశస్త్రాదులు ప్రయోగించడంలో నిష్ణాతుడవు. బ్రహ్మదేవుని గూర్చి తపస్సు చేసి బ్రహ్మాస్త్రాన్ని సాధించావు. నీ చేతిలో ఇంద్రుడే ఓడిపోయాడు. నీ ముందు మరుద్గణాలు కూడా నిలవలేవు.

ఈ ముల్లోకాలలో నీతో పరాజితుడు కానివాడంటూ ఎవరూ లేరు. నీ భుజపరాక్రమాదులే నీ భద్ర కవచాలు. నీ తపస్సే నీకు సర్వరక్ష, నీవు నిరుపమాన ప్రజ్ఞాశీలివి. నీకు అసాధ్యమైన కార్యం ఏదీ లేదు. నీకు తెలియనిది ఏదీ లేదు. తపోబలంలోను యుద్ధంలోను నాతో సమానుడవు నీవే. నీవు నా పక్షంలో నిలబడి పోరాడితే నాకు జయంతథ్యం అని నాకు తెలుసు.

మేఘనాథా! ఒక వానరుడు ఎనభై వేలమంది రాక్షసులను జంబుమాలిని, అమాత్యపుత్రులను సేనానాయకులను మట్టికరిపించాడు. అంతేగాదు అక్షకుమారుని కూడా చంపివేశాడు. అశ్వాలు, గజాలు, రథాలు ఎన్నో నుగ్గు అయ్యాయి. పదాతి దళానికి అంతులేదు. ఓ సుపుత్రా! నీపై నమ్మకం నాకు ఉంది. నీవు యుద్ధం

చేసేటపుడు కాలానుగుణంగా వ్యవహరించు. నిన్ను చూచిన తోడనే శత్రువులు లొంగిపోతారు. అయినా నీవు నీ బలమును, ఆ వానరుని బలాన్ని ఒక్కసారి సమీక్షించుకొని మన సేనలను నాశనం చెందకుండా ఉండేలా ఆలోచించి యుద్ధం చేయుము

మేఘనాధా! ఆ వానరుడు ఒకే దెబ్బతో చాలామందిని నాశనం చేస్తున్నాడు. ఆయన దెబ్బనుండి మన సేనలను కాపాడడం అంత తేలిక కాదు. అందుకని నీవు సేనలను తీసుకొనిపోవద్దు. వజ్రాయుధం కూడా ఆ వానరుని ముందు పని చేయనట్లుంది. ఎందుకంటే ఆ వానరుని వేగం ముందు వాయువేగం కూడా దిగదుడుపే. అక్ష కుమారుని కూడా నిహితుడిని చేసిన వానరుని తక్కువ అంచనా వేయకూడదు. ఇక మిగిలింది మన పితామహుడు ఇచ్చిన అస్త్రమే.

నీవు తపస్సు చేసి దక్కించుకొన్న ఆ అస్త్రమే ఈ వానరుని బంధించగలదు. దీనిని మించి ఏ ఆయుధం ఆ వీరుని బంధించలేదని నాకు తెలుస్తోంది. చిన్నవానివైన నిన్ను యుద్ధరంగానికి పంపడం నాకు ఉచితంగా లేదు. కాని క్షాత్ర ధర్మాన్ని అనుసరించి సమర్థులైన యోధులు ఉన్నప్పుడు రాజు తనకు తానుగా యుద్ధానికి వెళ్ళకూడదు. అందువలనే నిన్ను ఆ వానరుని దగ్గరకు పంపుతున్నాను.

కదనరంగంలో విజయులం అవ్వాలన్న దీక్షయోధులందరికి ఉండాల్సిందే. జయార్థం అన్న అస్త్ర శస్త్ర ప్రయోగాలు తెలిసి ఉండాలి.' అని రావణుడు తన కొడుకుకు జాగ్రత్తలు చెప్పాడు. దేవతల వలె దివ్య ప్రభావం ఉన్న మేఘనాధుడు తండ్రికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి ' తండ్రీ! మీ ఇష్టం వచ్చినట్లుగానే ఆ వానరుని పట్టి బంధించి తెస్తాను' అని చెప్పి తనకు ప్రియం ఒనర్చే వారి దగ్గరనుండి ప్రశంసలను అందుకొని సమరానికి ఉద్యుక్తుడయ్యాడు.

రాక్షసప్రభువైన రావణుని కుమారుడు ఇంద్రజిత్తు పద్మ దళముల వంటి నేత్రాలున్నవాడు, పూర్ణిమ దినమున ఉప్పొంగే సముద్రంలాగా రణభూమికి బయలుదేరాడు. చాలా వేగంగా పరుగులు తీసే రథాన్ని ఇంద్రజిత్తు ఎక్కాడు. గరుత్మంతుని వలె వేగగమనం కలవి, తెల్లని కోరలున్న నాలుగు సింహాలు ఆ గుర్రానికి పూన్చారు.

చాలా వేగంగా రథంపైన ఇంద్రజిత్తు ఆంజనేయుని దగ్గరకు ఉరికాడు. ఇంద్రజిత్తు రథం చప్పుడు, ధనుష్టంకారం, జయధ్వానాలు విని ఆంజనేయుడు తనకు సమ ఉజ్జీ వస్తాడనుకొని యుద్ధానికి సంబరపడ్డాడు. రణవిద్యలో ఆరితేరిన ఇంద్రజిత్తు బాణాలను చేత బట్టి ధనుస్సు ధరించి ఆంజనేయునికి ఎదురు వెళ్ళాడు. ఆయన రథం వెళ్ళే వేగానికి లేచిన దుమ్ము అన్ని దిక్కులు నిండిపోయింది. దూసరభరితమైన భూమిని చూసి క్రూరమృగాలు అరవసాగాయి. ఆకాశాన సిద్ధులు, మహర్షులు, యక్షులు, గంధర్వులు, నాగులు వీరందరూ ఇంద్రజిత్తు ఆంజనేయుని దగ్గరకు రావడం చూసి చాలా ఆనందించారు. వీరందరూ ఆ వీరుల సమరోత్సాహాన్ని మెచ్చుకుంటున్నారు. వారందరూ ఇంద్రజిత్తు పరాక్రమాన్ని, ఆంజనేయుని శక్తిని గురించి మాట్లాడుకొంటున్నారు. పక్షులన్నీ తమకు ఆహారం బాగుగా దొరుకుతుందని సంతోషంగా అరవసాగాయి. ఆంజనేయుడు ఇంద్రజిత్తుకు దడపుట్టేటట్లుగా సింహనాదం చేసి తన శరీరాన్ని త్వరగా పెంచసాగాడు.

ఇంద్రజిత్తు దివ్యరథంపైనుండి చిత్రమైన వింటిని సంధించి పిడుగుపాటు కలిగినట్లుగా ధనుష్టంకారాన్ని చేశాడు. అతిభయంకరబలాలున్న హనుమంతుడు ఇంద్రజిత్తు యుద్ధానికి తలపడ్డారు. దేవేంద్రుడు రాక్షసులు యుద్ధంచేసినట్లుగా వారిద్దరూ పోరు సాగించారు. యుద్ధాన వాసికెక్కిన ఇంద్రజిత్తు బాణాలనుండి తప్పించుకొంటూ ఇంద్రజిత్తును ఇబ్బందికి గురిచేస్తూ ఆకాశాన సంచరిస్తూ ఆంజనేయుడు యుద్ధం చేయసాగాడు.

ఇంద్రజిత్తు వాడియైన ములుకులున్నవి, మంచి రెక్కలున్నవి, బంగారు పిడులున్న బాణాలను ఆంజనేయునిపై గుప్పించసాగాడు. గురిచూచి కొట్టడంలో ఇంద్రజిత్తు మేటి. అలాంటి ఇంద్రజిత్తు బాణాలను వమ్ముచేస్తూ ఆంజనేయుడు విజయవిహారం చేయసాగాడు.

వాయుసుతుడు ఇంద్రజిత్తు ఎదురుగా నిలబడేవాడు. ఆయనను కవ్వించేవాడు. బాణాన్ని సంధించి వదిలిన తర్వాత పైకి ఎగిరేవాడు. యుద్ధంలో సర్వసమర్థులైన వారిద్దరూ సకల ప్రాణులకు ఆశ్చర్యం కలిగేటట్లుగా మహాయుద్ధం చేస్తున్నారు. హనుమంతుని ఎలా జయించాలో ఇంద్రజిత్తుకు, ఇంద్రజిత్తును ఎలా పడగొట్టాలో హనుమంతునికి అంతు చిక్కడంలేదు. ఇద్దరూ అజేయులుగా పోరాడుతున్నారు.

బాణాలన్నీ వమ్ము అయిపోవడం, శరాలు గురి తప్పడం చూసి ఇంద్రజిత్తులో విచారం మొదలైంది. హనుమంతుని మట్టి కరిపించడం అసాధ్యమని మేఘనాదుడు అనుకొన్నాడు. కనీసం బంధించే ఉపాయం ఏదైనా ఉందా అని తీవ్రంగా ఆలోచించాడు. రావణుడు చెప్పినట్లుగా బ్రహ్మాస్త్రాన్ని సంధించాలని అనుకొన్నాడు. ఎలా అయినా కపివరుని బంధించాలని తలచి ఆయనపై బ్రహ్మాస్త్రాన్ని సంధించాడు.

ఆ అస్త్ర ప్రయోగం వలన హనుమంతుడు నిశ్చేష్టుడై నేలపై బడిపోయాడు. కొద్దిసేపటికి తనను బ్రహ్మాస్త్రంతో బంధించాలని అనుకొన్నాడనే విషయం తెలుసుకొన్నాడు. ఆ అస్త్రం బ్రహ్మావరప్రభావంవలన క్షణంలో వీడిపోయింది. బ్రహ్మాస్త్రం ఆంజనేయుని ఏ మాత్రం బాధించలేదు. ఆంజనేయుడు బ్రహ్మ తనకు ఇచ్చిన వరాన్ని గుర్తుతెచ్చుకొన్నాడు.

బ్రహ్మాస్త్రానికి కట్టుబడినట్లుగానే ఉంటాను. దానివలన పితామహునకు గౌరవం ఇచ్చినట్లు అవుతుంది. ఇంద్రజిత్తు ఈ అస్త్రం నుంచి నేను తప్పించుకోలేనని అనుకొంటున్నాడు. అలా అనుకోవడం కూడా మంచిదే అవుతుంది. నన్ను మహేంద్రుడు వాయుదేవుడు రక్షిస్తున్నందువల్ల నాకు బాధ ఏమీ తెలియడంలేదు.

రాక్షసులు నన్ను బంధించి రావణుని దగ్గరకు తీసుకెళ్ళుతారు. అప్పుడు ఆ దుష్టుడితో నేను మాట్లాడవచ్చు అనుకొని నన్ను ఈ రాక్షసులు తీసుకొని వెళ్ళదురుగాక అనుకొన్నాడు. నిశ్చేష్టునిగా పడుకొన్న ఆంజనేయుని చుట్టూ శత్రువులు చుట్టుముట్టారు. ఆయనను భయపెడుతూ బంధించసాగారు. అప్పుడు ఆంజనేయుడు బిగ్గరగా అరిచాడు. జనపనారతోను వస్త్రాలతోను ఆంజనేయుని బంధించారు. రావణుడు నన్ను చూడాలని తలస్తున్నట్లుంది అనుకొని ఆంజనేయుడు శత్రువుల బంధనాలను నిందా వాక్యాలను సహించాడు. బ్రహ్మాస్త్రం వలన బంధితుడైన వారిని శత్రువులు అతి తెలివితో వస్త్రాలతో దారాలతో బంధించడం వలన బ్రహ్మాస్త్రం వీడిపోయింది. వానరోత్తముడు

బ్రహ్మాస్త్రం నుండి విడివడుట చూసి అయ్యో! నా శక్తి అంతా ధారపోసి బ్రహ్మాస్త్రంతో వీనిని బంధించాను కదా. ఈ తెలివి మాలిన రాక్షసులు త్రాళ్ళతో కట్టి బ్రహ్మాస్త్రం నుండి వానరుని విముక్తుణ్ణి చేసేశారు. అయ్యో! ఇప్పుడీ బంధనాలను త్రెంచుకుని మనలను ఏదైనా చేస్తే మన గతి ఏమిటా? అనే ఇంద్రజిత్తు ఆలోచించసాగాడు. మరలా బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించడం కుదరదుగదా అని మధనపడసాగాడు.

ఆంజనేయుడు తనను పిడికెళ్ళతో గుద్దుతూ తనను బంధించి లాక్కెళుతున్నా మౌనంగా భరించాడు. అలా ఆంజనేయుని తీసుకెళ్ళి 'రావణ మహారాజా! ఇతడే అశోకవనాన్ని ధ్వంసం చేసిన వానరుడు. మన సేనలను చంపినవాడితడే' అని ఆయనకు చూపిస్తూ రావణుని ముందు ఆంజనేయుని నిలిపారు.

ఆ సభలోని వారందరూ ఆంజనేయుని చూసి ఇతడు ఎవరో? ఎక్కడనుండి వచ్చాడో? ఎవరు ఆశ్రయం ఇచ్చారో? అని ఆలోచించసాగారు. మరికొందరు ఇదే విషయం గట్టిగా చర్చించుకోసాగారు. మరీ ఉగ్రులైన రాక్షసులు ఇతడిని వెంటనే భక్షించివేయండి, చంపేయండి అంటూ కేకలు వేశారు.

మహాత్ముడైన హనుమంతుడు అమూల్య రత్నాదులతో అలంకరించి వున్న సింహాసనం మీద ఉన్న రావణుని చూశాడు. అతనికి సమీపంలో కూర్చున్న ఆయన సచివులందరిని ఆంజనేయుడు పరికించి చూశాడు. వికృతాకారులైన రాక్షసులు ఆంజనేయుని అటు ఇటు లాగుతుండడం రావణుడు చూశాడు. తేజోబల సంపన్నుడై సూర్యునిలాగా ఉన్న రాక్షస రాజును ఆంజనేయుడు చూశాడు.

రోషావేశంతో రావణుడు ఆంజనేయుని చూస్తూ అనుభవజ్ఞులైన తన మంత్రులకు ఆంజనేయుడు గురించి వివరాలు అడిగి తెలుసుకోమన్నాడు. వారందరూ కపివరుని చూచి 'ఓ వానరవీరా నీవెవరు? ఎక్కడనుంచి వచ్చావు? ఏ పనిమీద ఇక్కడకు వచ్చావ'ంటూ అందరూ ఆంజనేయుని అడిగారు.

ఆంజనేయుడు వారినందరిని చూశాడు. వారి మాటలు విన్నాడు. వారి కోపం చూసి నవ్వుకొన్నాడు. వారికి వారి బంధువులు దూరం అయితే బాధకలుగుతోంది. మరి సీతమ్మను దాచిపెట్టితే శ్రీరామునికి బాధ కలుగదా? అనుకొన్నాడు. ఎవరికైనా వారికి బాధ కలిగితేనే తెలుస్తుంది. ఎదుటి వారి బాధమాత్రం పట్టదుకదా! అనుకొన్నాడు.

అంతలో రాక్షసుల కేకలు అరుపులు ఎక్కువఅయ్యాయి. వారందరూ 'వానరా నీవు ఎవరు? ఎక్కడివానివి?' అంటున్నారు. దానికి సమాధానం ఇవ్వాలనుకొని వారి వైపు ప్రశాంతంగా చూశాడు. భయమేమి కనబర్చని కపిని రాక్షసులు భయాందోళనలతో చూశారు. దానికి సమాధానంగా కపివరుడు "నా పేరు ఆంజనేయుడు. నేను సుగ్రీవుడు పంపగా వచ్చిన దూతను." అని వారికి చెప్పాడు.

* * *

# రావణుని ఆకారం

## సర్గ - 49

శత్రువులకు దడ పుట్టించే ఆకారం ఉన్న రావణుని హనుమంతుడు కోపంగా చూశాడు. రావణుడు ధరించిన కిరీటం మంచి ముత్యాలతో పొదగబడి ధగధగా మెరుస్తోంది. ఆ కిరీటంలో వజ్రాలు, మణులు చిత్ర విచిత్రంగా అమరి ఉన్నాయి. సర్వాభరణ భూషితుడై రావణుడు రాజసింహాసనంపై దర్పంగా కూర్చుని ఉన్నాడు. మేలిమి పట్టు వస్త్రాలను కట్టుకొన్నాడు.

చందనంకస్తూరీ లాంటి మైపూతలతో అందంగా అలంకరించుకొని ఉన్నాడు. అతని కన్నులు దర్శనీయంగా ఉన్నాయి. పెదవులు దంతాలు అందంగా ఉన్నాయి. మహావీరుడైన రావణుడు పది శిరస్సులతో పెద్ద మందర పర్వతంలాగా కనిపించాడు. కాటుకకొండలాగా ఉన్న రావణుని వక్షస్థలంపై మిలమిలలాడే ఎన్నో ఆభరణాలున్నాయి. అతని బలిష్ఠమైన బాహువులకు ఎర్ర చందనం పూసి ఉంది. జిలుగు వెలుగులు విరజిమ్ముతున్న భుజకీర్తులు, దండ కడియాలు పెట్టుకొని ఉన్నాడు. రావణుని సింహాసనం మీద రత్నకంబళి పరచి ఉన్నారు. దానిమీద సుఖంగా రావణుడు కూర్చుని ఉన్నాడు.

చక్కగా అలంకరించుకొన్న యువతులు వింజామరలు పట్టుకొని రావణుని చల్లని గాలి వచ్చేటట్లుగా వీస్తున్నారు. మంత్రాంగాన్ని బాగా ఎరిగి ఉన్నవారు, బాగా బలదర్పితులైనవారు, దుర్ధరుడు, ప్రహస్తుడు, మహాపార్శ్వుడు, నికుంభుడు అనే నలుగురు మంత్రులు ఆయన దగ్గరగా కూర్చుని ఉన్నారు. నాలుగు సముద్రాలతో ఆవరించిన భూమండలంలాగా రావణుడు కనిపిస్తున్నాడు.

దేవతలతో పరివేష్ఠితుడైన దేవేంద్రునిలాగా రావణుడు ఆంజనేయునికి కనిపించాడు. మేరు శిఖరంపైన నిలచిన నీరుమేఘంలాగా కనిపించిన రావణుని హనుమంతుడు ఆశ్చర్యంగా చూశాడు.

తేజో విరాజమానమైన ముఖ సౌందర్యానికి హనుమంతుడు ఆకర్షించబడి, రావణుని చూచి ఏమీ అందచందాలు! ఈయన ధైర్యం ప్రశంసార్హం. నన్నే ఇక్కడకు తెప్పించుకొని చూస్తున్నాడు. ఇతని తేజస్సు రూప వైభవం అన్నీ కలసి సర్వలక్షణ శోభితునిలాగా కనిపిస్తున్నాడు. అధర్మమైన పనులు చేయకపోతే రావణుడు రూపయౌవన యశస్సులతో దేవతలకు రాజు అయ్యి ఉండేవాడు. క్రూరమైన, లోక నింద్యములైన అధర్మకృత్యాలు చేస్తున్న రావణుని చూసి ముల్లోకాలు భయపడుతున్నాయి. రావణుని ధైర్యం, ఆయన తపస్సు అన్నీ మెచ్చుకునే లక్షణాలే. కానీ బుద్ధి మాత్రం కుదురుగా లేదు. ఒక్క అవలక్షణం ఈ రాక్షసేంద్రుని హీనంగా చరిత్ర పుటల్లోకి ఎక్కిస్తుంది గదా. బ్రహ్మ మంచి పుట్టుకనిచ్చాడు. బుద్ధినిచ్చాడు. కానీ వాటిని పెడదారి పట్టించే అహంకారాన్ని కూడా ఇచ్చాడు. ఈ అహంకారమే యశఃకీర్తి ప్రతిష్ఠలు పొందాల్సిన రావణుని అధోగతిపాలు చేస్తున్నాయి ఔరా! ఏమి చిత్రం?

రావణునికి కోపం వస్తే సమస్త జగత్తును కూడా సముద్రంలో ముంచివేయగల సమర్థుడు. ఇంతటి బలోపేతుడు అయి కూడా పాడు పనులు చేసి తన మృత్యువును తానే ఆహ్వానిస్తున్నాడు కదా అని ఆంజనేయుడు రావణుని గూర్చి ఆలోచిస్తూ చింతించాడు.

* * *

# ప్రహస్తుని ప్రశ్నలు

## సర్గ - 50

తన ఎదురుగా జంకు గొంకు లేకుండా నిలబడ్డ హనుమంతుని చూచి రావణునిలో కోపం కట్టలు తెంచుకొంది. కానీ కాస్త జంకు కూడా అనిపించింది. ఏదో అనుమానం వేస్తోంది. హనుమంతుని దీర్ఘంగా చూస్తున్నాడు.

మహాతేజస్సుతో ఉన్న కపివరుని చూచి రావణుడు తన మనస్సులో ఇతడు నేను కైలాస పర్వతం కదిలించినపుడు నన్ను శపించిన నందీశ్వరుడు కాదు గదా. లేక ఈ వానర రూపంలో ఆ బాణాసురుడే వచ్చాడా అని అనుకొన్నాడు.

ప్రహస్తుని వైపు తిరిగి రావణుడు 'ఈ దుష్టుడు ఇక్కడకు ఎందుకు వచ్చాడో? మన అశోక వనాన్ని ఎందుకు ధ్వంసం చేశాడో? మన స్త్రీలను ఎందుకు భయపెట్టాడో అన్నీ వివరంగా కనుక్కో' అనిచెప్పాడు." ఏ ప్రయోజనంతో నా దుర్భేధ్యమైన నగరంలో కాలుపెట్టాడో కనుక్కో ' అని కూడా చెప్పాడు. ప్రహస్తుడు రావణునివలన ప్రేరితుడై, " ఓ వానరా! భయపడకు. నిన్ను మేము ఏమీచేయము. నీవు నిర్భయంగా ఉన్నది ఉన్నట్లుగా మాకు చెప్పు. నిన్ను దేవేంద్రుడు ఇక్కడకు పంపినాడా? నీవు నిజం చెప్తే నిన్ను మేము బంధవిముక్తుణ్ణి చేస్తాం " ఆలసింపక ఉన్నది ఉన్నట్లుగా చెప్పు నీకు మేలు జరుగుతుంది" అని చెప్పాడు.

"గూఢచారి రూపంలో నీవు వచ్చానని అనుకొంటున్నాం. నిన్ను ఇక్కడకు కుబేరుడు గానీ యముడు, వరుణుడు కాని పంపించాడా? లేక విజయకాంక్షతో విష్ణువే నిన్ను దూతగా పంపించాడా? నీవు చూడడానికి వానర రూపంలో కనిపిస్తున్నా నీ తేజస్సు నిరుపమానంగా ఉంది. ఇలాంటి తేజస్సు వానరులకుండదు కదా. నీవు నిజం చెప్తే నీ ప్రాణాలు దక్కుతాయి. నీవు రావణుని లంకలో అడుగుపెట్టడానికి ఉన్న నిజమేదో చెప్పు" అంటూ ప్రహస్తుడు అడిగాడు. ప్రహస్తుని మాటలు విన్న హనుమంతుడు చిన్నగా నవ్వుకున్నాడు.

అయినా వీరికి నా గురించి తెలియాల్సిన అవసరం ఉంది. నేనెవరో చెప్తాను. అప్పటికైనా వీరికిబుద్ధి వస్తుందేమో అనుకొన్నాడు.

"రావణా! నేను మీరనుకొంటున్నట్లుగా దేవేంద్రాదుల దూతనుకాను. నేను వానర జాతి వానిని. నా అంతట నేను నీ లంకలో ప్రవేశించాను. నీ దర్శనం చేసుకోవాలని అశోకవనాన్ని ధ్వంసం చేశాను. అప్పుడు నీ బలాలైన రాక్షసులు నా మీదకు వచ్చారు. నా  రక్షణార్థం నేను వారిని హతమార్చాను.

ఇంత మంది మార్బలం ఉంది గదా నీకు. మరి నాగురించి నీకు తెలిపే శక్తి ఏదీ లేకపోయిందా? దుర్భేధ్యమైన నా లంక అని అంటున్నావు కదా కానీ నేను నీ అనుమతిలేకుండానే ఈ లంకలో అడుగుపెట్టాను గదా. నేనెవరో, నాభుజబలం ఏమిటో నీకు తెలీదంటావా? నీ అనుచరులు నీకు నేచేసిన పని గురించి చెప్పలేదా?" అని ఆంజనేయుడు చిరునవ్వుతో అడిగాడు. అలా అడుగుతున్న వానరుని చూచి రావణునిలో ఆక్రోషం పెరిగిపోతోంది. కోపంగా ఆంజనేయుని చూస్తున్నాడు దశకంఠుడు.       "రాక్షస రాజా... పోనీలే నాగురించి వారికిఏం తెలిసిఉంటుంది? చింతించకు. నేనే నాగురించి చెప్తా విను" అని క్షణం ఆగాడు. నిర్భయంగా మాన్లెడుతున్న ఆంజనేయుని చూస్తే రావణునిలో అనుమానం పెరుగుతోంది.  తప్పక ఈ వానరుడు విష్ణువు పంపిన దూతే అయిఉంటాడు. మా రాక్షసులకు పరమ శత్రువు కదా అందుకనే పంపిఉంటాడు. నా శక్తి సామర్థ్యాలు చూచి భయపడి దేవతలందరూ విష్ణువును శరణువేడి ఉంటారు. అందుకే ఆయన నాదగ్గరకు ఈ వానరుని పంపిఉంటాడు. అయినా నాగురించి నేనే చెప్తా అనే ఈ కపివరుడు ఏం చెప్తాడో చూద్దాం అనుకొన్నాడు రావణుడు.

"రావణా! నేను అంజనాసుతుణ్ణి. వాయునందనుణ్ణి శ్రీరాముని దూతను.  సుగ్రీవుని బంటును. సురాసురలు సైతం అస్త్రాలతో నన్ను బంధించజాలరు. నీ కుమారునికి బ్రహ్మాస్త్రాన్ని ఇచ్చిన ఆ బ్రహ్మదేవుడే నాకు ఆ వరాన్ని అనుగ్రహించాడు. రాక్షస రాజైన ఈ రావణుని చూడాలనే కోరికతోనే నేను బ్రహ్మాస్త్రానికి బంధితుడైనట్లుగా నటించాను.

నేను ఒక రాజకార్య నిమిత్తం ఇక్కడకు వచ్చాను. నిన్ను చూడాలనే ఈ రాక్షసులు పెట్టే బాధలు భరించాను. ఓ రావణా! రాక్షస రాజా! నేను రాముని దూతను. నీ హితం కోసం నేను చెప్పే మాటలను విను" అని హనుమంతుడు ప్రహస్తుని ప్రశ్నలకు రావణునికి జవాబు చెప్పాడు.  " రావణా ! నేను నీ లంకలో ఎపుడో ప్రవేశించాను. నీకిష్టమైన అశోకవనాన్నిధ్వంసం చేశాను. నీ వారిని యమపురికి పంపించాను. దీనితో నీవు నా గురించి తెలుసుకొనిఉంటావు గదా. నీవు చేసిన పనిని గురించి మంచిచెడ్డలు చెప్పేవారు నీకు లేనట్టుగా ఉంది. అందుకనే నేను నీ హితాన్ని ఆలోచించి నీతో మాట్లాడుదామని వచ్చాను. నేను చెప్పేమాటలు కాస్త  ఆలోచించు. నీ మనసు చెప్పే  మాటలను ఆలకించు" అని హనుమంతుడు రావణునితో అన్నాడు.

* * *

# హనుమంతుని హితవు

## సర్గ - 51

రావణునికి హనుమంతుడు మంచి మాటలు చెప్పాలనుకొన్నాడు." ఓ రావణా! సుగ్రీవుని సందేశంతో నీ లంకలో నేను ప్రవేశించాను. సోదరునివని తలచి మా వానరరాజు నీ యోగ క్షేమాలను అడిగి తెలుసుకోమన్నారు. నీ హితం కోసం సుగ్రీవుడు ధర్మార్థాలతో కూడుకొన్న సందేశాన్ని వినిపింపుమని నాకు చెప్పారు. అవి చెప్తాను విను" అని చెప్పాడు.

" రావణా! దశరథుడు అయోధ్యానగరికి మహాప్రభువు. ఆ ప్రభువు ఇంద్రునితో సమానుడు. ఆయనకున్న నలుగురు పుత్రులలో శ్రీరాముడు పెద్దవాడు. ఆజానుబాహువు సర్వులకు ప్రియం ఒనర్చేవాడు. ఆ శ్రీరాముడు తండ్రి ఆజ్ఞ ప్రకారం సతి ఐన సీతాదేవితో, సోదరుడైన లక్ష్మణునితో కలసి వనవాసం చేస్తున్నాడు.

ఆ సీతాదేవి మహాసాధ్వి విదేహ రాజు కూతురు. ఆమె దండకారణ్యంలో ఎవరి చేతనో అపహరింపబడింది. దానివలన ఆ రామలక్ష్మణులు ఆమెను వెదుకుతూ ఋష్యమూక పర్వతానికి చేరారు. అక్కడ సుగ్రీవునితో వారికి స్నేహం ఏర్పడింది.

సుగ్రీవుడు సీతను వెదికించుటకు సహాయం చేస్తానని రామునకు చెప్పాడు. దానివలన రాజ్యభ్రష్టుడైన సుగ్రీవునకు రాజ్యం ఇప్పిస్తానని రాముడు చెప్పాడు. శ్రీరాముడు చెప్పినట్లుగానే యుద్ధంలో వాలిని హతమార్చి శ్రీరాముడు వానర లోకానికి సుగ్రీవుని రాజుగా చేశాడు. ఆ సుగ్రీవుని అన్న ఐన వాలిని నీవు ఇంతకుముందే తెలుసుకొని ఉన్నావు కదా.

మహాపరాక్రమశాలి అయిన వాలిని ఒకే ఒక్క బాణంతో శ్రీరాముడు సంహరించాడు. సత్యసంధుడైన సుగ్రీవుడు కోట్ల కొలదిగా ఉన్న వానరులను కిష్కింధకు రప్పించి వారిని విభజించి భూమండలం నలుదిసలా సీతను వెదకడానికి పంపించాడు. వానరులు ఆమెను పాతాళంలోను, ఆకాశంలోను కూడా వెదుకుతున్నారు.

మా వానరులు గరుత్మంతునిలాగా వేగం గలవారు. వాయువేగంతో సమానులైన వారు ఎందరెందరో వున్నారు. నేను వాయసుతుడను నన్ను హనుమంతుడని అంటారు. నేను సీత జాడ తెలుసుకోవడానికి నూరు యోజనాలున్న ఈ సముద్రాన్ని దాటి ఇక్కడకు వచ్చాను. సీతాన్వేషణలోనున్న నాకు ఆ తల్లి ఇక్కడే కనిపించింది.

ఓ రావణా! నీవు ధర్మార్థాలను బాగా తెలిసిన వానివి. తపస్సులు చేసి వరాలను పొందినవానివి. అలాంటి సద్గుణుడివైన నీవు పరసతులను బంధించడం మంచిపని కాదు. ధర్మవిరుద్ధ కార్యాలు చాలా అపాయకరమైనవి సర్వాన్ని నాశనం చేయగలవు. బుద్ధిమంతులు ఎవరూ ఆ పనిని చేయడానికి ఇష్టపడరు.

ఓ రాజా! రామలక్ష్మణులు అస్త్ర శస్త్రాలు ప్రయోగించడంలో నేర్పరులు. వారి ముందు దేవేంద్రుడు కూడా నిలవజాలడు. సర్వకాలాలలో ధర్మబద్ధమైన పనే అన్ని మంచి కార్యాలకు తోడ్పడుతుంది. నా మాట విని సాక్షాత్తు పురుషోత్తముడైన రామునకు సీతాదేవిని అప్పగించు.

లేకపోతే నేను సీతాదేవిని ఇక్కడ చూశానని శ్రీరామునకు తెలుపుతాను. ఆ తర్వాత కార్యాన్ని ఆయనే నిర్వర్తించగలడు.

శ్రీరాముని స్మరిస్తూ ఉన్న సీతాదేవిని నేను చూశాను. ఆమెను నీవు అపహరించావు. కాని ఐదు పడగల నాగుబాముతో ఆడుకొంటున్నావనే విషయం నీకు తెలియటంలేదు. ఆమె నీ పాలిట మృత్యువు అవుతుంది. ఎంత జీర్ణశక్తి ఉన్నా విషాహారాన్ని ఎలా అరాయించుకోలేరో అలాగే ఈ సీతాదేవిని సురాసురులెవరూ పొందలేరు.

నీవు ఎన్నో కష్టాలకు ఓర్చి తపస్సు చేసి చావు లేకుండా వరం పొందావు. కాని నేడు ఈ దుష్కర్మ చేసి నీ చావును నీవే ఆహ్వానిస్తున్నావు. ఇది మంచి పని కాదు. దేవ, దానవ, గంధర్వ, యక్ష, నాగ జాతులలో సుగ్రీవుడు ఏ జాతికి చెందినవాడు కాదు. శ్రీరాముడు మానవుడు, సుగ్రీవుడు వానరుడు. ఓ రాజా! సత్యంగ్రహించి నీ ప్రాణాలను ఎలా కాపాడుకోవాలో నీవే నిర్ణయించుకో. ధర్మాధర్మాలు వాటి ఫలాలు కలసి ఉండవు. నీవు ఎన్ని పుణ్య కార్యాలు ఇంతకు ముందుచేసి ఉన్నా అవి అన్నీ నేటి నీ దుష్కర్మతో నాశనం అయిపోతాయి. పైగా ఈ కార్యం వలన నీవు చెడుఫలితాన్ని అనుభవించాల్సి వస్తుంది. " అని మారుతి రావణునికి చెప్పుతున్నాడు." రాక్షస రాజా!పుణ్యమైన పనులవల్ల శుభఫలితం, పాపపు పనులవలన అశుభ ఫలితాలు చేరుతూనే ఉంటాయి. ధర్మంవలన అధర్మ ఫలితం రూపుమాపబడదు. నీ ధర్మ కార్యాలవలన నీకు ఇప్పటికి జయమే కలుగుతుంది. కాని నేడు నీవు అధర్మానికి కొమ్ము కాచావు. దానివలన నీకు అపజయమే కలిగి తీరుతుంది.

దండకారణ్యంలోని ఖరదూషణాదులతో సహా రాక్షసుల సంహారం, వాలి వధ తెలుసుకొని ఆపై నీవు చేయవలసిన కార్యాన్ని నిర్ణయించుకో. నీ మంచి కోసం చెప్పే మాటలను విని బాగా ఆలోచించి నిర్ణయం తీసుకో.

చతురంగ బలాలతో కూడిన లంకను నాశనం చేయడానికి నేను ఒక్కణ్ణే చాలుగదా! ఐనా వానర భల్లూక వీరుల ముందు రాముడు సీతను అపహరించినవానిని సంహరిస్తాను అని ప్రతిజ్ఞ చేశాడు. నేను ఈ పని చేస్తే ఆయన ప్రతిజ్ఞ భంగం అవుతుంది కాన నేను వదిలి వేశాను. శ్రీరామునకు అపకారం చేసేవాడు దేవేంద్రుడు ఐనా శ్రీరాముడు విడిచిపెట్టడు. అలాంటప్పుడు సామాన్యుడివైన నీవు ఆయనకు ఓ లెక్కా?

రావణా! నీవు అపహరించి తెచ్చిన సీతాదేవిని నీవు సామాన్య స్త్రీ అని అనుకొంటున్నావు. కాని ఆమె కాళరాత్రి. నీ లంకను నాశనం చెయ్యగలదు. సీతారూపంలో కాలపాశం నీ మెడకు చుట్టుకొంది. అద్భుతమైన కోటబురుజులతో విశాలమైన వీధులతో ఉన్న ఈ లంక సీతాదేవి తేజస్సుతో దగ్ధం అవుతుంది. శ్రీరాముని కోపజ్వాలలో మండిపోతుంది. ఇప్పటికైనా తెలివి తెచ్చుకొని నీ లంకను నీవు కాపాడుకో.

ఆత్మీయులు, బంధువులు, స్వజనులు, పౌరులు సోదరులు, సుతులు, హితులు భోగైశ్వర్యాలు అన్నీ ఉన్న నీవు నీ లంకా సామ్రాజ్యం బాగుండాలని కోరితే వెంటనే ఆ సీతమ్మ తల్లిని రాముని దగ్గరకు పంపించు. అప్పుడే నీవు బాగుంటావు.

రాక్షసరాజా! నేను శ్రీరాముని బంటును. నేను ఏమైనా చేయగలను. కాని నీ హితం కోరి నీకు మంచి చెప్పడం నా విధి అనుకొని చెప్తున్నాను. నీవు రాక్షసుడవు. ఆ రాముడు మానవుడు. నేను విశేషించి వానరుడను. అనగా మీ ఇద్దరికి మధ్యస్థుడను కాన నీవు నా మాటలు విని సీతాదేవిని శ్రీరామునకు అప్పగించు. అదే నీకు మేలు.

సర్వలోకాలకు శుభాలను ఒనకూర్చే రామునికి నీవు ఘోరమైన అపరాధం చేశావు. నీవు బ్రతికి ఉండడమనేది అసాధ్యం. దేవ దానవ యక్ష కిన్నర గంధర్వాదులలో ఆ ప్రభువును ఎదిరించగలవారెవరూ లేరు. శ్రీరాముడు మహా యశస్వి. ఆయన రుద్రుడై సమస్త లోకాలను లయం చేయగలడు, సృష్టించగలడు. విష్ణుతుల్యుడైన ఆయనను ఎదిరించడం నీకు చేతకాదు.

శ్రీరాముని చేతిలో చావు మూడిన వానిని ఈ ముల్లోకాలలో ఎవరూ రక్షించలేరు. త్రిమూర్తులు కాని సురపతి ఐన దేవేంద్రుడు కూడా చావు మూడి వానిని రక్షించడంలో వెనుకడుగే వేస్తారు." అని హనుమంతుడు రావణునికి చెప్పాడు.

'ఓ రావణా! నేను చెప్పే మంచిని గ్రహించి జ్ఞానివై సీతమ్మ శ్రీరాముని దగ్గరకు పంపించు' అని చెప్పే హనుమంతుని ధైర్యం చూసి రావణుడు క్రుద్ధుడయ్యాడు. బంధింపబడి కూడా నిర్భయంగా మాట్లాడే ఆంజనేయుని చూసి ఆశ్చర్యం వేసింది. నాముందే ఇలా మాట్లాడుతున్నాడే అని అనిపించిన రావణునికి కోపం ఎక్కువైంది. దానితో రావణుడు తన అనుచరులతో ఆంజనేయుని చంపమని ఆదేశాలిచ్చాడు.

* * *

# విభీషణుని హితవు

## సర్గ - 52

**అ**క్కడే ఆసీనుడై ఉన్న రావణుని సోదరుడైన విభీషణుడు రావణుని మాటలకు అడ్డు వచ్చాడు. ' అన్నా! క్షమించు. దూతగా వచ్చిన వానిని చంపడం మంచిదికాదు. ఆ కార్యాన్ని విడిచిపెట్టు' అని చెప్పాడు. ' అన్నా! దూత ధర్మం ప్రకారం తన యజమాని మాటలను చెప్పాడు. ఆయనను మీరు చంపడం మంచిదికాదు' అని చెప్పాడు. కార్యకారణ విచక్షణ ఉన్న విభీషణుడు అంతశ్శత్రువులను జయించినవాడు, మాట నేర్పరి అయిన విభీషణుడు రావణుని మంచిని కూర్చడానికి అగ్రజుని ప్రశంసిస్తూ ఇలా చెప్పాడు.

" ఓ రాక్షసరాజా! కోపాన్ని వీడు; ప్రసన్న వదనునివై నేను చెప్పేది వినుము. ఉచితానుచితాలు తెలిసిన మీ లాంటివారు దూతలను చంపరు. ఓ మహావీరా! రాజధర్మానికి విరుద్ధమైన కార్యాలను చేయటం మంచిది కాదు. ఇతడు వానరుడు. ఇతన్ని చంపడం లోక మర్యాద కాదు.

మీరు యుక్తాయుక్త విచక్షణ ఉన్నవారు. రాజధర్మకోవిదులు. ప్రాణకోటిలో మంచి చెడులు తెలుసుకోగలిగిన జ్ఞానులు. పరమార్థం తెలిసి కూడా మీరు రోషావేశంతో పనిచేస్తే మీరు కష్టపడి నేర్చుకొన్న శాస్త్రవిద్య అప్రయోజనం అవుతుంది కదా. మిమ్ము ఎదురించగల శక్తి ఇక్కడ ఎవ్వరికీనూ లేదు. మీరే చక్కగా ఆలోచించి ఈ దూతకు తగిన శిక్షను విధించుము. కాని ప్రాణహాని కలిగించకండి.” అని చెప్పాడు.

ఆ మాటలు విన్న రావణుడు “ విభీషణా! రాజధర్మం నాకు బాగా తెలుసు. కాని ఈ వానరుడు అకృత్యాలను చేసి నా ముందు గర్వపు మాటలను మాట్లాడాడు. పాపులను వధించడంచేత ఏ మాత్రం పాపం రాదు. అందువలనే నేను ఈ వానరుని చంపమని చెప్తున్నాను” అని చెప్పే రావణుని మాటలు విభీషణునికి మంచివి అనిపించక మరలా“ ఓ రావణా! ఏ కాల పరిస్థితులలోను దూతలను వధించడం పాపమే అవుతుందని శాస్త్రం చెప్తోంది. ఇతడు ప్రబల శత్రువే. ఇందులో ఏ మాత్రం సందేహం లేదు. మనకు చెప్పలేనంత నష్టాన్ని కూడా కలిగించాడు. అది కూడా నిజమే అయినప్పటికీ సత్పురుషులు దూతలకు దండన విధిస్తారు కాని వధించరు.

ఏదైనా అవమానకరమైన దండనను విధించుము. వికారరూపుని చేయడం, కొరడాతో దెబ్బలు వేయడం, శిరోముండనం చేయడం, శరీరంపై వాతలు పెట్టడం– ఇలాంటి దండనలను దూతలకు విధించవచ్చునని ప్రాజ్ఞులు చెప్పి ఉన్నారు. విజ్ఞులైన మీరు చక్కగా ఆలోచించి ఈ వానరునికి తగిన దండన విధించుము. కానిమీరు చంపాలనే ఉద్దేశాన్ని మాత్రం విడిచిపెట్టండి.” ఇలా అనేక రకాలుగా విభీషణుడు రావణునికి హితబోధ చేశాడు.అయినా రావణుని కోపం తగ్గకపోవడంతో మరిన్ని మాటలు చెబుదామని విభీషణుడు మాట్లాడుతున్నాడు. “ ఓ ప్రభూ! పరాక్రమంలో దేవతలుకూడా మీకు సములు కారు. మీరు ఎన్నోసార్లు దేవేంద్రాదులను, దేవతలను యుద్ధంలో ఓడించారు కదా. మిమ్ము చూస్తేనే దేవ దానవులకు దడ పుడుతుంది. మీరు శూరులు. అజేయులు కూడా. అట్టి మిమ్ము కలలో కూడా సంహరిస్తామని కాని, ఎదురిస్తామని కాని, ఎవ్వరూ అనుకోరు. మీకు హాని చేయ తలపెట్టిన వారెల్లా అసువులు బాసినవారే కదా!

అలాంటి అజేయులైన మీరు ఈ కపిని వధించడంలో సాధించే ప్రయోజనం నాకు ఏమీ కనిపించడంలేదు. ఇతడు చెడ్డవాడైనప్పటికి శత్రువుల చేత పంపించబడినవాడు. అస్వతంత్రుడైన ఈ దూతను తన యజమాని మాటలను చిలుకలా అప్పచెప్తాడు. కనుక ఇతడు మరణ దండనకు అర్హుడు కాడు.

మీ ప్రతాపం దేవేంద్రాదులంతటివారిపై చూపాలి కాని ఈ దూతలపైన ఎందుకు? రాక్షసరాజా! ఇతనిని మీరు చంపివేసినచో మరొక్కడు ఈ మహోదధిని దాటి రాలేడు. అప్పుడు విషయం తెలియక రామలక్ష్మణులు ఇక్కడకు రాలేరు. ఇపుడు వీనిని పంపించి వేసినచో రామలక్ష్మణులు ఇక్కడకు వస్తారు. మీ యుద్ధ ప్రియత్వంవలన వారిని మీరు సునాయాసంగా సంహరించగలరు.

రాక్షసులకు వచ్చిన ఈ యుద్ధావకాశాన్ని మీరు చేతులారా పాడుచేసినవారు అవుతారు. మీరు మీ పరాక్రమం, ఉత్సాహం, యుద్ధకాంక్ష వీనిని వదిలిపెడ్తే ఆ రామలక్ష్మణులపై చూపించవచ్చు.

ఆ యుద్ధంలో మీచే పోషింపబడే కోటానుకోట్లమంది మీకు తోడుగా వస్తారు. మీ అజ్ఞానువర్తులై ఆ రాజ పుత్రులను బంధించి తెస్తారు. అప్పుడు మీ శక్తి శత్రువులకు తెలుస్తుంది. దేవతలకు భయం పుట్టించే మీరు ఈ దూతను దండించడంవలన కీర్తి పొందలేరు. ఒక్క క్షణం వివేకంతో ఆలోచించండి " అని చెప్పే విభీషణుని మాటలు రావణునికి నచ్చాయి. ఆయన వాటిని మనస్ఫూర్తిగా విన్నాడు. ఇపుడు ఏం చేయాలా? అని ఆలోచిస్తూ తలపంకించాడు.

* * *

# హనుమంతుని తోకకు నిప్పు

## సర్గ - 53

**వి**భీషణుని మాటలు రావణుని జ్ఞానాన్ని జాగృతం చేశాయి. " విభీషణా నీవు చెప్పేది యథార్థమే. దూతలను వధించడం పాపమే అవుతుంది. సరే కాని ఈ వానరుని మాత్రం దండించి తీరాలి అన్నాడు. వానరులకు వాలంపై మక్కువ ఎక్కువ. అందువలన ఈ తోకరాయుని తోకకు నిప్పు అంటించండి. కాలిన తోకతో తనవారి దగ్గరకు వెళ్తాడు. వారందరి ముందు వానరుడు అంగవికారంతో బాధపడతాడు" అని రావణుడు చెప్పాడు.

వెంటనే రాక్షసులందరు చేరి చినిగిన గుడ్డలు నూలు వస్త్రాలు అన్నీ తోకకు చుట్టారు. నిప్పు అంటించారు. ఈ మండుచున్న తోక ఉన్న ఈ వానరుని లంకలో కూడళ్ళలో త్రిప్పండి అని రావణుడు భటులను ఆజ్ఞాపించాడు. దాంతో తోకకు నిప్పు అంటించిన రాక్షసులు ఆంజనేయుని చుట్టుముట్టారు. తోక బాగా మండుతోంది. దానిని చూడడానికి స్త్రీలు బాలురు వృద్ధులు వచ్చారు. రాక్షసులు హనుమంతుని బాగా గట్టిగా బంధించారు.

ఆ బంధనం విడిపించుకోగల సామర్థ్యం ఉండి కూడా హనుమంతుడు ఏమీ చేయలేనివాడిలాగా అక్కడే ఉండిపోయాడు. నన్ను బంధించి కూడా ఈ రాక్షసులు నన్ను ఏమీ చేయలేరు. ఒక్కసారి పైకి ఎగిరి వీరిని చంపివేయగలను. కాని రామకార్యార్థం వచ్చాను కదా. శ్రీరాముని ప్రీతికోసం నేను ఈ బంధనాలలో ఉండిపోతాను. రాత్రివేళ ఈ లంకను చూశాను. ఇంకా ఏవైనా రహస్య ప్రదేశాలు ఉన్నాయేమో, వాటిని ఈ వంకను చూడవచ్చు గదా అనుకొన్నాడు.

ఈ రాక్షసులు నా వాలానికి నిప్పు అంటించి నన్ను బంధింతురుగాక! కాని నాకు ఏ క్లేశం జరగదు అని ఒక్కసారి ఆంజనేయుడు అనుకొన్నాడు. రాక్షసులు ఊరుకున్న ఆంజనేయుని చూసి తమ ప్రతాపం చేత ఆంజనేయుడు ఒదిగిపోయాడని తలచి సింహనాదం చేస్తూ, జబ్బలు తొడలు చరుస్తూ లంక ప్రతిధ్వనించేటట్లుగా అరిచి ఆంజనేయుని పట్టుకొని లంకా పురమంతా త్రిప్పారు.

అలా హనుమంతుని త్రిప్పుతున్న రాక్షసులతో తిరుగుతూ లంకలోని రాజప్రాసాదాలను, గుప్తంగా ఉన్న భూగృహాలను, తీర్చిదిద్దిన వీధి కూడళ్ళను, విశాల మార్గాలను, చిన్న చిన్న సందులను, రాజమార్గమును అన్ని చూస్తూ ఆంజనేయుడు సాగాడు. ఇదిగో ఇతడే గూఢచారి చూడండి చూడండి అని ఆ భటులు అక్కడ చేరినవారికి చెప్పసాగారు.

దాన్ని చూచిన రాక్షస స్త్రీలు పరుగున సీత దగ్గరకు వెళ్ళి " ఓ సీతా ఎర్ర మూతి వానరుడు నీతో మాట్లాడిన వానరుని రాక్షసులు బంధించి తోకకునిప్పు పెట్టి వీధులంతా త్రిప్పుతున్నారు" అని చెప్పారు. ఆ మాటలు సీతాదేవికి ములుకుల్లా గ్రుచ్చుకొన్నాయి. దాంతో రావణుడు అపహరించిన నాటినుండి నేటి వరకు బాధలు పడుతున్న సీత ' ఓ అగ్నిదేవా! నేను నిత్యం నా పతినే స్మరించుదాన్నైతే, నేను పతి సేవా పరాయణతో వ్రతమాచరించి ఉంటే ఈ హనుమంతునికి నీవలన బాధ కలగకుండా చూడు. అగ్నిదేవా! మారుతిని చల్లగా చూడు' అని ప్రార్థించింది.

'ధర్మాత్ముడై నా రాముడు నన్ను సచ్ఛీల సంపన్నురాలిగా భావించినట్లయితే మారుతిని కాపాడు తండ్రీ' అని మరల వేడుకొంది. 'పూజ్యుడు సత్యసంధుడు అయిన సుగ్రీవుడు నన్ను ఈ బాధలనుండి విముక్తి చేయగలవాడైతే ఆంజనేయుని చల్లగా చూడు.' అని మ్రొక్కింది. అంతే సీతాదేవి ప్రార్థనలతో తీక్షణ స్వభావుడైన అగ్ని మారుతికి చల్లగా తగిలాడు. వాయుదేవుడు అగ్నిదేవునకు తోడై హనుమంతుని కాపాడడంలో నిలిచాడు.

తోక దహింపబడుతున్నా ఆంజనేయునికి బాధ కలుగకపోవడంతో ఆంజనేయుడు ఈ వైశ్వానరుడు నన్నేమి చేయడం లేదు. నా వాలం దగ్ధం అయిపోతున్నా ఈ హవ్యవాహనుడు నాకు బాధను కలిగించడం లేదు. నా వాలం చివర మంచుగడ్డ పెట్టినట్లుగా నాకు అనిపిస్తోంది. నేను సముద్రం దాటి వస్తుంటే లోపల ఉన్న మైనాక పర్వతం నాకు విశ్రాంతినివ్వాలని పైకి వచ్చింది. అదొక రామకార్యంలోని అద్భుతం అయితే ఇప్పుడిదొక ఆశ్చర్యంగా ఉంది అనుకొన్నాడు.

సీతాదేవి కనికరంవల్ల, రాముని దయవలన ఈ అగ్ని నన్ను బాధించడం లేదు. వాయుదేవుడు అగ్నిదేవునికి మిత్రుడవడంవల్ల కూడా ఈ అగ్ని నాపై కరుణ చూపిస్తున్నాడు. రామబంటునైన నన్ను ఈ రాక్షసాధములు బంధించారు కదా! దీనికి నేను ప్రతీకారం చేసి తీరాలి అని తీర్మానించుకొన్నాడు.

వెంటనే బంధనాలనుంచి విడివడి ఆంజనేయుడు ఒక్కసారిగా ఆకాశానికి ఎగిరి పెద్దగా సింహగర్జన చేశాడు. ఉన్నతంగా ఉన్న లంకా నగర ముఖద్వారం మీదకు ఎగిరి ఆంజనేయుడు అక్కడ నిలబడ్డాడు. ఆంజనేయుడు పర్వతం అంత ఎత్తుకు ఎదిగి మరల అంతలోనే చిన్నగా మారి బంధనాలను వదిలించుకొన్నాడు. అటు ఇటు తిరిగి చూశాడు. ద్వారం మీద ఇనుప గుదియ కనిపించింది. దాంతో ఆ ద్వార రక్షకులను మోది చంపేశాడు. అక్కడనుంచి లంకనంతా పరికించి చూశాడు. అపుడా ఆంజనేయుడు సూర్యుడిలా కనిపించాడు.

* * *

# లంకాదహనం

## సర్గ - 54

లంక ద్వారం పైన నిలబడి లంకనంతా పరికించి చూస్తూ నేను ఇంకా ఏం చేయాలా అని ఆలోచించాడు. ఈ రాక్షసులకు తీవ్రమైన మనస్తాపాన్ని కలిగిస్తాను అనుకొన్నాడు.

అశోకవనం నాశనం అయ్యింది. కొందరు వీరులు చచ్చారు. రాక్షస సేనలో కాస్త భాగం నశించింది. ఇంకా నేను ఏం చేస్తే వీరికి మనస్తాపం కలుగుతుందని ఆలోచించాడు. ఈ లంకను నాశనం చేయాలనుకొన్నాడు. దుర్గాన్ని నాశనం చేస్తే నేను సముద్ర లంఘనం చేయడం, సీతాదేవిని చూడడం అనే వాటికి ప్రయోజనం కలుగుతుందని అనుకొన్నాడు. నన్ను చల్లగా చూసిన ఈ అగ్నిదేవునికి ప్రీతిగా కొంత నైవేద్యం ఇస్తాను అనుకొన్నాడు.

వెంటనే ఆంజనేయుడు మండుతున్న వాలంతో విద్యుత్కాంతులతో మెరుస్తూ మేఘంలాగా కనిపిస్తూ లంకా నగరంలోని భవనాల మీద సంచరించసాగాడు. ఒక గృహం నుండి మరొక గృహానికి గెంతుతూ వెళ్తున్నాడు. అలా ఎగురుతూ మొదట ప్రహస్తుని ఇంటికి నిప్పు అంటించాడు. అక్కడనుంచి మహాపార్శ్వుని వజ్రదంష్ట్రుని, శుకుని, సారణుని, ఇంద్రజిత్తుని, జంబుమాలి, సుమాలి లాంటి రాక్షస ప్రముఖుల హర్మ్యాలను అంటించసాగాడు. అలా అవన్నీ అగ్నికి ఆహుతి అవుతున్నాయి.

ఆంజనేయుడు అంతటితో ఊరుకోక తన వాలాన్ని రశ్మికేతుడు, సూర్య శత్రువు, హ్రస్వకర్ణుడు, దంష్ట్రుడు, రోమశుడు, మత్తుడు, ధ్వజగ్రీవుడు, విద్యుజ్జిహ్వుడు, ఘోరుడు, హస్తిముఖుడు ఇలా అందరి భవనాలు తగులబెట్టసాగాడు.

గొప్ప కృతజ్ఞుడైన విభీషణుని గృహాన్ని ఆంజనేయుడు తాకలేదు. ఐశ్వర్యమంతులైన రాక్షసుల భవనాలను, మణులు, ప్రవాళాలు, ఇలా అన్నీ సంపదలను ఆంజనేయుడు దగ్ధం చేశాడు. అలా వెళ్ళుతూ రావణుని ప్రసాద పైభాగానికి ఆంజనేయుడు చేరాడు. సర్వ విధ శోభాయమానంగా నానా విధ రత్న మాణిక్యాదులతో అలంకృతమైన రావణుని భవనాన్ని కూడా అగ్నికి నైవేద్యం చేశాడు. వాయుదేవుని అండతో అగ్నిదేవుడు ప్రళయ కాలాగ్నిలాగా ప్రజ్వరిల్లాడు.

బంగారు, రత్నాలు, ముత్యాలు, వైఢూర్యాలతో చేసిన కిటికీలున్న ఆ మహా భవనాలన్నీ కుప్పగా కూలిపోయాయి. పుణ్యం క్షీణించిపోగా నేల రాలిన సిద్ధుల కుటీరాల్లాగా రాక్షసుల గృహాలన్నీ శిథిలం అయ్యి నేలరాలాయి. ఎవరి గృహాలను వారు రక్షించుకోవడానికి వెళుతూ అగ్నిదేవుడే ఈ వానరుని రూపంలో వచ్చాడు అంటూ గగ్గోలుగా అరిచారు.

కొంతమంది స్త్రీలు లబోదిబోమంటూ చంటిపిల్లలను చంకలలో పెట్టుకొని పరుగులు తీశారు. అలా వారు పరుగెత్తుతుంటే వారిలో కొందరి కొప్పులు, వస్త్రాలు జారిపోతున్నాయి. వాటిని సరిచేసుకొనే ధ్యాసే లేకుండా వారి రక్షణకోసం పరుగులు తీశారు.

అగ్నిదేవుడు ముత్యాలు మణులు మాణిక్యాలు వాటి వెంట బంగారం అన్నీ దగ్ధం చేస్తున్నాడు. అయినా ఆయనకు తృప్తిలేదు. భూమినిండా రాక్షసుల శవాలు చేరుతున్నాయి. కానీ భూభారం తగ్గిందని భూదేవి చెప్పడం లేదు. వానరోత్తమునివలన లంక రుద్రునివలన దగ్ధం అయిన త్రిపురం వలె దగ్ధం అయిపోతోంది.

లంకానగరం అంతా మంటలు విజృంభించాయి. ఆకాశాన్ని తాకుతున్నాయా! అన్నట్లుగా ఆ జ్వాలలు పైకి ఎగిసివెళ్తున్నాయి. ఆ మంటలు ధ్వనులతో కూడి లంక అంతా వ్యాపించిపోయాయి. అగ్నిరవ్వలు మోదుగ పూలలాగా ఆకాశాన్నంటాయి. అలా మండిపోయే లంకను చూచి లంకావాసులు అవాక్కై నిలుచుండిపోయారు.

తరచి చూడగా ఈ వానరుడు నిజమైన వానరునిగా కనిపించడంలేదు దేవేంద్రునిలాగా వజ్రాయుధ బల సంపన్నుడై లంకనంతా నాశనం చేస్తున్నాడు. లేక దిక్పాలురలో ఎవరైనా అయ్యి ఉండవచ్చు. లేక సూర్య చంద్రాదులలో ఎవరైనా ఈ రూపాన వచ్చారేమో! లేక యముడే ఈ వానర రూపంలో వచ్చి ప్రళయం సృష్టిస్తున్నాడేమో!

సమస్త జీవకోటికి ఆధారభూతుడైన బ్రహ్మ క్రోధావేశమే రూపు కట్టి ఇటు వచ్చిందేమో! ఊహింప శక్యం కాని విష్ణుతేజమే రాక్షస నిర్మూలనకు మాయారూపంతో ఇక్కడకువచ్చిందేమో. రాక్షస నాశనానికి మృత్యువే వానరాకృతి దాల్చి వచ్చిందేమో అని లంకలోని రాక్షసులు తృటిలో అందమైన నగరమంతా దగ్ధం అయిపోవడం చూసి నిశ్చేష్టులైన వారి అంతరంగంలో ఆలోచనలు ఇలా సాగి వారందరూ ఒక చోట గుమికూడి ఇదే విషయం ఒకరితో ఒకరు చెప్పుకొంటున్నారు.

బుగ్గిపాలైన నివాసాలు చూచి ప్రాణాలు పోగొట్టుకొన్న స్వజనులను చూసి మిగిలిన రాక్షసులు హాహాకారాలు చేస్తూ దగ్ధం అయిన వారికోసం గగ్గోలుగా విలపించారు. వారి ఆర్తనాదాలతో లంక అంతా నిండిపోయింది. హనుమంతుని కోపతాపంతో లంకవాసులలో ప్రముఖులు దుర్మణం చెందారు. భటులు పలాయనవాదం చేట్టారు. లంక శాపగ్రస్తలా మారి బోరుమని ఏడుస్తోంది.

భయ విషాదంలో కూరుకొన్న లంకను హనుమంతుడు తృప్తిగా చూశాడు. బ్రహ్మ కోపానికి ఆహుతి ఐన అవనిలాగా లంకానగరం కనిపించింది. సంకల్పించిన పనులన్నీ చక్కబెట్టుకొన్నాడు. త్రికూట పర్వత శిఖరాగ్రానికి హనుమంతుడు చేరుకొన్నాడు. ఆంజనేయుడు లంకాదహనం చేసి రామధ్యానమగ్నుడయ్యాడు.

లంకాదహనం చేసిన వానరోత్తముని దేవతలందరూ మెచ్చుకొన్నారు. దేవతలు గంధర్వులు, సిద్ధులు, మహర్షులు అందరూ దగ్ధం అయిన లంకను వీక్షించారు. ప్రళయ కాలాగ్ని స్వరూపునిగా కనిపించే ఆంజనేయుని చూచి ప్రశంసా వర్షాన్ని కురిపించారు. వారందరూ రాక్షస వంశం సమూల నాశనం చెందే తరుణం ఆసన్నమైనదని చెప్పే ఈ లంకాదహన చిహ్నాన్ని చూచి పరమానందించారు.

* * *

# సీత చింత

## సర్గ - 55

బుద్ధిశాలి ఐన హనుమంతుడు లంకనంతా దగ్ధం చేసి సముద్రానికి వెళ్ళి తన తోక నిప్పును చల్లార్చుకొన్నాడు. లంకావాసులందరూ లంకాదహనాన్ని చూచి బాధలో కూరుకొనిపోయారు. వారందరూ ఏడుస్తున్నారు. వారిని చూసి హనుమంతుడు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. అయ్యో లంకను కాల్చి నేను పెద్ద తప్పుచేశాను అని తనను తాను నిందించుకొన్నాడు.

మహాత్ములు తమ బుద్ధికుశలతతో ఆగ్రహావేశాలను అదుపులో పెట్టుకొంటారు. కోపం ఎవరినైనా సర్వనాశనం చేస్తుంది. కోపావేశానికి లోనైనవారు ఏ పాప కార్యాన్ని అయినా ఆలోచన లేకుండా చేసేస్తారు. గురువులను హత్య చేయడానికి కూడా వారు వెనుకాడరు. కన్నుగానకుండా సత్పురుషులను కూడా నిందిస్తారు. కోపోద్రిక్తంతో అనకూడని మాటలను కూడా అనేస్తారు. క్షణికోద్రేకంతో వచ్చిన పిచ్చి కోపాన్ని అణచుకొన్న వాడే నిజానికి జ్ఞాని.

అయ్యో! నేను ఎంత పాపిని. ఆలోచనారహితంగా లంకనంతా దగ్ధం చేశాను. ఈ లంకలోనే ఉండే సీతాదేవికి ఏమి ఆపద వచ్చిందో? ఆమెను అగ్నిపాలు చేతులారా చేసి స్వామి ద్రోహాన్ని చేశాను. బుద్ధిలేని నేను ఘోర కృత్యాన్ని చేశాను. నా పాపానికి నిష్కృతి లేదు. నేను లంకను నిప్పు పెట్టడం వలన సీతాదేవి అగ్నికి ఆహుతి అయి ఉంటుంది. నావలనే సీత రక్షణకు భంగం ఏర్పడింది. నేను చేసిన ప్రయత్నం అంతా బూడిదలో పోసిన పన్నీరు అయ్యింది.

సీతాన్వేషణం పూర్తి అయింది. ఇంక సీతాదేవి సందేశాన్ని శ్రీరామునికి నివేదించడమే మిగిలి ఉంది అనుకొన్నాను. కానీ ఆ ప్రయత్నం అంతా వృథా అయిపోయింది. కోపంతో కన్నులు మూసుకొని బుద్ధి నాశం చెంది మూల విచ్ఛేదానికి పాల్పడ్డాను. లంకాపురి అంతా దహించుకుపోతోంది. దాన్ని చూసి ఇప్పటిదాకా ఆనందించాను. కాని నా ప్రాణం ఐన శ్రీరాముని అమూల్య వస్తువు అందులో ఉండిపోయిందన్న జ్ఞానాన్నే మరచిపోయాను.

నా బుద్ధి వైపరీత్యంతో ఇంత ముప్పు వచ్చింది. ఇక నేను బ్రతికి ఉండడం వృథా. కార్యాన్ని నాశనం చేసిన నేను నా ముఖాన్ని సుగ్రీవాదులకు రామాదులకు ఎలా చూపించగలను? బుద్ధి చాంచల్యంతో నేను చేయకూడని కార్యాన్ని చేశాను. నేను బడబాగ్నిలో దూకి ప్రాణత్యాగం చేయడం మంచిదా? లేక సముద్రంలో దూకి జలచరాలకు ఆహారం అవడం మంచిదా?

ఛీ ఛీ నేను ఇలా చేశాను. రాజస భావం చాలా చెడ్డది. కార్యదక్షుడనైన నేను రజోగుణ ప్రభావంతో కార్యానికి విఘ్నం కలిగించాను. సీతాదేవి ప్రాణాలకు హాని జరిగినదని తెలిస్తే రామలక్ష్మణులు అసువులు వదిలేస్తారు.

వారిని చూసిన సుగ్రీవుని వానరలోకం నేను చేసిన పనికి తలవంచుకోలేక ప్రాణాలను వదిలేస్తారు. దీనికంతా కారణం కేవలం నా అజ్ఞానమే. నా కోపమే. కోపంవలన ఎవరైనా సర్వనాశనం అవుతారనడంలో లేశమాత్రం కూడా సందేహం లేదు.

ఈ మాట అయోధ్యావాసులకు తెలిస్తే ఇక్ష్వాకు కులదీపులు ఐన భరతాదులు వారి తల్లులు, వారి ప్రజానీకం అందరూ అగ్నికి ఆహుతి అయిపోతారు. ఇంతమందిని బాధలకు గురిచేసిన నేను నిజంగా దురదృష్టవంతుడినే. రోషాతిరేకంతో దోషాలలో కూరుకుపోయాను. లోక నాశకుడిని. నేను చేసిన పాపం ఇంత అని లెక్కవేయడానికి కూడా సాధ్యంకాదు. కిష్కింధనుండి అయోధ్యవరకు ఉన్న వారినందరిని నేను బాధలకు గురిచేశాను. ఇలా ఆలోచిస్తున్న హనుమంతునిలో ఒక్కసారిగా ఆలోచన వచ్చింది. ఇదివరలో సీతమ్మ తల్లికి శుభశకునాలు కన్పించాయి కదా. అలాంటప్పుడు ఆమెకు ప్రాణహాని ఎలా జరుగుతుంది అనే ఆలోచన జాగృతం అయ్యింది. చాలా సంతోషం వేసింది. అవునౌవును మంగళ ప్రదాయిని శ్రీరాముని ధర్మపత్ని ఐన సీతాదేవిని అగ్ని దహింపజాలదు కదా. కనుక ఆమె సురక్షితంగానే ఉంటుంది. సీతా సాధ్వి పతివ్రతామతల్లి ఆమె ధర్మమే ఆమెను రక్షణ కవచమై కాపాడి ఉంటుంది. ఆ సీతమ్మవలనే సర్వభక్షకుడైన అగ్ని నన్ను కరుణతో చూశాడు. శ్రీరాముని ప్రియపత్ని ఐన సీతను అగ్ని ఏ విధంగాను బంధించలేదు. ఇది నిజమే. నాశనం లేని అగ్ని నా వాలాన్నే కాల్చలేదు. ఇక సీతాదేవికి అపకారం ఎందుకు చేస్తాడు?

నిరంతరం రామనామ తపోగ్నితో విలసిల్లే సీతమ్మ అగ్నినే రూపుమాపగల సమర్థురాలు. ఆమెను అగ్ని ఎందుకు బాధిస్తుంది? ఇలా ఆలోచిస్తున్న హనుమంతునికి ఆకాశంలో చారిణులు మాట్లాడుకొనే మాటలు వినవచ్చాయి. వాటిని చెవులప్పగించి వినసాగాడు." చూశారా! ఈ అద్భుతం. తోకకు నిప్పంటించిన హనుమంతుడు ఆ నిప్పుతోనే లంకవాసులను దగ్ధం చేస్తున్నాడు. తన వాలానికున్న నిప్పుతో లంకనంతా అగ్నికి ఆహుతి చేశాడు. లంకావాసుల ఆక్రందనలు మిన్నుముట్టుతున్నాయి. ఏమి ఆశ్చర్యం!

అంతేకాదు, ఇంకొక పరమాశ్చర్యం గొలిపే సంగతి విన్నారా! లంకలోనే ఉన్న సీతమ్మ తల్లి ఆ అగ్నివలన లేశమంతైనా బాధపడలేదు. లంక అంతా దగ్ధం అయిపోయినా వాలానికి ఉన్న నిప్పు వల్ల ఆంజనేయుడు బాధపడలేదు. రామనామమెంత గొప్పదో కదా" అనే మాటలను చెవులు రిక్కించి వినసాగాడు. ' ఇప్పుడు లంకలోనే అశోక వృక్షం క్రింద కూర్చుని ఉన్న సీతమ్మ చల్లని గాలితో సేద తీరుతూ ఉంది. అగ్ని దూరం అయిపోయాడు ' అనే మాటలు వినవచ్చి ఆంజనేయునిలో ఉత్సాహం సంతోషం పొంగివచ్చాయి.

ఈ అమృత తుల్యమైన మాటలు విని నా మనస్సు పరమానందంతో ఊగిపోతోంది. ఇందాకటి నుంచి సీతమ్మ ఏమి అయిపోయిందో అనే వేదనాగ్నిలో దహించుకుపోయిన నేను అమృతభాండంలో మునిగినట్లున్నాను. సీతమ్మ క్షేమ వార్తతో హనుమంతుడు సంతుష్టి చెందాడు.

ఒక్కసారి సీతమ్మను కన్నులారా చూసి సంతోషంతో తిరిగి సముద్ర లంఘనం చేసి రామునికి సంతోష వార్తను తెలుపుతాను అని హనుమంతుడు భావించాడు.

* * *

# సీతాదర్శనం - సముద్ర లంఘనం

## సర్గ - 56

అనుకొన్న వెంటనే హనుమంతుడు లంకలోని అశోవనంలోకి ప్రవేశించాడు. సీతమ్మ దగ్గరకు వెళ్ళాడు. సాష్టాంగ ప్రణామం చేశాడు. ' అమ్మా మీరు క్షేమమే గదా' అని అడిగాడు. ' అమ్మా దైవానుగ్రహంవలన మిమ్ము నేను సురక్షితంగా చూడగలిగాను. అమ్మా! ఇక నేను శ్రీరాముని దగ్గరకు వెళ్లివస్తాను' అని చెప్పాడు.

సీతాదేవి హనుమంతుని చూస్తూ అశ్రుపూరిత నయనాలతో " ఓ పుణ్యపురుషా! ఒక్కదినం ఇక్కడ ఎక్కడైనా రహస్య ప్రదేశంలో ఉండి వెళ్ళవచ్చుగదా " అని అడిగింది." వానరోత్తమా! నీవలన నా శోకం దూరం అవుతోంది. నీవు శ్రీరాముని దగ్గరకువెళ్ళి తిరిగి వచ్చేవరకు నా ప్రాణాలు నిలుస్తాయో? లేదో? ఓ మహావీరా!నేను మానసికంగా శారీరకంగా రాముని ఎడబాటుతో క్రుంగిపోయి ఉన్నాను. ఇప్పుడు నీవు కనిపిస్తూ రాముని మాటలు చెప్తుంటే పోయిన ప్రాణాలు తిరిగి నన్ను చేరుతున్నట్లు అనిపిస్తున్నాయి.

ఈ సమయంలో నీవు కనిపించకుండా పోతే నా ప్రాణాలు నిలుస్తాయా? అనే సంశయం నాకు కల్గుతోంది. అసంఖ్యాక వానర భల్లూక సేనలు రామలక్ష్మణుల అండగా ఉన్నాయనే విషయం యథార్థమే. కాని ఈ అపార సముద్రాన్ని వారందరూ ఎలా దాటివస్తారు? అనే సందేహం నన్ను వీడక అనుక్షణం నన్ను వేధిస్తోంది

వాయుదేవుడు, గరుత్మంతుడు, నీవు మీ ముగ్గరే కదా సాగరాన్ని దాటగలిగినవారు. మరి సాగరం అడ్డంకి నీవు ఎలా సమర్థంగా తొలగించాలని అనుకొంటున్నావు? ఇందులో నీ ఆలోచన ఎలా ఉంది?

శత్రువులను పరిమార్చడంలోను నన్ను ఆవలికి తీసుకొని వెళ్ళడంలోను నీవు కార్యసాధకునివే. కాని నన్ను నా భర్త వచ్చి తీసుకెళ్ళకపోతే ఆయనకు అపకీర్తి వస్తుంది గదా. శత్రు భయంకరుడగు శ్రీరాముడు లంకకువచ్చి రావణుని హతమార్చి నన్ను చేపట్టితే గదా ఆయన కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి " అని సీత అంది.

దానికి హనుమంతుడు " అమ్మా! మీరు సందేహాలను వీడండి. సంశయాత్మక బుద్ధిని డోలాయమాన మనస్సును మీరు దిటవు చేసుకోండి. ఓ సీతాదేవీ! మీరు నిశ్చితంగా ఉండండి. శ్రీరాముడు సుగ్రీవాదులతో కలిసి వచ్చి మీరు కోరినట్లుగానే రావణ వధ చేస్తారు. మిమ్ము చేపట్టుతారు. త్వరలోనే రావణుడు బంధుజన సపరివార సమేతంగా రామబాణాగ్నిలో కాలి బూడిద అయిపోతాడు. అప్పుడే మీరు శ్రీరాముని దగ్గరకు చేరుతారు. ఇది నిశ్చయంఅమ్మా. " అని సీతకు ధైర్యం చెప్పి వెళ్ళడానికి అనుమతినిమ్మని హనుమంతుడు సీతాదేవిని ప్రార్థించాడు.

రామదూతను నేను అని హనుమంతుడు ఎలుగెత్తి చాటాడు. తన బలాన్ని కాస్త రాక్షసులకు చవి చూపించి శ్రీరాముని చూడాలనే తలంపుతో సాగరాన్ని మరలి వెళ్ళడానికి కృతనిశ్చయుడయ్యాడు.

హనుమంతుడు అరిష్టం అనే మహాగిరిని ఎక్కాడు. ఆ గిరి అంతా పద్మక వృక్షాలతో నిండి ఉంది. నల్లని పంక్తులు కలిగి శిఖరాల మధ్య వ్రేలాడే మేఘంలాగా కనిపించింది. సూర్యకిరణాల ప్రేమతో మేల్కొన్నట్లుగా ఆ గిరి ప్రకాశిస్తోంది. దానిపై జలపాతాల సవ్వడులు వేదాధ్యయనం చేస్తున్నట్లుగా ఉన్నాయి. గైరికాది ధాతువులు యోగులు కన్నులు తెరచి చూస్తున్నట్లుగా తేజోవంతంగా కనిపిస్తున్నాయి.

దేవదారు వృక్షాలు క్రూర మృగాలు, సర్పాలు పక్షులు అన్నీ సమృద్ధిగా ఆ గిరిపై ఉన్నాయి. దానిపైన శిఖరాలు, గుహలు, అనేక రకాలైన వృక్షాలు ఉండడంతో అక్కడ యక్షులు, కిన్నరులు, గంధర్వులు సంచారం చేసేవారు. రుచికరాలైన ఫలాలు, కందమూలాలు ఎక్కువగా ఉన్నాయి. మౌనిలాగా ఉండే ఆ అరిష్టగిరిని సీతాదేవి కుశల వార్తను తెలపాలనే తొందరలో హనుమంతుడు అధిరోహించాడు.

హనుమంతుని పాద తాడనంతో ఆ గిరిపై ఉండే గండశిలలు పిండి అయ్యాయి. తన శరీరాన్ని అమాంతంగా ఆంజనేయుడు పెంచాడు. పాదాన్ని అదిమిపట్టి తన శరీరాన్ని విమానంలాగా పైకి ఎత్తి ఉత్తర దిశగా సాగరాన్ని అధిగమించడానికి హనుమంతుడు ముందుకు సాగాడు.

అలా పైకి ఎగిరిన హనుమంతుని వేగానికి అరిష్టగిరిపై ఉండే వృక్షాలు, శిఖరాలు అన్నీ పెద్ద ధ్వనితో సముద్రంలో పడిపోయాయి. అరిష్టగిరి నుంచి వాయునందనుని వేగానికి పడిపోతున్న భూరుహములు అన్నీ ధరణీదేవికి  తమవంతు సాయాన్ని అందిస్తామని దానికి తమ ప్రాణాలను తృణ ప్రాయంగా తలుస్తామని చెప్పుతున్నట్లుగా వ్రేళ్ళతో సహా పడిపోతున్నాయి.

గుహలలో ఉన్న సింహాలు క్రూర మృగాలు భయంతో గర్జించాయి. అక్కడ ఉన్న విద్యాధర స్త్రీలు ఆ ధ్వనికి భయపడ్డారు. వారి వస్త్రాదులు స్థానభ్రంశం చెందాయి. ఆభరణాలు పక్కకు తొలిగాయి. మహాసర్పాలు భయంతో చుట్టలు చుట్టుకొని గిరిని గట్టిగా పట్టుకొన్నాయి.

పది యోజనాల విస్తీర్ణం ఉన్న ఆ అరిష్టగిరి హనుమంతుని ధాటికి, వేగగమన శక్తికి నేలమట్టం అయింది. హాయిగా మనస్సంతోషంతో సుగ్రీవ రామాదుల కలయిక కోసం హనుమంతుడు సాగరం ఆవలి తీరానికి ప్రయాణం చేశాడు. ప్రకృతి అంతా పులకించిపోతోంది.

త్వరలో రావణుని పీడ వదిలిపోతుంది. ఇక అందరూ సంతోషంతో బతకవచ్చు అనుకొంటోంది. భూదేవి రాబోయే సుఖాన్ని గురించి ఆలోచిస్తూ పరవశిస్తోంది. సీతమ్మ తనకుమంచి రోజులు రాబోతున్నాయని తనపై శ్రీరామునికి అనుగ్రహం కలుగుతుందని ఆనందిస్తోంది.

* * *

# హనుమ అంగదాదుల సమాగమనం

## సర్గ - 57

మహాబల పరాక్రమాలున్న కపిశ్రేష్ఠుడు అరిష్టగిరి నుండి ఆకాశానికి ఎగిరి సాగరోల్లంఘనానికి బయలుదేరాడు. ఒక మహానౌక సాగరాన్ని దాటినట్లుగా బలోపేతుడైన ఆంజనేయుడు అనాయాసంగా సాగరాన్ని దాటాలని ప్రయత్నిస్తున్నాడు. ఆకాశాన్ని తాకుతున్నట్లుగా హనుమంతుని ప్రయాణం సాగింది. మబ్బుల చాటున దాగి మరలా ప్రకాశవంతమవుతున్న చంద్రుని లాగా హనుమంతుడు కనిపించకుండాను కనబడుతూనూ సాగరాన్ని దాటుతున్నాడు.

మేఘాలను చీల్చుకొంటూ వెళ్లే గరుత్మంతునిలాగా ఆంజనేయుడు కనిపించాడు. పెద్దగా సింహగర్జన చేస్తూ సాగరాన్ని అధిగమిస్తున్నాడు. రావణుని హృదయంలో భయోత్పాతం కలిగించి లంకను దహనం చేసి వస్తున్న హనుమంతుని చూడడానికి పైకి వచ్చిన మైనాకుణ్ణి చేత్తో స్పృశించి తన ప్రేమాతిశయాన్ని చవిచూపించి వింటి నుండి వదలిన బాణంలాగా ఆంజనేయుడు ఉత్తరదిశకు దూసుకొనిపోతున్నాడు.

మహేంద్ర పర్వతం సమీపిస్తుండగా ఆంజనేయుడు మహానాదం చేశాడు. అది దశదిశలా వ్యాపించింది. హనుమంతుడు సముద్ర ఆవలి తీరాన్ని చేరాడు. తన మిత్రులను చూడాలనే కోరికతో సింహగర్జన చేస్తూ తన తోకను అటు ఇటు త్రిప్పాడు. నభోమార్గంలో (ఆకాశ) గర్జనలు ఆకాశం బ్రద్దలు అయ్యేట్లుగా వినపడింది.

ఉత్తర తీరంలో చేరి ఉన్న అంగదాదులు వాయుపుత్రుని దర్శనం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. వారు హనుమంతుని మేఘ గర్జన విన్నారు. అంతవరకు హనుమంతుని చూడాలన్న కాంక్షతో ఉద్రూతలూగుతున్న వానరులందరూ ఆ నాదాన్ని విని పరమానందించారు. ఉత్సాహంతో పొంగిపోయారు. జాంబవంతుడు వానరులందరిని దగ్గరకు పిలిచాడు.

ఈ హనుమంతుడు కార్యాన్ని సాధించుకొని వస్తున్నట్లున్నాడు. అందువలనే సింహనాదాన్ని చేస్తున్నాడు. ఒకవేళ కార్యం సాధించలేకపోతే మహానాదం చేసుండేవాడు కాదు అని జాంబవంతుడు తనలో కలిగే సంతోషానికి మాటలు కట్టి చెప్పాడు. ఆ మహానుభావుని వేగాన్ని చూసి కపులందరూ సంతోషంతో గంతులు వేశారు. వారు ఆనందంతో అక్కడున్న చెట్లు ఎక్కి కొమ్మల నుండి కొమ్మలకు దూకుతూ చిగుళ్లు తింటూ నిక్కి నిక్కి చూస్తూ గంతులు వేస్తున్నారు. వారి మనస్సంతోషం వారిని ఒక చోటున ఉండనీయడం లేదు. కొమ్మలు పట్టుకొని వృక్షాలను ఊపుతున్నారు.

హనుమంతుడు మహానాదంతో సంతోషాతిరేకంతో భూమి మీదకు దిగడం వానరులు చూశారు. ఆయనకు అందరూ స్వాగతం పలికారు. నెమ్మదిగా హనుమంతుడు మహేంద్రగిరిపైన అడుగుపెట్టాడు. వానరులు హనుమంతుని చూసిన సంతోషాన్ని భరించలేక పెద్దగా అరిచారు; చప్పట్లు కొట్టారు; కొమ్మలు తెంపారు; ఎగిరారు; దూకారు. హనుమంతుని చుట్టూ చేరారు. క్షేమంగా తిరిగి వచ్చిన హనుమంతుని చూచి ఆనందాతిరేకంతో అశ్రునయనాలతో

వానరులు ఆయనను కౌగిలించుకొన్నారు. వానరులందరూ కానుకలిచ్చి హనుమంతునికి నమస్కరిస్తూ ఆలింగనం చేసుకొన్నారు. వానరోత్తముడైన హనుమంతుడు కార్య సాఫల్య సంతోషంతో జాంబవంతాది వృద్ధులకు యువరాజైన అంగదునకు నమస్కరించాడు. అంగదులు జాంబవంతుడు ఇలా వారందరు హనుమంతుని కొనియాడుతూ పూజించారు.

సీత వార్తకై ఆత్రంగా ఎదురుచూస్తున్న వానరులతో 'కనుగొంటిని సీతమ్మను' అని హనుమంతుడు చెప్పాడు. అంతే అది విని వానరుల ఆనందానికి అవధులు లేకపోయాయి. అంగదుడు హనుమంతుని తీసుకొని ఒక రమణీయ ప్రదేశంలో మహేంద్రగిరి పైన కూర్చున్నాడు. వారందరూ విషయం చెప్పమని హనుమంతుని అడిగారు. ' నేను లంకలో ప్రవేశించాను. దానిలోని అశోక వనంలో ఒక శింశుపావృక్షం క్రింద రాక్షస స్త్రీల కాపలా మధ్య ఉన్న సీతమ్మను చూశాను. ఆ జానకి శ్రీరామ దర్శనం కోసం తహతహలాడుతోంది. ఒకే జడ వేసుకొని మలిన వస్త్రాన్నే కట్టుకొని ఉంది. ఉపవాసాలతో క్రుంగి కృశించిపోయి ఉంది' అని చెప్పాడు. కనుగొన్నాను సీతను అని చెప్పిన మాటకే వానరులందరూ సంతోషంతో పొంగిపోయారు. రంకెలువేస్తూ తమ తోకలనెత్తి అటు ఇటు త్రిప్పుతూ నేలకేసికొడుతూ కేకలు వేస్తూ మహేంద్రగిరి అంతా చిందులు వేశారు. మరికొందరు పర్వత శిఖరముల నుండి క్రిందకు దూకారు. ఎగిరారు. మారుతిని ఆలింగనం చేసుకొని ముద్దుపెట్టారు. చల్లని వార్త వినిపించిన హనుమంతుని ప్రశంసించారు.

వానరులందరి పక్షాన అంగదుడు మారుతితో " ఓ వానరోత్తమా!బలపరాక్రమాలలో నీతో సమానుడు ఎవ్వరూ లేరు. నీవు అమేయ ప్రతిభాశాలివి. ఈ అపారమైన సాగరాన్ని దాటి వెళ్లివచ్చావు. నీవు మా ప్రాణాలను కాపాడిన దేవునివి. నీ అనుగ్రహంవలనే మేమందరం శ్రీరాముణ్ణి చూడగలుగుతున్నాం.

అహో! నీ ప్రభుభక్తి మెచ్చదగినది. నీ బలపరాక్రమాలను దేవతలు సైతం కొనియాడి తీరుతారు. నారీ శిరోమణి ఐన సీతా సాధ్వి దర్శనం చేసుకొన్న పుణ్యాత్ముడవు నీవే. సీతాదేవి జాడను తెలుసుకొన్న నీవు శ్రీరామునికి జానకీ దేవి కుశలవార్తను తెలుపుతావు. శోక సముద్రంలో మునిగిన రాముడు నీవలనే ఆ శోకాన్ని త్యజించి అందరికీ సంతోషం కల్గిస్తాడు. అటు భరతాదులు, ఇటు సుగ్రీవాదులు మితిమించిన ఆనందాన్ని తప్పక పొందుతారు.

అయోధ్యావాసులకు ఇంతకన్నా సంతోషమింక ఏదిఉండదు. మన కిష్కంధకూడా ఆనందంలో మునిగిపోతుంది. మన రాజు సుగ్రీవుడు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని వానరులందరూ మహోత్సాహంతో పండుగ జరుపుకొంటారు. లక్ష్మణ కుమారుడు కూడా అన్న సంతోషిస్తున్నారని తాను ఆనందిస్తాడు." అని అంగదుడు అమితానందంతో హృదయం ఉప్పొంగగా ఆంజనేయునితో అన్నాడు. ఆ మాటలు వింటూ కపివరులందరూ పెద్ద పెద్ద శిలలను ఆసనాలుగా చేసుకొని కూర్చున్నారు. హనుమంతుని మాటలను వినాలనే కుతూహలంతో వారందరూ సంతోషంగా సుఖాసీనులయ్యారు. స్వర్గమందు దేవతలతో ఆరాధించబడే దేవేంద్రునిలాగా అంగదుడు వానరులతో చేరి కూర్చున్నాడు. అంగదాదులు కూర్చున్న ఆ మహేంద్రగిరి చక్కని శోభలతో ప్రకాశించింది. సీతమ్మను చూసివచ్చానన్న ఆనందం ఆంజనేయునిలో తొణికిసలాడుతోంది.

* * *

# సీతాన్వేషణా వృత్తాంతం

## సర్గ - 58

వానర ప్రముఖులందరూ హనుమంతునితో చేరి చాలా సంతోషంగా ఉన్నారు. బ్రహ్మ చుట్టూ కూర్చున్న దేవతల్లాగా హనుమంతుని చుట్టూ అంగదునితోకూడి వానరులు కూర్చుని ఉన్నారు. జాంబవంతుడు, అంగదుడు ' ఆంజనేయా!నీవు వెళ్ళినది మొదలుకొని ఏమేమి చూశావో, ఏమి చేశావో జరిగింది జరిగినట్లుగా మాకు చెప్పు. వినాలనే కుతూహలం మమ్ములను వేధిస్తోంది. కపిశ్రేష్ఠా!నీవు చెప్పినది విని తర్వాత కార్యాన్ని గూర్చి ఆలోచిద్దాం' అన్నాడు.

మనం శ్రీరాముని దగ్గరకు వెళ్ళి చెప్పదగిన విషయాలు చెప్పకూడని విషయాలు కూడా చెప్పు అని వారు అడుగగా హనుమంతుడు వారి సంతోషార్థం "ఓ వానర ప్రముఖులారా! మీరందరూ మహేంద్రగిరిపైనుండి దక్షిణ దిశకు వెళ్ళడానికి పైకి ఎగరడం చూశారు కదా. అలా నేను పైనుంచి సముద్రాన్ని దాటుతూ వెళుతుండగా దారిలో నాకు ఒక పెద్ద పర్వతం అడ్డుగా నిలిచింది. దాన్ని చూచి ఇది ఏదో అడ్డంకి అయి ఉంటుంది దాన్ని ముక్కలు చేసెయ్యాలనుకొన్నాను. ముందుకు వెళుతుండగా ఆశ్చర్యంగా ఒక మనిషి అక్కడ కనిపించాడు.

ఆ మనిషి' హనుమంతా! నేను మైనాక పర్వతాన్ని. నీకు ఆతిథ్యం ఇవ్వమని సముద్రుడు చెప్పగా నేను ఇందులోనుండి పైకి వచ్చాను. నేను ఇంతకుముందు మీ నాన్న చేత దేవేంద్రుని నుండి రక్షించబడ్డాను. రెక్కలున్న పర్వతాలు ఇంతకుముందు ఎగిరే వెసులుబాటు కలిగి ఉండేవి. వాటివలన మహర్షులు, సిద్ధులు బాధపడుతున్నారని దేవేంద్రుడు తెలుసుకొన్నాడు.

అప్పుడు దేవేంద్రుడు వజ్రాయుధం చేత బట్టుకొన్న పర్వతపు రెక్కలను తెగనరకడం మొదలుపెట్టాడు. అలాంటప్పుడు నీ తండ్రి ఐన వాయుదేవుడు నాకు సహాయం చేసి నన్ను ఈ సముద్రంలో పడవేశాడు. అందువల్ల వాయుదేవుని పుత్రునివైన నిన్ను సేద తీర్చాలనుకొని బయటకు వచ్చాను. ఇక్ష్వాకు వంశజులచే వృద్ధి పొందిన సాగరుడు కూడా నీకు విశ్రాంతినివ్వమని నాకు చెప్పాడు' అని మైనాకుడు చెప్పడం నేను విని కర స్పర్శతో వారికి ఆనందం కలిగించి నేను విశ్రమించకుండా ముందుకు వెళ్లిపోయాను.

అలా వెళ్లే నాకు మరల సురస అను నాగకన్య పెద్దగా నోరు తెరచి నన్ను మింగేస్తానని అంటూ బ్రహ్మదేవుడు నిన్ను నాకు ఆహారంగా ఇచ్చాడంటూ వచ్చింది. ఆమెను 'నేను అమ్మా రామ కార్యార్థం వెళుతున్నాను. దశరథుని జ్యేష్ఠపుత్రుడు శ్రీరాముడు సతీ సోదరులతో వనవాసం చేసేటప్పుడు ఎవరో రాక్షసులు సీతమ్మను అపహరించారు. ఆమెను వెదకడం కోసం నేను వెళ్తున్నాను. తిరిగి నేను వచ్చేటప్పుడు నీకు ఆహారం అవుతాను. నన్ను నా మాటలను విశ్వసించి దారి వదలు' అని నేను ఎంతో ప్రార్థించాను.

కాని ఆమె 'నువ్వు నన్ను దాటి వెళ్ళలేవు' అంటూ పెద్దగా నన్ను మింగివేసేటట్లుగా నోరు తెరిచింది. నేను అంతకన్నా పెద్దగా శరీరాన్ని పెంచుతూ వెళ్ళి చివరకు సూక్ష్మరూపం ధరించి పెద్దగా నోరు తెరచుకొని ఉన్న ఆ

సురస నోట్లోనుంచి వెళ్ళి అంతే వేగంగా బయటకు వచ్చేశాను. దాంతో ఆమె నన్ను మెచ్చుకొని తన అసలు రూపాన్ని చూపి 'అయ్యా వానరోత్తమా! నీ బలపరాక్రమాలు తెలుసుకోవాలని దేవతలు నాగకన్యనైన నన్ను పంపారు. నీవు నన్ను గెలిచావు. నీకు జయం కలుగుతుంది వెళ్ళిరా 'అని చెప్పింది.

అలా నేను ఆమె నుంచి దూరంగా వెళ్ళడం ప్రారంభించాను. మరికొద్దిసేపటికే నా గమన వేగం ఎవరో తగ్గిస్తున్నట్లుగా అనిపించి క్రిందకు చూశాను. అక్కడ సుగ్రీవుడు చెప్పిన ఛాయగ్రాహ రాక్షసి ఐన సింహిక కనిపించింది. ఆమె 'ఎన్నో రోజులనుండి ఆహారం కోసం ఎదురుచూస్తున్నాను. ఇన్నాళ్లకు నీవు మంచి ఆహారంగా దొరికావు. రా! తినివేస్తాను' అంటూ అమాంతంగా నోరు పెద్దది చేస్తూ నా మీదకు దూసుకొచ్చింది.

నేను మారు మాట్లాడకుండా నా శరీరాన్ని పెంచి మరల తగ్గించి ఆమె నోట్లో ప్రవేశించి ఆమె వక్షస్థలాన్ని బద్ధలు చేసి బయటకు వచ్చి వేగంగా పైకి ఎగిరి ముందుకు వెళ్ళాను. అప్పుడు ఆకాశంలోని చారణులు, గంధర్వులు 'ఆంజనేయుడు సింహికను చంపేశాడు' అని చెప్పుకోవడం నేను విన్నాను. అవి వింటూ సంతోషంగా నేను అడ్డంకులు ఎదుర్కొంటూ ముందుకు సాగుతాను అనుకొంటూ వెళ్ళడం ప్రారంభించాను.

అలా నేను వెళ్ళి సాయం సంధ్యా సమయానికి లంకలో ప్రవేశించాను. లంకలోకి వెళ్ళబోతున్న నన్ను లంకిణి అనే లంకానగర పాలక రాక్షసి నన్ను చూసింది. 'ఆమె ఎవరురా నీవు ' అంటూ నన్ను అడ్డుకుంది. ముష్టిఘాతాలతో గాయపరిచింది. నేను ఆమెను ఒక్క దెబ్బవేసి పరాజితను చేశాను. ఆమె 'ఓ వానరా! నన్ను ఏ వానరుడు జయిస్తాడో వానివలన లంకా నాశనం జరుగగలదు' అని బ్రహ్మదేవుడు నాకు చెప్పి ఉన్నాడు.

'నీవీనాడు లంకలో ప్రవేశిస్తూ నన్ను ఓటమి పాలు చేశావు. నీకు విజయం లభిస్తుంది. నీవు యథేచ్ఛగా తిరుగు' అని నాకు లంకిణి లంకలోపలకి వెళ్ళడానికి అనుమతినిచ్చింది. నేను సంతోషంగా లోపలకి వెళ్లాను. బాగా ఆలోచించి సీతమ్మను వెదకడానికి పిల్లంత ప్రమాణంలో నా రూపాన్ని సంతరించుకొని అన్వేషణ ప్రారంభించాను.

అలా నేను రావణాంతఃపురం అంతా గాలించాను. లంకలోని ప్రముఖుల ఇళ్లు, తటాకాలు, ప్రాకారాలు, పర్వతాలు, గుహలు అన్నీ వెదికాను. కాని నాకు సీతమ్మ జాడ తెలియలేదు. నేను శోకంలో మునిగిపోయాను. మరల ఆలోచించుకొని వెదకడం ప్రారంభించాను. అశోక వనం నా కంట పడింది. అక్కడ నేను వెదుకుతుండగా శింశుపా వృక్షం మొదట్లో సీతమ్మ దీనంగా కూర్చుని ఉండడం చూశాను.

తామర రేకులవంటి నేత్ర సౌందర్యంతో పూర్ణ చంద్రుని వంటి ముఖంతోఉన్న జానకి మలిన వస్త్రాదులు కట్టుకొని నిరలంకణతో కూర్చుని ఉంది. ఆమె కన్నులు సంతత ధారగా కన్నీటిని స్రవిస్తున్నాయి. ఆమె క్షణం క్షణం శ్రీరాముణ్ణే స్మరించడం చూచి నేను దుఃఖించాను. ఆమెను రాక్షసస్త్రీలు భయపెడుతూ ఉన్నారు. ఆమె వారి మాటలు వినకుండా తన భర్తనే ధ్యానిస్తూ కూర్చుని ఉంది. అంతలో ఉదయాద్రిలో సూర్యుడు పొడిచే సమయం కావచ్చింది. పక్షుల కిలకిలరావాలు వినిపించాయి. లంకలో వేదఘోష వినిపించింది. రావణుని అంతఃపురం నుండి రావణుడు అతని స్త్రీలు సీత దగ్గరకు రావడం నేను చూశాను.

చెట్టుపైనున్న నేను ఇంకా ఆకులమధ్య కనిపించకుండా దాగి కూర్చుని రావణుని గమనించాను. రావణుడు సీతమ్మ దగ్గరకు వచ్చి ఎన్నో మాయమాటలు చెప్పాడు. ఆ జానకమ్మను ఎన్నో రీతులుగా ప్రలోభపెట్టాలని చూశాడు. ఎన్ని చెప్పినా ఎంతగా ఆశలు కలిగించినా ఆమె ఏ మాత్రం కదలలేదు. పైపెచ్చు వానినే తూలనాడింది. నీకు బుద్ధి లేదు. బుద్ధి చెప్పేవాళ్ళ మాటలు కూడా నీవు చెవికి ఎక్కించుకోవడంలేదు. పర స్త్రీ వ్యామోహం వలన నీవు సర్వనాశనం చెందుతావు అంటూ శపించింది.

ఆమె తిరస్కారాన్ని భరించలేని రావణుడు కోపంతో ఆమెకు రెండు నెలల గడువు ఇచ్చి రాక్షస స్త్రీలను నయానో భయానో ఈమెను నావైపుకు మరల్చండి. నాపై ప్రేమ కలిగేటట్లుగా చేయండి అని ఆజ్ఞాపించి వెళ్ళాడు. రావణుని ఆజ్ఞ ప్రకారం ఆ భయంకరాకారులైన రాక్షసులు సీతను ఎన్నో విధాలుగా భయపెట్టారు. గడువు తీరిన వెంటనే మనస్సు మార్చుకోకపోతే ఉదయాహారంగా తినివేస్తానని రావణుడు చెప్పిన మాటను వారు చెప్పి సీతమ్మను భయపెట్టారు.

'నా భర్త లేని సమయంలో నన్ను అపహరించిన నీ గొప్పదనం ఏపాటిదో నాకు తెలుస్తూనే ఉంది. నా భర్త ఐన శ్రీరాముని ముందు నీవే కాదు ఈ ముల్లోకాలలో ఎవరూ నిలవలేరు. నీవు ఏనాటికీ శ్రీరామునికి సమానుడవు కాదు' అని రావణునికే ఎదురుచెప్పిన సీత వీరి మాటలకు చలించలేదు.

రావణుడు సీతమ్మను ప్రలోభపెట్టినా భయపెట్టినా సీత లొంగకపోవడంతో ఆ రాక్షసుడు కృద్ధుడు అవడం చూసి అతని భార్యలలో ఆయన ప్రియమైన భార్య వచ్చి మనుష్య కాంత ఐన 'ఈ సీతతో నీకు పని ఏముంది? నీవు నీ ఇష్టం వచ్చిన రీతిగా నాతో రమించు' అంటూ రావణుని దూరంగా తీసుకెళ్ళింది. వారు వెళ్లిన తర్వాత రాక్షస స్త్రీలు సీత చుట్టూ చేరి ఆమెను ఎంతగానో బాధించడం మొదలుపెట్టారు.

వికృతాననలైన రాక్షసులను చూస్తూ వారి మాటలు వింటూ సీత భీతహరిణై దుఃఖించింది. నాకు మంచి కాలం రాదేమోనని వ్యాకులతతో విలపించింది. అలా దుఃఖిస్తున్న సీత దగ్గరలోనే త్రిజట అనే రాక్షస స్త్రీ ఉంది. ఆమె పొద్దు పొద్దున్నే నిద్రలేచి మిగతా రాక్షస స్త్రీలను పిలిచి తన కొచ్చిన స్వప్నాన్ని చెప్పింది. స్వప్న ఫలితంగా రావణుడు నాశనం చెందుతాడని చెప్పింది. లంక అంతా సర్వనాశం అవుతుందని వాపోయింది. అప్పుడు మనలను రక్షించే వారు ఎవరూ ఉండరు అని చెప్పింది.

ఈ సీతాదేవి శ్రీరాముని భార్య. వీరిదే విజయం. ఈమె భర్త ఐన శ్రీరాముడే లంకా నాశనం చేస్తాడు. రామలక్ష్మణులు వానరులతో వచ్చి రావణుని సంహరించి వేస్తారు అని చెప్పింది. మీరందరూ ఇప్పుడే ఈసీతను శరణు వేడమని కోరింది. మీరందరూ సీతమ్మ కరుణిస్తుందా? లేదా? అనే అనుమానాలు పెట్టుకోకండి. ఈ మైథిలి నమస్కరించినంత మాత్రాననే ప్రసన్నురాలు అవుతుంది. శరణన్నవారు శత్రువులైనా వారికి అభయం ఇవ్వడంలో శ్రీరాముని మించినవారు ఎవరూ లేరు. మీరు నిరభ్యంతరంగా ఆమెను బ్రతిమాలుకోండి అని హితవు చెప్పింది.

సీతమ్మ త్రిజట మాటలు విని అదే నిజమైతే నేను తప్పక మిమ్ములను రక్షిస్తాను అని చెప్పింది. ఆ దయార్ద్రమూర్తిని చూచి నాకు కన్నీరు ఆగలేదు. ఆమె దగ్గరకు వెళ్ళి ఎలా అయినా మాట్లాడి తీరాలి అనే కోరికను అణచుకోలేక బాగా ఆలోచించి చెట్టుపైనుండి రామకథను గానం చేశాను. రాజర్షి గణ పరంపరను విని సీతమ్మ సంతోషిస్తుందనే నేను ఆమె దగ్గరకు వెళ్లి నా రూపును చూపించి నమస్కరించాను. ఆమె నన్ను చూచి సజలనేత్రి అయ్యింది. నన్ను గురించి వివరాలు చెప్పమని అడిగింది. మనకు శ్రీరామునితో మైత్రి ఎట్లా పొసిగిందో చెప్పమని కోరింది. మన వానరుల గురించి వివరాలు ఇవ్వమంది.

'ఓ పూజ్యురాలా! నేను సుగ్రీవుని భృత్యుడను. నన్ను ఆంజనేయుడంటారు' అంటూ నేను రామ సుగ్రీవుల మైత్రి అంతా చెప్పాను. ఆమె ఆనందిస్తుండగా 'అమ్మా ఇదిగో రామముద్రిక' అంటూ నేను శ్రీరాముని అంగుళీయాన్ని ఇచ్చాను. దాన్ని చూచిన సీతమ్మ సంతోషానికి అవధులు లేకపోయాయి. ఆమె అంగుళీయాన్ని కన్నులకు అద్దుకొని కన్నీరు మున్నీరు అయింది. పాత జ్ఞాపకాల తెరలో మరుగైంది.

'అమ్మా నీవు శ్రీరామునికి ఇచ్చే సందేశం ఏమటమ్మా!' అని అడుగగా ఆమె శ్రీరాముడే వచ్చి రావణుని సంహరించి తీసుకెళ్ళడమే శ్రీరామునికి తగినదని నేను భావిస్తున్నానని చెప్పింది. నేను ఆ తల్లికి సాష్టాంగ దండ ప్రణామాలు చేశాను. అమ్మా నీ ఆనవాలుగా శ్రీరామునికి ఏదైనా ఇవ్వమని ప్రార్థించాను.

ఆ మాటలతో సౌందర్య రాశి ఐన ఆ తల్లి తన దివ్యమైన చూడామణిని నాకు ప్రసాదించి 'ఆంజనేయా! దీన్ని అభిమానిస్తాడు' అని చెప్పింది. ఆమె రక్కసి మూకల మధ్య నలిగిపోతున్నానని నన్ను త్వరగా ఈ బాధలనుండి రక్షించమని వేడుకొన్నట్లుగా శ్రీరామునికి చెప్పమంది.

వానర ప్రముఖా! నేను రెండు నెలలే జీవించగలను. ఆపై నేను నా ప్రాణాలు నిలబెట్టుకోలేని అశక్తురాలిని. అంతలో నీ ప్రభువు నన్ను కాపాడేలా చేయమని నన్ను ఆదేశించింది. నేను విచలిత మనస్సుతో ఆమెకు అంజలి ఘటించి తిరిగి రావాలనుకొన్నాను. సీతమ్మ బాధలు పెట్టే ఈ రాక్షసుల పని పడదామనిపించింది. వెంటనే నా శరీరాన్ని పర్వతకారంలో పెంచి ఆ అశోక వనాన్ని నాశనం చేశాను. దాంతో రాక్షస స్త్రీలు భయపడి రావణునికి నా గురించి నూరిపోశారు. ఆజ్ఞనిస్తే వానరుని పని పడదామని వారు రావణునికి చెప్పారు.

వనధ్వంసవార్తతో కలవరం చెంది రావణుడు తన సేవకులను నామీదకు పంపాడు. పంపినవారిని పంపినట్లుగా నేను యమపురికి పంపేశాను. అలా వెళ్ళిన వారిలో ఎనభై వేలమంది రాక్షసులు, జంబుమాలి మంత్రి పుత్రులు ఏడుగురు సేనాపతులు ఐదుగురు అయ్యారు. వారితో వారి సేన కూడా అంతం అయ్యింది. రావణునికి దాంతో మతి చెడింది. అక్షకుమారుడను రావణుని కొడుకు నన్ను పీచమణస్తానంటూ నాపైకి వచ్చాడు. కానీ ఈ అక్ష కుమారుడు నిజంగా వీరుడే. తన పరివారం నాశనం చెందారని విని బాధతో శౌర్యంతో అక్ష కుమారుడు యుద్ధభేరిని మ్రోగించాడు.

"అక్షకుమారుని కాళ్లు పట్టుకొని గిరగిరా త్రిప్పి నేలకేసి బాదాను. దాంతో అక్షకుమారుడు క్షయం (నాశనం) అయ్యాడు. దాంతో యుద్ధోన్మత్తుడైన రావణుడు తన సమాన బలపరాక్రమాలున్న ఇంద్రజిత్తును నాపై ఉసికొల్పి

పంపాడు. నేను ఇంద్రజిత్తును కూడా నానా బాధలు పెట్టాను. దాంతో అజేయుడనని తెలుసుకొని నన్ను చంపడం కన్నా బంధించడం సులభమని అర్ధం చేసుకున్న మేఘనాధుడు నన్ను బ్రహ్మాస్త్రంతో బంధించాడు.

అతి తెలివిగల రాక్షసులు బ్రహ్మాస్త్ర బంధితుడనైన నన్ను మరల త్రాళ్ళతో కట్టి రావణుని చెంతకు తీసుకెళ్ళారు. రావణుడు నన్ను చూసి నా గురించి వివరాలు చెప్పమని అడిగారు. నేను సుగ్రీవుని సేవకునిగా రామదూతగా నన్ను పరిచయం చేసుకొన్నాను. నీ హితం చెప్పడానికి నన్ను సుగ్రీవుడు పంపించాడని చెప్పాను. శ్రీరాముని ధర్మపత్నిని నీవు అపహరించి పెట్టుకోవడం మంచిది కాదని చెప్పాను.

ఋష్యమూకం పైన రామ సుగ్రీవుల మైత్రీ బంధం వివరించాను. ఒక్క బాణంతో రాముడు నీకు తెలిసిన అమేయ పరాక్రమ శాలిఐన వాలిని కడతేర్చాడని చెప్పాను. ఆయన తలచుకొంటే ముల్లోకాలు తలక్రిందులు చేయగలడని హెచ్చరించాను. చేసిన ప్రతిజ్ఞ ప్రకారం సుగ్రీవుని వానర లోకానికి రాజుగా చేశాడు. శ్రీరాముడు మాట తప్పని సత్పురుషుడని వివరించి చెప్పాను. వీరులైన వానరులు, రామలక్ష్మణులు వారి బలాలను చూపించక ముందే నిద్ర మేల్కొని రాబోయే ఆపదలను నివారించుకోమని చెప్పాను. సుగ్రీవుని సందేశాన్ని వినిపించానని నేను చెప్పగానే రావణుడు ఆగ్రహోదగ్రుడయ్యాడు. వెంటనే నన్ను చంపమని రాక్షసులకు చెప్పాడు. ఆ సభలో కూర్చున్న సత్పురుషుడు రావణుని సోదరుడైన విభీషణుడు దానికి అడ్డుపడ్డాడు. ఎన్నో హిత వచనాలు చెప్పాడు. శాస్త్ర తర్కబద్ధంగా మంచిని ఉపదేశించాడు. దూత వధ మంచిది కాదన్నాడు. కావాలంటే దూతను దండించవచ్చని ఉపాయం చెప్పాడు.

దాంతో కాస్త శాంతించిన రావణుడు నా శక్తి సామర్థ్యాలు తెలుసుకోలేక అజ్ఞానియై నా వాలానికి నిప్పు పెట్టించాడు. వారందరూ నన్ను పిడికెళ్ళతో బాదుతూ నన్ను త్రాళ్ళతో వస్త్రాలతో బంధించారు. నేను పగటి పూట లంకను చూడాలనే కోరికతో ఊరుకొన్నాను. నన్ను వారే లంకానగరం అంతా త్రిప్పటం మొదలుపెట్టారు. చూడండి చూడండి ఈ కోతి పని అంటూ చూడనివారికి కూడా చూపించారు.

నాలో కోపం కట్టలు త్రెంచుకొని ఈ బుద్ధిలేనివారికి బుద్ధి చెప్పాలని తలచాను. వెంటనే ఆకాశం పైకెగిరాను. శరీరాన్ని పెంచి తగ్గించి వారి బంధనాలను తెంచి బయటకు వచ్చాను. నాకు ఒళ్ళు మండి నా వాలాన్ని పెట్టిన నిప్పుతో లంకనంతా కాల్చివేశాను. భవనాలు, కూడళ్లు, ఉద్యానవనాలను అన్నింటిని దహనం చేశాను. లంక అంతా నాశనం అయ్యిందని సంతోషించాను. నేను వచ్చిన పని పూర్తి అయిందనుకొని సముద్రానికి వచ్చి నా తోక నిప్పును చల్లార్చాను. నా ఘనకార్యానికి నేను మురిసిపోతూ లంకవైపు ఒకసారి పరికించి చూశాను. నా మనస్సు నేను చేసిన తప్పును దెప్పి పొడిచింది. నా అజ్ఞానానికి నన్ను నేను తిట్టుకొని చెంపలు వాయించుకొన్నారు. నావలన జానకి కూడా దగ్ధం అయిపోయి ఉంటుందని, ఇక నాకు దుర్గతే అని వాపోయాను.

మరల నాలో జ్ఞానం ఉదయించి అయోనిజ ఐన జానకిని అగ్ని ఎలా నాశనం చేయగలదు అన్న సందేహంతో పరుగున వెళ్లి సీతమ్మను చూశాను. చల్లని మనస్సున్న ఆ తల్లి శ్రీరామ ధ్యానంలో మునిగి ఉండడం చూసి

మురిసిపోయాను. అమ్మా అంటూ నే చేసినదంతా చెప్పాను. క్షమించమని వేడాను. నీకు త్వరలోనే విముక్తి కలిగించే పని చేస్తానని మాట ఇచ్చాను. వైదేహి శుభాశీస్సులు తీసుకొని అరిష్ట పర్వతాన్ని ఎక్కాను. సిద్ధులు చారణులు గంధర్వుల సంచరించే రాజమార్గమైన ఆ గగన వీధులలో సంతోషంతో విహారం చేస్తూ ఆనంద వార్తను చెప్పాలని ఉరకలు వేసే మనస్సుతో సాగరాన్ని ఉత్సాహంతో అధిగమించాను. మధ్యలో మేరుపర్వతాన్ని స్పృశించాను. ఆనందంతో మహేంద్రగిరి చేరాను. నాలోపొంగే ఆనందాన్ని మీతో పంచుకోవాలని మహానాదంతో నేను విజయుడినై వచ్చానన్న వార్తను మీకు ఎరిగించాను. మిమ్మల్ని చూడగానే నాకు పరమానందం వేసింది. నేను చూసింది మీకు తెలియాలనే ఉత్సాహంతో కనుగొంటిని సీతమ్మను అని చెప్పాను. ఇక అంతా మీకు తెలిసిందే. ఇక మనం చేయవలసిన కార్యాన్ని మీరు చెప్పాలి. మేమందరం దానిని ఆచరించాలి" అని హనమంతుడు ఆనందంగా చెప్పాడు. వానరులందరూ కన్నీరు నిండిన కన్నులతో హనుమంతుడు చెప్పినదంతా విన్నారు.

* * *

# సీత దురవస్థ

## సర్గ - 59

ఆంజనేయుడు లంకకు వెళ్లివచ్చిన వృత్తాంతమంతా చెప్పాడు. ఇంకా ఏదో చెప్పాలనే ఆతృత తగ్గిన హనుమంతుడు, "శ్రీరాముని ప్రయత్నం సఫలం అయ్యింది. సుగ్రీవుని కార్యం ఫలించింది. ఇప్పుడు రామ సుగ్రీవుల మైత్రి గట్టిపడుతుంది. సీతాదేవి సౌశీల్యం ఆమెకు భర్తపై అనురాగం నన్ను మంత్రముగ్ధుణ్ణి చేసింది" అని చెప్పాడు.

" వానరులారా! సీతాదేవికి సీతాదేవియే సాటిరాగల వనిత. ఆమె అల్పసంతోషి. ఎవరైనా మంచి మాటలు చెప్పగానే అవి విని ఎంతో సంతోషిస్తుంది. రావణుడు గొప్ప తపోబల సంపన్నుడు తన తపశ్శక్తితో లోకాన్ని కూడా దహింపచేయగలడు. ఈ ఒక్క అకృత్యం తప్ప అన్ని ధర్మకార్యాలే చేస్తాడు. అధర్మాన్ని ఆశ్రయించకపోతే అతడు దేవతా రాజు అయి ఉండేవాడు. సీతమ్మను స్పృశించినా రావణుడు మండిపోకుండా ఉండడానికి కారణం అతని తపస్సే.

సీతాదేవిని తీసుకొచ్చి ఆమెతో కూడ కలిసి మనం రామలక్ష్మణుల దగ్గరకు పోవాలని నాకు అనిపిస్తోంది. ఆ లంకాపురిని రాక్షసులను తుదముట్టించే శక్తి నాకుంది. ఇంకా వీరులైన మీరందరూ దృఢనిశ్చయులై విజయాన్ని కాంక్షిస్తే మీరు నాకు తోడు ఉంటే నాకు ఇక ఎదురే ఉండదు. మనం కష్ట పడినా కాలాతీతం జరిగినా మనం మనకు అప్పగించిన కార్యం మనం చేశాం. ఇక రామసుగ్రీవులదగ్గరకు హాయిగా వెళ్ళవచ్చు. " అని ఆంజనేయుడు చెప్తుతున్నాడు. అసలు ఇంద్రజిత్తు యుద్ధంలో బ్రహ్మ, ఇంద్ర, రౌద్ర, వాయువ్య వారుణాస్త్రాలెన్నింటిని ప్రయోగించినా వానినన్నింటిని నేను వమ్ము చేయగలను. రాక్షసులందరిని మట్టుపెట్టగలను. కాని అనుజ్ఞ నా పరాక్రమానికి అడ్డుగా నిలుస్తోంది అని అన్నాడు.

వానరులందరిలో జాంబవంతుని ఎదుర్కొనే శక్తి దేవతలకు కూడా లేదు. వానరులు గిరులను, వృక్షాలను గిరగిరా త్రిప్పి శత్రువులపైకి వేస్తే వారు దాని క్రింద పడి నుజ్జు అయి తీరాల్సిందే కాని మరోదారి ఉండదు. అంతేగాదు రాక్షసులందరిని వారి చేత ముత్తాతలను సైతం మట్టి కరిపించే శక్తి ఒక్క అంగదునికే ఉంది.

పనసుడు, నలుడు వీరందరూ పర్వతాలనే నుగ్గు చేస్తారు. ఇక వీరికి రాక్షసులు ఒక్క లెక్కలోనివారా? మైందుని ద్వివిదుని గెల్చువారు ఎవ్వరూ లేరు. మైందుడు ద్వివిదుడు అమృతపానం చేసి ఉన్నారు. వానరులందరిలోకి శ్రేష్ఠులు అశ్వినీ దేవతల పుత్రులైన వీరికి బ్రహ్మదేవుని వరం కూడా ఉంది. ఆ వర ప్రభావంతో దేవతలను సైతం నిరోధింపగలరు.

నేను లంకానగరాన్ని ధ్వంసం చేస్తూ రామలక్ష్మణుల సుగ్రీవుల పేర్లను లంకా నగర వీధులో మారుమ్రోగించాను. మన వారందరికీ జయధ్వానాలుచేశాను. నేను శ్రీరాముని బంటునని ఎలుగెత్తి చాటాను.

రావణుని అశోకవనంలో శింశుపావృక్ష ఛాయలో దీనవదనై సీతమ్మ కూర్చుని ఉంది. బలగర్వితుడైన రావణుడు ఆ సీతాసాధ్విని రోదింపచేస్తున్నాడు. ఆమె శ్రీరాముని ఎడబాటుతో శోకతప్తయై ఉంది. దుష్ట రావణుడు ఎంతగా నిర్బంధించినా సీతాసాధ్వి లెక్క చేయడంలేదు. శుభలక్షణసర్వాంగి, కల్యాణి ఐన సీత త్రికరణశుద్ధిగా శ్రీరాముణ్ణే ఆరాధిస్తోంది.

ధూళి ధూసర భరితమైన వస్త్రాన్ని చుట్టుకొని ఉంది. తైల సంస్కారాదులు లేక ఆమె కేశాలన్నీ జడగట్టుకుపోయాయి. వికృతాకారులైన రాక్షస స్త్రీలు ఆమెను చుట్టిముట్టి రావణుని కోసం పట్టి పీడిస్తున్నారు. ఆమె నేలపై కూర్చుని శోక దేవతలాగా విచార వదనంతో ఉంది.ఆమెను చూసిన నాకు దుఃఖం ఆగలేదు. ఇప్పటికిపుడే ఆమెను ఆ శోకం నుంచి విముక్తి చేయాలనిపించింది. కానీ నేను ఆజ్ఞాబద్ధుడ్ని అయినాను కదా! కనీసం సీతమ్మ తల్లికి కాస్త అయినా ఊరటను కలిగించాలని అనుకొన్నాను.

నేను ఆమెకు నమ్మకం కలిగేటట్లుగా మాట్లాడాను. సీత ఆచరించిన పవిత్ర జీవిత విధానం నిరుపమానం. ఆమె కఠోర దీక్షా శక్తే రావణుని మట్టుపెట్టగలదు. శ్రీరాముని చేతిలో రావణుని చావు మూడి ఉంది.

సీతాదేవి కుసుమ కోమలాంగి, శ్రీరాముని ఎడబాటుతో ఆమె మరింతగా కృశించిపోయి ఉంది. దీనావస్థలోనున్న ఆమె గురించి శ్రీరామునికి మనం చెప్పాలి. విషయాన్ని వివరించి ఆయనను తొందరపెట్టి ఆమెను తీసుకొనిరావాలి.

ఆ సీతారాముల సమాగమానికి మనం మన వంతు సహాయాన్ని చేసితీరాలి. ఆ తల్లి రోదన విన్న నాహృదయం తరుక్కుపోయింది. ఇక్కడకు వచ్చి మీతో మాట్లాడుతున్నప్పటికి ఆ సుకుమారవతి వదనం నాకన్నుల ముందే కనిపించి నన్ను విచారానికి గురిచేస్తోంది. దీనికి మనం ఏం చేయాలో ఆలోచించండి అని హనుమంతుడు వారందరికీ చెప్పాడు. ఆమాటలు విన్న కపివరుల మనస్సులు బరువెక్కాయి. అయ్యో ఎంతోమంది ఉన్నా , రాజకుమారులు, వీరులు తన వారై ఉండికూడా జానకమ్మ వేదన చెందుతోంది. అరివీర భయంకరుడైన శ్రీరాముని ధర్మపత్ని అయి కూడా కష్టాల కొలిమిలో కాలిపోతోంది. విధి విచిత్రం కదా ఆ తల్లిని రాముని దగ్గరకు చేర్చడానికి మనం ఏం చేయగలమో అందరం ఆలోచించుదాం అని కపులందరు దీర్ఘాలోచనలో మునిగారు.

* * *

# అంగదుని ఉత్సాహం

## సర్గ - 60

అంగదునిలో ఉత్సాహం పెల్లుబికింది. వానరవీరులారా! సీతమ్మ ఎక్కడ ఉందో తెలుసుకొన్న మనం ఆమెను తీసుకొని శ్రీరాముని దగ్గరకు వెళ్ళడం ఉచితం కదా. ఈ మారుతి సీతమ్మను చూశాడు. రాక్షసులను చంపాడు. లంకను దగ్ధం చేశాడు. కాని సీతమ్మను తీసుకొని రాలేదు.

మన వంటి వీరులు సీతమ్మను తీసుకొని వెళ్ళకుండా ఊరికినే వెళ్లి చేతులు కట్టుకొని సీతమ్మను చూశాం అని చెప్పితే ఏం బాగుంటుంది. అది మన వీరత్వానికి మచ్చగదా?

మనందరం ఆకాశంలో ఎగరడంలో ముందుండేవారు. మనకు ఎదురువచ్చే దేవతలుగాని దైత్యులుగాని ఎవరూ లేరు. అందుకని హాయిగా ఎగురుతూ లంకకు వెళ్ళి వారందరిని నాశనం చేసి సీతమ్మను తీసుకొని వచ్చి చక్కగా హర్షోల్లాసంతో శ్రీరాముని దగ్గరకు వెళ్దాం.

ఎలా అయినా ఈ హనుమంతుడు రాక్షసులను పరిమార్చే ఉన్నాడు కదా! మనలను చూడగానే వారు నోరు మూసుకొని కాలికి బుద్ధి చెప్పి పరుగు లంకించుకొంటారు. మనం ఎంచక్కా సీతమ్మను తీసుకొనిరావడమే తరువాయి అవుతుంది.

ఇంతమాత్రానికి మనం కిష్కింధకు వెళ్లి, వానర ప్రముఖులకు విషయం చెప్పి, రామలక్ష్మణులను తీసుకొచ్చి, లంకకు వెళ్ళి, వారిని హతమార్చి, ఇన్ని ఎందుకు? మనమే సీతమ్మను తీసుకొని వెళ్దాం అని అంగదుడు చెప్తూ ఉత్సాహపడడం జాంబవంతుడు చూశాడు. అంగదుని మాటలకు సంతసించాడు. 'అంగదా!నీ ఆలోచన బానే ఉంది. కాని నీవు చెప్పే మాటలు సముచితంగా లేవు. రామ సుగ్రీవులు సీతను వెదికే బాధ్యత ఒక్కటే మనకు చెప్పారు. ఆమెను ఎలా ఐనా తీసుకొని రమ్మని వారు చెప్పలేదు.

అంతేగాక శ్రీరాముడు మనందరి ముందు శత్రువును సంహరించి తీసుకొని వస్తాను అని వారి వంశంమీద ఒట్టుపెట్టుకొని చెప్పి ఉన్నాడు. మనం జానకిని తీసుకెళ్ళితే ఆయన ప్రతిజ్ఞను భంగం చేసినవాళ్లం అవుతాం కదా! సత్యవంతుడైన శ్రీరాముడు ప్రతిన భంగం కాకూడదు కదా! మనం సీతను తీసుకొని వెళితే ఆయన తృప్తిపడడు. అందువలన మనం అందరం కిష్కింధకు వెళ్ళి సుగ్రీవుని తదితరులను తీసుకొని రామలక్ష్మణుల దగ్గరికు వెళ్ళి ఇంతవరకు జరిగిన విశేషాల్ని చెప్దాం. శ్రీరాముని ఆలోచనను అనుసరించి మనం పని చేయడం యుక్తం కదా. ఒక్కసారి మరలా ఆలోచించి చూడు నీకే అర్థం అవుతుంది. సీతమ్మ జాడలను మాత్రమే చూసి రమ్మని చెప్పారు కదా!' అని జాంబవంతుడు అంగదునికి చెప్పాడు.

* * *

# మధువనంలో కేరింతలు

## సర్గ - 61

జాంబవంతుని సూచన బాగుందని అందరూ తలచారు. ఆంజనేయునితో కలసి అంగదాదులు మహేంద్రగిరిని వీడి పైకి ఎగిరారు. ఆంజనేయునినే చూస్తూ వారు ముందుకు సాగివెళ్ళారు. వారి మనస్సు సీత దర్శనం చేసుకొన్నామన్న సంతోషంతో కేరింతలు వేస్తోంది. వారి హృదయం ఉత్సాహంతో ఏ పని చేయడానికైనా ముందుకు ఉరుకుతోంది.

సుగ్రీవునికి ఉపకారం చేసిన రాముణ్ణి తలచుకొంటూ ఆయనకు మహోపకారం చేయాలనే కోరిక వాళ్ళల్లో ఇనుమడించసాగింది. ఆకాశ మార్గాన వెళ్లుతున్నవారు లతలతో పూవులతో వృక్షాలతో విలసిల్లే మధువనం చేరారు. ఆ మధువనం సుగ్రీవుని రక్షణలో ఉంది. సుగ్రీవుని మేనమామ ఐన దధిముఖుడను వానర ప్రముఖుడు మధువనాన్ని అహర్నిశం కాపాడే వాడు. మధువనం చూసిన వానరులందరూ మధుపానాసక్తులయ్యారు. వారందరూ అంగదుణ్ణి ప్రార్థించారు. అంగదుడు జాంబవంతాది వృద్ధ వానరుల అనుమతి తీసుకొని వానరులందరికి మధుపానం చేయడానికి తన ఆమోదాన్ని తెలిపాడు. వారందరూ అంగదుని ఆమోదంతో హర్షోల్లాసంతో తేనె పట్టులున్న చెట్లపైకెక్కారు.

వారందరూ తమకు దొరికిన పండ్లను, దుంపలను తింటూ మధుపానం చేస్తూ ఆనందంగా వున్నారు. మధుపానం చేసిన వానరులు మేను మరిచారు నృత్యాలు చేశారు; గీతాలు పాడారు; ఆటలు ఆడారు; చెట్ల కొమ్మలపై నుండి క్రిందకు దూకారు; కొమ్మలను పట్టుకొని పైకి క్రిందకు వ్రేలాడారు; ఇంకొందరు పకపకా నవ్వారు; ఇంకొందరు పరుగెత్తారు; గంతులు వేస్తూ ఏవేవో ఆనందంతో అరుస్తున్నారు; ఒకరిపై ఒకరు పడుతూ లేస్తూ ఆటలు ఆడుతున్నారు; ఒకరినొకరు త్రోసుకుంటూ గుద్దుకొంటున్నారు. మధుపానం చేయనివాడు, తృప్తి చెందనివాడు అక్కడ ఎవ్వరూ లేరు. వారందరిని దధిముఖుడు చూశాడు. వనం పాడుచేయడం సహించలేకపోయాడు. కోపంగా వారందరిని వారించాడు. వానరవీరులు అసలే సీతాదర్శన ఉత్సాహంతో ఉన్నారు. పైగా మధుపానం సేవించారు. ఉన్మత్తులు అయ్యారు. అలాంటివారికి వృద్ధుడైన దధిముఖుని మాటలు చెవికెక్కలేదు. అందుకే ఆ వృద్ధుణ్ణి వారు లెక్కచేయలేదు. దధిముఖుడు వారిని అదుపు చేయలేకపోయాడు. పరుషంగా మాట్లాడాడు; అరచేతులతో చరిచాడు; కొట్లాడాడు; ప్రార్థించాడు; అయినా వారిలో ఏ విధమైన మార్పును తీసుకొనిరాలేకపోయాడు. వృద్ధుణ్ణి చుట్టుముట్టారు. మధువు ఎక్కువై ఆయనను భయపెట్టారు. జబ్బ పట్టుకొని ఈడ్చసాగారు. దంతాలతో కొరికారు గోళ్ళతో గీరారు. పాదాలతో తన్నారు. చేతులతో కొట్టారు. ఇలా చేదయం దోషమని కూడా వారికి తట్టలేదు; వానరుల సంతోషం శ్రుతిమించి రాగాన పడింది. అయినా వారిలో ఏ ఒక్కరికి మత్తు వీడలేదు. దధిముఖుడ్ని అతని పరివారాన్ని కూడా పెద్దపెద్దగా అరుస్తూ కేకలు వేస్తూ ఏడిపించసాగారు. వారు బాధపడుతున్నారు అని కూడా చూడకుండా మత్తులో మునిగిన వానరులు గంతులు వేస్తున్నారు. వారిని నిలవరించడం ధదిముఖుని వల్ల కాలేదు.

* * *

# దధిముఖుని ప్రయాణం

## సర్గ - 62

దధిముఖుడు కపుల ప్రవర్తనతో విసిగిపోయాడు. 'వానరులారా! మీరు యధేచ్ఛగా మధువును గ్రోలండి. నేను మీకు అడ్డు వచ్చేవారిని నివారిస్తాను' అని హనుమంతుడు వానరులను ప్రోత్సహించాడు. ఆ మాటలు విన్న అంగదుడు మరింత సంతోషపడుతూ 'ప్రముఖులారా! హనుమంతుని మాటను నేను శిరసావహిస్తాను. అది అకార్యం అయినా చేస్తాను. అందువలన మీరందరూ సంతోషంగా మీ యిష్టం వచ్చినట్లు మధువును సేవించండి'అని చెప్పాడు.

వానరులందరూ హనుమ, అంగదుల మాటలు విని బాగు బాగు అని అరుస్తూ పరుగెత్తారు. వారందరూ సంతోషంతో ఫలాలను తింటూ మధువు త్రాగుతూ ఉరుకులు పరుగులతో ఆడుతున్నారు. శ్రుతి మించి ఒకరితో ఒకరు కొట్టుకొంటున్నారు. తేనెపట్టులు పట్టుకొని విసరుకొంటున్నారు. అతిగా సేవించిన కొందరు చెట్ల బోదెల ప్రక్కన ఆకులు పరచుకొని నిద్రపోతున్నారు. నేలపై మరికొందరు పడుకొన్నారు.

ఇంకొందరు నడవలేక నడుస్తూ తూలుతూ తూగుతూ నడుస్తున్నారు. వికృత చేష్టలు చేస్తూ వెకిలిగా నవ్వుతున్నారు. ఇంకొందరు అల్లరి చిల్లరగా మాట్లాడుతున్నారు. వన రక్షకులందరిని కాళ్ళతో కుమ్ముతూ చేతులతో ఎత్తి పైకి ఎగరేస్తున్నారు. అలా దెబ్బతిని వచ్చిన అనుచరులను దధిముఖుడు ఓదార్చాడు.

భయపడకండి, బాధపడకండి మనందరం కలిసి బలం ఉపయోగించి వీరిని నిగ్రహించుదాం అని చెప్పాడు. వారందరూ కలసి మధువు సేవించే వానరుల దగ్గరకు వెళ్ళాడు. వారందరూ రాళ్ళను కర్రలను పట్టుకొన్నారు. దధిముఖుడు చెట్టును పెకలించి పట్టుకొని అంగదాదులు వున్న చోటుకు వెళ్ళారు. తాళ వృక్షాలు శిలలు పట్టుకొన్న అనుచరులందరూ అంగదాదులను చుట్టుముట్టారు.

వారిని చూసి మత్తులోనున్న అంగదుడు, హనుమంతుడు వారిని ఎదుర్కొన్నారు. అంగదుడు తన తాత అని కూడా చూడకుండా బాహువులతో కొట్టి, కాళ్ళతో కుమ్ముతూ నేలపై పడివేశాడు. అంగదుని చావుదెబ్బలకు దధిముఖుని బాహువులు, ఊరువులు బాగా దెబ్బతిన్నాయి. దేహం రక్తసిక్తం అయ్యింది. ఒక్క క్షణం మూర్ఛిల్లాడు. మళ్లీ లేచి వారిని నిలవరించడానికి బాగా ప్రయత్నించాడు.

వారిని తప్పించుకొని ఒక ఏకాంత ప్రదేశానికి వచ్చాడు. తన అనుచరులతో ధదిముఖుడు " వీరిని ఇలానే ఉండనివ్వండి. మన సుగ్రీవుడు రాముని దగ్గరే ఉన్నాడు. నేను వెళ్లి అంగదుని దోషాలను ప్రభువుకు చెప్తాను. అప్పుడు బలపరాక్రమశాలి ఐన సుగ్రీవుడే ఈ వానరుల సంగతి తేలుస్తాడు అని చెప్పాడు.

ఈ మధువనం సుగ్రీవునకు అత్యంత ఇష్టం . దీనిని మదోన్మత్తులైన వానరులు నాశనం చేస్తున్నారు. నేను చెప్పినా వారు వినిపించుకొనే స్థితిలో లేరు. ఇక నా సహనం ఉడిగిపోయింది. నేను వనాన్ని పాడుచేస్తుంటే చూస్తూ ఊరుకోలేను." అని చెప్తున్నాడు. "వానరులారా!ఈ అంగదునితో కూడిన ఈ కపులు ఈ వనాన్ని ధ్వంసం

చేస్తూ ఎందుకు ఆనందం అనుభవిస్తున్నారో నాకు తెలియడం లేదు. వీరికి హనుమంతుడు, అంగదుడు జాంబవంతాదులు కూడా వంత పాడడం నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఈ మధువనం సుగ్రీవునకు అత్యంత ఇష్టమైంది. తండ్రి తాతల దగ్గరనుంచి ప్రాప్తమైంది. దేవతలు కూడా ఇందులో చొరలేరు. దీన్ని పాడుచేసిన ఎవరినైనా సుగ్రీవుడు దండించక మానడు. ఈ సంగతి అందరకు తెలుసు. ఆవిషయం తెలిసినఉన్న వీరు ఎందుకు ఈ విపరీత చర్యకు పూనుకొంటున్నారో అర్థంకావడం లేదు. దీనివెనుక ఏదో మహత్తర సంగతి ఉండి ఉంటుంది. దాన్ని సుగ్రీవుణ్ణే అడిగి తెలుసుకొందాం. నా సంరక్షణలో ఉన్న వనాన్ని పాడుచేయడం నేను సహించలేకున్నాను. వీరికి తప్పక దండన విధించవలసిందే. రాజాజ్ఞను తిరస్కరించిన ఈ దురాత్ములు తగిన దండన అనుభవిస్తే కాని మన కోపం చల్లారదు. వెంటనే వెళ్దాం" అంటూ దధిముఖుడు అనుచరులతో కలసి ఆకాశ మార్గాన ఎగురుతూ ఒక్క క్షణంలో సూర్య పుత్రుని దగ్గరకువెళ్లారు.

మహావీరుడు తన అనుచరులతో కూడి ఆకాశం నుండి దిగిరావడం సుగ్రీవాదులు చూశారు. వారికి ఏదో తెలియని ఆనందం వేసింది. అంతలో దధిముఖుడు వారి దగ్గరకు వచ్చి నమస్కరించాడు.

* * *

# కార్య సాఫల్యతను గుర్తించిన సుగ్రీవుడు

## సర్గ - 63

దధిముఖుడు విషణ్ణవదనుడై నమస్కారం చేస్తున్నాడు. ఆయనను చూచి సుగ్రీవుడు ఆందోళన చెంది "దధిముఖా! నీకు అభయం ఇస్తున్నాను. ఎందుకీ విచారం? నాకు ఉన్నది ఉన్నట్లుగా చెప్పు, బాధపడకు" అని చెప్పాడు. 'మధువనం జాగ్రత్తగానే ఉందికదా! మీరెందుకు తత్తరపడుతున్నారు?' అని మరలా దధిముఖుని అనునయిస్తూ సుగ్రీవుడు అడిగాడు.

'రాజా! మీ తాతల దగ్గరనుంచి సంక్రమించిన ఆ మధువనం దగ్గరకు నేటివరకూ ఎవరూ రాలేదు. కన్నెత్తి చూచినవారు కూడా లేరు. కాని ఈనాడే దాని ధ్వంసం జరిగింది. కాని మన తోడి వారలే మధువనంలో ప్రవేశించి ఆనంద చిత్తంతో ఫలాదులు భక్షిస్తూ మధువును సేవిస్తున్నారు. వారిని ఎంతగా అడ్డుకొన్నా మత్తులోనున్నవారు మమ్ములను ఎదిరిస్తున్నారు.

మధువును తాగినంత తాగి మరలా పారబోస్తున్నారు. అది చూడలేక మేము వారిని నివారించబోతే మమ్ములను చావగొట్టి తరిమివేశారు. రక్షకులలో కొంతమందిని బాగా కొట్టి చావు వచ్చేటట్లుగా చేస్తున్నారు. మీరు రాజుగా ఉన్నప్పుడే ఈ వానరులు మధువనాన్ని పూర్తిగా ధ్వంసం చేశారు' అని చెప్తున్న దధిముఖుని మాటలను శత్రుభయంకరుడైన లక్ష్మణుడు విన్నాడు. ' సుగ్రీవా! దధిముఖుడు ఎందుకు విచార వదనంతో ఉన్నారు? ఎవరీ అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఎందుకు మీకు వీరు మొరపెట్టుకొంటున్నారు' అని అడిగాడు.

సుగ్రీవుడు 'లక్ష్మణా! అంగదాది వానర ప్రముఖులు ఫలాదులను భక్షించి మధువులు తాగుతూ మధువనాన్ని విశృంఖలంగా నాశనం చేస్తున్నారని ఈ దధిముఖుడు చెప్తున్నారు. దక్షిణదిశకు వెళ్ళిన వానరులు కార్యాన్ని సాధించుకొని వచ్చి ఉంటారు. కార్యాన్ని సాధించిన వారు ఈ పనులు చేస్తుంటారు. వనపాలకుడైన దధిముఖుని సైతం అంగదుడు మోకాళ్లతో కుమ్మి బాధపెట్టాడట. ఈ ప్రముఖుని కూడా లెక్క చేయని వానరులు సీతమ్మను చూసి ఉండి ఉంటారు. అందుకు సందేహం లేదు. ఆ చూచినవాడు కూడా హనుమంతుడే అయి ఉంటాడు. అందువలనే వారి ఉత్సాహం మితిమీరి నర్తిస్తోంది.

కార్యసాధనకౌశలం, ప్రజ్ఞ, ప్రయత్న సామర్థ్యం ఇవన్నీ ఒక్క హనుమంతునికే ఉన్నాయి. ఆ ఆంజనేయుడే సీతమ్మను చూసి వచ్చి ఉంటాడు. జాంబవంతాది ప్రముఖుల నాయకత్వంలో ఆంజనేయుని పర్యవేక్షణంలో కార్యం తప్పక సఫలం అయి తీరుతుంది.

సీతాదేవి అన్వేషణ ఫలవంతం అయి ఉంటుంది. అందుకే కన్నెత్తి చూడడానికి కూడా శక్యంకాని మధువనంలో కపివరులు వీరంగం సృష్టిస్తున్నారు. ఈ దధిముఖుడు మధువనభంగ నెపంతో ఈ శుభవార్తను తెల్పడానికి ఇక్కడకు వచ్చాడు. ఓ లక్ష్మణా! నా మాట నిజం. సీతాదేవి కనబడిందని నేను అనుకోవడం ముమ్మాటికి సత్యం అయి ఉంటుంది. అంగదాది వానరులు మధువనధ్వంసమే దీనికి ప్రబల నిదర్శనం. ఓ మహాపురుషా! ఋక్షరజునకు బ్రహ్మదేవుడిచ్చిన ఈ వనాన్ని ధ్వంసం చేయడానికి హనుమాదులు పూనుకోరు.'

అలా చెప్పే సుగ్రీవుని మధుర వాక్కులు విని రామలక్ష్మణులు పరమానంద భరితులు అయ్యారు. 'మామా! వారు కార్యాన్ని సాధించి వచ్చారు. వారి ఈ దుశ్చర్య ఆనందమే కల్గిస్తోంది. ఈ శుభవార్తను తెచ్చిన మీపై కూడా నాకు సంతోషం కలుగుతోంది. మీరు వెంటనే వెళ్లి హనుమదాదులను శీఘ్రంగా ఇక్కడికి రమ్మని చెప్పుము.

దధిముఖా!మీరు ప్రసన్నులై వారిని క్షమించు. వారు సాధించిన కార్యం మహోన్నతమైంది. అందుకే వారిని ఏమీ అనకుండా వెంటనే మా దగ్గరకు పంపించండి. వారినందరిని చూడాలని నాకు మనస్సు ఉవ్విళ్లూరుతోంది. వారి సీతాన్వేషణకు వారి కార్యసఫలతను వారి నోట వినాలని నా మనసు వేగిరపడుతోంది. ఇన్నాళ్ళకు నేను ఇచ్చిన మాటను నెరవేర్చుకుని హనుమదాదులు వస్తున్నారని నాలో అమితమైన సంతోషం వేస్తోంది. మనందరం శ్రీరాముని ఆనందాన్ని త్వరలో చూడబోతున్నామన్న మాట. ఇక దక్షిణదిక్కు నుంచి వచ్చిన వానరులను మీరు ఏమి అనకండి. వారికి సంతోషం కలిగేటట్టుగా మీరు ప్రవర్తించండి. వారు ఆనందంలో చిలిపి పనులను చేస్తున్నట్లు నాకు అనిపిస్తోంది. " అని సుగ్రీవుడు అన్నాడు.

కార్యం సఫలం అయ్యిందన్న వార్త విని శ్రీరాముని ముఖం విచ్చిన తామర పూవులాగా కనిపించింది. పూర్తిగా విచ్చుకొన్న మందారంలాగా లక్ష్మణుని ముఖం విప్పారింది. వారిద్దరిని చూచి సుగ్రీవుడు చాలా సంతోషించాడు. శరీరమంతా పులకించిపోయింది. ఇక కార్యం సిద్ధించింది అని సుగ్రీవాదులు ఎంతో ఆనందించారు.

* * *

# సీతా సందర్శన వార్తను తెలపటం

## సర్గ - 64

వానరుడైన దధిముఖుడు సుగ్రీవుని అనుజ్ఞ పొంది రామలక్ష్మణులకు సుగ్రీవునికి అభివాదం చేసి తిరిగి ఆకాశ మార్గంలో పయనించి మధువనానికి చేరాడు. అప్పటికి వానరుల మత్తు దిగిపోయి ఉంది. వారందరిని దధిముఖుడు సంతోషంగా చూస్తూ అంగదుని దగ్గరకు వచ్చాడు. ' ఓ బలశాలీ! మీరందరూ చాలా దూరం నుంచి వచ్చారు. అలసిపోయి ఉన్నారు. ఫలాలు మధువులు అన్నీ మీరు మీ ఇష్టం వచ్చినట్లుగా వీటిని ఆరగించండి' అని చెప్పాడు.

మా మూర్ఖత్వంవలన ఇంతకుముందు తప్పుచేసి మిమ్ములను నిరోధించాము. యువరాజులైన మీరే మమ్ములను క్షమించండి. మీ తండ్రిలానే మీరు కూడా మాకందరికి ప్రభువులు.

' అంగదా! నేను ఇప్పుడే సుగ్రీవుని చెంతకు వెళ్ళి మీరందరూ ఇక్కడకు వచ్చి ఉన్నారన్న వార్త తెలిపాను. వారందరూ మీరు తిరిగి వచ్చినందుకు ఎంతో సంతోషిస్తున్నారు. మీరు మధువనం ధ్వంసం చేశారనీ చెప్పాను. మీ పినతండ్రికి కోపం మచ్చుకు కూడా రాలేదు. పైగా ఎంతో సంతోషించాడు. మిమ్ములందరిని త్వరగా పంపించమని నాతో చెప్పాడు' అని దధిముఖుడు చెప్పాడు. అంగదుని ముఖం ధదిముఖుడు చెప్పిన విషయం విని ఆనందించింది.

దధిముఖుని మాటలు విని అంగదుడు తన సహచరులతో ' ఓ వానర యోధులారా! దధిముఖుని మాటలు సుగ్రీవునితోపాటుగా రాముడు కూడా విని ఉంటారు. ఓ వీరులారా! ఇక మనం ఒక్క క్షణం కూడా వృధా చేయకుండా రామాదుల దగ్గరకు వెళ్దాం. ఈ దధిముఖుడు చెప్పే మాటలను బట్టి సుగ్రీవాదులు శుభవార్తను త్వరగా వినాలనే తలంపుతో ఉన్నట్లున్నారు. కార్యసిద్ధిని పొందిన మనం కాల విలంబనం చేయడం మంచిది కాదు' అని అంగదుడు చెప్పాడు.

'వానరులారా! నేను మిమ్ము ఆజ్ఞాపించే వాణ్ణి కాదు. మీరు కార్యాన్ని సాధించారు. మీరందరూ ఎలా చెప్పితే అలా నడుచుకొంటాను' అని చెప్పే అంగదుని మాటలు విని వానరులలో సంతోషం కలిగింది.

వారందరూ ' అంగదా! మీరు యువరాజులై ఉండి కూడా ఇంత నమ్రతతో మాట్లాడుతున్నారు. ఎవరైనా కాస్త పదవి రాగానే కన్ను మిన్ను కానరు. సర్వాధికారివి అయి ఉండి కూడా మీరు మేము చెప్పినట్లు నడుచుకొంటాననడం మీకే తగినది. ఇది మీకు భవిష్యత్తులో శుభాలను చేకూర్చగలదు. మేమందరం మీ కింకరులం. మీ మాట ప్రకారం నడుచుకొనేవాళ్లం. మీ మాటను ఆవగింజంతైనా జవదాటము.' అని వానరులందరూ సంతోషంతో, ముక్తకంఠంతో చెప్పారు.

సరే మనమందరం కలిసి సుగ్రీవుని దగ్గరకు వెళ్దాం అనుకొన్నారు. వెంటనే మహాబలశాలులందరూ ఒక్కుమ్మడిగా ఆకాశానికి ఎగిరారు. వారందరూ మహానాదం చేస్తూ పైకి ఎగిరి ముందుకు సాగారు. అప్పుడు చూచేవారికి కదులుతున్న పర్వతంలాగా వారు కనిపించారు. అంగదాదులు రావడం చూసి సుగ్రీవుడు ' రామా!

ఊరడిల్లుము. సీతాదేవిని వీరు చూచి వచ్చి ఉంటారు. ఇక మనందరికి ఆనందం తప్పక కలుగుతుంది. మీ దుఃఖం దూరమయ్యే రోజులు చాలాదగ్గరకు వచ్చాయి" అని రాముణ్ణి ఊరడించాడు.

ఒకవేళ వీరు ఆ అమ్మను చూడనట్లయితే గడువు మీరిన తర్వాత వారెవరు నా ముందు రావడానికి ఉద్యమించరు. కాన వీరి ఉత్సాహాన్ని చూసి చెప్తున్నాను. మీదు మిక్కిలి కార్యం సఫలం కాకపోయి ఉంటే అంగదుడు నా ముందుకు ఎట్టి పరిస్థితులలోను రాడు.

కార్యం నెరవేర్చకపోయి ఉంటే అంగదుని ముఖం దీనంగా ఉండేది. దీనవదనుడైన అంగదుడు వానరుల మధువన ప్రవేశానికి అనుమతిని ఇచ్చి ఉండడు. అంగదుడు బాధ్యత ఉన్న యువరాజు తప్పకుండా సీతాదేవి జాడ తెలిసింది. ఓ రామా! మీ బాధ నేటితో తీరిపోయింది.

ఓ ప్రజ్ఞాశాలీ! మీ కార్యం సాధించుకొచ్చినవాడే హనుమంతుడే. ఇందులో ఎట్టి సందేహం లేదు. హనుమంతుని కార్యదక్షత నాకు బాగా తెలుసు. ఓ రామా! మీరు దుఃఖించడం మానివేయండి. కష్టాలు కడలిని చేరుకొన్నాయి. హనుమంతుడు అసమాన ప్రజ్ఞావంతుడు. ఆయన వెళ్ళిన చోట విజయవంతమే అవుతుంది. కార్యం సఫలం చేసేదాకా నిద్రపోనివాడు ఈ ఆంజనేయుడు. అంతా శుభమే జరుగుతుంది. మీకు, మాకు మంచిరోజులు రాబోతున్నాయి. నేను చెప్పేదంతా నిజమే అయి ఉంటుంది. ఇది నా ఊహ మాత్రమే కాదు ఇది నా పరమ విశ్వాసం.

సుగ్రీవుని దగ్గరకు వచ్చే వానరులందరూ తమ సంతోష చిహ్నంగా తోకలను ఎత్తి కిచకిచలాడుతున్నారు. పెద్ద పెద్దగా అరుస్తున్నారు. హనుమంతుడు, అంగదుడు మహానాదం చేస్తూ వస్తున్నారు. ఇదంతా విజయసంకేతం లాగా నాకు అనిపిస్తోంది. అంగదుడు హనుమంతుడు ముందుగా ఉండి మిగతా వానరులందరూ గుమికూడి వస్తున్నారు. ఇలా రావడంలోనే వారి విజయం తెలుస్తోంది. మీరు లక్ష్మణుడు ఇక విచారించాల్సిన అవసరం లేదు.' అలా చెప్తుండగానే వానరులందరూ ఆకాశమార్గం నుండి నేలను తాకారు.

వారిని చూడగానే సుగ్రీవాదులకు, రామలక్ష్మణులకు కన్నులలో కన్నీరు నిండింది. లక్ష్మణుని హృదయస్పందన వేగవంతమైంది. సీతమ్మ జాడతెలుసుకోవాలని రామాదులు వేగిరపడుతూ దక్షిణదిశనుంచి వస్తున్న వానరులను ఆసక్తిగా చూస్తున్నారు.

రామలక్ష్మణ సుగ్రీవులున్న ప్రదేశానికి వానరులందరూ చేరారు. హనుమంతుడు రాముని చూసి ***"శ్రీరామ చంద్రమూర్తీ! సీతాదేవిని చూశాను. ఆమె క్షేమంగా ఉంది. పొడగంటిని సీతమ్మను "*** అని పెద్దగా చెప్పి సాష్టాంగ నమస్కారం చేశాడు.

ఆ అమృత వాక్యాలు విని శ్రీరాముడు లక్ష్మణుడు పరమానందభరితులు అయ్యారు. సుగ్రీవుని విశ్వాసాన్ని లక్ష్మణుడు కళ్ళతోనే అభినందించాడు. శ్రీరాముడు మహదానందంతో హనుమంతుని చూశాడు. హనుమంతుని ఆనందానికి అడ్డు లేకుండా పోయింది.

* * *

# శ్రీరామునకు సీతావృత్తాంతాన్ని చెప్పటం

## సర్గ - 65

### సీతాదేవి సమాచారం

వానరులందరూ రామలక్ష్మణులకు, సుగ్రీవునకు సాష్టాంగ ప్రణామాలు చేశారు. సీతాదేవిని గూర్చి చెప్పడం ప్రారంభించారు. రావణాంతఃపురంలో సీత ఉండటం, రాక్షస స్త్రీలు ఆమెను భయపెట్టడం, రావణుడు రెండు నెలలు గడువు ఇవ్వటం, అన్ని విషయాలు చెప్తూతూ ఉన్నారు. వారి మాటలు విని శ్రీరాముడు" ఓ వానరులారా! సీతాదేవి ఎక్కడ ఉంది? నా విషయంలో ఆమె అభిప్రాయం ఏమిటి? ఆమెకు సంబంధించిన విషయాలన్నీ తెలపండి" అని అడిగాడు. రాముని మాటలు విని హనుమంతుని చెప్పమని వానరులందరూ ప్రోత్సహించారు. అప్పుడు దక్షిణ దిక్కుకు తిరిగి మారుతి నమస్కరించాడు. ***"శ్రీరామా! పొడగంటినయ్యా సీతమ్మను.*** ఇదిగో ఆమె ఆనవాలు" అంటూ సీతాదేవి చూడామణిని శ్రీరామునకు ఇచ్చాడు. అంజలి ఘటించాడు. 'శ్రీరామా నేను నూరు యోజనాల పొడవున్న సముద్రాన్ని దాటి సీతను వెదుకుతూ లంకలో ప్రవేశించాను.

రామా!దక్షిణ సముద్రానికి దక్షిణ తీరం దగ్గర ఉన్న రావణుని లంకలోని అశోకవనంలో శింశుపా వృక్ష మూలంలో సీతాదేవి కూర్చుని ఉండటం నేను చూశాను. ఆమె ఆశలన్నీ మీ మీదే పెట్టుకొని జీవిస్తోంది. ఆమెను వికృత రూపాలున్న రాక్షస స్త్రీలు చుట్టుముట్టి బాధిస్తున్నారు. దీనురాలై సీత ప్రతిక్షణం మీకై పరితపిస్తోంది. ఆమె మంచు దెబ్బకు వాడిన పద్మలత లాగున్నది. వైదేహి రావణుని ఏవగించుకొంటూ తనువును త్యజించాలను కొంటున్నది. శ్రీరామా! మీపైనే మనస్సు నిలిపిన సీతను నేను చాలా కష్టపడి వెదికాను. మీ గుణ గానాన్ని ఆలపించి ఆమెకు నాపై నమ్మకాన్ని కలిగించాను. మీ కథా గానంతో సంతసించిన సీత నాపై విశ్వాసాన్ని పెట్టుకొని నాతో సంభాషించింది. నేను సీతమ్మ తల్లికి మీ విషయాలన్నీ చెప్పాను. ఆమె మీరిద్దరి మైత్రి గురించి విని ఆనందించింది. సీతమ్మకు మీపై భక్తి ప్రపత్తులు మెండుగా ఉన్నాయి. శ్రీరామా! ఆమె మీ కోసం తపస్సే చేస్తోంది. మీరు తనను గుర్తించడానికి వీలుగా చిత్రకూట పర్వతంపై జరిగిన వాయస గాథను నాకు తెలిపింది. 'ఓ మారుతీ! నీవు చూచినదంతా ఉన్నది ఉన్నట్లుగా శ్రీరామునికి తెలుపు అని చెప్పింది. నేను జాతి రత్న శోభలను వెదజల్లే చూడామణిని భద్రంగా దాచాను. ఓ రోజు రాముడు మణిశిలల గంధంను నా చెక్కిలిపై తిలకంగా తీర్చిదిద్దారు. ఈ విషయం కూడా రామునికి గుర్తుచేయి' అని సీతమ్మ నాతో చెప్పింది. 'శ్రీరామచంద్రా! సీతమ్మ రావణుని గడువు ముగియగానే క్షణమైన ప్రాణాలను నిలుపుకోజాలనని చెప్పారు. త్వరగా తన దగ్గరకు వచ్చి రావణవధ చేసి తనను కాపాడమని మరీ మరీ వేడుకొంది. రామా! ఇక మీరు సాగరాన్ని దాటే ఉపాయం చెప్పాలి. మీరు త్వరపడి సీతమ్మ కష్టాలను దూరం చేయడానికి పూనుకోవాలి. రామా! మీ పైనే ప్రాణాలు నిలుపుకున్న ఆ

అమాయక స్త్రీ రత్నాన్ని కాపాడాల్సిన బాధ్యత మీ పై ఉంది. మేమందరం మీ కింకరులుగా ఉండి మీకు తోడుగా ఉంటాము. మీరు చెప్పే పనిని త్వరత్వరగా చేయడానికి నా మనస్సు ఉబలాటపడుతోంది" అని ఆంజనేయుడు రామునితో చెప్పాడు. ఇలా హనుమంతుడు సీతాదేవిని గూర్చి శ్రీరామునికి చెప్పి ఆయనకు మనస్సంతోషం కూర్చాడు. సీతాదేవి సందేశాన్నంతా చెప్పాడు.

* * *

# శ్రీరామచంద్రుని పరితాపం

## సర్గ - 66

**చూ**డామణిని చూసిన రాముని కనుకొలుకులలో నీళ్లు నిండాయి. ఆయన చూడామణిని హృదయానికి హత్తుకొని 'హా సీతా!' అంటూ బిగ్గరగా ఏడ్చాడు. కన్నుల నీరు కారిపోతూ ఉండటం సోదరుడైన సౌమిత్రి చూడలేకపోయాడు. సౌమిత్రికీ నేత్రాలు జలపూరితాలయ్యాయి. రాముడు కనుల నీరు ఉబికి వస్తుండగానే "సుగ్రీవా! ఈ చూడామణి చూస్తుంటే నా మనస్సు ద్రవించిపోతోంది. నా వివాహ సమయంలో జనకుడు నా ప్రియసఖి జానకికి కానుకగా దీన్ని ఇచ్చాడు. జనకుడు చేసే యజ్ఞాలతో తృప్తి పొందిన దేవేంద్రుడు జనకునికి జలం నుండి పుట్టిన ఈ మణిని ఇచ్చాడట.

దీనిని చూచిన వెంటనే నా తండ్రి దశరథుడు నా మామగారైన జనకుడు జ్ఞప్తికి వచ్చారు. ఈ మణి ఎప్పుడూ జానకి తలమీద ఉండి శోభలీనుతుండేది. ఈ చూడామణిని చూస్తున్న కొలదీ నన్ను పాతసంగతులు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నేడు దీన్ని చూస్తూ సీతాదేవిని పొందినంత సంతోషాన్ని పొందుతున్నాను. ఓ ఆంజనేయా! సీతాదేవి మాటలను మరలా నాకు చెప్పు. దప్పికగొన్నవాడికి నీరు దొరికినట్లుగా నేను సీత మాటలతో ఓదార్పు పొందగలను" అని హనుమంతుని ఇంకా ఇంకా సీత ఏమేమి మాట్లాడిందో చెప్పమని రాముడు అడిగి అడిగి చెప్పించుకొన్నాడు.

అంతలో రాముడు విచారిస్తున్న తన సోదరుని చూశాడు. ఆయనలో దుఃఖం ద్విగుణీకృతం అయింది. వెంటనే లక్ష్మణా! వైదేహి లేకుండా ఈ మణిని చూస్తే నాలో దుఃఖం పెల్లుబుకుతోంది. ఒక్క మాసం రోజులలో ఆమెను మనం దక్కించుకొంటే ఆమె ఎప్పటికీ జీవించియే ఉంటుంది. లేకుంటే సీత!' అంటూ గొల్లున రాముడేడ్చాడు. లక్ష్మణుడు అన్నను చేతితో నెమురుతూ తలపై రాస్తూ ఓదార్చాడు. చల్లని చూపులున్న జానకి లేకుండా నేను క్షణమైనా జీవించలేను. ఆమె ఉనికిని తెలుసుకొన్న నేను క్షణమైనా నిలవ లేకుండా ఉన్నాను. నన్ను ఎలా

అయినా సీత దగ్గరకు చేర్చు. లక్ష్మణా! సీతకు భయం ఎక్కువ. ఆ ఘోర రాక్షసుల మధ్య నా సీత ఎన్ని బాధలు అనుభవిస్తోందో గదా!' అన్నాడు. హనుమా! 'రోగికి ఔషధ సేవనం వలన స్వస్థుడు ఐనట్లుగా విరహాగ్నిలో దహించుకుపోయే నన్ను సీత గురించి కమ్మని మాటలు చెప్పి నన్ను స్వస్థుడిని చేయి. నా భార్య మధుర స్వభావం గలది. ఆమె నా వియోగాన్ని ఎలా భరిస్తోంది? జానకి ఎలా జీవిస్తోందో? నాకు చెప్పు" అని శ్రీరాముడు హనుమంతుని అడిగాడు.

* * *

# హనుమంతుడు రామచంద్రుని కోర్కెను తీర్చటం

## సర్గ - 67

శ్రీరాముడు మరల మరలా సీతాదేవి వృత్తాంతం చెప్పమని కోరగా హనుమంతుడు ఆయన కోర్కెను తీర్చాలనుకొన్నాడు. "ఓ పురుషోత్తమా! ఇదివరలో చిత్రకూటాన జరిగిన కాకి వృత్తాంతమంతా నాకు వినిపించింది. మీరిద్దరూ వన విహారం చేసి అలసి ఒక చెట్టు క్రింద విశ్రమించి ఉండగా ఈ వృత్తాంతం జరిగిందని సీతమ్మ నాకు చెప్పింది.

మీరు సీత ఒడిలో నిద్రిస్తుండగా ఒక కాకి సీత దగ్గరకు వచ్చి ఆమె స్తనాల మధ్య గీరిందట. ఆమె మట్టి పెళ్ళలతో దానిని దూరంగా తరిమేసినా ఆ కాకి మరల మరలా వచ్చి ఆమె పాలిండ్లమధ్య భాగాన్ని గాయపరుస్తూనే ఉందట. ఆ బాధ భరించలేక గాఢనిద్రలోనున్న మిమ్ము సీతమ్మ తల్లి లేపిందట. మీరు నిద్ర లేచి రక్తసిక్తమైన సీత వక్షస్థలాన్ని చూసి కోపం తెచ్చుకొన్నారట. 'ఓ సీతా! నిన్ను గాయపర్చింది ఎవరు?' అంటూ మీరు ఆమెను అడిగి మీ ఎదురుగా ఉన్న కాకిని చూసి కోపోద్రిక్తులై దర్భను అభిమంత్రించి బ్రహ్మాస్త్రంగా వేశారట.

ఆ బ్రహ్మాస్త్రం ఆ కాకిని ముల్లోకాలను తరిమిందట. అది చివరకు మిమ్మే శరణుకోరి బ్రహ్మాస్త్రానికి తన కుడి కన్నును బలి ఇచ్చిందట. ఇలాంటి మీ అప్రమేయ బల పరాక్రమాలకు మేరలేదని సీతాదేవి చెప్పింది.

మరల ఆమె 'హనుమంతా! ఉత్తమోత్తముడైన శ్రీరాముడు అన్ని విద్యలలో ఆరితేరినవాడు. అలాంటి పురుషపుంగవుడు నాపై ఎందుకు నిర్దయగా ఉన్నాడు? దేవదానవయక్షగంధర్వాదులలో శ్రీరామునకు ఎదురు నిలిచే వారు ఎవరూ లేరు. అలాంటి పురుషోత్తముడు నన్ను ఎందుకు కనికరించడంలేదు? అన్న అనుజ్ఞతో లక్ష్మణుడు నన్ను రక్షించాలని ఎందుకు అనుకోవడంలేదు? మానవోత్తములైన వారిరువురు దేవేంద్రునికి సమానులే. వారికి వారే సాటి. నావలన ఏదైనా దోషం వాటిల్లిందేమో! అందుకే వారు నాపై ఉపేక్ష భావంతో ఉన్నారు ఇదంతా నేను పూర్వ జన్మలో చేసుకొన్న పాపఫలితమై ఉంటుంది" అని జానకి కంట తడి పెట్టుకొంది.

శ్రీరామచంద్రా! నేను అపుడు ఆ తల్లిని చూస్తూ ఊరుకోలేకపోయాను. అప్పుడు నేను ఆ తల్లిని 'అమ్మా! మీరు అలా తలచవద్దు. మీ విరహ వేదనలో శ్రీరాముడు అన్నింటిని త్యజించాడు. ఏమీ తోచని స్థితిలో కూర్చుని ఉన్నాడు. శ్రీరాముని దుఃఖాన్ని చూసి లక్ష్మణుడు ఆవేదన చెందుతున్నాడు. మిమ్ము ఎలా చేరాలో తెలియక వారిద్దరూ శోక సముద్రంలో మునిగి ఉన్నారు. మీరు కంటతడి పెట్టాల్సిన తరుణం ఇది కాదు. అమ్మా! రామాదులు సుగ్రీవునితో స్నేహం చేశారు.

వానరులందరూ మిమ్ము వెదికే ప్రయత్నంలో ఉన్నారు. ఇప్పుడు నేను మిమ్ము కనుగొన్నాను. ఇక మీ దుఃఖాలు దూరం అయ్యాయని భావించు తల్లి. అమ్మా! త్వరలో రామలక్ష్మణులు ఇక్కడకు వస్తారు. శ్రీరాముడు రావణుని సపరివారంగా సంహరించి మిమ్ము గైకొని అయోధ్యాపురికి వెళ్తారు'. అని నేను ధైర్యం చెప్పాను.

'ఓ పూజ్యురాలా! మీరేదైనా ఆనవాలు శ్రీరామునికి గుర్తుగా ఇవ్వండి అని నేను అడిగాను. అప్పుడు ఆ తల్లి నాకు చూడామణిని ప్రసాదించింది. నేను తిరిగి రావాలని అనుకొని నా శరీరాన్ని పెంచాను. ఆమె నేను వచ్చేస్తున్నానని దిగులు చెందింది. 'ఓ కపివరా! రాజీవలోచనుడైన రాముణ్ణి బంగారు మేనిఛాయ ఉన్న లక్ష్మణుని చూసే భాగ్యం నీకు దక్కింది. నీవు పుణ్యాత్ముడవు.

కమలలోచనుడైన ఆ మహానుభావుని చూసే భాగ్యం నాకు దక్కుతుందో లేదో అని పరితపిస్తున్నాను. నేను దురదృష్టవంతురాలిని' అని విలపించింది. ఆమె బాధ చూడలేక నేను 'అమ్మా! మీరు నా వీపును అధిరోహించుము. నేను ఇప్పుడేమిమ్ములను శ్రీరాముని దగ్గరకు చేర్చుతాను' అని చెప్పాను.

అప్పుడు ఆ తల్లి 'వానరోత్తమా! అది ధర్మం కాదు. కాలం అనుకూలించక నేను రావణుని చెరలో ఉన్నాను. నిస్సహాయురాలినై ఉన్నాను. ఇప్పుడు నేను ఏమీ చేయజాలను అని చెప్పింది. మరల జానకిదేవి ఓ కపివరా! నీవు త్వరగా వెళ్లి ఈ విషయాలను వారితో చెప్పు. సింహ పరాక్రమవంతులైన రామలక్ష్మణుల కుశలాన్ని, సుగ్రీవాదుల క్షేమాన్ని నేను అడిగానని చెప్పు. మహాబాహుడైన శ్రీరాముణ్ణి నన్ను ఈ కష్టాల సంద్రంనుండి గట్టెక్కించమని నా ప్రార్థనగా నీవు చెప్పు. నేను మీ రాకకోసం వేయి కన్నులతో ఎదురుచూస్తున్నానని నా మాటగా చెప్పు' అని సీతాదేవి మీకు సందేశాన్ని ఇచ్చింది" అని హనుమంతుడు శ్రీరాముడితో మరలా చెప్పాడు.

* * *

# సీత సందేహాలను నివృత్తి చేసిన విధానం

## సర్గ - 68

**సీ**తాదేవి గురించి వినాలనుకొనే రామునకు లంకలో సీతమ్మను చూచిన హనుమంతుడు అక్కడి వివరాలను పూసగుచ్చినట్లుగా మరల మరల చెప్పి రఘుకుల రాముని హృదయావేదనను కరిగిస్తున్నాడు. చెప్పిందే చెప్పించుకుని

కోసలేంద్రుడు సీత విరహాన్ని మరిచిపోవాలని అనుకొంటూ హనుమంతుని మాటలను వింటున్నాడు. 'శ్రీరామా! సీతాదేవి నాతో ఇంకా ఇలా చెప్పింది. 'హనుమా! ఆ మహానుభావుని నన్ను త్వరగా కొనిపొమ్మని చెప్పు. నీవు ఇంకొక్క రోజు ఇక్కడే ఉండచ్చు గదా! నీవు నా దగ్గరే ఉండి శ్రీరాముని విషయం చెప్తూ ఉంటే నా బాధలు ఉపశమించినట్లుగా ఉంది. నీవు దూరం అయితే నేను శోక సముద్రంలో మునిగిపోతాను. నీవు మరలా తిరిగి వచ్చేవరకు నా ప్రాణాలు నిలుస్తాయో లేదో నేను చెప్పలేను.

నీవు ఇక్కడ నుంచి వెళ్ళిపోతే నా దుఃఖం మరింతగా వృద్ధి చెంది నన్ను చాలా బాధిస్తుంది. నీవు సర్వ సమర్థుడివి గాన ఈ సాగరాన్ని దాటి వచ్చావు. కాని నీ సహచరులైన వానరులు, భల్లూకాలు దశరథుని పుత్రులు ఈ సాగరాన్ని ఎలా దాటి రాగలరు? ఈ మహాసాగరాన్ని దాటే వారిలో గరుత్మంతుడు, వాయుదేవుడు, నీవు మీ ముగ్గురే సమర్థులు గదా మరి మిగతావారు ఇక్కడకు ఎలా వస్తారు?'

అని సీతమ్మ ఎంతో వ్యథాభరితంగా నన్ను అడిగింది రామయ్యా" అంటూ హనుమంతుడు సీత విషయాలను చెప్పుతున్నాడు.

'హనుమా! రామాదులు సుగ్రీవాదులు ఏ ఉపాయం చేత ఇక్కడకు వాళ్లు వస్తారని నీవు ఊహిస్తున్నావు? నాకు చెప్పుము. నీవు నన్ను ఇక్కడనుంచి తీసుకెళ్ళిపోతే నీ కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి కాని నా శ్రీరామునకు కాదు గదా. శ్రీరాముడు సమస్త బలాలతో వచ్చి రావణుని సమూలంగా సంహరించి నన్ను చేపట్టి అయోధ్యకు తీసుకెళ్ళితే అది నాకు నా ప్రభువుకు యశస్కరం అవుతుంది గదా!

ఈ దుష్టుడు రాముని కన్నుగప్పి నన్ను ఇక్కడకు తెచ్చాడు. ఇప్పుడు నీవు ఆ రాక్షసుని కన్ను గప్పి నన్ను తీసుకెళ్ళడం శ్రీరాముడు ఇచ్ఛగించడు. శత్రు బలాన్ని తుద ముట్టించి నన్ను చేపట్టడమే ఆ మహావీరునికి తగియున్నది' అని హేతుబద్ధంగా చెప్పే సీతమ్మ మాటలు విని ఆమెతో నేను ఇలా చెప్పాను.

''అమ్మా! వానర లోకప్రభువు మిమ్ము శ్రీరాముని దగ్గర చేర్చాలనే కృతనిశ్చయంతో ఉన్నాడు. మహాపరాక్రమవంతులైన వానరులందరూ సుగ్రీవుని ఆజ్ఞకోసం వేచి ఉన్నారు. ఆ వానరులందరూ బలశాలురు. వారు ఆకాశంలో కాని, పాతాళంలోగాని సంచరించగలరు. వారి గమన శక్తికి అడ్డు ఏదీ ఉండదు. వారందరూ ఈ భూమండలాన్ని చాలాసార్లు చుట్టివచ్చారు.

సుగ్రీవుని సేనలో నాకన్నా బలవంతులే గాని నాకన్నా బలహీనులు ఎవరూ లేరు నేనే ఇక్కడకు వస్తే ఇక వారి సంగతి నేను ఏం చెప్పాలి. ఓ దేవీ! శ్రీరామునిగూర్చి, లక్ష్మణునిగూర్చి మీకు చెప్పాల్సిన అవసరం లేదు. ఓ వైదేహీ! మీరు దుఃఖాన్ని వీడండి. మీరు పరితపించాల్సిన అవసరమే లేదు.

ఉదయిస్తున్న బాలభానునివలె తేజోమూర్తులైన రామలక్ష్మణులు నా భుజాలమీద ఎక్కి ఇక్కడకు రాగలరు. శ్రీరాముడు ధనుష్పాణియై ఇక్కడ ఉండడం మీరు చూస్తారు. రామలక్ష్మణులు ఇద్దరూ ఆయుధాలు ధరించి

లంకకు తప్పక వస్తారు. గోళ్లు ఆయుధాలుగాగల వానరులు ఎందరో రామాదులతో కూడి లంకా పట్టణాన్ని చుట్టుముట్టుతారు. వారి మేఘ నాద ధ్వనిని మీరు త్వరలోనే వినగలరు.

శ్రీరాముడు మిమ్ము చేకొని వనవాస దీక్ష పూర్తిచేసుకొని అయోధ్యాపురికి వెళ్ళి పట్టాభిషిక్తుడు అవుతారు." ఇలా నేను ఎన్నో మాటలు చెప్పి రాక్షసులమధ్య ఉన్న శ్రీరాముని ధర్మపత్ని సీతాదేవిని ఊరడించాను.

ఆమెకు ధైర్యాన్ని ఇచ్చాను. ఆమెను ఓదార్చి ప్రసన్నురాలిని చేశాను. సీతాదేవి నా మాటలకు ఊరడిల్లి మనశ్శాంతిని పొందింది. శ్రీరామా! మీరు కూడా మనశ్శాంతిని పొంది తరువాతి కార్యానికి శ్రీకారం చుట్టుము" అని హనుమంతుడు శ్రీరామునికి చెప్పాడు. హనుమంతుని మాటలు విని రాముడు కాస్త ఉపశమనంచెందాడు. 'హనుమా! నీవు చెప్పిన ఈ మాటలు విని నాకు చాలా ఆనందం వేస్తోంది. ఇన్నాళ్ళకు నా సీత ఎక్కడుందో తెలుసుకున్నాము. ఇక సీతను రక్షించుకొనే భారం నాపై ఉంది. ఇంద్రాదిదేవతులు అడ్డు వచ్చినా నేను నా సీతను కాపాడుకొంటాను' అని శ్రీరాముడు ధృడంగా అన్నాడు.

మారుతి సీతమ్మ జాడ తెలుసుకొని శ్రీరామునకు, శ్రీరాముని ఉదంతం సీతమ్మకు చెప్పి వారిద్దరికీ ఉపశమనాన్ని కలిగించాడు. విరహాగ్నిలో దహించుకుపోయే వారికి హనుమంతుడు చల్లని మాటలు చెప్పి వారిలో ఆశలు రేపాడు.

**సుందరకాండ సమాప్తం**

# యుద్ధకాండ

# శ్రీరాముని దీర్ఘాలోచన

## సర్గ - 1

హనుమంతుడు సీతాన్వేషణమంతా ఉన్నది ఉన్నట్లుగా శ్రీరామునితో చెప్పాడు. హనుమంతుడు చెప్పినదంతా రాముడు విని సంతోష తరంగితుడయ్యాడు. తన ఆనందాన్ని మాటలలో చెప్పలేక మౌని అయ్యాడు. మనస్సుకు ఇంత తియ్యటి ఆనందాన్నిచ్చిన హనుమంతుని కేది ఇచ్చినా ఋణం తీరదని అనుకొన్నాడు. తన సంతోషాన్ని వ్యక్తపరుస్తూ చేతులు చాచి హనుమంతుని దగ్గరకు రమ్మని సైగ చేశాడు. హనుమంతుడు తన ప్రభువు, తనకు ఇష్టమైన నాయకుని ఆనందాన్ని చూచి చిత్తరువు అయ్యాడు. రాముడు చేతులు చాచగానే బొమ్మలా నడిచి ఆ చేతులమధ్య ఇమిడిపోయాడు. దగ్గరగా వచ్చిన నేస్తాన్ని రాముడు గాఢాలింగనం చేసుకొన్నాడు.

సీత కుశల వార్త విన్న రాముని హృదయం వేయి ఏనుగులు ఎక్కినంతగా సంతోషించింది. మాటలలో రూపుకట్టించలేని ఆనందాన్ని ఒక్క కౌగిలింతలో, స్పర్శాసుఖంలో రాముడు వ్యక్తపరిచాడు. స్పర్శతో తెలియపర్చలేని భావమే లేదు కనుక హనుమంతుడు ఆ ఆనంద జలధిలో ఉత్తుంగ తరంగితుడయ్యాడు. ఆ ఇద్దరి ఆనందం మేనుల స్పర్శలతో స్వర్గపుటంచులను తాకింది. ఆ మహోన్నత సంపదను ఇచ్చిన రామునికి తాను జీవితాంతం దాసానుదాసుడై ఉంటానని హనుమంతుడన్నట్లుగా రామునకనిపించింది. నిన్ను మించిన ప్రియులు లేరెవ్వరీ లోకాన అని రాముడంటున్నట్లుగా హనుమంతుని కనిపించింది.

అలా వారిద్దరూ తన్మయులై కాలాన్ని మరిచారు. వారిద్దరి గాఢానురాగాన్ని చూచి అక్కడివారు ధన్యులయ్యారు. హనుమంతుడు చేసిన కార్యం నిజంగా మహోన్నతమైనది కదా అని అనుకొన్నారు. కొద్దిసేపటికి రాముడు నోరు విప్పాడు. "హనుమా! నీవు చేసిన పని ఈలోకాన ఎవ్వరూ చేయలేరు. అనితర సాధ్యమైన ఈ సముద్ర లంఘనాన్ని నీవు తృటిలో చేయడమే కాదు, రావణ పాలిత లంకలో అడుగిడి అక్కడి నా సీతను నీవు చూశావు. నిన్ను ఏమని పొగడను. నీవు నాకు చేసిన మేలుకు ఏమిస్తే నీ రుణం తీరుతుంది?

దుర్భేధ్యమైన లంకలో ప్రవేశించి కార్యాన్ని సఫలీకృతం చేసి నాకు ఆనందాన్నిచ్చావు. ఇది నిజంగా పరమోత్కృష్ట కార్యమే. లంకలో ప్రవేశించే మొనగాడు ఎవ్వరూ లేరు. గరుత్మంతుడు, వాయువు, నీవు తప్ప ఈ సముద్రాన్ని దాటగలవారు ఎవరూ లేరు. నీవు నిజంగా సుగ్రీవునకు నమ్మిన సేవకునివే. రావణుని కట్టడిలో ఉన్న లంకను చూడడానికి దేవ, దానవ, యక్ష, గంధర్వ, నాగ, కిన్నరాదులకే సాధ్యం కాదు. అలాంటి లంకను చూడడమే కాదు. నీవు అందులోకి వెళ్లి రావణుని చూసి లంక అంతా తిరిగి నా సీతను చూసి, ఆ క్షేమ వార్తను నాకు అందించావు. నీవు నిజంగా అమోఘ తేజో బలసంపన్నుడవు" అని రాముడు చెప్తున్నాడు.

"హనుమా! లోకంలో సేవకులలో మూడు రకాలవారు ఉంటారు. యోగ్యత సమర్థత ఉండి కూడా ప్రభు కార్యం చేయడం అశక్తుడైతే ఆ సేవకుడు అధముడనే చెప్పాలి. శక్తి సామర్థ్యాలు ఉండి కూడా వాటిని వినియోగించక ప్రభువు ఏది ఎంత చెప్పితే అంతే చేసే సేవకుడు మధ్యముడనవచ్చు.

తన యోగ్యత, శక్తి సామర్థ్యాలకు భంగం వాటిల్లకుండా ప్రభువు చెప్పిన కార్యం సాధించడంతోపాటుగా అక్కడ ఉన్న ఇతరత్రా సమాచారాన్ని సేకరించడంతోపాటుగా శత్రువు గుండెలలో దూతే ఇంత సామర్థ్యం ఉన్నవాడైతే ఇక వారి నాయకుని సామర్థ్యాన్ని లెక్కచేయడంలో ఊహించ శక్యం కాకుండా శత్రు ఆలోచనను దిగ్భ్రమకు గురిచేసి వచ్చిన నిన్ను ఏ సేవకుడని అభినందించాలి?

నీవు నిజంగా అత్యుత్తమునివే. నీ పరాక్రమం నిరుపమానం అత్యద్భుతం. దీనివలన నీవు నాకే గాదు సుగ్రీవునకు అఖండ ఖ్యాతిని లెక్కకట్టగ రాని సంతృప్తిని చేకూర్చావు. వైదేహి జాడ తెలుసుకొని నేడు నేను లక్ష్మణుడు రఘు వంశమే కాదు, మీరు సైతం ధర్మమార్గంలో రక్షించబడినాము."

"ఓ మారుతీ! నీ విజయం నాకు ఆనందాన్నిస్తోంది కాని వేలకొలదిగా ఉన్న ఈ వానర సైన్యం మా సోదరుడు నేను ఈ సముద్రాన్ని దాటడమెలా? అన్న చింత నాలో ఎక్కువై పోతోంది. ఈ అనంత వారధిని దాటి అవతలికి వెళ్లడం ఎలా? అనే వ్యాకులత్వంతో నా మనస్సు ఆందోళనలో మునిగిపోతోంది.

నా జానకి కూడా నీతో ఇదే చెప్పింది కదా. నీవు చక్కగా నా సీతను చూసి సంతోషించావు. నాకు ఆ వార్త చెప్పి ఆనందింపచేశావు. కాని, ఇప్పుడు ఈ జలనిధిని దాటడం ఎలా?" అంటూ శ్రీరాముడు దీర్ఘాలోచనా పరుడయ్యాడు.

ఆయన్ను చూచిన వానరులందరూ చింతితులు అయ్యారు. అప్పటిదాకా వారందరూ సీతమ్మ కనపడి రామునకు సంతోషం కలిగించామని ఎంతో ఆనందించారు. అటువంటి వారి మనస్సులో విచారం గూడుకట్టుకొంది. ఇప్పుడు ఈ దీర్ఘసముద్రాన్ని దాటటం ఎలా అని ఆలోచిస్తున్నారు. రాముడు ఇపుడేవిధంగా చర్యలను తీసుకొంటాడో అని వారందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

* * *

# సుగ్రీవుని ప్రోత్సాహం

## సర్గ - 2

అనంత సాగరాన్ని దాటే ఆలోచనలో శ్రీరాముడు శోకంలో కూరుకుపోయాడు. సీత దగ్గరకు చేరడమెలా? అన్న చింత రాముణ్ణి అతలాకుతలం చేస్తోంది. కన్నులు అశ్రువులతో నిండిపోయాయి. హృదయం బరువెక్కింది. సుగ్రీవుడు రాముణ్ణి చూశాడు. ఆయన సామాన్యునిలా విచారించడం చూచి తట్టుకోలేకపోయాడు. వెంటనే ఆయనకు ధైర్యం చెప్పాలనుకొన్నాడు. ఆయన్ను విచారంనుంచి బయటకు తీసుకొచ్చే బాధ్యత తన మీద ఉందనుకొన్న సుగ్రీవుడు "శ్రీరామా!మీకు ఇది శోకించాల్సిన సమయం కాదు.

మనకు సీతమ్మ సమాచారం తెలిసింది. రావణుని నివాసం కరతలామలకం అయ్యింది. ఇప్పుడు మీరు ఇలా పరితపించడానికి కారణం నాకు కనిపించడం లేదు. మీరు నీతిశాస్త్ర కోవిదులు. నిశ్చయాత్మక శక్తి సంపన్నులు.

యోగి తన సాధనకు అడ్డు వచ్చే ఆలోచనలను పారద్రోలి బుద్ధిని స్థిరం చేసుకొన్నట్లుగా మీరు మీ నిరుత్సాహాన్ని దూరంగా తరిమేయండి. మీ ఆలోచనలను కార్యసాధనవైపు మరల్చండి.

క్రూర జలచరాలతో నిండి ఉండే ఈ సింధువును మనమందరం అవలీలగా దాటగలం. మీ శత్రువును మీరు అంతం చేయగలరు. నిరుత్సాహంతో ఉండే వారు ఏ పనిని సాధించలేరు. దైన్యం మనిషిని క్రుంగదీస్తుంది. సులభంగా చేసే కార్యాలను సైతం నీరుగార్చివేస్తుంది. శోకంలో మునిగి దుఃఖపరంపరలను తలచుకొని మనిషి ఏమి చేయలేక చివరకు జీవితాన్ని అంతం చేసుకొంటే కూడా ఆశ్చర్యపోవాల్సింది ఏమీలేదు. శోకమే అన్నింటికి మూలం."

"ఆ శోకాన్ని విడనాడితే మనిషి చేయలేనిది, సాధించలేనిది ఏదీ ఉండదు. ధర్మమార్గంలో నడిచేవారిని ఆ ధర్మమే రక్షిస్తుంది. విజయాన్ని తెచ్చిపెడుతుంది.

స్వామీ! ఈ దుఃఖాన్ని కృతఘ్నుడిని మిత్రుడు విడిచిపెట్టినట్లుగా మీరు దూరం చేయండి. మీ కోసం ఏది చేయడానికైనా తహతహలాడే వానరులు ఎంతోమంది ఉన్నారు. వారందరూ మీ కనుసైగకై ఎదురుచూస్తున్నారు. వారందరిని చూచి నేను దృఢనిశ్చయంతో చెప్పుతున్నాను. పాపాత్ముడైన రావణుని వధించి సీతా సాధ్విని తీసుకొచ్చే మార్గాన్ని అన్వేషించు. ఈ వార్థిపై వారధిని నిర్మించి రావణ రాజ్యాన్ని చేరే దారిని గూర్చి ఆలోచించు.

మనం త్రికూట పర్వతంపై అలరారే లంకను చూస్తే చాలు. అది నాశనం అయినట్లుగా భావించవచ్చు. మహాసాగరంపై సేతువును నిర్మించకుండా దాటిపోవడం దేవతలకూ అసాధ్యమే అవుతుంది. ఈ అంబోధిని దాటి ఆవలికి పోవడానికి వంతెనే చక్కని మార్గం.

వానరులందరూ కామరూపులు. వారికి అసాధ్యమైన కార్యం ఏది ఉండదు. యుద్ధవీరులే వారందరూ. మనకు విజయం తథ్యం, నిక్కం, మీరు చింతను చెంత చేర నీయకుండా చేయండి. రామా! ప్రాణి ఎప్పుడూ ఆశావాదిగానే జీవించాలి. ఎప్పుడైతే మనస్సున ఉత్సాహం ఉరకలు వేస్తుందో అప్పుడే కార్యాన్ని సాధించే మార్గం దానికదే కనిపిస్తుంది. మనిషి శూరుడైతే శూరత్వమే దారిచూపుతుంది.

ఏదైనా ఒక వస్తువు చేయి జారిపోతే అది తప్పక దొరుకుతుంది. నేను సాధించి తీరుతాను అనే ఆత్మవిశ్వాసం ఎవ్వరికైతే ఉంటుందో వారిని విజయలక్ష్మి వరిస్తుంది. పని సాధించేటపుడు పురుష ప్రయత్నం చేయాలి. ఫలితం భగవంతునిపై వదలాలి. అప్పుడు భగవదనుగ్రహం కలిగి మనిషి తన పనిని సాధించడంలో ఫలవంతుడౌతాడు.

శోకం సమస్త ప్రయోజనాలను భంగపరుస్తుంది. ఉత్సాహం ధైర్య శౌర్యాలు అద్భుత విజయావకాశాలను అందిపుచ్చుకొంటాయి. శ్రీరామా! మేము మీకు అండగా ఉన్నాం. ఇప్పుడు మీరు సాధించలేనిది ఏదీ లేదు. కార్యోన్ముఖుడవై విజయం గురించి ఆలోచించు. మీరు ధనుస్సు పట్టి రణరంగంలో నిలబడితే మిమ్ము ఎదిరించే వాడు ఈ మూడు లోకాలలోను లేడు."

"రామా! మీ కోసం అక్కడ అనేక బాధలను అనుభవిస్తూ సీతమ్మ మీకోసం ఎదురు చూస్తోంది. మీరు తప్పక సీతమ్మను ఆ దుష్టుని చెరనుంచి కాపాడి తీరుతారు. ఆ తల్లి నమ్మకం ఎప్పటికీ వీగి పోదు" అని సుగ్రీవుడు రామునకు చెప్తున్నాడు.

"మీరు అపార జలనిధిపై సేతువును నిర్మిస్తారు. త్వరలోనే సీతాదేవిని చేపట్టి తీరుతారు. మీ వెనుకే మేమందరం ఉన్నాం. మీరు సామాన్యునివలె దీనులుకాక మహాత్ములైన మీరు క్షత్రియ ధర్మాన్ని అనుసరించి శత్రువు పై యుద్ధభేరిని మ్రోగింపజేయండి. క్రోధంలేని క్షత్రియుడు కార్యాన్ని సాధించలేడు. మీ హృదయం నుండి శోకాన్ని తరిమి దాని స్థానంలో క్రోధాన్ని పెట్టుకోండి.

మహాబలురైన వానరులందరూ శిలలు వృక్షాలు చేబూని శత్రువును మట్టి కరిపిస్తారు. రణోత్సాహంతో లేవండి ప్రభూ! ఈ అనంత సాగరాన్ని అధిగమించడానికి సేతు నిర్మాణం గురించి ఆలోచన చేయండి! మనం ఈ అంబుధి దాటితే చాలు మనం అయోనిజను దక్కించుకొన్నట్లే.

నాకు అన్నీ శుభశకునాలే కనిపిస్తున్నాయి. ఇక మాటలతో పనిలేదు. శ్రీరామా! నా మనస్సు ఆనందంతో ఉరకలు వేస్తోంది. ఇక సేతు నిర్మాణమే తరువాయి. విజయం మనదే అంటూ మహాప్రభూ! మీరు అడుగు ముందుకువేయండి, మేమంతా **'శ్రీరామ జయ జయ శ్రీరామ'** అంటూ వడివడిగా అడుగులువేస్తాం.

విజయలక్ష్మి మీ చెంత చేరి చిరునవ్వు లొలికిస్తుంది. సీతారాములు ఒకటై లోకానికి ఆనందాన్ని అందిస్తారు. సీతమ్మ మిమ్ము చేరడం నిక్కమైన నిజం. పదితలలున్న ఆ రావణుడు మట్టిపాలు కావడం అంతే సత్యం. ఇది ముమ్మాటికి నిజం! జయం మనదే ప్రభూ!! లేచి ఉద్యమించండి" అంటూ సుగ్రీవుడు రామునిలో ఉత్సాహాన్ని నింపాడు. ఆలోచనామార్గం చూపాడు.

శ్రీరామునిలో దైన్యం పటాపంచలు అయింది. సుగ్రీవుని మాటలు మదిని సంతోషపరిచాయి. ఇక త్వరలో సీత దగ్గరకు వస్తుందన్న మాట రామునకు వేయిఏనుగుల బలాన్నిచ్చింది. సీత ఆలోచనలతో రామచంద్రుడు దీర్ఘాలోచనుడయ్యాడు. వారధిని నిర్మించి సీతను దరికి చేరవచ్చు అనుకొంటున్న రాముడు జూలు విదిల్చిన సింహంలాగా వానరులకు కనిపించాడు. రామునిలో ధైర్యాన్ని, శౌర్యాన్ని చూచిన వానరులలో ఆనందం యుద్ధకాంక్ష బయలుదేరాయి. రావణుని పని నేటితో సరి, అని వారి మనస్సులు జయభేరిని మ్రోగించాయి.

* * *

# లంక రక్షణ వ్యవస్థ

## సర్గ - 3

**శ్రీ**రాముడు సుగ్రీవుని హిత వచనాలు విన్నాడు. శోకాన్ని దూరం చేసి కార్యోన్ముఖుడయ్యాడు. విజయం చేకూరే మార్గంకోసం ఆలోచన సాగించాడు. "ఓ హనుమా! సుగ్రీవుడు చెప్పినదంతా నిజమే. ఉత్సాహంతోనే ఉన్నత శిఖరాన్ని చేరవచ్చు.

నా తపోబలంతో నేను వార్ధిపై వంతెన నిర్మించగలను. లేకపోతే నా తపః ప్రభావంతో ఈ సముద్ర జలాన్ని ఇంకింపచేయగలను. కాని, "ఓ కపివరా! నీవు లంకనంతా చూచి వచ్చావు గదా. లంకకు వెళ్లడానికి సులభ

మార్గాలు ఏవీ నీకు కనిపించలేదా? లంకలో జల, స్థల, వనాది మార్గాలు ఎన్ని ఉన్నాయి? రావణుని బలం, దుర్గ ద్వారాలు, రక్షణ వ్యవస్థ అంతా నీవు చూశావు గదా. అవన్నీ నాకు ఉన్నది ఉన్నట్లుగా చెప్పు. అప్పుడు మనం మన కార్యం గురించి ఆలోచన చేద్దాం" అని అడిగాడు.

వాక్చతురుడైన హనుమంతుడు "శ్రీరామా! లంకవాసులందరూ హర్షోల్లాసాలతో సుఖంగా జీవిస్తున్నారు. వారికి అసంఖ్యాకములైన రథాలు, అశ్వాలు, గజాలు ఇలా బహుళంగా సేన ఉంది. ఆ నగరానికి నలువైపులా ద్వారాలు రక్షకుల పాలనలో సురక్షితమై ఉన్నాయి. అవి విశాలంగా ఎత్తుగా ఉండడంవల్లే లంక శత్రు దుర్భేధ్యంగా ఉంది.

అంతేగాదు. అవి లోహ నిర్మితాలు; వాటిపై మంత్ర ప్రభావ యంత్రాలు ఉన్నాయి. అవి బాణాలను శిలలను వర్షిస్తాయి. వాటిచుట్టూ లోతైన అగడ్తలున్నాయి. వాటి దగ్గరే వందలకొద్ది రాక్షసగణం అస్త్రశస్త్రాలు ధరించి అప్రమత్తులై కాపలా ఉన్నారు.

నగరం చుట్టూ ఉన్న ప్రాకారం బంగారంతో నిర్మితమైంది. మణులు రత్నాలు వైఢూర్యాలు పొదిగి ఉన్నాయి. ఆ ప్రాకారం ఎత్తుగాను దృఢతరంగా ఉంది. దానిని శత్రువులు ఎక్కలేరు.

ఆ ప్రాకారం చుట్టూ ఉన్న అగడ్తలలో మొసళ్లు, మత్స్యాలు చల్లని జలాల్లో తిరుగాడుతుంటాయి. కన్నులకింపుగా తామరలున్నాయి. కాని, అవి శత్రు భయంకరాలు, ప్రమాదకరాలు.

ఆ అగడ్తలనుండి ప్రాకారం లోపలకు యంత్ర సహాయంతో తెరచుకునే తలుపులున్న వంతెనలున్నాయి. ఆ ప్రాకార సమీపంలోనే సేవా నివాసాలున్నాయి. ఎవరైనా శత్రువులు ఆ వంతెనలపైకి వస్తే యంత్ర సహాయంతో వాటిని ఎత్తివేస్తారు. దాంతో ఆ వచ్చిన శత్రువులు అగడ్తల్లోని మొసళ్లకు ఆహారం అవుతారు. లంకలో అత్యున్నత స్థాయిలో మేధావులున్నారు.

ఆ వంతెనలలో ఒక్క వంతెన చాలా దృఢతరమైంది. అభేద్యమైంది. బంగారు స్తంభాలతో వేదికలతో నిర్మితమై ఉంది. శత్రువులు ఆ లంకపై దాడి చేయడం అసాధ్యం. నదులు, పర్వతాలు, వనాలు కృతిమాలైన అగడ్తలు, ప్రాకారాలు ఉన్నాయి. వీటిని దాటి వెళ్లడం దేవతలకు సైతం దుర్లభంగా కనిపిస్తుంది.

రావణుడు యుద్ధాభిలాషి. నిత్యం రణోత్సాహంతో ఆరోగ్య ధైర్యోత్సాహాలతో విలసిల్లుతుంటాడు. తన సేనల పర్యవేక్షణలో అతి జాగ్రత్తగా ఉంటాడు. లంక త్రికూట పర్వతంపైన కట్టుదిట్టమైన రక్షణ వ్యవస్థలో ఉంది.

శూలాలు, ఖడ్గాలు ధరించిన పదివేలమంది రక్కసులు పూర్వద్వారంలో, దుర్జయులైన లక్షలాది యోధులు దక్షిణ ద్వారంలో డాళ్లు, ఖడ్గాలు ధరించిన శూరులు పది లక్షలమంది పశ్చిమ ద్వారంలో అస్త్రశస్త్రాల ప్రయోగాలలో ఆరితేరిన నిపుణులు కోట్లమంది ఉత్తరద్వారంలో చతురంగ బలాలతో నగరాన్ని రక్షిస్తుంటారు.

లంకలో భవనాలు, ప్రాసాదాలు, బంగారంతో నిర్మించి ఉన్నాయి. అగడ్తలు, శతఘ్నులు, యంత్రాలున్న లంక అమరావతిని తలపించే శోభతో పాటు శత్రు భయంకరంగా ఉంది. సద్వంశ సంజాతులు, హితులు,

ఉత్తములైన వీరులు రావణునికి అండగా ఉన్నారు. లంకానగర మధ్య భాగాన్ని వేలకొలది రాక్షసులు నిరంతరం తమ అదుపాజ్ఞలలో ఉండే భటులతో రక్షిస్తుంటారు. ఆ అజేయులైన యోధుల సంఖ్య కోటిని మించి ఉంటుంది.

లంకావాసులు సిరిసంపదలతో తులతూగుతున్నారు. వారిని ఎల్లపుడూ రావణుడు తన భద్రతా సిబ్బందితో కాపాడుతుంటాడు. వారిలో నిన్నటి దాకా శత్రుభయం లేనేలేదు."

"శ్రీరామా! నేను లంకకు వెళ్లినపుడు ఆ అగడ్తలనంతా రాళ్లతో వృక్షాలతో నింపి మూసివేశాను. బంగారంతో నిర్మితమైన భవనాలను దగ్ధం చేశాను. ప్రాకారాలనెన్నింటినో నేలమట్టం చేశాను. పరిఖలపైన నిర్మితమైన వంతెనలను విరిచేశాను. సైన్యంలో నాల్గవ వంతు దృఢకాయులైన రాక్షసులను చంపివేశాను."

"ఓ రామా! లంకా నాశనానికి మైందుడు, ద్వివిదుడు, పనసుడు, జాంబవంతుడు, అంగదుడు, నలుడు, నీలుడే చాలు. మనం ఏ ఉపాయంతోనైనా ఈ సముద్రాన్ని దాటగలిగితే లంక నేలమట్టం అయి తీరుతుంది. వానరులు సముద్రాన్ని దాటితే లంక చుట్టూ ఉన్న అగడ్తలను శిలలను వృక్షాలతో నింపివేస్తారు. మనమందరం సులభంగా లంకా ప్రవేశం చేయగలం."

"ఓ ప్రభూ! మన సమస్త బలాన్ని కూడగట్టుకొని సర్వసన్నద్ధులం అవుదాం. సముద్రంపై వంతెన నిర్మాణం గురించి మీరు ఆలోచించి చెప్పండి. సుముహూర్తాన మనం బయలుదేరడానికి అంగదుని ఆజ్ఞాపించండి. లంకను నాశనం చేయడం రావణుని పైలోకాలకు పంపడం మీకు చిటికెలో పని. కానీ, ఈ సముద్రాన్ని దాటడానికి కావాల్సిన ఉపాయాన్ని మాత్రం మీరే చెప్పాలి" అని హనుమంతుడు శ్రీరాముడితో చెప్పాడు.

* * *

# వానర సేన సముద్ర తీరానికి ప్రయాణం

## సర్గ - 4

లంకానగరి విశేషాలను హనుమంతుడు శ్రీరామునితో చెప్పాడు. శ్రీరాముడు అన్నీ విన్నాడు. బాగా ఆలోచించాడు. "సుగ్రీవా! మారుతి వలన మన శత్రువు గుట్టుమట్టులు తెలిశాయి కదా. ఇక మనం రణభేరిని మ్రోగించటానికి పయనం అవుదాం. నా ప్రియసతిని అపహరించిన ఆ దుర్మార్గుడైన రావణుణ్ణి చంపి తీరుతాను. లంకనంతా ధ్వంసం చేస్తాను. ఇదే నా ప్రతిజ్ఞ" అని ఆవేశంగా రాముడు అన్నాడు.

మధ్యాహ్న సమయంలో ఆదిత్యుడు తన ప్రతాపంతో జనులను భయపెడుతున్నాడు. మహావృక్షాలన్నీ భానుని ధాటికి తట్టుకోలేక చేవచచ్చినట్లు ఒరిగిపోయాయి. పవనుడు పలకరించడానికి కూడా మొహం చాటేస్తున్నాడు. గంగమ్మ అయితే మరీ ముడుచుకొని కూర్చుంది.

శ్రీరాముడు "సుగ్రీవా! ఈ సమయమే శత్రువుపై విజయానికి మంచి ముహూర్తం. రావణుడు ఇక ఏ విధంగానూ తప్పించుకొని పోలేడు. మనం ఇప్పుడే బయలుదేరి లవణ సముద్ర తీరానికి వెళ్దాం. మన యుద్ధ ప్రయాణ వార్త సీత వింటే తన జీవితంపై ఆశ చిగురింపచేసుకొంటుంది. ఓ కపిశ్రేష్ఠా! నేడు ఉత్తర ఫల్గుణీ నక్షత్రం. రేపు హస్తా నక్షత్రం. ఇవి రెండు శుభాన్నే సూచిస్తున్నాయి. అంతేగాదు నా కుడి కన్ను అదురుతోంది. ఇది మన సంకల్పానికి శుభకరం. మనం ఇప్పుడే బయలుదేరుదాం. దానికి కావాల్సిన దానినంతా సమాయత్తం చేయి" అని అన్నాడు రాముడు. ఆమాట వినడంతోనే లక్ష్మణుడు ఆనందచిత్తుడయ్యాడు. ఇక మా వదినమ్మకు కష్టాలు తీరిపోయాయి. మా రామన్న అనుకొన్నది సాధించేదాకా నిదురపోడు. ఇక ఆ దుష్టుని దుర్మార్గాన్ని తరిమికొట్టేయ్యాలి అని మనసులో భావించాడు.

"శ్రీరామా! మీ నిర్ణయం సముచితంగా ఉంది" అంటూ లక్ష్మణ సుగ్రీవులు ధర్మాత్ముడైన శ్రీరాముని మెచ్చుకున్నారు. ఇక ఎవరెవరు ఏ ఏ పనులను చేయాలో సమాలోచనలు సాగించారు. అంతా రామానుగ్రహం పై ఉంటుందని, తాను చెప్పితే చేసేవానిని మాత్రమేనని సుగ్రీవుడు అన్నాడు.

"రామా! నాచేత పని చేయించే భారం మీదే సుమా" – అని ఓ నమస్కారం చేశాడు. రాముడు ఓ క్షణం నిశ్శబ్దంగా కూర్చున్నాడు. రాముడు బాగుగా యోచించాడు. ఇలా చెప్తుతున్నాడు. "సుగ్రీవా!లక్షమంది సైనికులకు మార్గనిర్దేశకునిగా సేనాపతియైన నీలుని నియోగించు. ముందుగా నీలుని పంపించు. మనం వెళ్ళే మార్గంలోని ఫలాలు, నీరు, దుంపలులాంటి ఆహార పదార్థాలను పానీయాలను రాక్షసులు విషపూరితం చేయవచ్చు. ఆ విషయంలో అందర్ని జాగరూకులై ఉండమని చెప్పు. వానరులందరూ మడుగులు, కందకాలను దాటేటప్పుడు, కీకారణ్యాలలో సాగేటప్పుడు శత్రువులు దాపులలో పొంచి ఉంటారు. వారు మనపై దాడిచేయవచ్చు. కావున ఆ విషయంలో మనం జాగ్రత్త తీసుకోవాలి.

మనం చేయబోయే యుద్ధం మహాభయంకరమైనది. అందుకే పరాక్రమశాలురనే తీసుకెళ్దాం. వృద్ధులు, బాలలు, అశక్తులు లాంటి వారిని కిష్కింధలో వదలి వెళ్దాం. శౌర్యవంతులను వందలు వేలకొలదిగా కూడగట్టుకొని పోదాం. కుడివైపున కపి సేనానాయకుడు వృషభుని నియమించుదాం. "ఓ సుగ్రీవా! ఇంద్రుడు ఐరావతం నెక్కి వచ్చినట్లుగా నేను ఈ హనుమంతుని భుజస్కంధాలపై సేన మధ్యలో వుండి వారికి సమరోత్సాహాన్ని కలిగిస్తాను. సార్వభౌముడు ఏనుగు అధిష్ఠించిన కుబేరునివలె లక్ష్మణుడు అంగదుని నెక్కివస్తాడు. నీవు పల్లకీ ఎక్కి మాతో కూడా రావయ్యా. ఋక్షరాజైన జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శి, వీరు ముగ్గురు సేనకు వెనుక భాగాన వస్తూ అందరిని కాపాడుతారు" – అని సుగ్రీవునకు రాముడు చెప్పగా, రాముని ఆజ్ఞను శిరసావహించమని వానరులందరికి సూర్యపుత్రుడు సుగ్రీవుడు ఆదేశాలను ఇచ్చాడు. శ్రీరాముని ఆజ్ఞ వచ్చినదే తడవుగా వానరులందరూ పర్వత గుహలనుండి వృక్షాలపైనుండి గుంపులు గుంపులుగా బయలుదేరారు. సుగ్రీవ లక్ష్మణులు వెంటరాగా రాముడు దక్షిణ దిశగా ముందుకు సాగాడు. మదపుటేనుగుల్లాగా ఉండే వానరులందరూ ధర్మం మన ప్రక్కన ఉంది, అందువలన జయం మనదే జయం తథ్యం అంటూ ఉరకలు వేస్తూ పరుగులు తీశారు. శ్రీరామ లక్ష్మణులతో కలసి సుగ్రీవాదులు వారితో కలిసి వానరులు అందరూ సంతోషంగా పోరుకు సిద్ధమై దక్షిణ దిశగా సాగిపోయారు.

అలా సాగుతూన్న వానరులు మధ్యలో కనిపించే వృక్షాలనుండి మధుర ఫలాలను తెంపి తింటూ తేనె పట్టులనుండి తేనెలను జుర్రుతూ సాగారు. అందరిలో ఉత్సాహం శృతిమించింది. గెంతులువేస్తూ, ఎగురుతూ, దుముకుతూ పరుగులెత్తుతున్నారు. జయం జయం అనే వానరుల నినాదాలు మిన్నుముట్టుతున్నాయి.

అలా వెళ్ళేవారు తోసుకుంటూ, తొక్కుకుంటూ మహోత్సాహంతో ముందుకుసాగుతున్నారు. దాంతో వెళ్ళేవారిలో కొందరు మరికొందరిని క్రింద పడవేస్తున్నారు. ఇంకొందరు పడినవారిని లేపుతూ ముందుకు సాగుతున్నారు.

ఇక రావణుని పని అయిపోయింది. రావణ రాజ్యం మట్టిపాలే అంటూ అరుస్తున్నారు. ఋషభుడు, నీలుడు, కుముదుడు అనే వానరులు అందరికన్నా ముందుగా సాగుతూ మార్గాన్ని సుగమం చేస్తున్నారు. శత్రు సంహారకులైన రామలక్ష్మణ హనుమ సుగ్రీవులను కొందరు చుట్టిముట్టి సాగుతున్నారు. పదికోట్లమంది వానరులకు శతవలి సేనా ప్రముఖునిగా ఆదేశాలిస్తూ దక్షిణ తీరానికి పరుగుతీస్తున్నాడు.

కేసరి, పనసుడు కుడివైపున 100కోట్లమంది వానరులతో రక్షణ కార్యాన్ని చేపట్టి ముందుకు సాగుతున్నారు. గజుడు, అర్కుడు ఎడమ భాగ రక్షకులై సాగుతున్నారు. గంధమాదనుడు జాంబవంతుడు సుషేణుడు సైన్యానికి వెనుక సుగ్రీవుని నాయకత్వంలో జోరుగా ఉరుకులు పెట్టుతున్నారు. వేగగమనుడైన నీలుడు మార్గాన్ని అన్వేషిస్తూ సమస్త సేనావాహినిని నియంత్రిస్తున్నాడు.

వలీముఖుడు, ప్రజంఘుడు, రంభుడు, రభసుడు వీరందరూ వానరుల్లో తిరుగుతూ వారికి సమయానికి తగ్గ సూచనలిస్తున్నారు. అలా సాగుతున్న వానరులకు వృక్షాలతో లతలతో అలరారే సహ్యాద్రి కనిపించింది. తటాకాలు, నదులు అన్నీ మధ్యలో కనబడుతూ వెనక్కు వెళ్లుతున్నాయి. రాముడు వానరులందరికి దక్షిణ తీరానికి వెళ్ళే మార్గంలో ఎక్కడైనా జనపదులుగాని, నగరాలు కాని కనిపిస్తే వాటిలోకి ప్రవేశించకూడదని ఆజ్ఞ పెట్టాడు.

హనుమంతునిపై రాముడు, అంగదునిపై లక్ష్మణుడు ఎక్కి వెళుతుంటే గురు శుక్రులతో కూడిన సూర్య చంద్రుల్లాగా కనిపించారు. అంగదుని పైనున్న లక్ష్మణుని మనస్సు ఆనందంగా ఉంది. మా అన్న కోరికలు అన్నీ ఈడేరుతాయి. దానికి మంచి సమయం నేటి నుంచే ఆరంభమైంది అనుకొన్నాడు. లక్ష్మణునకు శకున శాస్త్రం బాగా తెలుసు. వెళుతూ వెళుతూ హనుమంతునిపై నున్న రామునితో “అన్నా! ఈ వాయునందనుడు మనందరికి సుఖస్పర్శను కలిగిస్తున్నాడు. పక్షుల కలరవాలు, మృగాల ధ్వనులు మధురంగా వినవస్తున్నాయి. సూర్యకాంతి ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. నక్షత్ర మండలం నిర్మలంగా ఉంది. సప్తర్షులు, సిద్ధులు ధ్రువమండలానికి ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇవన్నీ మనకు శుభ శకునాలు.

వీటి అన్నింటిని పరిశీలించి చూస్తే “అన్నా! మీరు తప్పక రావణుని వధ చేస్తారు. రాక్షసులతో కూడిన లంకను నాశనం చేసి మీ పట్టపురాణి మా వదిన అయిన సీతాదేవిని చేపట్టి తీరుతారని నాకు అనిపిస్తోంది. సోదరా! ఒక్కసారి గగనంపై దృష్టిని నిలుపు మీకే అర్థం అవుతుంది. మన వంశజులకు శుభసూచకం అయిన విశాఖ నక్షత్ర ద్వయం దేదీప్యమానంగా ప్రకాశిస్తోంది. మన వంశశ్రేష్ఠుడు త్రిశంకువు తన పురోహితునితో

సంతోషంగా ఉన్నాడు. అన్నా! అటు చూడు రాక్షసులకు మూలా నక్షత్రం మౌలికమైంది కదా. దానిని ధూమకేతువు స్పృశిస్తోంది. ఇది వారి వినాశహేతువు."

"అన్నా శ్రీరామచంద్రా!తారకాసుర సంహారార్థం ఏగిన దేవతాసైన్యంలాగా నేడు రావణుని ఎదిరించడానికి కపిసేన నడుం కట్టింది. దారిలోన వనాలనిండా ఫలపుష్పాదులు సమృద్ధిగా కనిపిస్తున్నాయి. జలాశయాలపై నుండి వచ్చే చల్లని మారుతం ఫలపుష్పాదుల సువాసనను మోసుకొని వచ్చి మన మనస్సులకు ఆహ్లాదాన్ని కలిగిస్తోంది. ఇవన్నీ మనకు గోచరమయ్యే శుభ శకునాలే. మీరు ఇక సంతుష్ట మనస్సుతో ఉండవచ్చు. జానకమ్మ మన దరికి చేరే రోజు దాపుననే ఉంది" అని సౌమిత్రి తన ఆనందాన్ని అన్నతో పంచుకున్నాడు.

కొన్ని యోజనాల విస్తీర్ణం దాకా వ్యాపించి ఉన్న వానర సేన క్రమబద్ధంగా సుగ్రీవుని నాయకత్వంలో సాగుతుంది. అలా నడిచే వానరుల వలన రేగిన దుమ్ము సూర్యమండలాన్నంతా కప్పి వేసిన మేఘవృత్తంలాగా కనిపిస్తోంది. వానరులు ముందుకు వెళ్లుతుంటే సరస్సులు, తటాకాలు, వనాలు, తోటలు, పొలాలు అన్నీ వెనకకు సాగిపోతున్నాయి. వానరులందరూ తమ హర్షోల్లాసంతో ప్రసన్న మనస్కులై రామకార్యం సాధించడానికి ముందుకు వెడుతున్నారు.

వానరులు తమ సంతోషాన్ని రకరకాలుగా వ్యక్తం చేస్తున్నారు. అందులో కొందరు తోకలను నేలకేసి కొడుతున్నారు. మరికొందరు పళ్లు పటపటలాడిస్తున్నారు. ఇంకొందరు చేతికందిన శిలలను బ్రద్దలు చేస్తున్నారు. ఇంకొంతమంది సింహనాదం, మహానాదం చేస్తున్నారు. పెద్ద పెద్ద బండరాళ్లను విసిరి వేస్తున్నారు. వినోద క్రీడార్థంలాగా సాగిపోతున్నారు. అలా వారు ఉత్సాహంతో సాగుతున్నారు. సీతాదేవికి రావణుని చెర ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా చెరిపేయాలని పట్టుదలతో రాత్రింబవళ్లు అలసట మరచిపోతున్నారు.

వెళుతూ పూలున్న చెట్లను ఊపుతున్నారు. దానివలన వానరులపై పుష్పవృష్టి కురుస్తోంది. పొగరు, ఎర్ర గోరింట, మామిడి అశోక, వావిలి, గన్నేరు, తిమిశ, ఊడుగు, కానుగ, జువ్వి, రాగి, తుమికి, నేరేడు, ఉసిరిక, కడిమి చెట్లు అనేక రకాలైన చెట్లు కనిపించాయి. వాటినన్నింటిని తమ శక్తి కొలదిగా ఊపుతూ పండ్లుకోస్తూ పూలు రాలుస్తూ వానరులు తమ సహజ స్వభావ సిద్ధంగా హాయిగా ముందుకు వెళుతున్నారు.

సహ్యాద్రిపైన ఉన్న వనాలలో పూవులపై తుమ్మెదల ఝుంకారాలు, గైరికాది ధాతువుల నిగారింపు, మిళితమై మనోహరంగా ఉంది. కొండ చరియలకు మొగలి పొదలు వావిలి విరజాజి తీగలు అందాన్నే ఇనుమడింపజేస్తున్నాయి. మల్లె పొదలు గన్నేరులు విరగకాచి కూర్చిన అల్లిక కదంబ మాలలా వనాలకు శోభనిస్తున్నాయి. ఇప్ప, పొగడ, వేగిస, పుష్పాలు సుమనోహర సుగంధాన్ని వెదజల్లి పాదాచారులై వెళుతున్న వానరసేనకు అలుపును దూరం చేస్తున్నాయి. పొన్నలు విరబూసి ఎర్రకాంచనాలు, మాధవీలతలతో పెనవేసుకొన్నాయి.

చిరిబిల్వ, మధూక, వంజుల, నకుల, రంజక, తిలక, నాగ, చూత, కోవిదార, ముచవింద, అర్జున, కుటజ, ధవపాటవిక, సింధు వారాలు ఇలా ఒక్కటేమిటి? వందలేమిటి వనమంతా వానరులు వెళ్ళే మార్గమంతా చెట్లు పూలతో సమ్మోహనపరుస్తున్నాయి. ఫలాలతో జిహ్వకు స్వర్గాన్ని చూపెడుతున్నాయి. తనువుకు తనివితీరని ఆనందాన్ని

పంచిపెడుతున్నాయి. ఇంద్రియాలవల్లే కదా ఇంత ప్రకృతి సోయగం మనస్సును ఆకర్షించింది అనుకుంటూ వానరులు అడుగులు వడివడిగా వేస్తున్నారు.

సరస్సులు, తటాకాలు, సెలయేర్లు, జలపాతాలు– ఇలా అనేక రకాల జలాశయాలు తామరలను కలువలను తమ ఉపరిభాగంలో అలంకరించుకొన్నాయి. ఇక వాటిమీద నీటికొంగలు, బెగ్గురు పక్షులు, చక్రవాకాలు, నీటికోళ్లు, కలహంసలు, రాజహంసలు, క్రౌంచాలు, కారండవములు, నీటికాకులు బారులు తీరి ముగ్ధ మనోహర దృశ్యాన్ని కన్నుల కింపుగా చూపిస్తున్నాయి. కనువిందు చేస్తున్న వీటిని వానరులు వదలలేదు. వాటికి కూడా రామకార్య ఆనందాన్ని పెంచిపెట్టారు.

ఆ జలాశయాలు స్నానాదికాలకు, దాహార్తికి పనికివచ్చి వానరులకు ఇతోధిక సాయాన్ని అందించాయి. వానరులు ద్రోణ ప్రయాణంలో ఉండే తేనె పట్టున్న వృక్షాల కొమ్మలను పట్టి వంచి కడుపునిండా ఆ తెనెను లాగించారు. పచ్చని శరీరచ్ఛాయతో ఉన్న వానరులు భూదేవి పచ్చని పట్టుచీర చుట్టబెట్టుకొన్నట్లుగా భూమండలాన్ని ఆవరించి సాగారు. అలా వారు ముందుకు సాగి దక్షిణాన ఉన్న మహేంద్రగిరిని చేరారు.

దశరథ పుత్రుడు శ్రీరాముడు హనుమదాదులతో కలిసి మహేంద్ర శిఖరం ఎక్కాడు. తాబేళ్లు చేపలు నిండిన అల్లకల్లోలంగా ఉన్న తరంగ ఘోషను వింటూ సముద్రాన్ని చూశాడు. వానరులందరూ సహ్య, మలయ పర్వతాలు దాటుతూ దక్షిణ సముద్ర తీరానికి చేరారు.

సాగర తరంగాలతో అక్కడున్న శిలలన్నీ నునుపుదేలి ఉన్నాయి. వానర ప్రముఖులందరూ సముద్ర తీరాన్ని చేరారు. రాముడు ఒక్కసారి సాగరాన్ని అవలోకించి “సుగ్రీవా! ఇపుడు మన చింత మొదలైంది. మన ముందు అబ్ధి అడ్డుగా ఉంది. దీన్ని దాటడం ఎలా?” అన్నాడు.

“సరే, ఇక్కడ మన సేననంతా ఆపండి. సీతాదేవి చేజిక్కించుకోవడానికి ఈ సాగరాన్నిదాటే ఉపాయం ఇక్కడే ఉండి యోచిద్దాం” అని రాముడు వానరసేనకు చెప్పాడు. “ఓ వానరులారా! మీరందరూ ఇక్కడ చాలా జాగ్రత్తగా ఉండండి. మన శత్రుసేన దాపునే ఉండి మనలను దొంగదెబ్బతీయవచ్చు. సేనానాయకులందరూ అప్రమత్తులై రక్షణ భారాన్ని జాగ్రత్తగా చూడండి” అని రాముడు హెచ్చరించాడు.

పింగళి వర్ణ వానరసేన మరొక సాగరాన్ని తలపిస్తోంది. వారందరూ అక్కడున్న చెట్లనీడన విశ్రమించారు. వారి కోలాహల ధ్వని సాగర ఘోషను మించిపోతోంది. సుగ్రీవుని నాయకత్వంలో ఉన్న వానర సేనను మూడు విభాగాలు చేశారు. వారందరూ తదేకంగా సాగరాన్ని చూస్తున్నారు. వారందరికి ఆవలి తీరం కనిపించడంలేదు. ఈ సముద్రాన్ని ఆవల రాక్షస నివాసం. ఈ సముద్రంలో భయంకరమైన మొసళ్లు, తిమింగలాలు నిండి ఉన్నాయి. సంధ్యా సమయం ఆసన్నమైంది. సముద్రుడు తరంగాలతో ఎగిసిపడుతూ తెల్లని నురగను తీరానికి చేరుస్తున్నాడు. అప్పుడు సుదంతి అయిన సాగరకన్య నవ్వుతున్నట్లు ఆ నురగ కనిపిస్తోంది.

చంద్రోదయంతో సముద్రం ఉప్పొంగిపోతోంది. సాగరంలోని అలలు చంద్రుని అందుకోవాలనే ఉబలాటంతో పైపైకి ఎగిసి వస్తున్నాయి. రాక్షస నివాసానికి దారితెన్ను కనబడక సాగరం అగమ్యగోచరంగా కనిపించింది. తుది

మొదలు లేని ఆకాశం, ఆది అంతం లేనట్లుగా కనిపించే సంద్రం రెండూ ఒకేలాగా కనిపిస్తున్నాయి. ఆకాశం నక్షత్రాలతో మెరుస్తూ ఉంది. సాగరం ముత్యాలు రత్నాలతో అలరారుతోంది. దీని వైశాల్యం, దాని లోతు ఎక్కడా అంతు చిక్కడంలేదు. అందుకే ఈ రెండింటి మధ్య తారతమ్యం కనిపించడంలేదు. సాగరం ఆకాశాన్ని ప్రతిబింబిస్తూ నీలవర్ణాన్ని పులుముకొంది. చంద్రునితో మంతనాలు సాగించాలని సాగరుడు తరంగాలతో తంతిని పంపుతున్నాడు. ఇలా ఒక్కరికి ఒక్కోలా కనిపించే మహోదధిని వానరులు ఆశ్చర్యానందాలతో చూస్తున్నారు. రాముడు సాగరాన్ని చూస్తూ మౌనంగా కూర్చున్నాడు. లక్ష్మణుడు ధీరగంభీరుడైన అన్నను మహోజ్వలంగా ఎగిసిపడే సంద్రాన్ని మార్చి మార్చి చూస్తున్నాడు.

ఆయనకు ఏ ఆలోచనా తట్టడంలేదు. అన్న ఏం చేయబోతున్నాడనుకొంటూ మా సీతమ్మ తల్లికి ఇంకా ఎన్నాళ్ళీ కష్టాలూ, కన్నీళ్లూ? "అమ్మా!మేము సముద్రం ముందుకు వచ్చాం. ఇకపై దీన్ని దాటి రావణుని మట్టుపెట్టుతాం తల్లీ. మీరు చింతించకండి" అని మనసుతోనే సీతమ్మకు సందేశాలను పంపిస్తున్నాడు. మౌనముద్రను దాల్చిన సోదరులిరువురిని చూసి సుగ్రీవాదులు ఉత్కంఠభరితులయ్యారు. వారు ఈ సముద్రాన్ని దాటడానికి ఎపుడు ఏమి చెప్పబోతున్నారా అని ఎదురుచూస్తున్నారు.

* * *

# సీతాస్మరణం

## సర్గ - 5

**నీ**లుని పర్యవేక్షణలో వానరసేన సముద్ర తీరం ఆవరించింది. మైందుడు, ద్వివిదుడు వానరసేననంతా కలియతిరుగుతూ అదుపులో ఉంచుతున్నారు. ఆ తీరంలో సేనాశిబిరాలు వేశారు. సముద్రం దాటడానికి ఉపాయం తోచని శ్రీరాముడు వ్యాకుల మనస్సుతో ఉన్నాడు."లక్ష్మణా! అందరూ కాలం గడిచిన కొద్దీ దుఃఖ భారం తగ్గుతుందంటారు కదా. మరి నా దీనావస్థ ఏమిటి? సీతను చూసే రోజులు గడిచేకొద్ది నా దుఃఖం దిన దిన ప్రవర్ధమానమయ్యే శుక్ల పక్ష చంద్రునిలాగా వృద్ధి పొందుతోంది. ఇది తీరే మార్గం కనిపించడంలేదు" అంటూ రాముడు కన్నీరు పెట్టుకొన్నాడు.

"సౌమిత్రీ! ఇప్పటిదాకా నా మనస్సు సీత దూరం అయ్యిందని బాధపడింది. నేడు ఆ దుష్ట రావణుడు సీతకు విధించిన గడువును తెలిసిన నా మనస్సు దుఃఖ భారాన్ని పెంచుతోంది" అని అన్నాడు. మరలా "ఓ వాయుదేవా! నీవు సీతను స్పర్శించి తర్వాత నా దగ్గరకు రా. అప్పుడు ఆ సీతను తాకిన వాయువు సీత గంధాన్ని నాకు చేర్చుతుంది. అది నాకు హాయినిస్తుంది. రావణుడు అపహరించే సమయంలో నా సతి భయ విహ్వలురాలై "హా రామా!" "నాథా రక్షించు" అని అరిచి ఉంటుంది.

ఆ ఆక్రందన నా చెవులలో మారుమ్రోగుతూ నన్ను విరహాగ్నిలో కాల్చివేస్తోంది. సీత ఎడబాటనే అగ్ని నన్ను ఆపాదమస్తకం దహించి వేస్తోంది.

నా సీత పదితలలున్న రావణునితో ఎన్ని కష్టాలుపడుతోందో. అసలే దుష్టుడు, ఆపై రాక్షసుడు. అతనికి ఏక్షణం ఏదురాలోచన అనే పురుగు తొలుస్తుందో ఏమౌతుందో" అని రాముడు ఆవేదన చెందాడు.

"లక్ష్మణా! నేను ఈ జలధిలో మునిగి నా విరహాగ్ని చల్లార్చుకొంటాను. ఆవల రావణ పాలిత రాజ్యంలో సీత, ఈవల సముద్ర గర్భంలో నేను ఉన్నామనే తలంపుతో నేను కాస్త ఊరట చెందుతాను. ఆ దరిని ఉన్న సీత ఈ దరినున్న నన్ను ఎప్పుడు చేరుతుందో? మా ఇద్దరిని దరి చేర్చే ఈ వారధి ఎలా నిర్మితం అవుతుందో చూడాలి. రావణాది శత్రువులను పరిమార్చునది ఎప్పుడో? సర్వాంగ సుందరిని ఐన సీతను దక్కించుకొనేది ఎప్పుడో? దొండపండు వంటి సీత అధరామృతాన్ని గ్రోలేదెప్పుడో? సీత నిండైన ఎదలో తలదాచుకొనేదెప్పుడో? ఆ సీత స్పర్శాసుఖం నాకు కలిగే భాగ్యం ఎన్నడుందో?" అని శ్రీరాముడు సీతాస్మరణంలో ఆత్మానందాన్ని పొందుతున్నాడు.

"జనకమహారాజు కూతురు, శత్రు భయంకరుడైన దశరథుని కోడలు, నా ప్రేయసి అయిన సీత సింహానికి చిక్కిన లేగదూడలా రాక్షసుల మధ్య నలిగిపోతోంది. ఆమె నాథుడినైన నేను ఇక్కడ ఉండగానే ఆమె అనాథలాగా ఆక్రోశిస్తోంది. ఆ రక్కసి మూకల మధ్య వైదేహి ఎన్ని బాధలు పడుతుందో? అసలే నా శుభాంగి సీత సుకుమారి. లలిత లావణ్యవతి. ఆమె శరీరం సన్నని జాజి తీగలా ఉంటుంది. నేడు కాలం కలసిరాక, నేను దగ్గరలేక, ఉపవాసాది కృత్యాలతో నా సీత క్రుంగి కృశించి బక్కచిక్కి వాడిన పూతీగలాగా అయిపోయి ఉంటుంది. నా శరపరంపరలో ఆ రావణుని హృదయాన్ని చీల్చివేసి నా సీతను నేను ఎప్పుడు దగ్గరకు తీసుకొంటానో? నన్ను చేరిన ఆనందంతో నా కళ్యాణి ఆనందాశ్రువులతో నన్ను అభిషేకించేదెప్పుడో!" అని ధీశాలి ఐన రాముడు సీతను పదే పదే గుర్తుచేసుకొన్నాడు.

సాయంకాలం అవడంతో భాస్కరుడు అస్తమించాడు. రాముణ్ణి లక్ష్మణుడు ఓదార్చాడు. వారిద్దరూ సంధ్యను ఉపాసిస్తున్నారు.

* * *

# రావణుని మంత్రాలోచన

## సర్గ - 6

ఇంద్రుడు దైత్యసంహారం చేసినట్లుగా హనుమంతుడు లంకానాశనం చేశాడు. రాక్షససేనను అంతమొందించిన ఆంజనేయుని చర్య రావణునికి బాధను కలిగించింది. ఇందరి వీరుల మరణానికి కారకుడైన హనుమపై రావణుడు ఉగ్రుడయ్యాడు. కాని, తన ఆలోచనను మంత్రులతో పంచుకోవాలనుకొన్నాడు.

“ఓ సచివులారా! లంకను చూడడానికే దేవతలు సైతం జంకుతారు. అలాంటిది ఒకే ఒక్క వానరుడు నా లంకా సామ్రాజ్యాన్ని చూడడమే కాదు; ప్రవేశించాడు. అంతేకాదు, నా సేనలో చాలా భాగాన్ని నాశనం చేశాడు; నా చైత్య ప్రాసాదాన్ని, అశోక వనాన్ని ధ్వంసం చేశాడు. అంతటితో ఆగక ఎన్నో భవనాలను నేలమట్టం చేశాడు. ఇది నాలో అసహనాన్ని కలిగిస్తోంది. వానరుని చర్య నాలో బాధనే మిగులుస్తోంది.

ప్రజ్ఞావంతులు రాజ్యరక్షణభారాన్ని గురించి మంత్రులతో ఆలోచించమని చెప్తారు కదా. రాముని ఎదిరించడానికో లేక జయించడానికో మనం ఏమి చేస్తే బాగుంటుందో మీరు చెప్పండి. నేను ఇలా ఎందుకు అడుగుతున్నానో మీకు తెలిసే ఉంటుందని అనుకొంటాను. పురుషులలో మూడు రకాల వారు ఉంటారు. కార్యాన్ని సకాలంలో చేయక ఉపేక్షించి ఫలం దైవ నిర్ణయమని పురుషయత్నాన్ని చేయని వాణ్ణి అధముడని అంటారు.

తానే సర్వాధికారినని, తానే తెలివిగలవానినని అంతా నా చర్యల ఫలమేనని విర్రవీగుతూ పనులను ఆచరిస్తే వారిని మధ్యములని అంటారు. ఇలా కాకుండా తన ఆలోచనను ఒక ప్రక్కనుంచి మంత్రుల అభిప్రాయాన్ని విని, వారితో తాను అనుకొన్నది చెప్పి, అన్నింటిని సరితూచి యుక్తాయుక్త విచక్షణతో కార్యాన్ని చేసే వాణ్ణి ఉత్తముడని అంటారు కదా. అందుకే మీ ఆలోచనలను నాకు చెప్పండి. మనం అందరం కలిసి మన శత్రువు అయిన రాముని జయించే మార్గం అన్వేషిస్తాం!

ఉత్తమ, మధ్యమ, అధమ మంత్రాంగాలు ఉన్నాయి. మంత్రులందరూ కలిసి అభిప్రాయాలు చెప్పి అన్నింటిని సమీకరించి ఐక్యతారాగంతో ఒక్క ఆలోచనను అందరూ బలపరిస్తే అది సరియైన అత్యుత్తమమైన మంత్రాంగం అవుతుంది. అలాకాక, ఎవరి ఆలోచనలువారికే ఉంటూ వారి మధ్య ఆలోచనల సయోధ్య. ఐక్యత కుదరకపోతే అది మధ్యమ మంత్రాంగం అవుతుంది. ఎవరికి వారు తమదే గొప్ప అభిప్రాయం అనుకొంటూ కార్యసాధనకు ఉపయోగించిన ఆలోచనలు కలిగి ఉంటే అది అధమ మంత్రాంగం అవుతుంది కదా! ఇదంతా మీకు ముందే తెలుసునని నేను అనుకొంటున్నాను. మీరందరూ మనందరి బాగుకోసం ఆలోచించి చక్కని అభిప్రాయాలను చెప్పండి.

అందరం కలిసికట్టుగా శత్రు విజయం కోసం ఒక కార్యాచరణను ఆలోచించి దాన్నే పాటిస్తాం! అది నా ఒక్కనికే కాక మొత్తం లంకకు అంతా ప్రయోజనకారి అయ్యి ఉండాలన్నది నా అభిమతం. నేను ఇంతవరకు మన వంశాభివృద్ధి కోసం అహర్నిశలు పాటుపడ్డాను. అపుడంతా మీరు నాకు తోడు ఉండి విజయాన్ని తెచ్చిపెట్టారు. ఇపుడూ మీ ఆలోచనలకు పదును పెట్టండి. నాకు మీకు మనందరికి శ్రేయస్కరమైనదాన్ని గురించి బాగుగా యోచించి చెప్పండి” అని రావణుడు వారి మంత్రులతో చెప్పాడు.

మరలా రావణుడే “ శ్రేష్ఠతములైన మంత్రులారా! నాకు మీ అమూల్య అభిప్రాయాలు కావాలి! శ్రీరాముడు తమ్మునితో కూడి వానర సేనను తీసుకొని దక్షిణ సముద్ర తీరానికి చేరాడనే సమాచారం నాకు అందింది. ఇక

ఆ రాముడు సముద్రాన్ని ఇంకింపజేసో లేక మరే విధంగానైనా మన లంకలో అడుగుపెడ్తాడు. ఇది నిశ్చయం. అందుకే మీరందరూ మీ బుద్ధికి పదును పెట్టి మన లంకానగరాన్ని, సైన్యాన్ని కాపాడుకొనడానికి తగిన సూచనలు చేయండి.

మనందరికి పనికివచ్చే హితాన్ని కూర్చే అభిప్రాయాలను చెప్పండి. అంతే కాదు, రాముడు మానవుడేనని, హనుమంతుడు వానరుడేనని ఆలోచించివద్దు. ఎందుకంటే దూతగా వచ్చిన ఆంజనేయుడు ఎంత నాశనాన్ని చేశాడో మీకు తెలుసు గదా! దాన్ని దృష్టిలో పెట్టుకోండి అని రావణుడు తన మంత్రులతో తన అభిప్రాయాలన్నీ చెప్పాడు.

* * *

# రాక్షసుల పరాక్రమం

## సర్గ - 7

రావణుడు చెప్పినదంతా విన్న రాక్షసులు "దానవాగ్రణీ! మీరు చాలా బుద్ధిమంతులు. మీరు చెప్పినదంతా యథార్థమే" అంటూ రావణుని మెచ్చుకొన్నారు. శత్రు పక్షపు బలాలు తెలుసుకోలేని అధములు అయిన వారు రావణుని మెప్పు పొందడానికి "రాక్షసరాజా! మీరు భయపడాల్సిన అవసరం ఏమీ లేదు. మనలో ఎందరెందరో మహావీరులు యోధానుయోధులు ఉన్నారు. వారి ముందు ఏ శత్రువు నిలవలేదు. కనుక చింతించాల్సిన అవసరం ఏ మాత్రం లేదు" అని రావణునికి చెప్పారు.

"లంకాధిపతీ! ప్రభూ! మన దగ్గర పరిఘలు, బల్లాలు, కత్తులు, శూలాలు, ఖడ్గాలు, గదలు ఇలా ఎంతో ఆయుధ సంపద మెండుగా ఉంది. పైగా మీరు రణధీరులు. మీరు ఇంతకుముందు భోగవతీపురంపై దండెత్తి నాగులను జయించారు. పరమేశ్వరునికి ఇష్టసఖుడైన కుబేరుని కూడా ధిక్కరించి ఓడించారు. యక్షులను మట్టి కరిపించారు. కుబేరుని పుష్పక విమానాన్ని చేజిక్కించుకున్నారు."

"రావణేశ్వరా! మీ ముందు ఎవరు నిలవగలరు? ముల్లోకాలలో మీ పేరు చెబితే చాలు వారందరూ పలాయన మంత్రం పఠిస్తారు. యముడు మీ పరాక్రమానికి జడిసి తన కూతురైన మండోదరిని మీకిచ్చి వివాహం చేశాడు కదా! మధువు అనే దానవేంద్రుడు యుద్ధంలో అజేయుడుగా పేరు తెచ్చుకొన్నాడు కదా. వానిని కూడా మీరు నిర్జించారు. పైగా మీ చెల్లెలైన కుంభీనసకు భర్తను చేశారు గదా."

"దానవేంద్రా! మీ చేతిలో పరాజితులు అయినవారే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. నాగులందరూ పారిపోగా నాగులలో ప్రముఖులైన వాసుకి, తక్షకుడు, శంఖుడు, జటి లాంటి వారిని మీరు లొంగదీసుకొన్నారు కదా! కాలకేయాది దానవులు ఎంతో బలవంతులు. వారితో కూడా మీరు సంవత్సరం పాటు యుద్ధం సాగించినా

చివరకు మీరే వారిని వశపరచుకొన్నారు. వారు బ్రహ్మదేవుని నుండి వరం పొందిన వారు. వారే మీకు వశులైతే మానవులు ఏపాటి మీకు?"

"ఓ మహానుభావా! మహాబలవంతులైన వరుణుని కుమారులను మీరు ఓడించినారు. మీ యుద్ధకౌశల్యంతో ముల్లోకాలను గడగడలాడించారు. యముని సైన్యాన్ని అల్లకల్లోలపరిచారు. మృత్యువుపైనే విజయం సాధించారు. అమోఘమైన తపస్సు చేసి చతుర్ముఖుని నుండి వరాలను సాధించుకొన్నారు.

ఈ భూమండలంలోని రాజులనందరినీ ఓడించారు. దేవతలనే ఎదిరించి నిలవగలిగిన మీ ముందు ఈ శ్రీరాముడు ఒక్క లెక్కలోనివాడా? మహారాజా! మీరు శ్రీరామునితో యుద్ధం చేయాల్సిన అవసరమే రాదు. శత్రువులందరిని తరిమికొట్టడానికి మీ కుమారుడొక్కడే చాలు.

ఇంద్రజిత్తు పరమేశ్వరుని ప్రీతిపాత్రుడు. అతనిచే వరాలందుకొన్నవాడు. అతనిని ఎదిరించలేకనే గదా ఇంద్రుడు లంకకు తలవంచుకొని వచ్చాడు. దేవతా సైన్యం మహా సాగరం వంటిది. రుద్రాదిత్య గణాలు మరుద్గణాలతో నిండి ఉండేది. ఆ దేవతా సైన్యాన్ని మేఘనాధుడు చీల్చి చెండాడి సురపతి అయిన ఇంద్రుణ్ణి లంకకు తన శక్తితో తీసుకొని వచ్చాడు కదా. మనకు బందీ అయిన ఆ పురందరుని, బ్రహ్మ చెప్పినందువల్ల కదా ఇంద్రజిత్తు వదిలాడు. మేఘనాథుడు శంబరాసురుని, వృత్రాసురుని ఎదిరించిన బలశాలి కదా!

మహారాజా! మీరు యుద్ధాన్ని గూర్చి చింతించవలసిన అవసరం లేదు. మానవులతో యుద్ధం మనకు సాధారణ విషయమే. అల్పమైన విషయాన్ని గూర్చి మీరు ఇంతలోతుగా పరిశీలించడం మాకు ఆశ్చర్యంగా ఉంది. ఇంతగా ఆలోచించవలసిన అవసరం లేదు. మేమందరం విజయం మనదే అవుతుందని గట్టిగా చెప్పగలం."

"మీరు రణోత్సాహం ఉన్న ఇంద్రజిత్తుకు శ్రీరామునితో యుద్ధాన్ని చేయడాన్ని అప్పచెప్పండి. అతడే రణభేరిని మ్రోగించి శత్రువులను యమ సదనానికి పంపి విజయకేతనం ఎగురవేయగలడు. రాక్షసరాజా! ఇక ఏ సందేహం మీ మనస్సులో రానీయవద్దు. శ్రీరాముడు ఓడిపోవడం, మీరు గెలవడం ఖాయం! ఇందులో ఏమాత్రం సందేహం లేదు. మన లంకను చూచి వెళ్ళిన హనుమంతుడు రాక్షసులు ఏపాటివారో తప్పక రామునికి చెప్పి ఉంటాడు. ఇప్పటికే రాముడు మన గురించి ఆలోచించి పలాయన మంత్రాన్ని పఠించడానికి ఉరకలు వేస్తుంటాడు. అంతే కాదు మహారాజా! వారు సముద్రానికి ఆవలనున్నారు. వారందరూ ఈ సంద్రాన్ని దాటడానికే భయపడి పారిపోవడం తథ్యం" అంటూ రాక్షస మంత్రులందరూ అవగాహనా రాహిత్యంతో కూడిన అభిప్రాయాన్ని వారి రాక్షసేంద్రునకు చెప్పారు. వారు చెబుతున్నతీరుకు, పూర్వవిజయాలను ఏకరువు పెట్టుతున్నందుకు రావణుని మోములో సంతోషపు ఛాయలు కనిపించసాగాయి. దాన్ని చూచిన మంత్రి పుంగవులు మరికాస్త రావణునికి ఇంపు కలిగించే మాటలు చెప్పడంమొదలుపెట్టారు.

* * *

# రాక్షసుల ప్రగల్భాలు

## సర్గ - 8

రాక్షసులందరి మాటలు రావణుడు సంతోషంతో విన్నాడు. ఇంతలో నల్లని మేఘంలాంటి శరీరచ్ఛాయ గల ప్రహస్తుడు లేచాడు. “రాజా! దేవ, దానవ, గంధర్వ, పిశాచ, యక్ష, పక్షి గణాలు ఏవీ మిమ్మల్ని రణరంగంలో ఎదిరించలేవు సరి గదా, మరి ఈ వానరులు ఒక్క లెక్కలోనివారా? రాజా! హనుమంతుడు వచ్చిన నాడు మనం ఏమరుపాటుతో ఉన్నాం. అందుకే వాడు బీభత్సాన్ని సృష్టించాడు. దానికే మీరు ఇంతగా దిగులుపడే అవసరం లేదు. మనం ఆనాడు రణోత్సాహంతో ఉండి ఉంటే ఆ వానరుడు బ్రతికి బట్టకట్టగలిగేవాడా?

మహారాజా! కొండలతో, వనాలతో ఉన్న ఈ భూమండలాన్ని సాగర పర్యంతం వరకు ఒక్క వానరుడు లేకుండా నేను నిర్జించగలను. రాక్షసరాజా! నాకు ఆజ్ఞ ఇవ్వండి చాలు. నేను మిమ్ము కాపాడగలను. ఒక్క శత్రువు లేకుండా చేయగలను. మరల “అయ్యో! తప్పు చేశాననే చింత మీ దగ్గరకు రానివ్వను” అంటూ ప్రహస్తుడు రావణుని హృదయంలోని ఉల్లాసం కల్గించే సంతోషవార్తలు చెప్పసాగాడు. తాను ఎన్ని విజయాలు సాధించిందీ, తాను ఎంతగొప్పవాడైనదీ చెప్పడమే కాక, రావణుని విజయపరంపరలను కొనియాడసాగాడు.

ప్రహస్తుని మాటలతో ఉత్తేజితుడైన దుర్ముఖుడు లేచాడు. “దానవేంద్రా! మన అనుమతి లేకుండా వానరుడు లంకా ప్రవేశం చేయడం, వనధ్వంసం, లంకా నగర దహనం, రాక్షస నాశనం ఇవన్నీ మనకు అవమానకరాలు. మన రాక్షసులకు తలవంపు తెచ్చిపెట్టాడు. అందుకే నాకు ఆజ్ఞ ఇవ్వండి. నేను ఇప్పుడే వెళ్లి ఆ వానరులు ఎక్కడున్నా మట్టుపెడతాను. ఆకాశంలో దాగినా సముద్రంలో మునిగినా, పాతాళంలో తలదాచుకొన్నా బయటకు లాగి మరణదండన విధిస్తాను” అని బీరాలు పలికాడు.

వజ్రదంష్ట్రుడు లేచి “మహారాజా! మనకన్నా తక్కువ బలం ఉన్న వానరునితో పని ఏమి? అంటూ పరిఘను చేతబట్టుకొన్నాడు. దానవరాజా! లక్ష్మణునితో సుగ్రీవునితో చేతులుకలిపి మనపై యుద్ధోత్సాహం చూపే రాముని పనిబట్టడం మన ముఖ్య కర్తవ్యం. నేను ఒక్కణ్ణే వెళ్ళి ఆ కోతిమూకను అల్లకల్లోలం చేసి నా పరిఘతో రామలక్ష్మణ సుగ్రీవులను హతమారుస్తాను. ఉపాయం ఉంటే చాలు! మహారాజా! ఒక్కడే శత్రువులెందరినైనా ఎదిరించగలడు.

రావణ మహారాజా! నేను మీ కొక ఉపాయం చెప్తాను. దాన్ని ఆచరిస్తే చాలు మన వాకిట విజయలక్ష్మి వచ్చి నిలుస్తుంది. మన రాక్షస వీరులందరూ మహాపరాక్రమశాలురు. కామరూపులు గదా! వీరందరూ మానవరూపంలో అస్త్రశస్త్రాలను ధరించి శ్రీరాముని దగ్గరకు వెళ్లాలి. “అన్నా! మీ కోసం రావణునితో యుద్ధం చేయడానికి భరతుడు మమ్మల్ని పంపించాడని రాముణ్ణి వంచించాలి”.

ఆ మాటలు రాముడు నమ్మి వానర సేనను తీసుకొని లంకపై దాడి చేయడానికి సమాయత్తం కమ్మని చెప్తాడు. మరుక్షణమే మనం వారిపై శూలాలు, గదలు, ధనుస్సులు చేబూని వారు తేరుకొనేలోపే చంపిపారేయాలి. ఆకాశాన నిలిచి రాళ్లు శస్త్రాలను గుప్పించి వానరులను యమపురికి పంపివేయాలి. అప్పుడు రామలక్ష్మణులు

నయవంచనకు గురి అయి కాలికి బుద్ధి చెప్తారు. వారిని మనం పట్టుకొని సంహరించి వేయాలి" అంటూ గొప్ప సలహాను వజ్రదంష్ట్రుడు రావణునికి ఇచ్చాడు.

కుంభకర్ణుని కుమారుడు నికుంభుడు కోపంతో ఊగిపోయాడు. "ప్రభూ! మీరందరూ ఇక్కడే ఉండండి. నేను ఒక్కడినే వెళ్లి ఆ రామలక్ష్మణ సుగ్రీవ హనుమదాదుల పీచమణిచి వస్తాను."

అలా ఆయన అనగానే కొండలా ఉన్న వజ్రహనువు మండిపడుతూ లేచాడు. పళ్లు పటపటలాడించాడు. "ప్రభూ! దీనికి ఇంత ఆలోచన అవసరం లేదు. మీరందరూ హాయిగా నిశ్చింతగా గుండెమీద చేయి వేసుకొని నిద్రపొండి. నేను ఒక్కణ్ణే ఆ వానరులందరిని నా ఎడమ చేతితో చిదిమివేసి వస్తాను.

మీరంతా మద్యం సేవించి రమిస్తూ ఉండండి. నేను శ్రీరాముని, లక్ష్మణుని, సుగ్రీవుని, అంగదుని, హనుమంతుణ్ణి ఒక్క చిటికెలో చంపివేసి మరలి వచ్చి మీతో కలిసి ఆనందిస్తాను. దీనికి ఇంత, మందీ మార్బలమూ అవసరం లేనేలేదు" అని వజ్రహనువు గొప్పలు చెప్పాడు.

ఇలా రావణుని యోధులందరూ ఒకరినిమించి మరొకరు వీరాధి వీరులుగా తమని తాము చిత్రించుకొంటూ శత్రువుపై వారు ఎలా జయభేరిని మ్రోగించగలరో చెప్పుతున్నారు. రావణుడు వారి మాటలు వింటూ దీర్ఘాలోచనలో పడిపోయాడు. రావణునికి వీరి మాటలు రుచించినట్లే ఉన్నాయి. తలపంకిస్తూ వినే రావణుని విభీషణుడు చూచాడు.

* * *

# విభీషణుని హితబోధ

## సర్గ - 9

**రా**క్షసులందరి ప్రగల్భాలు, అధిక ప్రసంగాలు అక్కడే ఉన్న విభీషణుడు విన్నాడు. యథార్థాన్ని విచారించకుండా పలికే వారి మాటలు విభీషణున్ని కలతపరిచాయి. శత్రువును అంచనా వేయకుండానే తమ బల సంపన్నత గురించి చెప్పుకొనే రాక్షసులు అధముల్లాగా కనిపించారు. తప్పుదోవన పోయే తనవారిని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందను కొన్నాడు.

అంతలో నికుంభుడు, రభసుడు, సూర్యశత్రువు, సుప్తఘ్నుడు, మహాపార్శ్వుడు, మహోదరుడు, అగ్నికేతువు, రశ్మికేతువు, ఇంద్రజిత్తు, ప్రహస్తుడు, విరూపాక్షుడు, వజ్రదంష్ట్రుడు, ధూమ్రాక్షుడు, అతికాయుడు, దుర్ముఖుడు– ఈ వీరులంతా కత్తులు, కటార్లు, ఈటెలు, బల్లెములు, ధనుస్సులు చేతబట్టి 'రాముని పని పట్టుతాం' అంటూ రావణునికి చెప్పుతున్నారు. విభీషణుని మనసు మూర్ఖులను చూసి చింతించింది. రావణునికి మంచి చెప్పాలని అనుకొన్నాడు. సభామర్యాదను పాటించి లేచి నిలబడ్డాడు.

"రావణ మహారాజా! మనలను వంచన చేసిన హనుమంతుణ్ణి రామలక్ష్మణులను మేం నిగ్రహిస్తాం. మేం చంపివేస్తాం" అంటూ ఉరకలు వేస్తున్న యువతను చూశావు గదా! అయ్యో! రాక్షస నాశనానికి నడుం కట్టే వీరిని ఆపాలి కదా! రాక్షస జాతి ఏమౌతుందోనని నేను కలత పడుతున్నాను. అంతలో తేరుకొని మన శాయశక్తులా రాక్షస జాతిని కాపాడాలనుకొంటున్నాను అని బాగా ఆలోచించి ఇలా చెప్పడం ఆరంభించాడు.

"నాయనలారా! ముందు నా మాట వినండి. ఆపై కార్య నిర్ణయం చేద్దాం. రణానికి తొందర లేదు. బాగా ఆలోచించి తరువాత కర్తవ్యాన్ని పాటిద్దాం. ముందుగా నేను చెప్పేది ఆలకించండి. ఎంత క్లిష్టమైన కార్యమైనా సామ దాన భేదాలనే ఉపాయాలతో ఎదుర్కోవాలి. శత్రువును కూడా ముందు సౌమ్యంగానే నిలవరించాలి. మన ఉపాయాలతో కార్యాన్ని సాధించలేకపోతే చివరి అస్త్రంగా దండోపాయాన్ని ప్రయోగించాలి. అంతేగాని బలం ఉంది కదా అని కయ్యానికి కాలు దువ్వకూడదు. యుద్ధంలో గెలుపూ ఓటమీ అనేవి దైవాధీనాలు. మనకై మనం శత్రువుపై రణభేరి మ్రోగించకూడదు.

ముందుగా మన ప్రక్కనున్న బలాన్ని తెలుసుకోవాలి. ధర్మం ఎటువైపు ఉందో సమీక్షించుకోవాలి. ఎప్పుడైనా ఎక్కడైనా ధర్మమే విజయాన్ని వరిస్తుంది. కాబట్టి, ముందు మనం ధర్మాన్ని ఆచరించడంలో విరుద్ధంగా లేము అన్నదాన్ని నిర్ధారించుకోవాలి. మనం మంచిపనే అనుకొని చేసేదంతా మంచే అయిపోదు. ఒక్కొక్కసారి మనకు మంచిదైనది ఇతరులకు కీడుచేసేది కావచ్చు. అందుకని ధర్మనిర్ణయం అతి సూక్ష్మమైనదని అన్నారు." అంటూ చెప్తూ నలువైపులా పరికించి చూశాడు. అందరూ వినమ్రంగా వింటున్నారు. విభీషణునికి మనశ్శాంతిగా అనిపించింది. అందుకే అసలు విషయం చెప్పాలనుకొని తన దీర్ఘోపన్యాసాన్ని మరల కొనసాగించాడు.

"వీరులారా! యుద్ధం దుర్బలులతో, స్త్రీలతో చేయకూడదు. మనకన్నా తక్కువ బలం ఉన్నవారిని భయపెట్టితే చాలు, యుద్ధం చేయాల్సిన అవసరం ఉండదు. అలానే మత్తులో ఉన్నవారిని, స్త్రీలతో సుఖిస్తున్నవారిని, బాలుర చేత, వృద్ధుల చేత నడిపిస్తున్న రాజ్యం మీదకాని, జాగ్రత్త లేనివారిపైన, రణాసక్తి లేక విరాగులైన వారి మీద విధివశాత్తు సంపద కోల్పోయిన వారిపై, సామంతుల చేత చిక్కి చిక్కుల పాలైన వారిమీద యుద్ధాన్ని ప్రకటించకూడదు."

"యుద్ధం మొదలు పెట్టేముందు ధర్మం, శత్రుబలాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. రాజనీతిని యుద్ధనీతిని ఎట్టి పరిస్థితులోను వదలకూడదు. నీతి బాహ్యునకు నరకం తప్ప స్వర్గం చేజిక్కదు. అలాంటప్పుడు మనం బాగా ఆలోచించి నిర్ణయం తీసుకొంటే మంచిది అవుతుంది. ఈ విషయాన్ని మరలమరల మనం ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

సీతను అపహరించుకొని రాకముందు రాముడు మనకు ఏలాంటి అపకారాన్నైనా చేశాడా? ఖరదూషణాదులు వెళ్లి యుద్ధానికి ఆహ్వానిస్తే ఏ వీరుడైన చేతులు ముడుచుకొని కూర్చోడు గదా. అందుకే రాముడు వారితో యుద్ధం చేశాడు. దానిని మనం మరచి సీతను అపహరించి అధర్మంగా ప్రవర్తించాము. అలాంటి మనపై శ్రీరాముడు జయేచ్ఛతో యుద్ధాభిలాషి అయ్యాడు. కామక్రోధాదులను జయించాడు. అపకారం చేయనివారిపై ఆ రాముడు చేయి ఎత్తడు. అటువంటివానిపై యుద్ధం చేయబూనటం ఏ మాత్రం సబబుగా ఉంది? నేను చెప్పేదానినంతా జాగ్రత్తగా విని ఆ తర్వాత నిర్ణయానికి రండి. ఎపుడైనా ఎక్కడైనా ఆవేశం అనర్థాన్నే తెస్తుంది."

"అంతేగాదు. నేడు రాముని ప్రక్క అసంఖ్యాకమైన వానరసేన ఉంది. వారంతా భగవదనుగ్రహం కలవారు అజేయులు పైగా వారు ధర్మంకోసం యుద్ధం ప్రకటిస్తున్నారు. అట్టివారిని మనం చులకనగా తీసివేయటం మంచిపనేనా? రాముడొక్కడే పద్నాలుగు వేలమంది రాక్షసులను నిర్జించాడని మనం తెలుసుకొన్నాం. మరి ఇప్పుడు వారిపై మన యుద్ధం సముచితమేనా?" అని చెప్తున్న విభీషణుడు నలుదిశలా చూశాడు.అందరూ మౌనంగా వింటున్నారు. అయితే ఇపుడు సత్యాన్ని చెప్పి వీరిని ధర్మమార్గంలో పయనింప చేయడానికి ఇది మంచి సమయమే అనుకొన్నాడు. మరల వారిని చూస్తూ చెప్పడం ఆరంభించాడు.

" పౌరులారా! మీరే మనలంకకు నిధులవంటివారు. మన రాజు పరస్త్రీయైన శ్రీరాముని భార్యను అపహరించి తెచ్చాడు. పరసతులను వాంఛించినవారికి ఫలం ఎలా ఉంటుందో మీకు తెలియదా?న్యాయాన్ని, ధర్మాన్ని నిర్ణయించేటప్పుడు చాలా జాగ్రత్తలు పాటించాలి. మనవారు కాకపోయినా వారు ధర్మం నిర్వర్తిస్తుంటే వారిని మనం గౌరవించి తీరాలి. పర స్త్రీని తాకడంవలన కీర్తిప్రతిష్టలు దెబ్బతింటాయి. ఆయువు నశిస్తుంది. పాప కార్యాచరణం వలన సమస్త సంపదలు నాశనం అయిపోతాయి. నీచజన్మ వస్తుంది. ఇహలోకంలోనే కాక పరలోకాన కూడా ఆ పాపం కట్టి కుడుపుతుంది."

"అందువలన అన్నా! రావణా! సీతాదేవిని తిరిగి ఆ శ్రీరామునికి ఇచ్చివేయడమే మంచిది. చేసిన తప్పును తెలుసుకొని తప్పును సరిదిద్దుకోవడమే ఉత్తమ లక్షణం. మీరు వీరాధివీరులు. మిమ్మల్ని మెచ్చి వచ్చిన స్త్రీలు వందల సంఖ్యలో ఉన్నారు. వారందరిని మీరు ఆనందింపచేయవచ్చు. కానీ, శ్రీ రఘువీరుని భార్యను తీసుకొని రావడం మహాతప్పు. పైగా ఆమె నిశ్చలంగా శ్రీరాముణ్ణే ధ్యానిస్తోంది. మిమ్మల్ని ఇచ్ఛగించడంలేదు. కావున మీరు ఈమెను పంపించివేసినట్లు అయితే మనం యుద్ధం చేయాల్సిన అవసరం లేదు. చేసిన తప్పును సరిదిద్దుకొంటే సరిపోతుంది.

హనుమంతుడు లంకలో చేసిన పనుల్ని మనం దుష్కార్యంగా భావించకూడదు. వారి సొమ్మును మనం హరించాం కావున అతడు ఆ కార్యాన్ని చేశాడు. అనుచితంగా ప్రవర్తించడం మీకే కాదు రాక్షస జాతికే మంచిదికాదు. శ్రీరాముడు ధర్మమూర్తి. అటువంటి వారిపై సమరం పనికిరాదు. మైథిలిని శ్రీరామునకు ఒప్పచెప్పడం యుక్తం.

సర్వ శుభలక్షణాలతో అలరారే మన లంకపై ఆ రామలక్ష్మణులు బాణాలు వేసి ఛిన్నాభిన్నం చేయకముందే మనం మేల్కోవడం మంచిది. వానర సేన అపరిమితమైంది. అజేయమైంది. అది మన లంకానాశనం చేయకముందే మనం ఆ జానకిని రామునికి ఇచ్చివేయడమే మంచిది.

అలా కాక ఆ శ్రీరామునికి పంచమ ప్రాణమైన ఆ సీతాదేవిని ఇక్కడే ఉంచితే మనం ఆపదల పాలు కావటం ఖాయం. మన జాతిని నిర్వీర్యం చేయటం ఆ రామునికి అసాధ్యం కాదు. అన్నా! ఉచితానుచితాలు తెలుసుకోకుండా కోపం తెచ్చుకోవటం అనర్థదాయకం. అది మన వినాశనానికే దారితీస్తుంది. మీరు ఆగ్రహించకుండా యుక్తమైన కార్యాన్ని చేపట్టి, మీరూ మీతోపాటు మమ్మల్ని కూడా ఉద్ధరించండి. యుద్ధం ఆపటం మీ చేతులలోనే ఉంది. ఆ శ్రీరాముని బాణాలు పదునుగాను మొనదేలి ఉన్నాయి. వాటిని ఎదిరించి నిలవడం ఎవ్వరికైనా చేతగాని పని.

మీరు మీ రాజ్యం, మీ సుతులు, బంధువులు, ప్రజలు సుఖంగా ఉండాలని వాంఛిస్తే ముందు ఆ వైదేహిని శ్రీరామునికి అప్పగించండి. లేకుంటే, యుద్ధం మనం ప్రకటించనక్కరలేదు. ఆ ధర్మాత్ముడే శంఖాన్ని ఊది మనల్ని, యమునికి అప్పగించగలడు" అని చెప్పే విభీషణుని పలుకులు రావణుడు విన్నాడు.

రావణుని కొలువుకూటమి అంతా నిశ్శబ్దంగా ఉంది. విభీషణుని మాటలు అందరిలో ఆలోచనలను రేపాయి. ఎవరికి వారు దీర్ఘాలోచనులయ్యారు. అవును, ఈ విభీషణుడు చెప్పే మాటలు నిజమే! ఎందుకంటే, ఆ సీతమ్మ తల్లి ఒంటరిగా ఉన్నసమయంలో, అదీ మాయరూపుడై భయపెట్టి మరీ తీసుకువచ్చాడు. పైగా ఆమె ఇన్నాళ్ళు గడిచినా ఆ శ్రీరాముణ్ణే తలుస్తూ కన్నీరు పెడుతోంది. ఎందరు ఎన్ని విషయాలు చెప్పినా ఆమె భర్త గుణనామాన్ని వదలక కీర్తిస్తోంది.

అటువంటి సీతమ్మను ఈ రావణుడు బలవంతపెట్టడం, భయపెట్టడం సముచితంగాలేదు అనుకొన్నారు. రావణుడు సభాభవనంలోని అందరిని చూశాడు. అందరూ మౌనంగా ఉండగా తానేం చెబుతాడోనని ఎదురుచూడ సాగాడు విభీషణుడు. తమ్ముని మాటలు తనలో ఇంత ఆలోచనను రేకెత్తిస్తున్నాయి. ఇపుడు తాను ఏం మాట్లాడుతాడనే విషయం అందరి దృష్టిని ఆకర్షిస్తున్నది. కనుక తాను చాలా జాగ్రత్తగా ఆలోచించాల్సి ఉంటుంది అనుకొన్నాడు.

విభీషణుడు అందరినీ చంచలదృక్కులతో చూస్తున్నాడు. నేను చెప్పిన విషయం సరియైనది. దాన్ని కాదనటానికి ఎవరికి ధైర్యం లేదు. కానీ, వీరందరూ మూర్ఖత్వాన్ని వీడి ఆలోచించాలి కదా! 'ఇసుకనుంచి తైలాన్నైనా తీయవచ్చుకానీ మూర్ఖుల మనసు రంజింపజేయలేము కదా! వీరు ఎలా స్పందిస్తారో అని కలతచెందాడు. రాక్షస రాజు విభీషణునికి మారు చెప్పకుండా ఆ సభలోని వారినందరిని వదిలి భవనంలోకి వెళ్లిపోయాడు.

* * *

# అపశకునాలు

## సర్గ - 10

**వి**భీషణుడు ధర్మమూర్తి, నీతిశాస్త్ర కోవిదుడు. ఆయన సీతను రామునకు అప్పగించడమే మంచిదని భావించాడు. అదే రాక్షస జాతికి ప్రయోజనకారి అని తలచాడు. అందుకే జంకు కొంకులు వదిలివేసి అన్నకు హితం చెప్పాలనుకొన్నాడు.

విభీషణుడు మంత్రులందరికీ చెప్పాడు. రావణుడు మొండివాడు కదా. నేను చెప్పేది వింటాడో వినడో ఇంకొక్కసారి చెబుదాం అనుకొన్నాడు. ప్రొద్దున్నే రావణుని అంతఃపురానికి విభీషణుడు వెళ్లాడు. అన్నగారి అంతఃపురం పెద్ద పర్వత శిఖరంలాగా ప్రకాశిస్తోంది. దానిలోపల ఎన్నెన్నో గదులు విశాలంగా విభజించి ఉన్నాయి. విద్యావేత్తలు, పండితోత్తములు రాకపోకలు చేస్తున్నారు.

శంఖరావాలతో కూడిన మంగళ తూర్యనాదాలు చెవులకింపుగా వినిపిస్తున్నాయి. వేదఘోష మారు మ్రోగుతోంది. యజ్ఞాలు చేస్తున్నారు. హోమాలు జ్వలిస్తున్నాయి. నృత్య వేణుగానాలు వినసొంపుగా ఉన్నాయి. రత్నాలు వజ్రాలతో నిర్మితమైన ఆ భవనం సూర్యతేజస్సుతో ధగధగలాడుతోంది. గంధర్వుల మందిరంలాగా కనిపించే ఆ రావణుని మందిరంలోకి విభీషణుడు అడుగుపెట్టాడు.

పెరుగు, తేనె, పేలాలు, నెయ్యి లాంటి హోమద్రవ్యాలు నిండి ఉన్నాయి. బ్రాహ్మణవేత్తలు హోమకార్యాలు చేస్తున్నారు. శ్రుతులు వినిపిస్తున్నారు. పూవులతో అక్షింతలతో కలశారాధన చేస్తున్నారు. మంత్రయుక్తంగా యజ్ఞ కార్యాన్ని చేస్తున్నారు. అక్కడున్న రాక్షసులు విభీషణుడికి స్వాగత సత్కారాలు చేశారు.

ఉన్నత ఆసనంపై కూర్చుని ఉన్న రావణుని విభీషణుడు చూసి నమస్కరించాడు. రావణుడు విభీషణుని నమస్కారాన్ని స్వీకరించి కూర్చోమని ఆసనం చూపించాడు. కుశల ప్రశ్నల తరువాత విభీషణుడు అసలు విషయం చెప్పడం ప్రారంభించాడు. "అన్నా! మీకు అన్నీ తెలుసు. తెలియనిది అంటూ ఏదీ లేదు. కాని, మీకు తెలిసీ పొరపాటు చేస్తున్నారు. దానివలన మనకు అపారమైన నష్టం వాటిల్లుతుంది. దానివలన నేను మీకు ఇన్నిసార్లు చెప్పాల్సి వస్తోంది. నేను చెప్పబోయే మాటలను విని తరువాత మీ నిర్ణయం చెప్పండి" అంటూ ముందరి కాళ్లకు బంధం వేశాడు.

"అన్నా! ఆ సీతను తెచ్చిన నాటినుండి మన లంకలో అన్నీ అపశకునాలే కనిపిస్తున్నాయి. వేద మంత్రపూర్వకంగా హోమాలు చేస్తున్నా అగ్ని ప్రజ్వరిల్లడం లేదు. దీపాలన్నీ కొడిగట్టిపోతున్నాయి. హోమాగ్నులనుండి చిటపట ధ్వనులతో కూడిన నిప్పురవ్వలు ఎగిసి వస్తున్నాయి. వంటశాలలో, వేదాధ్యయనశాలలో, అగ్ని గృహాలలో సర్పాలు వస్తున్నాయి. హోమ ద్రవ్యాలకు చీమలు పడుతున్నాయి. పాడియావులు ఒట్టిపోతున్నాయి. పట్టపుటేనుగులు మద ధారలను స్రవించడంలేదు. గుఱ్ఱాలు దీనంగా సకిలిస్తూ ఆహారాన్ని తీసుకోవడం లేదు.

అంతేగాదు, అన్నా రెండు సంధ్యాకాలాలలో నగరం సమీపంలో నక్కలు ఊళలు వేస్తున్నాయి. కాకులు గుంపులు గుంపులుగా వచ్చి భవనాలపై కూర్చుంటున్నాయి. గాడిదలు, ఒంటెలు, కంచర గాడిదలు కన్నీరు కారుస్తున్నాయి. వాటిపైన ఉండే రోమాలు నిక్కపొడుచుకొని ఉన్నాయి. వాటికి చికిత్స చేసినా అవి స్వస్థతను పొందడంలేదు.

గ్రద్దలు, కాకులు, పక్షులు అన్నీ వలయాకారంలో భవనాలపై తిరుగుతున్నాయి. నరమాంసాన్ని భక్షించే క్రూర మృగాలు పెద్దగా అరుస్తున్నాయి. అన్నా! ఇవన్నీ చూస్తుంటే నాకు సీతాదేవిని తీసుకొని రావడమే వీటి అన్నింటికీ హేతువనిపిస్తుంది. మీరు నేను చెప్పేమాటను విని ఆమెను రాముని దగ్గరకు పంపించివేయడమే మంచిదనిపిస్తోంది.

ఈ మాటలు నేను నా స్వలాభంకోసమో, నా ప్రాణాలు దక్కించుకోవడం కోసమో చెప్పడంలేదు. ఈ అపశకునాలు నాకే గాదు, అంతఃపుర వాసులకు, రాక్షస వీరులకు, స్త్రీలకు, పురుషులకు అందరికీ కనపడుతూనే ఉన్నాయి. వారందరూ మీ ముందు మాట్లాడటానికి జంకి మీకు యథార్థం చెప్పడంలేదు.

నేను మీ వాడిని కాబట్టి, నా సోదర ప్రేమతో మన వంశం కాపాడుకోవాల్సిన బాధ్యతతో మీకు చెప్తున్నాను. మీరు వీటిని తప్పుగా ఆలోచించకుండా ముందు ఆ రామునితో విరోధం పెంచుకోకుండా ఈ అగ్ని కీల ఐన సీతను ఇచ్చివేయండి. మన బాధలన్నీ ఇట్టే మాయం అవుతాయి. మరొక్కసారి ఆలోచించండి అన్నగారూ!" అని విభీషణుడు హేతుబద్ధంగా, తార్కికంగా చెప్పాడు.

'వినాశకాలే విపరీత బుద్ధిః' అన్నట్లు రావణునకు మంచి మాటలు విషపూరితంగా కనిపించాయి. కనులెర్ర జేసి "ఓ విభీషణా! శత్రువుల బలాన్ని నా ముందు పొగడడం ఒక తప్పు. ఇప్పుడేమో మనకు అరిష్టాలు జరుగుతున్నాయని చెప్తూ దానికి శకునాలను చూపి నన్ను భయపెట్టాలనుకోవడం మరింత తప్పు. అసలు నిన్ను నా ముందు మాట్లాడనీయడమే నేను చేసిన పొరపాటు. భూత భవిష్య ద్వర్తమాన కాలాలన్నీ నీకే తెలిసినట్లుగా నాకు నీతులు చెప్పడం కట్టిపెట్టు. నాకు శత్రు భయం ఏ కోశాన లేదు. శ్రీరాముడు మైథిలిని తీసుకొనిపోవటం అనేది కల్ల అది కలలో కూడా అసాధ్యం. దేవతలతో కూడిన ఇంద్రుడు కూడా నా ముందు తలవంచి తీరవలసిందే. అలాంటప్పుడు ఈ రాముని గూర్చిన బెంగ నాకు లేదు" అని దశకంఠుడు విభీషణునితో చెప్పి అక్కణ్ణుంచి పంపివేశాడు.

* * *

# మంత్ర భవనంలో మంత్రాంగం

## సర్గ – 11

**రా**వణుడు చేసిన పాపకృత్యాలు ఆపదల్ని నెత్తికెత్తుకొని వచ్చింది. రావణుని బంధువులు, హితులైన విభీషణాదులు ఎంతగా హితవు చెప్పినా రావణుడు అహంకరించి మంచిని చెవికి ఎక్కనీయలేదు. దానితో కష్టాల కడలి అందర్నీ ముంచివేయడానికి ఉరకలువేస్తూ పరుగెత్తి వచ్చింది. దాంతో పరిస్థితిని కళ్లారా చూచిన రావణుడు దిగులుతో కృశించాడు. అయినా వరగర్వం అతనిని యథార్థం చూడనీయలేదు. చేసిన పాపాన్ని సరిదిద్దుకోనీయలేదు.

అందువలన రావణునిలో అతిశయించి కామక్రోధాదులు రణానికే మొగ్గుచూపాయి. యుద్ధం అనివార్యం అని తెలిసింది. దానిని ఎలా ఐనా ఎదుర్కోవాలని రావణుడు తలచాడు. తన సేనలను సమీకరించుకోవాలన్న బుద్ధితో మహాగర్జన చేసే రథాన్ని అధిరోహించి మంత్రాంగం చేసే భవనానికి బయలుదేరాడు. రత్నాలు మణులతో పొదిగి తయారుచేసిన ఆ బంగారు రథం శోభాయమానంగా వెలిగిపోతోంది. రావణుని మదిలో కోట్ల సంఖ్యలో ఆలోచనలు ముసురుకున్నాయి. కానీ, అహంకారం, క్రోధమే అన్నింటిని అదుపు చేస్తోంది. రావణుని ఆలోచనల్లాగా గుర్రాలు పరుగెత్తుతున్నాయి.

దాన్ని చూచిన మంత్రులందరూ రావణుని అనుసరించి ఆ భవనానికి వెళ్లారు. విభీషణుడు తన రథంపై రావణునితో వెళ్ళాడు. యోధులందరూ గదలు, ఈటెలు, ఇనుప గుదియలు, గండ్రగొడ్డళ్లు, శూలాలు ధరించి రావణునితో వెళ్ళారు. ఆలోచనామందిరానికి వెళ్ళే దశగ్రీవునితో వేలకొలదిగా రాక్షసుల మహానాదాలతో, శంఖధ్వనులతో అనుసరించారు.

రావణుని రథంపై కట్టిన శ్వేతచ్ఛత్రం పున్నమినాటి వెలుగులను పంచుతోంది. రథంలోని రావణునికి సేవకులు వింజామరలు వీచి సేద తీరుస్తున్నారు. రాజమార్గంలో సాగిపోయే రథానికి ఇరువైపులా రాక్షసులు నిలబడి రావణునికి అంజలి ఘటిస్తున్నారు. జయధ్వానాలు చేస్తున్నారు. తేజస్వి ఐన రావణుడు ఆశీర్వచనాలను పొందుతూ జయధ్వనులు వింటూ భవనంలో అడుగుపెట్టాడు.

ఆలోచనా మందిరం బంగారు స్తంభాలతో, ఆస్తరణాలతో మణులు మాణిక్యాలతో భువన మోహనంగా విశ్వకర్మ నిర్మించాడు. ఆ భవనాన్ని ఆరువందల మంది పిశాచ గణాలు రక్షిస్తున్నాయి. ఆ భవనంలోని సింహాసనం విశాలంగా వైడూర్యాలతో పొదిగి ఉంది. రంగు రంగుల జింక చర్మాలతో అందంగా అలంకరించి ఉంది. దానిపై ఆనుకోవడానికి సుతిమెత్తగా బూరుగు దూదితో చేసిన దిండ్లు అమర్చారు. లంకేశ్వరుడు ఆ సింహాసనంపై హాయిగా కూర్చున్నాడు. ఆయనతో వచ్చిన వారందరూ వారి వారి తాహతులను అనుసరించి చక్కగా ఆసనాలను అలంకరించారు.

రాక్షసులందరిని ఉద్దేశించి రావణుడు చూశాడు. అక్కడ దూతలను మన శక్తి సామర్థ్యాలను ప్రదర్శించాల్సిన అవసరం వచ్చింది. ఎక్కడెక్కడి వీరులందరిని కొని తెమ్మని ఆదేశించాడు. ప్రజ్ఞాశీలురు, అమోఘ తేజో సంపన్నులు వీరాధివీరులందరిని రమ్మని కబురు పంపాడు.

రావణుని ఆజ్ఞను శిరసావహించి దూతలందరూ పరుగు పరుగున లంకలోని ప్రతి ఇంటికీ వెళ్లారు. విహారాలలో ఉండేవారిని, శయనాగారాలలో ఉండేవారిని సుఖాభిలాషులని, నిద్రలో జోగేవారిని తట్టి లేపి రావణుని ఆజ్ఞను వినిపించారు. వారందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచారు. జూలు విదిల్చిన సింహం లాగా ఒళ్ళు విరుచుకున్నారు.

మదించిన రాక్షసులందరూ రావణుని ఆజ్ఞను విన్నారు. వెంటనే రణానికి మరో ఆలోచన లేకుండా నడుం కట్టారు. తమ తమ ఆయుధాలను చేత బట్టారు. వాహనాలను అధిరోహించారు. రథాలు, గుర్రాలు, ఏనుగులు రావణుని మందిరానికి వెళ్లడానికి బారులు తీరాయి. ఇంకొందరు కాలినడకన బయలుదేరి వెళ్లారు.

అలా వచ్చిన వారందరూ రావణునికి అభివాదం చేశారు. తాము చేయవలసిన కార్యాన్ని ఆజ్ఞాపిస్తే తృటిలో చేసేస్తామన్నట్లు నిలబడ్డారు. రాజాజ్ఞను నిర్వర్తించడం కన్నా వారికి మరేది లేదన్నట్టుగా ఉన్న

వారిని రావణుడు అమితానందంతో చూశాడు. వారినందరిని రావణుడు స్వాగతించి తగిన ఆసనాలపై కూర్చోమని చెప్పాడు. రాజాజ్ఞ తలదాల్చి రావణుని ఎదురుగా వారందరూ ఆసీనులయ్యారు. పురోహితులు, శ్రోత్రియులను కూడా రావణుడు రప్పించి వారినీ కూర్చోబెట్టాడు.

విషయాలను బాగా ఆలోచించి నిర్ణయం చేయగల దిట్టలు, మంత్రాంగంలోను, శత్రువులను మట్టి కరిపించడంలోను ఆరితేరిన యోధులు, అన్నివిషయాలలో అమోఘమైన ప్రతిభావంతులు, సద్గుణోపేతులు అందరూ బాహు విక్రమ పరాక్రమవంతులు ఆసీనులయ్యారు.

చక్కని పేరు ప్రతిష్ఠలున్న విభీషణుడు రావణునికి అభివాదం చేసి తన స్థానంలో కూర్చున్నాడు. ప్రహస్తుడు మొదలైన అమాత్య గణమంతా రావణుని ఆలోచనా మందిరంలో ఆసీనులయ్యారు. ఆ రాక్షసులందరూ చక్కని అంగరాగాలను, కస్తూరి చందనాదులను అలంకరించుకొని ఉండడంతో ఆ భవనం అంతా మంచి సువాసనతో నిండిపోయింది.

సభలోని వారందరూ అత్యంత శక్తిసంపన్నులు. రాజభక్తి తత్పరులు. తమకు నియోగించిన కార్యాలలో నిమగ్నమై జయాన్ని పొందినవారు, సత్యవంతులు, పరాక్రమోపేతులు, రావణుని హితులు. వారందరూ ఆయుధ పాణులై రావణుని ఆజ్ఞ కోసం ఎదురుచూస్తున్నారు. వారందరితో కూడిన రావణుడు వసువుల మధ్యనున్న దేవేంద్రునిలాగా కనిపించాడు. అంతమంది ఉన్న ఆ సభాభవనం నిశ్శబ్దంగా ఉంది.

అందరూ సావధానులై రావణుడు ఏం చెప్తాడా! అని ఆలోచిస్తున్నారు. మరొకసారి మహారాజు వారిముఖాలను తేరిపార చూశాడు. సంతృప్తి చెందాడు. నాకు విజయం లభిస్తుంది. ఇందరున్నారు కదా అనుకొన్నాడు. మనసులో ఏమూలో ఉన్న అనుమానం మరలా తొలచడం ప్రారంభించింది. అయినా గంభీరంగా కూర్చున్నాడు. తాను చెప్పదల్చుకున్నదాన్ని మననం చేసుకొన్నాడు. సీతను గురించి మళ్ళా ఆలోచించాడు. విభీషణుడు చెప్పింది గుర్తుకు వస్తోంది. ఇతర రాక్షసులు చెప్పినదాన్ని గుర్తుచేసుకొన్నాడు.

* * *

# రావణుని పరివేదన

## సర్గ - 12

**ఆ**లోచనా మందిరానికి విచ్చేసిన ప్రముఖులందరిని రావణుడు పరిశీలించి చూశాడు. సేనాపతి ఐన ప్రహస్తునితో నగరం లోపల బయట రాక్షసులను కాపలా కాయడంలో అప్రమత్తం చేయమని చెప్పాడు. ప్రహస్తుడు రావణుని కోరిక ప్రకారం భటులకు ఆదేశాలిచ్చి వచ్చాడు. “రావణప్రభూ! ఇక లంక అంతా కట్టుదిట్టం చేశాను. మీరు నిశ్చితంగా మీ ఆలోచనను మాకు చెప్పండి” అని అడిగాడు.

ఇంద్రియ లౌల్యంతో రావణుడు పాపకృత్యం చేశాడు. చేసింది పాపమని తెలిసినా మితిమీరిన గర్వంతో తాను చేసింది తప్పుకాదని తన మనస్సాక్షినే ప్రలోభపెడుతూ తప్పుమీద తప్పు చేస్తున్నాడు. హితం చెప్పేవారిని దూరం చేసుకొంటున్నాడు. మంచిమాటలు పెడచెవిన పెడుతున్నాడు. ఏమౌతుందోనన్న ఆత్రం ఒక ప్రక్క – నేనే గెలుస్తానన్న అతిశయం మరోప్రక్క ఉంది. తాను తన ఆలోచనలను నియంత్రించుకోలేక భ్రష్టుపట్టాడు. అంతేగాక తన వంశంలో ఉండే సత్పురుషులను కూడా వక్రమార్గంలో నడిపించడానికి మార్గాన్వేషణ చేస్తూ ప్రయత్నం ఆరంభించాడా రావణుడు.

"ఓ ప్రియ సదస్యుల్లారా! ధర్మార్థ కామాలలో క్లిష్ట పరిస్థితులు ఏర్పడినపుడు లాభ నష్టాలు, ప్రియా ప్రియాలు, హితాహితాలు, సుఖదుఃఖాలు గురించి మీరు చక్కగా ఆలోచించి నాకు మంచి సూచనలిచ్చేవారు. మీరందరూ ఆలోచనలు చేయడంలో సమర్థులు. పరస్పర చర్చల ద్వారా తగు నిర్ణయం చేసి లాభాన్ని ఆర్జించవచ్చు. ఇంతవరకు మీరు నాకిచ్చిన అమూల్యాభిప్రాయాలు నిష్ఫలం కాలేదు" అంటూ రావణుడు తన అనుచరులతో మాట్లాడడం ఆరంభించాడు.

దేవతలు దిక్పాలురతో కూడిన ఇంద్రునిలాగా నేను మీ అండతో సిరిసంపదలెన్నింటినో చేజిక్కించుకొన్నాను. మీరు నాకు తోడుగా ఉండడంవల్లే ముల్లోకాలను జయించగలిగాను. ఎవరినైనా ఎదిరించగల భుజశక్తి నాలో మీ వలననే ఏర్పడింది.

నేను చేయదలచిన కార్యాలన్నీ మీకు ఇంతకుముందే చెప్పాలనుకొన్నాను. కాని, నా తమ్ముడైన బలశాలి కుంభకర్ణుడు నిద్రలో ఉండడంవలన మీతో నేను చెప్పలేకపోయాను. ఆరు నెలలనుండి నిద్రలోనున్న కుంభకర్ణుడు ఇప్పుడే మేల్కొన్నాడు. అందువలన నేను ఇంతకుముందు చేసిన, ఇప్పుడు చేయాలనుకున్న విషయం మీతో పంచుకొంటాను అంటూ కుంభకర్ణునితో రావణుడు తాను చేసిన ఘనకార్యాన్ని చెప్పసాగాడు.

"శ్రీరాముని పత్ని ఐన సీతాదేవి అతిలోక సౌందర్యవతి. ఆమెలాంటి లావణ్యవతిని నేను ఏ లోకాన చూడలేదు. సన్నని నడుముగల ఆ నవమోహనాంగిని చూచిన తోడనే నేను మన్మథ పరవశుణ్ణి అయ్యాను. కాని ఆ శుభాంగి, కల్యాణి, ఆ మందగామిని నా శయ్యాగారానికి రావడానికి ఇష్టపడడంలేదు. బంగారు ప్రతిమలాగా ఉండే ఆ శరత్కాల చంద్రబింబంలాంటి మోమును చూసి నేను రేయింబవళ్లు నిద్రలేమితో బాధపడుతున్నాను. కామ పరవశంతో వైదేహికోసం నేను అశ్రులు చాస్తున్నాను.

ఆ జానకీ పాదాలు భూమిని తాకి ఉన్నాయి. అవి లేత తమలపాకులాగా పలుచగాను, ఎఱ్ఱ మందారంలాగా ఎరుపెక్కి నన్ను వివశుణ్ణి చేస్తున్నాయి. నా మోహం రోజురోజుకీ పెరుగుతోంది. ఆమెపై నా ప్రేమ తరగడమే లేదు. మన్మథుడు నన్ను క్రోధంలోను, సంతోషంలోను వెన్నాడుతూ నన్ను పీడిస్తున్నాడు. నేను ఆ మైథిలి కోసం నిరంతరం వ్యాకులచిత్తంతో బాధపడుతున్నాను.

ఆ విశాలనేత్రి నన్ను ఒక సంవత్సర కాలం గడువు కోరింది. ప్రస్తుతం ఆమె తన భర్త ఐన రాముని కోసం ఎదురుచూస్తోంది. ఆ సీత కోరిక సముచితంగా ఉందని నేను ఆమె గడువును అంగీకరించాను. కాని, నేను మన్మథ పీడితుడినై సుదీర్ఘకాలం ఎదురుచూడడంలో వేసారిపోయాను.

క్రూర జంతువులతో నిండి ఉండే ఈ మహాసాగరాన్ని దాటడం ఒక్క రాక్షసులకే వీలవుతుంది. మానవ మాత్రుడైన రాముడు వానరులతో కలసినా ఈ సముద్రాన్ని దాటుకొని రావడం అసంభవం. కాబట్టి, నా విజయం తథ్యం. కాని, ఒక్క వానరుడు లంకా ప్రవేశం చేశాడు. లంకను చాలావరకు ధ్వంసం చేశాడు. అందువలన కార్య సాధనామార్గం గురించి ఆలోచించాల్సిన తరుణం ఆసన్నమైందని మిమ్ము పిలిచాను.

ఇంతకుముందు మీ అండదండలతోనే నేను దేవాసుర యుద్ధంలో జయభేరిని మ్రోగించాను. వానరసేనతో కూడిన సుగ్రీవాదులను వెంట బెట్టుకొని రాముడు ఆ సాగర ఆవలి తీరంలో చేరి ఉన్నాడనే వార్త వేగుల ద్వారా తెలుసుకొన్నాను. నాకు మానవమాత్రుడైన రామునివలన భయం లేదు. ఐనప్పటికీ మీ అందరి అభిప్రాయాన్ని తెలుసుకొని కర్తవ్యాన్ని నిర్ణయించుకోవటం సముచితం అని నేను భావించాను. అందుకే మీకు ఇవన్నీ చెప్తున్నాను.

కాని, నేను మనస్సు పడ్డ జానకిని ఇవ్వటానికి నేను ఏ పరిస్థితులలోను అంగీకరించను. రామలక్ష్మణులను చంపివేయాలనే స్థిర నిశ్చయంలో నేను ఉన్నాను. ఈ రెండింటిని దృష్టిలో పెట్టుకొని నాకు మీరు తోడుగా నిలిచి విజయాన్ని చేకూర్చుతారని నేను ఆశిస్తున్నాను. దీనిపై మీ అభిప్రాయాన్ని నాకు చెప్పండి" అని మోహాంధకారుడైన రావణుడు వారందరితో చెప్పాడు.

కామ పరవశత్వంతో అంధుడై అజ్ఞానంతో మాట్లాడే రావణుని చూసి కుంభకర్ణుడు మండిపడ్డాడు. "అయ్యో! జరగకూడదని జరిగిపోయింది. కానీ, తప్పు తెలుసుకోకుండా మళ్ళీ తప్పు చేయడానికి సలహాలు సంప్రదింపులు చేస్తున్నారు. అయినా నేను చెప్పదల్చుకున్నది చెప్తాను" అని అనుకొన్నాడు. కుంభకర్ణుడు చెప్పటం ఆరంభించాడు. "అన్నా! రామలక్ష్మణులను వంచించి మీరు ఈ సీతను అపహరించకముందే మీ సంగతి మాతో చెప్పి ఉంటే బాగుండేది. యమునా నది భూమికి చేరకముందే తన జనస్థానంలోని యమునోత్రి గుండాన్ని నింపి ప్రవహించినట్లుగా మీరు పాపకృత్యం చేయకముందే మీ దుర్మార్గపు ఆలోచనను మాకు చెప్పితే సముచితంగా ఉండేది. కాని ఇప్పుడు చేతులు కాలిపోయాయి, ఆకులు పట్టుకొంటే ఏమౌతుంది? చేయాల్సిన కార్యం గురించి బుద్ధిమంతులు ముందు ఆలోచిస్తారు.

నీరు అంతా గట్టు దాటివెళ్లిన తర్వాత ఆనకట్ట వేసినట్లుగా మీరు చేయాల్సిన అకృత్యం చేసేశారు. ఇప్పుడు దాన్ని గురించి దుఃఖించి ఏం లాభం? నిశ్చయాత్మక బుద్ధితో ఆలోచించి కార్యాన్ని చేసే రాజు కార్యం తరువాత పశ్చాత్తాపపడాల్సిన అవసరం ఉండదు. ధర్మవిరుద్ధ కార్యాలు చేసినప్పుడే పనులలో తారుమార్లు జరుగుతాయి. ఆ పనులు అపాత్రదానం, నిష్ప్రయోజనం అయినట్లుగా, అశుచి పాత్రలో హవిస్సులుంచడంవలన నిష్ఫలం అయ్యినట్లుగా అనర్థాన్ని కలిగిస్తాయి. బలవంతుడని విర్రవీగుతూ తొందరపాటుతో ప్రవర్తించే రాజులవలన శత్రుపక్షం వారు రాజ్యంలోని లోపాలను తెలుసుకొంటారు. క్రౌంచ పర్వత రంధ్రం నుండి పక్షులు ఆవలి తీరం వెళ్లినట్లుగా చపలచిత్తుని శత్రువులు అవలీలగా దెబ్బతీస్తారు.

మీరు అనాలోచనతో చేసిన కృత్యం విష మిశ్రితమైన ఆహారం లాంటిది. సీతాపహరణం ప్రాణాపాయకరం. ఇంతవరకు శ్రీరాముడు మిమ్మల్ని చంపకపోవడం మీ అదృష్టం అని నేను అనుకొంటున్నాను. మీరు ఇంతవరకు శత్రువులతో చేసిన పనులు అనుచితంగా ఉన్నాయి.

అయినా మీరు దుఃఖించవలసిన అవసరం లేదు. మీరు చేసిన పనివలన శత్రువులు ఏర్పడ్డారు. వారిని నేను చంపివేసి మిమ్ము కాపాడుకొంటాను. రాక్షసరాజా! నేను రణరంగంలో పరిఘ పట్టుకొని నిలిస్తే నా ముందు ఇంద్ర సూర్యులైనా, అగ్నివాయువులైనా, కుబేర వరుణులైనా పారిపోవాల్సిందే కదా. మీరు చింతించకండి. నేను ఆ రామలక్ష్మణులు సంహరించి వేస్తాను. ఆ రాముడు ఒక బాణం నాపై వేసి మరో బాణం తీసేలోపే నేను వాని రక్తం అంతా తాగివేస్తాను. అలానే లక్ష్మణుని మ్రింగివేసి తర్వాత మెల్లగా వానరసేనను భక్షిస్తాను.

అన్నా! అంతవరకు మీరు హాయిగా విహరించండి. మద్యం సేవిస్తూ, ఆనందించండి. నేను శత్రువులపై విజయాన్ని సాధించి వస్తాను. అప్పుడు ఆ సీతాదేవి రాముడు మృత్యుగ్రస్తుడయ్యాడని తెలుసుకొంటుంది. ఆమె శాశ్వతంగా మిమ్ము చేరుతుంది. ఆమెను తీసుకొని రాకుండా ముందే మాతో చెప్పిఉంటే ఈమె మీరు మోహించవలసిన కన్య కాదని చెప్పిఉండేవారం. కానీ, చెప్పకుండా సీతమ్మను తీసుకొని వచ్చేశారు కదా. ఇపుడు ఇక వెనుదిరిగి చూసి లాభం లేదు" అని అన్న చేసింది అకృత్యమైనా మందలించుతూనే సోదర ప్రేమను చూపుతూ కుంభకర్ణుడు రావణునికి ధైర్యం చెప్పాడు.

* * *

# రావణుని ప్రగల్భాలు

## సర్గ - 13

కుంభకర్ణుని మాటలు రావణునిలో ఆగ్రహాన్ని తెప్పించాయి. రావణుని కన్నులు నిప్పులు కురుస్తుండడం మహాపార్శ్వుడు చూశాడు. తన ప్రభువును శాంతపర్చాల్సిన తరుణమిదని అనుకొన్నాడు. వెంటనే క్రోధాన్ని నివారించే ఉపాయాన్ని ఆలోచించి లేచి నిలబడ్డాడు. "మహారాజా! మీరే ప్రభువు. మీకు మరొకరు చెప్పాల్సిన అవసరం ఏమున్నది? పెద్దపులుల్లాంటి క్రూరమృగ సంచారం ఉన్న దండకారణ్యం ప్రవేశించారు కదా. అప్పుడు చేతికి అందిన మధువును సేవించని వాడు ఉంటాడా? ముల్లోకాలు మిమ్మల్ని చూసి జడుస్తాయి. మీరు దేవతలను సైతం ఎదిరించగల ధీశాలురు. మీకు చేతికి చిక్కిన సీతను ఎందుకు అనుభవించలేదు? కోడిపుంజు కోడిపెట్టను వశం చేసుకొన్నట్లుగా మీరు సీతను ఆక్రమించి ఉండవచ్చు గదా. శత్రువులపై కాలు మోపినట్లుగా యథేచ్ఛగా మీరు సీతతో క్రీడించి ఉండాలి! మీ కామార్తి తొలగి మీ కోరిక నెరవేరిన తర్వాత వచ్చే ఆపదలు రాబోయే ముప్పు తర్వాత చూచుకోవచ్చు.

మీరు ఇప్పుడు చింతించాల్సిన అవసరం లేదు. ఒకవేళ యుద్ధరంగంలో ఇంద్రుడే ఎదురువచ్చినా ఇంద్రజిత్తు కుంభకర్ణులు మా అండదండలతో వారిని దూరంగా తరిమికొట్టగలరు. నీతికోవిదులమని చెప్పేవారందరూ సామదాన భేద దండోపాయాలను చెప్తూ శత్రువును చివరకు దండనకు గురి చేయవచ్చు. కాని, నాకు సామదాన భేదాలు నచ్చవు. నేను శత్రువు ఉన్నాడని తెలిస్తే చాలు భయంకరంగా పోరాడి వాణ్ణి నేలమట్టం చేసేస్తాను. అదీ నాకు చాలా ఇష్టమైన పని."

"ఓ రావణప్రభూ! ఇప్పటికే మించినది ఏదీ లేదు. మీరు నిర్భయంగా మీ ప్రీతికరమైన కార్యాచరణకు శ్రీకారం చుట్టండి. మేము లంకానగరానికి వచ్చే శత్రువులను మా అస్త్రశస్త్రాదులతో వారిని పట్టి యమపురికి పంపివేస్తాం" అని మహాపార్శ్వుడు అగ్నికి ఆజ్యం పోసినట్లుగా రావణుని దుష్కార్యాన్ని మరింతగా పెంచుకోమని చెప్పాడు.

మహాపార్శ్వుని మాటలు రావణుని దర్పాన్ని పెంచాయి. ఆనందంతో శరీరం పులకించింది. వెంటనే తాను గొప్ప వీరుడని విర్రవీగాడు. ఇక ఆనందంగా మాట్లాడడం మొదలుపెట్టాడు. "మహాపార్శ్వా! గతంలో నాకు జరిగిన అన్యాయం గురించి నీకు తెలియదు గదా! అందుకే నీవు ఇలా చెప్తున్నావు".

"ఒకసారి నేను గగన విహారం చేస్తున్నాను. "పుంజికస్థల" అను ఒక అప్సరస బ్రహ్మదేవుని అనుగ్రహానికి వెళ్తున్నట్లుగా కనిపించింది. ఆమె అతి సుకుమారవతి." ఆమె నన్ను చూసి భయపడుతూ మబ్బుల చాటున మరుగుతూ బ్రహ్మదేవుని గృహానికి వెళ్తోంది. నేను దాన్ని చూశాను. ఆమె లావణ్యానికి అబ్బురం చెందాను. ఎలా ఐనా ఆమె పొందు కావాలని తహతహలాడాను. బలవంతంగా ఆమెను నా వశం చేసుకొని ఆనందించాను

ఆ తర్వాత ఆమె బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్లింది. ఏనుగు నలిపేసిన తామరపూవులాగా దయనీయంగా ఉన్న ఆమెను చూసి బ్రహ్మ కుపితుడయ్యాడు. అందుకే, "ఈ క్షణం నుండి ఏ పరస్త్రీని ఐనా బలవంతంగా అనుభవిస్తే నీ తల వేయి ముక్కలౌతుంది" అని బ్రహ్మ నన్ను శపించాడు. దాంతో నేను భయపడి ఈనాడు సీతను బలవంతం చేయడం లేదు.

నేను సముద్రునివలె శక్తి సంపన్నుణ్ణి. నేను వాయు వేగగమనుణ్ణి. నా శక్తి తెలియని అమాయక చక్రవర్తి రాముడు నాపై యుద్ధానికి వస్తున్నాడు. నా శక్తి సామర్థ్యాలను అంచనా వేయలేక సుఖంగా నిద్రించే సింహాన్ని లేపినట్లుగా, మృత్యుదేవతనైన నన్నే ఆ రాముడు రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నాడు.

వజ్రతుల్యాలైన నా బాణాలతో ఆ రాముణ్ణి పరితపింపచేస్తాను. ఉదయాద్రిలోని బాలసూర్యుడు నక్షత్రాల కాంతిని అణచివేసినట్లుగా నేను వానర సేనతో ఉన్న రాముని పరాక్రమాన్ని అణగార్చివేస్తాను. ఇంద్రుడు, వరుణుడే నా ధాటికి ఆగలేకపోయారు గదా. ఒకసారి కుబేరుణ్ణి సైతం నేను జయించాను కదా! అప్రమేయ బలశాలినైన నా ముందు ఒక్క క్షణం నిలబడ్డానికి కూడా పనికిరాడు ఆ రాముడు. అటువంటి రాముణ్ణి త్వరలోనే నేను సంహరించివేస్తాను. అంతేకాదు, బ్రహ్మ ఇచ్చిన వరాల వలన నేను ఊరుకొన్నాను. కానీ, సీత నాకో లెక్కా నన్ను నేను నిగ్రహించుకోగల సమర్థుడ్ని. అందుకే ఈ సీత తనంత తాను గా నా పొందును కోరితేనే నేను ఆమెతో భోగిస్తాను అని అనుకొన్నాను. లేనియెడల నేను ఎన్ని రోజులైనా నన్ను నిగ్రహంగా ఉంచుకోగలను. ఆ విషయంలోనూ నేను అగ్రేసరుణ్ణే అని లోకానికి తెలియడం కూడా అవసరమే. అందుకే నేను అనుకొన్న పనిని చేయడానికి తాత్సారం చేస్తున్నాను" అని రావణుడు ప్రగల్భాలు పలికాడు.

* * *

# విభీషణుని హితోక్తులు

## సర్గ - 14

రావణాది వీరులు చెప్పే బీరాలు విభీషణుడు విన్నాడు. వీరికి బుద్ధి చెప్పాలనుకొన్నాడు. " మహారాజా! మీరందరూ తప్పుదారిలో నడవడానికి ఉరకలు వేస్తున్నారు. మీరు పూలహారమని నమ్ముతూ వేయి పడగల మహా సర్పాన్ని మెడలో వేసుకొన్నారు. అది తెలుసుకోలేక ఉన్మాదిలాగా ప్రేలుతున్నారు. మీరు సీత అని నమ్మే ఈమె స్త్రీరూపంలో ఉన్న మహాసర్పం. ఆమె అందమైన చిరునవ్వును చూచి మీరు మోహం పొందుతున్నారు. అవి సర్పానికున్న విషపూరితమైన కోరలు. ఆమె చేతికి ఉన్న వ్రేళ్ళే సర్పపు పడగలు.

మృత్యుదండాన్ని ధరించి నిలచిన రాముణ్ణి మీరు మానవ మాత్రుడని భావిస్తున్నారు. సీతాపహరణం అనేదే మహాపరాధం. ఆ అపరాధాన్ని చేసిన వాణ్ణి శ్రీరాముడే తప్పక సంహరించివేస్తాడు. మీరు ఇప్పటికైనా తెలివి తెచ్చుకొని వెంటనే ఆ సీతమ్మను రామయ్యకు అప్పగించండి. మీ ప్రాణాలే కాక మా అందరి ప్రాణాలు నిలిపినవారు అవుతారు. ఆ రాముని అమోఘ శరాలు మిమ్ము తాకకముందే మీరు త్వరపడండి. ఆ జానకిని దాశరథికి ఇచ్చివేయడమే ఎంతైనా మంచిది. రాజా! మీరు మీ బలాన్ని అంచనా వేయడంలో పొరపాటు చేస్తున్నారు. మీరు, మహాపార్శ్వుడు, కుంభకర్ణుడు, ప్రహస్తుడు, మహాకాయుడు, ఇంద్రజిత్తు వీరే కాదు సమస్త రాక్షస గణం ఆ రాముని ధాటికి తట్టుకోలేరు. మీరు ఈ ముల్లోకాలలో ఎవరిని శరణు వేడినా నిష్ప్రయోజనం అవుతుంది. ఆకాశంలోనైనా, పాతాళంలోనైనా ఆఖరికి మృత్యుదేవత ఒడిలో తలదాచుకొన్నా రాముని బాణం మమ్ములను మ్రింగివేయక మానదు" అని తాను అనుకొన్న యథార్థాన్ని కన్నులకు కట్టినట్లుగా విభీషణుడు చెబుతున్నాడు.

విభీషణుని మాటలు ప్రహస్తునకు రుచించలేదు. "విభీషణా! మాకు దేవ దానవ యక్ష కిన్నరాదులవల్లనే రణరంగంలో భయం లేదు కదా. ఇక ఈ మానవుని వలన ఎందుకంత భయం వస్తుంది?" అని ప్రహస్తుడు అడిగాడు. మహాత్ముల బుద్ధి ఏకాలంలోనైనా చక్కని ఆలోచనలే ప్రేరేపిస్తుంది కదా! అందుకే విభీషణుడు "ప్రహస్తా! ధర్మాన్ని అనుసరించనినాడు ఆ అధర్మమే నరకాన్ని సృష్టిస్తుంది. అలానే రావణుడు చేసిన అధర్మ కార్యానికి కొమ్ము కాచే మీరందరూ రణరంగంలో పరాజితులు అవడంలో ఆశ్చర్యం ఉండదు.

ఇక్ష్వాకు వంశతిలకుడైన శ్రీరాముడు రూపుకట్టిన ధర్మమే! ఆ ధర్మ నిరతుడు మహారథుడు, రణకోవిదుడు అట్టి రాముడు కబంధుని, వాలి, విరాధుడు లాంటి మహామహులను మట్టికరిపించాడు. ఆ ధర్మచింతకుని ముందు దేవతలు సైతం తలలు వంచవలసిందే.

ఆ రాముని బాణాలకు రెక్కలున్నాయి కాబట్టి, వేగంగా దూసుకొనిపోతాయి. వాటిని నిలువరించే శక్తి ఎవరికీ లేదు. వాటి శక్తిసామర్థ్యాలు నీకు తెలియదు. రాముని బాణాలు పిడుగులాంటివి. ప్రాణాంతకాలు. త్రిశీర్షుడు, కుంభకర్ణుడు, నికుంభుడు, దేవాంతకుడు, నరాంతకుడు, అతికాయుడు, అకంపనుడు వీరెవ్వరూ ఆ రాముని ముందు నిలవలేరు.

రావణుడు వ్యసనపరుడు, కార్యాలోచన చేయకుండానే కార్యాన్ని చేసేవాడు, కఠినాత్ముడు, పైకి మిత్రుల్లాగా కనిపించే మీలాంటి శత్రువుల మాటలు వినే అధముడు. మీవలన అతడు సర్వ రాక్షస జాతిని నిర్వీర్యం చేయ సంకల్పించాడు. మంచి చెడులు నిర్ణయించుకోలేని ఈ రాజు అసమర్థుడు.

ఇలాంటి రావణుడు శ్రీరామునిపై అకారణంగా కయ్యానికి కాలు దువ్వుతున్నాడు. కొరివితో తల గోక్కొంటున్నట్లుగా తెలుసుకోలేని నీచుడు. సర్పబంధంతో బంధితుడైన ఈ రావణుని రక్షించే కార్యం చేయకుండా మీరు మరింత ఊబిలోకి నెట్టివేస్తున్నారు.

హితులైన వారు బలవంతంగానైనా ముప్పుల్లో చిక్కుకున్న వారిని రక్షించి తీరాలి. మీరందరూ అసలు విషయాన్ని గ్రహించి నీతి మాలిన పని చేసిన రావణునికి బుద్ధి చెప్పండి. మిత్రులైన వారు మిత్రుడు చేయరాని పాపం చేస్తుంటే ఊరకనే చూడడం మహా నేరమౌతుంది. మీరందరూ కలిసి అవసరమైతే జుట్టు పట్టుకొని లాగియైనా ఈ అనుచిత కార్యానికి అడ్డుపడండి.

ప్రమాదకరమైన శ్రీరాముడనే మహాసముద్రంలోని సీత అనే బడబాగ్నికి ఆహుతి అయిపోయే ఈ అమాయకుడ్ని రక్షించాల్సిన బాధ్యత మీపై ఉంది. సర్వ రాక్షస క్షేమం కోరి, లంకానగర సురక్షితాన్ని కోరి, నేను మీకు మంచే చెప్తున్నాను. మహారాజ కుమారుడైన శ్రీరామునికి ఆ సీతమ్మను అప్పగించి మన కులాన్ని, వంశాన్ని, నగరాన్ని కాపాడండి.

ఉత్తములైన మంత్రులు బలాబలాలను పూర్తిగా తెలుసుకోవాలి! ఇరుపక్షాల స్థాయిని హాని వృద్ధులను బాగా ఆలోచించి ప్రభువుకు హితాన్నే కూర్చేది, అప్రియం అయినా దానినే చేయాలి. ప్రభువుకు ఇచ్చగింపు మాటలు కాక ప్రభువు హితం రాజ్యక్షేమంకోసం తపనతో నిర్ణయాలు తీసుకోవాలి. అకారణంగా రాజు రాజ్యకాంక్షతో పొరుగువారిపైన యుద్ధానికి అడుగులు వేస్తే సమర్థులైన మంత్రులు రాజుకు సత్యాన్ని చెప్పాలి. యుద్ధానికి పావు కదిపేముందు ఎదుటి వారి గురించి అన్ని విషయాలు తెలుసుకోవాలి. బలవంతులైన శత్రువును ఢీ కొంటే వచ్చే నష్టం ఎక్కువఅయితే రాజ్యక్షేమం కోరి సంధికి కూడా సిద్ధపడాలి. అదే రాజనీతి. అంతేకాని ఎదుటివారి శక్తిసామర్థ్యాలు తెలియకుండా యుద్ధానికి సిద్ధం కాకూడదు" అని ఎన్నో విధాలుగా నయానా భయాన శ్రీరాముని గూర్చి రాక్షసులకు విభీషణుడు చెప్పాడు. విభీషణుని మాటలు విన్న వారందరూ మౌనం పాటించారు. కాని యువకులైన రాక్షసులకు శత్రువును కీర్తిస్తున్నట్లు కనిపించి వారు సందిగ్ధంలో పడ్డారు.

* * *

# ఇంద్రజిత్తుకు రాముని పరిచయం

## సర్గ - 15

**బృ**హస్పతిలాగా బుద్ధి చెప్పే విభీషణుని మాటలు వయస్సులోను జ్ఞానంలో చిన్నవాడైన ఇంద్రజిత్తుకు అయోమయంగా అనిపించాయి. శత్రువు గొప్పతనాన్ని చెప్పే చిన్నాయన మాటలు అప్రస్తుతంగా కనిపించాయి.

పిరికివానిలాగా భయపడుతున్నాడనుకొన్నాడు. వయస్సు ముదిరి భయం ఆవహించి ఈ విధంగా మాట్లాడుతున్నాడు. ఆయనకు భయం పోగొట్టడం నా పని అని ఇంద్రజిత్తు అనుకొన్నాడు. అందుకని "ఓ పినతండ్రీ! మీరు ఏదో ఊహించుకొని మాట్లాడుతున్నారు. ముందు మీ భయాన్ని పారదోలండి.

రాక్షస వంశంలో పుట్టిన బాలుడు కూడా ఇలా మాట్లాడడం నేను ఇప్పటివరకూ చూడలేదు. బలపరాక్రమాలు, స్వాభిమానం ఉన్న మన వంశంలో పుట్టిన మీరు ఇలా మాట్లాడడం నేను సహించలేకుండా ఉన్నాను. "పిరికి పినతండ్రీ! మన ముందు ఆ మానవ మాత్రులెంత? నేను మీరు వారిని నిరోధించనక్కరలేదు. ఈ రాక్షస వంశంలో పుట్టిన ఏ సామాన్యుడైనా చంపివేయగలడు. ఒక పిరికిపంద తాను. భయపడేది కాక తన తోటివారిని కూడా భయాందోళనలకు గురి చేస్తాడు. నేను త్రిలోకాధిపతి అయిన దేవేంద్రుడంతటివాణ్ణే. ఆయన మత్తగజం ఐరావతం నుండి క్రిందపడవేశాను. బరబరా ఈడ్చుకొని లంకకు తీసుకొచ్చాను. అప్పుడు నన్ను చూసి దేవతలు నలుదిక్కులా పారిపోయారు. ఐరావతం యొక్క దంతాలు లాక్కొని వచ్చాను. నేను ఒక్క దేవేంద్రుని కాదు సమస్త దేవతా గణాన్ని గజగజలాడించాను" అంటూ చిన్నవాడు, ఇంద్ర సముడు, బలశాలియైన మేఘనాదుడు విభీషణుని పిరికివానిగా చిత్రించి తూలనాడాడు. **కార్యసాధకుడు గౌరవాన్ని, అవమానాన్ని ఒకటే విధంగా చూస్తాడు కదా!** అదేవిధంగా నన్ను తూలనాడుతున్నారు అని తెలిసినా వారికి మంచి చేయాలని అనిపించి ఇంద్రజిత్తుతో మాట్లాడాలని అనుకొంటున్నాడు. అందుకే విభీషణుడు తన అభిప్రాయాన్ని చెక్కు చెదరనీయకుండా "నాయనా! ఇంద్రజిత్తూ! నీవు చిన్నవాడివి. నీకు యుక్తాయుక్త విచక్షణ అబ్బలేదు. ఉడుకు రక్తంతో ఉరకలు వేసే యౌవనంలో ఉన్నావు. ఏ కార్యాచరణం వలన ఏ ఫలం అందుతుందో నీవు గ్రహించలేవు. నీ బుద్ధి విచక్షణను కోల్పోయింది. తండ్రి అనే మోహాంధకారంలో నీవు అధర్మ పక్షాన నిలిచి పోరాడటానికి ఉత్సాహం చూపిస్తున్నావు. "రావణ వినాశం తప్పదు" అని రాముడు చెప్పిన మాట విని కూడా భ్రమలో కూరుకొని మాట్లాడుతున్నావు".

"దీన్నిబట్టి నీవు పుత్రుని రూపంలో ఉన్న రావణుని శత్రువని నాకు తెలుస్తోంది. ఆత్మీయంగా నీవు మాట్లాడుతున్నప్పటికీ నీవు తలవంచుకొనే పనినే ప్రోత్సహిస్తున్నావు. బాలునివైన నిన్ను మంత్రాంగంలో కూర్చోబెట్టిన వాడూ వధార్హుడే." అని విభీషణుడు అజ్ఞానంలో ఉన్న మేఘనాదునికి బోధచేస్తున్నాడు.

మేఘనాథుడు పినతండ్రి చెప్తున్న విషయాలు వినలేక తన ముఖంలో కనిపింపచేసే భావాలను చూసిన విభీషణుడు మరలా చెప్పనారంభించాడు.

"మేఘనాథా! నీవు బుద్ధి నశించి ప్రేలుతున్నావు. నీవు అజ్ఞానంలో కొట్టుకుపోతున్నావు. వినయం లేనివాడివి. క్రూర స్వభావంతో మెలిగే నీకు సాత్విక బుద్ధి ఎక్కడనుంచి వస్తుంది? బాల్య చాపల్యంతో నీవు మాట్లాడే మాటలను మెచ్చుకొనే ఈ రావణుడు దండనార్హుడే.

మీకెవరికీ శ్రీరాముని పరాక్రమం తెలియదు. ప్రాణాంతకాలైన శ్రీరాముని శరధాటిని అంచనా వేయలేని మూర్ఖులు మీరు. మహారాజా! ఇప్పటికైనా మీరు తెలివి తెచ్చుకొని ఆ సీతా సాధ్విని సంపదలు, రత్నాలు, నగలు, దివ్య వస్త్రాలు, కానుకలు ఇచ్చి ఆ రామునికి అప్పగించి తప్పును సరిదిద్దుకొనండి. అప్పుడే మన వంశం నిలుస్తుంది. లేకపోతే లంకానాశనం తప్పదు" అంటూ విభీషణుడు ఇంద్రజిత్తుకు, రావణునికి కఠినంగా చెప్పాడు.

* * *

# విభీషణుడు రావణుని విడిచి వెళ్లటం

## సర్గ - 16

**వి**నాశకాలం దాపురించిన రావణునికి విభీషణుని మంచి మాటలు ములుకుల్లా గ్రుచ్చుకొన్నాయి. దాంతో క్రోధావేశపూరితుడై తమ్ముడని కూడా చూడకుండా విభీషణుని అవమానించటం మొదలుపెట్టాడు. "ప్రాణాపాయకరమైన విషనాగుతో కలసి జీవించవచ్చుగాని మిత్రునిలాగా ఉంటూ శత్రు పక్షపాతితో కలసి జీవించడం ప్రమాదకరం. ఈ లోకంలో ఉండే జ్ఞాతుల స్వభావం నాకు బాగా తెలుసు. వారందరూ ఎప్పుడెప్పుడు దాయాదులకు ఆపదలు ఎదురు అవుతాయా అని ఎదురుచూస్తుంటారు.

ఆపదల పాలైన జ్ఞాతులను చూసి ఒకరితో ఒకరు సంతోషంగా చెప్పుకొంటుంటారు. తమకంటే ఉన్నత స్థితిని కలిగిన వాణ్ణి, కార్యదక్షుణ్ణి, విద్వాంసుణ్ణి, ధర్మస్వభావుణ్ణి, శూరుణ్ణి అవమానిస్తుంటారు. లోపల కుళ్లు కుతంత్రాలు దాచి పైకి మాత్రం మంచివాళ్లలాగా, సాధుస్వభావులుగా, కల్మషం లేని వారిలాగా కనిపిస్తారు. తోడివారు ఆపదల పాలైనప్పుడు, తమ చేయిని అందించడం పోయి, వారి గురించి శత్రువులకు సమాచారం అందించి ద్రోహానికి పూనుకొంటారు. ఓ విభీషణా! ఇప్పుడు నీవు మా దాయాదివి కదా అందుకే దెబ్బతీయాలని చూస్తున్నట్లున్నావు."

"విభీషణా! ఒకసారి పద్మవనంలోని ఏనుగులను బంధించుదామని కొందరు నరులు వెళ్లారట. అప్పుడు వారితో ఏనుగులు కొన్ని శ్లోకాలు చెప్పాయట. వాటి సారాంశం చెప్తాను విను. ఈ లోకంలో ఎవరు గాని అగ్నికి, శస్త్రాలకు, పాశాలకు భయపడాల్సిన అవసరం అంతగా ఉండదు. కాని, స్వార్థులు, నిర్దయులు ఐన జ్ఞాతుల విషయంలో ఏమాత్రం అజాగ్రత్త వహించకూడదు. మన ఏమరుపాటును చూసి దాయాదులు ఊబిలోకి నెట్టివేసి చప్పట్లు కొట్టి ఆనందిస్తారు. ఎవరైనా మనపై దాడికి వస్తే జ్ఞాతులైన వారు వారికి అసలు రహస్యాలు చెప్పి మనల్ని పట్టించగలరు. **ఈ లోకంలో గోవుల వలన సంపద, స్త్రీల వలన చాంచల్యం, బ్రాహ్మణుల వలన ఇంద్రియ నిగ్రహం, ఎలా వస్తాయో ఆ విధంగానే జ్ఞాతుల వలన అపాయం కలిగి తీరుతుంది. విభీషణా!** నేను ముల్లోకాలను జయించిన వీరుణ్ణి. దేవతలను సైతం పాదాక్రాంతం చేసుకొన్నాను. ఐశ్వర్యవంతుణ్ణి, ఉత్తమ వంశ సంజాతుణ్ణి నన్ను చూసి నీవు ఓర్చుకోలేకున్నావు. తామరాకుపైన నీటి బిందువులు ఎలా కలసి ఉండలేవో ఆ విధంగానే దుష్టులతో స్నేహం ఎక్కువ కాలం నిలవదు.

పూలనుండి తేనెను త్రాగుతున్న తుమ్మెద, మరొక పుష్పంపై మక్కువ పెంచుకొని ఎలా వెళ్లిపోతుందో ఆ విధంగానే నా సొత్తు తింటూ నీవు శత్రువు పాట పాడుతున్నావు. ఏనుగు జలకాలాడి బయటకు వచ్చి మరల తన తొండంతో తనపైనే బురద చల్లుకొంటుంది. అలానే నీవు నీ అసూయతో నా దగ్గర మనలేకున్నావు. శరత్కాల మేఘం పూర్తిగా వర్షించి భూదేవిని సంతృప్తిపరచనట్లే జ్ఞాతివైన నీవు కులనాశనంకోసం చూస్తున్నావు. ఛీ! ఛీ!

నీవు తమ్ముడివి కాబట్టి, ప్రాణాలతో బట్టకట్టకలిగావు. ఇదే మాటలు మరొకడు మాట్లాడి ఉంటే వాడి తల నరికివేసి ఉండేవాణ్ణి." అని ఆవేశపూరితంగా పదితలల రావణుడు మాట్లాడాడు.

'చెప్పినా తెలుసుకోలేని మూర్ఖుల ముందు నిలబడడం విభీషణుడు తనదే తప్పు' అనుకొన్నాడు. ఇసుకను పిండి తైలం తీయవచ్చుగాని, మూర్ఖుల మనస్సు రంజింపచేయలేమనే మాటే నూటికి నూరుపాళ్లు నిజమనుకొన్నాడు. 'ఛీ! అంటూ అవమానించిన ధూర్తుల ముందు ఇక తలయెత్తి మంచిని చెప్పలేననుకొన్నాడు. చెవిటివానిముందు శంఖం ఊదినట్లు, మూర్ఖులకు మంచి తలకెక్కదనుకొని తన మంచిని తాను చూసుకోవాలని నిశ్చయించుకొన్నాడు.

వారి ముందు నిలవలేక చేతిలో గద పట్టుకొని ఆకాశానికి ఎగిరాడు. అంతరిక్షంలో నిలబడి "రావణా! మీరు నా పెద్దసోదరులు. అందుకే మీరు నన్నెంత తూలనాడినా భరించాను. దుష్ప్రర్తనుడు అయినా సోదరుని విడువకూడదని ధర్మానికి కట్టుబడి మిమ్ము భరించాను. కాని, విపరీత కాలం ముంచుకొచ్చిన వారికి మంచి కనిపించదు. పోయేకాలం దాపురించిన వారికి విచక్షణజ్ఞానం నశిస్తుంది.

**ఈ లోకంలో ప్రభువును మెప్పించి తమ ప్రాపకాన్ని పెంచుకొనేవారు కోకొల్లలుగా ఉంటారు. వారు అరటిపండు ఒలిచి తేనెలో ముంచి చక్కెరలో అద్ది తినిపించినట్లుగా చెడుకు మసిబూసి మంచి అనే ముసుగు వేసి తియ్యగా మాట్లాడుతారు. వారి మాటలే బుద్ధిహీనులు మెచ్చుతారు. అప్రియమైనా సత్ఫలితాలను ఇచ్చే పరుష వాక్కులు పలికేవారు అరుదుగా వుంటారు.** వారు ఉన్నా మీ లాగా వినేవారు బహు అరుదు. తగలబడిపోతున్న ఇంటిని చూసి ఆ నిప్పును ఆర్పివేయని వారు ఎవ్వరూ ఉండరు. మృత్యుపాశబద్ధుడవుతున్న మిమ్ము చూసి నా అన్నవై ఉన్నందున మిమ్ము కాపాడాలని ఎంచాను. ఎన్నోవిధాలుగా మీకు మంచి చెప్పాను. కాని, మీరే మంచిని మంచిగా చూడలేకపోయారు. ఎవరి ప్రవర్తన వారికి ఎదుటివారిలో కనిపిస్తుంది. అందుకే మీ దుర్మార్గమే మీకు నాలోను కనిపించింది. మీ లాంటి మూర్ఖులను బాగుచేయాలని తలంచడం నాదే పొరపాటు. పాముకు పాలు తాగించవచ్చు కాని, దాని కోరలనుండి అమృతాన్ని రాబట్టలేము. అదేవిధంగా మూర్ఖుని మనసును మార్చలేము. ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించాను."

"ఆ శ్రీరాముని బాణాలు సువర్ణభూషితాలు. అవి మిమ్ము కాల్చివేయడం చూడలేక మీకు హితవు చెప్పాను. శూరులు, బలశాలురు కూడా కాలం మూడినప్పుడు ఇసుకతో కట్టిన ఆనకట్టలాగా కొట్టుకుపోతారు. ఏదిఏమైనా నీ ఇష్టం వచ్చిన రీతిగా మసలుకోవయ్యా! నావలన మీరు ఇబ్బందులపాలు కానవసరంలేదు. నేను దూరంగా వెళ్లిపోతాను. మీరు క్షేమంగా ఉండాలనే నేను కోరుకొంటాను. మీరు మీ బంధువులు అందరూ క్షేమంగా ఉండండి. అయినా అధర్మపాలన వినాశహేతువు అవుతుంది. మరొక్కసారి ఆలోచించి నిర్ణయం తీసుకోండి" అని దుష్ట రావణునికి విభీషణుడు ఎన్నో బుద్ధులు చెప్పి, చివరకు విసిగి, వారితో అవమానాలు భరించలేక దూరంగా వెళ్లిపోయాడు.

* * *

# విభీషణుడు శ్రీరాముని శరణువేడటం

## సర్గ - 17

విభీషణుడు రావణునికి హితబోధ చేశాడు. దుష్టుడైన రావణుడు దానిని వినకపోగా తమ్ముణ్ణి అవమానించాడు. దుష్టులకు దూరంగా ఉండడమే మేలని విభీషణుడు ఆకాశానికి ఎగిరి ఒక ముహూర్తకాలంలో రాముడున్న చోటికి చేరాడు. ఆకాశంలో నిలిచాడు. అలా గగనమార్గాన వస్తున్న మేరు శిఖరం లాంటి ఆకారం ఉన్న రాక్షసుని వానరులు చూశారు.

ఉన్నత పర్వతాకారంలో సర్వాలంకార శోభితుడై తన అనుచరులైన ప్రముఖులతో కూడి ఆకాశాన వస్తున్న విభీషణుని చూసి వానరులు శత్రువులు వస్తున్నారనుకొని వారిలో అనుకోసాగారు. సుగ్రీవుడు కూడా వివిధ ఆభరణాలు ధరించి చేతులలో ఆయుధాలు పట్టుకొని వస్తున్న విభీషణాదులను చూశాడు. "వానరులారా ఆయుధపాణులై వస్తున్న ఆ రాక్షసులు మనపై దండెత్తి వస్తున్నట్లు వుంది" అన్నాడు. ఆ మాటలు విన్న వానరులందరూ చేతికి అందిన వృక్షాలను, శిలలను పెకిలించి పైకి ఎత్తారు.

'ప్రభూ! వీరిని తుదముట్టించడానికి అనుజ్ఞ ఇవ్వండి' అని అంటుండగానే దగ్గరగా వచ్చిన విభీషణుడు అంతరిక్షంలో నిలిచి "ఓ వానర ప్రముఖులారా! నా మాట వినండి. నేను రావణుడనే దశకంఠుని తమ్ముణ్ణి. నా పేరు విభీషణుడు. రావణుడనే లంకాధిపతి, దండకారణ్యం నుంచి రాముని పత్నిఅయిన సీతాదేవిని అపహరించుకొని వచ్చి లంకలో దాచాడు. అతనికి అడ్డువచ్చిన జటాయువును చంపివేశాడు. ఆ సీతాసాధ్విని రాక్షస స్త్రీల కాపలాలో రావణుడు బంధించాడు. నాటినుండి నేటివరకు మా అన్న అయిన రావణునకు ఎన్నో విధాలుగా నేను మంచిని చెప్పాను. చావు దగ్గర పడినవానికి ఔషధం పనిచేయనట్లుగా, నేను చెప్పే హితం రావణునికి విషపూరితంగా కనిపించి, నా మాట వినకపోగా నన్ను అవమానించాడు. అవమానాలకు తాళలేక నేను నా భార్యాపుత్రులను కూడా విడనాడి రాముణ్ణి శరణు పొందుదామని వచ్చాను. నన్నే నమ్ముకొన్న ఈ రాక్షసులు సైతం నా బాటనే ఉత్తమమైనదిగా ఆలోచించుకొని నాతోనే వచ్చారు. నేను శరణుగోరి రాముని చెంతకు వచ్చానని మీరు త్వరగా రామునికి చెప్పండి" అని విభీషణుడు పెద్ద కంఠస్వరంతో చెప్పాడు.

సుగ్రీవుడు వడివడిగా వెళ్లి శ్రీరామునితో విభీషణుని వాక్యాలు చెప్పి "రామా! ఈ విభీషణుడు శత్రు పక్షంలోని వాడు. వీనిని దృష్టిలో పెట్టుకొని మన వానర యోధుల భద్రతను గురించి ఆలోచించాలి. మనం యుద్ధం ప్రకటించడానికి మనం చేసే వ్యూహ రచన, యుద్ధనీతి, గూఢచారి చర్యలు అలానే శత్రు పక్షం వారు చేసే చర్యలు సమీక్షించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

రామా! ఈ రాక్షసులు కామరూపులు, అదృశ్యంగా కూడా ఉండగల శక్తిసంపన్నులు. వీరిని ఎట్టి పరిస్థితులలోను నమ్మగూడదు. ఈ విభీషణుడు రావణుని గూఢచారి అయినా మనం ఆశ్చర్యపోనవసరంలేదు. లేకపోయినా ఇతడు మనలో మనకు కలహాలు సృష్టించగలడు. ఇతనిని మనం నమ్మినచో మనతోనే ఉండి మన విషయాలన్నీ గ్రహించి మన లోపాలను కనిపెట్టి అదును చూచి, మనకు కాని సమయంలో మనపై దెబ్బతీయవచ్చు.

**ప్రభూ! మిత్రులను, అడవి జాతివారిని, వేతనాలపై ఆధారపడే వారిని కూడా మన సైన్యంలో చేర్చుకోవచ్చు. కాని, శత్రుపక్షం వారిని చేర్చుకోవటం నాకు అంత సమంజసంగా కనిపించడం లేదు.** ఈ విభీషణుడు మన శత్రువు అయిన రావణునికి స్వయానా తమ్ముడు. ఇతనిని విశ్వసించడం ఎలా? నాకు ఎంత ఆలోచించినా ఇతడు రావణుని గూఢచారిగానే అనిపిస్తున్నాడు. ఇతనిని బంధించడమే మేలు అనిపిస్తోంది" అని సుగ్రీవుడు తన మనస్సులోని మాటను రామునికి చెప్పాడు. ఓ నిమిషం ఆగి హృదయాందోళనతో తిరిగి రామునితో సుగ్రీవుడు మాట్లాడాలను కొన్నాడు.

"శ్రీరామా! తెలివిగల గూఢచారి ఊహించని రీతిలో శత్రువులపై దెబ్బతీయవచ్చు. గుడ్లగూబ కాకి గూటిలో చేరి మంచిగా నటిస్తూ కాకులను తినివేసినట్లుగా, ఈ విభీషణుడు మన వానర సేనలో శరణార్థిగా చేరి మనలను తప్పుదోవ పట్టించవచ్చు. అందుకే మనం ఇప్పుడే వచ్చినవారిని చంపివేద్దాం" అంటూ ఆందోళనతో సుగ్రీవుడు మరల రామునికి చెప్పాడు.

సుగ్రీవుని మాటలు శ్రీరాముడు విన్నాడు. "వానర ప్రముఖులారా! సుగ్రీవుని మాటలు సహేతుకంగా ఉన్నాయి. వాటిని మనం కాదనలేము. కాని, కార్యసంకటాలు ఏర్పడినప్పుడు ఒక మిత్రుడు అభిప్రాయం చెప్పాడు కదా అని, శ్రేయస్సు కోరేవారు ఆలోచనాప్రజ్ఞ ఉన్నవారు ఊరుకోకూడదు. మీరందరూ కూడా విభీషణుని గూర్చి మీ అభిప్రాయాలను నిర్భయంగా నాకు చెప్పండి. అందరం మాట్లాడుకొని తర్వాత ఒక నిర్ధారణకు వద్దాం" అని శ్రీరాముడు వానరులతో చెప్పాడు.

"రఘూత్తమా! మీరు స్వయంగా నిర్ణయాధికారులై ఉండి, యుక్తితో ఆలోచించగలిగి కూడా, మా అభిప్రాయాలను చెప్పమని అడిగారు. దీన్నిబట్టి మీకు మాపై ఉన్న ప్రేమాదరాలు తెలుస్తున్నాయి. మీ మహోన్నత ఉదాత్త గుణం చూసిన మా వానరులు మీకు వారి అభిప్రాయాలను ఒక్కొక్కరుగా చెప్తారు" అని వానర పెద్ద చెప్పాడు. "రామచంద్రా! శత్రుపక్షం నుండి వచ్చినవారిని నిస్సంకోచంగానే అనుమానించవచ్చు. వారు మా పినతండ్రి అయిన సుగ్రీవుడు చెప్పిన విధంగానే ఆదమరిచి ఉన్న సమయంలో మనలను దొంగ దెబ్బతీయవచ్చు. కాని, శత్రుపక్షం నుంచి మంచివారు అక్కడ మనలేక కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయి. కావున, వచ్చిన వాని గుణదోషాలను పరీక్షించిన తర్వాత ఉత్తమ గుణాలు ఉన్నవారైతే వారిని మనలో చేర్చుకోవటానికి ఎలాంటి అనుమానం ఉండదు. ఇక దోషపూరితుడని తెలిస్తే ఎలాను తిరస్కరిస్తారు కదా. నా అభిప్రాయం ప్రకారం విభీషణుని గుణదోషాలను పరీక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది" అంటూ అంగదుడు చెప్పాడు.

శరభుడను వానరుడు ఇట్లన్నాడు "గూఢచారిని నియమించి, విభీషణుని అసలు సంగతిని తెలుసుకోవడానికి మనం ప్రయత్నించవచ్చు" అనే అభిప్రాయం చెప్పాడు. జ్ఞాన వృద్ధుడైన జాంబవంతుడు ఇట్లన్నాడు. రావణుడు క్రూరాత్ముడు, పాపాత్ముడు. అట్టివాని దగ్గరనుండి రాకూడని స్థలంలోకి, మిత్రత్వం చేయకూడని వారి దగ్గరకు, రాకూడని సమయంలో వచ్చిన ఇతనిని శంకించాల్సిన అవసరం ఉందంటూ తన అభిప్రాయం చెప్పాడు. ఇలా వారి వారి అభిప్రాయాలను రామునికి వినిపించసాగారు.

రామునితో విభీషణునిపై తమ తమ అభిప్రాయాలను చెప్పడంలో భాగంగా మైందుడను వానరుడు విభీషణుని మంచి మాటలతో చేరబిలిచి మాటల నేర్పుతో విభీషణుని సచ్ఛీలం గురించి తెలుసుకొన్న తర్వాత నిర్ణయించుకోవచ్చుననే అభిప్రాయం చెప్పాడు.

అందరి మాటలు హనుమంతుడు విన్నాడు. సకల శాస్త్రాలను ఔపోసన పట్టినవాడు; నీతి కోవిదుడు; విషయాన్ని గ్రహించటంలో నేర్పున్నవాడు రామునితో ఇలా చెప్పడం ప్రారంభించాడు.

"శ్రీరామా! వీరందరూ విభీషణునిపై వారి అభిప్రాయాలు చెప్పారు. నాకు తోచినది నేను చెప్తున్నాను. బుద్ధిలో బృహస్పతులైన మీరు విచక్షణ తెలిసిన వారు. నేను వీరితో పోటీపడిగాని నా వాక్సామర్థ్యాన్ని తెల్పడానికిగాని చెప్పడం లేదు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నాకు తెలిసింది చెప్పాలనుకొంటున్నాను. శత్రుపక్షం నుండి వచ్చిన వారిలో అనర్థాలు నిర్ణయించడానికి గుణదోషాలు పరీక్షించాలనే అభిప్రాయాలు నాకు సమంజసంగా అనిపించడంలేదు. వచ్చినవారిలోని గుణదోషాలను నిర్ణయించడానికి వారికి ఏదైనా అవకాశాన్ని ఇవ్వాలి. కొత్తవారికి అవకాశం ఇవ్వడంలో మన వ్యూహం వారికి తెలిసే అవకాశం ఉంటుంది. అది కూడా మనకు మంచిది కాదనిపిస్తోంది. అలాకాక గూఢచారిని నియమించి అసలు విషయం రాబట్టాలనే అభిప్రాయం కూడా మంచిది కాదు. ఎదురుగా వచ్చిన వానిని ఉంచుకొని గూఢచారిని ఎక్కడకు పంపించాలి? అరచేతిని చూడడానికి అద్దం ఎందుకు? ఇది అంత బాగున్నట్లుగా కనిపించలేదు. అంతేకాదు, దేశ కాలానుగుణంగా ఇక్కడకు వచ్చిన శరణార్థిని అనుమానించడం యుక్తమని నాకు అనిపించడంలేదు. రావణునిలోని దోషాలని చూసి అవి మంచివి కాదని నిర్ణయించుకొన్న విభీషణుడు రామునిలోని గుణాలకు ఆనందించాడు. దుష్టుల దగ్గర ఉండి అంతమయ్యే బదులు మంచివారికి సహాయం అందించాలని వచ్చి ఉంటాడు. ఇది అతని బుద్ధికుశలత తెలుపుతుంది. పైగా వచ్చినవాడు తన పరిస్థితిని తెలుపుకుంటూనే ఉన్నాడు. కాబట్టి, తెలుసుకోవలసినది ఏముంటుంది?

గూఢచారిని నియమించి ఇతని వృత్తాంతం తెలిసికొనడం బాగా లేదు. అపరిచిత వ్యక్తులు అనువుగాని విధంగా ప్రశ్నిస్తున్నప్పుడు బుద్ధిమంతుడైన వ్యక్తి మనస్సు బాధపడుతుంది. తన గురించి చెప్తున్నా శంకించే వారిని చూసి అతడు విసుగు చెంది చాచిన స్నేహ హస్తాన్ని వెనక్కు తీసుకొని మరలిపోవచ్చు. ఈ కారణంగా అనవసరంగా ఒక మంచి మిత్రుని మనం పోగొట్టుకుంటాం.

అలాకాక, మనతో మాట్లాడే తీరును బట్టి అతని ముఖ కవళికలు, కంఠ స్వరాన్నిబట్టి అతని స్థితి కొద్దిగా అంచనా వేయవచ్చు. ఒక్కసారి చూచినంతనే భావాలను పసికట్టడం అంత సులభం కాదు. మాట్లాడేటప్పుడు ఇతని ముఖం ప్రసన్నంగానే ఉంది. కంఠస్వరంలో మార్పు కూడా లేదు. కపట బుద్ధిగలవారు ఎదురుగా రాలేరు. కాబట్టి, మోసం చేయాలనే లక్షణం అంతగా కనిపించడంలేదు. పైగా తన స్థితిని చెప్పాడు. అందుచేత, ఇతనిని సందేహించాల్సిన అవసరం నాకు అంతగా కనిపించడంలేదని హనుమంతుడు విభీషణునిపై తన అభిప్రాయం చెప్పాడు. ఎవ్వరికైనా వారి మనోభావాలను ప్రయత్నపూర్వకంగా దాచుకొన్నవారి ముఖకవళికలు వారి హావభావాల వలన బయటకు తెలుస్తాయి. కార్యశూరత్వం ఉన్న రామా! సకాలంలో పని చేయగలిగితే వారు సత్ఫలితాలను పొందుతారు."

"ప్రభూ! మీ కార్యదక్షతను, రావణుని దుర్మార్గాన్ని ఇతడు పరికించి చూశాడు. సకల శాస్త్రాలను ధర్మాన్ని ఎరిగినవాడు మీరు వాలిని వధించి సుగ్రీవునికి రాజ్యం ధారపోశారని విని ఉన్నాడు. మిమ్ము శరణుపొందితే రాజ్యలాభం కూడా కలుగుతుందనే ఆశతోనే ఇక్కడకు వచ్చి ఉంటాడు. కాబట్టి, ఇతనిని మీరు చేరదీయడం వలన మనకు లాభమే కలుగుతుందని నాకు తోస్తోంది.

శ్రీరామా! ఈ విభీషణుని గూర్చి నాకు తెలిసిన విషయం మీకు చెప్పాను. నేను ఇంతకుముందు కూడా ఈ రాక్షసుని సరళ స్వభావాన్ని చూచి ఉన్నాను. మాట నేర్పరితనాన్ని విని ఉన్నాను. అందుకే ఇతనిని గురించి మీకు చెప్పాను. ఇక మీ ఇష్టం వచ్చినట్లుగా మీరు కార్యాన్ని చేపట్టండి!" అని హనుమంతుడు విభీషణుని గూర్చితన మనసులోని మాటను రామునితో చెప్పాడు.

* * *

# శ్రీరాముని నిర్ణయం

## సర్గ - 18

**శ్రీ**రాముడు వానర ప్రముఖుల మాటలు విన్నాడు. హనుమంతుని మాటలతో రాముని ముఖం ప్రసన్నమైంది. "మిత్రులారా! మన దగ్గరకొచ్చిన విభీషణుడు గురించి నా అభిప్రాయం వినండి. నేను నా దగ్గరకు వచ్చినవారిని వారు మంచివారైనా, చెడ్డవారైనా వారిని విడిచిపెట్టను." అలా శ్రీరాముడు అనగానే సుగ్రీవుడు వెంటనే నిలబడి "శ్రీరామా! నా మనస్సు విభీషణునిలో దోషమేది లేదని చెప్తోంది. కాని, ఇతడు వచ్చిన ప్రదేశం, తత్కాల పరిస్థితులు అన్నీ ఆలోచించి చూడగా నాకు దోషాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

పైగా ఇతడు సంకట స్థితిలో అన్ననే వదిలివచ్చాడు. ఇక దేనినైనా ఎందుకు వదిలిపెట్టడు. అందువల్ల నా అభిప్రాయం చెప్పాను" అని అన్నాడు. శ్రీరాముడు లక్ష్మణునితో "సకల శాస్త్రాలు చదవనివారు, గురుసేవ చేయనివారు సుగ్రీవునిలాగా ఆలోచించలేరు. అని అంటూ సుగ్రీవా! నీవు సోదరుని విడిచి రావడం దోషం అని చెప్పావు. ఇది నిజమే, కాని ఇందులో ఒక ధర్మసూక్ష్మం ఉంది. లోకంలో సహజంగా రాజులు ఇతర దేశపు రాజులను, జ్ఞాతులను తమ శత్రువులుగా తలుస్తారు.

ఎవరైనా సంకట స్థితిలో ఉన్నప్పుడు అవకాశం చూసి దెబ్బతీస్తారు. అలాగే ఈ విభీషణుడు ఆ భయంవలనే నేడు మన దగ్గరకు వచ్చాడు. నిర్మల హృదయం ఉన్న జ్ఞాతులను, తమ బంధువులను మంచివారిగానే తలుస్తారు. కానీ, దాయాది సత్పురుషుడైనప్పటికీ కొందరు తప్పుగా భావిస్తారు. ఈ విభీషణుడు కూడా మంచివాడే. తన సోదరుడు బాగుండాలనే ఉద్దేశంతో మంచిని బోధించాడు. ఆ దుష్టుడు వినకపోగా అవమానించి ఇతనిని శంకించాడు. అందుకే రావణుని వదిలి మన దగ్గరకు వచ్చాడు. అందువలన సోదరుని విడిచి రావడం దోషయుక్తం కాదు.

శత్రుపక్షంవారిని దరిచేరనీయరాదని చెప్పావు. దీనినికూడా నీతిశాస్త్రం సమర్థించదు. మనం ఈ విభీషణుని వంశంలోనివారం కాదు. కాబట్టి, ఇతని రాజ్యానికి మనం అడ్డురాము. ఈ సంగతి ముందే గ్రహించి విభీషణుడు వచ్చి ఉంటాడు" అంటూ ఇంకా రావణుని తమ్మునిపైన తన అభిప్రాయాన్ని చెప్పుతున్నాడు.

"వానరులారా! మరొక విషయం. జ్ఞానులనేవారు ఎక్కడైనా ఉంటారు. వారు మానవులు, దేవతలు, రాక్షసులు అని కాదు. సత్త్వగుణప్రధానులు సజ్జనులన్న పేరుతో ప్రతిచోట మసులుతూనే ఉంటారు. వారి సంఖ్య తక్కువగానో, ఎక్కువగానో ఉంటుంది. అలా – ఈ రాక్షసులలో కూడా జ్ఞానులు ఉండి ఉంటారు. జ్ఞాతులు ఎవ్వరైనా కలిసిమెలిసి ఉండడంలో నిశ్చింతగా సంతోషంగా ఉండలేరు. పైగా, విభీషణుడు బిగ్గరగా తన విషయాలు చెబుతూ శరణుకోరాడు. ఇతడు రావణునినుంచి ముప్పు వస్తుందేమోనని భయపడుతున్నాడు. అందువలన మనం విభీషణుని దగ్గరకు చేరదీయవచ్చు.

సుగ్రీవా! లోకంలో నీవంటి మిత్రులుకాని, భరతుని వంటి సోదరులుకాని నావంటి పుత్రులుకాని అరుదుగా ఉంటారు" అని రాముడు చెప్పుతుండగా "శ్రీరామా! మీరు ఎన్నిచెప్పినా నాకు విభీషణుని రావణుడే పంపి ఉంటాడని అనిపిస్తోంది. వీనిని పట్టి చంపివేయడమే ఎందుకైనా మంచిదనిపిస్తోంది. ఈ విభీషణుడు మాయావి. మన దగ్గర చేరి మిమ్ము, లక్ష్మణునినేకాదు నన్ను చంపే ఆలోచనతోనే ఇక్కడకు వచ్చినట్లున్నాడు" అని ఆందోళితమనస్కుడై సుగ్రీవుడు పలికాడు.

అన్నీ విన్న రాముడు "సుగ్రీవా! ఈ విభీషణుడు రాక్షసుడైనా దుష్టుడైనా నా దగ్గరకు శరణుకోరుతూ వచ్చాడు. అందువలన నేను ఇతనికి అభయం ఇస్తున్నాను. వానరేంద్రా! నీవు భయపడకు. నేను తలచుకొంటే పిశాచాలను, దానవులను, యక్షులను సంహరిస్తాను. కాని, ఒక పావురం తన భార్యను చంపిన వేటకాని ఆకలిని తన మాంసమిచ్చి తీర్చినదట. ఒక్క పక్షే తన దగ్గరకు కీడుచేసిన శత్రువు వచ్చినా కాపాడింది. నేను మనిషినై ఉండికూడా శరణుకోరినవారిని కాదు పొమ్మని చెప్పగలనా? ఇది ఎప్పటికీ జరగదు."

"నాకు తెలిసిన ఓ మహర్షి గురించి చెబుతాను విను. నీ సందేహాలు మటుమాయం అవుతాయి. కండు మహర్షి కణ్వుని కుమారుడు. సత్యవాది ఐన కండు మహర్షి నాకు కొన్ని మంచి మాటలు చెప్పాడు" అంటూ రాముడు సుగ్రీవునకు హితకరమైన మాటలు చెప్పాడు. 'సుగ్రీవా! **శత్రువు చేతులు జోడించి శరణువేడితే కాదని చెప్పకూడదు. శత్రువు ఆర్తుడైనా, గర్వించినవాడైనా తన ప్రతిపక్షం వారి దగ్గరకు చేరినప్పుడు ప్రాణాలకు తెగించి అయినా వారిని కాపాడాలి. శరణుకోరిన వారిని ఎవరైతే స్వార్థబుద్ధితో కాపాడలేరో వారికి నరకప్రాప్తి కలుగుతుంది.**

ఈ కణ్వ మహర్షి పుత్రుడు చెప్పినదంతా నిజం. **శరణాగతుని రక్షించలేక పోయినట్లైతే మన సమస్త పుణ్యాలు హరించిపోతాయి. వారిని రక్షించినందువలన కీర్తి కూడా వస్తుంది. 'నేను నీవాడను' అని వచ్చే 'ఎవరినైనా నేను కాపాడి రక్షిస్తాను' ఇది నా వ్రతం. ఇప్పుడు ఈ విభీషణుని స్థానంలో రావణుడు శరణుకోరినా వారిని నేను ఏమాత్రం సంకోచించక అభయం ఇస్తాను. నావలన కాని, ఈ లోకం మరి ఎవ్వరివలన కాని కీడు రాకుండా కాపాడతాను'** అని శ్రీరాముడు సుగ్రీవునితో చెప్పాడు.

'శ్రీరామా! మీరు సమస్త ధర్మాలను తెలిసినవారు. మీకు తెలియని ధర్మం ఏదీ లేదు. మీ ఇష్టమే మా ఇష్టం. మీకు ఏది సమ్మతమని తోస్తే దానినే మేము మనస్ఫూర్తిగా అంగీకరించి మీ విజయానికి తోడ్పడతాము' అని సుగ్రీవుడు రామునితో చెప్పగానే రాముడు ఆ మాటలకు ఆనందించాడు. 'సుగ్రీవా! ఆ విభీషణుని సాదరంగా తోడ్కొని తీసుకొనిరా. నేను అభయం ఇచ్చాను. ఇక భయం నీ దరికి చేరదు అని నేను చెప్పానని నామాటగా చెప్పి ఆ శరణార్థిని సగౌరవంగా తీసుకొనిరా' అని చెప్పాడు. రాముని మాటలను అర్థంచేసుకొన్న సుగ్రీవుడు సంతోషంగా విభీషణుని దగ్గరకువెళ్లాడు.

* * *

# రామ విభీషణుల సంభాషణం

## సర్గ - 19

రఘురాముడు విభీషణునికి అభయం ఇచ్చాడని తెలుసుకొన్న వెంటనే గగనం నుంచి క్రిందకు తన అనుచరులతో వచ్చి విభీషణుడు రాముని పాదాలపై పడి నమస్కరించాడు. "శ్రీరామా! నేను విభీషణుడను. రాక్షసుడను. నన్ను మా అన్న అయిన రావణుడు అవమానించాడు. అతనినుంచి నేను విడివడి నా స్వజనులను త్యజించి మీ దగ్గరకు వచ్చాను.

మీపైనే నా సమస్త సుఖాలు ఆధారపడి ఉన్నాయి. నా జీవితం నా సర్వస్వం మీ ఆధీనం చేస్తున్నాను. నాకు తెలిసినదంతా మీకు చెప్పటానికి నేను సంకోచించను" అని విభీషణుడు చెప్పాడు. శ్రీరాముడు విభీషణుని లేవనెత్తి తన ప్రక్కన కూర్చోబెట్టుకొని "విభీషణా! సోదరా! నేను ఉండగా నీకు ఏ ఆపదలు రావు. ఏ ముప్పు వాటిల్లదు. నీవు నిశ్చితంగా ఇక్కడ ఉండవచ్చు. నీ గౌరవాదరాలకు ఏ ఆటంకం రాదు" అని అభయం ఇచ్చాడు.

"విభీషణా! నాకు రావణుని యథార్థ బలం గురించి నీకు తెలిసింది చెప్పు" అని రాముడు అడిగాడు. 'రాజకుమారా! రావణుడు బ్రహ్మవరప్రసాది. ఆ వర ప్రభావాన గంధర్వ, యక్ష, కిన్నరులే కాదు, దేవతలు సైతం రావణునికి తలవంచుతారు.

రావణుని సోదరుడు కుంభకర్ణుడు. ఇతడు ఇంద్రసముడు, ప్రహస్తుడు ఇతని సేనాపతి, కుంభకర్ణుడు ఒకసారి కుబేరునిపై దండెత్తి వెళ్లి అతని సేనాధిపతి ఐన మణిభద్రుని ఓడించాడు.

ఇంద్రజిత్తు రావణుని కుమారుడు. ఇతడు యుద్ధంలో గోళ్లకు బలమైన తొడుగులు, ఛేదించలేని కవచం ధరించి అదృశ్యంగా ఉంటూ యుద్ధంలో శత్రువులను సంహరిస్తాడు. ఇతడు అగ్నిని సంతృప్తిపరచి శక్తిని సంపాదించాడు.

మహోదరుడు, మహాపార్శ్వుడు, అకంపనుడు వీరు ముగ్గురూ రావణుని సేనాధిపతులు. వీరు దిక్పాలురతో సమానమైన బలం ఉన్నవారు. లంకాపురంలో పది కోట్ల సంఖ్యగల రాక్షససేన ఉంది. వారందరూ కామరూపులు అమిత తేజో బలసంపన్నులు."

అని విభీషణుడు రావణుని బలసంపదనంతా రామునికి చెప్పాడు. 'విభీషణా! నీవు చెప్పినదంతా నేను బాగా విని ఆలోచించి చెప్తున్నాను. వారినందరిని నేను సంహరించి నిన్ను పట్టాభిషిక్తుని చేస్తాను' అని రాముడు అనగానే విభీషణుని కళ్లల్లో ఆనందాశ్రువులు నిండాయి. అది విన్న వానరులందరూ 'బాగు బాగు' అని రాముణ్ణి ప్రశంసించారు. 'లక్ష్మణా! సముద్రజలం తెచ్చి ఈ వానరుల ఎదుట విభీషణుని రాక్షసరాజుగా అభిషేకించు' అని రాముడు చెప్పాడు. ఆ విధంగానే లక్ష్మణుడు చేశాడు.

అభిషిక్తుడైన విభీషణుడు 'శ్రీరామా! నేను రావణుని గూర్చిన సమస్తాన్ని మీకు చెప్తాను. అంతేకాదు, మీ పక్షాన నిలచి శత్రువులతో పోరాడతాను అని ప్రతిజ్ఞ చేస్తున్నాను' అంటూ ప్రతిజ్ఞాపూర్వకంగా రామునకు విభీషణుడు మాట ఇచ్చాడు.

సుగ్రీవుడు, హనుమంతుడు కలసి విభీషణుని ఈ మహాసముద్రాన్ని దాటటానికి కావలసిన మార్గం ఏదైనా చెప్పమని అని అడిగారు.

"మిత్రులారా! రఘువంశంలోని సగరునిచే త్రవ్వబడిన సాగరం నేడు శ్రీరాముని కార్యంలో తోడ్పడగలదు. దానికి ఈ శ్రీరామచంద్రుడే సాగరుని వేడుకొని వారధి నిర్మించడానికి వీలుకలిగించమని ప్రార్థించాలి" అనిచెప్పాడు.

సుగ్రీవాదులు విభీషణుని సూచనను రామునికి చెప్పారు. రాముడు సంతోషంతో విభీషణుని చూశాడు. 'లక్ష్మణా! నీవు, సుగ్రీవుడు విభీషణుని మాటలు విన్నారు. మీరిద్దరూ శాస్త్రప్రవీణులు, ఆలోచనలో దిట్టలు. మీరు ఆలోచించి నాకు ఏమిచేయాలో చెప్పండి' అని రాముడడగ్గా అక్కడేవున్న హనుమంతునితో సహా లక్ష్మణసుగ్రీవులు సముద్రుణ్ణి ప్రార్థించడం మంచిదేనని చెప్పారు.

తిమింగిలాది జంతువులతో నిండిన ఈ అంబుధిని వారధి లేకుండా దాటడం దేవతలకైననూ అసాధ్యమే. కాబట్టి, విభీషణుని ఆలోచన ప్రకారం వారధి నిర్మించడానికి వీలునివ్వమని సముద్రుణ్ణి ప్రార్థించడం మంచిదని వానర ప్రముఖులందరూ రామునికి ఏకగ్రీవంగా తమ అభిప్రాయాన్ని చెప్పారు. రాముడు దానికి సమ్మతించాడు.

రాముడు అప్పుడే సముద్రుని దగ్గరగావెళ్లి దర్భాసనం పరచి దానిమీద ఆసీనుడై సముద్రునికి నమస్కరించాడు.

* * *

# రావణుని రాయబారం

## సర్గ - 20

శార్దూలుడను రాక్షసుడు సముద్రతీరంలో నిలచి ఉన్న వానర సేననంతా చూశాడు. వానరులంతా కలిసి మరొక మహాసముద్రం ఉన్నట్టుగా శార్దూలునకు అనిపించింది. అతని శరీరం కంపించింది. ఇక రావణుని పని అయిపోయినట్లే అనుకొన్నాడు. వెంటనే తన ప్రభువుకు విషయం చెప్పి రాజ్యాన్ని కాపాడాలని రాజభక్తితో లంకకు పరుగెత్తాడు.

"మహాప్రభూ! సీత జాడ తెలుసుకొని యుద్ధం చేయడానికి సన్నద్ధులై ఉన్న సుగ్రీవుని వానరసేనను చూశాను. విభాగాలుగా విభజించబడి లెక్కకు అందనంత వానరసేన సముద్రతీరంలో నిలచి ఉంది. వారి మధ్య ధీర గంభీరులు, ఆజానుబాహులు ఐన రామలక్ష్మణులు ఉన్నారు. భల్లూక సైన్యం, వానర సైన్యం శ్రీరామునకు జయజయధ్వానం చేస్తోంది.

వారిని నిలవరించడానికి మీరు త్వరగా ఏదైనా సామదాన భేదోపాయాలను ఉపయోగించాలి! లేకపోతే లంకకు గొప్ప ఆపద వచ్చేట్లు ఉంది" అని భయకంపితుడైన శార్దూలుడు చెప్పగానే రావణుడు నీరుగారిపోయాడు. ఏంచేయాలో తెలుసుకోలేక చాలాసేపు ఆలోచించాడు. సుగ్రీవుని దగ్గరకు రాయబారిని పంపించి భేదోపాయంద్వారా ప్రతిపక్షాన్ని చెల్లాచెదురు చేయవచ్చుని అనుకొన్నాడు.

వెంటనే శుకాసురుని పిలిచాడు. 'నీవు వెంటనే సుగ్రీవుని దగ్గరకు నా దూతగా వెళ్లి నేను చెప్పినదంతా నిర్భయంగా చెప్పి వారిని రామలక్ష్మణుల దగ్గరనుంచి విడదీసి పంపివేసిరా' అని చెప్పాడు. వెంటనే శుకుడు సుగ్రీవుని దగ్గరకు వెళ్ళాడు. అపార సేనావాహినిని చూశాడు. పక్షిరూపంలో గగనాన నిలచి అంతా పరికించి చూశాడు. తరువాత సుగ్రీవుని ఉద్దేశించి రావణుడు చెప్పి పంపిన మాటల్ని అలాగే చెప్పసాగాడు.

"ఓ కపివరా! మీరు వానర కులాన పుట్టారు. ఋక్షరజసుని కుమారుడవు. నాకు నీవు సోదరునితో సమానం. నేను ధీమంతుడైన రాముని పత్నిని అపహరించినంత మాత్రాన నీకు జరిగిన నష్టం ఏముంది? వాలి నాకు మిత్రుడు. వాలి తమ్మునివైన నీవూ సోదరునివే. ఆ రామలక్ష్మణులైన నరులతో నీ మైత్రి వలన నీకు ఒరిగే లాభం ఏమీలేదు".

మీరందరూ మా పక్షాన నిలిచి ఉంటే మీకు చాలా మేలు జరుగుతుంది. అంతా ఆలోచించి నీవు ఈ నరులను వదిలి కిష్కింధకు తరలివెళ్లు. నీకు శుభం జరుగుతుంది" అని రావణుని మాటగా శుకాసురుడు సుగ్రీవునితో చెప్పాడు. అంతేకాదు, ఈ సముద్రం దాటడం దేవతలకే అసాధ్యం ఐనప్పుడు, ఇక ఈ నరవానరులకు సాధ్యమయ్యే పనేనా అంటూ విషయం చెప్పి గబుక్కున పైకి ఎగిరి నిలిచాడు.

ఆ రావణుని సందేశం వినగానే ఆ వానరులందరూ ఒకేసారి పైకెగిరి ఆ చిలుక రూపంలోని రాక్షసుని పట్టుకొని రెక్కలు ఊడబెరుకుతూ ముష్టిఘాతాలతో నేలపై పడవేశారు. వానరులకు భయపడిన రాక్షసుడు రఘురామునికి తన బాధను మొరపెట్టుకున్నాడు. 'రామా! దూత తన యజమాని కార్యాన్ని చేయకుండా

ఉండలేదుకదా. అందుకే నేను నా ప్రభువు ఐన రావణుని మాటలను యథాతథంగా చెప్పాను. అలాంటి నన్ను ఈ వానరులు బాధిస్తున్నారు. వీరిని బాధించవద్దని మీరు చెప్పండి' అంటూ వేడుకొన్నాడు. శుక రాక్షసుని బాధించవద్దని రాముడు చెప్పగా వానరులు ఆయనను వదిలేశారు. ఆ రాక్షసుడు చటుక్కున ఎగిరి అంతరిక్షంలో నిలచి 'సుగ్రీవా! జనులందరిని బాధించు రావణునకు నన్ను ఏమి చెప్పమంటావు?' అని అడిగాడు. ఆ మాటలకు సుగ్రీవుడు మండిపడ్డాడు. రావణుని పేరు విన్న సుగ్రీవుడు ఆగ్రహంతో ఊగిపోయాడు. అందుకే మిక్కిలి కోపంతో 'ఓ రావణా! నీవు వధార్హుడవు. నీవు నాకేవిధంగా మిత్రుడవుగాని, సోదరుడవుగాని కాలేవు. నీవు నాకు ఏ మేలును చేయలేదు. ప్రియమైనవాడివి కూడా కాదు. పైగా నా మిత్రుడైన రామునకు విరోధివి. ఆ ఉత్తముని భార్యను అపహరించి చేయరాని తప్పుచేశావు. అందుకే నీ చావు తప్పదు".

"నీవు ముల్లోకాలలో దాగినా, ఎవ్వరూ నిన్ను రాముని బాణంనుంచి రక్షించలేరు. నీ బంధువులను, స్వజనులను అందరిని వానరసేనతో కలిసి రామలక్ష్మణులు యమపురికి పంపివేస్తారు. నిన్ను రక్షించడానికి పరమ శివుడైనా రాడు. శ్రీరాముని బాణాల తాకిడికి గంధర్వ, రాక్షస, పిశాచ, కిన్నరాదులు సైతం గడగడలాడుతారు. నిన్ను రక్షించే నాథుడు ఏ లోకాన లేడు. నీవు ఈ సత్యాన్ని తెలుసుకో. నిన్ను ఎదుర్కొన్న జటాయువును ఎందుకు చంపావు?"

"రామలక్ష్మణులు లేని సమయంలో దొంగలా వచ్చి సీతమ్మను ఎలా అపహరించావు? అది ఘనకార్యం అని ఎలా భ్రమిస్తున్నావు? రఘురాముడు దేవతలకు సైతం దుర్జయుడు. ఆ మహావీరుడు నీ ప్రాణాలను తప్పక హరించివేస్తాడు అని నామాటగా రావణునికి చెప్పు" అని సుగ్రీవుడు శుకాసురునితో చెప్పాడు. అక్కడే ఉన్న అంగదుడు పక్షిరూపంలో ఉన్న రాక్షసుని చూచి సుగ్రీవా! ఇతడు దూతగా వచ్చిన శత్రువు గూఢచారి. ఇతడు మన సేననంతా కలయచూస్తున్నాడు. వీణ్ణి అంతమొందించడం మంచిది అని చెప్పాడు. దాంతో మరల వానరులు శుకుని వేధించసాగారు. 'రామా! నన్ను ఈ వానరులనుంచి రక్షించు. లేకుంటే నేను పుట్టిన నాటినుంచి నేటివరకు నేను చేసిన పాపాలు వీరిని చేరుతాయి. రామా! దూతలను చంపకూడదనే విషయం ఈ వానరులకు చెప్పు' అంటూ ప్రార్థించాడు. రాముడు ఆ మాటలు విని వానరులను వారించాడు.

* * *

# సముద్రునిపై రామబాణ ప్రయోగం

## సర్గ - 21

**స**ముద్రుని దగ్గర రాముడు నియమ నిష్ఠలతో మూడు రోజులు పడుకొన్నాడు. తదేక దీక్షతో సముద్రుని ప్రార్థించాడు. తన కుడి చేతిని తలగడగా చేసుకొని ఆ దర్భాసనం మీదనే పడుకొంటూ ఏకాగ్రచిత్తంతో సాగరుణ్ణి దారి ఇవ్వమని వేడుకొన్నాడు. ఎంత వేడినా సముద్రుడు రామునకు దర్శనం ఇవ్వలేదు. ఏమాత్రం తొణకలేదు. సముద్రంలో ఎప్పటిలాగే తరంగ ఘోషలు దిశదిశలా వినిపిస్తూనే ఉన్నాయి.

దర్శనం ఇవ్వని సముద్రుణ్ణి రాముడు చూశాడు. రాముని సన్నిధిలో గుండె కరిగి సజలనేత్రుడు కాని దర్శనమివ్వని జలధీశుని కరుడుగట్టిన హృదయాన్ని రాముడు అవలోకించాడు. సహజంగా కరుణాపయోనిధియైన రాముని హృదయం కోపంతో ఘనీభవించింది.

వెంటనే లక్ష్మణునితో "లక్ష్మణా! నా ధనుస్సు ఇలా తీసుకొని రా! నేను ఇంతవరకు ఋజువర్తనంతో సముద్రుని వేడుకొన్నాను. నా సీతను దక్కించుకొనే ఉపాయం చెప్పమని ప్రార్థించాను. దీనినంతా నా అసమర్థతగా సాగరుడు లెక్కించినట్లున్నాడు. ఇప్పుడే నేను నారిని సంధించి నా బాణ ప్రయోగంతో ఈ సముద్రుని చీల్చి చెండాడుతాను" అంటూ కోపంతో మండిపోతూ ఎర్ర జీరలున్న కన్నులతో రాముడు లక్ష్మణుడు అందించిన వింటిని చేబూనాడు.

'సౌమిత్రీ! మంచి గుణాలున్న వారిని ఎదుటివారు తక్కువ అంచనా వేస్తారు. వారి సద్బుద్ధిని చేతకానితనమని భావించి విర్రవీగుతారు. అలానే నేడు ఈ సముద్రుడు దారినివ్వకుండా ఉరకలు వేస్తున్నాడు. ఇప్పుడే నేను వీని పని పట్టుతాను. మీనాలు, మొసళ్ళు, తిమింగలాల లాంటి జలచరాలనన్నింటిని ఒక్క బాణంతో చంపివేస్తాను. శాంత స్వభావంతో ఈ లోకంలో కీర్తిప్రతిష్ఠలు కలుగవు. అందుకే నా ఉగ్రరూపాన్ని చూపి ఈ సముద్రుని ఇప్పుడే ఎండింపజేస్తాను. నీటి ఏనుగుల తొండాలు, సర్పాలు వీటినన్నింటిని ముక్కలు చేసి సాగరంపై తేలియాడేటట్లు చేస్తాను. నేను ప్రార్థించినా దారినివ్వని సముద్రుని శుష్కింపజేస్తాను. అప్పుడే ఈ వానరులందరూ నడిచి ఆవలి తీరానికి చేరుతారు.

సముద్రం ఎండిపోదనేది లోక ప్రసిద్ధి గదా. నేడు నా శరాఘాతంతో ఎండింపజేస్తాను. ఉవ్వెత్తున ఎగిసిపడే అలలున్న ఈ సాగరాన్ని అల్లకల్లోల పరిచి హద్దులను దాటి ప్రవహింపజేస్తాను.' ఇలా చెపుతూ రాముడు ప్రళయ కాలాగ్నునిలాగా నిప్పులు చెరుగుతూ కోదండాన్ని చేతబట్టాడు. ఆగ్రహోదగ్రుడై నారిని సంధించాడు. స్వామి యొక్క ధనుష్టంకారం విని జగమంతా కంపించిపోయింది. వాడియైన శరం వింటినుండి బయలుపడి సముద్ర జలాలలోకి వెళ్ళింది.

సముద్రంలోని జలచరాలన్నీ భయపడి చెల్లాచెదురు అయ్యాయి. అలల వేగం పెనుగాలులతో కూడి భయంకరంగా పెద్ద పెద్ద తరంగాలు ఆకాశం అంత ఎత్తుకు ఎగిరాయి. సముద్ర గర్భంలో శంఖాలు, ముత్యాలు అన్నీ పైకి తన్నుకొచ్చి తేలియాడసాగాయి. రామబాణ ధాటికి సర్పాలు అగ్ని బాధలు అనుభవించసాగాయి. దానవులున్న ఆ సాగరం అతలాకుతలమయింది. పాతాళలోకాన ఉన్న రాక్షసులు బెంబేలు పడ్డారు. నీళ్ల సుళ్లు తిరగసాగాయి. మహాసముద్రం అంతా అల్లకల్లోలం కాగా, మొసళ్లు, మీనాలు, తిమింగలాలు అన్నీ తరంగాలతో లేచి భూమిని చేరుతున్నాయి. రాముడు కోపం వీడక మరల ధనుస్సును ఎక్కుపెట్టబోయాడు. అంతట సౌమిత్రి పరుగు పరుగున వచ్చి ధనుస్సు పట్టుకుని 'అన్నా! క్రోధం వీడు. సత్పురుషులకు కోపం అందగించదు' అంటూ శరానికి అడ్డుగా నిలిచాడు.

* * *

# సేతు నిర్మాణం

## సర్గ - 22

శ్రీరాముని కోపం తగ్గలేదు. సముద్రుని దర్శనం కాలేదు. సాగరం అంతా అల్లకల్లోలం అయిపోయింది. లక్ష్మణుడు వారిస్తున్నా రాముడు కోపోద్రిక్తుడై "సముద్రా! నేడు పాతాళలోకం వరకు వ్యాపించి ఉన్న నిన్ను నా బాణంతో శుష్కింపజేస్తాను. నీలోని ప్రాణులన్నీ నశించేలాగ చేస్తాను. నీ స్థానాన ఇసుక రేణువులు మాత్రమే ఉండేలా నిన్ను ఎండగట్టుతాను. అప్పుడు నా వానర యోధులందరూ హాయిగా నీ మధ్యనుండి నడిచి ఆవలి తీరానికి చేరిపోతారు.

సముద్రా! నీవు దానవులకు ఆశ్రయం ఇచ్చి వారి స్వభావాన్ని ఒంటబట్టించుకొన్నట్లు ఉన్నావు. అందువలనే నా ప్రతాపాన్ని తెలిసి నీవు మిన్నకున్నావు' అంటూ శ్రీరాముడు నారిని సంధించాడు. అమోఘమైన బాణాన్ని తీసి ఎక్కుపెట్టి బ్రహ్మాస్త్రాన్ని జపించసాగాడు. నారిని ఆకర్ణాంతం లాగుతుండగా భూమ్యాకాశాలు బ్రద్దలు అయినట్లుగా ధ్వని వచ్చింది. పర్వతాలు భూమి అంతా కంపించిపోతోంది. లోకమంతా చీకట్లు క్రమ్ముకొన్నాయి.

సరస్సులు, నదీనదాలు అన్నీ కంపనకు గురి అవుతున్నాయి. సూర్యచంద్రాదులు గతులు తప్పినట్లుగా అనిపించాయి. వందలకొలది ఉల్కలు గగనం నిండిపోయాయి. గాలుల రాపిడివలన పెద్ద పెద్ద శబ్దాలతో జగతి అట్టుడికినట్లు అయిపోసాగింది. ఒక్కసారిగా పెనుగాలులు విజృంభించి ఆకాశాన మేఘాలను చెదరగొట్టుతున్నాయి. ఆ గాలుల వలన వృక్షాలన్నీ కూకటివేళ్ళను తెంపుకుని నేలపై పడిపోయాయి.

పర్వతాల కంపనతో పెద్ద పెద్ద శిఖరాలు కొట్టుకొని పిండి పిండిగా నేలకు రాలుతున్నాయి. మేఘాలు ఒకదానితో మరొకటి రుద్దుకుంటూ మహాగర్జన చేస్తున్నాయి. అగ్నిజ్వాలలతో కూడిన మెరుపులు ఉరుములతో ఆకాశం దద్దరిల్లుతోంది. భూమి మీద, పాతాళంలో, సముద్రంలో ప్రాణులన్నీ గగ్గోలుగా అరవసాగాయి.

లోకానికి కనపడని పిశాచ గణాలు భయంతో రొద చేస్తున్నాయి. భయంకర ధ్వనులకు భీతి చెంది కొన్ని ప్రాణాలు అనంతవాయువులో లీనం అయ్యాయి. ఈ సమయంలో సముద్రం ఉన్నదానికన్నా ఒక యోజన పర్యంతం ఎక్కువగా అలలతో ఆక్రమించింది. భయంకరమైన వేగంతో తరంగాలు ఆకాశం దాకా ఎగిసి ఎగిసిపడుతున్నాయి.

గర్వోన్నతుడైన సముద్రుడు పారిపోతున్నట్లు హద్దు దాటి సముద్రం ముందుకు పరుగెత్తుతూ ఉంది. అలాంటి స్థితిలో ఉన్న సాగరుని చూచిన రాముడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించక అలానే పట్టుకుని కొంత తడవు చూశాడు. అప్పుడు దిక్కులు పిక్కటిల్లేటట్లుగా సముద్రం గర్జించింది. సముద్ర మధ్యంనుండి మేరుపర్వతం వంటి శరీరంతో సూర్యునిలాగా వెలుగులీనే ఓ దివ్యపురుషుడు అక్కడున్న వారికి కనిపించాడు.

ఆ దివ్య పురుషుడు సర్వాలంకార భూషితుడై శ్యామ వర్ణంతో భాసిల్లాడు. దివ్య వెలుగులతో ఉన్న సముద్రుడు మెల్లమెల్లగా సాగరగర్భంలోంచి బయటకు వచ్చాడు.

రత్న గర్భుడైన సాగరుడు రత్నాలు, ముత్యాలతో కూర్చిన ఆభరణాలు ధరించి ఉన్నాడు. ఆయన నేత్రాలు తామర రేకులను పోలి ఉన్నాయి. ఆయన శిరస్సుపైన మంచి సువాసనాభరితమైన పూలు అలంకరించి ఉన్నాయి. ఆయన వక్షస్థలాన ఉన్న ముత్యాల సరం మధ్య కౌస్తుభం కూర్చి ఉంది. చక్కని రూపయౌవనాదులతోన్న ఆ సాగరుడు ధనుర్బాణాలు ధరించి ఆగ్రహుడై నిలచిన రాముని చెంతకు వచ్చిచేతులు జోడించి నిలిచాడు.

'ఓ రఘువరా! నమస్కారం. భూమి, వాయువు, ఆకాశం, జలం, అగ్ని ఎలా అయితే వాటి స్వభావాన్ని అనుసరించి శీతోష్ణాదులను కలిగి ఉంటాయో, ఆ విధంగానే లోతుగాను దాటడానికి శక్యంగాకుండా ఉండటం నా స్వభావం. లోతు లేకుండడం అనేది నా స్వభావానికి విరుద్ధం గదా! రామచంద్రా! నేను చెప్పేది సావధానంతో విను. నీ ఆగ్రహాన్ని ఉపశమింపచేసుకొని నా మాటను దయతో ఆలకించు స్వామీ!' అంటూ సాగరుడు రాముడిని వేడుకొన్నాడు.

'మహారాజ కుమారా! జల జంతువులతో అల్లకల్లోలంగా ఉండే నా శరీరాన్ని నేను ఏ విధంగా స్తంభింపచేయగలను? ఈ జలాన్ని, ధన, లోభ, దండ భయాలతో నేను ఎలా నిగ్రహించగలను? రామా! నేను మీ కోసం ఒక్క పనిని చేయగలను. మీరు లంకకు వెళ్లడానికి దారిని ఇవ్వగలను. వానరులందరూ నా జలాన్ని నిర్భయంగా దాటడానికి వీలును ఏర్పరుస్తాను. మీరందరూ ఆవలికి వెళ్ళేవరకు మిమ్ము జలచరాలు బాధించకుండా చూస్తాను. ఇంతకన్నా నేను ఏమి చేయగలను? నన్ను అర్థం చేసుకొని అనుగ్రహించు వదలిపెట్టు. కోపాన్ని వదలిపెట్టు' అంటూ సాగరుడు పదేపదే రామునికి విన్నవించుకొన్నాడు.

ఆ మాటలకు రాముడు సంతోషించి ఆగ్రహాన్ని విడిచిపెట్టాడు. 'సాగరా! నేను ఎక్కుపెట్టిన బాణం వృథా కారాదు. అందువలన నీపై నేను ప్రయోగించాలనుకున్న ఈ బ్రహ్మాస్త్రాన్ని ఎక్కడ విడవమంటావో నీవే చెప్పు' అంటూ సాగరుణ్ణి అడిగాడు. ఆ మాటలు విని సాగరుడు ' రామా! ఉత్తర దిశలో ద్రుమకుల్యం అను ప్రదేశం ఉంది. అక్కడ ఆభీరులను అడవి జాతివారు ఉన్నారు. వారందరూ పాపాత్ములై పాపకృత్యాలు చేస్తున్నారు. వారి పాపాన్ని నేను ఓర్చుకోలేక ఉన్నాను.

దారిదోపిడీ లాంటి అకృత్యాలు చేస్తూ నా జలాన్ని సేవిస్తున్నారు. వారి ఆగడాలను నిర్మూలించలేక నేను చాలా రోదిస్తున్నాను. అందుకే మీ అమోఘమైన బాణాన్ని ద్రుమకుల్యంపై వేసి వారినందరిని తుదముట్టించు' అని అడిగాడు. వెంటనే సంధించి ఉన్న బ్రహ్మాస్త్రాన్ని ద్రుమకుల్యంపై రాముడు వదిలాడు.

ఆ బాణం వెళ్లి భూమిలో గ్రుచ్చుకొని పాతాళంవరకు సాగింది. అక్కడనుంచి నీరు ఎగజిమ్మి వచ్చి ఆ ప్రదేశాన్నంతా ముంచివేసింది. ఆ బాణం గుచ్చుకున్న తావును **'వ్రణకూపం'** అనే పేరుతో ప్రసిద్ధికెక్కింది. ఆ బాణం గుచ్చుకొని నీరు వచ్చేటప్పుడు పెద్ద శబ్దం వచ్చింది. శ్రీరాముడు ఊరుతూ వస్తున్న ఆ జలాశయంలోని నీటినంతా ఎండగట్టించాడు.

రామబాణంతో శుష్కించిన ఆ ప్రదేశం **'మరుకాంతారం'** అన్న పేరుతో ప్రసిద్ధమైంది. **'మరుకాంతారం'** సముద్ర కుక్షిగా ఉన్న భూమికి రాముడు ఆ ప్రదేశం ఎప్పుడు పశువులకు ఇష్టమైన పచ్చిక బయళ్ళతో సమృద్ధిగా

ఉండేటట్లుగా వరం ప్రసాదించాడు. అక్కడున్న వారికి రోగబాధలు ఉండవు. వనచరులకు ఆహారాలైన కందమూలాలు, ఫలాలు తేనెలు అన్నీ కోకొల్లలుగా దొరుకుతాయి. అంతేగాక, నేయి, పాలు, సుగంధ ద్రవ్యాలు ఔషధాలు అన్నీ అక్కడ విరివిగా దొరికేటట్లు, వనాన్ని ఆ రాముడు అనుగ్రహించాడు.

సముద్ర మధ్య భూమి దగ్ధం అయిపోయింది. సముద్రుడు సంతోషంతో రాముని దగ్గరకు వచ్చి "శ్రీరామా మీ వానర యోధులలో నీలుడు విశ్వకర్మ ఔరసపుత్రుడు. నీలుడు అతి బల పరాక్రమశాలే గాక విశ్వకర్మ నిర్మాణ కౌశలాన్ని కూడా ఔపోసన పట్టినవాడు. నీలుడు తన తండ్రిచేత శిల్పకళా నిపుణుడయ్యే వరాన్ని పొంది ఉన్నాడు. ఇతడు కూడా తండ్రి ఐన విశ్వకర్మలాగా కార్యదక్షుడు.

ఈ వానర సేనలో సామాన్యునిలాగా కనిపించే ఆ నీలుడు నాపై సేతువును కట్టగల సమర్థుడు. నీలుడు కట్టిన సేతువును నేను భరిస్తానని మాట ఇస్తున్నాను" అని రామునితో రత్నాకరుడు చెప్పి తన నిజరూపాన్ని పొంది ఎప్పటిలాగా కల్లోల తరంగితుడయ్యాడు.

అప్పుడు సౌమ్యుడైన నీలుడు లేచి ' శ్రీరామప్రభూ! ఈ సముద్రరాజు చెప్పినదంతా నిజమే. నేను ముందుగా నా గురించి చెప్పుకోవటం ఇష్టంలేక చెప్పలేదు. వీరాధివీరులందరి ముందు చిన్నవానినైన నేను నాకు వచ్చిన చిన్న పనిని గూర్చి ఏమని చెప్పాలో తెలియక సతమతమౌతున్నాను. ఇప్పుడీ గంభీరవారాశి చెప్పడంతో నేను మీ ముందుకు వచ్చాను.'

"స్వామీ! మీరు నాకు అనుమతిని ఇచ్చినట్లయితే, నేను ఈ అబ్ధిపై వారధి కట్టి మీ మెప్పును పొందడానికి నా శాయశక్తులా కృషి చేస్తాను" అని నీలుడు రామునితో చెప్పాడు. నీలుని అసామాన్య ప్రతిభను రాముడు గుర్తించాడు. వానరులందరికి నీలుని పర్యవేక్షణలో వంతెన నిర్మాణం చేయమని ఆజ్ఞ ఇచ్చాడు. దాంతో వానరులందరూ సంతోషంగా ఎగురుతూ దుముకుతూ అరణ్యంలో ప్రవేశించారు.

వృక్షాలను, శిలలను తెచ్చి సముద్ర తీర ప్రదేశంలో వానరులు వేయసాగారు. మద్ది, ధవ, వెదురు, అవిసె, తెల్లమద్ది, తాళ, తిమిశ, మారేడు, గన్నేరు, మామిడి, అశోక వృక్షాలను వ్రేళ్ళతో కొన్ని, వ్రేళ్ళు లేకుండా కొన్ని తెచ్చి పడేశారు. పర్వతాకారంలో వున్న వానరులు పెద్ద పెద్ద శిలలను పర్వతాలను పెకలించి యంత్రాలమీద తీసుకొని వచ్చి సముద్రం దగ్గరకు చేర్చారు.

శిలలు, పర్వతాలు, వృక్షాలు అన్నీ సముద్రంలోకి చేర్చారు. దానివల్ల సాగర జలం ఎత్తు పెరిగింది. కొందరు వానరులు నూరు యోజనాలున్న కొలతదారాలు చేతబట్టారు. సేతు నిర్మాణపు పనికి శ్రీకారం చుట్టారు.

నీలుడు అద్భుత నిర్మాణ కౌశల్యాన్నంతా రంగరించి పటిష్ఠమైన సేతు బంధనం చేస్తున్నాడు. ఆయనకు వానరులందరూ సహాయకులు అయ్యారు. నీలుడు ఏది తెమ్మంటే దాన్ని తెస్తూ సంతోషంగా పనులు చేస్తున్నారు. క్రమబద్ధంగా ఎప్పుడెప్పుడు వంతెన పూర్తయి లంకలో ప్రవేశిద్దామా అన్న ఆలోచన అక్కడి ప్రతివారిలో ప్రతిధ్వనిస్తోంది.

ఎప్పుడు లంకను నాశనం చేసి రావణాది రాక్షసులను యమపురికి పంపించి అమ్మ సీతమ్మ చల్లని తల్లిని ఓదార్చుదామా, విరహాగ్నిలో దహించుకుపోయే రామునకు ఎప్పటికి సీతమ్మ అనే చల్లని మారుతపు స్పర్శ

తగులుతుందో? ఎప్పుడు రాముడు శాంతించి ఆనందరాముడు అవుతాడో కదా. దానికి నేను పనిచేయాలి. రాముని ఆనందానికి నేనే కారణం కావాలి అంటూ వానరులందరూ ఉత్సాహపూరితంగా నిర్మాణం చేపట్టారు.

ఉత్సాహవంతులైన వానరుల సహాయంతో నీలుడు వారధికట్టడంలో ముందంజ వేస్తున్నాడు. విశ్వకర్మే నిర్మించాడా అన్నట్లు వంతెన నిర్మాణం సాగుతోంది. మొదటిరోజు 14 యోజనాలు, రెండవ నాడు 20 యోజనాలు, మూడవ నాడు 21 యోజనాల దూరం, నాలుగవనాడు 22 యోజనాల దూరం నిర్మాణం జరుగుతూ పోయింది. రోజురోజుకు పెరిగే సేతుబంధనం చూసి దేవతలు సిద్ధులు, చారణులు, యక్షులు, గంధర్వులు అద్భుత ఆశ్చర్యాన్ని పొందుతున్నారు. వానరులందరూ సేతు నిర్మాణాన్ని చూచి "ఆహా! నీలుని మేధాశక్తి అని కొనియాడుతూ పెరిగే ఉత్సాహంతో అందరూ సేతు బంధన కార్యంలో నిమగ్నులయ్యారు. ఆనందచిత్తంతో పనులు చేస్తున్నారు.

వారి అద్భుత కళాకౌశల పటిమ చూచి మానవేంద్రులైన రామలక్ష్మణులు ఆశ్చర్యానుభూతి చెందారు. రాముని గుండెలలో గుబులు తీరుతూ వుంది. 'ఇక ఎన్నాళ్లో లేదు, నా సీత నా దరి చేరటానికి' అని రామయ్య మనస్సు ఆనందడోలిక అయ్యింది. అన్న సంతోషాన్ని చూచి తమ్ముడయ్య తిమ్మయ్యలను కొనియాడుతున్నాడు. "ఆహా! నా వదినమ్మ అన్నను చేరుతోంది గదా. ఆ అద్భుతమైన రోజుకోసం కన్నులు కాయలు చేసుకొని ఎదురుచూస్తున్నాను. ఇక త్వరలోనే సేతు నిర్మాణం పూర్తి అవుతుంది. మనమందరం లంకను చేరడమే తరువాయి.

లంక వాసుల గతి ఇక అధోగతే. సీతమ్మను రాముని దగ్గరకు చేర్చటమే మిగిలి ఉంది" అని లక్ష్మణస్వామి ఆనందిస్తున్నాడు. ఐదవ రోజు వేగంగా పని చేసే వానరులందరూ గట్టిగా కృషి చేసి మిగిలిన 23 యోజనాల దూరం వరకూ సేతుబంధనం పూర్తిచేశారు. సువేల పర్వతందాకా వెళ్లారు.

వానరోత్తముడు విశ్వకర్మ తనయుడు నీలుడు. ఐదవ రోజుకు నూరు యోజనాల దూరంగా సేతువును బంధించివేశాడు. సముద్రానికి ఆవలి తీరానికి ఈవలికి బంధం వేశాడు. సాగరంపై ఆ సేతు నిర్మాణం అమోఘంగా, ఆశ్చర్యంగా, దర్శనీయంగా ఉంది. ఆ వంతెనను చూడటానికి గగన పథాన దేవతలు, సిద్ధులు, మహర్షులు, గంధర్వాదులు అందరూ నిలిచారు. నలుని నిర్మాణ చాతుర్యాన్ని వారందరూ కొనియాడారు. వారందరిలో రామకార్యం కావడానికి ఇక ఎంతో ఆలస్యం లేదు అని వారిలో ఆనందం ఉరకలువేస్తోంది.

ఊహలకు అందని ఆ నిర్మాణం ఒడలను పులకింపచేస్తోంది. దానిమీద వానరులందరూ ఎగురుతూ దూకుతూ సంతోషాన్ని ప్రకటిస్తున్నారు. ఆ సేతువు నలుచదరంగా మిట్టపల్లాలు లేకుండా సమతలంగా ఉంది. సముద్రానికి పాపిటలాగా అద్భుత ఆభరణంగా ఆ వంతెన కనిపించింది. అందరూ శత్రుపక్షం వారు వస్తే వారిని ఎదిరించటానికి అప్రమత్తులై ఉండాలని విభీషణుడు వానరులకు సూచించాడు.

శ్రీరామా! మీరు హనుమంతునిపై, లక్ష్మణుడు అంగదునిపై కూర్చోండి. మిమ్ము ఆకాశ మార్గాన ఆవలి తీరానికి చేర్చుతారు. వానరులందరూ ఈ వంతెన మీద నుండి ఆవలికి వస్తారు" అని సుగ్రీవుడు చెప్పగా రామలక్ష్మణులు అలానే చేశారు. వానరులందరూ సేతు బంధనంపైనుండి మెల్లగా సంతోషంగా ఎగురుతూ దూకుతూ ఈదుతూ ఆవలి తీరం చేరారు.

సముద్రాన్ని దాటే వానరుల కోలాహల ధ్వని సాగర ఘోషను మించిపోయింది. సుగ్రీవుని నాయకత్వాన వానరులు విభీషణుడు అందరూ లంక దగ్గరకు చేరారు. ఈ అద్భుత రామ కార్యాన్ని సాధించిన వానరులను శ్రీరాముడు, దేవతలు, సిద్ధులు, మహర్షులు అందరూ మెచ్చుకున్నారు. వారిని స్తుతించారు. ఇలా వానరసేన ఎట్టకేలకు సముద్రాన్ని అధిగమించి లంకావాసులకు గుబులు పుట్టించింది. వానరులలో శ్రుతిమించిన ఆనందం వెల్లువెత్తుతోంది. లంకలో రాక్షసుల మనసులు డోలాయాన పరిస్థితులలో చిక్కుకున్నాయి. ఎపుడు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందో అని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఊపిరి తీసుకొంటున్నారు.

* * *

# ఉత్పాత శకునాలు

## సర్గ - 23

**ల**ంక దగ్గరికి చేరిన రామాదులు వానరులందరు లంకను చూశారు. రాముడు అక్కడికి చేరగానే ప్రకృతిలో కనిపించే శకునాలు చూచి ఆనందభరితుడు అయ్యాడు. లక్ష్మణుని అక్కున చేర్చుకొని 'లక్ష్మణా! ఈ కనిపిస్తున్న శకునాలు రావణునిపై మన జయాన్ని నిర్దేశిస్తున్నాయి అని ఆనందంగా చెప్పాడు.

ఈ శకునాలు లోక వినాశకారక పరిస్థితిని తెలుపుతున్నట్లున్నాయి. "చూడు లక్ష్మణా! ధూళినిండిన గాలి దిక్కులను ఆక్రమిస్తోంది. భూమి, పర్వతాలు కంపనకు గురి అవుతున్నాయి. భూకంపం వలన వృక్షాలు భూమిలోపలకు వెళుతున్నాయి. మేఘాలు దిక్కులను ఏకం చేస్తాయా అన్నట్లు వర్షధారలను మోస్తున్నాయి.

గర్జిస్తున్న మేఘాలు ఎంత కుంభవృష్టిని కురిపిస్తాయో ఏరులు ఊరులు ఏకం అయిపోతాయి అనిపించేలాగా నల్లని మేఘాలు మెరుపుతో భయపెడుతున్నాయి. సంధ్యా సమయం ఆహ్లాదకరంగా లేక ఎర్రని ఛాయతో రక్తసిక్తం అయిన భూమిని తలపిస్తోంది. సూర్యుడు నిప్పుకణికల్లాంటి కిరణాలను వెదజల్లుతున్నాడు.

క్రూర మృగాలు, పక్షులు అన్నీ గగ్గోలుగా దీనంగా అరుస్తూ తిరుగుతున్నాయి. చంద్రుడు రాత్రి కూడా వెన్నెలను పంచలేకపోతున్నాడు. తెల్లని చంద్రుడు ఎరుపు నలుపుల మేళవింపును కలిగి ఉంటున్నాడు. ఇది వినాశనానికి హేతువును సూచిస్తోంది.

నిర్మలమైన సూర్యమండలంలో నల్లని మచ్చ కనిపిస్తోంది. నక్షత్రాలు కూడా కాంతి తగ్గి శోభావిహీనంగా కనిపిస్తున్నాయి. కాకులు, డేగలు, గ్రద్దలు భూమికి దగ్గరగా సంచరిస్తున్నాయి. నక్కల ఊళలు భయాన్ని పుట్టిస్తున్నాయి. వానరులు రాక్షసులు ఒకరిపై ఒకరు శూలాలు గదలు విసురుకోవడంతో భూమి అంతా రక్తసిక్తమౌతుందని అనిపిస్తోంది. రావణుని ఆధీనంలో ఉండే లంకపై మనం నేడే దాడి చేద్దాం' అని రాముడు చెప్పాడు. రామలక్ష్మణులు లంకకు అభిముఖులై సాగారు. వారిని అనుసరించి సుగ్రీవాదులు, వానరులు, విభీషణాదులు ముందుకు కదిలారు. వారి అందరిలో రణోత్సాహం ఉరకలు వేస్తోంది. రణానుకూలంగా వానరులు ఉత్సాహంగా ఉండడం చూచి శ్రీరాముడు చాలా సంతోషించాడు.

రామునకు అనుకూలంగా ప్రకృతి స్పందిస్తోంది. సూర్యుడు వానరులను ఉత్తేజితులను చేస్తున్నాడు. సీత హృదయం బరువు తగ్గుతున్నట్లుగా అనిపించింది. ఉరుము లేని వానలాగా సీతమ్మ మనసు ఆనందపరవశం అవుతోంది. నా రాముడు నన్ను చేరే సమయం ఆసన్నమౌతోంది. ఇక నా కష్టాల కొలిమి చల్లారబోతోంది. ఈ రావణుని చెర వీడిపోయే దినం దగ్గరౌతోంది అని మనసు అదే పనిగా చెప్పుతోంది. పెదవులపై చిరునవ్వు తొణికిసలాడుతోంది. భీతిని కలిగించే రాక్షసాంగనలను కూడా అనుగ్రహించమని అంతరంగం చెప్పుతోంది. శరణాగతులను రక్షించే నాథునికి అర్ధాంగినైన నేను అందరిని సమానంగా చూడాలని సీతమ్మ అనుకొంటోంది.

* * *

# శుకరావణుల సంభాషణం

## సర్గ - 24

**స**ముద్ర ఆవలి తీరానికి చేరిన వానరసేన సంతోషంతో ఉప్పొంగిపోతోంది. "ఎప్పుడెప్పుడు యుద్ధం మొదలు అవుతుందా!" అని ఎదురుచూస్తున్నారు. వారందరికి లంకలోపల నుండి భేరి నినాదాలు మృదంగ ధ్వనులు వినిపించాయి. వానరవీరులు అవి వింటూ దానికన్నా ఎక్కువగా కోలాహలంగా సింహనాదాలు చేశారు. భీకరంగా సింహనాదాలు రాక్షసులకు కూడా వినిపించాయి.

శ్రీరాముడు చిత్ర విచిత్ర ధ్వజ పతాకాలతో ఉన్న లంకానగరాన్ని చూచి పరితపించాడు. 'నా ప్రియసతి ఇక్కడే గదా రాక్షసుల మధ్య బాధలు పడుతోంది' అనుకొన్నాడు. "లక్ష్మణా! ఈ లంకానగరం విశ్వకర్మ నిర్మించాడు. త్రికూట పర్వతంపైన నిలచిన లంక ఆకాశం నుండి క్రిందకు వ్రేలాడుతోందా! అన్నట్లుగా వీని శిఖరాలు కనిపిస్తున్నాయి కదా! లంక విశాలమైన ఆకాశంలాగా వ్యాపించి ఉంది. వీరిలో కనిపించే వృక్షాలు, పక్షులు, మృగాలు అన్నీ కుబేరుని చైత్రరథ ఉద్యానవనాన్ని తలపిస్తున్నాయి. కోకిలలన్నీ తమ గాన పారవశ్యంతో హాయిని పొందుతున్నాయి కదా! మనం ఈ లంకను నేలగూల్చాలి" అని అన్నాడు.

శ్రీరాముడు వానరసేననంతా యుద్ధనీతిని అనుసరించి చక్కగా విభజించాడు. అంగదుడు నీలునితో కలిసి సేన యొక్క వక్షస్థల భాగంలో నిలిచాడు. వానరసేననంతా గరుడ వ్యూహరచనలో నిమగ్నమయ్యారు. సుగ్రీవునితో యుద్ధవ్యూహాన్ని చెప్పుతూ "సుగ్రీవా! ఋషభుడు కుడి పార్శ్వంలో నిలిచి ఉంటాడు. గంధమాదనుడు ఎదిరించడానికి శక్యంకానివాడు. ఎడమ పార్శ్వంలో ఉంటాడు. నేను లక్ష్మణునితో కలిసి శిరఃస్థానంలో ఉంటాం. జాంబవంతుడు, సుషేణుడు, వేగదర్శి – ఈ మహాత్ములు కుడి ప్రదేశాన్ని రక్షిస్తారు. వరుణుడు పశ్చిమ దిక్కును సంరక్షిస్తున్నట్లుగా నీవు వానరసేన పుచ్ఛభాగాన్ని రక్షించు" అని శ్రీరాముడు వానరసేననంతా యుద్ధ వ్యూహంతో విభజించాడు.

విభజించి నిలిచిన వానరసేనలోని వానరులందరూ పెద్ద పెద్ద శిలలతోను, వృక్షాలతోను, పర్వతాలతోను లంకను సమూలంగా నేలమట్టం చేద్దామని అనుకొంటున్నారు. 'ఇక మన వ్యూహరచన అంత అయిపోయింది గదా ఇక ఆ శుకాసురుని వదిలివేయి' అని రాముడు సుగ్రీవునితో చెప్పాడు. రాముడు చెప్పిన ప్రకారం సుగ్రీవుడు

శుకుణ్ణి వదిలివేశాడు. శుకుడు వానరుల వద్ద నుంచి తప్పించుకొని రావణుని వద్దకు వచ్చి "మహాప్రభూ! మనకు కష్టకాలం వచ్చింది" అంటూ వెళ్లాడు. శుకాసురుని వికృత రూపం చూసి రావణుడు నవ్వుతూ "ఏమి శుకా! నిన్ను ఆ వానరులు పట్టుకోలేదు గదా. నీ రెక్కలు అన్నీ భీభత్సంగా ఉన్నాయి. వారు వాటిని పీకివేయలేదు గదా" అని రావణుడు అడిగాడు.

"ప్రభూ! సముద్రానికి ఆవల ఉన్న వానరసేన నాయకుడైన సుగ్రీవుని దగ్గరకు వెళ్లి నీ మాటలన్నీ యథాతథంగా చెప్పాను. వాళ్ళు నన్ను చూసి నా మాటలు విని కోపంతో పైకి ఎగిరి నన్ను పట్టుకొని నానా యాతనలకు గురిచేశారు. వానరులతో మాట్లాడడం కాని, పోరాడడం కాని ఎవ్వరూ చేయలేరు. వానరులు బలశాలురే కాదు కోపస్వభావులు, తీక్ష్ణమైనవారు.

"రాక్షస నాయకా! నేడు దండకారణ్యంలో ఖరదూషణాదులను చంపిన రావణుడు సీత ఉన్న ప్రదేశానికి వచ్చి ఉన్నారు. సాగరం మీద సేతు బంధనం చేసి వానరులంతా లంకను చేరారు. తన ప్రియపత్నిని అపహరించిన వారిని నాశనం చేయడానికి రాముడు ధనుష్పాణియై నిలిచి ఉన్నాడు. కోదండరాముని వెనుక వానర, భల్లూక సేనావాహిని అపారంగా వేచి ఉంది. ఈ రాక్షస, వానర సైన్యానికి మధ్య, దేవ దానవుల మధ్య సంధి లాంటిది ఏదీ ఉండదు. ఇక ఆ వానర సేనావాహినికి అడ్డు అనేది ఏమీ లేదు. వారు ఏ క్షణంలోనైనా లంకను ముట్టడించవచ్చు. వారి ధాటికి రాక్షససైన్యం అల్లకల్లోలం అయిపోవచ్చు. అందుకే "రాక్షసేశ్వరా! రావణా! మనం త్వరపడాల్సిన సమయం ఆసన్నమైంది. ముందు ఈ పెద్ద ముప్పునుండి లంకను కాపాడడానికి ఏదైనా చేయాలి. వానరులను ఎదిరించటంకన్నా సీతను శ్రీరామునకు అప్పచెప్పడమే మేలు అని నాకు అనిపిస్తోంది. అదే అన్నింటికన్నా ఉత్తమమైనది. బతికి ఉంటే బలుసాకు ఐనా తినవచ్చు. కాని, రాముని ఎదిరించి నిలవడం అనేది కల్ల అని నాకు స్పష్టంగా తెలిసింది" అని శుకుడుచెప్పి చెప్పగానే రావణునికి అరికాలి మంటనెత్తికెక్కినట్లు అయ్యింది. 'హూ!'అని పెద్దగా హూంకారం చేశాడు. "ఏదిఏమైనా సరే ఆ సీతను రామునకు ఇచ్చే మాటే లేదు. లంక అంతా నాశనం అయినా ముల్లోకాలు కలసి నన్ను ఎదిరించడానికి వచ్చినా నేను ప్రాణాలను వదలడానికి సిద్ధపడతానేమో కాని ఈ సీతను మాత్రం వదిలే ప్రశ్నే లేదు నేను ఏం చేయదల్చుకొన్నానో అదే చేస్తాను" అని తీవ్రంగా శుకునికి రావణుడు చెప్పాడు. విరబూసిన పూల మీదకు తుమ్మెదలు వెళ్లినట్లుగా నా బాణాలు ఎప్పుడు రాముని మీదకు పరుగెత్తుతాయో అనినేను ఎదురుచూస్తున్నాను అని అంటున్న రావణుని అయోమయంగా శుకుడు చూశాడు.

"శుకా! నా అమ్ముల పొదులలోని బాణాలతో ఆ రఘు నందనుని మట్టికరిపిస్తాను. ఉదయిస్తున్న సూర్యుడు అంధకారాన్ని అణచివేసినట్లుగా నేను నా సమస్త బల సంపదతో రాముని వానర సేనను తిప్పికొట్టివేస్తాను. రాముడు నా పదునైన బాణాల రుచి తెలియక నాతో పోరుకు సిద్ధం అవుతున్నాడు. త్వరలోనే ఆ రాముడు నాతో పోరు ఏ స్థితి కలిగిస్తుందో తెలుసుకొంటాడు. నేను రణభూమి అనే రంగస్థలానికి వెళ్లి నా శత్రుసేనలపై నా బాణాన్ని వీణగా చేసుకొని వీణావాదనం చేస్తాను. నా ధనుష్టంకార ధ్వనితోనే వానరులంతా తోక ముడిచి పారిపోతారు. అప్పుడు వారి ఆర్తనాదాలు ఆ వీణాకచ్చేరికి ప్రక్కవాద్యాలు అవుతాయి. నా వీణానాదం శ్రోతలను అలరిస్తుంది. నా బాణ ప్రయోగం శత్రువుల గుండెలను అవిసేటట్లు చేస్తుంది.

సహస్రాక్షుడైన ఇంద్రుడు, పాశహస్తుడైన వరుణుడు, దండధరుడైన యముడు, శంకరుని మిత్రుడైన కుబేరుడు నన్ను ఎదిరించలేక నాకు అభివాదం చేశారు. ఇప్పుడూ వారు రామునితో పోరు చూసి నాబలసంపదను మళ్ళీ గుర్తుచేసుకొంటారు. పరమేశ్వరునే గడగడలాడించగల నాపై పోరుకు సిద్ధపడే ఈ మానవుడు మూర్ఖుడు కాక మరి ఏమి అవుతాడు? అలాంటి అవివేకిని చూచి నాకు జాలివేస్తోంది వానిని చూచి రమ్మని చెప్పితే నీవు బిక్కచచ్చినట్లు అయివచ్చావు. నీవు పిరికివాడివి. యుద్ధాన్ని తలుచుకొని పిరికివారు భీతిచెందుతారు. వీరులలో ఉత్సాహం ఉరకలు వేస్తుంది. నీవు భయపడకు! నా ముందు సురాసురులే వణుకుతారు. ఇక ఈ రాముడొక లెక్కా" అని రావణుడు వీరాలాపాలు చేశాడు.

* * *

# రావణుని కుటిల నీతి

## సర్గ – 25

రావణుడు దశరథ కుమారుల సాగరాన్ని దాటి వానరులతో కలసి లంక దగ్గరకు వచ్చి ఉన్నారని తెలుసుకొన్నాడు. ఒక పన్నాగాన్ని పన్నాడు. తన దూతలైన శుక సారణులను పిలిచాడు. "ఓ దూతలారా! ఈ అపారమైన సాగరాన్ని దాటడం అనేది దేవతలకు కూడా అసాధ్యం. అలాంటిది దీనిపైన రాముడు వారధి నిర్మింపచేశాడు అనడం అద్భుత కార్యం. నేటివరకు ఈ వింతను కనివిని ఎరుగలేదు.

నేను సాగరంపైన సేతువును నిర్మించారనే విషయాన్ని నమ్మలేకుండా ఉన్నాను. నేను రాముని సేనావాహిని ఎంత ఉందో? వాని బలసంపద ఏపాటిదో? వారి శక్తియుక్తులు ఎంతవో? తెలుసుకోవాలని అనుకొంటున్నాను.

మీరు మారువేషంలో ఎవ్వరూ గుర్తించని విధంగా వెళ్లి వానరసేనలో ప్రవేశించండి. ఆ సేన పరిమాణం బలపరాక్రమాలు అన్ని తెలుసుకోండి. అక్కడే ఉండి వారు పన్నే వ్యూహరచన గురించి తెలుసుకొని రండి. రాఘవునకు సుగ్రీవునకు నమ్మకంగా ఉన్న మంత్రులు ఎవ్వరు? జలధిపైన సేతువును ఎవరు నిర్మించారు? ఎలా నిర్మాణం చేశారు? ఇక మీదట వారి యుద్ధ ప్రణాళిక ఏది? ఈవిషయాలు అన్నీ కూలంకషంగా తెలుసుకొని నా వద్దకు వచ్చి నాకు చెప్పండి" – అంటూ రావణుడు తన దూతలైన శుక సారణులకు చెప్పాడు.

రావణుని ఆదేశం ప్రకారం శుక సారణులు సైతం కపులయ్యారు. బుద్ధిమంతులలాగా కపి సైన్యంలో కలిసిపోయారు. కాని, ఆ అపార సేనావాహినిని చూసి వారి శరీరం గగుర్పొడిచింది. వారికి వానరసేన గురించి తెలుసుకోవడం లెక్కపెట్టడం తలకు మించిన పని అయింది.

వానరులందరు పర్వత శిఖరం మీద, కొండచరియలలో కొండగుహలలో ఉన్నారు. మరికొందరు సముద్ర తీరంలో, వనాలలో సంచరిస్తూ ఉన్నారు. కొందరు సముద్రాన్ని దాటుతున్నారు. మరికొందరు ఈదుతున్నారు. లెక్కపెట్టడానికి సాధ్యంకాని అసాధ్యమైన వానర సేనను చూసి రావణుని దూతలు నివ్వెరపోయారు.

వీరి సంగతిని విభీషణుడు పసిగట్టాడు. వారిద్దరిని పట్టుకొచ్చి రాముని ముందునిలబెట్టాడు. "ఓ శ్రీరామా! వీరిద్దరూ రావణుని దూతలు. మన కపుల వేషంలో వానరసేనలో దుష్టబుద్ధితో ప్రవేశించారు" అని విభీషణుడు రాముడితో చెప్పాడు. శుక సారణులు రాముని చూచినంతనే బ్రతుకు మీద ఆశ వదిలేసుకొన్నారు. నీరుకారిపోయి "రఘువీరా! మేము రావణుని బంటులం. మా యజమాని మీ శక్తి సామర్థ్యాలు తెలుసుకోవడానికి మమ్ములను పంపించగా ఇక్కడకు వచ్చాం" అని దిగాలుగా చెప్పారు.

శ్రీరాముడు చిరునవ్వుతూ "మరి మీ రావణుడు చెప్పిన పనిచేశారా?మీరు మా అపార సేనా వాహిని చూశారు గదా. మా శక్తి సామర్థ్యాలు అవగాహన చేసుకొన్నారు గదా. ఇక స్వేచ్ఛగా మీ ప్రభువు దగ్గరకు వెళ్లి ఉన్నది ఉన్నట్లుగా చెప్పండి. ఇంకా మీకు ఏదైనా తెలియకపోతే మా విభీషణుడు మీకు దగ్గర ఉండి చూపిస్తాడు. అంత ప్రాణభీతి లేకుండా చూచి రండి. మీరు నిరాయుధులైన దూతలు కదా. మేము దూతలను చంపలేం.

"విభీషణా! వీరు మన శత్రు సైన్యం నుండి మన విశేషాలను ఆరా తీయడానికి వచ్చి పట్టుపడ్డారు గదా. వీరి చౌర్యం బట్టబయలైంది. ఇక వీరిని వదిలివేయండి" అని రాముడు చెప్పాడు.

"ఓ దూతలారా! మీరు రావణుని దగ్గరకువెళ్లి జరిగినదంతా చెప్పండి. నేను చెప్పే విషయాలను యథాతథంగా నా మాటగా చెప్పండి. రావణా! ఏబలం చూసుకొని నా సీతను అపహరించి తెచ్చావో, నీ బల సంపదతో నా ఎదుట నిలువు. నన్ను శరణుగోరితే నిన్ను నేను క్షమిస్తాను. లేకపోతే రేపే ప్రాకారాలతో, సింహద్వారాలతో, ఉన్న లంకానగరాన్ని నా శర సంపదతో నాశనం చేస్తాను.

నీ రాక్షస బలాన్ని సమూలంగా నరికివేస్తాను. దేవేంద్రుడు తన వజ్రాయుధంతో దానవులను సంహరించినట్లుగా నేను నా బాణాలతో నిన్ను నీ బంధుమిత్ర సపరివారంగా నాశనం చేస్తాను' అని నా మాటగా రావణునికి రాముడు సందేశాన్ని పంపాడు.

ప్రాణాలు అరచేత బట్టుకొని శుక సారణులు రావణుని వద్దకు పరుగెత్తి వెళ్లి శ్రీరాముని మాటలు వినిపించారు. విభీషణుడు మమ్ము వధించమని చెప్పగా ఆ శ్రీరామచంద్రుడు మమ్ము క్షమించి వదిలివేశాడు అని కూడా చెప్పారు.

"రావణా! రాక్షసేశ్వరా! రామలక్ష్మణులు సర్వశుభ లక్షణ సంపన్నులు. సుగ్రీవుడు, ఇంద్ర సముడు, విభీషణుడు ఆకారం దాల్చిన ధర్మమూర్తి, వీరు నలుగురే ఈ లంకను నాశనం చేయగలరని అనిపిస్తోంది.

యుద్ధ సన్నద్ధుడైన శ్రీరాముని రూపవైభవం, ఆయనకున్న అస్త్ర శస్త్ర విద్యాపాటవం, శక్తియుక్తులు అన్నీ చూస్తే ఆయన ఒక్కడే లంకానాశనం చేయగలడు అనిపించింది. మరొకరి సహాయమే ఆయనకు అవసరం లేదని తెలుస్తోంది. సుగ్రీవుని నాయకత్వాన ఉన్న వానర సేన దుర్భేద్యమైంది. రాజా! ఆ మహా యోధానుయోధులతో తలపడడంకంటే వారికి సీతాసాధ్విని ఇచ్చివేసి సంధి చేసుకోవడమే మేలు అనిపిస్తోంది" అని తాము చూసి తెలుసుకొన్న సంగతిని రావణునికి దూతలు నిర్భయంగా చెప్పారు.

* * *

# రావణుడు - వానర సైన్యం

## సర్గ - 26

శుక సారణులు నిర్భయంగా తమకు తెలిసిన యథార్థాన్ని రావణునికి చెప్పారు. గర్వోన్నతుడైన రావణుడు ఎదుటివారి బల పరాక్రమాలను నమ్మలేదు. ఎదుటివారిని చులకనగా చూసే రావణుని దుష్ట స్వభావం వారి అసలు స్థితిని చెప్తుతున్నా పట్టించుకోలేకపోయింది.

అందుకే "సారణా! దేవతలు, గంధర్వాదులు ఎవ్వరూ వచ్చినా నేను సీతను వదలను. నీవు సౌమ్యుడవు. అందుకే ఆ వానరులు కాస్త భయపెట్టగానే నీవు భీతి చెందావు. ఆ శ్రీరామునకు సీతను అప్పగించడం యుక్తమని చెప్తున్నావు. నిజానికి నన్ను యుద్ధరంగంలో ఎదిరించి నిలువగల వీరులు ఎవ్వరున్నారు?" అని చెప్తూతూ రావణుడు తాళ వృక్ష ప్రమాణంలో ఉన్న తన భవనంపైకి ఎక్కాడు. అక్కడినుండి వానర సేనను చూడాలనుకొని దూతలను కూడా తనతో రమ్మని చెప్పాడు.

ప్రాసాద అగ్రభాగానికి చేరిన దుష్ట రావణుడు వానరసేన మీదకు దృష్టి సారించాడు. లెక్కించడానికి సాధ్యంకాని వానర సేన రావణుని కళ్లు మిరుమిట్లు గొల్పింది.రావణుని ఆజ్ఞ ప్రకారం రాముని అపార సేనావాహినిని చూసి వచ్చిన శుకసారణులతో మాట్లాడుతూ రావణుడు "సారణా! ఈ అపార సేనావాహిని మీరు ప్రత్యక్షంగా చూసి వచ్చారు గదా. ఈ వానరులలో ప్రముఖులు ఎవ్వరు? సుగ్రీవుడు ఎవరి మాటను ఎక్కువగా వింటాడు? యుద్ధ రంగంలో బలశాలురు మహాశూరులు ఎవరెవరు ఉన్నారు? వానరసేనల అగ్రేసరులు ఎవరు? అగ్రభాగాన నిలచే బలశాలురు ఎవరు? వీరిలో పేర్కొనదగిన మహిమోపేతులు ఎవరెవరు ఉన్నారో వారి అందరి గురించి నాకు విపులంగా చెప్పు" అని అడిగాడు.

వానర ప్రముఖుల అనుపానులు తెలిసికొని వచ్చిన శుకసారణులలో సారణుడు "రాజా! లంకానగరాన్ని తీక్షణంగా చూస్తున్న ఆ మహావీరుడు నీలుడు. అతనిని చుట్టిముట్టి లక్షల సంఖ్యలో వానరయోధులున్నారు. ఇతడు ఒక్కసారి సింహగర్జన చేస్తే మన లంక అంతా కంపించిపోతుందేమో అనిపిస్తుంది. సుగ్రీవుని వానర సేనకు ఊర్ధ్వ భాగాన నీలుడు నిలబడ్డాడు.

సమరోత్సాహంతో భుజాలు చరుస్తూ తిరుగుతున్న ఆ మహాబలుడు అంగదుడు. పర్వత శిఖరం వలె సమున్నతుడు. అతడు రోషంతో తన వాలాన్ని నేలకేసి కొట్టుతూ ఎప్పుడెప్పుడు రాక్షసులపై పరుగెత్తుదామని ఆలోచిస్తుంటాడు. వానర రాజైన సుగ్రీవుడు వాలి సుతుడైన అంగదుణ్ణి యువరాజుగా అభిషేకించాడు. దేవేంద్రునకు వరుణునివలె రామకార్యంలో సుగ్రీవునకు ప్రీతిపాత్రుడైన వాడు అంగదుడు.

అంగదుని చుట్టూ వేలకొలది వానరులు మూగి ఉన్నారు. అంగదుని వెనుక ఉన్నవాడు నలుడు. ఇతనే సేతువు నిర్మించిన మహోన్నతుడు. విశ్వకర్మరూప నిర్మాణ కౌశలాన్ని వంటబట్టించుకొన్న ఔరస పుత్రుడు. ఇతడు క్రోధ స్వభావుడు. వానర ప్రముఖులందరూ క్రుద్ధులై విజయోత్సాహంతో రణభేరిని మ్రోగించడానికి సన్నద్ధులు అవుతున్నారు. వీరిని ఎదుర్కొనడం అసాధ్యంగా కనిపిస్తోంది.

వెండికొండలా మెరిసిపోయే యోధుడు శ్వేతుడు. ప్రజ్ఞావంతుడు. ముల్లోకాల వీరులలో పేరెన్నిక ఉన్నవాడు. శ్వేతుడు. వానరులలో ఉత్తేజాన్ని నింపుతుంటాడు. సుగ్రీవుని దగ్గరే ఉన్న వానరుడు కుముదుడు. గోమతీతీరంలో ఉన్న సంకోచనం అనే వన ప్రదేశపు వానరులకు రాజు.

ఈ కుముదుడు తీక్షణ స్వభావుడు. వేలకొలది కపులను వెంట బెట్టుకొని వచ్చాడు. ఇతని వాలంపై ఎరుపు, తెలుపు బూడిద రంగులున్న రోమాలున్నాయి. శత్రు భయంకరుడు. మనకు కనిపిస్తూ దగ్గరగా ఉన్నవాడు రంభుడు యోధపతి. ఇతను గోరోచ వర్ణుడు చాలా బలశాలి. వింధ్య, కృష్ణగిరి, సహ్యాద్రి, సుదర్శనం అనే పర్వతాలపై ఉంటాడు. చూపులతోనే దహించి వేస్తాడు అని అనిపిస్తాడు. కోటి ముప్ఫై లక్షలమంది వానరులతో ఉన్న రంభుడు చండ ప్రచండుడు.

శరభుడు మరొక యూధపతి. ఓరగా చూసే వీరావేశుడు. వెన్ను చూపని బలశాలి. ఈ శరభుడు సాల్వ పర్వత నివాసి విహారులు ఇతని అనుచరులు. వీరి సంఖ్య లక్షా నలభై వేలను మించి ఉంటుంది. వీరందరూ బాహువిక్రములే.

పారియాత్ర పర్వత నివాసి పనసుడు. ఇతని రక్షణలో యాభై లక్షలమంది వానరులున్నారు. వీరందరూ ఒకరిని మించినవారు మరొకరు. వీరిని యుద్ధ రంగంలో ఓడించడం అనేది అరుదు. ఇక ఇక్కడ కనిపిస్తున్న వినతుడు. మహావీరుడు. అరవై లక్షలమంది వానరులతో సేవించబడేవాడు. దర్దుర గిరిలాగా మహోన్నత శరీరుడు. అప్రమేయ బలపరాక్రమశాలి. వీని రక్షణలో ఉన్న వానరులలో కాగడా పెట్టి వెదికినా పిరికి పంద ఐన వానరుడు ఎవ్వరూ లేరు. అపార వానర సేనావాహిని మొత్తం సమరోత్సాహంతో ఉరకలు వేస్తోంది. ప్రతివానరుని హృదయం రామకార్యం చేయాలని ఉవ్విళ్ళూరుతోంది. ప్రతి వానరుడు తన పరాక్రమానికి పదునుపెట్టడమే ముఖ్యకర్తవ్యం అని తలుస్తున్నాడు. వారందరూ వారి యజమానికి ప్రాణతుల్యులు.

క్రోధనుడనే యూధపతి యుద్ధానికి రమ్మని లంకా వాసులను రెచ్చగొట్టుతున్నాడు. గైరిక వర్ణంతో విరాజిల్లే గవయుడు చాలా తేజస్వి. దృఢకాయుడు. క్రోధంతో మనలను ఎదిరించాలనే ఉరకలు వేస్తున్నాడు. ఈయన డెబ్భై లక్షలమంది వానరులతో అలరారుతున్నాడు. లంకను నేలమట్టం చేయాలనేది గవయుని ఉబలాటం.

వానరులందరూ కామ రూప విద్య తెలిసినవారు. బలశాలురు. ఎదిరింప శక్యంకానివారు. వీరందరూ రాముని సుగ్రీవుని పర్యవేక్షణలో యుద్ధ సన్నద్ధులై ఉన్నారు. లంకను ముట్టించాలన్న బలమైన కోరికతో వీరు ఉత్సాహభరితులై ఉన్నారు.

వారందరూ లంకేశ్వరులైన మీ పై మహోగ్రజ్వాలతో మండిపడుతున్నారు. వారి నాయకుని భార్యను తీసుకొచ్చారన్న కోపం వారిలో మిక్కుటంగా ఉంది. దానిని వారు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఎపుడెప్పుడు లంకావాసులను తుదముట్టించి సీతమ్మను దక్కించుకోవాలా అని ఎదురుచూస్తున్నారు. రాముని ఆజ్ఞ లేక వారు అక్కడ నిలచిఉన్నారు. కానీ, అది అంది అందగానే మూకుమ్మడిగా పోరు సాగించి సీతమ్మను చూడాలని వారు తహతహలాడుతున్నారు.

* * *

# సారణుడు - వానరుల పరాక్రమం

## సర్గ - 27

**వా**నరుల గురించి ఎంత చెప్పినా తనివితీరని సారణుడు మరలా రావణునికి కపుల పరాక్రమాన్ని చెప్పాలనుకొన్నాడు.

“రావణా, రాక్షసేశ్వరా! వానరుల యుద్ధరీతి శత్రుభయంకరంగా ఉంది. హరుడు సేనాపతి. ఇతని రక్షణలో వేలమంది వానరులు యుద్ధోత్సాహంతో ఉన్నారు. వీరందరూ ఎక్కడెక్కడి పర్వతాలను, శిలలను వృక్షాలను చేత బట్టుకొని లంకపై వేయడానికి ఉద్యుక్తులౌతున్నారు.

మనకు కనిపించే భల్లూక యోధులు కాటుక వంటి నలుపువర్ణంతో ఉన్నారు. అసంఖ్యాకంగా ఉన్న వీరు తిరుగులేని పరాక్రమవంతులు. నిమ్నోన్నత ప్రదేశాలు వీరి ఆవాసాలు. వీరిమధ్యలో ధూమ్రుడు భీకర స్వభావ నాయకుడు. ఇతడు వర్షాధిదేవతలవలె భయావహమైన రూపం ఉన్నవాడు. ఋక్షవంతం అనే పర్వతంపైన నర్మదా నదీ జలాలను సేవించే భల్లూక వీరులు.

ధూమ్రుని తమ్ముడు జాంబవంతుడు. ఇతడు తమ్ముని మించిన యోధుడు. గురువులపై పెద్దలపై వినయం ఉన్నవాడు. ఈ జాంబవంతుడు దేవాసుర యుద్ధంలో ఇంద్రునికి సహాయం చేశాడు. దేవేంద్రునికి ఇష్టుడు. ఎన్నో వరాలను పొందినవాడు. ఇతని అనుచరులు మహోన్నతాకారం ఉన్న భల్లూకాలు. వీరు మహాపరాక్రమవంతులు.

భల్లూకాలు మహావీరులు. వీరు ఏనాడు మృత్యువుకు భయపడరు. వీరు పిశాచాలుగా రోమాలున్నవారు. గండశిలలను సులభంగా ఎత్తి విసిరివేస్తారు.

దంభుడు నిరంతరం తన బలాలతో కూడి ఇంద్రునికి సహాయం చేస్తుంటాడు. మహాసేనాపతి సన్నాదనుడు వానరులకు పితామహుడు. సుప్రసిద్ధుడు. ఇతని శరీర ప్రమాణం ఒక యోజనం అంత ఎత్తు ఉంటుంది. తనకన్నా యోజనం ఎత్తున ఉన్న వస్తువును చేతితో పట్టుకొంటాడు. నాలుగు కాళ్ళ జంతువులలో ఇతనికన్నా పెద్ద జంతువు ఏదీ లేదు. బహుముఖ ప్రజ్ఞాశాలి, ఇతడు కూడా ఎప్పుడూ యుద్ధంలో ఇంద్రుని పక్షానే ఉంటాడు.

క్రథనుడు అగ్ని దేవునివలన గంధర్వకన్యకు పుట్టినవాడు కైలాస పర్వత ప్రాంతంలో యథేచ్ఛగా తిరిగేవాడితడు. ఈయనకు కోట్లకొలది వానరులు అనుచరులుగా ఉన్నారు. లంకా నాశనానికై ఎదురుచూసేవాళ్ళల్లో ఇతడొక్కడు. ప్రమాథి అనే వానరోత్తముడు, గంగా తీర వనాలలో సంచారం చేస్తుంటాడు. ఎప్పుడూ గజ సమూహాలను భయపెడుతుంటాడు. కపియోధులలో ముఖ్యుడైన ప్రమాథి పర్వత గుహలలో ఆవాసం చేస్తుంటాడు.

గంగాతీరాన **శరబీజ** అనే మందర పర్వతంలాంటి గిరిపైన దేవేంద్రునిలాగా ప్రమాథి వానరులను కాపాడుతుంటాడు. ఇతడు వాయువేగ గమనుడు. ఇతని పాద ఘట్టనవల్ల లేచిన ధూళి ఆకాశంలోని మేఘాలను చేరుతుంటుంది. నిర్భయంగా సింహగర్జనను మించి గర్జించే వీరులైన వానరులకు ఇతడు రాజు.

బలిష్ఠులైన కొండముచ్చు యోధులకు అధిపతి గవాక్షుడు. వీరు లక్షలసంఖ్యలో ఉండి సేతు బంధనానికి తోడ్పడిన వారిలో ముఖ్యులు. గవాక్షుని సేనానాయకత్వంలో ఉన్న కొండముచ్చులందరూ నల్లని ముఖంతో భయంకరాకారులైన మహాబలశాలురు.

మేరుపర్వత ప్రాంతంలోని వాడు కేసరి. మేరుపర్వతం అన్ని ఋతువులలో ఫలవృక్ష సంపదతో అలరారుతుంటుంది. సూర్యుడు తన కిరణాలను ప్రతిదినం ప్రసరిస్తుంటాడు. మహర్షులు ఆ మేరు పర్వతాన్ని ఎప్పుడూ విడిచి వెళ్ళరు. వారి ఆశీర్వాదాలను అందుకొనే కేసరి మహోన్నత భుజ బల సంపన్నుడు.

మేరుపర్వత ప్రాంతంలో అరవై వేల కాంచన పర్వతాలు ఉన్నాయి. ఆ పర్వత రాజాలపై నఖాలు, గోళ్ళు ఆయుధాలుగా ఉన్న వానరులు ఉన్నారు. వారు కపిల వర్ణులు, పింగళి వర్ణులు, సింహంవంటి కోరలతో, పెద్దపులుల వంటి దుర్జయులు. వారి వాలం చాలా పొడవైనది. శత్రు భయంకరులైన వారు దృఢకాయులు. వారి పాద ఘట్టన వలనే లంకను నుజ్జు చేయగలమనే ధీమాతో రణోత్సాహులైన వీరులు వారు.

శతవలి భూమండలంలో ఖ్యాతి వహించిన వీరుడు. జయం నిమిత్తం సూర్యుని ఉపాసిస్తాడు. ఇతడు తన స్వశక్తిమీదనే ఎక్కువగా ఆధారపడి శత్రువులను మట్టి కరిపిస్తాడు. మంచి పని చేసి రాముని మెప్పించాలనే దీక్షలో ఉన్నాడు.

గజుడు, గవాక్షుడు, గవయుడు, నలుడు, నీలుడు, వీరిలో ఒక్కొక్క యూధపతి వెంట పది కోట్లమంది వానరులు ఉన్నారు. వింధ్య పర్వత నివాసులైన వానరులు అందరికన్నా మహాబలవంతులు. వీరి సంఖ్య లెక్కవేయలేనిది. వానరులందరూ ఈ అవనిపై కొండలను పిండి కొట్టగలరు. ఆ కొండలనే ఎత్తి దూరంగా విసిరివేయగల సుసంపన్న శక్తిశాలురు వానరులు అని దూతలు రావణునితో చెప్పారు. సముద్రాన్ని దాటి వచ్చిన వానరసేన అపారంగా మరో మహాసంద్రాన్ని తలపిస్తోంది. బుద్ధిశాలురు, బలశాలురు అయిన వానరులు రణోత్సాహంతో ఉరకలువేస్తున్నారు. వారినందరిని చూసి అతిబలుడైన రాముడు స్థిర నిశ్చయంతో స్థిమితంగా ఉన్నాడు. రామలక్ష్మణులు చూసి ధర్మం మన ప్రక్కనే ఉంది కాబట్టి, జయభేరిని మ్రోగించేది మనమే అని సుగ్రీవుని రక్షణలో ఉన్న సేనావాహిని ఆనందంతో కేరింతలు కొడుతోంది.

* * *

# ప్రముఖుల బలాబలాలు

## సర్గ - 28

**సా**రణుడు చెప్పినదంతా వింటున్న రావణునికి మరింత విపులంగా వానర సేన గురించి చెప్పాలని శుకుడు అనుకొన్నాడు. వెంటనే "మహారాజా" అంటూ తన చేతిని చాచి వ్రేలితో చూపుతూ రామపక్షంలోని వారి బలాబలాలను చెపుతున్నాడు. "రాజా! వీరందరూ మదపుటేనుగులవంటి పరాక్రమవంతులు. వారిని ఎదిరించ

వీలులేనివారు. ప్రభూ! వీరందరూ కిష్కింధావాసులు గంధర్వులందు పుట్టినవారు. ఇక్కడ కనిపించే ఆ ఇద్దరు వీరులు మైందుడు ద్వివిదుడు. వీరు బ్రహ్మను మెప్పించి అమృత సేవనం చేశారు. వీరిని ఇంతవరకూ ఎవరూ ఎదిరింపలేదు. ఇక్కడ కనిపించే మహావీరుడు మన లంకను ధ్వంసం చేసిన హనుమంతుడు. వాయుదేవుని వరంతో కేసరి పుత్రునిగా జన్మించాడు.

హనుమంతుడు కామరూపి అన్ని దిశలకు వాయువులాగ వెళ్లి రాగలడు. ఇతడు చిన్నతనంలోనే సూర్యుని భక్షించాలనుకొన్న వీరుడు. దేవ దానవ మహర్షులకు చేరడానికి శక్యంకాని సూర్య మండలానికి వెళ్లాలని మూడు వేల యోజనాల దూరం ఆకాశాన ఎగిరాడు. అక్కడనుండి ఇంద్రుడు కొట్టినందువల్ల హనువులకు దెబ్బ తగిలి హనుమంతుడు అయ్యాడు. లంకా నాశనం నేను ఒక్కడినే చేయగలననే సత్తా ఉన్న ధీశాలి ఇతడు. ఇతని పరాక్రమాన్ని మనమందరం ఇదివరకే రుచిచూశాం కదా.

హనుమంతుని దగ్గరే శ్యామ వర్ణ శోభితుడై నిలచిన పద్మపత్ర నేత్రుడు శ్రీరాముడు. ఇక్ష్వాకు వంశజులలో అతిరథుడుగా పేరుగాంచాడు. శ్రీరాముని అందరు రూపుకట్టి నిలిచిన ధర్మమూర్తి అని పొగడుతారు. బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగంలోను, ఉపసంహరించడంలోను ఉపాయశాలి. వేదస్వరూపుడు. ఇతని కోపానికి గురి అయినవాళ్లు మృత్యుముఖం చేరినట్లే అనుకోవచ్చు. మీరు అపహరించి తెచ్చిన సీతాసాధ్వి ఇతని భార్యయే.

శ్రీరాముని పంచ ప్రాణమైన ఉంగరాల జుట్టున్న బంగారు ఛాయాంకితుడు లక్ష్మణుడు. సదా అన్ననే అనుసరించే మహా పరాక్రమశాలి. మిమ్ము ఎదిరించాలని మీపై ఉగ్రుడై ఉన్నాడు. అపజయం ఎరుగని సహనశీలుడు. తానొక్కడే శత్రువులపై జయభేరి మ్రోగించి అన్నకు ఆనందాన్ని కూర్చగలను అనుకొనే ప్రతిభావంతుడు. అన్యాయాన్ని ఎదుర్కొనే మహోన్నతుడు.

శ్రీరామచంద్రమూర్తికి ఎడమవైపుగా నిలబడి ఉన్నది విభీషణుడు. శ్రీరాముడు ఇతనిని లంక భావి రాజ్యాధిపతిని చేస్తానని ప్రతిజ్ఞ చేసి ఉన్నాడు. మీపై కోపంతో ఉగ్రూతలూగుతున్నాడు. శ్రీరామునకు విభీషణునకు మధ్య గిరిలాగా ఉన్నది సుగ్రీవుడు. సమస్త వానర ప్రభువు. శ్రీరామునిదయను పొందినవాడు. వానర లోకానికే మహారాజు హిమవంతునివలె శ్రేష్ఠుడు.

పర్వత ప్రాకారాలతో నిండి ఉన్న కిష్కింధకు ఇతడే ప్రభువు. ఇతని ఆజ్ఞానుసారం భూమండలంలోని నలువైపులనుండి వానరులు కిష్కింధకు చేరి రాముని కార్యంలో పాలు పంచుకొంటున్నారు.

రాక్షసేంద్రా! సూర్యపుత్రుడైన సుగ్రీవుని ఎదిరించడం ఎవరికీ శక్యంకాదు. సుగ్రీవుని మెడలో నూరు సువర్ణ కమలములు చెక్కి ఉన్న సువర్ణమాల ఉంది. ఇది మెడలో ఉన్నంతవరకు శత్రువు సుగ్రీవుని ఎదుట రాణించలేదు. శ్రీరామునితో మైత్రి చేసి ఈ కాంచనమాలను వాలి నుండి పొందాడు. శ్రీరాముని సహాయంతో కిష్కింధారాజ్యం, తార, రుమ, కాంచనమాల సుగ్రీవునకు ప్రాప్తించాయి.

మహాప్రభూ! గణిత శాస్త్రజ్ఞులు సంఖ్యాప్రమాణం ఇలా చెప్పారు. నూరు లక్షలు ఒక కోటి, లక్ష కోట్లు ఒక శంఖం, లక్ష శంఖాలు ఒక మహాశంఖం, లక్ష మహా శంఖాలు ఒక బృందం, లక్ష బృందాలు ఒక పద్మం, లక్ష

పద్మాలు ఒక మహాపద్మం, లక్ష మహాపద్మాలు ఒక ఖర్వం. లక్ష ఖర్వాలు ఒక మహాఖర్వం, లక్ష మహా ఖర్వాలు, ఒక సముద్రం, లక్ష సాగరాలు ఒక ఓఘం, లక్ష ఓఘాలు ఒక మహౌఘం.

ఇలాంటి వేయి కోట్లు నూరు శంఖాలు, వేయి మహాశంఖాలు, వంద బృందాలు, వేయి మహాబృందాలు, వంద పద్మాలు వేయి మహా పద్మాలు, నూరు సముద్రాలు వేయి మహౌఘాలు, కోటి మహౌఘాలు ఒక మహా సముద్రంలాగా వానర సేన విభీషణాదులతోను వానర ప్రముఖులతోను సుగ్రీవుని నాయకత్వాన నిన్ను ఎదిరించాలని లంకకువచ్చారు.

ఇంతమంది శత్రువుల ముందు పరాజయం పాలుకాకుండా మంచి ఉపాయంతో సంధి చేసుకొనే ప్రయత్నం చేస్తే బాగుంటుందని నాకనిపించింది. ఈ అజేయమైన అమోఘమైన వానర సేనతో ఉన్న శ్రీరామ లక్ష్మణులను ఎదిరించడం అసాధ్యమైన పని నాకు అనిపిస్తోంది. రాక్షస ప్రభూ! మనందరం బాగుండాలని మీరు తలిస్తే ముందుగా ఈ వానరుల నుంచి తప్పించుకోవాలి. వారందరూ రామునకు విధేయులు. రాముని మాట వారికి బ్రహ్మవాక్కు. ఒక్క రామునికోసం వారు ఏపనైనా చేస్తారు. అనంతంగా ఉన్న వారి సేనను మనం ఎదిరించడానికన్నా వారిని ఏ ఉపాయంతోనైనా వశపర్చుకొంటేనే మంచిదని నాకు తోస్తోంది" అని శుకుడు రావణునకు చెప్పాడు.

* * *

# శార్దూలుని ఆగడం

## సర్గ - 29

**శు**క సారణులు శత్రువుల పరాక్రమాలను కళ్ళకు కట్టినట్లుగా చెప్పారు. వారి బల సంపదను తెలుసుకొని రావణుడు అసూయాపరుడయ్యాడు. తన ముందే శత్రువులను పొగడే తన దూతలను చూసి ఆగ్రహించాడు. వారు ప్రభువు ఆగ్రహం చూచి వణికిపోయారు. చేతులు కట్టుకొని తలలు వంచుకొని నిలబడ్డారు.

"శుకసారణులారా! రాజు నిగ్రహానుగ్రహసమర్థుడు. రాజువలన జీవించేవారు ఆయన ముందు అప్రియములైన మాటలు చెప్పకూడదని మీకు తెలియదా? శత్రుపక్షంలోని వారిని అజేయులంటూ వారిని ప్రస్తుతి చేయవచ్చునా? మీరు ఆచార్యులను సేవించి శాస్త్రాదులను నేర్చారు. కాని వాటి సారం మీరు తెలుసుకొన్నట్లుగా కనిపించడం లేదు. మీరు అక్కడ నేర్చుకొన్నా ఇప్పుడు మరిచినట్లున్నారు. అజ్ఞానులులాగా నా ముందు మాట్లాడినారు. మీలాంటి మూర్ఖపు మంత్రులతో నేను రాజ్యపాలన చేస్తున్నాను. ఇది నా గొప్పదనమే కదా!

నేను మీ అందరికి రాజును. ఒక్క మాటతో మీకు మేలైనా, కీడైనా చేయగలను. అట్టి నాముందే మీరు నాకు హితం చెప్పడానికి పూనుకొన్నారు. మీకు చావంటే భయం లేదా? దావాగ్నిలో ఎక్కడైనా ఒక వృక్షం మిగిలి ఉంటుందేమో కాని రాజుకు కోపం వస్తే మాత్రం అపరాధులు ఎవ్వరూ మిగిలి ఉండరు.

ఇదివరలో మీరు నాకు ఉపకారం చేశారన్న ఒక మిషతో నేను మిమ్ములను ఇంతవరకు ఉపేక్షించాను. లేకపోతే నా ఎదురుగా శత్రువులను పొగిడిన మీకు మరణదండన విధించేవాడిని. ఛ! మీరు నా ఎదురుగా నిలవవద్దు. కృతఘ్నులైన మీరు నా ముందు నుంచి దూరంగా వెళ్లిపోండి. మిమ్ములను జీవచ్ఛవాలుగా చూస్తాను." అని రావణుడు అన్నాడు. అలా వారు రావణుని చీదరింపులకు గురిఅయ్యారు. అక్కడనుండి వారు వెళ్లిపోయారు.

రావణుడు మహోదరుని పిలిచి రాజనీతిలో రాటుదేలిన చారులను పంపించమని చెప్పాడు. మహోదరుని పంపిన చారులు రాజభక్తితత్పరులు. శత్రువులకు భయపడనివారు. వారిని చూచి రావణుడు రాముని సైన్యంలోకి వెళ్లి ఆంతరంగిక మిత్రులను, మంత్రులను, యుద్ధ పన్నాగాలను అన్నీ తెలుసుకొని రమ్మని వారిని వానరసేన దగ్గరకు పంపించాడు. అక్కడ మీరు అప్రమత్తతతో మెలగుతూ ప్రచ్ఛన్న రూపులతో ఉండండి. మిమ్ములను ఎవరూ పసిగట్టకుండా చూసుకోండి అని రావణుడు వారిని హెచ్చరించాడు.

మరల వారిని రావణుడు పిలిచాడు, " దూతలారా! మీరు అన్ని పనులను ఎవరు చూడకుండా తెలుసుకొని రావాలి. రాముడు ఒక్కడే నిద్రించునా? అతని చుట్టూ రక్షకులు ఎంతమంది ఉంటారు? వారందరూ ఎప్పుడూ యుద్ధ సన్నద్ధులై ఉన్నారా?లేదా? ఎపుడెపుడు రాముడు ఒంటరిగా ఉంటాడు. రామలక్ష్మణులు విడిగా మాట్లాడుకుంటారా? వానరులముందే అన్ని విషయాలు మాట్లాడుతారా? ఇన్నాళ్ళు ఇక్కడున్న సీతను గురించి వానరులు ఏమనుకొంటున్నారు? రామలక్ష్మణులు ఏమనుకొంటున్నారు? లక్ష్మణుని మాట రాముడు వింటాడా? రాముని మాటను సందేహించకుండా లక్ష్మణుడు చేస్తాడా? ఇలా అన్ని విషయాలను విని రండి. వారి ప్రణాళికా వివరాలు అన్నీ తెలుసుకొని రండి. శత్రువులు లోటుపాట్లు తెలుసుకొంటే మనం అనాయాసంగా శత్రువులను జయించవచ్చు కదా దీనిని దృష్టిలో పెట్టుకుని నేను చెప్పనివి, చెప్పినవి అప్పటికప్పుడు చేయాల్సినవి మీ బుద్ధికుశలతతో చేసుకురండి" అని రావణుడు వారికి చెప్పాడు.

రావణుడు చెప్పినట్లు చేద్దాం అని వానర సైన్యం దగ్గరకు వచ్చారు. శుకసారణుల మాట వినకుండా మనలను మరలా పంపించడంలో రావణునికి మనపై ఎంతటి నమ్మకం ఉందో అని మురిసిపోయి, ఎలాగైనా రావణునికి మేలు చేయాలని వానరుల చెంత నిలిచారు. ఆ అపార సేనావాహిని చూసారు. నోటి మాట రాక నిశ్చేష్టులు అయ్యారు. వారిలో దైన్యం ఆవరించింది. రామలక్ష్మణులను, సుగ్రీవ విభీషణాదులను చూశారు. వారికి భయం వేసింది. వారు అలా చూస్తున్నప్పుడే విభీషణుడు వారిని గుర్తించాడు.

ఆ దుష్టులలో నాయకుడైన శార్దూలుని పట్టుకొని రాముని ఎదుట నిలబెట్టాడు. వానరులు శార్దూలుని చావగొట్టారు. దయామయుడైన రాముడు వారిని ఏమి అనవద్దని వారిని విడిచిపెట్టారు. వానరుల దెబ్బకు వారు స్పృహ కోల్పోయి తిరిగి తెలివి పొంది, బతికిఉంటే బలుసాకు తినవచ్చునని తమ యజమానికి వారు ఏమి చెప్పాలా అని చింతించి చేసేది ఏమీ లేక వారు లంకను చేరారు. గూఢచారులు శ్రీరాముని బలపరాక్రమాలను గూర్చి రావణునితో చెప్పారు.

* * *

# వానర వీరుల వంశ చరిత్ర

## సర్గ -30

**శ్రీ**రాముని దయతో శార్దూలుడు తిరిగి లంకకు వెళ్లి రావణుని దగ్గరగా చూడగలిగాడు. లెక్కించడానికి శక్యంకాని సైన్యంతో రాముడు సువేల పర్వతంపై ఉన్నాడన్న సమాచారాన్ని రావణునికి చెప్పాడు. శార్దూలుని మాటల వలన రావణునిలో భయం పుట్టింది.

"శార్దూలా! నీవు మామూలుగా లేవేమి? దీనునిలాగా కనిపిస్తున్నావు. నిన్ను ఆ శత్రువులు పట్టుకోలేదుగదా. నిన్ను వారు బాధించలేరు గదా" అన్న రావణుని మాటలు విని "ప్రభూ! విక్రమవంతులు, బలవంతులు రాముని రక్షణలో ఉన్న వానర సైన్యాన్ని మేము చూడటానికి కూడా శక్యం కాలేదు. ఇక వారితో మాట్లాడడం, ప్రశ్నించడం అన్న అవకాశమే రాలేదు. వానరులు నాలుగు ప్రక్కలా కాపలా కాస్తున్నారు.

నేను మారువేషంతో సైన్యంలో ప్రవేశించాను. కాని, నేను ఏమీ గుర్తించకముందే విభీషణుడు నన్ను పట్టుకొన్నాడు. వానరులందరూ నన్ను బాగా కొట్టి గిచ్చి బాధించారు. పైగా నన్ను వానరులందరిముందు ఊరేగించి రాముని వద్ద నిలిపారు. వానరులవల్ల నేను బాగా దెబ్బతిన్నాను. అలాంటి నన్ను శ్రీరాముడు కరుణించాడు. పిడిగుద్దులతో రక్తసిక్తమైన నా శరీరాన్ని చూసి వానరులతో నన్ను ఏమీ చేయకుండా వదిలివేయమని చెప్పగా రాముని ఆజ్ఞను వారు పాలించారు.

వానరులందరు అత్యుత్సాహంతో చేతులలో శిలలు, పర్వతాలు, వృక్షాలు పట్టుకొని మన లంకవైపు దూసుకొస్తున్నారు.

గరుడ వ్యూహంగా ఏర్పడ్డ వానరులతో శ్రీరామలక్ష్మణులు మహోగ్రులై లంకపై దాడికి వస్తున్నారు. రావణరాజా! రాముడు ప్రాకారం దగ్గరకు వచ్చేలోపు మీరు ఏదైనా చేసి లంకను రక్షించు స్వామీ. ఆ శ్రీరామునికి సీతను ఇవ్వడానికైనా లేక యుద్ధం చేయడానికైనా మీరు త్వరపడాలి. లేనట్లయితే మీరు పశ్చాత్తాపం చెందాల్సి ఉంటుంది" అని శార్దూలుడు రావణునికి చెప్పాడు.

ఇంత చెప్పినా అర్థంకాని రావణుడు "శార్దూలా! ఆ వానరులు ఎవరి పుత్రులు? ఎవరి పాలకులో చెప్పి వారు ఎలాంటి పరాక్రమం ఉన్నవారో నీకు తెలిసిందంతా నాకు చెప్పు. శత్రువుల గురించి తెలుసుకోవడం ఏ రాజుకైనా మంచిదే కదా" అని రావణుడు అడిగాడు. రావణుని ప్రశ్నలకు సమాధానంగా "ప్రభూ! ఋక్షరజసుని పుత్రుడు జయింప శక్యంగాని సుగ్రీవుడు సేన అంతటికీ నాయకుడు. గద్గదుని పుత్రుడు జాంబవంతుడు భల్లూకాలకు రాజు, యుద్ధంలో ఆరితేరిన యోధుడితడు.

గద్గదుని మరొక పుత్రుడు ధూమ్రుడు. బృహస్పతి కొడుకు కేసరి. కేసరి కుమారుడు హనుమంతుడు. మహావీరుడైన సుషేణుడు వరుణుని పుత్రుడు. దధిముఖుడు చంద్రుని సుతుడు. బ్రహ్మ మృత్యువును సుముఖుడు, దుర్ముఖుడు, వేగదర్శి అనే వారిగా వానరులను పుట్టించాడు. నీలుడు అగ్ని ఔరస పుత్రుడు.

ఇంద్రుని మనుమడు అంగదుడు వాలి సుపుత్రుడు. వాలికి ఏమాత్రం తీసిపోని గొప్ప పరాక్రమవంతుడు. మైందుడు, ద్వివిదుడు అనేవారు అశ్వినీ దేవతల పుత్రులు. వీరు అమృతం సేవించిన పరాక్రమవంతులు. గజుడు, గవాక్షుడు, గవయుడు, శరభుడు, గంధమాదనుడు వీరు ఐదుగురు యమధర్మరాజు నందనులు. వీరు కాలాంతకులు. వానరులంతా దేవతలఅంశలతో జన్మించారు. శుభలక్షణులు. వీరందరూ అసంఖ్యాకంగా విజయాన్ని కోరుతూ రణోత్సాహంతో ఉన్నారు.

దశరథ మహారాజు పుత్రులు రామలక్ష్మణులు. వీరిద్దరూ మహాబలవంతులు. రాముడు ఒక్కడే జనస్థానంలో 14 వేలమంది రాక్షసులను సంహరించాడు. లక్ష్మణుడు రాముని అంతటి ధీశాలి. ఈ భూమండలంలో శ్రీరామునికి సాటివచ్చే వీరులు ఎవ్వరూ లేరు. రామలక్ష్మణులిద్దరూ ఉత్తమ గుణసంపన్నులు. సత్యవాదులు. ఎన్నడూ అధర్మం చేయని వీరులు.

శ్వేతుడు, జ్యోతిర్ముఖుడు సూర్యుని కుమారులు. హేమకూటుడు వరుణుని కుమారుడు. మహావీరాధివీరుడైన నీలుడు విశ్వకర్మ కొడుకు. వసు తనయుడు దుర్ధరుడు. మీకు తమ్ముడైన విభీషణుడు. వీరందరూ మన శత్రువైన రాముని పక్షాన ఉన్నవారు. శ్రీరాముని చేతిలో లంక భావిరాజుగా విభీషణుడు అభిషిక్తుడై ఉన్నాడు.

వానరులందరూ రణధీరులు, గొప్ప పరాక్రమవంతులు. వానరులలో ఏ ఒక్కరిని మనం తక్కువ శక్తి ఉన్న వారిగా అంచనా వేయలేము. వారిలో అహంకారం మచ్చుకైనా లేదు. వారందరూ ధర్మాన్నే ఊపిరిగా చేసుకొని జీవించేవారు. వారికి ధర్మాచరణపట్ల అపారమైన నమ్మకం ఉంది. అన్యాయం చేసేవారు తప్పక శిక్షింపబడుతారు అని వారు గట్టిగా నమ్ముతారు. అందుకే అక్రమంగా మీరు చేసిన పనికి శిక్ష వేసి తీరాలి దానికి భగవంతుడు తోడుంటాడు అన్న విశ్వాసంతో వారు ముందుకు కదులుతున్నారు. అందరిలో జయోత్సాహం కొట్టవచ్చినట్టు కనిపిస్తోంది" అంటూ వానరులు గురించి తనకు తెలిసినదంతా రావణునికి వివరించి శార్దూలుడు చెప్పాడు.

* * *

# దశగ్రీవుడు జానకికి భీతి కలిగించటం

## సర్గ - 31

**గూ**ఢచారుల ద్వారా రావణుడు రాముని పక్షాన ఉన్న వానరసేన గురించి తెలుసుకొన్నాడు. వారి బలాబలాలు అంచనా వేశాడు. రామలక్ష్మణుల పరాక్రమం గురించి స్వజనుల ద్వారా విన్న దాన్ని గుర్తుచేసుకొన్నాడు. రావణుని మదిలో గుబులు తీవ్రమయ్యింది. శత్రువులను ఎలా ఎదిరించాలో తెలియక సతమతమయ్యాడు.

దూతలను పంపించి మంత్రులను రప్పించాడు. మంత్రులందరితో కలిసి శత్రువుల వ్యూహరచనను ఎలా దెబ్బతీయాలో అని సమాలోచన చేశాడు. అందరూ కలిసి బాగా ఆలోచించి నిర్ణయాలు తీసుకొని ఎవరిదోవన

వారు వెళ్లిపోయారు. రావణుడు గొప్ప మాయలు తెలిసినవాడు. తన దగ్గర మాయలు తెలిసిన విద్యుజ్జిహ్వుని పిలిచాడు. "మనం నీ ప్రజ్ఞాపాటవాలతో సీతాదేవిని భయపెట్టుదాం" అని రావణుడు విద్యుజ్జిహ్వునితో చెప్పాడు. అలా వారిద్దరూ కూడబలుక్కున్నారు. "నిశాచరా! నీ ప్రజ్ఞను ఉపయోగించి శ్రీరాముని శిరస్సు వంటి ఒక మాయా శిరస్సును ధనుర్బాణాలను తీసుకొనిరా"తర్వాత నేను నాటకం జరిపిస్తాను అని రావణుడు చెప్పాడు. విద్యుజ్జిహ్వుడు రావణుని కోరికను తీర్చాడు. దాంతో చాలా సంతోషించి ఒక ఆభరణాన్ని బహుమతిగా ఇచ్చాడు.

రావణుడు విద్యుజ్జిహ్వుడు ఇద్దరూ అశోక వనంలోని సీత దగ్గరకు వెళ్లారు. ఆ సమయానికి సీతాదేవి చాలా దీనంగా ఏడుస్తూ కూర్చుని ఉంది. రాక్షసస్త్రీల కాపలా మధ్య భర్తనే అనుక్షణం ధ్యానిస్తూ ఉంది. సీతను చూచి రావణుడు "ఓ సీతా! నిన్ను బ్రతిమాలుతున్న కొద్దీ విర్రవీగుతూ నీ భర్త గొప్పతనాన్ని చెప్పావు. నన్ను తృణీకరించావు. కాని, నేడు పరిస్థితులు ఎలా మారిపోయాయో. యుద్ధంలో గెలుపు ఓటములు దైవాధీనాలు కదా. అందుకే నాడు ఖరదూషణాదులను చంపివేసిన నీ భర్త, నేడు నా చేతిలో హతుడయ్యాడు. ఇక నీకు ఆధారం ఏదీ లేదు. నీ గర్వం అణగారిపోయింది. ఇప్పుడు దుఃఖించి ప్రయోజనం ఏదీ ఉండదు. సీతా! ఇప్పటికైనా తెలివి తెచ్చుకొని నన్ను భర్తగా అంగీకరించు. మూర్ఖురాలా! ఇప్పటినుంచి రాముని చింతను మాను. మరణించిన భర్తను నీవు మరిచిపోయి, నిన్నే కోరుకునే నన్ను పతిగా స్వీకరించు. నా భార్యలందరికీ నీవు యజమానురాలివి కాదలచుకొంటే నన్ను అంగీకరించు. రామునిపై పెట్టుకున్న నీ ఆశలన్నీ అడుగంటాయి. అదృష్టహీనురాలా! తెలివిగలదానివని అనుకుంటూ మూర్ఖపు పనులు చేస్తున్నావు. వృత్రాసురునివలె నీ భర్త ప్రాణాలను నా చేతిలో పోగొట్టుకొన్నాడు.

జానకీ! శ్రీరాముడు సుగ్రీవుని నాయకత్వంలో వానర బలాలతో సాగరాన్ని దాటి సువేల పర్వతం చేరాడు. అక్కడ అలసిన సేనావాహిని రాత్రివేళ నిదురలో మునిగింది. ఆ సమయంలో ప్రహస్తుని నాయకత్వాన నా బలాలు రాత్రివేళ రామలక్ష్మణులున్న చోటకు వెళ్లాయి. అక్కడ నిద్రపోతున్న వారినందరినీ మావాళ్ళు తుదముట్టించారు.

మా రాక్షస సైనికులు అడ్డ కత్తులు, ఇనుప గుదియలు, చక్రాలు, ఇనుప దండాలు, ఖడ్గాలు, బాణాలు, శూలాలు, సమ్మెటలు, గదలు, ఈటెలు, శస్త్రాలు ఇలా చాలా ఆయుధాలను ధరించి వానరులందరినీ మోదారు. అస్త్రశస్త్ర విద్యలలో ఆరితేరిన ప్రహస్తుడు రాముని గుర్తించి తన మహాఖడ్గంతో ఒక్క క్షణకాలంలో శ్రీరాముని శిరస్సును ఖండించివేశాడు. దాన్ని చూచిన లక్ష్మణుడు వానరసేనతో పారిపోయాడు. "సీతా! ప్రహస్తుడు సుగ్రీవుని నరికేశాడు. రాక్షసుల దెబ్బకు హనుమంతుని దవడలు పగిలిపోయాయి. ఈ కోలాహలానికి మేల్కొన్న వానరవీరులను ఎక్కడికక్కడే రాక్షసులు తుదముట్టిస్తూ వెళ్లారు. జాంబవంతుని మోకాళ్ళు తెగ నరికివేశారు. రాక్షసుల యోధులు చాలామంది ఒకేసారి చుట్టుముట్టడం వలన వానరులు ఏమీ చేయలేకపోయారు. మొదలు నరికిన చెట్లలాగా కూలిపోయారు. మైందద్వివిదులు కూడా రాక్షసుల ప్రహారాలకు గాయపడిపోయారు.

వానరుల శరీరాలు ఛిన్నాభిన్నం అయిపోయాయి. అందరూ నడుములు విరిగి కాళ్లు చేతులు తెగి రక్తసిక్తులై అతిదీనంగా ఏడుస్తూ నిట్టూరుస్తూ నేలపై పడిపోయారు. పనసుడను వానరుడు సైతం కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నారు. దధిముఖుడను వానరుడు పైకి లేవలేక ప్రాణాలు పోక గుహలో పడి ఏడుస్తున్నాడు. కుముదుడు పూర్తిగా కన్నుమూశాడు.

రాక్షసుల బాణాలు అంగదునికి గ్రుచ్చుకోవడంతో అతని శరీరం రక్తమయం అయ్యింది. అతని భుజకీర్తులు క్రిందపడి పోయాయి. అతడు దీనాతిదీనంగా కన్నుమూశాడు. కొందరు గజబలముల తొక్కిడికి రథ చక్రాల బరువుకు అశ్వాల పాద ఘట్టనలకు వానరులు నిహతులయ్యారు.

వాయువేగానికి మేఘాలు చెల్లాచెదురై పోయినట్లుగా రాక్షసుల చేతికి చిక్కిన వానరులు వారి పరాక్రమాన్ని ఎదుర్కోలేక చనిపోయారు. కొందరు వానరులు సముద్రంలో పడిపోయారు. మరికొందరు శత్రువు ధాటికి తాళలేక గగన మార్గంలో పరుగుపెట్టారు. చాలామంది మృత్యువాతపడ్డారు.

అక్కడే ఉన్న రాక్షస స్త్రీని పిలిచి భవనంలో ఉన్న విద్యుజ్జిహ్వుని పిలుచుకొని ఇక్కడకు తీసుకొనిరా. అతడే రాముని ఖండిత శిరస్సును తీసుకొని వచ్చాడు అని చెప్పగానే విద్యుజ్జిహ్వుడు రాముని శిరస్సును రక్తం కారుతూ తీసుకొని వచ్చాడు.

"ఓ విద్యుజ్జిహ్వా! నీవు స్వయంగా ఆ రాముని శిరస్సును ధనుర్బాణాలను జానకికి చూపించు. ఆమె స్వయంగా చూచి నిర్ణయించుకొంటుంది. పాపం! ఎలా అయినా ఆమె భర్త కదా! ఆ రామునిపై జానకి ఎన్నో ఆశలు పెట్టుకొంది" అని రావణుడు అనగానే రాముని శిరస్సును జానకి దగ్గరగా పెట్టి దూరంగా వెళ్లి నిలుచున్నాడు. "సీతా! ఈ బలమైన అల్లెత్రాడు ఉన్న ధనుస్సు కూడా ఆ శ్రీరామునిదే. రాత్రే మా నిశాచరుల చేతిలో ప్రాణాలు పోగొట్టి రాముని ధనుస్సును కూడా నాకు తెచ్చి చూపారు. సీతా! ఇక నీవు గతం అంతా మరిచిపోయి భవిష్యత్తును బంగారుమయం చేసుకోవడానికి బాట వేయి. నీ అంగీకారంపైనే నీ భవిత ఆధారపడి ఉంది. బాగా ఆలోచించుకొని నీవు నన్ను అనుగ్రహించు. నీ భర్తగా నన్ను అంగీకరించు. ఇక పై నీవు దుఃఖించవలసిన అవసరం లేదు. ఎపుడూ చిరునవ్వులు చిందిస్తూ హాయిగా పట్టపురాణివై వందిమాగధులతో దాసదాసీ జనంతో అష్టైశ్వర్యాలను పొందుతూ నా అంకంపైన ఆసీనురాలివి కావచ్చు. ఇక చింతను వీడి చెంతకు రమ్ము. నీవు కోరినట్లుగా నేను నీకు గడువుకూడా ఇచ్చాను. దానిని ఆ మతిలేని రాముడు వినియోగించుకోలేక పోయాడు. నీవు మాత్రం చేసేది ఏముంటుంది? భర్త పనికిమాలిన వాడైతే భార్య ఏంచేయగలదు? అందుకే త్రిలోకవీరుడనైన నన్ను నీవు భర్తగా అనుగ్రహించు. నీ కష్టాలను నేను దూరంగా తరిమివేస్తాను. నిన్ను సుఖాల కడలిలో ఓలలాడిస్తాను అని రావణుడుచెప్పుతూ ఉన్నాడు.

* * *

# మాయా శిరస్సును చూసిన సీత పరితాపం

## సర్గ - 32

సీత మాయా శిరస్సును చూసింది. హనుమంతుడు చెప్పిన రామ సుగ్రీవుల మైత్రి గుర్తుతెచ్చుకొంది. మాయా శిరస్సులో శ్రీరాముని ముఖ కవళికలను ఏరుకొంటోంది. శ్రీరాముని ముఖ కాంతి, కేశాలు, లలాటం, అన్నీ చూసింది. మాయ కూడా అసలునే పోలి ఉండడంతో సీతకు దుఃఖం తన్నుకొచ్చింది. గోరువంకలా పెద్ద పెట్టున సీత రోదించింది.

రాముని శిరస్సును తన ఒడిలో పెట్టుకొని "ఓ కైకేయీ! నేటితో మీ కోరిక తీరింది. నాతో కూడా రాముణ్ణి అడవులకు పంపావు. మీ రాజ్యసుఖం కోసం ఈ వంశానికి తీరని నష్టాన్ని కలిగించావు. మీ మనస్సు ఇప్పుడు శాంతించి ఉంటుంది. భువన మోహనాకారుడు సర్వులకు ప్రియుడు ఐన రాముడు మీ మూలాన అసువులు కోల్పోయాడు. సర్వలోక పూజ్యుడు నేలకొరిగాక ఇక ఈ లోకంతో నాకు పని ఏమి? అంటూ సీతాదేవి మూర్ఛపోయింది. క్షణకాలానికి తెప్పరిల్లింది. అయ్యో! మీరు శత్రువును దునుమాడుతానని చెప్పారు గదా. నేడు ఎలాపరలోక ప్రయాణం కట్టారు? అయినా నేను లేనిదే మీరు ఏపనిని ఆరంభించరుగదా ఇపుడునేను లేకుండాయమధర్మరాజును చూడడానికిఎందుకు వెళ్ళారు? అంటూ సీత మాయశిరస్సుతో మాట్లాడుతోంది.

"శ్రీరామచంద్రా! ఇప్పుడు నన్ను దిక్కులేనిదానిలాగా చేశావు. నేడు నేను నిస్సహాయురాలిని అయ్యాను భార్యకంటే భర్త ముందు చనిపోవడం ఎంతో దురదృష్టం. అనర్థదాయకం. నేను బ్రతికి ఉండగనే సత్ప్రవర్తనులైన మీరు చనిపోవడం అనేది అసంభవం కదా. ఈ పరిస్థితి మీ కెట్లు కలిగింది?" అంటూ సీత జరిగిన సంగతి తెలిసి మ్రాన్పడిపోయింది.

"శ్రీరామా! ఆపదలపై ఆపదలు వచ్చిపడుతున్నాయి. వీనివలన నేను శోక సాగరంలో మునిగిపోయి ఉన్నాను. ఈ దుఃఖసముద్రం నుండి మీరే నన్ను గట్టు చేరుస్తారని ఎంతో ఆశపెట్టుకొన్నాను. కాని, నేడు మీరే నాకు శాశ్వతంగా దూరం అయ్యారేమి? రామా! పుత్ర ప్రేమకోసం అల్లాడిపోతున్న మా అత్తగారైన కౌసల్యాదేవిని కూడా దుఃఖసాగరంలో ముంచివేసితిరిగదా. వశిష్ఠాది పురుషులు మిమ్ము దీర్ఘాయుష్మంతునిగా దీవించారు గదా. వారి దీవెనలేవీ ఫలించలేదా?

మీ దురదృష్టం వలన మీరు నిద్రాపరవశులై మృత్యుదేవతలకు చిక్కినారు. మనిషి అదృష్ట దురదృష్టాలు భగవంతుని చేతిలో ఉంటాయి కదా. ఆపదలన్నింటిని ఉపాయాలచేత తప్పించుకొనేవాడివి గదా. అలాంటి మీరు ఊహించరాని అకాల మరణానికి ఎలా గురయ్యారు? ఈ క్రూరమైన కాళరాత్రి మిమ్ము నా నుండి దూరం చేసింది. మిమ్మల్నే సర్వస్వంగా భావించే నన్ను త్యజించి ఈ భూదేవిపై ప్రేమతో ఈమె ఒడిలో శయనించారా?

ఈ బంగారు కోదండం నాకు ఎంతో ఇష్టమైంది. దానిని మీరు నాతో కలిసి త్రిసంధ్యలోను పూజించేవారు గదా. పుణ్యపురుషా! మీరు స్వర్గానికి వెళ్లి అక్కడే ఉన్న దశరథ మహారాజుతో మాట్లాడుతున్నారా? పవిత్రమైన ఇక్ష్వాకు వంశంలో ఎందరో మహానుభావులు జన్మించారు కదా. వారినందరిని మీరు చూస్తారు గదూ?

బాల్యావస్థలోనే మనమిద్దరం భార్యాభర్తలం అయ్యాం. నాటినుంచి మీరే నాకు మిత్రులు. సఖులు అయ్యి నన్ను ఎల్లవేళలా కాపాడుతున్నారు. బేలనైన నన్ను ఈనాడు ఎలా ఒంటరిగా వదిలి వెళ్ళగలిగారు?నాకు మీరు నన్ను విడిచి వెళ్ళారంటే నమ్మశక్యంగా లేదు.

"ఓ శ్రీరామా! నేడు మౌనం వహించి ఎందుకు ఊరుకొంటున్నారు? నాటి ప్రాణిగ్రహణ సమయంలో సదా నాతో కలిసి ఉంటారని చెప్పారు గదా! నేడు ఆ మాటను అబద్ధం చేసి మీరు ఒక్కరే దూర తీరాలకు వెళ్ళాలా?

సుగంధద్రవ్యాలతో అలంకృతమైన మీ మేను నాకు సంతోషాన్నిచ్చేది. ఇప్పుడు డేగలు, క్రూరపక్షులు మీ శరీరాన్ని లాగుకొనిపోతున్నాయేమో? ప్రభూ! వనవాసానంతరం అగ్నిష్టోమాది యజ్ఞాలను ఆచరించి యజ్ఞాగ్నితో సంస్కారాలు పొందాల్సిన మీరు అవేమీ చేయకుండానే దివికి ఏగారా?

స్వామీ! నాడు సౌమిత్రితో కలిసి మన ముగ్గురం దండకారణ్యానికి వచ్చాం. నేడు లక్ష్మణుడు ఒక్కడే కౌసల్యామాత దగ్గరకు వెళ్ళితే ఆమె గుండెలు బ్రద్దలు అయిపోతాయి. మీరు స్వర్గానికి వెళ్లారని నేను ఈ రాక్షసుని ఇంట బందీనయ్యానని తెలిస్తే ఆమె ప్రాణాలతో జీవించలేదు.

ఓ మహారాజకుమారా! మీ ఒంటి చేత్తో రాక్షసులెందరినో హతమార్చారు. అలాంటి మీరు నా దురదృష్టవశంతో నిద్రలో మీరు ఈ ప్రహస్తుని చేతిలో నశించారంటే నేను నమ్మలేకున్నాను. శ్రీరాముడు బాహుబల సంపన్నుడు. ఆయన నష్టజాతకురాలినైన నన్ను చేపట్టి కారడవుల పాలయ్యారు. నేడు విధి విచిత్రంగా ఆయనను విగతజీవిని చేసింది. ఇదంతా నా ప్రారబ్ధ కర్మే. భార్య రూపంలోనున్న మృత్యుదేవతనయ్యాను. నాడు నా దురాశవల్లే అన్నదమ్ములిద్దరూ పర్ణశాలకు దూరమయ్యారు.

నేడు నా కొరకే మహాసముద్రాన్ని అవలీలగా దాటి ఈ దుష్టుల చేతిలో మరణించారు. చాలామందికి దానాలు చేసిన ధర్మవీరునికి నేడు ఈ దుస్థితి కలిగింది" అని సీత బోరున విలపించింది.

సీత మనసు రాముని వియోగాన్ని నమ్మలేకున్నా, వాస్తవంగా శ్రీరాముని ఖండితశిరస్సును చూసి జానకి అయోమయానికి గురైంది. మరల మరల శ్రీరాముని తలుచుకుని వైదేహి అమితంగా దుఃఖించింది. నా ప్రారబ్ధ కర్మవశాననే ఇపుడు ఈ కష్టంవచ్చిందని తన మూలకంగానే వంశం నాశనమవుతోందని వాపోయింది. పూర్వజన్మలో నేను కన్యాదానానికి అడ్డుపడినానేమో! నేడు ఇలాంటి దురవస్థ కలిగింది అని విలపిస్తూ దశకంఠుని చూసింది. దర్పంగా నిల్చున్న రావణుని చూసి "రావణా! దయచేసి నన్ను నా భర్త కళేబరం పైకి చేర్చు. నేను నా భర్తతో కలిసి సహగమనం చేస్తాను. ఆ మహానుభావునితో కలిసి ఈ లోకంలో జీవించలేకపోయినా కలిసి దివ్యలోకాలకు వెళ్ళే భాగ్యాన్ని కలిగించు.

**రావణా! నేను నా పుట్టింట భర్తయే దైవమనీ మాట విన్నాను. భర్తనే సర్వస్వంగా భావించే స్త్రీకి ఇహపర సౌఖ్యం లభిస్తుందని చెప్పగా విన్నాను. ఎన్నో పురాణాలు చదివి స్త్రీ ధర్మాలెన్నిటినో నేర్చుకొని ఆచరించాను. ధర్మం, కృతజ్ఞత, భూతదయ ఈ మూడు లక్షణాలు శ్రీరామునిలో పోతపోసి ఉన్నాయి. ఇక ఆ ధర్మమూర్తే లేని ఈ లోకాన నేడు నాకు దిక్కెవరు?** ఈ లోకంలో నేను చేసుకొన్న పాపం నన్ను కట్టి కుదుపుతున్నట్లు నాకు అనిపిస్తోంది.

ఇక నాకెవరూ లేరు. నా చివరి కోరిక నాభర్తతో నేను సహగమనం చేయడమే. ఆ ఒక్క కోర్కెనా నాకు తీరేలాగా భగవంతుడు అనుగ్రహిస్తాడని నేను అనుకొంటున్నాను. నేను ఏదో కాస్త పుణ్యం చేసుకొని ఉండే ఉంటాను. ధర్మమూర్తి అయిన శ్రీరామునికి ఇల్లాలిని అయ్యాను కదా! ఆ సౌభాగ్యవశాన నాకు భగవంతుడు నా సహగమనాభిలాషను పూర్తి చేస్తాడని నేను నమ్ముతున్నాను" అంటూ రాముని శిరస్సు అనుకొని ఆ మాయశిరస్సును ఒడిలో పెట్టుకొని సీత పదే పదే విలపించసాగింది.

అంతలో అక్కడే నిలచి ఉన్న రావణుని దగ్గరకు ప్రతీహారి వచ్చి ప్రహస్తుడు తక్షణ రాజకార్యం నిమిత్తం వచ్చి ఉన్నాడని, రావణునితో త్వరగా మాట్లాడుకొంటున్న విషయం రావణుడు అతని ద్వారా తెలుసుకొని గబగబా అక్కడనుంచి వెళ్లిపోయాడు.

రావణుడు వెళ్లిపోగానే మాయా శిరస్సు మాయమైపోయింది. ధనుస్సు అదృశ్యం అయ్యింది. రాముని ఎదిరించడానికి తగిన ఉపాయాలను తన మంత్రులతో దశకంఠుడు చర్చించసాగాడు.

విషయం చెప్పకుండా సైనికులందరిని దండోర వేసి పిలిపించమని రావణుడు చెప్పగా రావణ ప్రతినిధులు అలానే చేసి వారినందరినీ రావణుని భవనానికి తీసుకొని వచ్చారు. ఎక్కడివారక్కడ వెళ్ళిపోయారు. సీతకు జరిగిందిచూస్తూ ఏమైందో తెలియక, తెలుసుకోలేక స్తబ్ధంగా ఉండిపోయింది. కన్నీరుధారగా కారిపోసాగాయి.

* * *

# సరమ ఊరడింపులు

## సర్గ - 33

**మా**యాశిరస్సును చూచి దుఃఖిస్తున్న జానకిని సరమ చూసింది. సరమ సీతపై అనురాగం ఉన్న రాక్షస స్త్రీ. రావణుని మాయా ప్రభావానికి లోనై సీత భ్రమిస్తోందని తెలుసుకొంది. ఆమెను ఓదార్చాలనుకొంది. సీత దగ్గరగా వెళ్లి "అమ్మా! సీతమ్మ తల్లీ!ఊరడిల్లు తల్లీ! ధైర్యం వహించు. ధైర్యంతోచూడు. నిజానిజాలు తెలుసుకోలేకుండా ఉన్నావు. బేలవై ఏడుస్తున్నావు.

ఓ విశాలాక్షీ! రావణుడు మీతో చెప్పిన మాటలన్నీ విన్నాను. మీరు చెప్పే మాటలను కూడా విన్నాను. నాకు ప్రాణాలపై తీపి లేదు. నీ కోసం నేను ప్రాణాలు ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నాను. నీ దగ్గర మాట్లాడేటపుడు బంటు వచ్చి రావణుని పిలిచుకొని వెళ్ళాడు గదా! వారితోపాటు నేను కూడా వెళ్ళి విషయం ఏమిటో తెలుసుకొని వచ్చాను.

రాముడు ఈ రక్కసుల చేతిలో చావలేదు. ఆయన సురక్షితంగానే ఉన్నారు. నా మాట నిజం తల్లీ! నేను చెప్పేదంతా విను. మీకే తెలుస్తుంది" అని సరమ సీతను ఓదార్చింది.

"సీతా! రాముని వధించడం అసంభవం. అసాధ్యం. వానరులందరూ దైవాంశ సంభూతులు. వారిని ఎదిరించే శక్తి ఎవరికీ లేదు. అలాంటివారి దగ్గరకి అధర్మాన నడిచే వీరు వెళ్ళగలరా? రాముడు శుభలక్షణ సంపన్నుడు. ఆయన ప్రతాపానికి తిరుగులేదు. భూమండలంలో ధర్మమూర్తిగా వాసికెక్కాడు. తనను రక్షించుకోవడమే గాక పదిమందిని రక్షించగల రాజు. తనకు దీటైన సోదర రత్నాన్ని కలిగి ఉన్నవాడు. శత్రువులను తునుమాడడంలో సమర్థుడు. అటువంటి రఘువీరుడు నిద్రలో చంపబడడం అసత్యం.

రావణుడు క్రూరుడు. అతని ఆలోచనలనిండా క్రూరత్వమే ఉంటుంది. ఆయన చర్యలన్నీ దుశ్చర్యలే. వీటి గురించి మీకు నేను చెప్పాల్సింది ఏమీ లేదు. రావణుని ఈ చర్యద్వారా మీకు పట్టిన దృష్టి తొలగిపోయిందనుకోవమ్మా! నేటినుంచి మీకు సర్వ శుభాలే కలుగుతాయి. మీ దగ్గరకు సర్వసంపదలు వచ్చి తీరుతాయి.

శ్రీరాముడు మీ పతిదేవుడు వానరులతో కలసి సముద్రాన్ని దాటి సువేల పర్వతాన్ని చేరి ఉన్నారు. రాఘవుని సంకల్పాలు అన్నీ జరుగుతూనే ఉన్నాయి. సాగర తీరాన ఉన్న రామలక్ష్మణులను నేను చూచి వచ్చాను.

రావణుడు గూఢచారుల ద్వారా శ్రీరాముని విషయం తెలుసుకొన్నాడు. తత్తరపాటు దుశ్చర్యలకు పూను కొంటున్నాడు. రాముని గూర్చి తలచి రావణుడు భయపడి తన మంత్రులతో రహస్యాలోచనలు చేస్తున్నాడు."

సరమ అలా చెప్తుతుండగానే ఇరుపక్షాల సైనికుల రణభేరి సింహనాదాలు వినిపించాయి. "మృదుభాషిణీ! విను; ఆ వినవచ్చే భేరినాదాలు రణగొణధ్వనులు రాక్షసుల యుద్ధ సన్నాహాలను తెలుపుతోంది గదా! యుద్ధం చేయడం కోసం గజాలను, అశ్వాలను రథాలను వేగిరపరుస్తున్నారు. చతురంగ బలాలను సమీకరిస్తున్నారు.

రాజమార్గాలన్నీ సైనికులతో క్రిక్కిరిసి ఉన్నాయి. వారందరూ యుద్ధ సన్నద్ధులై వానరసేనతో పోరుకు ముందుకు పోతున్నారు. సీతాదేవీ! నలుదెసలా పరికించి చూడు. ఈ రాక్షసులందరూ కవచధారులై ఆయుధ పాణులై రథాలను, అశ్వాలను, గజాలను అధిరోహించి వెళ్తున్నారు. ఎక్కడ చూచినా సమరోత్సాహం కనిపిస్తోంది. మరి రావణుడు రాముణ్ణి చంపివేసి ఉంటే ఈ రణానికి సన్నాహాలు ఎందుకు చేసేవాడు?

"ఓ దేవీ! మీ కష్టాలు కడతేరే మార్గం త్వరలోనే వస్తుంది. శ్రీరాముడు క్రోధాన్ని జయించాడు. శ్రీరాముడు యుద్ధంలో రావణుని సంహరించి మిమ్ము పొందగలడు. ఇంద్రుడు ఉపేంద్రునితో సహాయంతో రాక్షసుల పైకి విజృంభించేటట్లు రాముడు లక్ష్మణునితో కలిసి రావణాది రాక్షసులను మట్టుపెడ్తాడు.

మీ మనోరథాలన్నీ త్వరలోనే ఈడేరుతాయి. మీరు ఆనందాశ్రువులతో మీ భర్తను చేరుతారు. మీరు శ్రీరామునితో కూడి ఉండడం నేను చూచి ఆనందిస్తాను. తైల సంస్కారాలు లేక ఎండిపోయిన మీ కురులను మీ పతి త్వరలోనే సవరింపగలరు.

మైథిలీ! రావణుణ్ణి సమరభూమికి ఆహుతి ఇచ్చి, మీ శ్రీరాముడు తన ప్రాణతుల్యమైన మిమ్ము పొంది, సమస్త సుఖాలను పొందుతారు. మీరిద్దరు ఒక్కటైన ఆనందంలో ఈ భూమాత సస్యశ్యామలమై బంగారు పంటలతో శోభిస్తుంది.

దినకరుడైన కర్మసాక్షి సమస్త ప్రాణుల పుట్టుకకు కారణహేతువు. ఆ స్వామి మీ వంశానికి మూల పురుషుడు. ఆ సూర్య నారాయణుని వేడుకో. మీ మనోరథాలు త్వరలోనే ఈడేరి మీదగ్గరకు సంతోషం వస్తుంది" అని సరమ సీతను ఓదార్చింది. సరమ సీతమ్మను మంచి మాటలతో ఓదార్చడానికి ఎంతగానో ప్రయత్నిస్తోంది. ఆమె మాటలు వింటున్న జరుగుతున్నదేమో, జరుగబోయేదేమిటో తెలుసుకోలేక సతమతమౌతోంది. ఓ కంట కన్నీరు కారుతోంది. మరో కంట ఆనందం వేస్తోంది. అవునౌను, నా రాముడు ధర్మమూర్తి గదా. ఆయనకు అపజయం ఎందుకు కలుగుతుంది అనుకొంటూ కన్నీరును తుడుచుకొంటోంది. కానీ, రాముని ఖండిత శిరస్సు, అది మాయమవడం అంతా అగమ్యగోచరంగా ఏదీ దిక్కుతోచనీయకుండా చేస్తోంది. సరమ వింటూ అవే నిజాలు కావాలని దేవుని పదే పదే మొక్కుతోంది.

* * *

# సరమ లాలింపు

## సర్గ - 34

రావణుని మాయా ప్రభావానికి లోనైన సీత ఎంతగానో పరితపించింది. అలా విలపిస్తున్న సీతను సరమ తన ఓదార్పు మాటలతో యథార్థ విషయాలతో ఊరడించింది. సరమ ఓర్పు నేర్పు ఉన్న రాక్షస స్త్రీ. సీతాదేవికి ఆప్తురాలు. అందుకే మరల సీత దగ్గరకు చేరింది. "సీతా! మీరు చింతించకండి. నేను ఇప్పుడే వెళ్లి ఆ రఘువీరుని క్షేమవార్తను నేను చూసి మీకు సందేశం తెస్తాను" అని చెప్పింది. నేను ఆకాశమార్గంలో వేగంగా సంచరించగలను. నేను వాయువేగంతో గరుత్మంతునితోను పోటీపడగలను"ఇక్కడ ఉన్నట్టుగానే రణరంగంలోకి వెళ్ళి అక్కడి విషయాలను కనుగొని తిరిగి రాగలను మీరు నిశ్చింతగా ఉండండి" అంటూ సీతకు ధైర్యం చెప్పింది.

సీత సరమ మాటలలోని యథార్థాన్ని ఆకళింపు చేసుకొంది. అయినా మనస్సు ఊరుకోక సరమ నీవు అన్ని పనులు చేయడంలో సమర్థురాలివే. కానీ, అంటూ సీత సంశయాన్ని వెలిబుచ్చాలని చూస్తోంది.

"సరమా! నీకు నాపై అపారమైన ప్రేమ ఉందన్న విషయం నాకు తెలుసు. కాని, నిజంగా నీవు నాకు ప్రియం చేయాలని అనుకొన్నచో రావణుని దగ్గరకు వెళ్లి అతడు ఏమి చేయుచున్నాడో? అతని పన్నాగాలేమిటో చూసి తెలుసుకొని వచ్చి నాకు చెప్పు" అని సీత సరమను అడిగింది.

"సరమా! ఈ రావణుడు నన్ను పదే పదే బాధిస్తున్నాడు. బెదిరిస్తున్నాడు. ఏ క్షణాన ఏమి చేస్తాడో ఏ ముప్పు రానున్నదో అని నిత్యం ఇతనికి వెరిచి బ్రతకడం నాకు చాలా విసుగును పుట్టిస్తోంది. ఈ రావణుని వలన అశోక వనాన భయంతో గడగడలాడుతున్నాను. ఇప్పుడు నీవు నాకు సహాయం చేయదలిస్తే వెళ్లి ఆ రావణుని విషయం కనుక్కొనిరా" అని సీత సరమను పంపింది.

సరమ సీతకు ఆనందాన్ని ఇవ్వాలన్న సంకల్పంతో ఇప్పుడే వెళ్ళిరావణుని విషయం సంగ్రహించి వస్తాను. వెళ్ళి విషయ గ్రహణ చేసి సీత దగ్గరకు సరమ వచ్చింది. సీత సరమను ఆప్యాయంగా కౌగిలించుకొని ప్రక్కనే కూర్చోబెట్టుకొంది. "నెచ్చెలీ! నా మనస్సుకు నీ మాటలు ఊరటనిస్తాయి. త్వరగా విషయాన్ని చెప్పు" అంటూసీత తొందర చేసింది.

"సీతాదేవీ ! రావణుని తల్లి కైకసి, వృద్ధ మంత్రులు అందరూ మిమ్ము శ్రీరామునికి అప్పగించమని రావణునితో చెప్పారు. అవిద్ధుడను రాక్షసుడు కూడా రావణుని హెచ్చరించాడు. దండకారణ్యాన జరిగిన విషయాలు, హనుమంతుడు సముద్రాన్ని దాటి రావడం, లంకను ధ్వంసం చేయడం అనేవి శ్రీరాముని ప్రబల నిదర్శనాలు.

శ్రీరాముని ఎదురించే శక్తి ఎవరికీ లేని మాట నిశ్చయం. **లోభికి ధనంపైన ఆశవీడనట్లే రావణునికి మీపై ఆశతీరలేదు.** ఎవరు ఎన్ని రీతులుగా చెప్పినను అతడు మిమ్ము విడవటానికి ఇష్టపడటంలేదు. రావణునకు ఆయువు మూడినందువల్లే మంచి తలకెక్కడంలేదని అందరూ అనుకొంటున్నారు. రాక్షసులందరూ కదన రంగంలో నిహతులు అయినా రావణుడు ప్రాణాలతో ఉంటే మాత్రం మిమ్ము వదలడు. కాని, ఆ రఘురాముడు సమరభూమిలో రావణుని తన శరాలతో స్వర్గానికి పంపిమిమ్ము అయోధ్యకు తీసుకొని వెళ్తారు."అని సరమ సీతతో చెప్తుండగానే వానర సైన్యాల భేరినాదాలు సింహగర్జనలు దిక్కులు పిక్కటిల్లేటట్లుగా వినిపించాయి.

వానరుల సమరోత్సాహపు కోలాహల ధ్వని మిన్నుముట్టుతుండగా లంకావాసులు దిక్కుతోచక తలో దిక్కుకు పారిపోయారు. తమ ప్రభువు తప్పిదానికి తమకు శిక్ష తప్పదనుకొని వారు రావణుని తిట్టుకొన్నారు. రాక్షస స్త్రీలందరూ తమతమ భర్తలకు దాపురించిన కష్టాన్ని చూసి చింతించారు.

* * *

# మాల్యవంతుని హితం

## సర్గ - 35

**శ**త్రు భయంకరుడైన రాముడు రణభేరీ నినాదంతో లంకపై దాడికి శ్రీకారం చుట్టాడు. ఆ నినాదపు శబ్దం రావణునిలో వణుకు పుట్టించింది. నిరుత్తరుడై ఏం చేయాలో తెలియక కొట్టుమిట్టాడు. చేసిన అన్యాయపు పనిని ఎదుర్కొనేంత ధైర్యం సన్నగిల్లింది. ఎన్నో ఎన్నెన్నో కదన వ్యూహాలు రచించాడు; మాయలు పన్నాడు; కాని అవన్నీ నీరుగారిపోయాయి. ఏ ఒక్కటీ ఆదుకోలేదు. ఇప్పుడేమో రాముడు ప్రళయకాళరుద్రుడై ప్రభంజనం సృష్టిస్తున్నాడు.

'రామ' అనే హోరుగాలిని ఎలా తట్టుకోవాలో తెలియక దిక్కులు చూస్తున్న రావణునికి మంత్రాలోచన మదిలో పుట్టింది. వెంటనే మంత్రులందరిని పిలిపించాడు. 'ఆడలేనమ్మ మద్దెల ఓడన్నట్లు' రాక్షస రాజు సచివులపైన విరుచుకుపడ్డాడు. మీరందరూ ఆ శత్రు భయంకర రాముడు లంకకు వచ్చాడని చెప్పారు. అపార సేనావాహిని తీసుకొని వచ్చాడని అన్నారు. కాని, మీలో ఏ ఒక్కరైనా ఏం చేయాలా అని ఆలోచించారా? మీరందరూ సాటిలేని

వీరులని నాకు తెలుసు గదా! మీలో ఏ ఒక్కరూ ఆ రాముణ్ణి ఎదురించాలనే ఆలోచన లేక నిమ్మకు నీరెత్తినట్లుగా చేతులు ముడుచుకొని కూర్చున్నారు అని బడబడా అరిచాడు.

ఆ అరుపుల వెనుక దాగిన భయం నీలి నీడలు రావణుని మాతామహుడైన మాల్యవంతుడు చూశాడు. తన కర్తవ్యాన్ని నిర్వర్తించాలని తలచాడు. "రావణా! పద్నాల్గు విద్యలయందు ఆరితేరినవారు నీతిశాస్త్రకోవిదులు ఐన రాజులు మాత్రమే చాలాకాలం రాజ్యపాలన చేయగలరు. సకలైశ్వర్యాలను పొందగలరు. సమయా సమయాలను బట్టి రాజు శత్రువులను సంధి చేసుకోవడం ద్వారానో లేక యుద్ధం చేసో అదుపులో ఉంచుకోవాలి. ఒక్కొక్కసారి దేశ కాల పరిస్థితులను చూచి కూడా రాజు ఆక్రమణదారులనుంచి తన లాభమే కాక రాజ్య సౌభాగ్యంకోసం శత్రు విజయం చేయాల్సి ఉంటుంది. శత్రు బలాలను సరిగ్గా అంచనా వేసి తన బలం నిజంగా అధికంగా ఉన్నప్పుడు మాత్రమే శత్రువును యుద్ధానికి పిలవాలి. మన సామర్థ్యం మీద ఏమాత్రం అనుమానం ఉన్నా, లేక శత్రు బల సంపదను అంచనా వేయలేకపోయినా వారితో సంధి చేసుకోవడమే ఉత్తమోత్తమమైనదిగా తెలుసుకోవాలి. రావణా! ఇప్పటి పరిస్థితులను అనుసరించి మనం రామునితో సంధి చేసుకోవడమే మేలు అని నాకు అనిపిస్తోంది. ఆ శ్రీరాముడు నీపై దండెత్తి రాకముందే నీవు స్వలాభాన్ని త్యజించి ఆ సీతాదేవిని ఆయనకు అప్పగించడమే మంచిది. అది నీకును నీ రాజ్యానికీను ఉత్తమమైనదిగా నేను భావిస్తున్నాను.

సమస్తమైన దేవతలు, ఋషులు, గంధర్వులు అందరూ రాముని విజయాన్నే వాంఛిస్తున్నారు. కావున బలవంతుడైన శ్రీరామునితో యుద్ధం చేయడానికి పూనుకోవద్దు. సర్వజ్ఞుడైన బ్రహ్మ సురాసురులను ధర్మాధర్మాలను సృజియించాడు. అసురులెప్పుడూ అధర్మాలే ఆశ్రయిస్తున్నారు. మంచి స్వభావం ఉన్న దేవతలు ధర్మాన్ని చేరి, వారే ఏనాటికైనా జయభేరిని మ్రోగిస్తున్నారు. ఇది తరతరాల నుంచి చూస్తున్న విషయమే.

**ఏనాడైతే అధర్మం పెచ్చుమీరుతుంటే ఆ విష్ణువే తనను తాను సృజించుకొని ధర్మాన్ని రక్షిస్తున్నాడు.** నీవు భోగలాలసుడవై అధర్మమైన పనిచేశావు. దానివలనే నేడు భయభ్రాంతితో బాధపడుతున్నావు. ఇంద్రియ లోలుడవైన నీవు విశృంఖలంగా ప్రవర్తించి ఋషులను, దేవతలను, సిద్ధులను జడిపించావు. అధర్మం నీ పక్షాన ప్రజ్వరిల్లింది. ఇప్పుడు ఆ శ్రీరాముడు ధర్మపక్షాన నిలచి నిన్ను యుద్ధానికి ఆహ్వానిస్తున్నాడు. పవిత్రాత్ములైన ఋషులందరూ ఎప్పుడూ లోక కల్యాణంకోసం తపస్సు యజ్ఞం చేస్తారు. వారి హోమాగ్నిలో అగ్నిదేవుడు తీవ్రంగా ఉంటాడు. అందువలనే అధర్మపరులైన రాక్షసులందరూ గ్రీష్మ ఋతువులోని మేఘాలలాగా ఉనికి తెలియనీయకుండా పారిపోతారు. నేను చెప్పేదాన్ని విని ఆలోచించి నిర్ణయం తీసుకో" అంటూ మాల్యవంతుడు చెప్తున్నాడు. "రావణా! దృఢవ్రతులైన మహాత్ముల చేసే తీవ్ర తపస్సు ప్రభావం రాక్షసులను పరితపింపజేస్తుంది. దుష్ట స్వభావంగల వారెవరైనా మంచివారి స్వభావాలకు తలవంచాల్సిందే.

"ఓ రావణా! నీవు ఒక్క విషయం మరిచిపోతున్నావు. నీవు తపస్సు చేశావు. వరాలను పొందావు. కాని ఇంద్రియాలను జయించలేక తప్పు చేశావు. దేవ దానవ యక్షుల వలన మరణం లేకుండా వరం పొందావు. కాని నరవానరుల ప్రసక్తి నీవు చేయలేదు. ఆ నర వానరులే నేడు నీ దగ్గరకు మృత్యుదేవత రూపంలో వస్తున్నారు."

"మహాబలశాలలు, పరాక్రమోపేతులు ఐన నరులు వానర, భల్లూక యోధుల సమేతంగా గర్జన చేస్తున్నారు. వీరే కాక తర్వాత ఆకాశాన, భూమిపైన ఎన్నో ఉత్పాత శకునాలు మనకు కనిపిస్తున్నాయి. వీటి అన్నింటిని చూసి మనకు కీడు తప్పదని నాకు అనిపిస్తోంది. భయంకరమైన మేఘగర్జనలు, ఏనుగులు, గుర్రాలు గగ్గోలుగా ఏడుస్తున్నాయి. ధ్వజాలన్నీ మట్టిగొట్టుకుపోయి వన్నెతరిగి ఉన్నాయి. క్రూరమృగాలు నక్కలు అరుస్తూ తిరుగుతున్నాయి. గద్దలు భూమికి దగ్గరగా తిరుగుతున్నాయి. నల్లని స్త్రీలు అడ్డదిడ్డంగా మాట్లాడుతూ వస్తువులు దొంగిలించినట్లు, వారు నిర్భయంగా తెల్లని కోరలు చూపుతూ నవ్వుతున్నట్లు కలలలో కనబడుతున్నారు."

అగ్నిద్రవ్యాలను కుక్కలు ముట్టుతున్నాయి. గోవులకు గాడిదలు పుట్టుతున్నాయి. పిల్లులు పెద్ద పులులతోను, పందులు కుక్కలతోను కలుస్తున్నాయి. కిన్నర జాతివారు రాక్షసులతోను, మనుష్యులతోను సంబంధాలు పెట్టుకొంటున్నారు. ఎర్రని పాదాలు ఉన్న తెల్ల పావురాలు అంతట తిరుగుతున్నాయి. ఇది రాక్షస వినాశం చూపుతుంది. ఇంట్లో పెంచుకొనే చిలుకలు గోరువంకలు క్రూరంగా అరుస్తున్నాయి.

కాకులు గుమికూడి కారాడుతున్నాయి. వికృతమైన అంగాలున్న ఎరుపు గోరోచన వర్ణం వాడు ఐన యముడు సాయం సమయంలో గృహాలలో పరికించి చూస్తున్నట్టు అనిపిస్తోంది. ఓ రావణా! లంకపై దండెత్తివచ్చిన ఈ వీరుడు నరుని రూపంలో వచ్చిన నారాయణుడే. అద్భుతంగా సాగరంలో సేతువు నిర్మించిన పరాక్రమశాలి రాఘవుడు సామాన్య మానవునిలాగా కనిపించడంలేదు. నరేంద్రుడైన శ్రీరామునితో సంధి చేసుకోవటమే మంచిదనిపిస్తోంది" అని మంత్రులలో శ్రేష్ఠుడు పౌరుషం ఉన్న మాల్యవంతుడు రావణునికి హితం చెప్పాడు. రావణుడు ఏమి మాట్లాడుతాడో చూద్దామని మాల్యవంతుడు రావణుని జవాబుకోసం ఎదురుచూశాడు.

* * *

# నగర రక్షణ ఏర్పాట్లు

## సర్గ - 36

**మా**ల్యవంతుని హితవచనాలు రావణునిలో కోపాన్ని ఎగదోశాయి. క్రోధంతో ఉడికిపోయాడు. కనుబొమ్మలు ముడిచి అసహనంతో పచార్లు చేశాడు. "మాల్యవంతా! నీవు శత్రుపక్షం వానివలె కనబడుచున్నావు. హితం హితం అంటూ అహితమే నూరిపోస్తున్నావు. శత్రువును అతిగా పొగడి ఆకాశానికి ఎత్తుతున్నావు.

రాముడు కేవలం మానవుడు, తండ్రిచే విడువబడినవాడు. సవతితల్లి అభీష్టానుసారం రాజ్యభ్రష్టుడయ్యాడు. నేడు అడవులపాలై కాయలు పండ్లు తినే కోతి మూకను సాయం అడిగాడు. అలాంటి మానవమాత్రుణ్ణి ఇంద్రుడంతటివాడని చెప్తున్నావే? నీవు రాక్షస వంశాన పుట్టలేదా? నీలో ఏ కొద్దిగానైనా పౌరుషం అనేది లేదా? సీతను అప్పగించమని నాతోనే చెప్తుతున్నావే? నీకెందుకంత అధైర్యం?"

నేను, నా పరాక్రమం నీకు తెలియదా? దేవతలనే గజగజలాడించాను. రాక్షసులందరికీ ప్రభువును. నన్ను మెచ్చి నా సుందరతకు మోహం చెంది ఎందరెందరో కన్యలు నన్ను కోరి వచ్చి ఉన్నారు. నన్ను రామునికంటే దుర్బలునిగా ఎంచుతున్నావు. నీవు నన్ను కించపరచటానికి కారణం నేను తేల్చుకోలేకుండా ఉన్నాను. నా వీరత్వం చూసి ద్వేషం పుట్టిందా? లేక శత్రువుల ప్రోత్సాహంతో నాతో ఇలా మాట్లాడుతున్నావా? ఇందులో ఏది నిజం?

శక్తి సామర్థ్యాలున్న ప్రభువు ముందు ఎవరైనా ఇలా మాట్లాడటానికి సాహసిస్తారా? శాస్త్రాలను చదివిన వారెవ్వరూ ఇలాంటి పనులు చేయరు. లక్ష్మీదేవిని పోలిన సీతాదేవిని దండకారణ్యం నుండి అపహరించి తెచ్చి నేడు అప్పనంగా శ్రీరామునకు ఎవ్వరైనా అప్పచెపుతారా? మాల్యవంతా! ఆ రామలక్ష్మణులు ఇంద్రుని మించినవారైనా కోట్లకొలది వానరులు తోడు తెచ్చుకున్నా ఏమీ ఫర్వాలేదు. నేను కొద్ది రోజులలోనే ఆ రాఘవుని సపరివారంగా యమపురికి పంపివేస్తాను. నా ద్వంద్వ యుద్ధంలో నా ఎదురుగా దేవతలే నిలవలేరు. నా శరీరం రెండు ముక్కలైనా నేను ఎవ్వరికీ లొంగను. ఎవరికి తలవంచని స్వభావం నాది. ఈ స్వభావాన్ని నేను మార్చుకోలేను.

నా దృష్టిలో ఈ సముద్రంపైన సేతువు కట్టడం సామాన్యమైన విషయమే. ఇది రాముడు కట్టినా రాక్షసుడు కట్టినా ఒక్కటే. ఇందులో అద్భుతమైన విషయం కాని, దైవానుగ్రహంవలనే ఏర్పరచినది అని గాని నాకు అనిపించడంలేదు. ఆ సముద్రాన్ని అష్టకష్టాలు పడి రాముడు దాటి వచ్చినా నా చేతిలో ప్రాణాలు దక్కించుకొని తిరిగి ఆవలి తీరానికి చేరలేడు. ఇది నిశ్చయాత్మకమైన వాస్తవం" అని రావణుడు వీరావేశంతో కోపం బుస కొట్టుతుండగా మాట్లాడాడు.

రావణుని మాటలు మాల్యవంతునిలో ఆగ్రహంతోపాటుగా విసుగు పుట్టించాయి. తిరిగి ఏం చెప్పినా చెవిటివాని ముందు శంఖం ఊదినట్లుగా నిష్ప్రయోజనం అని అనుకొని మౌనంగా ఉండి రావణుని ఆశీర్వదించి అక్కడినుంచి వెళ్లిపోయాడు. రాక్షస రాజు రక్షణ ఏర్పాట్ల గురించి తన మంత్రులతో మాట్లాడాడు. తూర్పుద్వారం దగ్గర ప్రహస్తుని, దక్షిణంవైపు మహోదరుని, మహాపార్శ్వుని, ఇంద్రజిత్తు తన అనుచర గణంతో కలసి పశ్చిమద్వారం దగ్గర ఉండమని చెప్పాడు. శుక సారణులను ఉత్తరభాగాన్ని రక్షించటానికి నియమించాడు. మహావీరులు, పరాక్రమశాలురైన విరూపాక్షులతో కలిసి రాక్షసులను లంకానగర మధ్యమ భాగాన్ని రక్షించమని చెప్పాడు.

కాలపాశానికి బంధితుడైన రావణుడు తన తమ్ముడు, స్నేహితులు, హితులు, భటులు, శ్రేయోఽభిలాషులు అందరూ కలిసి హితం చెప్పినా రావణునికి తలకెక్కలేదు. నగర రక్షణ ఏర్పాట్లు చేసి శత్రువును గెలిచినంతగా రావణుడు ఆనందించాడు. రావణుడు సభలోని వారినందరిని స్వగృహాలకు వెళ్ళడానికి అనుమతి ఇచ్చాడు. వారందరూ రావణ ప్రభువుకు జయధ్వానాలు చేసి ఎవరి ఇండ్లకువారు వెళ్లిపోయారు.

* * *

# శ్రీరాముని వ్యూహరచన

## సర్గ - 37

శ్రీరాముడు తమ్మునితో కలిసి సుగ్రీవుని నాయకత్వంలో వానరసేన భల్లూక సేనతో కలసి శత్రువు నగరానికి చేరాడు. వానర ప్రముఖులతో కలసి శ్రీరాముడు యుద్ధం ఎలా చేయాలో అని ఆలోచించాడు. రావణుని పాలనలోనున్న లంకానగరం మన ఎదురుగా ఉంది. దీన్ని దేవతలు సైతం జయించలేరు. శత్రు దుర్భేద్యమైన లంకలోనే రావణుడు ఉంటాడు. మనం కార్యసిద్ధికోసం ఆలోచనలు చేయాలని అందరూ అనుకొన్నారు.

"రామా! నా మంత్రులైన అనలుడు, శరభుడు, సంపాతి, ప్రఘసుడు అనేవారు లంకకు వెళ్లి వచ్చారు. వీరు అందరూ పక్షి రూపంలో శిబిరాలలోకి వెళ్లి వచ్చారు. వారు రావణుని అనుపానాలు తీసుకొని వచ్చారు.

తూర్పు ద్వారంలో ప్రహస్తుడు, దక్షిణ దిశలో మహాపార్శ్వుడు, మహోదరుడు, పశ్చిమదిక్కులో ఇంద్రజిత్తు, ఉత్తరంలో రావణుడు యుద్ధ సన్నాహంతో ఉన్నారు. వానరులందరూ అడ్డకత్తులు, ఖడ్గాలు, ధనుస్సులు, శూలాలు, ఇనుప గుదియలు పట్టుకొని ఉన్నారు. రావణుని తోడుగా శుకసారణులు, వేలకొలది రాక్షసులు శస్త్రపాణులై నిలిచి ఉన్నారు. నగర మధ్యభాగంలో విరూపాక్షుడు ఉండి నగరాన్ని రక్షిస్తున్నాడు. దీనినంతా నా సచివులు చూచి వచ్చారు.

ఇక ఇప్పుడు వారి వ్యూహం మనకు తెలిసింది. కాబట్టి, మనం వారిని ఎలా నిరోధించాలో మాట్లాడుకోవాలి."

"ప్రభూ! రావణుని చతురంగ బలాలలో వేయిమంది గజయోధులు, పదివేలమంది రథికులు, ఇరవై వేలమంది అశ్వికులు కోటి సంఖ్యలో కాల్బలం నగరాన్ని రక్షిస్తున్నారు. రామా! రావణుని సైన్యంలో ఒకరి వెంట మరొకరు ఉండి యుద్ధం చేయడానికి 10 లక్షలమంది అనుయాయులు ఉంటారు" – అంటూ విభీషణుడు తనకు తెలిసినదంతా రామునకు చెప్పి తన సచివులను చూపాడు. "శ్రీరామా! నేను మీకు రావణుని గూర్చి చెప్పేది మీకు తెలియడానికి కాని, మీరు భయపడుతారనో మిమ్మలను భయపెట్టడానికో చెప్తుతున్నానని మీరు అనుకోవద్దు.

రావణుని గూర్చి అన్ని విషయాలు మీకు తెలిసి ఉంటే, ఆ దుష్టుని సంహరించడం సులభం అవుతుందనేది నా అభిప్రాయం. రఘువీరా! ఒకసారి రావణుడు కుబేరునిపై యుద్ధం చేయాలనుకొన్నప్పుడు 60 లక్షలమంది యోధులను వెంట తీసుకొని వెళ్ళాడు. వారందరూ కూడా రావణుని ప్రతాపంలోను దర్పంలోను ఏ విధంగాను తీసిపోరు. రామా! మీరు దేవతలను కూడా ఎదిరించగల సమర్థులు. ప్రభూ! నేడు రావణుడు అధర్మాచరణ చేసి ఉన్నాడు. మీరు మీ వానరసేనతో కలిసి రావణుని నుగ్గుచేయగలరు" అని విభీషణుడు అన్నాడు.

ఆ మాటలకు రాముడు సంతోషించాడు. ఇక 'సుగ్రీవా! మన రణ వ్యూహరచన చేద్దా'మంటూ రాముడు రణవ్యూహ్యాన్ని చెప్పాడు. "సుగ్రీవా! నీలుడు లంక తూర్పు ద్వారాన్ని ఆక్రమించి వానర సైన్యంతో ప్రహస్తుని,

వాలిసుతుడైన అంగదుడు అసంఖ్యాక వానరసేనతో దక్షిణ ద్వారాన ఉన్న మహాపార్శ్వ మహోదరులను, హనుమంతుడు పశ్చిమ ద్వారాన ఉన్న మాయావి ఐన ఇంద్రజిత్తును ఎదుర్కొని వారినందరిని యమునికి అతిథులుగా పంపండి.

బ్రహ్మనుండి వరాలు పొంది కూడా నీచబుద్ధితో వ్యవహరించే రావణుని నేను, లక్ష్మణుడు ఎదుర్కొంటాం. మహాత్ములైన మహర్షులకు, సిద్ధులకు, సాధువులకు అపకారం చేస్తూ తనకు బలం ఉందని విర్రవీగుతున్న ఆ పొగరుబోతును నేను తుదముట్టించాలని గట్టి నిర్ణయం చేసుకొన్నాను. నగర ఉత్తర ద్వారంలోనున్న రావణుని ఎదుర్కొని మేము నగర ప్రవేశం చేస్తాం.

జాంబవంతుడు సుషేణాదివీరులు నగర మధ్య ప్రదేశంలో సేనా శిబిరాలను ఛిన్నాభిన్నం చేస్తారు. వానరులారా! మీరందరూ కామరూప విద్య తెలిసి ఉన్నప్పటికీ కపుల రూపంలో రావణునితో పోరాడండి. వానర శరీరమే మన వాళ్ళు అనేదానికి గుర్తుగా ఉంటుంది. మనలో నేను లక్ష్మణుడు, విభీషణులు అతని మంత్రులు నలుగురు, మనుషుల రూపధారణలో ఉంటాం. మేం ఏడుగురమే మనుషులం. మిగతా మన సేన అంతా కపి రూపంలో ఉండాలి. దీన్ని మీరు ఎట్టి పరిస్థితులోను మరవకండి" అని రాముడు వానరులకు యుద్ధ సంకేతాన్ని చెప్పాడు.

రాముడు, విభీషణుడు, సుగ్రీవాది ప్రముఖులందరూ ఇలా మాట్లాడుకొని ఈ రాత్రికి మనం సువేల పర్వతంపై ఉందాం అనుకొన్నారు. ఇక సువేల పర్వతాన్ని కప్పివేయడానికి వానర సేన మూగింది.

* * *

# రామపక్షం సువేల పర్వతం చేరటం

## సర్గ - 38

ధర్మజ్ఞులు, యుద్ధనీతి తెలిసిన వారు తనపై ఆదరాభిమానాలున్నవారు ఐన తన మిత్రులందరితో లక్ష్మణునితో కలసి శ్రీరామచంద్రుడు సువేల పర్వతంపైకి ఎక్కారు. వారందరూ ఆ రాత్రి ఆ పర్వతంపైన ఉందామనుకొన్నారు.

"సుగ్రీవా! ఇక్కడనుంచి ఆ రావణుని భవనం నాకు చూపించు. దుష్టుడైన రావణుడు మరణం ఆసన్నమై నా భార్యను అపహరించాడు. నీచబుద్ధితో ఈ చెడు పని చేసి నా కోపకారణం అయ్యాడు.

ఆ రాక్షసాధముని పేరు తలచుకొంటేనే నా రక్తం ఉడికిపోతోంది. ఆ ఒక్కని తప్పు వలన నేడు రాక్షస వంశమే నాశనం కాబోతుంది. **దుష్టుల దగ్గర ఉన్న మంచివారికి సైతం అధోగతి తప్పదు. అందువలనే సజ్జనులు దుర్జనుల సాంగత్యాన్ని డబ్బు పెట్టి ఐనా వదిలించుకోవాలి."** ఇలా చెప్పుతూ ముందుకు వెళ్తున్న రాముని అనుసరించి ధనుర్బాణధారియైన లక్ష్మణుడు వెళ్లాడు. విభీషణుడు అతని మంత్రులు సుగ్రీవ జాంబవంత అంగదాది ప్రముఖులు, రామలక్ష్మణ హనుమదాదులు అందరూ ఆ రాత్రి సువేలాన్ని ఎక్కి అక్కడే విశ్రమించారు. అక్కడ

వారికి లంకానగరం ఆకాశం నుండి త్రికూట పర్వతానికి వ్రేలాడుతున్నట్లుగా కనిపించింది. చూడముచ్చటైన ప్రాకారాలు ఎత్తుగా ఉన్న భవన సముదాయాలు, నందనోద్యానాలు, పర్వతాలు జలాశయాలతో నిండిన లంకానగరం అలకాపురిని తలపించింది. రావణుడు చేసిన అధర్మకార్యానికి అందమైన రాజ్యం నశించబోతోంది కదా అని విచారించారు. రాత్రి రావణుని మూర్ఖత్వంలాగా అంతటా కమ్ముకుంది. రాక్షసులు వానరులు యుద్ధోత్సాహంతో 'ఆ రాత్రి ఎప్పుడు గడుస్తుందా' అని వారు ఎదురుచూస్తూ గడిపారు.

* * *

# రామలక్ష్మణులు - లంకానగర వైభవం

## సర్గ - 39

**సు**వేల పర్వతంపైనుండి లంక శోభలు రామలక్ష్మణులతో కూడిన వానరులను ఆకట్టుకొన్నాయి. దుష్టరావణుని పాలనలో అందమైన లంకానగరాన్ని దాని అద్వితీయ సుందర దృశ్యాన్ని చూసి వారందరూ ఆశ్చర్యపోయారు. లంక అంతా నందనోద్యానాలు, ఉపవనాలు పైనుంచి జాలువారే జలపాతాలు, ఆగి ఉన్న తటాకాలు ఎన్నెన్నో సుందర దృశ్యాలు కన్నులకు ఇంపుగా కనిపించాయి. ఆకాశాన్ని తాకేటట్లున్న భవన సముదాయాలను మించి తరువులున్నాయి. వృక్ష రాజాల్లో చంపక, అశోక, పున్నాగ, మద్ది, తాటి, దేవదారు ఎత్తుగా పెరిగి ఉన్నాయి.

కానుగ తోపులు, మామిడి తోపులు, అరటి తోపులు అందంగా కనిపిస్తున్నాయి. నాగ కేసరాలు, మల్లెలు, మాధవీలతలు, పున్నాగలు, పొన్నలు, జాజులు, విరజాజులు, అడవి మల్లెలు, సంపెంగలు, మొగలులు విరగకాచి ఉన్నాయి. పూపొదరిల్లులాగా చెట్ల గుబుర్లు అక్కడక్కడా లంకను అందంగా తీర్చిదిద్దుతున్నాయి. పచ్చని గుబుర్లమధ్య ఎరుపు తెలుపు నీలవర్ణపు పూలు అందగిస్తున్నాయి. కొండచరియలలోను పర్వత సానువులలో దానికదే పెరిగిన పచ్చిక బయళ్ళు తివాసీ పరచినట్లుగా అనిపిస్తున్నాయి.

ఉద్యానవనాల్లో పెంచిన పచ్చిక భూదేవి కట్టుకొన్న పచ్చని పట్టు చీరలాగా కళకళలాడుతోంది. దానిపై వృక్షాలనుండి రాలిన పువ్వులు పడి, జరీ బుటా నేసిన చీర కట్టుకున్న భూమాత అందంగా కనిపిస్తోంది. జలాశయాలు నిండుగా ఉన్నాయి. వాటినిండా పూచిన తామరలు, కలువలు, తుమ్మెదలను రమ్మని పిలుస్తున్నాయి. తుమ్మెదల ఝుంకారాన్ని విని హంసలు నీటికోళ్లు చక్రవాకాలు, బెగ్గురులు, గోరువంకలు, లకుముకి పిట్టలు అన్నీ జలాశయాన్ని చేరి కలరవాలు చేస్తున్నాయి. జలనిధుల చేరువనున్న వృక్షాలు, చెట్లు వాటిపై రకరకాల పక్షుల గుంపులు, కోయిలలు అవి చేసే మధురగానాలకు వడ్రంగి పిట్టల ధ్వని మృదంగ శబ్దాన్ని తలపిస్తోంది.

ఆ మనోహర దృశ్యాలకు ఆనందించిన కపులు పులకిత శరీరాలతో ఉపవనాలలో ప్రవేశించారు. పూల పరిమళాలు నింపుకొన్న వాయువు మనస్సును ఆహ్లాదపరుస్తోంది. సుగ్రీవుని అనుమతితో కొందరు కపులు లంకలో వెళ్లి వారి గర్జనలతో, పాదఘట్టనలతో లంకను కంపింపచేశారు.

వీరి సింహనాదాలతో దద్దరిల్లిన లంకలోని ఎలుగుబంట్లు, సింహాలు, ఏనుగులు భీతితో భయపడి పారిపోయాయి. ఒకచోట త్రికూట పర్వతపు శిఖరం నూరు యోజనాలదాకా విస్తరించి ఉంది. దానినిండా పూలు, చెట్లు నిండి బంగారు శిఖరంలాగా కనిపిస్తోంది. ఆ శిఖరాన్ని పక్షులు కూడా చేరలేనంత ఎత్తుగా ఉన్నాయి. లంకలో మహారాజ ప్రాసాదం వేయికాళ్ళతో నిర్మింపబడి ఉన్నాయి.

కైలాస శిఖరంలా ఉన్న ఆ భవనం రావణుని భవనమని కపులు ఆశ్చర్యంగా దాన్ని చూశారు. అపూర్వమైన వనశోభలు, ఆనందాన్నిచ్చే భవన సముదాయాలు, మనోజ్ఞమైన లంక క్రీడా పర్వతాలతో అద్భుతమైన అడవులు మనోవాంఛిత వస్తువులతో సుభిక్షంగా ఉంది. ధనధాన్యాది సర్వ సంపదలతో అలరారే లంకను రామలక్ష్మణులు, సుగ్రీవాదులు ఆశ్చర్యానుభూతితో చూశారు. లంకనిండా శ్రేష్ఠమైన వస్తువులు, గైరికాది ధాతువులు, నవవిధ రత్నాలు, యంత్రాలతో పనిచేసే తలుపులు – సర్వాంగ సుందరంగా ఉన్నాయి.

* * *

# రావణ సుగ్రీవుల ద్వంద్వ యుద్ధం

## సర్గ - 40

**సు**వేల పర్వతం చేరి రామపక్షం మనోజ్ఞమైన లంకనంతా పరికించి చూశారు. అప్పుడు లంకలో మహారాజ భవన సముదాయ అగ్రభాగంలో రావణుడు కూర్చోనుండడం సుగ్రీవుడు చూశాడు.

రావణునకు ఇరువైపులా ఛత్రచామరాదులు వీస్తూ పరిచారికలున్నారు. రావణుని నల్లని శరీరంపై ఎఱ్ఱగంధం ఆచ్ఛాదితమై ఉంది. బంగారు పట్టువస్త్రాలు, మేలిమి ఆభరణాలతో సంధ్యారుణ కాంతులతో విలసిల్లే నల్లని ఆకాశంలాగా రావణుడు కనిపించాడు.

రావణుని చూచి చూడగానే సుగ్రీవునిలో కోపం ఆవేశించింది. రామలక్ష్మణ వానర సేన అంతా చూస్తుండగానే సుగ్రీవుడు ఒక్క ఉదుటున ఆకాశంలోకి ఎగిరి వేగంగా రావణ భవన అగ్రభాగాన నిలిచాడు. ఆ ప్రాకారంపై నిలబడి “ఓ రాక్షసుడివైన రావణా! నేను శ్రీరాముని మిత్రుడిని, సుగ్రీవుణ్ణి. నీ పీచమణచడానికై వచ్చాను నేను” అంటూ ఎగిసి చిత్ర విచిత్ర రమణీయంగా ఉన్న రావణుని కిరీటం క్రింద పడేలా ఒక తన్ను తన్నాడు.

అనుకోని సంఘటనతో రావణుడు హతాశుడయ్యాడు. వెంటనే తేరుకొని “ఓ సుగ్రీవా! నీవు ఇప్పటినుంచి హీనగ్రీవుడవంటూ రావణుడు కుప్పించి ఎగిరి తన బాహువులతో సుగ్రీవుని పట్టుకొన్నాడు. సుగ్రీవుడు రావణుని బాహువులతో బంధించివేశాడు. ఇద్దరూ ఒకేసారి తోసుకుంటూ క్రింద పడ్డారు.

మరలా బంతిలాగా లేచి ఇద్దరూ అరచేతులతో కొట్టుకొన్నారు. ముష్టిఘాతాలతో ఇరువురూ బాధించు కొన్నారు. పిడికెళ్ళతో వీపులు బాదుకున్నారు. మోకాళ్ళు అరచేతులు మోచేతులతో రావణ సుగ్రీవులు భీకరంగా పోరు సల్పారు.

అలా కొట్టుకునే శింశుపా, శాల్మలీ వృక్షంలాగా కనిపించారు. రావణ సుగ్రీవులు చాలాసేపు మేడ పైభాగంలో మల్లయుద్ధం చేశారు. ఒకరి శరీరాన్ని మరొకరు క్రింద పడవేశారు. ఇద్దరూ లాక్కొన్నారు. తోసుకొన్నారు. మోచేతులతో పొడుచుకొన్నారు. మోకాళ్ళతో కుమ్ముకొన్నారు.

తమ తమ బాహుబలంతో ఒకరినొకరు అదిమి పట్టారు. అప్పుడు వారిద్దరి శరీరాలనుండి స్వేదం ధారలా ప్రవహించింది. ఆ ఇద్దరూ సమాన బలవంతులు. వారి వ్యాయామ సాధనవలన ఇద్దరూ అలసిపోవడం లేదు. వారిద్దరి శరీరాలు స్వేదంతో తడిసి వర్షిస్తున్న మేఘాల్లా అద్భుత కాంతితో కనిపించారు.

వారిద్దరు బాహువులతో బంధించుకొని చక్రంలాగా చాలాసేపు వలయాకారంలో తిరిగారు. ఆహారంకోసం చూసే పిల్లల్లాగా ఒకరినొకరు ఎప్పుడు పడేద్దామని చూసుకొన్నారు. అలా నడుస్తూ నడుస్తూ కాళ్ళల్లో కాళ్ళు వేసి ఒకరినొకరు తోసుకున్నారు.ఎలాగైనా ఒకరిని ఒకరు దెబ్బతీయాలని వారిద్దరూ చూస్తున్నారు. ఇద్దరికీ కోపం ఎక్కువౌతోంది. ఒకరినిఒకరు దొంగదెబ్బ అయినా వేయాలని చూస్తున్నారు. ఆ ఇద్దరు మహావీరుల పరాక్రమాన్ని అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. రామలక్ష్మణులు సుగ్రీవుడు చేసిన పనికి అబ్బురం చెందుతూ చూస్తున్నారు.

రావణసుగ్రీవులిద్దరూ మల్లయుద్ధం చేస్తున్నారు. యోధులు పరిగెత్తుతూ వంచించుకుంటూ పట్టుకొంటూ పడవేసుకుంటూ యుద్ధం చేశారు. ఒడుపుగా అవతలివారిని పట్టి బంధించాలని అదేపనిగా సమయంకోసం చూస్తున్నారు. విరోధి చేతులను ఒడిసి పట్టుకొని లాగి అవతల పడవేస్తున్నారు.

ఇద్దరూ అరివీర భయంకరంగా యుద్ధం చేస్తున్నారు. ఇద్దరిలో ఎవ్వరూ ఎవ్వరికీ తీసిపోవడంలేదు. ఎంత చాకచక్యంగా ఒడుపులు పట్టినా రావణునికి సుగ్రీవుడు చిక్కడంలేదు. సుగ్రీవునికి రావణుడు పట్టుబడడంలేదు. అందులో తన మాయా ప్రభావంతో సుగ్రీవుని మించాలన్న ఆలోచన రావణునికి కలిగింది.

ఇద్దరూ విడివడి కోపావేశంతో నిలబడ్డారు. రావణుని ఆలోచన సుగ్రీవుడు పసికట్టాడు రవిసుతుడు. రావణుని ముప్పతిప్పలు పెట్టుతూ చటుక్కున ఆకాశంలోకి ఎగిరాడు. సుగ్రీవుడు చేసిన పని రావణునికి అర్థం కాలేదు. దశకంఠుడు అటుఇటు చూసుకొని 'వీని పని పట్టుదాం' అనుకొనేంతలో సుగ్రీవుడు ఆకాశానికి ఎగిరాడు. ఇక చేసేదేమీ లేక, రావణబ్రహ్మ సుగ్రీవుని తుదముట్టించాలని నిర్ణయించుకున్నాడు. రావణుని తికమకపాలు చేసి సుగ్రీవుడు హాయిగా పైకి ఎగిరి వాయువేగంతో పయనించి రాముని ప్రక్కనవెళ్లి చక్కగా నిలబడ్డాడు. దానిని నిశ్చేష్టులై అందరూ చూస్తున్నారు.

సుగ్రీవుని ధైర్యోత్సాహం చూచి రాముని సైన్యంలో యుద్ధోత్సాహం పెరిగింది. లక్ష్మణునిలో కోపం కట్టలు తెంచుకుంది. ఈ రావణుని తుదముట్టిస్తేకాని మా అమ్మ సీతమ్మ మా అన్న కడకు చేరదు. ఆమె కష్టాలకు కారణమైన వీణ్ణి నరికివేయాలి అని లక్ష్మణుడు మనసున తలిచాడు. రావణసుగ్రీవుల ద్వంద్వయుద్ధాన్ని చూసి రామునిలో రణావేశం పెరిగింది. రావణునిపై యుద్ధోత్సాహంతో ఎప్పుడు సంహరిద్దామా అన్న ఆలోచనను రామునిలో సుగ్రీవుడు పుట్టించాడు.

* * *

# అంగద రాయబారం

## సర్గ - 41

సుగ్రీవుడు రావణునితో మల్లయుద్ధం చేసి వచ్చి రాముడి ప్రక్కన నిలబడ్డాడు. 'సాహసవీరా!' అంటూ రాముడు సుగ్రీవుని ఆలింగనం చేసుకొని "సుగ్రీవా! ఇలాంటి తొందరపాటు ప్రభువులకు ఉండవచ్చా" అని సున్నితంగా రాముడు మందలించాడు. జాంబవంతాది వీరులతోనైనా, నాతోనైనా మాటమాత్రం చెప్పకుండా రావణుని పైకి ఎగిరివెళ్లావు. ఇలా చేయడం చాలా సాహసం. ఇందులో నీకు అపాయం జరిగితే మేము ఏం చేయాలి? నీవిలా వెళ్లిపోవడం మా అందరినీ ఆశ్చర్యంలో ముంచేసింది.

"శత్రుసూదనా! అనాలోచితంగా ఇలా చేయకు. ప్రాణమిత్రునివైన నీకు కీడు జరిగితే నాకు ప్రయోజనం ఏముంది? అప్పుడు సీతతోగాని, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులతో కాని ఒనగూడేది ఏముంది? దేవేంద్రాదులతో సమాన వీరత్వం ఉన్న ఓ వానరశ్రేష్ఠా! నీ పరాక్రమం గురించి నాకు బాగా తెలుసు. "సుగ్రీవా! నేను రావణుని పుత్ర బంధుసహితంగా హతమార్చి, ఈ లంకను విభీషణునికి అభిషిక్తుని చేద్దామనుకున్నాను. అలాగే కోసల రాజ్యానికి భరతునికి ఇచ్చివేసి నా దేహాన్ని చాలింపదలిచాను. నీకు ఏదైనా ఆపద వాటిల్లితే నేను చూడలే"నంటూ రాముడు సుగ్రీవుడుతో చెప్పాడు.

"రఘువీరా! నేను పౌరుషవంతుడిననే మాట అలా ఉండనీ! ముందు నేను మీ దాసానుదాసుడను. మీ భార్య ఐన మహాసాధ్వి సీతను అపహరించిన రావణుని చూచి నేను ఊరుకోలేకపోయాను" అని చెప్పే సుగ్రీవుణ్ణి రాముడు అభినందించాడు. "సౌమిత్రీ! ఇక మనం వ్యూహరచన చేసి రావణునిపై యుద్ధం ప్రకటించుదాం" అని రాముడు చెప్పాడు. అపుడు భూమి అంతా కంపించిపోయింది. పెనుగాలులు వీస్తున్నాయి. పర్వత శిఖరాలు చలిస్తున్నాయి. మహావృక్షాలు కదలబారుతున్నాయి. డేగలు, గ్రద్దలు అన్నీ కర్ణకఠోరంగా అరుస్తున్నాయి. సాయం సంధ్యారుణకాంతులు ఎర్రచందనంలాగా ఎరుపెక్కి అగ్ని కణాలను వెదజల్లుతోంది. పక్షులన్నీ దీనంగా అరుస్తున్నాయి.

"లక్ష్మణా! చూశావా! ఇవన్నీ కూడా ఉత్పాతాన్ని సూచించే దుశ్శకునాలు. ప్రపంచంలో దుష్టుల సంహరణను ఇది సంకేతం అనిపిస్తోంది. కాకులు, డేగలు ఆకాశం నుండి క్రిందకు వాలి అరుస్తున్నాయి. నక్కలు ఊళలు వేస్తున్నాయి. ఇది కూడా అశుభ సూచకమే. మనం నిర్భయంగా వానరసేనతో లంకపై నేడే యుద్ధభేరిని మ్రోగిద్దాం" అని రాముడు చెప్పాడు. అందరూ కలిసి పర్వతం నుండి క్రిందకు దిగి వచ్చారు. శుభముహూర్తంలో సుగ్రీవుడు వానర సేనకు యుద్ధానికి పురికొల్పాడు. మరునాటి ప్రాతః సమయంలో శ్రీరాముడు సమరాభిలాషతో ధనుర్ధరుడై లంకకు అభిముఖంగా సాగాడు. ఆ మహావీరుని అనుసరించి సుగ్రీవుడు హనుమ జాంబవంతాదులు బయలుదేరారు.

శత్రువులను నిలవరించడంలో సమర్థులు దృఢకాయులైన మహా వానర వీరులు పెద్ద శిలలను, వృక్షాలను, పర్వతాలను పట్టుకొని ముందుకు వెళ్లారు. రామలక్ష్మణులు వీరావేశంతో చక్కగా లంకను చేరారు.

శ్రీరాముని ప్రేరణతో వానరులు రాక్షసులపై దాడి మొదలుపెట్టారు. లంక ఉత్తరద్వారం గిరిశిఖరం అత్యున్నతంగా ఉంది. దానిదగ్గర రామలక్ష్మణులు ఆయుధపాణులై నిలిచారు. వరుణుని వలన రక్షించబడుతున్న సాగరంలాగా లంక ఉత్తరద్వారాన్ని రావణుడు రక్షిస్తున్నాడు. అది శత్రు దుర్భేద్యంగా కనిపిస్తోంది. సామాన్య యోధులకు దానవుల రక్షణలో ఉన్న ఉత్తరద్వారం భయంకరంగా ఉంది. మహావీరుడైన నీలుడు వానర సేనాపతి మైందుడు, ద్వివిదుడు ఇద్దరితో కలిసి తూర్పుద్వారాన్ని ముట్టడించాలని చూశాడు. అంగదుడు ఋషభుడు, గవాక్షుడు, గజుడు, గవయునితో కలిసి దక్షిణ ద్వారాన్ని ఆక్రమించడానికి శ్రీకారం చుట్టాడు.

గరుత్మంతునితో సమానులైన మహావీరులందరితో సుగ్రీవుడు పశ్చిమోత్తర దిశల మధ్యభాగంలోని వాయవ్య దిశను దాడిచేశాడు. 36 కోట్లమంది వానర ప్రముఖులు సుగ్రీవుని వెనుక దాడికి సంసిద్ధం అయ్యారు. శ్రీరాముని ఆదేశం ప్రకారం ప్రతి ద్వారం దగ్గర కోటిమంది వానర యోధులను విభీషణుడు ఉండేలాగా ఆదేశాలిచ్చాడు.

వానరులందరూ తమ బలాన్నంతా కూడదీసుకొన్నారు. నఖాలను, కోరలను ఆయుధాలుగా చేసుకొన్నారు. ఒకరినిమించి మరొకరు వేయి రెట్ల బలం ఉన్న వానరులను శత్రువులు ఎవరూ ఎదిరించలేకుండా ఉన్నారు. వారందరూ అద్భుతంగా కనిపిస్తూ రాక్షసులను శలభాల్లాగా మాడ్చివేస్తున్నారు. భూమి అంతా వానరులతో రాక్షసులతో నిండిపోయింది. ఇసుక వేస్తే రాలనంత జనాభా అక్కడ కనిపించసాగారు.

త్రికూట పర్వతం చుట్టూ వానర సేన కోటానుకోట్ల సంఖ్యతో నిండిపోయింది. బలశాలురు ఐన వానరులు నిలిచి ఉండడంతో వాయువు చొరడానికి కూడా వీలు లేనిదిగా కనిపిస్తోంది. నల్లని మేఘాల్లాగా ఇంద్ర సములైన వానరులు రాక్షసులపై బడి చంపుతున్నారు. రాక్షసులందరూ మెరుపు దాడిలో ఆశ్చర్యానుభూతులు అవుతున్నారు. వానర వీరుల కోలాహల ధ్వని సాగర ఘోషను మించిపోయింది. ఆ ధ్వనికే వృక్షాలు పర్వతాలతో నిండి ఉన్న లంక కంపించిపోతోంది.

వానర వీరుల సైన్యాన్ని సురాసురులెవ్వరూ ఎదిరించ శక్యంకాకుండా ఉంది. అప్పుడు రాముడు యుద్ధనీతిని అనుసరించి సామ దాన దండోపాయాలను గురించి ఆలోచించాడు. అందులో భాగంగా రాయబారిని పంపడం సముచితంగా ఉంటుందని రాముడు వానరులతో అన్నాడు. దానికి అందరూ సమ్మతించారు. దానికి అంగదుని శ్రీరాముడు నియమించాడు.

నిర్భయంగా రావణుని దగ్గరకుపోయి రావణుని సంబోధించి నా మాటగా చెప్పు అంటూ, రాముడు “ఓ రాక్షసాధమా, రావణా! నీ అధికారం జారిపోయింది. నీ విజయలక్ష్మి దాదాపుగా మా చేతుల్లోకి రాబోతోంది. నీకు చావు మూడింది. అందువల్లనే బుద్ధి పనిచేయడం మానేసింది. గంధర్వ, అప్సరస, దేవ, సిద్ధ, మహర్షులకూ నీవు అపకారం చేశావు. గర్వోన్నతుడవై సీతను అపహరించావు. నీ పాప ఫలాన్ని అనుభవించే రోజు ఆసన్నమైంది. దాని నుండి నీవు తప్పించుకోలేవు. పరసతులను చెరబట్టే నీలాంటి పాపాత్ముల పాలిట మృత్యుదేవతనైన నేను నీ ఎదురుగా నిలిచాను. నా చేతిలో నీవు పరాభవాగ్నిలో మాడిపోక తప్పదు. సమస్త దేవతల నివాసమైన పుణ్యలోకానికి నేను నిన్ను పంపిస్తాను.

మారీచుని సాయంతో నేను లేని సమయంలో దండకారణ్యంలో సీతను అపహరించిన నీ బలమేదో నేడు నీ ముందు నిలిచిన నాకు చూపించు. సీతాసాధ్విని నాకు అప్పగించి తప్పును సరిదిద్దుకో! అలా కానిచో నిన్నే కాదు, నా తిరుగులేని బాణాలతో నీ వంశాన్ని, నీ మొత్తం లంకనూ, నాశనం చేస్తాను. ధర్మాత్ముడు, పుణ్యుడు ఐన విభీషణుడు నన్ను శరణు పొంది ఉన్నాడు. నేడు లంకను జయించి విభీషణునికి ధారపోస్తాను. ఇది తథ్యం నీవు గుర్తుంచుకో!

రావణా! నీ మూర్ఖత్వంతో రాజ్యంలో నీవు సమీకరించుకొన్న నీ అనుచరులందరూ నీ వంటి అజ్ఞానులే. అధర్మాన్ని ఆచరించే పాపాత్మా! నీవు నశించక తప్పదు. నాకంట పడిన నీవు ఇక ముల్లోకాలనుండి కూడా తప్పించుకొని పోలేవు. నీ వలన రాక్షసులందరి నాశనం జరుగుతుంది. ముందుగా నీకు అవకాశం ఇస్తున్నాను. దాన్ని అంది పుచ్చుకొని నీవు లంకను కాపాడుకో! లేకపోతే కడసారిగా లంకనంతా ఒకసారి చూసుకో. ఆ తర్వాత నా శరధాటితో నిన్ను కడతేర్చివేస్తాను" అంటూ రాముడు రావణునితో చెప్పమని అంగదునికి చెప్పి రాయబారిగా పంపాడు.

అంగదుడు అగ్నిదేవునిలాగా తేజస్సుతో వెలిగిపోతూ క్షణకాలంలో రావణుని భవన అంతర్భాగాన్ని చేరాడు. బంగారు భుజకీర్తులతో అత్యంత సుందరాకారుడైన అంగదుడు ప్రజ్వరిల్లే అగ్నిలాగా రావణుని ముందు నిలబడ్డాడు. తనను తాను పరిచయం చేసుకొని, కోసల ప్రభువైన రామచంద్రుని పరిచయాన్ని తెలుపుతూ, దుష్ట రావణ కార్యాన్ని తూలనాడుతూ రాముని మాటను రావణునితో చెప్పాడు.

"రావణా! నీకు, నీ పుత్రులకు, బంధువులకు, హితులకు నీ శ్రేయస్సు కోరేవారికి అందరికీ నాశనం తప్పదు. వైదేహిని రామునికి అప్పగించి నీ ప్రాణాలు దక్కించుకో" అని అంగదుడు రాముని మాటను యథాతథంగా చెప్పాడు. వానరోత్తముడు ఐన అంగదుని మాటలు విని రావణుడు క్రుద్ధుడై "అనుచరులారా! అంగదుని బంధించి వధించివేయండి" అని చెప్పాడు.

వెంటనే నలుగురు రాక్షస వీరులు అంగదుని చుట్టుముట్టారు. అంగదుడు తన ప్రతాపాన్ని ఏ మాత్రం చూపకుండా ఊరుకొని వారికి పట్టుపడ్డాడు. తన దగ్గరకు వచ్చిన రాక్షసులను తన చంకలలో ఇరికించుకొన్నాడు. ఒక్కసారిగాపైకి ఎగిరాడు. రాక్షసులను పక్షిపిల్లల్లాగా పట్టుకొని అమాంతంగా పైనుంచి క్రిందకు విసిరికొట్టాడు. వారందరూ రావణుడు చూస్తుండగానే నేలకొరిగి చనిపోయారు.

అంగదుడు పైనుంచి గిరిశిఖరంలా ఉన్న భవన శిఖరంపైకి ఎగిరిదూకాడు. ఆపాద ఘట్టనకు ఆ శిఖరం తునాతునకలయింది. మీసాలు దువ్వుతూ పౌరుషాన్ని ప్రకటించి బిగ్గరగా సింహనాదం చేశాడు. దాంతో తన ప్రాసాదం కూలిపోవడం చూసి రావణుడు తన మరణం ఆసన్నమైనట్టుగా అనుకుంటూ నిట్టూర్పులు విడిచాడు.

అంగదుడు తిరిగి రావడం చూసి, రాక్షస వైఖరిని గమనించిన రాముడు యుద్ధం అనివార్యం అని అనుకొన్నాడు. సుగ్రీవుని ఆజ్ఞతో సుషేణుడు నాలుగు వైపులా ఆవరించి ఉన్న వానర సేన సమాచారాన్ని సేకరించుకొచ్చాడు. సముద్ర తీరం ఆవల నుండి వచ్చి, ఆవరించి ఉన్న అక్షౌహిణుల వానర సేనను చూసి,

రాక్షసులు ఆశ్చర్యానికి లోనయ్యారు. వారినందరిని అదేపనిగా చూస్తూ, కాలం ఆసన్నమైందని తెలుసుకొని రాక్షసులందరూ నిశ్చేష్టులుగా మారారు. వారిలో దైన్యం ఆవరించింది. భయభ్రాంతులకు లోనైన వారు రావణుని తిట్టుకుంటూ ఆయుధాలు ధరించి ఉన్మాదులలాగా లంక అంతా పరుగెత్తారు. రాక్షసులందరిలో ఎపుడూ లేని భయం ఆవరించింది. వారికి వారి ప్రాణాలు పోతాయేమో అన్న శంక ఎక్కువైంది. రాముడు తప్పక లంకావాసులను యమపురి ప్రయాణం కట్టిస్తాడనే నమ్మకం మితిమీరింది, దానితో వారు చేస్తున్నదేమిటో వారికి తెలియకుండాపోతోంది. వారు పరుగులు తీస్తున్నారు. కూర్చున్న చోటు కూర్చోలేకుండా, నిల్చున్న చోటున నిలవలేకుండా ఉన్నారు. వారిలో ఏ క్షణం ఏమౌతుందోనన్న గాబరా వారిని నిలువనీయక పరుగులు పెట్టిస్తోంది. రావణుని పై వారికి కోపం వస్తోంది. సీతమ్మను ఇచ్చివేస్తే భయం తీరిపోతుందని అనిపిస్తోంది. కానీ, దుష్ట ప్రభువు మాట వినక, ప్రాణం మీదికి తీసుకువచ్చాడని అనుకుంటున్నారు. కొందరికి కన్నులలో కన్నీరు ఉబికి వస్తోంది. వారి అనుబంధాలను తలుచుకుని బాధపడ్తున్నారు.

* * *

# వానరులు లంకను ఆక్రమించటం

## సర్గ - 42

రాక్షసులందరు రావణుని దగ్గరికి వెళ్లి రాముని వానర సైన్యం లంకను నాలుగు వైపులా ముట్టడించారని చెప్పారు. దాంతో రావణుడు రక్షణ ఏర్పాట్లను రెట్టింపు చేశాడు. రావణుడు ప్రాసాద అగ్రభాగానికి చేరి కపి సైన్యాన్ని చూశాడు. యుద్ధకాంక్ష ఉన్న వానరులు అసంఖ్యాకంగా కనిపించారు. వీరినందరిని ఎలా ఎదుర్కోవాలా అనే చింతలో రావణుడు మునిగాడు.

శ్రీరాముడు ధ్వజపతాకలతో అందంగా ఉన్న లంకను, దానిలోని రాక్షసులను పరికించి చూశాడు. ఆయన మదిలో సీత మెదిలింది. జానకి నా కొరకై ఎంతగా ఎదురుచూస్తుందో అనుకొన్న ఆయన మనస్సు చింతతో నిండిపోయింది. దీనికంతా కారణమైన రావణుడు స్మృతిపథంలో మెదిలాడు. కోపంతో ఉద్యుక్తుడైన రాముడు వానరులకు లంకను ముట్టడించమని ఆజ్ఞనిచ్చాడు.

రాముని ఆజ్ఞను విన్న వానరసేన అత్యుత్సాహంతో సింహనాదం చేసింది. శత్రువులను హతమార్చాలనే ఆశ వారిలో తహతహలాడింది. కనిపించిన రాక్షసులను ముష్టిఘాతాలతో తొక్కిపారేశారు. శిలలను, వృక్షాలను లంక పైకి విసురుతూ బీభత్సాన్ని సృష్టించారు.

కొందరు వానరులు గండశిలలను, వృక్షాలను చేతబట్టుకొని ఎవరిని మోదాలని ఎదురుచూశారు. రావణుని కడతేర్చాలన్న ఆశతో వానరులు లంక ప్రాకారాలపై ఎగబాకారు. బురుజులపై ఎగిరి దూకారు. అరణ్యాలను ఛిన్నాభిన్నంచేశారు.

సింహద్వారాలను, కోట బురుజులను ధ్వజాలను పగలగొడ్తున్నారు. జలాలున్న అగడ్తలను మట్టితో, పర్వత శిఖరాలతో, గడ్డి గాదంతో పూర్తిగా నింపేశారు. వానర సేనాపతులు తమ తమ అనుచరగణాలను కోట్ల సంఖ్యలో వెంటబెట్టుకొని లంక ప్రాకారం పైకి ఎగదోసుకుంటూ వెళ్లారు. బలిష్టమైన వానర యోధులు బంగారు ముఖద్వారాలను చూర్ణంచేశారు.

తిరుగులేని పరాక్రమశాలురు 'శ్రీరామునికి జయం! జయం!' అంటూ ధ్వనులతో లంకను అట్టుడికించారు. వీరబాహువు, సుబాహువు, నలుడు మొదలగు వానరులంతా గబగబా లంక ప్రాకారాన్ని అధీనంలోకి తెచ్చుకోవాలని శతథా ప్రయత్నిస్తున్నారు.

కుముదుడు వంద కోట్ల మంది సైనికులతో ఈశాన్య ద్వారాన్ని ఆక్రమించాడు. ప్రఘసుడు, పనసుడు కుముదునికి సహాయకులుగా ఉన్నారు. శతవలి మహావీరుడు, 20 కోట్ల మంది వానరులతో దక్షిణ ద్వారం దగ్గర ఆగ్నేయ దిశను ఆక్రమిస్తూ ముందుకు వెళ్లాడు. తార తండ్రి, మహా పరాక్రమ శాలి అయిన సుషేణుడు 60 కోట్ల మంది కపులతో పశ్చిమ ద్వారాన్ని నైరుతి దిశగా ఆక్రమణ చేశాడు.

ఉత్తర ద్వారాన్ని రామలక్ష్మణులు సుగ్రీవుని సాయంతో ఎదుర్కొంటూ సాగారు. వాయువ్య దిశను వారు ఆక్రమిస్తున్నారు. గవాక్షుడు కోటిమంది కొండముచ్చులు శ్రీరాముని దగ్గరగా ఉన్నారు. ధూమ్రుడు కోటి సంఖ్యలో యోధులను పెట్టుకొన్నారు.

వానర భల్లూక సేనసంతా రాక్షసులపైకి విజృంభిస్తున్నారు. వీరికి తోడుగా విభీషణుడు గదాధారియై తన సచివులతో రావణునిపై ఉరకడానికి ఉరకలు వేస్తున్న మనస్సుతో నిలిచాడు.

గజుడు, గవాక్షుడు, గవయుడు, శరభుడు, గంధమాదనుడు అందరు వారి అనుచరులతో శ్రీరామునకు సహాయకులుగా నిలిచారు.

రాక్షసరాజు ప్రాసాద అగ్రభాగాన నుండి వానరసేననంతా చూస్తూ అతిగా కోపోద్రిక్తుడై తన సేనకు వానరులను ముట్టడించమని ఆజ్ఞనిచ్చాడు. రావణుని ఆజ్ఞ సేనలో రణోత్సాహం కలిగించింది. అందరూ సింహనాదాలు చేశారు.

రాక్షసులు ఢక్కాలు, పుష్కర వాయిద్యాలు రణభేరిగా మ్రోగించారు. శంఖారావాలు చేశారు. నల్లని శరీరాకృతి ఉన్న పర్వతాకార రాక్షసులు తెల్లని శంఖం చేతబట్టి పెద్దగా నాదం చేశారు. మహా సముద్రంలాగా ముందుకు వస్తున్న వానరులను అడ్డుకోవడానికి రాక్షసులు పైకి వెళ్ళారు. ఇరుపక్షాల సింహనాదాలు, భేరినాదాలు త్రికూట పర్వత ప్రాంతం అంతా ప్రతిధ్వనించిపోయింది.

శంఖారావాలు, దుందుభుల మ్రోతలు, గజాల ఘీంకారాలు, అశ్వాల సకిలింపులు, రథ చక్రపు సవ్వడులు, రాక్షసుల కోలాహలాలు లంకను కంపింపజేశాయి. దేవదానవ సంగ్రామంలాగా రాక్షస వానరుల సమరం తలపించింది.

రాక్షసులు పరాక్రమంతో గదలు, ఈటెలు, బాణాలు, శూలాలు, గండ్రగొడ్డళ్ళతో వానరులను పరిమార్చారు. కంఠాలతో జయధ్వానాలు చేస్తున్నారు. రాక్షసులు "మహారాజు జయం, రావణ వీరునకు జయం అంటుంటే, వానరులు "శ్రీరామునకు జయం", "లక్ష్మణునికి జయం", "సుగ్రీవునకు జయం", "హనుమకు జయం" అంటూ అరుస్తున్నారు. ప్రాకారం పైకి వస్తున్న వానరులను రాక్షసులు పడవేస్తున్నారు. వారిని అడ్డుకొంటూ వీరు పైకి వెళ్తున్నారు. సాటిలేని సంకుల సమరం ఇద్దరిమధ్యా భయంకరంగా సాగుతోంది.

* * *

# ప్రజంఘాది వీరుల మరణం

## సర్గ - 43

రెండు పక్షాల నడుమ ఘోర సంగ్రామం మొదలైంది. ఒకరిపై మరొకరు వేగంగా దూసుకొస్తూ యుద్ధం చేస్తున్నారు. ఇరువురిలో కోపావేశాలు అధికం అయ్యాయి.

బంగారు ఆభరణాలతో అలంకరించిన గుర్రాలు, ఏనుగులు, రథాలు యుద్ధానికి తీసుకొని వచ్చారు. అందంగా అలంకరించుకొన్న రాక్షసవీరులు వాటిపై ఎక్కి వానరులతో పోరాడుతున్నారు. యుద్ధనినాదాలు దెబ్బతిన్నవీరుల ఆర్తనాదాలు గదలు కొట్టుకోవడంతో సవ్వడులు రాక్షసులు వృక్షాలు విసురుతూ చేసే శబ్దం వానరుల రాక్షసుల మధ్య ద్వంద్వ యుద్ధాలు, గండశిలలు తగలటంతో వస్తున్న శబ్దం అన్నీ కలిసి సమరభూమి కలకలంగా ఉంది.

ఎటుచూసినా భీకరంగా అరుపులు పెడబొబ్బలు ఆర్తనాదాలు రణరంగం అంతా మహాభయంకరంగా ఉంది. రాక్షసులు వానరులు ఎవరికి వారు జయం కావాలని పోరు సాగిస్తున్నారు. ఇరుపక్షాల వీరులు సంకుల సమరం చేస్తున్నారు. రావణ సేనలో భయం ఉన్నా ఎదుటి పక్షం వారు చేసే యుద్ధాన్ని చూసి వీరత్వం ఎగదన్నుకొస్తోంది. మనం అధర్మమైన పోరు చేస్తున్నాం అనే జంకు వారిని కుంగదీస్తోంది.

ఇంద్రజిత్తు వాలిసుతునితో యముడు శివునితో పోరాడినట్లుగా పోరాటం సాగించాడు. విభీషణుని సచివుడు సంపాతి ప్రజంఘాసురునితో పోరాటం చేస్తున్నాడు. హనుమంతుడు జంబుమాలితో యుద్ధం చేస్తున్నాడు. విభీషణుడు మిత్రఘ్నుడను మహాబలునితో యుద్ధం, మహావీరుడైన గజుడు తపనాసురునితో నీలుడు నికుంభునితో తలపడ్డారు. అందరూ భీకరంగా రణాన్ని సాగిస్తున్నారు.

వానర ప్రభువు సుగ్రీవుడు ప్రఘాసురునితో, లక్ష్మణుడు విరూపాక్షునితో యుద్ధం సాగిస్తున్నారు. శ్రీరామునితో దుర్జయులైన అగ్ని కేతువు, రశ్మికేతువు, సుప్తఘ్నుడు, యజ్ఞకోపుడు యుద్ధం చేస్తున్నారు.

ఘోర రాక్షసుడైన వజ్రముష్టితో మైందుడు, అశని ప్రభునితో ద్వివిదుడు పోరాడుతున్నారు.

భయంకర స్వరూపుడు ప్రతీపనుడు నలునితో యమధర్మరాజు అంశతో పుట్టిన సుషేణుడు విద్యున్మాలితో కదనరంగంలో వీరవిహారం చేస్తున్నారు. చాలామంది వానరవీరులు రాక్షసులతో తలపడుతున్నారు. వారి యుద్ధం చూచేవారికి భయంకరంగా గగుర్పాటు కలిగిస్తోంది. రక్తం ప్రవాహంలా పారుతోంది. దానిమీద వీరుల వెంట్రుకలు పచ్చికలా కొట్టుకొస్తున్నాయి.

కళేబరాలు భూమి నిండుతున్నాయి. ఇంద్రజిత్తు తన వజ్రాయుధం వంటి గదతో అంగదుని మోదాడు. కుపితుడైన అంగదుడు ఆ గదనే లాక్కొని ఇంద్రజిత్తు రథాన్ని, అశ్వాలను, సారథిని తుత్తునియలు చేశాడు. ప్రజంఘుడు సంపాతిని బాణాలతో గాయపర్చాడు. నల్లమద్ది చెట్టుతో ప్రజంఘుని ఈడ్చికొట్టాడు. దెబ్బకు ప్రజంఘుడు ప్రాణాలు వదిలేశాడు.

జంబుమాలి హనుమంతుని వక్షస్థలం బ్రద్దలు అయ్యేలాగా కొట్టాడు. హనుమంతుడు దాని నుండి తప్పించుకొని రథంపైకి ఎగిరాడు. అరచేతితో జంబుమాలిని బాది యమునికి అతిథిని చేశాడు. ప్రతపనుడు నలుడు యుద్ధం చేస్తుండగా ఒక్కసారి నలుడు ప్రతపనుని పళ్ళను రాలగొట్టాడు. సుగ్రీవుడు సప్తవర్ణ వృక్షంతో ప్రఘసుని చావకొట్టాడు.

అగ్ని, రశ్మి కేతువులు సప్తఘ్నుడు, యజ్ఞకోపులు బాణాలు వేస్తూ శ్రీరామునిపై యుద్ధం చేస్తున్నారు. రఘురాముడు నాలుగు భయంకర బాణాలు వేసి వారిని శీఘ్రంగా యమపురికి పంపివేశాడు. మైందుడు వజ్రముష్టికి ముష్టి ఘాతుకంతో పైకి పంపించాడు. కాటుక రాశిలాగా ఉన్న నికుంభుడు నలునిపై బాణాలతో యుద్ధం చేశాడు.

నికుంభాసురుడు వంద బాణాలతో నలుని గాయపరచి వికటాట్టహాసం చేశాడు. శ్రీమహావిష్ణువు దైత్యులను దునుమాడినట్లు నలుడు ఆగ్రహంతో నికుంభుని రథ చక్రం పెరికి దానితో రథాశ్వాలను రథాన్ని నుగ్గుచేశాడు. ఆ చక్రంతోనే నికుంభాసురుని చంపివేశాడు.

ద్వివిదుని స్పృశించడమే చాలా కష్టం. ఆయనను యుద్ధంలో ఎదిరించాలని వచ్చే రాక్షసులను నరుకుతూ గిరిశిఖరంతో తనపై వస్తున్న అశనిప్రభుని కొట్టాడు. దాంతో ఆ పిడుగులాంటి వానరేంద్రుని తన బాణాలతో హింసించాడు. అలా పోరుతూ సాలవృక్షపు దెబ్బకు అశని ప్రభువు నేలకు ఒరిగాడు.

సుషేణుడు తన వాలాన్ని నేలకేసి కొట్టుతూ యుద్ధం చేస్తూ విద్యున్మాలి రథాన్ని గిరిశిఖరంతో కొట్టాడు. రణకుశలుడైన విద్యున్మాలి గబుక్కున రథంనుంచి క్రిందకు దూకాడు. గదను పట్టి సుషేణుని కొట్టాడు. ఆ దెబ్బను తేలికగా చూస్తూ బండను తీసుకొని విద్యున్మాలిని మోదాడు. ఆ ధాటికి విద్యున్మాలి మొదలు నరికిన చెట్టులాగా పడిపోయాడు.

దేవదానవ యుద్ధంలో దేవతల చేతిలో దానవులు హతులు ఐనట్లుగా వానరుల చేతిలో రాక్షసులు నిహతులు అవుతున్నారు. సమరభూమి అంతా రాక్షసుల కళేబరాలు, రక్తం శిలలు, వృక్షాలు, చచ్చిపడిన అశ్వాలు, ఏనుగులతో నిండిపోయింది. అక్కడికి గుంపులు గుంపులుగా నక్కలు వచ్చి ఊళలు వేస్తున్నాయి. ఇరుపక్షాల మధ్య భయంకరమైన పోరు జరుగుతోంది.

* * *

# రామలక్ష్మణుల నాగబంధం

## సర్గ - 44

వానరులు రాక్షసులు ఘోర యుద్ధం చేస్తుండగా రాత్రి ప్రారంభం అయ్యింది. అయినా వారిరువురూ పోరును ఆపకుండా యుద్ధం సాగించారు. చీకటి ఆవరించి ఉండడంతో వానరులు రాక్షసులు ఇరువురికి ఎరుకలేకపోయింది. వారిలో వారే కలహించుకోసాగారు. వానరులను వానరులే నీవు రాక్షసుడివి నిశాచరుడివి అంటూ కొట్టుకున్నారు. రాక్షసులు నీవు వానరుడివి, నీవే భల్లూకం అంటూ వారిలో వారే చావమోదుకొన్నారు. ఇలా ఎవరి పక్షంలోని వారిని వారే చంపివేసుకొన్నారు.

చిమ్మ చీకట్లో చేతికి అందిన వారిని రాక్షసులు తినివేయసాగారు. చీకట్లో మెరుస్తున్న బంగారు రథాలను ధ్వజాలను సకిలిస్తున్న గుర్రాలను వానరులు తమ దంతాలతో గోర్లతో చీల్చివేయసాగారు. మాయారూపులైన రాక్షసులు ఒకసారి కనపడి మరోసారి కనపడకుండా యుద్ధం చేస్తున్నారు. ఇలా కొట్టుకొంటున్న యోధులున్న సమరభూమి కాలు పెట్టడానికి వీలు లేకుండా శవాలతో నిండిపోయింది. రక్తంతో మట్టికలిసిపోయి రక్తపుటేరులు బురదలతో ఆ ప్రదేశం నానా జుగుప్సను కలిగిస్తోంది.

గాయపడిన వీరుల ఆర్తనాదాలు, గెలుస్తున్న వీరుల సింహనాదాలు – అన్నీ కలిసి వింత ఆశ్చర్యాన్నిస్తున్నాయి. వీరులందరిని పొట్టన పెట్టుకొన్న ఆ కాళరాత్రి భయంకరంగా ఉంది. ప్రళయకాలాన ఉప్పొంగే సముద్రంలాగా వీరుల ఘోష మదిని భీతిగొలుపుతోంది. శ్రీరాముడు తన ఎదురుగా కనిపిస్తున్న యోధులపైకి బాణాలను ఎక్కుపెట్టి వేయసాగాడు. శుకసారణులు, మహాపార్శ్వుడు, మహోదరుడు, వజ్రదంష్ట్రుడు ఈ ఆరుగురి బాణాలతో రాముడు నిగ్రహించాడు. వారు ఆ ధాటికి తట్టుకోలేక ప్రాణాలు అరచేత పట్టుకొని రణభూమి నుండి పలాయనం చేశారు.

బంగారు వన్నెలు చిందిస్తున్న రామనామాంకిత బాణాలు సమర భూమి నలుప్రక్కలా వ్యాపించాయి. ఆయనను ఎదిరించిన రాక్షసులు మిడుతల్లాగా మాడి క్రిందపడిపోతున్నారు. కొందరు అక్కడనుంచి పారిపోతున్నారు. రాక్షసుల కేకలతో, వానరుల గర్జనలతో ఆ రాత్రి మారుమ్రోగింది. మహాకాయులైన భల్లూకాలు రాక్షసులను తమ చంకల్లో ఇరికించుకొని చంపి గ్రద్దలకు ఆహారంగా వేస్తున్నారు.

అంగదుడు ఇంద్రజిత్తును చంపివేయాలన్నంత కోపంగా యుద్ధం చేస్తున్నాడు. అంగదుని వీరవిహారానికి ఇంద్రజిత్తు చిత్తై దిక్కులు చూస్తున్నాడు

ఇంద్రజిత్తు రథాశ్వాలు, సారథి యమపురికి వెళ్లారు. రథం ముక్కలైంది. ఇక చేసేది ఏమీ లేక ఎదుటపడి, అంగదుడు తనను ఆహ్వానించాల్సిన యమునకు కబురు పంపుతాడని భయపడి, అక్కడనుంచి ఇంద్రజిత్తు మాయం అయ్యాడు.

అంగదుని చేతిలో మహాపరాక్రమశాలి ఐన ఇంద్రజిత్తు ఓడి అంతర్థానం చెందడంతో అందరూ అంగదుని మెచ్చుకొన్నారు. ఇంద్రజిత్తును ఓడించటం చూసి విభీషణుడు అంగదుని బాగు బాగు అని మెచ్చుకొన్నారు. అంగదుని మెచ్చుకోలు చూసి తను ఓడిపోవటంతో ఇంద్రజిత్తు కుతకుతలాడాడు.

ఇంతలో శ్రీరాముడు, "వానరులారా! కుపితుడైన ఇంద్రజిత్తు ముల్లోకాలను బాధించే వరగర్వి మనపై వస్తున్నాడు. మీరందరూ సుగ్రీవునకు అండగా ఉండండి." అంగదుని వీరత్వంలో ఇంద్రజిత్తు నాగుపాములా బుసకొట్టుతున్నాడని రాముడు వానరులను హెచ్చరించాడు. ఇంద్రజిత్తు ఎవరికీ కనిపించకుండా ఉంటూ తన బాణ ప్రయోగంతో వానరులను బాధిస్తున్నాడు.

వానరులకు ఎదురు నిలవలేక మాయలు పన్ని ఇంద్రజిత్తు బాణ ప్రయోగం చేస్తున్నాడు. నాగపాశాలను రామలక్ష్మణులపైకి వదిలాడు. దాంతో వారిరువురు మూర్ఛిల్లిపోయారు. సూక్ష్మబుద్ధి ఉన్న ఇంద్రజిత్తు రామలక్ష్మణులను తన పాశంతో బంధించి వేశాడు. ఇంద్రజిత్తు తన మాయతో వారిని మట్టుపెట్టాలనే సంకల్పం నెరవేరిందనుకొన్నాడు.

* * *

# వానరుల శోకం

## సర్గ - 45

ఇంద్రజిత్తు మహామాయావి. తన మాయల పన్నాగంలో భాగంగా తాను కనపడకుండా ఉండి నాగపాశ బాణాలను రామలక్ష్మణులపై వేసి వారిని మూర్ఛిల్లేటట్లు చేశాడు. అంతకుముందే రాముడు ఇంద్రజిత్తును కనిపెట్టి ఉండమని వానరులను ఆదేశించి ఉన్నాడు.

సుషేణుని కుమారులిద్దరూ వానరశ్రేష్ఠుడైన నీలుడు, అంగదుడు, శరభుడు, వినతుడు, జాంబవంతుడు, సానుప్రస్థుడు, ఋషభుడు, ఋషభస్కంధుడు ఈ పదిమంది ఇంద్రజిత్తు జాడను తెలుసుకోవడానికి ఆకాశంలో వెదకడం మొదలుపెట్టారు. తన ఉనికిని కనిపెట్టటానికి చూస్తున్న వానరులను ఇంద్రజిత్తు చూశాడు. వారికంటే వేగంగా పరిగెత్తే బాణాలను వారిపైకి వేస్తూ వారి గమనాన్ని వెదుకులాటను ఇంద్రజిత్తు నిరోధించసాగాడు. రాత్రి

కూడా ఇంద్రజిత్తుకు తోడైంది. దాంతో వానరులు వాని జాడను కనిపెట్టలేకపోయారు. అంగదుని వీరావేశంతో పలాయన మంత్రం పఠించిన ఇంద్రజిత్తు అక్కడినుంచి పారిపోయి రామలక్ష్మణుల దగ్గరకు వెళ్లాడు. వారు రాక్షసులను అవలీలగా ఎదుర్కోవడం చూశాడు. వారి దగ్గరకు వెళ్లిన ఇంద్రజిత్తు“ రాఘవులారా! నేను అదృశ్యుడినై యుద్ధం చేస్తే నన్ను ఇంద్రుడు కూడా పట్టుకోలేడు. ఇక మీరెంత ఒక లెక్కలోనివారా?” అని రామలక్ష్మణులను ఎద్దేవా చేశాడు.

“నేను అదృశ్యంగా ఉంటూనే మీపై బాణాలు వేసి మిమ్ములను ఇప్పుడే యమపురికి పంపిస్తా” అంటూ సోదరులపై బాణప్రయోగం చేశాడు. రామలక్ష్మణులపై వెంట వెంట వారి ఆయువు పట్టులపై బాణాలు వేశాడు. వికృతంగా గర్జన చేస్తున్నాడు, బాణాల పరంపరను వేగంగా వేస్తూనే ఉన్నాడు. ఆ ఘోర సంగ్రామంలో రామలక్ష్మణులపై నాగాస్త్రాలు వేసి బంధించాడు. దాంతో వారిరువురు క్షణకాలం కళ్ళు తెరవలేకపోయారు. ఇంద్రజిత్తు వేసిన బాణాల వలన ఆ సోదరుల శరీరాలు బాగా దెబ్బతిన్నాయి. వారిరువురు నాగపాశ బద్ధులై కంపించిపోయారు. ఆపై నేలమీద పడిపోయారు.

వారి సర్వావయాలను సర్పరూపంలో బాణాలు చుట్టుకొని ఉన్నాయి. వాని శరీరం రక్తసిక్తం అయింది. రామలక్ష్మణులు శారీరకంగా మానసికంగా దెబ్బతిన్నారు. వారి శరీరం నుండి రక్తం బయటకు రాసాగింది.

బాణాలు – సూటిగా ఉండి వర్తులాకారంలో ఉండే నారాచాలు, మధ్యభాగంలో నారాచంలాగా ఉండే అర్థనారాచాలు, గండ్రగొడ్డళ్ళ వంటి మొనలున్న భల్లములు, దోసిళ్ళ రూపంలో ఉండే బాణాలు అంజలికములు, దూడ దండాలను పోలిన అడుగు భాగంలో ఉన్న వత్సదంతాలు, సింహం కోరల్లాంటి అగ్రభాగం ఉన్న సింహదంష్ట్రాలు, కత్తులవంటి మొనలున్న క్షురాలు అనే రకరకాల బాణాలతో శ్రీరాముణ్ణి ఇంద్రజిత్తు బాధించాడు. మూర్ఛితుడై పడి ఉన్న రాముని పిడికిలి సడలిపోయి ఉంది. రత్నాలతో అలంకృతమైన కార్ముకం మూడు చోట్ల వంగి ఉంది. అల్లెత్రాడు ఎక్కుపెట్టలేదు. రాముడు లక్ష్మణునికన్నా ముందు పడిపోయాడు. నేలపై పడి ఉన్న రాముణ్ణి చూసి లక్ష్మణుడు ఎంతో కుమిలిపోయాడు. అలా ఇంద్రజిత్తు బాణానికి లక్ష్మణవీరుడు నాగపాశ బద్ధుడయ్యాడు. అలా వారిద్దరూ స్పృహ తప్పి నేలపై పడిపోవడం చూచి వానరులంతా దిగాలు పడిపోయారు. వానరులు యుద్ధం వదిలేసి, తమ ప్రభువుల చుట్టూ చేరి దుఃఖంలో మునిగిపోయారు.

* * *

# ఇంద్రజిత్తు బడాయి

## సర్గ – 46

**శ్రీ**రామునిచే ప్రేరితులైన వానరులు ఇంద్రజిత్తు జాడను కనిపెట్టలేక నేలకు దిగివచ్చారు. వారికి మూర్ఛితులై పడి ఉన్న రామలక్ష్మణులు కనిపించారు. తుఫాను తర్వాత ప్రశాంతంలాగా ఇంద్రజిత్తు రామలక్ష్మణ సోదరులిద్దరూ

పడిపోవడంతో స్థిమితం తెచ్చుకొని యుద్ధం ఆపివేశాడు. అక్కడనుంచి వెళ్లిపోయాడు. ఆ స్థితిలో సుగ్రీవుడు రామలక్ష్మణుల దగ్గర వచ్చాడు అక్కడ పడి ఉన్న రామసోదరులను, వారి చుట్టూ నిలచిన నీలాది వానరవీరులను చూశాడు.

ఇక్ష్వాకువంశ సోదరులు నాగపాశానికి బద్ధులై ఉండడంతో వారిలో కదలిక లేదు. కాని, వారు ఊపిరిగా మెల్లగా తీసుకొంటున్నారు. రక్తపు మడుగులో నిశ్చేష్టులై పడి ఉన్నారు. వారిని చూచిన వానరులు విభీషణాదులు అందరూ కన్నీరుగార్చుతూ వారిదగ్గరే ఉండిపోయారు. వారి మతి కుంచించుకుపోయింది. జరిగింది చూచిన తర్వాత ఏం చేయాలో, ఆ సోదరులను ఏమి చేయాలో తోచక దిగ్భ్రమలో వారందరూ ఉండిపోయారు.

ఇంద్రజిత్తు కోసం ఆకాశం అంతా, సమరభూమి అంతా గాలించారు. వారికి ఇంద్రజిత్తు జాడ తెలియలేదు. మాయను ప్రయోగించి శత్రువులను మట్టుపెట్టే శక్తి ఉన్న ఇంద్రజిత్తు బ్రహ్మ వరప్రభావి. ఇంద్రజిత్తు ఘనకార్యాన్ని చేశానని విర్ర వీగుతూ అదృశ్యంగా తిరుగుతున్నాడు.

ఆ వర ప్రభావంతో ఘనకార్యాలు చేసే ఇంద్రజిత్తును విభీషణుడు కనిపెట్టాడు. తన ఇంద్రజాలంతో పడిపోయిన రామలక్ష్మణులను చూసి ఇంద్రజిత్తు చాలా సంతోషించాడు.

ఖరదూషణాది వీరులను సంహరించిన మహావీరాధివీరులైన రామలక్ష్మణులను నా బాణ ప్రహారంతో సంహరించాను. ఇప్పుడు వీరి దగ్గరికి దేవతలు, సిద్ధులు, మహర్షులు ఎవ్వరు వచ్చినా వీరిద్దరిని కాపాడలేరు. వీరిరువురివలన నా తండ్రి ఐన రావణాసురుడు కంటికి నిదురలేక చాలా రోజులనుంచి చింతిస్తున్నాడు. వీరిరువురివలనే మా లంకావాసులందరూ కంటిపై కునుకు రాక నిద్రపట్టక అల్లాడుతున్నారు. వీరందరూ కష్టపడి నిర్మించిన సేతు నిర్మాణం, హనుమంతుని వీర శౌర్య పరాక్రమాలు అన్నీ శరత్కాలపు మేఘాలలాగా నావలన నిష్ఫలమైపోయాయి. ఇలా అంటూ తన దగ్గరగా ఉన్న వానరయోధులపై బాణాలు వేశాడు.

శత్రువును దెబ్బతీయడంలో మేటి ఐన ఇంద్రజిత్తు నీలునిపై తొమ్మిది బాణాలను, మైందుని ద్వివిదునిపై మూడేసి బాణాలను వేసి వారిని బాధించాడు. ఇంకా తనివితీరక జాంబవంతుని వక్షస్థలంపై బాణం వేశాడు. హనుమంతునిపై వరుసగా ఆగకుండా పది బాణాలు వేశాడు. గవాక్ష శరభులిద్దరిపైనా రెండేసి బాణాలు వదిలాడు.

కొండముచ్చులలోని ప్రముఖులపైన అంగదునిపైన శరప్రయోగం చేశాడు. వానరులందరిని బాగా దెబ్బతీసి ఇంద్రజిత్తు గర్వంగా పెద్ద అరుపుతో కూడిన నవ్వు నవ్వాడు. వికటాట్టహాసాలతో వానరులను భయభ్రాంతులను చేశాడు. “రాక్షసవీరులారా! మనపై దండెత్తి వచ్చిన ఆ రాకుమారులు నా చేతిలో ఎలా దెబ్బతిన్నారో చూడండి. ఇక లేవలేకపడిపోయారు. విజయం మనదే” అంటూ వారి రాక్షసయోధులకు రణోత్సాహం కలిగించాడు.

ఇంద్రజిత్తు చేసిన పనికి వారి అనుచరులందరూ ఆశ్చర్యపోయారు. విజయాన్ని చూసి విస్మయానికి గురి అయ్యారు. ఇంద్రజిత్తును అభినందిస్తూ మహానాదం చేశారు. చలనరహితంగా పడి ఉన్న రామలక్ష్మణులను చూచి ఇంద్రజిత్తు వారు నిజంగా ప్రాణాలు వదిలేశారని అనుకొని సంబరపడిపోయాడు.

ఇంద్రజిత్తు స్థితిని చూసి సుగ్రీవుడు మండిపడ్డాడు. రామలక్ష్మణుల పరిస్థితికి కన్నీరు మున్నీరుగా ఏడ్చాడు. తన ప్రభువులకు ఏం చేయాలో తోచక వ్యాకులం చెందాడు. అతని కన్నులు ముక్కు పెదవులు అన్నీ భీతితో అదిరిపాటుకు లోను అవుతున్నాయి. కంఠం నుంచి మాట రావడంలేదు. కన్నులు బేలగా రామలక్ష్మణుల వైపు చూస్తూ కన్నీరు కార్చుతున్నాయి. అలాంటి స్థితిలో ఉన్న సుగ్రీవుణ్ణి చూచి విభీషణుడు ధైర్యం చెప్పాడు.

"మిత్రమా! సుగ్రీవా! భయం వీడు. ఇలాంటి పరిస్థితులు యుద్ధంలో మామూలుగా జరుగుతుంటాయి. మన అదృష్టం వలన వీరు త్వరలోనే కోలుకొంటారు. నీవు ధైర్యం తెచ్చుకొని శరణార్థినైన నన్ను కూడా నీవే కాపాడాలి. దీనివలన శత్రువుల జయం కాని, మనకు అపజయం కాని, ఇపుడు కలుగలేదు. ధర్మానికి అపజయం ఉండదు కదా! కాబట్టి, మనం కన్నీరు కార్చాల్సిన స్థితి రాదు. వీరిద్దరూ త్వరలోనే కోలుకొంటారు" అని సుగ్రీవునికి విభీషణుడు ధైర్యం చెప్పాడు.

తర్వాత కుడిచేత్తో సుగ్రీవుని ముఖం కళ్ళు తుడిచాడు. ధర్మాత్ముడైన విభీషణుడు రాక్షస మాయలను తెలుసుకొనే మంత్రాలను జపించి ఆ మంత్ర పూత జలంతో సుగ్రీవుని నేత్రాలను తుడిచాడు. "వానరరాజా! ఇది చింతించాల్సిన సమయం కాదు. అతి ప్రేమను చూపడంవలన చిన్న కీడు కూడా పెద్ద ప్రమాదంలా కనిపిస్తుంది. అధైర్యంవలన సమస్త కార్యాలు దెబ్బతింటాయి. కాబట్టి, ధైర్యం పూని శ్రీరామునికి నాకు వానర యోధులందరిని మంచి చేకూరే మార్గాన్ని అన్వేషిద్దాం!

రామలక్ష్మణులు స్పృహనుండి తేరుకొనేవరకు వారిని మనం రక్షించాలి. ఆ తర్వాత వారిరువురు మన భయాన్ని పారద్రోలుతారు. ఈ నాగపాశ బంధంవలన రామలక్ష్మణులకు ఏమీ కాదు.

ఏనాడు శ్రీరాముని మృత్యువు దరిచేరదు. ధర్మప్రవర్తనుడు, సత్యవాది ఐన రామునకు అపజయం ఏనాటికీ కలుగదు. వారు స్పృహ తప్పి ఉన్నా వారి ముఖ కవళికలలో ఎలాంటి తొట్రుపాటులేదు. వారి ముఖం దివ్యశోభలతోనే అలరారుతోంది. వారు నిద్రిస్తున్నట్లుగా ఉన్నారు. అందువలన మీరు వారిని గురించి చింతించనక్కరలేదు.

"వానరశ్రేష్ఠా! నీవు వానరులలో చొచ్చుకొచ్చిన భయాన్ని పారద్రోలు. వారందరూ పారిపోవాలను కొంటున్నారు. వారు నన్ను చూసి ఇంద్రజిత్తుగా తలచి పరుగెత్తిపోతున్నారు. అలాంటి వారిని చూచి ఓదార్చి వారిలో రణోత్సాహాన్ని నింపు" అంటూ సుగ్రీవుణ్ణి, పారిపోవడానికి ఉద్యుక్తులైన వానరసేనకు తిరిగి వారిలో ఉత్సాహ, ఉద్రేకాలను నింపి వారి ప్రయత్నాన్ని విభీషణుడు ఆపాడు. విజయ విహారం చేసేశాననుకొని ఇంద్రజిత్తు ఉత్సాహంగా లంకానగర ప్రవేశం చేశాడు. తన తండ్రికి ఆనందానిచ్చేశానని గర్వంగా తండ్రి ముందుకు వెళ్ళారు. "తండ్రీ! రామలక్ష్మణులను చంపేశాను" అంటూ అత్యుత్సాహంతో ఇంద్రజిత్తు గట్టిగా అరచి చెప్పాడు. ప్రియమైన వార్త చెవులో పడగానే రావణుడు ఒక్క ఉదుటున లేచి ఇంద్రజిత్తును కౌగిలించుకొని "తండ్రీ! నన్ను చాలా సంతోషింపజేశా"వంటూ ఇంద్రజిత్తును ముద్దులతో ముంచెత్తి పొగిడాడు. శత్రువులు మరణించారన్న వార్త భవనం అంతా పాకిపోయింది. ఇంద్రజిత్తు శిరస్సును ముద్దిడుకొని " నాయనా! నీవు వారిని ఎలా సంహరించివేశావో నాకు వివరంగా చెప్పు" అని రావణుడు అడిగాడు.

తన ప్రతాపాన్ని అంతా పూసగుచ్చినట్లుగా రావణునికి ఇంద్రజిత్తు చెప్పాడు. నాగపాశంతో బందీలు అయి పడిపోయారన్న వార్త తెలిసీ రావణుని మనస్సు ఆనందంతో ఊగిపోయింది. వారివలన చింతాక్రాంతమైన మనస్సు నుండి చింతనంతా చేత్తో తీసివేసినట్లుగా రావణుడు సంతోషించాడు. ఇక నాకు ఏ బాధా కలుగదు. నేను అనుమానపడినట్లుగా ఏమీ జరుగలేదు. ఆ రాముని పత్ని నాకు సొంతం అయినట్లే గదా అని మనసున రావణుడు అనుకొన్నాడు. ఆ సీత ఇంతవరకు నన్ను తృణీకరిస్తూ వస్తోంది. ఇక ఏ రాముని చూపించి నన్ను భయపెడుతుంది? రాముడు గీముడులేడని నేను జానకితో గర్వంగా చెప్పవచ్చు అనుకొన్నాడు. కానీ, రావణుని మనసులో సంతోషం అంతగా కలగడంలేదు. ఇంద్రజిత్తును పిలిచి మరీ రామలక్ష్మణుల గురించి పదేపదే అడిగి చెప్పించుకున్నాడు. తన తనయుడు చెప్తున్నంతసేపు ఆనందం కలుగుతున్నట్లే ఉంది. కాని, మనసు ఎందుకో సంతోషాన్ని ఇవ్వడం లేదు. జరిగింది నిజమేనా అనే సందేహం పట్టి పీడిస్తోంది.

నాగపాశబద్ధులను చేసేశానని ఇంద్రజిత్తు మహాదానందపడిపోతున్నాడు. "తండ్రీ! ఇక మనపై ఈగ కూడా వాలదు. ముల్లోకాలలో ఎవరు లంకవైపు కన్నెత్తి చూడరు" అంటూ తండ్రిని ఆనందించమని పదే పదే చెప్తున్నాడు.

* * *

# నాగపాశబద్ధులైన రామలక్ష్మణులు - సీత

## సర్గ - 47

ఇంద్రజిత్తు తన బాణ ధాటితో శ్రీరామలక్ష్మణులను నాగపాశ బంధితులను చేసి పడేశాడు. తన ప్రతాపాన్ని తండ్రి చెప్పాడు. నేలపై పడిపోయిన రామలక్ష్మణులను సుగ్రీవ హనుమదాదులందరూ చుట్టూ చేరి రక్షిస్తున్నారు. విభీషణుని ప్రోత్సాహంతో సుగ్రీవుడు రాక్షసులలో రణోత్సాహాన్ని నింపాడు. వారి అందరిని అప్రమత్తులై ఉండమని చెప్పాడు. వానరులందరూ గాలి కదలినా, ఆకు చప్పుడు వినపడినా రాక్షసుల పని ఏమోనని చాలా జాగ్రత్తగా పరిశీలించి చూస్తున్నారు.

రావణుడు సంతోషంగా ఇంద్రజిత్తును విశ్రాంతి తీసుకోమని చెప్పాడు. సీతాదేవిని రక్షిస్తూన్న రాక్షస స్త్రీలను తన దగ్గరికి పిలిపించాడు. రాజశాసనాన్ని పాటిస్తూ త్రిజటతోపాటు రాక్షస స్త్రీలు రావణుని దగ్గరకు వచ్చారు. ఇక తన ప్రతాపాన్ని వారితో సీతకు చెప్పించాలని ఉవ్విళ్లూరాడు. "భామినులారా! రామలక్ష్మణులు ఇంద్రజిత్తు చేతిలో హతులయ్యారు. సీతను ఇప్పుడే పుష్పక విమానంలో తీసుకెళ్లి యుద్ధరంగంలో పడిపోయి ఉన్న ఆ సోదరులను చూపించి తీసుకురండి" అని చెప్పాడు.

"ఆ జానకి ఇంతవరకు తన పతి, తన స్వామి అంటూ నన్ను తిరస్కరిస్తోంది. అందువలన నేడు ఆ పరమపదించిన వారిని చూచి ఆ వైదేహికి కళ్లు తెరిపించండి. ఇక వారిని మరిచిపోయి నన్నే తన భర్తగా అంగీకరించమని చెప్పండి. ఇక ఆ అతిలోక సుందరి సర్వాలంకార భూషితయై నా దరిచేరుతుంది. నా అదృష్టం

నన్ను వెదుక్కొంటూ వచ్చింది. నాపై కాలుదువ్విన నరులు నా కుమారుని చేతిలో మాడిపోయారు. ఈ సంతోష వార్తను సీతకు తెల్పి నా ముచ్చట తీర్చమని చెప్పండి" అంటూ వారిని వేగిరపరిచాడు.

దుర్మార్గుడైన రావణుని అత్యాశలను విని లోలోపల మధనపడుతూ రాక్షస స్త్రీలు అలానే చేస్తామని చెప్పి వచ్చారు. పుష్పక విమానం తెచ్చి పెట్టి అందులోకి సీతను చేర్చారు. వారందరూ కలిసి యుద్ధభూమికి వెళ్లారు.

రామలక్ష్మణులు ఇంద్రజిత్తు చేతిలో హతులయ్యారని రావణుడు దండోరా వేయించి లంక అంతా ప్రచారం చేశాడు. ధ్వజపతాకాలతో పూలతో రాజ్యాన్నంతా అలంకరింపజేశాడు.

సీతాదేవి త్రిజటాదులతోకలిసి వెళ్లి యుద్ధభూమిని అంతా పరికించి చూచింది. అక్కడ సంతోషంతో పొంగిపోయే రాక్షసులను చూచింది. దీనవదనాలతో దుఃఖిస్తున్న వానరులను చూచింది. నేలపై పడి ఉన్న నాగపాశ బద్ధులైన రామసోదరులను సీతాదేవి చూసింది. వారి అవయవాలు దెబ్బతిని ఉండడం; వారి చేతిలోని ధనుర్బాణాలు విడివిడిగా నేలపై పడి ఉండడం; వారి కవచాలు విరిగి ఉండడం చూసి సీత తట్టుకోలేక పెద్ద పెట్టున ఏడ్చింది. దేవతలను పోలిన ఆ రామలక్ష్మణులు నేలపై పడిపోయి ఉండటం చూచి సీత ఎంతగానో రోదించింది.

* * *

# త్రిజట ఓదార్పు

## సర్గ - 48

రామలక్ష్మణులు పడిపోవటం సీత తట్టుకోలేక పెద్దగా ఆక్రోశించింది. తనవల్లనే వారికి దుర్గతి కలిగిందని చింతించింది. జరిగిపోయిన సంగతులు తలచుకొంటూ విలపించింది. "నా హస్త సాముద్రిక లక్షణాలు చూసి దైవజ్ఞుడు పుత్రవతిని అవుతానని చెప్పారు. దీర్ఘసుమంగళిగా బ్రతుకుతానని చెప్పారు. నేడు నా గతి ఇలా అయ్యింది. దీనికి కారణం ఏమిటి? నావలన ఏ పొరపాటు జరిగిపోయిందో, కాలం ఎదురు తిరిగి మృత్యువై నన్ను కాటువేస్తోంది" అంటూ తన పురాకృత కర్మను తిట్టుకుంటూ విలపిస్తోంది.

"ఓ అంగనలారా! నన్ను చూసి అమ్మా! నీవు ధర్మాత్మురాలివి. నిన్ను పరాక్రమశాలి అగు మహారాజు చేపట్టుతాడు అని జ్యోతిష్కులు నాకు చెప్పారు. అవన్నీ అబద్ధాలేనా? నా పాదాలు చూసినవారు పద్మరేఖలను బట్టి నీవు మహారాజుకు భార్యవై పట్టాభిషేక వైభవాన్ని పొందుతావని కూడా చెప్పారు. అవి కూడా అన్నీ కల్లలైన మాటలుగానే ఉన్నాయి. ఏ లక్షణాలున్న స్త్రీలు వైధవ్యం పొందుతారని చెప్పుతారో అవి నాకు మచ్చుకైనా లేవు. అలాంటి నాకు నేడు ఇలాంటి గతి పట్టింది. దీనికి కారణభూతం ఏమై ఉంటుంది?

"స్త్రీల అరచేతిలో అరికాళ్ళతో పద్మాది రేఖలున్నచో వారికి సర్వశుభాలు కలుగుతాయని అంటారు. ఇది శాస్త్ర విషయం. దీనికి తిరుగు ఉండదు అని చెప్పారు. కాని, శ్రీరాముడు నేలపై పడి ఉండటం చూస్తే ఆ శాస్త్ర వచనం అనృతం అనిపిస్తోంది."

"నా కేశాలు సూక్ష్మంగాను, పొడవుగాను, పొట్టిగాను లేకుండా మితంగా ఉన్నాయి. కనుబొమ్మలు విడివిడిగా స్పష్టంగా ఉన్నాయి. పిక్కలు గుండ్రంగా ఉన్నాయి. వాటిపై వెంట్రుకలు లేవు. నా పలువరుస కూడా అతి పెద్దగా వికారంగాను లేదు ఎక్కడా సందులు లేవు. నేత్రాలు, నేత్రాల పైభాగం, చేతులు, పాదాలు, చీలమండలాలు, ఊరువులు అన్నీ సమప్రమాణంలోనే ఉన్నాయి. నా చేతివ్రేళ్లు, కాలివ్రేళ్లు అన్నీ సమానంగానే ఉన్నాయి. నా పాలిండ్లు గుండ్రంగాను చనుమొనలు గంభీరంగా ఉన్నాయి. నాభి లోతుగాను, పార్శ్వభాగాలు వక్షస్థలం పుష్టిగాను ఉంది. నా పాదాలు భూమిని సమతలంగా తాకుతున్నాయి ఇవన్నీ శుభ లక్షణాలే కదా!"

"నా చేతులు, కాళ్లు ఎర్రగా ఉంటూ కాంతితో ఉన్నాయి. నా ముఖప్రసన్నత, చిరునవ్వు చూసి దైవజ్ఞులు జ్యోతిష్కులందరూ ఈ కన్య పతితో పట్టాభిషిక్తురాలు అవుతుందని చెప్పారు. వారి మాటలన్నీ నేడు నీటి మూటలయ్యాయి. నా గతి అధోగతి అయిపోయింది."

"పాపం, ఆ రాకుమారులిద్దరు నా కోసం దండకారణ్యం అంతా గాలించారు. సముద్రంపై సేతువును నిర్మించారు. అపార సేనావాహినిని సమాయత్తపరిచారు. ఈ దుష్ట దుర్మార్గ రావణునిపై ధ్వజం ఎత్తి నిలిచారు. అటువంటి మహాత్ములు నేడు గోష్పాదమంత సైన్యంతో మాయలమంత్రగాని చేతిలో సంహరించబడడం ఏమిటి?" అని సీతమ్మ దీర్ఘాలోచనతో పాత సంగతులన్నింటిని నెమరువేసుకొంటోంది. ఆమెను రాక్షస స్త్రీలు విచారంగా చూస్తున్నారు. నాగపాశబద్ధులైన రామలక్ష్మణులను చూచిన సీత బోరుమని విలపిస్తోంది. తనవలన ఘోరం జరిగి పోయిందని, అక్కడున్న రాక్షస భామినులకు చెప్తూ రోదిస్తోంది. "ఈ రఘువీరులు విశ్వామిత్రుని వద్ద ఎన్నో అస్త్రశస్త్ర విద్యలు నేర్చుకున్నారు. వారుణం, ఆగ్నేయం, ఐంద్రం, వాయవ్యం, బ్రహ్మశిరం, అమోఘాస్త్రం లాంటివి ప్రయోగించడానికి సమర్థులైన వీరులు వారు. మరి అవన్నీ వారు ఎందుకు ప్రయోగించలేదో? శత్రువు ఎంతటి వీరుడైనా శ్రీరాముని కంటబడినచో వాడు యమపురికి వెళ్ళటం లేక రామశరణార్థి కావటం ఈ రెండింటిలో ఏదో ఒక్కటి జరుగుతుంది. మరి నేడు ఆ వీరాధివీరులు నేలపై పడి ఉండటం నేను నమ్మలేక ఉన్నాను."

"ఈ ఇంద్రజిత్తు మాయా రూపంలో ఉండి, నా రామ లక్ష్మణులను నిహతులను చేయడం నాకు నమ్మబుద్ధి కావడంలేదు. ఈ రామలక్ష్మణులు ఇంతవరకు దేనికోసం చింతించడం నేను చూడలేదు. మా అత్తగారు మహా తపస్విని. వీరి మరణం తెలుసుకొంటే ఆమె ఏమౌతుందో అనే చింత నాకు ఎక్కువగా ఉంది. వనవాసం ముగించుకొని సతి సోదరులతో కలిసి నా చిన్నారి తనయుడు ఏనాడు వచ్చునో అని ఆ తల్లి నిరంతరం ఎదురుచూస్తుంటుంది. అటువంటి ఆ మహాతల్లి ఎంతగా రోదిస్తుందో గదా!" ఇలా పరితపిస్తున్న సీతను వారించుతూ "అమ్మా మీ పెనిమిటి, మరిది ఇద్దరూ జీవించే ఉన్నారు. వారి ప్రాణాలు ఎక్కడకూ పోలేదు. వారు ప్రాణాలుతో ఉన్నారని మీరు నమ్మడానికి నేను చెప్పేది విను తల్లీ" అంటూ త్రిజట సీతను ఊరడించింది.

"అమ్మా! వారు మరణించే ఉంటే వానరసేనలో కోపోద్రిక్తత నిండి ఉండేది. అది అక్కడ కనిపించడంలేదు. వైదేహీ! ఈ పుష్పక విమానం భర్తను కోల్పోయిన స్త్రీని తీసుకొనిరాదు. మీరు ఈ విమానంలోనే వచ్చినందువల్ల నీ భర్త సజీవుడే అన్నదానికి నిదర్శనం. యుద్ధంలో నీ పతి ప్రాణాలు పోయి ఉంటే, వానరసేన అంతా ఛిన్నాభిన్నం అయి తలోదిక్కు పోయేవారు. అలాంటి చిహ్నాలు ఏవీ అక్కడ కనిపించలేదు కదా. పైగా వానరులందరూ ఆ

సోదరులను రక్షిస్తున్నారు. కాబట్టి, వారి ప్రాణాలకు వచ్చిన ఆపద ఏమీ లేదు. సీతాదేవీ! మీరు దుఃఖాన్ని వదిలి ధైర్యంగా ఉండండి. దేవీ! వారు సజీవులయ్యే ఉన్నారు, అని నేను చెప్పే మాట యథార్థం. నేను ఎప్పుడూ అబద్ధం చెప్పలేదు. ఇకమీద కూడా అబద్ధం చెప్పను. మీ స్త్రీ ధర్మం, నిష్కళంకమైన మీ స్వభావం నా మనస్సును ఆకట్టుకొన్నాయి. అమ్మా!ఇంద్రాది దేవతలు కాని, రాక్షసులుకాని మీ భర్తను జయింపలేరు. నా స్వప్నాన్నిబట్టి, వానరుల ముఖ ప్రసన్నతను బట్టి నేను నిజమే చెప్తున్నాను. మీ రామలక్ష్మణులు నిస్సంశయంగా సజీవులు అయి ఉన్నారు. ఇందులో లేశమాత్రం కూడా సంశయం లేదు. అమ్మా సీతమ్మ తల్లీ! ఇంకో విషయం మీరు గమనించారా? వారు మూర్ఛిల్లి ఉన్నా, వారి ముఖంలోని తేజస్సులో ఎట్టి మార్పు లేదు. జవసత్వాలు ఉడిగి ప్రాణం లేనివారి ముఖం కళావిహీనం అయ్యి ఉంటుంది. కానీ, అలాంటి లక్షణాలు ఆ సోదరుల విషయంలో ఏవీ కనిపించడం లేదు."

త్రిజట చెప్పిన మాటలు విని సీత మనస్సు కాస్త ఊరడిల్లింది. "అమ్మా త్రిజటా! నీ మాటలే సత్యాలు కావాలి. నా రాముడు సజీవుడై ఉండాలి. నా మరిది లక్ష్మణస్వామి, అన్నకు కుడిభుజంగా ఎప్పుడూ అనుసరిస్తూ సంతోషంగా ఉండాలి. వారివురిని కాపాడమని సమస్త దేవతలను ప్రార్థిస్తూ తిరిగి పుష్పక విమానంలో సీత అశోక వనంలోకి వెళ్లింది. తిరిగి అశోక వృక్షం క్రింద చేరి తన మనఃఫలకంలో ప్రతిష్ఠించి ఉన్న రామలక్ష్మణులను చూస్తూ వారి గురించే ఆలోచిస్తూ ఉంది.

* * *

# రాముడు స్పృహనుండి తేరుకొనటం

## సర్గ - 49

**నా**గాస్త్రాలతో బంధితులైన రామలక్ష్మణుల చుట్టూ వానరులు దుఃఖమగ్నులై ఉన్నారు. పరాక్రమశాలి బలశాలి ఐన రాముడు స్పృహలోకి వచ్చాడు. తన ప్రక్కనే బాణపు దెబ్బలతో స్పృహ తప్పి ఉన్న లక్ష్మణుని చూసి ఎంతో బాధకు లోనయ్యాడు. "అయ్యో! నా తమ్ముడు నాతోపాటు అరణ్యాలకు వచ్చి నా కోసమే జీవిస్తూన్న లక్ష్మణుడు నేడు ఇలా నేల మీద స్పృహ లేకుండా పడిపోయాడే?

సౌమిత్రి లేకపోతే ఇక నేను సీతను పొంది లాభం ఏముంటుంది? అంతేగాక నేను బతికి ఉండడంలో కూడా అర్థం ఏదీ ఉండదు. **ఈ లోకంలో దేనినైనా పొందవచ్చు. చివరకు ఒక భార్య పోయినా మరల ఇంకొక భార్యను పొందే వీలుంటుంది. కాని, ప్రాణాన్నిచ్చే తమ్ముడు, ధర్మంకోసం నిలబడే తమ్ముణ్ణి పొందడం మాత్రం దుర్లభం.** నేను అయోధ్యకు తిరిగి వెళ్ళితే నన్ను ఆహ్వానించటానికి వచ్చే నా తల్లి సుమిత్రాదేవి కన్నులు తన కన్న కొడుకును చూడాలన్న ఆత్రంతో వెదుకుతాయి కదా. ఎక్కడ నా చిన్నవాడు నీతోనే నీ కోసమే వచ్చాడు కదా. నా చిట్టి తండ్రి లక్ష్మణుడు ఏడీ? అని సుమిత్రా దేవి నన్ను అడిగితే నేను ఏమని సమాధానం చెప్పేది? లక్ష్మణుడు

రావణుని యుద్ధంలో ప్రాణాలు పోగొట్టుకొన్నాడని నేను ఎలా సమాధానం ఇవ్వను? ఒకవేళ జవాబు వింటే ఆ తల్లి జీవించగలదా? గోరువంకలా నేలకొరిగిపోదా? అసలే భర్తను పోగొట్టుకొని అలమటించే ఆ సౌజన్యమూర్తి నేడు తన కుమారుడు చనిపోయాడని అంటే ఆమె ప్రాణాలతో నిలవలేదు. సుమిత్రాదేవి దుఃఖం కౌసల్యాదులను బాధిస్తుంది కదా! తమ్ముణ్ణి పోగొట్టుకొని తిరిగి వచ్చిన నన్ను భరతాదులు క్షమించగలరా? వారు సౌమిత్రి ఇక కనిపించడన్న వార్తతో హతాశులు అవుతారు కదా. అయ్యో! నేడు ఎలాంటి విషమ స్థితి వచ్చింది. ఇప్పుడు నేను ఏం చేయాలి?

అయ్యో! నేను ఈ చిన్నవాణ్ణి అడవులకు తీసుకువచ్చి గొప్ప తప్పిదం చేశాను. నేడు నా వలనే రణభూమిలో విగతజీవుడై లక్ష్మణుడు పడిపోయాడు. నేను చాలా దురదృష్టవంతుణ్ణి. నాడు నా చేతికి చిక్కిన రాజ్యం తృటిలో చేజారిపోయింది. నా తండ్రి నానుంచి దూరతీరాలకు పయనమై వెళ్ళాడు. నన్ను అమితంగా ప్రేమించిన నా తల్లి కైక నన్ను 14 ఏండ్లు వనవాసం చేయమని చెప్పింది. అలా నా తల్లులకు తమ్ముళ్ళకు దూరం అయిన నన్ను ఈ సౌమిత్రి ఆ బాధలనుంచి ఉపశమింపజేస్తూ నీడలాగా నా చెంతే నిలిచాడు. తండ్రి దుఃఖాన్ని కూడా నేను మరచిపోయేంతగా నన్ను లాలించాడు. అలాంటి నా చిన్నారి తమ్ముడు, ప్రాణానికన్నా అధికమైన సోదరుడు, కన్నులు మూసి పడి ఉన్నాడే నేను ఏమి చేయగలను? శత్రువులను నిర్జించే శక్తి ఉన్న వీరుడివే. నీవే ఈనాడు నేలపై పడి ఉన్నావు. నాకు దిక్కు ఎవరు లక్ష్మణా" అంటూ శ్రీరాముడు పెద్దగా రోదించాడు.

శ్రీరాముడు మేల్కాంచడం, స్పృహనుంచి కోలుకోవడం చూచి, వానరులు సంతోషిస్తూ లక్ష్మణునికోసం దుఃఖిస్తున్న రాముని చూసి దిగులు చెందారు.

"అయ్యో! రక్తసిక్తమైన దేహం బాణాల దెబ్బలతో బంగారు మేనిచ్ఛాయ రక్తపు వర్ణాన్ని పులుముకొంది. ఈ అరుణం లక్ష్మణుని బాధను తెలుపుతోంది. ఇక లక్ష్మణుడు లేని ఈ జీవితం నాకు అక్కరలేదు. నేనును సౌమిత్రితో కలిసి పరలోక యాత్ర ప్రారంభిస్తాను" అంటూ దేహంపై శ్రీరాముడు అనాసక్తి చూపాడు.

"సుగ్రీవా! ఈ లక్ష్మణుడు అద్వితీయ పోరాట పటిమ ఉన్నవాడు. క్షణంలో తీవ్ర వేగంతో పోగల 500 బాణాలు వేయగల సమర్థుడు. కార్తవీర్యార్జునుని కంటే సౌమిత్రి వేగంగా శత్రు బాణాలను నిర్జించగలడు. యుద్ధంలో ఇంద్రుని అస్త్రాలను నిరోధించే వీరుడు. నేను చేసిన పొరపాటువలన నేడు ప్రాణాలను పోగొట్టుకొన్నాడు. కేవలం నా తప్పిదంవలననే హంసతూలికా తల్పంపై శయనించే సుకుమార శరీరుడు నేడు ఈ భూమిపైన రక్తాస్తరణుడై పడి ఉన్నాడు.

నేను ఈ విభీషణుని లంకా రాజును చేస్తానని మాట ఇచ్చి ఉన్నాను. అది ఇంకనూ పూర్తికాలేదు. నా మాటలు అసత్యాలయ్యాయి. ఆ అసత్యాలు నన్ను వేదనకు గురి చేస్తున్నాయి. కపిరాజా! ఇక నేను ప్రాణాలు వదిలివేయడం నిశ్చయం. లేకపోతే నన్ను బలహీనునిగా తలచి ఈ రావణుడు నన్ను తరిమికొట్టుతాడు. ఇక నీవు నీ సేనను తీసుకొని వెనక్కు మరలిపో. అంగదుని నాయకత్వంలో మహామహులను కూడా తీసుకొని సాగరం దాటి కిష్కింధకు మరలిపోండి.

రణరంగంలో వీరవిహారం చేసిన హనుమంతుడు, మైందుడు, ద్వివిదుడు, జాంబవంతుడు, గవాక్షుని చర్యలను నేను ఏనాడూ మరచిపోలేను. వారి వీరత్వంతో నేను ఎంతో సంతృప్తి పొందాను. వారు చేసిన యుద్ధం నిరుపమానం అయ్యింది. మీరందరూ నా కోసం ప్రాణాలకు తెగించి పోరాడారు. మిమ్ములను మీరు చేసిన కార్యానికి నేను ఎంతో ఋణపడి ఉన్నాను.

సుగ్రీవా! విధి నిర్ణయాన్ని ఎవరూ తప్పించుకోలేరు గదా. ధర్మనందనుడివైన నీవు నాకు మహోపకారం చేశావు. నీ సహాయం ఎనలేనిది. ఇక మీరు ఈ యుద్ధాన్ని వదిలేసి ఇక్కడనుంచి మీరు నచ్చిన ప్రదేశానికి వెళ్లిపోండి" అని చింతలో కూరుకొనిపోయి శ్రీరాముడు వానరులకు చెప్పాడు. శ్రీరాముని వచనాలు వానరుల కళ్ళనుండి అశ్రు కణాలను జారవిడిచేలా చేశాయి. వారందరూ దుఃఖంలో మునిగారు. గదాపాణియైన విభీషణుడు వానరసేనను సమాయత్తపరిచి రాముని దగ్గరకు గబగబా వస్తున్నాడు. ఆ వచ్చే విభీషణుడు ఇంద్రజిత్తు అనుకొని వానరులు పారిపోసాగారు.

* * *

# నాగపాశం నుండి విడివడటం

## సర్గ - 50

విభీషణుని చూస్తూ ఇంద్రజిత్తు వస్తున్నాడనే భ్రమతో వానరులందరూ పారిపోసాగారు. అలా పారిపోతున్న వానరులను చూచి విభీషణుడు జరిగింది ఏమిటా అన్న ఆలోచనతో ముందుకు సాగి వెళ్లి సుగ్రీవునకు రామునకు జయము పలికి అభివాదం చేశాడు. "సుగ్రీవా! ఈ వానరులు నన్ను చూచి పారిపోతున్నారేమి?" అని అడిగాడు. సుగ్రీవుడు వారిని చూచి వెంటనే జాంబవంతుని పిలిచి, ఈ పారిపోయే వానరులను వెంటనే ఆపండి. వెళ్ళేవారి ముఖంలో ఏ విధమైన దుఃఖపు నీడలు లేవు. కాని, ఒకరినొకరు లాక్కొంటూ వేగంగా క్రిందపడి ఉండేవారిని దాటుకుంటూ పరుగెత్తుతున్నారు. వీరందరూ ఈ వచ్చినది ఇంద్రజిత్తు అనే భ్రమకు లోనయ్యారు. వీరిని ఆపు. ఇక్కడకు వచ్చినది మహారాజు విభీషణుడని వారికి చెప్పు" అని సుగ్రీవుడు జాంబవంతునితో చెప్పి పంపించాడు.

అంగదుడు "విభీషణా! ఈ రాక్షసులు దుష్టబుద్ధితో మన ప్రభువులు నాగపాశ బద్ధులై పడిపోయారు. వీరి దేహం బాణాలు గాయాలతో బాగా దెబ్బతింది" అని చెప్పాడు. సుగ్రీవుడు వారిని చూచి బాధపడి చల్లని నీటితో ఆ రామలక్ష్మణుల ముఖం తుడిచాడు.

వీరిద్దరు అత్యంత బలపరాక్రమం ఉన్నవారు. ఋజువర్తనులు. వీరిని దుష్టబుద్ధి ఉన్న మాయావి ఇంద్రజిత్తు తన మాయాజాలంతో స్పృహ తప్పించాడు. నా అన్న కొడుకు వలనే వీరికి ఈ స్థితి దాపురించింది. సత్యపరాక్రమాలున్న వీరిని ఇంద్రజిత్తు వంచించాడు. ఇంద్రజిత్తు వలనే రామలక్ష్మణులు బాణపు దెబ్బలతో రక్తసిక్తం అయిన శరీరంతో నేలపై పడి ఉన్నారు. ధర్మాత్ములైన వీరిని నేను మహాత్ములుగా గుర్తించాను. అందువలనే వీరిని శరణుగోరి ఇక్కడే

ఉన్నాను. ఈ పురుషశ్రేష్ఠులిద్దరూ ప్రాణాపాయస్థితిలో పడిపోయారు. ఇక నాలో లంకపై నా ఆశలు అణగారిపోయాయి. ఈ ఆపదలవలన నేను బ్రతికి ఉండి ప్రయోజనం లేకుండా పోతుంది. అధర్మ ప్రవర్తనుడైన రావణుడు నా పరమ శత్రువు.

కాని, నేడు అధర్మమే చేసే రావణుని కోరిక తీరినట్లుగా ఉంది. నేను ధర్మచింతనతో రామునకు సీతను అప్పగించమని ఎన్నోసార్లు రావణునికి చెప్పాను. కాని, ఆ దుష్టబుద్ధి నా మాటను పెడచెవిని పెట్టాడు. కాని, నేడు వాని కోరిక తీరబోతోంది. ఏదిఏమైనా సీతాదేవిని వదిలిపెట్టను అని చెప్పే ఆ రావణుడు తను చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చుకొనేలాగా పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇదంతా నేను జీర్ణం చేసుకోలేకపోతున్నాను" అంటూ విభీషణుడు విలపించాడు. అలా విలపించే విభీషణుని సుగ్రీవుడు అక్కున చేర్చుకున్నాడు. "మిత్రమా! వీరు స్పృహ తప్పారు కాని, ప్రాణాలు పోగొట్టుకోలేదు. అయినా రాముని ప్రాణ మిత్రుడైన నేను సజీవంగానే ఉన్నాను. స్నేహధర్మాన్ని అనుసరించి నేను నా ప్రాణతుల్యుడు చేసిన ప్రతిజ్ఞ నేను నెరవేరుస్తాను. నీవు దిగులుచెందాల్సిన అవసరం ఏమీ లేదు. వీరు త్వరలోనే మూర్ఛనుండి తేరుకొని తప్పకుండా రాక్షసులను సమూలంగా నాశనం చేస్తారు" అని చెప్పాడు.

"తన మామ అయిన సుషేణునితో సుగ్రీవుడు రామలక్ష్మణులను కిష్కింధకు తీసుకొని వెళ్లండి. వీరిద్దరిని జాగ్రత్తగా చూడండి. వీరు త్వరగా కోలుకునేటట్లుగా చూడండి. నేను ఒక్కనినే ఇక్కడ ఉండి ఈ దుష్టుడిని దునుమాడి తీరుతాను. రావణుని బంధు మిత్ర పుత్ర సపరివారంగా అంతం చేసి సీతమ్మ తల్లిని తీసుకొని వస్తాను. నేను వచ్చేదాకా వీరిద్దరిని కాపాడండి" అంటూ సుషేణునితో సుగ్రీవుడు చెప్పాడు. ఈ మాటలు విన్న విభీషణుడు "వానరరాజా! నేను ఇంతకుముందు దేవాసుర సంగ్రామం గురించి విని ఉన్నాను. ఆనాడు రాక్షసులు కపటోపాయాలతో దేవతలతో యుద్ధం చేసి వారిని బాధించేవారు. రాక్షసులు కుటిలురు. వారి కుటిల పన్నాగాలతో ఎందరో దేవతలను పరాక్రమహీనులుగాను, ప్రాణాలను పోగొట్టేటట్లుగా చేసేవారు. కాని, రాక్షసులకు ఎప్పుడు విజయం దక్కలేదు. గాయపడినవారిని దేవతలను గురువు రక్షించేవారని నాకు తెలుసు" అంటూ విభీషణుడు తనకు తెలిసిందాన్ని చెప్తున్నాడు.

"అంతేకాదు సుగ్రీవా! దేవతలకు గురువు ఐన బృహస్పతి అసువులు బాసిన దేవతలను మృతసంజీవిని విద్యతో బతికించేవాడు. మంత్రబలం చేత పరాక్రమవంతులుగా చేసేవాడు.

ఆ బృహస్పతికి సహాయం చేయడానికి పక్షులు, వానరులు ఉండేవారు. సంపాతి పక్షిరాజు. ఆయన బృహస్పతి చెప్పినట్లుగా మహౌషధులు ఐన సంజీవకరణిని, విశల్యకరణిని తీసుకొచ్చి నిహతులైన దేవతలను పునర్జీవితులను చేసేవారు. వానరులు పక్షులు వాయువేగంతో ఔషధులున్న పర్వతాలకు వెళ్ళి ఆ ఔషధులను తీసుకొచ్చి దేవతలను కాపాడేవారు. క్షీర సాగర మధనం తర్వాత దేవతలందరూ కూడబలుక్కొని చంద్రగిరి, ద్రోణాద్రి అనే ఔషధాలున్న పర్వతాలను క్షీరసాగర తీరంలోని కొండలపై ఉంచారు. అక్కడకు వెళ్లి ఆ సంజీవకరణిని తీసుకొచ్చి వీరులకు తిరిగి స్పృహ తెప్పించవచ్చు. ఈ పనికి వాయువేగగమనుడైన హనుమంతుని పంపించుదాం" అని విభీషణుడు సుగ్రీవాదులతో చెప్పుతున్నాడు.

ఇంతలో పెద్దగా గాలివీచింది. ఆ వాయువేగానికి మెరుపులతో కూడిన మేఘాలు చెల్లాచెదరు అయిపోయాయి. సాగరంలో జలాలు అల్లకల్లోలం అయ్యాయి. పర్వతాలు, భూమి అంతా కంపించిపోయింది. వృక్షాలు వేర్లతో సహా బయటకు వచ్చి నేలపై పడిపోతున్నాయి. లంకాద్వీపంలో ఉన్న సర్పాలన్నీ భయంతో పారిపోతున్నాయి. జల జంతువులు స్థాణువులై సముద్ర గర్భానికి చేరుతున్నాయి.

అలాంటి స్థితిలో మహాబలశాలి వినతాసుతుడు గరుత్మంతుడు వచ్చాడు. ఆయన అగ్నిలాగా తేజోమూర్తిగా వానరులకు కనిపించాడు. సత్పురుషులైన రామలక్ష్మణులను అప్పటివరకు అస్త్రరూపంలో బంధించి ఉన్న సర్పాలన్నీ దూరంగా పారిపోయాయి. గరుత్మంతుని చూడగానే ఆ సర్పాలన్నీ భీతితో నలు దిక్కులా పారిపోయాయి.

గరుత్మంతుడు రామలక్ష్మణులకు జయజయధ్వానాలు చేశాడు. వారిని అభినందించాడు. చంద్రకాంతిలాగా ఆహ్లాదకరంగా ఉన్న రామలక్ష్మణుల ముఖాలను గరుత్మంతుడు తన చేతితో నిమిరాడు. వారి శరీరాన్నంతా స్పృశించాడు. దాంతో రామలక్ష్మణుల శరీరాలపై ఉన్న గాయాలన్నీ మటుమాయం అయ్యాయి. ఆయన కరస్పర్శతో దివ్య శరీర కాంతి వారికి వచ్చింది. శరీరం అంతా నునుపు తేలి వారి కాంతి ద్విగుణీకృతం అయ్యింది. వారి తేజస్సు, బలపరాక్రమాలు ఇనుమడించాయి. అద్భుత కార్యోత్సాహం వారిలో పెరిగింది. దృష్టి శక్తి, సూక్ష్మబుద్ధి, పరిజ్ఞానం వేగం, జ్ఞానశక్తి వారిలో వృద్ధి అయ్యాయి.

గరుత్మంతుడు రామలక్ష్మణులను లేవనెత్తి తన అక్కున చేర్చుకొని ఎంతోసంతోషించాడు. ఈ పరిణామానికి వారూ సంతోషించారు. రాముడు ప్రసన్న వదనంతో "మహాత్మా! మీ వలన నేడు ఇంద్రజిత్తు మాయనుండి మేమిరువురు బయటకు రాగలిగాం. మేము ఇంతకుముందున్న జవసత్వాలను తిరిగి పొందాం. మిమ్మల్ని చూసి మా తండ్రిని చూసినట్లుగా ఆనందించుతున్నాం. మీ రూపం అపురూపంగా కనిపిస్తోంది. మీ ఎదుట మేం ఎంతో ఆనందాన్ని అనుభవిస్తున్నట్లుగా ఉంది.

మీరు ధరించిన పూలమాలలు, మీరు అలదుకొన్న గంధాలు, నిర్మలమైన మీ వస్త్రాలు, మీ దివ్యాభరణాలు అన్నీ మమ్ములను ఆశ్చర్యచకితులను చేస్తున్నాయి. ఇంతకీ మహాత్ములైన మీరు ఎవరు? ఎందుకు వచ్చారు?" అంటూ రాముడు వైనతేయుని అడిగాడు.

పక్షిరాజు ఐన వైనతేయుడు రాముని పలుకులకు ఎంతో ఆనందించాడు. హర్షోల్లాసంతో "రామా! నేను మీ ప్రియమిత్రుడను. మీ బహిఃప్రాణమైన నేను గరుత్మంతుడను. మీరిరువురి సంగతి తెలిసి నేను త్వరత్వరగా వచ్చాను. క్రూరకర్ముడైన ఇంద్రజిత్తు తన మాయాబలంతో సత్పురుషులైన మిమ్ములను నాగబంధితులను చేశాడు. వీటిని విడిపించుకోవటానికి దేవతలకుగాని, ఎంతో బలశాలురకుగాని వీలుకాదు.

ఈ మహా సర్పాల యొక్క కోరల విషం చాలా భయంకరం. సత్యపరాక్రమ వంతుడవైన రామా! మీరు మీ తమ్ముడు రాక్షసులను చంపటంలో దిట్టలు. మీరు చాలా అదృష్టవంతులు. అందుకే భయంకరమైన నాగబంధం నుంచి విముక్తులయ్యారు. మీరిద్దరు ఇకమీద చాలా జాగ్రత్తగా ఉండాలి. కదనరంగంలో కపటోపాయాలతో విజయం సాధించడం రాక్షసులకు వెన్నతోపెట్టిన విద్య. ఇది వారి సహజ స్వభావమే.

సత్యవంతులు అరివీర పరాక్రమాలు ఐన మీరు సరళస్వభావులుగా ఉండడం మీ నైజం. కాని, రాక్షసులతో యుద్ధాలు చేసేటపుడు మీరు చాలా జాగ్రత్తగా ఏమరుపాటు అనేది లేకుండా ఉండాలి. మీ ఋజువర్తనమే మీకు బలమై మిమ్ములను కాపాడుతుంది. రాక్షసులు మాయలు పన్నుతారనడానికి ఈ ఇంద్రజిత్తే నిదర్శనం. శ్రీరామా! ఈ రాక్షసులు వారి ప్రవృత్తిని అనుసరించి పరులకు అపకారాన్నే చేస్తుంటారు. దానిగురించే వారు నిరంతరం ఆలోచిస్తుంటారు. ఎవరిని పడదోయాలా ఎంతమందికి బాధ కలిగించగలమా అని చింతిస్తుంటారు. మీరు రాక్షసులు ఈ పని చేయరు అని తలచనే వద్దు. వారిని ఎప్పటికప్పుడు అప్రమత్తతతో కనిపెట్టి యుద్ధంచేయాల్సి ఉంటుంది. మీరందరూ అతి జాగ్రత్తలు తీసుకొంటూ పోరు సల్పండి. కానీ, మీరు శత్రువులను సైతం కరుణించే స్వభావులు. ఇక నాకు సెలవు ఇప్పించండి" అని వైనతేయుడు అడిగాడు. "రామా మరొక్క విషయం, నేను ఏ విధంగా మీకు మిత్రుడనని మీరు అనవసరంగా ఆలోచించకండి. ఆ విషయంపైన కుతూహలం చూపించకండి. రాక్షసులతో యుద్ధం అయిపోయిన తర్వాత సీతను పొంది విజయుడవైనప్పుడు నా మిత్రత్వం, నేను ఎవ్వరు అనే విషయాలు మీకు అర్థం అవుతాయి. వానరులు మీరు కలసి లంకేశ్వరుని మట్టిపాలుచేయండి. దానిపైనే శ్రద్ధపెట్టండి. మీరు సముద్రమంతటి లంకలో స్త్రీలు వృద్ధులు బాలురను విడిచి అందరినీ సంహారం చేయండి. మీ బద్ధశత్రువును రావణుని సంహరించి, మీరు సీతాదేవిని చేపట్టి తీరుతారు. ఇది అక్షరసత్యం! నేను చెప్పేదే జరిగితీరుతుంది." ఇలా పక్షీంద్రుడు చెప్పి రామునకు నమస్కారం చేసి ఆయన అనుమతితో స్వస్థానానికి వెళ్లిపోయాడు. స్వస్థులైన రామలక్ష్మణులను చూచి వానరులందరూ చాలా సంతోషించారు. సింహనాదాలు, గర్జనలు చేశారు. ఆనందంతో వానరులు దుమికారు. ఆకాశమంత ఎత్తుకు ఎగిరారు. నాగబంధం నుంచి విడివడిన రఘువీరులను చూసి వానరుల ఆనందానికి అవధి లేకుండాపోయింది. పదే పదే భుజాలు చరుస్తూ, తొడలు కొడుతూ, వృక్షాలను విసిరేస్తూ ఆనందాన్ని ప్రకటించారు. వానరుల ఆనంద గ్రీష్మాంతాన వచ్చే మేఘగర్జనలాగా కనిపించింది. వారి ఆనందం చూసి రాక్షసులు భయపడ్డారు. వానరుల ఆనందానికి మేరలేకుండా పోయింది. రామలక్ష్మణులు లేవడంతో సుగ్రీవాదులకు మనకు జయం తప్పక కలుగుతుంది అనే నమ్మకం కలిగింది. రామలక్ష్మణులిద్దరూ గాయాలన్నీ మాని ద్విగుణీకృతమైన బలంతో ఉండడం వానరులలో సంతోషం కలిగించింది. వారందరూ సింహనాదం చేయసాగారు.

* * *

# ధూమ్రాక్షుడి యుద్ధభేరి

## సర్గ – 51

**వా**నరుల మహానాదం రాక్షసులతోపాటు రావణుడు విన్నాడు. సంతోషంతో చేస్తున్న మహానాదం విని వానరులు దుఃఖించాల్సిన సమయంలో గర్జన చేస్తున్నారు. "దీనికి కారణం ఏమై ఉంటుందా? అని ఆలోచించాడు. తన దగ్గర ఉన్న మంత్రులతో దూతలతో ఈ విషయం చర్చించాడు. రామలక్ష్మణులను చూచి తోకముడిచి

పారిపోవాల్సిన వానరులు తోక ఝాడించి గర్జన చేస్తున్నారే? ఇది తప్పకుండా వారికి ఏదో సంతోషం కలిగించే విషయం అయి ఉంటుంది. మీరు వెళ్లి వారి సంతోష కారణాన్ని తెలుసుకొని రండి!" అని రావణుడు పంపించాడు.

రావణుని ఆజ్ఞ ప్రకారం రాక్షసులు గబగబా మేడల పైభాగానికి చేరారు. నాగాస్త్రాలలో బంధితులైన రామలక్ష్మణులు ఆ బంధం నుంచి విముక్తులై లేచి ఉండడం వారు చూశారు. పాశాలను ఛేదించుకొన్న మదపు టేనుగుల్లా రామలక్ష్మణులు ఉత్సాహంతో నిలబడటం రాక్షసులకు ఆశ్చర్యాన్ని కలిగించింది. అందుకే వారు గబగబా వెళ్లి రావణునితో ఆశ్చర్యకరమైన విషయం చెప్పారు.

రావణుడు ఒక నిమిషం పాటు విస్మయానందానికి గురి అయ్యాడు. మరు నిముషం ఆయనలో చింత మొదలైంది. అత్యంత బలవంతమైన అస్త్రాలనుండి విడివడిన రామలక్ష్మణులు నిజంగా నన్ను బాధించేవారే అనుకొన్నాడు. దేవాసుర సంగ్రామంలోను ఇంకా చాలా యుద్ధాలతో ఈ అస్త్రాలవలన విజయం పొందాం కదా. నేడు ఎందుకు అస్త్రాలు కొరగాకుండా పోయాయని రావణుడు చింతించాడు.

దైవవరం వలన పొందిన ఇంద్రజిత్తు నాగాస్త్రాలు చాలా బలోపేతమైనవి. అలాంటి అస్త్రాలు నేడు వ్యర్థం ఎలా అయ్యాయని మంత్రులతో ఆలోచించాడు. ఇక యుద్ధం తప్పనిసరి అనుకొన్నాడు. ధూమ్రాక్షుని పిలిచాడు. "తిరుగులేని పరాక్రమం ఉన్న వీరా! నీవే వెళ్లి రామలక్ష్మణులతో సహా సమస్త వానర సైన్యాన్ని మట్టుపెట్టిరా" అని చెప్పాడు.

రావణుని మాటలతో ఉత్సాహం పొంది ధూమ్రాక్షుడు సర్వసైన్యంతో యుద్ధానికి బయలుదేరుతానన్నాడు. ధూమ్రాక్షుని సేనాధిపతి వెంటనే సేనను సమీకరించాడు. మరలా యుద్ధవార్తను విన్న నిశాచరులు ఆనందంగా గదలు, ఈటెలు, గండ్రగొడ్డళ్లు పట్టుకొని చేతులలో గంటలు పట్టుకొని మహానాదం చేస్తూ ధూమ్రాక్షుని దగ్గరకు వచ్చారు. వారి గర్జన దిక్కులు పిక్కటిల్లేటట్లుగా ఉంది.

కొందరు యోధులు కవచాలు ధరించారు. అలంకరించిన రథాలను అధిరోహించారు. ధ్వజాలు ఎగురవేశారు. మరికొందరు గాడిదలు ఎక్కారు. కొందరు గజాల మీద ఇంకాకొందరు అశ్వాల మీద వారి వారి ఆయుధాలను పట్టుకొని కదనరంగానికి బయలుదేరారు. వారందరూ పెద్దపులుల్లాగా శత్రువులు ఎదిరించడానికి శక్యం కాకుండా ఉన్నారు.

ధూమ్రాక్షుడు దివ్యమైన రథాన్ని ఎక్కాడు. దానికి తోడేలు, సింహం లాంటి ముఖాలున్న గాడిదలు పూన్చారు. బంగారు ఆభరణాలతో అలంకరించారు. రాక్షస యోధులందరిని వెంటబెట్టుకొని లంకానగరపు పశ్చిమ ద్వారాన్ని చేరాడు. కాని ధూమ్రాక్షునకు అన్ని అపశకునాలు ఎదురు అయ్యాయి.

ఆ పశ్చిమ ద్వారాన్ని ఆక్రమించడానికి హనుమంతుడు సర్వసన్నద్ధుడై నిలబడి ఉన్నాడు. ధూమ్రాక్షుని దివ్యరథం సాగుతుండగా ఆకాశం నుంచి ఒక గ్రద్ద రివ్వున వచ్చి ఆ రథం అగ్రభాగంలో నిలిచింది. పక్షులన్నీ అతన్ని చుట్టుముట్టాయి. రాబందులు ధ్వజాగ్రభాగాన గుంపులు గుంపులుగా చేరి అరుస్తున్నాయి.

వాటిని తప్పించుకొంటూ ధూమ్రాక్షుడు తన రథాన్ని ముందుకు తీశాడు. అంతలో రక్తసిక్తమైన ఒక తెల్లని మొండెం అతని రథం ముందు వేగంగా వచ్చి పడింది. మేఘాలు రక్తపు ధారల్లా ఉండే వర్షాన్నిస్తున్నాయి. పెనుగాలులు వీచాయి. పిడుగులు పడుతున్నట్లు ఆకాశం మేఘావృతం అయింది. చిమ్మని చీకట్లు దిక్కులను ఆవరించాయి.

ఇలా ఎదురయ్యే ఉత్పాతాలను చూచి రాక్షసులకు దడ పుట్టింది. ధూమ్రాక్షుడు కూడా ఎదురు కాబోయే యుద్ధాన్ని తలచుకొని కీడు శంకించాడు. అయినా చాలామంది రాక్షస యోధులతో కలసి భయంకర సముద్రంలాగా కనిపించే వానరుల దగ్గరకువెళ్లాడు. వానరులందరూ శ్రీరాముని దగ్గర హాయిగా ఉన్నారు.

* * *

# ధూమ్రాక్షుని సంహారం

## సర్గ - 52

రణభూమికి వస్తున్న ధూమ్రాక్షుని చూచి వానరులు మహానందంతో కోలాహలం చేశారు. రాక్షసుల వానరుల మధ్య భయంకరమైన యుద్ధం మొదలైంది. వానరులు నఖాలు గోళ్లు ఆయుధాలుగా చేసికొని రక్కసులను బాధించారు. రాక్షసులు గొడ్డళ్లు, గదలు, ఈటెలు, బల్లాలు శస్త్రాలు ఉపయోగిస్తూ వానరులను బాధపెడుతున్నారు.

రాక్షసులను పడగొట్టడానికి వానరులు పెద్ద పెద్ద శిలలను, వృక్షాలను బండరాళ్ళను పట్టుకొని విసిరివేస్తున్నారు. రాక్షసులు బాణాలు వేస్తూ ఆయుధాలతో బాధిస్తున్నా వానరులు వారిని ముప్పతిప్పలు పెడుతున్నారు.

వానరులు ఊపిరి బిగపట్టి రాక్షసులను పిడిగుద్దులతో రక్తాన్ని కక్కిస్తున్నారు. వారు వేసే బాణాలను తప్పించుకొంటూ గోళ్ళతో గీకేస్తున్నారు. శిలలు తగిలి వృక్షాల దెబ్బలకు రాక్షసులు కిందపడి ప్రాణాలు వదిలేస్తున్నారు. చేతికందినవారిని కోరలతో కొరికివేస్తున్నారు. వారి రథాలను నుగ్గుచేస్తున్నారు. ధ్వజాలను పీకి క్రిందపడేసి తొక్కుతున్నారు. పర్వతాల్లా ఉన్న రాక్షసులు శిలల క్రిందపడి హరీమంటున్నారు.

అశ్వాలు, గజాలు వానరుల ధాటికి ప్రాణాలు వదిలేశాయి. వానర వీరులు ఆకాశంలోకి ఎగురుతూ శత్రువుల భుజాలపై ఎక్కి వారి ముఖాలను గోళ్లతో పీకేస్తున్నారు. జుట్టు అంతా పీకి క్రింద పడేస్తున్నారు. వానరుల పనితో రాక్షసులు కోపోద్రిక్తులై అయ్యి గర్జిస్తున్నారు.

రాక్షసులను అరచేతులతో బాది వానరులు తరిమికొట్టుతున్నారు. బాణాలతో వారి శరీరాలను ఛిద్రం చేస్తున్నారు. వానరుల ధాటికి తాళలేక రాక్షసులు పిక్కబలంకొద్దీ పరుగు ప్రారంభించారు.

వానరుల ధాటికి తట్టుకోలేక పారిపోతున్న రాక్షసులను ధూమ్రాక్షుడు చూశాడు. కోపంతో మండిపోతూ వానరులపై విరుచుకుపడ్డాడు. ఈటెలతో వానరులను బాదాడు. వారి శరీరం నుండి రక్తం కాలువలై ప్రవహించింది. గదలతో వారిని చావబాదాడు.

ధూమ్రాక్షుని దెబ్బకు చాలామంది వానరులు క్రిందపడి ప్రాణాలు పోగొట్టుకున్నారు. రాక్షసబలం తాకిడికి కొందరు వానరులు తాళలేక చెట్లపై దాక్కొన్నారు. కొందరికి త్రిశూలాల దెబ్బలకు కడుపులో ప్రేవులు బయటపడ్డాయి. కొందరి శరీరాలు రక్తసిక్తం అయ్యాయి.

రాక్షసుల వానరులమధ్య యుద్ధం భయంకరంగా సాగుతోంది. యుద్ధరంగం సంగీత సభలాగా కనిపించింది. వింటి నారుల శబ్దాలు యోధుల గర్జనలు, నిహతులవుతున్న వారి గావుకేకలు, ఆనందంగా వేసే కేకలు, గాయపడిన వారు పెట్టే పెడబొబ్బలు, అన్నీ వీణానాదానికి పక్క వాద్యాల సహకారం అందించినట్లుగా యుద్ధభూమి సంగీత కచేరిని తలపించింది.

వానరులు పారిపోవడం, నిహతులవడం హనుమంతుడు చూశాడు. ధూమ్రాక్షునిపై కోపం తెచ్చుకొన్నాడు. వెంటనే పెద్ద బండను తీసుకొని రాక్షసునిపై విసిరివేశాడు. దాన్ని చూసి ధూమ్రాక్షుడు గదను అడ్డుపెట్టుకొని చటుక్కున నేలపై దూకాడు. రథంపై బండ బడి రథం ముక్కముక్కలుగా విరిగిపోయింది. అశ్వాలు, సారథి పడిపోయారు. చెట్లు బోదెలతో, కొమ్మలతో, వృక్షాలతో ధూమ్రాక్షునితో ఉన్న రాక్షసులను మట్టుపెట్టాడు.

రాక్షసులు వానరులు చాలామంది తలలు పగిలి చచ్చిపోయారు. మారుతి ధూమ్రాక్షునిపై దాడికి దిగాడు. ఆయనను చూసి ధూమ్రాక్షుడు హనుమంతుని వక్షస్థలంపై గదతో మోదాడు. ఆ దెబ్బ తింటూ కూడా హనుమంతుడు ఒక పెద్ద పర్వత శిఖరాన్ని ఎత్తి ధూమ్రాక్షుని తల మధ్యభాగంలో వేశాడు.

ఆ దెబ్బతో రాక్షసుడు అవయవాలన్నీ చెల్లాచెదురు కాగా ముక్కలుగా పడిపోతున్న పర్వతంలాగా రక్కసుడు నేలకూలాడు. దాన్ని చూచి రాక్షసయోధులు చావకుండా మిగిలినవారు భయంతో కంపించిపోయారు. చావుదెబ్బలను తప్పించుకుంటూ లంకలోకి పరుగెత్తి వెళ్లారు.

యుద్ధ విజయం ప్రాప్తించడంతో వానరులందరూ శ్రమను మరిచారు. ధూమ్రాక్షుని అంతం చేసిన హనుమంతుడు సంతోషించాడు. వానరులందరూ హనుమంతునకు జేజేలు పలికారు.

* * *

# వజ్రదంష్ట్రుని వీరంగం

## సర్గ - 53

**ధూ**మ్రాక్షుని మరణవార్త విని రావణుడు కోపంతో బుసకొట్టసాగాడు. మహాబలశాలి ఐన వజ్రదంష్ట్రుని పిలిచాడు. "నీవు వెంటనే వెళ్లి శ్రీరాముణ్ణి లక్ష్మణులతోపాటు సుగ్రీవుని వానరసేనను నాశనం చేసిరా"అని చెప్పాడు. రావణుని అనుజ్ఞతో వజ్రదంష్ట్రుడు అనుచరగణాన్ని సమాయత్తం చేశాడు. గజాలు, అశ్వాలు, గాడిదలు పూన్చిన రథాలు, చతురంగ బలాలు, కవచాలు ధరించిన యోధానుయోధులతో కదనరంగానికి రాక్షసుడు

బయలుదేరాడు. సేనానాయకులు సేనలతో కదలివచ్చారు. కత్తులు, ఈటెలు, శూలాలు, రోకలిబండలు, భిండి వాలములు, పాశాలు, బల్లాలు, అడ్డకత్తులు, ఖడ్గాలు, చక్రాలు, గదలు, గండ్రగొడ్డళ్ళు అన్నీ ఆయుధాలు ధరించారు. చిత్ర విచిత్ర వేషధారణతో రాక్షసులు యుద్ధ సన్నద్ధులు అయ్యారు. వజ్రదంష్ట్రుని బలం అంతా దక్షిణ ద్వారం వైపుగా నడిచి, అంగదుని నిరోధించే ప్రయత్నం చేసింది. వజ్రదంష్ట్రుని దక్షిణ ప్రయాణంలో మేఘాలు లేకుండానే ఉల్కలు నేలరాలాయి. మృగాలు భీకరంగా అరిచాయి. పక్షులు రొదచేశాయి. ఈ అపశకునాలు చూచి రాక్షసులలో కలవరం కలిగింది. వజ్రదంష్ట్రుడు శకునాలను లెక్క చేయకుండా రణోత్సాహంతో ముందుకు కదిలాడు.

ఉభయుల మధ్య సంకుల సమరం మొదలైంది. వానర రాక్షస యోధులలో కొందరి మెడలు అవలీలగా తెగిపోయాయి. సర్వాంగాలు రక్తసిక్తం అయ్యాయి. ఇరుపక్షాల యోధులు ఒకరిని మించి మరొకరు ఉత్సాహంతో పోరుచేస్తున్నారు. యుద్ధంలో వెన్నుచూపని మహాయోధులు పరిఘలు చేబూని ఒకరిపై ఒకరు దాడిచేస్తున్నారు. రాక్షసులు శస్త్రాలతో బాధిస్తున్నారు. వృక్షాలు, పర్వతాలతో వానరులు బాధిస్తున్నారు. సమరభూమిలో ధనుష్టంకారాలు, గర్జనలు, మహానాదాలు మిన్నుముట్టాయి. ఎందరో వీరాధివీరులు నేలకొరుగుతున్నారు. కొందరు యోధులు ఆయుధాలు ప్రక్కన పడేసి బాహుబల ప్రదర్శన చేస్తున్నారు. కొందరు ద్వంద్వ యుద్ధానికి తలపడ్డారు.

వజ్రదంష్ట్రుడు యమునిలాగా విజృంభించి వానరసేనను తన బాణ కౌశలంతో మట్టి కరిపిస్తున్నాడు. ఇరుపక్షాలలో యోధుల ప్రాణాలు వదిలి భూమి అంతా నిండుతున్నారు. తునిగిపోయిన రథాలు అవయవాలు ఛిన్నాభిన్నం అయిన జంతువుల కళేబరాలు, వానర రాక్షసుల శవాలు రణరంగం అంతా నిండిపోయింది. రణరంగంలో వానరులను మట్టుపెట్టే వజ్రదంష్ట్రుడు అంగదుని కంటిలో పడ్డాడు. అంగదుడు కోపోద్రిక్తుడై రక్కసునిపై విరుచుకుపడ్డాడు. ఇద్దరూ భీకరంగా పోరు చేశారు. ఇంద్ర సముడైన అంగదుడు ఒక పెద్ద మహా వృక్షం పెరికి సింహం క్రూరమృగాన్ని చంపివేసినట్లు వజ్రదంష్ట్రునిపై వేశాడు. దాంతో వజ్రదంష్ట్రుడు అక్కడనుంచి తప్పించుకొన్నాడు. మిగతా రాక్షస సైన్యంలో చాలామంది ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయాయి. రాక్షసుల మహాబలాలన్నీ వాయువేగానికి చెదిరిపోయినట్లు వానరుల దాడికి చెదిరిపోయారు.

* * *

# వజ్ర దంష్ట్రుని మరణం

## సర్గ - 54

అంగదుని చేతిలోనుంచి తప్పించుకొని వానరులను మట్టుపెడుతూ ముందుకు వజ్రదంష్ట్రుడు సాగాడు. వెనుకకు తిరిగి చూచుకొనేసరికి రాక్షసులు చాలామంది పడిపోయి వున్నారు. దాంతో కుపితుడై వజ్రదంష్ట్రుడు అంగదునిపై వానరులపై వజ్రాయుధాల్లాంటి బాణాలను వేశాడు. వానరులు రాక్షసులు ఇద్దరూ ఒకరికన్నా ఒకరు

విజృంభిస్తున్నారు. పోరు ఘోరంగా సాగుతోంది. చాలామంది శిరస్సులు ముక్కలయ్యాయి. పాదాలు గాయాలు అయ్యాయి. శస్త్రఘాటికి తాళలేక వానరులు, వృక్షాల, పర్వతాల తాకిడికి రాక్షసులు నేలపై పడిపోతున్నారు. నేలపై పడిన కళేబరాలు తినడానికి రాబందులు గుంపులు గుంపులుగా చేరుతున్నాయి. కాకులు, గ్రద్దలు అన్నీ విపరీతంగా అరుస్తున్నాయి. రక్తం ధారలు కట్టి కాలువల్లా ప్రవహిస్తోంది. నేలకు ఒరిగే రాక్షసుల యోధులను చూడలేక వజ్రదంష్ట్రుడు ఒక్కో రెక్కలున్న బాణంతో రెండు, మూడు, ఐదు, ఆరుగురు చొప్పున వానరులను గాయపరుస్తున్నాడు. వారందరూ బాణఘాటికి భయపడి అంగదుని దగ్గరకు పరుగెత్తి వెళ్లి సంగతి చెప్పారు. దాంతో అంగదుడు వజ్రదంష్ట్రుడు ఇరువురు యుద్ధభేరి మ్రోగించి యుద్ధం ఆరంభించారు. సింహం, గజంలాగా వారు పోరాడుతున్నారు. రాక్షసుడు అంగదుని ఆయువుపట్లమీద కొట్టుతున్నాడు. అంగదుడు రాక్షసుని బాధిస్తున్నాడు. ఇరువురి శరీరం రక్తసిక్తం అయింది. ఒక మహావృక్షాన్ని రాక్షసునిపై అంగదుడు విసిరాడు. దాన్ని వజ్రదంష్ట్రుడు ఛేదించాడు. ఒక పెద్ద పర్వతం ఎత్తి అంగదుడు రాక్షసునిపై వేశాడు. వజ్రదంష్ట్రుడు ఏ మాత్రం భయపడకుండా దాన్ని గదతో ఛిద్రం చేసి ముక్కలుగా పడవేశాడు. అంగదుడు వేసిన పర్వతం గద వలన ముక్కలై వజ్రదంష్ట్రుని రథంపై పడింది. అది నుగ్గు అయింది. గిరి తీసుకొని అంగదుడు ప్రక్కనే ఉన్న ఒక యోధుని ప్రాణాలు తీశాడు. మరలా పెద్ద శిఖరం తీసుకొని వజ్రదంష్ట్రునిపై దెబ్బవేశాడు. దాంతో రక్తం గక్కుకొని అతడు మూర్ఛితుడు అయ్యాడు. గదను పట్టుకొని నేలపై కూర్చుండిపోయాడు. కొంతసేపటికి వజ్రదంష్ట్రునికి తెలివి వచ్చింది. అంగదుని వక్షస్థలంపై గదతో కొట్టాడు. ఆ ఇద్దరూ అంగారక బుధగ్రహాల్లా కొట్లాడుతున్నారు.

వారిద్దరు ద్వంద్వ యుద్ధం చేశారు. ఇద్దరి శరీరాలు అలసి రక్తసిక్తం అవుతున్నాయి. వజ్రదంష్ట్రుడు వృషభ చర్మంతో చేసిన డాలును ఖడ్గాన్ని పట్టుకొని యుద్ధం చేస్తున్నాడు. దాన్ని చూసి అంగదుడు ఒక మహావృక్షాన్ని పెకిలించాడు. రాక్షసులు వానరులు చిత్రవిచిత్రంగా యుద్ధం చేస్తున్నారు.

ఇరువురూ చంపాలనే ప్రయత్నాలతో దయాదాక్షిణ్యాలు లేకుండా పోరాటం చేస్తున్నారు. చూసేవారికి వారిద్దరూ భయం పుట్టిస్తున్నారు. బాగా పూచిన మోదుగ చెట్లలాగా వారిరువురి దేహం రక్తంతో తడిసింది.

ఇద్దరూ చేతులతో గ్రుద్దుకొన్నారు. మోకాళ్ళతో పొడుచుకొన్నారు. కొద్దిసేపటికి ఇద్దరూ నేలపై పడిపోయారు. మరుక్షణంలో అంగదుడు కుపితుడై ఎర్రని కళ్ళతో లేచి నిలబడ్డాడు. వజ్రదంష్ట్రుని ఒరలో ఉన్న ఖడ్గాన్ని అంగదుడు చేజిక్కించుకున్నాడు. దానితో రాక్షసుని తలపై గట్టిగా కొట్టాడు. వజ్రదంష్ట్రుని చంపివేసిన అంగదుని వానరులందరూ మెచ్చుకొన్నారు.

* * *

# అకంపనునితో యుద్ధం

## సర్గ - 55

అంగదుని చేతిలో వజ్రదంష్ట్రుడు చనిపోయాడని ప్రహస్తుడు రావణునికి చెప్పాడు. నాయకులలో శ్రేష్ఠులైన వారు మరణించటంతో రావణునికి మదిలో భయం పట్టుకుంది. నాగపాశబద్ధులైన వారు తిరిగి లేచి కూర్చున్నారు. శత్రువులు ఆనందంగా ఉన్నారు. మన పక్షంలో వారు ఒక్కొక్కరే నేలకు రాలుతున్నారు. రాక్షసులలో భయంనీడలు కమ్ముకుంటున్నాయి. రాక్షసులు యుద్ధంచేయటానికి వెనుకంజవేస్తున్నారు. మరణించేవీరులను చూచి సైనికుల్లో భయాందోళనలను పెరగకుండా సైనికులకు యుద్ధోత్సాహాన్ని కలిగించడానికి రావణుడు చర్యలు తీసుకొంటున్నాడు. అకంపనుని నాయకత్వంలో వానరులను జయించవచ్చునని, ఆయనను సమరభూమికి పంపించమని రావణుడు చెప్పాడు. "మనకు విజయం తథ్యం అనే అకంపనుడు శత్రు సైన్యాలను ఎదిరించడంలో దిట్ట. మనకు విజయం తేవటంలో పేరెన్నిక ఉన్నవాడు. ఇతనిని పంపించి మన శత్రువుల చావు వార్తను నాకు చెప్పండి" అంటూ రావణుడు ప్రహస్తుని తొందర చేశాడు. భయంకరాకారులైన రాక్షసులు ప్రహస్తుని ప్రేరణతో యుద్ధరంగానికి సర్వసన్నద్ధంగా బయలుదేరారు. నీలవర్ణుడు మేఘ గర్జన చేసే మహావీరుడు ఐన అకంపనుడు జోరుగా యుద్ధానికి బయలుదేరాడు. రాక్షస వీరుల మధ్య సూర్యునిలాగా అకంపనుడు కనిపించాడు. అలా రథారూఢుడై సాగిపోతున్న అకంపనుని రథాశ్వాలు తొట్రుపడ్డాయి. అతని ఎడమకన్ను అదిరింది. ముఖం పాలిపోయింది. కంఠంలో దుఃఖం కూడుకొంది.

పెనుగాలుల విజృంభణ వేగవంతం అయ్యింది. పక్షులు, మృగాలు అన్నీ భీతిని పుట్టిస్తూ అరుస్తున్నాయి. అకంపనుని రథం యుద్ధభూమికి వస్తుండగా సాగరాలు అల్లకల్లోలం అయ్యాయి. పెద్దగా సాగరఘోష పెరిగింది. వానరులందరూ భయపడ్డారు. వృక్షాలు, శిలలతో యుద్ధానికి బయలుదేరారు. రాక్షసవీరులు రావణుని కొరకు ప్రాణాలు తెగించి పోరాడడం మొదలుపెట్టారు. సమర రంగంలో బలవంతులైన వానరులు నిలబడ్డారు. వానర రాక్షస యోధులు తమ పాదఘట్టనలతో రణభూమిని దద్దరిల్ల చేస్తున్నారు. వారి పాద ఘట్టనవల్ల రేగిన దుమ్ము ఆకాశం దాకా వ్యాపించింది. దానివల్ల ఇరుపక్షాల వీరులు కనిపించకుండా పోయారు.

ఆ సమరంలో చాలామంది గగ్గోలు పెడుతూ పరుగెత్తుతున్నారు. వారి ఆక్రందనలు వినిపిస్తున్నాయి. కాని వారి రూపు కనిపించడంలేదు. సూర్యరశ్మిని మేఘాలు కప్పివేశాయి. చీకటి ఆవరించింది. దాంతో ఇరుపక్షాల యోధులు వారిలోవారే యుద్ధం చేస్తూ వారిని వారే హతమార్చుకోసాగారు. రాక్షసులు ఆయుధాలతోను, వానరవీరులు పర్వతాలు శిలలతోను భీకరయుద్ధం చేశారు. యోధులను ఎదుటి వీరులను రణభూమికి బలి ఇస్తున్నారు. ఆ రోజు దుర్దినంగా ఇరుపక్షాల యోధులు నేలకు ఒరుగుతున్నారు. రాక్షస సేనాధిపతి అకంపనుడు రాక్షసులలో యుద్ధోత్సాహం నింపుతూ యుద్ధానికి పురికొల్పుతున్నాడు.

వానరులు రాక్షసులకు దీటుగా యుద్ధం చేస్తున్నారు. కుముదుడు, నలుడు, మైందుడు, ద్వివిదుడు అందరూ పోరాట పటిమ చూపిస్తున్నారు. ఘోర సంగ్రామం జోరుగా సాగుతోంది.

* * *

# అకంపనుని అంతం

## సర్గ – 56

**వా**నర ప్రముఖుల వీరవిహారానికి రాక్షసులు నిహతులు అవడం చూచి అకంపనుడు తీవ్రంగా కోపగించాడు. ఆగ్రహావేశాలతో సాటిలేని తన ధనుస్సును కదిలిస్తూ "సారథీ! రథాన్ని వానర యోధుల దగ్గరకు తీసుకొని వెళ్ళు. వీరందరూ మన రాక్షస యోధులను మట్టుపెట్టుతున్నారు. వీరిని నేను హతమార్చుతాను" అన్నాడు. సారథి అకంపనుడు చెప్పినట్లుగా చేశాడు.

అకంపనుడు వానరుల మధ్య నిలబడి కసిదీరా బాణాలను వదలుతున్నాడు. వానరయోధులందరూ ఒక్కొక్కరు నేలపై పడిపోతున్నారు. కొందరు పారిపోతున్నారు. అలా పారిపోయే వానరులను చూచి రాక్షసులు ఆనందిస్తూ ఇంకా ఎక్కువ శరపరంపరను కొనసాగిస్తున్నారు. వారిని చూచి హనుమంతుడు క్రుద్ధుడై అకంపనుని దగ్గరగా వెళ్ళాడు.

హనుమంతుని చూడగానే కపియోధులకు వీరావేశం వచ్చింది. వారిలో శక్తి సామర్థ్యాలు వచ్చి చేరాయి. వారందరూ హనుమంతుని చుట్టూ చేరారు. మహాకాయుడు హనుమంతుడు తన ఎదురుగా నిలబడడంతో అకంపనునిలో కంపన మొదలైంది. దేవేంద్రునిలాగా శరాలను హనుమంతునిపై వేయడం మొదలుపెట్టాడు.

అకంపనుని చూచి హనుమంతునిలో క్రోధం పెరిగింది. ఎలా ఐనా చంపివేద్దామని చూశాడు. హనుమంతుడు రణభూమి కంపించేటట్లుగా అకంపనుని పైకి ఉరికాడు. రణగర్జన చేశాడు. ఆ మహాత్ముని రూపం అగ్నిలాగా కనిపించింది.

మారుతి పెద్దగిరిని ఎత్తి గిరగిరా త్రిప్పాడు. దేవేంద్రుడు నముచిపై వజ్రాయుధాన్ని వేసినట్లుగా ఆ గిరిని అకంపనునిపై విసిరివేశాడు. వేగంగా తనపైకి దూసుకొచ్చే గిరిని ముందే చూచి అకంపనుడు అర్ధచంద్రాకారపు బాణాలతో ముక్కలు చేసేశాడు. శత్రువుకు తగలకుండా బ్రద్దలు అయిన పర్వతాన్ని చూసి హనుమంతునిలో రోషం పెరిగింది.

నల్లమద్ది చెట్టును వ్రేళ్లతో సహా పెరికాడు. వికటాట్టహాసం చేస్తూ దాన్ని కూడా బాగా త్రిప్పుతూ రాక్షసులందరిని బాదుతూ వేగంగా ముందుకు కదిలాడు. హనుమంతుని దెబ్బకు చాలామంది ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. గజాలను, రథాలను, అశ్వాలను నేలకూల్చుతూ హనుమంతుడు ముందుకు సాగాడు.

పదాతిదళాన్ని మట్టికరిపిస్తూ వెళ్తున్న హనుమంతుడు ప్రళయకాల రుద్రునిలా కనిపించాడు. ఆయన ధాటికి తాళలేక చాలామంది కాలికి బుద్ధి చెప్పారు. అకంపనుడు రాక్షసులకు దడ పుట్టిస్తూ ముందుకు వచ్చే హనుమంతుని చూసి పెద్దగా సింహనాదం చేశాడు. పద్నాలుగు పదునైన బాణాలతో మారుతిని అకంపనుడు బాధించాడు. ఆ బాణాలన్నీ హనుమంతుని శరీరంలో గుచ్చుకొన్నాయి. అయినా వాటిని లెక్క చేయకుండా ముందుకు ఉరికాడు.

బాగా పుష్పించిన అశోక వృక్షంలాగా కనిపించే ఆంజనేయుడు పెద్ద వృక్షం చేత బట్టుకొని అకంపనుని దగ్గరగా వెళ్లి నెత్తిమీద గట్టిగా కొట్టాడు. దాంతో అకంపనుడు కంపించి తల రెండుగా చీలిపోయింది. ఒక్కసారే అకంపనుని ప్రాణాలు అనంతవాయువుల్లో లీనమైపోయాయి.

రాక్షస యోధుడు మారుతి చేతిలో హతం అయిపోవడం రాక్షసులలో కలవరం కలిగించింది. ఓటమి పాలైన రాక్షసులందరూ గబగబా వానరుల ధాటినుంచి తప్పుకొంటూ ముందుకు పోతున్నారు. చేతిలోని ఆయుధాలను పారవేసి పలాయనం చిత్తగించారు.

దిక్కుతోచక ఎక్కడి రాక్షసులు అక్కడే వానరులను వదిలేసి లంకకు అభిముఖంగా పరుగులెత్తారు. రాక్షసులు పారిపోవడంతో వానరులు జయం పొందామని సంతోషంతో హనుమంతుని చుట్టూ చేరారు. ఆయనను వీరాధివీరునిగా కీర్తించారు. వాయుసుతుడు వానరులందరిని పేరు పేరునా మెచ్చుకొన్నాడు. మీరందరి వలననే రాక్షసులు నిహతులు అవుతున్నారు అంటూ వారిలో బలోత్సాహాన్ని నింపాడు.

వానరయోధులందరూ జయ జయ ధ్వానాలు చేశారు. మిగిలిన రాక్షసులను పట్టి వానరులు చంపేశారు. విష్ణువు దైత్యులను సంహరించినట్లుగా వానరులు రాక్షసులను సంహరిస్తున్నారు.

వానరులందరూ కలసి రామలక్ష్మణులకు సుగ్రీవ విభీషణాదులకు విజయఘోషలు చేశారు. వానరుల చేతుల్లో వీర మరణం పొందుతున్న రాక్షసులను చూసి రావణుని సేనలో భయోత్పాతాలు కలుగుతున్నాయి. వారిలో ఎప్పటికప్పుడు రణోత్సాహం తగ్గకుండా 'నేటితో రాముడి పని ఖాళీ' అంటూ ఇంద్రజిత్తు, రావణుడు చెప్పుతున్నారు. వీరులందరూ రామునితో వానరులతో యుద్ధం చేయాలనే ఉబలాటంతోపాటుగా మన ప్రాణాలు పోవడం తథ్యం అని మనసున తలుస్తున్నారు. రావణుడు వానరులతో కూడినరాముని ఎలా జయించాలని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. మహావీరుడైన అకంపనుడు యమునికి అతిథి కావడం రావణుడు జీర్ణం చేసుకోలేకున్నాడు. ఒక్కొక్క వీరుడు నేలకు ఒరిగిపోతున్నాడనే చింత ఇంద్రజిత్తును కంటిమీద కునుకు పట్టనీయడంలేదు. ఎలాగైనా రాముని ఓడించి తన తండ్రికి సంతోషం కలిగించాలని శతథా ప్రయత్నిస్తున్నాడు.

* * *

# రణరంగంలో ప్రహస్తుని ప్రవేశం

## సర్గ - 57

**హ**నుమంతుని చేతిలో అకంపనుడు కూడా మృత్యువు పాలవడంతో రావణునిలో కోపంతోపాటు అసహనం కూడా ఎక్కువైంది. తన సచివులతో దీర్ఘాలోచనలు చేశాడు. శత్రువులను నిర్జించే ఉపాయాలను ఆలోచించాడు. స్వయంగా నగరంలో తిరిగి తన సేనసంతా పర్యవేక్షించాడు. శత్రువుల దెబ్బతో నాశనం అయిపోతోన్న రాక్షస వీరులను తలచుకొన్న కొద్దీ రావణునిలో సహనం నశిస్తోంది.

ప్రహస్తుని చూచి రావణుడు "ప్రహస్తా! మన లంక చుట్టూరా శత్రు సైన్యం చుట్టుకొని ఉంది. లంక యావత్తు ప్రమాదంలో పడిపోయింది. ఈ స్థితిలో ఈ యుద్ధ ప్రమాదాన్ని ఎవరు తప్పించగలరు. నేను, కుంభకర్ణుడు, సర్వసేనాధ్యక్షుడవైన నీవు, ఇంద్రజిత్తు, నికుంభుడు మనలో ఏ ఒక్కరైనా లంక రక్షణ భారం మోయడం అసాధ్యం అనిపిస్తోంది. అందువలన నీవు స్వయంగా తగినంత బలాలను తీసుకొని రణరంగ ప్రవేశం చేసి విజయ విహారం చేసి వస్తావని నేను ఎదురుచూస్తున్నాను. నిన్ను యుద్ధ రంగంలో నిలిపితే చాలు. నీ రణకౌశలం తెలుసుకొన్న వానరులు పలాయనం చేస్తారు. మన రాక్షస యోధుల రణగర్జన వింటే వానరులు గుండెలు అణిగిపోతాయి.

వానరులు యుద్ధ శిక్షణ లేనివారు. చపల స్వభావులు. సింహగర్జనకు ఏనుగుల్లాగా పారిపోతారు. రణరంగంలో రథాలు కదలుతుంటే ఆ చప్పుళ్లకే వారు భీతి చెంది నలుదిక్కులా పారిపోతారు. నిస్సహాయులైన రామలక్ష్మణులు ఏం చేయలేక నీకు లొంగిపోతారు. ప్రహస్తా! నీ పైన నేను ఎన్నో ఆశలను పెట్టుకున్నాను. నా కోరికను నీవు బలోపేతం చేస్తావని అనుకొంటున్నాను" అని రావణుడు అన్నాడు.

ప్రహస్తుడు రాజాజ్ఞను తీసుకొని రణభేరి మ్రోగించాడు. ధనుర్ధారులైన అనుచర గణంతో బయలుదేరుతూ దివ్య రథాన్ని ఎక్కాడు. సారథి కూడా కడు నేర్పరితనంతో రథ చక్రపు ధ్వనులను మేఘ గర్జనను తలపించేటట్లుగా రథాన్ని నడిపాడు. ప్రహస్తుని దివ్య రథంపైన ఉరగ ధ్వజం రెపరెపలాడుతోంది. రథం కూడా సర్వరక్షా భద్రంగా తయారుచేశారు. బంగారు గవాక్షాలతో సూర్య చంద్ర ప్రభల సమాన తేజస్సుతో ఆ రథం అహ్లాదకరంగా ఉంది.

ప్రహస్తుడు ఢంకానాదం చేశాడు. వీణవేణు మృదంగ తాళ ధ్వనులతో శంఖారావాలతో యుద్ధానికి బయలుదేరారు. ఆ శబ్దాలవలన సముద్రం మారుమ్రోగినట్లుగా ఉంది. శత్రువులకు దడ పుట్టేలాగ భేరినినాదాలు భయంకరంగా చేశారు. నరాంతకుడు, కుంభహనుడు, మహానాదుడు, సమున్నతుడు ఈ నలుగురు ప్రహస్తుని సచివులు. వీరు ప్రహస్తునితో కదనరంగానికి కదిలివచ్చారు.

ప్రహస్తుడు చక్కని వ్యూహరచనతో తూర్పు ద్వారం నుండి సాగరంలాంటి కపి సేనను అంతరింపచేయాలనే కోరికతో బయలుదేరాడు. ప్రహస్తుడు బయలుదేరేటపుడు చేసిన గర్జనలకు లంకలోని ప్రాణులన్నీ భీతిల్లాయి. రక్తమాంసాలను భక్షించే పక్షులు ప్రహస్తుని చుట్టూ చేరి అపసవ్యంగా తిరిగాయి.

నక్కలు ఊళలు పెట్టాయి. అంతరిక్షం నుండి ఉల్కలు నేల రాలాయి. వాయువులు వేగంగా వీచాయి. మేఘాల రాపిడితో ఉరుములు ఉరిమాయి. మెఱుపులు మెఱిశాయి. పెద్ద వర్షం పడింది. దానితో సేనాపతి అనుచరులంతా తడిసిపోయారు. ఒక గ్రద్ద ప్రహస్తుని రథంపై నిలిచి దక్షిణవైపుగా తిరిగింది. తన ముక్కుతో ఉభయ పార్శ్వాలను స్పృశించింది. దాన్నిచూచి ప్రహస్తుని ముఖం వెలవెలాపోయింది.

రథాశ్వాలను అదలించే చెర్నాకోల సారథి చేతినుండి జారిపడింది. ప్రహస్తుని విజయోత్సాహం నీరుగారిపోయింది. అపశకునాలను చూచి అతని ముఖం కళావిహీనం అయింది. రథాశ్వాలు చదునుగా ఉన్న ప్రదేశాలలో కూడా తొట్రుపాటుకు లోనయ్యాయి.

ప్రహస్తుడు చింతతోనే కదలి కదనరంగంలోని ముందుభాగంలో నిలబడ్డాడు. అతణ్ణి చూసి చూడగానే వానరులు యుద్ధోత్సాహంతో వృక్షాలు, శిలలు పెకలించారు. పోరుకు సన్నద్ధం అయ్యారు. ఇరుపక్షాల యోధులు భయంకరమైన గర్జనలు చేశారు. పరస్పరం విజయ కాంక్షతో తలపడడానికి ఉవ్విళ్ళూరారు. ఒకరిని ఒకరు చంపివేయాలనే ఉత్సాహంతో ముందుకు పరుగెత్తారు. చావు మూడిన మిడత అగ్నిని చూచి ఆశపడి ముందుకు పరుగెత్తినట్లుగా ప్రహస్తుడు ఆయువు మూడడంతో వానరులపైకి కాలు దువ్వి కదిలాడు.

* * *

# ప్రహస్తుడిని అంతం చేసిన నీలుడు

## సర్గ - 58

**ప**రాక్రమశాలియైన ప్రహస్తుడు యుద్ధరంగానికి రావడం రాముడు చూచి విభీషణుని ఈ వచ్చే వీరుడెవ్వడో నాకు చెప్పమని అడిగాడు. "ప్రభూ! ఈ వచ్చే మహాకాయుడు రావణుని సర్వసైన్యాధ్యక్షుడు. ఇతనిని ప్రహస్తుడంటారు. లంక సేనావాహినిలో మూడు భాగాలకు ఇతడు అధిపతి..." అని చెప్పుతుండగానే ప్రహస్తుడు వానరసేన దగ్గరకు వచ్చాడు.

అపార సేనావాహినిని చూచాడు. జయేచ్ఛతో సింహనాదం చేస్తూ వానర వీరులకు అభిముఖుడై నిలిచాడు. రాక్షస యోధులందరూ తమ తమ ఆయుధాలతో వానరులపై దండెత్తారు. వానరులకు వారికి దీటుగా శిలలు, పర్వతాలు, వృక్షాలతో వారిని ఎదుర్కోవటం మొదలుపెట్టారు.

ఇరుపక్షాల మధ్య భీకర సంగ్రామం మొదలైంది. ఎంతోమంది నిహతులు అయ్యారు. వానరులు రాక్షసుల గదలతో, గండ్రగొడ్డళ్ళతో దెబ్బలు తింటున్నారు. వానరుల ఆయుధాలతో రాక్షసులు దెబ్బతింటున్నారు. కొందరి హృదయాలు బ్రద్దలు అయ్యాయి. మరికొందరివి తలల పగిలాయి. రెక్కలలో శూలాలు గ్రుచ్చుకొన్నాయి. కొందరి ప్రేగులు బయటపడ్డాయి. రక్తం కాలువలై పారింది. వానరులు కోపంతో రెచ్చిపోయి పర్వతాలు పిండిచేశారు. వారి అరచేతి దెబ్బలకు పిడికెళ్ళ పోటులకు రాక్షసులు తాళలేకపోయారు.

నోటినుండి రక్తం కక్కి కొందరు చనిపోయారు. కొందరి పళ్ళు ఊడిపోయాయి. ఇరుపక్షాల యోధులు భయంకరంగా అరుస్తూ వీరోచితంగా పోరాడుతున్నారు. ప్రహస్తుని సచివులను నలుగుర్ని వానరులు చంపాలనే ఉద్దేశ్యంతో పోరాడారు. వారిలో నరాంతకుడు వానరులను దెబ్బతీయబోవడం ద్వివిదుడు చూశాడు. వెంటనే వారితో పోరి యముని అతిథిగా పంపించివేశాడు.

దుర్ముఖుడను వానరయోధుడు ఒక పెద్ద వృక్షంతో సమున్నతుని నిహతుని చేశాడు. జాంబవంతుడు మహాశిలతో మహానాదుని వక్షస్థలంపై కొట్టి సంహరించివేశాడు. తారుడనే కపియోధుడు విజృంభించి కుంభహనువు తలపై మోది యమపురికి పంపివేశాడు.

వారు నలుగురు యమపురికి వెళ్ళిపోవటంతో ప్రహస్తుని ఆశలు అడుగంటిపోయాయి. అయినా యుద్ధం చేస్తున్నాడు. యుద్ధరంగంలోని ధ్వనులు సాగరాన్ని మారుమ్రోగిస్తున్నాయి. ప్రహస్తుడు తన శరపరంపరతో వానరులను మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నాడు. వీరుల శవాలతో కదనరంగం నిండిపోయింది. ఎర్రని రక్తంతో అభిషేకించి నట్లుగా భూమి రక్తపుటేరులను ప్రవహింపజేసింది.

యుద్ధభూమి అంతా ఒక సముద్రంలాగా కనిపిస్తే అందులో తేలే శవాలు జలచరాల్లాగా, కేశాలు సముద్రపు తరంగాల నురుగులాగా కనిపించసాగాయి. ప్రహస్తుడు తన రథం నుండే వానరులను చంపివేయడం నీలుడు చూశాడు. కోపంతో అట్టుడికిపోయాడు. నలుని ప్రహస్తుడు చూశాడు. వెంటనే వానరయోధునిపై తన బాణాలను ఎక్కుపెట్టి బాధించడం మొదలుపెట్టాడు.

నీలుని ప్రహస్తుడి బాణాలు బాగా బాధించాయి. తన మీదకు వచ్చే రాక్షసుని తుదముట్టించాలని నీలుడు ఒక పెద్ద వృక్షాన్ని చేత పట్టుకొన్నాడు. దగ్గరగా రాగానే ఒక బాదు బాదాడు. ఆ దెబ్బతో ప్రహస్తుడు చావుదెబ్బతిన్నాడు. కోపంతో మండిపోతూ నీలునిపై బాణప్రయోగం తీవ్రతరం చేశాడు. శరాఘాతాలన్నీ ఓర్చుకొంటూ నీలుడు ప్రహస్తుని అంతం చేయడానికి సమయం కోసం చూస్తున్నాడు.

మనోవేగంతో సాగిపోయే రథంపైనున్న ప్రహస్తుని మద్దిచెట్టుతో నీలుడు బలంగా మోదాడు. వేగంగా కదిలి ప్రహస్తుని ధనుస్సును నీలుడు లాగివేసి ముక్కలు చేసి క్రింద పడేస్తూ జయ జయ ధ్వానాలు చేశాడు. రోకలి బండను తీసుకొని రథంపైనుండి ప్రహస్తుడు క్రిందకు దూకాడు. నీలుడు ప్రహస్తుడు భయంకరంగా యుద్ధం చేశారు. వారిద్దరి దేహాలు రక్తసిక్తం అయ్యాయి. సింహశార్దూలాల్లాగా పోరాడారు. యుద్ధంలో వెన్నుచూపని ఆ ఇద్దరూ విజయాన్ని సాధించాలని దేవేంద్రుడు వృత్రాసురుల్లాగా యుద్ధం చేశారు.

రోకలిబండతో నీలుని లలాటంపై ప్రహస్తుడు మోదాడు. నీలుని లలాటం పగిలి నెత్తురు చిమ్మింది. అది లెక్క చేయకుండా పెద్ద వృక్షంతో ప్రహస్తుని వక్షస్థలంపై గట్టిగా కొట్టాడు. రోకలి బండతో విజృంభించే ప్రహస్తుని నిరోధించడానికి నీలుడు బండను పట్టుకొన్నాడు. ఆ మహాశిలను తీసుకొని నీలుడు ప్రహస్తుని మాదు పగులకొట్టాడు. దాంతో యముని ఆహ్వానపత్రిక ప్రహస్తునికి అందింది. పర్వతం నుండి జాలువారే సెలయేళ్ళలాగా ప్రహస్తుని శిరస్సు నుండి రక్తం ఏరులై పారింది.

ప్రహస్తుని మరణం రాక్షసులను నీరుగార్చింది. వారందరూ మూకుమ్మడిగా లంకవైపు పరుగులు తీశారు. సర్వసైన్యాధ్యక్షుడే నేలకు ఒరిగిపోయాడని తెలిసి రాక్షసులందరూ నిశ్చేష్టులు అయ్యారు. నలుని అందరూ మెచ్చుకొన్నారు. రాక్షసులు నోరు మెదపలేక మౌనం వహించారు.

* * *

# రావణుని ప్రతాపం - పరాభవం

## సర్గ - 59

రావణుని సర్వసైన్యాధిపతీ, మహావీరుడు ఐన ప్రహస్తుని మరణం లంకనంతా కుదిపేసింది. రాక్షసులందరూ మౌనం వహించారు. రావణునికి అంతర్మథనం ఎక్కువైంది. లంకకు చేరిన రావణుని సైన్యం అగ్ని వరసుతుడైన నీలుని చేతిలో ప్రహస్తుడు దారుణ మరణం పొందాడని చెప్పలేక చెప్పారు. ఇంద్రుని బలాలను సైతం నిర్జించిన ప్రహస్తుడు వానరుల చేతిలో నిర్జీవుడు అయ్యాడు.

"శ్రీరాముడు మానవుడే కదా! వానరులే కదా! అని ఉపేక్షించడం మంచిది కాదని అనిపిస్తోంది. ఇంతదాకా నేను వారిని సహించాను. ఇక వారి పని నేను పడతాను. వెంటనే కదన రంగానికి వెళ్లి రామలక్ష్మణులను వానరసేనను నా బాణాగ్నిశిఖలతో దహించివేసి వస్తాను. కపివీరుల రక్తంతో భూదేవిని అభిషేకించి విజయలక్ష్మిని వరించి తెస్తాను" అని వీరత్వంతో రావణుడు చెప్పాడు.

అగ్నితేజస్సుతో ప్రకాశించే దివ్యరథం మీద రావణుడు కదన రంగానికి బయలుదేరాడు. రాక్షసులందరూ మహారాజు కదనోత్సాహంతో బయలుదేరడం చూచి శంఖాలను పూరించారు. భేరీలను మ్రోగించారు. వంది మాగధులు జయజయధ్వానాలు చేశారు. రావణుడు లంకనుంచి బయలుదేరాడు. ఆయన అనుసరించి వేల సంఖ్యలో రాక్షస గణం కదనరంగానికి కదిలివచ్చింది. అప్పుడు ఆ రాక్షసరాజు భూత గణాలతో ఉన్న పరమ శివునిలాగా కనిపించాడు. రణభూమికి చేరిన రావణునికి వానరసేన యుద్ధోత్సాహం కనిపించింది. వారి మేఘ గర్జనలు, యుద్ధనాదాలు ఆ ప్రదేశం అంతా మారుమ్రోగుతున్నాయి. వానరుల చేతిలో శిలలు, పర్వతాలు, వృక్షాలు ఆయుధాలుగా ఉండడం చూశాడు. ఆదిశేషునివంటి శ్రీరాముడు యుద్ధోత్సాహంతో తరలి వచ్చే రాక్షస సేనావాహిని చూశాడు.

విభీషణుని చూచి రాముడు, మనవైపు దూసుకొచ్చే ఈ సైన్యం యొక్క వివరాలు ఏమిటి? రకరకాల ఆయుధాలతో ధ్వజపతాకాలు, ఛత్రాలతో విలసిల్లే రథాలు, ఏనుగులు, గుర్రాలు, కాల్బలం అంతటిని వివరించి చెప్పమని అడిగాడు. రాక్షసుల సేనావాహిని చూచి విభీషణుడు వారి గురించి శ్రీరామునితో చెప్పుతున్నాడు. "ప్రభూ! మహాకాయుడు ఉదయిస్తున్న సూర్యునిలాగా శత్రు భయంకరంగా మదపుటేనుగుపై ఎక్కి వచ్చేవాడు రావణుని సుతుడైన అకంపనుడు. సింహధ్వజంతో ఉన్న రథాన్నెక్కి ఇంద్ర ధనుస్సులాగా ప్రకాశిస్తూ వస్తున్నవాడు రావణుని పుత్రుడు ఇంద్రజిత్తు. బ్రహ్మదేవుని వర ప్రభావంతో అదృశ్యంగా ఉంటూ యుద్ధం చేయగల నేర్పరి. మహేంద్రగిరిలాగా ఉన్నతుడైన ధనుర్ధారి. రథికులలో శ్రేష్ఠుడైన అతికాయుడను రాక్షసవీరుడు.

సూర్యుని వంటి నేత్ర ద్వయంతో వచ్చేవాడు మహోదరుడు. మెడలో గలగలలాడే గంటలున్న మహావీరుడు పిశాచుడు. ఇతడు గుర్రం ఎక్కి అస్త్రాద్రిలాగా ఈటెను బట్టుకొని వస్తున్నాడు. వృషభంనెక్కి వచ్చేవాడు త్రిశిరుడు. ఇతని దగ్గర వజ్రాయుధానికంటే మిన్న ఐన శూలం విద్యుత్కాంతులతో విరాజిల్లుతోంది. ధనుష్టంకారంతో వచ్చే

యోధుడు కుంభాసురుడు. పరిఘ చేత బట్టుకొని వచ్చేవాడు రాక్షస యోధులతో ప్రముఖుడు కుంభకర్ణుని కొడుకు. ఇతని పరిఘ వజ్రాల తాపడంతో అగ్నిలాగా మెరుస్తుంటుంది. నరాంతకుడు పేరుకు తగినట్లుగా శత్రుయోధులను మట్టుబెట్టే భయంకరుడు.

రథంపైన వచ్చే మహాకాయుడు కాటుక పర్వతం వంటివాడే దశగ్రీవుడు రావణుడు. ఇతనితో వివిధ ఆకారాలున్న రాక్షసులు కూడా ఉన్నారు. పెద్ద పులులు, ఒంటెలు, ఏనుగుల మాదిరి ముఖాలతో రాక్షసులున్నారు. రుద్రునిలాగా కనిపించే రావణుని కిరీటం వజ్రకాంతులతో దేదీప్యమానంగా కనిపిస్తోంది. ఆయన ధరించిన కుండలాలు ఊగుతూ వింత శోభను ఇస్తున్నాయి. ఇంద్ర, యముల గర్వం అణచిన మహోన్నత పర్వతాకారుడు రావణుడు. సూర్యునిలాగా తేజస్సుతో ఉన్నాడు" అని రావణునితో వచ్చే సేన వివరాలు విభీషణుడు రామునికి చెప్పాడు.

శ్రీరాముడు రావణుని చూచి " విభీషణా! ఈ రాక్షస రాజు మహా తేజస్సుతో ఉన్నాడు. తేజోమహితమైన ఈ రూపం సూర్యునిలాగా దివ్యకాంతితో విరాజిల్లుతోంది" అని చెప్పాడు. రావణుని పక్షం వారందరూ దృఢకాయులు, మహాగిరులను సైతం పిండికొట్టగల సమర్థులు. తేజోవంతులైన అనుచరులతో ఉన్న రావణుడు భయంకరంగా యమునిలాగా కనిపించాడు. " ఈ విశిష్ట దేహం ఉన్న ఈ రాక్షసాధముడు దైవికంగా నా ఎదుట నిలిచాడు. ఇక వీణ్ణి నేను సంహరించి సీతను అపహరించి తెచ్చినందుకు తగిన శిక్ష వేస్తాను. ఇక జాగు చేయక నా సీతకు ఆనందాన్ని కలిగిస్తాను" అని శ్రీరాముడు చెప్తూ ధనుర్బాణాలను చేతబట్టుకొన్నాడు.

కదనరంగానికి వచ్చి రావణుడు తన యోధులతో "వీరులారా! మీరు నిర్భయంగా ఎటువంటి శంక లేకుండా శత్రుపక్షాన్ని చీల్చి చెండాడండి. మీరు అందరూ మీమీ స్థానాలలో అప్రమత్తులై ఉండండి. మనం ఏమరుపాటున ఉంటే వానరులు లంకలోపలికి వెళ్ళగలరు. జాగ్రత్త ." అని చెప్పాడు. రాజాజ్ఞతో యోధులందరూ ఎవరి స్థానంలో వారు నిలిచారు. యుద్ధభేరిని మ్రోగించి వానరసైన్యాన్ని కల్లోలపరచడానికి శ్రీకారం చుట్టారు. ధనుర్బాణాలతో వేగంగా వచ్చే రావణుని సుగ్రీవుడు చూశాడు. ఒక మహాపర్వతం శిఖరం పెకిలించి ఎత్తిపట్టాడు. సానువులు వృక్షాలతో ఉన్న ఆ శిఖరాన్ని గట్టిగా రావణునిపై సుగ్రీవుడు విసిరికొట్టాడు. దాన్ని రావణుడు తన బంగారు పుంఖాలున్న బాణాలతో ముక్కలు చేశాడు. ప్రాణాంతకమైన గిరిని వేసిన సుగ్రీవుని తుదముట్టించాలని రావణుడు ఆలోచించాడు. ఎలాగైనా రాముని సేనను చీల్చివేయాలని కృతనిశ్చయుడై రావణుడు నిలిచాడు.

మహాసర్పంలాగా వాయువేగంతో వెళ్ళేది, అగ్నికణాలు విరజిమ్మేది, దేవేంద్రుని వజ్రాయుధం కన్నా వాడి ఐనది ఐన శరాన్ని సుగ్రీవునిపై రావణుడు వేశాడు. ఆ తిరుగులేని బాణం కుమారస్వామి క్రౌంచ పర్వతాన్ని ఛేదించినట్లుగా సుగ్రీవుణ్ణి ఆ శరం ఛేదించింది. దాని ధాటికి తాళలేక సుగ్రీవుడు గిలగిలలాడుతూ నేలపై పడి మూర్ఛపోయాడు.

సుగ్రీవుడు పడిపోవడం చూచి రాక్షసులు మహదానందం పొందారు. గర్జనలు చేశారు. సుగ్రీవుణ్ణి పడదోసిన రావణునిపై గవాక్షుడు, గవయుడు, సుదంష్ట్రుడు, ఋషభుడు, జ్యోతిర్ముఖుడు, నభుడు పర్వతాలను పట్టుకొని

కోపంగా వెళ్ళారు. వారి శిలలన్నింటిని తన శరపరంపరతో రావణుడు నిర్వీర్యం చేశాడు. వానరులందరిని తన బాణాలతో బాగా బాధించాడు. తన శరధాటితో భయపెట్టాడు. వారినంతా బాణాలతో కప్పివేస్తున్నాడు. రావణుని ధాటికి తాళలేక వానరులంతా గగ్గోలుగా శ్రీరాముని శరణుజొచ్చారు.

వారి అందరిని చూచి శ్రీరాముడు వారికి భయంలేదని చెప్పుతూ చేతిలో బాణాలను కోదండాన్ని తీసుకొన్నాడు. అంతలో లక్ష్మణుడు వచ్చి "అన్నా! నేను ఉన్నాను గదా మీరు ఈ దుష్టునితో పోరాడి అలసిపోవాల్సిన అవసరం ఏమీ లేదు. నేను వీణ్ణి తుదముట్టిస్తాను. నాకు అనుజ్ఞ ఇవ్వు" అని అడిగాడు.

"సోదరా సౌమిత్రీ! నీవు రావణునిపై యుద్ధానికి వెళ్ళి నీ ఉత్సాహాన్ని తీర్చుకో! కాని, వాణ్ణి సామాన్యుడిగా లెక్కపెట్టకు. విజయం సాధించటానికి గట్టిగా పూనుకోవాలి. రావణుడు అత్యద్భుత వీరవిక్రముడు.

రావణుడు క్రుద్ధుడైతే ముల్లోకాలను గజగజలాడించగల వీరుడు. అందుకే మొదట రావణుని లోపాలను తెలుసుకో. నీ లోపాలను సరిచేసుకో. ఏకాగ్రచిత్తుడవై నిన్ను నీవు రక్షించుకొంటూ నీ పరమ శత్రువైన రావణుని దెబ్బతీయడానికి ప్రయత్నించు" అని చెప్పాడు.

అన్ని హితవచనాలు లక్ష్మణుడు బుద్ధిగా విన్నాడు. రాముని అనుజ్ఞ పొందాడు. రామునకు ప్రదక్షిణ నమస్కారం చేశాడు. ఆశీర్వాదాలను అందుకొన్నాడు. ఏనుగు తొండం వంటి బాహు సంపద ఉన్న లక్ష్మణుడు రావణునిపై దాడికి వెళ్ళాడు. వానరులపై రావణుడు బాణాలను కుంభవృష్టిగా కురిపిస్తున్నాడు. వానరుల దేహాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాడు.

ఇంతలో మహాతేజస్వి ఐన హనుమంతుడు రావణుని చూశాడు. అతని శరవర్షాన్ని ఆపివేయాలని మారుతి రావణునిపై విజృంభించాడు. రథం దగ్గరికి వెళ్ళి రావణునిపై తన అరచేతిని ఎత్తి "రావణా! నీవు దేవ దానవ గంధర్వాదులనుండి మృత్యుభయం లేకుండా వరం పొందావు. కానీ, నరవానరులనుండి మృత్యువును తప్పించుకోలేవు. ఇదిగో ఇప్పుడే నా దక్షిణ బాహువు నీవు జాగ్రత్తగా దాచుకొన్న ప్రాణాలను పైకి ఎగురగొడుతుంది" అన్నాడు.

దాంతో రావణుడు కోపోద్రిక్తుడై "ఓ మారుతీ! నీవు నన్ను కొట్టి శాశ్వతమైన కీర్తిని పొందు. కానీ అంతమాత్రాన నాకు ఏమీ కాదు. నీకు కూడా నీ బలం ఏపాటిదో తెలుస్తుంది" అని అన్నాడు. రావణుని మాటలకు అడ్డువస్తూ మారుతి "ఓ రావణా! ఒక్కసారి నా చేతిలో నీ ముద్దుల తనయుడి వీరమరణం గుర్తుతెచ్చుకో. అప్పుడు నా బలం ఏ పాటితో నీకు ముందు తెలుస్తుంది" అన్నాడు.

ఇలా మాట్లాడే మారుతి వక్షస్థలంపైన రావణుడు తన అరచేతితో గట్టిగా బాదాడు. ఆ దెబ్బకు మారుతి చాలాసార్లు కంపించిపోయాడు. అయినా తన అరచేతిని ఎత్తి రావణుని హృదయంపై గట్టిగా మోదాడు. భూకంపం వచ్చినపుడు భూమి కంపించినట్లుగా ఆంజనేయుని దెబ్బకు రావణుడు కంపించిపోయాడు. రావణుని కంపనం చూసి దేవతలు, మహర్షులు, సిద్ధులు గంధర్వులు ఆనందించారు.

కొంతసేపటికి రావణుడు చేరుకొని "మారుతీ! నీ బలం శ్లాఘనీయమే బాగు బాగు" అన్నాడు. "రావణా ఇక నీ ఆత్మస్తుతి చాలు నేను కొట్టిన దెబ్బతో నీవు ఇంకా బ్రతికే ఉన్నావు. ఇది నాకు అవమానంగా ఉంది. మరల నీవు నన్ను కొట్టి చూడు. నిన్ను నా పిడి గ్రుద్దుతో యమపురికి పంపిస్తాను" అన్నాడు.

ఆ మాటలు రావణునిలో ఆవేశాన్ని పెంచాయి. ఆలోచించకుండా రావణుడు తన పిడికిలితో హనుమంతుని వక్షస్థలాన్ని గుద్దాడు. రావణుని దెబ్బకు మారుతి కంపించిపోయి స్పృహ తప్పి నేలపై పడిపోయాడు. నీలుడు హనుమంతుడు పడిపోవడం చూచి చాలా కోపంతో మండిపడ్డాడు. రావణుడు అసామాన్యుడు. శత్రువుల ఆయువు పట్టులను ఛేదించగలడు అనుకొని నీలుడు రావణునిపై శిలలను విసిరేశాడు. రావణుడు వాటిని తప్పిస్తూ నీలునిపై బాణప్రయోగం చేశాడు.

ధీశాలి ఐన హనుమంతుడు మూర్ఛనుంచి తేరుకొన్నాడు. రావణుడు నీలునితో యుద్ధం చేయడం చూశాడు. నీలుడు విసిరివేసిన పర్వతాన్ని రావణుడు ఏడు బాణాలతో కొట్టి ముక్కలు చేశాడు. శత్రువులను తునుమాడడంలో సమర్థుడు అయిన నీలుడు తన పర్వతాన్ని నేలకూల్చడం చూచి రావణునిపై క్రోధావేశుడు అయ్యాడు.

నీలుడు కోపంతో ఊగిపోతూ మద్ది, మారేడు, ధవ, మామిడి వృక్షాలను ఒక్కొక్కటిగా పెకిలించి రావణునిపై వేశాడు. నీలుని నీరుగారుస్తూ రావణుడు ఒక్కొక్క వృక్షాన్ని ఛేదిస్తూ వెళ్ళాడు. నీలునిపై రావణుడు తన అమోఘ శర పరంపరను వేస్తూ పోయాడు. వాటిని తప్పించుకుంటూ నీలుడు తన రూపాన్ని సూక్ష్మంగా చేసుకొని దశగ్రీవుని ధ్వజాగ్రాన నిలిచాడు. తన ధ్వజంపై ఎక్కిన నీలుని చూచి రావణుడు కన్నులు ఎర్ర చేశాడు.

నీలుడు మహానాదం చేశాడు. ధ్వజంపైనుండి ధనుస్సుపైకి అక్కడనుంచి కిరీటంపైకి ఎగురుతూ దుముకుతూ రావణుని చేతికి చిక్కకుండా నీలుడు ఏడిపిస్తున్నాడు. అలా ఎగిరే నీలుని చూచి రామలక్ష్మణులు హనుమంతుడు ఆశ్చర్యపడినారు. రావణుడు కూడా నీలుని రూపం చూచి విస్మయం చెందాడు.

రావణుడు ఆగ్నేయాస్త్రాన్ని చేత బట్టుకొన్నాడు. నీలుడు నేర్పుగా అటు ఇటు కదులుతుండడం చూచి బాణం గురి చూడలేక రావణుడు తికమక పడ్డాడు. దాన్ని చూచి నీలుడు ఆనందంతో పొలికేక పెట్టాడు. వానరులందరూ కోలాహలంగా ధ్వని చేయడంతో రావణునికి ఆక్రోశం పెరిగింది. దానివలన రావణుని హృదయం వేగంగా కొట్టుకొంది.

నీలుని కోపంగా చూస్తూ రావణుడు "ఓ వానరా! నీ తెలివితేటల గారడీ విద్యల ప్రదర్శన చాలు. ఇక నీ ప్రాణాలు దక్కించుకో. నీవు ఎన్ని రూపాలు ధరించినా ఆగ్నేయాస్త్రం నుండి తప్పించుకోలేవు" అంటూ అరిచాడు. రావణుని అరుపును ఏమాత్రం పట్టించుకోకుండా ఎగురుతూ దుముకుతూ రావణుని ముప్పతిప్పలు పెడుతున్నాడు.

రాక్షసరాజు ప్రయోగించిన ఆగ్నేయాస్త్రం నీలుని వక్షస్థలాన్ని బాధించింది. కాని, అగ్నివర సుతుడు అవటంవలన భూమిపై పడిపోకుండా నేలపై నీలుడు నిలదొక్కుకొన్నాడు. కాని, స్పృహ తప్పి ఉండడంవల్ల రావణుడు నీలుని వదిలి లక్ష్మణునిపైకి వేగంగా దూసుకొనిపోయాడు. సుగ్రీవాది వానరులను రావణుడు నిర్వీర్యం చేస్తూ రావణుడు అగ్ని తేజస్సుతో వెలుగొందుతున్న లక్ష్మణునిపైకి రణావేశంతో ముందుకు వెళ్ళాడు.

భూమిని కంపింపచేస్తూ ధనుష్టంకారం చేస్తున్న రావణునితో లక్ష్మణుడు "రావణా! వానరులతో కాదు నీవు నాతో యుద్ధం చేయి! నీ పరాక్రమం ఏదో నేను చూస్తాను" అన్నాడు. లక్ష్మణుని ఈ మాటలు రావణుని ధనుష్టంకార ధ్వనిని మించి యుద్ధరంగంలో మారుమ్రోగాయి. రావణుడు ఆమాటలకు కుపితుడై "లక్ష్మణా! నీకు చావు మూడింది. నా చేతిలో నీకు చావు తప్పదు. అందుకే నాకు కనిపించావు" అంటూ భీకరంగా రావణుడు అరిచాడు.

"ఓ పాపాత్ములలో మేటి ఐన రావణా! దండకారణ్యంలో మేము లేనప్పుడు సీతాదేవిని అపహరించి తెచ్చినపుడే మాకు నీ శౌర్యపరాక్రమాల గురించి బాగా తెలిసింది. ఇప్పుడు చేతిలో ధనుర్బాణాలు పట్టుకొని వీరావేశంతో మాట్లాడుతున్న నిన్ను చూస్తే నీవెంత పరాక్రమశాలివో ఇంకా బాగా తెలిసింది" అని లక్ష్మణుడు రావణుని ఎద్దేవా చేశాడు. ఆ మాటలు వినలేక రావణుడు ఒక్కసారిగా ఏడు బాణాలు లక్ష్మణునిపై వేశాడు. వాటినన్నింటిని సౌమిత్రి నాశనం చేశాడు. ఆ ఇరువురు ఒకరినిమించి మరొకరు బాణ ప్రయోగం చేయసాగారు. ఇద్దరిలో గెలుపుపై ఆశ ఎక్కువ అయింది. క్షురం, అర్ధచంద్రం, ఉత్తమకర్ణి, భల్లం అనే బాణాలతో రావణుని శరాలను లక్ష్మణుడు తుత్తునియలు చేశాడు.

రాక్షస రాజు తన బాణాలు నిర్వీర్యం చేసే సౌమిత్రి కౌశలాన్ని మెచ్చుకోలేకుండా ఉండలేక పోయాడు. రావణుడు ధనుస్సు ఎక్కుపెట్టి నిశితమైన బాణ ప్రయోగం మొదలుపెట్టాడు. వాటినన్నింటిని వజ్రాయుధంతో సమానమైన బాణాలతో సౌమిత్రి ఎదిరించాడు.

బ్రహ్మ వరప్రసాదంతో చిక్కించుకొన్న బాణ సంపదలోని బాణంతో రావణుడు సౌమిత్రి లలాటాన్ని ఛేదించాడు. ఆ దెబ్బ లక్ష్మణుణ్ణి బాగా కదలించివేసింది. కంపించిపోతూ చేతిలో ధనుర్బాణాలు జారవిడిచాడు. కొద్దిసేపటిలోనే సౌమిత్రి తేరుకొని మరలా వింటిని ధరించి అమోఘ బాణ పరంపరను కొనసాగిస్తూ రావణుని ధనుస్సును మూడు బాణాలతో విరిచేశాడు. అంతటితో ఊరుకోక బాణాలను వేస్తూనే ఉన్నాడు. ఆ బాణ ప్రహారానికి రావణుడు తట్టుకోలేక మూర్ఛితుడు అయ్యాడు. అయినా వెంటనే తేరుకొన్నాడు.

అప్పుడు రావణుని ధనుస్సు విరిగిపోయింది. అతని శరీరం రక్తసిక్తం అయింది. రావణుడు చాలా కోపంతో బ్రహ్మ ఇచ్చిన 'శక్తి' అనే బాణాన్ని లక్ష్మణునిపై ఎక్కుపెట్టాడు. అది కదన రంగాన్నే కాల్చివేస్తుందా అన్నట్లుగా అగ్నిని విరజిమ్మింది. ఆ శక్తి బాణ ఘాతానికి లక్ష్మణుడు పీడితుడయ్యాడు. ఆ దెబ్బవలన స్పృహదప్పి నేలపై పడిపోయాడు.

రావణుడు రథం దిగి లక్ష్మణుని దగ్గరకు వచ్చాడు. సౌమిత్రిని లేవనెత్తాలని చూచి ప్రయత్నించాడు. కాని హిమవత్పర్వతాన్ని మేరు పర్వతాన్ని ఎత్తే శక్తి ఉన్న రావణునికి సౌమిత్రిని ఎత్తడం చేతకాలేదు. సమస్త భువన భాండాగారాన్ని ఎత్తగలను కదా మరి ఈ లక్ష్మణుని ఎత్తలేకపోతున్నానే అని రావణుడు కలవరం చెందాడు. అందరూ అన్నట్లుగా నారాయణుడే రామలక్ష్మణుల రూపంలో వచ్చాడా? అని అనుమానం రావణుని హృదిలో ఎక్కడో మెదిలి మెదలకుండా ఆగిపోయింది.

బ్రహ్మ ఇచ్చిన శక్తి చేత కొట్టినా లక్ష్మణుడు తాను విష్ణుభాగమనే విషయాన్ని గుర్తుచేసుకొన్నాడు. ఊహింపశక్యంగాని విష్ణువులోని చతుర్థాంశ నేను గదా! అని లక్ష్మణుడు అనుకోవడంతో రావణుని దెబ్బ సౌమిత్రిని ఏమి చేయలేకపోయింది.

రావణుడు లక్ష్మణుని తన బాహుబలం అంతా ఉపయోగించి లేవనెత్తపోయాడు. అయినా సౌమిత్రిని పిసరంత కదల్చలేకపోయాడు. దాన్ని చూచిన హనుమంతుడు కోపంతో రెచ్చిపోయి బలంగా ఎగిరివచ్చి తన పిడికిలితో రావణుని వక్షస్థలాన్ని బలంగా కొట్టాడు.

ఆ దెబ్బతో రావణుడు దిమ్మతిరిగిపోయాడు. కళ్లు బైర్లు కమ్మాయి. కదనరంగం కదలబారుతోంది అనుకొన్నాడు. రావణునికి తెలియకుండానే నేలపై మోకాళ్ళపై కూర్చుండిపోయాడు. అతని నేత్రాలనుండి చెవులనుండి రక్తం బయటకు తన్నుకొచ్చింది.

ఆ స్థితిలో రావణుడు నిశ్చేష్టుడై మెల్లగా నడిచి, తన రథం దగ్గరకు చేరి, దానిపై ఎక్కి కూర్చున్నాడు. అయినా రావణునిలో పూర్వపు స్థితి రాలేదు. అతని శరీరం వశం తప్పిపోయింది. స్పృహను కోల్పోతున్నాడు. మెల్ల మెల్లగా రథంలో సొరిగిపోతున్నాడు. ఆ స్థితిలో రావణుని చూసిన దేవతలందరూ చాలా సంతోషించారు. ఋషులు ఇంద్రాది దేవతలు అందరూ హర్షధ్వానాలు చేశారు.

రావణుని వలన దెబ్బతిని మూర్ఛితుడైన సౌమిత్రిని, మారుతి తన రెండు చేతులతో ఎత్తుకొని శ్రీరాముని దగ్గరకు తీసుకొని వచ్చాడు. శత్రువులు కదల్చలేక పోయిన సౌమిత్రి హనుమంతుని స్నేహ సౌహార్ధానికి కరిగిపోయి తేలిక అయ్యాడు. ఒబ్బిడిగా హనుమంతుని బాహువులో ఇమిడిపోయాడు. ఆనందంగా హనుమంతుని స్పర్శను లక్ష్మణుడు అనుభవించాడు.

రావణుడు శక్తితో కూడా లక్ష్మణుని ఏం చేయలేకపోయాననే చింతతో రథంపై ఆగిపోయాడు. లక్ష్మణుడు విష్ణువుయొక్క అంశసంభూతుడని తెలుసుకొన్నందువలన రావణుని దెబ్బలు ఆయనను ఏమీ చేయలేకపోయాయి. దానివలన సౌమిత్రి త్వరగా స్వస్థచిత్తుడయ్యాడు.

రథంపై నిశ్చేష్టుడిగా కూర్చున్న రావణునిలో చలనం మొదలైంది. మెల్లగా స్పృహ వచ్చింది. శరీరం అంతా ఆయన అధీనంలో వచ్చేసింది. వెంటనే శత్రు సంహారం చేయాలన్న తలంపు రావణుని మదిలో కలిగింది. అందువలన చేజారిపోయి ఉన్న ధనుస్సును బాణాలను రావణుడు తిరిగి తన చేతిలోకి తీసుకొన్నాడు.

రావణుని యుద్ధ పటిమను తెలుసుకొన్న వానరులు తోకలు ముడిచి అక్కడనుంచి వెనుతిరిగారు. దాన్ని చూచిన శ్రీరాముడు కోదండాన్ని ధరించి రావణునితో పోరుకు సిద్ధమై బయలుదేరాడు. అంతలో హనుమంతుడు ఎదురుగా వచ్చి "శ్రీరామా! విష్ణువు దైత్యులను సంహరించినట్లుగా మీరు నా భుజాలపై ఎక్కి ఆసీనులై వెంటనే ఆ దుష్ట రావణుని నిగ్రహించు" అని చెప్పాడు.

తన ప్రియ సఖుడు చెప్పిన మాటను శ్రీరాముడు అంగీకరించాడు. హనుమంతుని భుజాలపై శ్రీరాముడు కూర్చున్నాడు. వెంటనే హనుమంతుడు శ్రీరాముణ్ణి రావణుని ఎదురుగా నిలిపాడు. వజ్రాయుధ ధ్వనిని మించి

ధనుష్టంకారం చేస్తూ రాముడు రావణునిపై విజృంభించాడు. బలిచక్రవర్తి మీద మహావిష్ణువు విజృంభించినట్లుగా రాముడు రావణుని తునుమాడాలని నిశ్చయించుకొన్నాడు.

"రాక్షసరాజా! ఆగు నీవు నా పట్ల అపకారం చేశావు. ఇక నా నుండి తప్పించుకొని ఎక్కడకు పోగలవు? నీవు ఇక దిక్పాలురను ఇంద్రాది దేవతలను, ఆఖరికి నీ ఇష్టమైన దైవం ఐన శంకరుని ఆశ్రయించినా నా చేతిలో చావును తప్పించుకోలేవు. రావణా! నీవు శక్తి చేత నా తమ్ముని బాధించావు. నా తమ్ముడు విషాదానికి లోనయ్యాడు. ఇక నేను నిన్ను ఉపేక్షింపజాలను. నేను ప్రతిజ్ఞ చేసి వచ్చాను. ఇక నీ పని పట్టి తీరుతాను. నీ బంధు మిత్ర పుత్ర సపరివార సమేతుడవైన నీ పాలిటి మృత్యువును నేనే. ఇది నీకు అంతిమదశ" అని శ్రీరాముడు కోపంతో పలికాడు.

"దశకంఠా!నా శర రుచి నీవు ఎరుగనిది కదా. ఇదుగో ఇప్పుడే వాటి రుచి చూచి నీవు ఆనందించు. నీ స్వజనులైన దండకారణ్య వాసులకు మోక్షం ఇచ్చిన బాణాలే ఇవి" అని రావణుని రాముడు యుద్ధానికి ఉసికొల్పాడు.

రావణుడు కోపావేశుడు అయ్యాడు. రాముని బాధించాలని వాయుసుతుని తన బాణ ప్రయోగంతో బాధించాడు. ప్రళయకాలాగ్ని జ్వాలలాగా ఉన్న రావణుని బాణాలు హనుమంతుని తీవ్రంగా బాధించినా ఆంజనేయుడు తేజస్సును వీడలేదు. హనుమంతుని బాధించిన రావణునిపై శ్రీరాముడు క్రుద్ధుడయ్యాడు.

రావణునిపై వేగంగా దూసుకెళ్ళి రాముడు తన శర ప్రయోగంతో రావణుని రథ చక్రాలను, ధ్వజాన్ని, ఛత్రాన్ని, సారథిని నేలకూల్చాడు. మరలా విజృంభించి రావణుని వజ్రాయుధ సమమైన అశని అనే ఆయుధాన్ని శూలాన్ని, ఖడ్గాలను నాశనం చేశాడు. దేవేంద్రుడు మేరు పర్వతాన్ని ఢీకొట్టినట్లుగా తన అమోఘ శరంతో చందనాది పూతలతో దివ్యాభరణాలతో తేజరిల్లే రావణాసురుని వక్షస్థలాన్ని దెబ్బతీశాడు.

వజ్రాయుధ ప్రహారాలు, పిడుగుపాట్లు ఎన్ని వచ్చినా చలించని రాక్షసేశ్వరుడు శ్రీరాముని ధాటికి తాళలేకపోయాడు. భూకంపంవల్ల చలించే పర్వతంలాగా రావణుడు చలించిపోయాడు. భూకంప పీడితమై నేలరాలే పెద్ద మహావృక్షాల లాగా రావణుని చేతి నుండి ధనుస్సు క్రిందకు జారిపోయింది.

వ్యాకులచిత్తంతో ఉన్న రావణుణ్ణి శ్రీరాముడు చూశాడు. రాముని ధాటికి రావణుడు దిక్కుతోచని వాడయ్యాడు. తరువాత ఏమి చేయాలో కూడా తెలుసుకోలేక వెర్రిచూపులు చూస్తున్న రావణుని కిరీటాన్ని శ్రీరాముడు తన బాణంతో ముక్కలు చేసేశాడు. దానివలన రావణుని శోభ తగ్గిపోయింది. వ్యాకులచిత్తుడయ్యాడు. అలాంటి రావణుని చూసి శ్రీరాముడు జాలిపడ్డాడు.

"రావణా! నీవు అసాధ్యం ఐన రీతిలో యుద్ధం చేశావు. నీవలన నా పక్షంలోనివారు ఎంతోమంది బాధలకు లోనయ్యారు. ఇప్పుడు నీవు చాలా అలసినట్లు కనిపిస్తున్నావు. ఇప్పుడు నేను నిన్ను నా బాణాలతో గురిచేసి మృత్యువు దగ్గరకు పంపను. రాక్షసరాజా! నీవు లంకకు వెళ్లి సేద తీర్చుకో. నీ యుద్ధపు బడలికనంతా పోగొట్టుకొని తిరిగి యుద్ధోత్సాహంతో ధనుర్బాణాలు ధరించి నా ముందుకు రా. అప్పుడు నీ నా బల పరాక్రమాలు తెలుస్తాయి" అని రాముడు చెప్పాడు.

రావణుని రథం, అశ్వాలు, ధ్వజం, సారథి, ఆయుధాలు, కిరీటాలు అన్నీ తునకలు అయిపోవడంతో రావణునకు సంతోషం కరువైంది. చేసేది ఏమీ లేక రాముని మాటలు విని రావణుడు వెనుతిరిగి స్వస్థానానికి వెళ్లిపోయాడు.

శ్రీరాముడు, రావణుడు లంకకు వెళ్లిన తర్వాత లక్ష్మణునకు, వానర ప్రముఖులకు గ్రుచ్చుకొన్న రావణుని బాణాలు తొలగించాడు. శ్రీరాముని చేతిలో పరాజయం పాలైన రావణుని చూచి దేవతలు, నాగులు, యక్షులు, కిన్నరులు, సిద్ధులు, మహర్షులు అందరూ సంతోషించారు. భూమిపైన జలంలో నివసించే జంతువులన్నీ ఎంతో ఆనందించాయి. భూమిపైన నివసించే సాధారణ మానవులతో పాటుగా మునులు, సిద్ధులు, యక్షకిన్నరులు, పక్షులు సర్వ ప్రాణి కోటి రావణునకు రోజులు దగ్గరపడ్డాయని ఆనందించారు. దశకంఠుని పీడ కొద్దికాలంలో నివారణ అవుతుందని నిశ్చయించుకొన్నారు. ఇక మన దైనందిన కార్యాలను ఏ ఆటంకమూ లేకుండా సాగించవచ్చు అని సంతోషించారు. రావణుని స్థితి చూసి లంక మూగవోయింది. ఎక్కడ చూచినా నిశ్శబ్దత ఆవరించి రావణునిలో మరణభయం ఛాయలను పెంచాయి. జయ జయ ధ్వానాలుచేసే వందిమాగధులు, వేదపురాణాలు వల్లె వేసేవారు కూడా మౌనంగా ఉన్నారు.

* * *

# కుంభకర్ణుని ఆగమనం

## సర్గ - 60

రావణుని గర్వం అణగిపోయింది. శ్రీరాముని చేతిలో తన చావు తప్పదని నిశ్చయించుకొన్నాడు. అయినా మూర్ఖుడు గనుక రావణుని మూర్ఖపు పట్టుదల సడలలేదు. గర్వం అణగిపోయినా అతిశయం అణగక శ్రీరామునిపై ఎవరైనా జయం సాధించితే అది నాదేగదా అనే ఆలోచనలో పడిపోయాడు. తనను రక్షించేవారికోసం ఆలోచనలలో వెదకసాగాడు.

రావణుడు మానసికంగా వ్యధ చెందుతున్నాడు. మహిమాన్వితాలైన రాముని శరాలను తలచుకొని రావణుడు తనలో తనే కుమిలిపోతూ కంపిస్తున్నాడు. దివ్యమైన బంగారు ఆసనంపై రావణుడు కూర్చున్నాడు. అతనిని పరిపరి విధాల ఆలోచనలు పిచ్చిపట్టిస్తున్నాయి. అక్కడ కూడిన సచివులతో రాక్షసులతో రావణుడు తన ఆలోచనా పరంపరలను వారికి వినిపిస్తున్నాడు." దేవేంద్రుని మించిన బలశాలి అయి ఉండి కూడా నేను ఒక మానవమాత్రుని చేతిలో ఓడిపోయాను. నేను చేసిన ఘోరతపస్సు అంతా నేడు వృథా అయింది. నీకు మనుష్యుల వలన ఘోర అపజయం కలుగుతుంది అని చెప్పిన బ్రహ్మదేవుని మాటలు నేడు అక్షరసత్యాలు అయ్యాయి. నేను తపస్సు చేసి దేవ, దానవ, గంధర్వ యక్షులనుండి మరణం లేకుండా వరంపొందాను. కాని, నాడు ఈ వానరుల మనుష్యుల వలన మరణాన్ని నేను ఊహించలేక వరాన్ని పొందలేదు. కాలాన్ని నేను సరిగా లెక్క కట్టలేకపోయాను" అని రావణుడు చింతిస్తున్నాడు.

"ఇంతకుముందు ఇక్ష్వాకువంశపు రాజులతో నేను యుద్ధం చేశాను. అపుడు అనరణ్యుడు "దుర్మతీ! నా వంశంలో పుట్టే గొప్ప వీరాధివీరునివలనే నీకు మరణం ఆసన్నమౌతుందని ఆ మహారాజు నన్ను శపించాడు. దశరథ కుమారుడైన శ్రీరాముడే అనరణ్యుడు చెప్పిన ఇక్ష్వాకు రాజు అని నేడు తెలుసుకొన్నాను. నా బంధు మిత్ర సపరివారంగా నశిస్తానని అనరణ్యునివలన నేను శాపం పొందాను."

"కుశధ్వజుని కూతురైన వేదవతి అతిలోక సౌందర్యవతి. ఈమె తపస్సు చేసుకొంటుంటే నేను ఆమె మోహంలో పడి ఆమెను నన్ను భర్తగా అంగీకరించమని తొందరపెట్టాను. ఆమె పరాభవాన్ని తట్టుకోలేక నేను అయోనిజనై పుట్టి విష్ణువును చేకొని నిన్ను నీ వంశాన్ని నాశనం చేస్తానని నన్ను శపించింది. ఆ వేదవతే నేడు సీతగా రూపు దిద్దుకొన్నట్లుంది."

"నేను నా భుజబలాన్ని చూసుకొని చాలా గర్వించేవాణ్ణి. నా ఇష్టదైవానికి నా బలం ఎంత గొప్పదో తెలపాలన్న గర్వంతో ఒకసారి నేను కైలాస పర్వతాన్ని పెకలించబోయాను. దాంతో సుకుమారి అర్ధనారీశ్వరుని అర్ధాంగి ఐన పార్వతి భయపడింది. దానికి కారణం ఐన నన్ను చూసి నీవు ఒక స్త్రీవలన నశిస్తావని శపించింది.

అంతేగాదు, ఒకసారి నేను శివపార్వతులను దర్శించాలని కైలాసం వెళ్లాను. అక్కడ కోతి ముఖంతో ఉన్న నందీశ్వరుడు నన్ను అడ్డగించాడు. నేను కోపంతో ఆ నందీశ్వరుని రూపాన్ని ఎగతాళి చేశాను. అప్పుడు ఆ నందీశ్వరుడు ఈ ముఖం ఉన్న వానరులే నిన్ను అంతం చేస్తారు" అని ఆయన నన్ను శపించాడు.

"ఒకసారి రంభ తన ప్రియుడైన నలకుబేరుని ఇంటికి వెళుతుండడం నేను చూశాను. రంభ అందచందాలు నన్ను వివశుణ్ణి చేశాయి. దాంతో నేను ఆమెను బలవంతంగా అనుభవించాను. విషయం తెలిసిన నలకుబేరుడు పర స్త్రీ వ్యామోహంతో అధర్మానికి పాల్పడినప్పుడు నీవు అంతం అయిపోతావని నన్ను శపించాడు."

వరుణుని కూతురైన పుంజికస్థలపై కూడా నేను మోహంతో అత్యాచారం చేశాను. దానితో కుపితయై పుంజిక నన్ను పరస్త్రీతో నీవు కూడినప్పుడు నీ తల వేయి వ్రక్కలు అవుతుందని శపించింది. ఇందరు మహాత్ములతో శపించబడిన వాడిని నేను. ఇక నాకు ఎవరు దిక్కు? మహాత్ముల శాపాలు వ్యర్థం కావు గదా. నేడు నేను దిక్కులేని అనాథుణ్ణి అయ్యాను" అని చింతిస్తూ తన గతానుభవాలను రావణుడు నెమరువేసుకొన్నాడు.

ఇవన్నీ మనస్సులో ఉంచుకొని యుద్ధ సన్నాహాలు చేయాలి. రాక్షసులందరూ గోపురాలపైన పార్శ్వ ప్రదేశాలలో పొంచి ఉండండి. నాతమ్ముడు ఐన కుంభకర్ణుడు బ్రహ్మను తలచి గొప్ప తపస్సు చేశాడు. ఆయన తపస్సు ఇంద్రాది దేవతలు భయపడి బ్రహ్మదేవుని శరణు కోరారు. బ్రహ్మదేవుడు సరస్వతీ సాయంతో ఆరు నెలలపాటు నిద్రావస్థలో ఉండేటట్లుగా కుంభకర్ణుని శపించాడు. ఆ శాప ప్రభావం వలన నేడు కూడా కుంభకర్ణుడు నిద్రాదేవి ఒడిలో ఆదమరచి ఉన్నాడు. ఆయనను వెంటనే మేల్కొల్పండి! అని రావణుడు తన అనుచరులకు చెప్పాడు.

అంతలో రావణుడి మదిలో శ్రీరాముడు చేసిన పరాభవం కదిలింది. ప్రహస్తుని మృతి గుర్తుకు వచ్చింది. అప్పుడు రావణుడు మీరందరూ యుద్ధ సన్నాహాలలో ఉండండి. ఎవరూ ఏమరుపాటుకు లోనుకాకండి.

కుంభకర్ణునితో శ్రీరామునితో వైరం చెప్పి ఉన్నాను. అతడు తొమ్మిది రోజులనుండే నిద్రకు ఉపక్రమించాడు. తన ఇష్టమైన కాలం అంతా నిద్రించే కుంభకర్ణుని మేల్కొల్పండి!

కుంభకర్ణుడు రాక్షస యోధులలో అగ్రేసరుడు. ఆయన కదనరంగంలో కాలు పెడితే రామలక్ష్మణుల్ని సంహరించడానికి సమర్థుడు. సర్వ రాక్షసులకు సంరక్షకుడు. ఆ మూఢుడు ఎప్పుడూ నిద్రాదేవికి వశుడై ఉంటాడు. అతడు మేల్కొంటే నా పరాభవాగ్నిని శాంతింపచేస్తాడు. కుంభకర్ణునివలననే నా శోకం అంతరిస్తుంది. ఇంద్రసముడైన బలశాలి నా తమ్ముడు, నా అక్కర సమయంలో నన్ను ఆదుకోకపోతే ప్రయోజనం ఏముంటుంది? అందుకే త్వరపడి మీరు ఆ మహావీరుని మేల్కొల్పండి! అని రావణుడు పరిచారకులను ఆదేశించాడు.

రాక్షసేంద్రుని ఆదేశాన్ని రాక్షసులు తలదాల్చారు. కుంభకర్ణుని ఎలా మేల్కొల్పాలా అన్న ఆలోచన చేశారు. రాక్షసులందరూ ఆ ఆలోచనలతోనే కుంభకర్ణుని భవనానికి తరలి వెళ్లారు. ఆయనను మేల్కొలిపే శక్తి కోసం వారందరూ వివిధ భోజ్య పదార్థాలను భక్షించారు. రావణుడు చెప్పినట్లుగా గంధమాల్యాలను వివిధ రకాలైన తినుబండారాలు తీసుకొని రాక్షసుని భవనానికి వెళ్లారు. కుంభకర్ణుని భవనం అగరు చందనాదులతో సుమభరిత వాయువులతో నిండి ఉంది. పెక్కు ద్వారాలు ఉండి అందంగా కనిపిస్తోంది. కుంభకర్ణుని నిశ్వాసాలు అక్కడకు వచ్చిన రాక్షసులను నెట్టివేస్తున్నాయి. వారు చాలా ప్రయత్నంతో ఆ భవనంలోపలకి ప్రవేశించారు. పర్వతసముడై నిద్రిస్తున్న కుంభకర్ణుని చూశారు. కుంభకర్ణుని శరీరంలోని రోమాలు అన్నీ నిక్కపొడుచుకొని ఉన్నాయి. ఉచ్ఛ్వాస నిశ్వాసాలు భయంకరంగా పెద్ద శబ్దంతో వినిపిస్తున్నాయి. అతని నోరు పాతాళంలాగా విశాలంగా ఉంది. ముక్కు పుటాలు భయంకరంగా అదురుతున్నాయి. నిద్రలో కూడా ఆ కుంభకర్ణుడు చూపరులకు భీతిని కలిగిస్తున్నాడు.

మహాకాయులైన రాక్షసులు రుచికరాలైన మాంసాలు మేరుపర్వత ప్రమాణంలో కుంభకర్ణుని ఎదురుగా పెట్టారు. లేళ్లు, దున్నపోతులు, వరాహాలు ఇలాంటి జంతువుల మాంసపు ఖండాలను ఆహారపు రాశిగా ఏర్పరిచారు. రక్తభాండాలు, మద్యం అన్నీ కుంభకర్ణుని కోసం సిద్ధం చేశారు.

ఆ రాక్షసులు కుంభకర్ణుని శరీరానికి సుగంధ ద్రవ్యాలను పూశారు. సువాసనలు వెదజల్లే పూలమాలను అలంకరించారు. దివ్య పరిమళాలను వెదజల్లే ధూపాలు వేశారు. అప్పుడప్పుడు నిద్రనుండి లేవాలని మేఘగర్జన చేశారు. శంఖాలను పూరించారు. ఎంత చేసినా నిద్రావశుడైన కుంభకర్ణుడు లేవలేదు. వారందరిలో అసహనం మొదలైంది.

వారందరూ కలసి పెద్దగా కేకలు వేశారు. బలంగా చప్పట్లు కొట్టారు. అవయవాలను కదిపారు. కోలాహలంగా అరిచారు. శంఖారావాలు, ఢంకామ్రోతలు, తప్పెట్ల ధ్వనులు, సింహగర్జనలు చేశారు. అవి విని పక్షులు భయపడి పారిపోయాయి. భయంవీడక నేలపై పడి చచ్చిపోయాయి.

కుంభకర్ణుడు ఎంతకీ లేవలేదు. ఆయనను లేపే ప్రయత్నంలో ఉన్న రాక్షసులు విసిగి వేసారిపోయారు. ఇనుపకర్రలు, గదలను, రోకలి బండలను చేత బట్టుకొని ఒడలు మరచి నిద్రించే కుంభకర్ణుని శక్తి వంచన లేకుండా బాదారు. అలా బాదేవారిని కుంభకర్ణుని శ్వాసలు వెళ్లి తరుముతున్నాయి.

ఆ వేగానికి వారు అతి ప్రయత్నంపై నిలిచి ఎంతో కష్టపడి కుంభకర్ణుని లేపడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు.

కాటుక వంటి రాక్షసులందరూ ఒక్కుమ్మడిగా అన్ని వాద్యాలతో ధ్వనిని పుట్టించారు. తప్పెట్లు మ్రోగించారు. భేరీ నినాదాలు చేశారు. శంఖాలు పూరించారు. ఢంకాను మ్రోగించారు. గంటలు కొట్టారు. ఎన్ని చేసినా ఆ రాక్షసాధమునికి నిద్ర వదలలేదు. ఎంత ప్రయత్నించినా నిద్ర లేవకపోవడంతో వారు తీవ్ర ప్రయత్నంగా కొరడాలతో అంకుశాలతో పొడిచారు. గుర్రాలు ఒంటెలు గాడిదలతో తొక్కించారు. రోకలి బండతో గట్టిగా మోదారు. వేయి ఢంకాలను ఒక్కసారిగా మ్రోగించారు. ఆ శబ్దం లంక అంతా ప్రతిధ్వనించింది. అయినా కుంభకర్ణుని నిద్ర లేవలేదు.

బ్రహ్మ శాపమోహితుడై నిద్రించే రాక్షసుని చూసి రాక్షసులందరూ కోపగించుకొన్నారు. ఏమి చేయాలో తెలియక తలలు పట్టుకొన్నారు. అందరూ కలిసి శక్తివంచన లేకుండా జుట్టు పీకారు. కాళ్ళు, చేతులమీద ఉన్న రోమాలు పీకారు. చెవులు ముక్కులు ఊడబెరికినట్లుగా లాగారు. కడవలకొద్దీ నీరు తెచ్చి చెవిలో పోశారు. కాని, గాఢనిద్రాపరవశుడైన రాక్షసుడు లేశమాత్రం కూడా కదలలేదు.

బలిష్టులైన వీరులు సమ్మెటలు ముద్గరాలు తీసుకొని కుంభకర్ణుని ఛాతిపై మోదారు. అయినా కించిత్తు కూడా కదలిక లేదు. వారు విసిగిపోయి వేలకొద్ది ఏనుగులను తెప్పించి ఆ మహాకాయుడు ఐన కుంభకర్ణునిపై పరుగులు పెట్టించారు. అప్పుడు దోమల వాలినట్లుగా భ్రమసి కుంభకర్ణుడు పురుగు తాకినట్లుగా దండుకొని కుంభకర్ణుడు కన్నులు తెరిచాడు.

నిశాచరులు ఎన్ని బాధలు పెట్టినా ఆ నిద్రలో ఉన్న కుంభకర్ణునికి ఏమీ అనిపించలేదు. కనీసం చీమ కుట్టినట్లు అయినా బాధ పడలేదు. కాని, నిద్రాభంగం జరిగింది. ఆవులిస్తూ ఆకలి అంటూ లేచాడు. గిరిశిఖరాల లాగా బలిష్ఠంగా ఉన్న బాహువులను చూచాడు. తన సముద్రంలాంటి నోరు తెరిచి వికృతంగా ఆవులించాడు. ఆయన నిట్టూర్పు పర్వతంలోనుండి వచ్చే వాయువులాగా మహా 'గంభీర ధ్వని' పుట్టించింది.

కుంభకర్ణుడు నిద్రలేచి అటు ఇటు చేతులు చాపాడు. ఎదురుగా వరాహ మహిష మాంసఖండాలు కనిపించాయి. వాటిని తినివేశాడు. దాహంకోసం రక్తం త్రాగాడు. కడవలకొలది రక్తం, మద్యం సేవించాడు. ఆయన ఆకలి నెమ్మదించింది. మరల ఒక్కసారిగా శరీరం విరుచుకొన్నాడు.

కళ్లు నులుముకొంటూ తల తిప్పి అటు ఇటు చూశాడు. అప్పటివరకూ ఆయనకు భయపడి దాక్కొని రాక్షసులు అక్కడ కనిపించారు. వారు భయపడుతుండడం చూచి, "మీరేమీ భయపడకండి!" అని చెప్పాడు. తనను త్వరగా లేపడానికి కారణం ఏమిటని ఆశ్చర్యంగా అడిగాడు.

"మహారాజుకు వచ్చిన ఆపద ఏమిటి? ఆ శత్రువు మహేంద్రుడైనా వాణ్ణి మట్టి కరిపిస్తాను. అని పెద్దగా హుంకరించాడు. చిన్న చిన్న కారణాలకు మా అన్న నన్ను లేపరు. అలాంటిది ఆయన నన్ను లేపడానికి కారణం

ఏమిటో నిర్భయంగా చెప్పండి" అని అడిగాడు. మహాబల సంపన్నుడైన కుంభకర్ణుని మాటలకు విరూపాక్షుడు అంజలి ఘటించి జరిగినవిషయం చెప్పాడు.

"కుంభకర్ణా! మహారాజుకు దేవతల వలన నేడు భయం లేదు కాని, మనుష్యులవలన తీరని భయం లంక అంతా ఆవరించింది. పర్వతంవలె ఉన్న వానరులు మన లంక చుట్టూ వ్యాపించి ఉన్నారు. సీతాపహరణం కారణంగా శ్రీరాముడు వానరసేనతో కలసి దాడికి వచ్చి ఉన్నాడు. ఇప్పటికే ఒకసారి శ్రీరాముని దూత ఆంజనేయుడు వచ్చి లంకనంతా ధ్వంసం చేసి చాలామంది రాక్షసులను చంపివేశాడు. వారిలో అక్షకుమారుడు కూడా ఉన్నాడు.

నేడు పౌలస్త్యుడు కూడా శ్రీరాముని చేతిలో పరాజయంపాలై తల ఎత్తుకోలేక చాలా మధనపడుతూ లంకలో ఉన్నాడు. రాక్షస రాజే స్వయంగా రణ రంగంలో సూర్యునిలాగా విజృంభించాడు. కాని, శ్రీరాముని చేతిలో ఓడిపోయి ఆ వీరుని దయతో ప్రాణాలతో లంక చేరాడు. దేవదానవుల చేతిలో ఎవ్వరివలన లంకేశ్వరుడు ఓడిపోలేదు. కాని, నేడు ఓటమి ఆయనను నిద్ర పోనివ్వడంలేదు" అని చెప్పాడు. విరూపాక్షుని ద్వారా అన్న పరాభవాన్ని విని కుంభకర్ణుడు క్రుద్ధుడు అయ్యాడు. "విరూపాక్షా! అన్నకు జరిగిన ఆ పరాభవాన్ని నేను తుడిచివేసి తర్వాత అన్న దర్శనం చేసుకొంటాను. నేడే వానరయోధుల దగ్గరకు వెళ్లి వారి రక్తాన్ని కడుపారా త్రాగి రామలక్ష్మణులను చంపివేసి అన్నకు ఆనందాన్ని కలిగించుతూ అన్న దర్శనం చేసుకొంటాను" అని కుంభకర్ణుడు చెప్పాడు. కుంభకర్ణుడు గర్వంతో రోషపూరితుడై చెప్పే మాటలు మహోదరుడు విన్నాడు. "రాజా! మీరు చెప్పేది చాలా బాగుంది. కాని, ముందుగా రావణుని దర్శనం చేసుకోండి. ఆ ప్రభువు చెప్పిన మాటలు విని మంచి చెడులు ఆలోచించి తర్వాత నిర్ణయం చేసుకోండి" అని చెప్పాడు.

మహోదరుని మాటలతో కుంభకర్ణుడు సంతోషపడి సరే మీరు చెప్పినట్లే లంకేశ్వరుని దర్శనం చేసుకొంటానని చెప్పాడు. ఆయనకన్నా ముందుగా రాక్షసులు గబగబా రావణుని భవనానికి వెళ్లారు. "రావణ ప్రభూ! మీ సోదరుడు కుంభకర్ణుడు మేల్కొన్నాడు. ఆయనను కదనరంగానికి వెళ్ళమని చెప్తారా? లేక మీ దర్శనం చేసుకోమంటారా?" అని అడుగుతున్నారని రాక్షసులు చెప్పారు.

వారి మాటలు విని రావణుడు పరమానందించాడు. తన దగ్గరే ఉన్న రాక్షసులతో "సహచరులారా! ఇపుడు నాకు చాలా ఆనందంగా ఉంది. నా తమ్ముణ్ణి చూడడం కోసం నేను తహతహలాడుతున్నాను. వెంటనే రాజమర్యాదలతో నా దగ్గరకు తీసుకొని రండి. ఇక నాకు వచ్చిన ఆపద ఏమీ లేదు. నా సహోదరుడు ఎవరికీ జంకడు. కుంభకర్ణుడు అరివీర భయంకరుడు. వానిని యుద్ధరంగంలో చూచిన వెంటనే వానరులు కాలికి బుద్ధి చెప్తారు" అని చెప్పాడు. వెంటనే రాక్షసులందరూ "బాగు బాగు" అని చెప్పి కుంభకర్ణుని దగ్గరకు వెళ్ళారు. స్వామీ! రావణ మహారాజు మిమ్ములను దర్శించాలని కోరుకొంటున్నారు అని చెప్పాడు. అన్న ఆదేశాన్ని శిరసావహించాడు.

కుంభకర్ణుడు స్నానపానాదులు ముగించుకొన్నాడు. దాహం తీర్చుకోవటానికి మంచి బలవర్ధకమైన పానీయాన్ని ఇవ్వమని తన సహచరులకు చెప్పాడు. రాక్షసులు రెండు వేల కడవల మద్యాన్ని కుంభకర్ణునికి అందించారు.

తనివితీరా ఆ మద్యం సేవించాడు. ఆయనలో ఉత్సాహం రెట్టింపుఅయింది. అన్న దగ్గరకు కుంభకర్ణుడు బయలు దేరాడు. అతని పాదఘట్టనలకు భూమి కంపించింది. అతని శరీర శోభలు అందంగా కనిపించాయి. ఆయన వెళ్ళేటప్పుడు రాజమార్గానికి ఇరువైపులా పౌరులు నిలబడి అభివాదం చేశారు.

కుంభకర్ణుడు రాజమార్గంలో వెళుతున్నప్పుడు ప్రాకారం వెలుపల ఉన్న వానర యోధులు ఆయన మహాకాయం చూసి భయపడ్డారు. కొందరు పరుగున వెళ్లి శ్రీరాముని శరణువేడారు. కిరీటం ధరించి మహాకాయంతో వెళ్తున్న కుంభకర్ణుని చూచి వానరులు భీతి చెందారు.

* * *

# కుంభకర్ణుని జన్మవృత్తాంతం

## సర్గ - 61

**కి**రీటాన్ని ధరించి దృఢకాయంతో వెళ్ళే కుంభకర్ణుని శ్రీరాముడు చూశాడు. అతని ఆకారం తేజస్సు చూచి రాముడు ఆశ్చర్యచకితుడయ్యాడు. ప్రక్కనేఉన్న విభీషణుణ్ణి ఈ పర్వతాకారుడు ఎవరు? అని అడిగాడు. ఈయనను చూసి వానరులందరూ భీతితో పరుగుపెడుతున్నారు. ఏమిటిదంతా!' అని విభీషణుని రాముడు అడిగాడు.

గోరోచన వర్ణుడు, విశాల నేత్రుడు అయిన కుంభకర్ణుని చూచి రామునితో ఆయన గురించి విభీషణుడు చెప్పాడు." రామా! ఇతడు విశ్రవశుని కుమారుడు. చాలా ప్రతాపశాలి. యుద్ధంలో యముణ్ణి ఇంద్రుణ్ణి ఓడించాడు. ఈ మహావీరుని కుంభకర్ణుడని అంటారు. ఈయన ఎన్నోమార్లు యుద్ధంలో వేలకొలది దేవతలను, దానవులను, యక్షులను, నాగులను తరిమికొట్టాడు. దేవతలు సైతం కుంభకర్ణుని చూచి భయపడతారు.

కుంభకర్ణుడు చిన్నప్పటినుంచి మహా పరాక్రమశాలి. మహాకాయుడు. తన విపరీతమైన ఆకలికి కనిపించిన ప్రాణాలన్నీ భక్షించేవాడు. ఈయనకు భయపడి కొందరు ఇంద్రుణ్ణి శరణు వేడారు. ఇంద్రుడు ఇతనిని మట్టుపెట్టాలనుకొన్నాడు. తన వజ్రాయుధంతో కుంభకర్ణుని కొట్టాడు. ఆ దెబ్బ కొద్దిగా తగిలింది. దాంతో సింహగర్జన చేశాడు. ఆ ధ్వనికి భూమి అంతా కంపించిపోయింది. కుంభకర్ణుడు తనను కొట్టిన మహేంద్రుణ్ణి కోపంగా చూసి ఆయన వాహనం ఐన ఐరావతం దంతం పెరికి దానితోనే దేవేంద్రుని వక్షస్థలంపై కొట్టాడు.

కుంభకర్ణుని ఆ దెబ్బకు దేవేంద్రుడు చింతించాడు. దేవతలు బ్రహ్మర్షులు అందరూ కుంభకర్ణుని చేష్టలకు విసిగిపోయారు. ఇంద్రునితో కలిసి అందరూ బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్లారు. కుంభకర్ణుని దుర్మార్గపు పనులను చతుర్ముఖునికి చెప్పారు. కుంభకర్ణుడు ఇష్టం వచ్చినట్లుగా జనులను తినివేయడం, మునుల ఆశ్రమాలను నాశనం చేయడం దేవతలను, సాధువులను బాధించడం పరస్త్రీలను అపహరించడం ఇలాంటి అన్యాయాలన్నీ బ్రహ్మదేవునితో

చెప్పారు. "ప్రభూ... ఈ కుంభకర్ణుడు తినడం ఇలా ఉంటే కొద్దికాలంలోనే ప్రపంచం అంతా శూన్యం అయిపోతుందని" చెప్పారు.

బ్రహ్మదేవుడు రాక్షసులందరిని పిలిపించాడు. వారిలో ఉన్న కుంభకర్ణుని చూశాడు. పితామహునికే ఆయన్ను చూసి భయంవేసింది. ఆ భయం నుండి తేరుకొని **"కుంభకర్ణా! లోక నాశం కొరకు విశ్రవసుని కడుపున పుట్టినట్లున్నావు. నీ దుర్మార్గం మితిమీరింది. నీవు నిద్రావశుడివైపో!"** అని శపించాడు. దాంతో కుంభకర్ణుడు తన శాపానికి భయపడి తన అన్న ఐన రావణునితో చెప్పుకొన్నాడు. అప్పుడు రావణుడు పితామహునికి నమస్కరించి "పితామహా! మీరు నాటిన మొక్కను మీరే చిదిమివేసినట్లుగా మీ మునిమనుమణ్ణి మీరే శపించడం న్యాయంగాలేదు. మీ పలుకులు అసత్యం కావు కదా! అందుకే నా తమ్ముడు నిద్ర పోవడానికి మేల్కోవడానికి మధ్య కాలవ్యవధిని నిర్ణయించండి. అంతేగాని, మీరు కోపించి పూర్తిగా నిద్రాపరవశుడై ఉండేలా శపించకండి" అని బ్రతిమిలాడాడు.

చతుర్ముఖుడు రావణుని మాటలకు శాంతించాడు. "రావణా ఈ కుంభకర్ణుడు ఆరు నెలలు నిద్రావశుడయి ఉంటాడు. తర్వాత ఒక్క రోజే మేల్కొని ఉంటాడు. తిరిగి నిద్రలోనే కాలం గడుపుతాడు. ఆ మేల్కొన్న ఒక్కరోజు భూమండలం అంతా సంచరిస్తూ ఆకలికి ప్రాణులను ఆవురావురుమని తినివేస్తాడు" అని బ్రహ్మ శాపానికి కాస్త వెసులుబాటు కలిగించాడు.

"శ్రీరామా! నీ పరాక్రమాన్ని చవిచూసిన రావణుడు భయపడిపోయాడు. అందుకే నిద్రపోతున్న ఈ కుంభకర్ణుని లేపాడు. నిద్రనుండి మేల్కొనిన కుంభకర్ణుడు వానరయోధులపై పరుగులు తీస్తున్నాడు. అందిన వారిని అందినట్లుగా తిని వేస్తున్నాడు. అందుకే ఆయనకు వానరులు భయపడి పరుగు లంకించుకొంటున్నారు. ఇపుడు వచ్చే ఈ కుంభకర్ణుని కల్పిత యంత్రమని చెప్పి వానరులను నమ్మించాలి. అప్పుడే వారు భయాన్ని పారద్రోలగలరు" అని విభీషణుడు రామునితో చెప్పాడు.

విభీషణుని మాటలువిని శ్రీరాముడు సంతోషించాడు. ఆ తరువాత నీలునితో వానరులందరిని నగర ద్వారాలను రాజమార్గాలను వంతెనలను ఆక్రమించమని చెప్పండి. మీరందరూ శిలలు, పర్వతాలు వృక్షాలతో సర్వసన్నద్ధంగా ఉండండి అని శ్రీరాముడు యుద్ధవ్యూహాన్ని చెప్పాడు. నీలుడు పారిపోతున్న వానరులకు ధైర్యం చెప్పి శ్రీరాముని ఆజ్ఞను చెప్పాడు. గవాక్షుడు, శరభుడు, హనుమంతుడు, అంగదుడు వీరందరూ ద్వారం దగ్గరే ఎదురు నిలిచారు. శ్రీరాముని ఆదేశంతో వానరులలో సంతోషం వెల్లివిరిసింది. శైలాలను, వృక్షాలను చేతబట్టుకొని అందరూ యుద్ధ సన్నద్ధులై నిలబడ్డారు.

* * *

# కుంభకర్ణుడు - వానర సేన

## సర్గ - 62

పరాక్రమశాలి రాజశ్రేష్ఠుడు ఐన కుంభకర్ణుడు రాజమార్గంలో రావణుని దగ్గరకు బయలుదేరాడు. ఆయనపై రాజవీథులలో పూలుచల్లారు. సూర్య తేజస్సుతో వెలుగొందే రాజభవనంలోకి కుంభకర్ణుడు అడుగుపెట్టాడు. రావణుని భవనమైన పుష్పక విమానంలో సింహాసనారూఢుడైన రావణుని చూశాడు.

దశగ్రీవుడు కుంభకర్ణుని చూచిన వెంటనే తన ఆసనం నుండి లేచి ఎదురేగి తన అక్కున చేర్చుకొన్నాడు. కుంభకర్ణుడు రావణునికి పాదాభివందనం చేశాడు. రావణుని కుంభకర్ణుని లేవనెత్తి తన హృదయానికి హత్తుకొన్నాడు. ఆసనంపై కూర్చోబెట్టాడు. కుంభకర్ణుడు కోపంగా చూస్తూ "అన్నా! మీరు ఎవరి వలన భయపడుతున్నారు? నన్ను నిద్రనుండి ఎందుకు లేపి ఆదరిస్తున్నారు? మీరు నిస్సందేహంగా మీ భయకారణాన్ని నాకు చెప్పండి" అని అడిగాడు. అమోఘబలిశాలియైన తమ్ముడు "అన్నా! నీకొచ్చిన భయమేమి" అని అడుగుతూంటే 'ఆహా! ఇక నాకొచ్చిన భయమేమీ లేదు.'

నా పక్కన నా తమ్ముడున్నాడను కొన్నాడు రావణుడు. రావణుని మనసు ప్రశాంతతను పొందింది. కుంభకర్ణునితో జరిగింది, జరగాల్సింది చెప్పితే సరిపోతుందనుకొన్నాడు. "కుంభకర్ణా! నీవు నిద్రలో వుండడంవలన చాలా విషయాలు నీకు తెలియవు. దశరథ పుత్రుడు రాముడు వానరసేనతో సముద్రంపై వారధి నిర్మించి మనలంకపై దండెత్తివచ్చాడు. మన రాక్షస యోధులందరిని సర్వనాశనం చేస్తున్నాడు. వానరులెవరూ మరణించలేదు. కాని మన యోధులెందరో చనిపోయారు. వానరులు ఎంత ప్రయత్నం చేసినా పరాజితులు కావడంలేదు.

మన కోశాగారం అంతా ఖాళీ అయిపోతోంది. ఈ కష్టకాలంలో ఆదుకొనే దిక్కు నీవేనని మేం తలచాం. అందుకే నిన్ను మేల్కొల్పాం. నీవే రణరంగంలో మనసేనతో కలిసి వీరవిహారం చేసి మన లంకను కాపాడాలి" అని రావణుడు కుంభకర్ణునితో చెప్పాడు. "సోదరా! మీరు అప్పగించిన కార్యం చాలా కష్టమైందే. కానీ, మా సోదరుడివైన నీ కోసం చేయాల్సివస్తోంది" అంటున్న కుంభకర్ణునితో రావణుడు "సోదరా! కుంభకర్ణా! నేను ఇంతవరకు ఏవీ నిన్ను అర్థించలేదు.

నేడు నాకు కాలం ఎదురుతిరిగి ఉంది. అందుకే నిన్ను నాకు సహాయం చేయమని అడగాల్సి వచ్చింది. సోదరా! నీపై నాకు కేవలం సోదర ప్రేమేకాక గొప్ప వీరుడివన్న అభిమానం ఉంది. ఇంతకుముందు నీవు ఎన్నోసార్లు దేవతలను సైతం గడగడలాడించావు. అద్భుత పరాక్రమం నీ సొంతం కదా. ఆ శౌర్యాన్ని నీవు నేడు ప్రదర్శించి విజయలక్ష్మి చేకొనిరా. నీకు సాటివచ్చే వీరులెవరూ లేరు. నీకు యుద్ధప్రీతి చాలా ఎక్కువ. అలానే నీకు బంధు ప్రీతి కూడా అధికమేనని నాకు తెల్సు. మన ఇద్దరిమధ్య ఉన్న ప్రగాఢమైన స్నేహం, సోదర ప్రేమలతో నేను నిన్ను అర్థిస్తున్నాను. ఈ అద్భుత కార్యాన్ని చేసి నీవు వీరాధివీరునిగా ప్రసిద్ధికెక్కాలని నా ఆశ" అని రావణుడు కుంభకర్ణునితో చెప్పాడు.

రావణుడు చెప్పినది విన్నాడు. తప్పుదోవన పోయే అన్నను దారిమార్చలేక పోయాననే విచారం, వీరాధి వీరులను కోల్పోతున్నామనే చింత కుంభకర్ణునిలో ఎక్కువైంది. ఏమి చేసి లంకను కాపాడుకోవాలో నిర్ణయించుకోలేక సతమతమై కాసేపు నిశ్శబ్దంగా ఉన్నాడు. తెలిసి తప్పుచేస్తున్న అన్నతో ఏమని మాట్లాడాలో అనుకొన్నాడు.

* * *

# కుంభకర్ణుని హితవు - బీరాలు

## సర్గ - 63

**కుం**భకర్ణుడు రావణుడు చెప్పినదంతా విని పెద్దగా నవ్వాడు. "రాజా! మనం ఇంతకుముందు ఈ విషయం ప్రస్తావించి ఉన్నాం. ఆనాడు మీరు చేసిన పొరపాటును మీకు చెప్పాము. మీ హితం కోరి చెప్పే మాటలు మీరు వినలేదు. దానివలనే నేడు ఈ ఘోరస్థితి ఎదుర్కోవలసి వస్తోంది. పాపాత్ములకు నరకయాతన తప్పదన్నట్లుగా దోషానికి పరిహారం చెల్లించక తప్పదు."

"అన్నా! మీరు సీతాపహరణకు పూర్వమే యుక్తాయుక్త విచక్షణ చేయలేదు. బలగర్వంతో ఈ అకృత్య పరిణామం గురించి మీరు ఆలోచించలేకపోయారు. **గర్వం ఉన్నవారందరు పనులను తలక్రిందులు చేస్తుంటారు. వారు ఫలితాలను సక్రమంగా అంచనా వేయలేరు. దేశ కాలాలకు అతీతంగా పనిచేసే మూర్ఖులు కాలంతోపాటు నడిచి మంచి ఫలితాలను అందుకోలేరు."**

"ఏ రాజు అయినా రాజ్యకార్యాన్ని సచివులతో ఆలోచించిన తర్వాతే నిర్ణయాలు తీసుకొంటే మంచిది. తాను బలవంతుడై ఉన్నప్పుడు క్షీణదశలోని శత్రువులను దండోపాయం ద్వారా చేజిక్కించుకోవాలి. మన బలం శత్రుబలం సమానమైనప్పుడు సామమే అక్కడ పనిచేస్తుంది. సంధితోనే కార్యాన్ని చక్కబెట్టుకోవాలి. తన బలం క్షీణదశలోను, శత్రుబలం అధికం అయితే దాన ఉపాయం ద్వారా పని చేసుకోవాలి. అంతేకాదు, కార్యాన్ని ప్రారంభించే ముందు ఎవరైనా అంగబలం, అర్ధబలం, దేశకాల పరిస్థితులు, ఆటంకాలు, కార్యసిద్ధి ఉపాయాలు దృష్టిలో పెట్టుకోవాలి."

"ఇవన్నీ ఆలోచించి తన మంత్రులు చెప్పిన మంచిని ఆచరిస్తే ఉత్తమమైన రాజుగా గుర్తింపబడతారు. **ధర్మం, అర్థం అనే పురుషార్థాలను కాలానుసారంగా చేజిక్కించుకోవాలి. కాలాన్ని విస్మరించినవారు అధములు అవుతారు. ధర్మార్థకామాలలో ధర్మమే అన్నింటికన్నా శ్రేష్ఠం అయింది. రాజుగాని, వ్యక్తిగాని ఈ విషయం మనస్సులో పెట్టుకొని ఆచరిస్తే ఆ వ్యక్తి ఉన్నత స్థానాన్ని పొందుతాడు. లేకపోతే జీవితమంతా వ్యర్థం అవుతుంది."**

"రాజశిరోమణీ! మీరు సమయోచితంగా ఆలోచించి తగు నిర్ణయం తీసుకోండి. ధర్మాన్ని ఆచరించేవానికి ముల్లోకాలలోను అపజయం ఉండదు. **విజ్ఞులతో చేయాల్సిన పనుల గురించి ఆలోచించాల్సి ఉంటుంది. తనకు**

**మేలు చేసే కార్యాలనే మనస్సు పెట్టి చేయాలి. తనకు హాని చేసే కార్యాలు ఎంత మంచివి అనిపించినా వాటిని చేయకూడదు."**

"శాస్త్ర జ్ఞాన శూన్యులు అయినవారు ధర్మార్థాలను మరచి వారిని వారే పొగుడుకొంటుంటారు. అనుభవజ్ఞానహీనులు శాస్త్రజ్ఞానం లేనివారిని ఆశ్రయించి కేవలం అర్థం కొరకే అర్రులు చాస్తుంటారు. అయోగ్యులైన మంత్రుల సలహాలను ఎప్పుడూ పాటించకూడదు. హితంకానిదాన్ని గురించి హితకారి అయినట్లు కొంతమంది చెప్తారు. వారి బూటకపు మాటలు పట్టించుకోకూడదు. వారివలన కార్యభంగం వాటిల్లుతుంది. అట్టివారిని ముఖ్య విషయ చర్చలలో చేరనీయకూడదు. ఆరితేరిన శత్రువులు కొందరు దుష్ట మంత్రులతో స్నేహం చేస్తారు. వారు శత్రు సాంగత్యంవలన ప్రభువులతో చెడు కార్యాలను చేయిస్తుంటారు. వారివలన ప్రభువుకు అరిష్టమే కలుగుతుంది."

"శత్రు సాంగత్యంతో ఒనకూడే అర్థంకోసం కొందరు ప్రభువు దగ్గర మిత్రులలాగా వ్యవహరిస్తూ గుట్టుమట్లు తెలుసుకొంటారు. అలాంటివారిని దూరంగా తరిమేయాలి. రాజు వారి వ్యవహారసరళినిబట్టి వారి అసలు రూపాన్ని తెలుసుకోవాలి. జ్ఞానశూన్యులై ఆహార నిద్రా భయాదులే ఎరిగినవారు, ఎప్పుడూ ప్రగల్భాలనే పలుకుతారు. కొన్నిసార్లు చపల స్వభావుడైన రాజు మంత్రుల మాటలతో ఉబ్బిపోయి అసలు తన బలం తెలుసుకోక వారి ఇచ్చగింపు మాటలవలన శత్రువులపై యుద్ధానికి వెళ్లి అపజయం పాలౌతారు. అలాంటివారిని కూడా రాజు దూరంగా ఉంచాలి".

"శత్రుపక్షం వారి బలాబలాలను, శక్తిసామర్థ్యాలను, వ్యవహారసరళిని, కుటిలనీతిని తెలుసుకోనివారు కూడా పరాజితులు అవుతారు" అంటూ కుంభకర్ణుడు తనను రామునిపై యుద్ధం చేయమంటున్న లంకాధీశుడూ, తన సహోదరుడైన రావణునికి హితబోధ చేస్తున్నాడు.

"రాజా! ఇదివరలో విభీషణుడు మీతో సీతాదేవిని రామునకు అప్పగించు అన్నయ్యా! లేకపోతే మన లంకా నాశనం తప్పదు అని నిర్భయంగా చెప్పాడు. కాని, మీరు ఆనాడు ఆ మాట వినలేదు" అంటూ రాజధర్మాలను రావణుడు చేయాల్సినదాన్ని అన్యాపదేశంగా కుంభకర్ణుడు చెప్పాడు. అది విని అసలు సంగతి గ్రహించిన రావణుడు కోపంతో కుతకుతలాడాడు.

అయినా కోపాన్ని నిగ్రహించుకొన్నాడు. "నాయనా కుంభకర్ణా! నీకన్నా నేను పెద్దవాణ్ణి. నేను నీకు గురుడను, ఆచార్యుడను, మాన్యుడను. కాని, నీవు చెప్పేదంతా నిజమే కాని, చేయాల్సిన పని గురించి ఆలోచించక ఇలా మాట్లాడుతున్నావేమి? ఆనాడు నేను బలగర్వంతోనో, అజ్ఞానంవలనో, భ్రాంతివలనో నీ మాటలు వినలేదు."

"కాని, ఇప్పుడు పాత కథలు త్రవ్విపోయడంవలన వచ్చే గొప్పప్రయోజనం ఏమీ ఉండదు. ప్రస్తుతం ఏది చేయాలో నీవు చెప్పు. నేను అలానే చేస్తాను. **తెలివిగలవారు జరిగిపోయినదాన్ని గురించి కాక జరగాల్సినదాన్ని గురించి ఆలోచిస్తారు గదా! పరాక్రమగర్వం చేతనో, లోకనీతికి విరుద్ధంగానో నేను కార్యాన్ని ఆచరించినమాట నిజమే."**

"నేను చేసిన పొరపాట్లను నీవు నీ శక్తిసామర్థ్యాదులతో చక్కపరుచుకో. నాపై నీకు ప్రేమగాని గౌరవాభిమానాలు గాని ఏదైనా ఉంటే, నాకోసం నీకు ఈ పని చేయడం యుక్తం అనిపిస్తే ఈ కార్యంనుంచి గట్టెక్కించు. ఆపదల పాలైన వానిని ఆదుకొనడమే మిత్రుని పని. **ఆపదలలో చిక్కుకొన్నవారిని దరిచేర్చినవారే ఆప్తబంధువు గదా!"** రావణుని తన కోపాన్ని మాటల ద్వారా కుంభకర్ణునికి చెప్పాడు.

కుంభకర్ణుడు రావణుడు కోపంలో ఉన్నాడని తెలుసుకున్నాడు. ఈయనతో పరుషంగాకాక సరళంగా మృదు మధురంగా మాట్లాడాలని నిశ్చయించుకొన్నాడు. వెంటనే కుంభకర్ణుడు, "అన్నా! మీరు ఇంతవరకూ చింతించింది చాలు. ఇక మీరు మీ మనస్సును దిటవు చేసుకోండి. ఇక మీకు వచ్చే ఆపద ఏదీలేదు. నేను నా బొందిలో ప్రాణాలున్నంతవరకు మీకు జయం కలిగేటట్లుగా ప్రవర్తించి మీకు సంతోషాన్ని కలిగిస్తాను.

"సోదరా! మీరు శ్రీరాముని గూర్చే కదా ఇంతగా బాధపడుతున్నారు. ఇక నేను ఆ రాముణ్ణి అంతం చేసి తీరుతాను. సుఖ దుఃఖాది విషయాలలో మంచి చెప్పటం నా విధి కదా. అందుకని నాకు మంచిదనిపించిన దాన్ని మీకు చెప్పాను. ఇక మీ అభిమతం నాకు అర్థం అయింది. ఇక మీరు చింతించాల్సిన అవసరం ఏదీ లేదు. నేను రణరంగంలో విజృంభించి మీకు సంతోషాన్ని కలుగజేస్తాను. మీరే నా పరాక్రమాన్ని చూస్తారు" అని అన్నకు ధైర్యాన్ని ఇచ్చాడు.

"మహారాజా! నేడే నేను కదనరంగం వెళ్లి శత్రువులతో పోరి, రామలక్ష్మణులను సంహరించి వేస్తాను. యుద్ధభూమి నుండి వారి శిరస్సులను తీసుకొని వచ్చి మీకు ఆనందాన్నిస్తాను. కాని, సీతాదేవి మాత్రం ఆ పని వలన దుఃఖిస్తుంది. మన లంకలో ఆప్తులను పోగొట్టుకొన్న వారు ఉన్నారు. అయినా వారందరూ మన విజయానికి సంతోషిస్తారు."

"రావణ ప్రభూ! నేను పర్వతంలాగా సమున్నతుడైన సుగ్రీవుణ్ణి కదనరంగంలో చీల్చి చెండాడుతాను. రక్తసిక్త దేహంతో రణభూమిలో అచేతనంగా పడి ఉన్న సుగ్రీవుని కళేబరాన్ని మీరు త్వరలోనే చూస్తారు. మిమ్ము రక్షించే భారం నాది. నేను మీ శత్రువులైన ఇక్ష్వాకు సోదరులను, వారి సైన్యాన్ని తుదముట్టించి తీరుతాను. శ్రీరాముడు ముందు నన్ను చంపిన తర్వాతే మీదాకా రాగలడు. అంతవరకు మీకు ఏ ఆపద రాదని నేను ప్రతిజ్ఞ చేస్తున్నాను."

"ఓ శత్రుసంహారకా! మీరు నన్ను ఎప్పుడు కదనరంగానికి వెళ్ళమంటారో చెప్పండి. అప్పుడే నేను ఒక్కణ్ణే వెళ్తాను. నాతో సైన్యాన్ని పంపాల్సిన అవసరం లేదు. మీ శత్రువులందరిని రూపుమాపడానికి నేను ఒక్కణ్ణే చాలు. నా పర్వతాకారం, ఆ శూలం చూసి శత్రువులే భయపడి పారిపోతారు."

"ఇంద్రాది దేవతలను సైతం నేను తరిమికొట్టగలను. శస్త్రాలు ఏవీ లేకుండానే నేను నా బలంతో శత్రువులను అణచివేస్తాను. నేను విజృంభించితే మృత్యువే గజగజలాడుతుంది. ఇంద్రుడే యమునిదారి పడతాడు. నా ముష్టి ఘాతాలకు ఆ మానవుడైన రాముడు ఎంతమాత్రం ఎదురు నిలవలేదు. మహారాజా! నేను మీకు అండగా ఉన్నంతవరకు మీరు చింతించాల్సిన భయం ఏదీ లేదు. నేను మీకోసం యుద్ధం చేయడానికి సంసిద్ధంగా

ఉన్నాను. ఆ శ్రీరాముని గూర్చి మరి ఏ ఇతరుల గురించి మీరు భయపడాల్సిన అవసరం లేదు. రణరంగంలో రామలక్ష్మణులను, సుగ్రీవాది వీరులను, జాంబవంతులను ఎవ్వరు ఎదురైనా వారిని సంహరించి వేస్తాను.

మీకు నేను ఎనలేని కీర్తిని సంపాదించి పెడ్తాను. మహారాజా! ఈ మానవులే కాదు చతుర్ముఖుని వలనగాని, ఇంద్రునివలన గాని భయం ఉంటే చెప్పండి. వారిని సైతం నేను నిర్జించగలను.

సర్వభక్షకుడైన అగ్నిని తినివేస్తాను. సూర్య చంద్రాదులను నక్షత్రాదులను కూడా నేలపై రాలగొట్టగలను. నిద్రలేచిన నేను భూమండలంలోని అన్ని ప్రాణులను నా ఆకలికి ఆహుతి చేస్తాను."

"అన్నా! నేను ఇప్పుడే వెళ్లి ఆ రామలక్ష్మణులను హతమార్చి వానరులను తినివేసి వస్తాను. మీరు ఇప్పటినుంచి యథేచ్ఛగా విహరించండి. మీకిష్టమైన పనులన్నింటిని తనివితీరా హాయిగా నిర్భయంగా చేసుకోండి. ఆ శ్రీరాముడు మృత్యుముఖం చేరిన తర్వాత సీతాదేవి మీకు అనుగుణంగా ప్రవర్తిస్తుంది. సోదరా! ఈ లోకంలో మిమ్ములను మించి నాకు ఏదీ లేదు" – అంటూ కుంభకర్ణుడు రావణునికి మంచిని చెప్పాడు.

మూర్ఖుడు అయిన రావణుడు తను చేసింది మంచిపని కాదనే విషయం తెలిసీ దాన్ని సరిదిద్దుకోవడానికి అంగీకరించని మూర్ఖపు పట్టుదలతో ఉన్నాడని తెలిసికొన్నాడు. ఇక కాలం మూడిన వారిని ఎవరూ బాగుచేయలేరని తెలుసుకొన్నాడు. అన్నపట్ల తాను చేయవలసిన కర్తవ్యాన్ని చేస్తానని చెప్పాడు. అలా కుంభకర్ణుడు రావణునకు ధైర్యం చెప్పి రావణుని మనస్సుకు కాస్త హాయిని కూర్చాడు.

* * *

# మహోదరుని ఉపాయం

## సర్గ - 64

**అ**క్కడే ఉన్న మహోదరుడు రావణునితో పాటుగా కుంభకర్ణుని మాటలన్నీ విన్నాడు. అన్నీ విని ఆయన ఉద్దేశాన్ని చెప్పాలనుకొన్నాడు.

"కుంభకర్ణా! మీరు గొప్ప వంశంలో పుట్టి శాస్త్రజ్ఞానాన్ని అభ్యసించారు. కాని, దాని సారం మీకు అర్థం అయినట్లుగా నాకు అనిపించడంలేదు. ఏ సందర్భంలో ఎలా నడుచుకోవాలో ఏ కార్యాన్ని ఎలా సమర్థించుకొని సాధించుకోవాలో మీకు అంతగా తెలీదు. మీలో అహంకారం, గర్వం ఎక్కువగా ఉన్నాయి. అందుకనే రాజులతో హితం అంటూ ఏవేవో చెప్తున్నారు. ధర్మార్థ కామాలకు కారణాలు ఫలితాలు అంటూ వాటి గురించి మీరు వేర్వేరు కారణాలు చూపుతున్నారు. మీరు బాల్య చాపల్యంతో చెప్పే మాటలు నాకు అంత సబబుగా అనిపించడంలేదు.

మహారాజుకు ఉచితానుచితాలు, న్యాయాన్యాయాలు తెలియనివి కావు. ఆయన తన బలాన్ని శత్రు బలాన్ని అంచనా వేయడంలోను వృద్ధిక్షయాలను తెలుసుకోవడంలోను సమర్థుడే. **పెద్దలను సేవించని వారు శరీర బలం**

**ఉన్నా చేయాలనుకొన్న పనిని ఎలా సాధించలేరో, ఆ విధంగానే అనుచిత కార్యాన్ని బుద్ధిమంతుడైన వారు ఎలా మొదలు పెట్టాలనుకొంటాడు?**

"కుంభకర్ణా! ప్రాణులు అనుభవించే సుఖదుఃఖాలకు కారణం వారు చేసుకొన్న కర్మే కదా! పాపాత్ములు కూడా వారు పూర్వజన్మలో సుకృతానుసారంగా నేడు సుఖం పొందవచ్చు. ఈ జన్మలో ధర్మాన్ని ఆచరిస్తూ ఉన్నప్పటికీ పోయిన జన్మలో చేసిన చెడుకర్మల వలన నేడు దుఃఖం అనుభవిస్తూ ఉండవచ్చు. ధర్మార్థసాధకాలైన కర్మలు చేయడం వలన ఇహపరాలలో సుఖం పొందవచ్చు. నిషిద్ధ కర్మలు కూడా లోకానికి కల్యాణ కారణాలు అయితే ఆ కర్మలు చేయడంలో ఏ విధమైన తప్పులేదు.

చూసే దృష్టి కోణాన్ని పట్టి కార్యాలు దోషసహితంగానో, రహితంగానో కనిపిస్తాయి. కాని, వీటిని నిర్ధారించడం, ఎవరికివారు ఆలోచించి తీసుకోవాల్సిన విషయాలు. అంతేగాని, ఒకరు చేసిన పనిని మరొకరు వేలెత్తి చూపడంలో ప్రయోజనం ఉండదు.

ధర్మార్థకామాలలో కామం సకామం అయితే అదే ప్రముఖమైనది కావచ్చు. సకామం వలన లోక కల్యాణం జరుగుతుంది. మన మహారాజు సీతను తీసుకొని రావడంలో దోషం లేదని నిశ్చయించుకొన్నాడు. కామ పరతంత్రులు సుఖాన్ని పొందాలనుకోవడంలో తప్పులేదు గదా. మంత్రులమైన మనమందరం రాజును సమ్మతించాం. ఇప్పుడు మనపై శ్రీరామచంద్రుడు దండెత్తి వచ్చాడు.

అయితే మనం మన రాజు చేసింది తప్పు అని ఎందుకు అనుకోవాలి? మనం పరాక్రమవంతులమే కదా. ఆ శత్రువులను నిర్జించాల్సిన అవసరం ఉంది కాని మీరు చేసింది తప్పు. దాన్ని సరిదిద్దుకోవాల్సిన బాధ్యత మీది అని రాజు చెప్పాల్సిన అవసరం ఎందుకు వస్తోంది?" అంటూ మహోదరుడు రాజు ప్రాపకంకోసం రాజు మెచ్చుకోవాలనే దృష్టితో ధర్మాన్ని ప్రక్కకు తోసి కామమే ప్రముఖం అయినదని, రాజును ప్రక్కదోవ పట్టించటానికి చూశాడు. నా మాటలతో రావణుడు మహదానందపడుతాడు. ఇక నా మాటకు తిరుగుండదు. రాజుకు స్వయాన తమ్ముడైనా సరే, కుంభకర్ణుని మాటకు విలువ లేకుండా చేశాను అని మనసులో ఆనందం పొందుతున్నాడు.

"కుంభకర్ణా! పైగా నేను ఒక్కనినే వెళ్లి శత్రువులను మట్టికరిపిస్తానని మీరు చెప్తున్నారు. అది కూడా యుక్తం కాదు. ఒక్క రాముని చేతిలో జనస్థానంలో 14 వేలమంది రాక్షసులు నిహతులై ఉన్నారు. ఆ రాముడు మన రాక్షసులందరిని చావు దెబ్బతీస్తున్నాడు. అటువంటివాణ్ణి మీరు ఒక్కరే ఎలా ఎదుర్కొనగలరు? ఇది మీ ఆలోచనా రాహిత్యాన్ని తెలుపుతోంది. శ్రీరాముడు రెచ్చిపోయిన సింహంలాగా అగ్రహోదగ్రుడై ఉన్నాడు. ఆ రాముణ్ణి మీరు ఎందుకు తట్టి లేపాలని చూస్తున్నారు? ఆయన చేతిలో చావు తప్పించుకొని భయంతోపారిపోయి వచ్చిన వారు లంకలో తలదాచుకొంటున్నారు. వారు శ్రీరాముని తలచుకోవడానికి కూడా గడగడలాడుతున్నారు. మృత్యువు వంటి శ్రీరాముణ్ణి ఎదురించడం ఎవరికి శక్యమౌతుంది?

మన బలాలన్నింటితో కలిసి వెళ్లినా మీరు విజయం పొందుతారనేది సందేహమే. అలాంటప్పుడు మీరు ఒక్కరే వెళ్లి ఎలా శత్రుసంహారం చేయగలరు? తిరుగులేని బలసంపన్న శత్రువును సామాన్యంగా ఎంచి వారిని లొంగదీసుకోవాలని ఎవరు తలుస్తారు?"

"రాక్షసోత్తమా! మీరు అనాలోచితంగా కార్యానికి పూనుకోవద్దు. శ్రీరాముణ్ణి మించిన యోధుడు ఎవరూ లేరు. మీరు మహావీరునితో యుద్ధం చేయడానికి బాగా ఆలోచించి సాహసం చేయాల్సి ఉంటుంది" అని మహోదరుడు చెప్పాడు.

అటు తిరిగి "ఓ మహారాజా! మీరు సీతపై మనస్సుపడే ఆమెను తెచ్చారు గదా. మరి నేడు ఇలా ఎందుకు మాట్లాడుతున్నారు? మీరు ఆమెను నిజంగా కోరుకుంటే నా మనస్సులోని ఉపాయాన్ని చెప్తాను. మీకిష్టమైతే దాన్ని ఆచరించండి. నా ఆలోచన నాకు సరియైనదనే అనిపిస్తోంది. ఎందుకంటే సీతను తెచ్చిన దగ్గరనుంచి నేటి వరకూ స్థితిని చూసి రాబోయే పరిణామాలను అవగాహన చేసుకొన్న తరువాత నాకు ఈ ఆలోచన వచ్చింది. దాన్ని మీరు అవలోకించి మీ అభిప్రాయాన్ని చెప్పండి" అని మహోదరుడు తన ఆలోచనను రావణునికి చెప్పనారంభించాడు.

"మహారాజా! నేను మహోదరుడు, ద్విజిహ్వుడు, కుంభకర్ణుడు, వితర్ధనుడు వీరు రాముని చంపాలని యుద్ధరంగానికి వెళ్తున్నారని నగరంలో చాటించండి. మీ ఆజ్ఞతో మేము మీ శత్రువును హతమార్చివేస్తాం. అప్పుడు సీతను వశపర్చుకోవడానికి వేరే ఉపాయాలేవీ అక్కరలేదు. మేము కదనరంగంలో శత్రువులతో యుద్ధం చేస్తాం. ఒకవేళ మేం అలసిపోయినా మన శత్రువు జీవించే ఉంటే, మేం రక్తసిక్త దేహాలతో అలసిపోయి వచ్చి మహారాజా! శత్రువులను పరిమార్చితిమి అని చెప్తాం. మీకు విషయం తెలిసినా మీరు సంతోషాన్ని నటిస్తూ మాకు బహుమానాలు ప్రకటించండి. లంక అంతా ఆనంద సాగరంలో ఉండాలని, శత్రు విజయం మనకు లభించిందని, లంకలో చాటింపు వేయించండి. శత్రువులపై విజయం సాధించామన్న వార్త ఆ నోట, ఈ నోట ప్రాకి సీతాదేవికి చేరుతుంది. మీరు వెళ్లి శోకంలో మునిగిన సీతను ఓదార్చు. నీకు నేను ఉన్నాను. నీకు ఇంతకుముందుకన్నా ఎక్కువ సంతోషాన్ని ఇస్తాను అని మీరు ఆమెకు చెప్పండి" అని మహారాజుకు మహోదరుడు చెప్తున్నాడు.

"మహారాజా! సీతకు దుఃఖించాల్సిన అవసరం ఏదీ లేదని చెప్పండి. నీకు అవసరమైనవన్నీ నేను ఇస్తానని నమ్మకంగా చెప్పండి. అపుడు ఇక చేసేది ఏమీ లేక వేరేదారి దొరకక సీత మీకు వశం అవుతుంది.

మనోహరుడైన భర్త నశించాడన్న బాధతో నిరాశకు గురి అవుతుంది. స్త్రీ చాపల్య కారణంతో మీకు వశం అవుతుంది. ఆ దేవి ఇంతకుముందు సుఖసంపదలకు అలవాటుపడింది. ప్రస్తుతం నైరాశ్యంలో సుఖాలకు దూరమై బ్రతుకుతోంది. మీతో ఉన్నట్లు అయితే సుఖాలు దొరుకుతాయని తలచి ఆమె మిమ్ము అంగీకరిస్తుంది.

నాకు ఈ పనే మంచిదిగా కనిపిస్తోంది. నాకు యుద్ధరంగంలో శ్రీరాముని ఎదుట నిలిస్తే మరణం తప్పదని నిశ్చయంగా తెలుసు. అనవసరంగా అక్కడిదాకా పోయి మృత్యువును కౌగిలించుకోవడం కన్నా ఏదో ఒక ఉపాయంతో మన కోర్కెను తీర్చుకోవడమే ఉత్తమం అనిపిస్తోంది. కుంభకర్ణా! మీరు యుద్ధంకోసం ఉబలాటపడవద్దు.

మహారాజా! శత్రు సైన్యాన్ని ఎదిరించకుండా శత్రువులను గురించి ఆలోచనే లేకుండా ప్రయోజనం సిద్ధిస్తుంది. అప్పుడు సైన్యహాని జరగదు. ప్రాణభయం ఉండదు. పైగా యశస్సు, పుణ్యం దక్కుతాయి. శాశ్వతంగా

సకల సంపదలు కీర్తిప్రతిష్ఠలు వస్తాయి. మీకు ఈ పని నచ్చితే ఇదే చేయండి. అన్నింటికన్నా ఉత్తమమైనది ఇదే ఇంతకన్నా సులువైనదిగా నాకు శ్రీరామునితో పోరు సల్పడం అనిపించడంలేదు" అని మహోదరుడు రావణకుంభకర్ణులకు కొత్త ఉపాయం చెప్పాడు.

మహోదరుడు చెప్పేవి అస్తవ్యస్తంగా, గందరగోళంగా అనిపించాయి. రాముని భయం పట్టుకొన్న రావణునికి ఏ ఇతరమైన ఆలోచనా రాలేదు. ఇక కుంభకర్ణుడు ఏం చెప్తాడా! కుంభకర్ణుడన్నా నన్ను ఒడ్డున పడవేస్తాడా అని మహోదరుని మాటలు విని కూడా తన సోదరుని వంక ఆశగా చూస్తున్నాడు.

* * *

# సమరభూమి

## సర్గ - 65

**మ**హోదరుని మాటలను కుంభకర్ణుడు వినక ఆయనను మందలించాడు. తరువాత రావణునికి ధైర్యం చెప్పాడు. "మహారాజా! నేను కదనరంగానికి వెళ్లి సింహంలాగా శత్రువులతో పోరాడి విజయుడినై గర్జిస్తాను. దానిని మీరు విని తీర్తారు. **శూరులు అయినవారు ఊరికినే బీరాలు పోకుండా ఏ కష్టమైన పనిని అయినా శబ్దం లేకుండా చేస్తారు. వారు తమను తాము ఏ పరిస్థితులలోను పొగుడుకోరు. మీరు మహారాజులు నిశ్చింతగా ఉండండి.** నేనే అన్నీ చూస్తాను" అని చెప్పాడు.

"మహోదరా! భయస్వభావులు, ధైర్యం ఏమాత్రం లేకుండానే గొప్ప బలవంతులని చెప్పుకొనేవారు ప్రతిభా పాటవాలు లేకుండా మేధావులని చెప్పుకొనే మీవంటివారి మాటలు వినటం వలననే మహారాజుకు ఈ దుస్థితి వచ్చింది.

మహారాజు ప్రాపకంకోసం ఇచ్చగింపు మాటలు మాట్లాడి, రాజు చెప్పిన దానికి తలలు ఊపే మీ వంటివారి వలనే సీతాపహరణ దుష్కృత్యం జరిగింది. మహోదరా! నీవు నిజంగా మిత్రుని రూపంలో ఉన్న శత్రువువి. నీవంటివారు రాజు చుట్టూ చేరడంవలనే నేడు అందరిని పోగొట్టుకొని రాజు ఒంటరివాడు అయ్యాడు. కోశాగారం అడుగంటింది. సైనిక బలం తగ్గిపోయింది.

మహారాజా! ఇలాంటి కుటిల నీతితో చేసిన పరిస్థితులవలనే ఈ పరిస్థితి దాపురించింది. ఇప్పుడుకూడా ఈ దుర్మార్గపు ఆలోచనలు వద్దు. ఈ పరిస్థితి అంతా చక్కబడడానికి యుద్ధం ఒక్కటే మార్గం.

నేను ఇప్పుడే వెళ్లి యుద్ధంలో విజయం తెచ్చి పరిస్థితులను చక్కబరుస్తాను. మీరు నిర్భయులై ఉండండి" అని కుంభకర్ణుడు రావణునకు చెప్పాడు.

"కుంభకర్ణా! నీవంటి ధీశాలి సుహృద్భావం ఉన్నవాడు ఎవ్వరూ లేరు. నిజంగానే ఈ మహోదరునకు శ్రీరాముడంటే చాలా భయం. అందుకే యుద్ధ ఆసక్తిని చూపించడం లేదు. నీవే ఈ పరిస్థితులను చక్కబరచగల ధీరుడవు. నా భయం తొలగించగల ఉత్తముడు నీవే గదా! నీవు శూలం ధరించి రణభూమికి వెళ్ళి శత్రువులను తునుమాడు. తేజోమూర్తులైన రామలక్ష్మణులను వానరులను భక్షించివేయి" అని రావణుడు చెప్పాడు.

రావణునికి కుంభకర్ణుని బలం బాగా తెలుసు. అందుకే పునర్జన్మ లభించినట్లుగా తలచాడు. నా తమ్ముడు పరాక్రమించితే రామలక్ష్మణులు భయపడి పారిపోతారని గట్టిగా నమ్మాడు. యుద్ధ సన్నాహాలతో కుంభకర్ణుని పంపించాలని తలచాడు.

రాజాజ్ఞతో కుంభకర్ణుడు యుద్ధసన్నద్ధుడు అయ్యాడు. సూర్య సమప్రభావమైందీ, అగ్నికణంలాగా తేజరిల్లేదీ, శత్రువులను క్షణంలో మట్టి కరిపించేది ఐన శూలాన్ని చేత బట్టుకొన్నాడు. "అన్నా! నేను ఒక్కడినే యుద్ధ రంగానికి వెళ్లి వానరులను తినివేస్తాను. నా సైన్యాన్ని ఇక్కడే ఉండనిమ్ము" అని కుంభకర్ణుడు చెప్పాడు. "కుంభకర్ణా! నీవు ఎంత బలవంతునివైనా వానరసైన్యాన్ని తక్కువగా అంచనావేయవద్దు. వానరులు చాలా తెలివిగలవారు చాలామంది ఉన్నారు. పైగా ఒక్కక్షణం ఏమరిపాటుగా ఉంటే వారు దంతాలతో కొరికి నఖాలతో గీరి చీల్చివేస్తారు. అందుకనే నీవు సైన్యంతో వెళ్లి శత్రువులపై విజయాన్ని సాధించు" అని రావణుడు తమ్మునితో చెప్పాడు.

మహాతేజస్వి ఐన రావణుడు లేచి బంగారుహారాన్ని కుంభకర్ణునికి అలంకరించాడు. భుజకీర్తులను ఆభరణాలను స్వయంగా అలంకరించాడు. మంచి సువాసనగల పూలమాలను, చెవులకు కుండలాలను పెట్టాడు. కేయూరాలు, దండకడియాలు, ఇంకా సువర్ణాభరణాలు అన్నీ ధరింపచేశాడు. ఆభరణాలు ధరించిన కుంభకర్ణుడు క్షీర సాగర మథనానికి వాసుకిని చుట్టిన మందర పర్వతంలాగా కనిపించాడు.

కుంభకర్ణుడు విద్యుత్ప్రభలలాగా కనిపించేదీ, అభేద్యమైనదీ అయిన బంగారు కవచాన్ని ధరించాడు. సర్వాలంకార భూషితుడై అన్నను కౌగిలించుకొని ప్రదక్షిణ పూర్వకంగా నమస్కరించాడు. అన్న ఆశీస్సులను అందుకొని సింహగర్జన చేస్తూ యుద్ధానికి బయలుదేరాడు.

ఆయన వెంట చతురంగ బలాలు బయలుదేరాయి. ఢంకానాదాలు, భేరీ నాదాలు, సింహగర్జనలు, శంఖారావాలు చేశారు. రథాలు, ఏనుగులు, గుర్రాలు, ఒంటెలు, గాడిదలపైన కూడా సైనికులు వెళ్లారు. క్రూరమృగాలు, పక్షులను ఎక్కి కూడా కదనానికి రాక్షసులు కదిలివెళ్లారు.

ఎర్రచందనాదులతో ఆభరణాదులతో అలంకరించుకొన్న కుంభకర్ణుడు యుద్ధానికి వెళ్ళే సమయంలో లంకలోని పౌరులందరూ ఆయనపై పూలు చల్లారు. ఛత్రాలు పట్టారు; వింజామరలు వీచారు; కోలాహలంగా నగరమంతా సంతోషంగా ఉన్నారు.

సైనికులందరూ ఆయుధపాణులయ్యారు. కుంభకర్ణుడు తన కామరూప విద్యతో తన ఆకారాన్ని మార్చుకొన్నాడు. వంద బారల లావు, ఆరువందల బారల ఎత్తుతో కుంభకర్ణుడు కనిపించాడు. బండి చక్రల్లాంటి కన్నులు దావాగ్నితో దగ్ధం అయ్యే పర్వతంలాగా కుంభకర్ణుడు కదనానికి వికటాట్టహాసం చేస్తూ వెళ్లాడు.

చక్కని వ్యూహరచన చేశాడు. తన రాక్షసులతో కుంభకర్ణుడు "వానరులందరూ వనాలకు అలంకారంగా ఉండేవారు. వారు మనకు ఏ అపరాధం చేయలేదు. మన ప్రత్యక్ష శత్రువులు రామలక్ష్మణులు. వారిని ఎదుర్కొని విజయం సాధిస్తే ఇక ఈ వానరులతో ఏం పని ఉండదు కాబట్టి, నేను ముందుగా రామలక్ష్మణులతోనే యుద్ధం చేస్తాను" అని చెప్పాడు.

ఆయన అలా చెప్పుతూ ఉండగానే ఇరుపక్షాలు ఘోరంగా రణభేరిని మ్రోగించారు. ఆకాశంలో భూమిమీద కుంభకర్ణునికి అపశకునాలు ఎదురయ్యాయి. నక్కలు ఘోరంగా అరిచాయి. పక్షులు, మృగాలు అపసవ్యంగా తిరిగాయి. చిమ్మచీకటి వ్యాపించింది. వేడిగాలులు వీచాయి. కుంభకర్ణుని ఎడమ భుజం, ఎడమకన్ను అదిరాయి.

కుంభకర్ణుడు మహాకాయంతో లంక నగర ద్వారాన్ని దాటి మహాసాగరంలాంటి వానర సేనను చూశాడు. కుంభకర్ణుని చూచిన వానరులు భయపడి నలుదిక్కులా పారిపోవడం మొదలుపెట్టారు. అది చూసి రెచ్చిపోయిన రావణుని తమ్ముడు గట్టిగా గర్జించాడు.

కుంభకర్ణుని అరుపుకు చాలామంది వానరులు నేలపై పడిపోయారు. కుంభకర్ణుడు ప్రళయకాల రుద్రునిలాగా వానరులకు దడపుట్టిస్తూ యుద్ధరంగంలో కాలుపెట్టాడు.

* * *

# కుంభకర్ణుని వీరవిహారం

## సర్గ - 66

గిరి శిఖరం లాంటి మహోన్నతకాయుడు ఐన కుంభకర్ణుడు రావడం చూచి వానరులందరూ భయంతో పారిపోయారు. వారిని అంగదాదులు చూచి "వానరులారా! మీ శక్తి సామర్థ్యాలను శత్రువును జయించాలన్న కాంక్షను ప్రక్కన పడేసి, శరీరంపై వ్యామోహంతో ఎక్కడికి పారిపోతున్నారు. ఈ మహాకాయుని రూపం మనలను భయపెట్టాలని సృజించుకొన్నది. రాక్షసుల కపటోపాయాలకు మనం భయపడాల్సిన పనిలేదు. మరలి రండు. ఇది వీరి సహజరూపం కాదు. కల్పితం" అని అంగదుడు కుంభకర్ణుని గురించి వానరులకు చెప్పాడు. అప్పుడు వారు ఆ మాటలతో ధైర్యం చిక్కబట్టుకొని తిరిగి వచ్చారు.

వానరులంతా చేతికి దొరికిన గండుశిలలు, పర్వతాలు, వృక్షాలతో కుంభకర్ణుని కొట్టారు. అవి అన్నీ ఆయన శరీరానికి తగిలి ముక్కలై పడిపోయాయి. కుంభకర్ణుడు విజృంభించి తన చేతికి చిక్కిన వానరులను విసిరి వేయసాగాడు. దానితో వారందరూ రక్తసిక్త దేహాలతో రణభూమిలో పడిపోయారు.

కుంభకర్ణుడు విసిరివేయడంతో వానరులందరిలో కొందరు సముద్రంలో పడిపోయారు. కొందరు ఆకాశానికి ఎగిరారు. ఇంకొందరు సేతువుపై పడి వెనక్కు తిరగకుండా పరుగెత్తారు. కొందరు ఆకారంతోనే భయపడి

పలాయనం చేశారు. కొందరు మైదాన ప్రదేశాలకు పారిపోయారు. కొందరు చెట్లపై దాక్కొన్నారు. కొందరు పర్వత గుహలు చేరారు. కొందరు నిద్రను నటించారు. కొందరు చచ్చిపడినట్లు పడిపోయారు. కొందరు చతికిలపడ్డారు. కొందరు లేవలేకపోయారు.

అలా వెళ్ళేవారినందరిని అంగదుడు సంబోధిస్తూ "వానరులారా! పారిపోయి ఎక్కడా బ్రతకలేరు. మృత్యువుకు తెలియని స్థలం ఉండదు. అలాకాక శత్రువుపై దాడి చేస్తే విజయమో, వీరమరణమో లభిస్తుంది. పారిపోతే పిరికి పందలాగా బతకడం వృథా. మిమ్ములను చూసి మీ భార్యలే అసహ్యించుకొంటారు. మీ పిల్లలే మిమ్ములను అవహేళన చేస్తారు. అలా పారిపోయి బ్రతికితే మనలను అనార్యులు అంటారు. చీదర ఛీత్కారాలతో బతికే కన్నా చావడం మంచిదని మీకు అనిపిస్తుంది. ఎదిరించి పోరాడితే బ్రహ్మలోకం సిద్ధిస్తుంది. పారిపోతే అధిలోకం తప్పదు. కుంభకర్ణుడు శ్రీరాముని చేతిలో మరణించక తప్పదు. మనం ఇంతమంది ఉండి ఒక్క శత్రువును ఎదిరించలేమా? మరలిరండి. ఘనకీర్తిని పొందవచ్చు" అని అంగదుడు ధైర్యోత్సాహాలను వానరులలో నూరిపోశాడు.

అంగదుడు ఇలా చెప్తుండగానే పర్వతాకారంతో కుంభకర్ణుడు వారిపైకి వచ్చాడు. ఆయన చూడగానే వానరులందరూ తలోదిక్కు అయిపోయారు. అంగదుడు మరలా మరలా స్వాంతన వచనాలు చెప్పి వారిని ఒక్కటిగా చేశాడు. ఋషభుడు, శరభుడు, మైందుడు, హనుమంతుడు, తారుడు, ద్వివిదుడు, సుషేణుడు, గవాక్షుడు, దంభుడు, నీలుడు, కుముదుడు, పనసుడు మొదలగు వానర ప్రముఖులంతా కుంభకర్ణుని ఎదుర్కోవడానికి బయలుదేరారు.

* * *

# కుంభకర్ణుని మరణం

## సర్గ - 67

**అ**ంగదుని ప్రోత్సాహంతో వానరులందరూ విజయమో వీరస్వర్గమో తేల్చుకొందామని మరలివచ్చారు. హనుమదాదులు కుంభకర్ణునిపై యుద్ధానికి దిగారు. మహావీరులైన వానరులు వృక్షాలను, పర్వతాలను కుంభకర్ణునిపై వేయసాగారు. కుంభకర్ణుడు కోపోద్రిక్తుడై వానరులను విసిరివేస్తున్నారు. ఒక్కోసారి ఏడువందలు ఎనిమిది వందలమంది వానరులను కుంభకర్ణుడు విసిరివేస్తున్నాడు. అలా విసిరివేయగా ఆ వానరులందరూ నేలకు కరచుకొనిపోతున్నారు. ఒక్కోసారి గరుత్మంతుడు సర్పాలను తినివేసినట్లు వానరులను కుంభకర్ణుడు తినివేస్తున్నాడు.

వానరులందరూ ఊకుమ్మడిగా కుంభకర్ణునిపై దాడి చేయాలనుకొన్నారు. ద్వివిదుడు ఒక పెద్ద పర్వతాన్ని కుంభకర్ణునిపై విసిరాడు. ఆ పర్వతం మధ్యలోనే పడిపోయింది.

ద్వివిదుడు విసిరిన పర్వతం క్రింద అశ్వాలు, ఏనుగులు, రథాలు నుగ్గుఅయిపోయాయి. కొందరు వానరులు కూడా పర్వతం క్రిందపడి చచ్చారు. ద్వివిదునివలన చాలామంది రాక్షసయోధులు నేలకూలారు.

ఇరుపక్షాల యోధులు ఒకరిని ఒకరు చంపుకొంటున్నారు. హనుమంతుడు ఆకాశంపైకెగిరి అక్కడనుంచి పర్వతాలు, శిఖరాలు, వృక్షాలు కుంభకర్ణుని శిరస్సుపై వేశాడు. తనపైకి వస్తున్న పర్వతాలను కుంభకర్ణుడు ముక్కలు చేశాడు; వృక్షాలు ఛేదించాడు. తన శూలంతో వానర సైన్యాన్ని పారద్రోలాడు; ఇలా చేస్తూ హనుమంతునిపై కుంభకర్ణుడు దాడికి బయలుదేరాడు.

పరిస్థితిని చూచి హనుమంతుడు ఒక పర్వతాన్ని పట్టుకొని కుంభకర్ణుని ఎదురుగా నిలిచాడు. ఎదురుగా వచ్చి రాక్షసుని గట్టి దెబ్బతీశాడు. ఆ దెబ్బ కుంభకర్ణుని బాగా బాధించింది. కుంభకర్ణుడు కూడా ఆ దెబ్బ లెక్క చేయకుండా వజ్రాయుధంవంటి శూలంతో హనుమంతుని వక్షంపై కొట్టాడు. ఆ దెబ్బవలన హనుమంతుని ముఖం నుండి నెత్తురు చిమ్ముకొచ్చింది. గట్టిగా మహానాదం చేశాడు. గాయపడిన హనుమంతుని చూచి రాక్షసులు ఆనందించారు. వానరులు ఖిన్నులయ్యారు.

నీలుడు కుంభకర్ణునిపై ఒక గిరి శిఖరంతో దాడిచేశాడు. ఆ గిరిని ఒక పిడికిలి పోటుతో కుంభకర్ణుడు పిండి చేశాడు. ఋషభుడు, శరభుడు, నీలుడు, గవాక్షుడు, గంధమాదనుడు అనేవారు కుంభకర్ణునిపై పరుగులు తీశారు. వారందరూ ఒక్కసారిగా వృక్షాలతో, పర్వతాలతో కుంభకర్ణుని బాధించారు. అరచేతితో కొట్టుతూ పిడికిళ్ళతో గుద్దులతో నానా హింసలు పెట్టారు. కాని, అవి అన్నీ కుంభకర్ణునికి చీమ కుట్టినట్లుగా కూడా అనిపించలేదు. అవి ఆయనకు సుఖస్పర్శనే కలుగచేశాయి.

కుంభకర్ణుడు ఒడుపుగా ఋషభుని బాహువుల మధ్య ఇరికించుకొని గట్టిగా అదిమాడు. ఉక్కిరి బిక్కిరై ఋషభుడు నెత్తురు కక్కుతూ నేలపై పడిపోయాడు. శరభుని పిడికిలి పోటుతో బాధించాడు. మోకాలితో నీలుని పొడిచాడు. అరచేతి దెబ్బతో గవాక్షుని హింసించాడు. పాదాలతో గంధమాదనుని తన్నాడు.

వానర ప్రముఖులందరూ కుంభకర్ణుని వీరంగంతో స్పృహను కోల్పోతూ నేలపై మోదుగచెట్లలాగా పడిపోతున్నారు. మహాత్ములు పడిపోవడం చూచి ఒక్కుమ్మడిగా వానర యోధులు కుంభకర్ణునిపై పడ్డారు. ఆయనపై కూర్చుని శరీరాన్ని కొరకడం మొదలుపెట్టారు. గోళ్ళతో రక్కారు. మోకాళ్ళతో కుమ్మారు. వేలకొలది వానరులు ఆయనపై చేరారు. అప్పుడు వానరులతో నిండిన పర్వతంలాగా కుంభకర్ణుడు కనిపించాడు.

తనపైనున్న వానరులను కుంభకర్ణుడు ఆబగా తినివేయడం మొదలుపెట్టాడు. పాతాళం వంటి నోటిలో కుంభకర్ణుడు వానరులను పడవేస్తున్నాడు. అక్కడ పడినవారు ముక్కు రంధ్రాలనుండి, చెవులనుండి బయటకు వస్తున్నారు. దాన్ని చూసి కోపంతో మండిపడిన రాక్షసుడు వానరులను కసిగా నలిపేశాడు. కుంభకర్ణుడు ప్రళయాగ్ని లాగా వానరుల మధ్య తిరిగాడు.

కుంభకర్ణుడు వానరులను అతలాకుతలం చేస్తున్నారు. వారినందరిని భక్షిస్తూ, చిదిమివేస్తూ, వీరవిహారాలు చేస్తున్నాడు. వానరులు కుంభకర్ణుని బాధలకు తాళలేక వికృతంగా అరుస్తున్నారు. వారందరూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని శ్రీరాముని దగ్గరకు పరుగెత్తి 'శరణు శరణు' అంటున్నారు. అంగదుడు కుంభకర్ణునిపై మెరుపు దాడి చేశాడు. మహాగిరి శిఖరాన్ని పట్టి రాక్షసులందరిని చంపుతూ వారిలో భయాందోళనలు కలిగించాడు.

పర్వత శిఖరాన్ని తీసి కుంభకర్ణుని తలపై అంగదుడు మోదాడు. ఆ దెబ్బ కుంభకర్ణునికి బాగా తగిలింది. పట్టరాని ఆవేశంతో అంగదునిపై కుంభకర్ణుడు దాడిచేశాడు. శూలాన్ని విసిరాడు. యుద్ధనేర్పరియైన అంగదుడు శూలపు వేటునుండి తప్పించుకొన్నాడు. వాలి సుతుడు రాక్షసునిపై లంఘించాడు. రక్కసుని వక్షస్థలాన్ని బాగా బాదాడు. కుంభకర్ణుణ్ణి అంగదుని అరచేతి దెబ్బ కళ్లు బైర్లు కమ్మించింది. దాంతో ఎడమచేతిని బిగించి ఒక్క పోటు పొడిచాడు. ఆ దెబ్బకు అంగదుడు స్పృహ తప్పాడు.

అంగదుడు పడిపోగానే కుంభకర్ణుడు సంతోషంగా శూలాన్ని సుగ్రీవునిపై ప్రయోగించాడు. వేగంగా వచ్చే రాక్షసుడి శూలాన్ని చూసి సుగ్రీవుడు పైకి ఎగిరాడు. పర్వత శిఖరం పెకిలించి కుంభకర్ణునిపై విసిరాడు. మరో పర్వత శిఖరం తీసుకొని కుంభకర్ణునిపై పరుగెత్తాడు. ఆ సుగ్రీవుని ఎదురుగా పర్వతాకారంతో కుంభకర్ణుడు నిలిచాడు. అలా నిలబడడం చూసిన సుగ్రీవుడు ఆగి, "ఓ రాక్షసుడా! నీవు మా కపులతో మహా ఘోరయుద్ధం చేశావు. వీరులను రణభూమి అంతా పడేశావు. సైనికులను తినివేశావు. ఇలా నీవు గొప్ప పేరే సంపాదించావు. ఆ సామాన్య వానరులతో ఏమి పోరాడుతావు. ఇప్పుడు నా దెబ్బ కాచుకో "అని సుగ్రీవుడు పౌరుషంగా కుంభకర్ణునితో అన్నాడు. "ఓ వానరా! ఋక్షరజసుని కుమారుడవు. బ్రహ్మదేవుని మనుమడవు. శ్రీరాముని సాయంతో అన్నను చంపించి కిష్కింధకు రాజు అయ్యావు గదా! నీ గొప్పతనం నాకు బాగా తెలుసు. ఊరికే ఎందుకు గర్జిస్తావు?" అని రాక్షసుడు సుగ్రీవుని వెక్కిరించాడు.

ఆ మాటలకు సుగ్రీవుడు కుపితుడై చేతిలో ఉన్న పర్వతాన్ని గిరగిరా త్రిప్పి కుంభకర్ణుని వక్షస్థలంపై కొట్టాడు. అది మహాకాయుని శరీరాన్ని ఢీకొని ఛిన్నాభిన్నమై పడిపోయింది. దాన్ని చూసి రాక్షసయోధులు గర్జించారు. వానరుల ముఖాలు వెలవెలబోయాయి. తన శూలాన్ని విద్యుల్లతలాగా త్రిప్పుతూ సుగ్రీవుణ్ణి వధించాలని విసిరివేశాడు. ఆ క్షణానికి సుగ్రీవుడు ప్రక్కకు జరిగాడు వాయుసుతుడు వచ్చి ఆ శూలాన్ని పట్టుకొని రెండు ముక్కలుగా విరిచేశాడు.

హనుమంతుని బలాన్ని చూసి వానరులు ఎంతో సంతోషిస్తూ సింహనాదాలు చేశారు. పారిపోతున్న వానరులందరూ మారుతి చుట్టూ చేరి జయ జయ ధ్వానాలు చేశారు. దానితో ఒళ్ళు మండి కుంభకర్ణుడు త్రికూట పర్వత శిఖరం నుండి ఒక్క శిఖరం తీసుకొని సుగ్రీవుణ్ణి మోదాడు. ఆ దెబ్బ సుగ్రీవుణ్ణి స్పృహతప్పేటట్లు చేసింది. సుగ్రీవుడు రణభూమిపై పడిపోయాడు. వెంటనే మహాకాయుడైన కుంభకర్ణుడు నేలపై వంగి సుగ్రీవుణ్ణి తన రెండు చేతులతో ఎత్తి పైకి తీసుకొని వెళ్ళిపోతున్నాడు. మేరు పర్వతం వంటి రాక్షసుడు మేఘంలాంటి సుగ్రీవుణ్ణి తీసుకొని పోతుంటే మేరు శిఖరాన్ని వాయువు కొనిపోతున్నట్లుగా కనిపించింది.రాక్షసులందరూ కోలాహలం చేస్తున్నారు. వానర రాజు దుస్థితిని చూసి దేవతలు, వానరులు హాహాకారాలు చేశారు. ఇంద్రసముడైన కుంభకర్ణుడు ఒక్క సుగ్రీవుణ్ణి హరించివేస్తే చాలు మొత్తం వానర సైన్యం చెల్లాచెదరు అయిపోతుంది అని అనుకొంటూ ముందుకు వెళ్తున్నాడు. కుంభకర్ణుణ్ణి వాయునందనుడు చూశాడు. తన కర్తవ్యం ఏమిటా? అని ఆలోచించాడు. ఇప్పుడు వెళ్ళి కుంభకర్ణుని దెబ్బతీసి సుగ్రీవుణ్ణి రక్షిస్తే వానరులందరూ సంతోషిస్తారు. కాని, సుగ్రీవుడు సహజంగా బలోపేతుడు. నాగపాశం నుండి కూడా స్వశక్తితో బంధవిముక్తుడౌతాడు. కుంభకర్ణుని దెబ్బకు స్పృహ తప్పింది.

ఆ స్పృహ నుంచి తేరుకొని ఆ రాక్షసుని బుద్ధి చెప్తాడు కదా. మధ్యలో నేను వెళ్లి ఆ వానర రాజును రక్షిస్తే సుగ్రీవునికి నచ్చదేమో. ఆ వానర రాజుకు ఈ రాక్షసాధముడు ఒక్క లెక్కా? ఓ నిమిషం ఆగి చూద్దాం. అంతలో కుంభకర్ణుని దెబ్బకు పారిపోయే వానరులను ఒక్కటి చేద్దాం అనుకొన్నాడు.

లంక చేరుతున్న కుంభకర్ణుని చేతిలోని సుగ్రీవునికి మెల్లగా స్పృహ రాసాగింది. కుంభకర్ణుని చూసి రాక్షస యోధులందరూ ఆయన విజయాన్ని మెచ్చుకుంటూ పుష్పవృష్టి కురిపిస్తున్నారు. పన్నీటి జల్లులు పూల పరిమళాలతో సుగ్రీవుడు తేరుకొన్నాడు. తాను ఎక్కడ ఉన్నాడో తెలుసుకొన్నాడు. అదును చూసి ఈ వీరుని ముక్కు చెవులను కొరికివేద్దాం అనుకొన్నాడు.

వెంటనే సుగ్రీవుడు రాక్షసుని ముక్కు చెవులను గట్టిగా తన దంతాలతో పట్టుకొని కొరికివేశాడు. అవి తెగి క్రిందపడ్డాయి. గోళ్లతో పార్శ్వభాగాలను గీరేశాడు. ఆ దెబ్బలకు తాళలేక దేహం రక్తసిక్తం అయ్యేసరికి కోపం పట్టలేక సుగ్రీవుణ్ణి గిరగిరా త్రిప్పి నేలపై పడవేశాడు. అలా పడిన సుగ్రీవుణ్ణి రాక్షసులు బాధించడానికి రాగా ఆయన, రివ్వున ఎగిరి ఆకాశమార్గంలో రాముణ్ణి చేరాడు.

ముక్కు చెవులు తెగిన రాక్షసాధముడు మరల యుద్ధభూమికి పరుగుతీశాడు. తన చేతిలో ఆయుధం ఏదీ లేదనుకొని ఒక గదను చేత బట్టుకొన్నాడు. యుద్ధంలో నేర్పరైన కుంభకర్ణుడు ప్రళయకాలాగ్నిలాగా రణభూమిలో విహారం చేస్తూ వానరులను తినివేస్తున్నాడు.

చాలా ఆకలి బాధించడంతో కుంభకర్ణుడు విచక్షణ లేకుండా వానరులను, భల్లూకాలను, పిశాచాలను, రాక్షసులను కూడా తినివేయడం మొదలుపెట్టాడు. ముగ్గురు లేక నలుగురిని చేత చిక్కించుకొని ఒక్క ముద్ద అన్నంలాగా తినివేస్తున్నాడు. వానరులు ఎంతగా బాధిస్తున్నా రాక్షసుడు తినడం మానడం లేదు. దానికి భయపడి వానరులందరూ శ్రీరాముని దగ్గరకు పరుగెత్తారు.

రాక్షసుని ఆగడం చూసి సుమిత్రానందనుడు ఆగ్రహించి యుద్ధానికి తలపడ్డాడు. ఏడు బాణాలతో కుంభకర్ణుణ్ణి సౌమిత్రి బాధించాడు. బాణాలు ఎన్నివేసినా కుంభకర్ణుడు పట్టించుకోలేదు. ముందుకు వెళ్ళుతూ కుంభకర్ణుడు శ్రీరాముని మీదకు విజృంభించాడు. దాన్ని చూసిన రాముడు రౌద్రాస్త్రాన్ని కుంభకర్ణునిపై ప్రయోగించాడు. ఇంకాకొన్ని బాణాలను రాక్షసుని వక్షస్థలాన నాటాడు. రాముని బాణాలకు పీడితుడై కుంభకర్ణుడు ఆయనపై పరుగుతీశాడు. ఆ రాక్షసుని ముఖం నుండి అగ్నిజ్వాలలు బయటకు వచ్చాయి.

అడ్డువచ్చిన వానరులను తరిమివేస్తూ రాక్షసుడు రామునిపైకి పరుగుతీశాడు. నెమలి పింఛాన్ని పోలిన బాణాలను రాముడు కుంభకర్ణునిపై వేశాడు. ఆ దెబ్బకు కుంభకర్ణుని గద జారిపోయింది. ఆయుధాలన్నీ నేలపై పడిపోయాయి.

నిరాయుధుడైన రాక్షసుణ్ణి వానరులు బాధించసాగారు. రాముడు ప్రయోగించిన బాణాలు కుంభకర్ణుని దేహాన్ని ఛిద్రంచేశాయి. రక్తం బయటకు పరుగెత్తింది. ఆయన శరీరం అంతా రక్తంతో తడిసిపోయింది. అయినా కుంభకర్ణుడు పరుగులు తీస్తూ అందిన వారిని అందినట్లుగా నోట్లో పడవేస్తున్నాడు. అందులో వానర భల్లూకాలతో పాటు రాక్షసులూ ఉన్నారు.

కుంభకర్ణుడు ఒక గిరి చేతబట్టి గిరగిరా త్రిప్పి శ్రీరామునిపైకి విసిరాడు. కణుపుతో ఉండి వేగంగా సాగిపోయే బాణాలను ఆ గిరి శిఖరంపై రాముడు వేశాడు. ఆ గిరి రాముని దగ్గరకు రాకుండానే ముక్కలు అయి నేలపై పడిపోయింది. దాని క్రింద చాలామంది వానరులూ అణిగిపోయారు.

లక్ష్మణుడు కుంభకర్ణుని చూచి రాముడితో "ప్రభూ! ఈ రాక్షసుడు విచక్షణ కోల్పోయాడు. వీనిపైకి వానరులందరూ ఎక్కి కూర్చుంటే ఆ బరువుకు వీడు నేలపై కూర్చుంటాడు. అప్పుడు మిగతా అందరూ కలిసి వానిని వధించవచ్చుగదా" అని చెప్పాడు. లక్ష్మణుని మాటలు విన్న వానరులు గబగబా ఆ రాక్షసునిపై ఎగబ్రాకారు. అలా ఎక్కుతున్న వానరులను కుంభకర్ణుడు కోపంగా చూసి ఒళ్ళు విదిలించాడు. ఆ దెబ్బకు వారందరూ చెట్టునుంచి రాలే పుష్పాల్లా పడిపోయారు. రాముడు చూచి ఈ రాక్షసుడు చాలా దుర్మార్గుడు అనుకొన్నాడు.

వెంటనే ధనుస్సు చేతబట్టుకొన్నాడు. అల్లెత్రాడును బిగించాడు. వానరులందరూ సంతోషంగా చూస్తున్నారు. వారందరికి ఆనందం కలిగిస్తూ రాముడు రాక్షసునిపై విజృంభించాడు. అగ్నిలాగా తేజరిల్లుతూ వానరులను భక్షిస్తున్న కుంభకర్ణుని రాముడు చూచి ధనుష్టంకారం చేశాడు. ఆ ధ్వని కుంభకర్ణునికి కోపం తెప్పించింది. కోపంగా రాముని వంక కుంభకర్ణుడు చూశాడు.

అప్పుడు "ఓ కుంభకర్ణా! విచారించకు. ధనుర్ధారినై సిద్ధంగా ఉన్నాను. నిన్ను మృత్యుముఖానికి నేడే పంపిస్తాను. నేనే రాముడను" అన్నాడు. ఇతడేనా రాముడు అంటూ విస్మయంగా చూసి వికటాట్టహాసం చేశాడు. ఆ నవ్వు వానరుల గుండెలు అవిసిపోయేటట్లుగా ఉంది.

"రామా! నేను విరాధుని, కబంధుణ్ణి కాదు. ఖరదూషణాదులవంటి వాణ్ణి కాదు. వాలిని అసలే కాదు. నేను కుంభకర్ణుడను. నీతో యుద్ధం చేయడానికి వచ్చాను. ఇదిగో నా బలమైన గద. పూర్వం దేవాసుర యుద్ధంలో ఈ గదతోనే దేవతలను హరించాను. నన్ను చూచి ముక్కు చెవులు కోయించుకొన్నవాడని చులకన చేయకు. ఇక్ష్వాకు శ్రేష్ఠుడా! నీ పౌరుషాన్ని శౌర్య పరాక్రమాలను నేను కూడా చూచి ఆ తర్వాత నిన్ను తినివేస్తాను" అని అన్నాడు.

వజ్రాయుధంలాంటి బాణాలను రాముడు కుంభకర్ణునిపై వేశాడు. అవి ఆయన్ను ఏ మాత్రం బాధించలేదు. వాలిని సంహరించిన బాణాలు కుంభకర్ణుని ఏమి చేయలేకపోయాయి. రాముని బాణాలు కుంభకర్ణుని శరీరంలో గుచ్చుకొన్నాయి. కాని, అవి ఏవీ ఆయనను చీమంతైనా బాధపెట్టలేకపోయాయి. రాక్షసుడు గదను గిరగిరా త్రిప్పి రామునిపై వేశాడు. దాన్ని శ్రీరాముడు నిరోధించాడు. మరలా గదను చేతబట్టి రాగానే రాముడు వాయవ్యాస్త్రాన్ని కుంభకర్ణునిపై ప్రయోగించాడు. ఆ దెబ్బకు రాక్షసుని చేయి తెగిపడిపోయింది. ఆ చేతి క్రిందపడి ఎందరో రాక్షసులు, వానరులు అసువులు బాశారు. రామ, కుంభకర్ణులమధ్య భీకర యుద్ధం జరుగుతోంది. రాముని బాణ ప్రహారంతో కుంభకర్ణుడు మొండి చేయివాడయ్యాడు. అయినా సాలవృక్షాన్ని పెకిలించి రామునిపై పరుగు తీశాడు. రాముడు ఇంద్రాస్త్రంతో తాళవృక్షాన్ని పట్టుకొన్న చేతిని ఖండించివేశాడు. ఇలా రామకుంభకర్ణులమధ్య జరిగే సమరాన్ని దేవతలు, వానరులు ఆశ్చర్యంగా, అద్భుతంగా చూస్తున్నారు.

రెండు బాహువులు పోగొట్టుకొన్న కుంభకర్ణుడు రామునిపై పడడానికి విజృంభించాడు. అర్ధచంద్రాకార బాణాలను రెండింటిని ఒకేసారి రాముడు ప్రయోగించి ఆ రాక్షసుని పాదాలను నరికేశాడు. ఆ పాదాలు నేలపై పడుతూ పెద్ద శబ్దం కలుగచేశాయి. ఆ శబ్దం లంకలో, సముద్రం రెండింటిలో ప్రతిధ్వనించింది.

కుంభకర్ణుడు చేతులు, కాళ్ళు పోయినా తొడల సాయంతో పైకి ఎగిరాడు. అంతరిక్షం నుండి బడబాగ్నిలాంటి ముఖాన్ని రామునిపై చాచాడు. ఆ దృశ్యం చంద్రుని రాహువు మింగుతున్నట్లుగా కనిపించింది. బంగారు మొనలు దేలిన బాణాలతో కుంభకర్ణుని ముఖాన్ని రాముడు అలంకరించాడు. ఇక ఆ బాధకు తాళలేక నోరు తెరవలేక ఆర్తనాదం చేస్తూ రాక్షసుడు మూర్ఛితుడయ్యాడు.

రఘువీరుడు ఐంద్రాస్త్రాన్ని చేబట్టాడు. అది సాధువులకు శుభం కూర్చేది. బంగారంలో వజ్రాలు పొదగబడి ఉంది. ప్రకాశించే సూర్యునిలాగా ఉంది. ఆ బాణాన్ని కుంభకర్ణునిపై రాముడు ప్రయోగించాడు. అగ్నిజ్వాలలాగా మండుతూ ఆ బాణం కుంభకర్ణుని శిరస్సును ఛేదించివేసింది.

ఆ పర్వతాకారుని తెగిన శిరస్సు పగటికాలంలో ఆకాశాన ఉన్న చంద్రునిలాగా నిస్తేజంగా అయ్యింది. రామ బాణ ప్రహారంతో కుంభకర్ణుని శిరస్సు లంకలో వెళ్లిపడింది. దాని తాకిడికి రాజగోపురాలు ప్రాకారాలు ముక్కలై పడిపోయాయి. కోట్లకొలది వానరులను భయభ్రాంతులను చేసిన కుంభకర్ణుని శరీరం వెళ్లి సముద్రంలో పడిపోయింది. దాని క్రింద ఎన్నో జలచరాలు సర్పాలు చేపల్లాంటివి నుజ్జు అయిపోయాయి.

దేవతలకు, సాధువులకు శత్రువైన కుంభకర్ణుడు పడిపోగానే దేవతలందరూ జయ జయ ధ్వానాలు చేశారు. భూమి, పర్వతాలు కంపించిపోయాయి. రాముని అద్భుత పరాక్రమాన్ని చూచి దేవతలు, సిద్ధులు, మహర్షులు అందరూ సంతోషించారు. దివ్యజాతులవారు ఆకాశాన నిలిచి రామునకు ఆశీస్సులు అందచేశారు. రాక్షసులందరూ కుంభకర్ణుని మరణానికి హతాశులు అయ్యారు. ఘొల్లుమని ఏడ్చారు. సూర్యనారాయణుడు చీకట్లు పారద్రోలినట్లుగా రాముడు దుష్టుడైన కుంభకర్ణుని చంపివేశాడు. వానరులందరూ శ్రీరాముణ్ణి స్తుతించారు. పొగిడారు. ఆనందించారు. వేనోళ్ళ కొనియాడారు. ఘోరరూపుని హతమార్చిన శ్రీరాముడు వృత్రాసురుని చంపిన ఇంద్రునిలాగా కనిపించాడు.

* * *

# రావణుని విలాపం

## సర్గ - 68

**కుం**భకర్ణుడు శ్రీరాముని చేతిలో స్వర్గానికి వెళ్లాడని రావణుడు తెలుసుకొన్నాడు. యుద్ధభూమి నుంచి వచ్చిన రాక్షసులు కుంభకర్ణుని గూర్చి రావణునితో ఇలా చెప్పారు. "మహారాజా! కుంభకర్ణుడు కదనరంగంలో వీరవిహారం చేశాడు. ఒక్కసారికి ఏడు ఎనిమిదిమంది వానరులను తినేవాడు. చేతికి అందినవారిని అందినట్లుగా

తింటూ మిగతావారిని భయభ్రాంతులను చేసి తరిమేశాడు. కాలం తీరడంవలనే ఆ యోధుడు శ్రీరాముని చేతిలో మరణించాడు. శ్రీరాముని బాణపుదెబ్బలకు మీ తమ్ముని మొండెం సముద్రంలో పడిపోయింది. రాముని బాణాల వలనే చేతులు, పాదాలు, కంఠం తెగిపోయాయి.

కుంభకర్ణుని శరీరం నుండి సెలయేరులాగా రక్తం స్రవించింది. దావాగ్ని చేత దగ్ధం అయిన మహావృక్షంలాగా కుంభకర్ణుడు పడిపోయాడు. ఈ వార్తను మాకు చాలా నిరాశను కలిగించింది. మామీద మాకు నమ్మకం పోయింది. మహాప్రభూ! మీ తమ్ముడు యుద్ధరంగం నుంచి స్వర్గానికి చేరుకొన్నారు" అని రావణుని సైన్యాధికారులు విచారిస్తూ విషయం చెప్పారు. ఇదంతా విన్న రావణుడు అంతులేని శోకసముద్రంలో కూలిపోయాడు. రావణుని కుమారులైన దేవాంతకుడు, నరాంతకుడు, త్రిశిరాసురుడు, అతికాయుడు పినతండ్రి మరణ వార్త విని ఎంతో దుఃఖించారు.

ఎంతటి క్లిష్టకార్యం అయినా అవలీలగా సాధించే కుంభకర్ణుని మరణం సోదరులైన మహోదరుని మహా పార్శ్వుని దుఃఖంలో ముంచేసింది. రాక్షసశ్రేష్ఠుడు దిగాలుపడి కూర్చుండిపోయాడు.

"అయ్యో కుంభకర్ణా! నీవు మహాబలశాలివి. మహావీరునివైన నీవు నన్ను వీడి విధివశంతో మృత్యువు పాలయ్యావు. నీవు అసహాయశూరుడివై ఆపదలోనున్న నన్ను మన వంశాన్ని ఉద్ధరిస్తావని నేను కలలు కన్నాను. సోదరా! నీవు నాకు కుడిభుజం వంటివానివి. నీవు అండగా ఉన్నంతవరకూ నేను ఎవరికీ భయపడలేదు.

ప్రళయకాల రుద్రునివై దేవతలనే నిర్జించగలిగిన నీవు నరాధముని చేతిలో నిహతుడివయ్యావంటే నేను నమ్మలేకున్నాను. వజ్రాయుధం కూడా నిన్ను బాధింపలేదుగదా. రామబాణాహుతికి నీవు ఎలా అంధకారంలో మునిగిపోయావు? నీవు మరణించడం చూసి గగనాన మహర్షులు దేవతలు అందరూ సంతోషిస్తున్నారు.

"సోదరా! నీ మరణంవలన వానరులలో ఉత్సాహం పెరిగినట్లుంది. వారు లంకా ద్వారాలను, ప్రాకారాలను అధిరోహిస్తారు. ఇది నిశ్చయం. నీవే లేనప్పుడు నాకు ఈ రాజ్యం ఎందుకు? ఈ భోగలాలస ఎందుకు? నేను నీతోనే వస్తాను. నాకు ఈ జీవితంపైనే విరక్తి పుడుతోంది. నీవు లేకుండా నేను క్షణం కూడా జీవించలేను. నేను దేవతలను ఎంతో బాధించాను.

వారు నేడు నీవు లేని నన్ను చూసి నవ్వుతున్నారు. ఈ స్థితిలో నేను ఇంద్రుని ఎలా ఎదిరించగలను? ఇంతకుముందే విభీషణుని చెప్పిన మంచి మాటలను నేను వినలేదు. నా మూర్ఖత్వమే నాకీస్థితి తెచ్చిపెట్టింది.

మంచి మాటలు వినకపోయాననే పశ్చాత్తాపంతో నేను సిగ్గుపడుతున్నాను. నేను మంచి చెప్పే విభీషణుని, వీరుడివైన నిన్ను దూరం చేసుకొన్నాను. నా పాపకర్మ వలనే నేడు నేను ఒంటరిని అయ్యాను. ఇక నన్ను బాగుపరిచేవారు కానీ, ఉద్ధరించేవారు కానీ, 'అన్నా! నీకు నేను ఉన్నాను నీకు భయమేదీ లేదు' అని చెప్పేవారెవరూ లేని ఒంటరివాణ్ణి అయిపోయాను" అని రావణుడు చింతించాడు. కుంభకర్ణుని కోల్పోయిన రావణునిలో పశ్చాత్తాపాగ్ని బయలుదేరింది.

ఇంతకుముందు చేసిన పాపాలను రావణుడు నెమరేసుకోవడం మొదలుపెట్టాడు. నేను చాలా పెద్ద తప్పుచేశాను. నిద్రపోయే నా చిన్ని తమ్ముని అనవసరంగా నిద్రలేపాను. నేనే కదనరంగంలో వీర విహారం చేసి ఆ సోదర ద్వయాన్ని చంపిపారేసి ఉంటే సరిపోయేది. ఒక్కో వీరుని పంపించి నేను సమరభూమికి నా బలగాన్ని ఆహుతి చేస్తున్నట్టుంది అనే ఆలోచనలలో రావణుడు కూరుకుపోయాడు.

లంకలో అంతా నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. రాజాంతఃపురంలో కూడా మౌనమే ఆక్రమించుకొన్నది. రాజవీథులలోనే కాదు, సామాన్యుల పరిసరాలు కూడా కుంభకర్ణుని నిష్క్రమణానికి చిన్నబోయాయి.

* * *

# నరాంతకుని సంహారం

## సర్గ - 69

రావణుడు కుంభకర్ణుని మరణానికి చాలా చింతించాడు. తనలోని తప్పులను నెమరువేసుకొంటూ రావణుడు పశ్చాత్తాపాగ్నిలో దహించిపోయాడు. కుంభకర్ణుని ప్రతిభను గుర్తుతెచ్చుకొనేకొద్దీ రావణునిలో పరితాపం మితిమీరింది. అలా దుఃఖించే రావణుణ్ణి అతని కుమారుడైన త్రిశరుడు చూశాడు. ఆయనకు తండ్రిని ఓదార్చాలనిపించింది. "తండ్రీ! పినతండ్రి మరణం విధి నిర్ణయం. విధికి అందరూ తలవంచాల్సిందే కదా. అన్నీ తెలిసిన మీరు కూడా సామాన్యునిలాగా విలపించడం అంత బాగా లేదు. తండ్రీ! మీ దగ్గర బ్రహ్మ ప్రసాదించిన శక్తి, కవచం, ధనుర్బాణాలు ఉన్నాయి కదా.

అంతేగాదు, మీ రథం దివ్యమైంది. దానికి వంద కంచరగాడిదలను పూన్చవచ్చు. దానిమీద ఎక్కి మీరు వెళ్ళుతుంటే ఆ చక్రపు సవ్వడి మేఘ గర్జన లాగా వినిపిస్తుంది. మీరు ఎన్నోసార్లు ఆ రథంపై వెళ్లి దేవతలను పరాజితులను చేసి వచ్చారు. వివిధాయుధ సంపన్నులైన మీరు శ్రీరాముణ్ణి ఎదిరించగలరు.

మహారాజా! నాకు మీరు ఆజ్ఞ ఇచ్చినట్లు ఐతే నేను వెళ్ళి శత్రువులను మట్టి కరిపించి వస్తాను. గరుత్మంతుడు సర్పాలను భయపెట్టినట్లుగా నేను శత్రువులను భయపెట్టగలను. దేవేంద్రుడు శంభరాసురుని సంహరించినట్లుగా, మహావిష్ణువు విప్రచిత్తి, సింహిక కుమారుడైన నరకుని సంహరించినట్లుగా, నేను శ్రీరాముణ్ణి సంహరించివస్తాను.మీరు చింతించకండి" అని రావణునికి చెప్పాడు. ఇలా చెప్పే త్రిశరుని మాటలు రావణునిలో మళ్లీ ఆశను చిగురింపజేశాయి. మళ్ళీ గెలుస్తాననే ఆశ రావణునిలో తలఎత్తింది. త్రిశిరుని మాటలు విని రావణుని కుమారులు అందరూ యుద్ధ సన్నద్ధులు అయ్యారు.

నరాంతకుడు, అతికాయుడు మొదలగు రావణుని కొడుకులందరూ నేను ముందు అంటే నేను ముందు అంటూ యుద్ధానికి పోవడానికి చాలా ఉత్సాహం చూపారు. వారిని చూచి రావణునికి పోయిన ప్రాణం లేచి

వచ్చినట్లు అయింది. ఈ వీరులందరూ దేవతల దర్పాన్ని అణిచినవారే. దేవ గంధర్వ కిన్నెర నాగులలో ఏనాడు పరాజితులు కాలేదు. యుద్ధ విద్యలలో ఆరితేరినవారు శాస్త్ర పారంగతులు తపస్సులు చేసి మెప్పు పొంది వరాలను పొందినవారే వారందరూ.

అటువంటి కుమారులతో ఉన్న రావణుడు దేవతలతోనున్న దేవేంద్రునిలాగా కనిపించాడు. వారందరికి ఆభరణాలు ధరింపజేసి అక్కున చేర్చుకొని శుభాశీస్సులతో యుద్ధ రంగానికి పంపాడు. వారితోపాటు మహాపార్శ్వుడు మహోదరుడు కూడా వెళ్ళారు. వారందరు తండ్రికి నమస్కరించి యుద్ధోన్ముఖులు అయ్యారు. మహాబలశాలురైన రావణుని కుమారులు త్రిశిరుడు, అతికాయుడు, దేవాంతకుడు, నరాంతకుడు, మహోదర, మహాపార్శ్వులు రణోన్మత్తులై కదనరంగానికి కదలివెళ్ళారు. మహోదరుడు సుదర్శనం అనే గజంపై ఎక్కి అస్తాద్రికి చేరిన సూర్యునిలాగా కనిపించాడు. ఆయుధాలతో సమృద్ధంగా ఉన్న రథాన్ని త్రిశిరుడు మూడు బంగారు కిరీటాలను ధరించి ఎక్కాడు. బంగారు శిఖరాలతో వెలుగొందే హిమాలయం లాగా త్రిశరుడు కనిపించాడు. తూణీరాలు, ధనుస్సులు, ఈటెలు, ఖడ్గాలు, పరిఘలతో ఉన్న విశిష్ట రథాన్ని అతికాయుడు అధిరోహించాడు. మేలైన గుర్రాలను కూడా ఆ రథానికి పూన్చారు.

నరాంతకుడు తెల్లని ఉచ్చైఃశ్రవాన్ని ఎక్కాడు. ఆ గుర్రం మనోవేగంలో వెళ్ళేది. తోకచుక్కలాగా మిలమిలలాడే ఈటెను పట్టుకొని నరాంతకుడు పేరును సార్థకం చేయాలనే ఉబలాటంతో పరుగెత్తాడు. దేవాంతకుడు వజ్రఖచితమైన గదను ధరించి నెమిలి ఎక్కి సమరభూమికి బయలుదేరాడు. దృఢకాయుడైన మహాపార్శ్వుడు గదను ధరించి కదన రంగం వైపు కదిలాడు. ఆ రావణ సుతులననుసరించి గుర్రాలు, ఏనుగులు, రథాలు, కాల్బలాలు బయలుదేరాయి. అవి అన్నీ మేఘ గర్జన చేస్తూ రణరంగాన్ని బీభత్సం చేయాలనే కోరికతో ఉవ్విళ్ళూరాయి.

రాక్షసులందరూ గర్జిస్తూ, భేరీలను మ్రోగిస్తూ, శత్రువులను కవ్విస్తూ, సింహనాదాలు చేస్తూ, జబ్బలు చరుస్తూ యుద్ధోత్సాహం ఉరకలు వేస్తుండగా కదిలారు. వారి ధ్వనులు భూమిని కంపించాయి. వారందరూ అలా వెళ్లి శిలలు, వృక్షాలు పట్టుకొని తమకై నిరీక్షిస్తున్న వానరులను చూశారు. ఇరుపక్షాల సైనికులు సమరోత్సాహంతో ఉన్నారు. ఆయుధ పాణులై ఒకరికొకరు కత్తులు నూరుతున్నారు.

రాక్షస సేనలను చూడగానే వానరులలో కోపం మించింది. ఒకపెద్ద గండశిలలు చేతబట్టారు. రణావేశం వారందరిలో పెల్లుబికింది. ఒక్కసారిగా దిక్కులు అదిరేటట్లుగా సింహనాదం చేశారు. ఇరుసైనికులు కలబడ్డారు. వానరులు క్రోధావేశంతో ఆకాశంపైన, నేలపైన ఉంటూ శిలలతో, వృక్షాలతో శత్రువులను మట్టి కరిపిస్తున్నారు. రాక్షస యోధులు తమ తమ ఆయుధాలతో కపులను కత్తికి ఒక కండగా చేస్తున్నారు. ఆ సమరం మహాఘోరంగా సాగుతోంది. ఇద్దరిలో ఎవరూ తీసివేయాల్సినవారు లేరు. రణకౌశలనేర్పరులైన వారు అమితోత్సాహంతో యుద్ధం చేస్తున్నారు. రాక్షసులపైన శిలలు, వృక్షాలు వర్షిస్తే, కపులపై గదలు, శూలాలు, ఈటెలు బాణాలు వర్షిస్తున్నాయి. రణరంగంలో ఆర్తనాదాలు పెడబొబ్బలు హాహాకారాలు మిన్నుముట్టుతున్నాయి. ఆయుధాలు, ముష్టిఘాతాలతో గాయపడిన సైనికుల రక్తం కాలువలై ప్రవహించింది. పర్వతాకారులైన రాక్షసులు చెల్లాచెదురుగా పడిపోయారు.

కపులు వారి ఆయుధాలను చేతనైనంత వరకూ విరగగొట్టి పోశారు. వారిని పిడికిళ్ళతో పొడుస్తూ విసిరివేస్తూ కాళ్ళతో కొడుతూ యుద్ధం చేస్తున్నారు.

రాక్షసులను, వానరులను రెండు చేతులతో పట్టుకొని వారిని వారిచేతనే కొట్టిస్తున్నారు. నిశాచరులు వారి శిలలు పట్టుకొని వాళ్ళవాళ్ళనే మోదడం ప్రారంభించారు. వానరులను ఆయుధాలను తమ చేతుల్లోకి తీసుకొని వాటితో వారి ప్రాణాలకు ఎసరు పెడుతున్నారు. కపివీరులు రథాలను విరగొడుతున్నారు. ఏనుగులను, గుర్రాలను బాధిస్తున్నారు. వృక్షాలతో రాక్షసులను కొడుతున్నారు. వానరులను రాక్షసులు గదలతో బాదుతున్నారు. వారిమధ్య సంకీర్ణ సమరం సాగుతోంది. నరాంతకుని అంగదుడు సంహరించివేశాడు. నరాంతకుని మరణం దేవతలందరిలో హర్షాన్ని రేకెత్తించింది. దేవతలు, సిద్ధులు, మహర్షులు, వానరులు జయధ్వానాలు చేశారు. అనితర సాధ్యమైన ప్రతాపంతో నరాంతకుని నేలకూల్చిన అంగదుని బాహుబలాన్ని అందరూ మెచ్చుకొన్నారు. ఆ మెచ్చుకోలు వలన అంగదునిలో వీరావేశం పెల్లుబికింది. మరల అంగదుడు యుద్ధోత్సాహుడు అయ్యాడు.

* * *

# రావణుని కుమారుల వరుస మరణాలు

## సర్గ - 70

అంగదుని చేతిలో నరాంతకుడు యమపురికి వడివడిగా చేరాడు. ఇది రావణుని కొడుకులలో ఆగ్రహాన్ని పెంచింది. త్రిశరుడు, మహోదరుడు సోదరుని మరణానికి హాహాకారాలు చేశారు. మహోదరుడు ఏనుగుపై ఎక్కి అంగదునిపై కాలు దువ్వాడు. పరిఘ పట్టుకొని తన సోదరునికి హాని చేసిన అంగదుని మట్టి కరిపించాలని మహోదరుడు దుమికాడు.

సోదరుని మృతికి పరితపించిన దేవాంతకుడు అంగదునిపైకి ఉరికాడు. త్రిశిరుడు సూర్యకాంతులీనే రథం ఎక్కి అంగదునికి పైకి విజృంభించాడు. ఆ ముగ్గురు తనపై రావడం అంగదుడు చూశాడు. ఒక పెద్ద వృక్షాన్ని పట్టుకొన్నాడు. పెద్ద పెద్ద కొమ్మలున్న ఆ వృక్షాన్ని త్రిప్పి దేవాంతకునిపై వేశాడు. దేవాంతకుడు తన శర ప్రయోగంతో ఆ చెట్టును ముక్కలు చేశాడు.

అంగదుడు పైకి ఎగిరి అక్కడనుంచి వారిపై శిలలు వృక్షాలు కురిపించాడు. త్రిశిరుడు దేవాంతకుడు ఆగ్రహంతో అంగదుడు విసిరివేస్తున్న వాటిని భగ్నం చేస్తున్నారు. మహోదరుడు వజ్రాయుధతుల్యమైన ఈటెలతో విజృంభించి అంగదుని వక్షస్థలంపై దెబ్బతీశాడు.

అదే సమయంలో దేవాంతకుడు పరిఘతో అంగదుని బాధించాడు. ముగ్గురూ ఒకేసారి అంగదుని చుట్టుముట్టి బాధించినా అంగదునిలో లేశమాత్రం కూడా పౌరుషం తగ్గలేదు. అంతకంతకు రెచ్చిపోతూ వారిని హింసిస్తూ వారిని ప్రతిఘటిస్తున్నాడు. విద్యుత్ తీగలాగా అంగదుడు పైకి ఎగిరి తన పిడికిలితో మహోదరుని ఏనుగు తలపై

బాదాడు. ఆ దెబ్బకు ఏనుగు కళ్ళు రాలి క్రింద పడ్డాయి. గావుకేకపెడుతూ అది నేలపై పడిపోయింది. ఆ ఏనుగు దంతం పెరికి అంగదుడు దేవాంతకునిపై విజృంభించాడు.

అంగదుని వీరత్వానికి దేవాంతకునికి ముచ్చెమటలు పట్టాయి. అవయవాలన్నీ పట్టుదప్పి వృక్షం నేలకూలినట్లుగా దేవాంతకుడు రణభూమిలో కూలిపోయాడు. ఆయన నోట్లోనుండి రక్తం బయటకు వచ్చింది. అయినా ఆ మహా పరాక్రమశాలి మరలా లేచి తన చేతిలోని పరిఘను త్రిప్పి అంగదుని వక్షస్థలంపై బలంగా కొట్టాడు.

అంగదుడు ఆ దెబ్బకు నేలపై పడబోతూ నిలదొక్కుకొని ఆకాశంలోకి ఎగురుతుండగా త్రిశిరుడు మూడు వాడియైన బాణాలను అంగదుని ఫాలభాగంపై వేశాడు. అలా ముగ్గురు ఒక్క అంగదునిపై దాడి చేయడం హనుమంతుడు నీలుడు చూశారు. ఆగ్రహావేశాలతో అక్కడికి వచ్చారు. పర్వతాన్ని తీసుకొని త్రిశిరునిపై నీలుడు విసిరాడు. వేగంగా వచ్చే పర్వతాన్ని చూచి త్రిశిరుడు తనబాణాన్ని వేసి పర్వతాన్ని నుగ్గుచేశాడు.

కోపావేశంతో హనుమంతుడు దేవాంతకునిపై దాడికి పూనుకొన్నాడు. హనుమంతుడు తన దగ్గరకు రావడం చూసి దేవాంతకుడు ఆనందంతో పరిఘను తీసుకొని ఎదురెళ్లాడు. హనుమంతుడు శత్రువును ముందుకు రానిచ్చి ఒక పిడికిలితో గుద్దు గుద్దాడు. ఆ దెబ్బతో దేవాంతకుడు దిక్కులు పిక్కటిల్లేలాగా గర్జించాడు. ఆ గర్జనకు రాక్షసులే భయపడ్డారు. దేవాంతకుని తల పిండి ముద్ద అయింది; దంతాలు వూడాయి; నాలుక బయటకు వచ్చింది. గుడ్లు తేలేసి అసువులు కోల్పోయాడు.

దేవాంతకుని కూడా పోగొట్టుకొని త్రిశిరుడు రుద్రుడయాడు. ప్రళయ కాలాగ్నిలాగా నీలునిపై శరపరంపరను వేస్తున్నాడు. మహోదరుడు కూడా ఆగ్రహావేశాలతో మదగజం ఎక్కాడు. నీలుని వక్షస్థలంపై బాణాలను ఎక్కుపెట్టి వరసగా వేయసాగాడు. ఇద్దరు మహావీరుల శరవర్షంలో నీలుని వక్షస్థలం బాగా దెబ్బతింది. శరీరం శిథిలం అవుతుండగా నీలుడు స్పృహ కోల్పోయాడు. మరల తేరుకొని ఒక్క పెద్ద పర్వతం తీసుకొని మహోదరుని తలపై బాదాడు.

ఆ పర్వతం దెబ్బకు మహోదరుని తల పగిలింది. ఏనుగుతో పాటుగా ఆ వీరుడు నేలకొరిగాడు. యముడు మహోదరుని అతిథిగా ఆహ్వానించాడు. ఇద్దరు సోదరులు మరణానికే పరితపిస్తున్న త్రిశిరుడు ఇప్పుడు పినతండ్రి ఐన మహోదరుని మరణం ఆశనిపాతంగా తగిలింది. త్రిశిరుడు మానసికంగా బాగా దెబ్బతిన్నాడు. వానరులపై క్రోధావేశంతో ఉడికిపోయాడు.

ధనుస్సును చేతబట్టుకొన్నాడు. గట్టి పట్టుదల పూనాడు. తన బాణ పరంపరను హనుమంతునిపై గురిపెట్టాడు. నారి సంధించి బాణాలను హనుమంతునిపై వదిలాడు. వాయుసుతుడు త్రిశిరుని చూచి ఒక గిరిని చేతబట్టి గిరగిరా త్రిప్పి త్రిశిరునిపై వేశాడు. మహాశూరుడైన త్రిశిరుడు కూడా దాన్ని తప్పించుకుంటూ బాణాలతో ఆంజనేయుని నొప్పించాడు. పర్వతం వ్యర్థం అయిపోగా హనుమంతుడు వృక్షాల వర్షాన్ని త్రిశిరునిపై కురిపించాడు. ఆ వర్షాన్ని ఆకాశంలోనే త్రిశిరుడు ఆపివేశాడు. విజేతలా వికటాట్టహాసం చేశాడు.

దానితో హనుమంతుడు క్రోధోద్రిక్తుడయ్యాడు. ఆకాశంలోకి ఎగిరి త్రిశిరుని రథాన్ని రథాశ్వాలను గోళ్ళతో చీల్చివేశాడు. త్రిశిరుడు బల్లెం తీసుకొని మారుతిని దెబ్బతీశాడు. కపివరుడు తనపై వచ్చే బల్లాన్ని పట్టుకొని గట్టిగా గర్జించాడు. దాన్ని ముక్కలుగా విరిచి క్రిందపడేశాడు. వాయుసుతుని వానర గణాలు మెచ్చుకొన్నాయి. ఆ హర్షధ్వానాలు వినలేని త్రిశిరుడు చేతిలో ఖడ్గం పట్టుకొని మారుతి వక్షస్థలంపై గట్టిగా మోదాడు. తన గుండెకు త్రిశిరుని ఖడ్గ ప్రహారం తాకి తాకగానే తన అరచేయిని ముడిచి త్రిశిరుని వక్షస్థలంపై వాయుసుతుడు గట్టిగా కొట్టాడు. ఆ దెబ్బకు త్రిశిరుడు మూర్ఛపోయాడు. హనుమంతుడు బిగ్గరగా నాదం చేశాడు. దానితో మళ్లీ త్రిశిరుడు లేచి ముష్టిఘాతాలతో హనుమంతుని బాగా బాధించాడు. ఆ బాధ తాళలేక హనుమంతుడు త్రిశిరుని మూడు తలలను చేజిక్కించుకొన్నాడు. వెంటనే త్రిశిరుని ఖడ్గాన్ని లాక్కొన్నాడు. ఆ ఖడ్గంతో త్వష్ట ప్రజాపతి కొడుకైన విశ్వరూపుని ఇంద్రుడు సంహరించినట్లుగా హనుమంతుడు త్రిశిరుని మూడు శిరస్సులను ఖండించివేశాడు. ఆ దృఢమైన శిరస్సులు ఆకాశం నుండి నక్షత్రాలు రాలినట్లుగా రాలి భూమిపై పడిపోయాయి. యుద్ధరంగంలో హాహాకారాలు మిన్నుముట్టాయి.

వానరులు రాక్షస సంహారానికి ఆనందంగా గంతులువేశారు. వానరుల జయధ్వానాలతో భూమి కంపించింది. రాక్షసులు భయపడిపోయారు. వారు ఆర్తనాదాలు చేస్తున్నారు. మహావీరులైన **త్రిశిరుడు, నరాంతకుడు, దేవాంతకుడు, మహోదరుడు** చనిపోగానే **మహాపార్శ్వునిలో** అసహనం పెరిగింది. కోపం కట్టలు తెంచుకొంది. వానరులను ఎలాగైనా చంపివేయాలనే ఆవేశంతో చేతిలో గదను తీసుకొన్నాడు. దానిని ఇనుముతో నిర్మించి ఉన్నారు. బంగారు పట్టీలు వేసి ఉన్నారు. దాని అగ్రభాగం శత్రువుల రక్తంతో మెరుస్తూంది. దాని పట్టుకొని ప్రళయ కాలరుద్రునిలాగా ఊగిపోతూ వానరులపైకి పరిగెత్తాడు.

ఆ మహాపార్శ్వుని ఎదుట వానరోత్తముడైన ఋషభుడు నిలిచాడు. కోపంతో ఉడికిపోతున్న రాక్షసుడు తన వాడి ఐన గదతో ఋషభుని వక్షస్థలాన్ని గాయపరిచాడు. దానితో ఋషభుడు మూర్ఛితుడై అంతలో తేరుకొని వేగంగా వెళ్లి రక్కసుని చేతిలోని గదను లాక్కొన్నాడు. అంతేవేగంతో ఆ గదను బాగా త్రిప్పి మహాపార్శ్వుని చావబాదాడు. ఆ గదా ఘాతాలకు రక్కసుని దంతాలు ఊడిపోయాయి. గుడ్లు తేలేశాడు. చేసేది ఏమీలేక శక్తి ఉడిగిపోవడంతో ప్రాణాలు వదిలేశాడు.

రావణుని సుతులు, సోదరులు మరణించడం చూచిన మిగిలిన రాక్షసులు కాలికి బుద్ధి చెప్పారు. వేగంగా లంకలోకి పరుగెత్తారు. ప్రాణాలు దక్కించుకొంటే చాలు అని రావణ సైన్యం పిక్కబలం కొద్దీ పారిపోయారు. అలా రాక్షసులను అంతం చేసిన మిగిలిన శత్రువులు పారిపోవడం చూచి వానరుల ఆనందం ఉరకలు వేసింది. అందరూ హర్షధ్వానాలు చేశారు. ఆకాశమార్గాన యుద్ధం చూస్తున్న దేవతలు, సిద్ధులు, అందరూ లోక కంటకుని పీడ వదల బోతోందని సంతోషించారు.

లంకలో రాముని భయం ఎల్లెడలా వ్యాపించింది. ఎవరికీ కంటి మీద కునుకు రావడం లేదు. ఎపుడు తమ ప్రాణాలు అనంతవాయువుల్లో కలసిపోతాయో అని తెలియక వారందరూ భయభ్రాంతులయ్యారు.

* * *

# లక్ష్మణుడు అతికాయుని వధించటం

## సర్గ - 71

రావణుని కుమారులలో అతికాయుడు చాలా బలశాలి. పర్వతాకారుడు బ్రహ్మనుండి వరాలను పొందినవాడు. రాక్షససేన అంతా నాశనం చెందడం, తమ్ముళ్ళు, పినతండ్రులు అసువులు బాయడం అతికాయునిలో వ్యథను మిగిల్చాయి. నేను వెళ్లి శత్రు సంహారం చేస్తే కాని మనసు కుదుటపడదనుకొన్నాడు. వెంటనే యుద్ధ సన్నాహం మొదలుపెట్టాడు.

సూర్యకిరణాల్లాంటి కాంతిపుంజాలను వెదజల్లే రథం అధిరోహించి యుద్ధభూమిలోకి అతికాయుడు వెళ్ళాడు. పెద్దగా సింహగర్జన చేశాడు. 'నేను రావణ పుత్రుడను అతికాయుడను. నాతో యుద్ధం చేయగల వీరులెవరు?' అంటూ సింహనాదం చేశాడు. తన ధనుస్సును చేతబట్టి ధనుష్టంకారం చేశాడు. ఆ ధ్వని సమరభూమి అంతా ప్రతిధ్వనించింది. పర్వతంలాగా దృఢంగా కనిపించే రాక్షసుణ్ణి చూసి కుంభకర్ణుడు మరల వచ్చాడా అని వానరులందరూ భయపడిపోయారు.

వానరులందరూ అతికాయుణ్ణి చూచి ఒకరికి ఒకరు దగ్గరగా నిల్చున్నారు. ఎందుకైనా మంచిదని శ్రీరాముణ్ణి శరణుజొచ్చారు. శ్రీరాముడు మేఘంలాగ గర్జిస్తున్న అతికాయుణ్ణి చూశాడు. ఆ శరీర పరిణామాన్ని చూచి శ్రీరామచంద్రుడు ఆశ్చర్యచకితుడై సింహంలా గర్జిస్తున్న రాక్షసుడు ఎవరని విభీషణున్ని అడిగాడు. 'విభీషణా! వివిధాయుధాలతో ఉన్న రాక్షసుడు భూతగణాలతో ఉన్న ఈశ్వరునిలాగా కనిపిస్తున్నాడు. చాలా అశ్వాలను పూన్చిన పెద్దరథంపై ఆసీనుడై యుద్ధరంగానికి వచ్చాడు. ఆయన్నుచూచి కపులందరూ భీతావహులై పరుగెత్తుతున్నారు. ఇతణ్ణి గూర్చి నాకు చెప్పు' అని శ్రీరాముడు విభీషణుణ్ణి అడిగాడు.

వానరులందరూ సింహనాదం చేస్తున్న రక్కసుణ్ణి ఆశ్చర్యంగా చూస్తున్నారు. రాక్షసుని రథంపై ధ్వజం రెపరెపలాడుతోంది. ధనుస్సు బంగారుతో నిర్మితమైంది. బాణాలు సూర్యకిరణాల్లా ఉన్నాయి. రథానికి అనుకర్షం అనే ఇరుసుదిమ్మె చాలా దృఢంగా ఉంది. నలుగురు సారథులున్నారు. రథానికి రెండువైపులా పదిమూరల పొడవున్న రెండు ఖడ్గాలున్నాయి. ఎర్రని కంఠమాలతో నల్లని శరీరంతో యమునిలాగా కనిపిస్తున్నాడు అని వారిలో వారు అనుకొంటున్నారు. 'ప్రభూ! మనపై వచ్చే రాక్షసుడు దశగ్రీవుని కొడుకు. వేదశాస్త్రాలను చదివినవాడు. పెద్దలయందు గౌరవభావం ఉండేవాడు. అస్త్రవేత్తలలో ధీరుడు అతికాయుడనే పేరున్నవాడు. దేవతలను తరిమికొట్టడంలో పేరున్నవాడు. బ్రహ్మ చేత వరాలను పొందినవాడు. రాజనీతి చతురుడు. మంత్రాంగంలో దిట్ట. ఇతని బాహుబలంవల్లనే లంక సురక్షితంగా ఉంది. ఈ అతికాయుడు ధాన్యమాలి అన్న రావణుని భార్యకు పుట్టినవాడు. ఈ రథం బ్రహ్మమెచ్చి ఇచ్చిన సంపదే' అని విభీషణుడు చెప్పాడు. 'శ్రీరామా! ఈ వీరునివల్ల వానర సైన్యం తగ్గిపోవచ్చు. ఇతని బాణధాటికి వజ్రాయుధం కూడా పడిపోతుంది. వరుణుని పాశంకూడా నిర్వీర్యం అయ్యింది. అతికాయుడు దేవతలను గజగజలాడించేవాడు. అందుకే మీరు త్వరపడి ఇతని గర్వాన్ని అణిచివేయండి.

లేనట్లయితే వానరులు ఇతని ధాటికి తట్టుకోలేరు' అని విభీషణుడు తనకు అతికాయుని గురించి తెలిసింది చెప్పాడు.

అతికాయుడు వానరులను చూస్తూ పదే పదే ధనుష్టంకారం చేశాడు. ఆ రథికుని వీరావేశాన్ని చూసి కుముదుడు, ద్వివిదుడు, మైందుడు, నీలుడు, శరభుడు మొదలగు వారందరూ వృక్షాలను, పర్వతాలను తీసుకొని ఒక్కుమ్మడిగా దాడిచేశారు. వాటినన్నింటిని తుత్తునియలు చేసి వారందరిపై ఇనుప బాణాలను ప్రయోగించాడు. ఘోరసంగ్రామంలో వానరులలో చాలామంది బాగా దెబ్బతిన్నారు. వానరులందరిని భయకంపితులను చేసి చెల్లాచెదరు చేశాడు. వానరులందరూ అగ్నికి ఆహుతయ్యే శలభాల్లా నాశనం అయిపోతున్నారు. వారిని చూసి అతికాయునికి చిరాకు కలిగింది.

గబగబా రథంపై రాముని దగ్గరకు వచ్చాడు. "వానరులారా! నేను మీలాంటి చిన్నా చితకలతో యుద్ధం చేయను. యుద్ధవిద్యలు నేర్చిన గొప్ప బాహుబలుడే నాతో ధైర్యం ఉంటే యుద్ధం చేయడానికి రావాలి" అని అతికాయుడు గర్వోన్నతుడై అంటుండగానే లక్ష్మణుడు కోపం పట్టలేక అతికాయుని ముందుకు వచ్చాడు. ధనుస్సును చేతబట్టుకొని లక్ష్మణుడు భూమ్యాకాశాలు దద్దరిల్లేటట్లుగా ధనుష్టంకారం చేశాడు. ఆ ధ్వని విని ఆ రావణుని కుమారుడు కూడా ఆశ్చర్యపడ్డాడు. ఒక వాడియైన బాణాన్ని తన తూణీరం నుండి బయటకు తీశాడు. 'ఓ సౌమిత్రీ! నీవు బాలుడివి. యుద్ధవిద్యలో ఆరితేరినవాడివి కాదు. మృత్యువుతో పోరాడడానికి ముందుకు వస్తున్నావు. నీవు నిద్రపోతున్న సింహాన్ని మేల్కొల్పాలని చూస్తున్నావు. నేను వేసే బాణాలకు దేవతలే కాదు భూమండలం, అంతరిక్షం, హిమవత్పర్వతం ఏవీ ఆగలేవు. నీవు వ్యర్థ ప్రయత్నాలు మానివేసి ఇక్కడనుంచి పారిపో. అనవసరంగా ప్రాణంపైకి తెచ్చుకోకు. నీకు హితం చెప్తున్నాను విను' అంటూ అతికాయుడు లక్ష్మణునితో చెప్పాడు.

'సౌమిత్రీ! ఇదిగో ఈ బాణం నీ ప్రాణాలను హరించివేస్తుంది. వెళ్లు ఇక్కణ్ణుంచి' అని హుంకరించాడు. 'ఇది విషనాగుకన్నా భయంకరమైంది. నీ రక్తాన్ని బొట్టు కూడా నీ ఒంట్లో మిగల్చదు' అని గట్టిగా అరిచాడు. 'ఓరీ దురాత్మా! చాలా మాటలు గొప్పగా మాట్లాడుతున్నావు. నీవు ప్రగల్భాలు పలకడంలో అధికుడివే. అంతేగాదు ఆత్మను శ్లాఘించుకొనడంలోనే నిన్ను మించిన వారు ఎవరూ లేరు. కాకపోతే ఈ రెండింటివల్లా నీ పౌరుషం విదితం కాదు. నీ ఎదురుగా తిరుగులేని యోధునిగా నేను ఎదురు నిలిచాను. నీ వాగ్బాణాలు కట్టిపెట్టి చేతలతో నీ గొప్పతనాన్ని చూపించు. అప్పుడు నీ గురించి తెలుసుకొంటాను' అన్నాడు వీరాధివీరుడైన లక్ష్మణుడు.

'నన్ను బాలునిగా తలచకు. తాటిపండును తొడిమనుండి విరగగొట్టినట్లుగా నేను నిన్ను తుంచివేస్తాను. వామనావతారాన కూడా వటువే బలిచక్రవర్తిని పాతాళానికి పంపించింది. కాబట్టి, నేను బాలుడినో, వృద్ధుణ్ణో తరువాత ఆలోచిద్దాం. ముందు తూణీరం తెరువు' అని సహేతుకమైన మాటలు చెప్పి సౌమిత్రి ధనుష్టంకారం చేశాడు. ఆ ధ్వనికి కుపితుడైన అతికాయుడు వాడియైన శరాన్ని లక్ష్మణునిపై సంధించాడు. అంతలో గగనతలాన వీరిద్దరి సంగ్రామం చూడాలన్న వేడుకతో దేవతలు, సిద్ధులు, మహర్షులు, మహాత్ములు నిలిచారు. విషసర్పతుల్యమైన బాణం రావడం చూసి సౌమిత్రి అర్ధ చంద్రాకార బాణంతో దాన్ని ఛేదించివేశాడు. అతికాయుడు మరల ఐదు

బాణాలను సంధించాడు. అవి తనను చేరకముందే సూర్యాగ్ని తేజస్సుతో వెలుగొందే బాణాలను వేసి లక్ష్మణుడు వాటిని ముక్కలుగా చేశాడు. శరసంధానంచేసి సౌమిత్రి అతికాయుని లలాటాన్ని బాధించాడు. ఫాలభాగంలో నాటుకొన్న బాణం అతికాయుణ్ణి రక్తసిక్తుని చేసింది. 'నీవు గట్టివాడివే సుమా!' అని లక్ష్మణుణ్ణి మెచ్చుకొని మరల అతికాయుడు విజృంభించాడు. మహారాక్షసుడు బాణాలను ఏకధాటిగా లక్ష్మణునిపై ప్రయోగించాడు. వాటికి లక్ష్మణుడు వెరవక వాటినన్నింటిని ఛేదిస్తూ ముందుకు వెళ్ళాడు.

ఎన్ని బాణాలు వేసినా చెక్కుచెదరని సౌమిత్రిని చూస్తూ అతికాయుడు ఒక ప్రక్క అసహనం మరో ప్రక్క ఆశ్చర్యాన్ని పొందాడు. ఎలా అయినా సౌమిత్రిని నిరోధించాలని ఒక వాడి బాణంతో లక్ష్మణుని వక్షస్థలాన్ని బాధించాడు. దాంతో లక్ష్మణుని హృదయం నుండి రక్తం ధారగా కారసాగింది. సౌమిత్రి తన వక్షస్థలం నుండి బాణాన్ని పెరికి అవతల పడేశాడు. వెంటనే లక్ష్మణుడు ఒక బాణాన్ని చేతిలో పట్టుకొని ఆగ్నేయాస్త్రాన్ని జపించి వదిలాడు. అది అగ్నిని విరజిమ్ముతూ అతికాయుని వైపు దూసుకెళ్ళింది. రాక్షసుడు కూడా సౌర మంత్రాన్ని జపించి వదిలాడు. ఆగ్నేయాస్త్రం, సూర్యాస్త్రం రెండూ గగనాన పరస్పరం ఢీకొన్నాయి. కాసేటికి రెండూ జ్వాలలను కోల్పోయి నేలపై రాలిపోయాయి.

అతికాయుడు ఐషీకాస్త్రాన్ని సంధించగా లక్ష్మణుడు ఐంద్రాస్త్రాన్ని ప్రయోగించి దాన్ని ఛేదించివేశాడు. యామాస్త్రాన్ని రాక్షసుడు, లక్ష్మణుడు వాయువ్యాస్త్రాన్ని ప్రయోగించి నిర్వీర్యం చేశారు. వర్షపు ధారల్లాగా లక్ష్మణుడు బాణాలను రాక్షసునిపై ప్రయోగించాడు. అవి అన్నీ వెళ్లి అతికాయుని వజ్రకఠిన కవచాన్ని ఢీకొన్నాయి. కాని ఆ కవచం దృఢమైంది. దాంతో ఆ బాణాలు అతణ్ణి ఏమీ బాధించలేకపోయాయి.

బాణాలన్నీ వ్యర్థం అయిపోవడంతో లక్ష్మణుడు వేలకొద్దీ బాణపరంపరను అతికాయునిపై ప్రయోగించాడు. అతికాయుడు భీకరమైన శరాలను సౌమిత్రిపై వేశాడు. ఆ ధాటికి లక్ష్మణుని ఆయువుపట్టు తప్పి క్షణకాలం స్పృహను పోగొట్టింది. కొద్దిసేపటికి లక్ష్మణుడు తేరుకొన్నాడు. నాలుగుబాణాలు వేసి అతికాయుని రథాశ్వాలను నేలకూల్చాడు. రథ ధ్వజాన్ని బాణంతో లక్ష్మణుడు కూల్చివేశాడు. మొక్కవోని బాణాన్ని ఆ రాక్షసునిపై ప్రయోగించాడు.

కాని, ఆ బాణం కూడా అతికాయుణ్ణి బాధించలేకపోయింది. అప్పుడు వాయుదేవుడు లక్ష్మణుని చెవిలో బ్రహ్మాస్త్రంతో తప్ప ఈ రాక్షసుడు నేలకు ఒరగడనే సత్యం రహస్యంగా చెప్పాడు. బ్రహ్మ ఇచ్చిన కవచాన్ని బ్రహ్మాస్త్రంతో ఛేదించవచ్చుననే రహస్యం లక్ష్మణునకు వాయుదేవుడు చెప్పాడు. వెంటనే లక్ష్మణుడు ఒక బాణం తీసి బ్రహ్మాస్త్రాన్ని జపించాడు. దాన్ని సంధించాడు. అప్పుడు భూమ్యాకాశాలు, మహాగ్రహాలు నలుదిక్కులు అన్నీ కంపించాయి. ఆ బాణం వజ్రాయుధంలాగా బంగారపు పూతతో విచిత్రాలైన పుంఖాలతో అగ్నిని విరజిమ్ముతూ అతికాయుని వైపు దూసుకెళ్ళింది. అతికాయుడు దాన్ని చాలా బాణాలు వేసి నిరోధించాలని చూశాడు. కాని అది వాటిని నాశనం చేస్తూ ముందుకు వెళ్లింది. అయినా అతికాయుడు తొణకకుండా బల్లెం, కత్తి, గద, గండ్రగొడ్డలి, ఈటె, హులంలాంటి వాటితో ఛేదించాలని చూశాడు. అద్భుతాకారాలు గలిగిన ఆయుధాలను వమ్ముచేసి బ్రహ్మాస్త్రం అతికాయుని శిరస్సును ఖండించివేసింది. ఆ రాక్షసుని శిరస్సు హిమత్పర్వతంలాగా నేలపై పడింది.

శిరస్సు మొండెం తలోదిక్కుకూ పడిపోయాయి. గర్జించి గర్జించి నేల రాలిన అతికాయుణ్ణి చూచి రాక్షసులందరూ హతాశులయ్యారు. గగ్గోలుగా అరిచారు. ఏమి చేయాలో వారికి తోచక మ్రాన్పడి చూస్తుండిపోయారు. వానరులందరూ బలే బలే అని కోలాహలంగా అరిచారు. లక్ష్మణునికి జై జై అంటూ హర్షధ్వానాలు చేశారు. అతి బలవంతుడైన అతికాయుణ్ణి మట్టికరిపించిన లక్ష్మణుణ్ణి చూచి విభీషణుడు ఆశ్చర్యానందాన్ని వ్యక్తం చేశాడు. వికసించిన పద్మాల వంటి ముఖాలతో వానరులందరూ అతి సంతోషంగా నాట్యం చేశారు. సమరభూమి కాస్త నృత్యాలు చేసే మండపం అయ్యింది.

శ్రీరాముని తమ్ముని పరాక్రమాన్ని చూసి సంతోషించారు. అందరూ సౌమిత్రిని వేనోళ్ల పొగిడారు. అవలీలగా అతికాయుని యమపురికి పంపించావంటూ లక్ష్మణుణ్ణి అందరూ కొనియాడారు. లక్ష్మణుని హృదయం ఆనందంతో నిండిపోయింది.

* * *

# రావణుని చింత

## సర్గ - 72

**అ**తికాయుని మరణం రావణుని హృదిలో అగ్నిని రగిల్చింది. ఎంతో చింతించాడు. అక్కడ ఉన్నవారితో తన బాధను పంచుకొన్నాడు. ధూమ్రాక్షుడు, అకంపనుడు, ప్రహస్తుడు, కుంభకర్ణుడు వీరందరూ అస్త్రవేత్తలు, ధనుర్ధారులు, మహా బలపరాక్రమశాలురు వీరందరూ రాముని చేతిలో నిహతులు అయిపోయారు. ఇంతవరకు ఓటమే ఎరుగని వీరంతా వీరమరణం పాలయ్యారు.

నా కుమారుడు ఇంద్రజిత్తు (మేఘనాదుడు) తపశ్శక్తితో సంపాదించుకొన్న నాగాస్త్రంతో రామలక్ష్మణులను బంధించాడు. ఆనాడు నేను ఎంతో సంతోషించాను. కాని, ఆ సోదరులు ఆ బంధంనుండి ఎలా తప్పించుకొన్నారో నాకు అర్థం కావడంలేదు. వారు మాయోపాయం చేతనో మోహింపజేసో, ఔషధ ప్రభావంతో ఎలాగో వారు బయటపడినారు. నా ఆదేశాన్ని పాటించి ఎందరెందరో వీరులు, నా కొమరులు రణావేశంతో వెళ్ళి యుద్ధభూమి ఆహుతులయ్యారు. శ్రీరాముని పరాక్రమం ఎలాంటిదో నేను ఊహించలేకుండా ఉన్నాను. విభీషణుడు సుగ్రీవాది వీరులు ఆ మహామహుని తోడుగా నిలిచారు. భళీ! ఆ మహావీరుని ఎంతైనా శ్లాఘించవలసిందే. అతని ముందు నిలువగల వీరులు ఎవ్వరూ నాకు కనిపించడంలేదు. రాముని వీరత్వానికి తగ్గట్లుగా సుగ్రీవుని సేన అమోఘంగా ఉంది. పాలకు పంచదార చేరినట్లుగా రాముని పక్షాన వానరులు చేరి అప్రమేయ బలసంపన్నపక్షం వారు అయ్యారు. ఆ రఘురాముడు సాక్షాత్తు నారాయణ స్వరూపంలాగా కనిపిస్తున్నాడు. లంకను అప్రమత్తంగా రక్షించాల్సిన అవసరం నాకు ఎక్కువగా కనిపిస్తోంది. లంకను అంతా పరిరక్షించాల్సిన అవసరం చాలావుంది. సీత అశోకవనాన ఉంది. అక్కడికి రాకపోకలు సాగించే వారిపైన కన్ను పెట్టాల్సి ఉంది. లంకనుండి బయటకు వెళ్ళేవారిని లోపలకు

వచ్చేవారిని అప్రమత్తంగా జాగ్రత్తతో చూడాలి. లంకను అంతా మంచి యోధులతో రక్షించాలి. రాక్షసులందరూ వానరుల స్థావరాలను, వారి కదలికలను, పగలు రాత్రి భేదం లేకుండా కనిపెట్టాలి అన్నాడు. రాక్షసులందరిని పిలిచి రావణుడు వారందరికీ లంకను అప్రమత్తంగా కాపలా కాయాలని ఆదేశాన్నిచ్చాడు. వానరుల మాటలను, కదలికలను కనిపెట్టి వారి సమాచారాన్ని తెలుసుకోమని చెప్పాడు.

అందరికి ఆదేశాలిచ్చిన రావణుడు అంతఃపురంలోకి వెళ్ళాడు. ఆయన్ను పుత్ర వియోగం దహించివేస్తోంది. శత్రువు వీరత్వం కంటికి కునుకు రానీయడంలేదు. పాత సంగతులు గుర్తుకు వచ్చి రాముడు నారాయణుడేమోనన్న చింతను ఉద్దీప్తం చేస్తున్నాయి. అన్ని వైపులనుండి మంటలంటుకొన్న అడవిలాగా రావణుడు మనస్సు రగిలిపోతూ వేడి నిట్టూర్పులు విడిచాడు. లంక అంతా రాముని భయం ఆవరించింది. ఎవ్వరిలోనూ కాగడా పెట్టి వెదికినా సంతోషం ఛాయామాత్రంగానైనా లేదు. వీరులు, వారికి సంబంధించిన ఆప్తులలో కూడా భయమే తిష్ఠవేసుకుంది. ఏక్షణం ఏమౌతుందో అన్న ఆలోచన వారికి నిద్రలో సైతం వీడడం లేదు. రావణుని అంతఃపురకాంతలందరూ చింతాక్రాంతులయ్యారు.

* * *

# ఇంద్రజిత్తు సమరభూమికి వెళ్ళటం

## సర్గ - 73

పుత్ర మరణంతో వ్యాకులచిత్తుడై ఉన్న రావణుని వద్దకు రణరంగంలో ప్రాణాలు దక్కించుకొన్న రాక్షసులు పరుగు పరుగున వచ్చారు. రాముని పరాక్రమాన్ని లక్ష్మణుని తేజాన్ని వర్ణించి చెప్పారు. అతికాయుని వీరమరణంతో వారు అనుభవిస్తున్న బాధనంతా రావణుని ముందు వెళ్ళగక్కారు. వారి బాధనంతా విని శోకసముద్రంలో మునకలు వేస్తున్న రావణుడు మరింత లోతుకు జారిపోయాడు.

ఆయనలో వర్ణించనలవికాని దుఃఖం కట్టలు త్రెంచుకొని ప్రవహించింది.

దీనంగా విలపించే రావణుని చూచి ఇంద్రజిత్తు బాధపడ్డాడు. వెంటనే 'తండ్రీ! రాక్షసరాజా! నేను బ్రతికి ఉండగా మీరు చింతించాల్సిన అవసరం రాదు. నేను కదనరంగంలో కాలుపెట్టి బాణాలను ఎక్కుపెట్టితే నా ధాటికి ఎవరైనా బ్రతికి బట్టకట్టడం కల్ల. నేను ఈనాడే వెళ్ళి రామలక్ష్మణులను నా శరపరంపరతో ముక్కలు చేసి వస్తాను. ఆ ఇరువురూ ఈ రోజు యమపురికి వెళ్ళడం ఖాయం. 'తండ్రీ! నేను ఇంద్రుని జయించాను. నేను ఇప్పుడే ప్రతిజ్ఞ చేస్తున్నాను. నేడే నా బాణాలకు ఆ ఇక్ష్వాకువంశ సోదరులను బలి ఇచ్చి వెనక్కు తిరిగి వస్తాను.'

'నేను కదనరంగంలో బాణాలను ఎక్కుపెట్టి వానర సైన్యాన్ని బాధిస్తుంటే ఇంద్రాది దేవతలు సూర్య చంద్రులు చూస్తారు. మీరు నాకు ఆజ్ఞనివ్వండి' అని అడిగాడు. రావణుని అనుమతి తీసుకొని వాయువేగంతో వెళ్ళే దివ్య

రథాన్ని అధిరోహించి వేగంగా సమరానికి వెళ్ళాడు. ఇంద్రజిత్తును అనుసరించి వేలాదిగా రాక్షస యోధులు కదనానికి కాలు కదిలించి వెళ్ళారు. వారందరూ ఆయుధాలతో రథాలతో సమరాంగణానికి బయలుదేరారు.

రాక్షసులందరూ రణభేరి మ్రోగించారు. సింహనాదం చేశారు. ఇంద్రజిత్తు రథంపై శ్వేతఛ్ఛత్రం పున్నమి చంద్రునిలాగా వెలిగిపోతోంది. దివ్యులలాంటి పరిచారికలు ఆయనకు వింజామరలు వీస్తున్నారు. రావణుడు మహా పరాక్రమశాలి ఐన తన కొడుకును చూచి 'నాయనా! నీవు దేవతలను సైతం పరాజితులను చేసినవాడివి. నీకు ఈ మానవమాత్రులు ఒక్క లెక్కలోనివారు కాదు. అందుకే నీవు ఒక్కనివే శత్రువులను ఓడించి రాగల ధీరోదాత్తుడవు' అని ఆశీస్సులను అందజేశాడు.

ఇంద్రజిత్తు రణభూమికి చేరాడు. రణావేశంతో వ్యూహాన్ని పన్నాడు. ముఖ్యప్రదేశాలలో రాక్షసులను నిలిపాడు. అగ్నికి మంత్రసహితంగా ఆహుతులనిచ్చాడు. పూలమాలలు, సుగంధాలు, పేలాలు, హోమద్రవ్యాలు, ఆహుతిగా ఇచ్చాడు. శరాలను దర్భలుగా ఎర్రనివస్త్రం అగ్నికి ఆజ్యం సమర్పించాడు. అగ్నిచుట్టూ దర్భలు ఈటెలు పరిచాడు. సజీవంగా ఉన్న నల్లని మేకను అగ్నికి బలి ఇచ్చాడు. అప్పుడు అగ్ని ప్రజ్వలించింది.

హోమగుండంలో అగ్ని జ్వలించడం మేఘనాదుడు సంతోషంగా చూశాడు. ఇది ఇంద్రజిత్తుకు విజయ సూచకంగా కనిపించింది. యుద్ధోన్మత్తుడైన ఇంద్రజిత్తు విజయం తనదేనని విర్రవీగాడు.

ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రాన్ని ఆవాహన చేశాడు. తన ధనుస్సును, రథాన్ని బ్రహ్మాస్త్ర మంత్రాలతో అభిమంత్రించాడు. ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రాన్ని జపిస్తుంటే సూర్యచంద్రులు, నక్షత్రాలు ఇతర ప్రాణులన్నీ వ్యాకులం చెందాయి. అగ్ని కార్యం పూర్తిచేసి ధనుర్బాణాలను, ఖడ్గాలను తీసుకొని ఇంద్రజిత్తు ఆకాశానికి ఎగిరాడు. అక్కడ నుంచి మంత్ర ప్రభావంవలన క్రింద ఉండే ఎవరికీ ఇంద్రజిత్తు కనిపించలేదు. ఇంద్రజిత్తు అదృశ్యంగా ఉంటూ యుద్ధం చేస్తాడని రాక్షసులు తలచారు. ఇక విజయం తమదే అనుకొన్నారు. రాక్షససైన్యం ఆనందోత్సాహాలతో వానరులపైకి విజృంభించాడు. చిత్ర విచిత్ర బాణాలను ఖడ్గాలను, ఇనుప గదలను అంకుశాలను చేత బట్టి యుద్ధం చేయడానికి ముందుకు ఉరికారు. నేను మీ చెంత ఉంటాను, మీరందరూ కపులను చితక్కొట్టండి అని ఇంద్రజిత్తు వారికి తన వాణిని వినిపించాడు.

రాక్షసులందరూ భీకరంగా గర్జిస్తూ శరవర్షాన్ని వానరులపై కురిపించారు. గదలతో మోదుతున్నారు. అంకుశాలతో, ఈటెలతో వారిని పొడుస్తున్నారు. ఇంద్రజిత్తు అప్పుడప్పుడు కనబడుతూ కనపడకుండా వానరులను నుగ్గునుగ్గు చేస్తున్నారు. ఒక్కోసారి ఐదేసి ఏడేసి బాణాలను ప్రయోగించారు. కపులను చిత్రవధ చేస్తున్నాడు. కపులందరూ పర్వతాలను గిరులను తీసుకొని రాక్షసులపై విజృంభిస్తున్నారు. కాని, రాక్షసులదే యుద్ధంలో పైచేయి అయ్యింది.

వానరులందరూ ఇంద్రజిత్తు దెబ్బకు నిహతులవుతున్నారు. వారందరూ దేవతలవలన పరాజితులై పడిన రాక్షసులలాగా పడిపోతున్నారు. ఇంద్రజిత్తు బాణ ప్రహారానికి తాళలేక వ్యాకులం చెంది వారందరూ వెనక్కు మరలారు. 18 బాణాలతో గంధమాదనుని దెబ్బతీశాడు. తొమ్మిది బాణాలతో దూరంగానున్న నలుని కొట్టాడు.

ఏడుబాణాలతో మైందుని బాధించాడు. ఐదు బాణాలతో గజుణ్ణి కొట్టాడు. వీరు పడిన తర్వాత ఇంద్రజిత్తు ఇతర వానరుల మీదకు దాడికి దిగారు.

ఇంద్రజిత్తు పది బాణాలు వేసి జాంబవంతుణ్ణి, ముప్ఫై బాణాలతో నీలుణ్ణి హింసించాడు. దైవదత్త శరాలతో సుగ్రీవుణ్ణి ఋషభుని, అంగదుని, ద్వివిదుని సొమ్మసిల్లచేశాడు.

ప్రళయాగ్నిలాగా క్రుద్ధుడై వీరత్వంతో విజృంభిస్తున్నారు. తనవారినందరిని పొట్టన పెట్టుకున్న వానరులను తుదముట్టించాలని ఇంద్రజిత్తు ఆవేశపడ్డాడు. అతివేగంగా తన దైవబలాన్ని ఉపయోగిస్తూ వానర ప్రముఖులను వానరులను నాశనం చేస్తున్నాడు. ఖడ్గాలను, శరాలను అద్భుతాకార ఆయుధాలను ప్రయోగిస్తూ రావణుని కుమారుడు కదన రంగంలో కదం తొక్కి వానరులను తుదముట్టిస్తున్నాడు. కపులలో కొందరు శ్రీరామునికోసం ప్రాణాలు విడిచారు. మరికొందరు మూర్ఛిల్లారు. ఇంకొందరు బాణాలను ఎదుర్కోలేక శరవర్షంలో తడిసి ముద్ద అవుతున్నారు. ఆ భయంకర దృశ్యం రావణుని సైన్యానికి చాలా ఆనందాన్నిచ్చింది. ఇంద్రజిత్తు సంతోషానికి అవధులు లేకుండా పోతున్నాయి. తన ఇంద్రజాలాన్నంతా గుప్పించి సమరభూమిని ఆక్రమించుకోవాలని తపన చెందాడు. తన బాణ పరంపరతో యుద్ధభూమిని కప్పివేస్తున్నాడా అని అనిపిస్తోంది. అవిచ్ఛిన్నంగా వానరయోధులను అగ్నితుల్యమైన బాణాలతో చితకబాదుతున్నాడు.

హనుమదాది వీరుల ఆయుధాలను మంత్రపూరితం చేసి బాధించాడు. మిగిలిన వానరసేనపై గదా ఘాతాలతో విజృంభించాడు. అవిచ్ఛిన్నంగా బాణాలను ప్రయోగిస్తూ వానర సేనను నిర్వీర్యం చేస్తున్న ఇంద్రజిత్తును రామలక్ష్మణులు చూశారు. బ్రహ్మాస్త్రాన్ని అభిమంత్రించి వానరులను పడగొడుతున్నాడని శ్రీరాముడు తెలుసుకున్నాడు.

“లక్ష్మణా! ఇంద్రునకు శత్రువైన రాక్షసుడు వీరవిహారంతో వానర ప్రముఖులతో కూడిన వానర సేననంతా నాశనం చేస్తున్నాడు. ఇక మిగిలిన మనలను దెబ్బతీయాలనే దృక్పథంతో ముందుకు వస్తున్నాడు. అదృశ్యంగా ఉంటూ యుద్ధం చేసే ఇంద్రజిత్తును ఎలా ఎదుర్కోవడం అన్న ఆలోచన కుదరడంలేదు. రాక్షసులు మాయచేయడంలో అతినేర్పరులు. వారు వీరులను మోసంతో తుదముట్టించాలని చూస్తారు. అది వారి సహజ నైజం. దానితోపాటూ దుర్బుద్ధి పుట్టి ఉంటుంది. కనుక ఎదుటివానిని యుద్ధనీతిని పక్కనపెట్టి దెబ్బతీయడంలోనే ముందుంటారు. వీరిని ఎదుర్కోవడం సులభమైన విషయం కాదు. అందుకనే మనం బుద్ధితో ఆలోచించి ఈ అంతర్హితుడై వ్యవహరించే శత్రువును దెబ్బతీయాలి. ఇప్పుడు మనం ఇలా నిలబడి పోరు సాగిస్తే ఆ దుష్టుడు మనపై బ్రహ్మాస్త్రాన్ని వదులుతాడు. ఇప్పుడు బ్రహ్మ గొప్పతనాన్ని మనం ఎదిరించలేం కదా. ఆ పరమేష్ఠి శక్తి సామర్థ్యాలు ఊహించలేం కదా. ఈ ఇంద్రజిత్తు దాడికి నాతోపాటుగా నీవు కూడా బాధపడుతున్నావు.

అయినా మనిద్దరం స్పృహ కోల్పోయినట్లుగా క్రిందపడి ఉందాం. మనలను చూసి నా శరవర్షపు ధాటికి మూర్ఛిల్లిపోయారు. తనదే విజయం అనుకొని ఇంద్రజిత్తు రావణుని దగ్గరకు వెళ్తాడు. తర్వాత మనం శత్రువును ఎదుర్కొనే విషయం ఆలోచిద్దాం” అని శ్రీరాముడు లక్ష్మణునితో చెప్పాడు.

ఇంద్రజిత్తు బాణ వర్షాన్ని కురిపిస్తున్నాడు. ఆ శరపరంపరకు పీడితులైనట్టుగా స్పృహ తప్పి పడిపోయినట్లుగా సోదరులు నటించారు. రామలక్ష్మణుల పరిస్థితులను చూచి ఇంద్రజిత్తు మహదానందం పొందాడు. పడిపోయిన

శత్రు పక్షాన్ని చూచి రాక్షసులు ఆనందించారు. సమరభూమి అంతా నిశ్శబ్దంగా ఉంది. వానరవీరులంతా స్పృహను కోల్పోయిపడిఉన్నారు. రామలక్ష్మణులు సైతం పడిఉండడంతో రాక్షసులకు ఎక్కడలేని ఆనందం వచ్చింది. అప్పటివరకూ గతించిన వీరుల తాలూకు విచారం వారిలో మటుమాయం అయింది. గంతులు వేస్తూ లంకకు వెళ్ళారు.

రాక్షసులందరూ తిరుగులేని వీరుడని ఇంద్రజిత్తును కొనియాడారు. ఇక ఆలస్యం లేకుండా తన తండ్రి విజయవార్త తెలపాలన్న ఆతురత మేఘనాథునిలో పెరిగింది. వెంటనే లంకకు మరలాడు. మహాసంతోషంతో “తండ్రీ! మీకు విజయలక్ష్మిని తోడ్కొని వచ్చాను” అంటూ ఇంద్రజిత్తు తన విజయాన్ని తండ్రితో విన్నవించాడు. అప్పటికే కదనరంగ వార్తలు తెలుసుకొన్న రావణునిలో తన తనయుని గొప్పతనాన్ని, వీరత్వాన్ని విన్నాడు. ప్రతిపక్షం నిర్వీర్యులయ్యారన్న సమాచారం రావణునిలో ఆనందం పెంచింది. ఇంద్రజిత్తును గాఢాలింగనం చేసుకొని ఆనందబాష్పాలు రాల్చసాగాడు.

మాటలు పెగలక రావణుడు తన కుమారుని సైగలతో ఆశీర్వదించాడు. ఇంద్రజిత్తు సాధించిన విజయం రావణునిలో శక్తిని పెంచింది. మేఘనాథుని హృదయానికి హత్తుకొని రావణుడు కన్నీరు కార్చాడు. నాలో పేరుకుపోయిన భయాన్నంతా క్షణంలో పోగొట్టావంటూ పొగడ్తలతో తనయుని ముంచెత్తాడు.

* * *

# హనుమంతుడు సంజీవిని పర్వతం తేవటం

## సర్గ - 74

వానరసైన్యం రామలక్ష్మణులు అందరూ ఇంద్రజిత్తు వలన మూర్ఛితులై పడిపోయారు. విభీషణుడు సుగ్రీవుని దగ్గరకు వెళ్ళాడు. సుగ్రీవుడు మూర్ఛనుండి తేరుకొని చుట్టూ చూసి పరితాపం చెందాడు. విభీషణుడు సుగ్రీవునకు ధైర్య వచనాలు చెప్పాడు. ‘సుగ్రీవా! బ్రహ్మదేవుడు ప్రసాదించిన బ్రహ్మాస్త్ర ప్రభావంతో వానరసైన్యం మూర్ఛిల్లి ఉంది. రామలక్ష్మణులు కూడా బ్రహ్మాస్త్రాన్ని గౌరవించి స్పృహ కోల్పోయి ఉన్నారు. ఇందులో మీరు విచారించాల్సిన అవసరం లేదు’ అని సుగ్రీవునకు ధైర్యం చెప్పాడు.

హనుమంతుడు బ్రహ్మాస్త్రాన్ని గౌరవించి ఒక్క క్షణం మాటలాడక మౌనంగా ఉన్నాడు. ఆ తర్వాత ‘విభీషణా! మనం వానరసైన్యంలో మూర్ఛిల్లి ఉన్నవారిని ఓదార్చుదాం’ అని చెప్పి వారిద్దరూ రెండు కాగడాలు పట్టుకొని సమరభూమి అంతా కలియతిరిగారు. వానరులందరి శరీర భాగాలు బాగా దెబ్బతిని ఉన్నాయి. రక్తం ఓడుతుండగా వారందరూ నిద్రపోతున్న వారిలాగా పడి ఉండడం చూశారు. అంగదుడు,సుగ్రీవుడు, ద్వివిదుడు మొదలగు వానర ప్రముఖులంతా బాగా దెబ్బతిని కొనఊపిరితో ఉన్నారు.

67 కోట్లమంది వానరులు ఆ రోజు నిహతులయ్యారు. హనుమంతుడు, విభీషణుడు ఇద్దరూ జాంబవంతుని కోసం అంతా వెదికారు. బ్రహ్మదేవుని సుతుడు వయోవృద్ధుడైన జాంబవంతుని వారు చూశారు. వందలకొలది బాణాల చేత బాగా దెబ్బతిని పడిపోయి ఉన్న జాంబవంతుని దగ్గరకు వెళ్ళారు.

'ఆర్యా! మీ ప్రాణాలకు ముప్పు వాటిల్లలేదు గదా' అని విభీషణుడు అడుగగా 'విభీషణా! నేను పదునైన బాణాలు తగలడంతో నిన్ను చూడలేక ఉన్నాను. కాని, నీ కంఠస్వరాన్నిబట్టి నిన్ను గుర్తుపట్టుతున్నాను. వాయుసుతుడు అంజనాదేవి కుమారుడు ఐన హనుమంతుడు క్షేమమే గదా' అని జాంబవంతుడు విభీషణుని అడిగాడు.

విభీషణుడు ఆశ్చర్యంగా 'జాంబవంతా! సమరభూమిలో రామలక్ష్మణులు, సుగ్రీవుడు, అంగదాదులు ఇంతమంది ఉండగా వీరి క్షేమాన్ని అడగక ఒక్క హనుమంతుని అడగడంలోని విశేషం ఏమిటి?' అని అడిగాడు. జాంబవంతుడు బలవంతంగా చిరునవ్వు తెచ్చుకొని **'విభీషణా! ఒక్క హనుమంతుడు ఉంటే మొత్తం వానర సైన్యం అంతా హతం అయిపోయినా బ్రతికిఉన్నట్లే లెక్క. ఒక వాయునందనుడు లేకపోతే మేమందరం బ్రతికినా చనిపోయిన వారిలో జమే.**

వాయుదేవునివంటి బలశాలి, అగ్నిదేవుని వంటి తేజస్వి, మహావీరుడైన హనుమంతుడు జీవించి ఉన్నంతవరకు మనలో ఆశ మెదలుతూనే ఉంటుంది.' అంతా విని వాయుసుతుడు నేను హనుమంతుడనని చెప్పి జాంబవంతునకు ప్రణమిల్లాడు. హనుమంతుని మాటలు వినగానే జాంబవంతునిలో జవసత్వాలు మేల్కొన్నాయి. 'కపివరా! నీవే ఈ వానరులందరిని కాపాడగల వీరునివి. హనుమంతా! నీవు కటిబద్ధుడివి కావయ్యా! నీవు పరాక్రమించడానికి ఇదే మంచి సమయం.

వీరులకు, భల్లూక వానరులకు తిరిగి స్వస్థత చేకూర్చు. బ్రహ్మాస్త్ర బాధితులైన రామలక్ష్మణులను ఓదార్చు తండ్రీ' అని జాంబవంతుడు హనుమంతునితో చెప్పాడు.

'మారుతీ! నీవు సముద్రంపైనుంచి గగనాన సుదూర ప్రాంతం పయనించి హిమవత్పర్వతానికి వెళ్ళు. అక్కడ నీకు స్వర్ణమయమై, అత్యున్నతమైన వృషభగరి అను మహాపర్వతం, కైలాసగిరి నీకు కనిపిస్తాయి. మహావీరా! వృషభగిరికి కైలాసగిరికి మధ్యలో సాటిలేని తేజస్సుతో ఉండే ఓషధీపర్వతం ఉంది. అందులో లెక్కలేనన్ని ఓషధులున్నాయి. వాటిలో నీవు దిక్కులను ప్రకాశింపజేసే మృత సంజీవిని, విశల్యకరణి, సంధానకరణి, సావర్ణ్యకరణి అనే నాలుగు దివ్యౌషధాలున్నాయి. నీవు వేగంగా వెళ్ళి వాటిని తీసుకొని వచ్చి ఈ వానరులను రామలక్ష్మణులను సజీవులుగా స్వస్థులుగాను చేయి. దీనికి నీవు సమర్థునివి' అని జాంబవంతుడు చెప్పాడు.

వెంటనే జాంబవంతునికి నమస్కరించి త్రికూట పర్వతాన్ని అదిమి పెట్టి తన శరీరాన్ని ఒక్క ఉదుటున పైకి ఎగిరించాడు. ఆ అదిమిన పాదం బరువుకు త్రికూటంలోని శిఖరాలు, వృక్షాలు అన్నీ నుగ్గుఅయిపోయాయి. అగ్ని రవ్వల్లాగా నేలపై పడిపోయాయి. త్రికూటంపై నిర్మించిన లంకానగరం అంతా కంపించిపోయింది. గుహలు గోపురాలు అన్నీ భగ్నం అయ్యాయి.

హనుమంతుడు అలా ఆకాశానికి ఎగిరినపుడు ఆయన చెవులకున్న కుండలాల కాంతి ఆకాశం అంతా దివ్యకాంతితో నిండింది. హనుమంతుడు త్రికూటం నుంచి మలయగిరి చేరాడు. మలయగిరి అంతా వృక్షాలు, లతలు, పర్వత శిఖరాలతో అందంగా అలరారుతోంది. అక్కడ విద్యాధరులు, మహర్షులున్నారు. రకరకాల మృగ సంచారం, నానావిధ పక్షుల ఆవాసంతో దర్శనీయంగా ఉంది.

మేఘం వంటి పవనసుతుడు తన పాదాన్ని అదిమి పెట్టి బిగ్గరగా అరచి ఆకాశంపై ఎగిరాడు. ఆ అరుపుకు లంక అంతా భయంతో వణికిపోయింది. హనుమంతుడు శ్రీరాముని ధ్యానించాడు. మహాసర్పం వంటి తన వాలాన్ని పైకెత్తాడు. గగన మార్గానికి తగ్గట్టుగా ప్రాణవాయువును నిరోధించి నడుము వంచి ముందుకు సాగిపోయాడు. అలా ఎగిరి ముందుకు సాగేటపుడు మారుతి బాహువులు, ఊరువుల వేగానికి గిరిశిఖరాలు, పాషాణాలు, వృక్షాలు పైకి ఎగిరి సముద్రంలో పడిపోయాయి.

మారుతి మేరుపర్వతదిశగా తన ప్రయాణం సాగించాడు. మహావిష్ణువు సుదర్శనచక్రంలాగా వేగంగా ముందుకు పోతున్నాడు. గగన మార్గంలో సంచరిస్తూ భూతలాన ఉన్న గిరులను, తరులను, సరస్సులను, నదులను, మహానగరాలను, జనపదాలను, చూస్తూ మారుతి ముందుకు వెళ్ళాడు. ఏ మాత్రం అలసట లేకుండా ఆయన నిరాటంకంగా పురోగమిస్తున్నాడు. వాయుతరంగ ధ్వని దశదిశలా ప్రతిధ్వనిస్తోంది.

జాంబవంతుని మాటలను మననం చేసుకుంటూ ఆంజనేయుడు హిమవత్పర్వత ప్రాంతానికి చేరాడు. హిమాలయంపై జలపాతాలు, గుహలు, సెలయేళ్లు అందంగా పొందికగా ఉన్నాయి. దానిపై తెల్లని శిఖరాలు అందంగా మేలి ముసుగు ధరించిన అప్సరసల్లా ఉన్నాయి. రకరకాల వృక్షాలు కనుల పండుగ చేస్తున్నాయి. ఋషుల, సిద్ధుల ఆశ్రమాలను మారుతి చూశాడు. హిమాలయం అంతా హనుమంతుడు తేరిపార చూశాడు. బ్రహ్మ నివాస స్థానం, కైలాసం, ఇంద్రుని నివాసం, శివునివిహార స్థలం, హయగ్రీవుని ఆరాధనా స్థలం, ఈశ్వరుని వలన ఖండితమైన బ్రహ్మశిరస్సు పడిన చోటు, యమకింకరులు విశ్రమించే ప్రదేశం, బ్రహ్మ ఇంద్రునకు వజ్రాయుధం బహూకరించిన ప్రదేశం, కుబేరుని నిలయం, సూర్యుని భార్య ఐన ఛాయ ప్రీతికోసం సూర్యుని తేజస్సును తగ్గించాలని విశ్వకర్మ భాస్కరుని బంధించిన ప్రదేశం, దేవతల కొరకు ఆ బ్రహ్మ ఆసీనుడయ్యే ప్రదేశం, పాతాళం ప్రవేశించు ప్రదేశంలాంటి విశిష్ట దర్శనీయ ప్రదేశాలను మారుతి చూశాడు.

జాంబవంతుని సూచన ప్రకారం కైలాసగిరిని దర్శించాడు. హనుమంతుడు వృషభ పర్వతానికి కాంచనాద్రికి మధ్య ఉండే సర్వౌషధి మహాపర్వతాన్ని చూశాడు. ఆ గిరి దేదీప్యమానంగా వెలుగుతోంది. అగ్నికాంతులలాగా మిరుమిట్లు గొలుపుతూ ప్రకాశిస్తూ ఓషధీ మహాపర్వతం దివ్యంగా కనిపించింది. ఓషధగిరికి ప్రదక్షిణ నమస్కారాలు చేశాడు. ఆ తర్వాత ఆ గిరినంతా కావాల్సిన ఓషధుల కోసం వెదికాడు.

వేలకొలది యోజనాలదూరం వెదికాడు. ఔషధాలన్నీ తమను తీసుకొని పోవడానికి ఎవరో వచ్చారని అవన్నీ అదృశ్యమయ్యాయి. ఏవీ కనిపించకపోయేసరికి హనుమంతునిలో అసహనం పెరిగిపోయింది. 'పర్వతోత్తమా! శ్రీరామునిపై ఆదరం చూపడం లేదేమి? ఇదే నీ దృఢనిశ్చయం అయితే ఇప్పుడే నీకు నా బాహుబలాన్ని చూపిస్తాను.'

అంటూ వృక్షాలు, గైరికాది ధాతువులతో విలసిల్లే ఆ గిరిని కోపంగా హనుమంతుడు తన చేత్తో పెకిలించి వేశాడు. అప్పుడు ఆ గిరి శృంగాలన్నీ నుగ్గునుగ్గైపోయాయి. దాని చుట్టూ ఉన్న సానువులన్నీ మాడి మసైపోయాయి.

మారుతి ఎత్తిన గిరి శిఖరాన్ని చేత్తో పట్టుకొన్నాడు. సురాసురులతో కూడిన లోకాలన్నీ గడగడలాడాయి. యక్షులు, సిద్ధులూ అందరూ ఆ ఓషధీ పర్వతాన్ని తీసుకెళ్ళడం చూసి మారుతిని ప్రస్తుతించారు. ఆకాశంలో వెళ్ళే మారుతి మార్తాండునిలా దేదీప్యమానంగా వెలిగాడు. ఆ వాయుసూనుడు ఓషధిగిరిని తీసుకొని త్రికూట పర్వత ప్రాంతం చేరాడు. విభీషణుడు, జాంబవంతాదులు హనుమంతుని చూసి చాలా సంతోషించారు.

అక్కడ నేలపై దిగి హనుమంతుడు విభీషణుని కౌగిలించుకున్నాడు. ఔషధాల వాసన తగిలి తగలగానే మహారాజ పుత్రులు రామలక్ష్మణులు లేచి కూర్చున్నారు. వానర వీరులందరూ స్వస్థులయ్యారు. వారి గాయాలన్నీ ఓషధీ మహిమతో మటుమాయం అయ్యాయి. మహౌషధుల ప్రభావంతో వానరులు పునర్జీవితులై గాయాలు తొలగి ఆరోగ్యం పొందారు.

రావణుని అనుచరులు సంగ్రామంలో ప్రాణాలు కోల్పోయిన వారిని సముద్రంలోకి చేర్చమని రావణ ప్రభువు చెప్పాడు. శ్రీరాముని అనుమతితో హిమవత్పర్వతం పైకి ఓషధీ శైలాన్ని చేర్చివేసి, తిరిగి క్షణంలో హనుమంతుడు శ్రీరాముని చెంత చేరాడు.

* * *

# వానర రాక్షసుల మధ్య ఘోరయుద్ధం

## సర్గ - 75

**సు**గ్రీవుడు శ్రీరాముడు ఇప్పటివరకు జరిగిన విషయాలు జరగబోయే విషయాలన్నీ కూలంకషంగా మాట్లాడుకొన్నారు. సుగ్రీవుడు మారుతితో రాక్షసరాజు కుమారులను పోగొట్టుకొని దుఃఖంలో ఉన్నాడు. ఆయన ఇక యుద్ధానికి రాలేడు. నీవు వేగంగా సంచరించగలిగిన మరికొందరు వెళ్లి లంకనంతా దగ్ధం చేసి రండి అని చెప్పాడు.

రాత్రి ప్రవేశించింది. ఒక పొద్దు గూకింది. వెంటనే వానర వీరులందరూ కాగడాలను చేతపట్టాడు. అందరూ ఒక్కసారిగా లంకలో ప్రవేశించారు. పూర్వాపరాలు, అట్టాలకాలు (మేడ పైగదులు), రాజవీధులు, ఉపవీధులు, రాజభవనాలు ఇలా అన్నింటికీ నిప్పుపెట్టారు. అవన్నీ మంటల్లో చిక్కుకుపోయాయి. గృహాలు, ఆరామాలు అన్నీ అగ్నికి ఆహుతి అయిపోయాయి.

రాజభవనాలు నేల పాలయ్యాయి. అగరు, చందన వృక్షాలు బూడిద అయ్యాయి. ముత్యాలు, పగడాలు, వజ్రాలు అన్నీ బుగ్గిపాలు అయ్యాయి. గృహాలలో ఉండే విలువైన సామగ్రి అంతా అంతరించిపోయింది. అశ్వభూషణాలు, ఏనుగుల అలంకారాలు, ఇనుము, కంచుతో చేసిన కవచాలు అగ్నిలో కాలిపోయాయి.

ఖడ్గాలు, ధనుస్సులు, అల్లె(త్రాడులు, బాణాలు ముండ్ల గుదియలు, అంకుశాలు, బల్లేలు ఉన్న వ(స్త్రాలు, వింజామరలు, పులి చర్మాలు, కస్తూరి సుగంధాలు, అస్త్ర సమూహాలు అన్నీ అగ్నిలో కరిగిపోయాయి. మంటలు విజృంభించి లంకనంతా చుట్టివేశాయి.

ఆ మంటలు గృహాలతోపాటుగా మద్యం మత్తులో సోలిపోయిన వారిని, ని(ద్రిస్తున్న వారిని, ఆనందించి ని(ద్రలో మునిగినవారిని బిడ్డలకు పాలిస్తున్న తల్లులను, మంటల ధ్వనికి లేచి సంతానాన్ని తీసుకొని అటు ఇటు పారిపోయే వారిని అందరినీ అగ్నిదేవుడు పొట్టన పెట్టుకున్నారు. లక్షలకొద్దీ రాక్షసులు మంటలలో మాడిపోయారు.

మహాసౌధాలు అందులో ఉండే నగిషీలతో తీర్చిదిద్దిన తల్పాలు, ఆసనాలు, మణులు మాణిక్యాలతో కూర్చిన కిటికీలు సూర్య మండలం దాకా వ్యాపించి ఉన్నట్లు కనిపించే సౌధాలన్నీ నేలమట్టం అయిపోయాయి. లంక ఎప్పుడూ భేరి మృదంగ ధ్వనులతో, నెమళ్ళ (క్రేంకారాలతో, (క్రౌంచ పక్షుల కలరవాలతో (ప్రతిధ్వనిస్తున్న అందమైన లంక నేడు శ్మశాన రాగాన్ని ఆలపిస్తూ నైరాశ్యంలో కూరుకుపోయింది.

అగ్నిచే దగ్ధం అయిన గృహాలనుండి రాక్షస సుందరీమణులు ఎవరికి వారే మంటలకు ఆవలకు వెళ్ళాలని హాహాకారాలు చేస్తున్నారు. దూరం నుంచి చూసేవారికి లంక దివ్యఔషధులున్న హిమాలయంలాగా కనిపించింది. అశ్వాలు, గు(ర్రాలు మంటలకు భయపడి అటు ఇటు పరిగెత్తిపోతున్నాయి. లంకచుట్టూ ఉన్న సము(ద్రంలో లంక అగ్నిజ్వాలలు (ప్రతిబింబిస్తున్నాయి. దాంతో అది ఎ(ర్ర సం(ద్రంలాగా కనిపిస్తోంది. లంకలోని జనమంతా ఆర్తనాదాలు చేస్తున్నారు. వారి ఏడుపులు పెడబొబ్బలు పది యోజనాల దూరం దాకా వ్యాపించాయి. మంటలను తప్పించుకోవాలని పరుగెత్తే రాక్షసులను వానరులు అడ్డగించి యుద్ధానికి తలపడ్డారు. వానరుల గర్జనలు రాక్షసుల పెడబొబ్బలతో భూమి అంతా దద్దరిల్లింది. ఓషధుల (ప్రభావంతో రామలక్ష్మణులు వానరులు తెప్పరిల్లారు. శరాలవలన కలిగిన బాధ వారిని విడిచింది. రాముడు విల్లు ఎక్కుపెట్టుతుండగా రేగిన ధనుష్టంకారం రాక్షసులలో భయకంపనలు పుట్టించింది. రాముని ధనుస్సు నుంచి వెలువడిన ధ్వనితో లంకాపురంలోని శిఖరాలు కంపించి (క్రిందపడిపోయాయి. రాక్షస యోధులందరూ యుద్ధ సన్నద్ధులు అవుతున్నారు. సింహనాదాలు చేస్తున్నారు. వానరులు గర్జిస్తున్నారు. ధ్వనులన్నీ కలసి లంక (ప్రళయ కాళరా(త్రిలాగా కనిపించింది.

వానరయోధులందరికీ సు(గ్రీవుడు సరిగా యుద్ధం చేయనివారికి యుద్ధంలో ఏమరపాటువలన గాని లేక అసహనంవలనగానీ వానరులు కనిపిస్తే వారికి మరణం విధిస్తానని హెచ్చరిక చేశారు. మీరందరూ రావణుని అంతఃపుర సమీపంలో యుద్ధం చేయమని కూడా వానర (ప్రభువు ఆదేశించాడు. దానితో కపులందరూ అ(ప్రమత్తులై రావణుని అంతఃపురం దగ్గరకు వెళ్ళారు. అక్కడ ఘోర యుద్ధం చేస్తున్నారు.

దాన్ని చూచిన రావణుడు కోపావేశం పూనాడు. గట్టిగా ఒకసారి ఆవులించాడు. ఆ ఆవులింత (ప్రభావం దశదిశలా వ్యాపించింది. అతని దేహం అంతా రౌ(ద్రావేశంతో ఒణికింది. కుంభకర్ణుని కుమారులైన కుంభనికుంభులను యుద్ధానికి పంపించాడు. వారితోపాటు వేలకొలది యోధులు రణరంగానికి చేరారు. రాజాజ్ఞ తలదాల్చి యూపాక్షుడు, శోణితాక్షుడు, (ప్రజంఘుడు, కంపనుడు మొదలగు వారందరూ సమరభూమికి తరలివెళ్ళారు.

రాక్షసయోధులు ధరించి ఉన్న ఆభరణాల కాంతి, వానరులు చేబూని ఉన్న కాగడాల కాంతి ఆ ప్రదేశాన్నంతా వెలుగులతో నింపింది. మిరుమిట్లు కొల్పుతున్న కాంతి వేయి చంద్రబింబాలు ఒకేసారి ఉదయించినట్లుగా ఉంది. లంకాగృహాలలోనుంచి వెలువడే జ్వాలలు చంద్రుని కాంతి వానరులు కాగడాల కాంతి, రాక్షసుల ఆభరణాల కాంతి అన్నీ కలిసి వింత శోభను కలిగించాయి. సముద్ర జలాలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి.

రాక్షస యోధులు రథాలను అధిరోహించారు. వారి రథాలపై ధ్వజ పతాకాలు ముత్యాల్లాగా మెరుస్తున్నాయి. వారి ఆయుధాలు – ఖడ్గాలు, గండ్రగొడ్డళ్ళు, గదలు వివిధ రకాలుగా ఉన్నాయి. రథాలకు కట్టిన చిరుగంటలు గలగల మ్రోగుతున్నాయి.

అక్కడ వీచే గాలిలో రాక్షసులు అలదుకొన్న సుగంధాలు, వారు ధరించిన పూలమాలల వాసనలు  అక్కడవీచే వాయువు ఒక్కసారిగా గృహాలలోనుండి వస్తువులు కాలడంవలన వచ్చే దుర్గంధం, గృహాలలోని కొయ్యల్లాంటివి కాలిపోవడంతో వచ్చిన పొగ గాలితో కలిసి గాలి బరువుగా వేడిగా మారింది.

రాక్షసయోధులు కోపం, ఆవేశం కలగలిపి వానరులపై విరుచుకుపడ్డారు. అసలే యుద్ధోత్సాహం శ్రుతిమించి ఉన్న వానరులు వారిపై పర్వతాలు వృక్షాలతో తెగబడ్డారు. రాక్షసులు వానరులను తెగనరుకుతూ వెళ్లుతున్నారు. వానరులు రాక్షసుల ముక్కులు, చెవులు, కంఠాలు కొరుకుతున్నారు. వారి శరీరాన్ని గోళ్ళతో గీరివేస్తున్నారు. ఇరుపక్షాల వారి మధ్య వాగ్యుద్ధం ఆయుధ యుద్ధం పోటీపడుతోంది. ఉభయ పక్షాలలో యోధులు నిహతులు అవుతున్నారు. అయినా ఎప్పటికప్పుడు ఇరుపక్షాల వారు  విజృంభించి యుద్ధం చేస్తూనేఉన్నారు.

* * *

# రాక్షస వీరుల సమరోత్సాహం

## సర్గ – 76

అవిచ్ఛిన్నంగా యుద్ధం సాగుతోంది. అంగదుడు రణోత్సాహంతో అకంపనునిపై వెళ్ళాడు. అకంపనుడు ఉద్రిక్తుడై అంగదునకు కొట్టాడు. ఆ దెబ్బ వాలిసుతుని బాగా బాధించింది. అయినా అంగదుడు వృక్షంతో అకంపనుని ఎదను గాయపరిచాడు. దానివలన రణభూమిపై అకంపనుడు పడిపోయాడు.

దాన్ని చూసి కోపంగా శోణితాక్షుడు అంగదునిపై వచ్చాడు. శత్రువులను చీల్చి చెండాడే శరాలను వేసి వాలి సుతుని బాధించడం మొదలుపెట్టాడు. మంగలి కత్తి వంటివి, అర్ధచంద్రాకారం వంటివి, లేగదూడల వంటివి, ఏదుబంది ముళ్ళవలె తీవ్రమైనవి, గ్రద్ద ఈకలాంటివి ఐన బాణాలను శోణితాక్షుడు వానరులపై ప్రయోగించాడు.

వాలి సుతుడు ఆ బాణాప్రహారాలను తట్టుకొంటూ శ్రేష్ఠమైన బాణతూణీరాలను, రథాన్ని నుగ్గు నుగ్గు చేశాడు. రాక్షసుడు క్రుద్ధుడై నింగికి ఎగిరాడు. చేతిలో కత్తిని, డాలును ధరించాడు. అంగదుడు నింగికి ఎగిరి

శోణితాక్షుని కత్తిని లాగివేసుకొని భుజంపై కొట్టాడు. దానితో ఆయన యజ్ఞోపవీతం తెగింది. తనముందుకు వచ్చే ప్రజంఘాది శత్రు సమూహాన్ని వెంటాడటం మొదలుపెట్టాడు.

శోణితాక్షుడు తేరుకొని ఇనుప గదను చేతబట్టి మళ్ళీ అంగదునిపై విజృంభించాడు. యూపాక్షుడు, ప్రజంఘుడు ఇద్దరూ అంగదునిపై దాడికి దిగారు. మైందుడు, ద్వివిదుడు ఇద్దరూ అంగదుని రక్షిస్తూ రాక్షసులకు ఎదురు నిలిచారు. మహాకాయులైన రాక్షసవీరులు ఆయుధాలతో ఘోరమైన పోరుచేస్తున్నారు.

శోణితాక్షుడు ప్రజంఘాది వీరులు, ద్వివిదుడు, మైందుడు, అంగదాది వీరులు ఆయుధాలు, వృక్షాలతో సమరం సాగిస్తున్నారు. ప్రజంఘుడు అంగదుని చంపాలని ఖడ్గం చేబూని సరైన అదనుకోసం ఉరికాడు. అది గమనించి అంగదుడు తన పిడికిలితో ప్రజంఘుని బాహువును తీవ్రంగా బాధించాడు. దానితో ఖడ్గంతో సహా ప్రజంఘుడు నేలకూలాడు.

మళ్ళీ లేచి నిశాచరుడు కోపంతో అంగదుని దిమ్మ తిరిగేటట్లుగా ఒక బాదు బాదాడు. దానితో అంగదుడు చలించిపోయాడు. కొద్దిసేపు తర్వాత అంగదుడు రాక్షసుని చేతిలో ఖడ్గాన్ని లాక్కొన్నాడు. దానితో ప్రజంఘుని శిరాన్ని ఖండించివేశాడు. యూపాక్షుడు పినతండ్రి మరణానికి శోకించాడు.

పినతండ్రి మరణం యూపాక్షునిలో వీరావేశం పెంచింది. బాణాలన్నీ అయిపోయి ఖడ్గం తీసుకొని వానరులపై విజృంభించాడు. ఆయనను ద్వివిదుడు అడ్డగించి బాధించాడు. తన తమ్ముడు శత్రువు చేతిలో దెబ్బలు తినడం చూసి శోణితాక్షుడు తన గదతో ద్వివిదుని వక్షస్థలాన్ని గాయపర్చాడు. కొంత తడవు ద్వివిదుడు చలించిపోయాడు.

తేరుకొన్న తర్వాత తనను కొట్టడానికి వచ్చే శోణితాక్షుని ఖడ్గాన్ని లాగివేసుకున్నాడు. ఇంతలో మైందుడు యూపాక్షుని వక్షస్థలంపై పిడిగుద్దు వేశాడు. వారు నలుగురు తీవ్రంగా పెనగులాడుతూ దెబ్బతీసుకొంటున్నారు.

ద్వివిదుడు శోణితాక్షుని, మైందుడు యూపాక్షుని చాలాసేపు పీడించి పీడించి చివరకు యుద్ధభూమికి వారిద్దరినీ బలి ఇచ్చారు. ఆ దెబ్బతో రాక్షససేన బాగా భయపడి కుంభుని శరణువేడారు. వారందరికి ఊరటనిచ్చి తన ధనుస్సును చేబూని యుద్ధానికి ఉద్యుక్తుడయ్యాడు. కుంభుని ధనుస్సు ఇంద్రధనుస్సులాగా మిరుమిట్లు గొలిపే కాంతితో వెలుగులు లీనుతోంది.

ఆ ధనుస్సుతో వేగంగా వెళ్ళి శత్రువులను బాధించే బాణాలను కుంభుడు ప్రయోగించాడు. వాటివలన ద్వివిదుడు చలించి త్రికూట పర్వతంలాగా పడిపోయాడు. అది చూచి బాధతో మైందుడు కుంభునిపై విజృంభించాడు. పెద్దశిలను ఆ రాక్షసునిపై గురి చూసి కొట్టాడు. దాన్ని బాణాలతో కుంభుడు ఛేదించి వేశాడు. సర్పం వంటి బాణంతో కుంభుడు మైందుని మర్మస్థానాలను ఛేదించాడు. దానితోమైందుడు స్పృహ తప్పి నేలకు ఒరిగిపోయాడు.

మేనమామలిద్దరూ పడిపోవడంతో అంగదుడు కోపించి వృక్షాలతో, పర్వతాలతో కుంభునిపై దాడిచేశాడు. కుంభుడు బాణవర్షంలో అంగదుని ముంచివేశాడు. కొరువులతో ఏనుగును కొట్టినట్లుగా అంగదుని రెండు కనుబొమ్మల మధ్య ప్రదేశాన్ని బాణంతో కొట్టాడు. రక్తం ఎగజిమ్మి కళ్ళు మూతపడిపోయాయి. ఒక చేత్తో రక్తాన్ని ఆపుతూ మరో చేత్తో కాస్త వంగివున్న సాలవృక్షాన్ని వేర్లతో సహా పెరికి కుంభునిపై విసిరివేశాడు. దాన్ని ఏడు బాణాలతో కుంభుడు ముక్కలు చేశాడు. అంగదుడు చాలా రోజుల్నించి యుద్ధం చేసి అలసి వున్నాడు. పైగా కుంభుని బాణం బాగా బాధించడంతో అంగదుడు మూర్ఛిల్లి నేలపై పడిపోయాడు.

అంగదుడు అలా నేలపై పడిపోవడంతో వానరులు చాలా చింతించారు. ఆ విషయం శ్రీరామునికి చెప్పారు. వెంటనే తగిన ఆదేశాలను ఆయన వానరులకు చెప్పాడు. జాంబవంతాది వీరులు కుంభుని ఎదిరించడానికి వేగంగా వెళ్ళారు. కొంతమంది వానరులు వృక్షాలు పట్టుకొని అంగదుని కాపాడడానికి వెళ్ళారు. వారందరూ తనపై రావడం చూసి కుంభకర్ణుని సుతుడు తన బాణాలను వర్షంలాగా ప్రయోగించాడు.

ఆ బాణ వర్షంలో వానరులు ముందుకు వెళ్ళలేకపోయారు. దాన్ని సుగ్రీవుడు చూశాడు. మద్దిచెట్టులాంటి మహా వృక్షాలను కుంభునిపై కోపంగా విసిరాడు. దాన్ని కుంభుడు తన బాణాలతో ఛేదించి వేశాడు. వానరులందరిని తన బాణాలతో పీడించే కుంభుని అదనుచూసి సుగ్రీవుడు అతని ధనుస్సును లాగి ముక్కలు చేసి పడేశాడు. ఆ తర్వాత కుంభునితో రాక్షస పక్షపాతం, వీరత్వంలో నీవు నీ పినతండ్రి ఐన రావణునితో సమానంగా యుద్ధం చేస్తున్నావంటూ సుగ్రీవుడు కుంభుని మెచ్చుకొన్నాడు.

"ప్రహ్లాద, బలి, ఇంద్ర, కుబేర, వరుణులతో సమాన పరాక్రమం కలిగిన కుంభా! నీవు ఒక్కడివే తండ్రిని పోలి పుట్టావు. నీవు శూలం ధరించి సంహారం చేయి కాని, జితేంద్రియులను ఇంద్రియాలు బాధించలేనట్లు నీవు మమ్ములను బాధించలేవు. నీ పెద్ద తండ్రి వరాలతో దేవతలను ఎదిరించగలిగాడు. నీ తండ్రి కుంభకర్ణుడు తన నిజమైన భుజబలశక్తితో దేవతలను గజగజలాడించాడు. నీవు ధనుర్విద్యలో ఇంద్రజిత్తును, ప్రతాపంలో రావణుని పోలి ఉన్నావు. నీవు నీ రాక్షస సమూహంలో అతి శ్రేష్ఠుడివని చెప్పవచ్చు.

నీ భయంకర బాణప్రహారంలో వానర ప్రముఖులను పడగొట్టావు. ఇపుడు నాతో యుద్ధానికి త్వరపడు. మనిద్దరి మధ్య యుద్ధం శంబరాసురునికి ఇంద్రులమధ్య యుద్ధాన్ని తలపిస్తుంది. నీవు యుద్ధంలో అలసినట్లు ఉన్నావు.నీవు కొద్దిసేపు కావాలంటే విశ్రాంతి తీసుకొని నాతో తలపడు. అప్పుడు నా బలాన్ని నీవు చూద్దువుగాని" అని సుగ్రీవుడు కుంభుని రెచ్చగొట్టాడు.

కుంభుడు రెచ్చిపోయి సుగ్రీవుణ్ణి తన బాహువులతో ఇరికించుకొని అదిమిపెట్టాడు. వారిద్దరు ఒకరినొకరు తీవ్రాతి తీవ్రంగా బాధించుకొన్నారు. కొట్టుకొన్నారు. వారి పాదాల తాకిడికి నేల అణగిపోతోంది. సుగ్రీవుడు బలం కొద్దీ కుంభుని చేతులతో పైకి ఎత్తాడు. గిరగిరా త్రిప్పి సముద్రంలో పడేశాడు. ఆ వేగానికి కుంభుని శరీరం సమద్రపు అడుగు భాగాన్ని చేరింది. ఆ శరీరం విసురుకు సముద్రం మేరు పర్వతం అంత పైకి లేచింది.

దానితోపాటు కుంభుడు పైకి వచ్చి వేగంగా తన పిడికిలితో సుగ్రీవుని వక్షస్థలాన్ని బాదాడు. ఆ దెబ్బకు వానరుని కవచం బ్రద్ధలు అయ్యింది. రక్తం కారింది. మహాక్రోధావేశంతో సుగ్రీవుడు తన వజ్రాయుధం వంటి పిడికిలి బిగించి కుంభుని ఎదను బలంగా కొట్టాడు. ఆ దెబ్బకు నీళ్లు చల్లిన నిప్పులాగా కుంభుడు నేలకు ఒరిగిపోయాడు. వక్షస్థలం బద్దలుఅయింది. రుద్రుని చేత దెబ్బతిన్న సూర్యుడిలాగా ప్రకాశవంతంగా ఉన్న కుంభుడు మృత్యువు ఒడిలో జారిపోయాడు. మహాబలపరాక్రమవంతుడైన కుంభుని బలశాలి ఐన వానర ప్రభువు సుగ్రీవుడు చంపివేశాడు. ఆ దెబ్బకు వనాలతో ఉన్న భూమి కంపించిపోయింది. రాక్షసులలో కుంభుని మరణం అశనిపాతం అయింది.

* * *

# హనుమ చేతిలో నికుంభుని మరణం

## సర్గ - 77

తన సోదరుని సుగ్రీవుడు చంపివేయడం నికుంభుడు చూశాడు. చూపులతోనే వానరులను కాల్చి వేయాలన్నట్లుగా వారిని అగ్నిజ్వాలల్లాంటి దృష్టితో చూశాడు. వెంటనే గిరికి సమానం అనిపించే పరిఘను చేతిలో పట్టుకొన్నాడు. ఆ పరిఘపై ఐదు వేలి ముద్రలు ఉన్నాయి. బంగారంలో మణులు మాణిక్యాలు పొదిగి దాని పిడిని చేశారు. దాన్ని పట్టుకొని సింహంలాగా నోరు తెరచి బిగ్గరగా సింహనాదం చేశాడు.

సర్వాలంకార భరితుడైన నికుంభుని వక్షస్థలం బంగారు పతాకాలతో ఉంది. కుండలాలు భుజకీర్తులతో ప్రకాశుడై ఉన్నాడు. నికుంభుని పరిఘ ధాటికి సప్త వాయు మండలం బ్రద్దలయ్యింది. ఆ పరిఘను నికుంభుడు వేగంగా త్రిప్పాడు. ఆ వేగానికి కుబేరునిఅలకాపురి, ఇంద్రుని అమరావతి, గ్రహాలతోఉన్నఆకాశం కూడా తిరుగుతోందా అనిపించింది. ఆ నికుంభుని అగ్నిజ్వాలలు, పరిఘ ప్రభావకాంతిని చూచి వానరులెవరు ఆ మహావీరునితో యుద్ధం చేయడానికి రాలేకపోయారు. అటువంటి వాని దగ్గరికి హనుమంతుడు ఒక్కడే రొమ్ము విరుచుకొని నిలిచాడు. ఆ పరిఘను బాగా త్రిప్పి ఎదురుగా ఉన్న హనుమంతుని వక్షస్థలాన్ని వేగంగా కొట్టాడు. నికుంభుని దెబ్బ హనుమంతుని ఏమీ చేయలేకపోయింది. కాని, ఆ పరిఘ వేలాది ముక్కలై నేలపై పడిపోయింది. అవి ఆకాశం నుంచి రాలే ఉల్కలాగా చూసేవారికి కనిపించాయి. హనుమంతుని శరీరం పరిఘ దెబ్బకు చలించినా మారుతి ఏ మాత్రం తొణకలేదు. తన పిడికిలిని దృఢంగా బిగించాడు. వాయుసుతుడైన హనుమంతుడు శ్రీరాముని మనస్సులో ధ్యానించాడు. ఒక్కసారిగా తన పిడికిలి ఎత్తి నికుంభుని వక్షస్థలాన్ని గట్టిగా కొట్టాడు. ఆ ముష్టిఘాతానికి నికుంభుని హృదయం చీలికలై రక్తం ఎగజిమ్మింది. మేఘాలనుండి మెఱపులాగా రక్తం బయటకు వచ్చింది.

నికుంభుడు దిమ్మెరపోయినా తన రెండు చేతులతో హనుమంతుని గట్టిగా పట్టుకొన్నాడు. అప్పుడు రాక్షసులలో ఆనందం వెల్లివిరిసింది. మరల మారుతి మరో పిడికిలిపోటుతో నిశాచరుని దెబ్బతీశాడు. నిశాచరుని ఉక్కిరిబిక్కిరి చేసి వాని పట్టును సడలించుకొని హనుమంతుడు తేజో విరాజమానుడయ్యాడు. దానితో తట్టుకోలేక నికుంభుడు నేలపై పడిపోయాడు. వానిపై హనుమంతుడు పడి బాగా దెబ్బలతో బాధించి నుగ్గు నుగ్గుచేశాడు. హనుమంతుడు నికుంభుని కంఠాన్ని చేతికి చిక్కించుకొని మెలికలు త్రిప్పాడు. ఆ మెలికలనొప్పికి నిశాచరుడు దిక్కులు పిక్కటిల్లేలాగా అరిచాడు. దానితో నికుంభుడు ప్రాణాలు అనంతవాయువులో లీనమైపోయాయి. అప్పటివరకు అరుస్తున్న రాక్షసులగుండెలు నీరుకారాయి. వారిలో చింత ఎక్కువైంది. ఎంతటి మహావీరాధివీరులు వచ్చినా వానరులముందు, నరులైన రామాదులముందు ఎందుకూ కొరగాకుండాపోతున్నారు. దీనికి కారణం ఏమిటో వారికి అంతుచిక్కడంలేదు. చివరకు వీరమరణం దక్కుబోతుందనే అనుమానపుపొర వారిలో పొడచూపింది. నికుంభుని మరణం వానరులలో సంతోషాన్ని నింపింది. రాక్షసులలో విషాదాన్ని పెంచింది. వానరుల కోలాహల ధ్వనులు వారి ఉత్సాహపు అరుపులు రాక్షసుల గుండెలను గుభేలనిపించాయి.

* * *

# మకరాక్షుని యుద్ధ సన్నాహం

## సర్గ - 78

**ని**కుంభ కుంభులు మరణించారు. రాక్షస యోధులందరూ ఒకరి తర్వాత మరణించడం రావణుని భయభ్రాంతులను చేస్తుంది. అయినా పట్టు వదలని మూర్ఖ మహారాజు మకరాక్షుని యుద్ధానికి ప్రేరేపించాడు. 'నీవు యుద్ధానికి వెళ్ళి రామలక్ష్మణులను జయించి రమ్ము – ఇది నా ఆజ్ఞగా తలచు' అని చెప్పాడు.

'చిత్తం మహారాజా!' అని మకరాక్షుడు రావణునికి బదులిచ్చి ప్రదక్షిణ నమస్కారాలు చేసి రాజాజ్ఞను తీసుకొని యుద్ధభూమికి వెళ్ళాలని నిశ్చయం చేసుకొన్నాడు. మందిరం బయటకు వచ్చాడు. సేనాపతిని సైన్యాన్ని సిద్ధం చేయమని చెప్పాడు. సేనాపతి మకరాక్షుని కోరిక ప్రకారం సైన్యాన్ని తీసుకొని వచ్చాడు. మకరాక్షుడు రథానికి ప్రదక్షిణ చేశాడు. రథంపై ఎక్కి యుద్ధభూమికి మరలాడు.

తనతో వచ్చే సైన్యానికి నా ముందు నిలబడి వానరులతో పోటీ చేయమని చెప్పాడు. రావణ ప్రభువు నన్ను రామలక్ష్మణులను జయించమని చెప్పాడు. నేడే నేను రామలక్ష్మణులను, సుగ్రీవుణ్ణి వధించి తీరుతాను అని ప్రగల్భాలు పలికాడు. నా శూలానికి ఎండుటాకులు గుచ్చినట్లుగా వానరులను గుచ్చుతాను అని చెప్పాడు.

ఆయన మాటలు విని అనుచరులందరూ ఒక చోట గుమికూడారు. వారిలో అతికాయులు, బలంగా ఉన్నవారు, పింగళి వర్ణంవారు, పర్వతాకారులు, వికృత శరీరులు ఉన్నారు. వారందరూ ఆయుధాలను పట్టి తమ పాద ఘట్టనలతో భూమిని వణికిస్తూ సమరభూమిలోని వానరులను భయకంపితులను చేయాలనే ఉత్సాహంతో బయలుదేరారు.

వానరుల, రాక్షసుల సింహనాదాలు, గర్జనలు కోలాహలధ్వనులు, భేరీనాదాలతో సమరభూమి దద్దరిల్లు తోంది. మకరాక్షుని చెర్నాకోలు భూమిపై జారిపోయింది. ఉన్నట్టుండి ధ్వజం నేలపాలైంది. అశ్వాలు చురుకుదనాన్ని కోల్పోయాయి. దుమ్ముతో నిండిన గాలి మకరాక్షుని బాధిస్తోంది.

పరాక్రమవంతులైన రాక్షసులు వారికి ఎదురయ్యే అపశకునాలను పట్టించుకోరు. ఆ నిశాచరులు మదపు టేనుగులలాగా, దున్నపోతుల్లాగా సమరానికి కాలుదువ్వారు. వారు చాలా యుద్ధాలు చేసి ఉండడంతో వారి శరీరాలు గదాఘాతాలు శరపు దెబ్బలకు గురి అయి కాయలు కాచి ఉన్నాయి. రాక్షసయోధులు మూర్ఖులై 'నేను ముందు నేను ముందు' అంటూ కదనానికి ముందుకు పరుగెత్తుతున్నారు.

* * *

# శ్రీరాముడు మకరాక్షుని యమపురికి పంపటం

## సర్గ - 79

మకరాక్షుడు రాక్షసులతో కూడి యుద్ధభూమికి వచ్చాడు. అది చూసి చాలామంది రాక్షసులను కడతేర్చిన వానరసైన్యం మళ్ళీ రణోత్సాహంతో గంతులు వేసింది. పోరుమొదలై వానరుల రాక్షసుల యుద్ధం దేవదానవ సంగ్రామాన్ని తలపించింది.

రాక్షసులు రకరకాల ఆయుధాలు పట్టుకొన్నారు. వానరులు ఎప్పటిలాగే వృక్షాలు, పర్వతాలు, శిఖరాలు పుచ్చుకొన్నారు. వానరులను తన శర సంధానంతో భీతావహులను చేస్తూ కదనరంగంలో మకరాక్షుడు వీరవిహారం చేస్తున్నాడు. వానరులు ఆయుధాల ధాటికి తట్టుకోలేక వారిని ఎదిరించడానికి అటు ఇటు పరుగెత్తుతున్నారు. వారు భయపడి పోతున్నారని రాక్షసులు రాక్షసానందాన్ని పొందుతున్నారు.

ఖరుని కొడుకుకు శ్రీరాముడు ఎదురయ్యాడు. చాలా కోపం తెచ్చుకొని 'ఓ శ్రీరామా! నిలువు, నాతో యుద్ధానికి తలపడు. నా బాణ పరంపరతో నిన్ను మట్టి కరిపిస్తాను. నా తండ్రిని కూడా నీవే దండకారణ్యంలో చంపావు. కాని, నా చేతిలో నీవు తప్పించుకోలేవు' అని అన్నాడు. 'ఓ దురాత్మా!రాఘవా! ఆనాడు నీవు నాకు కనిపించి ఉంటే అప్పుడే నీ పని పట్టేవాణ్ణి. కానీ, తప్పించుకొన్నావు. అనవసరంగా మా వీరులను నీవు నాశనం చేస్తున్నావు. నిన్ను చూస్తుంటే నాలో ఆవేశం పెల్లుబికి వస్తోంది. నన్ను కోపాగ్ని దహించి వేస్తోంది. ఓ రామా! ఇక నీవు నా చేతిలో తప్పించుకోలేవు. నీ ప్రాణాలు నా చేతిలో హరీమంటాయి. ఇది తథ్యం' అని కోపోద్రిక్తుడై మకరాక్షుడు ఊగిపోయాడు. ఎలాగైనా రాముని యమపురికి పంపించాలన్న ఆవేశం వానిలో కనిపించింది.

మకరాక్షునిలోని ఆవేశం, ఆక్రోశం రామునిపై విరుచుకుపడ్డాయి. దాశరథి నవ్వుతూ ఆ నిశాచరుని చూసి 'నీ వాచాలత్వంతో ఏమొస్తుంది? నీ పరాక్రమం యుద్ధంలో చూపించు. ఘనకీర్తి వస్తుంది. నీ తండ్రి ఒక్కడే కాదు నా చేతిలో ఖరదూషణాదులు 14 వేలమంది నిహతులు అయ్యారు. పాపాత్ముడా! నీ శరీర భాగాలు నేడు కాకులు గ్రద్దలు తృప్తిదీరా తింటాయి.'అని అంటూశరాన్ని సంధించాడు.

వారిద్దరిమధ్య భీకర సంగ్రామం జరిగింది. రాముడు మకరాక్షుని శరాలను ఛిన్నాభిన్నం చేశాడు. ఆ వీరుల ధనుష్టంకారాలు ప్రపంచం అంతా మారుమ్రోగిపోయాయి. వారి మహాయుద్ధాన్ని చూడాలని దేవతలు, సిద్ధులు, మహర్షులు గంధర్వాదులు వచ్చారు. పరస్పర ప్రతీకారాలతో వీరులిద్దరు ఘోరంగా తలపడుతున్నారు.

పౌరుషాలు ఒకరిని మించి మరొకరిలో పెచ్చుమీరుతున్నాయి. రాలిపోయిన శరాలు భూమి అంతా నిండి పోయాయి. క్రోధావేశుడైన రఘువీరుడు నిశాచరుని ధనుస్సును విరిచేశాడు. ఎనిమిది బాణాలతో రథ సారథిని పైకి పంపించాడు. రథాన్ని తలక్రిందులు చేసి ముక్కలు చేశాడు. రథాశ్వాలు రాముని బాణాలకు ఆహుతి అయిపోయాయి. మకరాక్షుడు చేసేది లేక నేలపై పోరుకు సిద్ధం అయ్యాడు. రాక్షసుడు ప్రళయ కాలాగ్నిలాగా

ప్రజ్వలిస్తూ సమరభూమిలో ప్రాణులను భీతావహులను చేస్తున్నాడు. శూలం తీసుకొని గిరగిరా త్రిప్పి రామునిపై మకరాక్షుడు విసిరాడు.

అగ్నిని విరజిమ్మే ఆ బాణాన్ని రాముడు గగనాన్నే మూడు బాణాలతో కొట్టిపడేశాడు. ఆ శూలం ముక్కలై నేలపై పడిపోయింది. దాన్ని చూసి గగనాన ఉన్న దేవాదులు 'బాగు' 'బాగు' అని రాముణ్ణి ప్రశంసించారు.

కోపం పట్టలేక మకరాక్షుడు పిడికిలి బిగించి రాముణ్ణి నిలువు నిలువు అంటూ రామునిపై రాబోయాడు. ఆ రాక్షసునిపై రాముడు అగ్నేయాస్త్రాన్ని జపించి ప్రయోగించాడు. రాముని అస్త్రపు ధాటికి నిశాచరుని హృదయం బ్రద్దలు అయ్యింది. యముడు తటాలున వచ్చి మకరాక్షుని ప్రాణాలను పట్టుకొని వెళ్ళాడు.

మిగతా యోధులు లంకవైపు పరుగు లంకించుకున్నారు. రాముని వీరత్వం చూసి వానరులందరూ జయఘోష చేశారు. దేవ గంధర్వాదులు రామపక్షాన్ని కొనియాడారు. రాక్షసుల గుండెలు అదరగా వారు రావణుని దగ్గరకు పరుగుతీశారు. రాక్షసుల మరణం దివ్యజాతుల వారిని, సాధు పుంగవులను సంతోషింపచేస్తోంది.

* * *

# ఇంద్రజిత్తు యుద్ధం

## సర్గ - 80

**మ**కరాక్షుడు దివికి వెళ్లిన సంగతి తెలిసి రావణుడు చింతా సముద్రంలో నిండా మునిగిపోయాడు. ఏమి చేయాలో అంతుపట్టలేదు. మనస్సులో ఇంద్రజిత్తు మెదిలాడు. వెంటనే ఆయనకు కబురు పంపించి రప్పించాడు. ఇంద్రజిత్తు మనస్సును యుద్ధంవైపుకు మళ్ళింపచేశాడు. ఇంద్రజిత్తును మించిన వీరులు భూతలంలో ఎవరూ లేరని నమ్మబలికారు. నీవు ఎలా అయినా వెళ్లి రామలక్ష్మణులను సంహరించి రమ్మని చెప్పాడు. రాక్షస ప్రభువు చెప్పినట్లు మేఘనాదుడు యుద్ధసన్నద్ధుడు అయ్యాడు. యజ్ఞభూమిలో విధ్యుక్తంగా అగ్నికార్యాలు ఆరంభించాడు. ఇంద్రజిత్తు చేసే హోమ ప్రక్రియలో ధరించాల్సిన ఎర్రని తలపాగాలు, వస్త్రాలు తీసుకొని రాక్షస స్త్రీలు వచ్చారు. హోమంచుట్టూ రెల్లుగడ్డి పత్రాలతో ఆస్తరణాలు వేశారు. రావిచెట్టు పుల్లలను సమిధలుగా చేశారు. ఋత్విక్కుల కోసం లోహపు స్రువాన్ని ఇచ్చారు. హోమంచేసి నల్లని మేకను బలి ఇచ్చారు. హోమ ద్రవ్యాలతో అగ్నిని పూజించారు. అగ్నిజ్వాలలు పైకి ఎగిశాయి. విజయం సూచితం అయ్యిందని వీరులందరూ సంతృప్తిపడ్డారు.

ఇంద్రజిత్తు అగ్నికి ఆహుతులు సమర్పించి దేవ దానవ రాక్షసులను సంతృప్తిపరిచాడు. అంతర్థానశక్తి దర్శనీయ శక్తి ఉన్న రథాన్ని ఇంద్రజిత్తు ఎక్కాడు. ఆ రథానికి 4 గుర్రాలు పూన్చారు. బాణాలు, ధనుస్సులు అందులోనే అమర్చి ఉన్నారు. రథం బంగారు తొడుగులతో కాంతులు చిమ్ముతోంది. వెలుపల మృగాల ఆకృతులు, చంద్ర, అర్ధచంద్రాకార బొమ్మలు చిత్రించి ఉన్నారు. రథం దివ్యంగా ఉంది. యుద్ధ విశారదుడైన ఇంద్రజిత్తు

అభిచార హోమాలు చేసి యుద్ధభూమిలో అడుగుపెట్టాడు. అంతర్ధానం చెందే వీలున్న మంత్రాలను పఠించి నేడు కపట వనవాసులైన రామలక్ష్మణులను మట్టుపెట్టుతాను. వానరులందరిని చంపివేసి నా తండ్రికి ఆనందం చేకూర్చుతాను అని ఇంద్రజిత్తు చెప్పాడు. అదృశ్యంగా ఉండి రణం చేస్తానని రాక్షసవీరులతో చెప్పాడు. వారందరిలో రణావేశం కలిగించాడు. వానరుల, రాక్షసులమధ్య యుద్ధం మొదలైంది. రామలక్ష్మణులకోసం ఇంద్రజిత్తు వెదికాడు. ధనుర్ధారులై వానరులలో ఉత్సాహాన్ని నింపుతున్న వీరులైన ఇద్దరినిచూసి వీరే రామలక్ష్మణులు అని ఇంద్రజిత్తు అనుకొన్నాడు. వెంటనే వారిపై బాణాలను వర్షంలాగా కురిపించాడు. అవి రామలక్ష్మణులను బాధించసాగాయి. ఇంద్రజిత్తు పొగచేత చీకటిని సృష్టించి ఆకాశాన్ని కప్పివేశాడు. అదృశ్యుడై వున్న ఇంద్రజిత్తుకోసం సోదరులిరువురు గగనాన్ని శరాలతోనింపేశారు. దివ్యాస్త్రాలను ప్రయోగించారు. కాని, అవి ఏవీ ఇంద్రజిత్తును బాధించలేకపోయాయి. ఇంద్రజిత్తు ఆకాశాన్ని మంచుపొగ చేత చుట్టివేశాడు. దానితో మేఘనాదుని రథపు సవ్వడిగాని, ధనుష్టంకారం గాని, రామలక్ష్మణులకు వినిపించకుండా పోయింది. అశ్వాల గిట్టల చప్పుడు వారిని చేరడంలేదు.

ఇంద్రజిత్తు అగోచరునిగా ఉండి యుద్ధం చేస్తున్నాడు. అద్భుతరీతిలో జడివాన కురిపిస్తున్నాడు. సూర్యకిరణాల్లా ఉన్న దైవదత్తాలైన బాణాలచేత రాముని శరీరాన్ని ఇంద్రజిత్తు బాగా బాధించాడు. అయినా సోదరులిరువురు ఇంద్రజిత్తుపై నిరంతరంగా బాణప్రయోగం చేశారు. ఇంద్రజిత్తు ఏవైపునుంచి బాణం వేసినా ఆ సోదరులు కనిపెట్టుతూ వాటిని అన్నింటిని నిర్వీర్యం చేయసాగారు. అతిరథుడైన ఇంద్రజిత్తు సమరభూమి అంతా కలియ తిరుగుతూ అందరినీ తన బాణఘాతాలతో దెబ్బతీస్తున్నాడు. అంతరిక్షంలో సూర్యునిలాగా సాగే ఇంద్రజిత్తు సంచారం అతని బాణాలధాటిని ఎవ్వరూ తెలుసుకోలేకపోతున్నారు. చాలామంది వానరులు ఆయన ధాటికి నిహతులు అవుతున్నారు. లక్ష్మణునిలో క్రోధావేశం పెరిగింది. రామలక్ష్మణులు అదృశ్యవీరుని అస్త్రనైపుణ్యానికి అబ్బురపడుతున్నా దాగి యుద్ధంచేయడంతో వానరులను కోల్పోతున్నారు. వీరులను సంహరిస్తున్న ఇంద్రజిత్తుపై లక్ష్మణునికి ఆగ్రహం పెల్లుబికింది.

అదృశ్యంగా ఉంటూ వానర సేనను అంతం చేస్తున్న ఇంద్రజిత్తుపై సౌమిత్రి మండిపడ్డాడు. 'అన్నా! సమస్త రాక్షసులను నాశనం చేసే బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగిస్తాను' అని శ్రీరామునితో ఆగ్రహోదగ్రుడైన లక్ష్మణుడు చెప్పాడు.

శ్రీరాముడు సోదరుని అనునయించాడు. 'లక్ష్మణా! ఒక దుష్టరాక్షసుని కోసం సమస్త రాక్షసులను చంపాలను కోవడం పాడికాదు. ఎట్టఎదుట నిలబడి యుద్ధం చేయడానికి భయపడేవానిని, యుద్ధానికి విముఖుడై పారిపోయేవానిని, దోసిలొగ్గి శరణుజొచ్చినవారిని, స్పృహ తప్పి ఉన్నవారిని చంపడం వీరుల లక్షణం కాదు. ఇంద్రజిత్తును మాత్రమే చంపే ప్రయత్నం చేద్దాం' అని శ్రీరాముడు సోదరునితో చెప్పాడు.

ఇంద్రజిత్తును సంహరించడానికి విషతుల్య బాణాలను ప్రయోగించుదాం. కనబడకుండా తిరుగుతున్నాడు. ఒకవేళ ఇంద్రజిత్తు కనిపించితే ఈ వానరులే మట్టుపెట్టివేస్తారు. అందుకే వానరులకు భయపడి దాగి యుద్ధం చేస్తున్నాడు. ఆ ఇంద్రజిత్తు ఒక శూరమ్మన్యుడు (శూరత్వం లేకున్నా ఉందని చెప్పుకొనే మూర్ఖునిపై) ఇంత ఆగ్రహావేశం అక్కరలేదంటూ రాముడు లక్ష్మణుని శాంతపరిచాడు.

ఈ ఇంద్రజిత్తు భూమిలో దాగినా, స్వర్గాది ఊర్ధ్వలోకాలకు వెళ్లినా, అధః పాతాళ లోకాలకు వెళ్లినా, నా అస్త్రానికి పట్టుపడక తప్పదు. ఇతడు ప్రాణాలు కోల్పోవటం తథ్యం అని చెప్పి ఇంద్రజిత్తును సంహరించడానికి తగిన ఉపాయంకోసం రాముడు ఆలోచిస్తున్నాడు.

మాయామోహితం చేసేశాను. ఇక రామలక్ష్మణుల సంగతి ఇంతే సంగతులు. వారు నా ధాటికి ఆగలేక పారిపోతారు అని ఇంద్రజిత్తు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాడు. రాక్షసులందరూ మేఘనాదుని యుద్ధకౌశల్యానికి మురిసిపోతూ సమరం సాగిస్తున్నారు. రావణుని హృదయంలో శంక ఉద్భుతం అవుతూన్నా, నా మేఘనాదుడు ఇంద్రుని జయించిన వీరుడు. ఈ నరవానరులను సంహరించడం చిటికలో పని. ఎలాగైనా తనదే విజయం అని ఆశగా సమరాంగణ సమాచారంకోసం ఎదురుచూస్తున్నాడు.

* * *

# మాయాసీతను చంపివేయటం

## సర్గ – 81

శ్రీరాముడు లక్ష్మణుడు మాట్లాడుకోవటం ఇంద్రజిత్తునకు కనిపించింది. శ్రీరాముని మనోభావాలు ఇంద్రజిత్తు తెలుసుకొన్నాడు. కుంభకర్ణాది వీరులను చంపిన వారిని తలుస్తూ కోపంగా లంకలోపలకి ఇంద్రజిత్తు వెళ్లాడు. కుపితులైన రామలక్ష్మణులను జయించడం కష్టమనుకొన్నాడు. బాగా ఆలోచించి మాయోపాయం ద్వారా రామలక్ష్మణులను ఎదుర్కోవాలని చూశాడు. తన ఊహను రచించుకొన్నాడు. దానిప్రకారం రావణుని కొడుకు ఈసారి పశ్చిమ ద్వారం నుండి యుద్ధసన్నద్ధుడై వచ్చాడు.

వీరులైన అన్నదమ్ములు యుద్ధసన్నద్ధులుగా ఉన్నారని చూశాడు. తన మాయ ద్వారా వారినందరిని మోహంలో పడవేయాలని పన్నాగం పన్నాడు. గొప్ప మాయావి ఐన ఇంద్రజిత్తు మాయాసీతను తన రథంపై కూర్చోబెట్టాడు. ఆమెను చంపివేయాలనే ఆసక్తితో ముందుకు వెళ్తున్నాడు. వానరులు ఆ విషయం తెలుసుకోవాలని వారి ఎదురుగా వెళ్ళాడు. అలా పైకి వచ్చే రావణ సుతుని వానరులు ప్రతిఘటించాలని పర్వతాలు, శిలలు, వృక్షాలతో ఆయనపైకి వెళ్ళారు.

హనుమంతుడు పెద్ద గండ శిలను చేపట్టి ఇంద్రజిత్తుపై దాడికి ఉద్యమించాడు. అప్పుడు ఆయన ఇంద్రజిత్తు రథంపైన కూర్చున్న శోకదేవత ఐన మాయ సీతను చూశాడు. ఆమె ఒక వస్త్రాన్ని చుట్టపెట్టుకొని ఉంది. పైగా ఉపవాసాలచేత క్రుంగి కృశించిపోయి ఉంది. తైల సంస్కారాదులు లేకుండా మలిన వస్త్రంతో ఉన్న శరీరం మలినంతో నిండి ఉంది.

కొద్ది రోజుల క్రింద చూచిన సీత మళ్ళీ కనబడేసరికి హనుమంతునిలో దుఃఖం పెల్లుబికింది. ఇంద్రజిత్తు అధీనంలో దీనంగా కూర్చున్న సీత దుఃఖించటం చూసి మారుతి ఆమె నిజమైన సీతగా భావించాడు. ఆ పరమ సాధ్విని ఇంద్రజిత్తు ఏం చేయాలనుకొంటున్నాడో అని ఆవేశంగా హనుమంతుడు వానరులతో కలిసి ఇంద్రజిత్తుపై దాడికి దిగాడు.

తనపైకి వచ్చే వానరబలాన్ని చూసి ఇంద్రజిత్తు మండిపడ్డాడు. వెంటనే తన ఒరనుండి కత్తిని చూసి మాయా సీత జుట్టును పట్టుకొన్నాడు. ఆమెను కొట్టుతున్నాడు. సీత 'రామా!' 'రామా!' అని విలపిస్తోంది. రావణుని పుత్రుడు ఇంద్రజిత్తు సీత కొప్పును పట్టుకొని చేత్తో ఆమెను కొట్టటం చూసి హనుమంతుడు కోపంతో ఊగిపోయాడు.

'ఓరీ దురాత్మా! బ్రహ్మర్షుల వంశంలో పుట్టావు. నీ కుల వినాశనం కోసమే సీతాదేవి జుట్టును పట్టుకొన్నావు. ఛీ దుష్టుడా! నీవు దుర్మార్గుడివి. నీ బుద్ధి పెడదోవ పట్టింది. ఓయీ! నీవు క్రూరుడివి, దుర్జనుడివి, దుష్కార్యాలను చేయడంలో పరాక్రమశాలివి. నీలో కనికరం లేశమాత్రం కూడా లేదు. ఈ పాడు పనిని నీవు మాత్రమే చేయగలవు.

ఈ మైథిలి దశరథ వంశానికి చెందినది. తన ఇంటిని, పరివారాన్ని, ప్రాణనాథుని దూరంగా చేసుకొంది. అటువంటి దీనురాలిని నీవు చంపబోతున్నావు. ఇంతకూ ఆమె చేసిన అపరాధం ఏముంది? సీతామాతను చంపి నీవు చాలా కాలం బ్రతకాలని ఆశపడుతున్నావేమో! కానీ, అది జరగని పని నీవు చేసిన దుష్కృత్యాలవలన నీకు మరణదండన విధించి తీరాలి. అందుకే నీవు నా చేతికి చిక్కావు.

ఈ లోకంలో స్త్రీ హత్యలకు పాల్పడినవారికి రౌరవాది నరకాలు తప్పవు. నీవు ఈ జీవితంలో పడరాని బాధలు పడడమే కాదు ప్రాణంపోయిన తర్వాత కూడా నరక బాధలుపడడం తథ్యం' అంటూ హనుమంతుడు క్రోధావేశంతో ఇంద్రజిత్తుపై దాడిచేశాడు. వానరులందరూ తనపై రావడం చూసి రాక్షస సేనను వానరులపైకి ఇంద్రజిత్తు ఉసికొల్పాడు. ఇంద్రజిత్తు వేలకొలది బాణాలు వేసి వానరులను నిలువరించాడు.

హనుమంతునితో 'ఓ వానరుడా! రామలక్ష్మణులు, సుగ్రీవుడు మీరందరూ ఈ వైదేహి కోసమే ఇక్కడకు వచ్చారు కదా! నీవు చూస్తుండగానే ఈమెను హతమార్చివేస్తాను. ఆ తర్వాత నిన్ను, నీ సుగ్రీవాదులను, రామలక్ష్మణులను చంపివేస్తాను. ఆ తర్వాత విభీషణుని పనిపడతాను. స్త్రీలను చంపకూడదని నీవు నాకు చెప్తావా? కాని, ఈమెను చంపినందువలన మా శత్రువులైన మీరందరూ బాధలకు గురి అవుతారుకదా. అందుకే నేను ఈమెను చంపితీరుతాను. ఇది మంచిపని కాకుండా ఎలా అవుతుంది' అని మేఘనాదుడు పెద్దగా అరుస్తున్నాడు.

"నేను సీతను సంహరించివేస్తాను. అదిచూచిన రామలక్ష్మణులు పలాయనం చిత్తగిస్తారు. అలా వెనుతిరిగే మిమ్మల్ని నేను నా కరవాలానికి బలిస్తాను" అని అరుస్తూ ఇంద్రజిత్తు తన కరవాలంతో మాయాసీతపై ఒక వేటువేశాడు. ఆమె తలరెండు ముక్కలైంది. ఆ దివ్యసుందరి దేహం నేలపై పడిపోయింది. ఇంద్రజిత్తు సంతోషంగా హనుమంతునివైపు తిరిగాడు. 'ఓయీ! ఈ రామపత్నిని నా కసిదీరా చంపివేశాను. మీ శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరయింది' అంటూ తన రథం ఎక్కి ఇంద్రజిత్తు వికృతంగా నవ్వాడు. నిశాచరులందరూ ఇంద్రజిత్తు రణప్రణాళికతో ఉండడంతో ఆ రావణుని కొడుకు రథం దుర్భేధ్యంగా ఉంది. ఆ వికృతపు నవ్వును వానరులందరూ విన్నారు. ఇంద్రజిత్తు కపటపు నవ్వును చూచి నిజమని వానరులు తలచారు. వారి కార్యం విఘ్నం అయ్యిందని భావించారు. దాంతో వారు ముఖం చిన్నబుచ్చుకొన్నారు. ఎంతో బాధ వారి హృదయమంతా నిండిపోయింది.

* * *

# ఇంద్రజిత్తు - నికుంభిలాహోమం ప్రారంభం

## సర్గ - 82

ఇంద్రజిత్తు సంతోషం చూపించాలని మహానాదం చేశాడు. ఆ ధ్వని దిక్కులను భయకంపితం చేసేటట్లుగా ఉంది. ఆ ధ్వని విని వానరులందరూ నలుదిశలా పారిపోయారు. ఆ కపులంతా దైన్యంతో విషాదంతో వెనుతిరిగి వెళ్లిపోతున్నారు. వారందరిని చూచి 'ఓ వీరులారా! మీరందరి ముఖాలు ఎందుకు విచారంతో కూరుకొనిపోయాయి. మీరు యుద్ధోత్సాహం వీడి పరుగెత్తుతున్నారు ఎందుకు? నేను ముందు నడుస్తాను. మీరు నా వెనుక యుద్ధం చేయడానికి ఉద్యమించండి. ఉత్తమ వంశంలో పుట్టిన మీరు వెన్నుచూపి పారిపోవటం ఏమైనా బాగుందా?'

హనుమంతుని మాటలు వానరులలో ఉత్సాహాన్ని నింపాయి. వారి మనస్సుకు యుద్ధం చేయాలనిపించింది. వారందరూ రాక్షసులను తుదముట్టించాలని ఆవేశపడినారు. వెంటనే పర్వతాలు, శిలలు తీసుకొని రాక్షసులపై దాడికి విజృంభించారు. హనుమంతుని చుట్టూ చేరారు. అందరూ కలిసి రాక్షసులను మట్టికరిపించడం మొదలుపెట్టారు. అప్పుడు హనుమంతుడు ప్రళయకాలాగ్ని రుద్రునిలాగా కనిపించాడు. సీతను వధించాడనే కోపంతో కట్టలు త్రెంచుకొంది. సీతామాత అసువులు కోల్పోయిందనుకొని మారుతి చింతితుడయ్యాడు. ఒక పెద్ద పర్వతాన్ని తీసుకొని ఇంద్రజిత్తు రథంపై విసురుగా వేశాడు.

వెంటనే రథ సారథి దాన్ని చూచి తన రథాన్ని ఇంద్రజిత్తు సూచన ప్రకారం దూరంగా తీసుకొనిపోయాడు. హనుమంతుడు ప్రయోగించిన శిల గమ్యం చేరకుండా భూమిపై పడిపోయింది. దాని తాకిడికి అక్కడ ఉన్న రాక్షస సైన్యం కొందరు ప్రాణాలు వదిలేశారు. వందల సంఖ్యలో కపులు గర్జిస్తూ ఇంద్రజిత్తుపై ఉరికారు.

కపులందరూ వృక్షాలతో, పర్వతాలతో శత్రువులను ఎదుర్కొంటున్నారు. రాక్షసులు బాణాలు, ఖడ్గాది ఆయుధాలతో వానరులను తుదముట్టిస్తున్నారు. రాక్షస సైన్యం భీతిల్లడం ఇంద్రజిత్తు చూశాడు. వెంటనే తన బాణాలను ఎక్కుపెట్టాడు. అజేయుడై వానరులను శరఘాతాలతో చంపివేస్తున్నాడు.

మారుతి ఇంద్రజిత్తు సైన్యం మధ్య పోరు అంతకంతకు అధికం అవుతోంది. శత్రువులను కాస్త మారుతి నిలువరించగలిగాడు. తన సేనావాహినితో మారుతి 'ఇప్పుడు మనం వీరితో యుద్ధం చేయడం నిష్ప్రయోజనంగా కనిపిస్తోంది. శ్రీరామునికి సంతోషం కలిగించాలనే కోరికతో మనం వీరిని ఎదిరించాం. నేడు మన ముందే సీతాదేవి అసువులు బాసింది. ఇప్పుడిక మనం యుద్ధం చేసి మనకు ఒరిగేదేముంది? ఈ విషయం సుగ్రీవాదులకు చెప్దాం. ఆ తర్వాత రామలక్ష్మణులు చెప్పిన రీతిగా మనం నడుచుకొందాం' అని వారితో చెప్పాడు.

కపులందరిని తీసుకొని హనుమంతుడు నిర్భయంగా వెనక్కు తిరిగాడు. హనుమంతుడు రాముని దగ్గరకు వెళ్ళడం ఇంద్రజిత్తు చూశాడు. ఇక ఫర్వాలేదు అనుకొన్నాడు. తన ఊహ నిజమైంది అనుకొన్నాడు. రణరంగంలో తన పాచిక బాగా పారిందని సంతోషించాడు. ఆహా! నా తెలివే తెలివి!! అని తన్ను తాను పొగడుకున్నాడు. దాంతో ఇంద్రజిత్తులో ఆనందం ఉరకలు వేసింది. మహోత్సాహంతో తాను అనుకొన్న పనిని చేయాలని సంకల్పించుకొన్నాడు. ఇక యజ్ఞాన్ని ఆరంభించడం ఎంతైనా మంచిదనుకొన్నాడు.

దురహంకారి నికుంభిలా చైత్యం వెళ్ళాడు. నికుంభిలా యజ్ఞం ప్రారంభించడానికి వేదికను ఏర్పరచాడు. అగ్నిని ప్రతిష్ఠించాడు. ఆహుతులను సమర్పించడం మొదలుపెట్టాడు. అభిచార హోమ విధానం ప్రకారం అగ్నికి హవిస్సులను ఇస్తున్నాడు.

అగ్ని శోణితాది హోమాలతో తృప్తి చెందాడు. దాంతో హోమకుండం నుంచి అగ్నిజ్వాలలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. తీవ్రమైన జ్వాలలు మిన్ను ముట్టినట్లుగా ఎగియడంతో ఆ ప్రదేశం అంతా దేదీప్యమానం అయింది. రాక్షసుల క్షేమంకోసం ఇంద్రజిత్తు హోమకార్యాలు చేస్తున్నాడు. అన్ని విషయాలు తెలిసిన రాక్షసులు, తెలియని రాక్షసులు సైతం రావణపుత్రుడు చేసే గొప్ప యజ్ఞాన్ని ఆశ్చర్యంగా, ఆనందంగా చూస్తున్నారు. ఇంద్రజిత్తు తన కపటోపాయం ద్వారా వానర సైన్యాన్ని దైన్యానికి గురిచేశాడు. వారు ఆ దైన్యాన్ని వీడేసరికి అసలు విషయం వారికి తెలిసే లోపల తన యజ్ఞం పూర్తి చేయాలని ఇంద్రజిత్తు అనుకొన్నాడు. దానిప్రకారమే యజ్ఞం మొదలుపెట్టాడు. దానివలన అప్రమేయ బలశాలి అయి శత్రునాశనం చెయ్యాలన్న ఆకాంక్ష ఇంద్రజిత్తులో బలంగా ఉంది.

* * *

# శ్రీరాముడిని ఓదార్చటం

## సర్గ – 83

శ్రీరాముడు రణరంగంలో జరిగే కోలాహల ధ్వనిని విని జాంబవంతునితో అత్యద్భుతమైన ఆయుధాల శబ్దం వినపడుతోంది, తప్పకుండా హనుమంతుడు ఏదో గొప్ప కార్యం చేసినట్లు ఉన్నాడు. 'ఓ భల్లూకరాజా! నీవు నీ బలాలతో కూడి అక్కడికి వెళ్ళు' అని చెప్పాడు. వెంటనే జాంబవంతుడు పశ్చిమ ద్వారం దగ్గర ఉన్న హనుమంతుని చేరాలని తన సైన్యాన్ని తీసుకొని బయలుదేరాడు. వారికి మారుతి, అతని సేన విషణ్ణవదనాలతో ఎదురు అయ్యారు. జాంబవంతుడు విచారవదనాలతో ఉన్న వారిని ఆశ్చర్యంగా చూశాడు. దిగులుచెందిన వానరసైన్యాన్ని అంతా వెనుకకు మరల్చి హనుమంతుడు భల్లూక వీరులతో కలిసి శ్రీరాముని దగ్గరకు వెళ్లాడు. 'ప్రభూ! సీతాదేవి మీ ప్రాణప్రదం అయిన మీ సతీమణిని మా ఎదురుగా ఇంద్రజిత్తు కరవాలానికి బలిచేశాడు. ఆమె మనలను వీడి వెళ్లిపోయింది' అని ఎంతో కుమిలిపోతూ మాయాసీత వధ వృత్తాంతాన్ని మారుతి శ్రీరామునితో చెప్పాడు.

మారుతి మాటలు విని మొదలు నరికిన చెట్టులాగా శ్రీరాముడు నేలకూలాడు. ఆయన అలా పడిపోవటం చూసి వారందరూ పట్టుకోవడానికి చుట్టూ చేరారు. శ్రీరాముని క్రింద పడుకోబెట్టి కాస్త చల్లని నీరును తెచ్చి ఆయన కన్నులపై చల్లారు. లక్ష్మణుడు అన్నను అక్కున చేర్చుకొన్నాడు. 'అన్నా! రాజ్యాధికారం దక్కకపోయినా, మీరు కలత చెందలేదు. సంతోషంతో పితృవాక్య పాలనకు పూనుకొన్నారు. ఆ ధర్మమే మిమ్ము ఆపదలపాలు చేస్తోంది. రామచంద్రా! ధర్మం గురించి ఎప్పుడూ చెపుతూనే ఉంటారు. కానీ, ఇప్పుడు మనలను ఆపదలు చుట్టుముట్టాయి. ఇప్పుడు మీరు చెప్పే ధర్మం మనలను కాపాడలేదు. అటువంటి ధర్మం నిరర్థకం అనిపిస్తుంది.

ఈ చరాచర జగత్తు అంతా కంటికి కనిపిస్తుంది. ఇందులో ప్రతి విషయం తరచి చూసి నిర్ణయించవచ్చు. కాని, ధర్మాధర్మాలు కంటికి కనపడని సత్యాలు. వాటిని మనం విన్నాం కాని, ఎప్పుడూ చూడలేదు. ధర్మం ఆచరిస్తే సత్ఫలితం వస్తుందని, అధర్మం చేస్తే తప్పక చెడ్డ ఫలితం వస్తుందని చెప్పగా విన్నాం. కాని, ఇపుడు ధర్మాన్నే ఆచరించే మీరు కడగండ్ల పాలయ్యారు. ఇప్పుడు ధర్మంపై ఆసక్తి సన్నగిల్లుతోంది. ధర్మాచరణ అంటే ఏమిటో తెలీని ప్రాణులు, మాట్లాడలేని, జ్ఞానం సంపాదించలేని, జీవులు అన్నీ సుఖంగానే బ్రతుకుతున్నాయి. ధర్మం ఆచరించే మీకు కష్టాలు రావటం, అధర్మాన్నే చేసే రావణునకు సుఖాలు రావడం చూస్తే మనం ఏమని అనుకోవాలి? ఏది నిజమని నమ్మాలి? ఈ లోకంలో ఎక్కడైనా అధర్మాన ఉన్న వారు సంపదలను బాగా వృద్ధి పొందించుకొంటున్నారు. ధర్మాచరణులు ఎప్పుడూ ఏదో ఒక బాధకు లోను అవుతున్నారు. వారిని అధర్మపరులు శాసిస్తూ దుఃఖభాజనులు చేస్తున్నారు. ధర్మశీలురకు ఆపదలే వస్తాయి అనేది నిజమైతే ఎవ్వరూ ధర్మాన్ని ఆచరించరు."

"రఘురామా! పాపకర్ములు అధర్మంవలన బాధపడడం ఎక్కడా కనిపించడంలేదు. ధర్మాధర్మాలు అచేతనాలు. అందుకే ప్రతిక్రియ చేయడానికి శక్తి వాటికిలేదు. అవి అవ్యక్తం. అసత్తుతో సమానం. సత్పురుషులలో శ్రేష్ఠుడా! సత్కర్మ జనితమైన అదృష్టం శుభఫలితాన్ని ఇస్తే మరి ఇపుడు మీకు వచ్చిన ఈ ఆపద ఏమిటి? కాబట్టి, సత్కర్మవలన శుభమే కలుగుతుందనుకోవటం అసమంజసంగా కనిపిస్తోంది.

మనిషి కార్యాన్ని సాధించడంలో ధర్మాన్నేకాక పురుష ప్రయత్నాన్ని కూడా ఆచరించాలి. మన తండ్రి సమస్త రాజ్యప్రజల ముందు మిమ్ము రాజును చేస్తానని ప్రతిజ్ఞ చేశాడు. కాని, ఇతర ఆలోచనలు చుట్టుముట్టడంతో మీపై దయలేనివారయ్యారు. మిమ్ము కారడవుల పాలు చేశారు. అప్పుడు మీరు పితృవాక్యపాలన అంటూ రాజ్యాధికారాన్ని వదిలి అడవులకు వచ్చారు. నేడు అపాయాలన్నీ మనలను చుట్టుముట్టాయి. నాకు మీరు సత్యవచనాన్ని పాలింపలేదని అనిపిస్తోంది. ధర్మానికి ప్రాధాన్యం ఇస్తే అధర్మానికి తావు ఇవ్వకూడదు. అధర్మచింతనే వస్తే ధర్మం అనే మాట మర్చిపోవాలి. ఇంద్రుడు విశ్వరూప మునిని హతమార్చాడు. ఆ తర్వాత యజ్ఞం చేశాడు. అతడు అధర్మానికి ప్రాధాన్యం ఇస్తే యజ్ఞం చేసేవాడు కాదు. ఒకవేళ ధర్మానికే ప్రాధాన్యం ఇస్తే మునిని హత్యచేసేవాడు కాదు. అధర్మంతో కూడిన ధర్మం కర్తను నశింపజేస్తోంది. అందువలన, మనిషి తనకు నచ్చిన రీతిలోనే పనులు చేయాలి. సమయానుకూలంగా పురుషార్థమో లేక ధర్మమో ఏదో ఒకదానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇది నా అభిప్రాయం' అని లక్ష్మణుడు వదిన మరణించిన వార్తతో ధర్మంపైన అసహనం కలిగి ఆవేశంతో ధర్మాధర్మాలను గూర్చి శ్రీరామునితో మాట్లాడాడు. "రామా! మీరానాడు రాజ్యాధికారం వద్దని చెప్పారు. అప్పుడే మీరు ధర్మాన్ని కాలరాచారనిపిస్తోంది. గ్రీష్మఋతువులో చిన్న నదులు ఎండిపోయినట్లుగా, మానవుడు పురుషయత్నాన్ని విస్మరిస్తే ఫలాలు ఏవీ అందకుండా పోతాయి. సుఖాలలో పుట్టినవారు ప్రాప్తించిన సంపదలను పోగొట్టుకొని తిరిగి వాటిని పొందాలనే తాపత్రయంతో అనేక పాపకృత్యాలు చేస్తారు. సంపద ఉన్నవాని చుట్టూ చుట్టాలు, స్నేహితులు కూడుతారు. వారందరూ సంపద ఉన్నవాణ్ణి సత్పురుషుడని, పండితుడని చెప్తూ ఉంటారు. అతడే బుద్ధిశాలిగా, భాగ్యశాలిగా, గుణవంతునిగా కూడా కీర్తింపబడుతాడు. మహావీరా! మీరు రాజ్యాన్ని ఎందుకు త్యాగం చేశారో నాకు తెలియదు. కానీ, అర్థ పరిత్యాగంతో బంధుమిత్రులు, కీర్తి దూరం అయిపోయాయి. ఇది నిర్వివాదం. నిర్ధనుడు అర్థకామాలను ఆశించి ధనార్జన కోసం పూనుకొన్నా తగిన శ్రేయస్సును పొందలేడు.

సంపదలు ఉన్నవారికీ, హర్షం, కామం, దర్పం, ధర్మం, క్రోధం, శమం, దమం అన్నీ అభివృద్ధి పొందుతాయి. సంపదలపై అనాసక్తి కనిపించేవానికి ఐహిక సుఖాలు అన్నీ దూరం అవుతాయి. మీరు వనాలకు రావడం వలన మీ ప్రాణాధికమైన భార్య దూరం అయ్యింది. అంతేకాదు, మీకీనాడు ఇంద్రజిత్తు కష్టం తెచ్చిపెట్టాడు. రామచంద్రా! నేను నా శౌర్య పరాక్రమాలతో మీ దుఃఖాన్ని దూరం చేస్తాను. మీరు శోకాన్ని వీడి లేవండి. మీరు సత్యనిష్ఠాపరులు. అసత్యమాడనివారు. మీ శౌర్య సాహస బలాలను మీరు మరచిపోవద్దు లేవండి. మనకు తీరని దుఃఖాన్ని కలిగించిన రాక్షసులను సమూలంగా నాశనం చేద్దామనే ఆలోచనకు రూపాన్ని కల్పించు" అంటూ లక్ష్మణుడు తనకు తెలిసిన దానిని గూర్చి చెప్తూ రామునిలో ఉత్సాహం నింపడానికి మాట్లాడాడు. వానరులందరూ అచేతనులు అయినట్లుగా లక్ష్మణుని మాటలు వింటున్నారు. రామునికి వచ్చిన బాధను చూచి వారు విచారానికి లోనయ్యారు. మనమంతా ఇంత కష్టపడి సముద్రాన్ని దాటి, ఇన్ని కష్టాలకు ఓర్చి యుద్ధం చేస్తూ ఉంటే భగవంతుడు మనకు అననుకూలంగా ఉన్నాడేమిటా అనే ఆలోచనలో మునిగిపోయారు. వారిలో నిస్సత్తువ ఆవరించింది. రాముడు సీత మరణవార్త విని అమితదుఃఖానికి లోనయ్యాడు. తమ్ముడు, ధైర్యశాలి అయిన సౌమిత్రి మాటలు రామునిలో దుఃఖాన్ని పెంచాయి. వదినమ్మ ను సంహరించారనే వార్త సుమిత్రానందునిలో ఆవేశం, ఆక్రోశం కలిగించింది. ఈ క్షణంలో రావణాసురుని అతని వంశాన్ని నాశనం చేయాలనే ఆగ్రహం కట్టలు తెంచుకుంది. మాయాసీత వధ రామాదులలో కలవరం కలిగించింది. వానరులందరూ విషణ్ణవదనాలతో ఉన్నారు. లక్ష్మణుడు ఆగ్రహంతో ఉడికిపోతున్నాడు. రాముడు నిస్తేజంగా ఉన్నాడు.

* * *

# విభీషణుని విన్నపం

## సర్గ - 84

అపారమైన సోదరప్రేమ ఉన్న లక్ష్మణుడు శ్రీరామునికి ఎన్నోవిధాలుగా ధైర్యం చెప్పాడు. అలా వారు మాట్లాడుకొంటుండగానే విభీషణుడు వానర సైన్య సమీక్షచేసి వారి దగ్గరకు వచ్చాడు. నలుగురు సచివులతో ఉన్న విభీషణుడు గజరాజులాగా కనిపించాడు. దుఃఖంలో కూరుకుని అశ్రువులను జాలువారుస్తున్న వానరులను చూశాడు. విచార వదనంతో చింతిస్తున్న రామ లక్ష్మణులను విభీషణుడు చూశాడు. వారిని చూచిన విభీషణునికి ఆత్మీయుల దుఃఖం చూడలేక కళ్ళు అశ్రుపూరితాలు అయ్యాయి. ఎందుకు విచారిస్తున్నారని వారిని అడిగాడు. మారుతిద్వారా తెలుసుకున్న విషయం వలన వారు బాధపడుతున్నారని విభీషణుడు తెలుసుకున్నాడు. లక్ష్మణుడు చెబుతుండగానే మధ్యలో మాటలు ఆపివేస్తూ "రఘురామా! హనుమంతుడు చూచిన విషయం సత్యం కాదు. మహాబాహూ! సీతాదేవి విషయంలో రావణుని ఆంతర్యం నాకు బాగా తెలుసు. రావణుడు దుర్మార్గుడే అయినను సీతాదేవికి ఏ ఆపద తీసుకురాడు. నేను ఎప్పుడు రావణుని హితంకోసమే పనిచేసేవాణ్ణి. అలాంటి నేను ఎన్నోసార్లు సీతాదేవిని మీకు అప్పగించమని చెప్పాను. ఆమెను సామ దానభేదదండోపాయాలతో వశపర్చుకోవడం అసాధ్యం

మహాబాహూ! రఘువంశ తిలకా! ఇంద్రజిత్తు చేత సంహరించబడింది మాయాసీతే కాని నిజం కాదు. ఇది ముమ్మాటికీ నిజం. ఇంద్రజిత్తు మాయలవాడు. వానరులను ఇలాంటి చర్యతో భ్రమింపజేసి తాను **నికుంభిలా యజ్ఞం** చేయాలని తలపెట్టాడు. దానిని చూచి ఇంద్రజిత్తు అనుకున్నట్లే వీరు మాయా సీతను నిజమైన సీతగా భ్రమించారు.

ఇంద్రజిత్తు ఇప్పుడు **నికుంభిలా చైత్యం** వెళ్లి హోమకార్యాలు ఆచరిస్తున్నాడు. ఇంద్రజిత్తు తలపెట్టిన యజ్ఞం పూర్తిచేసినట్లయితే వారిని ఇంద్రాది దేవతలతో సహా ఎవరూ జయించలేరు. వానరులను భ్రమలో ఉంచడంద్వారా మీరందరూ పరాక్రమాన్ని వీడుతారు. ఆ సమయంలో ఇంద్రజిత్తు యజ్ఞంచేసి బలవంతుడు కావాలనే దురాశతో ఈ మాయను పన్నాడు. పురుషోత్తమా! ఈ అకారణ శోకాన్ని వీడి వానరసేనలో ఉత్సాహాన్ని నింపండి. ధైర్యం తెచ్చుకుని పోరాటం చేయండి. సేనా నాయకులతో పాటుగా మా వెంట సౌమిత్రిని పంపండి. ఈ నరశ్రేష్ఠుడు లక్ష్మణస్వామి తన నిశిత శరాలతో ఇంద్రజిత్తు హోమకార్యాలు నిర్వీర్యం చేస్తాడు. అప్పుడే ఇంద్రజిత్తుని సంహరించటం వీలు అవుతుంది. ఈ లక్ష్మణుని వీరావేశ బాణాలు రావణ పుత్రుని రక్తాన్ని పీల్చివేస్తాయి.

మహాబాహూ! రఘుకులోత్తమా! శత్రుసంహార విషయంలో కాల విలంబన మంచిది కాదు. మన శత్రువును నిహతుని చేయడానికి మీరు అనుమతిని ఇవ్వండి. రాక్షసయోధుని యజ్ఞం పూర్తి అయితే సురాసురులకు సైతం అదృశ్యునిగా ఉండి యుద్ధంచేసి గెలవగలడు. యజ్ఞం పూర్తి అయితే ఇక మన గెలుపు సంశయాస్పదం అవుతుంది" అని విభీషణుడు శ్రీరాముని దుఃఖాన్ని దూరం చేశాడు. యుద్ధానికి ముందు అత్యవసరంగా చేయాల్సిన మేఘనాద రావణుల మాయోపాయాన్ని పటాపంచలు చేయండని ఉద్బోధించాడు.

* * *

# లక్ష్మణాదులు నికుంభిలను చేరటం

## సర్గ - 85

**శ్రీ**రాముడు శోకంలో ఉండటంతో విభీషణుడు చెప్పినదంతా విన్నా అది సత్యమా అసత్యమా అన్న మీమాంసలో కూరుకొని పోయాడు. తాను విన్నదంతా నిజమా కాదా అన్న సంశయం ఆయన్ను పీడించింది. దాంతో రాముడు విభీషణుని మరల చెప్పినదంతా ఇంకోసారి చెప్పమన్నాడు. రఘురామునికి చింత తీరేటట్లుగా యథార్థాన్ని మరల విభీషణుడు చెప్పాడు.

'మహారాజా! మీరు చెప్పినట్లుగానే వానర సేననంతా లంక అన్ని ద్వారాల చెంత నిలిపాను. యూథపతులను వేర్వేరుగా విభజించి వచ్చాను. మహావీరా! ఈ అనవసర శోకాన్ని అవతల పడేసి యుద్ధోన్ముఖునివి కావలసిన అవసరం ఉంది. లేకపోతే మన శత్రువులు ఆనందించే సమయం వస్తుంది. మీరు రాక్షసాదులను నిర్మూలించి సీతాదేవిని పొందవలసి ఉంది.

ఈ లక్ష్మణుడు ఇప్పుడే తగినంత సైన్యాన్ని తీసుకొని నికుంభిల దగ్గరకు వెళ్ళటం ఉచితం. సౌమిత్రి గొప్ప ధనుర్ధారి. ఇతడు ఇంద్రజిత్తును చంపగల నేర్పరి. ఇంతకుముందు ఇంద్రజిత్తు బ్రహ్మను గూర్చి ఘోరమైన తపస్సుచేశాడు. దానివలన బ్రహ్మశిరం అనే అస్త్రాన్ని వేగంగా వెళ్ళే రథాన్ని అశ్వాలతో సహా పొంది ఉన్నాడు.

ఇప్పుడు మరల మనపై విజయకాంక్షతో నికుంభిల చేరి యజ్ఞాలు చేస్తున్నాడు. ఇప్పుడు ఆ యాగం పూర్తిచేసి యుద్ధానికి తరలివస్తే ఆయనకు ఎదురు నిలిచే వారు ఎవరూ ఉండరు. శ్రీరామా! ఇంతకుముందు సర్వలోక సృష్టికర్త ఐన బ్రహ్మదేవుడు రావణసుతునకు వరం ఇచ్చాడు.

మహాబాహూ! ఇది వరంలాగా కనిపించే శాపమే. ఇది ఇంద్రజిత్తు మరణ సూచకం. ఇంద్రజిత్తు నికుంభిల అనే వటవృక్షం దగ్గర చేరి అక్కడ అభిచార హోమాలు పూర్తిచేయకముందే, నీ శత్రువు శస్త్రధారివియైన నిన్ను దెబ్బతీయడానికి పూనుకొంటే, అతడే నీ పాలిట మృత్యుదేవత అని చెప్పాడు. ఇప్పుడు నికుంభిల దగ్గరే ఇంద్రజిత్తు యాగం ప్రారంభించాడు. అది పూర్తికాకమునుపే మనం వానిని దెబ్బతీయాలి. దానికి సౌమిత్రే సర్వవిధాలా సమర్థుడు' అని విభీషణుడు మరలా చెప్పాడు. అన్నీ విన్న రాముడు ఇంద్రజిత్తు మాయా ప్రభావం మనకు అందరికీ తెలిసిందే. రణరంగాలలో వానరులు, మానవులే కాదు వరుణునితో సహా దేవతలను నిశ్చేష్టులను చేస్తాడు. బ్రహ్మాస్త్ర ప్రయోగ నిపుణుడు, ఈ విభీషణుడు చెప్పినదంతా నిజమే అయి ఉంటుంది. అనుకొన్నాడు. ఆ విషయాన్ని వానరులతో కలసి ఆలోచించాడు. సుగ్రీవుడు, ఆంజనేయాదులకు కూడా విభీషణుని మాటలే నమ్మకం కలిగించాయి.

'లక్ష్మణా! నీ వెంట సుగ్రీవాది వీరులను జాంబవంతాదులను హనుమదాదులను తీసుకొని వెళ్ళు. మాయలు పన్నడంలో బహునేర్పరి ఐన రావణ కుమారుని జయించు. మహాత్ముడైన విభీషణుడు నీకు అనుక్షణం తోడు నీడగా ఉంటాడు' అని రాముడు చెప్పాడు.

అత్యద్భుత పరాక్రమశాలి ఐన లక్ష్మణుడు ధనుస్సుతోపాటు ఖడ్గాన్ని తీసుకొన్నాడు. యుద్ధ సన్నద్ధుడై తన అన్నకు ప్రదక్షిణ నమస్కారాలు చేశాడు. 'అన్నా! నేడే నా ధనుస్సుకు పని చెప్పి లంకలో దిగుతాను. ఆ దురాత్ముని నా శరాలకు బలి ఇస్తాను' అని లక్ష్మణుడు వీరావేశంతో శ్రీరామునితో పలికాడు.

ఇంద్రజిత్తును వధించాలన్న ఉబలాటం లక్ష్మణునిలో అధికం అయ్యింది. ఇంద్రజిత్తు ఉన్న నికుంభిలకు లక్ష్మణుడు అన్న అనుమతితో బయలుదేరాడు. లక్ష్మణునితోటి విభీషణాదులు సుగ్రీవాదులు, జాంబవంతాది వీరులు హనుమంతునివంటి వానరప్రముఖులు వానరసేన అత్యుత్సాహంతో బయలుదేరారు. అందరిలా మాయలమారియైన మేఘనాదుని ఎలా మట్టుబెట్టాలన్న ఆలోచనలు, వానరాకకు ముందు ముసురుకొనే తూనీగల్లా ముసురుకొన్నాయి. వారందరూ దీర్ఘాలోచనలల్లో మునిగితేలుతూ ముందుకు వడివడిగా వెళ్తున్నారు.

అలా వారు రావణుని నికుంభిలకు చేరసాగారు. చాలా దూరం ప్రయాణం చేసిన తర్వాత ఇంద్రజిత్తు సైన్య బలాలు వీరికి ఎదురు అయ్యాయి. ఇంద్రజిత్తు దగ్గరకు లక్ష్మణుడు వెళ్ళి ధనుర్ధారుడై నిలిచాడు. ఇంద్రజిత్తు యాగాన్ని నిర్వీర్యం చేయాలని తలచాడు. సౌమిత్రికి తోడుగా విభీషణుడు అక్కడే నిలిచాడు. వాలి సుతుడు, హనుమంతుడు, సుగ్రీవుడు, జాంబవంతుడు అందరూ లక్ష్మణునికి చేదోడుగా ఉన్నారు.

అసంఖ్యాకులైన రాక్షస యోధులు మహారథులు అతిరథులతో ఆ ప్రదేశం చొరరానిదిగా ఉంది. దుర్భేద్యమైన ఇంద్రజిత్తు సేనావాహినిలో లక్ష్మణుడు ప్రవేశించాడు. లక్ష్మణుని తోడుగా విభీషణుడు, సుగ్రీవాదులు వెన్నంటి నిలిచారు. ఏ ప్రక్కనుంచి ఏరూపులో ఇంద్రజిత్తు విరుచుకుపడుతాడా అని నాలుగువైపులా అప్రమత్తంగా వారు చూస్తున్నారు.

* * *

# విభీషణుని ప్రోత్సాహం

## సర్గ - 86

**“ల**క్ష్మణా! ఇక్కడ కనిపించే కాటుక లాంటి శరీరులే ఇంద్రజిత్తు సైన్యం. దీన్ని చెల్లాచెదురు చేస్తే కాని మనకు ఇంద్రజిత్తు కనిపించడు. యాగం కాకముందే నీ శర సంధానంతో ఇంద్రజిత్తును జయించు. ముందు ఈ రాక్షస సేననంతా మట్టికరిపించు” అని విభీషణుడు లక్ష్మణుని ప్రోత్సహించాడు.

సహృదయుల అంతర్యాన్ని తెలుసుకోగలిగే నైపుణ్యం ఉన్న లక్ష్మణుడు విభీషణుని సూచనలను అనుసరించి ఇంద్రజిత్తుపై శరాలతో దాడిచేశాడు. వృక్షాలు, పర్వతాలతో గోళ్ళు ఆయుధాలుగా ఉన్న వానరులు, భల్లూకాలు రాక్షసులపై ఒక్కుమ్మడిగా విజృంభించారు. రాక్షసులకు కోపం మితిమించింది. వారు ఆయుధ పాణులయ్యారు. వెంటనే శత్రుసైన్యాలతో ఆయుధాలతో తలపడ్డారు.

ఇరుపక్షాల నడుమ సంకులసమరం సాగింది. రణకోలాహల ధ్వనులు లంక అంతా నినదించాయి. వికృతాకార రాక్షసులు వానరులను అంతంచేయాలని ఆయుధాలను ప్రయోగించారు. రాక్షసులను చంపాలని వానరులు చూశారు. భల్లూకాలు, వానరాలు అన్నీ రాక్షసులను పట్టి పీకుతున్నాయి. గోళ్ళతో దంతాలతో హింసిస్తున్నారు. వారి ధాటికి రాక్షసులు భయంతో గడగడలాడుతున్నారు.

ఎదిరింప శక్యం కాని ఇంద్రజిత్తు తన సేన వధింపబడడం చూశాడు. విషాదంలో కూరుకుపోతున్న తన సేనను చూసి వెంటనే హోమ కార్యాన్ని ఆపి లేచాడు. దట్టంగా ఉన్న వృక్ష సమూహం నుంచి బయటకు వచ్చాడు. సిద్ధంగా ఉన్న రథాన్ని ఎక్కాడు. మహాతేజస్సుతో ఉన్న ధనుస్సును చేతబట్టాడు.

ధనుస్సు చేతబట్టి కదనానికి కదిలిన ఇంద్రజిత్తును రాక్షస సేన చూసింది. అత్యుత్సాహంతో ఆయన చుట్టూ చేరింది. హనుమంతుడు వృక్షాలతో పర్వత శిఖరాలతో రాక్షస సేనను మట్టి కరిపిస్తున్నాడు. వేలకొలది నిశాచరులు హనుమంతునిపై శరాలను కురిపిస్తున్నారు. శూలాలు, ఖడ్గాలు, బల్లెములు, అడ్డకత్తులు ఇనుప గుదియలతో హనుమంతుని పీడిస్తున్నారు. హనుమంతుడు వారిని మృత్యువు ఒడిలో చేరుస్తున్నాడు. రాక్షసులను తునుమాడే హనుమంతుడిని చూశాడు ఇంద్రజిత్తు. వెంటనే తన సారథిని హనుమంతుని దగ్గరకు తీసుకెళ్ళమని

చెప్పాడు. హనుమంతుని దగ్గరకు ఇంద్రజిత్తు చేరి శరాలను, ఖడ్గాలను, అడ్డకత్తులను విరామం లేకుండా వేస్తున్నాడు. వాటినన్నింటిని తప్పించుకొంటూ హనుమంతుడు ఇంద్రజిత్తును ఎదుర్కొంటున్నాడు.

'ఓరీ దుర్మతీ! నీవు శూరుడివే అయితే నాతో ద్వంద్వ యుద్ధానికి తలపడు. అప్పుడు నీ ప్రాణాలు మిగులుతాయో చూస్తాను' అని హనుమంతుడు ఇంద్రజిత్తుతో అన్నాడు. హనుమంతునకు జవాబు ఇవ్వకుండా తన శరాన్ని ఎక్కుపెట్టాడు. ఈ బాణంతో వాయుసుతుని చంపేయాలని ఇంద్రజిత్తు అనుకొన్నాడు.

వాని మనోభావం తెలుసుకొన్న విభీషణుడు లక్ష్మణునకు చెప్పాడు. 'లక్ష్మణా! దేవేంద్రుని జయించిన ఇంద్రజిత్తు మారుతిని చంపాలని చూస్తున్నాడు. గన్నేరు ఆకులవంటి నీ శరాలతో ఆ దుష్టుడి పని పట్టు. త్వరపడి ఇంద్రజిత్తు ఆటను మీరు కట్టించకపోతే విపరీత పరిణామాలు చోటుచేసుకొంటాయి' అని చెప్పాడు. రణరంగంలో ఉన్న ఇంద్రజిత్తును లక్ష్మణుడు చూశాడు. విభీషణుని మాటప్రకారం ఇంద్రజిత్తుతో యుద్ధానికి సిద్ధం అయ్యాడు. అంతలో ఇంద్రజిత్తు రణగర్జన చేశాడు.

మేఘనాదుడు వెంటవెంటనే హోమకార్యం నిర్వర్తించాలని తొందరపడుతున్నాడు. వానరులు రావడం ఇంద్రజిత్తులో అసహనం కలిగించింది. ఏ పనినైనా చేసి వీరిని దూరం చేయాలని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. రాక్షసుల మీదకు వస్తున్న వానరులను యమపురికి పంపించాలని నానాయాతనలు పడుతున్నారు. ఇంద్రజిత్తు గొప్పతనం మీద అందరూ ఆశలు పెట్టుకున్నారు. రావణవిజయం కావాలంటే ఈ ఇంద్రజిత్తు హోమం పూర్తికావాలని వారందరికి తెలిసింది. కాని, ఆ పని పూర్తిఅవుతుందా అన్న సందేహం కొందరిలో పొడచూపింది. వారు నిశ్శబ్దంగా ఇంద్రజిత్తు చేసేదానిని చూస్తున్నారు.

* * *

# ఇంద్రజిత్తు నిందాలాపం

## సర్గ – 87

**వి**భీషణుడు తాను చెప్పిన విషయం నిజమేనని చూపించడానికి లక్ష్మణుని తీసుకొని గబగబా ముందుకు వెళ్ళాడు. ఆ మహావనంలోని మఱ్ఱిచెట్టు దగ్గరకు వెళ్ళారు. ఇంద్రజిత్తు హోమకార్యాలను చేసే స్థలాన్ని చూపించాడు. 'లక్ష్మణా! ఇక్కడే ఇంద్రజిత్తు భూతబలులు ఇచ్చి హోమం నిర్వర్తించి వెంటనే అదృశ్యశక్తి ఉన్న రథాన్ని ఎక్కి రణభూమికి వస్తాడు.

ఇంద్రజిత్తు ఈ మఱ్ఱిచెట్టు దగ్గరకు రాకముందే నీవు వెళ్లి ఇంద్రజిత్తు రథాన్ని అశ్వాలను సారథిని చివరకు ఇంద్రజిత్తును కూడా సంహారం చేయి' అని చెప్పాడు. సౌమిత్రి విభీషణుని మాటలు విని 'మహాత్మా! మీరు చెప్పినట్లే చేస్తాను' అనిచెప్పి ముందుకు సాగాడా లక్ష్మణుడు.

అప్పుడు వారికి ధనుర్ధారియై రథంపైనున్న ఇంద్రజిత్తు కనిపించాడు. వెంటనే ఇంద్రజిత్తును సౌమిత్రి యుద్ధానికి ఆహ్వానించాడు. 'నీవు సర్వసన్నద్ధునివై నాతో యుద్ధం చేయడానికి రా' అని కవ్వించే లక్ష్మణుని ప్రక్కన ఉన్న విభీషణుని రావణుని కొమరుడు చూశాడు. చాలా కోపం ఆయన కళ్ళలో ఉబికి వచ్చింది.

'రాక్షసా! నీవు ఈ గడ్డపై పుట్టి పెరిగావు. సాక్షాత్తు నా తండ్రికి తమ్ముడివి. అయినా నాపై ద్రోహానికి తలపడుతున్నావేమి? దుర్బుద్ధీ! నీవు రాక్షస ధర్మానికి కళంకం తెస్తున్నావు. నీలో సుహృద్భావం కనుమరుగైంది. పులస్త్యవంశం వానివన్న సత్యాన్ని మరిచినట్లున్నావు. నీ కర్తవ్యం, నీ సోదరభావం అన్నీ కనుమరుగు అయిపోయాయి.

ఆత్మీయులను పోగొట్టుకొని పరులకు ఊడిగం చేస్తున్నావు. నీ స్థితి చూసి నాకు జాలి వేస్తోంది. స్వజనులతో గౌరవ ఆదరాలను పొందే అర్హతను పోగొట్టుకొన్నావు. సజ్జనుల నిందకు గురి అయ్యావు. నీవు నీచులను ఆశ్రయించి జీవిస్తున్నావు. నీది ఒక బ్రతుకేనా? నీ బుద్ధి శిథిలం అయ్యింది. స్వజనులు బుద్ధిహీనులైనా వారి దగ్గర ఉండడమే మేలు. స్వపక్షం వారిని వీడి పరపక్షం చేరి తన వారిని నశింపచేసుకొన్న తర్వాత నీవు బావుకొనేది ఏముంటుంది? తర్వాత నీవు కూడా వీరి చేతిలో నిహతుడివికావని ఎలా నమ్ముతున్నావు?

ఇప్పుడు నీవు పనిగట్టుకొని విఘాతం కలిగించడానికి ఈ లక్ష్మణుని వెంట పెట్టుకొని వచ్చావు. ఇది చాలా దుష్కృతం. స్వజనుడవై నీవు అనుచిత కార్యానికి పూనుకోవడం అసహ్యకరంగా ఉంది. రావణానుజా! నీవు చేసే ఏ పని కూడా బాగోలేదు' అని ఇంద్రజిత్తు విభీషణునితో అన్నాడు.

'రావణ కుమారా! నీవు నా స్వభావం తెలియక దురుసుగా మాట్లాడుతున్నావు. నీకు పూర్తిగా నా విషయం తెలియదు. నేను క్రూర కర్మాలు చేసే రాక్షసుల ఇంట పుట్టినాను. కాని, నాది రాక్షస స్వభావం కాదు. సత్పురుషులకు గుణమే ప్రధానం. నాకు క్రూరకృత్యాలపై మనస్సు పోదు. అధర్మ కార్యాలు నాకు ఇష్టం ఉండదు. తన స్వభావానికి నా స్వభావానికి వ్యతిరేకం ఉన్నంత మాత్రాన నన్ను ఇంటినుంచి వెళ్ళగొట్టవచ్చా? మీ తండ్రి నన్ను ఇంటినుండి వెళ్ళగొట్టినాడు.

ధర్మాన్ని వదిలి పాప కృత్యాలు చేసే నీ తండ్రికి నేను ఎన్నోసార్లు మంచిమాటలు చెప్పాను. కాని, ఆయన వినలేదు. హింసకు పాల్పడ్డం మంచిది కాదని చెప్పాను. పరాయి సొమ్ముకు ఆశపడవద్దని చెప్పాను. పరస్త్రీల దగ్గరకు వెళ్ళవద్దన్నాను. పరస్త్రీలతో అనుచితంగా ప్రవర్తించవద్దని చెప్పాను.

పరుల సొమ్ము దోచుకోవడం, సజ్జనులను శంకించడం, పరస్త్రీలను అత్యాచారానికి గురిచేయడం, ఈ మూడును పరమ నీచాతి నీచమైన దోషాలు. వీటిని ఆచరించినవారికి సర్వనాశనం తప్పదు. మహర్షులను చంపడం, దేవతలతో యుద్ధం చేయడం పాపం. గర్వంతో ప్రవర్తించడం, ఇతరుల మేలు చూచి ఓర్వలేకపోవడం మహాపచారాలు. ఇవి జీవితంలో ఉన్న ఆనందాన్ని ఐశ్వర్యాన్ని పాడుచేస్తాయి.

మంచి లక్షణాలున్న మా అన్నలో పరస్త్రీ వ్యామోహం అతని హృదయాన్ని బండరాయిని చేసింది. ఒక్క అవ లక్షణం మంచి లక్షణాలన్నీ తుడిచిపెట్టింది. అందువలనే ఎన్నోసార్లు చెప్పి చూసి ఇక నా వలన కాదని మీ తండ్రిని వదిలివేశాను.

నీవు కూడా గర్వంతో మదించి మాట్లాడుతావు. నీతి నియమాలను కాలరాచావు. అందువలనే నేడు కాల పాశానికి బందీవయ్యావు. నీవు చెప్పవలసింది ఏమైనా ఉంటే నాతో చెప్పు. రాక్షసాధమా! నీ ఆయువు మూడింది. ఇక నీవు తిరిగి నికుంభిలకు వెళ్ళలేవు.

రామలక్ష్మణులను నీవు ఎదిరించలేవు. వీరి చేతిలో మరణం పొంది నీవు నరక కూపాన పడడం తథ్యం. నీ శక్తి సామర్థ్యాలను పూర్తిగా అభివ్యక్తం చేయి. నీ వివిధాయుధాలతో ఈ లక్ష్మణునితో యుద్ధం చేసి నీ కోర్కె తీర్చుకో. కాని, లక్ష్మణుని శరానికి బలికాక తప్పదు. ఇది తెలుసుకో. విషయం తెలుసుకొని మరీ మాట్లాడు. అనవసరంగా నోరు పారేసుకుని ఇబ్బందులపాలు కాకు. మంచి చేయడం బహుకష్టమని మీరు భ్రమిస్తున్నారు. పాపాన్ని ఏ భయంలేకుండా చేస్తున్నారు. కాని, ఆ పాపమే మీకు మృత్యువును కొనితెస్తోంది. దానిని మీరు గ్రహించలేకున్నారు. అది మీ కర్మ' అని విభీషణుడు ఇంద్రజిత్తు ప్రశ్నలకు సమాధానం ఇచ్చాడు.

* * *

# ఇంద్రజిత్తు, లక్ష్మణుల ఘోర యుద్ధం

## సర్గ - 88

**వి**భీషణుని మాటలు ఇంద్రజిత్తును ఆవేశపరిచాయి. అతడు పరుషంగా మాట్లాడుతూ ముందుకు వచ్చాడు. ప్రళయకాల రుద్రునిలాగా భయంకరమైన కోపంతో యుద్ధ సన్నద్ధుడై ముందుకు వచ్చాడు. ఆ నిశాచరుని ధనుస్సు చాలా దృఢంగా ఉంది. బాణాలు చాలా పదునుగా ఉన్నాయి.

సర్వాలంకార శోభతో ఉన్న ఇంద్రజిత్తు హనుమంతునిపై విరాజమానమైన లక్ష్మణుని చూశాడు. ఆయన చుట్టూ ఉన్న రాక్షస భల్లూక వీరులను, విభీషణాదులను చూశాడు. నేడు నా పరాక్రమాన్ని మీకందరికీ చూపిస్తాను అని గర్వంగా ఇంద్రజిత్తు చెప్పాడు. జడివానను తలపించే తన బాణ పరంపరతో మీ అందరిని మట్టి కరిపిస్తాను అని ఆవేశంగా అన్నాడు.

దూదిని అగ్ని తృటిలో కాల్చివేసినట్లుగా నా శరాలు మిమ్ములనందరిని నాశనం చేస్తాయి. నా వివిధా యుధాలచేత మిమ్ములను మృత్యుముఖులను చేస్తాను. అని పెద్దగా అరుస్తూ ఇంద్రజిత్తు ముందుకు వస్తున్నాడు.

'లక్ష్మణా! ఇంతకు ముందే నీవు, నీ సోదరుడు, నీ పరివారం అంతా నా శరధాటికి స్పృహ తప్పి పడి పోయిన సంగతి మరచిపోయావా? మళ్లీ నాపై బుసకొట్టేనాగులాగా యుద్ధం చేయడానికి నా దగ్గరకు వచ్చావు.

నీకు ఏమన్నా యమసదనం చూడాలన్న కోరిక ఉదయించిందా? అలా అయితే నేను నిన్ను యముని దగ్గరకు పంపి తప్పక నరక సదనాన్నంతా చూపించమని నా మాటగా యమునితో చెప్తాను. నీవు ఏమీ చింతించాల్సిన అవసరం రాదు. తప్పకుండా నిన్ను చేరవల్సిన చోటుకు చేరుస్తాను.'అని ఇంద్రజిత్తు అన్నాడు.

ఇంద్రజిత్తు మాటలకు సౌమిత్రి చిరునవ్వు నవ్వి 'రాక్షసా! యమసదనానికి చేర్చుతానని నీవు సులభంగా చెప్తున్నావు. అది మాటాలాడినంత సులభం కాదు. నీకు అసాధ్యమైన పనులను గూర్చి ఎందుకు ఆయాసపడుతావు? నీవు పలికే బీరాలనుబట్టి నీ బుద్ధి తేటతెల్లంఅయ్యింది. ఎవరైనా గొప్పకార్యం చేసిన తర్వాత చెప్పితే వారిని సమర్థులు అని చెప్పవచ్చు.

కాని, నీవు నీకే శూరత్వం ఆపాదించుకొని ప్రగల్భాలు పలుకుతున్నావు. మాటలు పలికి నిన్ను నీవు కృతార్థుడవైనట్లుగా భావిస్తున్నావు. నీవానాడు అదృశ్యంగా ఉండి యుద్ధం చేశావు. అది దొంగల పద్ధతి. పిరికివాడు తన స్వభావాన్ని దాచి వేరొక స్వభావాన్ని చూపిస్తుంటాడు. చూచేవారికి మంచివారిలా కనపడుతూ లోపల దుష్కృత్యాలను చేస్తుంటాడు. అటువంటివానిని భగవంతుడు ఊరికినే వదలడు. ఎవరి కర్మకు తగిన ఫలాన్ని వారికి అందించి తీరుతాడు.

నిశాచరా! నీ బాణాలకు నేను ఎదురుగా నిలిచాను. ఏదీ నీ పరాక్రమాన్ని ఇప్పుడు ప్రదర్శించు. ఆత్మ శ్లాఘను వీడి నాతో యుద్ధానికి తలపడు' అని లక్ష్మణుడు ఇంద్రజిత్తుతో అన్నాడు. యుద్ధ విజేతనని తలచే ఇంద్రజిత్తు తన ధనుస్సును చేతబట్టి శరాలను సంధించాడు. నిశాచరుడు వేగంగా సాగిపోయేవీ, బుసకొట్టేవీ, సర్పాలవంటి బాణాలను లక్ష్మణునిపై వేశాడు. ఇంద్రజిత్తు బాణాల ధాటికి లక్ష్మణుని శరీరం రక్తసిక్తం అయ్యింది.

ఇంద్రజిత్తు రక్తసిక్త దేహంతో ఉన్న లక్ష్మణుని చూసి తన యుద్ధ ప్రావీణ్యానికి తానే మురిసిపోయి పెద్దగా గర్జించాడు. సౌమిత్రీ! నా వింటినుండి వచ్చే బాణాలు బలమైనవి; పదునైనవి. ఇవి ప్రాణాంతకాలు. అవి నీ ప్రాణాలు నేడు తీయకుండా ఆగవు. నా చేతిలో ప్రాణాలు కోల్పోయి నీ మృత శరీరం నేల రాలుతుంది. దానిని నక్కలు, డేగలు, గ్రద్దలు గుంపులు గుంపులుగా వచ్చి తింటాయి.

శ్రీరామభక్తుడవు. ప్రియాతి ప్రియమైన సోదరుడివి. నీ మృత కళేబరాన్ని మీ అన్న త్వరలోనే చూస్తాడు. సౌమిత్రీ! నేడు నా శరం నీ కవచాన్ని, ధనుస్సును విరగగొట్టి తీరుతుంది. నీ తల తెగిపడడం ముమ్మాటికీ నిజం అయి తీరుతుంది.' అని గర్వాతిశయంతో రావణ సుతుడు చెప్పాడు.

'క్రూరకర్ముడివైన రాక్షసా! నీ వాచాలత్వం కట్టిపెట్టు. నీ మాటల తూటాలు ప్రక్కనపెట్టి నాపై శరాన్ని సంధించు. క్రియాశూన్యునివై ఎందుకు వ్యర్థ ప్రేలాపనలు చేస్తున్నావు. నీ వాగ్బాణాలకు తగినట్లుగా నీవు ప్రవర్తించు. ఓ ఇంద్రజిత్తూ! నీవు ఎన్ని మాట్లాడినా నేను వాచాలుడినిగాదు. ఇప్పుడే నీకు నేను ఏమిటో చేసి చూపిస్తాను' అంటూ లక్ష్మణుడు చేతిలోని ధనుస్సును సంధించాడు.

లక్ష్మణుడు ఒకేసారి ఐదు బాణాలను సంధించాడు. అవి వేగంగా వెళ్లి ఇంద్రజిత్తు వక్షస్థలాన్ని గ్రుచ్చుకున్నాయి. బాగా దెబ్బతిన్న ఇంద్రజిత్తు కోపావేశుడై లక్ష్మణునిపై మూడు బాణాలు వేశాడు.

ఆ ఇద్దరి వీరులమధ్య సమరం మహాఘోరంగా సాగుతోంది. ఆ ఇరువురి వీరత్వం కౌశల్యం నిరుపమానంగా కనిపించింది. వారిద్దరూ శస్త్రాలను, అస్త్రాలను ప్రయోగించడంలో అజేయులు, సర్వసమర్థులు. ఎవరికివారు అజేయంగా పోరాడుతున్నారు. సింహాల్లా పోరాడుతున్నారు.

అత్యుత్సాహంతో శర సమూహాలను గుప్పిస్తూ పోరు సల్పుతున్నారు. పరస్పర జయేచ్ఛతో ఉత్సాహంగా శరాలను ప్రయోగిస్తున్నారు. వారి యుద్ధం ఇంద్ర శంబరాసురుల యుద్ధాన్ని తలపిస్తోంది.

## భీకర సమరం

ఇంద్రజిత్తు వేసే బాణాలను నిలవరిస్తూ లక్ష్మణుడు బాణాలను వేస్తున్నాడు. ఒకసారి సౌమిత్రి ధనుష్టంకారం చేశాడు. అది ఇంద్రజిత్తులో భయం పుట్టించింది. ఒకసారి ఇంద్రజిత్తు సౌమిత్రిని తేరిపార చూశాడు. అప్పుడు విభీషణుడు ఇంద్రజిత్తు ముఖాన్ని చూసి లక్ష్మణునితో ఇలా చెప్పాడు. "సౌమిత్రీ! ఇంద్రజిత్తు ముఖం వెలవెలబోతోంది. ఇక వీనికి భంగపాటు తప్పదు' కనుక త్వరత్వరగా బాణప్రయోగం చేయి" అని చెప్పాడు.

లక్ష్మణుని బాణాలు కొంతసేపు ఇంద్రజిత్తు ఆయుధాలను క్షోభింపజేశాయి. దాంతో ఇంద్రజిత్తులో నైరాశ్యం నిండింది. కొద్ది సేపటిలోనే ఆ మహావీరుడు నిరాశను వదిలి ముందుకు వచ్చి గర్వంతో 'ఓ లక్ష్మణా! నీవు నీ అన్న నా యుద్ధపు తాకిడికి నేలపై పొర్లారు. ఆ రోజు నీ మదిలో మెదలడంలేదా? ఓహో! నీవు మరణాన్ని ఆహ్వానిస్తున్నావేమో? నీ అన్నతో పాటుగా కష్టాలు పడలేక, మృత్యు ఒడిలోకి వెళ్లాలనే సంకల్పించుకొని ఉంటావు. అందువలనే నీవు నాతో యుద్ధానికి తలపడ్డావు. ఇప్పుడు నీ ఉద్దేశ్యం నాకు బాగా అర్థం అయ్యింది.

నీ కోరిక నేను తప్పక తీర్చి నీకు సుఖాలు కలిగిస్తాను. యముని విహార స్థలంలో నీవు యథేచ్ఛగా విహరించేలాగా చేస్తాను' అంటూ లక్ష్మణుణ్ణి ఏడు బాణాలతో, హనుమంతుణ్ణి పది బాణాలతో కొట్టాడు.

ఇంద్రజిత్తులో అంతకంతకు కోపం పెరిగింది. రణావేశం ఉధృతి చెందింది. నూరు బాణాలు ప్రయోగించి విభీషణుని బాగా బాధించాడు. ఇంద్రజిత్తు పరాక్రమాన్ని చూసి లక్ష్మణుడు నవ్వుకొన్నాడు. 'ఓ రాక్షసోత్తమా! ఇది నాకు ఒక లెక్కలోనిది కాదు' అంటూ లక్ష్మణుడు దారుణమైన బాణాలను ఇంద్రజిత్తుపై వేశాడు. 'నిశాచరా! కదనరంగంలో ఉన్నవారు ఎవరూ ఇంత దుర్బలమైన బాణాలను ప్రయోగించరు.

నీవు వేసిన బాణాలు ఏవీ నన్ను అంతగా బాధించలేదు. అవి నొప్పించలేదు. పైగా అవి నాకు మంచి సుఖ స్పర్శనే ఇస్తున్నాయి. జయేచ్ఛ ఉన్నవారు ఎవరూ ఇంత పేలవమైన బాణాలు వేయడం నేను చూడలేదు' అని లక్ష్మణుడు అంటూనే శర వర్షాన్ని ఇంద్రజిత్తుపై సౌమిత్రి కురిపించాడు.

ఆ బాణ ప్రహారాలకు ఇంద్రజిత్తు కవచాలు ముక్కలు ముక్కలు అయిపోయాయి. రథంపైనే ఆకాశంనుంచి రాలిన ఉల్కల్లాగా కవచపు తునకలుపడిపోయాయి. దానివలన ఇంద్రజిత్తు నిశ్చేష్టుడు అయ్యాడు.

కోపంతో ఉడికిపోతున్న ఇంద్రజిత్తు లక్ష్మణునిపై వేలకొలదిగా శరాలను గుప్పించాడు. లక్ష్మణుని కవచం కూడా ఇంద్రజిత్తు బాణవేగానికి శిథిలం అయిపోయింది.

పరస్పరం వారు భీకరంగా పోరుకు విజృంభించారు. వారిరువురి శరీరాలు చాలా గాయపడ్డాయి. రణభూమిలో అలసి ఇద్దరూ నిట్టూర్పులు విడిచారు. అయినా బాణ ప్రయోగాన్ని వీడలేదు. అవిశ్రాంతంగా యుద్ధం చేస్తూనే ఉన్నారు. వారి శరీరం నుంచి రక్తం కారుతోంది. వీరులైన మహాత్ములిద్దరూ పోరునుంచి ఏ మాత్రం వెనుకంజ వేయలేదు.

రక్తసిక్తమైన దేహాలతో శరాల్నీ సమస్త అవయవాలను పీడిస్తున్నా ఏ మాత్రం జంకక శరాలను సంధిస్తూనే ఉన్నారు. రణగర్జనలు చేస్తూనే ఉన్నారు. వారిలో ఎవరికీ యుద్ధ విముఖత కాని, బడలిక గాని అనిపించలేదు. శౌర్య ప్రతాపాలను అనవరతంగా కొనసాగిస్తూనే ఉన్నారు. వారి ఇద్దరిమధ్య ఏ లోపాలు తల ఎత్తడం లేదు. ఇద్దరూ ఒకరితోఒకరు ఘోరంగా పోరు సల్పుతూనే ఉన్నారు.

మణికట్టుల అరచేతుల సవ్వడి, ధనుష్టంకారాలు శరసంధానపు ధ్వనితో సమరభూమి అంతా దద్దరిల్లిపోతోంది. వారి ఇద్దరి యుద్ధపు ధ్వని రెండు మేఘాలు ఢీకొంటే వచ్చే శబ్దంలాగా వినిపించింది. కొన్ని శరాలు ఢీకొని నేలపై రాలి పోతున్నాయి. మరికొన్ని శరాలు చాలాసేపు అగ్నిజ్వాలలు వర్షపు జల్లులు కురిపించి మెల్లగా నిర్వీర్యం అయి నేలకు జారుతున్నాయి. దక్షిణాగ్ని గార్హపత్యాగ్నితో ఉన్న యజ్ఞభూమి సమరభూమిని తలపించింది.

ఆ వీరుల దేహాలు రెండు ఆకుల రాలిన చెట్లలాగా ఉన్నాయి. ఎవరికివారు ఎదుటివారిని చంపివేయాలనే ఆకాంక్షతో సంకులసమరం చేస్తున్నారు.

వారిద్దరి దేహాలు గ్రుచ్చుకున్న బాణాలతో నిండిపోయాయి. అప్పుడు ఆ దేహాలు ఎదిగిన నారులాగా కనిపించాయి. యుద్ధరంగంలో అజేయంగా పోరాడుతున్న లక్ష్మణునికి బాసటగా ఉండాలని విభీషణుడు వచ్చి ప్రక్కన నిలచాడు.

* * *

# ఇంద్రజిత్తుతో పోరాటం

## సర్గ - 89

లక్ష్మణుడు ఇంద్రజిత్తు ఇద్దరూ మదపుటేనుగుల్లా యుద్ధం చేస్తున్నారు. విభీషణుడు యుద్ధభూమిలో లక్ష్మణుని ప్రక్కన నిలచాడు. చేతితో మహోన్నతమైన ధనుస్సును చేతపట్టాడు. భయంకరంగా ధనుష్టంకారం చేశాడు. పదునుగా ఉన్న శరాలను ఎక్కుపెట్టి విభీషణునిపై ప్రయోగించాడు. వానరులు, భల్లూక సేన, విభీషణుని సచివులు అందరూ కలిసి ఇంద్రజిత్తు సైన్యాన్ని మట్టికరిపించాలని విజృంభించి పోరాడారు.

విభీషణుడు వానరులకు ప్రేరణనిస్తూ 'వానరులారా! రావణుని బలగం అంతా నేల పాలైపోయింది. రావణునికి మిగిలిన ఒక్క బలం ఇంద్రజిత్తే వీణ్ణి హతమార్చితే ఇక రావణుడు ఒంటరివాడైపోతాడు. కపులారా! అందరూ విజృంభించి రాక్షస నాశనం చేయండి' అని చెప్పాడు. 'వానరులారా! యోధానుయోధులు వీరులు ఐన రావణుని సుతులు, సోదరులు అందరూ ఈ రణరంగంలోనే అసువులు బాశారు.

ఇంతమందిని చంపిన మీకు ఇంద్రజిత్తు ఒక్క లెక్కలోనివాడు కాదు. మహాసముద్రందాటిన వీరులకు కాలువ దాడటం గోష్పాదం వంటిది కదా. నేను ఇంద్రజిత్తు పినతండ్రి. నా కుమారుడైన వీణ్ణి చంపడం నాకు

మంచిపని కాదు. కానీ, రాముని కార్యం చేయాలనే పట్టుదలతో యుద్ధరంగానికి వచ్చాను. ఇంద్రజిత్తును నిహతుణ్ణి చేయాలనే సంకల్పించాను.

కాని, నేను బాణం తీయగానే నా కన్నులు వీనిమీద పుత్రవాత్సల్యంతో అశ్రువులతో నిండిపోతున్నాయి. ఇక మహాయోధుడు వీరాధివీరుడైన లక్ష్మణుడు ఈ ఇంద్రజిత్తును సంహరించగల శక్తిశాలి. మీరందరూ ఇతని వెనుక ఉండి ఇంద్రజిత్తు భృత్యులను అంతం చేయండి' అని విభీషణుడు చెప్పాడు.

విభీషణునితో ప్రేరేపించబడిన వానర వీరులందరూ ఉత్సాహంతో సింహనాదం చేశారు. వెంటనే తమ దంతాలతో, నఖాలతో చేతికి దొరికిన రాక్షసులను హింసించడం మొదలుపెట్టారు. జాంబవంతుడు రాక్షసులను తుదముట్టిస్తూ ముందుకు సాగాడు. రాక్షసులు వీరి పనికి ఉద్రిక్తులై జాంబవంతుని అడ్డుకత్తులతో గదలతో హింసించారు. వానరులందరు రాక్షసులను హింసించటాన్ని తీవ్రం చేశారు.

మహామనస్వి అయిన హనుమంతుడు తన భుజాలపై ఉన్న లక్ష్మణుని క్రిందకు దింపాడు. చాలా కోపంతో ఒక మద్ది చెట్టును పెకలించాడు. అక్కడున్న రాక్షస సేనపై ఆ వృక్షంతో యుద్ధం చేయడం మొదలుపెట్టాడు. ఇంద్రజిత్తు తన పినతండ్రితో కాసేపు యుద్ధం చేశాడు. మళ్లీ లక్ష్మణునిపై విజృంభించాడు.

మరలా వీరులిద్దరూ యుద్ధం భయంకరంగా చేస్తున్నారు. వారి శరసంధానంతో ఒకరికొకరు కనిపించకుండా పోయారు. వారిరువురు అమ్ములపొదినుండి బాణాలు తీయడం శరాలను ఎక్కుపెట్టడం ధనుష్టంకారం ఏవీ కనిపించకుండా వినిపించకుండా పోయాయి. సమరభూమి అంతా ఆ వీరుల శరాలతో నిండిపోయింది. వేగంగా సాగే బాణాల ధాటిలో ఎవరు ఎవరిని బాధిస్తున్నారో కూడా తెలియకుండా పోయింది.

ఆ భీకర రణ యోధుల మధ్య ఎవరిని జయలక్ష్మి వరిస్తుందో తెలియడంలేదు. ఆ బాణాలు అంతా నిండిపోవడంతో చిమ్మ చీకట్లు అలుముకొన్నాయి. ఎక్కడ చూచినా బాణాల గుట్టలు కనిపిస్తున్నాయి. ఆ ఇద్దరి శరీరాలనుండి రక్తం కాలువలై పారింది. నక్కలు భయంకరంగా ఊళలు వేశాయి. గ్రద్దల సంచారం ఎక్కువైంది.

అగ్నులు ఆరిపోయాయి. ప్రళయం సంభవించేలాగా ఉన్న అపశకునాలు చూసి మహర్షులందరూ లోకశాంతి జరగాలని ఆశీర్వదించారు. అప్పటివరకు అక్కడ లక్ష్మణ ఇంద్రజిత్తుల యుద్ధం చూడాలని గంధర్వాదులు వచ్చి ఉన్నారు. అపశకునాలు చూసి వారందరూ గగనతలం నుండి వారి ఆవాసాలవైపు వెళ్లిపోయారు. లక్ష్మణుడు నాలుగు బాణాలతో ఇంద్రజిత్తు రథాశ్వాలను కొట్టాడు. మరొక పదునైన శరాన్ని తీసి శ్రేష్ఠమైన ధనుస్సును ఎక్కుపెట్టి ఆకర్ణాంతం వరకు లాగి ఇంద్రజిత్తు రథసారథి శిరస్సును ఖండించి వేశాడు.

దాంతో ఇంద్రజిత్తు ఏమాత్రం అశ్రద్ధ లేకుండా రథాన్ని నడుపుతూ లక్ష్మణునితో యుద్ధం చేయసాగాడు. ఆ మహావీరుని సామర్థ్యం చూసి అందరూ అద్భుతమని మెచ్చుకొన్నారు. లక్ష్మణుడు రథసారథ్యంలో ఉన్న ఇంద్రజిత్తును అదను చూసి తన బాణాలతో బాధించాడు.

ఒడుపు చూసి లక్ష్మణుడు ఇంద్రజిత్తు ఇద్దరూ యుద్ధం చేస్తూనే ఉన్నారు. లక్ష్మణుడు ఒకసారి రాక్షసుని రథాశ్వాలను దెబ్బతీశాడు. ఇద్దరూ శరాలతో హింసించుకొంటున్నారు. ఇంద్రజిత్తు రథసారథి గతించడంతో విచారం కనిపించింది. దాంతో వానరులు లక్ష్మణునకు జేజేలు పలికారు.

వానరులలో ఇంద్రజిత్తు విచార వదనం ఉత్సాహాన్ని నింపింది. ప్రమాధి, శరభుడు, రభసుడు, గంధమాదనుడు నలుగురు నాలుగు గుర్రాల పని పట్టాలని వాటిపై విజృంభించారు. వారి దాడితో గుర్రాల ముఖం నుండి రక్తం కాలువలై పారింది. ఆ అశ్వాలు ప్రాణాలు కోల్పోయి నేలపై పడిపోయాయి.

వానరుల రణోత్సాహం పెల్లుబికింది. వెంటనే వారు రథంపై పడ్డారు. దాన్ని ముక్కలు ముక్కలు చేశారు. అక్కడనుంచి పైకి ఎగిరి లక్ష్మణుని ప్రక్కన చేరి నిల్చున్నారు.

గుర్రాలు ప్రాణాలు పోగొట్టుకున్నాయి. రథసారథి నిహతుడు అయ్యాడు. శరవర్షంతో దేహం రక్తసిక్తం అయి ముండ్ల పందిలాగా ఉంది. రథం కూలిపోయింది. దాంతో ఉక్రోశించిన మనస్సుతో ఇంద్రజిత్తు శరవర్షం కురిపిస్తూ లక్ష్మణునిపై పరుగెత్తాడు.

దేవేంద్రుని జయించిన ఇంద్రజిత్తు బాణాలను అవిచ్ఛిన్నంగా ప్రయోగిస్తున్నాడు. వాటిని యుద్ధకుశలుడైన సౌమిత్రి ఎదుర్కొంటున్నాడు. యుద్ధం ఆగకుండా సాగిపోతోంది. వానరులలో యుద్ధకాంక్షతోపాటుగా జయేచ్ఛఎక్కువైంది. ఉత్సాహం ఉరకలు వేస్తుండగా భూమిపై రక్తాన్ని ఏరులుగా పారిస్తున్నారు. రాక్షసులలో ఉడుకుమోత్తనం, ఓడిపోతున్నామన్న కోపం శ్రుతిమించాయి. వారందరూ వీరావేశంతో విజృంభిస్తున్నారు. ఇంద్రజిత్తు రక్కసులలో యుద్ధోత్సాహాన్ని పురికొల్పుతూ తాను సమరం సాగిస్తున్నాడు. అన్ని ప్రతికూల పరిస్థితులు ఎదురౌతున్నా ఏమాత్రం జంకడం లేదు. సౌమిత్రి వీరత్వాన్ని మెచ్చుకోలేక తాను ఎదుర్కోలేక నానాఇబ్బందుల పాలౌతున్నాడు.

* * *

# ఇంద్రజిత్తు మరణం

## సర్గ - 90

రథం, రథాశ్వాలు, సారథిని పోగొట్టుకొని నిశాచరుడు యుద్ధావేశం మనస్సులో ఉరకలు పెట్టుతూ ఉంటే, మళ్ళీ యుద్ధం చేయడానికి ముందుకు వచ్చాడు. ఇంద్రజిత్తు లక్ష్మణుడు ఇద్దరూ ఒకరినొకరు చంపుకోవాలని సిద్ధపడి యుద్ధం చేస్తున్నారు. వారిరువురు సైనికులతో పోరాడుతూ వున్నారు.

అంతలో ఇంద్రజిత్తు తన అనుచరులతో మీరు యుద్ధం చేస్తూ ఉండండి. నేను నా శరాలతో చిమ్మ చీకట్లు అలుముకొనేటట్లు చేశాను. ఇపుడు శత్రువులెవరో సరిగా కనిపించడంలేదు. మీరు వారితో ఆగకుండా యుద్ధం చేస్తుండండి. నేను వారికి తెలియకుండా నగరంలోకి వెళ్లి వేరొక రథాన్ని తెచ్చుకుని యుద్ధం చేస్తాను. నేను లేననే విషయం వారికి తెలియకుండా మీరు చూడండి. నన్ను వారు అడ్డగించకుండా తెలివిగా వారిని వంచిస్తూ యుద్ధం చేయండి అని చెప్పాడు.

ఇంద్రజిత్తు అలా రాక్షసులకు చెప్పి వానరులకు తెలియకుండా లంకానగరంలోకి వెళ్లాడు. బాగా అలంకరించిన రథాన్ని ఎంచుకొన్నాడు అశ్వ హృదయాలు తెలిసిన రథికుణ్ణి సారథిగా చేసుకొన్నాడు. ఉత్తమ రథాశ్వాలను

రథానికి పూన్చాడు. వేగంగా తిరిగి రణభూమికి చేరాడు. ఆ రథంలో శరాలతోపాటు అనేక ఆయుధాలు అమర్చి ఉన్నాయి.

మళ్లీ రథంపైన ఇంద్రజిత్తును చూసి విభీషణుడు, లక్ష్మణుడు, హనుమదాదులు ఆశ్చర్యపోయారు. ఇంద్రజిత్తు రణకౌశలాన్ని మెచ్చుకున్నారు. ఈసారి విజృంభించి ఇంద్రజిత్తు వేల కొలది బాణాలను వానరులపై ప్రయోగించాడు. ఎంతోమంది వానర యోధులను యుద్ధంలో పడగొట్టాడు. వానరులందరూ ఇంద్రజిత్తు దాడితో భయభ్రాంతుల య్యారు. దేవతలు బ్రహ్మదేవుని ఆశ్రయించినట్లు, కపులు లక్ష్మణుణ్ణి ఆశ్రయించారు. లక్ష్మణుడు వానరులకు అభయం ఇచ్చాడు. వెంటనే లక్ష్మణునిపై దాడికి దిగి ఇంద్రజిత్తు వింటిని ఛేదించివేశాడు. ఇంద్రజిత్తు రథంనుండి ఇంకొక ధనుస్సును తీసుకొన్నాడు. లక్ష్మణుడు దాన్ని ఎక్కుపెట్టేలోపే మూడు బాణాలతో ముక్కలు చేసేశాడు. ఆగకుండా లక్ష్మణుడు మూడు బాణాలతో ఆ నిశాచరుని వక్షస్థలాన్ని కొట్టాడు. ఇంద్రజిత్తు వక్షస్థలంలో బాణాలు గ్రుచ్చుకొని రక్తం బయటకు చిమ్ముకొని వచ్చింది. కవచం ఛేదించబడి వక్షస్థలం గాయం అవడంతో ఇంద్రజిత్తు నోటినుండి కూడా రక్తం కారింది.

అయినా ఇంద్రజిత్తు మహాకార్ముకాన్ని చేత పట్టుకొన్నాడు. మరల గట్టిగా నిలదొక్కుకొని లక్ష్మణునిపై శరవర్షాన్ని కురిపించాడు. రావణసుతుడు అమోఘమైన బాణ ప్రహారాలు చేస్తున్నాడు. రామానుజుడు ఎటువంటి బాధకు లోనుగాకుండా ఇంద్రజిత్తును బాధిస్తున్నాడు. లక్ష్మణుడు రాక్షసులపై బాణాలు ఎక్కుపెట్టి వారిని బాధించ సాగాడు. నిరంతరంగా బాణ ప్రయోగం చేస్తూ ఇంద్రజిత్తును సౌమిత్రి దెబ్బతీస్తున్నాడు. అలా వారిద్దరూ బాణాలతో యుద్ధం చేస్తూనే ఉన్నారు. ఆ తర్వాత లక్ష్మణుడు తన బాణంతో తిరిగి ఇంద్రజిత్తు రథసారథిని కూల్చివేశాడు. సారథి లేకున్నా అశ్వాలు మండలాకృతిలో తిరుగుతూ ఏ మాత్రం తడబాటు లేకుండా ఇంద్రజిత్తుకు అనుకూలి స్తున్నాయి. ఆ దృశ్యం లక్ష్మణాదులకు అద్భుతంగా కనిపించింది. ఇంద్రజిత్తు రణకౌశలానికి దీటుగా లక్ష్మణుడు శర ప్రయోగం చేస్తున్నాడు. సమరావేశంతో ఇంద్రజిత్తు మూడు బాణాలతో విభీషణుని వదనాన్ని బాధించాడు. అక్కడే ఉన్న వానరులందరిని తన బాణాలతో హింసించడం మొదలుపెట్టాడు. మహాతేజస్వి ఐన విభీషణుడు కోపించి తన గదతో ఇంద్రజిత్తు రథాశ్వాలను బాదాడు. రథాశ్వాలు రథసారథిని పోగొట్టుకొన్న ఇంద్రజిత్తు ఉక్రోషంగా నేలపై దిగాడు. శక్తి అనే బాణాన్ని తన పినతండ్రిపై ప్రయోగించాడు.

ఆ శక్తి బాణాన్ని లక్ష్మణుడు మధ్యలోనే నిర్వీర్యం చేశాడు. ఇంద్రజిత్తు వక్షస్థలంపై వజ్రాయుధంతో సమానాలైన ఐదు బాణాలను వేశాడు. అవి ఇంద్రజిత్తు దేహాన్ని రక్తసిక్తం చేశాయి. ఇంద్రజిత్తు యముడు అనుగ్రహించిన మహాశరాన్ని తీసి చేత పట్టుకొన్నాడు. దాన్ని లక్ష్మణుడు చూశాడు. వెంటనే స్వప్నంలో కుబేరుడు ప్రసాదించిన అస్త్రాన్ని జపిస్తూ శరాన్ని సంధించాడు. ఆ వీరిరువురి ధనుష్టంకారంతో లంక, సముద్రం ప్రతిధ్వనించాయి.ఆ ఘోర రూపాలైన బాణాలు మిరుమిట్లు గొలిపే కాంతితో ఆకాశంలోనే ఒక దానితో ఒకటి ఢీకొన్నాయి. అవి అగ్ని రవ్వలను విరజిమ్మి రెండూ శక్తిని కోల్పోయి నేలరాలాయి. ఆ ఇద్దరు వీరులూ తమ ఆయుధాలు నేల రాలటంతో సిగ్గుపడ్డారు. లక్ష్మణుడు కోపంతో వారుణాస్త్రాన్ని ప్రయోగించాడు. దేవేంద్రుడు ప్రసాదించిన రౌద్రాస్త్రాన్ని రావణ సుతుడు ప్రయోగించాడు.

ఆ రెండు కూడా ఢీకొని ముక్కలై నేల పాలు అయ్యాయి. మళ్లీ ఇంద్రజిత్తు ఆగ్నేయాస్త్రాన్ని లక్ష్మణుడు సౌరాస్త్రాన్ని ప్రయోగించారు. అవీ నేల రాలిపోయాయి. దానితో ఇద్దరిలో కోపం కట్టలు త్రెంచుకొంది. రణావేశంతో ఇద్దరూ పోటీపడ్డారు. వందల కొద్దీ బాణాలను వేశారు. ఇంద్రజిత్తు సమ్మెట, ఇనుప గుదియ, ఖడ్గం, గొడ్డలి లాంటి ఆయుధాలు లక్ష్మణునిపై వేశాడు. వాటితో పనికాక అసురాస్త్రాన్ని ప్రయోగించాడు. లక్ష్మణుడు ఇంద్రజిత్తు వేసే బాణాలను ఎదుర్కొంటూ అసురాస్త్రాన్ని మహేశ్వరాస్త్రంతో ఎదుర్కొన్నాడు. వారిద్దరి ధనుష్టంకారాలు, గర్జనలు శ్రుతిమించి సాగుతున్నాయి. ఆ ఘోర యుద్ధాన్ని గగనాన ఉన్న సిద్ధులు, మహర్షులు, గంధర్వులు, యక్షులు, చారిణులు అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. యోధానుయోధులైన వీరులు ఒకరినిమించి మరొకరు బాణ ప్రయోగం చేస్తున్నారు. ఇద్దరిలోనూ జయేచ్ఛ ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. రణావేశం ఎక్కువగా ఉంది. ఇద్దరిలో జయం ఎవరికి వస్తుందో తెలియనంతగా సమఉజ్జీలై యుద్ధం సాగిస్తున్నారు.

దేవాసుర సంగ్రామంలో దానవులను జయించిన ఐంద్రాస్త్రాన్ని దేవేంద్రుడు లక్ష్మణునకు బహూకరించాడు. ఆ అస్త్రం స్మృతిపథంలో మెదలడంతో సౌమిత్రి రాక్షసులను భీతిల్లచేసే ఆ అస్త్రాన్ని ఇంద్రజిత్తుపై సంధించాడు. విజయ ప్రాప్తికోసం ఐంద్రాస్త్ర దేవతను మంత్రాన్ని జపించాడు. ‘ఓ బాణమా! ఈ దశరథ కుమారుడు శ్రీరాముని తమ్ముడూ ఐన లక్ష్మణుడు నిజంగా పరాక్రమంలో సాటిలేని మేటి అయితే ఓ ఐంద్రమా! నీవు ఇంద్రజిత్తును హతమార్చు’ అని తన శరానికి చెప్పి ఇంద్రజిత్తుపై దాన్ని ప్రయోగించాడు.

లక్ష్మణుని వింటినుంచి దూసుకొచ్చిన ఐంద్రాస్త్రం వేగంగా వెళ్లి కుండలాలతో, శిరస్త్రాణాలతో అలరారే ఇంద్రజిత్తు శిరస్సును ఖండించివేసింది. ఆ మహావీరుని శిరస్సు నేలపై పడి పోయింది. బంగారు కాంతులతో విరజిమ్మే ఆ తల మొండెం నుంచి వేరై భూతలాన్ని చేరింది. లక్ష్మణుని చేతిలో దేవేంద్రుని జయించి మహావీరాధివీరుడైన ఇంద్రజిత్తు ప్రాణాలను పోగొట్టుకొని నిస్తేజంగా నేలపై ఒరిగిపోయాడు.

వృత్రాసుర సంహారం నాడు విజయం పొందిన దేవేంద్రుని పొగడినట్లుగా వానరులు, భల్లూక వీరులు, విభీషణాదులు గొప్పగా జయజయధ్వానాలు చేశారు. సంతోషంతో ఉప్పొంగిపోయారు. రణభూమినే రంగస్థలం చేశారు. అందరూ కోలాహలంగా అరుస్తున్నారు. దివ్యులైన గంధర్వాదులు, మహర్షులు, సిద్ధులు ఆనంద తాండవం చేశారు. లోకాన్ని పీడించే శక్తులను అణచివేశారంటూ రఘుకుల నందనుణ్ణి పొగడ్తలతో ముంచెత్తారు.

హర్షోల్లాసం రణరంగం అంతా వ్యాపించిపోయింది. ఎక్కడ చూచినా ఆనందమే వానరులకు కనిపించింది. ఇంద్రజిత్తు మరణంతో మిగిలిన రాక్షససేన ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఎక్కడి ఆయుధాలను అక్కడ వదిలేసి పరుగు ప్రారంభించారు. వారు వారు కట్టుకొన్న వస్త్రాలపై ధ్యాస లేకుండా, చేతిలో ఏముందో కూడా చూడకుండా పారిపోతున్నారు. అలా పారిపోయే రాక్షసులను చూసి కపులు వెర్రిగా నవ్వుతున్నారు. వానరులలో ప్రతివారి గుండె ఆనందోల్లాసంతో కొట్టుకొంటోంది. అందరూ ఆనందమనస్కులు అయ్యారు. ఇంద్రజిత్తు నేలపై పడి పోవడంతో రణభూమిలో వెదికినా రాక్షస జాతి కనిపించకుండా పోయింది. అస్త్రాద్రికి చేరిన సూర్యునిలాగా

ఇంద్రజిత్తు శరీరం కాంతి విహీనం అయింది. వీరాధివీరుడని గర్వించే మదం అణగారిపోయింది. ఇంద్రియాలు జీవచైతన్యంతో ఎగిరిపోయాయి. ప్రాణంలేని కళేబరం నిస్తేజమై నేలపై అచేతనమై పడిపోయింది. ఇంద్రజిత్తు మృతుడైన తర్వాత సమస్త లోకాలలో నూతనోత్సాహం పెల్లుబికింది. జీవులన్నీ సంతోషించాయి. విచక్షణ కలిగిన వారు అహో మహావీరుని మరణంతో ఆత్మ పరిశోధనకు పూనుకొన్నారు. ఇంద్రియ లౌల్యంతో పాడు పనులు చేసినా, గర్వం అతిశయించినా ఏదైనా సరే బుద్బుదప్రాయమైన ఈ జీవితం ఉన్నంతవరకే గదా! ఆ పరమేశుని కాలంతో పోటీ పడలేడు కదా. విధికి ఎవరూ ఎదురీదలేరు. ఎవరైనా ఎప్పుడో ఒక్కసారి విధికి తలవంచాల్సిందే. **అదే జీవితం ఉన్నంతలో నలుగురిచేత మంచి అనిపించుకొంటే పోయిన వారికోసం కంటతడి పెట్టేవారు ఉంటారు కదా!**

**ఇపుడు ఇంతటి వీరుడైనా లోకానికి అశాంతిని కలిగించిన వాని మరణం ప్రాణులన్నింటికి ఆనందాన్ని ఇస్తోంది కదా!** అని ఒక్క క్షణం శోధనలో ఏదో తెలిసిందని వారు అనుకొన్నారు. లోకంలో అరిష్టాలు తొలగిపోయాయి. పాపకర్ముడైన ఇంద్రజిత్తు నిహతుడయ్యే సరికి ఇంద్రాది దేవతలు ఆనందంలో మునిగిపోయారు. మహర్షులు సిద్ధులు రఘుకులస్థులకు ఆశీర్వాదాలు చెప్పారు. యక్ష గంధర్వ కిన్నరాదులు గానం చేసి నర్తించారు. లక్ష్మణుని మహామహునిగా అందరూ కీర్తించారు.

సర్వలోక భయంకరుడైన ఇంద్రజిత్తు చనిపోయాడు. లోకంలోని అన్ని ప్రాణులు నిశ్చింతగా జీవనం సాగించవచ్చని అనుకొన్నాయి. దిక్కులన్నీ శాంతించాయి. సాధువులు ఇక శాంతితో జీవనం సాగించవచ్చనుకొన్నారు. వానరులందరూ అభినందనల వర్షంలో సౌమిత్రిని తడిపేశారు.

హనుమంతుడు, జాంబవంతుడు, విభీషణుడు తమకు లభించిన విజయానికి పొంగిపోయారు. లక్ష్మణస్వామిని మోసిన హనుమంతుడు తన కష్టానికి ఫలం దక్కిందని ఆనందించాడు. సౌమిత్రిని వేనోళ్ళ పొగిడారు. వారందరు సౌమిత్రిని ఆలింగనం చేసుకొని తమ తమ సంతోషాన్ని తెలిపారు.

శ్రీరామునికి వార్త తెలిపారు. వానరులు పట్టలేని ఆనందంతో గెంతులు వేస్తూ లక్ష్మణుని ఎత్తి మోశారు. లక్ష్మణుడు వారి ఆనందాన్ని పంచుకొన్నాడు. అన్న కార్యంలో భాగం పంచుకొన్నానని అపరిమితానందం పొందాడు. అనితరసాధ్యమైన విజయాన్ని పొందిన సౌమిత్రి మహాశయుని స్తుతులతో నింపారు మానసికోల్లాసంతో అందరూ సంతోషిస్తున్నారు. వానరులలో సంతోషం శ్రుతి మించి రాగాన పడ్డట్టుగా చిందులు వేశారు. గంతులువేస్తున్నారు. ఎవరికి వారు తామే రాక్షసజాతిని నాశనం చేసేశామన్న ఆనందం పొందుతున్నారు. సౌమిత్రి చిరునవ్వులు చిందిస్తూ చూస్తున్నాడు. ఇంద్రజిత్తు మరణం వానరయోధులల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. అన్యాయం ఎంతగా వ్యాపించినా ఒకనాటికి నాశనం అయ్యితీరుతుందనుకొన్నారు. రావణుడు చేసిన అధర్మానికి ఆయన వంశమే నాశనం అయిపోతోందని వానరులు అనుకోసాగారు.

* * *

# శ్రీరాముని హర్షం

## సర్గ - 91

హనుమదాదులు లక్ష్మణుని తీసుకొని విజయోల్లాసంతో రామసుగ్రీవుల దగ్గరకు వచ్చారు. వారి విజయ విలాసాన్ని చెప్పారు. ఆ విజయం కన్నుల పండుగై ఆనందాశ్రువులతో రామ సుగ్రీవులు లక్ష్మణుని అభిషేకించారు. ఆనంద తన్మయత్వంతో ఆలింగనం చేసుకొన్నారు. శ్రీరాముడు లక్ష్మణుని బిగి కౌగిలితో ఆనందాన్ని మది సంతోషాన్ని తెలియపర్చాడు.

లక్ష్మణుడు తన అన్న ప్రక్కన నిలబడి వినపడీ వినపడకుండా ఇంద్రజిత్తు అసువులు కోల్పోయాడని చెప్పగా విభీషణాదులు హనుమదాదులు సంతోషాతిరేకంతో సౌమిత్రి ఇంద్రజిత్తు తల తెగ్గొట్టి నేలపై పడేశాడు అంటూ ఉత్సాహంతో చెప్పారు. 'నాయనా లక్ష్మణా! ఎంత మంచి పనో చేశావు. ఇక రాక్షసులందరిని సంహరించి నట్లుగా మనం అనుకోవచ్చు' అని చెప్పుతూ బిడియపడుతున్న లక్ష్మణుని అక్కున చేర్చుకొని  తలను ముద్దాడాడు శ్రీరాముడు.

అస్త్రాలతో గాయపడిన సోదరుని తన ఒడిలో పెట్టుకొన్నాడు. తనివితీరా కౌగిలించుకొన్నాడు. ప్రేమగా పదే పదే సౌమిత్రి ఒళ్ళు తడిమాడు. బాగా డస్సిపోయి బాణాల దెబ్బలతో బాధపడుతున్న సౌమిత్రి బాధగా నిట్టూర్చాడు. శ్రీరాముడు మరల మరల తలను దగ్గరగా తీసుకొని ముద్దాడుతూ సౌమిత్రి శరీరానికి ఓదార్పునిస్తూ చేతితో  స్పృశిస్తున్నాడు.

'సోదరా! నీవు లోకకంటకుడైన మహావీరుని సంహరించి వేశావు. ఇది చాలా దుష్కరమైన కార్యం. దాన్ని నీవు సాధించావు. ఇక రావణుని మరలా వేరుగా చంపాల్సిన అవసరం ఉండదు. ఇంద్రజిత్తు మరణంతో రావణుడు హతుడైనట్లే అని నాకు అనిపిస్తోంది. రావణుని ప్రాణం, కుడిభుజమైన ఇంద్రజిత్తును వధించడం తేలిక ఐన పని కాదు. అలాంటి మహత్తర కార్యాన్ని నీవు నిరంతరంగా పోరాడి గెలిచావు. నీవు అనితరసాధ్యునివే.

నీవు, విభీషణుడు, హనుమంతుడు అవిశ్రాంతంగా మూడు రోజులు పోరాడి చివరకు గెలుపును సాధించారు. మీవలనే శత్రువుల నాశనం జరిగింది. నేడు మనం శత్రువులను గెలిచినట్లే అనుకోవచ్చు. పుత్రుడు నిహతుడు అయ్యాడని తెలుసుకొన్న రాక్షస రాజు అమిత క్రోధావేశపరుడు అవుతాడు. వ్యూహరచనతో అపార సేనావాహిని తీసుకొని రావణుడు ఇక మనపై విజృంభిస్తాడు.

రావణుడు దుర్జయుడు అయినప్పటికీ మనం ఆ రాక్షసుని చుట్టుముట్టి పుత్ర వియోగ దుఃఖంలో ఉన్న ఆ వీరుని అవలీలగా చంపివేద్దాం. సురపతిని జయించిన మహావీరుడైన ఇంద్రజిత్తునే మట్టిగరిపించిన యోధునివైన నీవు నా ప్రక్కన ఉంటే రావణాసురుని జయించడం సులభమే అవుతుంది. ఇక సీతను దరిచేర్చుకోవడం, కోసల రాజ్యాన్ని పొందడంలో ఏమాత్రం సంశయం లేదు' అని రాముడు అన్నాడు.

ఇలా లక్ష్మణునకు శ్రీరాముడు చెప్పి తన ప్రాణమైన లక్ష్మణుణ్ణి తనివితీరా మరల తన హృదయానికి హత్తుకొన్నాడు. వారిద్దరిని చూసి సుషేణుడితోసహా వానరులందరూ అమితానందం పొందారు.

శ్రీరాముడు తన మిత్రులతో యుద్ధంలో గాయపడిన వీరాధివీరులైన లక్ష్మణుడు, హనుమంతుడు, విభీషణులకు చికిత్స చేయాలని చెప్పాడు. వారిగాయాలన్నీ మానేటట్లుగా వారికి చికిత్స వెంటనే చేయాలని తన అభిప్రాయాన్ని చెప్పాడు.

శ్రీరాముడు చెప్పి చెప్పగానే వానరయోధ నాయకుడు మహావీరుడు వైద్యుడు అయిన సుషేణుడు లక్ష్మణస్వామి ముక్కు దగ్గర ఔషధ పత్రాన్ని ఉంచాడు. దాని ప్రభావంతో సౌమిత్రి బాధలు తొలగిపోయాయి. గాయాలు కూడా మానిపోయాయి. తిరిగి సౌమిత్రి శరీరం బంగారు కాంతులీనింది.

శ్రీరాముని ఆదేశం ప్రకారం విభీషణాదులకు, వానరప్రముఖులకు, వానరులకు వైద్య సహాయం అందించారు. వారందరూ గాయాల బాధలనుంచి బయటపడ్డారు. పూర్తి ఆయురారోగ్యాలతో ఆనందించారు. అప్పుడు వారికి భగవంతుడు ఇచ్చిన విజయానందాన్ని తలచుకొని వారందరూ సంతోషించారు. మహాత్ముడైన శ్రీరాముణ్ణి లక్ష్మణుణ్ణి వానరసేననంతా మెచ్చుకొన్నారు. సుగ్రీవునిలో ఆనందం వెల్లివిరిసింది. ఇక సంపూర్ణ విజయం త్వరలోనే వస్తుందని సుగ్రీవుడు ఆనందించాడు.

* * *

# రావణుని పుత్ర వియోగ దుఃఖం

## సర్గ - 92

రావణుని సచివులు ఇంద్రజిత్తు మరణవార్తను ధృవపరచుకొన్నారు. ఎంతో బాధతో రావణునికి విషయం చెప్పారు. 'మహారాజా! దేవేంద్రుని జయించిన మీ పుత్రుడు శత్రువులను ఎంతో పౌరుషంగా ఎదుర్కొన్నాడు. ఆ మహావీరుడు శ్రీరాముని తమ్ముణ్ణి ముప్పతిప్పలు పెట్టిన తర్వాత పుణ్యలోకాలకు వెళ్ళాడు' అని చెప్పారు.

మహాపరాక్రమశాలి ఐన రావణుని సుతుడు భయంకరంగా యుద్ధం చేసి వీరమరణం పొందాడని విని రావణుడు తట్టుకోలేక మూర్ఛపోయాడు. ఆ బాధను రావణుడు భరించలేకపోయాడు. పుత్ర వియోగాన్ని తలచి పరి పరివిధాలుగా పరితపించాడు. 'అయ్యో! నా చిన్న తండ్రిని నా ముద్దులు మూటగట్టే కుమారునివి, దేవతలను అనాయాసంగా గెలిచిన నీవు ఈ మానవునికి ఎలా వశం అయ్యావు?

నీవు కోపగించితే యముడే హడలిపోతాడే, ఇంద్రాది దేవతలు సైతం నీ ధాటికి వెరచి చేతులు కట్టుకొని తలవంచుకొంటారే! అలాంటి నీవు లక్ష్మణునికి ఎలా చిక్కావు? కుమారా! ఇప్పుడు నాకు కాల మహత్వం గూర్చి అర్థం అయింది. దేవతలైనా రాక్షసులైనా ఏదో ఒకనాడు యముని చేరవలసినవారే. తనవారి కోసం యుద్ధం చేసిన వీరుడు ఎవ్వడైనా సరే వీర మరణం పొందితే వాడు తప్పక స్వర్గాధిపత్యాన్ని పొందుతాడు.

నేడు నా కొమరుడు గతించాడని విని దేవతలు మహర్షులు అందరూ నిర్భయంగా నిద్రించి ఉంటారు' అని రావణుడు అనుకొంటూ విలపిస్తున్నాడు.

'అయ్యో! నా మేఘనాదుడు తరలివెళ్లిపోయినాడంటే ఎంతో ఆశ్చర్యంగా ఉంది. నాకు ఊపిరి తీయాలని అనిపించడం లేదు. నా తనయుని మరణంతో నాకు సర్వభూమండలం శూన్యంగా కనిపిస్తోంది. అయ్యో! ఇంద్రజిత్తు మరణంతో నా అంతఃపురం అంతా రోదన ధ్వనులతో నిండిపోతోంది. శత్రువులను మట్టికరిపించే యోధుడివైన కుమారా! నీవు నన్ను, నీ తల్లిని, నీ భార్యను యౌవరాజ్యాన్ని వదిలి నేడు కనిపించకుండా ఎక్కడకు వెళ్ళావు?

పుత్రా! లోకంలో తండ్రి మరణించడం కొడుకు ప్రేత కార్యాలు చేయడం సహజం. నీవు దాన్ని మార్చివేశావు. నా కంటకప్రాయులైన రామలక్ష్మణులు, సుగ్రీవుడు జీవించే ఉన్నారు. నీవు నా హృదయ తాపాన్ని తీరుస్తావని నా శత్రువులను సమూలంగా నాశనం చేస్తావని ఎన్నో కలలు కన్నానే. నేడు వాటినన్నింటిని కల్లలు చేసి నీవు దివికి చేరుకున్నావా తండ్రీ! నీకు ఇది ఏమన్నా బాగుందా? తండ్రీ! నేను నీకున్నాను అని చెప్పే నీ దుందుభి స్వరం నాకు ఇక వినిపించదుగదా. అయ్యో! నేను ఎంతటి దురదృష్టవంతుణ్ణి!' కన్నీరు కార్చాడు. ఆయన దుఃఖాన్ని ఎవరూ తీర్చలేకుండా ఉన్నారు. ఓదార్చడానికి కూడా వీలు కలిగించకుండా నిరంతరంగా రావణుని కనులు కన్నీరును స్రవిస్తున్నాయి.

పుత్ర వియోగ దుఃఖం రావణున్ని అంతులేని ఆర్తికి గురిచేసింది. గ్రీష్మఋతువు సూర్య కిరణాల్లాగా పుత్ర వియోగ దుఃఖం రావణునిలో అంతకంతకు పెరిగింది. పుత్రుని వీరత్వాన్ని, అతడు సాధించిన మహావిజయాలు తలచుకొనేకొద్దీ రావణునిలో కోపంతో పాటుగా క్రోధాగ్ని అధికం అయ్యింది. మామూలుగా రావణుని ఆకారం భయంకరంగా ఉంటుంది. దానికితోడు కోపం, దుఃఖం, ఆవేశం కట్టలు త్రెంచుకోవడంతో ఎర్రని కన్నులతో రౌద్రాకారుడైన మహాశివునిలాగా, మూడో కన్ను తెరిచిన త్రినేత్రునిలాగా రావణుడు కనిపించాడు.

రావణుని కోపాన్ని చూచిన రాక్షసులు ఆయన ముందుకు వెళ్ళడానికి చాలా భయపడ్డారు. వారందరూ స్తంభాల చాటున దాక్కొన్నారు. ప్రళయకాల రుద్రునిలాగా రావణుడి కోపజ్వాల ఎగిసిపడుతోంది. మరల రావణునిలో రణావేశం విజృంభించింది.

రాక్షస యోధులను సమావేశపరిచాడు. తాను ఎన్ని విజయాలను పొంది ఉన్నాడో వారికి చెప్పాడు. వేలకొలది సంవత్సరాలు తపస్సు చేసి బ్రహ్మదేవుని మెప్పించి వరాలను పొందానని చెప్పాడు. దేవ దానవ యక్ష కిన్నరాదులవలన మరణం పొందకుండా వరం పొందానని గర్వంగా చెప్పాడు.

వజ్రాయుధ ప్రహారాలకు ఏ మాత్రం చెక్కుచెదరని కవచాన్ని పరమేష్ఠి తనకు అనుగ్రహించిన సంగతి వారికి చెప్పాడు. ఎంతటి వీరులైనా నా ముందు నిలవలేరని గొప్పలు చెప్పుకొన్నాడు. దేవాసుర సంగ్రామంలో నా యుద్ధ పటిమకు మెచ్చి దేవేంద్రుడు ధనుస్సు అనుగ్రహించాడని, దానితోనే నేడు రామలక్ష్మణులను ఇంద్రజిత్తు దగ్గరకు పంపిస్తానని బీరాలు చెప్పాడు. పుత్ర వియోగం తలచుకొని కోపంతో రావణుడు మనస్థిమితం తప్పినట్లుగా

ప్రవర్తించాడు. ఆయన కోపాన్ని ఎవరూ తగ్గించలేకపోయారు. ఉన్నట్టుఉండి రావణుడు సీతను చంపాలని ఆవేశపడ్డాడు. యోధులారా! ఆనాడు నా సుతుడు మాయాసీతను వధించి రామలక్ష్మణులను బాధించాలనుకొన్నాడు. నేను నిజంగానే ఆ సీతను చంపివేసి సంతృప్తి పొందుతాను అంటూ చేతిలోకి ఆవేశంగా ఖడ్గం తీసుకొన్నాడు.

పుత్ర వియోగ్నిలో దహించుకుపోయే రావణుడు తన భార్యలతో, మంత్రులతో కూడి సీతను చంపేయాలని వేగంగా అశోక వనానికి బయలుదేరాడు. కుపితుడై వెళ్ళే రావణుని చూచి ఆ రాక్షస గణం 'ఆహా! ఈ మహావీరుని రణరంగంలో చూసినంతనే రామలక్ష్మణులు భయంతో ప్రాణాలు కోల్పోతారు. ఈ అసహాయశూరుని చేతిలో దేవతలు సైతం పరాజయం పొందారు గదా. సమస్తలోకాలు ఈ వీరుని ధాటికి గడగడలాడాయి కదా. భూమండలంలో ఇతనికి సాటి వచ్చే వీరుడు ఎవ్వరూ లేరు' అని అనుకొన్నారు.

సచివులు ప్రియురాళ్లు ఎంతగా వారించినా ఆవేశపరుడైన రావణుడు మైథిలి దగ్గరకు పరుగుతీస్తున్నాడు. చేతిలో ఖడ్గంతో ఎలాగైనా నరికేస్తా అంటూ వైదేహి దగ్గరకు వెళ్ళే రావణుని అందరూ వారిస్తున్నారు. అలా ఖడ్గంతో వచ్చే రావణుని సీతామాత చూసింది.

"అయ్యో! నా నాథుడు దూరమై నేను అనాథలాగా జీవిస్తున్నాను. ఈ దుష్టుడు నన్ను ఎన్నోసార్లు నయానో భయానో తనను అంగీకరించమని కోరాడు. అయినా నేను ఎప్పటికప్పుడు ఆ మోహంపై నీళ్ళు చల్లుతూ వచ్చాను. నా తిరస్కార భావంవలన ఈ రాక్షసుడు క్రోధితుడైనట్లు ఉన్నాడు. నేడు ఖడ్గం పట్టి నాపైకే పరుగెత్తి వస్తున్నాడు. తనను అంగీకరించలేదన్నది భరించలేక చంపివేస్తాడు. లేక నరశ్రేష్ఠులైన సోదరులను ఈ దుర్మార్గుడు అంతం చేసి ఉండవచ్చు. అయ్యో! నావల్లనే ఆ రామలక్ష్మణులు వ్యధాభరితులు అయ్యారు కదా! లేకపోతే నా రామలక్ష్మణులను చంపలేక, పుత్రులను పోగొట్టుకొని అవమానాన్ని భరించలేక నాపై పడుతున్నాడేమో? అయ్యో! దూరదృష్టి లేని నేను ఆనాడు హనుమంతుడు చెప్పినట్లు వినకపోయానే? ఆ రోజు ఆ వాయుసూనుని భుజాలపై ఎక్కి శ్రీరాముని చేరి ఉంటే నేడు క్రూరాత్ముని కంటబడేదాన్ని కాదు గదా! శ్రీరామునికి ఏదైనా ఆపద వస్తే ఆయన తల్లి దయామయురాలైన కౌసల్య తట్టుకోలేదుగదా. అంతా నావలనే కీడు జరిగేటట్లుగా ఉంది" అంటూ సీత పరిపరివిధాలుగా ఆలోచిస్తోంది. ఆ దుఃఖిస్తున్న సీతను ఆవేశపరుడై పరుగెత్తుతున్న రావణుని ఉత్తముడైన సుపార్శ్వుడు చూశాడు.

'ఓ రాక్షసరాజా! సర్వశాస్త్ర పారంగతుడవైన నీవు నేడు అధర్మాన్ని ఎందుకు ఆశ్రయిస్తున్నావు? గృహస్థ ధర్మాలన్నీ తెలిసి ఆచరించే నీవు నేడు ఎందుకు సాధ్వీలలామను చంపకోరుతున్నావు? సద్గుణవతియైన ఈ సీతపై దయ చూపు. రావణా! నీ కోపాన్ని ఆవేశాన్ని రామునిపై చూపు.

మీరు రణవిద్యా కుశలురు, ప్రతిభాశాలురు. మహారథికులైన మీరు నేడు కృష్ణపక్ష చతుర్దశి. నేడే మీ విజయంకోసం రామునిపై యుద్ధాన్ని ప్రకటించు. ఈ అమావాస్య చీకట్లను పారద్రోలి విజయదుందుభిని మ్రోగించు' అని చెప్పాడు అని గబాగబా చెప్తుతూ సీతమ్మకు ఏదైనా అపాయం జరుగుతుందా అని కీడు చేస్తాడేమో ఈ రావణుడని, సుపార్శ్వుడు శంకించాడు. వడివడిగా వెళ్ళుతున్న రావణునికి ఈ మాటలు వినవచ్చాయి. ఏంటోనని

అంతా విన్నాడు. సుపార్శ్వుని వచనాలు వినసొంపుగా అర్థవంతంగా ఉన్నాయనిపించింది. ఓ క్షణం ఆలోచించాడు. వివేకం ఉదయించింది. అవునౌను! నేను మట్టు పెట్టాల్సింది రామలక్ష్మణులను అనుకొన్నాడు. వెంటనే వెనుతిరిగాడు. అందరూ రావణుడు ఏం చేస్తాడోనని చూస్తున్నారు.

అశోకవాటిక నుంచి వెనుతిరిగిన రావణుడు అంతే వేగంగా సభామందిరంలో వెళ్ళాడు. తన ఆసనంలో కూర్చున్నాడు. సుపార్శ్వుని హితవచనాలు రావణునిలో బాగా పనిచేస్తున్నాయి. దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. సభాప్రాంగణమంతా నిశ్శబ్దంగా ఉంది. ఏ క్షణంలో ఏమాట చెప్తాడో మహారాజు అని రాక్షసులందరూ చెవులు నిక్కబొడుచుకుని కూర్చున్నారు.

* * *

# శ్రీరాముని పరాక్రమం

## సర్గ - 93

**మ**హాబలశాలి అని పేరు తెచ్చుకొన్న రావణుడు పుత్రశోకాగ్నిలో దహింపబడుతున్నాడు. సుపార్శ్వుని మాటలువిని రణానికి వెళ్ళాలని నిశ్చయించుకొన్నాడు. సభాసీనుడై తన అనుచరులతో తన అభిప్రాయాలను పంచుకొంటున్నాడు. 'యోధులారా! చతురంగ బలాలన్నీ నేడు కదన రంగానికి కదలిరండి. రాముణ్ణి ఒంటరిని చేసి మీరందరూ అతణ్ణి చుట్టుముట్టండి. మీరందరూ అతణ్ణి చంపలేకపోయినా ఫర్వాలేదు మీరు చూస్తుండగానే రాముణ్ణి నేను హతమార్చివేస్తాను. నేడే బయలుదేరండి' అని వారినందరిని ప్రోత్సహించి కదనానికి పంపించాడు.

సమస్త రాక్షస బలాలు రాజాజ్ఞను తలదాల్చి సమరభూమిని ఆక్రమించాయి. అందరి చేతిలో గండ్రగొడ్డళ్ళు, గదలు, శూలాలు, బల్లాలు లాంటి ఆయుధాలు ఉన్నాయి. వారందరు వానరులపై విరుచుకుని పడ్డారు. అందినవారిని అందినట్లుగా చంపివేస్తున్నారు. సూర్యోదయంతో వానరసేనతో రాక్షస సేన తలపడింది.

వానరులు రాక్షసుల ఆయుధాలను లాక్కొని వాటితోనే వారిని హతమారుస్తున్నారు. కొద్దిసేపటికి రాక్షస సేనది పైచేయి అయ్యింది. వానరులు వారి ధాటికి ఆగలేకపోయారు. వారి ఆయుధాలు వీరిని బాగా బాధించసాగాయి. వానరుల నఖాలు, దంతాలు, వృక్షాలు, పర్వతాలు నిలవలేకపోయాయి. భయభ్రాంతులైన వానరులు శ్రీరాముని దగ్గరకు పరుగులు తీశారు.

వెంటనే రామచంద్ర ప్రభువు వానరులకు అభయం ఇచ్చాడు. రాక్షససేన మధ్య నిలిచాడు. శత్రువులపై శరాన్ని ఎక్కుపెట్టాడు. శరపరంపరతో బాణవర్షాన్ని కురిపించాడు. అరివీర భయంకరుడైన రాముని ధాటికి రాక్షసులు ప్రాణాలు కోల్పోతున్నారు. వారి ఆయుధాలన్నీ ముక్కలై పడిపోతున్నాయి. వారి రథాలు, రథాశ్వాలు, రథసారధులు అన్నీ నేలపాలవుతున్నాయి.

రాముని బాణాలు రాక్షసులకు తగులుతున్నాయి వారందరిపై రాముడు మోహనాస్త్రాన్ని సంధించాడు. దానితో వారికెవరికి రాముడు ఎక్కడ ఉన్నాడో తెలియడంలేదు. కాని, ఎదురుగా ఉన్నవారిని చూసి రాముడే అని భ్రమపడుతున్నారు. అదుగో రాముని బాణం వస్తోంది అంటున్నాడు. ఇదిగో ఇక్కడే రాముడున్నాడు అంటున్నాడు. వందలకొద్దీ రాముళ్ళను చూశారు. ఒక్క రాముణ్ణే చూశారు.

రాముని చేతిలోని ధనుస్సు అలా చక్రంలాగా కనిపిస్తోంది. వర్తులాకారంలో అగ్ని వెదజల్లబడుతున్నట్లుగా ఉంది. రాముడు విల్లు ఎపుడు ఎక్కుపెట్టుతున్నాడో ఎప్పుడు వేస్తున్నాడో వారికి తెలియడంలేదు.

కాని, రాముని బాణాలు వేగంగా వస్తున్నాయి. అవి వడివడిగా రాక్షసులను యమపురికి తీసుకొని వెళుతున్నాయి. రాముని శరాగ్నిలో రాక్షస సేన అంతరించిపోతోంది. దానవులను దునుమాడిన మహావిష్ణువులాగా శ్రీరాముడు రాక్షసులను సంహరిస్తున్నాడు. రాక్షసులకు రాముడు చక్రాకృతిలో కనిపిస్తున్నాడు.

రాముడు ఒక్కడే కామరూపులైన రాక్షసులను 18 వేల ఏనుగులను, 10 వేల రథాలను, 14వేల అశ్వికులతో కూడిన అశ్వాలను, రెండు లక్షల సంఖ్యలో ఉన్న కాల్బలాన్ని నాశనం చేశాడు. ఒకటిన్నర గంటలోనే రాక్షస సేన అంతరించిపోతోంది. ఆ రాముని ధాటికి రాక్షసులు ఆగలేక పరుగులు తీశారు.

రథ అశ్వ గజబలాలన్నీ నేలకూలిపోగా కొంతమంది రాక్షసులు లంక వైపు పరుగులు తీశారు. రణరంగం అంతా గజాలు, అశ్వాలు, సేనల కళేబరాలతో నిండిపోయింది. మహాశివుని శ్మశాన భూమిలాగా యుద్ధభూమి కనిపించింది.

దేవతలు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు అందరూ మహాత్ముడైన శ్రీరాముని స్తుతించారు. రాబోయే మంచి కాలం బాగుండాలని ఆశపడ్డారు. అందరూ రాక్షస పీడ వదిలిపోతోందని సంతోషించారు. శ్రీరాముని చెంతనే ఉన్న విభీషణుడు, సుగ్రీవుడు, హనుమంతుడు వీరందరూ శ్రీరాముణ్ణి శ్లాఘించారు. అప్పుడు రాముడు ఈ దివ్యాస్త్రాలు నాకు, పరమశివునకు మాత్రమే తెలిసినవి. వీటివలనే రాక్షస నాశనం జరుగుతోందని చెప్పాడు.

శ్రీరాముణ్ణి వానరులతో సహా దేవగణాలన్నీ ప్రశంసించాయి. సాధువులందరూ తమకు రాముణ్ణే మేలు చేకూర్చేవానిగా తలచారు.

* * *

# రాక్షస స్త్రీల ఆక్రందనం

## సర్గ - 94

**రా**వణుని ఆదేశం ప్రకారం వచ్చిన రాక్షస సేన అంతా రాముని చేతిలో అంతం అయ్యింది. రాముణ్ణి చూసి భీతితో అందులో కొంత మంది పారిపోయి తమ తమ ఇండ్లకు చేరారు. అలాంటివారు రాముని గూర్చి చెపుతున్నారు.

రాముని రూపవిలాసాన్ని, రాముని రణ కౌశలాన్ని ఆత్మీయులకు కళ్ళకు కట్టినట్లుగా చెపుతున్నారు. నేను బ్రతుకు జీవుడా అని పారిపోయి వచ్చేశాను. ఇక మనలను కాపాడేవారు ఎవరూ లేరు. శ్రీరాముని చేతిలో లంక సర్వనాశనం అయ్యి తీరుతుందనే వారి నమ్మకాన్ని ఆత్మీయులకు చెప్పారు.

లంకలోని ప్రతి ఇంటిలో ఏడుపు ధ్వని వినిపిస్తోంది. కొడుకును పోగొట్టుకొన్న తల్లి, భర్త కోల్పోయిన భార్య, తండ్రిని కోల్పోయిన పిల్లలు, సోదరులను పోగొట్టుకొన్న సోదరులు అయ్యో! అయ్యో! అంటూ ఆక్రోశించేవారు ఎక్కడ చూసినా కనిపిస్తున్నారు. రాక్షస స్త్రీల ఏడుపు, పెడబొబ్బలు, ఆర్తనాదాలు అన్నీ కలగలసి లంక అంతా మారుమ్రోగిపోతోంది. వారందరూ తమ బ్రతుకులు శ్రీరామాగ్నిలో కాలిపోతున్నాయని దానికి కారణమైన రావణుని, శూర్పణఖను దుమ్మెత్తిపోస్తున్నారు.

శ్రీరాముడు మన్మథునివలె స్ఫురద్రూపి గదా. సుకుమారుడు సౌందర్యవంతుడైన ఆ రాముణ్ణి వృద్ధురాలు వికృత స్వరూపిణి ఐన శూర్పణఖ ఎలా మోహించింది. అని వారు శూర్పణఖను చీదరించుకుంటున్నారు.

ఎవరైనా కావాలనుకొన్న వస్తువును పొందడానికి తమ అర్హతను చూసుకోరా? ఈ శూర్పణఖ లోకం ఏవగించుకొన్న హీనురాలు గదా. ఆ శ్రీరాముడు సర్వులకూ ప్రియం ఒనరించే వాడు గదా. కామ పరవశానికి తారతమ్యాలు కూడా చూసుకోరా? సద్గుణాలరాశి ఐన రాముణ్ణి దుర్మతి దుర్ముఖి ఐన శూర్పణఖ ప్రేమించడమే కాక ఈ రావణుని పురికొల్పింది.

ఆశ తీరని రాక్షసి రావణునికి మాయ మాటలు చెప్పింది. మూర్ఖుడైన రావణుడు శూర్పణఖ మాటలు విని లంకకు చేటు తెచ్చాడు. పళ్ళు ఊడిపోయి, జుట్టు తెల్లబడినా చిత్తం కుదుటపడని శూర్పణఖ నల్లని కురుల సౌభాగ్యమున్న నవ మోహనాకారుణ్ణి ఇష్టపడిందా? ఆ ఇష్టమే రాముణ్ణి చంపాలన్న వాంఛను రేపిందా? కాని ఆ దుర్మార్గపు శూర్పణఖ వల్లనే మహావీరాధివీరులైన కుంభకర్ణ ఇంద్రజిత్తు లాంటివారు నేడు ప్రాణాలు కోల్పోయారు.

లంకను అప్రమత్తంగా అహర్నిశంగా కంటిపాపలా చూసుకొనే యోధులు మరణించినా మూర్ఖుడైన రావణుని మనస్సు మారలేదు. శూర్పణఖ వల్లనే రావణుడు శ్రీరామునితో వైరం పెట్టుకొన్నాడు. అతడు కామ పరవశత్వంతో సీతను తెచ్చాడు. ఆ సీతే నేడు సర్వవినాశనానికి నాందీ వాచకం పలికింది.

ఒక్క శ్రీరాముడు జన స్థానంలో ఖరదూషణాదులను వధించలేదా? ఇది రావణునికి రాముని పరాక్రమం తెలపలేదా? ఒక్క శ్రీరాముడు 14 వేలమంది రాక్షసులను, విరాధుణ్ణి చంపివేసినా, మూర్ఖ రావణునికి యథార్థం తెలియకపోతే మనం చేసేది ఏముంది?

మహామాయావి నన్న గర్వాతిశయంతో కుటిల పన్నాగాలతో సీతను లంకకైతే తెచ్చాడు కాని ఈ రావణుడు సీతను ఎప్పటికైనా దక్కించుకోగలడా? అది అసాధ్యమైన పని కానీ శ్రీరామునితో బద్ధవైరం తప్పలేదన్న సత్యం ఇంకా రావణునికి గోచరించడంలేదు. ఇంద్రుని అనుగ్రహంతో పుట్టిన వాలి సైతం రాముని చేతిలో హతమైపోయాడు గదా! అప్పుడు అయినా రావణుని మతి చలించలేదా?

సుగ్రీవుని రాజ్యాభిషేకం చేసిన రాముని హృదయం తెలీని రావణుడు పశువులతో సమానుడు కదా. నిండు కొలువులో విభీషణుడు రాక్షసుల హితం కోరి ఎన్ని మంచిమాటలు చెప్పాడు. సీతాదేవిపై మోహ పాశం పెంచుకొన్న రావణునికి విభీషణుని మంచి తలకెక్కలేదు. ఆ మహాత్ముని మాటలు విని ఉంటే నేడు లంక దుఃఖార్త అయ్యి ఉండేది కాదు.

దుర్జయుడైన కుంభకర్ణుడే కాక నేడు ఇంద్రజిత్తు కాలపాశానికి బంధితుడయ్యాడు. ఎంతమంది చనిపోయినా, రావణునికి మంచిబుద్ధి పుట్టలేదు. శ్రీరాముడు నిజంగా ఏ నారాయణుడో అయ్యి ఉంటాడు. సాక్షాత్తు యముడే రాముని రూపంలో వచ్చాడేమో. ఇక రాముని చేతిలో లంక సర్వనాశనం అయి తీరుతుంది. ఇక ఈ లంకలో విలాపాలే వినిపిస్తాయి.

దశగ్రీవుడు మహావీరుడు, బ్రహ్మ వరప్రసాది. ఆ వరగర్వంతో శ్రీరాముని యథార్థ స్వరూపాన్ని గుర్తించలేకున్నాడు. శ్రీరామునితో వచ్చిపడుతోన్న ఆపదలను తెలుసుకోలేక మరల మరల యుద్ధ సన్నద్ధుడు అవుతున్నాడు. రాముని వలన ఏర్పడే ఉపద్రవాల నుంచి రక్షించే నాథుడు ఎవ్వరూ లేరు. ఇంతవరకు యుద్ధ సన్నద్ధులై వెళ్ళేవారికి అపశుకునాలే ఎదురయ్యాయి. వాటి ఫలితం వారి మరణంతో స్పష్టంగా తెలుస్తోంది. రాముని చేతిలో దశకంఠుని చావు తప్పదనే శకునాలే అన్నిచోట్లా కనిపిస్తున్నాయి.

మూర్ఖ రావణుడు బ్రహ్మ నుంచి దేవ దానవ యక్ష గంధర్వ కిన్నరాదులనుండి చావు లేకుండా వరం పొంది ఉన్నానని చెప్తున్నాడు. కాని, నరవానరులనుండి చావు తప్పించుకొనే ఉపాయం నాకు తెలీదు అని తెలుసుకోలేకున్నాడు. ఈ నరులే రావణుని ప్రాణాంతకులు. ఇందులో ఏ సందేహం లేదు. బలగర్వితుడైన రావణుడు దేవతలను బాగా హింసించి ఉన్నారు. వారందరూ బ్రహ్మదేవుని ఆరాధించి రావణుని బాధను నివారించుమని అడిగారు.

బ్రహ్మతో కూడి దేవతలందరూ వృషభధ్వజుని దగ్గరకు వెళ్ళి ఆ పరమ శివుని అనుగ్రహాన్ని పొందారు. ఆ దేవాదిదేవుడు మీకు మేలు చేయడానికి ఒక దివ్య స్త్రీ త్వరలోనే పుడుతుందని చెప్పాడు. ఆమె రాక్షసుల వినాశనానికి కారకులరాలు అవుతుందనీ చెప్పాడు. మండోదరి చెప్పినట్లుగానే దేవతలచే ప్రేరేపింపబడిన ఆకలి దానవులను భక్షించినట్లుగా రావణునితో సహా ఆ దివ్య స్త్రీ రాక్షసులందరినీ కాటువేయగలదు. ఆ దివ్య స్త్రీయే నేడు సీత రూపంలో లంకలో కూర్చుని ఉంది.

ఇక మనలను ఆదుకొనే వారు ఎవ్వరూ లేరు. దీనినంతా గ్రహించిన విభీషణుడు ముందుగానే రాముని శరణువేడాడు. నేడు నిశ్చింతగా ఉన్నాడు. ఇక మన పని ఇంతే అని రాక్షస స్త్రీలు అందరూ విలపించారు.

* * *

# రావణుని యుద్ధ పయనం

## సర్గ - 95

లంకలోని ఆర్తనాదాలు, రోదనల ధ్వని రావణునకు వినిపించింది. ఒక క్షణకాలంపాటు ఏమి చేయాలని ఆలోచించాడు. వెంటనే ప్రళయకాల రుద్రుడు అయ్యాడు. పళ్ళు పటపటలాడించాడు. తీక్షణంగా ఎదుటివారిని చూశాడు. చూపులతో కాల్చేస్తాడా అన్నట్లుగా రాక్షసులను భయకంపితులను చేశాడు. వెంటనే 'రాక్షసులారా! సైన్యాన్ని సిద్ధం చేయండి, నా రథాన్ని ఇటు తెండి: నా ధనుస్సును ఇవ్వండి; సచివులారా! వెంటనే బయలుదేరండి' అని రావణుడు హుంకరించాడు.

రాక్షసులందరూ గడగడలాడారు. మహోదర మహాపార్శులు యుద్ధ సన్నద్ధులు అయ్యారు. లంకలోని వీరులందరిని సమీకరించారు. పోరుకు విముఖులై ఉన్నవారిని సైతం యుద్ధానికి రమ్మన్నారు. రాజాజ్ఞను అందరూ పాటించాలని చెప్పారు. అందరూ సమకూడారు. యుద్ధానికి బయలుదేరారు.

రావణుడు దివ్య రథాన్ని అధిరోహించాడు. మంత్రులు బ్రాహ్మణులు అందరూ ఆయనకు జయ జయధ్వానాలు చేశారు. విప్రులు ఆశీర్వదించారు. మిత్రులందరూ జేజేలు పలికారు. 'యోధులారా! సూర్యకిరణాల్లాంటి నా బాణాలు వేసి రామలక్ష్మణులను నేడే యముని దగ్గరకు పంపిస్తాను. ఖరుని, కుంభకర్ణుని, విరాధుణ్ణి చంపిన ఆ సోదరులను నేను చంపి నా పగ తీర్చుకొంటాను. నా బాణాలతో ఆకాశాన్నంతా కప్పివేస్తాను. దాంతో సూర్యచంద్రాదులు కాంతి చొరలేక భూమండలంలో చిమ్మచీకటి ఆవరిస్తుంది. దిక్కులన్నింటిని అల్లకల్లోలపరుస్తాను. అందరూ ఇక గతి మోక్షంలేక నన్నే శరణుకోరుతారు. నాకు ఈ రాముడొక్క లెక్కలోని వాడు కాదు' అంటూ బీరాలు పలుకుతున్నాడు.

'నా ధనుస్సు అనే సముద్రంలో ఉవ్వెత్తున ఎగిసిపడే తరంగాలలాంటి బాణాలు వచ్చి శత్రువులను మట్టుపెట్టుతాయి. పంకజాలు నిండిన సరస్సులను ఏనుగు కలచివేసినట్లుగా వానరులతో నిండిన సమరభూమిని కలచివేస్తాను. నా శరాల ధాటితో వానరుల శిరస్సులను తెంపి పడేస్తాను. అప్పుడు ఈ భూమి అంతా కపుల తలలతో నిండిపోతుంది. వృక్షాలు పర్వతాలతో యుద్ధం చేసే వానరులను నేడు నేను నా చండ ప్రచండ శరాగ్నిలో కాల్చివేస్తాను. వానరుల గుంపులను నాశనం చేసి తీరుతాను.

ఆత్మీయులను పోగొట్టుకొని తల్లడిల్లుతున్న నా లంకావాసుల కన్నీళ్ళను తుడుస్తాను. నా బాణప్రహారాలతో వానరులను, భల్లూకాలను చంపి నక్కలకు, గ్రద్దలకు, కాకులకు విందు చేస్తాను' అని చెప్పి రావణుడు యుద్ధ సన్నద్ధుడై రాక్షసులలో రణావేశాన్ని ప్రోత్సహించాడు. లంకలో ఇంటింట ఉన్న వారందరూ రాజాజ్ఞకు భయపడి సైన్యంలో కలిశారు. అందరి చేతుల్లో గొడ్డళ్ళు, గదలు, ఖడ్గాలు, కత్తులు, గుదియలు లాంటి రకరకాల ఆయుధాలున్నాయి. రావణుడు ఎనిమిది గుర్రాలున్న రథాన్ని అధిరోహించాడు.

రాక్షస రాజు చాలామంది రాక్షస యోధులతో కదన రంగానికి కదిలాడు. ఆయనకు ముందుగా మంత్రులైన మహాపార్శుడు, మహోదరుడు, విరూపాక్షుడు, దుర్ధర్షుడు అనేవారు బయలుదేరారు. వారు అందరూ రణభేరి

మ్రోగించారు. శంఖాలు ఊదారు. సింహనాదం చేశారు. ఢంకా మ్రోగించారు. పెద్దగా యుద్ధోత్సాహంతో మేఘగర్జనలు చేశారు.

రావణుడు తన సారథితో ఎనిమిది గుర్రాలున్న రథాన్ని ఉత్తర ద్వారం నుంచి పొమ్మన్నాడు. అక్కడ రామలక్ష్మణులు యుద్ధసన్నద్ధులై ఉన్నారు. ఆ సమయంలో భూమి దద్దరిల్లింది. మేఘాలు రక్తధారల్లాంటి వర్షాన్నిచ్చాయి. రథాశ్వాలు తడబాటుకు గురి అయ్యాయి. ధ్వజాగ్రంపై గ్రద్ద వాలింది. నక్కలు భయంకరంగా ఊళలు వేశాయి. గ్రద్దలు క్రిందుగా తిరిగాయి.

రావణుని ఎడమకన్ను అదిరింది. భుజం ఎగిరిపడింది. రావణుని ముఖం వెలవెలబోయింది. ఆయన కంఠస్వరం త్రొటుపడింది. ఇన్ని అపశకునాలు ఎదురైనా రావణుడు లెక్కచేయలేదు. అంతరిక్షం నుండి పిడుగులు పడినట్లుగా భీకరంగా గర్జించాడు. వెంటనే ఆకాశం నుండి ఒక తోకచుక్క పెద్ద శబ్దంతో రాలిపడింది. కాకులు గ్రద్దలు అరిచాయి.

ఇరుపక్షాల నడుమ భీకర యుద్ధం మొదలైంది. జయం కోరుతూ వానరులు, రాక్షసులు యుద్ధం చేస్తున్నారు. రావణుడు శ్రుతిమించిన కోపంతో వీరావేశంతో కదనరంగంలో తన రణ ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. అతని బాణాల దెబ్బలకు శిరస్సులు తెగిపడిపోతున్నాయి. కొందరి వానరుల చెవులు, చేతులు తెగుతున్నాయి. క్రోధవివశుడై రావణుడు వానరులను చీల్చి చెండాడుతున్నాడు.

* * *

# రావణుని విజృంభణ

## సర్గ - 96

రావణుని ధాటికి వానరులు హతులై పోతున్నారు. రావణుని శరాగ్నికి మిడుతల్లాగా వానరులు రణభూమి అంతా పడిపోతున్నారు. దావాగ్నికి భయపడిపోతున్న ఏనుగుల్లా వానరులు గగ్గోలుగా పరుగులు తీస్తున్నారు. వానరులతో పోరాడుతూ రావణుడు రాముడున్న ప్రదేశానికి వచ్చాడు.

వానరులు హతులు కావటం, వారు పరుగులు తీయడం సేనాధ్యక్షుడైన సుగ్రీవుడు చూశాడు. వెంటనే రక్షణ బాధ్యత మరొకరికి అప్పగించి తాను స్వయంగా పెద్ద వృక్షాన్ని తీసుకొని రావణుడిని ఎదిరించడానికి ముందుకు వెళ్ళారు. యూథపతులందరూ వృక్షాలు, పర్వతాలు చేతపట్టి సుగ్రీవునికి నలుపక్కలా బయలుదేరారు. ప్రళయకాలునిలాగా వానరరాజు యుద్ధ రంగంలో పెనుగాలిలాగా విజృంభించి పోరాడుతున్నాడు.

పక్షులపై రాళ్ళు రువ్వినట్లుగా వానరశ్రేష్ఠుడు పర్వతాలను రాక్షసులపైకి వేస్తున్నాడు. రాళ్ళ వర్షపు దాడికి నిశాచర యోధుల తలలు బ్రద్దలు అవుతున్నాయి. పర్వతాకారులందరూ నేలకు ఒరుగుతున్నారు. రాక్షస యోధులలో ఆందోళన ఎక్కువైంది. వెంటనే విరూపాక్షుడు తన పేరు చెప్పి సుగ్రీవుణ్ణి యుద్ధానికి ఆహ్వానిస్తూ గజారూఢుడై

ముందుకు వచ్చాడు. దాంతో రాక్షసులలో ఆనందం పల్లవించింది. తన బాణాలతో సుగ్రీవుని విరూపాక్షుడు బాధించసాగాడు. సుగ్రీవునిలో కోపం ఎక్కువైంది.

పెద్దగా గర్జిస్తూ విరూపాక్షుని వధించాలనే నిశ్చయంతో ముందుకువెళ్ళాడు. పెద్ద వృక్షంతో విరూపాక్షుని గజాన్ని సుగ్రీవుడు దెబ్బతీశాడు. ఆ దెబ్బకు గజం వెనక్కు చాలా దూరం వెళ్ళి ఆక్రోశిస్తూ నేలపై కూలబడిపోయింది. అప్పుడు ఆ గజం నుంచి విడివడి విరూపాక్షుడు సుగ్రీవునికి ఎదురుకు వెళ్ళాడు. ఒక చేత్తో కత్తి, మరో చేత్తో డాలును తీసుకొని సుగ్రీవుని భయపెడుతామని వీరావేశంతో వెళ్ళాడు.

సుగ్రీవుడు పెద్ద బండను విరూపాక్షునిపై విసిరాడు. దాన్ని తప్పించుకొని కపిరాజును రాక్షసుడుకొట్టాడు. ఆ దెబ్బ సుగ్రీవుణ్ణి బాగా గాయపర్చింది. ఒక్క క్షణం సుగ్రీవుడు స్పృహను కోల్పోయాడు. మళ్ళీ తేరుకొని పిడికిలి బిగించి విరూపాక్షుని వక్షస్థలంపై గట్టిగా కొట్టాడు. ఆ దెబ్బకు నిశాచరుడు క్రుద్ధుడయ్యాడు. తన ఖడ్గ ప్రహారంతో సుగ్రీవుని కవచాన్ని కొట్టాడు.

సుగ్రీవుడు ఆ దెబ్బకు తూలి క్రిందపడ్డాడు. మళ్ళీ లేచి తన అరచేతితో నిశాచరుని చరిచాడు. ఆ శబ్దం భయంకరమైన పిడుగు శబ్దాన్ని తలపించింది. ఆ ఇద్దరి వీరులు వక్షస్థలాన్ని ఫాలభాగాలను హింసించుకొన్నారు. ఒకరిని మించి మరొకరు గాయపర్చుకొన్నారు. సుగ్రీవుడు బలం అంతా ఉపయోగించి విరూపాక్షుని ఫాలభాగంపై కొట్టాడు.

ఫాలభాగం పగిలిపోయి నిశాచరుని దేహంనుంచి నెత్తురు బయటకు వచ్చింది. పర్వతాకారుడైన విరూపాక్షుని శరీరం అమాంతంగా నేలపై పడిపోయింది. ఆ పడిన వేగానికి శరీరం పగిలింది. ఆ నిశాచరుని దేహం నుండి రక్తం ఏరులై ప్రవహించింది. కనుగ్రుడ్లు పైకి వచ్చాయి. వికృతంగా విరూపాక్షుని దేహం కనిపించింది. పూర్తిగా ప్రాణం పోనందువల్ల విరూపాక్షుని శరీరం నేలపై ఎగిరిపడింది. దీనంగా మూలుగు వినిపిస్తోంది. కొద్దిసేపటికి విరూపాక్షుని ప్రాణాలు యముడు తీసుకెళ్ళిపోయాడు.

అప్పుడు వానరులు పెద్దగా జయోత్సాహంతో కోలాహలంగా అరిచారు. రాక్షసుల నాయకుడు చనిపోయాడని రావణుని అత్యాశతో లంక సర్వనాశనం అయిపోతుందని పెడబొబ్బలు పెట్టారు. ఉత్సాహం ఒకవైపు రోదనలు, మరోవైపు రణరంగం అంతా భీభత్సంగా కనిపించింది. ఒకరికి విచారం, మరొకరికి ఆనందం కలిగించే రణభూమి సృష్టికి ప్రతిరూపంలా కనిపిస్తోంది.

రావణుని సైన్యం ఒక్కొక్క మహావీరుడిని కోల్పోతోంది. దాన్ని చూసి రావణునిలో అసహనం పెరిగిపోతోంది. చివరకు అపజయమేనా అని అనుమానం బాధిస్తోంది. కాని, సీతాదేవిని రామునకు అప్పగించాలని అనిపించడంలేదు. అతి ప్రియమైన కొడుకుసైతం దూరమయ్యాడు. కాని, రావణుడు యుద్ధానికే మూర్ఖంగా మొగ్గుచూపాడు.

* * *

# మహోదరుని పతనం

## సర్గ - 97

**రా**క్షస వానరుల మధ్య యుద్ధం సాగుతోంది. ఎండాకాలంలో చెరువులు ఎండిపోయినట్లుగా మెల్ల మెల్లగా ఇరుపక్షాల సేన తగ్గిపోతుంది. విరూపాక్షుడు కూడా చనిపోవటంతో రావణుని క్రోధం రెట్టింపు అయింది. మహాకోపంతో ఎదురుగా ఉన్న 'మహోదరుని చూసి రాక్షస శ్రేష్ఠునివైన నీవు మన శత్రువులపై విజయం సాధించటానికి ఉపక్రమించు. నీ మీదనే నేను ఎన్నో ఆశలు పెట్టుకొని ఉన్నాను. నీవు ఉద్యమించి ఈ వానరులందరిని చీల్చి చెండాడు' అని చెప్పి రణావేశం కల్పించాడు.

మహోదరుడు రాజాజ్ఞను శిరోధార్యంగా భావించాడు. శత్రుసైన్యంపై ఉరికాడు. ప్రభువు ప్రేరణతో వానరుల పని పడుతున్నాడు. పెద్దపెద్ద బండలను పట్టి వానరులు రాక్షసులపై వేస్తున్నారు. రాక్షసులు తమ ప్రాణాలు దక్కించుకోవాలని ఆయుధాలతో సాయశక్తులా పోరాడుతున్నారు. మహోదరుడు తన బాణాలతో వానరుల చేతులను తొడలను చీల్చివేస్తున్నాడు. ఆయన ధాటికి తట్టుకోలేక వానరులు ఎగురుతూ దూకుతూ పోరాడుతున్నారు.

సుగ్రీవుడు మహోదరునిపై మండిపడుతూ దాడికి దిగాడు. పెద్ద శిలను తీసుకొని మహోదరుని గురి చూసి సుగ్రీవుడు కొట్టాడు. ఏ మాత్రం తొట్రుపడకుండా ఆ నిశాచరుడు ఆ శిలను తన బాణాలతో ముక్కలు చేశాడు. తాను విసిరిన శిల ముక్కలు అయిపోవడంతో సుగ్రీవుడు మళ్లీ మద్దిచెట్టుతో దాడిచేశాడు.

సుగ్రీవుడు మహోదరుడు ఇద్దరూ యుద్ధం చేస్తున్నారు. కొద్దిసేపు గడిచిన తర్వాత నేలపై పడి ఉన్న ఇనుప గుదియను సుగ్రీవుడు చేతిలోకి తీసుకొని, అతి లాఘవంగా మహోదరునితో పోరాటం చేశాడు. ఒక్కసారి ఆ గుదియను ప్రయోగించి మహోదరుని అశ్వాలను నేల కూల్చాడు.

దాంతో రాక్షసుడు రథం దిగి గదను చేపట్టి సుగ్రీవునిపై దాడికి వెళ్ళాడు. ఇద్దరూ ఆయుధాలతో పోరు సాగించారు. నిశాచరుడు యుద్ధ నైపుణ్యంతో నేర్పుగా గదను సుగ్రీవునిపై విసిరాడు. తన పైకి వచ్చే గదను చేతిలో ఉన్న గుదియను ఉపయోగించి వేగంగా కొట్టాడు. ఆ దెబ్బకు ఆ రెండు ఆయుధాలు ముక్కలై నేలపై రాలిపోయాయి.

సుగ్రీవుడు నేలపై పడి ఉన్న ఆయుధాలను తీసుకొంటూ ఆ రాక్షసునితో యుద్ధం చేస్తున్నాడు. ఆ ఇరువురి యోధుల ఆయుధాలు అయిపోగానే ముష్టియుద్ధానికి తలపడ్డారు. అరచేతులతో చరుచుకుంటూ, పిడిగ్రుద్దులు గుద్దుకుంటూ, ఆ వీరులు పోరుతూ నేలపై పడ్డారు. ఆ ఇద్దరూ బాహువులతో పోరాడి అలసిపోయారు.

వేగంగా కదిలి మహోదరుడు ప్రక్కనే కనిపిస్తున్న కత్తిని డాలును తీసుకొన్నాడు. సుగ్రీవుడు డాలు ఖడ్గాన్ని తీసుకొని యుద్ధానికి తలపడ్డాడు. ఇద్దరూ మండలాకారంలో తిరుగుతూ ఒకరిని మించి మరొకరు పోరాటం చేస్తున్నారు.

దుష్టబుద్ధి ఐన రాక్షసుడు వేగంగా రోషంతో తన ఖడ్గంతో సుగ్రీవుని డాలును కొట్టాడు. డాలును కొట్టే మహోదరుని అదును చూసి సుగ్రీవుడు తన ఖడ్గంతో శిరస్సును ఖండించివేశాడు. మహోదరుడు అంతిమశ్వాసను వదిలేశాడు. శిరస్సు మొండెం వేరై నేలపై పడిపోయాయి.

రాక్షస సైన్యం మహోదరుని మరణంతో అక్కడ ఉండలేకపోయింది. రాక్షసులందరూ పిక్కబలం చూపి పరుగు లంకించుకొన్నారు. వానరులలో సుగ్రీవుని ప్రతాపాన్ని చూసి ఆనందం వెల్లువెత్తింది. వారందరు పెద్దగా కోలాహల ధ్వనులు చేశారు. విజయోత్సాహాన్ని పొందిన సుగ్రీవుణ్ణి గగనం నుండి దివ్యులు అభినందించి ఆశీర్వదించారు. రామలక్ష్మణులు ఆనందాతిరేకాన్ని తెలిపారు. భూమిమీద ప్రాణులన్నీ నిశాచరుల పీడ వదిలిపోతోందని చాలా సంతోషించారు. హర్షోల్లాసంతో వానరులు సుగ్రీవుని కొనియాడారు.

* * *

# మహాపార్శ్వుని అంతం

## సర్గ - 98

**సు**గ్రీవుని చేతిలో మహోదరుడు నిహతుడు అయ్యాడు. దానితో మహాపార్శ్వునిలో క్రోధం పెల్లుబికింది. తన బాణ ప్రహారాలతో వానరులను చీల్చి చెండాడడం మొదలుపెట్టాడు. ఆయన ధాటికి వానరులు అంగవికలురు అవుతున్నారు. వానరుల చేతులు, తొడలు, చెవులు, తలలు సైతం తెగి రణభూమి నిండిపోతోంది. వానరులు అల్లకల్లోలంగా అరుస్తూ పర్వతాలతో వృక్షాలతో ఆ రాక్షసుని ఎదుర్కొంటున్నారు.

భీతావహులైన వానరులను చూచి పున్నమినాటి చంద్రునిలాగా అంగదుడు ఉద్యమించాడు. ఇనుప గుదియను తీసుకొని మహాపార్శ్వుని కొట్టాడు. ఆ దెబ్బకు మహాపార్శ్వుడు నిశ్చేష్టుడు అయ్యాడు. మళ్ళీ అంగదుడు విజృంభించి రథసారథిని మహాపార్శ్వుని బాగా బాధించాడు. రథసారధితో సహా రాక్షసుడు స్పృహ కోల్పోయాడు. నేలపై పడిపోయాడు. తేజస్వి అయిన జాంబవంతుడు గవాక్షునితో కూడి అక్కడకు వచ్చాడు. ఆ నిశాచరుని రథాన్ని రథాశ్వాలను జాంబవంతుడు పర్వతంతో కొట్టి ముక్కలు చేశాడు.

స్పృహ తప్పిన మహాపార్శ్వుడు తెలివి పొంది జరిగింది తెలుసుకొని క్రోధావేశుడు అయ్యాడు. మరల ధనుస్సు చేతబట్టుకొని వేగంగా అనేక బాణాలను అంగదునిపై ప్రయోగించాడు. జాంబవంతుని వక్షస్థలాన్ని మూడు బాణాలతో బాధించాడు. జాంబవంతుని బాధించిన నిశాచరునిపై కోపం తెచ్చుకొని అంగదుడు గవాక్షుడు దాడికి దిగారు. దగ్గరగా దొరికిన ఇనుప గుదియను అంగదుడు తీసుకొని వేగంగా గిరగిరా తిప్పుతూ మహాపార్శ్వుని మోదాడు. వాలి సుతుని గదా ప్రహారాలకు నిశాచరుని చేతిలోని విల్లు శిరస్త్రాణం క్రింద పడిపోయాయి.

అంగదుడు రాక్షసుని దగ్గరగా వెళ్ళి బాగా బలంగా కుండలాలతో అందంగా ఉన్న రాక్షసుని చెవులను చరిచాడు. ఆ దెబ్బకు రాక్షసుని గూబ గుయ్యిమంది. రాక్షసుడు క్రోధావేశంతో గండ్రగొడ్డలిని విసిరివేశాడు.

వేగంగా ఆ గొడ్డలి అంగదుని పైకి రాబోతోంది. తన ఎడమభుజంపై పడబోతున్న మహాపార్శ్వుడు విసిరిన గదనుంచి అంగదుడు తప్పించుకొన్నాడు. తండ్రి అంతటి పరాక్రమశాలి యైన వాలిసుతుడు తన పిడికిలి బిగించాడు. ఆయువు పట్లను ఎరిగిన వానర శ్రేష్ఠుడు పిడికిలితో మహాపార్శ్వుని వక్షస్థలంపై పోటు పొడిచాడు. అంగదుని ముష్టిఘాతానికి మహాపార్శ్వుని వక్షస్థలం ముక్కలైంది.

క్షణాలలో గుండె పగిలింది. ప్రాణాలు అనంతవాయువుల్లో లీనం అయ్యాయి. రాక్షస సేన మరొకరి వీరుని పోగొట్టుకొని ఆక్రందనలతో మునిగిపోయింది. రావణుడు పరమ మూర్ఖంగా రోషపడ్డాడు. నా అన్నవారందరూ కట్టకట్టుకుని యమపురికి పయనం సాగించడం రావణునికి మనస్తాపం కలిగిస్తోంది. క్రోధం కట్టలు త్రెంచుకొంది. ఉచితానుచితాలు మరిచాడు.

వానరులందరూ మహాసంతోషంగా రాక్షస సేన తగ్గి పోతోందని ఆనందించారు. లంకానగరం అంతా కదలబారినట్లుగా వానరులకు కనిపించింది. అంగదాది వానర వీరుల జయధ్వనులు ఆకాశాన్ని అంటాయి. ఆ కోలాహల ధ్వని రావణునిలో రణావేశాన్ని రగులుకొల్పింది. దీంతో యుద్ధ సన్నద్ధుడై కదన రంగంలోనే పౌరుషంగా రావణుడు నిలచాడు. తన సైన్యం అంతా నశించిపోతోందని ఆక్రోశం కలిగింది. ఎలాగైనా రాముణ్ణి తుద ముట్టించాలని రావణుడు గట్టిగా అనుకున్నాడు.

* * *

# రామ రావణుల యుద్ధ ప్రారంభం

## సర్గ - 99

తన మంత్రులు మహామహులైన మహోదర మహాపార్శ్వులు, విరూపాక్షుడు తాను కదనరంగంలో ఉండగానే నిహతులు అయిపోవడంతో రావణుని హృదయం భంగపాటు గురి అయింది. తన సారధిని చూసి యోధులందరూ మరణిస్తున్నారు. వారి ఆత్మీయుల రోదన ధ్వని నన్ను వివశుణ్ణి చేస్తోంది. నేడే రామలక్ష్మణులను చంపి వారి కన్నీరును తుడిచివేస్తాను అని చెప్పాడు.

అన్నింటికీ కారణభూతుడైన ఆ రాముణ్ణి నిహతుణ్ణి చేస్తే చాలు. రాముడు అనే మహావృక్షపు వేర్లను నరికివేస్తే ఆ వృక్షం పుష్పం ఐన సీత వడలిపోతుంది. ఆ వృక్షపు శాఖలైన సుగ్రీవుడు, జాంబవంతాదులు, కాండం అనే లక్ష్మణుడు నేలపాలైపోతారు. నేడే నేను ఆ రామవృక్షాన్ని పెకిలించివేస్తాను. నన్ను రాముడు ఉన్న వేపుగా తీసుకొని వెళ్ళుఅని తన సారథిని ప్రోత్సహించి చెప్పాడు.

అతిరథులలో ప్రముఖుడైన రావణుడు రథ చక్ర సవ్వళ్ళు దశదిశలా ప్రతిధ్వనింపజేస్తూ భూమండలాన్ని దద్దరిల్లేటట్లుగా చేశాడు. ఘోరమైన తామసాస్త్రాన్ని ప్రయోగించాడు. ఆ అస్త్ర ప్రభావం వానరులను దహింపజేస్తోంది.

వానరులందరూ దానివలన నేలపై పడిపోతున్నారు. బ్రహ్మ సృష్టించిన తామసాస్త్ర ప్రభావానికి ఎవరూ తాళలేక పోతున్నారు. వానరులందరు ఎటు వారటు పరుగులు తీస్తున్నారు. వందలకొద్దీ వానర సైన్యం చెల్లాచెదురు అయి పోవడం రాముడు చూశాడు.

వానరసేనను పారద్రోలి, రాముని కోసం వెదికే రావణునకు తమ్మునితో స్థిరంగా ఉన్న శ్రీరాముడు కనిపించాడు. తామర రేకులవంటి నేత్ర సౌందర్యం ఉన్న శ్రీరాముని, అతని చేతిలోని మహోన్నతమైన ధనుస్సును చూశాడు. చాలాకాలంగా శత్రువుగా ఉన్న రావణుడు తమవైపుకు రావడం సోదరులు గమనించారు. రాముడు యుద్ధ సన్నద్ధుడై ధనుస్సు మధ్యభాగాన్ని గట్టిగా పట్టుకొన్నాడు. ఆ వింటిని ఎక్కుపెట్టి శ్రీరాముడు ధనుష్టంకారం చేశాడు.

ఆ ధ్వని దిక్కులను పిక్కటిల్లచేసింది. రాముని ధనుష్టంకార ధ్వనికి భీతి చెంది ఎంతమంది రాక్షసులు వానరులు నేలపై పడిపోయారు. వారి సమీపంలోనే ఉన్న రావణుడు అమావాస్యనాడు చంద్రునికోసం పొంచి ఉన్న రాహువులాగా కనిపించాడు. లక్ష్మణుడు రావణునితో యుద్ధం చేయాలనుకొన్నాడు. వెంటనే వాడిఅయిన బాణాలు రావణునిపై ఎక్కుపెట్టి వదిలాడు. వాటిని గగనతలంలోనే రావణుడు ముక్కలు చేసేశాడు.

రావణుడు యుద్ధ కౌశలంతో లక్ష్మణుడు వేసే బాణాలను నిర్వీర్యం చేస్తున్నాడు. లక్ష్మణుని యుద్ధరంగంలో రావణుడు ఎదుర్కొంటూ రాముని దాకా పురోగమించాడు. ఎర్రబడిన కన్నులతో కోపంగా చూస్తూ రావణుడు పెక్కు బాణాలను రామునిపై వదిలాడు. తనపై వచ్చే బాణాలన్నింటిని రాముడు తన బాణ ప్రహారంతో తుత్తునియలు చేస్తున్నాడు.

శ్రీరాముడు రావణుడు ఇద్దరూ తీక్షణాలైన బాణాలతో యుద్ధం చేస్తున్నారు. చిత్ర విచిత్రంగా అపసవ్యంగా సవ్యంగా తిరుగుతూ బాణవర్షాలను కురిపిస్తున్నారు. ఆ ఇద్దరూ ధనుర్ధారులు రుద్ర యముల్లాగా భీకరంగా పోరాడుతున్నారు.

రామరావణులు శర ప్రయోగంతో ఆకాశం అంతా మేఘాలు ఆవరించినట్లు అయింది. పదునైన ములుకులు, గ్రద్దల రెక్కల్లాంటి పుంఖాలున్న శరాలను ఇద్దరూ ప్రయోగిస్తున్నారు. మహోద్ధతులు, అరిభయంకరులు యుద్ధం చేస్తున్నారు. వారి శర ప్రయోగంతో సమరభూమి అమావాస్యను తలపించింది.

రామరావణులిద్దరు శస్త్ర విద్యాపారంగతులు; అస్త్ర విద్యలలో ఆరితేరిన ఘటికులు; ఆ మహామహులు మహావాయువు ధాటికి విజృంభించి సముద్ర తరంగాల్లా భీకరమైన పోరులో భాగం పంచుకొంటున్నారు. లోక కంటకుడైన రావణుడు శ్రీరాముని పాలభాగాన్ని బాణాలతో గాయపర్చాడు. ఆ రావణుని వింటినుంచి వచ్చే బాణాలు నిరంతరంగా వచ్చి రాముని శిరస్సును బాధించాయి. అయినా శ్రీరాముడు ఏ మాత్రం వ్యధ చెందలేదు.

శ్రీరాముడు క్రుద్ధుడై శరాన్ని తీసి మంత్రాన్ని జపించాడు. కోపావేశుడై రావణునిపై శర ప్రయోగం చేశాడు. రౌద్రాస్త్రాన్ని వేశాడు. రాముని నిశితాలైన బాణాలు దుర్భేద్యంగా ఉన్న రావణుని కవచాన్ని దెబ్బతీశాయి. అయినా రావణునిలో ఏ మాత్రం బాధలేదు.

రథారూఢుడైన రాక్షస రాజు రావణుని ఫాలభాగాన్ని రఘురాముడు దివ్యాస్త్రాలతో హింసించాడు. రివ్వున సాగిపోయే శరాలు రావణుని బాణాలను ఛేదించి వేశాయి. క్రోధపరవశుడై రావణుడు చాలా బాణాలను రామునిపై వేశాడు. చివరకు రావణుడు రాముని అస్త్రాలను ఛేదిస్తూ రాముని అంతం చేయాలనే ఆకాంక్షతో అసురాస్త్రాన్ని వేశాడు. మహా తేజస్వి ఐన రావణుడు రాముని ఎలా ఐనా దెబ్బతీయాలని అనుకొన్నాడు. వివిధ మృగ పక్షుల ఆకారాల్లో ఉండే బాణాలతో రాముణ్ణి బాధించాడు. సింహం, పులి, రాబందు, కాకి, గ్రద్ద లాంటి ముఖాకృతి బాణాలు రావణుడు ప్రయోగించాడు.

రాముడు రణోత్సాహి అయి రావణునిపై ఆగ్నేయాస్త్రాన్ని సంధించాడు. రాముడు అగ్నిని వెదజల్లే సూర్యచంద్రులు, అర్ధచంద్రుడు, తోకచుక్క, గ్రహం, నక్షత్రం, ఉల్క, మెరుపుతీగల్లాంటి బాణాలను రావణునిపై వేశాడు.

రాముని ఆగ్నేయాస్త్ర ధాటికి రావణుని వేలకొలది బాణాలు గగనాన్నే ముక్కలు ముక్కలై నేల పడిపోయాయి. అసహాయశూరుడైన శ్రీరాముని చేతిలో రావణుని అసురాస్త్రం దగ్ధం అయిపోయింది. దాంతో సుగ్రీవాదులు శ్రీరాముని చుట్టూ చేరి హర్షాన్ని వ్యక్తం చేశారు. కపియోధులందరూ ఆగ్నేయాస్త్రం అసురాస్త్రాన్ని నాశనం చేసిందని ఎంతో సంతోషించారు. వానరులందరూ శ్రీరాముని ప్రతాపాన్ని మెచ్చుకొన్నారు.

* * *

# శ్రీరాముని విజృంభణ - రావణుని పలాయనం

## సర్గ - 100

రావణుడు తన అసురాస్త్రం నిర్వీర్యం అయినందుకు చాలా చింతించాడు. అస్త్ర పారంగతుడైన రావణుడు మరలా ఇంకో శరాన్ని తీసి ఎక్కుపెట్టి రౌద్రాస్త్రాన్ని జపించాడు. ఆ ప్రభావంతో ఆయన ధనుస్సునుండి శూలాలు, గదలు, ముసలాలు, ఇనుప గుదియలు, పాశాలు, పిడుగులు ఇలా చాలా శరాలు అద్భుతంగా దూసుకొచ్చాయి. వాటిని రామునిపై రావణుడు ప్రయోగించాడు. రాముడు నింపాదిగా గాంధర్వాస్త్రంతో రౌద్రాస్త్రాన్ని వమ్ముచేశాడు.

రావణుడు కుపితుడై ధనుస్సునుండి గొప్ప చక్రాలను వెలువరించాడు. అవి సమస్త దిక్కులను కాంతివంతం చేస్తున్నాయి. రావణుని విచిత్ర చక్రాయుధాలను రాముడు తన బాణవర్షంతో ఛేదించి వేశాడు. సౌరాస్త్రాన్ని పోగొట్టుకొన్న రావణుడు రాముని ఆయువు పట్టులపై శరాలను వేశాడు. రావణుడు పది బాణాలను రామునిపై ప్రయోగించాడు. యుద్ధంలో ఆరితేరిన రాముడు ఆ బాణాలను ఛేదించడమే కాదు రావణుడి వివిధ అవయవాలను తన శరాలతో హింసించాడు.

రావణునిపై కోపం పెంచుకొన్న లక్ష్మణుడు ఏడు శరాలను ఎక్కుపెట్టి రావణుని మానవ కపాల చిహ్న ధ్వజాన్ని ముక్కలుగా చేశాడు. ఒక బాణంతో మిరుమిట్లు గొలిపే కాంతి ఉన్న కుండలాలను ధరించిన రావణ సారథిని లక్ష్మణుని చంపివేశాడు. మరల విజృంభించి లక్ష్మణుడు రెల్లు కాండంలాగా ఉన్న ఐదు బాణాలు వేసి ఏనుగు తొండం వంటి రావణుని ధనుస్సును తుంపేశాడు. రావణుడికి చేతిలోని ధనుస్సు పోవడంతో ఏమి చేయాలో తోచలేదు. అప్పుడు విభీషణుడు పైకి ఎగిరి తన గదలతో రావణుని రథాశ్వాలను సంహరించి వేశాడు. వెంటనే రావణుడు విభీషణునిపై కుపితుడై రథం నుంచి క్రిందకు దూకాడు. నిప్పులు గ్రక్కే పిడుగు లాంటి శూలాన్ని విభీషణునిపై విసిరివేశాడు. ఆ శూలం విభీషణుని చేరకముందే లక్ష్మణుడు మూడు బాణాలతో ముక్కలు చేసేశాడు. బంగారంతో అలంకృతమైన శూలం తోకచుక్కలాగా నేలపై రాలిపోయింది. రావణుడు చందనాది లేపనాలతో విలసిల్లే ఒక దివ్యమైన బల్లెంతో విభీషణునిపై ప్రయోగించాలనుకొన్నాడు. ఆ బల్లెమును ఎదుర్కొనే శక్తి ఇంద్రాదులకే లేదు. చాలా భయంకరమైన వజ్రాయుధంలాంటి బల్లాన్ని విభీషణునిపై గురిపెట్టాడు. ప్రాణాపాయ స్థితికి చేరిన విభీషణుని కాపాడాలని సౌమిత్రి తలచాడు. వెంటనే తన ధనుస్సును ఎక్కుపెట్టి రావణునిపై శరవర్షం కురిపించాడు. లక్ష్మణుని శరపరంపర అనంతంగా రావటంతో వాటిని ఎదుర్కొంటూ బల్లాన్ని విసరలేక విభీషణుని చంపాలనే ఆలోచనను రావణుడు విరమించుకొన్నాడు. తన పరాక్రమాన్ని కుంటుపర్చిన లక్ష్మణుని చూసి 'ఓ సౌమిత్రీ! నీవు శ్రమపడి ఈ విభీషణుని కాపాడగలిగావు. అందువలన వానిని విడిచి నీపైనే నా శక్తిని ప్రయోగిస్తాను. నేను ఇంతకుముందు ఎందరినో మహామహులను వీరాధివీరులను మట్టికరిపించి ఉన్నాను. అలాంటి నా బాహువుల పనితనం నీకు చూపిస్తాను. నీ హృదయాన్ని చీల్చి నీ ప్రాణాలను ఇపుడే హరించివేస్తాను' అని రావణుడు పెద్దగా లక్ష్మణునితో అరిచి చెప్పాడు.

క్రోధావేశపరుడైన రావణుడు లక్ష్మణుని చంపాలని అనుకొన్నాడు. మయునిచే నిర్మితం అయిన ఒక బల్లాన్ని చేత పట్టుకొన్నాడు. ఆ బల్లెం శత్రువులను పరిమార్చడంతో అమోఘమైన శక్తిగలది దాన్ని రావణుడు లక్ష్మణునిపై విసిరివేశాడు. అది లక్ష్మణుని చేరకముందే శ్రీరాముడు 'ఓ అమోఘ శక్తివంతమైన బల్లెమా! నీలో ప్రాణహరణశక్తి నశించి లక్ష్మణునకి శుభం కూర్చు' అని అన్నాడు.

విషసర్పంవలె భయంకరమైన ఆ శక్తిమంతమైన బల్లెం లక్ష్మణుని హృదయాన నాటుకోవడంతో లక్ష్మణుడు చాలా గాయపడి నేలపై పడిపోయాడు. లక్ష్మణుని దురవస్థను చూచి శ్రీరాముడు హృదయం బరువెక్కింది. ఆయన ఎంతో చింతకు లోనయ్యాడు. అశ్రువులు రాముని కన్నులనుండి ధారగా కారిపోసాగాయి. అంతలో రాముడు ఇది విచారించాల్సిన సమయం కాదని అనుకొన్నాడు. ఇక లాభం లేదు ఈ లక్ష్మణుని బాధించిన ఆ దురాత్ముని వధించి తీర్తాను అని నిశ్చయించుకొన్నాడు. వెంటనే రాక్షసునితో యుద్ధానికి తలపడ్డాడు. లక్ష్మణుడు రావణ ప్రయుక్త బాణంతో బాగా గాయపడి స్పృహ తప్పి ఉన్నాడు. అలాంటి స్థితిలో ఉన్న తమ్ముణ్ణి చూసేసరికి రాముడిలో ఆవేశం ఉద్రిక్తం అయింది.

లక్ష్మణుని హృదయాన నాటుకొన్న బాణాన్ని వానరులు పెరికివేయలేకపోయారు. ఆ శక్తి బాణం లక్ష్మణుని గుండెను చీల్చి ఆవలకి వెళ్ళి భూతలాన నాటుకొంది. దాన్ని తెలుసుకొన్న రాముడు కోపంతో ఉడికిపోయాడు. మహా ఉక్రోషంతో రాముడు దాన్ని తన రెండు చేతులతో బయటకు లాగి విరిచివేశాడు. రాముడు అలా ధనుస్సును ప్రక్కన పెట్టి తన రెండు చేతులతో శక్తి అనే బాణాన్ని లాగే సమయంలో దుష్టబుద్ధి ఐన రావణుడు రాముని అన్ని అవయవాలను తన శర పరంపరతో బాధించాడు. వాటిని రాముడు ఏ మాత్రం లెక్క చేయలేదు. లక్ష్మణుని గట్టిగా కౌగిలించుకొన్నాడు. నేలపై పడుకోబెట్టాడు. అక్కడే ఉన్న హనుమంతునితో సుగ్రీవునితో లక్ష్మణుణ్ణి జాగ్రత్తగా చూసుకోమని చెప్పాడు. పాపాత్ముడు, కూరాత్ముడు ఐన రావణుని చంపేయాలని సంకల్పించాను. 'వానరులారా! నేను ఇప్పుడే ప్రతిజ్ఞ చేస్తున్నాను. ఇక ఈ జగత్తులో రాముడో, రావణుడో ఎవరో ఒక్కరే ఈ ఉండాలి. ఇదే నిశ్చయం' అని ఉగ్రుడైన రాముడు చెప్పాడు. వానరులలో ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. రాక్షసమూకను నాశం చేయాలని అనుకొన్నారు. లక్ష్మణుడు నిస్తేజంగా పడిఉండడంతో రామునకు దుఃఖం ముంచుకువచ్చింది. 'అయ్యో లక్ష్మణా! నా అభాగ్యకారణంగా నీకీ దుర్దశ వచ్చింది. మనకు ఆ భగవంతుడు అనుకూలంగా లేదు. అందుకే ఇన్ని కష్టాలు పరంపరగా వస్తూనేఉన్నాయి. రాజ్యాధికారం దూరమైంది. వనవాసం చేయాల్సి రావడంతో దండకారణ్యాన ప్రవేశించాం. అక్కడే సీతాపహరణం జరిగి తీరని దుఃఖం వచ్చింది. ఈ కష్టాలే భరించలేనివి అంటే ఇపుడు ప్రాణాధికమైన లక్ష్మణుడు మహా ఘోరమైన దుర్భరమైన బాధకు లోనయ్యాడు. ఇదంతా ఈ దుష్ట రావణుని వలనే జరిగింది. వాలిని వధించి సుగ్రీవుని రాజ్యాభిషేకం చేశాను. సేతువును నిర్మించి సముద్రాన్ని దాటి ఈ లంకలో ప్రవేశించాం. ఇన్ని కష్టాలకు కారణం ఈ దుర్మార్గుడైన రావణుని వల్లనే జరిగాయి. అందువలనే ఇక నా కంటపడిన రావణుని ఇంక జీవింపనీయను. ఎదిరింప శక్యంకాని వానరులు అందరూ స్వస్థచిత్తులై నాకు రావణునకు మధ్య జరిగే యుద్ధాన్ని చూడండి. నేడు నా పరాక్రమాన్ని చూసి సమస్త లోకాలు సంతోషించేటట్లు చేస్తాను. దేవతలను, సాధువులను పీడించిన ఈ రావణుని చంపి దేవ గంధర్వ యక్ష కిన్నరాదులకే కాక మహర్షులు సాధువులు అందరికీ ఆనందాన్ని కలుగజేస్తాను' అని వానరులకు రాముడు చెప్పాడు. శ్రీరాముడు యుద్ధ సన్నద్ధుడై శరాలను రావణునిపై వేశాడు. రావణుడు కూడా వర్షధారల్లాగా శర వర్షాన్ని రామునిపై కురిపించాడు. ఉభయ వీరుల శరాలు ముక్కలై నేలను చేరుతున్నాయి. రామ రావణుల ధనుష్టంకారాలు సమస్త ప్రాణులను భీతిల్లి చేస్తున్నాయి. రాముని శర సంపద ఉధృతంగా తనపై దూసుకొని రావడంతో రావణుడు ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. పెనుగాలికి అల్లల్లాడే చిరుమొక్కలా రావణుడు కంపించిపోయాడు. ఆ ధాటికి తాళలేక రావణుడు పరుగులు తీశాడు.

* * *

# లక్ష్మణుడు మూర్ఛనుండి తేరుకోవటం

## సర్గ - 101

రాముడు రావణునితో యుద్ధం ప్రారంభించాడు. రఘువరుని మనస్సు మాత్రం లక్ష్మణునిమీదే ఉంది. ఈ దుష్టుడు నా సోదరుని స్పృహ తప్పేటట్లు చేశాడు గదా! అలా కనులుమూసుకుని సౌమిత్రి పడి ఉండగా నాకు యుద్ధంపై మనస్సు పోవడంలేదు అనుకొన్నాడు. తన ప్రక్కనే ఉన్న సుషేణునితో లక్ష్మణునిపై తనకున్న ప్రేమను చెప్పుతున్నాడు. "సుషేణా! ఈ సౌమిత్రి వీరాధివీరుడు. ఇంద్రజిత్తునే మట్టి కరిపించాడు. నేడు ఈ దుర్మార్గుని బాణఘాతం ఈ వీరుని మూర్ఛపోయేటట్లు జేసింది.

సౌమిత్రిని చూస్తుంటే నా పరాక్రమం జావగారిపోతోంది. నా చేతిలోని బాణాలు అప్రయత్నంగానే జారిపోతున్నాయి. నా ప్రాణాలు దుర్బలంగా ఉన్నాయి. నా కళ్ళు అశ్రువులతో నిండి నాకు ఏమీ కనిపించడంలేదు. నాకు జీవించాలనే ఆశ నశిస్తోంది. లక్ష్మణుడు లేని జీవితాన్ని నేను ఊహించలేకున్నాను. నేను సీత వియోగ్నిలో దహించిపోతూ నిరాశకు లోనైనప్పుడు నా సోదరుడు నన్ను ఎంతో ఓదార్చాడు. నేను నా తండ్రి మరణించిన దుఃఖం నుండి, నా తల్లులు నాకు దూరమైపోయిన దుఃఖంనుండి, అంతేగాదు, ఆఖరికి నా సీత నన్ను విడిచి వెళ్లిన దుఃఖంనుండి కూడా ఒక్క లక్ష్మణుడే నన్ను బాధావిముక్తిని చేశాడు. అలాంటి నా సోదరుడు నేడు మాట్లాడే శక్తిని కోల్పోయి నేలపై పడి ఉన్నాడు. అటువంటి నా సోదరుడు నన్ను విడిచి వెళ్లినట్లు అయితే ఇక నాకు ఈ లోకంతో పని ఏముంది? రాజ్యాధికారంగాని, సీతగాని, స్నేహితులుగాని, నాకు ఎందుకు? నాకు నా సోదరుడు నా ప్రక్కన ఉంటేగాని నేను ఏ పనీ చేయలేను. నా వెనుక దండకారణ్యాలకు వచ్చిన నా సోదరునిలాగానే నేను నా సోదరునితోనే ఉంటాను. ఒకవేళ ఇతడు యమ సదనానికి వెళ్ళితే నేను కూడా వెళ్తాను.

ఇప్పుడు ఈ రావణుని చంపి నాకు విజయం చేకూరినా, సీతను నేను పొందగలిగినా నాకు సంతోషంరాదు. రణభూమిపై పడి ఉన్న సౌమిత్రి లేచి తిరిగేవరకు నా మనస్సు శాంతించదు. అసలు పరమప్రీతుడైన నా సోదరుని దుర్మార్గులైన రాక్షసులు కపటోపాయం చేత హింసించారు. ఎదురుగా పోరాడినట్లు అయితే లక్ష్మణుని జయించేవారు ఎవరూ ఉండరు. ఏ దేశ కాలపరిస్థితులలోనైనా తల్లులుగాని, భార్యలు కాని దొరుకుతారు. కాని, ప్రాణ సమానుడైన రక్తం పంచుకుపుట్టిన సోదరుడు ఎంత కష్టించినా దొరకడు. అటువంటి లక్ష్మణుని పోగొట్టుకొని నేను జీవించలేను. అయ్యో! అందరికి మిత్రత్వాన్ని పంచి, నలుగురి మంచిని కోరే ఈ సుమిత్రానందనుని ఈ గతి పట్టిందే? అసలు నా దురదృష్టమే ఈ లక్ష్మణునకు పట్టింది. నేను పూర్వజన్మలో ఏ పాపం చేశానో? నేడు సోదరుని గాయాల పాలు చేశాను.

నేను అయోధ్యకు తిరిగి వెళ్ళినపుడు తనతో మాట మాత్రం చెప్పకుండా అడవులకు పయనమై వచ్చిన లక్ష్మణుడు ఏడీ? అని అడిగే సుమిత్రాదేవికి నేను ఏమని సమాధానం చెప్పను? నన్ను నీ తండ్రి దశరథుని సీతారాములలో చూస్తూ వారికి సేవ చేస్తుండమని తన తనయునకుచెప్పి పంపిన ఆ సౌజన్యమూర్తి సుమిత్రాదేవికి

నేను నా ముఖం ఎలా చూపించగలను? కనుసైగ ద్వారా అయినా అడవులకు వెళ్ళవద్దని చెప్పని నా మరదలైన ఊర్మిళ నా భర్త ఏడి? అని అడిగితే నేను ఏమని చెప్పేది?

లక్ష్మణునితో కలిసివెళ్ళిన నీవు సోదరుడు లేకుండా వచ్చినావేమని అడిగే అపార సోదర ప్రేమ ఉన్న భరత శత్రుఘ్నులకు ఏమని జవాబు చెప్పేది? లక్ష్మణుడా! నాతో మాట్లాడు. నీవు ఇలా పరలోక యాత్ర చేయాలనే తలంపును తెచ్చుకొనకుము" అంటూ తీవ్ర ఆవేదనకు లోనై వ్యాకులంతో రాముడు సౌమిత్రికోసం అనేక విధాలుగా పరితపించాడు. "సుషేణా! ఈ లక్ష్మణుడు గురించి ఎంత చెప్పినా తరిగిపోదు. మామధ్య పెనవేసుకున్న మైత్రీ బంధం చాలా గట్టిది. మా సోదరులలో ఎవరు లేకపోయినా రెండవవారు మనలేరు. నా గుండె బండరాయి కానీ నేను ఇంకా బ్రతికేఉన్నాను.

నన్ను విడిచి లక్ష్మణుడు క్షణమైనా ఉండలేడు. నా బహిప్రాణం లక్ష్మణుడే. నాలో జీవ శక్తికి కారణం ఈ సోదరుడే" అని సుషేణునితో రాముడు చెప్పాడు. అచేతనంగా పడిఉన్న లక్ష్మణుని చూచేకొద్దీ రామునకు కన్నీరు ధారాపాతంగా కారుతూనే ఉంది. "అయ్యో లక్ష్మణా! ఎంతటి అవస్థలపాలు అయినావు. నా సోదరుడు తిరిగి ఆరోగ్యవంతుడౌతాడు కదా!" అని అంటూ కన్నీరును ఆపుకునే యత్నంచేస్తున్నాడు.

సోదరుని స్థితిని చూచి వ్యాకులం చెందే శ్రీరామునితో సుషేణుడు 'శ్రీరామా! మీరు ఇంతగా చింతించాల్సిన అవసరం ఏమాత్రం లేదు. ఈ లక్ష్మణునికి వచ్చిన ఆపద ఏదీ లేదు. ఇతడు సజీవుడే అయ్యి ఉన్నాడు. కాని, దుష్టదానవుని బాణపు తాకిడివల్ల సొమ్మసిల్లి ఉన్నాడు. సరైన వైద్యం అందిస్తే ఇతడు తిరిగి పూర్వస్థితిని పొందుతాడు. మీరు వ్యాకులత్వం వీడి శత్రువుల పని పట్టండి. మేము ఈ లక్ష్మణుని తిరిగి స్వస్థుణ్ణి చేస్తాం. లక్ష్మణుడు మూర్ఛితుడై ఉన్నప్పటికీ ఇతని ముఖంలో ఎలాంటి అశుభ సూచకాలు కనిపించడంలేదు. ఇతని హృదయ స్పందన మెల్లగా సాగుతోంది. చాలా నీరసించి ఉన్నందువలన కళ్ళు తెరవలేక ఉన్నాడు త్వరలోనే కోలుకుంటాడు.' అని శ్రీరామునితో సుషేణుడు చెప్పాడు.

హనుమంతుని పిలిచి ఇంతకుముందు జాంబవంతుడు చెప్పిన హిమాలయ పర్వతం దగ్గర ఉన్న ఓషధీ పర్వతం నుండి విశల్యకరణి, సావర్ణ్యకరణి, సంజీవకరణి, సంధానకరణి ఓషధిని మరలా వెళ్ళి తెమ్మని చెప్పాడు. ఔషధ సేవనంవల్ల సౌమిత్రికి తిరిగి ఆరోగ్యం చేకూరుతుందని చెప్పాడు. రామభక్తుడైన ఆంజనేయుడు సుషేణుడు చెప్పిన దానికి మారు మాట్లాడకుండా తల ఊపాడు.

వెంటనే ఉద్యమించి ఇంతకుముందు జాంబవంతుడు చెప్పినది గుర్తుతెచ్చుకొన్నాడు. లంఘించి ఎగిసి ఆకాశ మార్గంలో వేగంగా పయనించి మారుతి హిమాలయాన్ని చేరాడు. అక్కడ మిలమిలలాడే ఓషధీ పర్వతాన్ని ఆనందంగా చూశాడు. కాని, ఆ పర్వతంనిండా దివ్యౌషధులు ఉండడం చూశాడు. అందులో సుషేణుడు చెప్పిన ఔషధిని గుర్తించలేకపోయాడు. తిరిగి సుషేణుడు చెప్పిన దాన్ని మననం చేసుకొన్నాడు. విరిగిన ఎముకలను అతికించగలిగేది, కాంతి విహీనం అయిన శరీరానికి కాంతినిచ్చేది, శరాలు గ్రుచ్చుకోవడంతో ఏర్పడిన రంధ్రాలను, గాయాలను మాన్పగలిగేది అయిన ఓషధిని ఎంతకూ గుర్తించలేకపోయాడు. నేను ఇలా మీనమేషాలు లెక్కపెట్టుతూ వెదుకులాటలోనే ఉంటే సమయం మించిపోతుంది. పుణ్యకాలం కాస్త పుచ్చిపోతుందనుకొన్నాడు.

వెంటనే ఓషధీ పర్వతాన్నే పెకలించి రాముని దగ్గరకు తెచ్చాడు. ఆ పర్వతాన్నే అవలీలగా తెచ్చిన మహాబలశాలి అయిన హనుమంతుని వానరులు అద్భుతంగా చూశారు; ఆనందించారు. వెంటనే సుషేణుడు ఆ శిఖరంలో ఉన్న ఓషధిని గుర్తుపట్టి చేతిలోకి తీసుకొన్నాడు. విశల్యకరణి, సావర్ణ్యకరణి, సంజీవకరణి, సంధానకరణి అనే మహౌషధాన్ని నలగగొట్టి లక్ష్మణునికి ముక్కుద్వారా ఔషధ సేవనం చేయించాడు.

ఆ ఔషధ ప్రభావంతో సౌమిత్రి మెల్లగా తేరుకొన్నాడు. కన్నులు తెరచి చూడసాగాడు. శరాలతో ఏర్పడిన గుండెకు తగిలిన గాయం మానింది. శరీరకాంతి ద్విగుణీకృతం అయ్యింది. ఏమాత్రం బాధలేని వాడుగా సౌమిత్రి ఆరోగ్యవంతుడయ్యాడు. నిద్రనుంచి లేచినట్లుగా లేచాడు. రాముని ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. హనుమ సుషేణాదులలోను ఆనందం వెల్లువై పారింది. రాముడు లక్ష్మణుణ్ణి దగ్గరకు పిలిచి "వీరుడా! నేను అదృష్టవశంతో నిన్ను తిరిగి చూస్తున్నాను. భగవంతుడు దయామయుడు. ఆయన మనలను ఎల్లవేళలా నీడలా ఉండి కాపాడుతున్నాడు.

ఆయన వల్లనే నీవు నేడు పునర్జీవితుడివి అయ్యావు" అంటూ లక్ష్మణుని హృదయానికి హత్తుకొని ఆనంద బాష్పాలు రాల్చాడు. పని అయిపోయిందని హనుమంతుడు ఓషధీ పర్వతాన్ని యథాస్థానానికి చేర్చాడు. వానరులందరూ లక్ష్మణుడు పూర్తి ఆరోగ్యవంతుడు అయ్యాడని సంతోషించారు. రాముడు చేయవలసినవి మరిచిపోయినట్లుగా సౌమిత్రినే ఆనందంగా చూస్తున్నాడు. పోయిన సంపదలన్నీ అవే తిరిగివచ్చినట్టు కోల్పోయిన అమూల్యమైన వస్తువు తిరిగి దొరికినట్లుగా శ్రీరాముడు సంతోషిస్తున్నాడు.

అలాంటి సంతోషితస్వాంతుడైన రాముణ్ణి చూచి లక్ష్మణుడు అతని కర్తవ్యాన్ని గుర్తుచేశాడు. "అన్నా! ఇలా మీరు ఉండడం బాగా లేదు. నేను క్రిందపడిపోగానే మహాత్ములైన మీరు సామాన్యునిలాగా విలపిస్తూ కూర్చోవడం, యుద్ధంపై ప్రీతిని కోల్పోవడం బాగలేదు. మన వంశ ఉన్నతిని గుర్తుతెచ్చుకొని మీరు శత్రువులపై దాడికి సన్నద్ధం కావాలి.

మీరు చేసిన ప్రతిజ్ఞను పాటించి తీరాలి. మీరు రావణుని చంపి విభీషణుని రాజ్యాభిషిక్తుని చేస్తానని మాట ఇచ్చి ఉన్నారు. ఆ పనికై ఉపక్రమించండి. మీ ప్రాణాధికమైన సీతమ్మ శత్రువుల చేత చిక్కి మిమ్మే స్మరిస్తూ బేలయై ఉంది. ఆమెను కాపాడవలసిన బాధ్యత మీపై ఉంది. దానికోసం మీరు ఉపక్రమించండి. లోకకంటకులైన రావణాది అసురులను చంపుతాను అని సాధుపుంగవులకు మాట ఇచ్చి వున్నారు. మీరు దాన్ని నెరవేర్చాల్సిన పని ఉంది."

"అన్నా! నా మాటను ఆలకించండి. నేడే ధనుస్సు చేపట్టి రావణుని హతమార్చండి. సూర్యుడు అస్తాద్రి చేరేలోగా ఈ దుష్టుడు నశించాలని నేను కోరుతున్నాను. మీరు దానికై పరాక్రమించండి! లేవండి!!" అంటూ లక్ష్మణుడు శ్రీరామునితో చెప్పాడు.

* * *

# దేవతా సాయం

## సర్గ - 102

లక్ష్మణుని మాటలు విన్న రాముడు సంతృప్తిచెందాడు. సౌమిత్రి ఆరోగ్యవంతుడు అవటంతో రామునికి మళ్లీ యుద్ధంపై మనసు మరలింది. తన పరమ శత్రువును పరిమార్చాలని నిశ్చయంతో చేతిలోకి ధనుస్సు తీసుకొన్నాడు. తన కోపాన్నంతా ధనుష్టంకారంలో చూపించాడు. రాక్షసులందరూ ఆ టంకారధ్వనికి భంగపాటుకు గురయ్యారు. రావణుని మనస్సును భీతి అవరించింది.

రాముడు ఘోరమైన శరాలను సంధించి రావణుని హింసించాడు. లక్ష్మణునివల్ల విభీషణాదులవల్ల రథం కోల్పోయిన రావణుడు కొత్త రథం అధిరోహించాడు. సూర్యుని మింగబోయిన రాహువులాగా రావణుడు శ్రీరామునిపై విజృంభించాడు. రావణుడు వర్షంలాగా శరాలను రామునిపై వేశాడు. వాటినన్నింటిని రాముడు ఎదుర్కొంటూనే రావణుని ముప్పతిప్పలు పెట్టాడు. రావణాసురుని సంగ్రామంలో రాముడు చీల్చిచెండాడ సాగాడు.

లోకకంటకుడు ఐన రావణుడు రథంపైన, సద్గుణాభిరాముడు సర్వులకు శ్రేయోదాయకుడైన రాముడు పాదుకలు కూడా లేకుండా నేలపై నిలబడి సమరం సాగించటాన్ని గగనతలాన్నుంచి చూసే దేవ గంధర్వ యక్ష కిన్నరాదులు చూడలేకపోయారు. వారికి రాముడుపడుతున్న కష్టం చూచి భగవంతుడైనా నరునిగా పుట్టినతర్వాత నరునిగానే ఉండాలి కదా. పాపం! ఈ రామునకు ఎంత దురవస్థ కలిగిందో! అని వారు చింతించారు. లోకాలకే దుష్టుడైన వానికేమో రథం ఉంది. సర్వలోకరక్షకుడైనవానికి భూదేవియే రథంగా ఉంది అని వారిలో వారు మాట్లాడుకుంటున్నారు.

రామునకు రథం ఉండి ఉంటే ఆ దుష్టుడిని త్వరగా సంహరించేవాడేమోనని వారిలో వారు చెప్పుకొన్నారు. మహేంద్రుడు వారి మాటలు విన్నాడు. తన కర్తవ్యం ఏమిటో ఆలోచించాడు.

### మహేంద్రుడు రామునికోసం రథం పంపడం

మహేంద్రుడు వారి మాటలు విన్నాడు. తన కర్తవ్యం ఏమిటో ఆలోచించాడు. వెంటనే మాతలిని పిలిచి "నీవు వెంటనే రథం తీసుకొని వెళ్లి రామునికి ఇవ్వు. నీ సారథ్యంలో రాముణ్ణి ఈ రథంపై ఎక్కి రావణునితో యుద్ధం చేయమని మామాటగా చెప్పు" అంటూ రామునికి రథాన్ని పంపించాడు.

మనోవేగగమనుడైన మాతలి మరు నిమిషంలో రాముని దగ్గరకు చేరాడు. చేతిలో కొరడా ఉంచుకొని రథంపై ఆసీనుడయ్యే రామునికి నమస్కరించాడు. 'శ్రీరామా! మీరు వీరాధివీరులు. మీకు దేవేంద్రుడు దీన్ని కానుకగా పంపించాడు. దేవగణాలన్నీ మీరు ఈ రథంపై నుంచి రావణునితో యుద్ధం చేయాలని ఆశిస్తున్నాయి' అని చెప్పాడు.

రాముడు ఆశ్చర్యానందాలతో రథంవైపు దృష్టి సారించాడు. ఆ దేవేంద్రుని రథం సువర్ణంతో నిర్మితమై దివ్యకాంతులను వెదజల్లుతోంది. చిరుగంటలున్నాయి. దానిలోవున్న స్తంభాలు కిటికీలన్నీ మణులతోను

వజ్రవైదూర్యాలతోను పొదిగి ఉన్నాయి. శిరోభూషణాలున్న హరిత వర్ణ అశ్వాలు చిత్రంగా ఆ రథానికి పూన్చివున్నాయి. రథంపై ధ్వజం కూడ బంగారంతో అలంకృతమై ఉంది. సురరాజు పంపిన దివ్యరథాన్ని రాముడు చూశాడు. దేవతల అభీష్టాన్ని తెలుసుకున్నాడు. వారి కోరిక ననుసరించి శ్రీరాముడు మాతలి సారథ్యంలో ఉన్న మహేంద్రుని దివ్యరథానికి నమస్కరించాడు. శ్రీరాముడు ఆశ్చర్యానందాలతో చూస్తున్నాడు. అపుడు మాతలి 'శ్రీరామా! దివ్యగుణ సంపన్నా! మీ విజయం కోరుతూ దేవేంద్రుడు మీకు దీన్ని సమర్పించారు' అని మాతలి శ్రీరామునికి చెప్పాడు. వెంటనే శ్రీరాముడు రథాన్ని అధిరోహించాడు.

## రామరావణ యుద్ధం

రామరావణుల మధ్య సంకుల సమరం మొదలైంది. ఆ ఇద్దరు వీరులు అతి భయంకరంగా వీరోచితంగా పోరాటం చేస్తున్నారు. దివ్యాస్త్రవిదుడైన రఘువీరుడు రాక్షసరాజు ఇద్దరూ అస్త్రసంధానం చేస్తున్నారు. వారిద్దరూ దివ్యాస్త్రాలను గాంధర్వాస్త్రాలను ప్రయోగించారు.

ప్రతి అస్త్రాన్ని నిర్వీర్యం చేసే రాముణ్ణి చూచి రావణుడు కోపోద్రిక్తుడయ్యాడు. ఇలాకాదని విషసర్ప రూపంలో వున్న రాక్షసాస్త్రాన్ని రామునిపై రావణుడు ప్రయోగించాడు. తనవైపు వేగంగా పరిగెత్తివచ్చే ఆ రాక్షసాస్త్రంపై రాముడు గరుడాస్త్రాన్ని వేశాడు. సర్పశత్రువైన గరుడరూప అస్త్రం సర్పరూప అస్త్రాలన్నింటిని వమ్ముచేసింది. వేలకొలది బాణాలతో రావణుడు రాముణ్ణి బాధించాడు.తన బాణ పరంపరతో మాతలినీ గాయపర్చాడు.

రావణుడు విజృంభించి రాముని రథ ధ్వజాన్ని నేలకూల్చాడు. బాణ ప్రయోగంతో రథాశ్వాలను గాయపర్చాడు. ఇలా రావణుడు రాముని రథాశ్వాలు గాయపర్చడం చూచి దేవతలు కలత చెందారు. మహర్షులు, సిద్ధులు గంధర్వాదులు వానర ప్రముఖులు విభీషణాదులు చూసి బాధపడ్డారు.

కోసల రాజుల నక్షత్రం విశాఖ. దానికి అధి దేవతలు ఇంద్రాగ్నులు. ఆకాశంలో అంగారకుడు విశాఖను ఆక్రమించాడు. పది తలలున్న రావణుడు ధనుస్సు చేపట్టి రామునిపై శరవర్షాన్ని కురిపించాడు. రాముడు శరసంధానం చేయలేక క్రోధమూర్తి అయ్యాడు.

రథాశ్వాలను బాధించిన రావణుడిని చూచి రాముడు కుపితుడయ్యాడు. రౌద్రాకారుడైన రాముని చూచి ప్రాణులన్నీ గడగడలాడాయి. పర్వతాలతో వృక్షాలతో వున్న త్రికూట పర్వతం చలించింది. పక్షులు అశుభ సూచకంగా అరుస్తూ తిరిగాయి. మేఘాలు గర్జించాయి. శ్రీరాముని కోపంతో కలుగబోతున్న దారుణమైన ఉత్పాత చిహ్నాలను చూసి లోకాలు అశాంతికి గురయ్యాయి. రావణుడు కూడా అదిరిపాటుకు లోనయ్యాడు.

రామరావణులు మళ్లీ విజృంభించి పోరాడుతున్నారు. వారిద్దరి పోరు లోక ప్రళయం సృష్టిస్తుందా అన్నట్లుగా సాగుతోంది. దేవతలు, దానవులు, యక్షులు, గంధర్వులు, సిద్ధులు, మహర్షులు అందరూ ఉత్కంఠతో రణాన్ని చూస్తున్నారు. రావణుని పక్షంవారైన అసురులు 'రావణునకు జయం' అని అరుస్తున్నారు. దేవతలు, సాధువులు శ్రీరామచంద్ర ప్రభువుకు జయధ్వానాలు చేస్తున్నారు.

దుర్మార్గ రావణుడు శ్రీరాముని చంపివేయాలని అనుకొన్నాడు. వెంటనే ఒక మహాబలమైన శత్రువులను తుదముట్టించే ఆయుధాన్ని పట్టుకొన్నాడు. రుద్రుని త్రిశూలాన్ని మించిన పదునైన ఆయుధమది. దేనినైనా రెండుగా చీల్చివేసే శక్తివున్న శూలాన్ని క్రోధావేశంతో రావణుడు చేతిలోకి తీసుకొన్నాడు.

రావణుడు శూలం మధ్య భాగం పట్టి పైకెత్తాడు. అతనిచుట్టూ చేరిన పర్వతాకారులైన రాక్షసులు భయంకరంగా అరిచారు. శూలాన్ని చేతబట్టిన రావణుడు దిక్కులన్నీ ఆవిరైపోయేలాగ సింహనాదం చేశాడు. భీకరంగా గర్జించి రావణుడు 'ఓ రామా! ఇదుగో ఈ వజ్రాయుధతుల్యమైన శూలాన్ని నీపై వేస్తున్నాను.

ఇది మీ సోదరులిరువురిని కడతేర్చివేస్తుంది. రణగర్వితుడివైన రామా! ఈ అభేద్యమైన ఈ శూలంతో మిమ్ములను చంపి, నా వారిని చంపిన నీపై నా పగ తీర్చుకొంటాను. నా అనుచరులకు ఆత్మశాంతిని కలిగిస్తాను. ఈ శూలంనుంచి తప్పించుకోలేవు కాచుకో' అంటూ రావణుడు రామునిపై శూలాన్ని విసిరాడు.

విద్యుత్కాంతి ప్రభలను వెదజల్లుతూ ఆకాశమార్గాన వచ్చే ఆ శూలాన్ని రాముడు చూశాడు. ఏమాత్రం జంకుగొంకులేక తన ధనుస్సు నుండి శరవర్షాన్ని కురిపించాడు. తన శరాలతో ఆ శూలాన్ని నివారించాడు. రాముని బాణాలు రావణుని శూలం గగనాన ఢీకొని రాముని శరాలు నిర్వీర్యమయ్యాయి. రాముడు కోపావేశుడు అయ్యాడు. దేవేంద్రుడు పంపించిన బల్లెం తీశాడు. అది చిరుగంటల సవ్వడితో యుగాంతాన కనిపించే తోకచుక్కలాగా మిరుమిట్లు గొలిపే కాంతితో ఉంది. దాన్ని రావణుని శూలంపై రాముడు ప్రయోగించాడు.

రావణుని శూలాన్ని శక్తి తేజోవిహీనం చేసింది. తాను కూడా తేజస్సు పోగొట్టుకుంది. ఆ రెండు ఆయుధాలు నేలపై జారిపోయాయి. రాముడు శరవర్షాన్ని రావణునిపై కొనసాగిస్తూ రావణుని రథాశ్వాలను కూల్చివేశాడు. మూడు బాణాలతో రావణుని వక్షస్థలాన్ని, లలాటాన్ని గాయపర్చాడు. రాముని బాణ ప్రహారాలకు రావణుని అవయవాలన్నీ గాయపడి రక్తాన్ని స్రవించసాగాయి.

రాముని వలన రావణుడు రక్తసిక్త దేహుడు అయ్యాడు. అవయవాలన్నీ గాయాలతో రక్తం ఓడుతున్నాయి. అప్పుడు తన శరీరాన్ని రాముని పరాక్రమాన్ని చూసి రావణుడు సమరాంగణంలో అసహనంతో కుమిలిపోయాడు.

* * *

# రణానికి దూరమైన రావణుడు

## సర్గ - 103

**రా**మరావణుల పోరు భయంకరంగా సాగుతోంది. ఇద్దరు వీరులు ఒకరినొకరు శరవర్షాలలో రక్తసిక్తులవుతున్నారు. శ్రీరాముని బాణవర్షంలో రావణుడు బాగా దెబ్బతిని క్రోధం పెంచుకున్నాడు. రావణుని శరాఘాతాలలో రాముని వక్షస్థలాన్ని బాగా దెబ్బతీశాడు. అయినా ఏమాత్రం జంకుగొంకు లేక రాముడు రావణుని పీడించడానికి శరపరంపరను కొనసాగించాడు.

వారిద్దరి శరాలు గగనాన నిలిచి ఉండడంతో సమరభూమి అంతా చిమ్మచీకట్లు ఆవరించాయి. దశరథ నందనుడు కాని, ఇంద్రజిత్తు తండ్రి కాని, అక్కడ ఒకరికొకరు కనిపించకుండా పోయారు.

రాముడు కుపితుడై రావణుని పరుషపు మాటలతో బాధించాడు. 'రాక్షసాధమా! నీవు నేను ఇంట్లో లేనపుడు నా భార్యను మాయచేసి తీసుకెళ్లావు అపుడే నాకు నీ వీరత్వం అర్థం అయ్యింది. మరల ఈరోజు నీకు నీవు శూరుడవని చెప్పుకొంటున్నావు. కపటోపాయాలచేత నీవు చేసే యుద్ధాన్ని చూసి నీ ప్రవర్తన తెలిసిన నేనే కాదు ఎవ్వరైనా నిన్ను శూరమ్మన్యుడివని, దుష్ప్రవర్తనుడివని అంటారు కాని, శూరశ్రేష్ఠుడివని ఎవ్వరూ అనరు. నీవు చెడుమార్గాన్ని తొక్కి నీ మృత్యువును నీవే ఆహ్వానించుకొన్నావు. సచ్చరిత్రకు దూరమైన నీవు వధార్హుడివి.

రావణా! కుబేరుని తమ్మునిగా కలిగి, ఘనమైన సంపదలు ఉంచుకొని నీవు అపకీర్తిని బాగా పెంచుకొన్నావు. నీలో గర్వం అతిశయించింది. అందువలనే నీ బుద్ధి పెడదారి పట్టింది. మంచి చెడుల విచక్షణను కోల్పోయిన నీవు అకృత్యాలను ఎన్నో చేశావు. వాటి అన్నింటికీ పరాకాష్ఠగా నీవు నా సీతను అపహరించావు. పరస్త్రీల వ్యామోహం చెందే నిన్ను దుష్టునిగా ఎంచుతారు. సిగ్గుమాలిన పనులను చేసిన నీవు వాటి ఫలాలను నేడు పొందుతున్నావు.

నా సీతను అపహరించే సమయంలో అక్కడే నేను ఉంటే నిన్ను కూడా నీ సోదరుని దగ్గరికి అప్పుడే పంపి ఉండేవాడిని. నేడు నీ పాపం పండింది. నేడు నా కంటిచూపును తప్పించుకొని నీవు ఎక్కడికీ పోలేవు. నిన్ను నా బాణ ప్రహారాలతో శిక్షిస్తాను. కుండలాలతో అలరారే నీ శిరస్సును ఖండించివేస్తాను. తలనుంచి వేరైన మొండెంలోని వక్షస్థలంపై కాకులు గ్రద్దలు కూర్చుని తనివితీరా నీ రక్తాన్ని త్రాగి నీ ప్రేగులను తీసుకెళ్తాయి' అని శ్రీరాముడు పరుషపు మాటలతో రావణుని తూలనాడాడు.

తర్వాత రాముడు శరాలను రావణునిపై వేయడం మొదలుపెట్టాడు. రాముని అస్త్ర పాటవం, శౌర్య పరాక్రమం, రణోత్సాహం రెట్టింపయ్యాయి. ఇంతకుముందుకన్నా రెట్టించిన వేగంతో శత్రు భయంకరుడైన రాముడు రావణునిపై బాణ ప్రయోగాలు చేస్తున్నాడు. రావణునిలో చిత్తవైకల్యం కలిగింది. ఇంతకుముందు జరిగిపోయిన సంగతులు తలచుకొన్నాడు. వానరుల యుద్ధం, శ్రీరాముని రెట్టించిన యుద్ధపటిమ చూచి తనకు అవసానకాలం వచ్చిందనే ఆలోచనలతో రావణుడు వ్యాకులచిత్తుడయ్యాడు. రావణుడు శస్త్రాలు ప్రయోగిస్తున్నాడు కాని, అవి ప్రయోజన శూన్యంగా ఉన్నాయి. చాలా ప్రయత్నం చేసి రావణుడు బాణాలు వేస్తున్నాడుకానీ అవి వ్యర్థమవుతున్నాయి. దాన్నిచూచి రథసారథి తన యజమాని వ్యాకులంగా ఉన్నాడని గ్రహించాడు. అధైర్యం ఆవహించిందేమోనని రావణుని తేరిపారా చూశాడు. అన్యమనస్కంగా బాణాలు పట్టుకున్న రావణుడు గమ్యం మరిచిన బాటసారిలాగా సారథికి కనిపించాడు. ఎందుకైనా మంచిదని తన యజమానిని రక్షించుకోవాలి అనుకున్నాడు. తన కర్తవ్యాన్ని ఆలోచించాడు. రావణుని రథసారథి రథాన్ని తోలుకొని రణభూమికి దూరంగా వెళ్లాడు.

* * *

# రావణుని పునః ప్రవేశం

## సర్గ - 104

కొద్దిసేపటికే రావణుడు వ్యాకుల చిత్తంనుంచి తేరుకొన్నాడు. మృత్యు ప్రేరితం వలన రాముని చంపాలని అనుకొన్నాడు. రామునికోసం చుట్టూ చూశాడు. అప్పుడు పరిస్థితి తెలిసి సారథిపై క్రుద్ధుడయ్యాడు. 'ఓయీ బుద్ధిహీనుడివైన సారథీ! నన్ను రణభూమి నుంచి దూరంగా తీసుకొని వచ్చి అవమానించావు. నేను శస్త్రాలు ప్రయోగించలేనివానిగా తలచావు. నీవు ఇలా తీసుకొని రావడం వలన నా శత్రువులు నన్ను వెన్ను చూపి పారిపోయిన పిరికివాణ్ణిగా తలుస్తారు కదా!

రావణుడు అత్యంత పరాక్రమశాలి అని నమ్మే లోకులకు నాపై అవిశ్వాసం కలిగేటట్లుగా చేశావు. దుర్మతీ! నీవు శత్రుపక్షం ప్రలోభాలకు లొంగి ఈ పని చేశావా? నీవు ఎంతకాలం నుండి నా ఉప్పు తింటున్నావు? నేను ఎన్నడైనా ఇలా వెన్నుచూపి వెనక్కురావడం చూశావా? నా హితం కోరే ఎవరైనా ఈ పనిని చేయలేరు. నీవు నిజంగా నా మిత్రునివే అయితే త్వరగా రథాన్ని మళ్లించి నా శత్రువుల ఎదురుగా నిలబెట్టు' అని వ్యాకులుడైన రావణుడు సారథిని పరుషంగా మాట్లాడాడు.

రాజు హితాన్నే కోరే రథసారథి రావణుని క్షమించమని అడిగాడు. తాను ఏ పరిస్థితుల వలన రణభూమికి దూరంగా మహారాజును తీసుకొచ్చాడో చెప్పాడు. 'ప్రభూ! నేను ఏమాత్రం ప్రలోభాలకు లొంగలేదు. నేను మీ హితం కోరేవాణ్ణే. నేను మీరు నాకు చేసిన ఏ ఉపకారాన్ని మరువలేదు.

ప్రభూ! నేను చేసిన పని మీకు అసంగతమైనదిగా కనిపించినా నా ధర్మాన్ని నేను ఆచరించాను. నేను స్నేహభావంతోనే మిమ్ములను తీసుకొని వచ్చాను. మీ కీర్తి ప్రతిష్ఠలు పెరగడానికే నేను కృషి చేస్తాను ప్రభూ! నన్ను మీరెప్పుడు అల్పబుద్ధివానిగాను దుష్టునిగాను తలచకండి. రాక్షస రాజా! అసలు నేను మిమ్ములను ఎందుకు ఇలా తీసుకొచ్చానో చెప్తాను వినండి' అంటూ సారథి రావణునితో 'స్వామీ! మీరు యుద్ధరంగంలో బాగా అలసి శత్రుపక్షంపై బాణం వేయలేని స్థితిలోకి జారిపోయేరు. పైగా, మనలను అపశకునాలు బాధించాయి. రథసారథి కాలమాన పరిస్థితులతో పాటుగా, రథంలో ఉన్న వీరుని ముఖప్రసన్నతను కూడా గమనించాలి గదా! నేను అదే చేశాను. మీ ముఖంలో యుద్ధ విముఖత ప్రస్ఫుటంగా కనిపించింది. దానివలన నేను మిమ్ములను దూరంగా తీసుకొచ్చాను. అని రావణునికి రథసారథి చెప్తున్నాడు.

'ప్రభూ! మిమ్మల్ని దైన్యం ఆవరించింది. మీరు సమరాన్ని గూర్చి కాక జరిగిపోయిన వాటి గురించి ఆలోచిస్తున్నట్లు కనిపించారు. లోకాన్నే భయపెట్టగలిగిన మీరు నిస్సహాయ స్థితిలో శత్రువులకు దొరకకూడదనే ఉద్దేశ్యంతో ఇలా చేశాను. మీరు యుద్ధంలో బాగా అలసిపోయారు. మనకు ఎదురౌతున్న సంఘటనలకు ఎదురొడ్డి మీరు కనుక నిలిచారు. కానీ, మీ హృదయం బాగా డస్సిపోయింది.

రథాశ్వాలు సైతం బాగా అలసిపోయాయి. మీకు కూడా విశ్రాంతి అవసరమని నాకు అనిపించింది. మీరు విశ్రాంతి తర్వాత శత్రువులతో రెట్టించిన ఉత్సాహంతో పోరు చేస్తారనే భావంతో నేను ఈ పని చేశాను.

ప్రభూ! శత్రు సంహారకా! నేను చేయవలసిన పనిని మీరు ఆజ్ఞాపించండి. నేను మీ మాటను శిరోధార్యంగా భావించి త్రికరణశుద్ధితో చేస్తాను. నాకు మీ మాటే వేదవాక్కు. మీరు నాకు, నా ప్రాణానికన్నా మిన్న. మీకు ఏ ఆపదా రాకుడదనే నేను ఈ పనికి పూనుకొన్నాను' అని అంటున్న రథసారథి మాటలతో రావణుడు సంతృప్తి చెందాడు. సారథిని కొనియాడాడు.

ఓహో! నీవు చెప్పుతున్నది బాగానే ఉంది. కాని, ప్రతిపక్షం వారు నీలాగా ఆలోచించరు కదా! వారు నేను పారిపోయానని అనుకొనే ప్రమాదం ఉంది. అందుకే త్వరపడు. నీవు చేసిన దానికి నేను ఎంతో సంతోషిస్తున్నాను. నీవు రాముని ఎదురుగా ఇప్పుడు రథాన్ని నిలుపు. నీ ప్రభువు రణరంగంలో శత్రు శేషాన్ని మిగల్చకుండా చేస్తేగాని నిద్రపోడు. ఆ రామలక్ష్మణులను హతమార్చే నేను లంకలో అడుగుపెడ్తాను. నా ప్రతాపం చూపి నా వైరివర్గాన్ని నాశనం చేస్తాను' అని రావణుడు సారథితో చెప్పి తన వేలి ఉంగరాన్ని బహూకరించాడు. రావణుని మాటలకు సారథి ఆనందించాడు. రావణుని కోరికను తీర్చాలని తలచాడు. వెంటనే రాక్షస రాజు రథాన్ని వేగంగా పయనింపచేశాడు. వానరులను, రాక్షసులను తప్పించుకుంటూ ముందుకు వెళ్ళి రాముని ఎదురుగా రథాన్ని నిలిపాడు. ఇరుపక్షాల వీరులు సమరోత్సాహంతో రామరావణులను చూస్తున్నారు.

* * *

# ఆదిత్య హృదయం

## సర్గ - 105

**యు**ద్ధంలో రాముడు చాలా అలసిపోయాడు. శత్రు సంహారం జరగలేదని చాలా చింతకు లోనయ్యాడు. ఆ స్వామి చెంత రావణుడు తిరిగి రణోత్సాహియై నిలబడి ఉన్నాడు. ఆ రామరావణుల యుద్ధం చూడడానికి దేవతలు, గంధర్వాదులు, సిద్ధులు, మహర్షులు ఆకాశాన నిలిచారు. రాముణ్ణి చూసిన అగస్త్యునకు రామునితో మాట్లాడాలనిపించింది. వెంటనే అగస్త్య మహర్షి రాముని దగ్గరకు వచ్చాడు.

'శ్రీరామా! మహాబాహూ! నీకు విజయం చేకూర్చే అతి రహస్యమైన ఒక స్తోత్రాన్ని నీకు చెప్తాను విను'అని అన్నాడు. 'శ్రీరామా! ఇది ఆదిత్యుని ఉద్దేశించినది. నీవు దీన్ని జపిస్తే నీ శత్రువులను నీవు నిరాటంకంగా ఎదుర్కోగలవు. ఈ స్తోత్రరాజం చాలా పవిత్రమైనది. సూర్యుడు నీకు అక్షయ సంపదలను ప్రసాదిస్తాడు. దీన్ని నియమ నిష్ఠలతో తదేక ధ్యానం చేస్తే తప్పక సర్వత్రా జయం సిద్ధిస్తుంది.

ఈ ఆదిత్య హృదయం జపించితే అధివ్యాధులను నశింపజేస్తుంది. సమస్త పాపరాశులను బూడిదగా చేస్తుంది. ఆయుస్సును వృద్ధిపరుస్తుంది. సర్వజపాలలో ఇది శ్రేష్ఠమైనది. ఇది జపించడం అవశ్యకం.

సూర్యుడు ప్రతి ఉదయం తన బంగారు కిరణసమూహాలచేత జాతిని జాగృతం చేస్తున్నాడు. సకల తేజస్సులను మించిన తేజోవంతుడు. ఈ దివ్యతేజోమూర్తికి దేవాసురులందరూ ప్రణమిల్లుతారు. సమస్త ప్రాణులకు ఆధారభూతుడైన సూర్యభగవానుని పూజించుకోవడం శ్రేయోదాయకమైన పని.

ఈ సూర్యుడు సర్వదేవతలకు ఆత్మఅయినవాడు. సమస్త దేవతా స్వరూపాలన్నీ కూడా భాస్కరునివే. దినకరుడు తన కిరణాలతో సమస్త లోకాలకు శక్తిని, స్ఫూర్తిని ప్రసాదించే తేజస్వి. తన ప్రతాపంతో ఎల్లెడల దైవీయ గుణాన్ని పెంచుతూ, అసుర శక్తులను నాశనం చేస్తాడు. షడృతువులకు కారకుడైన వాడు భానుడే.

బ్రహ్మ విష్ణు శివులనే త్రిమూర్తుల రూపాలకు కారకుడు సూర్యభగవానుడే. వీరే కాక కుమారస్వామి ప్రజాపతి, దేవేంద్రుడు, కుబేరుడు, కాలస్వరూపుడు, యముడు, సోముడు, వరుణుడు, పితృదేవతలు, వసువులు, సాధ్యులు, అశ్వినీ దేవతలు, మరుత్తులు, మనువు, వాయువు, అగ్ని, ప్రజలు ఇలా అన్నింటి స్వరూపాలూ ప్రభాకరునివే. 'ఆదిత్యః' ఇతడు అదితి పుత్రుడు. జగత్సృష్టికి మూలహేతువు. జనులు తమ కర్తవ్య పాలన చేయడానికి ప్రేరణనిచ్చేవాడు కూడా దినకరుడే. సూర్యుడు తన కిరణాలతో లోకాన్ని ప్రకాశింపజేస్తూ ఆకాశాన సంచరిస్తూ లోకాలకు పుష్టినివ్వడానికి వర్షాన్నిస్తాడు.

సువర్ణ వర్ణాంకితుడు. బ్రహ్మాండాల ఉత్పత్తికి బీజప్రాయుడు అత్యద్భుతంగా ప్రకాశమానుడై గగనాన విరాజిల్లుతున్నాడు. పగలు ప్రజలను కార్యోన్ముఖులను చేస్తూ దివాకరుడు శ్యామవర్ణ రథాశ్వాలతో సంచరిస్తుంటాడు. ఇతని రథాశ్వంపేరు సప్త. ఏడు గుర్రాలను కలిగి కూడా ఉంటాడని ప్రసిద్ధి. తేజోవంతమైన కిరణాలతో చీకట్లను పారద్రోలుతాడు.

అంధకారాన్ని పారద్రోలి ప్రాణుల హృదయాలలో సుఖాన్ని కలిగించువాడు. సర్వ సంహారకుడైన ఈ సూర్యుడు జగత్ప్రళయం తర్వాత మరల సృష్టిని ఆవిర్భవింపజేసేవాడు. బ్రహ్మాండానికి చైతన్య కారకుడు. నిరంతరం తన కిరణాలతో జగత్తును ఉద్దీప్తం చేస్తూ తన ఉదరంలోనే బ్రహ్మాండాలను ధరిస్తాడు.

ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మికాలనే బాధలలో కొట్టుమిట్టాడేవారిని దరిచేర్చుకొని శాంతిని ప్రసాదించేవాడు. తపింపచేసేవాడు వెలుగులను ప్రసాదించేవాడూ సూర్యుడే. పగటిపూట అగ్నిని తన గర్భంలో దాల్చేవాడు అదితి పుత్రుడయ్యాడు. సాయంకాల సమయానికి తనకు తానే శాంతించువాడు. మంచును తొలగించే శిశిర నాశనుడు. ఆకాశానికి అధిపతియైన సూర్యుడు తిమిరాంధకారాన్ని పారద్రోలుతాడు. జ్ఞానాన్ని పెంచేవాడు. ఋగ్యజుస్సామాలను పఠించినవాడు. ఆ మూడు వేదాల స్వరూపుడు కూడా సూర్యుడే. ప్రొద్దున్నే ఋగ్వేద రూపాన్ని మధ్యాహ్నానికి యజుర్వేద రూపాన్ని సాయంత్రానికి సామవేద రూపాన్ని సంతరించుకొనే దిట్ట. సూర్యుడు వర్షాన్నిచ్చే దేవుడిగా ప్రఖ్యాతి చెంది ఉన్నాడు. వింధ్యగిరి ప్రాంతంలో వేగంగా సంచరించేవాడు. సర్వప్రాణులకు ఇష్టమైనవాడు.' అంటూ సూర్యుని గొప్పతనాన్ని అగస్త్యుడు చెప్తున్నాడు.

ఉదకాలకు ప్రియమైనవాడు. వృత్తాకారంలో ఉండి తాపాన్ని కలిగించేవాడు. విరోధులను రూపుమాపేవాడు. పండితుడైన సూర్యుడు ప్రాతఃకాలంలో పింగళివర్ణంలో జనులకు ఆనందాన్ని కలిగిస్తాడు. మధ్యాహ్న సమయంలో సర్వప్రాణులను తపింపచేస్తాడు.

సర్వ ప్రాణులపై అనురక్తి కలిగిన సూర్యభగవానుడు సమస్త విశ్వ నిర్వాహకునిగా ఉన్నాడు. వ్యాకరణాది సమస్త శాస్త్రాల సారాన్ని ఔపోసన పట్టి గొప్ప తేజస్సు ఉన్నవాడు. సమస్త ప్రాణికోటి ఉత్పత్తి కారణభూతుడు

నక్షత్ర, గ్రహ, తారలకు అధిపతి ఐనవాడు దినకరుడు. అగ్న్యాది తేజస్సులకు మించిన తేజస్సున్న సూర్యుడు విశ్వస్థితికి హేతువు. పన్నెండు రూపాలలో ప్రసిద్ధి పొందిన ద్వాదశాదిత్యులకు నమస్కారం చేయాలి.

“సూర్యనారాయణస్వామీ! నీవు పూర్వ పశ్చిమ గిరులలో విలసిల్లేవానివి. జ్యోతిర్గణాలకు మూలమైన వానివి. దివారాత్రాలకు అధిపతివి, ఉపాసకులకు జయం కూర్చేవానివి, శ్యామ వర్ణాంకిత అశ్వాలున్న రథాలలో తిరుగుతూ వేలకొలది కిరణాలను ప్రసరింపజేస్తూ సమస్త జగత్తును రక్షించువానివి. అదితి పుత్రునివైన ఓ దినకరా! నీకివే నా నమస్కారం.

శీఘ్రంగా ప్రయాణిస్తూ పద్మాలను వికసింపజేసే ధీరోదాత్తుడవు. నీవు శత్రువులకు భయంకరుడవు. నిన్ను ఆశ్రయించినవారికి సర్వ సంపదలను చేకూర్చే వాడివి. సృష్టిని సృజించడానికి హేతువు నీవే. త్రిమూర్తి స్వరూపునివి. పరబ్రహ్మ స్వరూపునివి. కాంతినిధివి, దివ్యతేజోవంతునివైన నీవే ప్రళయకాలంలో లయకారునివి అవుతావు. ఓ రుద్రరూపా! నీకిదే నా వందనం.

స్వామీ! నీవు జడత్వాన్ని శీతలత్వాన్ని దూరం చేసేవానివి. సూర్యభగవానునివైన నీవు తమస్సును అంతమొందించగలవు. ఉపాసకులలో కామక్రోధ లోభ మోహ మద మాత్సర్యాలను తుడిచిపెట్టే గొప్పవానివి పరమాత్మ స్వరూపునివైన నీవు కృతఘ్నులను రూపుమాపివేస్తావు.

అంతర్బహిశ్శత్రువులను నాశనం చేసేవానివి. దివ్య తేజస్సులను విరజిమ్ముతూ సమస్త జ్యోతిస్సులకు అధిపతివి. పరమాత్మ స్వరూపా! నీవు అగ్ని రూపంలో ఆహుతులను గ్రహిస్తావు. సమస్త జగత్తు కార్యాలకు కర్మసాక్షివి నీవే. సర్వ జగత్కర్తవు! నీకివే నమస్సులు” అని సూర్యభగవానుని మహర్షి స్తుతించాడు.

“రఘునందనా! నారాయణుడే సమస్త ప్రాణుల సృష్టి స్థితిలయాలకు కారణభూతుడు. తన కిరణాలతో సమస్త జగత్తును ప్రేరేపిస్తూ తపింపచేస్తుంటాడు. సకల ప్రాణుల అంతర్యామిగా వెలుగొందుతాడు. సర్వ ప్రాణుల జీవ చైతన్య స్వరూపుడు. సూర్యుడు వేదవేద్యుడు, యజ్ఞ స్వరూపుడు, యజ్ఞఫల స్వరూపుడు కూడా.

రఘురామా! ఆపదలలోను, భయంలోను, దుర్గమారణ్యంలోను సర్వకాల సర్వావస్థలయందు సూర్యుని జపించిన వారికి నాశం ఉండదు. దేవదేవుడు జగత్పతి అయిన సూర్య భగవానుణ్ణి ఏకాగ్రతతో పూజించు. ఈ ఆదిత్య హృదయాన్ని మూడుసార్లు జపిస్తే మహా సంగ్రామంలో విజయం నీ సొంతం అవుతుంది. రామా! నీవు దీన్ని ఇపుడే పఠించు. నీవు ఈ దుష్ట రావణుణ్ణి వధించి తీరుతావు” అని అగస్త్య మహర్షి శ్రీరామచంద్రునకు ఆదిత్య హృదయం ఉపదేశించి తన స్థానానికి వెళ్లాడు.

శ్రీరాముని హృదయం అగస్త్యుడు బోధించిన ఆదిత్య హృదయం విని సంతోషంతో ఉప్పొంగింది. తన మనస్సులో సూర్య స్తోత్రాన్ని నిలుపుకొన్నాడు. ఏకాగ్రతతో రాముడు ఆచమించి ముమ్మారు ఆదిత్య హృదయాన్ని సూర్యుని ఎదురుగా పఠించాడు. ఆ తర్వాత కోదండం చేపట్టి యుద్ధానికి కదిలివెళ్ళాడు. దేవతలందరూ రావణుడు నశించడం తథ్యమని అనుకొన్నారు. వారందరూ రాముణ్ణి చూసి సంతోషించారు.

* * *

# శకునాపశకునాలు

## సర్గ - 106

రావణుని ఆజ్ఞతో రథసారథి వేగంగా రథాన్ని నడిపి రామునికి అభిముఖంగా నిలిచాడు. శత్రు సైన్యాలను అణిచివేసే గంధర్వ నగరంలాగా ఆశ్చర్యజనకంగా ఉందా రథం. యుద్ధోపకరణాలు ఉత్తమాశ్వాలు, సద్బుద్ధి ఐన అశ్వికుడు, ఆకాశాన్ని తాకేటట్లున్న ధ్వజాలతో ఆ రథం సుసంపన్నంగా ఉంది.

పెద్ద ధ్వని చేస్తూ శత్రువులకు దడ పుట్టించేదిగా ఉన్న రావణుని రథం ముందుకు రావడం రాముడు చూశాడు. నల్లని అశ్వాలు చూడటానికే భయంకరంగా ఉన్నాయి. రథ పతకాలు విద్యుత్కాంతులను ప్రసరిస్తున్నాయి. వజ్రాయుధ తుల్యమైన ఆయుధాలు నిండుగా ఉన్నాయి. అన్నీ చూచిన రాముడు తన ధనుస్సును అర్ధచంద్రాకారపు శరాన్ని ఎక్కుపెట్టాడు. ధనుష్టంకారం చేశాడు. ఆ ధ్వని పర్వతాలను సైతం కదిలించిందా అన్నట్లుగా ఉంది.

శ్రీరాముడు మాతలితో 'సారథీ!రావణుని రథం చూడు అది అపసవ్యంగా యుద్ధరంగానికి వస్తోంది. అంటే రావణుడే తన చావును నిశ్చయించుకొని వస్తున్నట్లుగా ఉన్నాడు. నీవు సవ్యంగా సాగుతూ ముందుకు వెళ్లు' అని రాముడు చెప్పాడు. 'మాతలీ! నేను శత్రువును వధించాలని తీర్మానించుకొన్నాను. నీవు ఏ మాత్రం ఏమరుపాటు లేకుండా దైన్యానికి ఎక్కడా తావు ఇవ్వకుండా గుర్రాలను నీ అదుపు ఆజ్ఞలలో ఉంచుకొని రథాన్ని నడుపు' అని శ్రీరాముడు తన రథసారథి అయిన మాతలితో చెప్పాడు.

'మాతలీ! నేను ఏకాగ్రతతో యుద్ధం చేయాలనుకొన్నాను. అందుకే నేను నీకు ఇవన్నీ చెప్పాను. నీవు వేరే విధంగా ఆలోచించకు. నీకు నేను బోధిస్తున్నానని అనుకోకు. ఇంద్రుని రథసారథివైన నీకు ఇవన్నీ బాగుగా తెలిసే ఉంటాయి. కానీ, నా ముందు జాగ్రత్తకొద్దీ నీకు చెప్పుతున్నాను' అని కూడా రాముడు చెప్పాడు.

మాతలి రాముని మాటలకు పొంగిపోయాడు. వెంటనే రథాన్ని ముందుకు సాగనిచ్చి రావణుని రథానికి కుడివైపుగా తీసుకెళ్ళాడు. దానితో ఆ రథపు చక్రాలవలన రేగిన దుమ్ము రావణుని కండ్లను కప్పివేసింది. ఏమీ కనిపించకుండా చేసిన రామునిపై రావణుడు క్రుద్ధుడు అయ్యాడు. వెంటనే తన శరాలను కురిపించాడు. రాముడు ఇంద్రుడు ప్రసాదించిన శరాలను రావణునిపై ప్రయోగించాడు.

ఆ ఇద్దరూ మహాయోధులు శరాలతో తలపడ్డారు. ఇద్దరికిద్దరూ వేరొకరిని చంపాలన్న ఆలోచనలతో ఉవ్విళ్ళూరుతున్నారు. ఇద్దరూ కోపావేశంలో మించిపోయారు. రెండు సింహాలు పోట్లాడుకొన్నట్లుగా వారి పోరు మహాభయంకరంగా సాగింది.

సారథితో చెప్పి మరల రావణుడు సమరాంగణపుమధ్యలోకి వచ్చాడు. రాముని బాణాలు రావణుణ్ణి బాధిస్తున్నాయి. కాని, రాముని గెలవాలనే తలంపుతో రామునిపై శరవర్షం కురిపించాలని, చూస్తున్నాడారావణుడు. రావణుని వినాశనాన్ని కోరే దేవగణాలు, సిద్ధులు, మహర్షులు ఒక చోట గుమిగూడి చూస్తున్నారు.

ఘోరమైన అపశకునాలు ఎదురయ్యాయి. వర్షాధి దేవత ఐన మహేంద్రుడు రక్తపు వర్షధారలను రావణుని రథంపై కురిపించాడు. సుడిగాలులు అప్రదక్షిణంగా తీవ్రంగా వీస్తున్నాయి. రావణుడు కదిలిన స్థలాలలో అంతా గ్రద్దలు, కాకులు తిరుగుతున్నాయి. ఇవన్నీ రావణునికి అపశకునాలుగా కనిపించాయి. లంకలో ఉల్కలు నేలకు జారాయి. పగటిపూటే మంకెన పూలు లంకనంతా వ్యాపించాయి. మేఘాల రాపిడి ధ్వని భయంకరంగా ఉంది. పిడుగులు రాలుతున్నాయి. ఇవన్నీ చూసిన లంకావాసులు రాక్షస రాజు మరణం తప్పదనుకొన్నారు.

రావణుని రథం ఆగిన ప్రదేశంలో భూమి కంపిస్తోంది. రాక్షస యోధుల బాహువులు ఎవరో కట్టేసినట్లుగా అయ్యాయి. సూర్యకిరణాలు రావణుని శరీరంపై పడి వివిధ రంగుల ధాతువుల్లాగా కనిపించాయి. రావణుని రథానికి ఎదురుగా ఆడు నక్కలు పెద్దగా ఊళలు వేశాయి. గ్రద్దలు అమంగళకరంగా కూశాయి. వాయువుల వీచే వేగానికి రణభూమిలోని దుమ్ము లేచి రావణుని కప్పివేస్తోంది.

పిడుగులు పడుతూ, ఉల్కలు రాలుతూ ఆకాశం అంతా మేఘావృతం అయ్యి చిమ్మ చీకట్లు ఆవరించాయి. గోరువంకలు పోట్లాడుతూ రావణుని రథధ్వజంపై వ్రాలాయి. రథాశ్వాలు అశ్రువులను కార్చాయి. అవి ఒకేసారి నిప్పును నీళ్ళను వెదజల్లాయి.

ఈ విధంగా రావణునికి అపశకునాలు అడుగుడుగునా కనిపించాయి. రామునకు అవన్నీ జయం కూర్చే శుభశకునాలు అయ్యాయి. అవన్నీ చూచిన రాముడు రావణుని మరణం తథ్యమేనని మదిలో అనుకొన్నాడు. శకున శాస్త్ర కోవిదుడైన రాముడు శుభ శకునాలను పట్టి సంతోషంగా హాయిగా ఉన్నాడు. శత్రువులపై విజయభేరి మ్రోగించే సమయం ఇంక ఎంతో దూరం లేదని అనుకొన్నాడు.

* * *

# రామరావణుల భయంకర సమరం

## సర్గ - 107

**త**మ తమ రథాలపై నుండి రామరావణులు చేసే యుద్ధం భయంకరంగా సాగుతోంది. సమస్త లోకాలను భీతిల్లచేస్తోంది. ఆ ఇద్దరు యోధులు నిర్విరామంగా యుద్ధం చేస్తున్నారు. ఒకరిని మించి ఒకరు పోరును విజృంభించి చేస్తున్నారు. వారిద్దరి సేనావాహినులు సైతం తమ ప్రభువుల యుద్ధం చూసి నిశ్చేష్టకు గురిఅయ్యారు. ఉభయ పక్షాల వీరులు చేతుల్లో వారి వారి ఆయుధాలను పట్టే ఉన్నారు. కాని, వారు యుద్ధం చేయాలనే తలంపునే మరచిపోయారు. కళ్ళు అప్పగించి రామ రావణులను చూస్తున్నారు.

జ్ఞాన అజ్ఞానాలమధ్య పోరులాగా, వెలుగు చీకట్ల పోరాటంలాగా, రామరావణుల యుద్ధం కొనసాగుతోంది. ధర్మాధర్మాల మధ్య భీకర సంగ్రామం జరుగుతోంది. దేవతాగణాలు, సర్వప్రాణి చేష్టలుడిగి వారినే చూస్తూనే

ఉన్నారు. శకున శాస్త్రాలను చదివిన పారంగతులు నిర్భయంగా పోరాటాన్ని చూస్తున్నారు. 'చావడానికి ఐనా సిద్ధపడ్డాను కాని' ... అంటూ రామునిపై రావణుడు తెగించి పోరాడుతున్నాడు.

'నాదే గెలుపు సుమా! ఎప్పుడైనా ఎక్కడైనా ధర్మానిదే విజయం అవుతుంది రాక్షసాధమా! నా చేతిలో నీ చావు తప్పనిసరి' అని ఉత్సాహంతో రాముడు బాణాలను వేస్తున్నాడు.

దశగ్రీవుడు క్రోధంగా రాముని రథధ్వజాన్ని లక్ష్యం చేసుకొన్నాడు. పదునుగా ఉన్న బాణాన్ని వేశాడు. కాని, రథానికి ఉన్న ప్రభావంతో ధ్వజాన్ని చేరకుండా ఆ బాణం నిర్వీర్యం అయిపోయింది. రావణుడు చేసిన దానికి రాముడు ప్రతిక్రియ చేయాలని శరంతీసి మంత్రం జపించి ప్రయోగించాడు. వెంటనే రామబాణం వేగంగా వెళ్ళి రావణుని ధ్వజాన్ని నేలపాలు చేసింది.

ఆ పనివలన రావణునిలో ఆవేశం ఉప్పొంగిపోయింది. వెంటనే రామునిపై అవిచ్ఛిన్నంగా శరాలను ప్రయోగించాడు. రాముని రథాశ్వాలను గురిచూసి రావణుడు కొట్టాడు. బాణప్రహారం వాటికి తగిలినా కాని అవి ఏమాత్రం తొట్రుపడలేదు. అవి వాటి స్థానాలనుంచి లేశం కూడా కదలలేదు. దాన్ని చూచి రావణునిలో ఆవేశం ఉధృతం అయింది. రథశ్వాలపై శరవర్షాన్ని కురిపించాడు. అయినా వాటికి ఏమాత్రం బాధ కలుగలేదు.

రామరావణుల సంకుల సమరం వేగంగా సాగుతోంది. రావణుని శరాలన్నింటిని రాముడు తన శరాలతో నివారిస్తున్నాడు. నిరాసక్తతతో కూడిన మనస్సుతో రావణుడు క్షణం విరామం లేకుండా బాణ ప్రయోగాలను చేస్తున్నాడు. పట్టుదలతో యుద్ధం చేస్తున్న రావణునిపై రామునికి జాలివేసింది. అపజయం తథ్యమని తెలిసి పోరాట పటిమలో రవ్వంత అలసత్వం లేకుండా పోరాడుతున్నాడు. అటువంటి రావణుని రాముడు సాదరభావంతో నవ్వుతూ వేలకొలది బాణాలను వేశాడు. ఆ యోధుల శరాలు గగనం అంతా నిండిపోయి నేలకు జాలువారుతున్నాయి. ఆ శరాలను చూస్తున్న వారు శరకుంభవృష్టిని తలపిస్తోంది కదా అని అనుకొంటున్నారు.

ఎడతెరిపి లేకుండా మహాయోధులు పరస్పరం ప్రతీకారంతో చెలరేగి పోరుతున్నారు. చూచేవారికి ఆ యుద్ధం గగుర్పాటును కలిగిస్తోంది. అక్కడున్న వారందరి రోమాలు తెలియకుండా నిక్కపొడుచుకొంటున్నాయి. హృదయ స్పందన అతివేగంగా అసలు లేకుండినట్లుగా సాగుతోంది. రక్తం పరుగెత్తుతోంది.

ఆ ఇద్దరి రణ కౌశలానికి దీటుగా వారి రథ సారథులు రథాలను మండలాకారంలోను, సూటిగాను నడిపిస్తున్నారు. సారథ్య నైపుణ్యం కూడా అత్యద్భుతంగా ఉంది. ఉభయులు శరాలను ప్రయోగించుకోవడంలోను, నివారించుకోవడంలోను దిట్టలు. ఒకసారి ఆ మహారథుల రథాలు ఎదురుగా వచ్చి ఢీకొన్నాయి. వెంటనే రాముడు నాలుగు బాణాలను రావణుని రథాశ్వాలపై గురిచూసి వదిలారు. ఆ దెబ్బకు అవి ఒక్క అడుగు వెనక్కువేశాయి.

వెనుకడుగు వేసే అశ్వాలను చూచి రావణుడు రామునిపై శరప్రయోగం చేశాడు. అవి వేగంగా దూసుకెళ్ళుతున్నాయి.

రావణుని శరాలు రాముని బాధించలేకపోయాయి. రావణుడు మాతలిని లక్ష్యం చేసుకొని శక్తివంతమైన బాణాలు వేశాడు. దివ్య శక్తి సంపన్నుడైన మాతలిని రావణుని బాణాలు నొప్పించలేకపోయాయి.

తన రథసారథిని లక్ష్యం చేసుకొని శర ప్రయోగం చేసిన రావణునిపై రాముడు క్రోధావేశం చెందాడు. వెంటనే ధనుస్సు ఎక్కుపెట్టి పది ఇరవైయేసి బాణాలను ప్రయోగించి రావణుని యుద్ధ విముఖుని చేశాడు. రావణుడు రామునిపై తీవ్ర కోపం తెచ్చుకొని అంతేవేగంగా రామునిపై బాణాలు గదలు, గొడ్డళ్ళు, ముసలాలు ప్రయోగించాడు.

ఆయుధాల ధ్వనిచేత బాణ పుంఖాల వేగంచేత సప్త సముద్రాలు క్షోభకు గురి అవుతున్నాయి. సముద్రాలు క్షోభించడం చేత వేలకొలది జలచరాలు అల్లకల్లోలానికి గురి అయ్యాయి. వనాలతో, అరణ్యాలతో కూడిన భూమండలం అంతా కంపించిపోతోంది. సమస్త ప్రాణకోటి చింతాక్రాంతులయ్యారు.

యుద్ధం చూసే సిద్ధులు, మహర్షులు ఈ భీకర సంగ్రామంలో రాక్షస రాజైన 'రావణుణ్ణి రాముడు వధించుగాక!' 'రామునికి జయం సిద్ధించుగాక!' అని వారు మంగళాశాసనాలు చేస్తున్నారు. గంధర్వాదులు అందరు రామునికి జయం కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నారు. ఋషిగణాలు బ్రాహ్మణులకు, సాధువులకు, గోవులకు శుభం కలగాలని ఆశీర్వదించారు.

గంధర్వాదులు ఆకాశానికి పోలినది ఆకాశమే, సముద్రాన్ని పోలినది సముద్రమే అయినట్లుగా, రామరావణుల యుద్ధానికి సరివచ్చేది రామరావణుల యుద్ధమే అని వారిలో వారు చెప్పుకొన్నారు. రఘువంశ కీర్తిని ఇనుమడింపచేసే రాఘవుడు చాలా రోషంతో మహావిషసర్పంవలె నున్న తీక్షణమైన బాణాన్ని రావణుని శిరస్సుకు గురిపెట్టి వేశాడు. ఆ బాణం వేగంగా వెళ్ళి రావణుని శిరస్సును ఖండించివేసింది.

ధగధగా మెరిసే కుండలాల కాంతి ఉన్న రావణుని శిరస్సు నేలపై పడిపోవడాన్ని గగనాన ఉన్నవారు, రాక్షసులు, వానరులు అందరూ చూశారు. కాని మరుక్షణమే రావణుని కంఠానికి మరియొక శిరస్సు వచ్చి చేరింది. శరాలను వేయడంలో ఒడుపున్న సమర్థుడైన రాముడు ఆ రావణునికి మొలచిన శిరస్సును ఖండించివేశాడు.

రాముడు నిరంతరంగా శిరస్సులను ఖండిస్తున్నాడు. అవిచ్ఛిన్నంగా రావణునకు శిరస్సులు వచ్చి చేరుతూనే ఉన్నాయి. సమాన తేజస్సులతో విరాజిల్లే వందలకొద్దీ శిరస్సులను రాముడు నేలపాలు చేశాడు కాని రావణుడు శిరస్సుతోనే ఉన్నాడు. రావణుని ఛేదించే మార్గం రామునికి అంతుబట్టకుండా ఉంది.

అస్త్ర శస్త్రాలన్నింటిని ఔపోసన పట్టిన కౌసల్యా తనయుడు శరాలను ప్రయోగిస్తూనే ఉన్నాడు. రావణుని వధించే మార్గం కానరాక దీర్ఘాలోచనలో మునిగిపోయాడు. నా దగ్గర ఉన్న బాణాలతోనే మారీచుని, ఖరదూషణాదులను వధించాను. నా శర ప్రయోగ ధాటికే విరాధుని కబంధుని కబళించివేశాను. నా బాణాల చేతనే మద్ది వృక్షాలను ఛేదించి వాలిని నిహతుణ్ని చేశాను.

సముద్రాన్ని కూడా క్షోభింపచేశాను. అస్త్రశస్త్రాలన్నీ నాకు ఇంతవరకూ మహోపకారమే చేశాయి. కాని, నేడు ఈ దుష్ట రావణుని విషయంలో వీని శక్తి సన్నగిల్లింది. దీనికి కారణం ఏమై ఉంటుంది అని రాముడు ఆలోచించాడు. రాముడు విజృంభించి రావణుని వక్షస్థలాన్ని బాగా గాయపరిచాడు. రావణుడు రాముని బాధించాడు.

రామరావణుల యుద్ధం అహోరాత్రాలు అవిశ్రాంతంగా సాగుతున్నాయి. ఇద్దరిలో ఏ ఒక్కరూ వెనకడుగు వేయడం లేదు. ఒక పగలు రాత్రే కాదు, కనీసం ఒక ముహూర్తకాలం కూడా ఆగకుండా అవిచ్ఛిన్నంగా నిర్విరామంగా రామరావణుల పోరు సాగుతోంది. రాముని జయం సిద్ధించకపోవడం చూసి మాతలి రామునితో మాట్లాడాలను కొన్నాడు.

* * *

# రావణ సంహారం

## సర్గ - 108

**భీ**కరయుద్ధం సాగుతోంది. అవిశ్రాంతంగా సాగుతున్న పోరు చూచి మాతలి రామునితో "ప్రభూ! ఏమీ ఎరుగని వానిలాగా రావణుని బాణాలు నివారిస్తూ పోతున్నారేమి? రావణుని అంతం చేసే బాణాలను వేయడానికి ఎందుకు ఉపేక్షిస్తున్నారు" అని అడిగాడు. "ఓ శ్రీరామచంద్రా! నేడు రావణుని మరణ సమయం ఆసన్నమైంది. మీరు బ్రహ్మాస్త్రాన్ని సంధించి రావణునిపై ప్రయోగించండి. ఆ బ్రహ్మాస్త్రంవలనే రావణుని ప్రాణాలు అంతరించి పోతాయి" అని మాతలి రాముడితో చెప్పాడు.

మాతలి మాటలు వినగానే రామునకు బ్రహ్మాస్త్రం స్ఫురణకు వచ్చింది. బ్రహ్మాస్త్రాన్ని సర్వలోక విధాత ఐన చతుర్ముఖుడు నిర్మించాడు. తేజోవంతుడైన బ్రహ్మ సర్వప్రాణికోటి క్షేమాన్ని ఆశించి ఇంద్రునకు ప్రసాదించాడు. ఆ ఇంద్రుడు అగస్త్యమహర్షికి ఇచ్చారు. ఆ అగస్త్యుడు శ్రీరామునికి బ్రహ్మాస్త్రాన్ని బహూకరించి ఉన్నాడు. దాన్ని రాముడు స్మృతిపథంలోకి తెచ్చుకొన్నాడు.

బ్రహ్మాస్త్రం రెక్కలలో వాయుదేవుడు, పదునులో అగ్ని, సూర్యుడు అధిదేవతలుగా ఉంటారు. ఈ బ్రహ్మాస్త్రానికి అవధి ఉండదు. ఎక్కడికైనా చొచ్చుకొని వేగంగా పోగలదు. బరువులో మేరు మందరగిరులను పోలింది సకల భూతాల తేజస్సారంతో నిర్మితమైంది. సూర్యుని తేజస్సుతో ప్రళయ కాలాగ్నిలాగా భయంకరంగా ఉంటుంది.

ఈ బ్రహ్మాస్త్రం శత్రువుల రథాశ్వాలను, పుర గోపురాలను, పరిఘలను, పర్వతాలను ముక్కలుగా చేసే శక్తి ఉన్నది. భయంకరమైన ఈ అస్త్రం కపట యుద్ధాన్ని కూడా ఛేదించి వేస్తుంది. రాక్షసులకు వినాశనం, సాధువులకు ఆనందాన్ని కూర్చేది. శరాలలో శ్రేష్ఠమైన బ్రహ్మాస్త్రాన్ని రాముడు సంతోషంగా చేతిలోకి తీసుకొన్నాడు.

రాముడు రణావేశపరుడై రావణుని చంపాలని గట్టి నిర్ణయం తీసుకొన్నాడు. ధనుస్సును ఆకర్ణాంతంవరకు లాగి బ్రహ్మాస్త్రాన్ని సంతోషంగా రావణునిపై ప్రయోగించాడు. యమునివలె నివారింపరాని బ్రహ్మాస్త్రం వేగంగా వెళ్లి రావణుని వక్షస్థలాన నాటుకొంది.

ఆ బ్రహ్మాస్త్రం అతివేగంగా వెళ్ళి రావణుని హృదయాన్ని చీల్చివేసింది. శత్రువులను తునుమాడడంలో సాటిలేని మేటి ఐన బ్రహ్మాస్త్రం రావణుని ప్రాణాలను హరించివేసి అంతే వేగంగా భూమిలోకి చొచ్చుకొని పోయింది.

తన పనిని సాగించి వినమ్రభావంతో ఉన్న సేవకునిలాగా బ్రహ్మాస్త్రం ప్రయోగించిన పనిని పూర్తిచేసి తిరిగివచ్చి రాముని తూణీరాన్ని అందంగా అలంకరించింది.

రావణుడు బ్రహ్మాస్త్రంతో నిహతుడు అయ్యాడు. ఆయనచేతిలోని ధనుస్సు బాణాలు అచేతనమై చేతినుండి జారి నేలపాలు అయ్యాయి. వజ్రాయుధ ప్రహారానికి ప్రాణాలు కోల్పోయిన వృత్రాసురునిలాగా రాముని చేతిలో రావణుడు ప్రాణాలు కోల్పోయి చేతనారహితుడై పర్వతాకారుడై రథంపైనుండి నేలపై జారిపడ్డాడు.

రావణుడు నేలరాలడం చావకుండా మిగిలిన రాక్షసులను భయావహులను చేసింది. ఎటువారక్కడ పరుగులు తీశారు. అలా పారిపోయే రాక్షసులపై వానరులు విరుచుకొనిపడి వారిని అంతం చేస్తున్నారు. వారి దెబ్బలకు తాళలేక రాక్షసులు లంకలో భీతితో ప్రవేశించారు.

వానరులలో సంతోషం పొంగి పొరలింది. జయోత్సాహాలు పెల్లుబుకుతుండగా శ్రీరామునికి జయధ్వానాలు చేశారు. వానరులంతా ముక్తకంఠంతో జేజేలు పలికారు. దేవతలు ఆకాశంలో దుందుభులు మ్రోగించారు. వాయుదేవుడు సువాసనతో నిండిన గాలిని ప్రసరింపజేశాడు. ఇంద్రుని రథంపైఉన్న శ్రీరామునిపై పుష్పవర్షం కురిసింది. దేవతలు గంధర్వాదులు సిద్ధులు మహర్షులు అందరూ భళి భళీ అని మెచ్చుకొన్నారు. వారందరూ హర్షోల్లాసంతో శ్రీరాముని కొనియాడారు.

రాక్షసరాజును హతమార్చడంతో సుగ్రీవుడు, హనుమదాదులు, సకల వానర లోకమూ సఫల మనోరథులు అయ్యారు. దేవతలు ప్రశాంతిని పొందారు. దిక్కులన్నీ పరమశాంతిని పొందాయి. ఆకాశం స్వచ్ఛంగా ప్రకాశించింది. సూర్యుడు స్పష్టంగా ప్రకాశించాడు.

సుగ్రీవుడు, విభీషణుడు, లక్ష్మణుడు అందరూ సంతోషించారు. అందరూ విజయప్రాప్తి జరిగిందని సంతోషించారు. రావణుని హతమార్చిన తన ప్రతిజ్ఞను నెరవేర్చి రాముడు దేవగణాలతో విరాజిల్లే ఇంద్రునిలాగా మిత్రులతో, సోదరునితో పరమానందించాడు.

* * *

# రామ విభీషణుల సంభాషణం

## సర్గ – 109

శ్రీరాముని చేతిలో రావణుడు పరాజితుడై యమసదనానికి వెళ్ళాడు. నిస్తేజంగా రావణుని మృతశరీరం నేలపై పడిపోయింది. దాన్ని చూచి తన సోదరునికి వచ్చిన దుస్థితికి విభీషణుడు ఎంతగానో దుఃఖించాడు. 'అన్నా! మీరు పరాక్రమశాలురు; నీతిశాస్త్ర కోవిదులు; హంసతూలికా తల్పంపై శయనించాల్సిన మీరు గతంలో చేసిన అనేక దుష్కార్యాలకు ఫలంగా కటిక నేలపై పడి ఉన్నారు.

"సోదరా! నేను మీకు ఎన్నో హితవచనాలు చెప్పాను. కామపరవశునివై నా మాటలు తీసిపారేశారు. కాని, మీ మోహాంధకారం నేడు ఏ పరిస్థితి కలిగించిందో చూడు. వీరాధివీరులైన మీ పుత్రులను, సోదరులను ఆఖరికి మిమ్ములను కూడా మీరు పోగొట్టుకున్నారు. ఇప్పుడు మీకు వచ్చిన సుఖం ఏముంది? సీతాపహరణం వద్దని నేను ఎంతగానో చెప్పాను? మీరు మీతోపాటూ ప్రహస్తుడు, ఇంద్రజిత్తు ఎంత చెప్పినా వినలేదు.

నేడు భక్తాగ్రగణ్యుడివి అయిఉండీ, అస్త్ర శస్త్ర విద్యలలో ఆరితేరి ఉండి కూడా మీరు ఈ యుద్ధభూమిపై దయనీయంగా పడి ఉన్నారు. ధర్మమే ఎప్పుడైనా గెలిచి తీరుతుందని చెప్పినా మీరు వినలేదు. అధర్మానికే పెద్ద పీట వేశారు. ఆ అధర్మమే మిమ్మల్ని భూమిపై నిలవనీయకుండా చేసింది. రణభూమిలో మీరు నిర్జీవులైన తర్వాత రాక్షసలోకం ఏమి చేయగలదు? ఇక నాకు మాత్రం మిగిలింది ఏముంది? నాకు శూన్యం తప్ప మరేమీ కనిపించటంలేదు' అని పరిపరి విధాలుగా విలపిస్తూ శోకమగ్నుడై ఉన్న విభీషణున్ని రాముడు శాంత వచనాలతో ఊరడింప జేశాడు. 'విభీషణా! నీ సోదరుడు పిరికిపందలా మరణించలేదు. క్షత్రియ ధర్మాన్ని అనుసరించి చివరి క్షణం వరకు అద్భుత పోరాట పటిమ చూపిన తర్వాత ప్రాణాలు కోల్పోయాడు. యుద్ధరంగంలో ఎవరికైనా, ఎప్పుడైనా మరణం వస్తుంది. గెలుపు, ఓటములు దైవాధీనాలు. యుద్ధంలో ఏ ఒక్కరో ఎప్పుడు గెలుస్తారని నమ్మకం లేదు కదా.

అయినా శత్రువును ముప్పతిప్పలు పెట్టి వీరోచితంగా పోరాడి అసువులు కోల్పోయిన వారికోసం కంటతడి పెట్టడం వీరుల లక్షణం కాదు. నీవు పారమార్థిక బుద్ధితో ఆలోచించి ఇక జరగాల్సిన కార్యం గురించి ఆలోచించు. మీ అన్న పుణ్యలోకాలకే వెళ్ళాడు. అటువంటి వారికోసం చేయవలసిన దాన్ని గూర్చి యోచించు' అని శ్రీరాముడు చెప్పాడు.

'శ్రీరామా! మా సోదరుడు ఎన్నో యుద్ధాలు చేశాడు. దేవతలను కూడా ఎదురించి నిలిచినారు.. కాని, నేడు సముద్రంలో లేచిన కెరటం తీరం చేరకుండానే భగ్నమైపోయినట్లుగా నేడు యుద్ధరంగంలో చేతనారహితునిగా మారి నిర్జీవుడుగా మారాడు. రావణుడు చేయని దానం లేదు. ఇష్టదైవాలను సేవించాడు. సమస్త భోగాలను అనుభ వించాడు. మిత్రులకు సేవకులకు ఆనందాన్ని పంచాడు.

రావణుడు వేదవేదాంగవేత్త యజ్ఞయాగాదులను చేసేవాడు. శత్రువుల గుండెలలో నిదురించేవాడు. అలాంటి రావణుడు నేలపై పడి వుండడంతో నా మనస్సు రావణుని దుస్థితికి విషాదానికి లోనవుతోంది' అని విభీషణుడు విలపిస్తూ రావణుని గూర్చి రామునితో చెప్పాడు.

విభీషణుని దైన్య వచనాలు విని రాముడు కూడా కాసేపు ఊరకుండిపోయాడు. అత్యంత అద్భుతమైన పోరాట పటిమ ఉన్నవాడు, అన్నీ మంచి కార్యాలను చేసినవాడు, చివరికి అధర్మాచరణతో కాలం చేతిలో కన్ను మూసినవాడు అని రామునికి అనిపించింది. రాముడు నిశ్శబ్దంగా ఉన్నాడు. కొద్ది సేపటి తర్వాత 'విభీషణా! భగవంతుడు నిర్ణయించిన ప్రకారం మనమందరం నడుచుకొంటుంటాము. నేడు వీరుడైన రావణుడు స్వర్గానికి ఏగినాడు. నీవు దుఃఖాన్ని మాని ఈ వీరునికి చేయాల్సిన కర్మలను చేయుము. జీవించి ఉన్నంత వరకు వైరభావాలు

ఉంటాయి. కాని, మరణించిన వారిపై ఎటువంటి విరోధం పెట్టకూడదు. మనుజునిగా పుట్టిన ప్రతిఒక్కరూ కర్తవ్యపాలన చేయాలి. నీవు ఈ దుఃఖాన్ని వదిలి పెట్టు. మీ సోదరునికి చేయవలసిన విధిని నిర్వర్తించు. నేడు ఈ రావణుడు నీతోపాటు నాకు కూడా సోదరుడే. లేచి అంత్య సంస్కారాలను చేయడానికి పూనుకో!' అని శ్రీరాముడు చింతిస్తున్న విభీషణునితో చెప్పాడు. రాముని అనునయ వాక్యాలు విభీషణుడు విన్నాడు. ఆయనకు దుఃఖం పెరిగింది. వృథాగా నా సోదరుడై ఉండీ, అసువులు కోల్పోయాడు గదా! అన్న చింతతో చేష్టలుడిగి అచేతనుడైన రావణుని వంక చూస్తుండిపోయాడు.

రణరంగం మూగబోయింది. రామరావణయుద్ధం పరిసమాప్తి చెందింది. రావణుడు నిహతుడయ్యాడు. విభీషణుడు సోదరుని మరణానికి విచారిస్తున్నాడు. అన్న మృత్యువుకు కారణం అతడు చేసిన పాపకృత్యాలే కదా అని దుఃఖిస్తున్నాడు.

* * *

# రావణ స్త్రీ విలాపం

## సర్గ - 110

రావణుని మరణవార్త రావణ అంతఃపురంలో వ్యాపించింది. రావణుని భార్యలందరూ పెద్ద పెట్టున రోదించారు. ఏరి కోరి రావణుని వివాహం చేసుకొన్న స్త్రీలందరూ తమను వీడి తమనాథుడు వెళ్ళిపోయాడన్న బాధను తట్టుకోలేక మూర్ఛపోయారు. చాలామంది స్త్రీలు పెద్దగా ఏడుస్తూ ఉత్తర ద్వారం నుండి బయటకు పరుగెత్తారు. ఎంత వారించినా వినకుండా రావణుని స్త్రీలందరూ శోకార్తులై దీనంగా విలపిస్తూ రణభూమికి పరుగు పరుగున విచ్చేశారు. దూడలను కోల్పోయిన ఆవుల్లాగా వారు ఏడుస్తున్నారు.

చివరకు విగతజీవుడై కాటుకరాశిలాగా పడి ఉన్న రావణుని వారు చూశారు. వారి కళ్ళు ధారాపాతంగా వర్షించసాగాయి. నిన్నటిదాకా తమను అలరించి సుఖపెట్టిన తమ నాథుడు నేడు అతి దీనంగా నేలపై పడి పోవడం వారు చూడలేకపోయారు. అయ్యో! ఆర్యపుత్రా! హా నాథా! అంటూ వారందరి ఆక్రందనలు మిన్ను ముట్టుతున్నాయి.

పతి వియోగ దుఃఖంలో అల్లాడుతూ వారందరూ కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్నారు. వారందరూ రావణుని చుట్టూ చేరారు. ఒక స్త్రీ ఆయన హృదయంపై పడి ఏడుస్తోంది. మరొక స్త్రీ రావణుని పాదాలపై ఏడుస్తోంది. మరొక స్త్రీ ఆయన బాహువులను పట్టుకొని ఏడుస్తోంది. రావణుని భార్యల ఏడుపులతో ఆ ప్రదేశమంతా మారుమ్రోగుతోంది. చెట్టు నుంచి తెగిపోయిన లతల్లా వారందరి మొహాలు వాడిపోయాయి. చెట్టునుంచి రాలిన పుష్పాల్లా స్త్రీలందరూ రావణుని చుట్టూ గుమికూడి ఆక్రోశిస్తున్నారు.

ఒక స్త్రీ రావణుని తలను తన ఒడిలో పెట్టుకొని ఏడుస్తోంది. ఒక స్త్రీ రావణుని కంఠంను మెలివేసుకొని ఏడుస్తోంది. స్త్రీలందరూ కన్నీటితో రావణుని తడిపేస్తున్నారు. అతి దీనాతిదీనంగా ఏడుస్తున్నారు. 'అయ్యో నాథా! మీ చేతులారా మీరు మృత్యువును కొనితెచ్చుకొన్నారు. మీపై అనురాగం పెంచుకొన్న స్త్రీలు ఇంతమంది ఉండగా మీరు అనవసరంగా సీతపై వ్యామోహం చెందారు.

"రావణా! మిమ్ము చూచి ఇంద్రాది దేవతలు గజగజలాడేవారు. కుబేరుని పుష్పక విమానాన్ని కూడా మీరు దక్కించుకొన్నారు. గంధర్వాదులు, ఋషులు, మహర్షులు మిమ్ము తలచుకొన్నంతనే భయంతో బిగ్రబిగిసిపోయేవారు. శత్రువులు మిమ్ము తలచేవారే కాదు. ఎవరైనా లంకను కన్నెత్తి చూడడానికి కూడా భయపడిపోయేవారు. అలాంటి మీరు నేడు ఒక్క మానవమాత్రుని చేతిలో ఓడిపోవడమే కాదు, ప్రాణాలను కూడా పోగొట్టుకొన్నారు."

"నాథా! మీ క్షేమం కోరి చెప్పేవారి మాటను మీరు వినలేదు. మీ దగ్గర ప్రాపకం పెంచుకోవడానికి చెప్పే వారి మాటలను విని ఇంత అనర్థాన్ని తెచ్చుకొన్నారు. ఆనాడు విభీషణుడు చెవిన ఇల్లు కట్టుకొని చెప్పిన మాటలను మీరు పెడచెవిన పెట్టారు ఒకవేళ ఆయన చెప్పినట్లు విని ఉంటే మీకీనాడు ఈ గతి పట్టేది కాదు."

ఆ సీతాదేవి రామునికి అప్పగించి ఉంటే ఆ విభీషణుని కోరిక తీర్చినవాడివి అయ్యేవానివి. అంతేగాదు, ఆ రాముడు మీకు మిత్రుడయ్యేవాడు. సర్వులకు ప్రియమైన కార్యాలు చేసే ఆ రాముడు మీతో సఖ్యం చేసి ఉండేవాడు గదా! కాని, మీరు సీతపై వ్యామోహంతో పర్వతంతో ఢీకొన్నారు. నేడు మీతో పాటు సర్వరాక్షస లోకాన్ని నాశనం చేశారు. ఎందరెందరో వీరాధివీరులు మరణం పొందారు. సర్వ రాక్షస లోకం మీరు లేక అనాథ అయ్యింది. రాక్షసులందరూ చనిపోవడంతో లంక అంతా వైధవ్యం పొందిన స్త్రీలతో నిండిపోయింది.

క్రూరాత్ములై చెడు బుద్ధి ఉన్నవారి మాట విని మూర్ఖంగా ప్రవర్తించారు. రాక్షస శ్రేష్ఠా! మీతోపాటు మమ్ములను కడగండ్లు పాలు చేశారు. అయినా రావణా! మీ స్వేచ్ఛా విహారమే మీ మృత్యువుకు కారణం కాకపోవచ్చు కూడా.

విధాత ఇచ్ఛానుసారంగా నేడు మీకీ దురవస్థ వచ్చి ఉంటుంది. చతుర్ముఖుని లీలా విశేషాలలో మనం నిమిత్త మాత్రులం కదా. మహాబాహూ! రాక్షసులు నశించడం, మీరు వధించబడటం మేము అనాథలం అయ్యిపోవడం అనేది సృష్టికర్త ఎప్పుడో నిర్ణయించే ఉంటాడు. అది నేడు జరిగి ఉంటుంది. ఎవరైనా కర్మఫలాలను అనుభవించాల్సిందే కదా! విధి విధానాన్ని ధనం కాని, మరి ఏ ఇతరం కాని మార్చలేదు.ఎవరూ విధిరాతను మార్చినట్లు చరిత్రలో ఎక్కడా కనిపించలేదు. మేమెవరమూ ఎప్పుడూ వినలేదు. మా పూర్వీకులు కూడా ఈ విషయం గూర్చి చెప్పగా వినలేదు. ఇంతకూ మా విధిరాత బాగోలేదు. మాకు అలవి కాని దుఃఖాన్ని ఆ చతుర్ముఖుడు రాసిపెట్టాడు. నొసట రాసిన వ్రాలు ఏం చేసినా చెరపలేము' కదా అని వారందరూ విలపించారు.

ఇలా రాక్షస స్త్రీలందరూ రావణుని మరణాన్ని చూసి దైన్యంతో కుమిలిపోయి ఆడ క్రౌంచ పక్షుల్లాగా విలపిస్తున్నారు.

* * *

# మండోదరి విలాపం - రావణుని అంత్యేష్టి

## సర్గ - 111

రావణుని పెద్ద భార్య, పట్టమహిషి రావణుని మరణవార్తతో అంతులేని దుఃఖానికి గురి అయ్యింది. రాముని చేతిలో మృతుడైన తన భర్తను చూచి ఆమె పెద్దపెట్టున విలపించింది. "పూజ్యుడా! మీరు కనులెర్ర చేస్తే చాలు బ్రాహ్మణులు, దేవతలు, ఇంద్రుడు కూడా గజగజలాడేవారు కదా. ఆకాశంలో సంచరించే చారణులు కూడా భయంతో వణికిపోయేవారే! ఈ రణంలో ఒక్క మనుష్యుని చేతిలో మరణించడం మీకు అవమానంగా లేదా? నాథా! మీ పరాక్రమంతో ముల్లోకాలను గెలిచిన మీరు ఈనాడు ఒక్క మానవుని చేతిలో ఎలా ఓడిపోగలిగారు? మీరు కామరూపులు గదా! వనవాసి అయిన రాముని చేతిలో మరణం మీకు సంభవించడం ఎలా జరిగింది? ఇదిఅసంభవమని నాకు అనిపిస్తోంది. సర్వ యుద్ధపరికరాలన్నీ ఉన్న మిమ్ము ఆ మానవుడు ఎలా నిర్వీర్యం చేయగలిగాడు?" అని అంటున్న మండోదరిలో ఉవ్వెత్తున దుఃఖజ్వాల ఎగిసింది. ఆమె నిశ్వాసాల వేడిగాలి సమరాంగణం అంతా వ్యాపించింది.

"నాథా! పద్నాలుగు వేల రాక్షసగణం ఉన్న మీ సోదరుడు ఖరుడు జనస్థానంలో ఈ రాముని చేతిలోనే హతుడు అయ్యాడు కదా. ఇతడు నిజంగా మానవ మాత్రుడు కాదు. ఎవరూ ప్రవేశింపజాలని లంకా నగరంలో ఒక్క హనుమంతుడు ప్రవేశించి సర్వరాక్షసులను బాధలకు గురిచేశాడు కదా. శ్రీరాముని అనుచరులు సముద్రంపై సేతువును నిర్మించారు కదా! నిజంగా వారు నరవానరులై ఉండరు.

కాలపురుషుడు మిమ్ము వధించాలనే నిశ్చయంతో మీ ఊహలకు అందకుండా శ్రీరాముని రూపంలో వచ్చి ఉంటాడు. లేక ఇంద్రుడే మానవుని రూపంలో వచ్చి సమరంలో మిమ్ములను నిహతుణ్ణి చేసి ఉంటాడు. అయినా నా భ్రాంతి కాని, ఆ శచీపతి మీ పేరు చెప్పితేనే గజగజలాడిపోతాడు కదా. కదన రంగంలో నిలిచే శక్తి ఆయనకెక్కడిది? బాగా ఆలోచించగా ఆ శ్రీరాముడే ఆదిమధ్యాంతరహితునిగా కనిపిస్తున్నాడు. చీకట్లను జయింప శక్యం కానివాడు, నాశరహితుడైన శ్రీమన్నారాయణుడే, నేడు శ్రీరాముని రూపాన వచ్చి ఉంటాడు అనేదే నిజమై ఉంటుంది.

"నాథా! మీరు ఇంద్రియాలను జయించి దేవతలను మించారు. కాని, నేడు ఇంద్రియలోలుడవై పరస్త్రీ వ్యామోహితులు అయ్యారు. నేను మీకు ఎంతగా ప్రాధేయపడి చెప్పినా నా మాట పెడచెవిన పెట్టారు. దాని ఫలితమే ఇది. దుర్మతులైన మీరు సీతాదేవిని అభిలషించారు. ఆమె స్త్రీ ధర్మాన్ని ఆచరించడంలో అరుంధతి, రోహిణి కంటే ఉత్తమురాలు. ఆమె జగజ్జనని. మాన్యురాలు అయిన సీతను తెచ్చి తప్పు చేశారు.

ప్రాణనాథా! సీతాదేవి క్షమాగుణంలో భూదేవి లాంటిది. సర్వాంగసుందరి అయిన ఆ సీతమ్మ పతి సేవా పరాయణత్వంతో నిర్జనారణ్యంలో తపస్సు చేసుకొనే ఆ ఉత్తమురాలిని మారీచుని ద్వారా మోసగించి మీరు అపహరించి తెచ్చారు. ఆ మైథిలిని పొందాలన్న మీ అభిమతం తీరలేదు. ఆ సాధ్వి తపఃప్రభావ కారణంతోనే మీకీనాడు దుర్గతి పట్టింది. ఆమె తపఃప్రభావంతో మిమ్ము దగ్ధం చేయగల సాధ్వీమణి సీత. కాని, మీరు మీ పాపం పండిన తర్వాతే నిహతులు అయ్యారు.

ఎవరికైనా వారు చేసిన కర్మలను పట్టి శుభాశుభ ఫలితాలు వస్తాయి. ఇదిగో నేడు మనం మీ దుష్కృత్యాల వలన కడగండ్ల పాలయ్యాం. శ్రీరాముడు ఆచరించిన ధర్మకార్యాలవలన విజయుడై సంతోషాన్ని పొందుతున్నాడు. మీరు కోరుకొంటే సీతాదేవిని మించిన సుందరీమణులు ఎందరో లంకలోనే ఉన్నారు. వంశోన్నతిని పట్టి అంద చందాలతో చదువుసంధ్యలలోను నేను సీతాదేవితో సమానురాలినే కాని, మీరీ విషయం గుర్తించలేకపోయారు. పరదార అయిన సీతాదేవిపై మోహం పెంచుకొని వాస్తవాన్ని విస్మరించారు.

ఏ ప్రాణికైనా వారు చేసే పనులను బట్టే మృత్యువు ఆసన్నమౌతుంది. మీరు సీతను అపహరించడమనే పాపకార్యం చేసినందువల్లే మృత్యుపాశానికి బంధితులయ్యారు. ఇకమీద సీతాదేవి శ్రీరాముని పొంది అంతులేని సుఖసంసారసముద్రంలో ఆనందం అనుభవిస్తుంది. కాని, నేను దుష్ప్రవర్తకుడవైన మిమ్ము భర్తగా చేసుకొన్నందు వలన నేడు శోక సంద్రంలోపడి అల్లాడిపోతున్నాను.

లంకాధిపతీ! నేను కూడా సమస్త సంతోషాలను అనుభవించాను. సమస్త దివ్య భవనాలలోను సంచరించాను. మన స్థాయికి తగ్గ పుష్పక విమానంలో సాటిలేని సుఖాలెన్నో వైభవోపేతంగా అనుభవించాను. కాని, నేడు మిమ్ము కోల్పోయిన నేను అన్నీ భోగభాగ్యాలకు దూరమైపోయాను. ఛ! ఛ! ఈ రాజభోగాలు సంపదలు అన్నీ కూడా చంచలమైనవే. మహారాజా! సుందర సుమనోహర రూప లావణ్యాలను చూచి నేను మిమ్ము మోహించాను. మిమ్మే నా ప్రాణమని నమ్మాను. మీ రూప సౌందర్యం నేడు శ్రీరాముని బాణఘాతంతో ఛిన్నాభిన్నమైపోయింది. నేను అద్వితీయం అనుభవైకవేద్యం అని భావించిన సౌందర్యం అంతా క్షణ భంగురమని తెలుసుకొన్నాను. నాకు వైధవ్యం సంప్రాప్తమౌ తుందని నేను కలలో కూడా ఊహించేకపోయాను. నేను మయుని ముద్దుల తనయను. రాక్షసేశ్వరుడు లంకాధిపతి ముల్లోకాలను జయించిన రావణునికి పట్టమహిషిని, ఇంద్రుణ్ణే జయించిన పుత్రునకు తల్లినని చాలా గర్వించేదానిని. నా గర్వం అంతా నేడు మట్టిపాలు అయ్యింది. నేను ఏమి చేశానని భగవంతుడు నాకీ గతి పట్టించాడు?

శ్యామవర్ణంతోనున్న మీ దేహం సర్వాంగ సుందరంగా సర్వాభరణ భూషితమై కన్నులకింపును కలిగించేది. కాని, నేడు ముండ్లపందివలె మీ శరీరమంతా శరాలు గ్రుచ్చుకొని చూడశక్యం గాకుండా ఉంది. లోక పాలురను గెలిచిన మీకు ఈ దురవస్థ ఏమిటి ప్రభూ? మీ భుజబల ప్రభావంతో కైలాసగిరినే ఎత్తినవారు కదా మీరు! గర్వితులను బంధించి మీరు పరాక్రమాన్ని చాటినవారు. భీకరకృత్యాలు చేసే రాక్షససేనకు సర్వాధిపతులుగా యుద్ధ కౌశల్యంలో మాయలు పన్నగల నేర్పరులు మీరు. ఏ దిక్కును మీరు జయించడానికి వెళ్లినా అక్కడనుంచి ఎందరో సుందరీమణులను కొనితెచ్చేవారే సకల ప్రాణులను భీతిల్లజేసే మీరు, శత్రువుల గుండెల్లో నిదురించే మీరు ఈనాడు అచేతనంగా సమరభూమిలో పడిపోయారేమిటి ప్రభూ! యజ్ఞయాగాలను చేసిన మీరు, రథికులలో మేటులు ఐన మీరు నేడు ఒక మానవుని చేతిలో మృతులు కావడం శోచనీయం. మమ్మల్నందరిని సంతోషపరిచే మీరు మాత్రమూ మమ్ములను శోకసంద్రంలో ముంచి దివ్యలోకాలకు వెళ్ళారు. మిమ్మల్ని ఇలా నేలపై పడి ఉండడం చూచి కూడా నేను స్థిరంగా ఉన్నాను. నేను నిజంగా పాషాణమే అయి ఉంటాను.

ఉత్తమోత్తమమైన హంసతూలికా తల్పాలపై పరుండే మీరు నేడు కటిక నేలపై దుమ్ముకొట్టుకొని రక్తపు మడుగులో అణగారిపడి ఉన్నారు. ఇంద్రజిత్తు లక్ష్మణుని చేతిలో మరణించినపుడే నా హృదయం ముక్కలు అయిపోయింది. నేడు మీరు కూడా నన్ను విడిచివెళ్లారు. నేను జీవచ్ఛవాన్ని అయిపోయాను. బంధు జనులను, మిమ్ము పోగొట్టుకొని ఇక నేను చేసేది ఏముంది?

స్వామీ! మీరు వీరస్వర్గాన్ని అలంకరించారు. ఇక్కడ నేను ఒక్కర్తినే ఉండి సాధించేది ఏమి ఉంది? నన్ను అనాథ చేయకుండా మీతో పాటే నన్ను తీసుకెళ్ళి పుణ్యం కట్టుకోండి! అభాగ్యురాలినైన నాతో మాట్లాడరేమి ప్రభూ! సమస్త భోగ ప్రదాతలైన మీకు దూరమై నేను బ్రతుకు కొనసాగించలేను. స్వామీ! మీ ఆజ్ఞ లేకుండా మీ సతులందరూ కాలినడకతో మీ దగ్గరకు వచ్చారు. వారందరిపై మీరు కోపం తెచ్చుకోరేమి? నాపై కోపం చూపించడాని కైనా మీరు లేచి మాట్లాడండి" అని మండోదరి అచేతనమైన రావణుని శరీరంపై పడి విలపిస్తోంది.

నిర్జీవమైన రావణుని కాయం చూచి మండోదరి 'నాథా! ఇంతవరకూ నేను మీతో క్రీడించాను. ఇపుడు నా కన్నులు అశ్రుధారలను నిరంతరంగా స్రవిస్తున్నాయి. అయినా మీరు నన్ను ఊరడింపరేమి? మీరు ఎందరో కుల స్త్రీల భర్తలను చంపి వారిని కన్నీటిపాలు చేశారు. పతివ్రతల కన్నీటి బొట్లు నేలపై రాలితే అశుభం జరుగుతుందంటారు. అది నిజమేనని నాకు అనిపిస్తోంది. వారందరి శాపాలు మీకు తగిలి నేడు మీరు మృత్యుదేవతకు అత్యంత సన్నిహితులయ్యారు. రాజా! మీ పరాక్రమంతో సమస్త లోకాలను గెలిచానని విర్రవీగారు. కాని, దొంగతనంగా ఒక పర స్త్రీని ఎలా అప హరించుకొని వచ్చారు? దొంగలాగా క్షుద్రమైన పనిని ఎలా చేశారు? వీరాధివీరులైన మీకు ఈ పిరికి లక్షణం ఎలా అబ్బింది? మాయామృగాన్ని పంపి రాముణ్ణి దూరం చేసి, సీతను తెచ్చిన మీ పరాక్రమాన్ని లోకం ఏమని పొగడుతుందో మీకు తెలియదా?"

ఇదే మీ మరణాన్ని తెచ్చిపెట్టింది, మహారాజా! ఎందరో మంచివారు మీకు హితబోధ చేశారు. కాని, వాటిని మీరు ఏ మాత్రం వినలేదు. మీ అనుంగు సోదరుడు విభీషణుడు భూతభవిష్యత్తులను ఎరిగినవాడు. మీరు చేసిన దుష్కృత్యాన్ని చూసి తల్లడిల్లాడు. దాన్ని రూపుమాపుకోమని మీకు ఎంతగా చెప్పినా మీరు వినలేదు. రామపత్నిని రామునకు ఇచ్చివేయమని విభీషణుడు ఎంతగా చెప్పాడు? రామునితో విరోధం మంచిది కాదని నోరు పెట్టుకుని మరీ చెప్పాడు."

"కాని, విధి నెత్తిపై కూర్చున్నందువల్ల మీకు మంచివారు చెప్పే విషయం తలకెక్కలేదు. కామక్రోధాదులకు వశులైన మీ వల్లనే రాక్షస ప్రముఖుల నాశనం జరిగింది. లంక సర్వనాశన కారకునిగా చరిత్రలో మిగిలిపోయారు. బలపరాక్రమ సంపన్నులైన మీరు యుద్ధంలో ప్రాణాలకు తెగించి పోరాడారు. సర్వశుభంకరంగా వీరమరణం పొంది వీర స్వర్గాన్ని అలంకరించారు. అందుకే నేను శోకించాల్సిన అవసరం లేదు."

మీరు మీ పాపపుణ్య ఫలాల సంచితంతో వీరస్వర్గాన్ని అలంకరించారు. నేను స్త్రీ సహజమైన చాపల్యంతో దుఃఖార్తికి లోనయ్యాను. మిమ్ము శాశ్వతంగా దూరం చేసుకొని దుఃఖ సముద్రంలో పడిపోయాను. విభీషణుడు శాస్త్రరీతిని అనుసరించి మీకు ఎన్నో మంచి విషయాలు చెప్పాడు. అవన్నీ మీరు విని ఉంటే మీకు మరణం

వచ్చేది కాదు. కాని, కీడు తలపెట్టే జ్ఞాతిగా భావించి విభీషణుని దూరం చేసుకొన్నారు. నా తండ్రి మయుడు మీకు ఎంతో మంచిని బోధించాడు. అయినా బలగర్వంతో వాటినన్నింటిని తృణీకరించారు. మహావీరుడు సర్వసమర్థుడువైన రాక్షస శ్రేష్ఠులైన మాల్యవంతునకు, సుమాలికి మీరు దౌహిత్రులు గదా! విశ్రవసు కుమారులైన మీరు కాళ్ళు చేతులు చాచి నేలపై పడి ఉన్నారు. మీకు భయపడి సూర్యుడు తన కిరణాలనే ఉపసంహరించుకొనేవాడు. అట్టి ఆ సూర్యుడు మీరు విగతజీవులు అయ్యారని తెలిసి విజృంభిస్తున్నాడు. రాజా! మీ పరిఘతో ఎంతోమంది వీరులను హతమార్చారు. అది కూడా నేడు ముక్కలై నేలపై పడి ఉంది.'

రావణుని ప్రియపత్ని అయిన మండోదరి భర్త మరణాన్ని జీర్ణించుకోలేక పరిపరివిధాల విలపిస్తోంది. రావణుని వక్షస్థలంపై పడి ఆమె రోదిస్తోంది. రావణుడు చేసిన ఘనకార్యాలను తలచుకొని మానవ మాత్రుని చేతిలో మృత్యువుపాలైన తన పతి దురవస్థను చూసి తపించిపోతోంది. ఆమెను అక్కడ ఉన్న స్త్రీలందరూ ఓదార్చుతూ కన్నీరు కార్చుతున్నారు. లోకంలో సంపదలన్నీ అస్థిరాలని వాటిని గూర్చి చింతించాల్సిన అవసరం లేదని చెప్తున్నారు. క్షణభంగుర జీవితంలో శుభ అశుభ కర్మల తాలూకు ఫలమే శాశ్వతం అని చెప్తూతూ వారి దురవస్థకు వారు దురపిల్లుతున్నారు. అప్పుడు శ్రీరాముడు విభీషణునితో స్త్రీలందరిని పంపించివేసి రావణునకు దహన సంస్కారం చేయమని చెప్పాడు. శ్రీరాముని మాటలు విని విభీషణుడు తన మనస్సులో చెలరేగే భావాలను మాటలలో చెప్పాడు. 'ఓ శ్రీరామా! ఈ రావణుడు ధర్మ మార్గాలను విడిచిన కఠినాత్ముడు. అసత్యవాది. స్త్రీలపై గౌరవభావం లేనివాడు. ఇలాంటి రావణునకు నాకు దహన సంస్కారం చేయాలనిపించడంలేదు. పైగా నన్ను ఇష్టపడనివాడు, నాకు సోదరుడే అయినా కూడా అందరికీ కీడు తలపెట్టే రావణునకు అంత్య సంస్కారాలు చేయాలని నాకు కాస్త కూడా అనిపించడంలేదు. ఈ విషయంలో లోకం నన్ను దూషించినా నేను ఏం చేయలేను' అని విభీషణుడు రాముడితో చెప్పాడు. అక్కడ ఉన్న వారందరూ విభీషణుని మాటలు విని నిజమే కదా అనుకొన్నారు. విభీషణుని యథార్థ వాదాన్ని విని తృప్తిపడ్డాడు. నిజాన్ని నిర్భయంగా చెప్పగలిగిన ధీరోదాత్తుని చూసి రాముడు విభీషణుని మనస్సు మార్చాలనుకొన్నాడు.

'విభీషణా! నీ మనస్సు నాకు అర్థం అయ్యింది. కానీ, నేను సముచితం అయిన మాటలనే నీకు చెప్పాను. ఈ నిశాచరుడు ధర్మవిరుద్ధంగా నడిపిస్తూ అసత్యవాది అయి ఉండవచ్చు. కాని, బలపరాక్రమవంతునిగా కూడా ప్రసిద్ధిచెంది ఉన్నాడు. రావణుడు లోక కంటకుడే ఐనా కూడా అంత్యేష్టి జరపాల్సిన బాధ్యత నీపైనే ఉంది. ఏ వ్యక్తిపైన ఐనా శత్రుత్వం జీవించి ఉన్నంతవరకే ఉంటుంది కాని, మరణించిన తర్వాత శత్రుత్వం వీడిపోతుంది. వీరమరణం పొందిన రావణుడు గౌరవార్హుడే. ఇతను నాకు కూడా సోదరునివంటివాడే. ధర్మజ్ఞా! నీచే అంత్య సంస్కారాలను జరిపించుకొనే అర్హతను రావణుడు పొంది ఉన్నాడు. దీనివలన నీ కీర్తి ఇనుమడిస్తుంది. నీవు ఏమాత్రం సంకోచాలు పెట్టుకోండా దహన సంస్కారానికి కావాల్సిన ఏర్పాట్లను చేయి' అని చెప్పాడు. రాముని మాటలు విని విభీషణుడు అంత్యేష్టికి కావాల్సిన ఏర్పాట్లు చేశాడు. మంచి గంధపు చెక్కలు, పద్మకాలు, వట్టివ్రేళ్ళు మొదలగు సుగంధ ద్రవ్యాలతో రావణుని చితిని ఏర్పాటుచేశారు. దానిపై వేదోక్తంగా మృగచర్మాన్ని పరిచారు. తర్వాతి కార్యక్రమాలను పూర్తిచేశారు. ఆ చితికి ఆగ్నేయ దిశలో ఒక వేదికను ఏర్పాటుచేశారు. ఆ వేదికపై

పడమర దిక్కున గార్హపత్యాగ్నిని, తూర్పులో అహవనీయాగ్నిని దక్షిణాన దక్షిణాగ్నిని ప్రతిష్ఠించారు. రావణుని చితిపై చేర్చారు.

నేయి, పెరుగు కలిపిన హవిస్సును స్రువం ద్వారా చితిపై ఆహుతిగా వేశారు. రావణుని శవం కాళ్ళదగ్గర శకటాన్ని పెట్టారు. తొడల మధ్య భాగంలో రోలును ఉంచారు. చెక్క పాత్రలను, అరణులను, ముసలం లాంటి వాటిని ఋత్విజులు యథాస్థానాలలో పెట్టారు. వేదశాస్త్ర విహితంగా రాక్షసులు రాక్షస రాజు రావణుని చితి ఎదురుగా మేకను బలి ఇచ్చారు. నేతితో తడిపిన దర్భలను అగ్నికి నలువైపులా వేశారు. ఇవన్నీ చూస్తున్న విభీషణునికి వద్దన్నా దుఃఖం ముంచుకువస్తోంది. ఎంతవారైనా మృత్యువుపాలు కావాల్సిందే కదా అనుకొని కళ్ళు తుడుచుకొన్నాడు. విభీషణునకు సహాయకులుగా ఉన్న రాక్షసులు దిగాలుపడిన మనస్సుతో రావణుని కళేబరానికి సుగంధద్రవ్యాలతో, పూలమాలలతో, వస్త్రాలతో అలంకరించారు. వారందరూ గట్టిగా ఏడుస్తూ ఆ కళేబరంపై పేలాలు చల్లారు. విభీషణుడు విధ్యుక్తంగా చితికి నిప్పుపెట్టాడు. విభీషణుడు స్నానంచేసి తడిబట్టలతో గరికపోచలను చేతిలో ఉంచుకొని శాస్త్రోక్తంగా తర్పణవిధులను ఆచరించాడు. శిరస్సును వంచి అన్నకు నమస్కరించాడు. అక్కడున్న స్త్రీలను మృదు వచనాలతో ఓదార్చాడు. ఇంక మీరందరూ లంకకు వెళ్ళండి అని మృదువుగా చెప్పాడు. వారందరూ వెళ్లిపోయిన తర్వాత విభీషణుడు రాముని చెంతకు చేరాడు. వారందరూ అనుకొన్న పని నెరవేరి రావణుడు చనిపోవడం జరిగిం దనుకొన్నారు. విజయాన్ని తలచి రామాదులందరూ సంతోషించారు.

* * *

# విభీషణుని రాజ్యాభిషేకం

## సర్గ - 112

రామరావణ యుద్ధం చూడటానికి వచ్చినవారందరూ రాముని వీరత్వాన్ని శ్లాఘించారు. రాముని కథలను చెప్పుకొంటున్నారు. తమ తమ నివాసాలకు వెళ్ళారు. సుగ్రీవుని వ్యూహరచనను, వానరుల సహాయాన్ని, విభీషణుని ధర్మాన్ని, రామలక్ష్మణుల పరాక్రమాన్ని అందరికీ చెపుతూ, రావణుడు పొందిన దుర్గతిని కూడా చెప్పుకొంటున్నారు.

మాతలికి శ్రీరాముడు మర్యాదలు చేశాడు. రథాన్ని తీసుకొని వచ్చి తనకు సహాయం చేసిన మీకివే నా ధన్యవాదాలు అంటూ రాముడు చెప్పాడు. దేవేంద్రుడు చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెల్పాడు. మాతలి రఘురాముని అనుమతిని తీసుకొని దివ్యరథం ఎక్కి స్వస్థానానికి వెళ్ళాడు. శ్రీరాముడు సుగ్రీవుని అక్కున చేర్చుకొని తనకు చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపాడు. లక్ష్మణుని మాట ప్రకారం అందరూ సైనిక శిబిరాలకు వెళ్ళారు. శ్రీరాముడు తన తమ్మునితో "సౌమిత్రీ! విభీషణుడు మనపై ఎంతో ఆదరాభిమానాలున్నవాడు.

ఈ విభీషణుని లంకా రాజుగా అభిషేకించు. నేను ఈ రావణానుజుని లంకాధిపతిగా చూడాలని ఎదురు చూస్తున్నాను" అని చెప్పాడు. లక్ష్మణుడు 'అట్లే' అని, వాయువేగ గమనులైన వానరులను పంపి సముద్ర జలాలను తెప్పించాడు. సువర్ణ కలశాలతో సముద్ర జలం తీసుకొచ్చారు.

శ్రీరాముని ఆజ్ఞ ప్రకారం సమస్త రాక్షసులు, వానరుల మధ్య విధ్యుక్తంగా వేదమంత్రాల మధ్య విభీషణునికి పట్టాభిషేకం చేశాడు. వారందరూ విభీషణుడు రాజు అయినందుకు సంతోషించారు. పుత్ర మిత్రాదులను కోల్పోయిన వారినందరిని విభీషణుడు ఓదార్చాడు. పట్టాభిషేకానంతరం విభీషణుడు లక్ష్మణునితో కూడి శ్రీరాముని దగ్గరకి వచ్చాడు.

లంక పౌరులందరూ సంతోషంగా మంగళకర ద్రవ్యాలను విభీషణునితోపాటు తీసుకొచ్చారు. అవి అన్నీ విభీషణుడు రామునకు సమర్పించాడు. రాజ్యాది సమస్త సంపదలను పొందిన విభీషణుడు ఇచ్చిన వాటిని రాముడు స్వీకరించాడు. హనుమంతుని చూసి శ్రీరాముడు "సౌమ్యుడా! నీవు విభీషణుని అనుజ్ఞ తీసుకొని రావణుని అశోకవనంలోనున్న సీత దగ్గరకు వెళ్ళు. ఆమెకు మన విజయవార్తను అందించు. నేను లక్ష్మణుడు సుగ్రీవాదులు క్షేమంగా ఉన్నట్లు ఆమెకు చెప్పు. శ్రేష్ఠమైన కపివరా! నీవు శీఘ్రంగా వెళ్ళి సీతాదేవికి విషయం చెప్పి ఆమె సందేశాన్ని తీసుకొనిరా!" రాముడు ఆంజనేయునికి చెప్పాడు.

* * *

# సీత హనుమంతుల సంభాషణం

## సర్గ – 113

**హ**నుమంతుడు రాముని ఆదేశాన్ని పాటించాడు. విభీషణుని అనుమతి పొంది సీతాదేవి దగ్గరకు వెళ్ళాడు. దీనంగా కూర్చున్న సీతను హనుమంతుడు చూశాడు. హనుమంతుడు సీతాదేవికి నమస్కరించి ఆమె ఎదురుగా నిలబడ్డాడు. మారుతిని చూచి సీతలో చాలా సంతోషం వేసింది. సంతోషం అతిశయించి ఆమె నోటినుండి మాటలు రాలేదు. కళ్ళు ఆనందాశ్రువులను కారుస్తున్నాయి. "అమ్మా! 'రాముడు లక్ష్మణుడు క్షేమంగా ఉన్నారు. సుగ్రీవాదులు విభీషణుల సహాయ సహకారాలతో లోక కంటకుడైన రావణుణ్ణి శ్రీరాముడు వధించాడు. ఈ సంతోష వార్తను మీకు అందించమని రాముడు నన్ను పంపించాడు. శ్రీరాముడు మీ కుశలాన్ని తెలుసుకోవాలని ఆరాట పడుతున్నారు. ఆ ప్రభువు మీకు సందేశాన్ని పంపించాడు."

"మీరు ఎంతో గంభీరంగా పాతివ్రత్య ధర్మాలన్నీ పాటించారు. సాధ్వీ! మీరు ఇంతవరకు ప్రాణాలు నిలిపి ఉండటం మా అదృష్టం. మీ ధర్మనిరతి వలన మాకు రణరంగంలో విజయం ప్రాప్తించింది. నేటితో మీ దుఃఖం దూరమైపోయింది. రావణుని మరణంతో లంక మన అధీనంలోకి వచ్చింది. మీ కోసమే శ్రీరాముడు రావణుని

వధించుతానని ప్రతిజ్ఞ చేశారు. దాన్ని నేడు పాటించారు. సముద్రంపై సేతువు నిర్మించి దుష్ట రావణుని చంపారు. ఇక మీరు రావణుని మందిరాన ఉన్నానని చింతించాల్సిన అవసరంలేదు."

ఇప్పటినుంచీ రామదర్శనం జరుగబోతోందని ఆనందించు తల్లీ! మీ దర్శనార్థియై విభీషణుడు వస్తున్నాడు. ఆయన మీకు సంతోషాన్నిచ్చే మాటలను చెప్తారు. కోదండరాముని దగ్గరనుంచి విభీషణుడు వస్తున్నాడు' అని చెప్పాడు. ఆ మాటలతో సీత సంతోష తరంగిణి అయ్యింది. ఆమె మనసు ఆనందసంద్రంలో మునకలు వేస్తోంది. మాటలు రాని మౌనిలాగా చేష్టలుడిగి కళ్ళు వర్షిస్తుండగా ఆనందంగా హనుమంతుని చూసింది.

ఒక్క మాట కూడా మాట్లాడని సీతను చూశాడు. ధారాపాతంగా కన్నీళ్ళు కారుస్తున్న సీతాదేవిని ఆశ్చర్యంగా చూసాడు. సీతాదేవి కారుతున్న కన్నీళ్ళను కనీసం తుడుచుకొనే ప్రయత్నమైనా చేయడంలేదు. కన్నులు, చెవులు అప్పగించి మారుతినే చూస్తూ ఇంకా రామచంద్రుని గూర్చి ఏమైనా చెప్పబోతాడాఅన్నట్లు చూస్తోంది. అది చూసిన ఆంజనేయుడు "అమ్మా! ఇప్పుడు అంతా సంతోషమే కదా. మరి మీరెందుకు నాతో మాట్లాడడంలేదు? మీరెందుకా కన్నీళ్ళు కారుస్తున్నారు? నాపై కోపమా తల్లీ! మీ మనసులో ఆందోళన ఏమైనా ఉందా? నేను మాట్లాడడంలో ఏదైనా తప్పుచేశానా అమ్మా! చెప్పమ్మా! మాట్లాడు సీతమ్మ తల్లీ!' అని రామ సందేశం వినిపించిన హనుమంతుడు సీతను అడిగాడు.

"హనుమా! నా నాథుని విజయవార్త విన్న నేను ఆనందంలో మునిగిపోయాను. ఇంతటి శుభవార్తను తెచ్చిన నీకు నేను ఏ బహుమానాన్ని ఇవ్వగలను. నిన్ను సంతోషపరిచే ఏ వస్తువూ నాకు భూమండలంలోగాని ఆకాశంలోగాని కనిపించడంలేదు." అమ్మా! ఎప్పుడూ మీ భర్త హితాన్ని కోరే మీరు ఒక్కరే ఇలా మాట్లాడగలిగారు. మీరు నిజంగా ధీరోదాత్తలక్షణాలున్నవారు.' అని సీతను పొగిడాడు.

"వాయుసుతా! నీ పలుకులన్నీ అమృతమయంగా ఉన్నాయి. భాషించే నేర్పు నీకు తప్ప మరి ఎవ్వరికీ లేదు. నీలో శ్రమకు తట్టుకొనే యుద్ధోత్సాహం, సామర్థ్యం, సర్వశ్రేష్ఠత్వం, అపరాధులను క్షమించడం అన్నీ సర్వశుభ లక్షణాలు నీకున్నాయి."

'దేవీ! ఈ రాక్షస స్త్రీలు ఇంతకుముందు మిమ్ము ఎంతగానో బాధించారు. మీరు అనుమతి ఇచ్చినట్లయితే, నేను వీరినందరిని చంపదలిచాను. వీరందరూ మిమ్ము చాలా బాధించారు. ఘోర రూపాలతో దుష్ట ప్రవర్తనతో క్రూర స్వభావులు ఐన వీరు రావణుని గూర్చి మీకు చెప్పి మిమ్ములను చాలా హింసించారు. అందుకే మీరు నాకు ఇప్పుడు అనుమతిని ప్రసాదించండి. ఒక్క క్షణంలో వారినందరిని చంపివేస్తాను.'

ఇలా అంటూ రోషావేశంతో మాట్లాడే హనుమంతుని సీతాదేవి ప్రసన్నంగా చూసింది. 'కపివరా! ఈ రాక్షస స్త్రీలు రావణుని ఆశ్రయించి ఉన్నవారు. రాజాజ్ఞ పాటించే రాజవిధేయులు, దాసీలు వీరిపైన ఎవరైనా కుపితులు అవుతారా? నేను పూర్వ జన్మలో చేసుకొన్న పాపఫలితంగా నేడు ఈ దుస్థితి వచ్చింది. ఆ ఫలితంగానే నేను దుఃఖాన్ని అనుభవించాను అనేది నా నిశ్చితాభిప్రాయం. పరులవలన దుఃఖం ప్రాప్తమైంది అనుకోవటం నాకు రుచించదు. అందుకనే నేను వీరు నాకు దుఃఖాన్ని కలిగించారని నేను భావించను.

రావణుని దాసీలను నేను క్షమిస్తున్నాను. వీరందరూ రాజాజ్ఞతో నన్ను భయపెట్టి బాధించారు కాని మామూలుగా నాకు వారికీ ఏ విరోధం లేదు. కపివరా! నీకు నేను ఒక కథను చెప్తాను' వినుము అంటూ సీతాదేవి హనుమంతుని ఆగ్రహాన్ని తగ్గించడానికి ఓ కథ మొదలుపెట్టింది.

ఒక వేటకానిని ఒకసారి పెద్దపులి తరిమింది. అపుడు ఆ కిరాతుడు గబగబా ఒక చెట్టుపై ఎక్కాడు. అంతకుముందే ఆ చెట్టు పైన ఒక భల్లూకం ఉంది. వేటకానిని తరుముతూ వచ్చిన పులి దాన్ని చూసింది. 'ఓ భల్లూక రాజా! మనమిద్దరం ఈ అడవిలో నివసించేవారం కదా. ఈ వేటకాడు మనద్దరికి శత్రువు. అందుకనే నీవు వెంటనే ఈ మృగయుడిని క్రింద పడవేయి. నేను వానిని వధించి వేస్తాను' అని చెప్పింది. అప్పుడు ఆ భల్లూకం ఈ వేటకాడు నా శత్రువైనా ఇపుడు నా దగ్గరికి వచ్చాడు.

నీ నుంచి రక్షణకోసం ఈ చెట్టును ఆశ్రయించిన ఆశ్రితుడిని నేను పడవేయను. అది అధర్మమైన పని. ఆశ్రయించినవారికి కీడు చేయడం పాపం. అలాంటి పాపకార్యాన్ని నేను చేయను అంటూ చెప్పింది. పులి ఏమీ చేయలేక అక్కడే తచ్చాడుతోంది.

కాసేపటికి భల్లూక రాజు నిద్రపోయాడు. పులి వేటకానిని మభ్యపెట్టింది. నీవు భల్లూకాన్ని క్రిందపడవేయి. అది నీకు అపకారం చేస్తుంది. నేను నిన్ను రక్షిస్తాను. దాన్ని పడేసి నువ్వు క్రిందకు రా! అని చెప్పింది. పులి మాటలు నమ్మి వేటకాడు భల్లూకాన్ని క్రిందకు తోశాడు. నేర్పరితనం ఉన్న భల్లూకం మేల్కొని క్రిందపడక నేర్పుగా మరొక కొమ్మను పట్టుకొని పైకి వెళ్ళింది.

మళ్లీ పులి చూశావా! నీవు రక్షించిన వేటకాడు నిన్ను చంపాలని చూశాడు. అందుకే నీవు వాణ్ణి క్రిందకు తోయమని చెప్పింది. భల్లూకం నేను నా ప్రాణం పోయినా అధర్మం చేయనని చక్కగా చెప్పింది. 'చూశావా హనుమా! జంతువులలోనే ఎంత నీతి ఉందో – అలానే ఉపకారికి అపకారం చేయడమే కాక అపకారికి సైతం ఉపకారం చేసేవారినే మంచివాళ్ళుగా ఎంచుతారు. అందుకే ప్రాజ్ఞులు తమకు అపకారం చేసినా వారిపై కోపగించరు' అని చెప్పింది.

సత్పురుషులు తరతమ భేదాలను చూడరు. వారికి పాపాత్ములపట్ల, పుణ్యాత్ములపట్ల ఒకటే భావం ఉంటుంది. లోకంలో తప్పు చేయనివారు ఎవరూ ఉండరు. కాని రాక్షసుల ప్రవృత్తే ఇతరులను బాధించడం, అలాగని వారిని దండన విధించకూడదు కదా అని చెప్పింది.

అన్నీ విన్న హనుమంతునికి సీతమ్మ ఎంత దయార్ద్రహృదయురాలో అని అనుకొన్నాడు. 'తల్లీ! సీతమ్మా! మీరు ఆ శ్రీరాముని ధర్మపత్నివి అయినందువల్లే మీ లోను శరణాగత వాత్సల్యం కనిపిస్తోంది. ఇక నేను నా ప్రభువు దగ్గరకు వెళ్తాను. మీ సందేశం చెప్పు అమ్మా' అని అడిగాడు.

'నాయనా మారుతీ! శ్రీరాముని దర్శించాలన్న కోరిక తప్ప నాకు ఇతరమైన ఏ కోర్కెలు లేవు. ఆ దేవదేవుని కరుణా కటాక్షాలకోసం నేను తపిస్తున్నాను' అని చెప్పింది. "సీతమ్మా! మీ కోర్కె తప్పక త్వరగా నెరవేరుతుంది. నేను ఇప్పుడే ఈ మీ కోర్కెను రామునికి విన్నవిస్తాను" అంటూ మారుతి రివ్వున దూసుకుపోయాడు.

* * *

# సీత రాముని దగ్గరకు రావటం

## సర్గ – 114

హనుమంతుడు శ్రీరాముని దగ్గరకు వేగంగా వచ్చి సీత మాటలను విన్నవించాడు. 'శ్రీరామా! శోకమగ్నురాలైన సీతమ్మ మీ విజయవార్తను విని చాలా ఆనందించారు. మీ కోర్కె ఏమని నేను అడుగగా శ్రీరామ లక్ష్మణులను చూడాలని చెప్పింది. శ్రీరామా! మీ దర్శన భాగ్యంకోసం సీతాదేవి తహతహలాడుతోంది. మీరు ఆమె కోరికను మన్నించండి ప్రభూ' అని హనుమంతుడు రామునితో చెప్పాడు. శ్రీరాముని హృదయం ఆర్తికి లోనుఅయ్యింది. కన్నీరు వచ్చాయి. శ్రీరాముని మనస్సు ఆవేదనలో దీర్ఘాలోచన చేసింది. ఇప్పుడు ఈ సీతను పరిగ్రహిస్తే లోకోపవాదం రావచ్చు. పరిత్యజిస్తే పాపం తప్పక వస్తుంది. ఇపుడు నేను చేయాల్సిన కర్తవ్యం ఏమిటని ఒక రాజుగా దీర్ఘాలోచన చేశాడు. విభీషణునితో! 'ఓ లంకాధినేతా! నీవు సీతాదేవికి అంతఃపురాంగనతో అభ్యంగనస్నానం చేయించి ఉత్తమ వస్త్రాలను అలంకరింపచేసి నా ఎదుటికి తీసుకొనిరమ్ము' అని చెప్పాడు. విభీషణుడు చిత్తం అని చెప్పి లంకలోనికి వెళ్ళాడు. రాముని కోరిక తీర్చాలని ఆత్రుత పడ్డాడు. వెంటనే త్రిజటా సరమాదులతో సీతాదర్శనం కోరుతున్నానని చెప్పి పంపాడు. సీతమ్మతో మాట్లాడాలి, ఆ అమ్మను రామయ్యదగ్గరకు పంపించాలనే ఆలోచన విభీషణుని నిలువ నీయడంలేదు.

ఎన్నాళ్ళనుంచి ఉన్న కోరికో నేడు తీరబోతోందని అనిపించింది. ఆ విషయాన్ని తలుచుకొన్నకొలదీ ఆనందబాష్పాలు కన్నుల వెంట ధారాపాతంగా కారుతున్నాయి. అంతలో సీతమ్మ అనుమతిని తీసుకొని త్రిజటాదులు పరుగున వచ్చారు. వారూ కూడా సీతారామ సమాగమంకోసం ఎదురుచూస్తున్నారు. ఆ మంచి సమయం రానే వచ్చింది. ఇక సీతమ్మ కష్టాలు గట్టెక్కాయి అని అనుకొన్నారు. విభీషణమహారాజు ఇంకా ఏమన్నా చెప్తూతారేమోనని చెవులప్పగించి నిలబడ్డారు.

సీతాదేవి అనుమతిని పొందిన విభీషణుడు మరుక్షణం సీతమ్మ దగ్గరకు వెళ్ళాడు. 'అమ్మా!' అని పిలిచాడు. "సీతమ్మతల్లీ! "అంటూ తన పరిచయం తాను చేసుకొన్నాడు. రాముని ఆజ్ఞను చెప్పాడు. దానిని అంగీకరించమని వేడుకొన్నాడు.

దానికి సీతాదేవి అభ్యంతరం తెలిపింది. నేను ఈ మలిన వస్త్రంతోనే శ్రీరాముని దర్శిస్తానని చెప్పింది. దానికి "అమ్మా! మీరు మీ భర్త మాట వినడం మంచిది కదా! అయినా పతి చెప్పినట్లుగా నడుచుకోవడం స్త్రీల ధర్మం కదా! శ్రీరాముడు చెప్పినట్లు చేయడమే ఉత్తమమ"ని చెప్పాడు. సీత రాముని ఆజ్ఞను పాటించడానికి ఒప్పుకొంది.

జానకీదేవికి అలంకరణల కన్నా నాథుని దర్శనాభిలాష ఎక్కువగా ఉంది. కానీ, రాముని మాట ప్రకారం నడుచుకోవాలనుకొంది. సీతాదేవి స్నానాదులను ఆచరించింది. సర్వాలంకార భూషిత అయింది. ఒక పల్లకీలో శ్రీరాముని చెంతకు విభీషణాదులతో వచ్చింది. ఆమె రాక రామునిలో సంతోషాన్ని, ఆలోచనను నింపింది. విభీషణుడు సీతాదేవి వచ్చినట్లు రామునితో చెప్పాడు. కాని, ఇంతకాలం రాక్షస మందిరంలో సీత ఉండవలసి

వచ్చినందుకు శ్రీరామునికి రోషం వచ్చింది. విభీషణా! సీతను నా దగ్గరకు తీసుకొని రమ్ము' అని ఉదాసీనంగా చెప్పాడు.

అక్కడ వానరులు, భల్లూకాలు, రాక్షసులు అందరూ గుమికూడి కోలాహలంగా మాట్లాడుకొంటున్నారు. వారినందరిని విభీషణుడు దూరంగా వెళ్ళమని ఆదేశిస్తున్నాడు. వారందరికి సీతాదేవిని చూడాలని ఉన్నందున దూరంగా వెళ్ళమనేసరికి వారిలో బాధ కదలాడింది. అప్పుడు శ్రీరాముడు దాన్ని తెలుసుకొని విభీషణుని వారించాడు.

'రాక్షసరాజా! స్త్రీలకు ఎవ్వరూ రక్షక కవచాలుగా ఉండవలసిన అవసరం లేదు. వారి సద్వర్తనమే వారిని ఎల్లవేళలా కాపాడుతుంది. శారీరక మానసిక బాధలు ఏర్పడినపుడు, యుద్ధభూమిలోను, స్వయంవరంలోను స్త్రీలు కనిపించడం నిషిద్ధం కాదు. అందులో ఏ తప్పు లేదు. సీతాదేవి అనేక బాధలకు లోను అయ్యింది. ఇప్పుడు ఆమె నా సమక్షంలో ఇతరులకు కనిపించడంలో ఏ దోషం లేదు అని శ్రీరాముడు చెప్పాడు. వీరందరూ ఆమెను చూస్తారు. సజ్జనులతోకూడిన నన్ను ఆమె చూస్తుంది అని చెప్పాడు.

అది విని విభీషణుడు సీతాదేవిని తీసుకొని రావాలని పల్లకీ దగ్గరకు వెళ్ళాడు. శ్రీరాముడు చెప్పిన దాన్ని విని లక్ష్మణుడు హనుమ సుగ్రీవాదులు ఆలోచనలో పడ్డారు. ఇది ఏమీ శ్రీరాముని చిత్తం ఇలా ఉంది? ప్రస్తుతం రాముని ముఖ లక్షణాలను బట్టి సీతాదేవి పట్ల అనాసక్తి కనపడుతోంది. ఇప్పుడు సీతపై శ్రీరాముని ప్రేమ తరిగి పోయిందా ఏమిటి? అని వారు మధనపడసాగారు.

మైథిలి మేలి ముసుగును ధరించి పల్లకీ దిగి శ్రీరాముని చెంతకు వచ్చింది. 'ఆర్యపుత్రా!' అని సంబోధించి ఇక ఏమీ మాట్లాడలేక రోదిస్తోంది. సీత మోము ఎత్తి ప్రసన్న వదనంతో ప్రశాంతంగా ఉన్న శ్రీరాముని చూచింది. ఆమె కళ్ళల్లో విస్మయానందాలు తొణికిసలాడినట్లు రామునికి కనిపించింది. రాముని కళ్ళల్లోను అదే భావం సీత చూడగలిగింది.

సీతకు చంద్రుని వంటి శ్రీరాముని దర్శించగానే మనోక్లేశాలన్నీ దూరం అయిపోయాయి. ఆమె పతి చెంత చేరే అదృష్టం వచ్చిందని ఎంతో పొంగిపోతోంది. సీతాదేవి ముఖం నిర్మలమైన చంద్రకాంతులతో విలసిల్లుతోంది.

* * *

# పరుష వాక్కులు

## సర్గ – 115

**సీ**తాదేవిని చూచిన శ్రీరామునికి సంతోషంకన్నా లోకాపవాద భయం ఎక్కువైంది. ఆ గిలితోనే ఆయన సీతతో మాట్లాడాడు. 'ఓ జానకీ! యుద్ధంలో శత్రువును జయించి నీకు రాక్షస చెర నుండి విముక్తి కలిగించాను. అన్యాయంగా ఒక స్త్రీ బాధపడుతుంటే చూచి ఊరుకొనే మనిషిని పురుషుడని చెప్పనవసరంలేదు. అందువలన

నేను నిన్ను అన్యాయంగా తీసుకొనివెళ్ళిన రావణునిపై పగపట్టాను. నేడు నా ప్రతీకారం తీర్చుకొని నీకు రావణుని చెరను తప్పించాను.

ఇప్పుడు నాపై వచ్చిన కళంకంపోయింది. నా ప్రతాపం లోకానికి వెల్లడైంది. నా ప్రతిజ్ఞ నెరవేరింది. ఇప్పుడు నేను స్వతంత్రుడనయ్యాను. దేవీ! చపలచిత్తుడైన రావణుడు నిన్ను అపహరించి మనకిద్దరికి ఎడబాటు కలిగించాడు. ఇది అవమానం. దైవం వలన జరిగినదాన్ని పురుషుడు తన పరాక్రమంతో పోగొట్టుకొంటే వీరునిగా కీర్తించబడతాడు. అందుకనే విధివశాత్తు జరిగిన మన ఎడబాటును నీవు ఆపదలపాలు గావడం. వీటిఅన్నింటినీ నేను రావణుని చంపి తీర్చివేశాను.

నాకు సుగ్రీవుడనే మిత్రుడు దొరికాడు. ఆయన వల్లనే సముద్రంపై సేతువును నిర్మించగలిగాను. ఈ రావణసేనతో యుద్ధం చేయగలిగాను. హనుమంతునివల్ల నీవు ఎక్కడ ఉన్నావో, నిన్ను అపహరించింది ఎవరో తెలుసుకోగలిగాను. అంతేగాక నా భక్తుడైన విభీషణుడు గుణహీనుడైన అన్నను వదిలి నన్ను ఆశ్రయించాడు. ఆయన చేసిన పని నేడు నిష్ఫలం కాలేదు.

శ్రీరాముడు చెప్పే మాటలు సీత వింది. ఆమెకు మనస్సు లోపల నుండి దుఃఖం ఎగదన్నుకొని వచ్చింది. ఆమె నేత్రాలనుండి ధారాపాతంగా కన్నీరు కారసాగింది. ఆ సీతాదేవి అశ్రువులు చూడగానే శ్రీరామునిలో కోపం కలిగింది. ఆమెను క్రీగంట చూస్తూ వానర రాక్షసుల సమక్షంలోనే రాముడు సీతతో పరుషంగా మాట్లాడాడు.

సీతా! దుష్టుడైన శత్రువు వలన కలిగిన అవమానాన్ని మానవునిగా చేయాల్సిన పనిచేసి తుడిచేశాను. రాక్షసుల దుష్కృత్యాలవలన ఏ మానవుడూ, మహర్షి దక్షిణ దిశలో సంచారం చేయలేక ఉన్నపుడు అగస్త్య మహర్షి ఆ దుష్టులను పారద్రోలి మానవులకు ఉపకారం చేశాడు. అలానే నేను శత్రువులను జయించి వారి బారినుంచి నిన్ను రక్షించాను. ఈ వనవాసకాలంలో ఎన్నో ఇబ్బందులకు లోను అయ్యాము' అంటూ రాముడు సీతతో చెప్తున్నాడు.

"శుభంకరీ! సుగ్రీవాది మిత్రులవలన నేడు నేను చేసిన కృషి ఫలించింది. ఇదంతా కేవలం నిన్ను పొందడానికే చేశానని నీవు అనుకోవద్దు. భార్యను రక్షించలేకపోయానని అందరిలో అపవాదువస్తుందనే నేను నిన్ను రక్షించాను. ఇక్ష్వాకువంశానికి అపకీర్తి కలగకుండా నా పరాక్రమాన్ని చూపి శత్రువులను నిర్జించాను. నీవు పరుల ఇంట ఇంతకాలం ఉన్నావు. ఇపుడు నా ఎదుట నీవు నిలబడ్డావు. నీపై నాకు సందేహం వస్తోంది. నేత్ర రోగి దీపకాంతిని చూడలేడు. అందువల్ల దీపానికి దోషం ఉందని చెప్పలేం కదా. అలానే నాకు నీపట్ల అనుమానం కలుగుతోంది.

"జానకీ! ఇప్పుడు నేను నీకు ఇష్టం వచ్చినట్లు వెళ్ళడానికి అనుమతిని ఇస్తున్నాను. నాతో నీకు ఏ పని లేదు. సద్వంశంలో పుట్టిన ఏ పురుషుడైనా పరుల ఇంట ఉన్న తన సతిని తిరిగి ఎలా స్వీకరించగలడు? రావణుడు నిన్ను తన ఒడిలో కూర్చోబెట్టుకొన్నాడు. ఆ దుష్టుని దృష్టి నీపై పడింది. ఆ స్థితిలో ఉత్తమ వంశ సంజాతుడనైన నేను నిన్ను ఎలా పొందగలను. నా వంశప్రతిష్ఠను నిలబెట్టుకోవడానికే నేను ఆ దుష్టుని చెరనుండి నిన్ను విడిచిపెట్టాను."

"నాకు ఇప్పుడు ఏమాత్రం ఆసక్తి లేదు. నీవు నీ ఇష్టంవచ్చిన చోటికి వెళ్ళవచ్చు. నేను దీన్ని నిశ్చయబుద్ధితో చెప్తున్నాను. నీవు లక్ష్మణుని దగ్గరో, భరతుని దగ్గరో కూడా ఉండవచ్చు. అలా కాకపోతే ఈ వానర రాజును ఆశ్రయించి కూడా హాయిగా బ్రతకవచ్చు. సీతా! నీవు రావణుని ఇంట కొద్దికాలం ఉన్నావు. నీవు అతిలోక సౌందర్య వతివి. నీవు రావణుని ఇంట ఉన్నప్పుడు అతని బుద్ధి ఎలా ప్రవర్తించిందో ఏమో నాకు తెలియదు" అని చెప్తున్న రాముని మాటలు చాలాకాలం ఎడబాటు తర్వాత చూసిన భర్త నోటినుంచి రావడం కర్ణకఠోరంగా అనిపించాయి."

ఆమెకు శ్రీరాముని మాటలు ములుకుల్లా గుచ్చుకొన్నాయి. ఆమె సంతత ధారగా ఏడుస్తోంది. ఆమె దుఃఖాన్ని తమాయించుకోలేక శ్రీరాముని మాటలవలన ఏర్పడిన బాధను కన్నీళ్ళ ద్వారా తెలుపుతోంది. సీతమ్మకు నోట మాట రావడంలేదు. రాముని కఠినమైన మాటలకు మ్రాన్పడిపోయింది. నిశ్చేష్టగా నిలబడిపోయింది. ఆమె హృదయం నిశ్శబ్దంగా ఉండిపోయింది.

* * *

# సీత అగ్నిప్రవేశం

## సర్గ - 116

రాముని మాటలతో సీత హృదయం భగ్గుమంది. వానరులు, రాక్షసులు, భల్లూకాలు ఇంతమంది ముందు సీతాదేవి తన భర్త నోటినుండి వినకూడని మాటలు విని సిగ్గుతో కుంచించుకుపోయింది. శ్రీరాముని వాగ్బాణాలు సీత హృదయాన్ని చీల్చివేశాయి. అయినా తనను తాను తక్కువ చేసుకొనే దుస్థితిని తెచ్చుకోవాలనుకోలేదు. తాను ఏమిటో, రామునికే గాదు అక్కడ ఉన్న వారికందరికీ తెలియపర్చాలనుకొంది.

ధీర గంభీరురాలైన సీత హృదయాన్ని దృఢతరం చేసుకొంది. లోకాపవాదుకు వెరచే తన భర్తకు తగిన సమాధానాన్ని ఇవ్వాలని సంకల్పించింది. "మహావీరా! నిమ్నశ్రేణికి చెందినవానివలె మీరు నాతో మాట్లాడుతున్నారు. నేను మీరనుకొన్నట్లుగా నీచబుద్ధి ఉన్న స్త్రీని కాను. మహాబాహూ! నన్ను విశ్వసింపుము. నేను మిమ్మే తలుస్తూ ఇంతకాలం ఎదురుచూశాను.

మానవులకందరికి దేవుడు బుద్ధిని ఇచ్చాడు. విచక్షణజ్ఞానాన్ని ఇచ్చాడు. ఆ విచక్షణ జ్ఞానాన్ని ఎవరు ఉపయోగించుకొంటారో వారు సద్బుద్ధులుగా లోకంలో వాసికెక్కుతారు. మానవునిలో మంచి చెడు అనే లక్షణాలు రెండూ ఉంటాయి. విచక్షణ తెలిసినవారు చెడు ఆలోచనలను అణగదొక్కి మంచిని ప్రేరేపిస్తే వారు మంచివారే అవుతారు. ఇందులో వంశం, కులం అనేవాటికి స్థానం లేదు. దీనితో గుణవంతులు, గుణహీనులుగా మానవులను వర్గీకరించుకోవచ్చు.

ఒకవేళ గుణహీనునిగా ఉన్న మనిషి తన చుట్టూ ఉన్న పరిస్థితుల ప్రభావంతో గుణవంతునిగా మారే అవకాశం ఉంది. అందుకనే ఉత్తమ వంశం, ఉత్తమ కులం అన్నది నానుడిలోకి వచ్చింది. ఎక్కడైతే గుణవంతులే ఎక్కువగా ఉంటారో వారిని ఉత్తమ కుల సంజాతులుగా పేర్కొనవచ్చు. వంశం కూడా అలాంటిదే.

ఒకవేళ ఉత్తమ వంశంగా కీర్తింపబడినవారిలో ఎవరైనా గుణహీనులు కనబడితే వారిని కుక్కమూతి పిందెలుగా అభివర్ణించడం ఈ లోకంలో జరుగుతుంది. దీన్నిబట్టి మానవులలో గుణవంతులు గుణహీనులు అనే రెండు వర్గాలే ఉంటాయని తెలుస్తోంది కదా. అంతేకాదు, ఇందులో స్త్రీ పురుష భేదాలు కూడా ఉండవు. గుణహీనులు పురుషుల్లో ఉన్నట్లే స్త్రీలలో కూడా ఉంటారు.

అందువల్లనే మీరు ఎక్కడో ఎవరో నిమ్నశ్రేణి స్త్రీలు ప్రవర్తన చెడుగా ఉండడం చూచి మీరు స్త్రీలందరిని శంకించడం బాగోలేదు. నా గతచరిత్ర చూచి అయినా నాపై సందేహించడం మీకు తగదు. నేను స్పృహ లేని స్థితిలో ఉన్నపుడు రావణుడు నన్ను స్పృశించి ఉండవచ్చు. అది నా ఇష్టప్రకారం జరిగిన చర్య కాదు. దీనికి మీరు నన్ను శిక్షించాలనుకోవడం నా దురదృష్టం.

నా శరీరం ఇతరులు తాకినప్పుడు అస్వంత్రురాలినైన నేను ఏమి చేయగలను? మనిద్దరం ఇంతవరకూ ప్రేమానురాగాలతో మసలాము. నేడు నాపై సరియైన అవగాహన మీకు లేకపోతే నేను జీవించడమే వ్యర్థం.

శ్రీరామా! నేను ఎక్కడ ఉన్నానో తెలుసుకోవడంకోసం హనుమంతుని పంపావు గదా! నేను లంకలో ఉన్న విషయం మీకు తెలిసిందే గదా. అపుడు మీరు నన్ను ఎందుకు పరిత్యజించలేదు? హనుమంతుని ద్వారా నా విషయం తెలుసుకొన్న మీరు వెంటనే నన్ను వదిలివేసి ఉండవచ్చుగదా.

మీరాపని ఆనాడే చేసి ఉన్నట్లయితే నేడు ఇంత శ్రమపడాల్సిన అవసరం ఉండేది కాదు గదా. నేను ఆనాడే ప్రాణ త్యాగం చేసి ఉండేదాన్ని. అపుడు మీ మిత్రులకు కూడా శ్రమ తప్పి ఉండేది కదా. సామాన్యునివలె ఆలోచిస్తూ మీ శీలస్వభావాలు మరిచినట్లు ఉన్నారు.

సదాచారవంతుడా! జనకుడు నన్ను పెంచి పెద్ద చేసినందువల్ల నేను జానకిగా పేరు పడ్డాను. కాని నేను నిజానికి అయోనిజను. దివ్య వనితను. మీరు ఈ విషయం పరిగణింపలేదు. నా బాల్యమందే మీరు నిండుసభలో నా పాణిని గ్రహించారు. ఈ విషయాన్ని కూడా విస్మరించారు. మనసా వాచా కర్మణా మనిద్దరం ఒకరికోసం మరొకరు జీవించే సామర్థ్యాన్ని కలిగి ఉన్నాం కదా. అలాంటి మీరు నేడు ఇలా మాట్లాడడం నాకు ఆశ్చర్యాన్ని, దుఃఖాన్ని కలిగిస్తోంది” అని సీతాదేవి రామునితో అంటోంది.

హృదయభారాన్ని దించుకుంటూ సీతాదేవి రోదిస్తోంది. ‘లక్ష్మణా! నేను మిథ్యాపవాదాన్ని భరించలేను. నీవు నా కొరకు చితిని ఏర్పరుచు. ఈ తీరని దుఃఖానికి ఇదే దివ్యౌషధం. నా గుణ శీలాలతో నా భర్త సంతుష్టుడు కాలేదు. ఆ స్వామి నన్ను అందరి ముందు పరిత్యజించాడు. ఇక ఆయనకు నమ్మకం కలిగించడానికి అగ్నిప్రవేశం ఒక్కటే శరణ్యం’ అని చెప్పింది.

వదినమ్మ మాటలు లక్ష్మణునిలో తీరని దుఃఖాన్ని తెచ్చిపెట్టాయి. దీనాతిదీనంగా రాముని వంక సౌమిత్రి చూశాడు. ఆయన ఆంతర్యాన్ని గుర్తించి మారుమాట లేకుండా చితిని పేర్చాడు. శ్రీరాముడు సీతను చూడకుండా నేలపై తన దృష్టిని నిలిపాడు. సీతాదేవి శ్రీరామునికి ప్రదక్షిణం చేసింది. నమస్కరించింది.

ఆ తర్వాత చితి దగ్గరకు వచ్చి అగ్నికి చేతులు జోడించి నమస్కరించింది. 'నా హృదయం ఒక్క క్షణం ఐనా శ్రీరాముని ధ్యానాన్ని మరవకుండా ఉండేటట్లయితే నన్ను ఆ అగ్నిదేవుడు అన్నివిధాలుగా కాపాడుతాడు. నా చరిత్ర కళంకం కానట్లు అయితే, నా పతి అన్యాయంగా నిరాధారమైన నిందను నాపై మోపి ఉన్నట్లు అయితే లోకసాక్షి అయిన అగ్ని నన్ను రక్షించుగాక!

నేను త్రికరణశుద్ధిగా ధర్మజ్ఞుడైన రాఘవుని అనుసరించి ఉన్నచో అగ్నిదేవుడు నన్ను రక్షించి తీరుతాడు. సూర్యచంద్రాదులు, దిశల అధిదేవతలు, దివారాత్రాలు, ఉభయ సంధ్యలు, భూదేవి నన్ను పవిత్ర చరితగా గుర్తించుతారు' అని అగ్నిదేవుని ప్రార్థించింది.

ఆబాలవృద్ధులు చూస్తుండగానే సీతాదేవి అగ్నిలో ప్రవేశించింది. అలా అగ్నిలోదూకే సీతను అందరూ అమూల్యమైన దానిగా చూశారు. ఆమె అలా అగ్నిలో ప్రవేశించటం చూచి స్త్రీలందరూ గగ్గోలుగా అరిచారు. అగ్నిలో సీత ప్రవేశించగానే అగ్ని జ్వాలలు ఉవ్వెత్తుగా ఎగిశాయి. దేవ దానవ యక్ష కిన్నరాదులు సిద్ధులు మహర్షులు అందరూ ఆ అపురూపమైన సీతను చూశారు. వారందరూ హాహాకారాలు చేస్తున్నారు.

* * *

# బ్రహ్మాది దేవతల స్తుతి

## సర్గ - 117

అందరి హాహాకారాలు రాముడు విన్నాడు. తన ప్రియసతి అగ్నిలో దూకడం చూశాడు. రాముడు తాను చేసినపనికి ఎంతో ఖిన్నుడై కంటతడి పెట్టుకొన్నాడు. రాముడు ఆలోచనాంతరంగుడు అయ్యాడు.

కుబేరుడు, పాపాత్ములను శిక్షించే యముడు, దేవేంద్రుడు, దిక్పాలురు, వృషభధ్వజుడు, ముక్కంటి సర్వసంపత్ప్రదుడు ఐన శంకరుడు, బ్రహ్మదేవుడు అందరూ దివ్య విమానాలు ఎక్కి లంకకు వచ్చారు. వారందరూ శ్రీరాముని ఎదురుగా నిలిచారు.

'రామా! నీవు సర్వప్రాణికోటి ఉత్పత్తికి కారకుడవు. జ్ఞానులలో అగ్రేసరుడివి. సర్వశ్రేష్ఠుడవైన నీవు సీతాదేవి అగ్నిప్రవేశం చేస్తుంటే ఉపేక్షించావు ఏమి? శ్రీరామా! నీవు బ్రహ్మాది దేవతలకు అధికుడవైన శ్రీమన్నారాయణుడివి. నీవా విషయం ఎందుకు తెలుసుకోలేకుండా ఉన్నావు. నీవు ఋతధాముడను ప్రజాపతివి, ఆది సృష్టికర్తవు, స్వయంభువుడవు. రుద్రులలో ఎనిమిదవ వాడివి మహాదేవుడవు. సాధ్యులలో ఐదవవాడవైన నీవు వీర్యవంతుడవు.

అశ్వినీ దేవతలు నీ కర్ణాలు, సూర్యచంద్రాదులే నీ నేత్రాలు. నీవు ఉత్పత్తి వినాశరహితుడవు. సర్వేశ్వరునివైన నీవు ఒక సామాన్యునివలె ప్రవర్తిస్తున్నావు' అని వారందరూ ముక్తకంఠంతో రామునితో చెప్పారు. ఆ మాటలు విని రాముడు 'ఓ దేవతలారా! నేను ఇంతవరకూ దశరథ మహారాజు తనయునిగానే తలచాను. ఒక సామాన్యుడిననే భావమే నన్ను ఆవరించి ఉంది. ఒకవేళ అలా కానట్లయితే నేను ఎవరో ఎవరికి చెందినవాడినో, నా ఉనికికి ప్రయోజనం ఏమో నాకు మీరు చెప్పండి' అని అడిగాడు.

అలా మాట్లాడే శ్రీరాముడిని చూచి బ్రహ్మ! 'ఓ సత్య పరాక్రమా! నీకు యథార్థం చెప్తాం. నీవు జగత్కారకుడవైన నారాయణుడవు. నీకు ఈ జగత్తు ఒక క్రీడాపరికరం. లక్ష్మీదేవి నీ హృదయ స్థానాన్ని అలంకరించి నిన్ను సర్వేశ్వర సంపన్నుడిగా చేసింది. నిరుపమానమైన సుదర్శన చక్రం నీ ఆయుధం. నీవు సర్వవ్యాపకుడవు. ఆదిమధ్యాంతరహితుడవు. పుట్టుకలేనివాడివి. నీవు ఏకశృంగంతో వరాహమూర్తివై భూమండలాన్ని ఉద్ధరించావు.

సర్వలోక శ్రేయస్సుకోసం నిన్ను నీవు సృజియించుకొంటావు. నాశరహితుడివి. ధర్మస్వరూపివివైన నీవు ధర్మార్థ కామ మోక్షాలనే పురుషార్థాలను అనుగ్రహిస్తావు. శార్ఙ్గం అనే ధనుస్సును ధరించినవాడివి. సర్వప్రాణులకు అంతరాత్ముడివే. నిత్యానిత్యాలకు అతీతుడివి. ఆశ్రితజన పక్షపాతివి. నందకమనేది నీ ఖడ్గమే.

విశ్వమంతా వ్యాపించి ఉన్నవానివి శుద్ధ సత్యస్వరూపుడవు. సృష్టిస్థితి లయాదులకు కారణుడవు నీవు. కారణాకారణభూతునివీ నీవే. ఇంద్రుని సోదరునివైన నీవు ఉపేంద్రుడవు. మధువు అనే రాక్షస సంహారం చేసినవాడివి. నాభి యందు పద్మం కలిగినవాడివి. నా జనకుడవు నీవు. ఇంద్రుని సృజించగలిగినవాడివి నీవే. శరణాగత వత్సలుడివి. సహస్ర శాఖలుగా విస్తరిల్లిన సామవేద స్వరూపివైన నీవు సనకాది మహర్షుల చేత స్తుతించబడేవాడవు. ముల్లోకాలకు కర్తవు నీవే. సదా సద్విచక్షణుడవు. ముక్తులకు భక్తులకు ఆశ్రయమైనవాడవు.

ఓంకార స్వరూపుడవైన నీవే యజ్ఞం, వషట్కారం ఓంకారం. నీవు అనంత మహిమా స్వరూపుడివి. నీ ఆవిర్భావం నీ తిరోభావం ఎవ్వరూ ఎరుగలేరు. నీ స్వరూప స్వభావాలను గూర్చి వేదాలుగాని, వైదికులు గాని, తెలుసుకోలేరు.

నీవు సర్వాంతర్యామివి. అందుకనే పర్వతాలలోను, నదుల్లోను, ప్రాణుల్లోను, దిక్కుల్లోను, ఆకాశంలోను, భూమిలోను నీవే సంచరిస్తూంటావు. సమస్త భూమండలానికి ఆధారుడవైననీవు అసంఖ్యాక నేత్రాలు, శిరస్సులు నీకు ఉన్నాయి. లోకం అంతా ప్రళయంలో అంతం అయిపోయినా నీవు శేషశాయివై చిరంజీవులైన మార్కండేయాది మహర్షులకు దర్శనమిస్తావు.

శ్రీరామా! నేను నీ హృదయాన్ని, సరస్వతీదేవి నీ జిహ్వను ఆశ్రయించి ఉన్నాం. ప్రభూ! పరబ్రహ్మ స్వరూపా! నీ అంగాలపై ఉండే రోమాలు దేవతలు, నీవు కన్నురెప్పలు మూసి తెరచినంతనే రాత్రి పగలు ఏర్పడుతాయి. నీ ఉచ్ఛ్వాసనిశ్వాసాలే వేదాలు. సమస్తానివి నీవే కారణుడవు. నీవు లేనిది ఏదీ లేదు. ఈ జగత్తు అంతా నీ శరీరమే' అంటూ రామునితో సకలదేవతలతో కూడిన బ్రహ్మ చెప్పుతున్నాడు. వానరులందరూ జరుగుతున్నదాన్ని ఆశ్చర్యానందాలతో చూస్తున్నారు.

'ఓ శ్రీరామా! పృథ్వి నీ స్థిర స్వరూపం, అగ్నిలోని ఉష్ణం నీ కోపం, చంద్రునిలోని చల్లదనం నీ అనుగ్రహం. శ్రీవత్సం అనే చిహ్నం ఉన్న శ్రీమన్నారాయణుడవూ నీవే. బలిని అదుపు చేయడం కోసం నీవే నిన్ను వామనుడిగా సృజించుకొన్నావు. ముల్లోకాలను ఆక్రమించిన త్రివిక్రముడివి నీవే. మహేంద్రునకు దేవతల ఆధిపత్యాన్ని ఇచ్చినవాడివి కూడా నీవే.

ఈ సీతాదేవియే లక్ష్మీదేవి. నీవు మహావిష్ణుడవు. ఎక్కడ ధర్మానికి గ్లాని జరుగుతుందో; ఎక్కడ సాధువులు ఇక్కట్లపాలు అవుతారో అక్కడ నీవే నిన్ను సృజియించుకొని దుష్టశిక్షణశిష్టరక్షణ చేస్తావు. రాబోయే ద్వాపర యుగంలోను దుష్టుల శిక్షణార్థం శ్రీకృష్ణునిగా ఆవిర్భవించబోతున్నావు.

లోక కంటకుడిగా ఉన్నరావణుని వధించడానికే నీవు శ్రీరామునిగా దశరథనందునిగా సృష్టించుకొన్నావు. ధర్మసంస్థాపనా కార్యాలలో దక్షుడవైన నీవు నేడు లోకకంటకుని నిర్మూలించి సాధు జనులకు మహోపకారం చేశావు. ఇప్పుడు నీ సంకల్పం ప్రకారం నీవు పరంధామం చేరు. రఘురామా! నీ తేజో పరాక్రమాలు అమోఘాలు. అనితరసాధ్యాలు. నీ దర్శనం అత్యంత ప్రభవాన్వితం నిన్ను స్తుతించడం ద్వారా ఐహికాముష్మిక ఫలాలు అందుతాయి. అనన్య భక్తితో నిన్ను సేవించినవారికి మనోరథాలన్నీ ఈడేరుతాయి.

శ్రీరామా! నీవు పురాణ పురుషుడవు. నిత్యుడవు. నాశరహితుడవు. నీవు పరబ్రహ్మానివని తలచి నిన్ను సేవించినవారికి లౌకిక సంపదలు కలిగితీరుతాయి. మోక్షం వస్తుంది. శ్రీరామస్తవం వేద ప్రతిష్ఠితం అయ్యింది. ఋషిప్రోక్తమైంది శాశ్వతమైంది. ఈ ఇతిహాసాన్ని చదివిన మానవులకు పునర్జన్మ ఉండదు. కైవల్యపద ప్రాప్తి వస్తుంది. ఇందులో ఏ సంశయం లేదు' అని బ్రహ్మ, శ్రీరామునికి చెప్పాడు. శ్రీరాముడు అన్నీ విన్నాడు. వానరులందరూ నిశ్శబ్దంగా ఉన్నారు. ప్రకృతి అంతా కూడా శబ్దం లేకుండా ఉంది. వాయువు నెమ్మదిగా వీస్తోంది. జలాలు నిర్మలంగా నిశ్చలంగా ఉన్నాయి.

* * *

# అగ్నిదేవుని సాక్ష్యం

## సర్గ – 118

శ్రీరాముడు ఎవరో? ఎందుకోసం ఈ భూమండలానికి వచ్చాడో బ్రహ్మదేవుడు శ్రీరామునితో చెప్పాడు. ఆ తర్వాత అగ్నిదేవుడు తన పుత్రిక లాంటి సీతను పైకి తీసుకొచ్చాడు. హవ్యవాహనుడు దివ్య రూపధారియైన సూర్యకాంతి వంటి తేజోపుంజంలాగా వున్న సీతాదేవిని సమిధలను ప్రక్కకు తొలగించి తీసుకొచ్చాడు. ఆమె ధరించిన ఎర్రని పట్టువస్త్రం, ఆభరణాలు సీత దేహ సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి. లోకసాక్షి ఐన వైశ్వానరుడు వైదేహిని శ్రీరామునకు అప్పగిస్తూ ఇలా చెప్పనారంభించాడు. "శ్రీరామా! ఈ జానకిలో లేశమాత్రం కూడా దోషం లేదు. ఈ దేవి వాక్కులు పవిత్రాలు. మనస్సు, బుద్ధి స్వచ్ఛమైనవి. త్రికరణశుద్ధితో నిన్నే ధ్యానిస్తోంది. ఈ పుణ్యాత్మురాలు నిన్ను తప్ప అన్యమెరుగనిది. నిర్జనారణ్యంలో నీవు లేనపుడు ఒంటరిగా ఉన్న ఈ సీతను

రావణుడు అపహరించాడు. ఈ మైథిలిని రావణుడు లంకలోని అశోకవనంలో రహస్యంగా దాచాడు. వికృత ఆకారాలున్న రాక్షస స్త్రీలు ఆమెను నిరంతరం కాపలా కాచారు.

సీత ఎల్లప్పుడు నిన్నే తలుచుకొని దుఃఖిస్తుండేది. రావణుడు పలు విధాలుగా ఈమెను ప్రలోభపెట్టాలని చూశాడు. ఐనా ఈమె ధీరోదాత్తయై దృఢచిత్తురాలు అయ్యింది. రావణుడు ఈమె మనసును మార్చలేక చివరకు చంపివేస్తానని బెదిరించాడు. రఘురామా! ఈ సీతలో ఏ దోషాన్ని ఎవరూ చూపించలేరు. ఈమెను నీవు స్వీకరించు ఇది నా ఆజ్ఞ" అని చెప్పాడు. ఆ మాటలకు సంతసించిన రాముడు కంట తడిపెట్టాడు. ఉత్తమురాలు ఐన సీతను నేను పరుషవాక్కులతో నొప్పించానని చింతించాడు. క్షణకాలం ఆలోచించాడు. "హవ్యవాహనా! ఈ సీతాదేవిలో ఏ దోషం లేదని నాకు ముందే తెలుసు. కాని, ఈమె పరుని ఇంట చాలాకాలం ఉంది. ఇపుడు నేను ఈమెను ఏమీ మాట్లాడకుండా స్వీకరిస్తే లోకులందరూ నన్ను కామపరతంత్రునిగా ఎంచుతారు. నన్ను మూర్ఖునిగా భావిస్తారు. ఈ జనకనందిని నాకు ఎప్పుడూ ఎదురు చెప్పలేదు. ఈమెపై నా అనురాగం లేశం కూడా తగ్గలేదు. నేను సీత ఇద్దరం అనురూపులమే. మా ప్రవర్తన, బుద్ధి, చింతన అన్నీ ఒకేవిధంగా ఉంటాయి. కాని, ఈ విషయం తెలియని లోకులు అల్పబుద్ధితో ఆలోచించి వైదేహిని తూలనాడే అవకాశం ఉంది.

అందుకనే, నేను ఈ పరీక్షకు సీతను నిలబెట్టాను. నా చిత్తంలోని ఆలోచనను సీత గ్రహించే ఉంటుంది. మిథిలా రాజకుమారి ప్రజ్వలిస్తున్న అగ్నిలాంటిది. ఈమె పరులకు దొరకడం అసాధ్యం. ఈమె యెడ ఎవరూ ఏ అఘాయిత్యమూ చేయలేరు. సూర్యుడిని సూర్యకాంతిని వేరు చేయలేనట్లుగా మా ఇద్దరిని ఎవరూ వేరు చేయలేరు. నా ప్రేమ సామ్రాజ్యంలో అధిదేవత ఐన ఈ సీతకు వేరొకరి సంపదతో పనిలేదు. ఈమెకు ముల్లోకాలలోను సాటి ఎవ్వరూ రారు. ఈమెను నేను పరిత్యజించుట అసంభవం.

లోకమాన్యులు ఆత్మీయులు ఐన మీరు నా హితం కోరి చెప్పారు. మీ వచనాన్ని పాటించటం నా కర్తవ్యం అయినా ప్రజలకోసం నేను ఇది అంతా చేశాను" అని చెప్పాడు రాముడు. ఆయన మాటలు విని అక్కడి వారందరూ రాముణ్ణి ప్రశంసించారు. అపుడు ఎంతో సంతోషంగా సీతాదేవిని రాముడు దగ్గరకు తీసుకొన్నాడు. ఆ అనురూపులైన దంపతులు సంతోషించారు.

* * *

# పరమ శివుని ఆజ్ఞ

## సర్గ – 119

**అ**క్కడే ఉన్న బ్రహ్మాది దేవతలందరూ అగ్నిదేవునితో రాముని సంభాషణ విని సంతోషించారు. సకలదేవతలు రాముడు ఏం చేస్తాడోనని చూస్తున్నారు. బ్రహ్మదేవుడు శ్రీరాముని వైకుంఠానికి వచ్చేయమని చెప్పాడు.

శ్రీమన్నారాయణుడు అలనాడు దశరథుని పుత్రుని తన్నుతాను సృజియించుకొని రావణుని సంహరించి పదకొండు వేల సంవత్సరాలు రాజ్యాన్ని పాలిస్తాను, అని ధర్మ సంస్థాపనం చేస్తానని చెప్పిన మాటలు, దేవతల కోరికనూ, వారి అభీష్టానికి నారాయణునితో చెప్పిన వైనం పరమశివుని మనస్సున మెదిలాయి. అపుడు పరమేష్ఠి శ్రీరామునితో మాట్లాడాలనుకొన్నాడు.

"శ్రీరామా! నీవు ఇంతకుముందు చెప్పినట్లుగానే అన్నీకార్యాలు చేపట్టి పూర్తిచేయి. చిమ్మచీకటిలాంటి అజ్ఞాననిధియై'న రావణుని నీ పరాక్రమం ద్వారా నాశనం చేశావు. మా అందరి అదృష్టవశంతో లోకవినాశకరుడైన రావణుడు అంతరించిపోయాడు. శ్రీరామా! దైన్యంలో మునిగి నిన్నే కలవరిస్తున్న నీ సోదరుని భరతుని ఊరడిల్లింపచేసే బాధ్యత నీపై ఉంది. అందుకనే యశస్విఅయిన కౌసల్యను సుమిత్రా కైకలను కూడా నీవే ఓదార్చవలసి ఉంది. భరతుని సంరక్షణలో ఉన్న కోసల రాజ్యాన్ని నీవే పరిరక్షించి ధర్మసంస్థాపన చేయాలి.

బంధుమిత్రులను రాజ్యంలోని పౌరులందరిని ఏకత్రాటిపై నడిపించే బాధ్యత నీ భుజస్కంధాలపై మోయాలి. వారందరిలో జీవనాడిలో ధర్మాన్ని అంతర్వాహినిగా ప్రవహించేలాగా చేయాలి. న్యాయమూ, ధర్మమూ ప్రజల ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా నీవే చేయాలి.

యజ్ఞయాగాది కార్యాలను చేసి ప్రజల దృష్టి ఎప్పుడూ సాధుత్వంపై ఉండేలాగా చేయాల్సిన కర్తవ్యం కూడా నీదే సుమా! ఇన్ని కార్యాలను చేసి తిరిగి నీవు వైకుంఠాన్ని చేరి లక్ష్మీతో కూడి దివ్య సుఖాలను అనుభవించు" అని పరమశివుడు శ్రీరామునితో చెప్పాడు.

రఘురాముడు పరమశివుని మాటలను మంత్రముగ్ధుడై వింటున్నాడు. ఆయననే చూస్తున్నాడు. మరలా మహేశ్వరుడు "రఘుకులనందనా! ఇటు చూడు. ఈ గగనాన పుష్పక విమానంలో సర్వశ్రేష్ఠునిగా కొనియాడబడిన మీ తండ్రి ఐన దశరథుడు ఉన్నాడు. మిమ్ములను కని పెంచి పుణ్యం సంపాదించి నేడు ఇంద్రలోకం చేరి ఉన్నాడు. నేడు నిన్ను, లక్ష్మణుడిని, సీతను చూడటానికి వచ్చాడు. మీరు విమానం ఎక్కి ఇతనిని చూడండి" అని శివుడు చెప్పాడు.

శివుని మాట ప్రకారం రఘుకుల నందనులు దశరథుని చూశారు. అమితానందం పొందారు. వారి నయనాలు అశ్రుపూరితాలు అయ్యాయి. ఆయనకువారు ముగ్గురూ చేతులెత్తి నమస్కరించారు. దశరథుడు తనసుతులను చూశాడు. కళ్ళలో ఆనందబాష్పాలు రాలుతుండగా వారిని దగ్గరకు రమ్మని సైగచేశాడు. వారు దగ్గరకు రాగానే రామలక్ష్మణులను కౌగిలించుకొని తన ఒడిలో కూర్చోబెట్టుకొని ఆనందించాడు. "రామా! నీవు లేని ఈ స్వర్గం కూడా నాకు వెలితిగానే తోస్తోంది. ఆనాడు కైక మాట్లాడిన మాటలను నేను మరువనే లేదు. నేడు దుష్టరావణుని చంపి లోకులందరికి ఆనందాన్ని పంచిన మిమ్ములను చూస్తుంటే నాకు చాలా ఆనందం వేస్తోంది. మీరు వనవాసం ముగించుకొని తిరిగి అయోధ్యా రాజ్యాన్ని పొందుతున్నావని తెలిసి నాకు మితిమించిన సంతోషం వేస్తోంది. శ్రీరామా! నీవు అష్టావక్రుని వంటివాడవు.

అష్టావక్రుడు తల్లిగర్భమునందు ఉన్నప్పుడే తండ్రి చేత శపించబడినాడు. అష్టావక్రుని జననం తర్వాత తండ్రి అయిన ఏకపాదులు ధనార్జన కోసం జనకుని సభకు వెళ్ళాడు. అక్కడ వందితో శాస్త్రచర్చ చేసి పందెంలో

ఓడిపోయి జల దిగ్బంధన శిక్ష అనుభవిస్తున్నాడు. అష్టావక్రుడు శ్వేతకేతునితో కలిసి ఉద్దాలకుని దగ్గర వేద విద్యాభ్యాసం చేసాడు. ఒకసారి వీరిద్దరికి తండ్రి విషయంలో మాట పట్టింపు వచ్చింది. దానితో కుపితుడైన అష్టావక్రుడు జనకుని సభకు వెళ్ళి వందిని ఓడించి తన తండ్రికి బంధవిముక్తిని కలిగించాడు.

ఆ విధంగా నీవు చేసిన కార్యాలతో నేను పునీతుణ్ణి అయ్యాను" అని దశరథుడు తన ఆనందాన్ని తన పుత్రులతో పంచుకొన్నాడు.

"శ్రీరామా! రావణుని వధించాల్సిన అవసరం ఉన్నందున దేవతలందరూ నీ పట్టాభిషేక మహోత్సవానికి అవాంతరాలు కల్పించారని నేడు నాకు అర్థం అయ్యింది. నాకు ఆ విషయం తెలియక నేను నిన్ను పొగొట్టుకున్నానని అనుకొన్నాను. అరణ్యాలలో ఎన్ని కష్టనష్టాలు పడుతావో వాటినన్నింటిని ఎలా భరిస్తావోనని అల్లాడాను. నాకు ఒక్కనికే నీవు దూరమయినా నేడు లోకకంటకుడైన వాణ్ణి సంహరించి లోకకల్యాణం చేశావు. దీనివలన నాకు అమితానందం కలుగుతోంది.

"ఓ శ్రీరామా! నిన్ను కన్న కౌసల్య ఎంత పుణ్యం చేసుకొందో? అయోధ్యా వాసులందరూ కూడా పుణ్యాత్ములే. నీవు నీ పట్టణపురాణి సీత ఇద్దరూ సాకేతపురికి పట్టాభిషిక్తులు అవుతుండడం వారందరూ చూచి తరించి పోతారు. నీ తమ్ములైన లక్ష్మణభరతశత్రుఘ్నులు మీకు సేవ చేసి కీర్తిని గడిస్తారు. మిమ్ములనందరని మీ తల్లులు చూచి ఆనందిస్తారు. మీరు చేసే ఘనకార్యాలను వారు చూచి మీ యశస్సును చూసి సంతోషిస్తారు."

"శ్రీరామా! మీరిద్దరూ మీపై అత్యంత ప్రేమను పెంచుకొన్న భరతశత్రుఘ్నులతో కలవబోతున్నారన్న విషయం నాకు సంతోషాన్ని ఇస్తోంది. నా కొడుకులు కోడళ్ళు అందరూ ఇక సంతోషంగా కాలం గడుపుతున్నారన్న విషయం నాకు స్వర్గానికన్నా ఎక్కువ ఆనందాన్నిస్తోంది.

"కుమారా! నీవు శత్రువులను నాశనం చేసి దేవతలకు కూడా ప్రీతునివి అయ్యావు. నీ కీర్తిప్రతిష్ఠలు ఇనుమడించాయి. నీ వలన మన వంశానికి ఆచంద్రార్కమైన కీర్తికాంత దొరికింది. ఇక సోదరులతో కలిసి చిరకాలం సుఖ సంపదలు పొందు. ఇలానే మన వంశగౌరవాన్ని పెంచు" అని దశరథుడు సీతారామ లక్ష్మణులను ఆశీర్వదించాడు.

అప్పుడు రఘురాముడు తండ్రిని అనుగ్రహించమని కోరాడు. "తండ్రీ! విషయం తెలియక నా తల్లి కైకను అనురాగుడైన భరతుని త్యజిస్తానని అని అన్నారు. ఇపుడు నిజం తెలుసుకొన్న మీరు వారిని కనికరించి మీ మాటలను ఉపసంహరించుకొనండి తండ్రీ!" అని రాముడు తండ్రిని అడిగాడు.

రాముని మాటలు విని దశరథుడు తన మాటలను వెనక్కు తీసుకొన్నాడు. ఆ పుత్రులిరువురిని మరల కౌగిట బంధించాడు. "లక్ష్మణా! నీవు భక్తిశ్రద్ధలతో అన్నవదినలను సేవించావు. ధర్మాన్ని పాటించావు. నీకు తప్పక సర్వసౌఖ్యాలు కలిగి తీరుతాయి. రాముడు సర్వలోక శుభంకరుడు. ఆయనను నీవెల్లప్పుడూ అనుసరించే ఉండు" అని దశరథుడు లక్ష్మణునకు చెప్పాడు.

“అమ్మా సీతా! శ్రీరాముడు నిన్ను అగ్నిపరీక్షకు గురిచేశాడని కినుక వహించకు. నీ పవిత్రత లోకాన వెల్లడించడానికే రాముడు ఆ పనిచేశాడు. జానకీ! నీకు నీ పతి సేవాభాగ్యం గురించి వేరుగా చెప్పాల్సిన పనిలేదు. శ్రీరాముడు సర్వదేవతలలోను అంతర్యామిగా ఉన్నాడు. మహర్షుల చేత పూజలందుకొనేవాడు. సీతా! నీవు నీ భర్తతో కూడి సమస్త సుఖాలను అనుభవించు” అని సీతను కూడా దశరథుడు ఆశీర్వదించాడు. రామలక్ష్మణులతో తనివి తీరా ముచ్చట్లాడి సీతారాములకు లక్ష్మణులకు ఆశీర్వచనాలు ఇచ్చి దివ్యవిమానం ఎక్కి దశరథుడు సంతోషంగా అమరావతిని చేరుకొన్నాడు.

దశరథునితో మాట్లాడి సీతారామలక్ష్మణులు సంతోషంలో మునిగిపోయారు. వారిని కలుసుకొని దశరథుడు ఆనందంతో దివికి వెళ్ళడానికి ఉద్యమించాడు. సకలదేవతలు రావణవధానంతరం సంతోషంగా ఉన్నారు. విభీషణాది రాక్షసగణం కూడా అధర్మం నశించిందని ఇకపై ధర్మాచరణతో ఉంటే అంతా ప్రశాంతంగా ఉంటుందని అనుకొన్నారు. సర్వజనుల మనసు శాంతిపొందింది.

* * *

# సజీవులైన వానరులు

## సర్గ - 120

దశరథుడు సంతోషంగా ఇంద్రలోకం వెళ్ళాడు. అప్పుడు దేవేంద్రుడు శ్రీరాముని చూసి “దశరథనందనా! మాకు నీవు చేసిన పని చాలా సంతోషాన్ని ఇస్తోంది. రఘురామా! ఇప్పుడు మీకేదైనా సహాయం కావాల్సి ఉంటే నన్ను అడగండి చేస్తాను” అని చెప్పాడు.

“ఓ దేవేంద్రా! మీరు వాగ్విశారదులు. మీరు నాకు నిజంగా సహాయం చేయాలని వాంఛించినట్లు అయితే నా కోరికను ఇప్పుడే చెప్తాను. నా కోసం ఈ భల్లూక వానరులందరూ ప్రాణాలకు తెగించి రావణుని సైన్యంతో పోరాడారు. సముద్రంపై సేతువును నిర్మించారు. నేను దుష్ట రావణుని దునుమాడడానికి ఎంతో సహాయం చేశారు. అట్టి మహోన్నతులైన వీరందరూ రామ రావణ మహాసంగ్రామంలో విగతజీవులై పడిపోయారు. మీకు సమ్మతం అయితే, నాకు మీరు సాయం ఒనర్చాలనుకొంటే, ఈ మృతులైన వానరులందరినీ పునర్జీవితుల్ని చేయండి! ఇంతకన్నా నేను కోరేది ఏమీ లేదు” అని రాముడు దేవేంద్రునికి చెప్పాడు.

‘ఓ మహేంద్రా! వీరందరూ తమ తమ భార్యాబిడ్డలను వీడి నా కోసమై వచ్చారు. వీరందరూ తిరిగి వారి ఆత్మీయులతో సుఖంగా ఉండాలని నా కోరిక. అంతేగాదు, ఈ వానరులు, భల్లూకాలు ఎక్కడున్నా వారికి కావాల్సిన మధుర ఫలాలు, కందమూలాలు జలాలు సమృద్ధిగా సర్వకాలాలలో వారి దొరికేలాగా చేయండి’ అని రాముడు చెప్పాడు.

దేవేంద్రుడు రాముని కోరికను విన్నాడు. ‘రఘువీరా! నీ కోరిక మహోన్నతమైంది. ఇది నీకు వానరులపై ఉన్న ప్రేమ వాత్సల్యాలను తెలుపుతోంది. ఇందువలన నీ ఔన్నత్యం కూడా వెల్లడి అవుతోంది. నేను ఇచ్చిన

మాటకు కట్టుబడి ఉండేవానిని. అందుకే అంగవికలురైన వానర భల్లూకాలతో సహా మృతులైన వానర సేననంతా తిరిగి స్వస్థులుగా అయ్యేటట్లుగా పునర్జీవితులు కాగలిగేటట్లుగా చేస్తున్నాను' అని సురరాజు చెప్పాడు.

'అంతేకాదు రఘువీరా! వీరందరూ వారి వారి గాయాలు మాని స్వస్థులై పూర్తి ఆయురారోగ్యాలతో జీవిస్తారు. ఎప్పటిలాగా బలశౌర్య పరాక్రమాలను తిరిగి పొందుతారు. వీరందరూ నిద్రనుండి లేచినట్లుగా ఇప్పుడే లేస్తారు. నీవు కోరినట్లుగానే అన్ని ఋతువులలోను వానరులకు ఇష్టమైన రంగు రంగుల పువ్వులు, కాయలు ఫలాలతో కూడిన వృక్ష సంపద, జల సంపద వీరున్న చోట సమృద్ధిగా ఉంటుంది' అని చెప్పాడు.

శచీపతి నోటినుంచి మాట వచ్చిరాగానే సమరభూమిలో ఎక్కడ పడిఉన్న వారు అక్కడనుండి నిద్ర మేల్కొనినట్లుగా మేల్కొని, లేచి నిలబడ్డారు. వారందరికి పూర్తి ఆరోగ్యం చేకూరింది. ఏమీ జరుగనట్టుగా ఏ బాధలేకుండా నిలుచున్నారు. వారిని చూస్తున్నవారందరూ సంతోషించారు. వానరులందరికి ఆశ్చర్య ఆనందాలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. వారందరు శ్రీరామలక్ష్మణులకు జయధ్వానాలు చేశారు.

సంతోషితస్వాంతులై వారందరిని బ్రహ్మాది దేవతలు ఆనందంగా చూశారు. 'శ్రీరామా! ఇక నీవు వీరందరికీ వారి వారి స్థానాలకు వెళ్ళమని ఆదేశాలను ఇమ్ము. సుగ్రీవాదుల్ని సంతోషపరచు. నీ కర్తవ్యపాలనకు ముందడుగు వేయి' అని చెప్పారు.

'రఘువీరా! సోదర మిత్ర సమేతుడవై అయోధ్యకు తరలివెళ్ళి అక్కడ నీ కోసమే ఎదురుచూసే భరత శత్రుఘ్నాదులకు ఆనందాన్ని కూర్చు' అని చెప్పారు. అక్కడున్న వారందరూ ఆ దేవతలకు నమస్కరించారు. దేవతలందరు శ్రీరాముని అనుమతిని తీసుకొన్నారు. వారి వారి దివ్య విమానాలను ఎక్కి సంతోషంగా స్వర్గానికి వెళ్ళారు. సంతోషితాంతరంగుడైన సీతారాముడు వానరులందరికీ తమ తమ శిబిరాలకు వెళ్ళి సేదతీరమని చెప్పాడు. వానర సైన్యమంతా శ్రీరాముని దయతో హాయిగా సురక్షితంగా శిబిరాలకు చేరింది. చంద్రప్రభలతో విలసిల్లే ఆ రాత్రిని ఎడబాటునుంచి దూరమై ఒకటైన సీతారాములు, అన్నావదినల సమాగమాన్ని ఆకాంక్షించే లక్ష్మణుడు, రామ విజయంకోసం పరితపించిన సుగ్రీవ హనుమాదులు, సమస్త వానర సేన ఆనందాన్ని ఆస్వాదించారు. చంద్రుడు వారి అందరిపై తన చల్లని కిరణాలను వెదజల్లాడు. ఆ ఆహ్లాదకరమైన ఆ చల్లని రాత్రిలో వారందరూ విశ్రమించారు.

* * *

# అయోధ్యా ప్రయాణానికి సన్నాహం

## సర్గ - 121

**ఆ**హ్లాదకరమైన ఆ చల్లని రేయి త్వరగా గడిచిపోయింది. ప్రాతఃకాలంలోనే విభీషణుడు జయధ్వానాల మధ్య శ్రీరాముని చూశాడు. ఆనంద పారవశ్యాన్ని పొందాడు. 'రఘువరా! స్నాన సంధ్యా వందనాలకై నిర్మల జలాలను, మైపూతలకోసం కురకుమాదులను, మేలైన వస్త్రాభరణాలను, మంచి గంధాలను, వివిధరకాలైన

హారాలను సమకూర్చుకొని తెచ్చాను. మీకు సేవ చేయడానికి అనువైన పరిచారికలను వెంటబెట్టుకొచ్చాను. నాపై అనుగ్రహంతో వీటిని స్వీకరించు ప్రభూ' అని రాముని ప్రార్థించాడు.

'విభీషణా! నీకు నాపై చాలా ప్రేమ ఉందన్న విషయం నాకు తెలుసు. కానీ, నేను వనవాస దీక్షలో వున్నాను. పైగా నా ప్రేమ పాత్రుడైన భరతుడు నాకోసం 14 ఏళ్లుగా నిరీక్షిస్తూ కందమూలాలే భక్షిస్తూ తాపస వేషధారణతో వున్నాడు. అలాంటి కైకేయి పుత్రుని చూడాలని నా మనసు తొందరపెడుతోంది. అందుకనే నేను వనవాస దీక్షతోనే భరతుని చూడడానికి వెళ్తాను. సుగ్రీవాదులను స్నానాదులకై ఆహ్వానించు. వారందరూ యుద్ధంలో చాలా శ్రమించి వున్నారు. వారందరి శ్రమను పోగొట్టే ఉపచారాలకు వారికి అందించు' అని విభీషణునితో రాముడు చెప్పాడు. పైగా అయోధ్య చాలాదూరంలో వుంది. నేను నా తమ్ముళ్లనూ, నా తల్లులను చూడాలనే కోరికతో ఉన్నాను. కనుక నాకు ఇవేమీ వద్దు అని చెప్పాడు. "విభీషణా! నేను త్వరపడాలి. నా చిన్ని తమ్ముళ్ళను చూడాలి. పద్నాలుగు ఏళ్లు ముగిసిన ప్రక్కరోజు నా దర్శనంకాకపోతే ప్రాయోపవేశం చేసి ప్రాణత్యాగం చేస్తానని భరతుడు భీకర ప్రతిజ్ఞ కూడా చేసివున్నాడు. నాకు ఆలస్యమైతే ఆ చిన్నారి తమ్ముడు చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చడానికి ఇసుమంతైనా వెనుకంజవేయడు" అని భరతుని తలచుకొని విభీషణునితో చెప్పాడు.

"శ్రీరామా! మీరు చింతించకండి. నా దగ్గర సూర్యుని తేజస్సుతో విలసిల్లే కుబేరుని పుష్పకవిమానం ఉంది. దానిలో నేను మీరందరిని ఒక్కరోజులో అయోధ్యకు చేర్చగలను రామచంద్రా! ఈ పుష్పకం యజమాని కోరిక ప్రకారం పయనించేది. ప్రభూ! మీరు కోరుకున్నవిధంగానే మిమ్ములను అయోధ్యకు చేరుస్తాను.

మీ భక్తుడిని. నాపై అనుగ్రహం ఉంచి మీరు సీతాలక్ష్మణులతో కలిసి లంకలో కొన్నాళ్లు ఉండి నా మనసుకు ఆనందాన్ని కూర్చండి. రామా! నా మిత్రత్వాన్ని పురస్కరించుకొని మీకు సేవ చేసే భాగ్యాన్ని నాకు కల్పించండి" అని విభీషణుడు రాముని వేడుకొన్నాడు.

అలా ప్రార్థించే విభీషణుని వంక ప్రేమతో శ్రీరాముడు చూశాడు. "విభీషణా! ఇప్పటిదాకా నీవు నీ అండదండలను సహాయ సహకారాలను అందించావుకదా. ఇవన్నీ నీవు చేసిన సేవలేకదా. విభీషణా! నేను చిత్రకూటంలో వున్నప్పుడు నా తమ్ముడు భరతుడు నన్ను అయోధ్యకు తిరిగి వచ్చేయమని ఎంతో బ్రతిమిలాడాడు. నేను నా ప్రతిజ్ఞాపాలనకోసం నిరాకరించాను. ఇప్పుడు నాప్రతిజ్ఞాపాలన అయిపోయింది. నేను చేయవలసిన పనిని చేసేశాను. కాలాతీతం కాకుండానే భరతుని చూడాలని నా మనసు పరితపిస్తోంది.

వాత్సల్యానురాగాలను పంచిన నా తల్లులను, గురువులను, పురజనులను చూడాలనే కోరికతో నా చిత్తం తహతహలాతోంది. విభీషణా! నాపై నీకున్న ప్రేమతో విమానాన్ని సిద్ధపరచు. వనవాసదీక్షానంతరం నేను ఇక్కడే ఉండడం ఉచితంకాదు. నా పరిస్థితి చూసి నాకు వెళ్లడానికి అనుమతినిమ్ము" అంటూ భక్తవత్సలుడైన రాముడు విభీషణుని అడిగాడు.

శ్రీరాముని అభిలాష ప్రకారం విభీషణుడు పుష్పకం తీసుకొచ్చాడు. వైడూర్యాలు పొదిగి బంగారంతో నిర్మితమై శోభాయమానంగా ఉందా విమానం. తెల్లని ధ్వజపతకాలతో బంగారు హర్మ్యాలతో పసిడి పద్మాలతో ముక్తామణుల మిలమిలలతో చిరుగంటల సవ్వడితో మృదుమధుర గానాలాపనతో అత్యద్భుతంగా ఉంది.

శత్రు దుర్భేద్యమైన మనోవేగంతో సాగిపోయే ఆ విమానం కుబేరునిది. దాన్ని రావణుడు కుబేరుని జయించి దాన్ని తెచ్చుకున్నాడు. అద్దానిని అందంగా అలంకరించి విభీషణుడు రామాదులకోసం తెచ్చాడు.

* * *

# అయోధ్యా ప్రయాణం

## సర్గ - 122

పుష్పక విమానాన్ని సిద్ధం చేసిన విభీషణుడు రామాజ్ఞకోసం ఎదురుచూశాడు. 'విభీషణా! ఈ వానరులందరూ యుద్ధంలో చాలా సహాయం చేశారు. వారినందరిని నూతన వస్త్రాభరణాలతో సన్మానించు' అని రాముడు చెప్పాడు. మరలా 'విభీషణా! వీరినందరిని నీవు సమ్మానించినచో లోకులందరూ నిన్ను పుణ్యాత్ముడివి, దయాళువని, జితేంద్రియుడవని పొగడుతారు. సైనికులను ఎక్కువగా సంతోషపెట్టాలి. వారుచేసిన సహాయానికి మించి వారికి గౌరవ సత్కారాలు చేయాలి. ఎందుకంటే వారు ప్రాణాలకు తెగించి మనకోసం వారు పోరాడుతారు.

అటువంటివారిని సత్కరించపోతే రాజుపై వారు విముఖతను పెంచుకొంటారు. అది రాజుకే ప్రమాదం కాబట్టి, రాజు సైనికుల రక్షణలో ఎప్పుడు తప్పుచేయకూడదు' అని రాముడు చెప్పిచెప్పగానే విభీషణుడు దానకార్యాలు చేపట్టాడు. వానరులందరినీ ధన కనక వస్తు వాహనాదులతో సంతృప్తిపరిచాడు. వారందరూ సంతోషించారు.

సత్కారాలను పొందిన వానరులకు శ్రీరాముడు వారి ఆవాసాలకు వెళ్లడానికి అనుమతి ఇచ్చాడు. సుగ్రీవాదులకు విభీషణాదులకు వారుచేసిన సహాయం అపూర్వమైంది అని కృతజ్ఞతలు చెప్పాడు. వారినందరిని కిష్కింధలో హాయిగా వుండమని చెప్పాడు. విభీషణుని లంకలో ధర్మపరిపాలన చేయమని చెప్పాడు.

ఆ తరువాత సీతతో కూడి శ్రీరాముడు పుష్పక విమానాన్ని అధిరోహించాడు. వారితోపాటు లక్ష్మణుడు ఆ విమానాన్ని ఎక్కాడు. అందులో కూర్చున్న రాముడిని సుగ్రీవాదులు సంతోషంగా చూచి అంజలి ఘటించారు. వారి కన్నుల నిండా ఆనందబాష్పాలు నిండాయి. వారందరి కంఠం మూగబోయింది. మాటలలో చెప్పలేని ఆనంద విచారాలను అనుభవిస్తున్నారు. రామాదులు వారిని ఆనందంగా చూస్తున్నారు. చూచినకొద్దీ చూడాలనిపిస్తున్న రామునితో వారు మాట్లాడాలనుకొన్నారు. వెంటనే ఇలా చెప్పారు.

"రామా! మమ్ములను కూడా మీతోపాటుగా అయోధ్యకు తీసుకొని వెళ్లుతావా! మేము అక్కడికి వచ్చి మీరు నదీ సముద్ర జలాలతో, క్షీరాదులతో, వేదఘోషలతో పట్టాభిషిక్తుడవుతుండగా మేము తనివితీరా చూస్తాం. మేము జనులకు ఏమాత్రం ఇబ్బంది కలుగకుండా సంచరిస్తాం. కౌసల్యామాతకు ప్రణమిల్లి మీ సెలవు తీసుకొని మా వనాలకు మళ్లీ వచ్చేస్తాం. మా కోరికను తీర్చు రాజేంద్రా! అని అడిగారు. విభీషణుడు కూడా అదేవిధమైన కోరికను కోరాడు.

సద్గుణాభిరాముడు మిత్రులతో మీరందరూ అయోధ్యకు రావాలనుకోవడం నాకు సంతోషాన్ని కలిగిస్తోంది. నా తమ్ముళ్ళను చూడడం నాకు చాలా ఇష్టం. ఇక త్వరగా విభీషణా!, సుగ్రీవా!, హనుమా!, వానరులతో కూడి త్వరగా విమానం ఎక్కండి. విభీషణా! నీ అమాత్యులతో నీవు కూడా ఈ విమానాన్ని అధిరోహించు మనం త్వరగా భరతుని చూడాలి, అంటూ వారిని రాముడు తొందరపెట్టాడు. వెంటవెంటనే వానరులు, రాక్షసులు అందరూ మహా సంతోషంగా విమానాన్ని అధిరోహిస్తున్నారు. వెళ్ళలేనివారు వెళ్ళుతున్న వారిని ఆనందంగాచూస్తున్నారు.

మహాబలశాలులైన వానర భల్లూక రాక్షసాదులందరితో కూడి సీతారామలక్ష్మణులున్న దివ్య విమానం ఆకాశానికి రివ్వున ఎగిరి వేగంగా సాగింది. హంస ప్రతిమలున్న ఆ పుష్పకం అయోధ్యను చేరడానికి వేగంగా వెళ్లసాగింది. ఎందరు కూర్చున్నా ఇంకొకరి చోటుండే ఆ దివ్యవిమానంలో అందరూ హాయిగా సుఖాసీనులై రామపట్టాభిషేకాన్ని మనస్సులో తలుస్తున్నారు. ఎప్పుడెప్పుడు అయోధ్యను చూస్తామో, రాముని చిన్ని తమ్ములను ఆనందాన్ని చూసే భాగ్యం మనకు కలుగబోతోందిగదా అని చూస్తున్నారు.

రామాదులతో కూడా విభీషణాదులు, వానరాదులుఅందరూ మహాకోలాహలంగా పుష్పకం ఎక్కారు. ఆ కుబేరుని పుష్పకానికి ఆనందం రెట్టింపు వేసింది. ఆహా! నేడు కదా సుదినం. నేను నా యజమాని ఇష్ట ప్రకారం వెళ్ళేదానినే, కానీ నేటిదినం నాకూ ఎంతో సంతోషంగా ఉంది. అమరేంద్రాదులుకూడా సంతోషించే రాముని పట్టాభిషేకానికి నావంతు సహాయం చేస్తున్నాను అనుకొంది.

అంతే రివ్వున గగనాన దూసుకుపోడానికి ఆయత్తం అయింది. వాయుదేవుడు తన చల్లని స్పర్శను వారందరికీ పంచుతున్నాడు.ధరణీదేవి ఒడిలో పొదువుకుని ఉన్నవృక్షరాజాలు తమ పరిమళాన్ని వాయువుతో తీసుకెళ్ళమని బతిమాలుకొంటున్నాయి. పూవులన్నీ విరగకాసి తమ సుగంధాన్ని పవనుని సాయంతో వారందరి కన్నా ముందుగా రామాదుల ఆగమనవార్తను భరతాదులకు అందించాలని తొందరపడుతున్నాయి. ఇలా ఒకరికొకరు పోటీపడుతూ అయోధ్యను చేరాలని ముందుకు వెళ్లడానికి  సమాయత్తం అవుతున్నారు.

* * *

# పుష్పక విమాన ప్రయాణం

## సర్గ - 123

**పు**ష్పక విమానంలో సుఖాసీనులై అందరూ అయోధ్యాభిముఖంగా ముందుకు సాగుతున్నారు. రాముడు సీతకు త్రికూట పర్వతంపై వెలసిన లంకానగర విశేషాలను చెప్తున్నాడు. 'సీతా ఈ లంకను విశ్వకర్మ నిర్మించాడు. ఇదిగో ఇదే సమర భూమి. ఇక్కడే లక్షలకొలది ప్రాణాలు అనంతవాయువులో లీనమైంది' అంటూ యుద్ధ విశేషాలను చెప్పాడు. కుంభకర్ణాదులను, రావణుని మంత్రులను, పుత్రులను అందరినీ చంపిన ప్రదేశం ఇదే.

ఇక్కడే మండోదరి తనభర్తను కోల్పోయి చాలా మధనపడింది. ఇదుగో 'సీతా! ఇదే మహా సముద్రం. దీనిపై వానర ముఖ్యుడు నలుడు సేతువును నిర్మించాడు. ఈ సంద్రం జల జంతువులకేకాక అమూల్య నిధులకు భాండాగారం. ఇందులో హిరణ్యనాభం అనే మైనాక పర్వతం ఉంది. దీనిపైనే హనుమంతుడు నిన్ను చూడడానికి వచ్చినపుడు విశ్రమించమని ఈ మైనాకుడు సముద్ర గర్భం నుండి పైకి వచ్చాడు.

సముద్ర తీర ఉత్తర ప్రాంతం ఇక్కడే నాకు పరమశివుని అనుగ్రహం కలిగింది. ఇక్కడనుంచే సేతు బంధనం మొదలైంది. విభీషణుడు శరణాగతునిగా నా దగ్గరకు వచ్చిందీ ఇక్కడే.

అదుగో ఆ కనిపించేదే పంపాతీరం. అక్కడ కనిపించే నగరమే కిష్కింధ. ఇదే సుగ్రీవుని రాజ్యం. నేను వాలిని వధించినది ఇక్కడే' అని చెప్పుతున్న రామునితో సీతాదేవి తార, రుమాది అంతఃపుర స్త్రీలను అయోధ్యకు పిలుచుకొని వెళ్ళాలని అనిపిస్తోందని చెప్పింది.

సీత కోరిక ప్రకారం రాముడు సుగ్రీవునితో కపివరుల స్త్రీలందరిని అయోధ్యకు  పిలవమని చెప్పాడు. వెంటనే సుగ్రీవుడు పుష్పకం నుండి దిగి అంతఃపురంలోకి వెళ్లి తారాదులతో సీతాదేవి కోరికను రాముని ఆజ్ఞను చెప్పి అందరి స్త్రీలను అయోధ్యకు తరలిరండి! అని చెప్పాడు.

తార సంతోషంగా తన ప్రియమిత్రురాండ్రతో విషయం చెప్పింది. కిష్కింధలోని సమస్త వానరులు అయోధ్యను దర్శించాలని అందంగా అలంకరించుకొని పరుగు పరుగున వచ్చారు. వారందరూ సీతను చూడాలని ఉవ్విళ్లూరుతూ దివ్య విమానాన్ని ఎక్కారు.

కాస్త దూరం వెళ్లిన తర్వాత 'సీతా! అదుగో చూడు, నేను, లక్ష్మణుడు ఈ ఋష్యమూక పర్వతంపైనే సుగ్రీవుని, హనుమను కలిసింది. దీనిదగ్గరే మేము కబంధుని చంపాను. జానకీ! జటాయువు నివసించిన వటవృక్షం ఇదే. ఈ జనస్థానంలోనే నేను ఖరదూషణాది మహారాక్షసులను సంహరించాను.

ఇదుగో ఈ కనిపించే ఆశ్రమం అగస్త్య మహర్షిది. ఇదుగో సుతీక్ష్ణ మహర్షి ఆశ్రమం కూడా కనిపిస్తోంది. వైదేహి ఈ కనిపించే ఆశ్రమం శరభంగ మహామునిది. నేను ఇక్కడే దేవేంద్రుని చూశాను. విరాధున్ని కూడా ఇక్కడే సంహరించాను.

అత్రి మహర్షిని దర్శించింది ఇక్కడే సుమా. నీవు అనసూయాదేవి ఆశీస్సులను పొందిన ప్రదేశం కనిపిస్తోంది చూడు. వారు మనలను ఎంత ఆప్యాయంగా పలుకరించారో కదా. అప్పుడు మనకు చాలా ఆనందం వేసింది కదూ! మనం మన తల్లితండ్రులకు దూరమయ్యామన్నా బాధ తెలియకపోవడానికి కారణం ఈ మహర్షుల ఆదరణే కదా అని జరిగిపోయిన సంగతులను వారు నెమరేసుకొంటున్నారు. సుందరీ! ఇదిగో ఇదేచూడు చిత్రకూటం' అని రాముడు సీతకు మార్గమధ్యంలో కనిపిస్తున్న విశేషాలను చూపిస్తున్నాడు. 'అన్నా ఇక్కడే మనలను భరతుడు కలుసుకొన్నది. కోసల రాజ్యం స్వీకరించమని నిన్ను వేడుకొందీ ఈ ప్రదేశమే. అని లక్ష్మణుడు తన అనుభవాలను గుర్తుకు తెచ్చుకుంటూ ఆ యా ప్రదేశాలను చూస్తున్నాడు.

'సీతా! అదుగో అక్కడ దూరంగా కనిపించేది యమునానది. అక్కడ చూడ ముచ్చటకొలుపే వృక్ష వనాలున్నాయి. ఇదిగో మహాతపశ్శాలి ఐన భరద్వాజుని ఆశ్రమం. ఇది మీకు గుర్తుందా? అదుగో త్రిపథగామినిఅని పేరు తెచ్చుకొన్న గంగమ్మ తల్లి. ఇదుగో నా ప్రియమిత్రుని శృంగి బేరపురం. గుహుదు మనకు సేవలు చేసింది ఇక్కడే.

ఇదుగో సరయూనది. ఇక్కడే మన ఇక్ష్వాకు వంశపురాజులు యజ్ఞయాగాదులు చేసేవారు. అల్లంతదూరాన కనిపించేదే అయోధ్య. మనం క్షేమంగా తిరిగి వచ్చామన్న సంతోషంతో అయోధ్యకు నమస్కరించుము' అని రాముడు సీతకు చెప్పాడు. 'స్నేహితులారా! అదుగో చూడండి. మా అయోధ్య ఎంత శోభాయామానంగా ఉందో! అని రామలక్ష్మణులు తమ సంతోషాన్ని వారి మిత్రులకు చెప్పారు.

విమానంలో ఉన్న వారందరూ దివ్య శోభాయమానంగా ఉన్న అయోధ్యా పట్టణాన్ని ఆత్రంగా చూశారు. రాక్షసులు, వానరులు అందరూ అయోధ్యను ఆశ్చర్యానందాలతో చూశారు. వారందరి కళ్ళు ఒక్కసారి చెమర్చాయి. అబ్బా! ఎన్నెన్ని కష్టాలు పడ్డారు, ఈ అయోధ్యావాసులు? అనుకొన్నారు. సుకుమారి అయిన సీతమ్మ ఆ దుష్ట రావణుని వద్ద ఎన్ని బాధలు పడిందో కదా అని వానర స్త్రీలు జానకీదేవిని అపురూపంగా చూస్తున్నారు. వారిని సీత తమ సొంత అక్కచెల్లెళ్లలను చూసినట్లుగా చూస్తోంది.

పుష్పకవిమానంలో రామాదులు తమ మిత్రసమూహంతో ఆనందోత్సాహాలతో అయోధ్యకు వస్తున్నారు.

* * *

# భరద్వాజ దర్శనం

## సర్గ - 124

చైత్రశుద్ధ పంచమినాడు రామాదులు భరద్వాజాశ్రమానికి చేరారు. పుష్పకం దిగి శ్రీరాముడు ఈ మహాముని దగ్గరకు వెళ్ళి నమస్కరించాడు. "పూజ్యమునివరా! అయోధ్యావాసుల క్షేమ సమాచారాలు మీకు అందుతున్నాయి గదా! వారందరూ శుక్లపక్ష చంద్రులవలె వృద్ధి పొందుతున్నారు గదా! భరతుడు రాజ్య పరిపాలనాన్ని సరిగా చేస్తున్నట్లే గదా! మౌనివర్యా" అని అడిగారు.

వనవాసాన్ని ముగించుకొని తిరిగి వస్తున్న శ్రీరామాదులను భరద్వాజుడు చిరునవ్వుతో ఆహ్వానించి శ్రీరాముని ప్రశ్నలకు సంతోషంతో సమాధానాన్ని ఇచ్చాడు. యుద్ధ విజేతా! 'నీకోసం నీ భరతుడు వేయికళ్ళతో ఎదురుచూస్తున్నాడు' అని చెప్పాడు.

'శ్రీరామా! నీవు దండకారణ్యంలో రాక్షసులను చంపటం, సీతాపహరణం, సుగ్రీవునితో మైత్రి, సముద్రంపై సేతు నిర్మాణం, విభీఘుని శరణాగత వత్సలం, రావణుని సంహరించడం ఇవన్నీ నేను నా తపస్సు చేత గ్రహించాను. రఘువరా! నీవు ఇన్ని ఘనకార్యాలు చేశావు. సాధు సత్పురుషులకు చాలా ఉపయోగకరమైన పనులు ఎన్నింటినో చేశావు. అందుకే నా మనస్సు నీకు మేలు చేయాలని తలుస్తోంది.

ఏదైనా వరం కోరుకో నీకు ఇస్తాను' అని భరద్వాజుడు రామునికి చెప్పాడు. ఆయన దానికి ఎంతో సంతోషించాడు. భరద్వాజునికి రాముడు నమస్కరించాడు. 'మహానుభావా! నేను అయోధ్యకు వెళ్ళుతున్నాను. ఇక మూడు యోజనాల దూరంలో అయోధ్య ఉంది. నేను వెళ్ళే దారిలో అన్ని చెట్లకు పూలు పండ్లు తేనెలతో సమృద్ధిగా సంపద ఉండేలాగా ఆశీర్వదించండి స్వామీ' అని అడిగాడు. అట్లే జరుగుతుందని భరద్వాజుడు చెప్పాడు. ఈ రోజు నా ఆతిథ్యం స్వీకరించి రేపు అయోధ్యకు వెళ్ళమని భరద్వాజుడు చెప్పాడు. శ్రీరాముడు దానికి అంగీకరించాడు. మహాతపస్వియగు భరద్వాజుని మాట ప్రకారం అయోధ్య వరకు ఉండే ఫలాలన్నీ సంపదతో అలరారుతున్నాయి. పూలు లేని చెట్లు పూలతోను, పండ్లు లేని చెట్లు పండ్లతోను అలరారాయి. మోడుబారిన చెట్లు సైతం పచ్చని ఆకులతో ఫలభరితమయ్యాయి.

వాటిని చూచిన వానరులు ఎంతో ఆనందాన్ని పొందారు. భరద్వాజుని అపారమైన తపః ప్రభావాన్ని గూర్చి వారందరూ ముచ్చటించుకొన్నారు. భరతుని అపార సేనకు ఆతిథ్యం ఇచ్చిన ఆ మహాముని నేడు అసంఖ్యాకంగా ఉన్న వానరుల సమూహానికి, భల్లూక సమూహానికి, రాక్షస సమూహానికి ఆనందంగా ఆతిథ్యం ఇచ్చాడు. భరద్వాజుని తపఃప్రభావంతో చెట్ల సంపదను చూసిన వానరులు ఆశ్చర్యానందాలు పొందారు. ఆ దివ్య ఫలాలను తనివితీరా తిన్నారు. స్వర్గాన్ని జయించినంత ఆనందాన్ని పొందారు. వారిలో లేశమాత్రమైనా విచారం లేదు. రాక్షసులు కూడా మహర్షి తపఃప్రభావానికి ఆనందిస్తూ ఫలాదులను సేవిస్తున్నారు.

* * *

# రాముడు అయోధ్యకు వస్తున్నాడన్న సమాచారం

## సర్గ - 125

రఘురాముడు ఆనందంగా అయోధ్యను మనసులో తలచుకొంటున్నాడు. మారుతిని పిలిచి "మారుతీ! నీవు నా తల్లుల క్షేమసమాచారాన్ని తెలుసుకొనిరా. ముందుగా శృంగబేరిపురం వెళ్ళి అక్కడ నా ప్రియనేస్తమైన గుహునకు నా రాకను ఎరిగించు. అతడు నాకు ప్రాణమిత్రుడు. అతని యోగక్షేమాలను విచారించు. అతడే నీకు భరతుని క్షేమ సమాచారాన్ని అందిస్తాడు.

"ఆంజనేయా! నీవు అక్కడనుంచి వేగంగా వెళ్ళి నా తమ్ముడైన భరతుని చూచి యోగక్షేమాదులను తెలుసుకో. నేను సీతా లక్ష్మణులతో కలిసి వనవాస దీక్షను ముగించుకొని తిరిగి వస్తున్నానని తెలియజేయి. దండకారణ్యంలో రాక్షసుల వధ, సీతాపహరణం, సుగ్రీవుల మైత్రి, సముద్ర సేతుబంధనం, దుష్ట రావణసంహారం, తిరిగి సీతను పొందడం, మీరందరితో కూడి అయోధ్యకు తిరిగి వస్తున్న సమాచారాన్నంతా భరతునకు తెలియజేయి.

మారుతీ! ఈ విషయాలు చెప్పేటపుడు భరతుని హావభావాలను, ముఖ కవళికలను జాగ్రత్తగా గమనించు. భరతునితో మాట్లాడేటపుడు అతని ఆంతర్యాన్ని నీవు తెలుసుకొని నాకు చెప్పు.

సమస్త సుఖభోగాలు, చతురంగ బలాలతో కూడిన రాజ్యం చేజిక్కించుకున్నపుడు, మనసు మారే అవకాశం ఎక్కువగా ఉంటుంది కదా. భరతుడు రాజ్యం ఏలడానికి మనస్సులో కోరిక కలిగి ఉన్నచో, రాజ్యం ఇచ్చివేయడానికి నాకు ఏ మాత్రం బాధ ఉండదు. నేను ఎక్కడైనా ఏ పరిస్థితులలోనైనా చక్కని జీవనాన్ని గడపగలను.

మారుతీ! మేమందరం ఈ ఆశ్రమం నుంచి ఎక్కువ దూరం రాకముందే అన్ని విషయాలు సమగ్రంగా తెలుసుకొని వెంటనే తిరిగి రావాలి సుమా!" అని మారుతిని రాముడు పంపించాడు.

రామాజ్ఞను శిరోధార్యంగా పవనసుతుడు భావించాడు. మనోవేగంతో శృంగబేరపురం చేరాడు. గుహుని కలుసుకొన్నాడు. రాముని ప్రియమిత్రుని చూశాడు. సత్య పరాక్రమవీరుడు రాముడు మీ దగ్గరకు రాబోతున్నాడన్న సంతోషవార్తను గుహునకు మారుతి అందజేశాడు. గుహుని క్షేమాదులను తెలుసుకొన్నాడు. అక్కడి విషయాలను ఆకళింపు చేసుకొన్నాడు. తన పనిని వివరించాడు.

మరల ఆకాశానికి ఎగిరాడు. వాయువేగ గమనంతో ప్రయాణం ఆరంభించాడు. అతడు ఆకాశంనుండే పరశురామ తీర్థాన్ని, వాలుకా నదిని చూచి నమస్కరించాడు. గోమతీనది దాపున ఉన్న మద్దిచెట్లను చూశాడు. సుసంపన్నంగా ఉన్న జన పదాలను, జనులను చూశాడు. నందిగ్రామ సమీపంలోని మహావృక్షాలను సిరిసంపదలతో సంతోషంగా ఉన్న ప్రజలను మారుతి గమనించాడు. చుట్టుఉన్న పరిసరాలను అవలోకిస్తూ భరతుడు ఉన్న ప్రదేశానికి త్వరగా చేరాలని మారుతి ప్రయాణిస్తున్నాడు.

అయోధ్యకు క్రోసెడు దూరంలో ఆశ్రమవాసియై జీవిస్తున్న భరత కుమారుని చూశాడు. నారచీరలు ధరించి, బక్కచిక్కి, దైన్యం గూడుగట్టుకొన్న ముఖంతో ఉన్న భరతుని చూశాడు. జటధారియై తాపస జీవన విధానంలో జితేంద్రియుడై కందమూల ఫలాలను ఆహారం చేసుకొన్న భరతుని మారుతి గమనించాడు.

మనోనిగ్రహంతో మితభాషియై రామపాదుకలు పూజిస్తూ రాజ్యపాలన చేస్తుండడం చూశాడు. సమస్త ప్రజల అభిమానాన్ని చూరగొంటూ వారిని కాపాడుతున్న రఘువీరుని మారుతి గమనించాడు.

భరతుని దగ్గర మంత్రులు, పురోహితులు, సేనానాయకులు, అందరూ కాషాయాంబరధారులై మారుతికి కనిపించారు. సకల ధర్మాలన్నీ దేహం ధరించినట్లుగా భరతుడు ధర్మమూర్తిగా కనిపిస్తున్నాడు. ధర్మంపై ఆసక్తి ఉన్న పురజనులందరూ నారచీరలు కృష్ణాజినం ధరించి ఉన్నారు. వారిలో ఏ ఒక్కరూ భోగాలపై ఆసక్తిని కనపర్చడం లేదు. ధర్మరూపుడైన భరతుని ఆంజనేయుడు చూశాడు. అంజలి ఘటించి తన పరిచయం చేసుకొన్నాడు. 'మహానుభావా! మీరు అనుక్షణం దండకారణ్యాన ఉన్న రామన్నను గురించి తలపోస్తున్నారు కదా! ఆ అన్న మీ క్షేమాదులను తెలుసుకోవడానికి నన్ను పంపించా'డన్న విషయం చెప్పాడు. "మహాత్మా! మీ శోకాన్ని త్యజించు. మీ రాముడు వనవాస దీక్ష ముగించుకొన్నారు. మిమ్ము చేరపోతున్నారు' అని చెప్పాడు.

ఆ ప్రభువు దండకారణ్యంలో ఎన్నో ఘనకృత్యాలు చేశాడని చెప్పుతూ వనవాస విషయాన్నంతా భరతునకు మారుతి వివరించాడు. నేడు వానరులతో, రాక్షసులతో కలిసి సీతా రామలక్ష్మణులు మీ దగ్గరకు రాబోతున్నారని మారుతి ఆనందంగా చెప్పాడు.

ఆ మాటలు విన్న భరతుడు ఆనందాతిరేకంతో కన్నులు కన్నీరు కార్చుతుండగా నేలపై పడిపోయాడు. మాటలలో చెప్పలేని ఆనందాన్ని పొందాడు. ఒక్క క్షణంలో నిబ్బరాన్ని పొందాడు. లేచి నిలబడి హనుమంతుని అక్కున చేర్చుకొని ఆనందకర వార్తను చెప్పినందుకు ఎంతో శ్లాఘించాడు.

'మహాత్మా! నీవు నాకు వానరునివేనని తోచటంలేదు. మీరు నిజంగా దివ్యుడివైన జాతికి చెందినవాడివి అయి ఉంటావు. నీవు నిజంగా నా పాలిటి భగవంతునివే. దేవాదిదేవుడే నీ రూపంలో నా దగ్గరికి వచ్చి ఉంటాడు. ఇదే ముమ్మాటికి నిజం. నీ వచనాలతో నేను ఎంతో ఆనందించాను.

ఇంత చల్లని వార్త తెచ్చిన నీకు నేను ఏమి ఇవ్వగలను? నీకు లక్ష గోవులను వందలాది గ్రామాలను, సదాచార సంపన్నులను 16 మంది కన్యలను అర్పిస్తాను. వారు సద్వంశ సంజాతులైన సర్వాభరణ భూషితులై ఉంటారు. నీకు నేనేమిచ్చినా ఋణం తీర్చుకోలేను. నేడు వెలకట్టలేని అమిత సుఖసంపదను తెచ్చి నా పరం చేశావు' అని సంతోషాతిరేకంతో చెప్పుతున్నాడు భరతుడు.

భరతునికి రాముడు వచ్చేస్తున్నాడని వార్త నిలవనీయడంలేదు. భరతునిలో ప్రతి అవయవం సంతోష తరంగాలతో అలరారుతోంది. అతని మనస్సు ఏదేదో పలవరిస్తోంది. 'మహాత్మా! ఇంత మంచి వార్త చెప్పావు, నీవు ఎంతటి ఘనుడవో! నా అన్న రాముని శుభవార్తను తెచ్చావా!' అంటూ పదే పదే మారుతిని పొగడుతున్నాడు. హనుమంతుని కౌగిలించుకుని తన ఆనందాన్ని పెంచుకుంటున్నాడు. అందరితో మా అన్న వచ్చేస్తున్నాడని చెప్పుతున్నాడు.

* * *

# నరవానరుల సంభాషణం

## సర్గ - 126

**"మ**హాత్మా! నీ నోటి ద్వారా ఎన్నో ఏండ్ల తర్వాత మా అన్న గురించిన శుభ సమాచారాన్ని ఆనందంగా విన్నాను. **మనిషి బ్రతికి ఉంటే వందల ఏండ్ల తరువాత కూడా శుభాన్ని వినవచ్చునని అంటారు కదా. అది నిజమేనని అనిపిస్తోంది.**

మహాత్మా! శుభంకరుడైన శ్రీరామునకు మీతో మైత్రీ సంబంధం ఎలా ఏర్పడిందో నాకు చెప్పుము' అని భరతుడు అన్న గురించి వినాలనే కుతూహలాన్ని దాచుకోలేక మారుతిని అడిగాడు. వనవాస చరిత్రనంతా మారుతి భరతునకు చెప్పాలనుకొన్నాడు.

'భరతా! మీ తల్లి పొందిన వరాలతో రాముడు సీతా లక్ష్మణ సమేతుడై అడవులకు పయనించడం, దాన్ని తట్టుకోలేని మీ తండ్రి దశరథుడు స్వర్గానికి వెళ్ళడం, మిమ్ములను మీ మేనమామ ఇంటినుంచి రప్పించడం,

మీరు విషయం తెలుసుకొని దుఃఖితుడవై రాముణ్ణి తిరిగి అయోధ్యకు రమ్మని పిలవడం, మీరు కూడా వనవాస దీక్షను తీసుకోవడం ఇవన్నీ మీకు తెలిసిన విషయాలే కదా!

మహాబాహూ! మీరు శ్రీరాముని దగ్గరనుంచి వెళ్ళిపోయిన తర్వాత అక్కడి వనమంతా మీ సేనావాహిని సంచారంతో అస్తవ్యస్తం అయింది. రామాదులు ఆ చిత్రకూట ప్రదేశం నుంచి దండకారణ్యంలో ప్రవేశించారు. అక్కడ వారికి విరాధుడను రాక్షసుడు తారసిల్లాడు. రామలక్ష్మణులు విరాధుణ్ణి మట్టుపెట్టారు. ఆ తర్వాత ఆ ముగ్గురూ ముందుకు సాగారు.

సీతారామ లక్ష్మణులు శరభంగ మహర్షి ఆశ్రమానికి చేరారు. రామాదులకు ఆతిథ్యం ఇచ్చి శరభంగుడు దివ్యలోకాలకు వెళ్ళాడు. అక్కడనుంచి వారు పంచవటి తీరంలో నివాసం ఉన్నారు. అక్కడికి శూర్పణఖ అనే రాక్షసి వచ్చింది. రాముణ్ణి చూసి మోహించింది. లక్ష్మణుడు అన్న ఆజ్ఞతో ఆ రాక్షసి ముక్కు చెవులు కోసి పంపించివేశాడు.

ఆ దండకారణ్యంలో మునుల్ని బాధించే పద్నాలుగు 14 వేలమంది రాక్షసులను రాముడు సంహరించివేశాడు. ఖరదూషణ త్రిశిరాది రాక్షసులు కూడా రాముని చేతిలో చచ్చారు. ఈ సంగతి తెలిసిన మూర్ఖురాలైన శూర్పణఖ రావణునికి చెప్పింది. రావణుని ఆదేశంతో మారీచుడు బంగారు లేడి రూపం ధరించి రామలక్ష్మణులను సీతమ్మకు దూరం చేశారు.

ఒంటరిగా ఉన్న సీతమ్మను మాయావేష రూపి అయిన రావణుడు అపహరించాడు. ఆమెను రక్షించాలని మీ తండ్రి మిత్రుడైన పక్షిరాజు జటాయువు రావణునితో పోరి చనిపోయాడు. జటాయువు ద్వారా సీతాపహరణం విషయం రామలక్ష్మణులుతెలుసుకొన్నారు. సీతాపహరణకు దుఃఖితులయ్యారు. మరల ధీరత్వంతో సీతాన్వేషణం ప్రారంభించారు. ఆ సమయంలో ఋష్యమూక పర్వతంపై అన్నకు భయపడి ప్రాణాలు దక్కించుకొంటున్న సుగ్రీవుడు కనిపించాడు. అక్కడ నేను, సుగ్రీవుడు రామలక్ష్మణులను కలిశాము అని హనుమంతుడు భరతునికి ఇష్టమైన మాటలను చెప్పుతున్నాడు. 'భరతకుమారా! సీతాన్వేషణామార్గంలో రాక్షసులనెందరినో రామలక్ష్మణులు చంపారు. సుగ్రీవునితో రాముడు మిత్రత్వం నెరిపాడు. వాలిని సంహరించాడు. రాముడు వానర లోకానికి సుగ్రీవుణ్ణి రాజుగా అభిషేకించాడు.

ఉపకారం పొందిన సుగ్రీవుడు ప్రత్యుపకారంగా సీతాన్వేషణ కార్యంలో భాగం పంచుకొన్నాడు. శ్రీరాముని దయచేత, అమ్మవారి కృపచేత నేను సముద్రాన్ని దాటి లంకలోని సీతను కనుగొని ఆ విషయం శ్రీరామునికి చెప్పాను.

గొప్పవాడైన నలుని పర్యవేక్షణలో సముద్రంపై సేతువును నిర్మించాం. మేమందరం అపార సేనావాహినితో కలసి లంకపై దండెత్తి వెళ్ళాం. అక్కడ మాకు, రామునికి శరణాగతుడైన విభీషణుడు లభ్యమయ్యాడు.

ఆ తర్వాత రావణుని పుత్రమిత్రాదులతోపాటుగా రాముడు సంహరించాడు. శోకగ్రస్త అయిన సీత రాముని చేరింది. లోకాపవాదానికి వెరచి మీ అన్న సీతమ్మ తల్లిని అగ్నిప్రవేశం చేయమని చెప్పాడు. ఆ తల్లి అగ్నిలో దూకగా హవ్యవాహనుడు సీతమ్మను పవిత్ర శీలవంతురాలిగా వర్ణించి సీతాదేవిని శ్రీరామునకు అప్పగించాడు.

అందరూ ఆనందంగా ఇప్పుడు భరద్వాజుని ఆతిథ్యం తీసుకొని మీ దగ్గరకు వస్తున్నారు' అని మారుతి అన్ని విషయాలను పూసగుచ్చినట్లుగా చెప్పాడు. భరతునకు పరమానందం కలిగింది. రాముని ఆగమనానికి ఏర్పాట్లు చేయాలనుకొన్నాడు.

"హనుమా! నా సోదరులు ఎన్నెన్ని ఇబ్బందులనో ఎదుర్కొన్నారు. వాటినంతా ఆ భగవంతుని కృపాకటాక్షాలతో అధిగమించారు. వారు ఇప్పుడు నాకు సంతోషాన్ని కలిగించాలని వస్తున్నారని నీవు చెప్పడం నా అదృష్టం. ఇన్నాళ్ళకు నా కోరికను భగవంతుడు ఈడేర్చుతున్నాడు. నా పై ఆ దయామయునకు అనుగ్రహం కలిగింది. అదే నాకు పదివేలు. పూర్వజన్మలో నేను చేసిన పాపరాశి నేటితో భస్మీపటలం అవుతోంది. అందుకనే నా రాముడు, నా అగ్రజుడు నన్ను చేరరాబోతున్నాడు అని ఆగని సంతోషాన్ని హనుమంతునితో పంచుకొంటున్నాడు భరతుడు. నా చిరకాల వాంఛ నేడు తీరిపోతోందని భరతుడు ఆనందాబ్ధిలో మునిగి చెప్పిన విషయాలనే మరల మరల మారుతితో చెప్పుతున్నాడు.

* * *

# నందిగ్రామ దర్శనం

## సర్గ - 127

**మా**రుతి ద్వారా విషయం తెలుసుకొన్న భరతుడు శత్రుఘ్నుని సహాయంతో రామాదులకు సాదర స్వాగత సత్కారాలు చేశాడు. దైవమందిరాలు కూడళ్ళు మార్గాలు అన్నీ సువాసన భరితమైన పూలతో అలంకరించారు. వందిమాగధులను వీణా వేణు మృదంగాది వాద్యకారులను అందరిని రామాదులను స్వాగతించమని చెప్పారు. వీధులన్నీ చక్కని రంగవల్లులతో ముత్యాల తోరణాలతో అలంకరించారు. స్వాగతం పలకడానికి రాజమాతలు అమాత్యులు, అంతఃపుర రక్షకులు, సైనికులు, పరస్త్రీలు, బ్రాహ్మణులు, రాజకుమారులు, పురప్రముఖులు, పౌరులు, దృష్టి, జయంతుడు, విజయుడు సుమంత్రుడు అను అష్టమంత్రులు అందరూ బయలుదేరారు. ప్రముఖ రథికులు, ఆంతరంగికులు, ఏనుగులు, అశ్వాలు రథాలు అన్నీ బయలుదేరాయి. చతురంగ బలాలు వారితో నడిచాయి. అయోధ్యాపురవాసులందరూ నందిగ్రామం చేరారు. ధర్మాత్ముడైన భరతుడు ద్విజులతో పూలమాలలు మధుర ఫలాలు తీసుకొని రామునికి ఎదురేగారు. వశిష్టాది మునులు భరతుని వెంబడించి వెళ్ళారు.

ఉపవాసాది కృత్యాలతో కృశించిన భరతుడు రామపాదుకలను శిరస్సున ధరించాడు. సంతోషంగా రామునకు ఎదురు వెళ్ళాడు. శ్వేతచ్ఛత్రంతో వింజామరలతో ఆ పాదుకల వెంట కొంతమంది వెళ్ళారు.

అలా నడుస్తుండగా వారికి రామాదుల ఆగమన చిహ్నాలు ఎక్కడా కనిపించలేదు. వారిలో విచారం కనిపించింది. ఎంతకీ రామాదులు కనిపించరేమి అనుకొన్నారు. వెంటనే భరతుడు మారుతిని చూశాడు. "హనుమా! నీవు చెప్పేది నిజమే గదా? కామరూపులైన వానరుల జాడ కాని, సత్య పరాక్రముడైన శ్రీరాముని జాడ కాని నాకు

కనిపించడం లేదు" అంటూ రామదర్శన విలంబనాన్ని భరించలేక భరతుడు హనుమంతునితో చెప్పాడు. "రాజకుమారా! చింతించకండి. దారిమధ్యలో రామాదులు మహర్షుల ఆశీర్వచనాలను పొందడానికి వెళ్ళిఉన్నారు కదా! ఆ భరద్వాజుని మహిమతో సర్వకాలాలలోను వృక్షాలన్నీ మధువులను స్రవిస్తున్నాయి. వాటి మకరందాన్ని ఆస్వాదించి మత్తిల్లిన తుమ్మెదలు మధుర గానాలాపన చేస్తున్నాయి. వానరులు ఆకలి దప్పులను తీర్చుకొని ఆనందిస్తున్నారు. మహర్షి రామాదులతో వచ్చిన వారికందరికి షడ్రసోపేతమైన ఆతిథ్యం ఇచ్చి ఉన్నారు.

ఆ సంతుష్టులైన వానరుల కోలాహల ధ్వని వస్తోంది. వారందరూ గోమతీనదిని దాటుతుండవచ్చు. అని చెప్పుతుండగానే పుష్పక విమానపు జాడ దేదీప్యమానంగా కనిపించింది. భరతా! అదిగో అటు చూడు. దివ్య పుష్పక విమానం స్వచ్ఛమైన చంద్రకాంతులతో శోభిల్లుతూ వస్తోంది. బ్రహ్మదేవుని సంకల్పానుసారం దీనిని విశ్వకర్మ నిర్మించాడు. దీన్ని కుబేరుని దగ్గరనుంచి రావణుడు గ్రహించాడు.

విభీషణుడు ఇప్పుడు ఈ రామచంద్రునకు బహూకరించాడు. అందులోనే రామాదులంతా విచ్చేస్తున్నారు" అని హనుమంతుడు ఉద్విగ్నచిత్తుడై భరతునకు చెప్పాడు.

అలా మారుతి చెప్పుతుండగానే అక్కడ చేరిన జనులందరూ 'అదుగో శ్రీరామ చంద్రమూర్తి వచ్చేస్తున్నాడు' అంటూ పెద్దగా అరిచారు. రామదర్శన కుతూహలంతో వారందరూ సంతోషాతిరేకంతో కోలాహలంగా అరిచారు. జయజయ ధ్వానాలు చేశారు. శ్రీరామ! జయ రామా! జయజయ రామా! అంటూ ముక్తకంఠంతో అరుస్తున్నారు. అందరిలో రాముని చూడాలన్న ఉబలాటం ఎక్కువైంది. అందరూ ఒకరిని ఒకరు తోసుకొంటూ ముమ్ముందుకు వెళ్ళాలని చూస్తున్నారు. శ్రీరాముడు భరతాదులకు దర్శనం ఇచ్చాడు. పరమానందభరితుడై భరతుడు పాదాభివందనం చేశాడు. కన్నుల నిండా ఆనందబాష్పాలను రాల్చుతూ ఒకరినొకరు గాఢాలింగనం చేసుకొన్నారు. రాముని చూచిన భరతుడు ఆనందంగా శిరసా ప్రణమిల్లాడు. భరతుని లేవనెత్తి శ్రీరాముడు అక్కున చేర్చుకొన్నాడు. రాముని కన్నులు అశ్రువులతో నిండాయి.

భరతుడు లక్ష్మణుణ్ణి ఆలింగనం చేసుకొన్నాడు. పూజ్యురాలైన సీతకు ప్రణామాలు చేశాడు. శ్రీరామునకు విధ్యుక్త విధులు చేశాడు. హనుమంతుని ద్వారా తెలుసుకొన్న సుగ్రీవాదులందరిని ప్రసన్న వదనంతో చూచి సుగ్రీవుని, జాంబవంతుని, అంగదుని, మైందుని, ద్వివిదుని, నీలుని, ఋషభుని, సుషేణుని, నలుని, గవాక్షుని, గంధమాదనుని, శరభుని, పవనుని కౌగిలించుకుని తన ఆనందాన్ని వ్యక్తపరిచాడు. వారందరిని కుశల ప్రశ్నలతో సంతుష్టులను చేశాడు.

సుగ్రీవుని దగ్గరకు చేర్చుకొని నేటినుండి మనం ఐదుగురు సోదరులం అని భరతుడు చెప్పాడు. 'ఆర్యా! అదృష్టవశంవలన నీవు మాకు దొరికావు. నీ సహాయంవలనే మా అన్న దుష్కరమైన కార్యాన్ని అవలీలగా సాధించ గలిగారు' అని చెప్పాడు. శత్రుఘ్నుడు రామలక్ష్మణులకు ప్రణామం చేశాడు. శత్రుఘ్నుని రాముడు ఆలింగనం చేసుకొని ఆదరించాడు. సీతాదేవికి శత్రుఘ్నుడు నమస్కరించాడు. ఆ తర్వాత వానరులందరికి నమస్కరించి వారి సహాయానికి కృతజ్ఞతలు తెల్పాడు.

పుత్రుని ఎడబాటులోనున్న కౌసల్య దగ్గరకు రాముడు వెళ్లి సాష్టాంగ వందనం చేశాడు. స్వాంతన వచనాలతో ఆమెను ఊరడించాడు. చాలాకాలం తర్వాత కొడుకును చూసిన ఆనందంతో ఆమె ఉబ్బితబ్బిబ్బు అయింది. పూజ్యులైన సుమిత్రా కైకేయీలకు పాదాభివందనం చేసి వారిని రామాదులు సంతోషపరిచారు. పౌరులందరూ చేతులు జోడించి ఆనందబాష్పాలతో రామునికి స్వాగతం పలికారు. వారినందరిని రాముడు విచారించి ఆనందాన్ని పంచాడు. భరతుడు రామునికి స్వయంగా పాదుకలను తొడిగాడు. "మహారాజా! మీరు నాకు అప్పగించిన రాజ్యాన్ని ఇపుడు తిరిగి మీకు ఇచ్చివేస్తున్నాను. మీరు వనవాస దీక్షను ముగించుకొని రావడంతో నేను ఎదురుచూసే మంచికాలం వచ్చింది. ఇపుడు నేను సఫల మనోరథుణ్ణి అయ్యాను. నా జన్మ ధన్యమైంది. మీరు నాకు అప్పగించిన కోశాగారం ధాన్యాగారం సైన్యం మీ అనుగ్రహంవల్ల పది రెట్లు అయ్యాయి. ప్రజలు సుఖశాంతులతో జీవిస్తున్నారు."

అలా చెప్పే భరతుని చూసి విభీషణుని కళ్ళు ధారాపాతంగా ఆనందాశ్రువులను కార్చాయి. రాముడు సంతోషంగా భరతుణ్ణి తన ఒడిలో కూర్చోబెట్టుకొని భరతుని ఆశ్రమానికి బయలుదేరాడు. అందరూ విమానంలో నందిగ్రామానికి చేరారు. పుష్పకం నుండి దిగారు. శ్రీరాముడు పుష్పకంతో 'ఓ పుష్పకమా!నీ వలన మేమందరం మా నెలవుకు వచ్చేశాము. మాకు సంతోషాన్ని పంచావు. ఇక నీవు నీ యజమానియైన కుబేరుని సేవించు. నీవు వెళ్ళటానికి అనుమతిని ఇస్తున్నాను' అని చెప్పాడు. ఆ విమానం రాముని ఆజ్ఞతో ఉత్తరదిశగా ప్రయాణించి కుబేరుని భవనాన్ని చేరింది. శ్రీరాముడు వసిష్ఠునకు పాదాభివందనం చేశాడు. ఉచితాసనాన్ని ఇచ్చాడు. గురువు అనుగ్రహాన్ని, ఆశీస్సులను రాముడు పొందాడు.

* * *

# అయోధ్యా ప్రవేశం

## సర్గ - 128

కైకేయి సుతుడు రామునకు నమస్కరించాడు. అన్నా! మీరు తల్లి కోరిక ప్రకారం ఈ రాజ్యభారాన్ని నాకు అప్పగించారు. మీరు వనవాసాన్ని చేశారు. నేడు మీ, నా దీక్షలు పరిసమాప్తం అయ్యాయి. చిత్రకూటంలో మీరు ఉన్నప్పుడు ఈ రాజ్యాన్ని నా దగ్గర న్యాసంగా ఇచ్చారు. ఈ భారాన్ని నేను కష్టమైనా ఇప్పటిదాకా మోశాను. ఇక ఈ భారాన్ని మోసే శక్తి నాకు లేదు.

మీ రాజ్యాన్ని మీరు తిరిగి పొంది నన్ను విముక్తుణ్ణి చేయండి" అని భరతుడు రాముణ్ణి ప్రార్థించాడు. "మహాబాహూ! మన తండ్రి పుత్రకామేష్టి యాగాన్ని చేసి మనలను పొందాడు. మీరు ఈ రాజ్యాధికారాన్ని తీసుకొని మన తండ్రి కన్న కలలకు సాకార రూపాన్ని ఇవ్వండి. మీ భక్తులమైన మేమందరం సంతోషంగా మీ రాజ్య కార్యకలాపాలలో మీకు ఇష్టం వచ్చిన రీతిగా పాల్గొంటాము.

స్వామీ! జ్యోతిశ్చక్రం తిరుగుతున్నంతవరకు సూర్యచంద్రాదులు ఉన్నంతవరకు ఈ రాజ్యాధినేతలు మీరే. శ్రీరాముడు భరతుని వాక్యాలకు సంతసించాడు. నీ ఇష్ట ప్రకారం నేను చేస్తానని చెప్పాడు. చక్కని సింహాసనంపై రాముడు కూర్చున్నాడు. అందరి మనసులను ఆనందం చుట్టేసింది. అందరూ ఇక కష్టాలు తీరి పోయాయని నిశ్చింతగా ఉన్నారు.

భరతుడు క్షురకులను పిలిపించాడు. వారి పనిని వారు నిర్వర్తించారు. భరత లక్ష్మణ శత్రుఘ్నులు అభ్యంగన స్నానాదికాలు ఆచరించారు. వానర రాజైన సుగ్రీవుడు, హనుమంతుడు రాక్షసరాజైన విభీషణుడు వారితో కూడా వచ్చినవారు అందరూ స్నానాదికాలను పూర్తిచేసుకొన్నారు.

శ్రీరామునికి జడలు విప్పదీసి కేశ సంస్కారాలు చేసి అభ్యంగన స్నానాలు చేయించారు. చిత్రవిచిత్రాలైన వస్త్రాదులను, ఆభరణాలను ఆ స్వామికి అలంకరించారు. సుగంధాది ద్రవ్యాలతో మైపూతలు అలదినారు. సర్వాలంకార శోభితుడైన ప్రభువు సింహాసనంపై కూర్చున్నాడు.

శత్రుఘ్నుడు రామలక్ష్మణులిరువురికి బంగారు హారాలను అలంకరించారు. నిర్మలమైన మనస్సులతో దశరథుని పత్నులందరూ స్వయంగా సీతాదేవిని అలంకరించారు. పట్టుపట్టి కౌసల్యామాత వానర పత్ను లందరిని బంగారు భూషణాదులతో అలంకరింపచేసింది. శత్రుఘ్నుని సూచన ప్రకారం సుమంత్రుడు రథాన్ని అందంగా అలంకరించాడు. మహానుభావుడైన శ్రీరాముడు దాన్ని అధిరోహించాడు.

సుగ్రీవాదులందరూ సర్వాంగ సుందరంగా అలంకృతులై శ్రీరాముణ్ణి అనుసరించారు. సుగ్రీవ పత్నులందరూ అయోధ్యను చూడాలన్న కోరికతో వారి వారి వాహనాలపై సీతాదేవితో వెళ్ళారు.

దశరథుని మంత్రులు, పురోహితుడైన వశిష్ఠుడు పట్టాభిషేకపు ఏర్పాట్లకోసం మంత్రాంగం చేశారు. సుమంత్రుడు, అశోకుడు, విజయుడు వీరు శ్రీరామాభ్యుదయంకోసం ఏర్పాట్లగురించి మంతనాలు చేశారు. అయోధ్యా నగరం వైభవంకోసం జయశీలుడైన శ్రీరామునికోసం పట్టాభిషేకపు ఏర్పాట్లను చేశారు.

దేవేంద్రునిలాగా శ్రీరాముడు జవనాశ్వాలను పూన్చిన ఉత్తమమైన రథాన్ని అధిరోహించి అయోధ్యలో అడుగుపెట్టాడు. భరతుడు రథసారథ్యాన్ని వహించాడు. శత్రుఘ్నుడు శ్రీరామునకు ఛత్రం పట్టాడు. లక్ష్మణుడు వింజామరలను వీచాడు. విభీషణుడు తెల్లని వింజామరను పట్టుకొని ముందుభాగంలో నడిచాడు. మహర్షులు, మరుద్గణాలందరూ శ్రీరామచంద్రుని స్తుతించారు.

వానరరాజు సుగ్రీవుడు శత్రుంజయం అనే గజాన్ని అధిరోహించాడు. వానరులందరూ మానవ రూపాలు ధరించారు. తొమ్మిదివేల ఏనుగులను అలంకరించారు.అందరూ కలసి అయోధ్యకు తరలివెళ్ళారు. శంఖారావాలు దేవదుందుభులు మ్రోగుచుండగా వందిమాగధుల స్తుతి పాఠాలతో రాముడు తన సహచరగణాలతో కలసి అయోధ్యకు చేరాడు.

శ్రీరాముడు సుగ్రీవుని ఆదర్శమైత్రిని, మారుతి దివ్యశక్తిని, వానరుల అద్భుత కృత్యాలను, రాక్షసుల బల పరాక్రమాలను, విభీషణుల కలయికను తన మంత్రులకు, వశిష్ఠునకు చెప్పాడు. ఆ విశేషాలన్నీ విని వారు ఆశ్చర్యానందాలు పొందారు. అయోధ్యవాసులందరూ ఆనందంగా రాముడు వచ్చాడని పండుగ చేసుకొంటున్నారు.

రఘురాముడు దశరథుని మందిరంలో ప్రవేశించాడు. తల్లులకు నమస్కరించాడు. భరతుడు తన భవనాన్ని సుగ్రీవునికి ఇవ్వమని మంత్రులతో చెప్పాడు. శత్రుఘ్నుడు సుగ్రీవుని చేతిని పట్టుకొని భరతుని అంతఃపురానికి తీసుకొని వెళ్ళారు. దాన్నంతా సుగ్రీవునకు చూపించాడు. శత్రుఘ్నుని ఆజ్ఞప్రకారం చక్కని ఆస్తరణాలతో కూడిన ఆసనాలను తల్పాలను ఏర్పాటు చేశారు.

భరతుడు సుగ్రీవునితో బంగారు కలశాలతో వానరులను పంపి సముద్ర జలాలను తేవడానికి పంపించమని చెప్పాడు.

సుగ్రీవుడు నలుగురు వానర ప్రముఖులను రప్పించాడు. వారికి మణులు పొదిగిన సువర్ణ కలశాలను ఇచ్చాడు. వారిని సముద్ర జలాన్ని తెమ్మని పురమాయించాడు. హనుమదాదులు వాయువేగంతో వెళ్ళారు. నాలుగు సంద్రాలనుండి ఐదు వందల నదులనుండి నీరు తీసుకొచ్చారు. సుషేణుడు తూర్పు సముద్రం నుండి నీరు తెచ్చాడు. ఋషభుడు దక్షిణ సముద్రం నుండి, గవయుడు పశ్చిమ సముద్రం నుండి నలుగురు ఉత్తర సముద్రం నుండి జలాలు తెచ్చారు.

వాటినన్నింటిని శత్రుఘ్నుడు పురోహితులకు అందించాడు. వశిష్ఠాది పురోహిత గణం పట్టాభిషేక ఏర్పాట్లు త్వర త్వరగా చేస్తున్నారు. ఎవరికి వారు రామపట్టాభిషేకమహోత్సవానికి కావలసిన పనులు చెప్పకుండా చేస్తున్నారు. అయోధ్యఅంతా పండుగ సంబరాలను జరుపుకుంటున్నారు. దేవతలంతా అమరపురిని మించిన ఆనందం కోసల రాజ్యంలో నెలకొందని చూస్తున్నారు.

* * *

# శ్రీరామ పట్టాభిషేకం

వశిష్ఠమహాముని సీతాసహితుడైన రాముణ్ణి బంగారు సింహాసనంపైన కూర్చోపెట్టారు. వశిష్ఠుడు, వామదేవుడు, జాబాలి, కాశ్యపుడు, కాత్యాయనుడు, సుయజ్ఞుడు, గౌతముడు, విజయుడు వీరందరూ శ్రీరాముణ్ణి సుగంధజలాలతో అభిషేకించారు.

బ్రాహ్మణులు, కన్యలు, మంత్రులు, యోధులు, పురప్రముఖులు, మహర్షులు ఆనందంగా వేదోక్తరీతిగా సీతారాములను అభిషేకించారు. గగనం నుంచి దేవ గంధర్వ యక్ష కిన్నరాదులందరూ స్తుతిపాఠాలతో సీతారాముణ్ణి అభిషేకించారు.

బ్రహ్మ నిర్మించి ఇచ్చిన రత్నఖచితమైన మనువు ధరించిన కిరీటాన్ని పూజించి దాన్ని శ్రీరామునికి అలంకరించారు. ఆ కిరీటం రత్నాలతో పొదగబడి, అందరి మన్ననలను పొందిన రాజులచేత అలంకరించుకోబడి దివ్యకాంతులను వెదజల్లుతోంది.

శత్రుఘ్నుడు తెల్లని ఛత్రాన్ని, సుగ్రీవుడు తెల్లని వింజామరలను పట్టుకొని శ్రీరాముని సేవిస్తున్నారు. విభీషణుడు తెల్లని వింజామరను శ్రీరామునికి వీస్తూ ఆనంద లోకాలలో విహరిస్తున్నాడు. దేవేంద్రుడు పంపగా వచ్చిన వాయుదేవుడు నూరు పసిడి పద్మాలతో మెరుస్తున్న బంగారుమాలను, ముత్యాలహారాన్ని రామునకు బహూకరించాడు.

పట్టాభిషేకమహోత్సవ సందర్భంగా గంధర్వాదులు ఆటలు ఆడి, పాటలు పాడి తన్మయులయ్యారు. అప్సరసలు నృత్యాలు చేసి వారినందరిని అలరించారు. ఆ శుభసమయంలో అయోధ్య అంతా మంగళప్రదంగా మారింది. భూమి అంతా నూతనోత్సాహాన్ని పొందింది. అందరూ నూతనోత్తేజంతో విలసిల్లారు. భూసురోత్తములకు శ్రీరాముడు లక్షల సంఖ్యలో గుర్రాలను, పాడి ఆవులను, గోవులను, వృషభాలను దానం చేశాడు.

బంగారు నాణేలు, వెండి నాణేలు, ఆభరణాలు, వస్త్రాదులతో ద్విజులను సంతోషపరిచాడు. సూర్యకిరణాల్లాగా వెలుగులీనుతున్న వజ్ర వైడూర్యాలతో అలంకరించిన బంగారు భుజకీర్తులను అంగదునకు శ్రీరాముడు అలంకరించాడు.

మణులతో కూడిన ముత్యాలహారాన్ని సీతాదేవి చేతికి ఇచ్చాడు. దాన్ని తీసుకొని మనోరంజకంగా ఉండడం చూసి దాన్ని హనుమంతునకు సీతాదేవి బహూకరించింది. వస్త్రాలను, ఆభరణాలను మారుతికి కానుకగా ఇచ్చింది. తన మెడలోని కంఠాహారాన్ని తీసి తన భర్తను, వానరులను సీత పదే పదే చూసింది. శ్రీరాముడు సీతను గమనించి ఆమె ఆంతర్యాన్ని తెలుసుకొన్నాడు.

'సీతాసుందరీ! నీ అనుగ్రహానికి పాత్రుడైన ఉత్తమునకు ఈ హారాన్ని మనస్ఫూర్తిగా బహూకరించు' అని రాముడు చెప్పగానే వెంటనే దివ్యప్రభలతో ఉన్న ఆ హారాన్ని సీత హనుమంతునకు ఇచ్చింది. అది ధరించిన హనుమంతుడు స్వచ్ఛమైన మేఘాలతో ఉన్న పర్వతంలాగా చూపరులకు ఆనందాన్నిచ్చాడు.

శ్రీరామచంద్రుడు వానరులందరికీ పేరు పేరునా వారికి ఇష్టమైన వస్తువులను, వస్త్రాదులను, ఆభరణాలను ఇచ్చి వారినందరిని సత్కరించాడు. శ్రీరాముడు విభీషణుని, అతని అమాత్యులను, సుగ్రీవుడిని, హనుమంతుణ్ణి వస్త్రాభరణాదులతో పూజించాడు.

సంతోషించిన వానరులందరూ రాముని అనుమతి తీసుకొన్నారు. వారికి కావలసినన్ని రోజులు అయోధ్యలో ఉన్నారు. చూడవలసిన ప్రదేశాలను అన్నింటిని చూశారు. ఇక హాయిగా తమ రాజ్యానికి వెళ్తామని రాముని అనుజ్ఞను పొందారు. సతీసుతబంధుసమేతుడై సుగ్రీవుడు కిష్కింధకు బయలుదేరాడు. అదేవిధంగా విభీషణాదులు గౌరవసత్కారాలను పొందారు. ఆనందాన్ననుభవించారు. విభీషణుడు తనివితీరా సాదర సత్కారాలను అందుకొని తన అమాత్యులు, పరివారంతో రాముని అనుమతినిపొందారు. వారంతా కలసి లంకకు పయనం అయ్యారు.

సమస్త కోసల రాజ్యపు పౌరులందరిని రాముడు ఆనందింపజేశాడు. లక్ష్మణుని చూచి 'ధర్మజ్ఞా లక్ష్మణా! నీవు నా అంతటివానివి. ఈ రాజ్యానికి నీవు యువరాజుగా అభిషిక్తునివి కావాలని చెప్పాడు. లక్ష్మణుడు రాముడు ఎంత చెప్పినా వినకుండా యువరాజ్య పదవిని సౌమిత్రి తృణీకరించాడు. నాకెప్పుడూ మీ పదసేవ పరమోత్తమమని చెప్పాడు. దానిని నాకు అనుగ్రహిస్తే చాలునని చెప్పాడు. రాముడు లక్ష్మణుని మాటలకు ఆనందించాడు.

అందరి ఆమోదంతో రాముడు భరతుణ్ణి యువరాజుగా అభిషేకించాడు. శ్రీరాముడు పౌండరీకం, అశ్వమేధం, వాజపేయం లాంటి యజ్ఞయాగాదులను చేస్తున్నాడు. ఆ రఘువీరుడు అలా పదివేల సంవత్సరాలపాటు అయోధ్యా రాజ్యాన్ని ఏలాడు. శ్రీరాముడు మేలు జాతి అశ్వాలను దానాలిచ్చి అశ్వమేధ యాగాన్ని నిర్వర్తించాడు. లక్ష్మణుని సహకారంతో సర్వభూమండలాన్ని శ్రీరాముడు సుభిక్షంగా పరిపాలించాడు. ఎల్లప్పుడూ యజ్ఞయాగాదులు చేస్తూ దేవతలను, ప్రజలను రాముడు సంతోషింపచేస్తున్నాడు. శ్రీరాముని పాలనలో అందరూ సంతోషిస్తున్నారు. ఎవరిలోనూ విచారం కలగడానికి ఆస్కారం లేకుండా పోయింది.

శ్రీరాముడు రాజ్యపాలన చేసేటప్పుడు స్త్రీలకు వైధవ్యంలేదు. అకాల మరణాలు ఎక్కడా జరిగేవి కావు. క్రూరమృగాల బాధ లేకుండా ఉండేది. జనులలో చోర జార భయాదులకు తావు లేకుండా ఉండేది. ఏ అనర్థానికి రామ పరిపాలనలో చోటులేకుండేది. రామరాజ్యంలో ప్రజలందరూ ధర్మచింతనులై కాలం గడిపేవారు. వారందరూ 'యథారాజా తథాప్రజా' అన్నట్లు సత్య ధర్మాలే ఆభరణాలుగా ధరించేవారు. ప్రజలందరూ స్పర్థలు లేకుండా పరస్పర సహాయ సహకారాలతో, ఆత్మీయతతో మెలిగేవారు.

ప్రజలందరూ దీర్ఘాయువులతో ఆయురారోగ్యాలతో విలసిల్లేవారు. ముక్కారు పంటలతో భూమి ఎల్లప్పుడూ సస్యశ్యామలంగా అలరారేది. జగమంతా రాముని గూర్చే చెప్పుకొంటూ రామునిలాగా జీవించాలనే తపనతో నిరంతరం రామనామ జపంలో మునిగి ఉండేవారు.

వృక్షాలన్నీ ఫల పుష్పసంపదతో అలరారేవి. సకాలంలో వర్షాలు కురిసేవి. చల్లని స్పర్శలతో వాయువు అందరిని సుఖపెట్టేవాడు. సర్వవర్ణాల వారు వారివారి కుల, వర్ణ ధర్మాలను ఆచరిస్తూ సుఖ సంతోషాలతో జీవితాలను గడిపేవారు.

రామరాజ్యంలో అందరూ సత్యధారణ చేసేవారు. ఇలా శ్రీరాముడు తన సోదరులతో కూడి భూమండలాన్ని పదకొండు వేల సంవత్సరాలపాటు నిత్యకళ్యాణం పచ్చతోరణంగా రాజ్యపరిపాలన చేశాడు. సర్వులకూ ప్రియం చేస్తూ వారిని ఆనందింపచేస్తూ తాను ఆనందించేవాడు.

* * *

# శ్రీరామాయణ మహత్వం

**వా**ల్మీకి విరచిత రామాయణం ఆదికావ్యం శుభప్రదమైనది. ఆయురారోగ్యాలను కీర్తిప్రతిష్ఠలను కల్గించేవి. రాజులకు విజయాన్ని చేకూర్చుతుంది. ఈ కావ్యం చదివినవారికి, విన్నవారికి సమస్త పాపాలు దూరం అవుతాయి.

రామపట్టాభిషేక ఘట్టం విన్న దంపతులు సంతానవంతులు అవుతారు. సంపదలు ప్రాప్తిస్తాయి. ఎవరికీ శత్రుభయం ఉండదు. ప్రజలందరూ కలకాలం సంతోషంతో వర్థిల్లుతారు.

క్లిష్టకార్యాలను అవలీలగా సాధించే రాముని కథను విన్నవారు దీర్ఘాయువును పొందుతారు. వాల్మీకి విరచిత రామాయణాన్ని విన్నవారు దారిద్ర్యాది దుఃఖాలనుండి విముక్తులు అవుతారు. దీర్ఘకాలం బంధువులకు దూరమైన వారు తిరిగి కలుసుకొని సంతోషంగా ఆత్మీయతతో చాలాకాలం జీవిస్తారు.

రామాయణ శ్రవణంతో దేవతలు ప్రసన్నులు అవుతారు. శ్రోతల కుటుంబాలకు పట్టిన దుష్టగ్రహ బాధలు తొలగిపోతాయి. రాజ్యం కోల్పోయిన భూపతులు రామాయణం విన్నందువల్ల తిరిగి రాజ్యాధికారాన్ని పొందుతారు. సర్వులకు సర్వశుభాలు కలుగుతాయి.

పాపాలు తొలగి పుణ్యరాశి రామాయణ పఠనంవల్ల వృద్ధి పొందుతుంది. ఇందులో సందేహించాల్సిన అవసరం ఏదీ లేదు. శ్రీరాముడు సాక్షాత్తూ శ్రీమన్నారాయణుడే. రామాయణం విన్నవారందరికీ రామానుగ్రహం కలుగుతుంది. శ్రీమన్నారాయణుని అవతారమే శ్రీరాముని రూపం. ఆదిశేషుడే లక్ష్మణుడు. ఈ మహాకావ్యం సర్వశుభకరమైంది. కుటుంబ వృద్ధి, ధనధాన్య సమృద్ధి కలుగుతుంది.

రామాయణం అందరికీ ఆయురారోగ్యాలను, కీర్తిప్రతిష్ఠలను, సౌభ్రాతృత్వాన్ని, బుద్ధికౌశలాన్ని, సుఖ శాంతులను, తేజో వైభవాలను ప్రసాదిస్తుంది.

సత్పురుషులందరూ రామాయణ పఠనంతో ఆనందిస్తారు. రామోదంతం సర్వశుభంకరం. దేవతలు పితృదేవతలు అందరూ దీన్ని చదవడం వలన తృప్తి పొందుతారు. రామాయణ సంహితను వ్రాసిన వారు స్వర్గ సుఖాలను పొందుతారు.

॥ జై శ్రీరామ్ ॥